THE

COMPLETE WORKS

OF

Chilakamarti Lakshmi Narasimham.

Vol. I. NOVELS.

V. R. NARLA MEMORIAL LIBRARY
V.R. NARLA
D. P. R. I.
Acc. No.

PRINTED AT SCAPE & CO.,

COCANADA,

1913.

iii

C. L. Narasimham.

V. R. NARLA MEMORIAL LIBRARY
V. R NARLA
D. P. R. I.
Acc. No.

చిలకమర్తి లక్ష్మీనరసింహకృత

గ్రంథములు.

ఒకటవ సంపుటము.

V. R. NARLA MEMORIAL LIBRARY
V.R.NARLA
D. P. R. I.
Acc. No.
10463

చిత్రవచనకావ్యములు.

DR. B.R AMBEDKAR OPEN UNIVERSITY
UNIVERSITY - LIBRARY
N10463

కాకినాడ:

స్కేపు అండు కో., ముద్రాక్షరశాల.

1913.

894.8273
LAK

V.R. NARLA MEMORIAL LIBRARY
V.R. NARLA
D. P. R. I.
Acc. No.

విషయసూచిక.

రామచంద్రవిజయము ... ... 1—135

హేమలత ... ... 137—267

అహల్యాబాయి ... ... 269—420

సౌందర్యతిలక మొదటిభాగము ... ... 421—556

డిటో రెండవభాగము ... ... 557—696

V.R. NARLA MEMORIAL LIBRARY
V.R NARLA
D. P. R. I.
Acc. No.

A0WA104B108

రామచంద్రవిజయము.

మొదటిప్రకరణము.

శ్రీమంతంబై సమస్తసంపదలకు నిలయమైన యీభరతఖండము నందలి దేశములందు ఫలవంతంబై, యతి పురాతనంబై, యనేక పావనరాజవంశసమేతమై యాంధ్రదేశము దనరుచుండును. ఆదేశమునందు సమస్తజనసేవితంబై, బహుపుణ్యక్షేత్రశోభితమై గోదావరీనది ప్రవహించుచుండును. ఈగోదావరీనది ప్రవహించుచున్న మండలములయందన్నింటిలో జన్మమెత్తినందులకు ఫలము ఘనులకు నల్పులకుఁ గూడ సహజముగ నందవలయునని యెంచియో యన్నట్లు గెలలభారముచేత భూమికిఁ దగులునట్లు వంగి యతిమనోహరమైన ఫలములచేత నాఁకొన్న యాపన్నజనంబుల కెల్ల నవ్యవధానముగ నాఁకలిఁదీర్చుచు, శృంగారతరమైన పుష్పలచేత నేత్రములకపూర్వమొనర్చుచు, సమస్తపుష్పజాతములనుండి వీతెంచు వాయువులచేత ఘ్రాణేంద్రియమునకుఁ దృప్తిఁగావించుచు, దూరప్రయాణములచేత నలసిసొలసి వచ్చు పాంథజనంబులకుఁ జల్లనినీడనిచ్చుచు, సర్వావయవములకును నేకకాలముననే మహానందము గల్గించుచు, ధరణీరమణికిఁ జేసిన యపూర్వాలంకారములోయన వెలయు తీయమామిళ్లు, పనసలు, అనంటులు, కొబ్బరులు, పోఁకలు మొదలగు ఫలవృక్షములకుఁ గన్నతల్లియై కోనసీమ భాసిల్లుచుండును. ఆకోనసీమయందెల్ల సౌందర్యసీమయు సుఖములకు దాపురంబును నమలాపురముగదా! ఆగ్రామము మొదటఁ జిన్నదైనను పుణ్యపురుషులనేకులు తమకీర్తి యాచంద్రతారార్కముగ భూమండలమున వెలయునట్లు బ్రాహ్మణోత్తములకు సుక్షేత్రములయిన భూములనిచ్చి వారి

నివాసార్థమై కట్టించిన యగ్రహారములచేతఁ జుట్టుప్రక్కలనున్న గ్రామములకంటె పెద్దదై, లోకులుమిక్కిలి నివసించుటచేత నొకపట్టణము వలెనుండును. కోనసీమయం దంతటను, ముఖ్యముగా నాగ్రామమునందును, భూలోకకల్పవృక్షములని ప్రసిద్ధికెక్కిన సార్థకనామమును ధరించిన కొబ్బరితోఁటలనేకములు గలవు. ఎంత ధన్యమైన జన్మమోగాని కొబ్బరిచెట్టును జక్కఁగాఁ బరీక్షించినయెడల వేరు మొదలు మొవ్వువఱకును జనుల కుపయోగించునుగాని యొకతృణమాత్రమైనను వ్యర్థముగాఁ బోదు. మహాత్ముల జన్మము పరోపకారార్థమేగదా? అట్టి కొబ్బరితోఁటయందు తోఁటకొక యిల్లుండును. అందాతోఁటయజమానుఁడు నివసించును. వేఱే కొబ్బరితోఁటల మాహాత్మ్యము వర్ణింపనేల? పదివరహాలు గలవానికంటె పదికొబ్బరిచెట్లుగలవాఁడు ధన్యుఁడను మాట సత్యమేయగు. అమలాపురమునం దుత్తరమునందొక చెఱువును దక్షిణమునందొక చెఱువును గలవు. మొదటిచెఱువునకు చుట్టును రెండుప్రక్కల నూరుండును. చెఱువులోదిగుటకు రెండుప్రక్కల మెట్లు గలవు. రాజవీధి యొక్కటే పెద్దదియున్నది. వీధికి రెండుప్రక్కలను గుమ్మములముందఱ కొబ్బరిచెట్లుండును. ఆగ్రామమునకు పడమటకుఁ జిమంచి వారి యగ్రహారమున్నది. ఆగ్రామమునకుఁ జేరినదే యొకమామిడితోఁట కలదు. విఱుగఁగాసిన యామామిడిచెట్లకాయ లెవ్వరైన దొంగిలించు కొనిపోదురేమో యను భయముచేత చెట్లకు నిలువెత్తున ముండ్లకంచె వేసి, పండుటకర్హమైన కాయలు దొరబారఁగనె బుట్టలుగట్టి, చిలుకలు మొదలగు పక్షులు కొఱికివేయకుండఁ జేతిలో నొకయుండ విల్లుబద్ద పుచ్చుకొని మధ్యమధ్య పచ్చని మామిడాకులసందునఁ గూర్చుండి తన రంగు తెలియకుండ మోసముజేయుచున్న చిలుకవైపున నొకయుండ వేయుచు నొకకాఁపువాఁడు కాఁపుకాచుచుండెను. అవల కొరడిమీఁద మార్గస్థుల దృష్టిదోషమునఁ దోటకు భంగమేమియుఁ గలుగకుండఁ

గాఁపుదలిగాఁ గాఁపువాఁడు తన శిల్పశాస్త్రచమత్కారము నంతను వినియోగించి చేసిన వికృతాకారముగల యొక దృష్టిబొమ్మగలదు. అది వేసవికాలమగుటచే నతిమనోహరమైన యావసంతఋతువునందు శృంగారలక్ష్మికిఁ బుట్టినింటివలెనున్న యాతోఁటలోనికి వచ్చి విశ్రమించకుండ మార్గస్థులను బెదరించుచుండును. కలిసిమెలిసి దట్టముగా గుమిగూడు కొన్న వారిని సహస్రకిరములవాఁడైన భేదింపఁజాలఁడని యైకమత్యోపయోగములను జనుల కుపదేశించుచున్నవోయన గుజ్జుమామిడిగున్నల యాకులు దట్టమై సూర్యకిరణదుర్గమంబుగా నుండెను. ప్రభాకరుఁడు తన సహస్రకిరణములను జగమునందు వ్యాపింపఁజేయుచు సర్వభూతభయంకరుఁడై భూమండలమెల్ల దహించుచుండెను. మృగవారంబులు మృగతృష్ణల జలాశయంబులుగ భావించి దాహనివారణార్థము పరుగులెత్తుచుండెను. చల్లని పందిళ్ళవలెనున్న క్రొమ్మావిగున్నలును మామిడిగున్నల వ్రేలాడుచున్న యలరు జొంపముల మెక్కి మెక్కి కూయుగండుఁగోయిలలును, కోయిలకూఁతల నాలకించుచు మార్గాయాసనివారణ మొనర్చుకొనుచున్న పాంథజనసమూహంబులును వేసవికాలలక్షణంబుల వెలిసేయుచుండెను. భూమిమీఁదరాలి యెండిన యాకులన్నియు గలగల ధ్వనిఁజేయుచు గాలికిఁ గదలుచుండెను. అగ్నివర్షము గురిసినఁ జాడ్పున గాడ్పులు వెచ్చగ వీచుచుండెను. అట్టిసమయమున ప్రభవ సంవత్సర వైశాఖశుద్ధ చతుర్థినాఁడొక మార్గస్థుఁడు మార్గాయాస నివారణార్థ మొక మామిడిచెట్టునీడకువచ్చి మూటను గ్రిందవైచి దానిమీఁద కుడిచెయ్యానుచుకొని భుజముమీఁదియంగవస్త్రముతో మొగమున స్నానముజేసినట్లు పట్టిన చెమటను దుడుచుకొనుచు తలకుఁజుట్టిన సెనగపువ్వంచు జరీయుత్తరీయము చెంగుతో విసరుకొనుచు నేదియో దీర్ఘాలోచనఁ జేయుచుఁ గూర్చుండెను. పచ్చని నిమ్మపండువంటి దేహచ్ఛాయయు, గుండ్రని మొగమును, సొగసైన కాటుకకన్నులును, సౌష్ఠవమైన

యవయవములును గలిగి, సహజమైన లావణ్యముగల యాతనిశరీరము నకు రాగికడ్డీలమీఁదనమర్చిన బంగారుమురుగులును, పుష్యరాగములు వేసి తాపిన తమ్మంట్లును నొక వింతయందమును గలిగించుచుండెను. అప్పుడప్పుడే నూతనముగా నంకురించుచున్న నూనూగు మీసములు చెప్పనక్కఱలేకయే యతఁడు పదునెనిమిదివత్సరముల ప్రాయముగల బాలుఁడని తెలియఁజేయును. ఆకుమారుఁడుతనలోఁదానేదో వితర్కించు కొనుచుండఁగా నప్పుడొక ముప్పదియయిదువత్సరముల చామనచాయ గల బక్కపలచని పొడుగు బ్రాహ్మణుఁడామార్గమునఁ బోవుచు దూర మున నతనిఁజూచి, కొంచెము నిదానించి, యెవరాయని యాలోచించి, క్రొత్తమొగమని తెలిసికొని, కిఱ్ఱుకిఱ్ఱుమని చెప్పులజోడు ధ్వనులఁజేయ, నీబాలకుఁడున్నవైపునకువచ్చి యెదుట నిలువఁబడి యిట్లుపలుకరించెను.

బ్రా—అబ్బాయీ! మనదేయూరు?

బాలు—మాది తాటిపాక కాఁపురము.

బ్రాహ్మ—మీ రెవ్వరు? మీయింటిపేరేమి? [రాజువారు.

బాలు—మేమారువేల నియోగులము. మాయింటిపేరుమాచి

బ్రాహ్మ—నీపేరెవరు? నీతల్లిదండ్రులు బాగున్నారా?

బాలు—నాపేరు రామచంద్రుఁడందురు. నాకుతల్లిదండ్రికూడ లేరు. తండ్రిగారు చనిపోయి నాలుగుసంవత్సరములయినది. తల్లిగా రు పోయి యీవేళ కిరువదిదినములైనది.

బ్రాహ్మ—పాపము! చిన్నతనమునందేతల్లిదండ్రులు లోకాంతర గతులయినారా? పూర్వజన్మకృతము. అయితే మీతండ్రిగారి నామ ధేయము.

బాలు—మాతండ్రిగారు శ్రీరాములుగారు.

బ్రాహ్మ—ఓహోహో! శ్రీరాములుగారి కుమారుఁడవటయ్యా? సరే. అయితే మీరన్నదమ్ము లెందఱు?

బాలు—అన్నదమ్ములును లేరు. అక్కసెల్లెండ్రును లేరు. నేనొక్కఁడనే. మాబాబయ్యగారిని మీ కేమైన నెఱుఁగుదురా యేమి?

బ్రాహ్మ—ఎఱుఁగుదురాయని యడుగుచున్నావా సరి సరి. మాకూచిమంచివారికి మీరు మిక్కిలి యత్యావశ్యకమైన బంధుకోటిలోవారే. బాంధవ్యమటుండఁగా మాతాతగారికిని శ్రీరాములుగారి తండ్రిగారికిని ప్రాణస్నేహమని మాతండ్రిగారు చెప్పుచుండఁగా నేననేక పర్యాయములు విన్నాను. మాముత్తాతగారి తమ్ముని కిచ్చినది మీ యూరిలోనున్న సత్యరాజువారి యాఁడుపడుచే.

బాలు—మాగ్రామములో సత్యరాజువారు లేరే !

బ్రాహ్మ—నీకేమి తెలియును? నిన్నఁగాక మొన్న కన్ను దెఱచినవాఁడవు. నక్క 'నేనుపుట్టి మూఁడువారములు గాలేదు. ఇంతగాలివాన యెన్నఁడు నెఱుఁగ'నన్నదఁట. సత్యరాజువారిప్పుడు గన్నవరములో నున్నారు. మీగ్రామములో లేరు.

బాలు—నామధేయము?

బ్రాహ్మ—నాపేరు శోభనాచలము. మాసంగతినీవు కుఱ్ఱవాఁడవగుటచే నెఱుఁగవుగాని మీపెద్దలందఱు నెఱుఁగుదురు. పెద్దాపురమునందు మహారాజుగారియొద్ద మంత్రులుగానున్న యనపిండివారు మాకు దగ్గఱబంధువులు. రాజమహేంద్రవరములో మాడభూషివారు మా మాతామహులు. మాతండ్రిగారికి మాడభూషివారు పిల్లనిచ్చినపుడు వెయ్యిన్నూటపదార్లు కట్నమిచ్చినారు.

అని శోభనాచలము చెప్పఁగానే రామచంద్రుఁడుగొప్పవారితో మాటలాడుట తటస్థమైనదని సగౌరవముగా మాటలాడఁదలంచి "తమ దర్శన మెన్నఁడును జేయలేదు" అనెను.

శోభ—అవును. దూరమునందున్నపు డెవరికివారే. నియోగములో బీరకాయపీచు సంబంధము. కదిపినఁగాని యెవరికిఁ దెలియును?

కుఱ్ఱవాఁడవయినను బుద్ధిమంతుఁడవు. అయితే నీవీగ్రామమెందుకువచ్చి నావు? ఇక్కడ బంధువులెవరు?

రామ—నాకందఱు బంధువులే. నేనీగ్రామమున నుపాధ్యాయుల విశ్వనాథశాస్త్రిలవారు వచ్చియున్నారని విని యాయనదగ్గఱఁ జదువు కొనవలెనని వచ్చినాను. లక్ష్మీసహస్రము జదువుకొనవలెనని యున్నది. ఆయన చక్కఁగా పాఠములు జెప్పగలరా?

శోభ—లక్ష్మీసహస్రమా? ఆలక్ష్మీసహస్రములు విశ్వనాథ శాస్త్రిలవారికి రావు. ఆయనకు కావ్యపరిశ్రమమేగాని వైదికమునందుఁ బ్రవేశము లేదు. లక్ష్మీసహస్రనామములు, విష్ణుసహస్రనామములు, మాగ్రామపురోహితుఁడైన సోమావధానులకు వచ్చును.

రామ—ఆపుస్తకము కూడ నొకకావ్యమే. సహస్రనామము లు గావు.

శోభ—ఏమో! చిన్నప్పుడు కావ్యపంచకమువఱకు జదువు కొన్నాను. వ్యవహారములోఁ బ్రవేశించినతరువాత తిరిగి యావిషయమై పనిచేయలేదు. అందుచేత జ్ఞాపకములేదు. ఆయనపాఠములు చక్కఁగాఁ జెప్పఁగలరుగాని నీవు బసయెక్కడచేయవలెనని యాలోచించినావు?

రామ—వంటపూటియింటనుండి చదువుకోవలెనని యున్నది.

శోభ—ఏమీ సదుపాయముగా నుండదు. అందులో మాగ్రా మములో నున్న పూఁటకూళ్ళముండ దిక్కుమాలినముండ. డబ్బు చేతిలో వేసికొని కసుపుగాల్చును. ఉన్న యిల్లదియొకటే. అబ్బాయి! నీవుమాకు గావలసినవాఁడవు రెండుమూడుదినములు మాయింటనుండి తరువాత పూఁటకూళ్ళయింటఁ బ్రవేశించు. గ్రామములోనికి వెళ్ళుదము రా ప్రొద్దుపోయినది.

రామ—మీయింట నెందుకు? వంటపూఁటియింట నే నీదినమే ప్రవేశించి చదువుకొనవలెనని యున్నది.

శోభ—నీకు మొగమాట ముండపనిలేదు. మాయిల్లు నీకత్యావశ్యకమైన చోటుగాని మఱొకటికాదు. మనమందఱము నొకకంచములో భోజనము జేయవలసినవాళ్ళము లే. మాటపుచ్చుకో.

బంధువులు బలవంతము జేయుచున్నపుడు వారియింటికిఁ బోకుండుట బాగుండదని యాలోచించినను రామచంద్రుఁ డెన్నఁడును పరగృహనివాసము జేయనందున మిక్కిలి యనిష్టముతోనే లేచి శోభనాచలముతోఁగూడ పోవుచు మార్గమధ్యమందు తా నీగ్రామము వచ్చిన వెంటనే గొప్పవారిస్నేహము దొరకినదనియుఁ దనకది శుభసూచకమనియు సంతోషించుచుండెను. శుష్కప్రియములయందుఁ దనకుఁగల యావత్తు సామర్థ్యము నుపయోగపఱచి, తన జన్మమధ్యమం దెప్పుడు లక్ష్మీసహస్ర మను కావ్యము పేరయిన వినకపోయినను, పంచకావ్యముల వఱకు జదువుకొనకున్నను, తానుగూడ చదువుకొన్నవాఁడేయని రామచంద్రుని మనస్సునకు తోఁచునట్లు పలికెను. రామచంద్రునకుఁ దల్లిదండ్రులు లేరని విన్నప్పటినుండియు నీతనికి వంటపూఁటింటికి ధనమెట్లు వచ్చునని పెద్దసందేహము శోభనాచలమునుఁబట్టి బాధించుటచేత శంకానివృత్తిఁ జేసికొనఁ దలంచి మెల్లగా నిట్లు ముచ్చటించెను.

శోభ—అబ్బాయి! వంటపూఁటిముండకు నెలకు నాలుగురూపాయిలు దక్కించవలెనే. పాపము నీకుతల్లిదండ్రులుకూడ లేరు. ఏలాగున చదువుకొందువో యని నాకు సందేహముగానున్నది.

రామ—అయ్యా! చేతులనున్న మురుగు లేబదిరూపాయిలు విలువగలిగి యున్నవి. తమ్మంట్లు పాతికరూపాయిలు. ఆ రెండునువిక్రయించినయెడల నొకసంవత్సరమువఱకు చదువవచ్చును "నందోరాజాభవిష్యతి" తరువాత దైవమున్నాఁడు నేనున్నాను. అప్పుడుద్యోగస్థులపిల్లలకు పాఠములు జెప్పి యేమాత్రమైన సొమ్ము సంపాదించగలనని నాకు ధైర్యమున్నది.

శోభ—సరే. చక్కని యాలోచన చేసినావు. చదువుకావలసిన వాఁడు సొమ్మేపావనముగాఁ జూచుకొనఁడు. చదువునందాసక్తిగలవానిని నిన్నొక్కనినే చూచినాను. కాని యీగ్రామమునందు కోమట్లుచెడ్డ వాళ్ళు. మోసముజేసి వరహావస్తువుదమ్మిడీకి కొనఁగలసామర్థ్యము వారి దగ్గఱనున్నది. పెద్దకోమట్లతో నాకుపెక్కువ్యవహారము లున్నవి. నేను వారిని మనయింటికిఁ బిలిపించి చక్కఁగా బేరముజేసి నష్టములేకుండ నీ సొమ్ము నీకువచ్చునట్లమ్మఁగలను. నీవుతొందరపడి సొంతముగా వ్యవహరింపఁబోకు. ఇక్కడ తలలుదీసి తలలు బెట్టువార లున్నారు.

అనిచెప్పఁగానే రామచంద్రునకు శోభనాచలనుమీఁద మునుపటికంటె నెక్కువ నమ్మకముకుదరఁగా నాతనిసహాయముచేత నెట్లయిన నాగ్రామమునందుండి సుఖముగాఁ జదువుకొనఁదలంచెను. ఇట్లువారిద్దరు మాటలాడుచు గ్రామములోనికి వచ్చిరి. గ్రామమునకు వచ్చి రాజవీథిలో కొంతవఱకు పోయి కుడిచేతిమీఁదుగా నున్న సందులో రెండు గుమ్మములుదాఁటి మూఁడవగుమ్మముదగ్గఱకుపోయి కొంచెము వెనుకగా వచ్చుచున్న రామచంద్రుఁడు వచ్చువఱకునిలుచుండి "ఇదేమనలోగిలి" అని చిన్నవీథియరుగులును కొబ్బరియాఁకులపడియును గలయొకపాత పెంకుటింటిలోనికిఁ దీసికొనిపోయి చావడిమీఁద నున్న తాటియాకుల చాపమీఁదఁ గూర్చుండుమనిచెప్పి తాను లోపలికిఁబోయి "అమ్మా" యని పిలిచి మెల్లగా నామెతో నిట్లని చెప్పెను.

శోభ—అమ్మా! నీవేమియు విసుగుకొనవద్దు. ఈవేళ మన యింటికిబంధువుడొకఁడు వచ్చియున్నాఁడు. త్వరగా వంటకావలెను.

తల్లి—నీవేదో తెచ్చిపెట్టి నన్ను చంపుచుందువని నేనీదివఱకే యనుకొనుచున్నాను. నీకుప్రతిదినము నెవఁడోయొకబంధువువచ్చుచు నేయుండును. నీయుద్యోగమునకు నీసంపాదనకు తోడు చుట్టాలనుగూడ దాపురము చేయవలెనఁటరా? నాయనా!

శోభ—అబ్బా! యూరకుండవమ్మా. అవతల పెద్దమనుష్యుఁడు కూర్చున్నాఁడు పెద్దలేదు పిన్నలేదు. నీగోలయెప్పుడు నీలాగేయున్నది.

తల్లి—ఏమి యూరకుండను? ఎన్నాళ్ళు? ఒకనాఁడా యొకకథ. ఎల్లకాలము నాకథ యిలాగే యున్నది. కాటికి కాళ్ళుజాపుకొన్న ముండను. చాకిరీచేయలేక నానాహింసలఁ బడుచు నేలాగైన గంజికాచి పోయుదమని యనుకుంటే నీవు పేల్చుకొని తినుచున్నావు. ఎముకలు చిట్లకట్టి పోవుచున్నవి. రామ రామ! దిక్కుమాలిన దేవుఁడు నాకు చావు పెట్టఁడు. అఱువదియేండ్లు వచ్చినందుకు సుఖములేదు, వల్లకాడులేదు. తల్లికడుపునఁ బుట్టినదిమొదలు చచ్చువఱకునొక్కటే మచ్చుగదా? ఇప్పుడత్తెసరు పెట్టవలెను. నీకేమి? మాట చెప్పఁగలవు.

అని తన్నుతానుదిట్టుకొనుచు, శోభనాచలమునుదిట్టుచు, మరల బియ్యము కడిగి పొయ్యిమీఁదఁ బెట్టుటకుఁ బ్రయత్నము సేయుచుండెను. శోభనాచలమును తనతల్లియన్న మాటలను రామచంద్రుఁడు విన్నాఁడేమో యని భయముతో నీవలకు వచ్చెను. చావడిముందున్న కొబ్బరియాకుల పందిరివలనఁ జల్లగానుండుటచేతను, పందిరి కావలివాకిటనున్న కొబ్బరిచెట్లమీఁదనుండి వచ్చెడి గాలిచేతను, మార్గాయాసనివారణము కాఁగా నేదో యోచనఁ జేయుచు రామచంద్రుఁడు వీరికిజరిగిన కలహముఁ బూర్తిగ వినలేదుకాని కేకలుమాత్రము వినెను. శోభనాచలము రాఁగానే వారిద్దఱిట్లు మాటాడిరి.

రామ—అయ్యా! లోపల నెవరు కేకలు వేయుచున్నారు?

శోభ—ఏమిటో మాయమ్మ నల్లమందు పిచ్చచేత నామీఁద నెప్పుడైన కేకలు వేయుచుండును. అంతేకాని నీన్యాయమాటేదియు లేదే.

రామ—ఏదో వంటసంగతి యనుకొన్నానులెండి. అందుచేత నడిగినాను.

శోభ—ఆబిడపెద్దది. పుట్టెబుద్ధిమెట్టఁగిన తరువాత నత్తెసరయినఁ

బెట్టి యెఱుఁగదు. మాయాఁడవాళ్లు పుట్టినింటికి వెళ్ళినారు. వంటబ్రాహ్మణుఁ డిదివఱకుండి వెళ్ళిపోయినాఁడు. తిరిగి యెవ్వరి నైన నేర్పఱుపవలెననుకొన్నాను. ఎవరును కుదరరు. వాళ్ళకు బాగుగ నన్నము గలిగియున్నది.

రామ—అవును వంటబ్రాహ్మణులు దొరుకుట కష్టమే.

ఇట్లు వారిద్దఱు కొంతసేపు మాటాడుచుండిరి. తరువాత వంట యయినదని తల్లి కేకవేయఁగా నిద్దఱును లేచి చెఱువునకు వెళ్ళి స్నానముజేసి యిష్టాగోష్ఠిని మాటాడుచు భోజనముసేసిరి.

రెండవ ప్రకరణము.

భోజనములు కాఁగానే చేతులు గడుగుకొని చావడిమీఁద వారిద్దఱు కూర్చున్నపుడు శోభనాచలము తాంబూలముమాట జ్ఞప్తికి రాఁగా తమలపాకులును చెక్కలును లేకపోవుటచేతను గొప్పవారియింటఁ దమలపాకులుండకపోవునా యనియు నవి తనయింట లేనందున తానుతక్కువవాఁడనియు రామచంద్రుఁ డాలోచించునేమో యని భయమును సందేహమును బొంది శోభనాచలము తాను నిరంతరము తాంబూలము వేసికొనునట్టి మహాసరసుఁడే యని బంధువునకు ధ్రువముగాఁ దెలియఁ జేయుటకై యిట్లని చెప్పెను. "తమలపాకు లయిపోయినవి. చాకలివాఁడు వారముదినములక్రిందట సెలవుతీసికొని వెళ్ళి తిరిగిరాకపోవుటచేత సంతకుఁబోయి యాకులను దెచ్చువారు లేకపోయిరి. అదికాక మాయింటిది గ్రామమున నుండక పోవుటవలన తమలపాకుల మీఁద శ్రద్ధకూడ తప్పినది. అదియున్నప్పుడాకులు చెక్కలు మాయింటినిండ దొరుకుచుండును. ఉదయాస్తమయములు వచ్చినవా రందఱు నములుచుండెడి వారు."

అని చెప్పఁగా రామచంద్రుఁడు తమలపాకు లలవాటులేదని చెప్పి విశ్వనాథశాస్త్రులవారిదర్శనము త్వరితముగాఁ జేయవలయునని యుత్సాహముతో శాస్త్రిలవారి యింటికిఁ ద్రోవఁజూపుమనియు, పూఁటకూళ్ళయిల్లు గ్రామమున కేపక్క నున్నదనియు, తనదగ్గఱ నున్నవస్తువుల నమ్మివేయుటకు కోమటిని బిలిపించుమనియు రామచంద్రుఁడు శోభనాచలమును తొందరపెట్టెను. శోభనాచలమునకు వస్తువుల నమ్మివేయుటయందు రామచంద్రునికంటె నెక్కువయాత్రము గలిగియున్నది. కనుక శాస్త్రిలవారింటికి మఱునాఁడు వెళ్ళవచ్చుననియుఁ, బూఁటకూటియిల్లు సాయంకాలము జూపుమనియుఁ జెప్పి కోమటినిమాత్ర మప్పుడే పిలిపించుటకు నిశ్చయించి యెవరిచేత నయినను మద్దుల కనకరత్నమునకు వర్తమానము బంపవలె ననుకొనుచుండఁగా నిరువదియేండ్ల వయస్సుగల యొక కమ్మవారి చిన్నవాఁడు వచ్చెను. అతఁడు శోభనాచలమునకు గుండెకాయ. ఇతనిపేరు వెంకటస్వామి. మార్గాయాసముచేత నీలోఁగా రామచంద్రునకుఁ గొంచెము నిద్రపట్టెను. అతఁడు నిద్రించుచుండఁగా వెంకటస్వామిని వీధిలోనికిఁ దీసికొనిపోయి యఱుగుమీఁదఁ గూర్చుండఁబెట్టుకొని శోభనాచల మతనితో నేదో గుసగుసలాడి పంపెను. యజమానుని కార్యనిర్వాహమునందు హనుమంతునితో సాటియని చెప్పఁదగినయాకుఱ్ఱవాఁడతివేగముగఁ బోయి కోమటితోఁగూడ నక్కడనున్నట్లు మరలివచ్చెను.

కనకరత్న మెప్పుడు వచ్చునాయని యెదురుచూచుచున్న శోభనాచల మతఁడు రాఁగానే తటుక్కునలేచి వీధిగుమ్మము వద్దకెదురుపోయి కమ్మకుఱ్ఱవాని దగ్గఱనుండి కోమటిని చెయ్యిపట్టుకొని దూరముగాఁ దీసికొనిపోయి చెప్పవలసిన సంగతులన్నియుఁ జెప్పి యాతని వెంటఁబెట్టుకొని రామచంద్రుని యొద్దకువచ్చి యాతని నిద్రలేపెను. లేచి తన యెదుట నల్లని లావుశరీరమును, భూలోకమున నవతరించిన ప్రత్యక్ష విఘ్నేశ్వరుఁడేమో యను భ్రాంతి కలుగఁజేయు పెద్దపొట్టయు, నుదుట

పట్టునామములును జేతులను మురుగులును నెడమచంక క్రింద వస్తువులున్న చారల సంచియు, కుడిచేతిలోఁ జిన్నత్రాసును గల కోమటిని జూచి రామచంద్రుఁడు కూర్చుండుమని చెప్పెను. అప్పుడు వారందఱీప్రకారముగా మాటాడిరి.

శోభ—కనకరత్నము! ఈపిల్లవాఁడు మురుగులను విక్రయించవలెనని నాతోఁ జెప్పినాడు. నీవు నాకు నమ్మకము గలవాఁడ వౌటచేతను, మాకు మీకు చాలవ్యవహారము లుండుటచేతను నేనునీకు వర్తమానము నంపినాను. ఒకడబ్బుసొమ్మెక్కువ కమ్మవలెనుగాని తక్కువ కమ్మవద్దు. మాకితఁడు కావలసినవాఁడు బంధువులతో పని హెచ్చుతగ్గైన వచ్చినపక్షమున నాకు మాటదక్కదు. ఇది నీవ్యవహారముగాఁ జూచుకోవలెను. వేఱే నేచెప్పనక్కఱలేదు.

కన—సరిసరి, మీరునాతో సెలవియ్యవలెనా ? ఇంతకాలము నుండి మీకునేను వస్తువులు నమ్మకముగా నిచ్చుచున్నాను. ఎన్నఁడయిన దమ్మిడిదగ్గఱనైన తేడావచ్చినదా? మనుష్యునకు మాట నమ్మక ముండవలెఁగాని ధనమా పావనము? భోగముదిగణించఁగలదు. తమవంటివారి దగ్గఱ మర్యాద కావలెనుగాని యొకడబ్బిటయితే నేమి? అటయితేనేమి. ఏవీ? మురుగులు తీయండి.

అని కనకరత్నము జెప్పఁగానే శోభనాచలము రామచంద్రుని దగ్గఱగా జరిగివచ్చి అబ్బాయీ ! మురుగులు దీయనా యని యడుగ నతఁడు తీయుమని తలయూఁచి యూరకుండెను. చేతిని మురుగులు చిన్నతనములో చక్కగా నెక్కించుటచేత చేతులతో లాగినపుడు మురుగులు రాలేదు. తరువాత త్రాళ్ళుబోసి వారు లాగుచుండఁగా, తల్లిదండ్రులు చిన్ననాఁడు తనకావస్తువు చేయించిపెట్టిన నాఁటికి నిప్పటికి తన యవస్థలో నెంతతారతమ్యము గల్గినదో తలంచుకొని, మురుగుల నమ్ముకొనుటచేతఁ గాని తనకుభోజనంబు జరుగకున్నదని కొంచెము విచా

రించి రామచంద్రుఁడు దుఃఖమును పైకిరానీకుండ దిగమ్రింగి బేరమును జూచుచుండెను. కనకరత్నమును మురుగులు దీసినతరువాత కొన్నిరాళ్ల త్రాసులో వేసి మురుగులు తూచికొంచెము నోరుచప్పరించెను. అప్పుడు వారిట్లు మాటాడిరి.

రామ—ఏమోయి ! ఆలా గనుచున్నావు ? ఎన్నితులముల యెత్తున్నవి.

కన—ఏమని మనవిచేయనండి? పాతగుల్లలు. చూడఁగానే నేనేమాత్రమో యుండుననుకొన్నాను. అబ్బే ! మాయనష్టములండి. ఏ కంసాలి చేసినాడండి? లాభము బాగుగాఁ గొట్టినాఁడు. ఇవి రెండుతులములు లున్నవి. తులము పదునెన్మిది రూపాయలధర.

రామ—మానాన్నగారు నమ్మకమయినకంసాలిచేత చేయించి నారు. అదికాక యిది మేలిమి బంగారము. తులము పాతికరూపాయల ధర. గీటురాయి యేదీ?

కన—పిచ్చిమాట. ఎంతనమ్మక మున్నను కంసాలి తిన్నఁగా జేయునా? అదికాక యిదివరహాలవన్నె కాని మేలిమికాదు. కావలసినయెడల నింక యెవరికయినఁ జూపించుకొనుఁడు. నేను గీటురాయి మఱచి పోయినాను.

శోభ—గీటురాయి యెందుకయ్యా? అతఁడు నాణెముకట్టినట్లు మాగ్రామమునం దెవ్వరును గట్టలేరు. ఒకవేళ పొరపాటు వచ్చిన నతఁడు పారిపోవునా? నీవుపారిపోదువా? ఇచ్చినమట్టుకు సొమ్ముపుచ్చుకో. నిలకడమీఁదను జూచుకొనవచ్చును. పుష్యరాగములుకూడ విక్రయిం చవలెనని యున్నదా?

రామ—అవి యిపుడు విక్రయించను. ఈరూపాయ లయిన తరువాతగాని చూడను. అయితే కనకరత్నము ! నీవిపుడు రొక్కము నీయఁగలవా?

కన—తక్షణము పుచ్చుకొండి. ముప్పదియైదురూపాయలు నా దగ్గఱ నున్నవి. తక్కినరూపాయలు రేపుదయమునఁ బంపించెదను." అనిలెక్కబెట్టి సొమ్మిచ్చెను. రామచంద్రుఁడు సొమ్ము పుచ్చుకొని బొడ్డుకొంగునఁగట్టుకొనెను. అంతట కోమటియు నింటికి వెళ్లిపోయెను.

అపుడు రామచంద్రుఁడును శోభనాచలమును లోకాభిరామాయణమును జెప్పుకొనుచుండఁగా పాతికసంవత్సరముల వయస్సుగలయొక పుష్టివాఁడు, రెండుభుజములమీఁద కాయలు స్పష్టముగఁ గనుపడుచుండ, జుట్టును జుల్ఫములను నున్నగ దువ్వి, చేతిలో నొకపేపబెత్తము బట్టుకొని, తలను నుత్తరీయము కుచ్చువచ్చునట్టు చుట్టి, నోట నొక చుట్టను బెట్టుకొని కాల్చి గుప్పుగుప్పున పొగలువదలి చిన్న మేఘములను గల్పించుచు, చేతిలో గుప్పెడాకులును చెక్కలును బట్టుకొని, నాగరికత యంతయు తనమొగముననే తాండవమాడునట్లు లోపలికి వచ్చెను. లోపలికి వచ్చిన యామనుష్యుని జూడఁగనే శోభనాచలమున కొకవిధ మయినతొందరకలిగెను. వచ్చినక్రొత్తమనుష్యుఁడుతనచంకక్రిందగుడ్డలోఁ జుట్టఁబడి యున్న చీట్లపేకను దీసి చావడిమీఁద వేయఁగనే, శోభనాచలమునకు తొందరయెక్కుడై, మొగము వెలవెలఁబాఱి, రామచంద్రుఁడు తనతోఁ బ్రసంగవశమునఁ జెప్పుచున్నమాటలు వినఁబడకుండెను. ఆతఁడు వచ్చి కూర్చుండి చుట్టకాల్చుకొనుచు, తమలపాకులతొడిమలఁ దీయుచు శోభనాచలమునకు లేశమయిన నిష్టములేకపోయినను నాతఁడు చేసిన కనుసంజ్ఞనైనఁ జూడక మాటలాడ నారంభించెను. ఈతనిపేరు నరసయ్య.

నర—"ఓరీ! శోభనాచలము! మనవాండ్రెవ్వరు రాలేదా? నీవుకూడ మొద్దులాగున కూరుచుంటి వేమి? దొడ్డిలో చింతచెట్టుక్రింద చాపలు వేయించినావా? నీపద్ధతిజూడఁగానీవేళ యిక్కడనే యాడుటకుని శ్చయించినట్లున్నది. ఏమి బెల్లముగొట్టినఱాయిలాగునమాటాడవేమిరా?

అని క్రొత్తమనుష్యుఁ డిట్లు మాటలాడుచుండఁగా పంగనామములు బెట్టుకొని యింకొక బ్రాహ్మణుఁడు వచ్చి కూరుచుండెను. శోభనాచల మాతని జూడఁగనే "దయచేయండి. వెంకటరత్నముగారు" అని పలుకరింపఁగా వెంకటరత్నము మిక్కిలి తెలివిగలవాఁడును, ప్రపంచవ్యవహారములయం దారితేఱినవాఁడును, గావున కడుమర్యాదగాఁ గూరుచుండెనుగాని తమలపాకులు వేసికొనుచు మొదటవచ్చిన బ్రాహ్మణుఁడు వెంకటరత్నమును జూచి యిట్లు పలుకరించెను.

నర—ఏమిరో! వెంకటరత్నము! నీవుకూడ యింత యాలస్యము చేసినావేమి?

వెంక—ఈవేళ భోజనము ప్రొద్దుపోయినది. వైశాఖపూజ చేసినాము.

నర—ఇది చైత్రమాసముగదా! వైశాఖపూజ యేమిటి?

వెంక—ఏడ్చినావులే. నీవూరుకో. నీకేమియుఁ దెలియదు.

నర—మీయింట వైశాఖపూజ జరిగిన శరభరాజుగారు నాకు వర్తమానము బంపరూ? మీయింట నేను రెండుకావిళ్ల మంచినీళ్లను మాత్రముఁ బోసి వెళ్లిపోయినాను.

వీరీప్రకారముగా మాటలాడుకొనుచుండఁగా మఱి నలుగురు మనుష్యులు తటాలునఁ దలుపుఁ దోసికొని వచ్చిరి. అందులో నొకఁడు శోభనాచలమును జూచి "ఓరీ! పిల్ల కుదిరినదఁట. సోమావధానులు చూచివచ్చినాఁడు" అని చెప్పెను. అపుడు వెంకటరత్నము మొగము చిట్లించుకొని యాక్రొత్తమనుష్యునివైపు దిరిగి పండ్లుకొఱికి మాటాడవద్దని సంజ్ఞచేసి "మన మందఱము దొడ్డిలోనికిఁ బోదమురండి" యని వారినందఱిని వెంటఁబెట్టుకొని యదివఱకే చింతక్రింద కమ్మకుఱ్ఱవాఁడు పఱచిన చాపల మీఁదఁ గూరుచుండి చీట్లపేక నాడ నిశ్చయించిరి. శోభనాచల మాదినమున రామచంద్రుఁడు వచ్చుటచేత నాటకు వెళ్ళక

కూరుచుండెను. మెడలో పిడికెడు యజ్ఞోపవీతము లుండుటచేత శోభనాచలమునకు వివాహమైనదని నమ్మియున్న రామచంద్రునకు నొకఁడు వచ్చి పిల్లకుదిరినదని చెప్పఁగానే శోభనాచలము చెప్పినమాటల యందును, వాని పెండ్లివిషయమందును, కొంచెము సందేహము గలుగుటయేకాక యతనియింటికి వచ్చి సంభాషించినవారి మాటలను బట్టి వీరందఱు వంటబ్రాహ్మణులు నీళ్ళబ్రాహ్మణులు మఱి యితరమైన నీచులనికూడ నాలోచన తోఁచి శోభనాచలము నడిగి చూడవలెనని బుద్ధిపుట్టెను. వారిట్లు మాటాడిరి.

రామ—ఏమండీ! ఆమొదట వచ్చినబ్రాహ్మణుఁ డెవఁడు?

శోభ—(వినివినుపించుకొనునట్లు మనస్సులో నేదో యాలోచించుచుండెను.)

రామ—ఏమండీ! ఆమనుష్యుఁ డెవరండీ?

శోభ—ఈగ్రామమునందు నీళ్ళబ్రాహ్మణుఁడు. (అని మెల్లఁగాఁ జెప్పెను.)

రామ—అతఁడు పరువు మర్యాద లెఱుఁగకుండ మాటలాడినాఁడేమి?

శోభ—ఏమిటో చిన్నతనమునందు మేమిద్దఱము నొకబడిలోనే చదువుకొన్నాము. అప్పటి చనువుచేత నిప్పటికిని నన్నాలాగున నాతఁడు పిల్చుచుండును స్నేహితులయెడ నాకంత పట్టింపు లేదు.

రామ—పిల్లకుదిరినదని యొకమనుష్యుఁ డన్నాఁడు. ఆపెండ్లి యెవరికి?

శోభ—నాకు వివాహ మనుకొన్నావా యేమి? మాపినతండ్రి కుమారునికి వివాహము కాలేదు. అతనివిషయమైపిల్లను వెదుకఁ బంపినాను.

రామ—ఇప్పుడు వారందఱు దొడ్డిలో నేమి చేయుచున్నారు.

శోభ—చీట్లపేక నాడుచున్నారు. నీవుగూడ నాడఁగలవా?

రామ—నాకు చేతఁగాదు. నేనాడఁ దలంచుకొనను లేదు.

శోభ—ఆడిన తప్పులేదు, చేతఁగాకున్న నేర్చుకొనవచ్చును. డబ్బుపెట్టియాడరు. ఒకవేళ సంతోషమునిమిత్తమాడినను తిరిగి యెవరి డబ్బు వారికే యిచ్చివేయుదురు.

రామ—అటువంటి యాటను నేను నేర్చుకొనను.

అని యిద్దఱు ప్రసంగము చేయునపుడు లోపల చీట్లపేక నాడుచుఁ గొంచెముధనము ఋణము కావలసి యొకస్నేహితుఁడు శోభనాచలమును నవలకుఁ బిలిచి ప్రస్తుతమాడుకొనుట కభ్యంతరము గల్గిన దనియు, తానింటిదగ్గఱ నుండి తెచ్చిన యిరువదియైదురూపాయలు నోడిపోవుటచేత పదిరూపాయ లప్పు కావలెననియుఁ జెప్పఁగా శోభనాచలము రామచంద్రునియొద్ద కాతనిఁ దీసికొనివచ్చి యాతఁడు మహాధనికుండనియు, సంవత్సరమున కతనికి వేయిరూపాయలు భూములమీఁద వచ్చుననియుఁ జెప్పి తన నమ్మకముమీఁద పదిరూపాయలు ఋణమిప్పించెను. అప్పుఁ దీసికొనుచున్న యామనుష్యుఁడు ధనవంతుఁడు గాకపోయినను, జూదరియు, నిర్భాగ్యుఁడు నైనను, శోభనాచలమున కతనియందుఁ గల యభిమాన మతని విషయమై యంత చక్కఁగాఁ జెప్పునట్లు చేసినది. శోభనాచలము మాటలునమ్మి రామచంద్రుఁడు తాను దిగుచున్న మహావిపత్సముద్రము నెఱుఁగకయే కొంగునఁగట్టినఁ సొమ్మువిప్పి బిళ్ళకుడుములలాగున పదిరూకలు లెక్కపెట్టి చేతిలోఁ బెట్టెను. రూపాయకు దినమున కొకయణా వడ్డీ యిచ్చెదనని చెప్పి యతఁడు సొమ్మునుబట్టుకొని పోయెను. మరికొంతసేపటి కామనుష్యుఁడే తిరిగి మఱి యైదురూపాయల నిమ్మని యడిగి పట్టుకొనిపోయెను. ఇప్పటికి రామచంద్రునియొద్ద నిరువది రూపాయలుమాత్రముండును. శోభనాచలముగారి పెరటిలో జరుగుచున్న మహాద్యూతము నందు మొహరీలు, వరహా

లు, రూపాయలు, అణాలు, డబ్బులు కూడ పందెములుగాఁ బెట్టి, దార పుత్రాదు లన్నవస్త్రములులేక మలమల మాడుచు నిత్యశివరాత్రులు ను నేకాదశులును సలుపుచున్నను దానిని లక్ష్యపెట్టక, యహోరాత్రములు వేదాంతులవలె బంగారమును చిల్లిపెంకులుగఁ జూచుచు వినోదసముద్రమునందు మునిఁగి తేలుచున్న యనేకనలచక్రవర్తులును ధర్మరాజులును నాచింతచెట్టుక్రిందఁ గొలువుఁ దీర్చియుందురు.

వారంద ఱావేసమ ట్లవిచ్ఛిన్నముగా జూదమాడుచున్న సమయమునందు నాకిటఁగూరుచున్న రామచంద్రశోభనాచలముల కొక విధమైన యల్లరి వినఁబడెను. అది వినఁబడినతోడనే శోభనాచలమునకు మనసు తాళకపోయినందున వెంటనే యరుగుమీఁదనుండి చివాలున నేల కుఱికి లోపలి కతఁడు పరుగెత్తుకొనిపోవుచుండఁగా సీతని కెదురుగా పయిమీఁద బట్టలేక జుట్టుముడి విడిపోయి, వెక్కివెక్కి యేడ్చుచు, కుచ్చెళ్ళకొంగుతోఁ గన్నీళ్ళఁ దుడుచుకొనుచు, నొకపిల్లవాఁడు వచ్చెను. అతనిఁజూచి రామచంద్రుఁడుకూడ లేచి పిల్లవాని యెదుటకుఁ బోయెను. అప్పు డాపిల్లవాఁడిట్లు చెప్ప నారంభించెను.

"అయ్యా! ఈసంగతి మీరు వినండి. నేను వీథిలో నుండి మాయింటికిఁ బోవుచుండఁగా సీకమ్మకుఱ్ఱవాఁడు నన్ను లోనికిఁ దీసికొని పోయెను. వెంకటరత్నముగారు నన్నుఁగూడ చీట్లాడుమని బలవంత పెట్టిరి. ఒకటి రెండు పందెముల యందు నన్ను గెలిపించి తరువాత నాచేతి నున్న బంగారపు ముద్దుటుంగరమును బందెము బెట్టించిరి. పైమీఁదనున్న జరీయుత్తరీయమును గూడ లాగుకొని నేనిమ్మనిగట్టిగా నడిగి నప్పుడు నన్ను వీరందఱుఁ దిట్టి కొట్టినారు. ఇవిగో చరుపులు చూడండి. దెబ్బ లేలాగున నట్టలు కట్టియున్నవో. నేనిప్పుడు శరభరాజుగారియొద్దకుఁబోయి యీసంగతిఁ జెప్పెదను." అని చెప్పుచున్న కుఱ్ఱవానిమాట కడ్డమువచ్చి సరసయ్య మహాకోపముతో నిట్లనియెను.

నర—కాళ్ళుకూఁతలు కుయ్యకు. చెప్పదెబ్బలు తినఁగలవు. శరభరాజుగారితోఁ జెప్పి తలఁగొట్టి మొలవేయించఁ గలవా యేమి? నీదిక్కున్న చోట చెప్పుకో. (అనిశోభనాచలమువంకఁ జూచి) ఈతఁ డుంగరమును బెట్టుకొనిరాలేదు. ఉత్తరీయము నేను పుచ్చుకొన్నమాట సత్యమే. నాదగ్గఱ రెండురూపాయలప్పుఁదీసికొని నాలుగు నెలలయినది. ఇంకను నీయలేదు. అందుచేత బట్టలాగుకొన్నాను. ఇతఁడు రాను లేదు. ఆడను లేదు. అంతయు నబద్ధమే.

ఇట్టిద్దఱు చెప్పఁగనే విని శోభనాచలము తన స్నేహితుల శక్తియు సాహసమును నెఱిఁగినవాఁడు గావున తప్పక వారాయుంగరము నపహరించి యుందురని నిశ్చయించి శరభరాజుగారీసంగతి విన్నపక్షమునఁ దనకు మాట వచ్చునని యేలాగైన నతని సొమ్మతనికిప్పించ వలెనని నిశ్చయించుకొని బలవంతముగా రానికోపమును దెచ్చుకొని యీప్రకారముగాఁ జెప్పెను.

శోభ—పుణ్యమునకుఁ బోఁగా పాప మెదురైనదఁట. స్నేహితులుగదా యని యాఁడుకొనుటకు స్థలమిచ్చినందుకు దెబ్బలాటలును, తుదకు నిష్టురములునా? నాయనా నీసొమ్ము నాయింటఁబోయినందులకు నేనాదండుగ నిచ్చుకొందును. తెచ్చుకొన్నందుకు చచ్చినట్లనుభవింప వలెను. నాసొమ్మెందఱు తినుచుండుటలేదు? అందులో నీవొకఁడవు. ఇంత మాత్రముతో నేను చెడిపోను. (అని రామచంద్రునివంక తిరిగి) అబ్బాయి! నీదగ్గఱనున్న యిరువదిరూపాయలు నాకుబదులియ్యఁగలవా సాయంకాలము తిరిగి నీ కిచ్చివేయుదును.

రామ—చిత్తము. పుచ్చుకొనుఁడు. అని చెప్పి యాసొమ్మునంతను నిచ్చెను. ముప్పదియైదురూపాయలు బదుళ్ళక్రిందనే యిచ్చివేయుటచేత రామచంద్రునకు భారమంతయుఁ దగ్గి దేహము చులుకనయయ్యెను. ఆరూపాయలు పుచ్చుకొని యాపిల్లవాఁ డుత్తరీయము

గూడ మరల నరసయ్యయొద్దనుండి తీసికొని యింటికిఁబోయెను. అప్పుడు సాయంకాల మగుటచే రామచంద్రుఁడు సంధ్యావందనమును జేసికొనుటకు చెఱువునకుఁ బోఁగా వెంకటరత్నమును, శోభనాచలమును వానిని వెంబడించిరి. వెంకటరత్నము చెఱువుగట్టున నున్న యొకయింటఁ బ్రవేశించెను. శోభనాచలము మాత్రము చుట్టఁగాల్చుకొనుచు గట్టు మీఁదఁ గూరుచుండి రామచంద్రుని సాంధ్యకృత్యము లయినతరువాత నతనితోఁ గలిసి ప్రదోషకాలమున శివాలయమున కరిగి యాలయము చుట్టును మూఁడుప్రదక్షిణములు చేసి నందీశ్వరుని చెవుల సందులనుండి ముందుగా నీశ్వర దర్శనముచేసి, గర్భగుడిఁ బ్రవేశించి తన కందకుండ నున్న గంట నెగిరికొట్టి శివునిదర్శించి “వందేశంభుముమాపతిం” అను శ్లోకమును బఠించి పూజారి యిచ్చిన రుద్రపాదముల నందుకొని మాహేశుపత్రి నంది తల నుంచి విభూతి మొగమునఁదాల్చి, కనుబొమ్మల సందున నమ్మవారి కుంకుమను బొట్టుబెట్టుకొని యీశ్వరప్రసాదమును దినఁగూడదు గనుక కొబ్బరి ముక్కల నక్కడనుంచి, కొంతసేపచటఁ గూరుచుండి యింటికి శోభనాచలముతోఁ గలిసి వచ్చునప్పటికి భోజన పువేళ యయ్యెను.

తన యదృష్టమువచ్చి రామచంద్రుఁడు వచ్చుటచేత తన కుమారుని వలన తగిలెడుదెబ్బలు తప్పినందులకు సంతోషించుచు, నల్ల మందు లేకపోవుట చేత కాళ్ళు లాగుచున్నందున వంటమాత్రము చేసి కొని శోభనాచలముతల్లి పరుండెను. శోభనాచలమువచ్చి తానే యన్నము వడ్డించి రామచంద్రునితోఁ గలిసి సుఖముగా భోజనము జేసెను. భోజనమగువఱకు వెంకటస్వామి వచ్చి సిద్ధముగా నున్నందున శోభనాచలము వానినక్కడనే పండుకొనుమని సహాయార్థ ముంచుకొ నెను. రాత్రి జామయిన తరువాత రామచంద్రునికి నిద్రపట్టెను. కొంతసేపటికి కందఱు బుసకొట్టి నిద్రపోవుచుండిరి కాని వెంకటస్వామికి

మాత్రి యేకారణముననో నిద్రపట్టదయ్యెను. తరువాత రెండుజాముల వేళ నేలఁగొట్టినట్టు చప్పుడయ్యెను. ఏదో స్వప్నమువచ్చి మెలఁకువఁ గల్గిన రామచంద్రుఁడాచప్పుడువిని 'యెవరువారు' అని కేకవేసెను. ఆ కేక వేయఁగనే యాచప్పుడాగిపోయి మరల నొకరెండు గడియలయ్యెను. అప్పటికి రామచంద్రుఁడు గాఢముగ నిద్రించుచుండెను. అప్పుడొక దొంగ చప్పుడుగాకుండ మెల్లమెల్లగా నడుగులఁ బెట్టుచు రామచంద్రునియొద్దకువచ్చి, తలవైపునఁ గూర్చుండి తమ్మంట్లఁ దీసికొని దురాశ చేత, శోభనాచల మిదివఱకే రూపాయ లన్నియు క్షౌరముచేసినాఁడన్న మాట నెఱుఁగక, తలక్రింది మూఁటలో నేమో యున్నదనుకొని మెల్లగ మూఁటలాగెను. మూఁటలాగఁగనే తల భూమిమీఁదఁ బడి టక్కున తగులుట వలన మెలఁకువ వచ్చి రామచంద్రుఁడు తలయెత్తిచూచి 'దొంగ దొంగ' యని కేకవేసెను. వెంటనే దొంగ మూఁటఁబాఱవైచి యేమూలకో పాఱిపోయెను. రెండుమూఁడు పిలుపులు పిలిచినతరువాత శోభనాచలములేచి దొంగలు పడినందుల కాశ్చర్యపడి దీపము వెలిఁగించి కఱ్ఱ పుచ్చుకొని యిల్లు నాల్గుమూలలు వెదకెను గాని వాని కెక్కడను దొంగ కనఁబడడయ్యెను.

కమ్మకుఱ్ఱవాఁడు మాత్ర మీ కేకలు వినఁబడక కాఁబోలు, చెమట పోయుచున్నను ముసుఁగుపెట్టికొని పండుకొనెను. రామచంద్రుఁడొక్కఁడు పండుకొనుటకు భయముగలుగుట చేత, కాఁదలఁచిన పని కొంచెమైనది గనుక శోభనాచలము రామచంద్రునిమీఁద నతిదయఁగలిగి దగ్గఱగాఁ బండుకొనెను. రూపాయలు శోభనాచలము దగ్గఱనుండుటచేతను, తమ్మంట్లు దొంగలెత్తుకొనిపోవుటచేతను, రామచంద్రునకు భయపడవలసిన యావశ్యక మంతయుఁబోయి సుఖముగా నిద్రపట్టెను. కాని మధ్యమధ్య స్వప్నములు, పలువరింతలు, నాతనినిద్రకు నంతరాయములు గల్పించుచుండెను. మురుగుల నమ్ముకొనుట చేత వచ్చినసొమ్ముతో కొంతకాల

క్షేపము చేయవచ్చునను ధైర్యమున తమ్మంట్లుపోయిన విచారమంతగా రామచంద్రున కగుపడలేదు. వయస్సునందు బాలుఁడయ్యు, తెలివితేటలం దసమానుఁడయిన యాకమ్మకుఱ్ఱవాఁడే రామచంద్రుని తమ్మంట్ల బాధ వదలించిన సాహసవిక్రముఁడని చెప్పనక్కఱలేకయే మీరు తెలిసికొనవచ్చును. జూదరియు, వంచకుఁడును, ద్రోహియు నగు నీశోభనాచలము, రామచంద్రుని తండ్రియగు శ్రీరాములుగారి నెఱుఁగక పోయినను నెఱిఁగినట్లుచెప్పి నిరక్షరకుక్షియయ్యు కావ్యపంచకము వఱకుఁ జదువుకొన్నట్లు చెప్పి పరమనీచుఁడయ్యు గొప్పవారికి బంధువుఁడని చెప్పి బ్రహ్మచారియయ్యు గృహస్థుఁడనిచెప్పి, మోసముచేసి, రామచంద్రుని తన యింటికి రప్పించుకొని చేయఁదలంచిన పనినంతయుఁ జేసి సఫలమనోరథుండై యారాత్రికమ్మవానిచేత దొంగతనము చేయించి, తమ్మంట్లు తానే యపహరించి మిగిలిన రాత్రియంతయు సుఖముగా నిద్రించెను. మద్దుల కనకరత్నమును శోభనాచలమునకే విషయమునను దీసిపోనివాఁడేకనుక నేఁబదిరూపాయల విలువగల మురుగులను ముప్పదియారు రూపాయలకే తీసికొని యందులో నొకరూపాయ నరువుపెట్టి తనచేత నయినంతవఱకుఁ దానును రామచంద్రుని వంచించెను. అందఱు నుదయమునందు లేచి కాల్యకృత్యముల నిర్వర్తించుకొనిరి.

మూఁడవ ప్రకరణము.

ప్రాతఃకాలమందు కాల్యకృత్యములు నిర్వర్తించుకొని విశ్వనాథ శాస్త్రులవారి దర్శనము చేయుటకుఁ బోవలయు నని రామచంద్రుఁడు శోభనాచలమును గూడ రమ్మనియడుగ నతఁడు వచ్చుటకు వీలు లేదనియు, శాస్త్రులవారు మిక్కిలి మంచివారనియు, స్వయముగానే వెళ్ళవచ్చుననియుఁ జెప్పి వారి యింటికి మార్గమును జూపుటకు మాత్రము

వెంకటస్వామిని జత యిచ్చెను. ఆతఁడును రామచంద్రుని వెంటఁబె
ట్టుకొని శాస్త్రులవారి యిల్లు చూపిపోయెను. విశ్వనాథశాస్త్రులుగారి
యిల్లు రాజవీథిలోనున్నది. విశాలముగా నున్న రెండువీథియరుగుల
మీఁద తాటియాకుల చాపలువేయఁబడి యున్నవి. ఆచాపల మీఁద
విశ్వనాథశాస్త్రులవారి విద్యార్థులందఱుఁ గూరుచుండి యుండిరి. అందు
లో కొందఱు తామిదివఱకుఁ జదువుకొన్న పాఠములఁ జింతనఁ జేసికొను
చుండిరి. కొందఱు ముందు చెప్పుకొనవలసిన పాఠములను జూచుకొను
చుండిరి. కొందఱాకును, గంటమును, బుచ్చుకొని క్రొత్తపుస్తకములఁ
జూచి ప్రతులవ్రాయుచుండిరి. ఉదయమునందే స్నానముజేసి, విభూతి
పెండెకట్లుఁ బెట్టుకొని, మొగలితుట్టు సంస్థానమునం దష్టావధానముఁ జే
సినపుడు మహారాజుగారిచ్చిన పట్టుశేలువ మీఁదఁ గప్పుకొని, బరువైన
బంగరు కుండలములు చెవులను క్రిందకు దిగలాగుచుండ విశ్వనాథ
శాస్త్రులవారు గోడకుఁ జేరగిలఁబడి కొంచెము తలవంచి కన్నులకు
సులోచనములు బెట్టుకొని ప్రాఁతదగుటచేత నక్షరము లగుపడకున్నందున
శిష్యుఁడొకఁడు మధ్యమధ్య పత్రములకు కాకరపసరు రాయుచుండఁ దా
టియాకుల పుస్తకమొకటి చదువుచుండెను. శాస్త్రులవారి కిప్పటికి
రమారమి యేఁబది సంవత్సరము లున్నందున తలకొంచెము నరసి
యుండెను. ముసలితనమైనను సుందరముగా, దార్ఢ్యముగానున్నయా
యన శరీరమును జూచినవారందఱు పడుచుతనమం దాయన స్ఫురద్రూ
పియై యుండునని యనుకొనక మానరు. రామచంద్రుఁ డక్కడకుఁ బో
గానే శిష్యులందఱు నితని నెగాదిగఁజూచి తమలోఁదాము ముసిముసినవ్వు
లు నవ్వుకొనుచుండిరి. రామచంద్రుఁడు వచ్చి శాస్త్రులవారికి నమస్కా
రముచేయ నాయన యాతని దీవించి కూరుచుండుమని చెప్పెను. కూరు
చున్నతరువాత రామచంద్రుని సంగతులన్నియు నడిగి యాతఁడు తమ
దగ్గఱ చదువుకొనుటకు వచ్చినాఁడని తెలిసికొని శాస్త్రులవారు సంతో

పించిరి. అంతట నొక శిష్యుఁడు రామచంద్రునితో ముచ్చటింపఁ దలఁచి యిట్లు సంభాషించెను.

శిష్య—అయ్యా! తమ రెంతవఱకుఁ జదువుకొన్నారు?

రామ—కావ్యపంచకము వఱకుఁ జదువుకొన్నాను.

శిష్య—ఎంతకాలమయినది కావ్యము లారంభించి?

రామ—మూఁడుసంవత్సరములైనది, ఇంక నేమాత్రమో కొన్ని నెలలుతక్కువే.

శిష్య—ఏమి బడాయ లయ్యా! ఎన్నఁడు కావ్యముల ముఖ మెఱుఁగనివారి దగ్గఱచెప్పినట్లే చెప్పుచున్నావు. నీవెంత తెలివిగలవాఁడ వైన నేఁడాది కొకకావ్యముకంటె నెక్కువఁ జదువఁగలవఁటయ్యా? నీవే చదువుకొన్నావా? ఇం కెవరు చదువుకోలేదా మేము నీ వంటి తెలివిగల వారము కాక పోయినను కొద్దిగొప్పచదువుకున్నవారమే

రామ—నేనబద్ధములు చెప్పుచున్నా ననియా మీ యభిప్రాయము? మూఁడు సంవత్సరములలో కావ్యములు జదువుకొనుట యొక వింతటండీ? నేనీలాగున జదివినాను.

శిష్య—మీరు గాదుగదా బ్రహ్మరుద్రులైనను సరే యేఁడాది కొక్కటి చదువునప్పటికి చచ్చిచెడి చేయంగల విన్నపములగును. మాట లండీ? మాగ్రామమునందు బ్రాహ్మణుఁ డొకఁడు నవద్వీపము వెళ్ళి యిరువదినాలుగు సంవత్సరములు వ్యాకరణశాస్త్రము చదివినాఁడు. ఇంకను గ్రంథము తరువాయి. నీవాకాశము మీఁదినుండి యూడి పడినావా యేమిటి? అయితే దినమున కెన్ని శ్లోకములు చదివెడువాఁడవు.

రామ—పది, ఎనిమిది యీప్రకారముగాఁ జదివెడువాఁడను.

శిష్య—(గుండె చేతితో బాదుకొని) అబ్బా! లోకములో లేనివింత. నీతలమీఁద దాఁటి కొమ్ములు దిరిగినవారైనను రెండు మూఁడు శ్లోకముల కంటె నెక్కువఁ జదువలేదు, (అని శాస్త్రులవారి

వంకఁ జూచి) ఏమండీ? శాస్త్రులవారు! ఇతని మాటలఁ జిత్తగించినారా

విశ్వ—ఆశ్చర్య మేమున్నది? కుశాగ్రబుద్ధు లున్న పక్షమున నల్లే చదువఁగలరు. ఇట్లు వారు సంభాషించు నప్పటికి జాముప్రొద్దెక్కఁగాఁ గొందఱు శిష్యులు మాధుకరమునకును గొందఱు వారములకును గొందఱు పూఁటకూళ్ళ యిండ్లకును బోయిరి. రామచంద్రుఁడు శాస్త్రులవారిదగ్గఱ సెలవుపుచ్చుకొని శోభనాచలమును దీసికొనిపూఁటకూఁళ్ళయింటికిఁబోయెను. ఆపూఁటకూటియింటియరుగుమీఁద భోజనార్థమువచ్చిన కొందఱురాజులును, బ్రాహ్మణులును గూరుచుండిరి. లోపల నడవలో నున్న దండెమునకు పట్టుబట్టలు వరుసగాఁ జుట్టఁబడి యుండెను. ఉదయాస్తమయములు తడికాళ్ళతో మనుష్యులు తిరుగుచుండుటచేత నిల్లంతయు తేమగలిగికొంచెము జారుగా నుండెను. చేతులను పోచీలును, మురుగులును, బంగారు తీఁగెలువేసిన రాగి పట్టెలును మెడలో పలకసరులు, పట్టెడ, నానును గలిగి చలువచేసిన జరీపంచె శరీరమంతయుఁ గనుపడునట్లు గట్టి, జుట్టు సిగముడివేసి, యింటఁ గొందఱికిని వాకిటఁ గొందఱికిని వడ్డించుచు, భోజనముచేసినవారిచ్చుచున్న డబ్బుల నెడమచేతఁ బుచ్చుకొనుచు, మిక్కిలి పనితొందరచే నూపిరి యాడక తిరుగుచున్న యొక తలవెండ్రుకల విధవనుజూచి, శోభనాచలము "రాజమ్మా! బాగున్నావా? ముసలాయన యేమైనా దార్ఢ్యముగాఁ దిరుగుచున్నాడా?" యని పలుకరించెను.

రాజ—తమదయవల్ల బాగున్నాము. మానాన్న మునుపటి వలెనే తిరుగుచున్నాఁడుగాని దగ్గుమాత్రము వదలలేదండి. ఏమి యీ వేళ మామీఁద కటాక్షము వచ్చినది.

శోభ—మఱేమిలేదు. తాటిపాకనుండి మన మాచిరాజువారి చిన్నవాఁడువచ్చినాఁడు. అతనికిమీయింట నుండవలెనని యున్నది. అతని నిక్కడ నొప్పగించుటకువచ్చినాను. పిల్లవాఁడు మిక్కిలి బుద్ధిమంతుఁడు.

ఈకాలపుపిల్లలవలె సల్లర చిల్లరవాఁడు గాఁడు. నీవందఱి నొకయెత్తు నీపిల్లవాని నొకయెత్తుగాను జూడవలెను. ఇతఁడొకరిజోలికి పొంటెకిఁ బోవువాఁడు గాఁడు. తన చదువేమో, తానేమో.

రాజ—దాని కభ్యంతర మేమి? తమరింతదూరము శ్రమపడి రావలెనా? ఆపిల్లవానికి మఱియొక లోపము రాకుండ జాగ్రతపెట్టు భారము నాది.

శోభ—రూపాయి లతని నడుగవద్దు. నెలకాఁగానే నేనిచ్చి వేయుదును. ఇంక వంట యెంత యాలశ్యముగా నగును నాలుగు గడియలకు రావచ్చునా?

రాజ—అక్కఱలేదు. రెండు గడియలలోగా రావచ్చును, స్నానము చేసిరా నాయనా

అప్పుడు శోభనాచలమును, రామచంద్రుఁడును వెళ్ళిపోయిరి. రాజమ్మది పూర్వము పలివెల నివాసస్థలము. ఆమెపెనిమిటి వివాహ మైన రెండుమాసములకే కాలధర్మము నొందుటచేతను పుట్టినింటివారి సంసారము చితికిపోవుట చేతను రాజమ్మ తల్లిని, తండ్రిని, తమ్మునిఁ దీసికొని యమలాపురము వచ్చి యచట పూఁటకూళ్ళను బెట్టుచు నహూరాత్రములు, వేసెడువిస్తరి వేయుచుఁ, దీసెడివిస్తరిఁ దీయుచు, వంటలు చేయించుచు, వచ్చినవారికి వడ్డించుచు కాశిలోనున్న యన్న పూర్ణాసత్రము నందువలె నిరంతరాన్నదానము జేయుచు నమలా పురమునందేకాక కోనసీమయం దంతటను మహాప్రసిద్ధికెక్కి విస్తారము ధనము నార్జించెను. పూఁటకూళ్ళను బెట్టుట కారంభించి మూఁడుసంవత్స రములైనను పండ్రెండువందలరూపాయిల నార్జించెను. ఆమె మొదట నాగ్రామము వచ్చినపుడు వండుటకు పాత్రసామాగ్రియైన లేనియిల్లు గంగాళములు మొదలయినవానితో నిండియుండఁగా మొదట కేవలము

రాగిపట్టెలయిన లేని రాజమ్మశరీరము బంగారపు నగలతో నిండియుం డుట యొక యాశ్చర్యముగాదు.

పాపము! దైవ మోర్వఁజాలక యామెకు వైధవ్యమును దెచ్చి పెట్టి మనసువచ్చినన్ని నగలు పెట్టుకొనుట కభ్యంతరము గల్పించినాఁడు గాని లేనిపక్షమున పుణ్యస్త్రీలుపెట్టుకొను నగ లన్నియుఁ బెట్టుకొనుట కామె దగ్గఱ సామర్థ్యమున్నది. ధనముహెచ్చినకొలఁది సుకుమారత కూడ హెచ్చినందున రాజమ్మ వంటఁజేయుట కష్టమనితోఁచి యొక వంటబ్రాహ్మణుని పెట్టెను. మొదట వచ్చినపుడు రాజమ్మతండ్రి పెసరట్లు నమ్ముటచేతను, తల్లి నీళ్ళబిందెలు మోయుటచేతను, తమ్ముఁడు చలిపందిరిలో దాహమునకు నీళ్ళిచ్చుటచేతను, తాను పూఁటకూళ్లు పెట్టుటచేతను సంపాదించిన ద్రవ్యముతో రాజమ్మ యిపుడు వడ్డీవ్యాపారము చేయుచుండెను. మొదట నందఱిని బ్రతిమాలి కాలక్షేపము చేయుచుఁ గొంతధనము చేతఁజిక్కఁగనే గర్వించి మనుష్యులను రాజమ్మనిరాకరింపఁ బ్రారంభించెను. ఇంటికి రాజమ్మ పెద్దాఁడుపడు చగుటచేత తలిదండ్రులును తమ్ముఁడును నామె యడుగు దాఁటక నామెపేరు జెప్పిన గడగడ వడఁకుచుందురు. తన యొడల నాలుగయిదువందల రూపాయిల నగలఁ బెట్టుకొని, తమ్మున కైదువంద లిచ్చి పెండ్లిఁ జేసి తా మున్న యింటివారికి నూరురూపాయ లింటిమీఁద బదులిచ్చి తరువాత నింకొకమాఱేబది రూపాయిలు వారిచేతిలోఁబెట్టి యాయిల్లుకొనెను. రాజమ్మ సంగతి నటుండనిచ్చి యిఁక కథారంభము జేయుదము. తరువాత రామచంద్రుఁడు స్నానముజేసి మడిఁ గట్టుకొనఁగా భోజనము లారంభ మాయెను. ఆసమయమునందు రాజమ్మ వడ్డనఁ జేయుచు, రామచంద్రుని వృత్తాంతమును దెలిసికొని యతఁడు నియోగియని చెప్పినతరువాత నిట్లు మాటాడ నారంభించెను.

రాజ—మొగమోటపడకు నాయనా! నియోగపు బిడ్డవు. కొంచెము పరువుప్రతిష్ఠలకు దేవులాడువారు మన నియోగులే. మేముగూడ నియోగులమే యని చెప్పుటకు నీవంటివారిదగ్గఱ సిగ్గుగానుండును. సగము చచ్చిసుమండీ యీపనిఁ జేయుచున్నది.

రామ—అవును. కాలము తప్పివచ్చునపు డేమి చేయఁగలము?

రాజ—నీవు చెప్పిన నమ్ముదువో లేదోకాని మాసంసారస్థితి, యేబదియావులపాడి. కావలసినంత ధాన్యపుపంట. ఏవస్తువునకైన నొకరియింటికి వెళ్ళనక్కఱలేకుండ కాలిమీఁద కాలువేసికొని కూర్చున్నవాళ్ళము. ఇవతలచెం బవతలఁ బెట్టి యెఱుఁగనుసుమీ. అలాటి దానిని, మాయశక్తియెక్కడనుండి వచ్చినదో బిండెలకుబిండెలు దింపుచున్నాను. నేఁటికాలమున కెంతకర్మమును దెచ్చిపెట్టినావా దైవమా యని పొట్టకోసర మీపనిఁ జేయుచు తగుదునమ్మా యని తిరుగుచున్నాను. ఎంత సుకుమారముగఁ బెరిగినానో యంతకష్టము వచ్చినది.

రామ—నియోగు లిటువంటిపనిఁ జేయవలసిన పక్షమున కష్టము గానేయుండును.

రాజ—కూచిమంచివారు, మాచిరాజువారు, మంత్రిప్రగడవారు మాకు బంధువులే. వారెవరైన కంటఁబడినప్పుడు ప్రాణము చచ్చినట్టుగానుండును. ఇప్పుడయిన నొకడబ్బుసొమ్ము మిగిలించుకొనవలెనని లేదు. వాళ్ళడబ్బు వాళ్ళకుఁ బెట్టి యేలాగుననైన మాటదక్కించుకోవలెనని యుద్దేశమే.

ఇట్లువారు మాటాడుకొనునప్పటికి భోజనమునకు మడికొందఱు వచ్చి చిరకాలముక్రిందటఁ దడిపినపట్టుబట్టలఁ గట్టుకొని యన్నముఁ దినుచుండిరి.

ఒకమనుష్యుఁడు—రాజమ్మగారూ! కొంతయన్నము చల్లగాను, కొంతయన్నము వెచ్చగాను నున్నదేమండీ ! పొడియన్న మేమయినఁ గలిసినదా యేమి?

రాజ—ఊరుకోవయ్యా! ఎవరయినను మీమాటకు నవ్వుదురు. అన్నము చల్లారినదేమో.

రెండవ—పప్పులో గంజివాసన వేయుచున్నట్లు గనఁబడు చున్నదేమి?

రాజ—మీకుకొంచెము రొంపపట్టినదేమో. పప్పులో గంజి వాసన యేమిటండీ.

మూఁడవ—ఏమిటండీ! అవతల రాజులకు వడ్డించఁగా మిగిలిన యన్నము మాకువడ్డించినారేమండి అంత బొత్తుగా మాలకూడా! కొంచెము కుడి యెడమ వద్దటండీ!

రాజ—చాలు లేవయ్యా ! నేర్చుకొనిపోయినావు. నీమాటలు నీవు సరే. నీవేయాచారవంతుఁడవా ? ఇవతలివాళ్ళే యంత మాలకూడు తినువాళ్ళా! నేనింటనుండి పళ్ళెముదెచ్చి వడ్డన చేయుచున్నందుకా యీలాటిమాటలు.

నాల్గవ—అన్నట్లు, జ్ఞాపకమువచ్చినది. రాజమ్మగారూ! మీమ అఁదిభార్య ప్రసవమైనదఁట. పురుడు వెళ్ళలేదుగదా! మీరు మడిగట్టు కొన్నారేమి?

రాజ—అయ్యో! మాకు వారికి తరములు తప్పిపోయినవండీ!

నాల్గవ—మఱఁదికి మీకు తరములేలాగునవిడిపోవునండీ! జ్ఞాతులు గనుకనా,

రాజ—పురుటిదినములు వెళ్ళిపోయినవి.

నాల్గవ—ఁవేకుతొమ్మిది. శుద్ధి స్నానముగాలేదు. రామ రామ. పురుటికూడుతినినందుకు రేపందఱము స్నానము చేయవలెను.

మీా రెప్పుడు నీలాగే. వెనుక చద్దియన్నముఁ బెట్టుమన్నపుడు మైలబట్ట తోనే పెట్టినారు. ఈయాచార మెక్కడను జూడలేదు.

మొదట—పచ్చడిలో మెతుకులు కనబడుచున్న వేమండీ?

రెండవ—ఇందాఁక నెవరో దిగఁబెట్టిన పచ్చడి వేరేతీసి దాఁచు చుండఁగా నేనుచూచినాను. అదిపొరపాటుచేత నీకుఁ బడినదేమో.

మొదట—నారాయణ! నారాయణ! ఎంగిలికూడ నెక్కడ తినఁ గలమమ్మా. ఛీ! నాకీయన్నము వద్దు. (అని యాపోసనముపట్టి లేచి పోయినాఁడు.)

రాజ—(కోపమువచ్చి) వెళ్ళవయ్యా! గడియగడియకు బెదిరించి యెంతకాల ముండఁగలవు. పాపము! పొరుగూరి నుండి వచ్చినారు. తల్లిదండ్రు లెవరు దగ్గఱలేరు గదా యని సమస్తసదుపాయములు చేసి సొంతయింటికంటె నెక్కువ యాదరణ చేయుచున్నందుకా మీారీలాగున చెవులుపట్టుకొని యాడించుట? పైపైనున్నది మనమాటలు పడుననిమీా రనుకొనుచున్నారు గాఁబోలు. నేనాలాగున మాటలు పడుదాననుకాను. మీాయిష్టమయిన నుండుడి, కష్టమయినపక్షమున వెళ్ళండి. నావంటివారు లక్షమంది మీాకున్నారు. మీావంటివారు లక్షమంది మాకున్నారు. మాచెక్కలు చల్లఁగా నున్నంతసేపు భయములేదు. ఇప్పటికయిన లె క్కఁజూచి యిచ్చి మఱి వెళ్ళండి. అందాఁక పట్టుపంచె పట్టుకొని వెళ్ళవద్దు.

నాల్గవ—సరే! ఉంచుకొండి పట్టుపంచె. నాకు భయములేదు.

రాజ—అవతలవీధి నున్నముండ డబ్బులు పుచ్చుకొని కడుపుఁ గాల్చెడిది. అదే మంచిది. పరమార్థ మాలోచించెడు మావంటి పరు వుగలవాండ్రకు కాలముగాదు. వాండ్రు దగ్గఱ నోరే మెత్తరు. ఆ మాయముండ కేలాగున డబ్బు దక్కునో తెలియదమ్మా?

అని యనఁగానే పట్టుపంచవదలి యతఁడుపోయెను. రామచంద్రుఁడును భోజనానంతరము పాఠశాలకుఁ బోయెను. శిష్టాచారసంపత్తి గల సాంప్రదాయమునందుఁబుట్టిన రామచంద్రుఁడు పూఁటకూటియింట బొట్టుఁ బెట్టుకొనక, కాళ్ళు గడుగుకొనక మడిబట్టలఁ గట్టుకొనక భోజనము చేయువారలను జూచి పట్టణవాసముఅయందుఁ గల వైచిత్ర్యముల కాశ్చర్యము నొందెను. అంతతో నతని యాశ్చర్యము సమాప్తము నొందక రాజమ్మ చర్యలు, భోజనమునకు వచ్చినవారి సంభాషణలు విన్నపిదప నధికమాయెను. రామచంద్రుఁడాదినము మొదలు విశ్వనాథశాస్త్రులవారి యింటనే పండుకొనుచు నచటి సహాధ్యాయులతో సుఖముగాఁ గాలముగడుపుచుండెను. ప్రతిదినము మధ్యాహ్నము భోజన మైనతరువాత శాస్త్రులవారు గేదెకు గడ్డినిమిత్తము పొలమునకుఁ బోయినప్పుడు గురుశుశ్రూషయం దొకరికంటె నొకరు మించవలెనని పనిఁ జేయుచున్న శిష్యులతోఁ గలిసి, శాస్త్రులవారికి తనచేత పనిఁ జేయించుట కిష్టము లేకున్నను, తానుగూడ శక్తిలోపము లేక శుశ్రూషఁ జేయుచుండెను. విశ్వనాథశాస్త్రులవారికి రామచంద్రుని మీఁదఁ గల మంచి యభిప్రాయ మంతకంతకు హెచ్చెను. జనమనోహరమైన యాకారమును, నాకారమునకుఁ దగిన బుద్ధిసంపదయు, బుద్ధిసంపద కనుగుణ మయిన విద్యాసక్తియు, విద్యాసక్తి కలంకారము పెట్టుచున్న వినయసంపత్తియు, నర్జునునియందు ద్రోణాచార్యునకు వలెనే రామచంద్రునియందు విశ్వనాథశాస్త్రులవారికి మంచిప్రేమను గలిగించెను. శాస్త్రులవారి యింటి యెదుటనే గ్రామమునందెల్ల తగు పెద్దమనుష్యులును సంపన్నగృహస్థులు నయిన మంత్రిప్రగడ శరభరాజు గారి యిల్లు గలదు. ఆయన కుమారుఁడు రామచంద్రుని యీడుగలవాఁడు. శాస్త్రులవారి దగ్గఱ చదువుకొనుచు రామచంద్రుని సత్ప్రవర్తనమునకును, బుద్ధికిని సంతోషించి యతనితో స్నేహముఁజేసి యతఁ

డెక్కడనుండిన తానక్కడ నుండుచు, నీతని కేలోపము తటస్థమయినను సహాయముజేయుటకు తాను సిద్ధముగా నుండి యతని నతిగౌరవము తోఁ జూచుచుండెను. వారిద్దఱును కృష్ణార్జునుల వలె నతిశయస్నేహముచేతఁ బ్రసిద్ధికెక్కిరి. సహజముగా మంచిశారీరముగల రామచంద్రునకు రాగజ్ఞానము వన్నె తేఁగా పుస్తకము నతిశ్రావ్యముగాఁ జదువఁగలుగుటచేత శరభరాజుగా రప్పుడప్పు డతనినిఁ బిలిపించి పుస్తకముఁ జదివించుచుందురు. పుష్పసౌరభ్యమువలెనే వ్యాపించిన రామచంద్రుని కీర్తి వలన నతనియందు మంచియభిప్రాయముగల శరభరాజుగారి మనస్సునకు, విశ్వనాథశాస్త్రులవారును, కుమారుఁడును జేయు న్యాయమైన స్తుతులు చక్కఁగా నాటి పిల్లవానియం దొక విధమైన యనురాగము గలిగించెను. ఇది యిట్లుండఁగా రామచంద్రుఁడు పూఁటకూటి యింటఁ బ్రవేశించి రెండుమాసము లయినది. ఒకపర్యాయము రాజమ్మ లెక్కకు తొందరపెట్టఁగా శోభనాచలము రెండురూపాయల నిచ్చెను. కాని తరువాత నొక దమ్మిడి నయిన నియ్యలేదు. తరువాత రామచంద్రుఁడు తన సహాధ్యాయునియొద్ద రెండురూపాయలు బదులుచేసి రాజమ్మ కిచ్చెను. ఇట్లు రాజమ్మ కొకమాసపు సొమ్ము మాత్రము ముట్టినది గాని రెండవమాసపు సొమ్ము ముట్టనందున నామె రామచంద్రుని నిలువ నీయక బాధపెట్ట నారంభించెను. శోభనాచలమే సొమ్ము నిత్తునని మొదట నొప్పుకొని, తరువాత నీయవలసిన యవసరము లేదనియు, రామచంద్రునే యడుగు మనియు, రాజమ్మకు రహస్యముగా వర్తమానము నంపెను. శోభనాచలము తన స్నేహితునకు పదునైదు రూపాయలు బదులిప్పించి, తానిరువది రూపాయలు బదులు పుచ్చుకొని స్నేహితునిచేత సొమ్మిప్పించను లేదు తానీయను లేదు. ధనము పుచ్చుకొన్నపుడున్న చొరవయు, ధైర్యమును మరల సొమ్ము నిచ్చునపు డాతనియందుఁ గనఁబడవయ్యెను. తన స్నేహితుఁ డీయవలసిన

ఋణమునకుఁ దా నుత్తరవాదిని గానని యు, తనసొమ్మే తానీయఁగల నని యుఁజెప్పి, శోభనాచలము, రామచంద్రుఁడు తనయింటికి తడిమన్ను పొడిమ న్నగునట్లు తిరిగినను నొక డబ్బయిన నీయక వచ్చినపుడెల్ల సాయంకాలము రమ్మని యొకమాఱును, నుదయమున రమ్మని యొక మాఱును సొమ్మందలేదని యింకొకమాఱును మనసులో నేమియు నుకొన వద్దని యొకమాఱును తనకు చాల మొగమోటముగా నున్నదని మఱొక మాఱును చెప్పినమాటఁ జెప్పక వానిని దిప్పుచుండెను. రామచంద్రుఁ డేవేళప్పుడు సొమ్మిచ్చెనో కాని శోభనాచలమునకు సొమ్మెన్నఁడు నందనే లేదు. అవసర మెక్కువై తనయింటికి కర్తఁడు వచ్చినకొలఁది శోభనా చలమునకు సొమ్మియవలెనను నభిప్రాయము తగ్గి పలుమాఱతఁడు వచ్చినందులకు విసుగు హెచ్చెను. రామచంద్రుఁ డింటికి వెళ్ళినపుడు శోభనాచల మగుపడక, యింటనుండక, నొకవేళ నింటనుండిన లేడని పించుచు, వీధిలో నెదురైనప్పుడు ప్రక్క సందులోనికై నను, దగ్గఱ యింటికై నను, బోవుచు, నట్లు జేయవీలుగానపుడు ముసుఁగు వేసికొని స్నేహితులమధ్య దాగుచు మొగమున కేదయిన నడ్డముపెట్టుకొనుచు, కాలము గడుపుచు వచ్చెను. అతిస్వల్పకాలసంపాదిత మైన వారి స్నేహము, క్రమక్రమముగా, మొగమోటమై, లజ్జయై, మనస్పర్థయై, నిష్ఠురమై యాగ్రహమై తుదకు రానురాను కలహముగాఁ బరిణమించె ను. తుదకు రాజమ్మయొక్క బాధ పడఁజాలక యొకనాఁ డుదయాస్త మయములు వాకిటఁగూర్చుండి వెంకటరత్నముతోఁ గూడ వచ్చు చున్న శోభనాచలమును బట్టుకొని రామచంద్రుఁడు విధిలేక యీప్రకా రముగా మాటాడ నారంభించెను.

రామ——అయ్యా! శోభనాచలముగారు! ఎంతకాలము తమ యింటిచుట్టు నేను తిరిగినను నామీఁద ననుగ్రహ మింకను రాలేదు గదా? రాజమ్మగారు నన్ను నిలువనిచ్చుట లేదు. తేపోమాపో యింట

నుండి సన్నామె వెడలఁగొట్టును. నామనవి చిత్తగించి లెక్క దయ చేయుదురూ. తమ రుచితముగనిచ్చినట్లు సంతోషించెదను. పుచ్చుకొన్న సొమ్ముగాని మఱొకటి కాదుగదా.

శోభ—(ఆగ్రహముతో, కన్ను లెఱ్ఱజేసి) నీకేమయిన కొంచెము బుద్ధి యున్నదా లేదా? పెద్దపిన్న లున్నారను సందేహ మేమియు నక్కఱలేదా? అందఱు నీవలె తుచ్ఛులే యనుకొన్నావా? నీవు బ్రతికిన బ్రతుకు కొద్ది నీపరువుకొద్ది యడిగినావు. నీసంప్రదాయ మెటువంటిది? నీసంగతి నేనాదినముననే గ్రహించినాను.

రామ—అయ్యా! తమకంతకోప మెందుకు? నేనేమన్నాను! నావల్ల తప్పున్న క్షమింపుఁడు.

శోభ—మేము నిన్ను క్షమించదగ్గవారమా! నీవే నన్ను క్షమించవలెను. చచ్చి చెడి యేలాగో రెండుగుల్లలు తెగనమ్ముకొని నీవుకాఁగా సొమ్ము సంపాదించినావు. నీదగ్గఱ బదులుపుచ్చుకొనుట నాదే బుద్ధితక్కువ. నీవీస్వల్పమునకు మొగము చిందుకొనుచున్నావు గానియీలాటివి లక్షలు సంపాదించినాము. లక్షలు వ్యయము చేసినాము. నావంటివాని కిది యొకలెక్క కాదు.

రామ—అందుచేతనే త్వరగా దయచేయించండి, నేరమంతయు నాదే.

శోభ—ఇయ్యక మానుదుమా యేమిటి? ఇచ్చినదాఁక చచ్చినట్లుండు. అప్పదునుకురాదు. నీసొమ్మెంతచేయును? నీవెంతచేయుదువు? నీనైజము కనఁబఱచుకొన్నావు. నీసొమ్ము వారమునాటికి గిరగిరఁద్రిప్పి పాఱవేసెదను. నీకంటె నిర్భాగ్యుఁడుగాని నీసొమ్ము నపహరించఁడు. నీకు గతిలేదు గాని మాకు లేకపోలేదు. ఉపకారమునకుఁ బోఁగా నపకార మెదురయినదఁట! వచ్చిననాఁడు మాయింట నుంచుకొని బంధువుఁడుగదా యని సమస్తవిధముల నాదరించినందుకా యీమాటలు

సాటి నియోగపువాఁడవని నీకింత నిర్వాహము చేయవలెనని యనుకొన్నాను. అయ్యా! వెంకటరత్నముగారు! ఆరాత్రి దొంగలుపడినప్పుడు తాను కుఱ్ఱవాఁడు భయపడునని దగ్గఱగా మీఁద చెయ్యివేసికొని పండుకొన్నాను. ఆవిశ్వాసమయిన లేదు. ఈకాలములో నెవరికి నుపకారము జేయఁగూడదండీ, నాయనా! రేపు నీసొమ్ము నీకుఁ బంపెదను. ఇప్పటికి వెళ్ళు.

వెంక—ఇంత మంచివారు, మీతో నే పడినదికాదు. ఇంక నీగ్రామమునం దెవరితో సరిపడును? బాగానే సార్లాపడఁగలఁడు. సరసముగానే యున్నది.

రామ—మీచిత్తము. ఇఁక నేనడుగను. ఆమాట మీరే దక్కించుకోవలెను.

శోభ—అమలాపురము నీళ్లోడలఁబట్టినవి. పెంకెతనము ముదిరినది. మాట దక్కించుకోవలెనుగాదూ? ఇది జ్ఞాపక ముంచుకో.

రామ—మీరాచందార్కము నాకుజ్ఞాపక ముండునట్లు చక్కనిపనిఁ జేసినారు.

అనిమెల్లఁగా ననుకొని మాటలతోఁ దెమల్చి తన్ను శిక్షింపక దయఁదలఁచి పోనిచ్చినందులకు మనసులో సంతోషించుచు దేవున కనేక వందనములఁ జేయుచు పూఁటకూటిదానికేమి ప్రత్యుత్తరము చెప్పుదునాయని యాలోచించుకొనుచు రామచంద్రుఁడు వచ్చెను. రాఁగానే రాజమ్మ వానిని జూచి యిట్లనియె.

రాజ—లెక్క తెచ్చినావయ్యా?

రామ—శోభనాచలముగారు—

రాజ—(మాటకడ్డమువచ్చి) శోభనాచలములేదు, గీభనాచలము లేదు. నాయింటఁ దిన్నవాఁడవు నీవా శోభనాచలమా? నాకతనితో నేమి? ఒడ లెఱుఁగవు. ఎవరియబ్బసొమ్మని తిన్నావు. డబ్బుపుచ్చుకో

కుండ నీకు మూఁడుపూఁటలు వండి కుంభముతో డుట కెవరు నీకిచ్చి యున్నారు. పోపో. నాయింటనుండి లేచిపో. చెంబు, పట్టుపంచె, నేనియ్యను నడునడు.

అంతకఠినముగా రాజమ్మ మాటలాడినపుడిఁక నచట నుండ రాదని చివాలున లేచి రామచంద్రుఁడు వెళ్ళుచుండెను. అంతట నాతని మార్గమధ్యమందు వెనుక తనకు రెండుమూఁడు రూపాయల నప్పిచ్చిన సహాధ్యాయుఁ డగుపడి రామచంద్రుని నిలువఁబెట్టి తనసొమ్ము తన కిమ్మని యడిగెను. వారిట్లు మాటాడిరి.

సహా—ఏమోయి! అప్పు పుచ్చుకొని తిరిగి యిచ్చినావు కావు? ఒకనాఁడా, రెన్నాళ్ళా? అంత గతిలేనివాఁడ వెందుకు పుచ్చుకొన్నావు. పోనీ యెగవేయి. దీనితో నీవు పెద్దకాఁపురముచేయవు నేను చెడిపోను. మర్యాదగాదు. నేనేలాటియవసరములో నీకిచ్చినానో నీవు నాకాలాగు రెండవకంటివాఁడెఱుఁగకుండ నీయవద్దా? రేపు నీవీయకపోతివా నీకు నాకు బాగుగాజరుగదు. అని చెప్పి వెళ్ళిపోయెను.

అతని యదృష్టమేమో కాని రామచంద్రునకు బదు లిచ్చినవారును నతనియొద్దబదులు పుచ్చుకొన్నవారును గూడ నతనిని సందంచుచుండిరి. శోభనాచలము సొమ్మిచ్చుననునాశ వానికి లవమును లేదు. గ్రామమందు తన్నెవరు నెఱుఁగరు. రాజమ్మ లేవఁగొట్టినది. మద్దుల కనకరత్న మియ్యవలసిన యారూపాయ కూడ తానీయనక్కఱలేదని చెప్పెను. అందుచేత మహావిచారముగలిగి నిర్విణ్ణుఁడై సాయంకాలము వఱకు భోజనము లేనందున కడుపులో మలమల మాడుచుండఁగాఁ బ్రదోషకాలమున నెప్పటియట్లాలయమునకుఁ బోయి దేవదర్శనముఁ జేసి తరువాత మంటపము మీఁద నుత్తరీయముఁ బఱచుకొని గుడ్లనీళ్ళు గ్రుక్కుకొనుచు, తల్లిదండ్రులు చనిపోవుటయు, పినతండ్రి యన్యాయముగ సొత్తపహరించుటయు, దరిద్రకష్టమును, ప్రతిస్థలమున తిట్లును,

తలఁచితలఁచివిచారించుచు వెల్లకిలఁబండుకొనెను. రామచంద్రుని సంగతి యంతయు నెవరివలననో విని శరభరాజుగారి కుమారుఁడు గోపాలము గ్రామమంతయు వెదకి దేవాలయమునకు వచ్చి మంటపముమీఁద నున్న రామచంద్రుని గనుఁగొని, మొగమోటముచేత నతఁ డేమియుఁ జెప్పకున్నను, భోజనము చేయనట్లు గ్రహించి "రామచంద్రుఁడా! మాబాబయ్యగారు నిన్నొక్కసారి రమ్మన్నారు" అనిచెప్పి తీసికొని-వెళ్లెను.

నాల్గవ ప్రకరణము.

అమలాపురమునందు గల యిండ్లన్నిటిలో మంత్రిప్రెగడ శరభ రాజుగారి యిల్లే పెద్దది. రెండు వీధియరుఁగులకు గచ్చు చేయఁబడియున్నది. ఇటికలతోఁ గట్టిన స్తంభములు రెండరుగుల మీఁదను గలవు. రాతిమెట్లతో నిండిన గుమ్మముదాఁటి లోపలికి పోఁగా నెడమచేతి వైపున పెద్దకచేరిచావడి యడుగువేసిన జారుసట్లునున్నవయి తెల్లనిపాల గచ్చుతో నిండియుండును. చావడికి రెండుప్రక్కల రెండుగదులుండును. అందులో నొకగదిలో శరభరాజుగారి జ్యేష్ఠకుమారుఁ డైన రాజగోపాలము చదువుకొనుచుండును. చావడికెదురుగా నున్న వాకిట వేసవి కాలము గనుక నొక కొబ్బరియాకుల పందిరి కలదు. చావడిమీఁద కూర్చుండుటకు వెనుకుపేళ్ళచాపయు దానిమీఁద తివాసులును గలవు. గోడదగ్గఱ మూఁడుమూళ్ళపొడుగున నొకపెద్దదిండు, జేరగిలఁబడుటకు వేయఁబడియున్నది. ఇనుపజాలకఱ్ఱలుగల యొకగవాక్షము దిండుపై నుండుటయేకాక చావడిలోనుండి దొడ్డిలోనికిఁ బోవుటకు కిటికీకి రెండు ప్రక్కల రెండుగుమ్మములును, వానికిఁజెక్కతలుపులునుగలవు. వీధిగుమ్మమునకు నెదురుగా లోగిటియొక్క లోపలిభాగమున్నది. అందు మండువా

యును, దాని కిరుప్రక్కలను రెండుగదులును, వానికిఁ జేరి పడమటి
యిల్లునునున్నవి. దొడ్డిలో నొకయుప్పునీళ్ళనుయ్యి త్రవ్వఁబడియున్నది.
నూతికిఁ గొంచెము ప్రక్కగా తులసికోట వేయఁబడి యున్నది.
ఇంటికి దక్షిణభాగమందు పశువులసాల యొకటికలదు. ఈయింటి
యందు శరభరాజుగారు తండ్రితాతలనాఁట నుండియు కాఁపుర
మున్నవారు. శరభరాజుగారి కిప్పటికి నలువది సంవత్సరము లుండును.
మొలకు బంగారపు గోవత్రాడును, చేతుల నగిషీ చెక్కిన గుల్ల
మురుగులును వ్రేళ్ళకు బటువులును, శరభరాజుగా రెప్పుడును దీయక
ధరించుచుందురు. ఆయన పచ్చనైన కొంచెము స్థూలశరీరము, బట్టతల
యుఁ గలిగియుందురు. శరభరాజుగారికి తొలిచూలు మగపిల్లవాఁడు
పుట్టుటచేత సంతోషించి రాజగోపాలమని తమతండ్రిగారిపేరు పెట్టు
కొనిరి. రాజగోపాలము తరువాత తొమ్మిదిసంవత్సరములవఱకు శరభ
రాజుగారికి బిడ్డలు లేరుగాని పిమ్మట నొకకుమార్తె గలుగ నేడవపురిటి
నాఁటికి నాలుగుమాసముల క్రిందట చనిపోయిన శరభరాజుగారి చెల్లెలు
స్వప్నములోఁ గృష్ణవేణమ్మకు కనఁబడి పేరు పెట్టుమనినందున, నీకొమా
ర్తెకు పార్వతియను పేరుపెట్టిరి. ఆమె వెనుక మరల నొకకుమారుఁడు
గలిగెను. అతనిపేరు నరసింహాము. కృష్ణవేణమ్మ శరభరాజుగారి భార్య.
శరీరమున ధరించిన యాభరణంబుల కాంతిని వెలవెలఁ బాఱఁజేయు
చాయయు, నాకర్ణాంతములైన నేత్రములును, దానిమ్మగింజలవంటి
పండ్లును, సన్నని నడుమును గలిగి కృష్ణవేణమ్మ, లావణ్యమందేకాక
సత్ప్రవర్తనమందును స్త్రీలలో శిరోభూషణమై మగనిమాట జవ
దాఁటక సత్కార్యములయం దాయనకుఁ దగినప్రోత్సాహము నిచ్చుచు
ననుకూలదాంపత్యమునకు నిదర్శనము వీరేయని జనులుస్తోత్రము చేయు
నట్లు మహాకీర్తిని గాంచెను. శరభరాజగారికి సంవత్సరమునకు గొబ్బ
రితోఁటల మీఁదను, భూములమీఁదను, మూఁడువేలరూపాయలు వచ్చు

ను. గ్రామమునం దాయన తగుపెద్దమనుష్యు లగుటచే వివాదలు గల వారందఱు శరభరాజుగారి యెదుటకు వచ్చి తగవులు పరిష్కరించు కొందురు. వెంకటరత్నము శరభరాజుగారి కొకవేలువిడిచిన పినతండ్రి కొడుకు. బాంధవ్యమునందే కాక, గుణములయందుఁగూడ వెంకటరత్నము శరభరాజుగారికి దూరమేకనుక నతనితనయింటనుంచుకొనుటకు నిష్టము లేకపోయినను తల్లిప్రోద్బలముచేత నతఁ డింటనుండుట కాయన సమ్మతించెను. చిన్నతనమునందే తలిదండ్రు లార్జించిన రొక్కమంతయు విచ్చలవిడిగా వ్యయముచేసి యన్నవస్త్రములకు లోపమురాఁగానే వెంకటరత్నము వీరియింటఁ బ్రవేశించెను. వివాహము కాకపోయినను, నతనికి సంసారికంటె నెక్కువ తాపత్రయములు గల్గియుండెను. ధనము వచ్చుబడి లేకపోయినను, ద్రవ్యముతో నావశ్యక మెక్కువగ నుండెను. రామచంద్రుఁ డమలాపురము వచ్చిన నాఁటిరాత్రి వెంకటరత్నము చెలువుగట్టునఁ బ్రవేశించిన యిల్లు వాని భోగస్త్రీయైన చంద్రముఖి యిల్లే. లావణ్యమునం దామెకుఁ జంద్రునితో సమానమైనకాంతి లేశమును లేదు సరికదా చంద్రునివలె గుండ్రని ముఖముగల్గి చంద్రముఖినామము సార్థకముజేసికొనునేమో యనుకొన్నను మొగము కొంచెమించుమించుగా మూరెడుపొడు గుండును. కొమార్తెకు సార్థకనామము లేకపోయినను తన చిన్నతనము నుండియు నింటికివచ్చిన యనేకనరుల ప్రాణముల హరించి హరించి యప్పటికి జవసత్వము లుడిగియున్నదాని తల్లికి నరహరి యనునామము సార్థకమై యుండెను. చంద్రముఖికి చప్పిదవడ లుండుటచేత తమలపాకు లావశ్యక మెక్కువగ నుండెను. అల్లు రామచంద్రుఁడు రాజగోపాలముతో రాఁగానే శరభరాజుగా రతనిని తమయింట నుండుమని బలవంతపెట్టిరి. నియోగపు కుటుంబమునందుఁ బుట్టిన రామచంద్రునకు పరగృహనివాసము చేయుట యభిమానమని తోఁచినను కాలము తప్పివచ్చినందున శరభరాజుగారి యింట నుండి

రాజగోపాలముతోఁ గలిసి, చదువుకొనుచుండెను. వచ్చినప్పటినుండియు రామచంద్రునకును వెంకటరత్నమునకును గొంచెము సరిపడకుండెను. శోభనాచలమునకు స్నేహితుఁ డగుటచేత వెంకటరత్నమునకు రామచంద్రునిమీఁద కొంచెము కోపముండుట సహజమే. అదియటుండఁగా వెంకటరత్నము నిలువుబొట్టువాఁడగుటచేత రామచంద్రుఁ డాబొట్టు పెట్టుకొననందుకు నాతనిమీఁద కోపము వచ్చెను. తరువాత కొన్ని దినములకు శరభరాజుగా రొకనాఁడు రామచంద్రునితో నేదో రహస్యమును జెప్పిరి. ఆరహస్యము తనకుఁ జెప్పుమని వెంకటరత్నము రామచంద్రు నెంత బలవంతపెట్టినను, నతఁడు చెప్పనందున వానిపై కోపము ద్విగుణ మయ్యెను. అందుచేత వెంకటరత్నము రామచంద్రుఁ డొంటరిగా తనకంటఁబడినప్పుడెల్ల పొట్టకుంటికిఁ జేరినవాఁడనియు, సర్వజ్ఞత్వము మెండనియు, నీక యిటువంటి యెత్తిపొడుపుమాటల ననుటయే కాక రామచంద్రుని గుఱించి తానెవరితోఁ బ్రసంగించినను తనశక్తి వంచన లేకుండ నతఁడు మంచివాఁడు కాఁడని వారి మనస్సులయందు నాటునట్లుగాఁ జెప్పుచు వచ్చెను. శరభరాజుగారును, కృష్ణవేణమ్మయు రామచంద్రుని తనకుమారునితో సమానముగాఁ జూచుకొనుచున్నను వెంకటరత్నము తనయెడల చూపుచున్న యసహ్యతవలన రామచంద్రునకు మనస్సిమితము లేకపోయెను గాని సద్గుణసంపన్నుఁ డగుటచే రామచంద్రుఁడు శరభరాజుగారితో నైనను, లేక తనప్రాణసమానముగాఁ జూచుకొనుచున్న రాజగోపాలముతో నైనను, నీసంగతిఁ జెప్పఁడయ్యె. రామచంద్రునకు తనయిల్లు వెడలినతర్వాత పూర్వము తనకిష్టములేని వస్తువు లెల్ల నిప్పు డిష్టమయ్యెను. అతఁ డమలాపురమున జదువుకొనుచున్న కొలంది విశ్వనాథశాస్త్రులవారికి వాత్సల్యమును, సహాధ్యాయులకు గౌరవమును, శరభరాజుగారికి ప్రేమయు, రాజగోపాలమునకు మైత్రియు, గ్రామస్థులకు మంచియభిప్రాయమును గలుగఁ

జొచ్చెను గాని వెంకటరత్నమునకు మాత్రము ప్రేమాదులు చచ్చి యసహ్యత హెచ్చనారంభించెను. ఇప్పటికి రామచంద్రుఁడు శరభరాజు గారియింటికి వచ్చి పదిమాసము లయ్యెను. అమలాపురమునందు గొబ్బరివేళ్ళనీళ్లు పడక దేహమునందు రామచంద్రునకుఁ గొంచె మప్పు డప్పు డజీర్ణముగాను ననారోగ్యముగా నుండుచు వచ్చెను. ఆసంవత్సర మునందు జ్యేష్ఠమాసమున నతనికి తీవ్రమైన జ్వరమువచ్చినది. జ్వరము తగులఁగానే శరభరాజుగారు తమదగ్గఱనున్న శీతాంశురసము మాత్రల నిచ్చిరి. విశ్వనాథశాస్త్రులవారు కొంచెము జలముమాత్రము మంత్రించి త్రాగుమని యిచ్చిరి. అంతటిలోనే యెక్కడనుండియో రెండుపొట్ల ములఁ దెచ్చి రాజగోపాలము తేనెతోఁగలిపి దగ్గఱనుండి మ్రింగించెను. కాని వెంటనే గుణము కనఁబడనందున సాయంకాల మతఁడు కషా యము నిప్పించెను. శరభరాజుగారి తల్లి యొకపూఁట కంటిలో మిరియ ముల కలికము వేసెను. ఎన్నిచేసినను రోగ మెక్కువేకాని తక్కువ కానందున శరభరాజుగారు తమయింటివైద్యుఁడు గ్రామమందు లేఁడని తెలిసికొని, పూర్వమున వృత్తియేదియు దొరకక వైద్య మారంభించి యనేకజనుల కకాలమరణపూర్వకముగ స్వర్గలోకసుఖముఁ గలుగఁజేసి ప్రాణము విసిగి వైద్యము చాలించి సంచి మూలఁ బడవైచిన యొక ముసలివైద్యుని బిలిపించి కుఱ్ఱవానిని జూపి చేయి చూడుమని చెప్పిరి. అంతట వైద్యుఁ డిట్లు పలికెను.

వైద్యు—చేయి చూడనక్కఱలేదు. లంకణములఁ గట్టుఁడి. ఎన్ని లంకణములు కట్టిన నంత మంచిది.

రామ—అయ్యా! చిన్నతనమున నుండియు నాకు లంకణములు పడవు. అన్నము తినవలయును.

వైద్యు—ఎందుకు పడవు? కమ్మనిరోగములు తియ్యనిమందులు

సరిపడఁగలవా ? ఉండలేకపోతే జాడ్యములొంగునా ? కన్నులుమూసి కొని పరుండుము.

శర—అయ్యా! ఎన్నిలంకణములు పడవచ్చును.

వైద్యు—ఇది పురాణజ్వరము. శరీరమున జీర్ణించెను. పది లంకణములమీఁదిమాట.

రామ—అయ్యయో ! నేనుండలేనండి. శరభరాజుగారు ! నా తత్వమున కది సరిపడదు.

శర—పథ్యము త్వరగానే పెట్టింతునులే నాయనా. (అని వైద్యునితో) అయ్యా! ఏమిమందు వేయఁదలఁచుకొన్నారు ? ఆనందభైరవి వేయవచ్చునా?

వైద్యు—ఆనందభైరవి యేమిపని చేయఁగలదు ? ఇది భడవా జాతి జ్వరము. రాకడ వేఱుగానున్నది.

శర—ఏదోయొకటి వేయించండి.

అని చెప్పగానే వైద్యుఁ డొకమాత్రనిచ్చి వెళ్ళిపోయెను. జ్వరముకొద్దిదైనను నది యెక్కువజ్వరమనిచెప్పియెక్కువధనము గ్రహించవలెనని దురుద్దేశము గలిగి రోగమెక్కువగుటకు వైద్యుఁడు మందిచ్చెను. తరువాత తాను లొంగఁదీయవలె ననుకొన్నను, రోగము త్వరగా లొంగలేదు. ఉష్ణముని శ్లేషముగా తగ్గినను లంకణము లింకను గట్టించి వైద్యుఁడు పథ్యము పెట్టించుట మానిపించెను. ఆమహానీరసముచేత నొకనాఁ డర్ధరాత్రి రామచంద్రునకు నిస్త్రాణ వచ్చి మాట రాక కాలుసేతులు చల్లఁబడెను. ఆసంగతి నెఱుఁగక యీగుణములు మఱియొకవిధముగా భావించి వెంకటరత్నము శరభరాజుగారి చెవిలో మెల్లఁగా "రామచంద్రునిపని బొత్తుగా నపస్మారముగానున్నది. మనకు దక్కఁడని తోచుచున్నది" యని చెప్పెను. ఆమాట వినఁగానే శరభరాజుగా రదిరిపడి లేచిరి. ఇంట నందఱు తొట్రుపాటుతో లేచిరి.

వెంకటరత్నము చాకలివానిచేత వీధిలోగోడదగ్గఱ రెండువెదుళ్ళుపాతించి రెండువెదుళ్ళడ్డమువేయించి నాలుగుచాపలడ్డము గట్టించెను. శరభరాజుగారి తల్లిచప్పచప్పన రెండుచేదల నీళ్ళు మీఁదఁ బోసికొని తడిగుడ్డతో నటకమీఁదికెక్కి యూరుగాయకుండల దింపుచుండెను. శరభరాజుగారు వైద్యునికొఱకు వర్తమానము నంపిరి; కాని జరుగుచున్న సంగతి యంతయు విని వైద్యుఁడు తన యౌషధప్రభావము తానెఱుఁగును గనుక మరణమే కాని మఱియొకటి జరుగదని నిశ్చయించుకొని రాక, తుదకు వర్తమానము లెక్కువకాఁగా శరభరాజుగారికిఁ గోపమువచ్చునని యచటికివచ్చి చూచి "చేతిలో చాల జబ్బుగానున్నది. ఇది విషమజాతి. నెగ్గదని నేను మొదటనే యనుకొన్నాను. మందు లియ్యఁగలము గాని యాయుర్దాయము పోయఁగలమా" యనిచెప్పి యొకచోట గుమిగాఁ గూడికొనియున్న రాజగోపాల శరభరాజ వెంకటరత్నము గారుల దగ్గఱఁ గూర్చుండెను. అప్పుడు శరభరాజుగారి తల్లి యన్న పూర్ణమ్మ వచ్చి యిట్లుపలికెను.

అన్న—ఏలాగున్నదిరా? నాయనా!

వెంక—ఏమిచెప్పను ఘడియలమీఁద నున్నది. ఇప్పుడో యింకనో.

అన్న—ఆ మంచము తీసి వీధిలోఁ బారవేయండిరా? ఇంకా యింట్లోయెందుకు?

శర—తొందర యేమిటమ్మా? ఇంక కొంచెముసేపుండు.

అన్న—కొంచెముసేపేమిటి? ప్రాణము గుటగుటలాడుచున్నది.

శర—నాకా పిల్లవానిఁజూడఁ గడుపులో జాలిగానున్నది. అవతలఁ బెట్టించలేను.

అన్న—సామానంతా తగులఁబడిపోతుంది. ఎక్కడో దిక్కుమాలిన ముండాకొడుకు కోసరము నిక్షేపమువంటి యిల్లు పాడుపడ

వెయ్యాడాని కాలోచిస్తావేమి చెప్పినమాట వినరు. ఏగంగలో దిగేదమ్మా? మాయసంతవచ్చింది. ఈనిర్భాగ్యపు చచ్చినాడు మాయింటి కోసరమే దాపరించినాఁడు. [లెందుకు?

రాజ—తిట్టకమ్మా. యేమియులేదు, ముందుగా చావుమాట

అన్న—చావక యీవెధవ బ్రతుకుతాఁడు? మీరుకూడా వాడితో కట్టగట్టుకొని గంగలో దిగండి. ఒక్కయేడు పేడిచి నోరు మూసికొని యూరకొంటాము.

వెంక—అన్నయ్యా! వాడతిప్రాది నక్షత్రి మంట. ఇల్లారు మాసములు వదలిపెట్టవలెను. పశువులసాలలో నైనఁ బెట్టించండి. పోవునప్పు డెక్కడయిన నొక్కటే.

వైద్య—ఆయుదాఁయ మున్నపక్షమున చంపినను చావఁడు. వెనుక నాకొక పర్యాయ మీలాగే ప్రాణముమీఁదికి వచ్చినపుడు మావారందఱు నన్నుక్రిందఁబడవేసికొని కూర్చున్నారు. అంతటనాప్రాణము పోయినది. నలుగురు యమదూతలు నల్లలాగులు తొడుగుకొని రోకళ్ళతో వచ్చి నన్ను దీసికొని మాలకాకివలె నల్లని దేహము గలిగి యొక సింహాసనముమీఁదఁ గూర్చున్న యొకరాజున కెదుట నిలువఁ బెట్టిరి. అతఁడు యమధర్మరాజు. నరకములోఁబడి యేడ్చువారి కేకలను విన్నాను. అప్పుడు యముఁడు నన్నుఁజూచి దూతలతో "ఓరీ మూర్ఖులారా! మీరొకనిఁ దీసికొనిరమ్మని పంపినవీనిని దీసికొనివచ్చినారేమి" యని చెప్పినన్ను క్రిందికిఁ బడఁదోసెను. అప్పుడు మావాండ్రు నా శరీరమును దీసికొని వెళ్ళుటకు సిద్ధముగా నుండఁగా నేబ్రతికినాను. ఏమో యీలాగున నీతఁడును బ్రతికిన బ్రతుకవచ్చును.

రాజ—ఏమివింతలండీ! ఎవరయిన నమ్మవద్దా?

వెంక—ఆశ్చర్య మేమున్నది? ఈపిల్లవాఁడు బ్రతుకఁడండి. రాత్రినాకలలో యమదూతలు పట్టెలాగులు తొడుగుకొని దుడ్డుకఱ్ఱలతో

వచ్చి గుమ్మములో నిలుచుండి యెవరినో రమ్మని పిలుచుచున్నారు. దూతదర్శనమైన నింక బ్రతుకుట యబద్ధము. నేననేకపర్యాయములు చూచినాను.

అని చెప్పినంతలోన విశ్వనాథశాస్త్రులవారి కలవలపాటంతయు విని లేచి రామచంద్రునకు తటస్థమయిన యామహాపదకు విచారించి శరభరాజుగారితో నిట్లనిచెప్పెను.

విశ్వ—అయ్యా! రామచంద్రుఁడు మిక్కిలి బుద్ధిమంతుఁడు. ఆతని కీలాగునకాలము తప్పివచ్చినది. ఇన్నాళ్ళనుండియు మీరే తండ్రివలె సంరక్షణఁ జేయుచున్నారు. అతఁడు పిల్లవాఁడయినను యోగ్యుఁడు. అవతల పెట్టించుట భావ్యముగాదు.

వెంక—ఏమిటయ్యా! అంత జాలిగానున్న పక్షమున మీయింటఁ బెట్టుకొండి. శ్రీరంగనీతు లెన్నియైనను జెప్పవచ్చును. మీయిల్లు కాకపోయినసరి.

అని పలుకుచున్న సమయమునందు శరభరాజుగారితల్లి వచ్చి వెంకటరత్నమును బిలిచి యుతఁడును తానును, తోడుపట్టి రామచంద్రుని మంచముఁ బశువులపాకలోఁ బెట్టిరి. మిక్కిలి పరిశుద్ధమయిన వాయువు గల శుభ్రమయిన చోట నుండవలసినరోగిని దీసికొనిపోయి, చుట్టును రొచ్చును దోమలు మొదలగుకీటకముల ధ్వనులును, కడుపులో ప్రేగులు తెగునట్లు వమనము కలుగఁజేయు పేడకంపుగల యాపాకలోఁ బెట్టుచుండఁగా శరభరాజుగారు చూచియు స్త్రీలమాట కడ్డముచెప్పలేక, స్నేహితునికొఱకు విచారించుచున్న రాజగోపాలము నూరడించుచు విశ్వనాథశాస్త్రులవారితో మాటలాడుచుండిరి. తరువాత కృష్ణవేణమ్మ రామచంద్రునియొద్దకుఁబోయి యాతనిస్థితినిజూచివిచారించి యాతనిసంగతిని బట్టి యవి నిస్త్రాణలక్షణములుగాని మరణచిహ్నములుగావని గ్రహించి, కొంచెము చిట్టుడుకునీళ్ళు పోసినచో నదికుదురుననుకొని తనయభి

ప్రాయమును శరభరాజుగారితోఁ జెప్పెను. ఆయన దాని కిష్టపడఁగా తరువాత చిట్టుముకునీళ్లుగిద్దెడు రామచంద్రున కామె లోపలపోసెను. అవి త్రాగిన నాలుగుగడియలకు రామచంద్రుఁడు కొంచెము తెల్విఁ దెచ్చుకొని యొత్తుగిలి పండుకొనెను. తక్కిన రాత్రియంతయు రామచంద్రుని యొద్ద రాజగోపాలము పరుండవలెననుకొని యది తండ్రితోఁ జెప్పుచుండఁగా విని ముసలమ్మ యిట్లని చెప్పెను.

అన్న—ఓరీ! కుఱ్ఱవాఁడా! నీవక్కడ పడుకోకు. ఆనకజడుసు కొన్నపక్షమున దేవుళ్లాడలేము. నీవు సావిట్లో పరుండు.

రాజ—అక్కడ పరున్నమాత్రముననే జడిసికొందునా? అంత భయములేదు.

అన్న—చెప్పినమాట వినవేమిరా? వాఁడెవరు? నీవెవరవు? నీ యమ్మవంకచుట్టమా? అబ్బవంకచుట్టమా. [కొనియెదను.

రాజ—నీవు వెయ్యిచెప్పినా నేను వినను. నేనిక్కడనే పడు

అని రాజగోపాలము చెప్పినమాటలకు మనసులో సణుగుకొనుచు నామె వెళ్లెను. ఆమిగిలిన రాత్రియంతయు వెంకటరత్నమును రాజగోపాలమును రామచంద్రునియొద్ద పశువులపాకలోఁ బరుండిరి; కాని దుర్వాసనచేత కొంతసేపటికి రాజగోపాల మావలకు వెళ్ళెను. అదివఱకు రామచంద్రుఁడు జబ్బుపడకమునుపు రాజగోపాలముయొక్క యుంగరమును తనవ్రేలను బెట్టుకొనెను. అది తీయకముందే రోగపీడితుఁడగుటచే నా యుంగర మతనిచేతనే యుండెను. రామచంద్రుఁడు కొంచెము కనుమూసి నీరసముచేఁ బరున్నపుడు పంగనామములఁ బెట్టుకొన్న యొక బ్రాహ్మణుఁడా యుంగరమును మెలమెల్లగా లాగుచుండెను. రామచంద్రుఁడులికిపడిలేచి నీరసముచేత మాటలు తిన్నగా రానందున నక్షరములు స్పష్టముగాఁ దెలియకున్నను, హీనస్వరముతో నొకకేకవేసెను. పంచప్రాణములను స్నేహితునిమీఁదనే పెట్టుకొనియున్న గోపాలమామాటలు

విని పరుగెత్తుకొనివచ్చి యేమని రామచంద్రి నడుఁగఁగా నతఁ డేదో గోపాలముయొక్క చెవిలోఁ జెప్పెను. ఆమాటనాలకించి గోపాలము మహా కోపముతో "ఏమయ్యా! వెంకటరత్నము! అతనిచేతియుంగరము నీవెం దుకు లాగినావు?" అనియడిగెను. వెంకటరత్నము మిక్కిలి కోపముతో నిట్లని చెప్పెను.

వెంక—ఏమిటయ్యా! జబ్బుచేత సంధించి చావునకు సిద్ధముగా నున్నవానిమాటలునమ్మి నన్నీలాగున ననఁదగినమాట యనరానిమాట తెలియకుండ నిందించెదవా? ఆతఁడు చెప్పను నీవు నమ్మనూనా? బాగు న్నది యెంతమాట!

రాజ—పంగనామములు పెట్టుకొన్న మనుష్యుఁడు లాగినాడఁట. నీవుగాక యింకెవరు.

వెంక—ఆ! ఈమాట బాగున్నది. కనులుమూసికొని మత్తుగా నతఁడు పరున్నపుడేమో యతనికి వెంకటేశ్వరులు వచ్చి ప్రత్యక్షమై యుంగరములాగినట్లు భ్రమకలిగినది. వెంకటేశ్వరులు నిలువుబొట్టు దై వమే కదా. ఈతని కేదో మొక్కున్నది, త్వరగా నాయుంగరము మీఁదుకట్టు. ఇది వెంకటాచలపతి మాహాత్మ్యమే?

రాజగోపాల మామాటల నమ్మి, వెంకటరత్నమునందు నిందా రోపణ చేసినందులకు నొచ్చుకొనుచు, రాత్రి యంతయుఁ గడపెను గాని, యాపని చేసినవాఁడు మన వెంకటరత్నమే తప్ప మఱొకరు కారు. గోపాల ముంగరమును మీఁదుకట్టి జోతిష్కులు వచ్చినపుడెల్ల రామ చంద్రుని నక్షత్రమును జెప్పి యతని కాదినముల యందు మరణ మున్న దేమో యని యడుగుచు, నిది నీచ మిది ఘనమని యెంచక సమస్త విధములైన యుపచారములఁగూడఁ జేయుచుండెను. అహహా? స్నేహ మెట్టిదో యోచింపుఁడు. ఇది జరిగిన నాలుగుదినములకు రామచంద్రుని పినతండ్రి జగన్నాథ మయిలాపురమున కేదో పనిమీఁద వచ్చి వెంకట

రత్నముతో మాటలాడుచు, తనయన్నకుమారుఁడు శరభరాజుగారి యింట నున్నాఁ డనియు, ప్రాణముమీఁదికి వచ్చిన దనియు విని యిట్లనియెను. "వెంకటరత్నముగారూ? వాఁడునాయన్నకొడుకని చెప్పుకొనుటకు సిగ్గుగానున్నది. నియోగులయింటఁ బుట్టి సాటివారి యింట పొట్టకూటికుండి మాకవమానము దెచ్చినాఁడు. వీఁడు పుట్టకపోయినను బ్రతికి పోదును." అనిచెప్పి వెళ్ళిపోవుచుండఁగా వెంకటరత్నమతఁడుకూడ రామచంద్రుని పరివర్తనాదులలోఁ దనయభిప్రాయముతో నేకీభవించినందులకు సంతసించుచు "మీపిల్లవానికి జబ్బుగా నున్నది. చూచిపొండి" యని చెప్పెను. జగన్నాథముగా రామాటవిని "వానికేమి భయములేదు. వాఁడు మనవంటివారి నెందఱినో కడతేర్చికాని పోఁడు." అనిచెప్పి పశువులసాలలోకిఁబోయి రామచంద్రుని యెదుట నిలిచెను. అతనిని జూడఁగానే రామచంద్రుఁడు కన్నులనుండి గిఱ్ఱున నీళ్ళు తిరుగ మాటరాక, ప్రక్కమీఁద పినతండ్రిని గూర్చుండు మని సంజ్ఞఁజేసి యతఁడు కూర్చున్న పిమ్మట నాతని మెడమీఁద చేతులు వేసికొని కౌఁగిలించుకొని యిట్లనియెను.

రామ—బాబూ! వచ్చినావా? నిన్ను చూడఁగనే నాబాబయ్యను మాయమ్మను జూచినట్లు పంచప్రాణములు లేచి వచ్చినవి. నాకు రోగము కుదిరినదాఁక నాలుగుదినములు నీవిక్కడనుండుము. నిన్ను చూడఁగనే నారోగము సగము కుదిరినది." అని చెప్పిన రామచంద్రుని మాట లతని రాతిగుండెను భేదింపలేకున్నను సమీపమున నున్న వారందఱికి జాలిని బుట్టించెను. అంతట జగన్నాథమిట్లు చెప్పెను.

జగ—"నాకుండుటకు తీరుబడిలేదు. ఇంకొకమాఱు వచ్చి యుండెదను. నీకు వారే తల్లి, తండ్రి నేను పోవుచున్నాను" అని చెప్పి వెళ్ళిపోయెను. రోగము కొంచెము తిరుగుమొగమునకు రాఁగానే శరభరాజుగారు రామచంద్రుని మంచమును లోపలఁ బెట్టించిరి. రామ

చంద్రునకు క్రమక్రమముగా నన్నియు హితమై, నల్లరక్తముపట్టి బలముచేర నారంభించెను. అతఁడు పూర్ణదార్ఢ్యవంతుఁ డగునప్పటికి రెండుమాసము లయ్యెను. ఆరోగ్యస్నానము జేసిన తరువాత రామచంద్రుఁడు యథాప్రకారముగాఁ బాఠశాలకుఁ బోయి చదువుకొన నారంభించెను. ఇప్పటికి లక్ష్మీసహస్రమును, నైషధమును ముగించి యలంకారశాస్త్రముఁ జదువఁ దలంచి కువలయానంద మారంభించెను. కావ్యముల యందేకాక వేదమునందుగూడ పరిశ్రమఁ జేయఁ దలంచి విశ్వనాథశాస్త్రిలవారు చతుర్వేదవేత్తలు గనుక రామచంద్రుఁ డాయన దగ్గఱ నమకచమకము లారంభించెను. ఈసంగతి వెంకటరత్నమునకుఁ దెలిసి యొకనాఁడు ప్రసంగవశమున నతఁ డీప్రకారముగా మాటలాడ నారంభించెను.

వెంక—ఏమోయి ! నీవు కూడ నమక చమకములు చెప్పకొను [చున్నావా యేమి?

రామ—ఆ. మొన్న విదియనాఁ డారంభము జేసినాను.

వెంక—సరిసరి! బాగుగాఁ జేసినావు. కొంచెము పెద్దవాండ్రమున్నాముగదా! మాతో నాలోచనఁ జేయఁ గూడదా? మన కేమిటి వేద మేమిటి? అదిబ్రాహ్మణులకుఁజెల్లినది. మన నియోగులకుఁదగదు.

రామ—నియోగులుమాత్రము బ్రాహ్మణులుగారా? మనము వేదములు చదువుకొనఁ గూడదని యెక్కడ నున్నది ? అందఱము బ్రాహ్మణులమే.

వెంక—నీకు తెలియను దెలియదు. ఒకరు చెప్పిన వినను వినవు. పాత్తరలుపట్టి సంభావనకువెళ్ళువారు బ్రాహ్మణులు. మనముకరణాలము. బ్రాహ్మణుల మగుదుమా ? కుఱ్ఱవాఁడవు. నీవిటువంటి తెలివితక్కువ మాట లాడఁబోకు. మనవాండ్రు విన్న తప్పు పట్టుకొందురు.

రామ—నియోగులకు వైదికులకు వేదోక్తకర్మ సమానమే కదా? ఆచారభేదములేకాని శాస్త్రభేద మేమున్నది.

వెంక——మీసములఁ బెంచుకొని లౌకికవ్యవహారములుచేయుచు వ్రాఁతకోఁతలు చేతనైనవారునియోగులు. మనకేమి మహారాజులము మనయిండ్లలో పురోహితులుగా నుండీ ప్రొద్దున స్నానము జేసి బిక్ష గోచులను బెట్టుకొనవలసిన వాండ్రును నిత్యకర్మలు చేయవలసిన వాండ్రును బ్రాహ్మణులు. వారి మంత్రములు మనము నేర్చుకొనఁ గూడదు. ఇంతేకాక నియోగులకు స్వరము రాదు. అపస్వరము నెత్తి నడచును.

రామ——వైదికులనియా బ్రాహ్మణుల కర్థము. వేదమును జదువుకొన్న మాత్రముచేత మన నియోగమునకు భంగములేదు. మీసము లెవ్వరును బెంచఁ గూడదు. మనము పెంచవచ్చునని ధర్మ శాస్త్రములో లేదు.

వెంక——నీదగ్గఱ నేనీసంగతిఁ జెప్పిన పక్షమున నీవు నమ్మవు. నీకు మనవాళ్ళ సంప్రదాయములు తెలియవు. మఱియెవరినైన నడుగు. తద్దినపుమంత్రము చదువుకోవలె నని దిక్కుమాలినబుద్ధి పుట్టిన దేమి? ఇంక దేవతార్చన మంత్రములుకూడ నేర్చుకో. మనచేతిక్రిందబ్రతుకు వైదికులకును, మనకును, సాపత్యమా? నీయిష్టము వింటే విను లేక పోయిన మాను. నీక్షేమముకొఱకే చెప్పినాను.

అని బ్రాహ్మణులకర్థము వేదాదివిద్యాభ్యాసము జేయువారని యు, నియోగులను బ్రాహ్మణు లనఁగూడ దనియు, మూర్ఖమైన యభి ప్రాయముతో నున్న వెంకటరత్నముయొక్క మనమునకు వాదమూల మున యదార్థస్థితిఁ దెలుపవలె నని రామచంద్రుఁడు ప్రయత్నము చేసి నాఁడుగాని, బుద్ధిహీనులలో చక్రవర్తియగు వెంకటరత్నము ముందట నితని వాదము పనికిరాదయ్యెను. ఇప్పటికిని ననేకనియోగులు తమ్మె వ్వరైన బ్రాహ్మణు లన్నప్పుడు, కరణము లననంపులకు కోపించి యది

నిందాస్పదమని యెంచి, వానితోఁ గయ్యమునకు డీకొందురు. అంతేకాక యాచారసంపత్తి లేని నియోగులవిషయమై మాటలాడుచు, వైదికులు "వారికేమి నియోగప్రభువులు? ఈమంత్రములు వారికెందుకు" అని చెప్పుచుందురు. సాహిత్యమునకుఁ దోడు సంగీతమును, దానికిఁ దోడు వేదమును నాతఁడు నేర్చుకొనుచుండెను. ఇట్లుండఁ గొన్నాళ్ళకు శరభ రాజుగారి రెండవకుమారుఁడగు నరసింహమునకు నక్షరాభ్యాసముఁ జేసి చదువవేసిరి. ఆదినమున గ్రామమునం దందఱిని భోజనమునకుఁ బిలిచిరి. ఆదినమున వెంకటరత్నముగారి సొంతమేళమే యక్కడ గానవినోదమును జరిగించినది కనుక నాయనయానందము మితము నెఱుఁగదు. అక్షరాభ్యాసమైన వెనుక నాగ్రామమందున్న తెనుఁగుబడి కతనినిబంపి యలవాటయినదాఁక పిల్లవానితోఁ గూడ రామచంద్రుని వెళ్ళుమని శరభరాజుగారు పంపుచువచ్చిరి. ఆగ్రామమునం దిదితప్ప వేరుపాఠశాలలు లేవు. రమారమి డెబ్బదిసంవత్సరములు వయసుగల యాబడిపంతులు పూర్వము పెద్దాపురము సత్రమునందు పద్దులు వ్రాయుటకుఁ గుదిరి, యక్కడ దొంగలెక్కలు వ్రాసినందులకుఁ దఱుమఁబడి, పిమ్మట ముశక్తేశ్వర గ్రామమునందొకరియింట దేవతార్చన బ్రాహ్మణుఁడుగాఁ బ్రవేశించి, యక్కడ యొక ముండనుంచుకొన్నందులకై వారు పొమ్మనఁగా పిమ్మట పలివెలగ్రామము వెళ్ళియక్కడ పరులకుపకారము జేయుటకు వైద్యమునారంభించెను. ఆయూరిప్రజలట్టి మహానుభావుండు వైద్యము చేయుచుండఁగా నది వినియోగపఱచుకొనఁజాలక యెవరు నతనియొద్ద మందుఁబుచ్చుకొననందున వారందఱిమీఁద కోపమువచ్చి చెప్పకుండ నాగ్రామమువదలి యమలాపురమువచ్చి వృత్తులన్నింటిలో సౌఖ్యకర మయినది యుపాధ్యాయత్వమేయని బాలురను బాగుచేయుట కతఁడు బడియొక్కటిఁ బెట్టెను. అమలాపురమం దాబడి కరణముగారి వీధియరుగుల మీఁద నుంచఁబడెను. బడి స్థాపింపఁబడి నపుడందుఁ జేరిన

వారు మఱుసంవత్సరమునకుఁ గూడ నాపుస్తకమే చదువుచుండిరి. చదువుచెప్పెడు దినములు తక్కువయుఁ సెలవుదినము లెక్కువయుగ నుండెను. పిల్లలాటవిడుపుడబ్బు లెన్నిపర్యాయములు తెత్తురో యన్ని సెలవలుండును గనుక, సెలవుల నిర్ణయము డబ్బులనుబట్టిగాని పండుగులనుబట్టిగాదు. రామచంద్రుఁడొకనాఁడు నరసింహమును దీసికొని బడికిఁబోయెను. ఆపాఠశాల యమలోకమును, చదువవచ్చిన బాలురు నరక మనుభవింపవచ్చిన పాపకర్ములును పంతులొక యమధర్మరాజును గానుండెను. రామచంద్రుఁడు నరసింహమును దీసికొనివెళ్ళి కూర్చుండఁగానే కొందఱు బాలురు వీఁపులమీఁద చదరలువేసికొని, కఱ్ఱపలకలను, జొన్నకలములను, తాటియాకుపుస్తకములను, గంటములను బట్టుకొని కొందఱు గోణములను గట్టుకొనియు, కొందఱులాగులఁదొడుగుకొనియు, కొందఱు మీఁద రుమాళ్లువేసికొనియు బడికివచ్చి చదరులుక్రింద పఱచుకొని కూర్చుండిరి. పదెనిమిది చింతబరికెలను రెండుప్రక్కలఁ బెట్టుకొని యొకనున్నని బొబ్బిలిపాడునుకాయ నెడముచేత నుంచుకొని, వార్ధకదశచేత రక్తమాంసహీనమగు తనశరీర మెముకలపోగువలె చూచిన వారికి భయము గలుగఁజేయుచుండ కేకనేదైనవిన్నపు డులికిపడిలేచుచు పంతులొక స్తంభమునకుఁ జేరగిలఁబడి యొక చిరుగుగోనెగుడ్డమీఁద కూర్చుండి, కునికిపాట్లఁబడుచుండెను. కొందఱునేలమీఁదద్రవ్విన గుంట ఓనమాలను దిద్దుచుండిరి. పంతులు బాలరామాయణమం దొకశ్లోకమును జెప్పఁగా నది బాలురకు నోటఁబట్టనందున మహాకోపమువచ్చి యతఁడు శ్లోకములోనున్న యక్షరమున కొకదెబ్బచొప్పున కొట్టి పిల్లల వీఁపుమీఁద చింతాకంత యెడమైనను లేకుండ దెబ్బలతోనింపి, దానితోతృప్తిఁబొందక కొందఱని గోడకుర్చీలు వేయించి, మఱికొందఱాట విడుపు డబ్బులు తేనందునకు మొట్టికాయలతోను, చెంపకాయలతోను తొడపాశములతోను, వారిని చేతనైనంత శిక్షచేసి, చెయ్యి నొప్పిపెట్టిన

తరువాత నెండలో నిలువఁబెట్టి, కొంతసేపు కొందఱిని నూఱుగుంజీలు దీయించి విసిగి యూరకుండెను. ఇంతలో నొక పెద్దధ్వని వారందఱికు వినఁబడెను. అపుడు నలుగురుపిల్ల లొకపిల్లవానిని కాళ్ళిద్దఱును చేతులిద్దఱును బట్టి తీసికొని వచ్చుచుండిరి. ఆబాలుఁడు కాళ్ళతోఁదన్నుచు, చేతులకందినవాని రక్కుచు, నోటికి దొరికినవానిని గఱచుచు, మధ్య మధ్య "అమ్మో! నాయనో! చచ్చినానురో వద్దురా" యని మొలుఁగెత్తి యేడ్చుచు దండములు పెట్టుచు చూచినవారి కందఱికును మహావిస్మయమును గలిగించుచుండెను. అతఁడు బడికిరాసందున పంతులవారు పంపినపిల్లలతనిని మోసికొనివచ్చుచుండిరి. గ్రామదేవతగుడికిఁదీసికొనిపోఁబడు మేకపిల్లవలెనే యాబాలుఁడు యమకింకరులవంటి యానలుగురు పిల్లలచేత పంతులవారిమెదుట నిలువఁబెట్టఁబడగా నతఁడు కోదండము దీయించుమని యాజ్ఞాపించెను. వెంటనే యానలువురును నిదివఱకేయొక దూలమునకు వేయఁబడిన జనపనారత్రాడుదగ్గఱ కతనిని దీసికొనిపోయి, నరహత్యఁ జేసినవారిని నురిస్తంభము నెక్కించునట్లు త్రాడును బట్టుకొనునట్లుజేసి, క్రిందగంటములఁ బాతిపెట్టి త్రాటియాకుల మంటవేసి కాళ్ళు క్రిందఁ బెట్టకుండఁజేసిరి. ఆలోపుగా పంతులవారు బెత్తమును పుచ్చుకొని చేయవలసిన పనినంతను జేసి, నరసింహావతారమువలె శాంతినొందక బడిలోనున్న బాలురనందఱిని, పక్షపాతములేకుండ చావఁగొట్టెను. అందులోనొకపిల్లవాఁడు "అయ్యా! నేనల్లరి జేయకుండఁ గూర్చున్నాను. నన్నెందుకుఁ గొట్టినారండి" యని యడుగఁగా పంతులు "వెధవా! ఆనక నీవుమాత్ర మల్లరిచేయవా? అప్పుడు నీకోసర మింకొకపర్యాయము పని చెరుపుకొని యెవరురాఁగలరు? అందుకని పనిలోపని యిప్పుడే కొట్టినాను" అని మఱలఁగొట్టెను. ఈచిత్రవధ జరుగుటచే బాలురందఱొకమారింటిమీఁద పెంకు లెగిరిపోవునట్లు గొల్లునగోలెత్తిరి. వెయ్యేల దొంగతనము మొదలయిన క్రూరకృత్యములను జేయు మహాద్రో

హులను గూడ చెరసాలకంపక యీబడికిఁబంపిన, నేరములనువారెన్నఁ
డును జేయరు. ఈబడికివచ్చిన తరువాత నేపిల్లవాఁడును పుస్తకము
పట్టి యెఱుఁగఁడు గనుక పంతులవారి కావిధమైన పంచెలచాపెన్నఁడును
జన్మమధ్యమున దొరకనేలేదు. ఈవిధముగానున్న యీపాఠశాలపై ఖరి
యంతయుఁజూచి రామచంద్రుఁడాశ్చర్యము నొందెను. నరసింహమును
నోటివెంట మాటలేక నిశ్చేష్టుఁడయ్యెను. కోదండ మెక్కినయాపిల్లవాఁ
డును, కొంతసేపటికి దేహము తెలియక క్రిందఁబడఁగా చప్పున పంతులు
చల్లనినీరుదెచ్చి మొగమునఁగొట్టి, చెవులుమూసి, మంచితీర్థము దాహ
మిచ్చి చావఁగొట్టి చెవులమూసెనను సామెతను సార్థకముచేసెను. తలి
దండ్రుల కీసంగతి తెలియనీయవద్దని పంతులవా రధికారమంతయును
మాని బాలుని బ్రతిమలాడనారంభించిరి. ఆపిల్లవానిని శిక్షించునప్ప
టి కోపముకంటె పదిరెట్లెక్కువగా నున్న యీముసలిబ్రాహ్మణుని
తొందర చూచితీరవలెను. చెప్పనలవిగాదు. పంతులుగారికి పొగాకును,
పండ్లును, మజ్జిగదాహమును దెచ్చిపెట్టు బాలురందఱు దెబ్బలుతక్కువ
దినుచు నాయన దయకు పాత్రులగుదురు. రామచంద్రుఁ డింటికి
వెళ్ళినతరువాత మన నరసింహము నీపాఠశాలకంపుటవలన నుపయో
గము లేదని చెప్పెనుగాని శరభరాజుగారామాటను వినిపించుకొనలేదు.
ఈదారుణమైన శిక్షలఁ జూచి నరసింహము బడికి వెళ్ళవలసి నప్పుడు
కడుపునొప్పి వచ్చినదని చెప్పి బడిమానుచు, నాలాగునఁజేయుటకువీలు లే
నప్పుడు చద్దియన్నముతిని బడికిపోదు నని చెప్పి యెక్కడికోపోయి, యీ
సంగతి తెలిసిన పక్షమున తమవారు కోపింతురని యింటికిరాక, యున్న
వస్త్రములులేక మొండలపాలై తిరుగుచు, తల్లిదండ్రులు వెదకునప్పు
డేదొడ్డిలోనో తోఁటలోనోకనఁబడుచు, తనప్రాణమునకుఁగూడ భయ
ముగల్గునేమో యని తలిదండ్రులకుఁ దోఁచునట్లు నడచుచుండెను. ఒకా
నొకదినమున రామచంద్రుఁడు పంతులవారితో నిట్లు ప్రశంసించెను.

రామ—అయ్యా! పంతులుగారూ! మీరీలాగున కొట్టిన పక్షమున పిల్లలురారండి. పిల్లలుమీఁద నింతకంటె కొంచెము దయగా నుండవలెను.

పంతు—నాకంటె పిల్లలమీఁద నింకాదయగా నెవ్వఁడుండఁగలరయ్యా ? నేనెప్పుడైన కొంచెము బెత్తముతో బెదిరించి యొకముక్క చెపుతానుగాని గట్టిగాఁకొట్టను. అయినను "దండం దశగుణం భవేత్" అని శాస్త్రమున్నది. ఎంతకొడితే యంతమంచిది. దెబ్బ దేవేంద్రలోకము.

రామ—అంతచేటుకొట్టఁగూడదు. చక్కగాబోధించి పాఠములు చెప్పవలయును.

పంతు—ఏమిబోధించ నండి? ఉత్తబండముండాకొడుకులు. ఎన్నిపర్యాయములు చెప్పినా ముక్కరాదు. మాచిన్నతనములో మేము చదువుకొన్న సంగతులు మాకథలు విన్నపక్షమున మీ రేమందురో. పంతులపేరు చెప్పిన గడగడవణఁకి లోపలికిపారిపోయేవారము. నేనుకొట్టే దెబ్బలొక దెబ్బలా?

రామ—మానరసింహ మేమయిన చదువుచున్నాఁడా?

పంతు—నరసింహాని కేమి? మహారాజు. అతనికి చదు వెందుకు పిల్లవాఁడు మిక్కిలి బుద్ధిమంతుఁడు. ఆటవిడెపుడబ్బు లెప్పటి వప్పుఁడిచ్చి వేయును. ఎన్నఁడు నాలస్యముచేయఁడు.

రామ—అతనికి నాలుగునెలల క్రిందట నక్షరాభ్యాసమయినది కదా? ఇప్పటికి ఓనమాలయినా రాలేదేమి?

పంతు—తొందరేమిటి చదువు రాకపోతే మిగిలిపోయిన దేమిటి? అన్నమునకు లోపమా? వస్త్రమునకు లోపమా? ఎవ్వఁడో కూఁడు గుడ్డలేని నిర్భాగ్యునకు గాని హాయిగా జరుగువానికి చదు వెందుకు?

రామ—చదు వందఱికిని గావలయును. విద్యలేనివాఁ డెంత ద్రవ్యవంతుఁడై నను గౌరవింపఁబడఁడు. విద్యవంటి దొకటిలేదు.

విద్యావిహీనులగు మూర్ఖులు విద్యాభ్యాసమువలని మహోపయోగము లెఱుఁగక భాగ్యవంతులు చదువుకొన నక్కఱలేదనియు, నుద్యోగములఁ జేయఁదలఁచినవారే చదువుకొనవలె ననియుఁ జెప్పుచుందురు! ఆబడికిఁ బోవుటవలన నరసింహాయున కభివృద్ధికనఁబడ నందున రామచంద్రుఁ డింటియొద్దఁ గూడ తగుశ్రద్ధతో పాఠములను జెప్పుచుండెను.

ఐదవ ప్రకరణము.

ఈప్రకారముగ రామచంద్రుఁడు శరభరాజుగారి జ్యేష్ఠకుమారునకు సహాధ్యాయియై రెండవకుమారునకు గురుఁడై యందఱకును తలలో నాలుకవలె మెలఁగుచుండెను. శరభరాజుగారి కుమార్తెయగు పార్వతి కిప్పటికి తొమ్మిది సంవత్సరములు దాఁటి పదియవ యేఁడు ప్రవేశించెను. వివాహము చేయవలయు నని శరభరాజుగారు సంబంధముల నిమిత్తము వెదకుచుండిరి కాని తగిన సంబంధము దొరకదయ్యెను. అదివఱకు వచ్చిన సంబంధములలో పిల్లవానికి భూస్వాస్థ్యము ద్రవ్యసంపత్తియుఁ గలిగియున్నయెడల విద్యాగంధము లేదు. విద్యగలవారికి ద్రవ్యము లేదు. శరభరాజుగారి తల్లికి విద్య లేకపోయినను ద్రవ్యవంతున కీయవలెనని యున్నది. కృష్ణవేణమ్మకు విద్యాధనసంపత్తులు రెండును గలవాఁడే కావలెననియున్నది. శరభరాజుగారి యాలోచనయు రాజగోపాలముయొక్క యాలోచనయు నీవిధముగా లేదు. ద్రవ్యవంతుఁడుగాకున్నను విద్యయు సౌందర్యమును గలవాని కీయవలెనని

వారి కభిప్రాయమున్నట్లు వారప్పుడప్పుడు మాటలాడుచున్న మాటలనుబట్టి కృష్ణవేణమ్మ తెలిసికొనెను. రాజగోపాలము పార్వతి కింటి వద్ద చదువుచెప్పుచుండుటచేత నానాటికి బాలిక చదువను వ్రాయను నేర్చి శుక్లపక్షచంద్రునివలె వృద్ధిఁబొందుచున్నందున విద్యావిశారదుఁడగువానికిచ్చి పెండ్లిచేయుట యావశ్యక మయ్యెను. ఇట్లుండ రామచంద్రుఁ డొకనాఁడు రాజగోపాలముతోఁ గూడ సాయంకాలమున దేవాలయమునుండి యింటికివచ్చుచుండఁగా నొకబ్రాహ్మణుఁడుకనఁబడి రామచంద్రునిఁజూచి "నాయనా రామచంద్రుఁడవు నీవేనా?" యని యడిగెను.

రామ—అవును నేనే. ఏమండి! మీదేయూరు ?

బ్రాహ్మ—మాది రాజవోలు. మీరింకా యిక్కడనే యున్నారా?

రామ—(భయముతో) ఆలాగనుచున్నారేమి? రాజవోలులో మామామయ్య పిల్లలు బాగున్నారా?

బ్రాహ్మ—ఇంకా నీకు తెలియదూ? మీ మేనమామగారు మొన్నరాత్రి తెల్లవారుజామున పరలోకాంతరగతు లయినారు. ఆ దుఃఖము పట్టఁజాలక మీ మేనత్త కూడా నూతిలో దిగినదికాని వెంటనే దగ్గఱనున్నవారు దిగి యామెను దీసినారు. ఆకస్మిక మరణమగుట చేత నెక్కడ నేమేమి యాస్తియున్నదో చెప్పలేదు. మఱిడిజాడ్యము వచ్చి పోయెను.

రాజ—అయ్యో ! మేనమామగారే ; మొన్న మధ్యాహ్నము రాజవోలునుండి వచ్చినరాజు మీమామను జూచి వచ్చినానని చెప్ప లేదటోయి రామచంద్రుఁడు!

బ్రాహ్మ—రాత్రి పాముకఱచి చచ్చిపోయినాఁడు. అన్నట్టు మఱచిపోయినాను మఱిడిజాడ్యము వచ్చినదండో.

రామచంద్రుఁ డామాట వినఁగానే నేలచదికిలఁబడి మాటరాక చెప్పరాని దుఃఖముతో వాపోవుచుండెను.

రాజ—మీ పేరేమండీ? మీకాఁపురము రాజవోలేనా?

బ్రాహ్మ—నాపేరు కర్రా రామయ్య. ఇందులో మీకనుమాన మెందుకు? మాది రాజవోలే కాఁపురము. నేను దహనమైన దాకా దగ్గఱనుండి వచ్చినాను. నేను ముక్తేశ్వర మీరాత్రి వెళ్ళవలెను. అని చెప్పి వెంటనే వెళ్ళిపోయెను.

నడచుటకైన సత్వములేకయున్న రామచంద్రుని జేయిపట్టుకొని మధ్యమధ్య నూరడించుచు రాజగోపాల మింటికిఁ దీసికొనిపోయి తలిదండ్రుల కావార్తఁ నెఱిఁగించెను. వారండఱుఁగూడ రామచంద్రుని స్థితికి విచారించిరి. రామచంద్రుఁడు చావడి మీఁద బోరగిలఁ బండుకొని కంటికి నేలకు నేకధారగా నేడ్చుచు మధ్యమధ్య మేనమామగుణములను రాజగోపాలమునకును శరభరాజుగారికి నీప్రకారముగాఁ జెప్పుచువచ్చెను. అయ్యో! నాచిన్నతనమునందే మాతండ్రిచనిపోయెను. ఆయన పోయిన తరువాత మాపినతండ్రి నాయాపదాస్తి తన స్వాధీనము జేసికొని యింటికి తాళమువేసి మాతల్లిని నన్ను లేవఁగొట్టెను. అప్పటినుండియు మామేనమామ తనకుమారునివలెనే నన్నాదరించుచు నాతల్లిని నన్ను సంరక్షించెను. ఆయన నేనడిగిన దెల్లనిచ్చి మాతండ్రి పోయినలోపము లేకుండఁ జేసెను. మాతల్లి యింతలో చనిపోయినది. మంచివాఁ డగుటచే మామామకు ఋణముకూడ హెచ్చినందున నాయనకు భారము కలుగఁజేయఁగూడదని నేనిటు వచ్చినాను. నాకర్మ మెప్పుడు నీలాగుననే యున్నది. తల్లిని దండ్రిని చిన్నతనమునందే దిగమ్రింగి నందుకు నాక్షేమము కోరు బంధువుఁడు మామేనమామ యొక్కఁడే యనుకొన్నాను. ఆతనికి నాకుఁగూడ ఋణము నేటితోఁ దీరిపోయినది. అనిచెప్పియేడ్చుచుండఁగా శరభరాజుగారు రామచంద్రునితో "నాయనా!

నీవిప్పుడు రాజోలు వెళ్ళవలెనా? అలాగైన పక్షమున రేపుదయమున మనుష్యుని సహాయమిచ్చి పంపుతాను వెళ్ళవచ్చును." అని చెప్పఁగానే రామచంద్రుఁడు వెళ్లుట కిష్టపడెను. ఇంతలో వెంకటరత్నము వచ్చి సంగతి యంతయు విని మైలవాఁడవు చావడిలోఁ గూరుచున్నా వేమని యతనిని గూకలువేసి యావలఁ గూర్చుండఁ బెట్టెను. అప్పుడు శరభరాజుగారితల్లి వచ్చి మైలవార్త వినఁగానే స్నానముజేయవలెను గనుక రెండుబిందెల చల్లనినీళ్ళు తెచ్చి దుఃఖభారముచేత శరీరమెఱుఁగక యున్న రామచంద్రుని మీఁదఁబోసిస్నానము చేయించెను. భోజనము చేయుమని యింటనున్న వారందఱు బలవంతపెట్టినందున పత్తిఁశికనుక వాకిట విస్తర వేయించుకొని కొంచె మెంగిలిపడి యతఁడు లేచిపోయెను.

తెల్లవారినదాఁక కంటిమీఁద నొక్కమాఱయిన కునుకు లేక విలపించుచు రామచంద్రుఁడు కోఁడికూయఁగానే రాజగోపాలమును లేపి తనకు మనుష్యుఁ డక్కఱలేదనియు తాను మార్గమంతయు నెఱుఁగుదు ననియుఁ జెప్పి యతనియొద్ద కొంచెము లెక్కపుచ్చుకొని దొడ్డవరమువెళ్ళి మధ్యాహ్న మక్కడ భోజనము చేసి కొంచెము చల్లఁబడిన తరువాత గోదావరినిదాఁటుటకు వెళ్లెను. అప్పుడు గోదావరి జ్యేష్ఠమాసముగుటచే విస్తారభాగ మెండిపోయి తాను ధవళేశ్వరము దగ్గఱ నీప్రకారముగనే పాయ లయితినని తెలియఁ జేయుటకో యనునట్లు చిన్న చిన్న చీలిక లయ్యెను. కాలము మాఱిపోయి నప్పుడు గొప్పవారికి నైన తిప్పలు గలుగుట సత్యమని తెలుపుటకుఁ గాఁబోలు నడుమ నిసుకతిప్పలుగలవు. ఈపాయ లన్నిఁటి యందును చివరపాయ మిక్కిలి వెడల్పుఁ గలదై యున్నదికాని తక్కినవన్నియు పేరునకు మాత్రము నీరుగల్గి మనుష్యులు చులకనగా నడచి పోవుటకు పాటిరేవులు పడియుండెను. మెత్తని మనస్సు గలవారి నేమన్నను నీప్రకారముగనే నాటునని తెలియఁ

జేయుటకో యనున ట్లుఱుగులు వేయఁగానే దించుకొనిపోవుచున్న యిసుక తిప్పల నుండి మూటలు తలమీఁదఁ బెట్టుకొని పాటిరేవుల దాఁటి చివర పాయ దాఁటవలెనని రేవుపడవ నెక్కుట కనేకమార్గస్థులు పోవుచుండిరి. వారితోఁ గూడ రామచంద్రుఁడు పోవుచు పూర్వకాలమునందు వఱదలు వచ్చి యిద్దరద్దరులకు నీరు దాసినపుడు తేరిచూడనైనఁజాలని బాలకులు గూడ నేఁడు సునాయాసముగ దాఁటుచున్న యా మహానదియొక్క శుష్కస్థితినిజూచి తనతండ్రిగారు సజీవులగునపుడు తన్నతిగౌరవముతో నాదరించినవారును, తనతో మాటలాడుట కనర్హమైనవారును నేఁడు తన్నవమాన పఱచుచున్నందున తన దీనావస్థ జ్ఞాపకము వచ్చి కొంచెము విచారించి యూరకుండెను. ఆ వచ్చిన జనులలో ముక్తేశ్వరగ్రామ వాస్తవ్యుఁడగు నొక బ్రాహ్మణుఁ డుండెను. ఆతఁడు లక్షాధికారియని చుట్టుపక్కల నున్న యూజను లందఱు చెప్పిరి కాని యతఁడు కట్టుకొన్న జేపరాపంచెను, మీఁదనున్న మాసినచిరుగుల యుత్తరీయము చేతిలో నున్న పెద్దమూటనుజూచి రామచంద్రుఁడు, భిక్షాధికారిగ నుండఁదగిన యామహాలోభియొక్క సంపదల కాశ్చర్యపడెను. మూటఁ దెచ్చిపెట్టుట కొక్క చాకలివానినైన నతఁడు దెచ్చుకొన లేదు. వారందఱు నీటి యొడ్డుననుండఁగా నింతలో పడవ యద్దరినుండి రాఁగా పడవవాండ్రది వఱకచ్చట గుట్టవేయఁబడి యున్న చింతపండు కంట్లములను పడవ పడి చెక్కవఱకును మునుఁగునట్లు వేసిరి. పడవఫ్రాటము కాఁగానే తెఱచాపఁ ద్రొక్కి పడవవాండ్రు దానిని నడుపఁ జొచ్చిరి. పడవ నడచినకొలఁది ధ్వానితోఁ గదలి నడిచి వచ్చుచున్నట్లున్న గట్టుమీఁది వృక్షములను లంకలో మేసి గోదావరి యందు నీరు ద్రాగుచున్న పశువులును లంకల యందు కాఁపులు పెట్టిన పుచ్చ, దోస, గుమ్మడి మొదలగు పచ్చని పాదులును, "అత్యుచ్ఛ్రయః పతనహేతుః" అనునీతిని తెలియఁజేయుటకో యన మొదట నుత్తుంగముగా లేచి తుదకు పడిపోవుచున్న కెరటములును

నదిమీఁదనుండి వచ్చుచున్న మలయ మారుతమును రామచంద్రుని దుఃఖమును గొంత పోఁగొట్టెను. తప్పతాగి స్మారకము తెలియకుండ నున్న యాముగ్గురు పడవవాండ్రలో నొకఁడు కూర్చుండి కునుకుపాట్లు పడుచు చుక్కాని బట్టుచుండెను. తక్కిన యిద్దఱు పడవలో మర్యాద గలస్త్రీలు కూర్చున్నను, సందేహము లేక నోట నుచ్చరింపరాని బండ బూతులు గల కీర్తనలను బాడుచుండిరి. కొంతదూరము పడవ నడవఁ గానే సరంగు డబ్బులను పుచ్చుకొనుటకువచ్చెను. పాప మొకకాఁపువాని దగ్గఱ మొదట నాల్గుడబ్బులను బుచ్చుకొనుటకు నొప్పుకొని సగము నదిని దాఁటిన తరువాత నాలుడబ్బులను బుచ్చుకొందు ననియు, న ట్లియ్యని యెడల మధ్య నొక తిప్పమీఁద దిగు మనియు, నతఁడు బాధపెట్ట నారంభించెను. ఆతని దగ్గఱ సొమ్ము పుచ్చుకొని సరంగు రెండవవాని దగ్గఱకుఁ బోయి యడిగెను. ఆతఁడు, "నేను రేవుదగ్గఱ పడవ యజమానుని కిచ్చినాను. అతఁడు నీతోఁ జెప్పలేదా"? అని యడుగఁగానే సరంగు కోపముతో "నాకీసంగతి పనికిరాదు. డబ్బ లియ్యఁ గలిగిన నియ్యి లేనిచో దిగిపో" అని చెప్పి మొదట పడవ యజమానుఁడు డబ్బులు పుచ్చుకొన్న సంగతి తా నెఱిఁగియు తిరిగి సొమ్ముపుచ్చుకొనెను. ఇట్లు పడిచెక్క వఱకును పూట మైన పడవ దైవవశము చేత సుడిగాలికి వశ మయ్యెను. రామచంద్రుఁడు తనకు దాహమగుటచే ముక్తేశ్వర గ్రామనివాసుని దగ్గఱ నున్న చెంబొకమా అడిగెను. అతఁడు మహాకోపముతో " మైలవాఁడవు. నీకు బ్రాహ్మణులము చెంబేలాగున నియ్యఁగలము." అని చెప్పెను. తరువాత నెండ బాధచే రామచంద్రుఁ డా బ్రాహ్మణుని యొద్దఁ గూర్చుండుటకు రాఁగా నతఁడు కోపముతో " ముట్టుకొంటావు కళ్ళు కనుపడవూ యెవరనుకున్నావు " అనికోపపడి వానిని లేవఁ గొట్టెను. అప్పుడు సుడిగాలితో గాలిదుమారము వచ్చి భూమ్యాకాశ్యమధ్య

మంతయు నొకయిసుక తెరలో నింపి పడవ కపాయమును కలుగఁజేయు నట్లు చేసెను. ఆసమయ మిట్లుండెను.

మ. నటదుత్తుంగతరంగ సంఘములరన్ బాత్రౌఘమై; రంగము
ద్భట గోదావరి గాఁగ; భూగగనమధ్యవ్యాప్తఘ్రూవ్రజం
బట నేపథ్యము గాఁగ; రౌద్రరస దృశ్యద్గ్రంథ మాడించెమన్
బటుఝంఝానిలసూత్రధారుఁడు మహాపాండిత్య మేపారఁగన్

కెరటములు మహోత్తుంగముగ లేచి పడవను పగులునట్లు కొట్టు చుండెను. దోనె యిటునటు నొరుగుచుఁ గొంచెము కొంచెము నీరు పోసికొన నారంభించెను. పడవలో స్త్రీలు, బాలురు, వృద్ధులు, నల్లకల్లోలముగా ధ్వనిఁ జేయుచు సరంగును తెఱచాప దింపుమని ప్రార్థించిరి కాని యతఁడు భయము లేదనియు త్వరగాదింపుదు ననియు జెప్పెను. ఒక పర్యాయము నదికి వంగివంగి నమస్కారము చేయుచున్న దో యనునట్లు దోనె మిక్కిలి యొరుగఁగా నందఱును పెద్దపెట్టున గోల పెట్టి యేడ్చిరి. పడవమునుఁగక మానదని యందఱకును తోఁచెను. ఆ సమయమందు తల్లులను గౌఁగిలించుకొని యేడ్చు బిడ్డలును, బిడ్డలనుజూచి యేడ్చు తల్లులును, పడవవాండ్రను గట్టిగాఁ దట్టి కొట్టఁబోవువారును, నారాయణ నారాయణ యని ధ్యానము చేయువారును, గంగా స్తవము పఠించువారును, కొబ్బరికాయలు, పసుపు, కుంకుమ, చీరెలు, గంగకు సమర్పించువారును దేవతలకు మ్రొక్కువారును చేయుధ్వనులు ప్రతి ధ్వను లిచ్చుచుండెను. ఆసమయమందు ముక్తేశ్వరబ్రాహ్మణుఁడు రామ చంద్రుని యొద్దకు వచ్చియతని కేమైన కొంచె మీఁత వచ్చునేమోయని యడిగెను. రామచంద్రుఁ డూరకుండెనుగాని యతని శాంతమును మన స్థిమితమునుజూచి యీఁతవచ్చుననియూహించి యాబ్రాహ్మణుఁడు రామ చంద్రునిగడ్డమును కాళ్లును, చేతులును, బట్టుకొని తనప్రాణము నెట్ల యిన రక్షింపుమనిబ్రతిమలాడ నారంభించెను. ఇప్పటికి దోనె దాదాఁపు

గా నొక్కిన కేంబదిగజములదూరములో నుండెను. పడవ మునుఁగుటకు సిద్ధముగా నుండినపుడు రామచంద్రుఁడు జందెము మెడకుఁజుట్టి నడుమునకు బట్ట గట్టిగాఁగట్టి ముందుగా నదిలోనికి దుమికి పడవలోనున్న యిద్దఱుపిల్లలను తనమీఁదనెక్కించుకొని యీఁది యొడ్డునదించెను. అది చూచియందఱును "మమురక్షింపుము మమురక్షింపు" మని వేఁడుకొనిరి. ఈలోపుగానొకపెద్దగాలిరాఁగా పడవతలక్రిందై మునిఁగిపోయెను. త్వరగాదింపుమనని వాగ్దానముచేసిన సరంగు తనమాటఁదప్పకుండ వారిని త్వరగా గంగలోదించెను. ముక్తేశ్వరబ్రాహ్మణుఁడు రెండుమునుఁగులు మునిఁగి నాలుగుగ్రుక్కలు నీళ్ళుత్రాగి మూఁడవమాఱు తేలినతోడనే, పిల్లలనుదింపి తిరిగి యెవరికైన సహాయముచేయుటకు పడవదగ్గఱకు వచ్చుచున్న రామచంద్రుని గొంతె గట్టిగాఁబట్టుకొనెను. రామచంద్రుఁడు వదలుమని ప్రార్థించెనుగాని వదలుమనుకొలఁది మఱింతగట్టిగా బ్రాహ్మణుఁడు పట్టుకొన నారంభించెను. రామచంద్రుఁడును బ్రాహ్మణుఁడును గూడ చచ్చిపోవునట్టి సమయము వచ్చినట్లు కనఁబడునుగాని రామచంద్రుఁ డుపాయశాలి గనుక బ్రాహ్మణుఁడెంతకును వదలనప్పుడు వానిని గట్టిగాఁ గఱచెను. తోడనే బ్రాహ్మణుఁడు పట్టువదలెను. రామచంద్రుఁడు భూతదయాళుఁడు కాఁబట్టి యాబ్రాహ్మణుని యందు మహాదయ గల్గి వెనుకకు వచ్చి రెండుమూఁడుతన్నులతో యొడ్డునకుఁ బంపెను. పిమ్మట రామచంద్రుఁడు బ్రాహ్మణుని గట్టున కెత్తుకొనిపోయి నీరు ద్రాగుటచే నెత్తుగా నుబ్బియున్న పొట్టమీఁద నడుగువేసి త్రొక్కి నీటిని వెలికిఁదీసి వానిని బ్రతికించెను. ఇంతలోనొకపడవవచ్చి యాజనులను రక్షించుటకుఁ బ్రయత్నముచేసెనుగాని సగముకంటె నెక్కువజను లాదుర్దినమునందు మృతి నొందిరి. రామచంద్రుఁడు సహాయ మియ్యనియెడల ముక్తేశ్వరబ్రాహ్మణుఁడు పడవవచ్చునప్పటికే స్వర్గంబున బాఁతకాపై యుండును. అంతట బ్రాహ్మణుఁడు రామచంద్రునితో "అయ్యా! మీఋణము

నేనెన్నటికైనను దీర్పలేను. నాయావదాస్తిని మీ కిచ్చినను మీ ఋణము తీరదు. మీకు తగినబహుమాన మేదైన నియ్యవలెనని యున్నది. మీరు నాతోఁగూడ ముక్తేశ్వరము దయచేయవలెను. నాప్రార్థన మంగీకరింపవలసినది.” అని చెప్పఁగా రామచంద్రుఁడు “సరిసరి; ఈమాత్రపుఁ బనికి బహుమాన మీయవలెనా? నాచేతనైన సహాయమును నేను చేసినాను. మీ రేమియు నియ్యనక్కఱలేదు. దయమాత్రముంచండి! తమరు పెద్దలు” అని ప్రత్యుత్తరము చెప్పి యొక్కతృణమైనను పుచ్చుకొనకయే రామచంద్రుఁడు రాజవోలునకుఁ బోయెను. ఆబ్రాహ్మణుఁడు గూడ శివకోటగ్రామమును చేరెను. రామచంద్రుఁడు రాజవోలు వెళ్లినప్పటికి సాయంకాలమైనందున మేనమామకుమారుఁడు వీధియరుగుమీఁదఁ గూర్చుండెను. ఆపిల్లవానిని జూడఁగానే రామచంద్రుఁడు “నాయనా! యెంతకష్టమువచ్చిన” దని యతనిని కౌఁగిలించుకొని యేడువనారంభించెను. ఈతఁ డెందు కేడ్చుచున్నాఁడో తెలియకుండ కుఱ్ఱవాఁడు కూడ పెద్దపెట్టున నేడువసాగెను. ఇద్దఱును లోపలికి పోఁగానే వారిని జూచి మహావిపత్తు తటస్థమైన దనుకొని మేనత్తగూడ నేడువ నారంభించెను. చుట్టుప్రక్కల నున్న మనుష్యులందఱును జేరి “యేమి యేమి?” యని యడిగిరికాని వారు ప్రత్యుత్తరమును జెప్పకయే వెక్కి వెక్కి యొకరి సంగతి నొకరెఱుఁగకుండ వారందఱును దుఃఖపడుచుండిరి. ఆవినోదమును జూడవచ్చినవారును, కష్టమేమోకలిగినదని యూరడింప వచ్చినవారును సంగతిని దెలిసికొనవలెనను వారును గుమిగూడి యింటిచుట్టును జేరిరికాని యొకరికిని దుఃఖకారణమేమో తెలియదయ్యెను. అప్పుడు రామచంద్రునివలెనే యున్న యొకనలువదియేండ్లబ్రాహ్మణుఁడు గుంపుగూడిన జనుల సందడిని జేతులతోఁ దోసికొని యతిత్వరితముగా వచ్చి గుండెబాదుకొనుచు “ఏమి? నాయనా! ఏమి? నాయనా” యని రొజుచు లోనికి వెళ్ళెను. అతనిని జూచి రామచంద్రుఁడు మిక్కిలి యాశ్చర్యపడి

నోటివెంట మాటరాక నిశ్చేష్టుఁడై తెలివితెచ్చుకొని లేచి యావచ్చిన మనుష్యుని గాఁగిలించుకొని "మామయ్యా! నీవు బ్రతికియున్నావా? ఎవరో దుర్మార్గులు నీవు చచ్చిపోయినావని చెప్పినారు. అందుకు నేనిక్కడికి వచ్చినాను" అని చెప్పిన యావిపరీత వృత్తాంతమునంతను మేనమామ విని యెవరో విరోధు లాపనిఁజేసినారని నిశ్చయించి యింటనందఱిని నూరకుండుఁడని చెప్పి తరువాత రామచంద్రుఁడును తానును కష్టసుఖములఁ జెప్పుకొనుచుండిరి. మేనల్లుఁడు మేనమామతో తాను రాజవోలుబయలుదేరి వెళ్ళినది మొదలుకొని యానాఁటివఱకు జరిగినయావద్వృత్తాంతమును పూసగ్రుచ్చినట్టు చెప్పఁగా మేనమామయు, శోభనాచలము మొదలైనవారి చరిత్రవిన్నపు డాశ్చర్యమును, కష్టములు విన్నప్పుడు విచారమును, కష్టనివారణమగునపుడు సంతోషమును, కనబఱచుచు, శరభరాజుగారి యుదారగుణముల స్తోత్రము చేయుచు, రామచంద్రునితో మాటాడుచుండెను. అతఁ డక్కడ నొకవారము దినములుండెను. ఆలోపుగా నాగ్రామనివాసుఁడొకఁడు మంత్రిప్రగడ వెంకటరత్నమునకు తమపిల్లనియ్యవలెనని యాతని గుణాములనుగూర్చి రామచంద్రునడుగఁగా నతఁడు వెంకటరత్నముయొక్క దుర్గుణాదులనుగుఱించి తనకు తెలసినంతమట్టుకు నిజముచెప్పెనుగాని కల్లలాడి యిల్లునిలుపు మనుశాస్త్రము నతఁడనుసరించలేదు. వారముదినములక్కడ నిలిచిన తరువాత మేనమామదగ్గఱ సెలవుపుచ్చుకొని ప్రయాణమై సుఖముగా రామచంద్రుఁ డమలాపురము జేరి యక్కడి వారందఱితో నీఘోరమయిన వృత్తాంతమునుజెప్పి వారందఱి నాశ్చర్యమగ్నులఁ జేసెను. రాజవోలులో రామచంద్రుఁడు వెంకటరత్నముయొక్క వివాహమునుగుఱించి మాటలాడినమాట లతనికి నేలాగుననో తెలిసినందున రామచంద్రుఁడు తనకుఁజేసిన మహోపకారమునకు మిక్కిలి కోపించి యతఁ డొకనాఁడు రామచంద్రునితో నిల్లు మాటాడ నారంభించెను.

వెంక—ఏమోయి! రాజవోలు విశేషములు. మీమామగారు బాగున్నారా?

రామ—ఆఁ బాగున్నారు. విశేషము లేమియులేవు.

వెంక—రాజవోలులో నాకు వివాహవిషయమై సహాయము నీవు చక్కఁగాఁ జేసినావు.

రామ—నేనుచేసిన దేమున్నది. వారునన్ను వచ్చి యడిగినారు.

వెంక—అడిగితే నన్నుగురించి నీవేమిచెప్పినావు? నీకునామీఁద నున్న కసియంతఁ దీర్చుకొన్నావు కాఁబోలును!

రామ—నాకు మీమీఁద కసియేమున్నది. నాపెద్దలను మీరు చంపినారా మీపెద్దలను నేనుచంపినానా? నాకు మీమీఁద కోపముండు టకు నేనెంతవాఁడను?

వెంక—ఎంతవాఁడవు కాకేమి? ఎంతవాఁడవు కాకుండ మా యమలాపురము వచ్చినావు? నీవు పొట్టకూటికి మాయింటియొద్దనున్నను నీకున్నగీర్వాణ మెవరికని లేదు. నీకు కన్నులు నెత్తికివచ్చినవి. నీముందఱ మేమెంతవాళ్ళము? పీటలమీఁద పెండ్లి చెడఁగొట్టి యేమిబావుకొన్నావు? నీకు సిగ్గుబిడియములు లేవేమి!

రామ—అయ్యో! తమకంత కోప మెందుకు? నాకు తోఁచిన య భిప్రాయమును నేను దైవముఖమునుజూచి నిశ్చయముగాఁ జెప్పినాను.

వెంక—నీకు నాసంగతి యేమి తెలుసును? నేను ముండనుంచు కుంటే నీకేమి? నాయంతవాఁడను నేను నీయంతవాఁడవు నీవు. ఒకరిదగ్గఱ నాపరిచారము నీవెందుకెత్తవలెను? నీవు మంచివాఁడవా యేమిటి? గుర వెందగింజ తన క్రిందినలు పెఱుఁగదఁట. నీయిష్టమువచ్చినట్లు ప్రేలుటకు నేనెవరనుకొన్నావు? పెండ్లివచ్చినప్పుడు వేయియబద్ధములాడియైన నొక కొంప నిలువఁబెట్టవలెనన్న మాటయయినను నీవు వినలేదు. నీచదు వెందుకు తగులఁబెట్టనా? ఒకరు పచ్చగానున్న పక్షమున నీవింతయోర్వ

లేవేమి? ఆహాహా! యెంతబుద్ధిమంతుఁడవయ్యా! సత్రములో రాళ్ళు వేయునట్టి మచ్చులాగున నున్నది.

రామ—నేను మీయందుఁగల మొగమోటముచేత నబద్ధము చెప్పిన పక్షమున నాప్రాణమున కుసూరుమని యాపిల్ల యేడ్చును. నూతేళ్ళు బ్రతుకవలసిన బ్రతుకు.

వెంక—సత్యవాదివి నీవు బయలుదేరినావు. భూలోక హరిశ్చంద్రుఁడవు. తిన్నయింటివాసములు లెక్కపెట్టుటలోఁ దెలివిగలవాఁడవు. తల్లిపాలు త్రాగి రొమ్ముగుద్దివాఁడన్న సామ్యము నీదగ్గఱనె నిజమైనది. ఇందుకే నియ్యోగపువానిని జేరఁదీయఁగూడదని శాస్త్రము చెప్పినవాఁడు వెఱ్ఱివాఁడా?

అని యిట్లు వెంకటరత్నము తానుగూడ శరభరాజుగారియింట పొట్టకూటికిఁ జేరినవాఁడే యనుమాట మఱచిపోయి రామచంద్రుఁడు తనయింటనేయుండినట్లును, వానిని తానేసంరక్షించుచున్నట్లును తలఁచి తలవాఁచిపోవునట్లు వానిని జీవాట్లు పెట్టి మాటలతో తనవాదమును ముగింపక చేతులుకూడ కలుపుటకు సిద్ధముగానుండెను. కాని రామచంద్రుని యదృష్టము బాగుండి యింతలో లోపలినుండి వచ్చి శరభరాజుగారు వెంకటరత్నమును రామచంద్రుని కూకలువేసి వారి వివాద నివారింపఁజేసిరి. రామచంద్రుని సత్యవాద మతనిని మహాపదలపాలుజేసెను. ఒకనాఁడు వెంకటరత్నము మనస్సులో నేదో తలంచుకొని రెండువ్రేళ్ళు చాపి యిందులో నొకవ్రేలుపట్టుకొమ్మని నరసింహమునడిగెను. అతఁడు రెంటిలో పొడుగువ్రేలు పట్టుకొనఁగా నది యతనిమనస్సులోనున్న యభిప్రాయమునకు సరిపడనందునను, నశుభసూచకముగా నున్నందునను వెంకటరత్నము, కోపమువచ్చి "శకునపక్షి వెధవా! ఎప్పుడు నింతే; చవటచేతులపెద్దమ్మ" యనిటంగున నొక మొట్టికాయ మొట్టెను. దానితో కుఱ్ఱవాఁడు కెవ్వున గుక్కతిరుగకుండ నేడ్వఁగా లోపలినుండి

కృష్ణవేణమ్మగారువచ్చి యెవరుకొట్టినారని యడుగఁగా రామచంద్రుఁడు సంగతియంతయుఁ జెప్పెను. కృష్ణవేణమ్మ వెంకటరత్నమునుగొంచెము చీవాట్లు పెట్టెను. ఇట్లొకదానికంటె నొకటి బలమైన కారణములచే వెంకటరత్నమునకును రామచంద్రునకును మనస్పర్ధ హెచ్చగుటచేత వెంకటరత్నము తనకసిఁదీర్చుకొనుటకు రామచంద్రుఁడు చదువుకొను చున్నప్పు డతని కేదైన పనిఁ జెప్పి యతఁడు చేయుటకు వీలులేదనఁగానే యావార్త శరభరాజుగారితోను వారితల్లితోనుజెప్పి "తిండికిసిద్ధముగా నుండును గాని పనివల్లగాదు. మాయింటనున్నవారికి మాకంటె నెక్కువ రాజసము" అని చెప్పచు తనచేతనైన యిబ్బందులు పెట్టుచుండెను. దేవుఁడు వరమిచ్చినను పూజారివరమియ్యఁడన్నట్లు శరభరాజుగారికి దయ యున్నను వెంకటరత్నమునకు కటాక్షము లేకుండుట యొక పెద్ద చిక్కు గానే యుండెను. ఒకనాఁడు రాత్రి భోజనములయినతరువాత శరభరాజు గారు లోపల చావడిలోఁ బచారుచేయుచుండఁగా రామచంద్రుఁడు దీపము వెలుఁగున చదువుకొనుచుండెను. అప్పుడు వెంకటరత్నము రామ చంద్రుని మెల్లఁగాఁబిలిచి యిట్లని చెప్పెను.

వెంక—అబ్బాయి! ఆమధ్య నిన్ను నేనన్నమాటలుమనస్సులో నుంచుకోవద్దుసుమీ! నామనస్సులో కల్మషము లేదు. అప్పటికప్పుడు కోపమువచ్చినప్పుడు పిచ్చముండాకొడుకువలె నాలుగు కేకలు వేయడమే గాని దీర్ఘక్రోధముంచుకోను. మనమందఱము కూడ నొకయింట నుండే వారము. ఈవేళ నాలుగనుకొన్నను రేపు తిరిగి కలిసేవాళ్ళము మన మే. నన్ను నీవన్నను నిన్ను నేనన్న నదిలెక్కలోనిది కాదు. నేను పయి కీలాగున కోపముతో కనఁబడుటే కాని నీవిషయమైన సంగతి నేదయిన శరభరాజుగారితోఁ బ్రసంగించవలసినపుడు నేనెంతకట్టుదిట్టముగఁ జెప్పు చుందునో పరమాత్మునకుఁ దెలుసును.

రామ—చిత్తము. మీదయ యున్నపక్షమున నాకేకొఱంతయు నుండదు. నేను మిమ్ము నందఱను నమ్ముకొన్నవాఁడనే కనుక నా భారమేమీది.

వెంక—ఒకపర్యాయము వీధిలోనికిరా (అనివీధిలోనికిఁ దీసికొని వెళ్ళి, సూర్యనారాయణగారూ! దయచేయండి.

అని యతఁడు పిలువగానే తెల్లని తలపాగాను బెట్టుకొని నిలువు టంగీ దొడుగుకొని మంచి జరీపంచెఁగట్టి, చేతిలోనొక వెండిపొన్నువేసిన కఱ్ఱ పట్టుకొని యున్న యొక బ్రాహ్మణుఁడు వచ్చెను. అతనిని జూచి రామచంద్రుఁడు "తివాసిపట్టుకొనిరానా?" యని యడిగెనుగాని వెంకట రత్నమును బ్రాహ్మణుఁడును, వద్దనిచెప్పఁగా వారందఱు వీధియరుగు మీఁద మూలఁ గూర్చుండిరి.

వెంక—రామచంద్రుఁడూ! నీవొక్క సహాయము చేయవలయును. ఈయన దేశిరావు సూర్యనారాయణగారు. వీరు దేశపాండ్యాలు, కోటిపల్లి కాఁపురము. తాతముత్తాతలనాఁటినుండియు శ్రీవిజయనగర మహారాజుగారిదగ్గఱ పెద్దయుద్యోగములను జేయుచున్నవారే. వారిది నూఱుపుట్లభూమి. వెనుకటి నందనసంవత్సరపు కఱవులకు వీరు చేసిన యన్నదాన మింతింతయని చెప్పనలవికాదు. మూఁడేండ్లు జనులు కుటుంబములతో వచ్చి వారిగ్రామములోఁ గాఁపురమున్నారు. నీవు వినియుందువు జగత్ప్రసిద్ధులు.

రామ—నేనెన్నఁడు నెఱుఁగను. మహానుభావులుమీరు.

సూర్య—అవి యన్నియునెందుకు ? ఆదినములువేరు. ఆకథలు వేఱు. చావలేకయీలాగున బ్రతుకుచున్నాము. ఈస్థితియీవేషమువేరు.

వెంక—అందుచేత నప్పులు విస్తారముకాఁగా భూములు తాకట్టు లోనున్నవి. ఇంటనున్న జవాహిరీనంత విక్రయించి వీరుకాలక్షేపము చేయుచున్నారు. అయితే యీనగలను కోటిపల్లిలోనుచుట్టుపట్లనుమాత్ర

మన్నరు. పూవులమ్మినచోటనే కట్టెలమ్మవలసి వచ్చెను. ఆనగలను మాగ్రిమము తెచ్చి యమ్ముచుందురు.

రామ—నేనిప్ప డేసహాయము చేయవలెను? పాపమునాకు విచారముగానే యున్నది.

వెంక—మఱేమి గొప్పసహాయము లేదు. నీయందు కోమట్లకు మహాగౌరవముకలదు. నీవమ్మినపక్షమున మోసము చేయరు. నీకు బంగారమునాణెము తెలుసును. ఈవస్తువులు నీవమ్మిపెట్టియతనిమర్యాదంగా పాడవలెను.

రామ—యీమాత్రపుపని కింత మనవికావలెనా? నాచేతనైన దానిలో మీకుఁ దగినంత సహాయము చేయఁగలవాఁడను.

సూర్య—అయ్యా! యిది రెండవవానికి తెలియనియ్యవద్దు. నాకు సిగ్గుగానున్నది. అందుచేతనే యీవస్తువుల నంతదూరమునుండి యింత దూరము తెచ్చి యమ్ముచున్నాను. అక్కడ ధర రాకపోలేదు.

రామ—మీరు చెప్పిన తరువాత నెవరికైనఁ దెలియనిత్తునా నాకు బంగారమునాణెము చక్కఁగాఁ దెలియదు.

వెంక—తెలిసినంత మట్టుకు చాలు. రాజగోపాలమునకైనఁ దెలియనీయకు. ఇవిగో వస్తువులు. కంటె నూరురూపాయలుధర. ఉంగరమేబదిరూపాయలు. ఈయన తిరిగి రేపురాత్రి మనదగ్గఱకు వచ్చి యీ సొమ్ము పుచ్చుకొందురు. రేపు పగలు దీనిని విక్రయించుము.

రామ—ఆయన రాత్రి రావడ మెందుకు? పగలు రారాదూ?

వెంక—పగలు వచ్చినపక్షమున శరభరాజుగారు బలవంతపెట్టి భోజనమునకు రమ్మనుమని నిష్ఠురము లాడఁగలరు. ఎందుకు? రాత్రియే మంచిది.

ఈసంభాషణ ముగిసిన తరువాత సూర్యనారాయణగారు వెళ్లిపోయెను. రామచంద్రుఁ డావస్తువులను రాత్రి జాగ్రత్తపెట్టి మరునాఁ

నుదయమున కోమట్లకుఁ జూపించి వారుచెప్పిన ధరప్రకారముగా రెండు వస్తువులను నూటయేఁబదిరూపాయల కొకబ్రాహ్మణునకు విక్రయించి యాసొమ్ము మరునాఁడు రాత్రి సూర్యనారాయణ రాఁగా నతనిచేతి కిచ్చెను. ఆపని యైనతరువాత వెంకటరత్నము రామచంద్రుని బిలిచి “నాయనా! యింకొక్కపనియున్నది. గంటము నాకు నొక్కపర్యాయము పుచ్చుకొనుము. పెద్దాపురము నుండి జగన్నాధరాజుగారు వచ్చినారు. ఆయనతోఁగూడ మామేనల్లుఁడు వచ్చినాఁడు. అతని కక్కడ ముప్పది రూపాయలు పని. వాఁడొక్కమారు నాకు మోము జూపించి తిరిగి కనఁబడలేదు. ఒకయుత్తరము వ్రాసిపంపెదను. నీవు వ్రాసిపెట్టవలెను.” అనఁగానే రామచంద్రుఁడు గంటమును తాటియాకును పుచ్చుకొని సిద్ధముగా నుండఁగా వెంకటరత్న మీప్రకారముగ వ్రాయించెను. “నీవు నాకీవేళ నొక్కమాఱు మొగము జూపించి తిరిగి లోపలికి వెళ్ళి నావు. నీతో మాట్లాడవలెననియున్నది. నీకు వీలెప్పుడో తెలియఁ జేసినపక్షమున నేనుతప్పకవస్తాను. నీతోమాట్లాడకుండ నేనుండలేను.” ఆయుత్తరమువ్రాసి రామచంద్రుఁడు “వ్రాలుచెయ్యండి వెంకట రత్నముగారు” అని యడుగఁగా “వ్రాలెందుకు? ఈమాత్రపు చీటి ముక్కకు వ్రాలును పైపేరునుగూడ కావలెనా” అని చెప్పి చీటిని బుచ్చుకొనెను. ఇదియైన నాల్గుదినములకు నరసింహము పుట్టినదినము వచ్చెను. అతఁ డాశ్వయుజబహుళ త్రయోదశినాఁడు జన్మించినందున నాదినము పిల్లవాని నభ్యంగనము చేయించి గ్రామమున నున్న నలుగురు నియోగులను శరభరాజుగారు భోజనమునకుఁ బిలిచిరి. మధ్యాహ్నము నరసింహమునకు సంపెంగనూనెతోఁ గృష్ణవేణమ్మ తల దువ్వి బంగారపు కుప్పెలుగల నల్లపట్టుజడబొందుతో జడవేసి జడ మీఁద చిన్న చేమంతిపువ్వును, దానికి పైభాగమున నడినెత్తిమీఁద మొగలిరేకును నమర్చి, మొగమున చక్కని యగరు చుక్కను బెట్టి

రావిరేకవేసి పచ్చని పట్టుచొక్కాదొడగి దానిమీఁద జందెమువలె వరహాలపేరువేసి మెడలో [illegible]ర్యాల పేరును, చంద్రహారమును వేసి దానిమీఁద బంగారపు కడ్డీకంటె పెట్టి కుడిచేతిమీఁద బంగారపు భుజ బొందుకట్టి రెండుదండలమీఁద వంకీలుపెట్టి, చెవులకు వజ్రపుపోగులు వేసిన తమ్మంట్లనుంచి కుడిచేతియైదువేళ్ళకు బటువులుంచి మణికట్టు దగ్గఱనుంచిన బంగారపు కడ్డీమురుగులును, మురిడిగొలుసులును, ధగధగ లాడుచుండ నెఱ్ఱపట్టులాగుతొడగి బంగారపుబిళ్ళలమొలత్రాడు లాగు మీఁదికిఁ దీసి కాళ్ళకు వెండియందెలును, గజ్జెలును, కడియములును, గేలించి మెడకు తెల్లచారలుగల యెఱ్ఱపట్టుదుమాలు ముడివేసి శృంగా రించి కుమారుని బడికిఁ బంపెను. పిల్లవాని మీఁద వైచిన వెండి బంగారము లతనికంటె బరువుగానున్నందున వస్తువులనుమోయలేకవగ రుచుచు పుస్తకములుమోయలేనందున చాకలివాఁడు వెనుక పుస్తకములఁ దెచ్చుచుండెను. తమలపాకులవంటి చెక్కిళ్ళను, తాంబూలము వేయ నక్కఱలేకయే దొండపండువలె నెఱ్ఱగానున్న క్రిందిపెదవియు, పూర్ణ చంద్రసమానమైన గుండ్రనిముఖమున కందమునొసంగ కాలియందియలు ఘల్లుఘల్లుమని మొఱయ దుర్మార్గుల కనులు కుట్టునట్లును, విరోధుల కసూయకలుగునట్లును, బిడ్డలులేనిస్త్రీలు ముచ్చటపడునట్లును, ముద్దుల మూటగట్టుచు బాలుఁడు బడికిఁబోయెను. బడిలో నెన్నఁడును చదువు లేదుకనుక పంతులవారు గాఢముగా గుఱ్ఱుపెట్టి నిద్రపోవుచున్నందున పిల్లలందఱును, దాహమున కనియు, నింక గొన్నిపనులకును నానా ముఖములై పారిపోయిరి. నరసింహముగూడ నొకమూలకుఁబోఁగా నెవరో యొకబ్రాహ్మణుఁడు చేతిలో నొకపటికబెల్లపుగడ్డయు, నొకపంచదార చిలుకయు, నాలుగుచక్కెరకేళీపండ్లును బట్టుకొని నరసింహమును రమ్మనుమని చేతితో సంజ్ఞఁజేసెను. ఎఱకొఱకుఁబోయిన చేఁపవలెనే నరసింహముగూడ నాబ్రాహ్మణుని యొద్దకుఁబోయి యతఁడుపెట్టిన పంచదార

చిలుకను దినుచుండఁగా నాబ్రాహ్మణుఁడతని నెత్తుకొని ముద్దాడి తన యింటికిఁ దీసికొనిపోయెను. పాపము ముద్దుచేత వదలలేకయేకాఁబోలును పిల్లవానిని బ్రాహ్మణుఁడు వదలనేలేదు. అతనితోఁగూడ వెళ్ళిన చాకలివాఁడు నరసింహాము పుట్టినదినముగనుక శరభరాజుగారు బహుమతీయిచ్చిన నాలుగుడబ్బులతోఁ గల్లునీళ్ళుత్రాఁగి బాలకుని సంగతి స్మరణకురాక యెక్కడనో దొర్లుచుండెను. పిల్లవాఁ డెంతసేపటికిని యింటికిరాలేదని కృష్ణవేణమ్మ విచారించుచుండఁగా చాకలివాఁడక్కడికి వచ్చెను. నరసింహ మెక్కడనున్నవాఁడని చాకలివాని నామె యడుగఁగా వాఁడేదో కొంపమునిఁగినదనుకొని "నేనిందాక తీసికొనివచ్చి యింటిదగ్గఱ దిగబెట్టినానండి" యని చెప్పెను. కానివాని మాటయందు నమ్మకముచాలక శరభరాజుగారితో నీసంగతి కృష్ణవేణమ్మ చెప్పెను. ఆమాట వినఁగానే యింటనందఱు కలవలపడ నారంభించిరి. నగలు శరీరమునిండ నుండుటచేత నెవరో గొంతుఁబిసికి చంపి నగలను దీసికొనిరని కృష్ణవేణమ్మ యేడ్చుచుండెను. శరభరాజగారు కదలుటకుఁ గాళ్ళాడక దిగులుమొగముతో నుండెను. శరభరాజుగారితల్లి కృష్ణవేణమ్మను నగలుపెట్టి పిల్లవానిని బడికిఁ బంపినందుకుఁ దిట్టసాగెను. వెంకటరత్న మొకప్రక్కకును చాకలివాఁ డింకొకప్రక్కకును నిరుగుపొరుగువారందఱు తలయొకప్రక్కకునుబోయి సందులు, గొందులు, పాడుదొడ్లు, ప్రాఁతయిండ్లు, బోడిగోడలు, తోఁటలు మొదలయిన రహస్యస్థలములన్నియు వెదకిరికాని యెందును బాలుఁడగుపడలేదు. నగలు పోయినను సరే జీవముతో మన కుమారుఁడు కనఁబడినఁజాలుఁనని తల్లి యూరడించుటకు వచ్చిన స్త్రీలతోఁ జెప్పిచెప్పి విలపించుచుండెను. రాజగోపాలమును రామచంద్రుఁడును గూడ నమలాపురమంతయు వెదకిరికాని పిల్లవాఁడు కనఁబడలేదు. తుదకు రాత్రి జామయినతర్వాత రామచంద్రుని కొక్కయోడిగవాఁడగుపడి నాలుగుగడియలప్రొద్దువేళ తాను తాఁటిచెట్టునెక్క-

కల్లుదీసికొనుచుండఁగా నొక నగలపిల్లవానిని, మఱియిద్దఱుమనుష్యులను తాఁటితోఁటలోఁజూచినానని చెప్పిపోయెను. ఆతోఁటలోపలికి రామచంద్రుఁ డొక్కఁడునుబోయి నాలుగుమూలలు వెదకి తుదకొకముండ్లకంచెదగ్గఱ నోటిలోగుడ్డలు గ్రుక్కఁబడియున్నందున మాటరాక దిగంబరియైనిలిచిన యొకబాలకునిజూచి చీఁకటిచేత మొదట తాఁటిమొక్కయేమో యనుకొని సందేహ నివారణార్థము దగ్గఱకుఁబోయి చూచి పిల్లవాఁడె యని తెలిసికొని "నరసింహము" అని పిలిచెను. మాటలాడుటకు వీలులేక నతఁడు కన్నీళ్ళతో ప్రత్యుత్తరమిచ్చి యెత్తుకొమ్మని చేతులుసాచెను. రామచంద్రుఁడు నరసింహము నెత్తుకొని నోటిలో గుడ్డలు తీసివేసి నగలింతపని జేసినవిగదాయని పిల్లవానిస్థితికిఁ గొంచెము కన్నీళ్లుదెచ్చుకొని దొరికినందున సంతోషించుచు నింటికిఁ దీసికొని పోయెను. పిల్లవాఁడు కొంతదూరమున నుండఁగానే యీసంగతి తెలిసి యింట నందఱువచ్చి పిల్లవానినెత్తుకొని ముద్దాడిరి. కృష్ణవేణమ్మయుఁ దొట్రుపాటుతోవచ్చి బాలునిఁజూచి దుఃఖము పొరలిపొరలి రాఁగా నెత్తుకొని కంటఁబడి సుఖముగానున్నందుకు మహా సంతోషముతో లోపలికిఁ దీసికొనిపోయి కొంచెమన్నము దిగఁదుడిచివైచి గుప్పెడుమిరపకాయలను లోపలనున్నవారందఱు గొంతులు బ్రద్దలగులాగున దగ్గునట్లు ప్రొయిలోఁబోసి పిల్లవానిని జరిగినసంగతినడుగుచు మధ్యమధ్య నేడ్చుచు వచ్చినస్త్రీలకు వానిని జూపుచుండెను. తరువాత మగవా రందఱు కాఁగడావేయించుకొని యాతాఁటితోఁటకుఁ బోయిరి కాని దొంగవాఁడును బుద్ధిమంతుఁడగుటచే పొరబాటుచేనైన నొక్కనగనైన దిగబెట్టకుండ నన్నిఁటిని దీసికొనిపోయెను గాని నరసింహము యొక్క చొక్కాను, లాగును, రుమాలును విడిచిపోయెను. ఆ తొందరలో దొంగలు తమచేతి తెల్లరుమాలుకూడ విడిచిపోయిరి. అది రామచంద్రునికంటఁబడఁగా నతఁడదిరిపడి శోధించిచూచి యొకకొంగున

జీడితో వేసిన పేరుయొక్క పొడియక్షరములు చా. జ. యని చదివి యాపే రెవరిదో మెఱుఁగక యందఱును త్వరితముగా నింటికి వచ్చిరి. ఆమఱునాఁడు నరకచతుర్దశియు దానితరువాత దీపావళియు నై యుండెను. నగలు దొరకక పిల్లవాఁడుమాత్రమే దొరకినందుకు శరభరాజుగారితల్లికి విచారముగా నున్నందున నాసంవత్సరము పండుగ చెయ్యవద్దని చెప్పినది కాని శరభరాజుగారును కృష్ణవేణమ్మయు పిల్లవాఁడు దొరకుటయేచాలు నని మునుపటికంటె పండుగ ఘనముగాఁ జేసికొనుటకుఁ బూనిరి. వా రందఱు తమకుమారుని వెదకి తీసికొనివచ్చి నందులకు రామచంద్రున కనేక వందనములు చేసి వేయివిధముల వానిని స్తోత్రము చేసి యతని ఋణము దీర్చుకొనలేమని చెప్పిరి. నరక చతుర్దశినాఁడు తెల్లవారు జామున నే లేచి యెంతమందికి తల లంటిన నంతపుణ్యము గనుక తన స్నేహితులను బంధువులను బిలిచి శరభరాజుగారు కొందఱికిని గోపాలము కొందఱికిని స్వయముగాఁ దలల నంటిరి. కొందఱికి మంగలవాళ్ళ చేత తల లంటింపించిరి. అభ్యంగన సమయమందు శరభరాజుగారికి పార్వతి మంగళహారతిఁ బట్టఁగా నాయన పాతికరూపాయలు పళ్ళెరములో వేసిరి. రామచంద్రుఁడును, రాజగోపాలమును బాణాసంచాగాల్చి దొడ్డినంతను వెలిగించిరి. ఆమరునాఁడు దీపావళి యమావాస్య యయ్యెను. అమా వాస్య యింక నొకనెలకు వచ్చుననఁగా పని పాటలను మానుకొని గంధకమును సూరేకారమునుకొని బొగ్గు తెచ్చి పాళ్ళువేసి టపాకాయలను తక్కిన యితరబాణసంచాయును గట్టువారును మందులను మండిగలలోఁ బోసి నూరువారును, మందు కూరువారును, తాము గట్టిన వస్తువులు చక్కఁగాఁ గాలునో లేదో యని పట్టపగలు చీకటిగదిలోనికిఁ బోయి తలుపులు మూసి యావస్తువుల నక్కడగాల్చి వాని సార మెఱుఁగు వారును తప్పపాళ్లు పడుటచేసాడైన మందులనుగుఱించి వగచువారును చెలరేగి యుండిరి. పట్టణమందు ప్రతిగృహమున గంధకపువాసన గొట్టు

చుండెను. అమావాస్యనాఁ డుదయమునఁ గొంచెము మబ్బువేసినందున వర్తకు లందఱికి తమసొమ్ము నమ్ముకొనుటకు వీలుండదని గుండెలలో రాయిపడిన ట్లుండుటయేగాక బాలురందఱును సంతోషభంగమగునేమో యని మేఘునిఁదిట్టుచుండిరి. కాని కొంతసేపటికి వర్తకులపాలిటి యదృష్ట దేవతయో యనునట్లు ఫెళ్లుమని యెండరాఁగా వర్తకులు దుకాణములను దెఱచి సరకు నమ్మ నారంభించిరి. భాగ్యవంతులు తమ బిడ్డలకు విస్తారధనము వ్యయపఱచి వస్తువులను గొనిపెట్టుచుండుటఁ జూచి బీద బిడ్డలు తమ తలిదండ్రుల బాధపెట్టఁగా వారు బిడ్డలకుఁ దగినయుత్సాహము తీర్పలేకపోయినందులకు విచారించుచు స్వల్పముగాఁగొనియిచ్చుచుండిరి. గొప్పయుద్యోగస్థుల యనుగ్రహము సంపాదింపవలెనని చిన్నయుద్యోగస్థులు తమపిల్లలకు లేకపోయినను బహుమతులపేరుపెట్టి వారియిండ్లకు పెద్దపెద్ద బాణసంచాబుట్టలను బంపుచుండిరి. అంతకంటె మహాభిమానముగల పౌరుషవంతులు తమరు సేవించుచున్న ప్రత్యక్షదేవతలగు వేశ్యకాంత లేమనుకొందురో యనియు మంచివస్తువులఁ బంపని యెడల మఱునాఁడు వారిమొగ మెట్లుచూతు మనియుఁ దలంచి పదిమందిలో నగుబాటు రాకుండ పరువు నిలువఁ బెట్టుకొనుటకు ధనము లేకున్నను ఋణము జేసియో, యింటనున్న వస్తువులను దెగనమ్మియో బాణసంచకొని యొక రసికునికంటె నొక రసికుఁ డెక్కుడుగా నుండవలెనని వర్తకులదగ్గఱ బదులు పుచ్చుకొని పెద్దపెద్దబుట్టలను వారియిండ్లకంపిరి. తాఁటిచిదుగులను సంపాదించి కాల్చి పొడుముచేసి గుడ్డలువేసి తాఁటికమ్మచీరి యందులో నీగుడ్డ పెట్టి పొట్లములుగాఁ జుట్టి గట్టి పైని పేడపూసి బాలు రెండఁబెట్టుకొను చుండిరి. వృద్ధు లగువారు తాఁటియాకుల యీనెలఁదీసి చిత్రముగా కత్తిరించి యడ్డముగా నొకయాకును నిలువుగా నొక యాకునువేసి గుమ్మడిపండులఁగట్టి వ్రేలాడఁదీయుచుండిరి. పురుషు లందఱు తమతమ గుమ్మముల ముందఱ నరఁటిచెట్లు తెగఁ

V.R. NARLA MEMORIAL LIBRARY
V.R. NARLA
D.P.R.I.
Acc. No.

ఐదవప్రకరణము.

గొట్టించియు బొప్పాయిచెట్లు నఱికించి పాతించి వానికి వెదురుకఱ్ఱముక్క
1 లను దిగఁగొట్టించి వానిమీఁదఁ బ్రమిదలను ...మట్టి గురుజులను
బెట్టించి యంతతోఁ దృప్తిఁబొందక రెండువీధియరుగుల... గడలను
బాతించి వాని కడ్డముగ వెదురుకఱ్ఱలను నాలుగైదంతస్తులుగఁ గట్టించి
వానిమీఁదఁ గుమ్మరివాండ్రు దెచ్చియిచ్చిన క్రొత్తప్రమిదలను బెట్టించు
చుండిరి. అప్పుడు సాయంకాలముకాఁగా నారాత్రి పెట్టఁబడు దీపముల
కాంతి ముందు తనకాంతి వెలవెలఁబోవునను సిగ్గుచేతనోయన సూర్యుఁ
డపరసముద్రముఁ బ్రవేశించెను. స్త్రీలందఱును మడిగట్టుకొని దీపములు
పెట్టిరి. ఆకాశమండలము నున్న నక్షత్రములెల్ల భూమండలమునఁ బ్రతి
ఫలించుచున్నట్లుదీపములు కోట్లకొలఁది వీథుల కిరుప్రక్కలను వెలయుచుఁ
దమ మధ్యను సువర్ణభూషణాలతోనున్న స్త్రీల యవయవములకపూర్వ
మైన లావణ్యము గలిగించుచు పట్టపగటియందువలె సమస్తవస్తువులను
గాన్పించుచు సొగసు మిగిలియుండెను. మహారాష్ట్రదేశ వర్తకులు
తమకొట్లనలంకరించి పళ్లెరములయందు వెండిబంగారు నాణెములనుంచి
ధనపూజఁ జేయుచుండ బ్రాహ్మణోత్తములు పూజఁజేయించి సంభా
వనల గ్రహించి బొజ్జల నాడించుకొనుచు నిండ్లకుఁ బోవుచుండిరి. ఈ
దీపికాసమూహమునకు వెఱచి యంధకార మంతయు వానివెనుక శరణా
ర్థము దాఁగియున్న దన్నట్లు క్రీనీడ దీపములవెనుక నుండెను. ఎక్కడఁ
జూచిన దీపములవెలుతురు నెక్కడఁ జూచిన రంగురంగుల మహ
తాబులకాంతియు నెచ్చోటఁగాంచిన నానందమును నేచాయఁగనుఁగొన్న
మహాధ్వనియు గ్రామమున నిండి యుండెను. బాలకులు కాల్చుట
కసమర్థులగుటచే నగ్నిబాణముల వెదురుకఱ్ఱలకుఁ గట్టించి కాల్పించు
తండ్రులును, చమత్కారముగాఁగాల్చుచిన్నబిడ్డలనుజూచి సంతోషించు
తల్లులును, వస్తువులయిపోయిన వని రోదనము చేయు బాలకులును,
భార్యల యొద్దను, తము రుంచిన వేశ్యకాంతల యొద్దను తమచమత్కార

మంతయుఁ జూపఁదలఁచి చిత్రవిచిత్రముగా నగ్నిబాణములఁగాల్చి వారి మెప్పు నొందుచున్న మహారసికులును, మార్గమునఁ బోవుచున్న జనుల కాళ్ళనడుమ తూటాలను సిసింద్రీలనువేసి వారు తత్తరపడి పరుగెత్తుచుండఁ జూచి యానందించు కొంటెవాండ్రును, సంభావనలకుఁ బోయి వచ్చుచు దూరమం దెక్కడనో కాలుచున్న యగ్నిబాణములఁ జూచి, తమయొద్దకు వచ్చుచున్నవని పరుగెత్తుపిరికిబ్రాహ్మణులును, చిన్నబట్టలఁ గట్టుకొని దుప్పటులఁగప్పుకొని వినోదముఁ జూడవచ్చిన శృంగార పురుషులును నడివీధులయందు ధూర్తు లగ్నిబాణములఁ గాల్చుటచేతఁ దమ గృహములు పరశురామప్రీతి యగునని భయఁపడి కేకలువేయు నార్తజనంబును, జనుల కుపకారము చేయఁదలంచి చేతులయందు నవనీత మంచుకొని శరీరములఁ గాల్చుకొనువారి కిచ్చునట్టి పుణ్యజనులును, గ్రామమం దంతటను, పిక్కటిలియుండిరి. ఊరున కుత్తరపుదిక్కుననున్న మందబయలుమీఁదికిఁ బోయి, మహావీరులందఱు నొకరిదేహములనొకరు తగులఁబెట్టుకొనుటకు రెండుకక్షులయిరి. మెడనుగట్టుకొన్న సంచిలోనుండి తూటాలనుదీసి కత్తితో పొరను దెగఁగోసి, జానకిత్రాటనున్న నిప్పుతో నంటించి రెండుచేతులను రెంటి నుంచుకొని నోటనొకటి పెట్టుకొని చిత్రవిచిత్రముగాఁద్రిప్పుచుఁ గూర్చుండియు, వంగియు, చేతనైన కసరతులఁ జేయుచు వానిని గొందఱు కాల్చుచుండిరి. తోలుచేతులు దొడుగుకొని లాగులను గట్టుకొని, తలలకు టోపీలఁ దాల్చి, తమ కెన్నఁడుపకారము చేయక యాదినమునమాత్ర మెదుటికక్షులో నిల్చిన జనులమీఁద వెలగకాయలు, గారకాయలు, తూటాలును, విసరివారిదేహములనుగాల్చుచు, వారు తమమీఁదవైచిన వానిని మరల నంది పుచ్చుకొని యుపయోగించుచు, మధ్యమధ్య నంటుకొన్నసంచులను తెగఁగొట్టి పారవైచుచు, దేహములను గాల్చుకొన్న తమమిత్రుల నిండ్లకుఁ బంపుచుఁ దమదగ్గఱి సరకు ముగిసినవెనుక స్నేహితులవద్ద పుచ్చుకొనుచు, చంకలక్రిందనున్న

పొట్టికఱ్ఱలతో నెదుటివారు ప్రయోగించిన వాని నాఁపు చేసికొనుచు, మీఁదికి బాణము వచ్చునప్పుడు పరుగెత్తుచుఁ గోయుటకు వ్యవస్థచాలక తూటాలను నోటితోఁ గీలుచు, చూచుటకువచ్చిన జనసమూహమును బరుగెత్తించుచుఁ గొందఱు వినోదసముద్రమగ్నులైరి. ఆసమయమునం దాభూమి కేవలమహాగ్నిహోత్రమయమై నిప్పులఁగ్రక్కు మనుష్యులతోఁ గూడి యాగ్నేయాది మహాస్త్రసమేతమగు రామరావణ మహాభారత యుద్ధభూములవలెఁ దేజోవంతమై యతిభయంకరమై ప్రజ్వరిల్లుచుండెను. అప్పుడు రామచంద్రుఁడును, వెంకటరత్నమును, రాజగోపాలమును, చూచుటకువచ్చి దూరముగా నిలుచుండిరిగాని యొకగారకాయ మహావేగముతో రాజగోపాలుమీఁదికివచ్చెను. అదిచూచి రామచంద్రుఁడు తనప్రాణమునకు వెఱవక స్నేహితునిమీఁదికి వచ్చుచున్న యాకాయ కెదురుగాఁ బోయి చేతికఱ్ఱతో దానిని గొట్టెను. అది వెంటనే పగుల రామచంద్రుఁడు శరీరమునిండ యగ్నిహోత్రపుముద్దలు పడెను. వెంటనే బట్ట యంటుకొన్నందున రామచంద్రుఁడు పరుగెత్తఁగా గాలితగిలి మఱి కొంచె మంటుకొనెను. అప్పుడు రాజగోపాల మతనినాఁపి చేతితో నలిపి నైచెనుగాని శరీరమం దక్కడక్కడ కాలెను. వెంకటరత్నము మంచి యుద్దేశము చేతనే త్వరగా బాధ నివారణ కావలెనని కొంచెము నీళ్లు మీఁదఁబోసెను. అంతట బాధపోవుటకుబదులుగాఁ గాలినచోట వెంటనే పొక్కులెక్కి బాధద్విగుణ మయ్యెను దఱువాత వారందఱు నింటికిఁ బోగా శరభరాజుగారు నవనీతమును దెప్పించి శరీరమంతటఁ గాలినచోట్ల పట్టించి వారి నాఘోరసమయమునందు నిర్భయముగా వీధులయందుఁ ద్రిప్పిన పఱచుతనపు గర్వమును నిందించుచుఁ దనకుమారుని రక్షించిన రామచంద్రుని ధైర్యసాహసాదుల కాశ్చర్యపడెను. రామచంద్రుని శరీరమున బాధ నెలనాఁటికిఁ గుదిరెను.

ఆఱవ ప్రకరణము.

పార్వతి వివాహవిషయమై శరభరాజుగారు బెంగపెట్టుకొనిరి. పిల్లకు దాదాఁపు పదిసంవత్సరములు వెళ్ళవచ్చినను తగిన సంబంధ మెక్కడను దొరకక పోవుటయేగాక, యింట నొకరి యభిప్రాయముతో నొకరి యభిప్రాయ మేకీభవించుట లేదు. భాగ్యవంతులగు నియోగు లందఱు తమ కుమారులు, కురూపులై, విద్యావిహీనులై యేవిషయము నందును పార్వతితోఁ బోలకున్నను రెండువేలరూపాయలు, వెయ్యిన్నూట పదార్లు కట్నమునిచ్చినఁగాని, శరభరాజుగారి పిల్లను జేసికొనమని చెప్పుచుండిరి. సత్సంప్రదాయమునఁబుట్టి ప్రస్తుతము కొంచెము నీరసపు స్థితిలోనున్న నియోగులు, శరభరాజుగారితో వియ్య మందవలెననుకొన్నను తమస్థితికిని వారిస్థితికిని గల తారతమ్యమును బట్టి తమకు వారు పిల్ల నియ్యరని యడుగుటకు సందేహించి యూరకుండిరి. శరభరాజుగారి తల్లి 'పిల్లకట్టుతప్పిపోవుచున్నది. మన మందఱము గంగాప్రవేశము జేయవలసివచ్చును. త్వరగా ముడిపెట్టు' మని తొందరచేయుచుఁ, గట్న మెంతయిచ్చినను సరే కొంచె మన్నవస్త్రములకు లోపములేనివారి కియ్యవలెనని చెప్పుచుండెను. రాజగోపాలము రామచంద్రునకు తనచెల్లెలి నిప్పించవలెనని తల్లిదండ్రులతో నప్పుడప్పు డామాట చూఁచాయగాఁ జెప్పుచువచ్చెను. శరభరాజుగారు విశ్వనాథశాస్త్రులవారితో, కుమార్తె వివాహవిషయమై ప్రసంగించినపుడు శాస్త్రులవారును, రామచంద్రుని గుణములశ్లాఘించి యతనిని తమమనసులోనుంచుకొనియన్యాపదేశముగ "భాగ్యవంతులను బ్రతిమలాడుటకంటె బీదవాని కిచ్చుటే మంచిది" యని చెప్పుచు వచ్చిరి. శరభరాజుగారును పిల్లను, ధనమునుఁగూడ గ్రహించి తెగనీల్గి సకలహింసలఁ బెట్టునట్టి భాగ్యవంతులను రాక్షసులతో

వేఁగుట కష్టమని యెంచి కుమార్తె యొక్కతే గనుక, తమకు
లోకువయైనవాని కెవ్వనికైన నిచ్చి పెండ్లిచేసి యల్లు నిల్లరిక ముంచుఁ
దలఁచుకొనుభాగ్యముతప్ప, తక్కినశుభలక్షణములన్నియు రామచంద్రు
నియం దుండుటచేత నతనికిఁ బార్వతి నీయఁదలంచి యావార్త తల్లి కె
ఱుఁగఁజేయఁగా నామె ప్రతిదినమును కలహమాడుచుఁ గోడలును గోసి
పెట్టుచు, రామచంద్రుని దిట్టుచు, తన వార్ధకలక్షణములన్నియుఁ జూ
పుచుండెను. వెంకటరత్నము వివాహ మెట్లయిన కానీయకుండవలె
నని మనసులో సంకల్పించుకొని సహజముగ వీనియం దయిష్టముగల
శరభరాజుగారితల్లిచెవిలో విషపుమాటలఁ జెప్పి యామె కసహ్య మె
క్కువ చేయసాగెను. చుట్టుప్రక్కలనున్న యమ్మలక్కలందఱు, పార్వతి
కనఁబడునపుడెల్ల "ఓహో హో! రామచంద్రునిగారిభార్య కాఁబోలు?
మాచిరాజువారికోడలా?" యని పరిహాసముచేయ నారంభించిరి. వారలట్ల
నుకొనుట మొదలదివఱకు రామచంద్రునితో స్వేచ్ఛగా మాటాడు
చున్నపార్వతి కెక్కడనుండియో మిక్కిలిసిగ్గువచ్చి మాటలాడుటమానెను.
మాటలుపోఁగానే చూపులుకూడ తప్పెను. తనస్నేహితు లెవరైనఁ ద
న్నాలాగు నన్నప్పుడు వారితోఁ గలహమాడుచు, పెద్దలున్నపుడు సిగ్గునఁ
దలవంచుకొనుచు, తల్లిదండ్రుల దగ్గఱనెవరైన హాస్యమాడునపుడు వా
రిచాటునకుఁబోవుచుఁ బార్వతి లజ్జాచిహ్నములఁ గనుపఱచుచుండెను.
అదిగాక త్రోవలో రామచంద్రుఁడు తారసిలినపుడు తలుపుచాటునకై
నను, గోడమూలకునైనను నొదుఁగుచువచ్చెను. రామచంద్రుఁడు తన
స్నేహితులు తన్ను పార్వతిమగఁ డనుటచేత కొంచెము సిగ్గుగల్గి తానే
వస్తువైనఁ బార్వతినడుగవలసివచ్చినపుడు ముభావముగ నడుగుచువచ్చెను.
ఆమెయు గోడచాటుననుండి ముసిముసినవ్వులు నవ్వుచు ముభావముగనే
ప్రత్యుత్తరము జెప్పుచువచ్చెను. అది యట్లుండ శరభరాజుగారొక
నాఁడు మధ్యాహ్నము నిద్రలేచి గదిలోమంచముమీఁదఁగూర్చుండఁగా,

కృష్ణవేణమ్మ తలుపునకుఁ జేరగిలఁబడి నిలుచుండెను. వెంకటరత్నము కూడ నక్కడ నొకబల్లమీఁదఁ గూర్చుండెను. వారిట్లుమాటాడిరి.

శర—ఏమిరా వెంకటరత్నము! జ్యేష్ఠమాసమునందు తప్పకుండా పార్వతికి వివాహము జేయవలెను. రామచంద్రున కియ్యడము నీ కిష్టమేనా?

వెంక—నాయిష్టము చెల్లఁగలదా! అదిగో మావదినె యున్నది గదా. ఆమె నడగండి.

కృష్ణ—నామాట పాటికిరాదు. మీయన్నగారు మీరు నాలోచించండి మీకిష్టమైన సంబంధమే నాకిష్టమైన సంబంధము.

శర—అయ్యో! మనమంతాకూడా కూడఁబలుకుకొననద్దూ. వాఁడు సద్గుణములు గలవాఁడు, బుద్ధిమంతుఁడులాగే కనుపడుతాఁడు.

వెంక—అగఁబడుటమాత్రమే. నామనమున కతని కివ్వడము మంచిదికాదని తోఁచుచున్నది. ఏమిటండీ? కూడు గుడ్డలేక యిల్లువాకిలి లేక పొట్టకూటికిఁ జేరిన నిర్భాగ్యునకు మాణిక్యమువంటి పిల్లను గట్టిపెడుతామంటారు? ఎవరైన నవ్వరఁటయ్యా? యావజ్జీవ మాపిల్ల మన జీవమున కుసూరుమనిపోదూ?

శర—అదృష్టమున్నపక్షమున వాఁడే బాగుపడుతాఁడు. లక్ష రూపాయల యాస్తియున్నవాఁడికిచ్చినా, యదృష్టముచాలకపోతే ముష్టి చెంబు చేతికి వస్తుంది. [నటయ్యా!

వెంక—ఆలాగని ముష్టిముండా కొడుకునకుఁ గట్టిపెట్టవచ్చు

కృష్ణ—ఏలా గాలోచనచేసినా సరే పిల్లయదిపేదది. కష్టమున కోర్వలేదు. పనిపాటులు చేయనక్కఱలేకుండాయుండే యిల్లుచూచి యివ్వండి.

ఇంతలో రాజగోపాలమువచ్చి "బాబయ్యా! నాగరాజుమామ గారు వచ్చినారు" అనిచెప్పెను. తోడనే శరభరాజుగారు కృష్ణవేణమ్మను

లోపలికి వెళ్లుమని తానెదురుగాఁబోయి, మూలనున్న తివాసి వెంకటరత్నముచేత చావడిలో వేయించి నాగరాజుగారినిజూచి "బావగారు! దయచేయండి" అని తివాసిమీఁదఁ గూర్చుండఁబెట్టెను. వారి కీ క్రిందిసంభాషణ జరిగెను.

శర—బావగారు! అక్కయ్యా పిల్లలూ సంతోషముగా [నున్నారా?

నాగ—మీదయవల్ల బాగానున్నారు. మీకు శరీరములో సుఖముగా నున్నదా?

శర—సుఖముగానే యున్నది. మీ రేపనిమీఁద దయచేసినారు?

నాగ—పని యేమున్నది. మీలోపల కార్యమీయేఁడు చేయవలెనుగదా. మీకు మాకు మూఁడుతరములనుండి సంబంధములువిడిపోకుండా కలిసి వచ్చుచున్నవి. మాకంటె మీకత్యావశ్యులు వేఱేలేరు. మీయిష్టమువచ్చిన యంత వరదక్షిణ యిచ్చి మీపిల్లను మాపిల్లవానికివ్వండి.

వెంక—ఔను. వీఁడిపిల్లవానిని నేను జూచినాను. మనపార్వతికంటె నాలుగేండ్లు పెద్దకాని పిల్లవాఁడు కొంచెము పొట్టికుఱ్ఱవాఁడు తెలివిగలవాఁడు.

శర—ఏమిచదువుకొనుచున్నాఁడు. ఆంధ్రమా? గీర్వాణమా

నాగ—చదువునకేమి నాలుగయిదేండ్లయినది రఘువంశమారంభించినాఁడు; కాని మధ్యమధ్య నభ్యంతరములువచ్చి మానుట చేత విస్తారము జదువలేదు. అయినా వాని యీడుకుఁ దగినచదువున్నది.

శర—ఈయేఁడు వివాహముచేయుట తప్పదు. ఒకనెలలోపుగా మీకు వర్తమానము నంపుతాను.

నాగ—మీయమ్మగా రెక్కడ నున్నారు?

వెంక—"ఆమె పరున్నది. నేను వెళ్ళి లేపుతానుండండి" అని వెళ్ళి వెంకటరత్న మన్నపూర్ణమ్మను లేపి నాగరాజుగారు వచ్చినా

చెప్పఁగానే యామె లేచి యొక గదిలోనికి వెళ్ళి రెండు రెక్కతలుపులలో నొకతలుపుఁదీసి రెండవతలుపుచాటునఁ గూర్చుండెను. అంతలో నాగ రాజువచ్చి గదియవతల గోడదగ్గఱఁ గూర్చుండెను. తోడనే యన్నపూ ర్ణమ్మ యెలుఁగెత్తి “అయ్యో! కూఁతురా! ఎంతపనిచేస్తివే యమ్మా నాకడుపులో చిచ్చు పెట్టిపోతివేయమ్మా” అని రోదన మారంభించెను.

నాగ—అత్తా! ఊరుకో. ఇది యొకనాఁటితో పోయేదికాదు. నీ వున్నన్నాళ్ళు నీలాగున నుండేదే. పెద్దదానవైనందుకు వాళ్ళచేతి మీఁదుగా నీవుప్పుదాఁటలేదు.

అన్న నాగరాజుతండ్రీ! చెట్టంతబిడ్డను దిగమ్రింగి సిగ్గులేక తిరుగుచున్నాను.

నాగ—నీవు కడుపగలకు. ఆపిల్లలను బెట్టుకొని కాలక్షేపము చే యవలయునుగాని దుఃఖపడితే కార్యమే మున్నది? చచ్చినవాళ్లు లేచి రారుగదా?

అని నాగరాజుచెప్పఁగా విని దుఃఖమును జాలించి గద్గదస్వర ముతో నన్నపూర్ణమ్మ—నాయనా! కుఱ్ఱవాఁడికిఁ బెండ్లయినదీ? నాకే సంగతీ తెలియడములేదు.

నాగ—కాలేదు. శరభరాజుగారితోఁ జెప్పి మీఁపార్వతిని మా పిల్లవానికి యిప్పించు. కలిసిన సంబంధము విడఁగొట్టఁగూడదు.

అన్న—శరభరాజూ పెళ్ళామూ యున్నారు. వాళ్ళయిష్టమేగాని నాపెత్తనమే మున్నది? సగముచచ్చి నేనున్నాను. మునుపటి యన్న పూర్ణమ్మను గాను. నామాట వింటారా నాయనా? లోపములేకుండా చెప్పతాను.

నాగ—సరే యోగమున్నపక్షమున కాకమానదు. నేను వెళ్ళు తాను. అనిచెప్పి శరభరాజుగారియొద్ద సెలవుపుచ్చుకొని వెళ్లిపోయెను. అన్నపూర్ణమ్మయేడ్చినకారణమిది. అప్పటికి రమారమి పదునొకండు

సంవత్సరములక్రిందట నన్నపూర్ణమ్మకూఁతురు పార్వతి చనిపోయినది. అప్పటినుండి నాగరాజెన్నఁడు నామెను జూచి పరామర్శ చేయలేదు. కూఁతురుపోయినతరువాత నాగరాజామెనుజూచుటకదే ప్రథమముగావున తనకూఁతు రాదినముననే చచ్చినట్లు రానిదుఃఖమును దెచ్చుకొని యొక విధముగా నన్నపూర్ణమ్మ సంప్రదాయమును నిలిపెను. తరువాత జాము ప్రొద్దుండగాఁ జుట్టుప్రక్కలనున్న స్త్రీలందఱు శరభరాజుగారి యింటి కెప్పటివలెనే వచ్చుచుండిరి. అన్నపూర్ణమ్మ తులిసికోట దగ్గఱ తాటియాకులవత్తులపెట్టె ముందుంచుకొని వత్తులఁ జేసికొనుచుండెను. కృష్ణవేణమ్మ మొక్కలపీటమీఁదఁ గూర్చుండి నరసింహామునకు జడ వేయుచుండెను. అప్పుడు రంగమ్మవచ్చి యిట్లనెను.

రంగ—అన్నపూర్ణమ్మత్తా! నీమనుమరాలికిఁ బెండ్లివారు వచ్చినారఁట. చెప్పనే చెప్పవయితివి?

అన్న—ఏమిగడుసుదానవే యమ్మా? ఇంకా వచ్చికూర్చొనేనా లేదు. ఇంతలోనే యెప్పుడు చెప్పను? [యేమిటి.

రంగ—అయినా మనుమరాలిపెండ్లిముందర నీకుకనఁబడతామా

అన్న—మరే, పెండ్లియంతా నామొగము మీఁదనే నడుస్తుంది. మధ్యనాకుగర్వ మెందుకు? ఆవూ దూడా యుండఁగా గుంజార్చిన దఁట.

రంగ—అలాగనకత్తా. పెద్దదానవు. ఈచలవంతా నీది. నీతరువాతనే యెవరైనా. అయితే యేమినగలు పెడుతా మన్నారు?

అన్న—నాకు తెలియదు. ఆసంబంధము వీరికి సరిపడదమ్మా. మాయింట నున్న రామచంద్రునికిస్తారఁట. ఈలాటిసంబంధము దొరకదని కోరితెచ్చినారు.

ఇంతలో మంగమ్మ వచ్చెను.

రంగ—మంగమ్మా! విన్నావఁటమ్మా, వీళ్ళ పార్వతిని రామచంద్రుఁ డన్నపిల్లవాఁడి కిస్తారఁట.

మంగ—(బుగ్గను చేయి పెట్టుకొని) అయ్యో పిల్లవానికా? ముష్టి సంబంధ మదేమిసంబంధమమ్మా. కొంచె మైనయింటివానికి పిల్లనియ్య వలెనుగాని వీని కేమిటి? పిల్ల యేమిటి?

అప్పుడు పాపమ్మ వచ్చి కూర్చుండి యిట్లుమాటాడ నారంభించెను.

పాప—కృష్ణవేణమ్మా! నీకూఁతురిని రామచంద్రుని కివ్వడము నిజమేనా?

కృష్ణ—నా కేమి తెలుసును మాయత్తగారున్నారు. తల్లీకొడుకూ యోజించి యెవరి కిచ్చుకొంటారో. నా కెందుకమ్మా ! నామాట వినేవా రెవరు!

అన్న—పైకి నాపెత్తనము. మగఁడూ, పెళ్ళాము, కూడఁబలుకుకొని చేస్తారమ్మా. నామాట లక్ష్యమెవరికి? నేనింత పిడచదానినే.

రంగ—నీకేమి యదృష్టవంతురాలవు. మనుమలు, మనుమరాండ్రు నీకేమమ్మా.

ఇంతలో శరభరాజుగారు వచ్చి 'అమ్మా' యని పిలువఁగానే తల్లి వెళ్లిపోయెను. అప్పుడు కుడిపైటను వేసికొని జానికమ్మ వచ్చికృష్ణ వేణమ్మా! నీకూఁతురికి పెండ్లిచేస్తారట. మీవారిబొజ్జ కలుగుతుంది.

కృష్ణ—నాబ్రతు కేలా గున్నదో విహహ మాలాగున్నది.

రంగ—ఓవిడా కృష్ణవేణమ్మ! మీయింటి కెవరమ్మా వచ్చినారు. అప్ప డేష్చినవా రెవరు.

కృష్ణ—మాయింటికిబంధువులు వచ్చినారు. మాయత్తగారికూఁతురు పోయినతరువా తామెను పరామరిశ చేయలేదు. అందుచేత నా విశ దుఃఖపడినది. జానకమ్మా యేమైనా పాటలు పాడుదూ. నీకంఠము బాగా సన్నముగా నుంటుంది.

రంగ—లంకాయాగము పాడవో.

మంగ—గోవిందనామములు పాడవమ్మా. నీకు బాగావచ్చును.

పాప—సీతసమర్త పాడవమ్మా. కొంతసేపదిపాడి తరువాత దక్షునియజ్ఞము పాడవచ్చును.

జాన—మీరు పదుచువాళ్ళు పదుచుపాటలు పాడమంటారు. కృష్ణారామాయని రెండుముక్క లనుకోనివ్వరుగదా. తరుణోపాయము చూచుకొనవద్దంటమ్మా? గోవిందనామములు పాడుతాను. మొన్నపాడి వదలిపెట్టిన దగ్గఱ నుంచి పాడుతాను.

"ఉగ్రుడైన శత్రుఘ్నుండు గోవిందారామ

కండ్లెఱ్ఱఁజేసెను గోవిందా

కండ్లు తెఱవని పసిబాల గోవిందారామ

శ్రుతకీర్తి కడుపగులునేమో గోవిందా

అంతట పాటలు వినకుండనే పాపమ్మ యిట్లు మాటాడ నారంభించెను.

పాప—మంగమ్మా! నీకూఁతురికి నెలతప్పినదఁట. నిజమేనఁటో?

మంగ—అప్పుడే యేలాగు తెలిసిన దమ్మా. ఎంతదాఁచవలెనన్నా దాఁగదు. మాకర్మము. నీకు వీరమ్మచెప్పినదాయేమి పెద్దదిగదా యని వీరమ్మతోఁ జెప్పినాను.

రంగ—వింటే నేమమ్మ. ఇంతలో తప్పా? విని సంతోషించే వాళ్ళముగాని విచారించము. పోసీ నాకెందుకమ్మా? జానకమ్మా! పాట పాడవమ్మా. ఈగోడవ లెప్పుడూ యిలాగుండేవే.

పాప—నీకు మనుమశాలు పుట్టినపక్షమున నాకొడుక్కిప్పించవమ్మా. కలిసినవాళ్ళము.

మంగ—నీకొడుకు పాతికయేండ్లవాఁడు. ఏలాగున నివ్వగలమమ్మా?

పాప—అదొకపెద్దంటమ్మా? నామగనికి నాకు ముప్పదియేండ్లు

హెచ్చుతగ్గు. నేనాఱునెలల పిల్లనై యుండఁగా మాతల్లినన్ను జేతిలోఁ బెట్టుకొని పెండ్లి చేసినది.

మంగ—మాపిల్లను మేమియ్యము. మీకున్న భాగ్యములకుఁ దోషు పిల్లకూడానా?

పాప—(కోపముతో) నీపిల్లయెంత నీవెంత. ముష్టిపిల్లనెవరికి కావలెను. నీభాగ్యము నీది నాభాగ్యము నాది. నాకొడుకు పెండ్లిగాకపోతే బ్రహ్మచారి యయి యుంటాడు.

మంగ—బ్రహ్మచారికాకపోతే సన్యాస మిప్పించుకో నాకేమి?

పాత—అట్టేమాటలు రానీకు. కావలిస్తే నీకొడుకుకు సన్యాస మిప్పించుకో (కృష్ణవేణమ్మవైపు దిరిగి) చూచినారమ్మా. నే నన్నమాటలలో తప్పేమున్నది. లోపముంటే నానోటిలో గడ్డిపెట్టండి.

మంగ—కృష్ణవేణమ్మగారు! దీనికి వచ్చినయేం డ్లెవరికి వచ్చినవమ్మా? ఆవిడన్నమాటలు విన్నారా?

కృష్ణ—ఆలులేదు చూలులేదు. కొడుకుపేరుసోమలింగమన్నట్లు మొదలు పిల్లపుట్టనై నా లేదు. దెబ్బలాట లెందుకు? ఊరుకొండమ్మా. అవతలచావడిలో మావారున్నారు. ఆనక నాగొంతుకు పిసికి చంపుతారు.

రంగ—నేవెళ్ళిపోతానమ్మ సాయంకాలమైనది. సంధెగుమ్మము లూడ్చుకోవలెను.

ఇట్లు మూర్ఖురాండ్రగు స్త్రీలు వృథాప్రసంగములతోడను, వ్యర్థకలహములతోడను, నసంబద్ధప్రలాపములతోడను కాలము గడపి యిండ్లకుఁబోయిరి. అన్నపూర్ణమ్మకు రామచంద్రునియందు కోపము నిర్హేతుకముగానే వచ్చినది. రామచంద్రునియందేమియు లోపము లేకున్నను, వెంకటరత్నముతోడి సహవాసముచేతనతనికిఁ గొన్నిక్రొత్త కష్టములుగూడ వచ్చెను. ఒకనాఁడు జాముప్రొద్దెక్కినతరువాత, శరభ

రాజుగారుచావడిలోఁ గూర్చున్నప్పుడు బ్రాహ్మణుఁ డొకఁడువిరిగిన కంటెను జేతఁబట్టుకొని, తాయి నూడఁదీసిన యొకయుంగరమును బుచ్చుకొని యతిత్వరితముగా వచ్చి శరభరాజుగారి యెదుట నిలిచి యీప్రకారముఁగాఁ జెప్పనారంభించెను.

బ్రాహ్మ—అయ్యా! శరభరాజుగారు! చూచినారా, మీయింట నున్న పిల్లవాఁడు చేసినపని.

శర—ఎవరు? మారామచంద్రుఁడా? ఏమిపనిఁ జేసినాఁడు?

బ్రాహ్మ—రెండునెలలక్రిందట నాకొక కంటెను, తాయిచెక్కిన యుంగరమును దెచ్చి యమ్మినాఁడు. ఆపిల్లవాఁడు మీయింటిదగ్గఱనున్నవాఁడేకదాయని నేను సందేహింపక యావస్తువులను కొన్నాను. అది కరిగించగా యిత్తడివస్తువై పోయినది. ఇత్తడికంటె నాకమ్మినాఁడు. ఇదివజ్రమని యుంగరములో తాయిచూపించినాఁడు. ఇదేదోగాజురాయి. నా కొంప తీర్చినాఁడు. వ్యాయవారము చేసిచేసి యాచించిన సొమ్ముపెట్టి యీనగలు కొనుక్కొన్నాను.

ఈమాటలు వినఁగానే శరభరాజుగారాశ్చర్యపడి, రాజగోపాలమును బిలిచి యతని కేమయిన నీసంగతి తెలియునేమోయని యడిగెను. కాని యతఁడును మహాశ్చర్యనిమగ్నుఁడై తానెఱుఁగనని చెప్పఁగారామచంద్రుని బిలువుమని యాతనికి శరభరాజుగా రాజ్ఞనిచ్చిరి. రామచంద్రుఁడును స్వచ్ఛమైన మనస్సుతోను, భయముతో వెలవెలబాఱు మొగముతోను వచ్చి శరభరాజుగారియెదుటఁ గూర్చుండెను. అతనిఁ జూడఁగానే బ్రాహ్మణుఁడు గుండెబాదుకొని "ఎంతవాఁడవురా నాయనా! నాకొంపతీర్చినావురా" యని యఱచెను. శరభరాజుగా రావస్తువును జేతఁబట్టుకొని యతనిమీఁదవచ్చిన యీనేరమునంతను జెప్పి యిట్లని మాటలాడ నారంభించెను.

శర—రామచంద్రుఁడూ! ఈవిషయములో నిజముచెప్పు. ఈ

వస్తువులను నీవీబ్రాహ్మణున కమ్మినావా లేదా?

రామ—ఈవస్తువులను నేనీబ్రాహ్మణునకు విక్రయించినాను.

బ్రాహ్మ—చిత్తగించండి. నే నబద్ధమాడలేదు. అయ్యో! అయ్యో! చంపినావురా.

రామ—వెంకటరత్నముగారిని బిలిపించండి. రాజగోపాలము! వెంకటరత్నముగారిని దీసికొనిరావయ్యా.

అనిరామచంద్రుఁడు చెప్పఁగా రాజగోపాలము వెంకటరత్నమును దీసికొనివచ్చెను.

రామ—అయ్యా! నేను దీనిరహస్యమంతయు మీకుఁ దెలియఁ జెప్పెదను వినండి. రెండునెలలక్రిందట నొకనాఁటిరాత్రి నేను దీపమువెలుఁగునఁగూర్చుండి చదువుకొనుచుండఁగా, వెంకటరత్నముగారు నన్ను బిలిచి సూర్యనారాయణగారి చేతిలోనుండి యీవస్తువులను బుచ్చుకొని నన్నమ్మిపెట్టుమన్నారు—

వెంక—ఛీ! నోరుముయ్యి. నామీఁద—

శర—(మాటకడ్డమువచ్చి) ఆతఁడు చెప్పదలఁచుకొన్నదంతా చెప్పనియ్యి. ఆసూర్యనారాయణ యెవరు. అతని దేగ్రామము? వారి యింటిపే రెవరు?

రామ—ఆయనయింటిపేరు నేనెఱుఁగను. ఆయన కోటిపల్లి కాఁపురస్థుఁడనియు, మిక్కిలిగొప్పవారనియు నాతో వెంకటరత్నముగారుచెప్పి నాచేత నీవస్తువుల నమ్మించిరి.

శర—వెంకటరత్నము! నీవేమెఱుఁగుదువు?

వెంక—అన్నయ్యా! వస్తువులను కొన్నవాఁడు దగ్గఱనున్నాఁడు గదా! నే నమ్మినానో, నేరముచేసినానో అందులో నాజోక్య మున్నదేమో కనుక్కోండి. నేనిందులో నాప్రమాణముగా నేపాపము నెఱుఁగను. ఆసూర్యనారాయణ యెవరో యిప్పుడు వినుచున్నాను.

రామ—నాప్రమాణముగా నేనింతకంటె నేమియు నెఱుఁగను. ఆవస్తువులు నావికావు. నన్ను మీచిత్తమువచ్చినట్లు శిక్షచేయవచ్చును. కాని న్యాయము కనఁగొనండి.

బ్రహ్మ—అయ్యో! ఈపనియంత రామచంద్రునిదేకాని మఱి యొకరిదికాదు. వెంకటరత్నముగారు దీనిలో నేమియు నెఱుఁగరు.

రాజ—బాబయ్యా! ఈవిషయము పూర్తిగా విచారించినగాని యేపని చేయవద్దు.

శర—విచారించుట కేమున్నది. వస్తువుల నమ్మినవాఁడు రామచంద్రుఁడే. ఇటువంటి దొంగపిల్లవానిని మనయింటఁ బెట్టుకొనుట మనకు ముప్పే.

వెంక—మహారాజులాగు మీరింతయన్నము బట్టపెట్టి సంరక్షణ చేయుచున్నందుకుఁ దినియుండలేక దొంగపనిఁ జేయ మొదలుపెట్టినాఁడు. తినఁగాతినఁగా గారెలు చేదైనవఁట. ఓరీ రామచంద్రుఁడు! నీకంత డబ్బు కావలసినపక్షమున వారి నడిగితే వారేయిత్తురుగదా. దొంగగడ్డి తిని మామీఁదఁగూడ నేరము పెట్టవలెనని యనుకొన్నావు. నేను లేచిన వేళ మంచిదే.

బ్రహ్మ—ఓరీ దిక్కుమాలిన ముండాకొడుకా! నాకు నీవు డబ్బెక్కడనుండి తెచ్చియివ్వఁగలవు? శరభరాజుగారు! మీ రింటిలోనుండి యీనిర్భాగ్యుని లేవఁగొట్టివేసెదరు సరే నాడబ్బుమాట యేమిటి? నే నింక నీళ్ళు వదులుకోవలసినదేనా?

శర—నేనేమిచేయను.

బ్రహ్మ—అయ్యో! అయ్యో! నూటయేబదిరూపాయలు నీ పిండాకుడు మీఁదఁ బెట్టినాను. నీజీవమున కుసూరున యేడ్చుచున్నాను. (అని యేడ్వఁజొచ్చెను.)

ఇంతలో నొకదాసి చేతితోఁ జీటిఁ బట్టుకొనివచ్చి "రామ

చంద్రుఁడుగా రెక్కడ నున్నారండి" యనియడిగెను.

శర—ఎందుకు? ఆచేతిలోని చీటి యేమిటి?

దాసి—మాయమ్మగా రుత్తరమిచ్చినారు. ఆయనకేగాని నే నివ్వను.

శర—మీయమ్మగా రెవరు? నీవెవరిదాసివి?

దాసి—చంద్రముఖమ్మగా రిచ్చినారు. ఆయన యెక్కడండీ.

శర—ఆచీటి యిలాగియ్యి (అని లాగికొని చదువుచున్నాఁడు) "ప్రాణేశ్వరా! మీరు వ్రాసినయుత్తర మందినది. ఈవేళ సాయంకాలము మీరును రాజగోపాలముగారును రావచ్చును. వెంకటరత్నముగారపు డింటివద్దనుండరు." అనిచదివి యిదేమిటి? భోగముదానికుత్తరములువ్రాసి తెప్పించుకొనుటఁగూడ సాగించినావు. విధవా! రాజగోపాలము! అతఁడు, నీవు, చేసినస్నేహమిందుకా? ఓరి దౌర్భాగ్యుఁడా! ఆవిధవనుగూడి చెడిపోయినావా?

రామ—అయ్యా! నేనెన్నఁడు దానికుత్తరమువ్రాయలేదు. ఇది యంతయు వెంకటరత్నముగారి మాయోపాయము. నేనేమియు నెఱుఁగను.

శర—వెంకటరత్నము! ఇతఁడువ్రాసిన యుత్తరముతోఁగూడ చంద్రముఖిని దీసికొనిరా.

తోడనే వెంకటరత్నము రామచంద్రునికి జరిగిన మహాపరాభవమునకు సంతోషించుచుఁ దన ప్రియురాలిని బిలుచుకొనివచ్చి వారియెదుట నిలువఁబెట్టెను.

శర—ఏమే చంద్రముఖీ! నీకితఁడుత్తరమును వ్రాసినాఁడా?

చంద్ర—(తలవంచి) వ్రాసినారండి. ఇదిగో నాయుత్తరము.

శర—(తీసి, పుచ్చుకొని యిట్లు చదివెను,)

"నీవు నాకీవేళ నొక్కమాఱు మొగముఁజూపించి తిరిగి లోపలకు

వెళ్ళినావు నీతో మాట్లాడవలెననియున్నది. నీకు వీలెప్పుడో తెలియఁ జేసినపక్షమున నేను తప్పక వస్తాను. నీతో మాట్లాడకుండ నేనుండ లేను." ఈవెనుకటి యుత్తరమును చదువఁగానే శరభరాజుగారు రామ చంద్రునితో నిట్లనెను.

శర—రామచంద్రుఁడూ! నీవ్రాఁత యవునా కాదా ?

రామ—వ్రాఁతనాదేకాని, వెంకటరత్నముగారు తన మేనల్లునకు నాచేవ్రాయించినారు. పైపేరును, క్రిందవ్రాలు నక్కఱలేదన్నారు.

చంద్రి—ఈయుత్తరము నాకీదాసి పట్టుకొనివచ్చినదండి.

శర—ఏమే! దాసీదానా, నీకీయుత్తర మెవరిచ్చినారు ?

దాసీ—ఆబాపనయ్య నాచేతికిచ్చి మాయమ్మగారి కిమ్మన్నాడండి.

శర—ఏగుణములున్నను దొంగతనము, లంజతనము, లేకపోతే భరింపవచ్చును. కాని యవియున్న వానిని భరింపలేము. రామచంద్రుఁడూ! యీదినముమొదలు నీవు మాయింట నుండవద్దు. నీదారినీవు చూచుకో.

ఆమాట వినఁగానే రామచంద్రుఁడు తనమీఁద పిడుగుపడినట్లు దేహమెల్ల ఝల్లుమన దుఃఖము పట్టఁజాలక వీధిలోనికి లేచిపోయెను. ఇంతలో విశ్వనాథశాస్త్రిలవా రీసంగతి యంతయు వినవచ్చి కోపావేశముతో నోటమాటరాకయున్న శరభరాజుగారిని జూచి మాటలాడుట కదిసమయముగాదని కొంచెముసే పూరకుండెను.

శర—ఎంతపనిచేసినాడండి? ఏమో మంచివాఁడనుకొన్నాను.

వెంక—నేను మొదటినుండి యీలాగేయనుకొన్నాను. వానినాలి ముచ్చగుణములు, నంగినంగిమాటలు, దొంగచూపులు, నక్కవినయములుచూచి వీఁ డుత్తతుంటరియని నేనిదివఱకే యనుకొన్నాను. మీరే పొరబాటుపడినారు.

విశ్వ—ఇంతపనిచేసేవాఁడుకాఁడు. చిన్నతనముచేఁ బొరఁబడ వచ్చును.

వెంక—చిన్నతనమా వాఁ డెక్కడి చిన్నవాఁడు. టంకంధరణ మేళ్ళున్నవి. సిద్ధాన్నము బోర్లదోసికొన్నాఁడు. మీఁదుమిక్కిలి రాజగోపాలమునుగూడ చెఱుపుచున్నాఁడు. ఇంటతిని యింటివాసములు లెక్కపెట్టినాఁడు. ఎంతబాగుచేయఁ దలఁచుకొన్నాము. వానికియోగము లేదు.

శర—మాపార్వతిగొంతుకగోసినానుగాను నయమే. నామెత్తఁదనము లోఁగువగట్టి యిష్టమువచ్చినయాట లాడినాఁడు. దొంగతనము దాఁగదండి. చిత్రము.

వెంక—ఎప్పటికయినా పాపము బ్రద్దలవక మానదు.

బ్రహ్మ—అయ్యా! నే శలవుపుచ్చుకొని వెళ్ళనా శరభరాజుగారు నాకర్మమింతే. ఈసుండాకొడుకు నాకొఱకు దాపగించినాఁడు (అని వెళ్లెను.)

అందఱును రెండుజాము లయి నందున భోజనములకు లేచిరి. వెంకటరత్నము మాయోపాయమునందుఁ దనకుఁ గల ప్రజ్ఞనుజూపించి, యిత్తడివస్తువును, గాజుటాయి వేసిన యుంగరమును రామచంద్రుని చేత నమ్మించి రామచంద్రుఁ డాదినమున వ్రాసిన యుత్తరమును దాఁచి తుద కాలాగున చంద్రముఖి కతఁడు వ్రాసినాఁడని చెప్పి విపత్సముద్రము త్రివ్వి యందులో కుఱ్ఱవానిని బడవైచి కృతకృత్యుఁడై, సఫలమనోరథుఁడై సుఖముగా నుండెను. రాజగోపాలముమాత్రము కంఠెను రామచంద్రుఁ డమ్ముటచేతను, చీటిలో నున్నవ్రాఁత యతనిదే, యగుటచేతను, రామచంద్రుని మీఁద కొంచె మనుమానపడుచు నతఁడట్టివాఁడు కాఁడని దృఢపఱచుకొనుచు, తండ్రిగారు తగిన విచారణ చేయక తొందరపడినారని నొచ్చుకొనుచు, స్నేహితుని కొఱకు విచారించుచు, తనమీఁదఁ గూడ నింద వచ్చినందుకు సిగ్గుపడుచు,

గారు భోజనానంతరమున నిద్రించునప్పుడు విశ్వనాథశాస్త్రిలవారి వీధి యరుగుమీఁదఁ గూర్చున్న రామచంద్రునియొద్దకు మెల్లమెల్లఁగాఁబోయి యతనియొద్దఁ గూరుచుండెను. రామచంద్రుఁడును సిగ్గుచే వంచినతల యెత్తక నేత్రములనుండి బాష్పములురాల గోడకుఁజేరగిలఁబడి యుండెను రాజగోపాలముకూడ మిక్కిలి విచారించుచు తుదకు తానే ముందుగాఁ బలుకరించెను.

రాజ—రామచంద్రుఁడూ! ఎందుకువిచారించెదవు; కాలవశము గాని నీలోపములేదు. ఇందులో జరిగినసంగతి నీ వామూలాగ్రముగ నాకుఁ దెలియఁజెప్పు. స్నేహితులదగ్గఱ దాఁచవలసిన సంగతులుండవు గదా!

రామ—రాజగోపాలమా! నీకుఁగూడ నామీఁద ననుమాన మున్నదిగదా. ఈవిషయమునం దేదోషము నాయందులేదు. అనిరామ చంద్రుఁడు యావత్తువృత్తాంతమును రాజగోపాలమునకుఁ దెలియఁజెప్పె ను. అది విని రాజగోపాల మిట్లనియెను. [చింపలేదు.

రాజ—మాబాబయ్య తొందరపడినాడు. చక్కఁగా నాలో

రామ—నన్ను మీ రింటనుండి పొమ్మనుటలో నా కన్న వస్త్రములకు లోపము వచ్చినదని విచారములేదు. లోకములో నా మీఁద వచ్చిన యీనింద యాచంద్రతారార్కమును బోదుగదా యనియు, నన్నందఱు దుర్మార్గుఁ డనుకొందురనియు నాకువిచారముగా నున్నది. దాదాఁపుగ రెండుసంవత్సరములు మీయింటనున్నను, శరభ రాజుగారు నాగుణ మంతమాత్రము తెలిసికొనలేకపోయిరి. పయిగా నిన్నుగూడ పాడుచేయుచున్నానని యన్నారు. ఈవిషయమయి నేనేమి యు నెఱుఁగను. వెంకటరత్నముచేయుచున్నమాయ నెఱుఁగక యందు లోఁబడిపోయినాను. ఏ మొగముఁ బెట్టుకొని యీగ్రామమం దుందును; -న్నెవ్వరు గుమ్మములోనికి రానియ్యరు. నాకర్మగతి యింతమట్టుకు

వచ్చినది. ఈయవమానమును నే భరింపఁజాలను. ఈగ్రామమునుండి యీవేళనే వెళ్ళిపోయెదను. అని కన్నీళ్ళు దెచ్చుకొని నాకు తమ్ముని వలెయున్న నిన్ను విడిచి యేలాగున పోఁగలను? నేఁటికి నే నమలాపురమునకు దొంగ నయినాను. నాకు నేటితో ఋణము తీరినది. నేను జేసిన తప్పులన్నియు క్షమించి నామీఁదఁ గటాక్షముంచు.

రాజ—(కన్నీళ్ళతో) రామచంద్రుఁడూ! నీవు నన్నేలాగున వదలఁ జాలకున్నావో నేను నిన్నాలాగే వదలలే కున్నాను. మనల నిద్దఱిని దైవమింతక్రూరముగా నెడబాపినందులకు నామఃఖమునకుఁ బరిమితి లేదు. నీసద్గుణములు, నీప్రవర్తన నేనుమఱువఁగలనా? నేను నిన్ను క్షమించుటకు నీవు నాకెన్నఁడు నేయపరాధమును జేయలేదు. నిజము నిలకడమీఁదఁ దెలియును. మాబాబయ్యకుఁ దప్ప నీమీఁద గ్రామమున నింకెవ్వరికిని ననుమానము లేదు. నీవీదినమున విశ్వనాథశాస్త్రులవారియింట భోజనము చెయ్యి. నాతోఁ జెప్పకుండ నీవీగ్రామము వదలఁబోకు. సాయంకాలము నీకు నేనేసంగతియు వర్తమానము నంపెదను. మాబాబయ్య లేచేవేళ యయినది. నేను వెళ్ళవలెను. (అని వెళ్ళెను.)

శోభనాచలము, వెంకటరత్నము, వారిస్నేహితులు రామచంద్రునకు జరిగిన మహావమానమునకు జాలిపడుచుండఁగా తాము నిర్విచారముగానుండుటయేగాక తన కతఁడదివఱకుఁ జేసినయపకారములకు వాని నొకమాఱు కొట్టవలెనని నిశ్చయించిరి గాని శరభరాజుగారి యింట నున్నంతకాలము వారికి వీలయినది కాదు. నేఁడు రామచంద్రుఁడు శరభరాజుగారియింటినుండి వెళ్ళిపోవుటచేత వారి స్వాధీన మయ్యెను.

రామచంద్రుని సంగతి యంతయు విని కొందఱు వచ్చి యాతని జూచి పరామర్శ చేసిరి. కొంద ఱతని స్థితికి విచారించిరి. విశ్వనాథశాస్త్రులవారు రామచంద్రుని గొంచెము బ్రతిమాలి లోపలికిఁ దీసికొనిపోయి యన్నము పెట్టించిరి. శరభరాజుగారియింట రామచంద్రుఁ డున్నప్పు

డతనియొద్దకువచ్చి యిచ్చకము లాడువా రందఱును దనకుఁ బ్రాణస్నే హితు లనిన వారందఱును లేశమును వానికి సహాయము చేయరైరి. రామచంద్రుఁడు సద్గుణుఁడనియు సత్ప్రవర్తనఁగలవాఁడనియు స్తోత్రము చేసిన వారిప్పు డితఁడు మహా దుర్మార్గుఁ డని నిందించిరి. అప్పుడు సాయంకాలముకాఁగా దేవదర్శనముఁజేసి రామచంద్రుఁడు శాస్త్రిల వారి వీధియరుగుమీఁదఁ గూర్చుండఁగా నతని సహాధ్యాయుఁడొకఁడు వచ్చి రామచంద్రునితో నిట్లు మాటాడెను.

సహా—రామచంద్రుఁడూ! నీకు తటస్థ మయిన మహాపదను గుఱించి నాకు విచారముగానున్నది. నీవమలాపురములోనే యుందువా? ఎక్కడి కయినను బోఁదలఁచుకొంటివా?

రామ—నేనీరాత్రి ముక్తేశ్వరము వెళ్ళిపోతాను. ఈయవమా నమును నేను భరింపలేను.

సహా—నిజమే. నామాట విని నాలుగు గడియలురాత్రియయిన తరువాత బయలుదేరి ముక్తేశ్వరము వెళ్ళు. ఇఁక నీవీగ్రామమునం దుండఁగూడదు. నీకు నేనొకయుపాయము జెప్పఁ దలఁచుకొన్నాను. నీక్షేమముకొఱకే. నీయిష్టమైన పక్షమున వినుము.

రామ—అయ్యో ! వినకేమి యీసమయమునందు నామేలు గోరువారు రాజగోపాలము నీవుగాక యింకెవరు?

సహా—నాతోఁగూడారా. అని చెప్పి యతఁడు రామచంద్రుని జెఱువుగట్టునకుఁ దీసికొనిపోయి యొకచెట్టుక్రిందఁ గూర్చుండెను. సందె చీఁకటిగనుక మొగమున మసిఁబూసికొని యిద్దఱు మనుష్యులు కఱ్ఱలు పుచ్చుకొని తప్పతాగినకంపే ముందుగా వారి రాకను దెలియఁజేయ వచ్చి గట్టుక్రిందఁ గూర్చున్న సహాధ్యాయుని బట్టుకొని తలమీఁద దయదాక్షిణ్యములు లేక కొట్టుచుండిరి. అప్పుడు సహాధ్యాయుఁడు ,,నేనురో, నేనురో, కొట్టకండిరో'' యని కేకలు వేయుచున్నను స్మార

కము తెలియదుగనుక వారి కామాటలు తెలియక తమపని మానరయిరి. అట్లు వారు తమపనిఁ గడతేర్చిపోయిన వెనుక రామచంద్రుఁడు తనకు సహాయము చేయవచ్చిన వాని కింత మహాపద గలిగినదని విచారించుచు నతనితల పగిలి రక్తమువచ్చుచున్నందున దానిమీఁద తడిగుడ్డవేయుటకు గుడ్డతడుపుటకయి చెఱువుగట్టునకు వచ్చెను. నీళ్ళలో దిగి గుడ్డతడిపి మరల గట్టెక్కుచుండఁగా నొక చాకలివాఁడు పరుగెత్తుకొనివచ్చి రామచంద్రుని జూచి యిట్లనియెను.

చాకలి—అయ్యా! రాజగోపాలము గారు తమ కీచీటిని యీమాటను నిమ్మని చెప్పినారు. (అని రహస్యముగాఁ జెప్పి వెళ్ళిపోయెను.)

రాజగోపాల మిచ్చిన యుత్తరమును జెఱువుగట్టున నెవరో దృష్టిఁ దీయుటకుఁ బెట్టిన యొక మూకుడులో నున్న దీపముముందఱ చదువుకొనుచు బాధపడుచున్న సహాధ్యాయుని మొగముఁ జూడక తిరిగి యక్కడకు రాక వెళ్ళిపోయెను.

ఏడవ ప్రకరణము.

శోభనాచలమును, వెంకటరత్నమును, వారి మిత్రమండలమును, రామచంద్రునిమీఁద కసిదీరక, యతఁ డారాత్రి ముక్తేశ్వరము వెళ్ళ ననుకొని, వారుగూడ వెంబడింపవలెనని నిర్ధారణఁ జేసిరి. రామచంద్రుఁ డారాత్రి విశ్వనాథశాస్త్రిలవారి యింటికి భోజనమునకుఁగాని, పరుండుటకుఁగాని రాలేదు. శాస్త్రిలవారి శిష్యులు గ్రామమునం దంతటను వెదకిరికాని రామచంద్రుఁడుమాత్రము వారి కగపడ లేదు. శాస్త్రిలవారు రామచంద్రుఁ [illegible]లోనో దిగి చచ్చినాఁడని యోచించిరి. రామచంద్రుని బట్టుకొనుట కిద్దఱు మనుష్యులను వెంటఁబెట్టుకొని శోభనా

చల మారాత్రి జాముయిన తరువాత బయలుదేరెను. ఎంతదూరము వెళ్ళినను రామచంద్రుఁడు వారి కగపడలేదుగాని చీఁకటిలో వచ్చుచున్న వారి కొకవిధమైన యాపద తటస్థమైనది. ఒక పుంతమార్గమునుండి కొంతదూరము పోయినతరువాత మార్గమున కిరుప్రక్కలను క్రిక్కిరిసి, యొకదానియగ్రము నొకటి స్పృశించి పొదరింటివలె నల్లుకొనియున్న దట్టమైన చెట్లక్రిందినుండి వారు నడచుచుండఁగా దైవవశమున శోభ నాచలమునకుఁ బాము కఱచెను. కఱచినతోడనే యతఁడు, తనతోఁగూడ వచ్చుచున్నవారి కాసంగతిఁ దెలియఁజెప్పి, యొకయడుగైనను బెట్టఁ జాలక, యొకచెట్టుక్రింద పయిమీఁదబట్టను బఱచుకొని పరుండెను. అక్కడ నౌషధము లేవియు లేవు. అతని చెలికాండ్రిద్దఱును శోభనా చలమునకయి విచారించుచు మార్గమున నెవ్వరైన వత్తురేమొ వారి సహాయము బుచ్చుకొందుమని రెండువైపులఁ జూచుచుండిరి. అప్పుడిఱు వది సంవత్సరముల వయస్సుగల యొకవైష్ణవుఁ డామార్గమునఁ బోవుచు, మాటిమాటికి వెనుకకుఁ దిరిగి చూచుచు, చీమ చిటుక్కుమన్న నక్కడ కొంతసేపు నిలిచి యాధ్వనికారణమును దెలిసికొనుచు ధ్వనియైనపుడెల్ల నులికిపడుచు, సన్ననైన పట్టునామములఁ బెట్టుకొని, శరీరమున ద్వాదశోర్ధ్వపుండ్రములు లేకయే, దక్షిణదేశపుపట్టుపంచె నొకటిఁ గట్టుకొని రెండవపంచెను తలమీఁదకు ముసుఁగువచ్చునట్లు శరీరమునిండఁ గప్పుకొని యామార్గమునఁ బోవుచుండెను. అతనిఁజూడఁగనే శోభనాచలము యొక్క స్నేహితు లిద్దఱును, సంతోషించి యతని సమీపమునకుఁ బోఁగా వైష్ణవుఁడు భయముతో వడవడ వణఁక నారంభించెను. అంతట వారిట్లు మాటలాడ నారంభించిరి.

ఒకఁడు—అయ్యా! మేము దొంగలము గాము. మీరు భయపడ నక్కఱలేదు. మేము మిక్కిలి యవసరమైన పనిమీఁద ముక్తేశ్వరమునుండి యమలాపురమునకుఁ బోవుచున్నాము. దైవవశముచేత మా

యజమానుని బురుగు ముట్టుకొన్నది. తమకేమైన మంత్రము వచ్చిన పక్షమున నాయనను బ్రతికింప వేడెదము.

వైష్ణ—అయ్యయ్యో! నాకు మంత్రమేదియు రాదు. నా దగ్గఱ మం దున్నది. ఆమనుష్యుని నన్నుఁ జూడనివ్వండి. ఆమందు నూరిపోస్తాను.

రెండ—తమపే రేవరండీ యాచార్యులుగారు.

వైష్ణ—రామానుజాచార్యులు. నన్ను మీ రేమైనా యెఱుఁగుదురా?

రెండ—ఎఱుఁగను. కాని మొగము చూచినట్లున్నది. అమలాపుర మెప్పుడైనా వచ్చినారా

వైష్ణ—అమలాపురములో నన్ను మీరు చూడలేదు. మాది తాటిపాక కాఁపురము నీవు నన్నెఱుఁగవు, మాది యమలాపురముగాదు.

ఒకఁడు—అయ్యా! ఈలాగు దయచెయ్యండి. ఇదుగో పాము కఱచినమనుష్యుఁ డిక్కడ పరున్నాఁడు. బొటనవ్రేలిమీఁద కఱచినది. దేహమంతా చెమటలు పట్టినవి. కాలు వాఁచినది. నోటనుండి నురుగులు గ్రక్కుచున్నాఁడు.

వైష్ణ—స్మారకము తెలియనట్లున్నది. (అని దగ్గఱకుఁ బోయి చూచెను.)

సర్పదష్టుఁడైన శోభనాచలమును జూడఁగనే వైష్ణవునకు మొగమున వికాసము తప్పిపోయెను. శోభనాచలమునకు స్మారకము తెలియకపోవుట వైష్ణవున కావహించెను. ఆసేవకు లిద్దఱును శోభనాచలమున కెట్లున్నదనియు, మందువేయుమనియు వారనుచున్నమాట లతనికి వినఁబడవయ్యెను; కాని కొంతసే పాలోచించి ధైర్యము దెచ్చుకొని, మూటనున్నకుప్పె నొకదానిని రాతిమీఁద నరగఁదీసి మందుపోసి, మొదటిమోతాదు కొంచెము పనిఁజేయుటఱకును వైష్ణవుఁడక్కడనుండి, తా

నతిత్వరితముగా ముక్తేశ్వరము పోవలయునని వారితోఁ జెప్పి మఱిరెండు మోతాదుల యౌషధము వారికిచ్చి, రెండుగడియల కొకమారు మందిమ్మనిచెప్పి తాను వెళ్ళిపోయెను. అతఁడు పోకముందే శోభనాచలమునకుఁ గొంచెము నెమ్మదిగా నుండెను. పొరబాటుచేత నావైష్ణవుఁడచటఁ దన తాఁటియాకులపుస్తక మొకదానిని వదలిపోయెను. కొంతసేపటికి శోభనాచలమునకు చలివేసినందున, స్నేహితులిద్దఱును తాఁటియాకులను బోగుచేసి చలిమంటవేయుచు, దాని వెలుతురున నాపుస్తకమును జూచి యందులో దోపఁబడిన యొక తాటియాకుల చీటినిఁదీసి యందులో నొకఁడిట్లు చదువనారంభించెను.

“ఓరామచంద్రుఁడూ! నీవీరాత్రి యమలాపురమున నున్నపక్షమున బ్రతుకలేవు. నీవొక సహాధ్యాయునితోఁ దిరుగుచున్నావఁట. వాఁడు నీస్నేహితుఁడుకాఁడు. శోభనాచలము మొదలగువారు నిన్నుఁ గొట్టవలెనని యోచించి నిన్ను చెఱువుగట్టునకుఁ దీసికొని రమ్మని వానిని బంపినారు. నీవీరాత్రి యకాయకీని ముక్తేశ్వరము వెళ్ళవలసినది. నేను బంపిన మూటలో తిరుచూర్ణము, తిరుమణి, దక్షిణదేశపుబట్టలు తేలు పాములవలని భయమురాకుండఁ గొన్ని మందులు నున్నవి. వైష్ణవ వేషమును వేసికొన్నపక్షమున వారు నిన్నానవాలు పట్టలేరు. నిన్ను నేను త్వరలోనే చూడఁగలను.” అని యామనుష్యుఁడు చదువఁగానె రెండవ వాఁడు నాలుక కఱచుకొని, చేయిజాడించుకొని విచారసూచకముగా నిట్లు మాటాడెను.

రెండ—అయ్యయ్యో! తెలివితక్కువ నిర్భాగ్యులము. ఇప్పుడు మనకు మందిచ్చిన యీవైష్ణవకుఱ్ఱవాఁడే రామచంద్రుఁడు. మనమెంత యదృష్టహీనులము? ఆకుఱ్ఱవాఁడు మంచి యదృష్టవంతుఁడు. వాఁడు చెఱువుగట్టునఁ గూర్చున్నప్పుడు మనము పంపిన మనుష్యులు త్రాఁగి రామచంద్రుఁడనుకొని మన మనుష్యునే కొట్టినారు. వాఁడు చెప్పినది

నిజమే. వీఁడు ముక్తేశ్వరమే వెళ్లుచున్నాఁడు. వీనిని దిరిగి తఱుముకొని వెళ్లుదమా?

ఒకఁడు—వద్దు. వద్దు. ఈవల శోభనాచలముయొక్క స్థితి బాగుండలేదు. ఆవైష్ణవుఁడు తప్పకుండా రామచంద్రుఁడే. ఆహాహా! ఎంత మంచివాఁడో చూడు! శోభనాచల మతనికి పరమశత్రువైనను వాని కెంత మంచి మందులిచ్చి వానిప్రాణమునిలిపినాఁడో చూడు. అతఁడూరకున్నపక్షమున శోభనాచలము చచ్చును.

రెండ—వాఁడు వీనికి విరోధి. చావవలెనని మందులిచ్చినాఁడేమో. ఆమందువేయవద్దు. అనక ప్రాణభీతి రాఁగలదు. వాఁడు దొంగముండాకొడుకు.

ఒకఁడు—రాజగోపాలము కొన్నిమందులు పంపినట్లు తాను జాబులో వ్రాసినాఁడు. అవి మంచిమందులు. అవే రామచంద్రుఁడు మన కిచ్చినాఁడు. అతఁడు మహానుభావుఁడు. అతనికి మనము నమస్కరించవలెను.

రెండ—శోభనాచలమూ! ఇప్పు డేమిచేయుచున్నావు?

శోభ—మాయింటికిఁ దీసికొనిపోయి మాయమ్మను జూపించండి. నేనుబ్రతుకను.

అంతట వారిద్దఱును శోభనాచలము నెట్లయినఁ దీసికొనిపోవలెనని యాలోచించుచుండఁగా నొకబండి యామార్గమునఁ బోవుచుండెను. ఆబండివాని కర్ధరూపాయినిత్తుమని చెప్పి శోభనాచలము నాబండిమీఁద వేసి తీసికొనిపోయిరి.

అట్లుశోభనాచలము మొదలగువారిచేతఁ దెలియఁబడకుండ దాఁటి రామచంద్రుఁడు ముక్తేశ్వరమునకుఁ బోవుచుండెను. ఆదినము కృష్ణపక్షనవమిగనుక పదునెనిమిదిగడియలరాత్రివేళకు, శత్రువులఁ దప్పించుకొని వచ్చినందులకు రామచంద్రున కుదయించిన యల్పసంతోషమువలెనే

చంద్రోదయమయ్యెను. కాని రామచంద్రుని ముఖవికాసమువలెనే చంద్ర కాంతియు, వికాసహీనముకాఁగా గ్రుడ్డివెన్నెలవచ్చెను. గ్రుడ్డిలోమెల్ల యన్నట్టు లాస్వల్పకాంతికే రామచంద్రుఁడు సంతోషించుచుండఁగా నప్పుడుత్తరభాగమందు చేటంతమబ్బు పట్టి, యాగ్రుడ్డివెన్నెలను దిగ మ్రిఁగుటయేకాక, యామబ్బు వృద్ధియై, మునుపటికంటెఁ బదిరెట్లెక్కువ చీఁకటిని దెచ్చెను. శోభనాచలాదుల యపకీర్తివలెనే యంతకంత కాచీఁకటియెక్కువకాఁగా, రామచంద్రుఁడు గోదావరియొడ్డునకుఁ బోయి, రేవు పడవ వీలైనపక్షమున దాఁటి యారాత్రి కోటిపల్లిపోవలెనని యోజనఁజేయుచు, దారితప్పి రేవుస్థలమునఁగాక మఱియొకచోటఁ గూర్చుండెను. ఆకాశమునందలి నక్షత్రగణంబు లన్నియుఁ, దమస్వల్పకాంతులను గూడ నిచ్చుటమాని రామచంద్రుని స్నేహితులవలెనే క్రమక్రమముగాఁ గనఁబడుటమానెను. అంధకార మంతకంతకు మిక్కుటమై, తోవనేకాక, యెదుటనున్న వస్తువునుగూడఁగనఁబడనిచ్చుటలేదు. నల్లని మబ్బులును, మబ్బులలోనుండి మధ్యమధ్య గుండెలువ్రక్కలు చేయునట్లు బయలువెడలుచున్న యుఱుములును, మొగమునెత్తకుండ వీచుచున్న ఝంఝామారుతములును, రామచంద్రుని మనస్సును గలఁచ నారంభించెను. తన్నుఁ గప్పుచున్న యిసుకచేత నది యిసుకతిన్నె యనియు, మహావాయువుచేతఁ గదల్పఁబడుచున్న తరంగముల ధ్వనిచేతఁ దన యెదుటనున్నది గోదావరియనియు, రామచంద్రుఁడు తెలిసికొనెను. అతఁ డక్కడఁ గూర్చుండి కొంచెము కాలుజాపఁగా కాలికేదో మెత్తమెత్తఁగాఁ దగిలెను. ఆది యేదో పరీక్షించి చూచునప్పటి కది కవిక యయ్యెను. తన ముందున్న స్థల మతఁడు బాగు జేసికొనుచుండఁగా చేతికొక చిన్న యెముకముక్క గ్రుచ్చుకొనెను. అంతటితోఁ బోక కఱ్ఱతో నతఁడు తడవి యవతలఁగొట్టఁగా నాదెబ్బ యొక్కకుండమీఁదఁ దగుల నది ఫడాలున పగిలెను. దానితోనాతని కాస్థలము శ్మశానమై యుండు

నని యనుమానము తోఁచెను. భయపడి పరధ్యాన్నముగా యోజించు చున్న యాబాలునివెనుక చెవులు గింగురుమన నొకనక్క కూసెను. అది కూయఁగానే యతని యనుమానము నిజమయ్యెను. అది శ్మశాన మను నమ్మకముగలిగినతోడనే రామచంద్రునికి ముచ్చెమటలుపోసెను. గుండె ఝల్లుమనెను. ధైర్యముచెదరిపోయెను. లేచి పారిపోవుటకైనఁ గాళ్ళలో సత్తువలేక యుండెను. చేతులాడవయ్యెను. ఏపని జేయుటకును తోఁచవయ్యెను. అతఁడు దీపములేదని విచారించుచుండెనుగాని, మధ్య మధ్యవచ్చిన మెఱుపులు వానిభయమును దగ్గించి, ధైర్యముఁ బుట్టించుటకు మారుగా నారుద్రభూములయందున్న సగముసగము కాలిన కొఱవులను శవములను గాల్చిన స్థలములను, కట్టుతాళ్ళను, కపాల ములను రామచంద్రునికగుపఱచి భయమును వెయ్యిరెట్లధికముచేసెను. అయర్ధరాత్రిమునం దా భయంకరమైన శ్మశానమందు గాఢాంధకార మునం దొంటరిగాఁ గూర్చున్న యాకుమారునకు, భయంకరముగాఁ జచ్చినవారిచరిత్రములును, ముసలమ్మలుచెప్పిన దయ్యములకథలును నప్పుడప్పుడు తానువిన్న దయ్యముల రూపములును, జ్ఞాపకమువచ్చి, భయోద్రేకముచేతఁ దన కక్కడనే మరణము కల్గునని రామచంద్రుఁడు నిశ్చయించుకొనెను. నడుమనడుమ మబ్బులనుండి మెఱుపులువచ్చి, క్రొత్త వస్తువులను జూపించిన స్మృతిపరవశముఁ జెందిన యతని కప్పుడప్పుడు తెలివి వచ్చి క్రొత్తసంగతులు జ్ఞాపకమై భయ మధికమగు చుండెను.

ఇంతలో రామచంద్రుని కన్నులనుండివచ్చిన నీళ్ళవలెనే యాకా శమునుండివర్ష బిందువులు పడ నారంభించెను. చినుకు లంతకంత కెక్కువై యాకాశము చిల్లిపడినట్టు కుంభవృష్టిగా నేనుఁగుతొండము లావు ధారలతో వర్షము కురిసెను. ఆవర్షమున భూమి నంతను దేదీ ప్యమానముగాఁ జేసిన యొక మెఱుపు వచ్చి, రామచంద్రునికన్నుల మిఱు మిట్లు గొలిపెను. దానితోడనేదిక్కులు ప్రతిధ్వనులు సేయ బ్రహ్మాండము

బద్దలగునట్లు పెద్దపిడుగు పడెను. అప్పుడు రామచంద్రుఁడు తెలివిగా నుండుటచేత "అర్జునః ఫల్గునః పార్థః కిరీటి శ్వేతవాహనః" అనుశ్లోకము బఠించి పిడుగు తనమీఁదకు రాకుండఁ జేసికొనెనుగాని, యా మెఱుపుచేతఁ గన్నులకుఁ జూచునట్టిశక్తియుఁ జెవులకు వినునట్టి శక్తియుఁ దప్పి, నాల్గునిమిషముల వఱకును దిరిగి రాలేదు. కీడులో మేలన్నట్లు ప్రకాశమానమైన యా మెఱుపు వలన, నొక దిబ్బమీఁద వేయఁబడిన యొక తాఁటియాకులపాక వాని కగుపడగా, వర్షములోఁ గూర్చుండుట కష్టమని, గుడ్డలన్నియుఁ దడిసినందున గజగజ చలిచేత వణఁకుచుఁ బ్రాణములన్నిఁటికంటెను నెక్కువ తీపిగనుక నా బాధపడఁజాలక యాపాక మఱుఁగున తలదాఁచుకోవలెనని నిశ్చయించి లేచి మెల్లఁగాఁ బోయెను. అక్కడనయినను వానికి మనస్స్థిమితము కలుగనందున పెద్దబానలవంటి కడుపులును, చిన్ననోళ్లును, వంకరకాళ్లును గల పిశాచములును, కామినీలును, బ్రహ్మరాక్షసులును, కన్నులకుఁగట్టినట్టు లాతనికి మానసవీథిని గనఁబడఁజొచ్చెను.

అప్పుడొక నల్లనిబ్రాహ్మణుఁ డంగవస్త్రమును గట్టుకొని యొక యంగవస్త్రమును మీఁదవేసికొని "నారాయణ నారాయణ" యనుచు పాకవైపునకు వచ్చుచుండెను. వానినిజూచి రామచంద్రుఁడు చేతిలో కొఱవిలేనందున కొఱవిదయ్యముగాదని నిశ్చయించి, యాబ్రాహ్మణుఁడు తిన్నఁగా నడచుచున్నను తనభయముచేత నతఁడువంకరగా నడచుచున్నట్లు కనఁబడినందున నేదో దయ్యమనుకొని తరువాత మనుష్యుఁడని యెఱిఁగి, శోభనాచలమో, వానిమిత్రులో తన్ను జంపుటకు వచ్చుచున్నారని భయపడుచు, నిశ్చేష్టుఁడై యుండెను. ఆబ్రాహ్మణుఁడు పాకలోనికి వచ్చి దుఃఖముతో "ఎంతపని జరిగినది. దైవమా!" అని విలపించుటచేతఁ దన శత్రుఁడుగాఁడని రామచంద్రుఁడు హీనస్వరముతో ట్లు పలుకరించెను.

రామ—అయ్యా! మీరెవరు బ్రాహ్మణులేనా?

బ్రాహ్మ—బ్రాహ్మణులమే. నీవెవరవు ఇక్కడెందుకున్నావు?

రామ—నేనార్వేలనియోగుల చిన్నవాఁడను. అమలాపురము నుండి వచ్చుచున్నాను.

బ్రాహ్మ—అయ్యా! మేమువైదికులము. నేను మిక్కిలి బీదవాఁడను. నాభార్యయీవేళకు తొమ్మిదిదినములక్రిందట ప్రసవమైనది. మగపిల్లవాఁడుకలిగినాఁడు. లేక లేకకలిగిన యామగపిల్లవాఁడిదినమున సందుకొట్టి చనిపోయినాఁడు. నాభార్యకు ప్రాణముమీఁదికి వచ్చినది. చచ్చినపిల్లవానిని దీసికొనిపోవుట కయినను, మాజాతివారును, మాబంధువులును, రాలేదు. కడుపుదుఃఖముతో నేనేయీపసికూనను పాతిపెట్టవలసివచ్చెను. (అని యేడ్చుచుండెను.)

రామ—అయ్యా! దుఃఖపడకండి. మీరుపెద్దలు. అన్నియుఁ దెలిసినవారు. నావలెనే మీరును దురదృష్టవంతులు.

బ్రాహ్మ—నాయనా! నీకేమి కష్టములు కలిగినవి? ఇక్కడకెందుకువచ్చినావు?

అని బ్రాహ్మణుఁ డడుగఁగా రామచంద్రుఁడు తనవృత్తాంతమంతయుఁ జెప్పి తనమీఁదికి వచ్చిన యాయపనిందయు, శరభ రాజుగారు తన్నులేవఁగొట్టుటయు, శోభనాచలాదుల వైరమును దెలియఁజేయ బ్రాహ్మణుఁ డాశ్చర్యపడి యితనికొఱకు విచారింప నారంభించెను. తరువాత వారిట్లు మాటాడిరి.

బ్రాహ్మ—పూర్వజన్మకృత మెవరు తప్పింపఁగలరు? నీవు మాయింటికివచ్చి రేపుమాయింటనుండి వెళ్ళుము. నీకు పొడిగుడ్డల నిచ్చి యీపూఁట కొంచెము చలిమంటవేస్తాను రా.

రామ—అయ్యా! నాకొఱకు నాశత్రువులు వచ్చుచుందురు. ముందు మీరునడవండి మీవెనుకనే నేనువచ్చెదను. ఎవరయిన వచ్చి

జాడ లడిగిన పక్షమున వెనుకనున్నానని చెప్పవద్దు. నాకేదో సంజ్ఞ చేయండి. "రామానుజాచార్యులు" అని నన్ను పిలిచిన నేనుపారిపోఁగలను.

బ్రాహ్మ—నాప్రాణము నీప్రాణమున కడ్డమువేసి రక్షించెదను.

ఇట్లిద్దఱును బోవుచు గోదావరి గట్టుమీఁది కెక్కునప్పటికిజాము ప్రొద్దుమాత్రమేయున్నది. అప్పుడు తాఁటియాకులఁగొడుగువేసికొని యొకపురుషుఁడు వెండిమురుగులు పెట్టుకొనియున్న చాకలివానిని వెంటఁ బెట్టుకొని వచ్చుచు తనయెదుట వచ్చుచున్న బ్రాహ్మణునిజూడక చీఁకటి చేత నాముసలిబ్రాహ్మణున కెదురుగాఁ బోయినందున గొడుగుకామ గ్రుచ్చుకొనెను. బ్రాహ్మణుఁడును దెబ్బతగిలినందున 'అబ్బా యెవరు రానీవు? చంపివేసినావు. కన్నులు కనఁబడవా?' అని యడిచెను. రామ చంద్రుఁ డదివిని యెవరో వచ్చినారని దిగఁబడి రాడయ్యెను.

పురు—అయ్యా! చూడలేదు. క్షమించవలెను.

బ్రాహ్మ—నీదేయూరు? నీవెవరవు.

పురు—మాదమలాపురము. మీకేఱువ దేంట్లకుట్టివాఁ డగుపడి నాఁడా?

బ్రాహ్మ—నేనెఱుఁగను. మీపిల్లవాఁడెవరో నీవెవరవో నాకుఁ దెలియదు. చేతిలోకఱ్ఱలూ మీరూ యెవరికొంపతివ్వుటకు వచ్చినారు. బుఱ్ఱలుపగులఁ గొట్టుటకు వచ్చినారా? దిక్కుమాల్నాళ్లారా?

పురు—అయ్యా! తిట్టకండి. మేమెవరిని గొట్టుటకు రాలేదు. వేరేపనియుండి వచ్చినాము. మీ రాపిల్లవానిఁ జూచినపక్షమునఁ జెప్పండి.

బ్రాహ్మ—నేను జెప్పను. ఇప్పుడు మాగ్రామమునందు మా తల్లిదగ్గఱనున్నవాళ్లను కేకవేసి మీకుతగినట్టు బుద్ధిజెప్పిస్తాను.

చాక—(కోపముతో) నోరుముయ్యి బాపనయ్యా! తెగసీలుగు తావేమి?

పురు—ఓరీ! ఆయనజోలికిఁ బోకురా. మనకు కావలసిన మనుష్యుఁడు దొరకలేదు. మధ్య నాముసలి బ్రాహ్మణునిజోలికి వెళ్ళుడ మెందుకు?

బ్రాహ్మ—అయ్యో! దుర్మార్గుఁడా! నీకుకావలసిన వాఁడు దొరుకలేదా? దొరికితే చంపివేస్తావా? నీకింత పౌమ్యకాలమేమిరా? అసి మాటాడుచున్న బ్రాహ్మణునిదాఁటి యాక్రొత్తపురుషు లిద్దఱును ముందుకుఁ బోవుచుండఁగాఁ జూచి బ్రాహ్మణుఁడు “ఆలాగు వెళ్ళుడమెందుకు? అక్కడవాఁడు లేడు. ఆలా వెళ్ళవద్దు. వద్దంటే మానవేమయ్యా” అని చెప్పెను. అతనియాటంకముఁ జూచి యాపురుషులు రామచంద్రుఁ డక్కడున్నాఁడని నిశ్చయించి యటుపోవుచుండఁగా రామచంద్రుఁడు వారిబారిఁబడకుండ గబగబ పరుగెత్తసాగెను. ఈపురుషుని వెంటఁదరుముచు నెట్లయిన వానిని రామచంద్రునిగా నిశ్చయించి పట్టఁదలఁచిరి. కొంతదూరముపరుగెత్తి యాక్రొత్తవారిలో నొకఁడు “రామచంద్రుఁడా! నేను రాజగోపాలమును పరుగెత్తకు. నీవీలాగునరా. భయములేదు.” అని పురుషుఁడు చెప్పఁగా రామచంద్రుఁడు ధైర్యముఁ దెచ్చుకొని తన శత్రువులు రాజగోపాలముయొక్క పేరుఁ బెట్టుకొనినా రనుకొని రాక మరల నాతని కేకను విని దగ్గఱకు వచ్చి రాజగోపాలమునుజూచిసంతోషించి యిట్లుపలికెను.

రామ—రాజగోపాలమూ! నీ వెందు కీరాత్రివేళ వచ్చినావు? నాకు సహాయము చేసినందులకు మీబాబయ్యగారు నిన్ను కూడ లేవఁగొట్టినారా యేమి?

రాజ—లేదు. చాకలివానిచేత మూట నీకుఁ బంపినపుడు నీకు లెక్క యేమైనఁ బంపడము మఱచిపోయినాను. పెట్టెలోనుంచి నాలుగురూపాయీలు తీసి యివతలఁబెట్టి చాకలివానిచేతి కిచ్చుట మఱచినాను. ఇదిగో నాలుగురూపాయలు పుచ్చుకో. నీవు సురక్షితముగా వచ్చినావా?

రామ—ఏమిసురక్షితము? చావుతప్పి కన్ను లొట్టవోయినట్లున్నది. నేను నీయుత్తరమును జూడఁగానే కొంతసేపు చెఱువుగట్టుమీఁద నాగి కపటియయిన యాసహాధ్యాయుని జోలికిఁబోక మఱినాలుగు జాములకు బయలుదేరినాను. అప్పటికి శోభనాచలము ముందుగానే బయలుదేరి త్రోవలో—

రాజ—(మాటకడ్డమువచ్చి) ఆసోది చెప్పకు నాకు ప్రొద్దుపోతుంది. మాయింటనందఱు నిద్రపోవుటఁగనిపెట్టి నేనిప్పుడు బయలుదేరినాను. నాపరుపుమీఁద నేను పరున్నట్టుగానె యొకదిండుపెట్టి మీఁద బట్టకప్పి యింటి దొడ్డి తలుపుఁ దీసియుంచి వచ్చినాను. మాబాబయ్య లేవకమునుపే నే వెళ్ళవలెను.

రామ—అయ్యో ! నాకొఱకు నీవిట్లు శ్రమపడవలసివచ్చినదికదా?

అని రామచంద్రుఁడు పోకముందే రాజగోపాలమును చాకలివాఁడును బయలుదేరిరి. రామచంద్రుఁడు రాజగోపాలముయొక్క సద్గుణములను స్తోత్రముచేసి బ్రాహ్మణునితోఁ జెప్పుచు బ్రాహ్మణునియింటికిఁ బోయి పొడిబట్టలు కట్టుకొని సుఖముగా నిద్రఁబోయెను. మఱునాఁడు రామచంద్రుఁ డుదయమున గోదావరిలోస్నానముచేసి ముక్తేశ్వరస్వామివారిదర్శనము జేసి యాదిన మాబ్రాహ్మణునియింట వండుకొని భోజనము జేసి, కోటిపల్లి పోవుటకు సిద్ధముగానుండఁగా, బ్రాహ్మణునిభార్యకు బాలింతరోగము వచ్చి మరణమునకు సిద్ధముగా నుండెను. వరహా యిచ్చినఁగాని వైద్యుఁ డామెకొక్కమాత్రనైన వేయకుండుటఁ జూచి, నవనీతమువంటిహృదయముగల రామచంద్రుఁడు కనికరించి తనకు రాజగోపాల మిచ్చిన నాలుగురూపాయలును వైద్యున కిచ్చి యాబ్రాహ్మణునిభార్యకు మందు వేయించెను. రామచంద్రుని చేతిధనమువదలఁగానే బ్రాహ్మణుని భార్యకు రోగముగూడ వదలెను. బ్రాహ్మణుఁడు

రామచంద్రుని సాహాయ్యమున తనయాపదయను నది దాఁటెనుగాని, రామచంద్రునకుగోదావరినది దాఁటుట కెట్టిని యేగానియైన లేదు. ధనములేక యోజించుచున్న రామచంద్రునకొక మంచియాలోచన దోఁచెను. పూర్వమొకనాఁడు తాను రాజవోలు వెళ్ళుచుండఁగా పడవ మునిఁగిపోయినపుడు ముక్తేశ్వర బ్రాహ్మణుని తాను రక్షించెను. అతఁడ నేక బహుమానములు తన కప్పు డిత్తు ననియును, ముక్తేశ్వర మొక్క పర్యాయము రమ్మని తిన్న బ్రతిమాలినసంగతియు, రామచంద్రునకు జ్ఞాపకము వచ్చి యాబ్రాహ్మణునిపేరు లింగరాజని తెలిసికొని, యట్టి స్నేహితుఁ డుండఁగాఁ దన కేఁక భయ మక్కఱలేదనుకొని లింగరాజు దగ్గఱకుఁ బోయెను. లింగరాజు రామచంద్రునిఁ జూచి యప్పటికి రమారమి యెనిమిది మాసము లయినందున, వెంటనే యతనిని యానవాలు పట్టఁజాలక కాఁబోలును, లింగరా జతనిఁ బలుకరింపఁ డయ్యెను. అవసరము రామచంద్రునిదే కనుక తుద కతఁడు మౌనము విడిచి మాటాడెను.

రామ—లింగరాజుగారూ! నన్నెక్కడనైనఁ జూచినట్లు జ్ఞాపక మున్నదా?

లింగ—మొగముఁ జూచినట్లు జ్ఞాపక మున్నది కాని యెవరో చెప్పఁజాలను. మీదేయూరు

రామ—మాదమలాపురము కాఁపురము. నాఁడు పడవ మునిఁగి పోయినపుడు—

లింగ—(మాటకడ్డమువచ్చి) ఓహోహో! నీవఁటయ్యా? నాఁడు పడవ మునిఁగిపోయినపుడు నీవుకూడ పడవలో నున్నావుకావూ. నాకా సంగతి జ్ఞాపకమా. అది యేమాత్రపు గొప్పసంగతి. నూరువ్యవహారము లలో మాకది జ్ఞాపకము రాదు. అయితే నీవిప్పు డీగ్రామ మెందుకు వచ్చినావు.

రామ—నిన్న నొకబ్రాహ్మణునియింట వంటఁ జేసికొని భోజనము జేసినాను. మీదర్శనము చేయవలెనని వచ్చినాను. మీరొక సహాయము చేయవలయును.

లింగ—ఏమిపనిమీఁద వచ్చినావు. అది యేదో చెప్పు. నా సాధ్యమయినపక్షమునఁ జూచెదను.

రామ—నేను కార్యాంతరమున కోటిపల్లి వెళ్లుచున్నాను. నాకు మీరు నాలుగురూపాయిలు బదు లిప్పించవలయును. నాలుగు మాసములలోఁ దిరిగి యిచ్చివేయఁగలను.

లింగ—అయ్యో! ఇప్పుడేమీరు రాకముందు నూఱురూపాయిలుండఁగా నొక పెద్దమనుష్యున కిచ్చినాను. ఒకఘడియ క్రిందవచ్చిన పక్షమున కావలసినన్ని రూపాయిల నిత్తును. నాలుగు కాకపోతే మఱి నాల్గు పుచ్చుకొనవచ్చును. మీ రెక్కడికిపోతారు. నే నెక్కడికిపోతాను. అయ్యయ్యో! రాకరాక మీరు వచ్చి యడగడము నాదగ్గఱ సమయము నకు లేకపోవడము సిగ్గుగనున్నది.

రామ—సరిసరి. మీకు సిగ్గెందుకు. అదినాయదృష్టము. మీరేమిచేయఁగలరు పోనీ! రేపేమయిన సద్దెదనంటె యీగ్రామములో నుంటాను.

లింగ—ఉండు. ఏమయిన లెక్క దొరకిన పక్షమునఁ జూచి యిస్తాను.

ఈప్రకారముగా లింగరాజుదగ్గఱ నాలుగువేలరూపాయిలున్నను దనకు మహోపకారము జేసిన రామచంద్రునకు నాలుగురూపాయిలు బదులిచ్చుటకుఁగూడ నతనిమనను సమ్మతింపదయ్యెను. ధనమీయకున్నను మర్యాదార్థమురామచంద్రుని భోజనమున కుండుమనియైనఁ జెప్పఁడయ్యెను. ఆమరునాఁడు శరభరాజుగారియింటనుండి రామచంద్రుఁడు వచ్చుటకుఁ గారణ మేమని లింగరాజునుగఁగా రామచంద్రుఁడు సత్య

కాలపు మనిషిగనుక యున్నదున్నట్లు మాయమర్మములు లేకుండఁ జెప్పెను. మూఁడవనాఁడు రామచంద్రుఁ డేదోయొకటి నిశ్చయముగాఁ దెలిసికొని లింగరాజువద్ద సెలవుపుచ్చుకొనిపోవలెనని యింటికివచ్చు నప్పటికి లింగరాజొక సంచిరూపాయిల ముందు వేసికొని పేరూరినుండి భూమి తాకట్టుపెట్టుటకు వచ్చిన యొక యరవ బ్రాహ్మణునితో వడ్డీని గుఱించి ముచ్చటించుచుండెను. రామచంద్రునిజూడఁగానే యతఁడాధన మును జూచుటచేత నడుగునేమోయని భయపడి మహాకోపమువచ్చి దగ్గఱనున్న కుమారునిజూచి "విధవా! తలుపువేయుమని యెన్నిమాఱులు చెప్పినను వేయవుగదా" అని వాని నొకచఱపుచఱచి లోపల సణుగుకొను చుండెను. అప్పుడు రామచంద్రుఁడు వానిని బలుకరింపఁగా వారిట్లు మాటాడిరి.

రామ—అయ్యా లింగరాజుగారు! తమకీవేళ సొమ్మందినదిగాఁ బోలును. నేను నాలుగుదినములనుండి తమకొఱకు నిరీక్షించియున్నాను. ఏదైన దయచేయించిన పక్షమున సెలవుఁబుచ్చుకొని వెళ్ళిపోయెదను.

లింగ—(అసూయతో) నానిమిత్త మెవరు నిన్ను నిరీక్షించు మన్నారు. నీపనిమీఁద నీవుండి నాకొఱ కున్నాననియెదవేమి? నీకు రూపాయ లెవరు పోగుపోసికొని కూర్చున్నారు? ఈరూపాయ లెవరిసొ మ్మని నీకివ్వను? ఊళ్ళోవాళ్ళ సొమ్మిచ్చినపక్షమున వాళ్ళూరుకుంటారా?

రామ—తమదగ్గఱ లేకపోయినపక్షమున మరెక్కడనైన బదు లిప్పించండి. మీరు చెప్పినయెడల నాకెవరుబడితే వారేయిస్తారు. రెండు నెలలలోఁ దీర్చఁగలను.

లింగ—నాకెవరిస్తారు? నీవేలాఁటివాఁడవో నేను నాలాఁటివాఁ డనే యేలినాటిశనిలాగున పట్టుకొని వదలకుండ నున్నావేమి? దీనికి వేళాపాళా లేదా? నీయవసరమే నీదా

రామ—ఆదినము పడవమునిఁగినపుడు మిమ్మునే బ్రతికించఁగా

నాకు బహుమానము చేయుదుమని ముక్తేశ్వరము రమ్మనుమన్నారు గదా? నాలుగురూపాయలు బదులైన నివ్వలేరండి?

లింగ—నీవు నన్ను బ్రతికించినావా? శరీరమంతా కాల్లకుక్క వలె తెగఁగఱచి వదలిపెట్టినావు. ఆపుడిప్లు నాలుగుమాసములవఱకు మానసేలేదు. ఒకనినొకఁడు బ్రతికించఁగలఁడా చంపఁగలఁడా? దైవానుగ్రహమున్నదికనుక నేను బ్రతికినాను. నీకు బహుమానమియ్యడము నాకు విధిగాదు. దయాధర్మభిక్షము. ఇస్తేయిస్తాను లేకపోతే లేదు.

రామ—ఆసంగతి నిదివఱకే చెప్పినపక్షమున నేను వెళ్ళిపోదునే. ఇన్నిదినములు నన్ను తేపుమాపని తిప్పుటయెందుకు?

లింగ—నోటికి సుద్ది బద్దము లేదేమి? నేను నిన్నుండమన్నానా? సొమ్మందదని మొదటే చెప్పినాను. అమలాపురములో దొంగవస్తువులమ్మి మాయూరుఁ బాడుచెయ్యవలెనని వచ్చినావా? నిన్ను గుమ్మములోనికి రానియ్యఁగూడదు. ఇంతంత బుద్ధులునీకుండుటచేతనే ధర్మరాజువంటి శరభరాజుగారు నిన్ను లేవఁగొట్టినారు. నేనొక దమ్మిడినైన నివ్వను. నాయింటికి నీవు రావలసినపని లేదు. నడునడు.

అని లింగరాజుగారు చెప్పఁగానే గంపంత యాశఁ బెట్టుకొన్న రామచంద్రునకుఁ గోపవిచారము లొక్క సమయముననే పుట్టెను; కాని కోపమును గనఁబఱచుట కది సమయముగాదు కనుక తన స్వాధీనములో నున్న విచారమును మఱి యొకమాఱు దెచ్చుకొనెను. లింగరాజువంటి పరమవిశ్వాసఘాతకుఁ డెక్కడైన నుండునా? పడవమునుఁగుటకు సిద్ధముగా నున్నప్పుడు తాను రామచంద్రు నెన్నివిధములఁ గాళ్ళకడుపులుపట్టుకొని వేడుకొనెనో నేఁ డన్నివిధముల దయదాక్షిణ్యములులేక కసరికొట్టెను. అతని కేప్రకారముగ మనసు తాళెనో తెలియదు. రామచంద్రుఁడు తన కగుపడఁగానే యతనిని జ్ఞాపకము దెచ్చుకొనియు, లింగరా జెఱుఁగని వానివలెను జ్ఞాపకములేనివానివలెను నటింప నారంభించెను. తన ప్రాణ

సంరక్షణఁ జేసిన రామచంద్రునకు తానుబహుమానము లిత్తుననియుఁ దన యావదాస్తి నిచ్చినను ఋణముఁ దీరదనియుఁ జెప్పి వానిని ముక్తేశ్వరము రమ్మని చెప్పిన లింగరాజు నాలుగురూపాయి లతనికి బదులైన నివ్వలేక యతిదీనముగ నున్న యాపిల్లవాని ననరానిమాటలని దరికిఁ జేరకుండఁ గొట్టెను. లోకములో నిట్టి లింగరాజు లనేకులున్నారు. ఆశ్చర్యమేల?

ఇట్లు నిర్విణ్ణమనస్కుఁడై యాశాభంగముచేత నాకస్మికదుఃఖము గలిగి పడవదాఁటుట కొకడబ్బైన లేక గోదావరిదగ్గఱఁ గూర్చుండి రామచంద్రుఁ డిట్లు విచారించెను.

"హా! దైవమా! మాచిరాజు శ్రీరాములుగారి గర్భమునఁ బుట్టి యాగర్భశ్రీమంతుఁడ నైన నాకు రేవుపడవదాఁటుట కొకకానియైన లేకుండఁ జేసితివి. నేనెక్కడ పాదముఁ బెట్టిన నక్కడ నిర్ధూమధామ మగుచున్నది. నాకుమరణమైన నేల కలుగఁ జేయవు? ఎన్నిదినము లన్నవస్త్రములు లేకుండ బాధపడఁగలను? మాతండ్రిగారు పోయినది మొదలుకొని యీనాఁటివఱకుఁ గష్టమే కాని సుఖమెఱుఁగను. నావంటిదిక్కుమాలినవాఁడు ప్రపంచమునం దెవ్వరు లేరు. కష్టములోనున్న దుఃఖమునంతను జెప్పుకొందమన్న నిరుపార్శ్వముల బంధువు లన్నమాట లేరుగద. ఈశ్వరా! ఇప్పటికైన నీకు నామీఁద కసిదీర లేదుగాఁబోలును." అని కన్నీళ్ళు కాలువలుగట్ట నేడ్చుచుఁ దుద కింతపాటుబ్రతుకు బ్రతుకుటకంటెఁ బ్రాణత్యాగము చేసికొనుట మంచిదని తనకష్టము లంతముఁ జేసికొనఁ దలఁచి, దుఃఖతాపముచేతఁ గల్గిన బాధ చల్లనియానదీగర్భమునందుఁ బ్రవేశించి తీర్చుకొననిశ్చయించెను. అప్పుడు ప్రదోషకాలమగుటచేత ముక్తేశ్వరస్వామివారి యాలయమునకుఁ బోయి, యీశ్వరదర్శనముజేసి కడపటిసారి యాదేవునకు మనసుదీర మ్రొక్కి తనకువచ్చిన స్తవములన్నియుఁ బఠించి దేవున కెదురుగాఁ గూర్చుండి తాను కవిత్వము చెప్పఁగలవాఁడే

కనుక తన దీనావస్థను దెలుపుకొనుచు నీక్రిందిపద్యములతో నీశ్వరుని స్తుతించెను.

చ. కడపితి నింతకాలమును ♦ గష్టచయంబులు నొందుచుంటి యీ
పుడమిని మాతృగర్భమునఁ ♦ బుట్టినదాది సుఖింపలేదు నీ
యడుగుల నాశ్రయించి యిఁక ♦ నైన సుఖింపఁగఁ గోరుచుంటినా
యెడఁ గరుణించి వేగముగ ♦ నీయవె మోక్షసుఖంబు లీశ్వరా.

చ. జనకుఁడు దీరె నాకు సతి ♦ శైశవమందె గతించెఁ దల్లియుం
మనమున నన్నుఁ గూర్చి యణు♦మాత్రము పొక్కెడువారు లేరు నే
ననయము చేయిఁ జాపుకొని ♦ యన్యులపంచల నుండఁజాల నో
యనఘ! కటాక్షముంచి వడి♦నంతముఁ జేయవె కష్టజాలమున్.

ఆ. వె. అడుగరానివారి ♦ నడిగితి ద్రవ్యంబు
చేయరానిపనులఁ ♦ జేసినాఁడ
నన్నవస్త్రములకు ♦ ననఘ! నన్ను క్షమించి
ముక్తినీయవయ్య ♦ భక్తవరద.

ఈశ్వరా! నేనిదివఱ కనేకపాపములను జేసినాను. నన్నేగతి కంపినను భారము నీదే. ఈదిక్కుమాలిన ప్రాణసంరక్షణకొఱ కనేకులకు బాధ నిచ్చినాను. నేఁటితో నాకష్టములన్నియు గట్టెక్కఁగలవు. కరుణించి నీసాన్నిధ్యమునుమాత్రము జేర్పుము. ఇదిగో నాచివరనమస్కారమందుకో" అని చేతులుజోడించిమ్రొక్కి మరల "నాకష్టములన్నియు సత్ప్రవర్తనమువల్లఁ గలిగినను నాకెన్నిజన్మములకైన సత్ప్రవర్తనమే దయచేయుము. నా కనేకోపకారములను జేసిన రాజగోపాలమును రక్షింపుము" అని గుడివదలి గౌతమీనదియొడ్డునకుఁ బోయి, బలవన్మరణము, పాపహేతువని యెఱిఁగియు దుఃఖములచేత నామాట మఱచిపోయి వంశమునకుఁదానొక్కఁడేకనుక తలిదండ్రులకుఁ గడసారి తర్పణము వదలి బట్టబిగియఁ గట్టుకొని నడుమున నుత్తరీయమును జుట్టి జందెము

మెడకుఁజుట్టి నదికి నమస్కారము జేసి కంఠములోఁతు నీళ్ళవఱకును బోయెను. పోయి యక్కడ నిలుచుండి యెక్కడనో తాటిపాకలోఁబుట్టి యతిసుకుమారముగాఁ బెఱిగి రాజవోలు మేనమామయండను గొన్నాళ్ళుండి, యమలాపురమునఁ జదువుకొనుటకు వచ్చి యపనిందపాలై ముక్తేశ్వరము వచ్చి గోదావరిలో బలవంతముగాఁ జచ్చుచున్న తన్నుగుఱించి విచారించి రాజగోపాలమును దలఁచుకొని యొకమాఱును మేనమామను దలఁచుకొని యొకమాఱు నేడ్చి చూచిచూచి యింతనిండుప్రాణము నిట్లు పోఁగొట్టుకొందునా యని భయపడి నాలుగడుగులు వెనుకకువచ్చి, చచ్చెడివానికి భయ మెందుకని మరల లోఁతునకుఁబోయి, యెవరును లేరుగదా యని నాలుగుమూలలఁ బారఁజూచి, కన్నులు మూసికొని "హాదేవా" యని గుభాలున లోఁతునీళ్ళలోఁ జేతులజోడించుకొని మునిఁగిపోయెను.

అతఁ డొకమాఱు మునిఁగి యీఁతవచ్చినవాఁడుగనుక వెంటనే నీళ్లుత్రాగక తేలెను. అపు డొకమనుష్యుఁడు తడిగోచితో వచ్చి రామచంద్రుని జుట్టుపట్టుకొని మొలలోఁతునీళ్ళవఱకును దీసికొనివచ్చి యక్కడ వానిని నిలువఁబెట్టి తానును నిలుచుండెను. అతనిని జూచి రామచంద్రుఁడు నిర్ఘాంతపడి కొంతసేపటికి "నీవెవ్వఁడ"వని యడుగఁగా నామనుష్యుఁ డిట్లుచెప్పెను. "అయ్యా ! నేనుపల్లెవాళ్ళ చిన్నవాఁడను. నేనును, మావాళ్ళు కొందఱును భద్రాచలమునుండి కలప తెప్పలుకట్టి నీలపల్లి తీసికొనిపోవుచున్నాము. గడియప్రొద్దువేళ మాపిల్లవాఁడు రేవులో నీఁతలాడుచు చేతియున్న వెండియుంగరమును బాఱవేసినాఁడు. రెండుగడియలుక్రిందట నేను నీళ్ళలో మునిఁగి యావస్తువునిమిత్తమడుగునఁ గూర్చుండి వెదకుచున్నాను. ఇదిగో వస్తువు దొరకినది. నేను నీటిలోనుండి బయటికివచ్చినప్పటికి మీరు తేలి మునుఁగుచున్నారు. తక్షణమే నేనువచ్చి జుట్టుపట్టుకొన్నాను. నావస్తువేకాకుండ బ్రాహ్మ

ణుని బ్రతికించిన పుణ్యముకూడ దక్కినది. బాబూ ! నేను సెలవుతీసి కొని తెప్పమీఁదకు వెళ్ళుతాను."

అని పల్లెవాఁడు చెప్పఁగా తాను బలవంతముగాదిగినట్లువానితోఁ జెప్పక నీవు మంచివాఁడవు. నాప్రాణ మీదినమున రక్షించినావు. అని వానిని బంపి తానును మెల్ల మెల్లఁగా బట్టలారవేసికొని బ్రాహ్మణుని యింటికిఁ బోవుచు నిట్లాలోచించుకొనెను. "నేనుజచ్చిపోవుట దేవునకిష్ట ములేదు. నేనేదో గొప్పయదృష్టమునకే బ్రతికినాను. నేనిఁక చావను. నామీఁద దైవమునకు సంపూర్ణముగా ననుగ్రహముగలదు." అని వితర్కించుకొని, బ్రాహ్మణునియింటికిఁ బోయి పురుడు వెళ్ళిపోయినది గనుక వానితోఁగలిసి భోజనముచేసి రేవుదాఁటుటకు సొమ్ములేదని యాతనితోఁ జెప్పి కొంచెముసొమ్ము గలదేమో యని సిగ్గుపడుచు నడిగెను. భూలోకమునం దవతరించిన కుచేలుఁడగు నాబ్రాహ్మణుఁడు గర్భదరిద్రుఁ డగుటచేత సొమ్ములేక ప్రాఁతబిందె నొకకోమటివద్ద తాకట్టుపెట్టి పదునాలుగణాలు తెచ్చి రామచంద్రునకిచ్చి క్షమింపుమని వేఁడుకొనెను. ఉదయమున లేచి రామచంద్రుఁడు రేవుదాఁటి కోటిపల్లి వెళ్ళెను. గోదావరిలోఁబడి తేలుటచేతఁ డనకష్టముననుండి తానును దేలినట్లు రామచంద్రునకుఁ దోఁచెను. కోటిపల్లి వెళ్ళి రామచంద్రుఁడు మహారాజుగారియొద్ద నేదైన నుద్యోగము దెచ్చుకోవలెనని యోచించెను. కోటిపల్లి శ్రీమద్విజయనగరపుమహారాజుగారిది. మహారాజుగారు, రాజధానియగు విజయనగరము నందుండి యుద్యోగస్థుల మూలమున, కోటిపల్లి సంగతియంతయుఁ దెలిసికొనుచు నప్పుడప్పుడాగ్రామమువత్తురు.

ఎనిమిదవ ప్రకరణము.

రామచంద్రుఁడు కోటిపల్లి వెళ్ళినపూఁట, గుణములయందు రాజమ్మకప్పగారుగానుండఁదగిన యొకపూఁటకూటి పెద్దమ్మయింటభోజనము చేసెను. ఎలాగైన నొకచిన్నయుద్యోగము సంపాదించుకొనవలెనని యతని కిష్టము గల్గియున్నదికాని తన కుద్యోగమునిచ్చువారును నిప్పించువారును లేరు. కోటిపల్లి పరగణాను శ్రీవిజయనగరపు మహారాజుగా రధికారులుగనుక వారా పరగణాకు వల్లూరి శంకరరావుగారిని ప్రధానోద్యోగస్థునిగా నేర్పఱచిరి. ఆయన సద్గుణసంపన్నుఁడును, ధర్మకార్యనిరతుఁడును, బహుజనోపకారియునైమిక్కిలిఁ గీర్తిఁగాంచెను. విజయనగర రాజ్యవిస్తారకులు ప్రస్తుతపు విజయనగరపుకోటఁ గట్టించిన ధన్యులు నగు శ్రీవిజయరామగజపతిమహారాజుగా రాకాలమున దేశమును బరిపాలించుచుండిరి. శంకరరావుగారి యధికారముక్రింద నున్నప్పుడు కోటిపల్లి పరగణా మిక్కిలి యభివృద్ధి నొందుచు వచ్చెను. రామచంద్రుఁడా శంకరరావుగారి దర్శనము చేయించుమని కచేరీలోనున్న యుద్యోగస్థులలోఁ గొందఱి నాశ్రయించి ప్రతిదినమును వారివీధియరుగులమీఁద సర్వకాలములయందుఁ గూర్చుండుచుండెనుగాని వారు మాటలతోనేకాని క్రియలతో నాతనిని సంతోషపెట్టరైరి. తుదకుఁ బ్రాణము విసిగి రామచంద్రుఁడు తానే స్వయముగా శంకరరావుగారినిఁ జూడవలయునని యాలోచించి గుమ్మముదగ్గఱకు వచ్చి లోపలికిఁ బోవుటకుఁ బ్రయత్నించెనుగాని గుమ్మముముందట వెండిబిళ్ళలనువేసికొని పులితోలు ధరించి పూర్ణాధికారమును జరుపుచున్న రాజభటులా నిరుపేదపిల్లవానిని లోనికిఁ బోనీయరైరి. రాజభటుఁడొకఁడు శంకరరావుగారు నిద్రించుచున్నారనియు, మఱియొకఁడు క్రొత్తమనుష్యుని రానిచ్చినపక్ష

మున పంతులవారు కోపింతురనియు, వేఱొకఁడు పంతులవారు వ్యవహారమును జూచుచున్నారనియుఁ జెప్పి యందఱు వాని నభ్యంతరపెట్టిరి. ఒకభటుఁడు రూపాయి తన కిచ్చినచో రామచంద్రుని లోపలికిఁ దీసికొని పోదుననియు, మఱొకఁ డర్ధరూపాయి యిచ్చినఁ దీసికొనిపోదు ననియు వారందఱు బేరములనాడ నారంభించిరి. లంచముల నిచ్చి రామచంద్రుఁడు శంకరరావుగారి దర్శనము చేయుట కిష్టములేక గుమ్మముముందఱ నాల్గుదినములు పడియుండియు, తుద కతఁడు పంతులవారి దర్శనము దొరకనందున విచారాక్రాంతుఁడై యుండెను. పూఁటకూటియింటనుండుటచేత తాను దెచ్చిన పదునాల్గణాలును వ్యయమయ్యెను. రామచంద్రుఁడు కోటిపల్లి గ్రామముఁ బ్రవేశించిన యయిదవదినము సాయంకాలమునందు శంకరరావుగారు కుడిభుజముమీఁద నెఱ్ఱనిరుమాలు నెడమభుజముమీఁద నుప్పాడలోఁ బురమాయించి నేయించి చలువచేసిన సన్ననిజరీయుత్తరీయమును వైచి చేతిలో వెండిపొన్నుగల యొకనున్నని సన్నపేపబెత్తమును బట్టుకొని, టక్కుటిక్కుమని తొడుగుకొన్న ముచ్చెలు ధ్వనిఁజేయ రాజభటుఁ డొకఁడు ముందుగా నడచి యెదుట వచ్చుచున్న మార్గస్థుల నందఱి నొత్తిగించుచుండ, నెవరితోడనో మాటలాడుచు, గోదావరి యొడ్డునకు జల్లగాలి నిమిత్తము వచ్చిరి. సమయమును నిరీక్షించి రామచంద్రుఁడు పంతులుగారి వెంటనే వచ్చి యాయన తనవైపు తిరిగినప్పుడు నమస్కరించెను. శంకరరావుగారును తిరిగి నమస్కరించి రామచంద్రునివృత్తాంత మడుగ నతఁ డామూలాగ్రముగా తన చరిత్రమును వినిపించెను. దానిని శంకరరావుగా రొకచిత్రమైన కథవలె విని యాశ్చర్యపడి రూపురేఖావిలాసములను బట్టి యాతఁ డొకగొప్పయింటివాఁడనియు హృదయ మిచ్చి మాటాడుటచేత నతఁడు నిర్దోషియనియు, చూపులనుబట్టిచాకచక్యము గలవాఁడనియుఁ దెలిసికొని తమకచ్చేరియందిరువది రూపాయిలపని యుండఁగా దాని నతని కిచ్చిరి. ముత్యాల

కోవవలెనన్న యతనివాంఛితయు, పనియందుగల శ్రద్ధయు, పైయధికారులయందుఁ గలిగిన విధేయతయును శంకరరావుగారికి రామచంద్రుని యందు దయఁగలిగించెను. తనపని నతివేగముగా ముగించుకొని రామచంద్రుఁడు కచ్చేరీలోనున్న మందమతులయొక్కయు, సోమరిపోతులయొక్కయు, పనులు గూడ చేసిపెట్టసాగెను. శంకరరావుగారు తప్ప కచ్చేరీలోనున్న యుద్యోగస్థులందఱును లంచగొండులయి ప్రజలను గ్రహాములవలె పీకుకొని తినుటచేత రామచంద్రుని కాకార్య మయిష్టమగుటచే లంచముల గ్రహించువారిని మందలించుచు, బాధపడుచున్న బీదకాఁపులకు సహాయముచేయుచు, నాతఁడు జనసమ్మతమైన పురుషుఁడయ్యెను. శంకరరావుగారికి తరువాత నుద్యోగస్థుఁడు దామరాజు పద్మనాభముగారు. శంకరరావుగారికి నెలకు రెండువందలయేఁబదిరూపాయిలజీతము. పద్మనాభముగారికి నెలకు నూటయేఁబది రూపాయిలజీత మున్నను నతఁడు లంచగొండులకెల్ల నగ్రగణ్యుఁడై, తనకుఁ గావలసి నన్ని లంచములను గ్రహించుచు, క్రిందియుద్యోగస్థుల కిప్పించుచు, భార్యమెడలో నగలుదిగవేసి లక్ష్మితోఁ దులతూఁగుచున్నందున, రామచంద్రుఁడు లంచములపేరయిన వినఁడుగనుక వారికందఱకుఁ బరమశత్రువై యుండెను. దేశముననున్న కాఁపులందఱును, తమయిండ్ల కర్మములఁ జేయించి యాచించు బ్రాహ్మణుల నెట్లో స్వల్పదానములచేతఁ దృప్తిపఱచుచుండిరి కాని, తమయిండ్ల కెన్నఁడునురాక మాటిమాటికి పాదపూజలు దెమ్మని పత్రికల నంపుచుఁ దమ కుపవాసవ్రతము నేర్పుచుఁ గచ్చేరీలోనున్న యీబ్రాహ్మణోత్తముల నెంతో ధనమిచ్చి పూజించియు, వారియనుగ్రహపాత్రులుగాకయే యుండిరి. ఈకారణములచేత రామచంద్రుఁడు చిన్న యుద్యోగస్థుఁడయ్యు తనకంటె ననేక రెట్లెక్కువ జీతముకల గొప్పయుద్యోగస్థులకుఁగూడ ప్రక్కలో బల్లెమై, తనపేరు చెప్పిన మాత్రమున వారు భయపడునట్లు ప్రవర్తించుచుండెను. తక్కువ

వాఁడైనను సన్మార్గుఁడు, గొప్పవాఁడైన దుష్టునకు భయహేతువేకదా. రామచంద్రుఁడాయుద్యోగములోఁ బ్రవేశించిన యారుమాసములకే శంకరరావుగా రతనికి ముప్పదిరూపాయిలపని నిచ్చిరి. రామచంద్రుఁ డెప్పుడును దురదృష్టవంతుఁడై గనుక నింతలో మహారాజుగారు శంకర రావుగారిని నాలుగువందలరూపాయిల జీతముమీఁద విజయనగరమునకు రమ్మని యుత్తరువుఁ జేసిరి. శంకరరావుగారు వెంటనే ప్రయాణమై శ్రీ మహారాజుగారితో రామచంద్రుని సత్ప్రవర్తనాదులఁగూర్చి విన్నవింతు మనియు, త్వరలో నీతని నభివృద్ధికిఁ దెత్తుమనియు, వాగ్దానముచేసి వెళ్ళిరి. ప్రాపకులు వెళ్ళిపోవుచున్నందునను మిగిలినవారు తనకు శత్రువులగుటను రామచంద్రునకు శంకరరావుగారి పోక విచారముగా నుండెను. లంచగొండుల కంకుశమువలెనున్న శంకరరావుగారు వెళ్లిపోయి నందులకు సంతోషించుచున్న చిన్నయుద్యోగస్థుల యదృష్టముననో రామచంద్రుని దురదృష్టముననో శంకరరావుగారి యుద్యోగము పద్మ నాభముగారి కయ్యెను. పద్మనాభముగారు క్రొత్తయధికారమును వహించఁగానే, రామచంద్రునియందు క్రోధమును గూడ వహించి యతఁడు చక్కఁగాఁ బనిఁజేయుచున్నను, సోమరియనియు, నవిధేయుఁ డనియు, పెంకెవాఁడనియు, వ్రాసినదెల్ల తప్పనియుఁ దిట్టుచు, మహారాజు గారి కీసంగతిఁ దెలియఁజేతునని బెదరించుచు, జీతములో సగము గునహాలక్రిందనే తగ్గించుచు నానాక్షోభలఁ బెట్టసాగెను. రామచం ద్రుఁడును దైవముమీఁద భారమువేసి ధర్మమే జయించునని శాంతించి యూరకుండెను.

అక్కడ నమలాపురములో రామచంద్రుఁ డెందులోనో దిగి ప్రాణ హత్యఁ జేసికొన్నాఁడని యందఱు ననుకొనిరి. కృష్ణవేణమ్మ తనకుమా రుని నిమిత్తమే విచారించినట్లు విచారించెను. శరభరాజుగారును దన మూలమున నిష్కారణముగ బ్రాహ్మణహత్య తటస్థమయినదని విచా

రించి సోమావధానుల నడిగి కొన్ని జపములు చేయించి దోషశాంతిని జేసికొనుచుండెను. రాజగోపాల మారహస్య మెఱిఁగినవాఁడే కనుక తానుగూడ విచారించినట్లు నటించెనే కాని నిజముగా దుఃఖింపను లేదు, తల్లిదండ్రులకావర్తమానము నెఱుఁగఁజేయను లేదు. వెంకటరత్నము బ్రహ్మానందభరితుఁడయి తన కింద్రాధిపత్యము వచ్చినట్లుండెను. పార్వతికి వేఱుసంబంధములు వచ్చెను. పార్వతివివాహపుమాట జ్ఞాపకమైనపుడెల్ల శరభరాజుగారు రామచంద్రుని మరణమునకుఁ దానె కారణుండని విచారించుచుండెను. గ్రామములోనివా రందఱు శరభరాజుగారితో నప్పుడప్పుడు రామచంద్రునివిషయమై మాటలాడుచు, నతఁడు మహాసద్గుణుఁడనియు, వాని వెళ్ళఁగొట్టినందున వారికిఁ బాపము కలదనియును జెప్పుచు వచ్చినందున శరభరాజుగారికి రామచంద్రుని వెడలఁగొట్టినందులకుఁ గొంచెము విచారము కలుగుచుండెను గాని యాయన కనుమానము సంపూర్ణముగా నివారణము కాలేదు. ఒకనాఁడు శరభరాజుగారును, చాకలివాఁడును గలిసి రాత్రి జామైనతరువాత దొడ్డవర మత్యావశ్యక మైన పనిమీఁదఁ బోవుచుండఁ ద్రోవలో నొకనూఱుగజములదూరమున నొకవివాద వినఁబడెను. ఆ రాత్రివేళ చీఁకటిలో కలహమాడు చున్నవారెవరో తెలిసికొనవలెనని శరభరాజుగారు కొంచె మాగిరి. వివాదపడుచున్న యీ మనుష్యులిద్దఱును శరభరాజుగారిని కాని చాకలివానిని కాని చూడక తమ కడినఱకు జరుగుచున్న కలహమును మానరైరి. శరభరాజుగారు వెళ్ళి యక్కడ నిలుచున్న తరువాత నాపురుషులకిట్లు వివాదము జరిగెను.

ప్రథముఁడు—అంతకోపము గలవాఁడవైన పక్షమున నాభాగము నాకు బాఱవేయరాదా ? ఎంతన్యాయమో యంతనాకు నిచ్చివేయి.

రెండవవాఁడు—నీ కివ్వవలసినదేమో నేఁదివఱకే యిచ్చినాను.

నాదగ్గఱ నిప్పుడేమియు లేదు. నే నిప్పుడు వీధిలోకి వెళ్లుటలేదు నాకాలు తెగవాఁచినది. అడుగుతీసి యడుగు పెట్టలేక యలోలక్షణా యని నే నేడ్చుచున్నాను.

ప్రిథ—అవసరములు తీరినవికదా? ఏరుదాఁటి తెప్ప తగులఁబెట్టినావు. కావలసినదంత నీచేతఁ జిక్కినదికదా. నీ వెన్నియాటలనైన నాడెదవు. నాజుట్టు నీచేతిలోనున్నదికనుక నీవీలాగునఁ జేసినావు.

రెండ—(కోపముతో) నీవు నాకుఁ జేసిన సహాయము లేమిటి? నేనుచేసిన ద్రోహము లేమిటి? ఆవేళ వస్తువు లమ్మఁగా వచ్చిన సొమ్ములో పాతిక రూపాయిలు పుచ్చుకొంటివి. అంతకంటె నీకెక్కువ యేలాగున రాఁగలదు.

ప్రథ—ఛీ. నోరుముయ్యి; అమ్మినవాసి కేఁబది, నీ కేఁబది నాకేఁబది, యనికాదూ మొదట నేర్పఱచుకొన్నది. తక్కినపాతికె నాకియ్యనక్కఱ లేదా? కష్టపడియమ్మి నానాబాధలు పడ్డవాళ్ళము మేమును పయినుండి కఱ్ఱపెత్తనమును జేసి యెక్కువలాభమును గొట్టేవాఁడవు నీవునా?

రెండ—తెగనీల్గుతావేమి. పొట్టకూటికిఁ జేరిన వెధవవు. నీకివ్వను. నీయబ్బతోఁ జెప్పుకో. మెత్తమెత్తఁగా నూరకున్నందుకా వేషములు వేస్తావు. నీవేషములు నాదగ్గఱ తీసిపెట్టు.

ప్రిథ—నీబెదరింపులు నాదగ్గఱ కావు. బ్రహ్మచారివిధవవు. నీవీలాగే గొంతుకుఁ గోస్తావని నే నప్పుడే యనుకొన్నాను. నీమాటలు నమ్మి నిష్కారణముగ నేను రామచంద్రునితో విరోధము దెచ్చుకొని యేమియెఱుఁగని పిల్లవానిని నానాహింసలు పెట్టినాను. తమ్మంట్లు నీవే తీసికొన్నావు. నీవూనేనూ పోగయి వానికొంపఁ ద్రవ్వినాము. ఇంత దిక్కుమాలిన బుద్ధులున్నవికనుకనే పాముకఱచినది.

రెండ—నీవుమాత్ర మెన్నిపాములుగఱవకుండ దాఁటఁగలవు? ఇల్లలుకఁగానె పండుగ కాలేదు. నీవు నన్నాక్షేపించ నక్కఱలేదు.

నాకంటె నీవు రెండాకులెక్కువచదివినావు. మంత్రిప్రగడహరి వంశమునఁ జెడఁబుట్టినావు. నీమూలమున శరభరాజుగారు తలయెత్తుకొని తిరుగడములేదు.

ప్రథ—నీయంతదుర్మార్గుఁడనుగానులే. ఇంట జూదమొకటిపెట్టి యందఱిని యింటికిఁ బిలిచి కొంపలు తీయడములేదు. కూచిమంచివారంతా యగ్రహారములు కట్టించి కీర్తిసంపాదించుచున్నారు. నీవు బ్రహ్మచారివై లోకము తగులఁబెట్టుచున్నావు. సిగ్గులేక నీవు మాటాడవలెనా?

రెండవ—బ్రహ్మచారినైనా నీవలె ముండనుంచుకొని దాని చేతికూడు తినుటలేదు. అబ్రాహ్మణముండాకొడుకా, నోరుముయ్యి, సిగ్గులేదేమి?

ప్రథ—నాముండజోలినీకెందుకు. దానిసంగతి నీవెత్తకు. ఏమయిన నన్నను. రామచంద్రుని యుసురుకొట్టి చచ్చిపోతావు.

రెండవ—నేను తమ్మంట్లు తీసికొన్నాను. నీవుదొంగవస్తువులమ్మించినావు.

ప్రథ—వానిమేనమామ చచ్చినాఁడని దొంగవర్తమానము చెప్పించిన మహానుభావుఁడవు నీవేకాదూ? నేనాలాటిపనులు చేయలేదు.

రెండవ—ఛీ, విధవవు. చెప్పుఁదీసికొని చెంపలుపగులఁగొట్టుతాను.

ప్రథ—కొట్టకపోతే నీవు బ్రాహ్మణుఁడవుగావు. ఏదీ కొట్టు.

రెండవ—పాముగఱచినప్పటినుండి నాకాలువాఁచి కదలనీయడములేదు. అందుచేత లేవలేనుగాని లేకపోతే నిన్నీవేళ చంపివేతును విధవా.

ప్రథ—ఆపని నేనేచేస్తాను. చూడు (అని కఱ్ఱతోఁగొట్టెను.)

రెండవ—ఆఁఆఁ—కొట్టుకొట్టు. (అనిచేతులడ్డము పెట్టుకొనుచు) నీకాలాగు దొళ్లుదోవవచ్చినది. నీసంకటము కుదుర్చఁగలనులే.

ఇట్లాపురుషులిద్దఱు నొకరిరహస్యము లొకరుబయటఁబెట్టుకొను చు కలహమాడుచుండఁగా శరభరాజుగారామాటలు విని యందులో నొకఁడు వెంకటరత్నమనియు, రెండవవాఁడు శోభనాచలమనియుఁ గంఠ ధ్వనినిబట్టి యానవాలుపట్టి చాకలివానితోఁగూడ వారియెదుటకుఁబోయి నిలిచిరి. ఎదుటనిలిచిన శరభరాజుగారిని జూచి వెంకటరత్నమును శోభ నాచలమును భయవిస్మయములతోఁ గదలలేకపోయిరి. అప్పుడు శరభ రాజుగారు వారితో నిట్లుమాటాడిరి.

శర—ఏమిరా వెంకటరత్నము! ఈవివాదమేమిటి. నీకు శోభనా చల మెందుకు సొమ్మియ్యవలెను? నీకును శోభనాచలమునకును గల వ్య వహారమేమిటి?

వెంక—(తలవంచి యూరకొన్నాఁడు.)

శర—ఓరి దుర్మార్గుఁడా! నీవేమో నమ్మకముగలవాఁడవనియు నాకుఁ బ్రీతిపాత్రుఁడవనియు నేననుకొన్నాను. సత్పురుషుఁడైన రామచం ద్రునికూటిలో దుమ్ముబోసిన మహానుభావుఁడవు నీవేనా? మామంత్రి ప్రగడవారి వంశమునఁ దప్పఁబుట్టినావురా! నీమాటలనునమ్మి నిష్కారణ ముగా రామచంద్రుని లేవఁగొట్టినాను. అతనిమనస్సెంతక్షోభపడినదో! మేనమామ చచ్చినాఁడని దొంగవర్తమాన మతనికిఁజెప్పి వానిచేదొంగ వస్తువుల నమ్మించి యాసొమ్మువిూరు పంచుకొన్నారా? అవురా! ఎంత వాఁడవురా! ఛండాలుఁడా!

(శోభనాచలముతో) ఏమయ్యా, నీకు బుద్ధిలేదు. అభము శు భము నెఱుఁగనికుఱ్ఱవాని తమ్మంట్ల నపహరించుటకు నీకు చేతులేలాగు వచ్చిన వయ్యా! పాముగఱచి బాధపడుచున్నావు. నీకిప్పటికైన సిగ్గురా లేదూ? విూరిద్దఱు మేకతోలును గప్పుకొన్న పెద్దపులులుగదా!

శోభ—(శరభరాజుగారి కాళ్ళమీఁదఁబడి) అయ్యా! రామచం ద్రుని సమస్తవిధముల భంగపఱచినాను. ఈవెంకటరత్నమును నేనును

గలిసి చేయరాని పాపములన్నియుఁ జేసినాము. తమరు క్షమించినట్లయిన నింకొక్క సంగతినిగూడఁ జెప్పెదను. తమ పిల్లవాని వస్తువులు—

శర—(ఆశ్చర్యముతో మాట కడ్డమువచ్చి) అవితీసి కుఱ్ఱవాని నోట గుడ్డలుకుక్కినవారు మీరే? అయ్యో! ఇఁకమిమ్ము బ్రతుకనీయఁ గూడదు. మీరు లోకములను మ్రింగివేయఁగలరు. ఎంతవాళ్ళయిన నవుదురు రామీరు. అన్నా వెంకటరత్నము! మాయింటనుండి మాకుఱ్ఱ వానినే చంపఁదలఁచుకొన్నావా? ఛీ నాయెదుటనుండి లేచిపో. నీమొగమును జూడఁగూడదు.

వెంక—(ఏడ్చుచు) అందులో నేనేమియెఱుఁగనండీ. మీపాదములసాక్షి.

శోభ—అయ్యా! మీనరసింహముయొక్క వస్తువులు నేనును మఱియొక్కఁడును కలిసితీసినాము. వెంకటరత్నమందులో నేమియు నెఱుఁగడు. నావంటి మహాపాతకుఁ డెక్కడను లేడు. నేను రామచంద్రుని గొట్టుటకు వెళ్లుచుండఁగా ముక్తేశ్వరము త్రోవలో నన్ను పాముగఱచినది. నేను రోగముచేతఁ దీసికొనుచున్నాను. నాకు బుద్ధివచ్చినది. ఇఁక నే బ్రతుకను నన్ను క్షమించండి నాకభయమిచ్చినదాఁక మీకాళ్లువదలను.

శర—ఓరీ వెంకటరత్నము. మాయింటనుండి లేచిపో. రామచంద్రుఁడు చచ్చిపోయినాఁడుగదా. నీమూలమున నాకు బ్రాహ్మణహత్య కూడ వచ్చినది.

వెంక—అతఁడు కోటిపల్లిలో నున్నాఁడట. చచ్చిపోలేదు.

శర—ఇఁక నాతో మీరు మాటాడవద్దు పొండి.

అని శరభరాజుగారు ప్రయాణమును మానుకొని గ్రామమునకుఁ దిరిగివచ్చి యింట నందఱితో నాసంగతిని జెప్పఁగా వారందఱును నిజము నేఁటికిఁ దెలిసినదికదాయని సంతోషించిరి. రాజగోపాలము పరవశత్వమును జెందెను. శరభరాజుగారు బ్రాహ్మణులను క్షోభపెట్టుట

సంపన్నగృహస్థులకు క్షేమముగాదని యోజించి శోభనాచలమును వెంకటరత్నమును క్షమించిరికాని తిన్నగా విచారింపకుండ రామచంద్రుని క్షోభపెట్టినందున పరిపరివిధముల నొచ్చుకొనుచుఁ బశ్చాత్తాపమును జెందిరి. మఱునాఁడుదయమున లేచి సోమావధానులను బిలిపించి, పార్వతిని రామచంద్రునకిచ్చి వివాహముచేతుననియు, ముహూర్తమును బెట్టుమనియుఁ జెప్పి మంచిలగ్నమును బెట్టించి, రాజగోపాలము శరభరాజుగారు సోమావధానులును గలిసి రామచంద్రునితో నీసంగతిఁ జెప్పుకొనుటకు మధ్యాహ్నము బయలుదేరి కోటిపల్లి వెళ్ళిరి.

శంకరరావుగారు విజయనగరమునకుఁ బోవుటవలన నేఁబదిరూపాయిలపని కచ్చేరిలో నూరకయున్నందున నాపని రామచంద్రునకు నియ్యఁగూడదని పద్మనాభముగారు వ్రాసినను, శంకరరావుగారి సాహాయ్యముచేత నది రామచంద్రునకే యయ్యెను. ఆపని యాతనికైన నెలదినములకు కోటిపల్లి పరగణాయందుఁ గొన్ని తొందరలుగలిగినందున తన్నివారణార్థము మహారాజుగారు శంకరరావుగారి నక్కడకంపిరి. ఆయనవచ్చినతోడనే వ్యవహారములన్నియుఁ జక్కఁబడెను. ఆయన నాల్గుమాసములక్కడనుండిరి. క్రమక్రమముగా శంకరరావుగారికిని రామచంద్రునకును బరస్పరానురాగ మభివృద్ధిఁ జెందెను. శరభరాజుగారును రాజగోపాలమును సోమావధానులును, వచ్చి రామచంద్రునియిల్లు తెలిసికొని, యతని యెదుటికిరాఁగా వారిని జూడఁగానే రామచంద్రుఁ డాశ్చర్యపడెను. తరువాత వారి నందఱను రామచంద్రుఁడు మర్యాదచేసెను. ఒకరి యోగక్షేమముల నొకరడిగిన వెనుక వారిట్లు మాటాడిరి.

శర—రామచంద్రుఁడూ! నీకు నేను మహాపకారమును జేసినాను. నీవెట్లు వాళ్ళమాయలోఁ బడినావో నేనును నట్లేపడినాను. నన్ను నీవు క్షమించవలెను.

రామ—మీరంతమాట సెలవియ్యవద్దు. మీరు పొరబడినారు.

మీ రదివఱకుఁ జేసిన యుపకారమును నేను మఱువను. ఇది యెల్ల మీచలవేకదా?

శర—నేను మాపార్వతిని నీకిచ్చి వివాహముచేసెదను. వివాహ మీవేళకుసరిగా నెలయున్నది. ఉభయులకుఁ గావలసిన సొమ్మంతయు నేనే వ్యయముచేసెదను. మీబంధువుల నందఱి నీలోఁగాఁ బిలిచి మా బంధువులకు శుభలేఖలు వ్రాసిపంపెదను. అప్పటికి నీవు సెలవుఁబుచ్చుకొని రావలెను. పాలకిఁగూడ నక్కడనేకుదిర్చియుంచుతాను. మేమింక ప్రయత్నములు చేసికొంటాము.

రామ—మాపినతండ్రిని మామేనమామను బిలువవలసినది. అంతకంటె నాకు బంధువులులేరు.

రాజ—రామచంద్రుఁడూ! శోభనాచలమును వెంకటరత్నమును తమలోఁదాము కలహమాడి యొకరిరహస్యముల నొకరు బయలుపెట్టుకొనిరి. అది మాబాబయ్యవిన్నాఁడు. నిజము నేఁటికిఁ దెలిసినది. వెంకటరత్నమును లేవఁగొట్టినారు.

రామ—దైవానుగ్రహమున్నది కనుక నిట్లయినది.

ఇట్లువివాహము నిశ్చయించి యారాత్రి వారందఱు నక్కడనుండిరి. రామచంద్రుఁడు శరభరాజుగారిని శంకరరావుగారియొద్దకుఁదీసికొనిపోయి దర్శనముచేయించి యీకాలపు విశ్వాసఘాతుకులవలెగాక తానుద్యోగముచేయుచున్నను పూర్వము శరభరాజుగారియింటఁ దానున్నట్లు చెప్పుకొనుట కభిమానము లేక యాయనతనకుఁజేసిన మహోపకారముల నెల్ల నుగ్గడించి శరభరాజుగారి గుణములను తగునట్లు శ్లాఘించెను. వారందఱును మఱునాఁడు ప్రయాణమైపోయిరి. రామచంద్రుఁడు వివాహనిమిత్త మొకమాసము సెలవిమ్మనియడిగెను. పద్మనాభముగారు వీలు లేదని యుత్తరువుచేసిరి. ఈవర్తమానము రామచంద్రుఁడు శంకరరావుగారితోఁ జెప్పఁగా నాయన పద్మనాభముగారిని చీవాట్లుపెట్టి సెలవు

నిప్పించిరి. వివాహ మొకవారమున్నదనఁగా రామచంద్రుఁ డొకనాఁడు వీధియరుగుమీఁదఁ గూర్చుండఁగా నతని పినతండ్రి జగన్నాథమువచ్చి కూర్చుండి రామచంద్రునితో నిట్లుచెప్పెను. 'నాయనా విన్నావా జరిగిన సంగతి. శరభరాజుగారు నీకుఁ దనకొమార్తె నిత్తునని ముహూర్తము పెట్టించి మమ్ముల నందఱినిబిలిచి తిరిగి నాలుగుదినములకిందట, వేరే క్రొత్తసంబంధమునిశ్చయించుకొన్నారఁట. మనసంబంధముకంటెఁ గొప్పది తెచ్చుకొన్నారు. వెయ్యిరూపాయిలు వరదక్షిణకూడా యిచ్చినారఁట. గొప్పవారుగనుక చెల్లినది. మన మీలాఁటిపనిఁ జేసినపక్షమున సాటివాళ్ళు తాటియాకులుగట్టుదురు. వారి నెవరు నోరెత్తి మాట లనలేక పోయినారు. గొప్పవాళ్ళందఱికి వినాశకాలమీలాగేయుండును. చూడు వారుచేసిన నగుబాటుపని.

రామ—(విస్మయముతో) శరభరాజుగారాలాఁటిపనిఁ జేయుదురా.

జగ—చేయ కేమి. ఆయన పైకాలా గగుపడునేకాని లోపల విషము. నీవు నీచుఁడవఁట. ఆశరభరాజుగారికి నీకియ్యవలెనని యున్నది కాని నీచపుసంబంధమని బంధువు లందఱు నాక్షేపించినారఁట. అందుచేత నీకుఁనే నొకసంబంధముఁ గుదిర్చినాను. నీకిష్టమున్న పక్షమునఁ జేసికొనవచ్చును.

రామ—నీవే పెద్దవాఁడవు. నీకిష్టమైన సంబంధము తీసికొనిరా.

జగ—కపిలేశ్వరములో మనవాళ్ళున్నారు. వారు శరభరాజుగారికన్న గొప్పవాళ్లు. సంవత్సరమునకు నాలుగువేలరూపాయిలువారికి భూములమీఁద వచ్చును. పిల్ల మకరమువంటిది. పెమ్మరాజు ప్రసాదరాయుఁడుగారి కొమార్తె. నీమంచియోగ్యతనుజూచి నీకు పిల్ల నివ్వవలెనని వారికున్నది. ఆయన మిక్కిలిమంచివారు. ఆయన వారము దినములలో నిక్కడికి వచ్చి నిన్ను జూచి ముహూర్తము నిశ్చయించుకొందురు.

రామ—గొప్పవారిని నమ్మఁగూడదు. చెప్పెడుమాట యొకటి చేసెడిదొకటి.

జగన్నాథ మీవర్తమానమంతయు రామచంద్రునితోఁ జెప్పి మరునాఁడు వెళ్ళిపోయెను. శరభరాజుగారు వేఱుసంబంధము కుదుర్చుకొనుటచేత రామచంద్రుఁడు మునుపటి ముహూర్తమునకు నమలాపురము వెళ్ళలేదు. జగన్నాథముగారు వెళ్ళిన పదిదినములకు నొకనాఁటిరాత్రి పండ్రెండుగురుబోయీలు పాలకీ నెక్కి యొకకాగడా వేయించుకొని మంచిబట్టలు ధరించుకొని పెమ్మరాజు ప్రసాదరాయుఁడుగారు వచ్చిరి. రామచంద్రుఁ డాయన కెదురుగాఁబోయి తీసికొనవచ్చి మర్యాదచేసెను. ఆయనతోఁగూడ నొకబ్రాహ్మణుఁడు పసుపు, కుంకుమ, పండ్లు చాకలివానిచేతఁ దెప్పించి యచటంబెట్టెను.

ప్రసా—అబ్బాయీ! మీపినతండ్రిగారువచ్చి నీతో మాటలాడినారా?

రామ—సంగతులన్నియుఁ దెలిసినవి. ఆయన వచ్చినారు.

ప్రసా—వివాహ మిప్పటి కారునెన్నిక్కదినములున్నది. సిద్ధముగానుండుడు. మాపిల్ల చిన్నతనమందు జబ్బుపడినపుడు మేము వెంకటేశ్వరసాన్నిధ్యమందు వివాహము చేయుదుమని మ్రొక్కుకొన్నాము. అందుచేత వాడపల్లిలో నీకార్యము చేయఁదలఁచు కొన్నాను. ఒక్కనాఁటి పెండ్లియని సందేహింపకుమనిచెప్పి బ్రాహ్మణుఁడుదెచ్చిన పసుపు కుంకుమ రామచంద్రునికిప్పించెను. బోయీలు సవారిఁదీసికొని వెళ్ళిపోయిరి. బ్రాహ్మణుఁడును వారితో వెళ్లెను. ప్రసాదరాయుఁడు గారక్కడ మరునాఁడుండిరి. ఆదినమున నాలుగుగడియల ప్రొద్దెక్కిన తరువాత రామచంద్రుఁడును ప్రసాదరాయుఁడుగారును మాటలాడుచుండఁగా రాజగోపాలముఁవచ్చి రామచంద్రునితో నీప్రకారము కఠినముగా మాటాడెను.

రాజ—ఏమోయి రామచంద్రుఁడూ! పరువైన నియోగుల

యింటఁ బుట్టినావుగదా! నీవీలాంటిబుద్ధు లెక్కడ నేర్చుకొన్నావు? నీకు మాసంబంధ మిష్టమున్న యెడల రావలెను. ఇష్టములేని పక్షమున రానని స్పష్టముగాఁ జెప్పవలెను. నీమాత్రపు పెండ్లికొడుకు మాకు కుదురకపోఁడు. మొదటవస్తానని చెప్పి ముహూర్తముఁ బెట్టించి రాక మోసము చేయఁదలఁచుకొన్నావా? నలుగురుబంధువులలో నగుభాటువచ్చి తలయెత్తుకొనలేక పోయినాము. ముహూర్తము దాటిన తరువాత నీవు రావని మీపినతండ్రిగారు చెప్పినారు. ఆమాటమొదట మాతోఁ జెప్పక పోయినారా?

ఆమాటలు విని రామచంద్రుఁ డాశ్చర్యపడుచుండఁగా ప్రసాదరాయఁడుగారు తొందరపడ నారంభించిరి. ఇంతలో శంకరరావుగారు గుమ్మముముందటికి వచ్చి "కామయ్యా! ఇక్కడేనా" యని యడిగెను.

కామ—"ఇక్కడేనండి. అదుగో దిక్కుమాలిన ముండాకొడుకు నాకొంపఁదీసినాఁడు." అనియఱచెను.

శంక—కామయ్యా! తొందరపడకు. సంగతియంతయుఁ జెప్పు.

కామ—అయ్యా! ఆకూర్చున్నవాఁడు నాకొమార్తె నెత్తుకొని పోయి యీరామచంద్రునికిచ్చి దొంగతనముగా వాడపల్లిలోఁ బెండ్లిచేయఁ దలఁచుకొన్నాఁడు. ఈదుర్మార్గుఁడు దినమున కొక్కవేషము వేసికొని లోకమును మోసముచేయుచుండెను.

శంక—ఆతని చెవులనున్న తమ్మంట్లు మాతమ్మునిచెవుల నుండెడివని తోఁచుచున్నది.

రాజ—ఓయీప్రసాదరాయఁడా! నీసంగతియంతయుఁ జెప్పు. నిన్ను తక్కువశిక్షతోఁ బోనిత్తును. లేనిపక్షమున నీపాట్లు నీవనుభవింపఁ గలవు.

ప్రసా—అయ్యా! నన్ను క్షమించవలెను. నేటికి నేను దొరకినాను. మాది నిడదవోలు కాఁపురము. నాపేరు చామర్తి జనార్దనము.

రామ—అయ్యా! ఇతని పేరుయొక్క పొడియక్షరములున్న రుమాలు మాకు దొరికినది. దానిమీఁద ‘చా. జ’ యని యున్నది.

శంక—అతని వృత్తాంతము నంతను జెప్పనిమ్ము.

ప్రిసా—నేను చిన్నతనమునందె పిత్రార్జితమగుద్రవ్య మంతయు జూదమునందు వ్యయపెట్టి జోగినై యమలాపురము ప్రవేశించి కూచిమంచి శోభనాచలమునకు స్నేహితుఁడనై యనేక పాపములను జేసినాను. శోభనాచలముయొక్కయు, వెంకటరత్నముయొక్కయుఁ బ్రోత్సాహముచేత కస్తూరామయ్యయను పేరుపెట్టుకొని, యీరామచంద్రుని మేనమామవచ్చినాఁడని దొంగవర్తమానమును జెప్పినాను. దేశిరాజు సూర్యనారాయణ యను పేరుపెట్టుకొని యిత్తడికంటెయు, గాజురాయి వేసిన యిత్తడి యుంగరమును రామచంద్రుని కిచ్చి బంగారపు వస్తువులని యమ్మించినాను. శరభరాజుగారి రెండవకుమారుని నగలన్నియు నేను శోభనాచలమును దీసికొని పిల్లవానినోట గుడ్డలుకుక్కినాము. తరువాత నాకునువారికిని వివాదమువచ్చినది. ఇప్పుడు రామచంద్రునిపినతండ్రి జగన్నాథము నాయొద్దకువచ్చి రామచంద్రునకు శరభరాజుగారి సంబంధము వచ్చుట కోర్వఁజాలక యాపెండ్లి చెడఁగొట్టి బీదపిల్లను జేయుమని నన్ను వేఁడుకొన్నాఁడు. కాఁబట్టి నేనీవిధముగా నీబ్రాహ్మణునికొమార్తెను దొంగిలించుకొని రామచంద్రునకుఁ బెండ్లిచేయఁదలఁచుకొన్నాను. నేఁటికి మీచేతఁ జిక్కినాను.

శంక—నిన్నువదలరాదు. ఏమోయి వీరాస్వామి! ఈతనిని బట్టుకొని సంకెళ్లువేయండి.

అని సంకెళ్ళువేయించి చామర్తి జనార్దనమును విజయనగర మంపించెను. అక్కడ మహారాజుగా రతనికి నాలుగుసంవత్సరములు చెరసాలలో నుండునట్లు శిక్ష విధించిరి.

అందఱు నాదినమున నిండ్లకుఁబోయిరి. మఱునాఁడు శంకరరావు

గారువచ్చి రామచంద్రునితో నిట్లనిరి. "అబ్బాయీ; నీకు నాకొమార్తె
నిచ్చి వివాహముచేయవలెనని యున్నది. నీకుఁ జేసికొనుటకు నేమైన
నభ్యంతరమున్నదా? మాపిల్లనుజేసికొన్నయెడల నీవుమిగుల నభివృద్ధిని
జెందఁగలవుసుమీ" యనిచెప్పగానే రామచంద్రుఁడు "మీరునన్ను
క్షమించవలెను. నేనిదివఱకే శరభరాజుగారి కొమార్తెను జేసికొనుటకు
నిశ్చయించుకొన్నాను. మధ్య నీజనార్దనమువచ్చి యంతరాయమును
గల్పించినాఁడుకాని యీపాటికి వివాహమయియుండును. కాని మన
నియోగులలోనెల్ల మంత్రిప్రగడవారు మిక్కిలి గొప్పవారు. శరభరా
జుగారికి సంవత్సరమునకు మూఁడువేల రూపాయిలువచ్చును. ఆయన
జ్యేష్ఠకుమారుఁడు రాజగోపాల మిప్పుడు మాయింటనున్నాఁడు. అతనికి
మీకొమార్తెనిచ్చి వివాహముచేయవలసినది. అన్నివిధముల నాకంటె
గొప్పసంబంధము" అనిచెప్పగా శంకరరావుగారు "నీవువారిపిల్లనుజేసి
కోవలసినది. మాట తప్పఁగూడదు నీపెండ్లియైనతరువాత చూచుకొం
దము. నీవు వెళ్లుము" అని చెప్పిరి. రామచంద్రుఁడు శరభరాజుగారి
సంబంధముకంటె శంకరరావుగారి సంబంధమెక్కువదనియు, దానివలన
తన కనేకలాభము లున్నవనియు నెఱిఁగి మాట ముందుగానిచ్చి నందు
నను, చిన్నతనమునందు శరభరాజుగారియింటనున్న విశ్వాసముచేతను,
శంకరరావుగారి సంబంధమును నిరాకరించి శరభరాజుగారి కొమార్తెనే
చేసికొనుటకు నిశ్చయించి యమలాపురమునకు రాజగోపాలముతోఁ
గూడ బోయెను. త్రోవలో వారిట్లు మాటాడిరి.

రామ—నేను పెండ్లికిరానని మీతో నెవరుచెప్పినారు. ముహూ
ర్తమునాఁడు మీరేమనుకొన్నారు?

రాజ—ముహూర్తమునాఁడు నీవింకనువత్తువని కనిపెట్టుకొని
కూర్చున్నాము. ఎంతసేపటికిని నీవు రాకపోఁగా సెలవుదొరక లేదనుకొ
న్నాము. ఆమఱునాఁడు మీపినతండ్రివచ్చి "మావాఁడు మీసంబంధము

ను జేసికొనుఁడఁట. ఆయన కింతకంటె నెక్కువవారెవరో వచ్చినారా. మీ యిష్టమువచ్చినట్టుమీరు చేసికొనండి" యని చెప్పెను.

ఆమాటలువిని రామచంద్రుఁ డాశ్చర్యపడి తనపినతండ్రియొక్క యోర్వలేమికిసిగ్గుపడుచుఁ, దనతో నతఁడుచెప్పినమాటలును, బ్రసాదరాయుఁడుగారి సంబంధములును జెప్పి రాజగోపాలమును గడుపుబ్బద్దలగునట్లు నవ్వించుచు నమలాపురముచేరి శరభరాజుగారు మొదలగువారికిఁ గూడ నీవృత్తాంతమును దెలియఁజేసెను.

శరభరాజుగారిదివఱకే వివాహప్రయత్నములను జేసినందున వైశాఖశుద్ధనవమినాఁడు రామచంద్రుఁడు పార్వతిని బెండ్లియాడెను. రామచంద్రుని మేనమామయు నాతనికుటుంబమును దప్ప మఱి యేబంధువులును బెండ్లికొడుకువైపున రాలేదు. పెండ్లివారికి విశ్వనాథశాస్త్రులవారియింట విడిదినేర్పఱచిరి. ఉభయులకును గావలసిన ద్రవ్యమంతయు నాశరభరాజుగారే వ్యయముచేసి పెండ్లి సమస్తవైభవములతోడను జేసిరి. శ్రావ్యమైన తూర్యారావములతోడను, ముత్తయిదువుల పాటలతోడను, పచ్చనిపందిళ్ళతోడను, విప్రాశీర్వాదధ్వానములతోడను వివాహము మనోహరముగానుండెను. శరభరాజుగారు తక్కువసంబంధమును దెచ్చుకొన్నారని వారి బంధువులెవ్వరును రాలేదు. అమలాపురమునందే విద్యార్థిగానుండి యచ్చటనే యపనిందపాలయి, మరల నాగ్రామమునందే కడుమర్యాదగా వివాహమాడుచున్న రామచంద్రునిఁ జూచి, యందఱును సంతోషించిరి. అయిదుదినములును వివాహమైన తరువాత పదునాఱుదినములపండుగ యగువఱకు నమలాపురమునందే యుండి పిమ్మట కోటిపల్లి వెళ్ళెను. వివాహమైన రెండుమాసములలోనే శంకరరావుగారు తమకుమార్తెను శరభరాజుగారి జ్యేష్ఠకుమారుఁడగు రాజగోపాలమున కిచ్చి పెండ్లిఁజేసిరి. ఇట్లు శరభరాజుగారును శంకరరావుగారును వియ్యంకులగుటచేత రామచంద్రునియందు శంకరరావు

గారు మునుపటికంటె నెక్కువదయగా నుండిరి. తరువాత రాజగోపాలమునకు శంకరరావుగారు విజయనగరమునం దుద్యోగము నిప్పించి యతనినచ్చటికిఁ దీసికొనిపోయిరి. వివాహమైన యెనిమిదిమాసములకే పార్వతి వ్యక్తురాలయినందున మఱినాలుగుమాసములకు శరభరాజుగారు పార్వతికిఁ దగినసారెబెట్టి కాఁపురమునకుఁ బంపిరి. పార్వతియు రామచంద్రుఁడును కోటిపల్లిలో కాఁపురము చేయుచుండిరి.

సమాప్తము.

137

హేమలత.

హేమలత.

మొదటి ప్రకరణము.

ఒకనాఁటి సూర్యాస్తమయసమయమున శరీరమునందంతట భస్మముఁ బూసికొని కాషాయాంబరంబులఁ గట్టుకొనిన యొకమార్గస్థుఁడు యమునానదివైపునకు వచ్చుచుండెను. ఆతఁడేగ్రామమునుండి వచ్చుచుండెనో యేగ్రామమునకుఁ బోవుచుండెనో యెఱిఁగినవా రెవ్వరును లేరు. మార్గమధ్యమున నొకరిద్ద ఱాతనిని బలుకరించిరి. కాని వారి కతఁడెట్టి ప్రత్యుత్తరమును నీయలేదు. అది వేసవికాల మగుటచేతను, సకల జంతుభయంకరముగా నామధ్యాహ్నమున గాడ్పువీఁచుటచేతను, నామనుష్యుఁడు మార్గాయాసమువలన డస్సియుండెను. అతని యాయాసమునుబట్టి దూరప్రయాణము నతఁడు చేసెనని నిశ్చయముగాఁ జెప్పవచ్చును. అతఁడు రమారమి నలువదిసంవత్సరముల వయస్సు గలిగియున్నను, నంతవయస్సుగలవానివలెఁ గన్పడఁడు. ఆమనుష్యుఁడు పొడుగరి కాఁడు కాని కేవలము పొట్టియని చెప్పుటకువీలులేదు. శరీరము చామనచాయఁ గలదియైయుండును. ఆయననుజూచువా రందఱు నతఁడు సుందరపురుషుఁ డని యనకమానరు. లావుగానున్న శరీరమునం దాపాదమస్తకమును భస్మ మలఁదఁబడియుండుటచేతను మెడలో యజ్ఞోపవీతము వస్త్రముచాటుననుండి కనఁబడకుండుటచేతను, నతఁ డేజాతిమనుష్యుఁడో తెలిసికొనుట దుర్లభముకాని యాతఁ డుత్తరహిందూస్థానవాస్తవ్యుఁడనియు నందు బ్రహ్మక్షత్రియ వైశ్యజాతులలో నొకజాతి

వాఁడనియుమాత్ర మూహింపవచ్చును. తీవ్రమైన సూర్యతాపమువలన బయలువెడలిన చెమ్మటచేత శరీరమునం దలఁదుకొన్న భస్మ మక్కడక్కడ కరఁగిపోయి యతనిసహజకోమలమైన శరీరము జూపుచుండెను. గడ్డమును జడలును నతఁడు యోగియని చెప్పుచున్నవికాని చక్కఁగా నవి పెరుఁగకుండుటచేత నూతనముగా నాశ్రమస్వీకారము నొనర్చినట్లు చూపరు గ్రహింతురు. భగ్గుభగ్గుమని కాలుగాలుచుండినను, నెండవేడిమిచే శిరస్సు మాడుచుండినను, నతఁడు పాదరక్షలుకాని గొడుగుకాని ధరింపకయే దినమంతయుఁ బ్రయాణము జేసెను. బైరాగులదగ్గఱనుండు కక్షపాల, యతనిదగ్గఱ నుండెనుగాని యోగిజనుల కత్యంతప్రియములగు గంజాయియుఁ జిలుమును నందు లేవు. యమునానదీతీరముననున్న మధురాపుర సమీపమున కతఁడు నాలుగుగడియల ప్రొద్దువేళ వచ్చినను నేమికారణముననో పట్టణమునఁ బ్రవేశింపక క్రోసుదూరముననున్న మామిడితోఁపులో దాఁగియుండి సూర్యాస్తమయమయినతోడనే యాస్థలమునువిడిచి, చీఁకటి కాల మగుటచేత నొరులకంటఁబడకుండ యమునాతీరమునకుఁ బోవుచుండెను. నదీతీరమునఁ జేరినతోడనే చంకనున్న కక్షపాల యొకమూలఁబడవైచి కాలుసేతులఁ జన్నీటఁ గడిగి మొగముపై నానిర్మలోదకములఁ జల్లుకొని నాలుగుపుడిసిళ్ళ నీళ్ళుత్రాగి యచ్చట నిసుకతిన్నెపై నించుక శయనించెను. అప్పుడు యమునాజలబిందువులతోఁగూడ మలయమారుతమరుదెంచి యాప్తమిత్రుఁడువచ్చి మీఁదఁజేయివైచి తట్టునట్లు కడుమార్గాయాసము నొందియున్న యాతని శరీరమును స్పృశించి యాయాసము నపనయించెను. అతఁడును సకలజనసులభమైన యీదైవదత్త సౌఖ్యముచేత పరవశత్వమునొంది కనులు మూసికొని హాయిహాయియని కొన్నినిమిషములవఱకును దనకష్టములనెల్ల మఱచిపోయెను. ఆసమయమునం దాకాశమున ననంతకోటినక్షత్రములు మినుకుమినుకు మని జ్యోతులవలెఁ బ్రకాశించుచుండెను. అది

నిర్జనస్థల మగుటచే నీలకోడి, చిమ్మట, మొదలగుజంతువుల రొదతప్ప మఱియొకధ్వని యేదియులేదు. నిశ్శబ్దముగనున్న యాస్థలమునందు శయనించినతోడనే యతనికిఁ దనపూర్వవృత్తాంతము జ్ఞప్తికివచ్చి వానిని విచారమునందు ముంచెను. వెంటనే యతండు 'హాదైవమా! ఎంతకష్టము గలుగఁజేసితివి. ఆహా! ఏమి తురకలదౌర్జన్యము. ఈమహమ్మదీయ ప్రభుత్వ మెన్నఁడైన నశించునా!' యని తనలోఁ దా ననుకొనుచు వశముగాక వచ్చిన బాష్పజలమును దుడుచుకొని యాకాశమువంకఁ జూచునప్పటికి చిన్నమబ్బుకనఁబడెను. అది క్రమక్రమముగా గొప్పదై యాకసమునంతను నాక్రమించుకొనుటచేతను, దానితో గాలిమమారు వచ్చుటచేతను వర్షమువచ్చునని యోజించి యిసుకతిన్నెమీఁద బవ్వళించిన యీయోగి యెచట దలదాఁచుకొందునాయని చింతింపనారంభించెను. కొంచెమాలోచించునప్పటికి తాను పగలుదాఁగుకొన్న మామిడి తోఁపునకును నదికిని మధ్యనున్న పాడుదేవాలయ మతనకి జ్ఞప్తికిరాఁగా నటకుఁ బోవఁబ్రయాణమయ్యెను. ఆదేవాలయమునకును నదీతీరమునకును గొన్నిగజములదూరముమాత్రమే యుండుటచేత నీమనుష్యుఁడు త్వరితముగా నడిచి గుడివైపునకువెళ్లెను కాని యంతకుముందే చినుకులారంభమై యెండచేఁగాఁగియున్న యోగిశరీరమును వడఁకునట్లుచేసి యాతనివస్త్రములఁ దడిపెను. బట్టతడుపు జల్లువాన కురియునప్పటికి మన బాటసారి దేవాలయపు ముంగలిభాగమునకు నడిచెను.

ఆదేవాలయము మనమువ్రాయుచున్న యీకాలమునాఁటికి శిథిలావస్థనొందినను బూర్వకాలమునందుఁ గొన్నిదినము లున్నతదశయందుండెను. క్రీస్తుశకము ౧౦౧౮ వ సంవత్సరమునందు గుజనీమహమ్మదు హిందూదేశముపై దండెత్తి జగత్ప్రసిద్ధి పుణ్యక్షేత్రమగు మధురానగరమున తద్దేవాలయమును దోఁచుకొని స్వామివిగ్రహమును స్వహస్తములతోఁ బెకలించి దేవాలయములనెల్ల భూమితో మట్టముఁ

చేసెను. ఈదేవాలయ మూరుబయట నుండుటచేత మ్లేచ్ఛప్రభువు స్వయముగా నాశనము జేయలేదుగాని తద్భటులు విగ్రహనాశన మొనర్చి యందు సైన్య మవ్వీటనున్నంతకాలమును దాము వశించిరి. ఆనాఁట నుండియు నాకోవెల శిలావిగ్రహశూన్యమైయ్యు నప్పుడప్పు డర్ధరాత్రములయందు మనుష్యవిగ్రహములతోఁ గూడియుండుటఁగలదు. దూరదేశప్రయాణములను జేయుచున్న బాటసారులను, ద్రవ్యవంతులను వణిజులను దోఁచుకొని స్త్రీలను జెఱఁబట్టి స్వచ్ఛంద విహారముసేయు దుర్నీతిపరులగు చోరులకును దురాచారులకును నాదేవళము శరణ్యంబై యుండెను. అందుచేత దీపములు పెట్టినతరువాత మధురానగరవాస్తవ్యులెవ్వరు నాదేవాలయప్రాంతములకరుగరు. అరిగిన నపాయములేక రారు. ఒకనాఁడు శవదహనమైన గుర్తులు కనఁబడుటవలనను నింకొకనాఁడు మనుష్యులు ధరించు కొన్నివస్త్రములును జిలుమును గన్పడుటవలనను జనులా ప్రాంతమునకు బొత్తుగా వచ్చుటమానిరి. ఈప్రదేశమునకు నలుదెసలను దట్టముగ నున్న వృక్షములు పెట్టనికోటవలె నుండుటంబట్టి చోరులకు సదుపాయ మెక్కువగనుండెను. ఆయాలయమునందుఁ బూర్వము శ్రావ్యమైన మురళీనాద మొనర్చుచుఁ గాళీయాహిపడగలపై నాట్యముసలుపు శ్రీకృష్ణుని విగ్రహముండెనని పట్టణమునఁగల వృద్ధులప్పుడప్పు డాస్థలమును జూచునప్పు డనుకొనుచుందురు. తురుష్కులుచేసిన నాశనమునకుఁ దోఁడు కాలముఁగూడ దేవాలయ ప్రాకారమును నాశనదేవత పాలుచేసెను. మనము వర్ణించెడు కాలమునాఁటికి ముఖ్యాలయమొకటి తక్క మఱియేదియు లేదు. గర్భాలయము సహజముగా నంధకారబంధురమైయుండెను. నాఁటిరేయి మేఘములచే గుడియందుఁ జీఁకటి పదిరెట్లధికముగ నుండెను. మన తెరువరి తడిసిన వస్త్రముల నారఁగట్టి కక్షపాలయందున్న పొడిబట్టనుదీసి కప్పుకొని మహాగుహవలె భయంకరముగానున్న యాదేవళముఁ బ్రవేశింప జంకుచుఁ

జలిబాధ కోర్వఁజాలక లోనఁ జొరఁబడి తప్పటడుగు లిడుచుఁ గొంత దూరముపోయి పూర్వము విగ్రహముండునట్టి యున్నతస్థలమునఁ గూర్చుండెను. అతఁడక్కడఁ గూర్చుండి తన పూర్వాశ్రమ సంబంధమగు దుఃఖాలోచన సముద్రమున మగ్నుఁడై పరవశత్వముఁ జెందియుండ నా నిర్జన ప్రదేశమున నతనికి మనుష్యుల యలికిడి వినఁబడి యాతనిఁ జింతాసమాధినుండి మేలుకొలిపెను. నిర్మానుష్య ప్రదేశమున నరుల యలుకు డగుట కతఁడాశ్చర్యపడి యది నిజమా యబద్ధమా యని వితర్కించుచుండగా నిద్దఱు మనుష్యులు చీఁకటియందుఁ దళతళ మెఱయుచున్నఖడ్గములు హస్తములధరియించి గుమ్మముముందర నిలవఁబడిరి. అప్పటికి వర్షమాగిపోయినందున వారిదేహములంతగాఁ దడిసి యుండలేదు. చేతులనున్న ఖడ్గములను గోడకుఁ జేరవైచి గుమ్మము ముందఱ నిలిచి దేహములను దుడుచుకొనుచు వారొకరితో నొకరు మాటలాడక యెవరి నిమిత్తమో నిరీక్షించుచుండిరి. ఇట్లుకొంతసేపుచూచి వారిరువురు లోనఁ బ్రవేశించిరి. అందొకఁడు మహారాష్ట్రుఁడు రెండవవాఁడు తురుష్కుఁడు. తురుష్కుఁడు దీర్ఘకాయముతోను దూలములవలెనున్న భుజద్వయముతోను గుండెలను దాఁకుచున్న నల్లని గడ్డముతోడను జూచువారి కందఱకును భయమును గల్గించుచుండెను. భయంకరమైన యాతని ముఖావలోకనఁ జేసినవా రందఱును దయయనున దతనియందు లేదని నిశ్చయముగఁ జెప్పఁగలరు. మహారాష్ట్రుఁడు కొంచెము గొప్పకుటుంబమునం దుద్భవించినను గాలవశమున ధనాదులు గోలుపోయి దురాచారులస్నేహముఁ జేసి దౌర్జన్యములం దారి తేఱెను గాని ముఖవిలాసముఁ జూడఁ గొంచెము జాలిగలవాఁడని తోఁచును. అయినను దొంగతనము మనుష్యవధ మొదలగు దుష్కార్యముల నాచరించు నెడ జంకును సందేహమును నిరువురకును లేవు. అదివఱకు గోడలకుఁ జాఱవైచిన ఖడ్గముల నొరలలోనుంచి వారు దేవళము మునుముందరఁ గూర్చుండి యేదో యోజింపుచుండిరి.

అందు మహమ్మదీయుఁడు మహారాష్ట్రునిఁ జూచి యిట్లనియె.

'నందా! బాలాజీ యింకనురాకుండుటకు నేమి కారణము? అతనిమార్గమునం దెవరైనఁ బట్టుకొనియుందురా?

నందు—గులామల్లీ! నీకింత వెఱ్ఱియెందుకు? మన బాలాజీ యిదివఱ కెన్నఁడైనా నొకరిచేతఁ జిక్కెనా? అతఁడు దేవాంతకుఁడని యెఱుఁగవా?

గులా—అవును? నేనెఱుఁగుదును. అందుచేతనే మన కీవఱకెన్నఁడును జక్రవర్తివలని భయములేదు. మనరహస్యము బయలు పడలేదు?

నందు—మనచేత నీకార్యములఁ జేయించుచున్న రహిమాన్ ఖానలాయుద్దీను చక్రవర్తివద్ద గొప్పయుద్యోగమునం దుండఁగా మనకు నెవరిభయమును గలుగదు. అతఁడు సుఖవంతుఁడగుఁగాక!

గులా—మొన్నటిరాత్రి స్త్రీలను దోఁచుకొన్నపుడు దొరకిన నగలలో నెన్నవవంతు మనము తీసికొనునట్లు ప్రభువుగా రేర్పఱచినారు?

నందు—ఎంతయిచ్చిన నంతే మనమును బుచ్చుకొందము.

గులా—అదిసరె. కాని యాదినమున మనుష్యులను నఱికినట్లు నీవిదివఱకెప్పుడు నఱికియుండలేదు. ఒకదెబ్బకు రెండుతునకలుగదా! వహవ్వా? శహబాస్. అటువంటి యేటు మరిదొరకదు.

నందు—అదియొకలెక్కా? నెలదినములక్రిందటఁ బ్రయాగలో యాత్రార్థమరుగుదెంచిన యోధులను దోఁచుకొన్నపుడు దయాదాక్షిణ్యములులేక స్త్రీలను శిశువులను గూడ నఱికివేసినాను. నాఁడు నీవు చూడలేదా?

అని వీరిరువురు సంభాషించుకొనుచుండఁ బోతవిగ్రహమువలె నాలయమధ్యమున సుఖాసీనుఁడై యున్న మనబాటసారి భయముచే గడగడ వడఁకుచు నేమియుఁ జేయలేకయుండెను. వారిసంభాషణమునుబట్టి వారు మనుష్యహంతకులని యతఁడు తెలిసికొనెను, వారిదివఱ కితనినిజూడక

తమరహస్యముల బయలుపఱచుకొనుచుండిరి. అప్పుడు నందుఁడు కొంచెము గంజాయిపీల్చవలెననికోరి సంచిలోనున్న చెకుముకిఱాతిని యినుపముక్కను దీసి వానిరాపిడిచే నగ్నిని సృజించి చిలుములో గంజాయియాకును బొగాకును వైచి యందు నిప్పంటించి తాను నాలుగు గ్రుక్కలను త్రాఁగి గులామున కందిచ్చెను. ఈనిప్పువెలుతురున గులాము మనుష్యుఁ డాలయమున నున్నట్లు జాడకట్టి తనయనుమానమును నందుని చెవిలోవైచెను. సహజలక్షణమైన క్రౌర్యమునకు గంజాయి మత్తుతోడ్పడ, వెంటనే నందుఁడు త్రాఁచుబామువలె లేచి మన బాటసారి యున్నవైపున కరుగుచుండఁగా గులామాతని వెంబడించెను. అదివఱకే భయకంపితుఁడైన మన తెరువరి యీదురాత్ములు తనవైపు వచ్చుచుండుటఁజూచి కెవ్వున నఱచి స్మృతియెఱుఁగక తనయున్నస్థలము నుండి క్రిందఁబడెను. అతనిఁజూచి నందుఁడును గులామును నాశ్చర్యపడి యొండొరులతో నిట్లు సంభాషించిరి.

నందు—అరే! అన్నయ్యా! ఎవఁడురావీఁడు?

గులా—ఏవఁడో మనమాటలువిని మనగుట్టు బైటఁబెట్టఁదలంచినదొంగ.

నందు—ఈఛండాలు నిప్పుడేమి చేయుదము? ఏదీ కత్తి యీలాగునతే

గులా—కత్తితోఁ గొట్టవద్దు. ఈలాగునఁ జేయుదము. (అని చెవిలో రహస్యముగాఁ జెప్పెను.)

అట్లిరువురుఁ గూడఁబలుకుకొని నిస్పృహాహృదయుఁడై యున్న యీదీనునినోట గుడ్డలఁగ్రుక్కి శిరస్సునొకఁడును బాదములనొకరును బట్టుకొని మోసికొనిపోయి యతఁడు గిజగిజ తన్నుకొనుచున్నను వదలక నదీతీరముఁజేరి లోతునీటందిగి "చావుముండకొడక" యని వాని నందుఁ

బాఱవైచిరి. తరువాత వారిరువురు నాలయమునకువచ్చి యాతని కక్ష
పాలను వెదకి యందుండి కొన్నివస్తువులను సంగ్రహించి తమప్రియ
మిత్రుఁడైన బాలాజీ రాఁడని నిశ్చయించుకొని యాథేచ్ఛం జనిరి.

రెండవ ప్రకరణము.

ఆగ్రామమునకు రమారమి పదునైదుక్రోసులదూరమున, ‘పాలి’
యను చిన్నగ్రామము కలదు. తత్పరిసరముననున్న మండలమునకు
దానిని ముఖ్యపట్టణముగ నొనర్చి యందొక ప్రతినిధి నేర్పఱచి యాత
నికి సర్వస్వతంత్రాధికార మిచ్చి చక్రవర్తియగు నలాయుద్దీను పరి
పాలన మొనర్చుచుండెను. పాలిసర్కారున కీసమయంబున రహిమాను
ఖాను ఖిల్లాదారుగ నుండెను. అతఁడు మొదట పారసీక దేశమునుండి
వచ్చిన బానిసవాఁడయ్యుఁ దనస్తోత్రపాఠనైపుణ్యముననో దురాచార
సంపత్తిచేతనో యలాయుద్దీను చక్రవర్తి కాప్తవర్గములోనివాఁడై నా
నాటికి నున్నతపదవుల నొందుచుఁ దుదకు నీయధికారమునొందెను.
ఈతఁ డీనూతనపదవినొంది యిప్పటికి మూఁడుసంవత్సరములైనది. అధి
కారప్రాప్తియైనదిమొద లాతఁడు గర్వోన్మత్తుఁడై రాజకీయోద్యోగస్థు
లనందఱ నగౌరవంబుతోఁ జూచుచు నిజాధికారమునకు లోఁబడిన ప్రజ
లననేక కష్టములపాలుచేసి జనవిరోధియై యుండుటయేకాక యంతఃపుర
స్త్రీలను జెఱపట్టుటయు దురాచారులచే దొంగతనములఁ జేయించుట
యు లోనగు దుష్కార్యధౌరేయుఁడై యహోరాత్రములు మద్యపాన
మత్తుఁడై స్త్రీజన మధ్యంబునఁ గాలము బుచ్చుచుండెను. అది చిన్న
గ్రామ మగుటచే నచ్చటనున్న యుద్యోగస్థులలోనెల్ల ఖానుగారే
మహోన్నతపదవినున్న కారణమున జనసామాన్య మాతని నవాబని
చెప్పుకొనుచు నతని కటాక్షపాత్రు లగుటకు యత్నించు చుందురు.

వెయ్యేల, చండతరమైన భానుయొక్క పరిపాలనచేఁ బ్రిజలు మలమల మాఁడుచు నన్నవస్త్రములకు దూరులై యాతని మరణమెదురుచూచుచు సాధ్యమగునేని తామె యాతనిఁ దునుమ్టింపఁ దలంచుచుండిరి. ఈతఁ డన్యమతస్థులగు హిందువులకేకాక సదాచారపరాయణు లగు మహమ్మదీయులకు ననిష్టుఁడుగ నుండెను.

క్రీ॥ శ॥ ౧౩౦౧ వ సం॥రమున వేసవికాలమున నొకనాఁటిమధ్యాహ్నము పదుగురుమనుష్యు లశ్వారోహణ మొనర్చి పాలిగ్రామసమీపమునను వచ్చుచుండిరి. అందు ధవళతురంగమునెక్కి మన్మథునివలె లావణ్యనిధియైన యొకరాజపుత్రకుమారుఁడు సేనానాయకుఁడై తోడివారలను దనమృదుమధుర వాక్యములచే హెచ్చరించుచు నెండతాపమునకు నుస్సురనుచు వచ్చుచుండెను. మదనసింగు రమారమి యిరువదియైదు సంవత్సరముల వయస్సుగలిగి మూర్తీభవించిన పూర్ణయౌవనమువలె సర్వాంగసౌష్ఠవముతోడను నిరంతర మందహాసవిలసితమైన మొగముతోడను, విశాలవక్షస్థలముతోడను జూచువారెల్లరు మెచ్చునట్లుండెను అతని ధవళాశ్వముమీఁద పారసీకదేశపుజీను వేయఁబడియుండెను. చలువచేసిన తెల్లనిషరాయి దొడుగుకొని విశాలమైన జరీపట్టెలతోఁ దలతలమని సూర్యకాంతిచే మెఱయు తలపాగనుధరించి, నిగనిగకాంతులను గ్రక్కుచున్న నల్లమొహము లంగరకదొడిగి, నడుమును పటకాతో బిగించి, పైనున్న కాస్మీరశాలువ నెండకడ్డముగ మీఁదవైచుకొని గుఱ్ఱమును మాటిమాటికిఁ జబుకుతో బెదరించుచుఁ బ్రయాణముసేయుచుండెను. క్షత్రియకులశిరోభూషణుండును, దనయేలికయుఁ జిత్తూరురాజ్యసంరక్షకుఁడునునగు భీమసింగునకు మదనసింగు బాలుఁడయ్యు నాంతరంగికుఁడగుటచేత స్వామికార్య నిర్వహణమునకై యప్పు డాగ్రానగరమునఁ గారణాంతరమున వసించుచున్న చక్రవర్తియొద్దకుఁబోయి తనప్రభువు పంపిన సందేశమును దృప్తికరముగా నిర్వర్తించి చక్రవర్తిదయసంపాదించి

తిరిగి చిత్తూరున కతఁడుపోవుచుండెను. అలాయుద్దీ నతనితోఁగూడ నాజరుజంగను నతనినిచ్చి పాలిగ్రామమువఱకు మదనసింగునకు సహాయ మొనర్పవలసినదని పంపెను. నాజరుజంగు హిందూస్థాననివాసులగు మహమ్మదీయులలోఁ బ్రఖ్యాతిగన్న వంశసంభూతుఁడై గుణములచేఁ దనవంశమునకుఁ గీర్తిఁ దెచ్చుచుండెను. చక్రవర్తి కాతనియందు గొంత నమ్మకముగలదు. మదనసింగును నాజరుజంగును సహజసద్గుణసంపన్నులు కనుక నాగానగరమునం దున్నప్పుడిరువురకు స్నేహమయ్యెను. అట్లిద్దఱును బయలుదేఱి పాలిగ్రామమునకు వచ్చుచుండఁగా మార్గమధ్యమున బందిపోటుదొంగల సంఘమొకటి వారిపైఁ బడ శౌర్యరాశియగు మదనసింగు నాజరుసహాయమున దొంగలనందఱఁబాఱఁదోలి యందనే కులవధించెను. స్వభావసిద్ధముగ నతఁడు మోటచొరవయుఁ దెగువయుఁ గల శరీరలక్ష్యములేనిసాహసుఁ డగుటచే సంపూర్ణజయము నొందినను మెడమీఁద చిటికెనవ్రేలు పొడవుగల గాయము నొందవలసివచ్చెను. ఎండవేడిమిచేతను, గాయపుమంటచేతను తాళఁజాలక రెండు మూఁడు పర్యాయము లతఁడు మూర్ఛిల్ల సిద్ధముగనుండి వెంటనే తెలివిఁదెచ్చుకొని కష్టముమీఁదఁ బ్రయాణ మొనర్చుచుండెను. ఏకధారగ స్రవించుచుఁ జూపరకుఁ గనులు మిరుమిట్లుగొలుపుర క్తముచే నతనియంగరకాలన్నియుఁ దడిసి శరీరమున కంటుకొనిపోయి మిగులబాధకరముగనుండెను. మదనసింగుతోఁ జిత్తూరునుండివచ్చిన సేవకు లేవురును భయకంపితులై నోటమాటలేక హృదయస్థితవిచారమును నేత్రబాష్పములవలనఁ దెలియఁజేయుచుండిరి. స్వల్పకాల పరిచయుఁడైనను నాజరుజంగు తనమిత్రునియవస్థకు మిగులఁ గుందుచు నతనికి ధైర్యముఁ గలిగించుటకు బహువిధప్రయత్నంబులు సలిపెనుగాని యవియెల్ల వ్యర్థములయ్యెను. కొంతసేపు నిశ్శబ్దముగ నయ్యాశ్వికులు నడచిరికాని తుదకు నాజరుజంగు రసపుత్రకుమారునిఁ బలుకరించి "నాలుగుగడియ లోపిక గలిగి

యుండుము. గ్రామసమీపమునకు వచ్చినారము. ఆచెట్లచాటున నున్నదే పాలిగ్రామము" అని హెచ్చరించి కొంచెము మంచితీర్థ మతనికిఁ ద్రావనిప్పించెను. నీరుత్రాగి సేదదేఱి రసపుత్రుఁడు ధైర్యమునుబూని గుఱ్ఱముపైఁ గూర్చుండగా మరల నాజరుజంగిట్లనియె. "ఈగ్రామమున మాబంధువుఁడును జక్రవర్తికిఁ బరమాప్తుఁడునునైన రహిమానుఖానున్నవాఁడు. మనకు సమస్తోపచారములు నతఁడుచేయును" ఈమాటలతరువాత నిశ్శబ్దముగా వారందఱునడచునప్పటికి గ్రామము వారియెదుట ననతిదూరమునఁ గనఁబడెను. ఈయాశ్వికులు గ్రామసమీపమున కరుగుట, ఖానుయొక్క సేవకులు కోటబురుజులమీఁదనుండి దూరముననే చూచి రహిమానుఖానున కెఱిఁగింప నతఁడును సముచితవస్త్రములు ధరించి వారినెదుర్కొని సగౌరవముగ నాదరించి మదనసింగుయొక్క దురవస్థనుజూచి గాయమునుమాన్పు మంగలివానికై వర్తమానము నంపెనుగాని యతఁడూరలేనందునఁ గొంచెమువిచారించి ఖాను నాజరుజంగుతో నిట్లనియె. "తమ్ముఁడా! మంగలివాఁడు లేఁడని మనము విచారింపనక్కఱలేదు. ఆవలమఠమున నొకవృద్ధుండగు బావాజీకలఁడు. అతఁడంధుఁడైనను గాయములను గడుసొగసుగ బాగుచేయును. ఈతని నటకుఁ దీసికొనిపొండు" అనిచెప్పి తనసేవకులలో నొకనిని మఠమును జూపుమని పంపెను. మదనసింగును మెల్లమెల్లఁగా మఠమునకుఁ దీసికొనిపోవువఱకు రాత్రి నాలుగు గడియల కాలమైనది. బావాజీయును సాయంకాలానుష్ఠానములను దీర్చుకొని భోజనముచేసి పండుకొనుటకు సిద్ధముగనుండెను. ఖానుచేనంపఁబడిన పరివారము ద్వారముననుండ ఖానుయొక్క సేవకుఁడు "బావాజీ మహారాజ్" అని కేకలువేసి తలుపు దట్టెను. బావాజీ యాతని కంఠధ్వని నానవాలుపట్టి తనకడ కతఁడెవడనో గాయముపడినవారిని దోడుకొని వచ్చెననియెఱింగి తనప్రక్కను బవ్వళించిన మనుమరాలిని మెల్లగఁ జేతితోఁదట్టి 'హేమలత ! హేమ

లత! తలుపుఁదీయువమ్మ' యని పిలిచెను. సాధుశీలయు నవనీతహృదయయు నగు హేమలత తనపితామహుఁడు పిలిచినంతటనే లేచి తన్నతఁడు పిలిచినకారణ మరసి నిద్రాభారముచేఁ గనులు నులుముకొనుచు నతిదీర్ఘమగు వేణీభరమువిడి పిక్కలపైఁ బడ మెలమెల్లగఁదలుపుఁదీసెను. అపుడు రాజసేవకులవలన వేయఁబడిన కాగడాలవెలుతురున హేమలత ముఖము సంపూర్ణశరత్కాలచంద్రమండలమువలె ముద్దులమూటఁ గట్టుచుండుటచే నొకనిమిషమువఱకును వారందఱు నిశ్చేష్టులై మదనసింగుయొక్క యవస్థనుమఱచి యనిమిషత్వమునొంది యామెను జూచుచుండిరి. వారియాశ్చర్య మొకకొంతతగ్గువఱ కామె తాతదగ్గఱకుఁ బోయెను. అంతట సేవకులు వృద్ధునితోఁ దమరాకకుఁ గారణ మెఱిఁగించి స్మృతిమెఱుంగకయున్న రాజపుత్రుని జూపిరి. వృద్ధుఁడును వానికి బ్రక్కగదిలో నొకమంచము వేయించి పూర్ణాంధుఁడు గనుక గాయమును దనహస్తముతోఁ దడవి "యిది దిట్టమైనగాయమే. అయినను రామదేవుని దయచే నాకిది సాధ్యమగునని తోఁచుచున్నది. మీరందఱు నావలకుఁబొండు. ఒకరుమాత్ర మిచట నుండుఁ"డని చెప్పి వారినందఱ నవల కంపకముందే యంధుఁడయ్యు నేత్రము లున్నవానికంటె నేర్పుగ గాయమునుగట్టి దానిపై నొక పట్టికవైచెను. అంత వార్ధకమున నతనికిఁ గలయోపికకును నపారప్రజ్ఞకును నందఱు నాశ్చర్యపడి కన్నులున్నపుడెంత నేర్పరియైయుండునో" యని యోజింప నారంభించిరి. తరువాతవారిపరివారమున నొక్కనిదక్క తక్కినవారలనందఱ నావలకంపి వృద్ధుఁడు మనుమరాలినిజూచి "అమ్మాయి ప్రొద్దుపోయినది పండుకొను" మని చెప్పెను. కాని యెందుచేతనో హేమలతకు నిద్ర రాకుండుటచేఁ "దాదా! ఈయనయవస్థను నేను కొంతవఱకుఁ గనిపెట్టి యుండెదను. పెద్దవాఁడవు నీవు నిద్రపొమ్మ నే నిదివఱకు నిద్రపోయినా' నని ప్రత్యుత్తరమిచ్చి తా నామంచమువద్దఁ గూర్చుండి మదన

సింగు లక్షణములఁ జూచుచుండెను. యోగియు మదనసింగుయొక్క యనుచరునివలన నతఁ డుత్తమరసపుత్రవంశస్థుఁ డని యెఱిఁగి గాయము తగిలిన కారణ మడిగి తెలిసికొని పిమ్మట నిద్రపోయెను. రసపుత్రుండును సుఖముగఁ గొంతవఱకు నిద్రించెను. హేమలత యతనిమంచము దగ్గఱఁగూర్చుండి ఱెప్పవాల్పక చూచుచుండెను. హేమలత యసమానరూపలావణ్యములయం దాకాలపు స్త్రీలలోనెల్ల శిరోరత్నమై యుండెనని చెప్పుటకుసందియములేదు. నిరంతరము నామెను బాయకుండు సద్గుణములుతక్క తదితరభూషణము లామెకడలేవు. ఆకర్ణాంతవిశాలనేత్రములును, దొండపండువలె సహజారుణ్యముగల మోవియు వంకరతిరిగి విండ్లవలెనున్న కన్బొమలును, నిరంతరమందహాసమును, నామెముఖారవిందలావణ్యమును బరిపూర్ణత నొందించెను. ఆమె పితామహుఁ డాగ్రామము వచ్చినప్పుడు బాలికగ నుండుటచే శుక్లపక్షచంద్రమండలమువలె దినదినప్రవర్ధమానమగు, నామె రూపమును జూచి తత్పురవాసు లామెయెడ ననురాగసమేతులయిరి. ఆమె రాజవీధిని బోవుతఱి తేఱి పాఱి యామెను గన్గొనని బాటసారులును దత్కంఠమునఁ బుష్పహారములు వేయని పూలవర్తకులును, నామెకొఱకు జక్కెరపెట్టని కోమటులును లేరు. కాని యాజగన్మోహనాకారము ప్రజలకనేకులకు విచారకారణమయి యుండెను. ఇంత సౌందర్యవిలాసవతియగు కన్య యేమహారాజు గర్భముననైన నుదయింపక నిరుపేదయయిన జాత్యంధుని మనుమరాలయి పుట్టి సామాన్యస్త్రీవలె పాటుపడవలసివచ్చెనుగదా యని జనులందఱు విచార మొందుచుందురు. కెంజిగురాకులకు వన్నె దెచ్చు నామె ప్రశస్తహస్తములతో బావినీరు తోడునపు డామెవ్రేళ్లు కంది నొవ్వ లెత్తుటఁజూచిన స్త్రీలందఱు నొకమారు కంటతడిపెట్టుకొని యామె నేపనిని జేయనీయక తామె యామెకయి సకలకార్యములఁ జేయుచుందురు. ఈమెసంప్రాప్తయౌవనయైనదిమొద లామెతాత

యామెను వీధిలోని కరుగవలదనియు, దురాత్ములదృష్టిని బడవలదనియుఁ బలుమాఱులు చెప్పుచుండుటఁబట్టి మునుపటివలె నిలు వెడలక గృహమున నేయుండుట కారంభించెను. అంధుఁడయిన పితామహుని పరిచర్యయం దతిశ్రద్ధగలిగి యతని కామె సమస్తోపచారములు విసుగక చేయుచుండును. అందుచేతనే నిద్రాభంగ మగునేని తాత కనారోగ్యమగునని యతని నిద్రపుచ్చి యామె రోగిమంచమువద్దఁ గూర్చుండెను. అప్పుడు రెండుజాములరాత్రియైనది. మదనసింగును గాఢనిద్రాసక్తుఁడై నడుమ "నోరీ, దురాత్ములార రండిరండి మీప్రాణము లపహరింపక మాననుసుడీ" యని రెండుసారులు పలవరించెను. ఒకపర్యాయము లేచి దాహముత్రాగి యొత్తిగిలి పండుకొన్నప్పుడు మనుష్యావతారముధరించిన సౌందర్యదేవతవలె కట్టెదుట నిలిచి తనకు దాహ మొసంగిన కాంతారత్నమును గన్నెత్తిచూచి మఱల నిద్రపోయెను. హేమలత యాతని ముఖావలోకనముఁ జేయుచు సుందరమందహాస మతని ముఖారవిందమున నంకురించునపుడు తాను జిఱునవ్వు నవ్వుచు, వానిశరీరమునఁ జెమ్మటపట్టునెడఁ దనశరీరమునఁ జెమట పట్టువఱకును విసనికఱ్ఱతో విసరుచు గాయమువలన రాచకొమరుఁడు బాధపడునెడ దానెంతయు విచారపడుచు నతఁడు జ్వరపీడితుఁ డగువేళ; తాతనులేపి యౌషధమొసఁగుచు నతనితో సమస్తబాధలఁ దాను బడుచు సకలోపచారములఁ జేయుచుండెను. మదనసింగుయొక్క మనోహరాకారమును జూచుటాదిగ హేమలత కదివఱకెన్నఁడును జనియింపనిదియు నిట్టిదని నిరూపింపరానిదియు నగునొకానొక మనోవికారముదయించెను. దానితో బాలికకు రాచకొమరునియందు ననురాగము పుట్టెను. హృదయము గాఢముగ క్షత్రియపుత్రునియందుఁ దవుల్కొని మరల్చుకొంద మని యయ్యబల ప్రయత్నించిన మరలకయుండెను. అందుచేత రాచకొమరుఁ డచిరపరిచయుఁ డయినను "గుణసముద్రుఁడై కడుసుందరుఁ డగునీతని కింతబాల్యమునం

దింతకష్టమేల సంప్రాప్తింపఁజేసితివి దైవమా! ఈతఁడు నిరపాయుండ యిబ్రతికియెన్నఁడయిన బట్టగట్టునా" యనిదైవము ననేకవిధంబుల వేఁడుకొనుచు నిష్టదేవతా ప్రార్థనమొనర్చుచు నామె చింతించుచుండెను. అపుడురమారమి యొకజాముప్రొద్దుండుటచే కోడికూఁతవలన యోగి మేలుకొని మనుమరాలిని బిలిచి 'అమ్మా నీవు రాత్రియంతయు మేలుకొన్నావు. ఇఁక నేను కనిపెట్టుకొనియుండెదను. నీవు నిద్రపొమ్మ' అని చెప్పి రోగిమంచముదగ్గఱకుఁ బోయి యాతనినాడి చూచి జ్వర మతితీవ్రముగా నుండుటచే మఱియొక క్రొత్తమందు వేసి మనుమరాలిని నిద్రపుచ్చి తానొంటరిగఁ గూర్చుండెను.

అపుడు తనకు జరిగిన మహోపకారము జ్ఞప్తికిరాఁగా 'ఆహాహా! అలాయుద్దీను చక్రవర్తియొక్క క్రౌర్యము నన్నెంతవఱకుఁ దెచ్చినది. భగవంతుఁడు దుర్మార్గులకుఁ దోడ్పడుట కలియుగధర్మముకదా హా! జాలాలుద్దీనుచక్రవర్తీ! ఎందున్నావు. అట్టి ధర్మశీలుఁడగు పినతండ్రినిఁ జంపి సింహాసనమెక్కిన యలాయుద్దీనునకు నామీఁద దయ యెట్లుండును! ఇంతకు దైవానుగ్రహమేమో' యని యాత్మవిచార మొందునప్పటికి రోగి దాహ మడుగుటవలన యోగి తనతలంపు మాని దాహమున కిచ్చి శరీరముపైఁ జేయివైచి జ్వరము తగ్గినదని యెఱిఁగి సంతోషించి రాచకుమారుఁడు జీవించునని నిశ్చయించుకొనెను. తరువాత కొంతసేపటికి కాకులుకూయ నుదయపర్వత శిఖర మలంకరించుచు సకలజనమిత్రుండగు సూర్యుఁ డుదయించి తన యరుణకాంతి దిగంతములయందుఁబర్వ బంగరుపూఁతవలె నలరు లేఁత నీరెండ సమస్తపదార్థములపై వ్యాపింపఁ జేసి వాని కపూర్వాలంకార మొసఁగెను. తనయాప్తమిత్రుని యవస్థ యెట్లులున్నదో యెఱుఁగఁగోరి సూర్యోదయ పూర్వముననే లేచి రహిమానుఖ నుప్రముఖులను లేపి తనవెంటఁబెట్టుకొనివచ్చిన నాజరుజంగు తనమిత్రస్థితి యపాయమును దాఁటినదని

సంతోషించెను. కాని రహిమానుఖాను రోగి యోగక్షేమములరయుక యవల ప్రక్క గదిలో తలుపుచాటున నిలువఁబడియున్న హేమలత యొక్క యరుణపదపల్లవములఁ జూచి యాశ్చర్యపడి యాప్రక్కనే తనచిత్తమును నిలిపి నాజరుజంగు మదనసింగులు తనతోఁ జెప్పుచున్న మాటల కసంబద్ధప్రత్యుత్తరంబుల నిచ్చుచు "నేను విన్నదానికిని నేఁడు చూచినదానికిని సరిపోయినది. నందుఁడు సమయమునకు లేక పోయెను గద. అయిననేమి?" యని, మనశ్శాంతి కలుగమి వారితో "నాకీదినమున తల దిమ్ముగానున్నది. మీ రనుకొనుమాటలు నాకు వినఁబడుచుండుటలేదు." అని చెప్పెను. మదనసింగును నాజరుజంగును ఖానుసాహేబుయొక్క ముఖలక్షణములు మారుటయు నతం డసంబద్ధసంభాషణుండగుటయు గ్రహించి కారణ మూహింపఁజాలక యూరకుండిరి. తరువాత నందఱును కోటకుఁ జనిరి.

మూఁడవ ప్రకరణము.

మదనసింగునకు గాయము తగిలిన మఱునాఁడు రహిమానుఖాను తనయంతఃపురమున నొకగదిలో దీర్ఘవిచారమున బాధపడుచుఁ గూర్చుండెను. అపుడు వానియెదుట కిర్వురు సేవకులు వచ్చి భయవినయములతో వంగివంగి సలాములుచేసి కట్టెదుట నిలువంబడిరి. అది సంధ్యాసమయముగనుక కార్యాంతర మాలోచించుచున్న ఖాను వారిని గుర్తింపక "ఎవరువారు?" అనిబిగ్గఱగ నఱచిచూచి ఓహో! నందుఁడా! రెండవవాఁడెవఁడు? ఓరీగులామల్లీ! మీరు సుఖముగా వచ్చినారా? యని పలుకరించెను. అంతట నాసేవకద్వయము " ఏలినవారి కటాక్షమువలన మే మీగడియవఱకు సుఖముగానున్నాము స్వామీ" యని కంట నీరు పెట్టుకొనఁజొచ్చిరి. ఖానుసాహేబు బదిరిపడి జరిగిన

యావద్వృత్తాంత మెఱిఁగింపుమన వారిలోనందుఁ డిట్లు జెప్పసాగెను. "మహాప్రభూ! ముందుగ నిన్నటివృత్తాంత మెఱిఁగించెదను. నిన్ననుదయ మెవరో పదుగురుమనుష్యు లాగ్రానగరమునుండి యెటకో బోవుచు మాకగపడిరి. భాగ్యవంతులగు బాటసారుల విడువవలదని యేలినవారిచ్చిన హుకుముప్రకారము వారు ద్రవ్యవంతులవలె నుంటచే మే మిరువది యైదుగురము వారిపైఁబడితిమి. తరువాత నేమి మనవిచేయుదును మహాప్రభూ! అందొక సుందరుఁడగు రాజపుత్రుఁడు మాపైఁబడి మాలో తక్షణమే పండ్రెండుగుర స్వర్గమునకంపెను. మిగిలినవా రాఱ్వురు గాయములఁ జెంది మరణమునకు సిద్ధముగ నున్నారు. కాని యారాజపుత్రునకు గాయము దిట్టముగఁ దగిలినది స్వామీ" యని చెప్పి కన్నీరు కాల్వలుగట్ట నేడ్చుచు గద్గదస్వరముతో మనబాలాజీకూడ మృతినొందెను. మహాప్రభూ! యని రోదన మారంభించెను. ఈవృత్తాంతము సవిస్తరముగ నాలకించినతోడనే సాహేబునకు మహాకోపమును భయమును నాశ్చర్యమును నేకకాలమున జనియింప గడియదాఁక మాటాడలేక కొయ్యవలె నుండెను. తుదకు ధైర్యముఁ దెచ్చుకొని "యారా యెంతపనిఁ జేసితిరి. కొంప మునిఁగినది. పాడుముండ కొడుకులు మీరొక కార్యము చక్కఁజేయఁగలరా? అయ్యయ్యో! వారు చక్రవర్తికడకు రాయబారమువచ్చిన రాజపుత్రకుమారుఁడు మొదలగువారు. ఈగ్రామమున వారిప్పు డున్నారు. వారిలో మన నాజరుజంగు కుండ నున్నవాఁడు. నావిషయమై యతఁడెఱుఁగును. చక్రవర్తితో సంభాషింపకమానఁడు. హా మౌలాఅల్లీ! హా మహమద్! ఈగండము గడిచినయెడల నూఱుగురు ఫకీరులకు నన్నముఁ బెట్టించెదను" అని ధైర్యము వదలి పిఱికిస్వభావము గలవాఁడగుటచే సేవకుల నిందింపఁ దొడఁగెను. అప్పుడు గులామల్లీ గడగడవడఁకుచుఁ దన యేలిక పాదములపైఁబడి మేమది యెఱుఁగక గోతిలోఁబడినాము. మహాప్రభూ మీ

గులాపువాండ్రను రక్షింపవలయునని స్వామిని బ్రార్థించెను. తరువా
త ధైర్యముఁదెచ్చుకొని ఖాను తదనంతరవృత్తాంతము నెఱింగింపుఁడని
వారల నడుగ నందుఁడు నోట మాటాడక నొకసంచిని దెచ్చి యందుం
డి యొక కాగితములకట్టను బైటకుదీసి "మహాప్రభూ ! ఇది యము
నాతీరమున దేవాలయమువద్ద మాకొక యోగిదగ్గఱ లభించినది
వానిని గడతేర్చి యిది తెచ్చినాము. ఏలినవారు చిత్తగింపవలెను"
అని చేతి కందిచ్చెను. అతఁడాకాగితముల నందుకొని దీపముఁ దె
ప్పించి వానిని జక్కఁగఁ జదివి పరీక్షించినపు డందుమిగుల రహస్యమ
గు కాగిత మొకటి కనఁబడుటచే విచారసమేతమగు ఖానుమొగము
మందహాసముతో వికసించెను. నూతనముగ సంభవించిన యీకాగిత
ములయందు తాను జక్రవర్తిదయ సంపాదించుకొనుట కాధారములు
కలిగినవి. అందుచే నానందపారవశ్యమున వెనుకటి చింతమఱచి గులా
మును భోజనమునకుఁ బొమ్మని పంపి, నందుని దూరముగఁ దీసికొని
పోయి యిట్లు జెప్పఁదొడఁగెను. నందా నీవు మిగుల విశ్వాసము కల
వాఁడవు. నీతో నాకు రహస్యకార్య మొకటి కలదు. ఆకార్యము
జేసినయెడ నీచేతినిండ వరహాలు పోసెదను. ఈగ్రామమున నంధుఁడ
గు యోగివద్దనున్న యీసుందరాంగిని నాకడకు నీవు మాయోపాయ
మునను సమ్మతిను తీసికొనిరావలయును. దానిని వివాహమాడకున్న
నేను జీవింపఁజాలను. నీనిమిత్తము నే నెదురుచూచుచుంటిని. అని
చెప్పినతోడనే నందుఁ డులికిపడి శరీరము జల్లుమన "స్వామీ! ఆమె స
ద్గుణవంతురాలు. ముసలివాఁడును మిగుల మంచివాఁడు. జనుల కంద
ఱకు నతనియందు భక్తి కలదు. అదినాకు సాధ్యమగునా?" యని నందుఁ
డు తనయసమర్థత నెఱిఁగింపఁ గోపోద్దీపితుఁడై ప్రక్కనున్న ఖడ్గమును
జేఁబూని విశ్వాసఘాతుకుఁడా ! నాసొమ్ముదిని నాకార్యమును జేయలే
వా? ఇది చేయవేని నీప్రాణములు దక్కవుసుమీ యని బెదిరింప నందుఁ

డగు నందుఁడు మ్లేచ్ఛనిపదములపైఁబడి దేవా ఆగ్రహింపకుఁడు. నాప్రాణములనైన ధారపోసి యీకార్యము సాధించెదను. గోవింద శాస్త్రియింట దాసియగు రాధవలన నీకార్యమగును. నేనెలలోపున సమకూర్తును. అని వాగ్దానము చేసినతరువాత తురుష్కుఁడు నందుని విడువ నతఁడు మృత్యుని ముఖమునుండి వెడలినట్లు సంతోషించుచు స్వామికార్యసాధనమం దుపాయములఁ బన్నఁదొడఁగెను. ఇదియిట్లుండ మదనసింగునకు గాయము నెమ్మదిగా నున్నదని హేమలత యిష్టదేవతలకెల్ల ముడుపులఁగట్టుచు సంతోషించుచుండ నాజరుజంగు నమితానంద భరితుఁడయి భగవంతునకు నమస్కరించెను. మదనసింగునకు నానాఁటి కారోగ్యముగలుగ నారంభించెను. రక్తక్షయమయినది గనుక నతనికి నీరసముదక్క తక్కినరోగమేదియుఁ గానరాదయ్యెను. ముసలివాని నేర్పుచే నరములకు బలము కలుగుచుండెను. తన ప్రియమిత్రుఁడారోగ్యస్నాన మొనర్చువఱకు నాజరుజం గాగ్రముఁబాసి పోఁదలఁచుకోనందున దానచట నుండునంతకాలమును ఖానుగారియింట బసచేసి ప్రతిదినమును ఖానుయొక్క దుర్గుణములను, మర్కటచేష్టలను స్వానుభవమువలన గ్రహించుచుండెను. అందుచే సద్గుణసంపన్నుఁడై నందున, నన్యమతస్థుఁ డయినను సింగునం దనురాగంబును స్వమతస్థుఁడు నాప్తబంధుఁడునైనను దుర్గుణుఁడయిన ఖానునెడ నసూయయు నాజరుజంగునకు గలుగనారంభించెను. హేమలతచేయు వివిధోపచారములును నామె రూపాతిశయమును సుగుణవైభవమును మదనసింగు హృదయమున నామెయెడ గాఢానురాగమును గల్గించెను. మధ్యాహ్నకాలమున సింగునకు నిద్రరాకుండఁగా చిన్ననాట తాతదగ్గఱ నేర్చుకొన్న హిందీభాషలోని భక్తిరసప్రధానములగు నీతికీర్తనల హేమలత శ్రావ్యతరకంఠముతో నప్పుడప్పుడు పాడుచుండును. ఒకప్పుడు తాఁ బెంచుచున్న చిలుకకు 'రామరామ' యని మాటల నేర్పుచు

వినువారి చెవులకు విందు సేయుచుండును. ఈకన్య తనయీఁడునకును స్థితికిఁదగిన విద్యలను దనపితామహునిదగ్గఱ నేర్చియుండుటచే నన్యులెవరులేని సమయములయందు తాతకు వినుపించువంకఁబెట్టి తేనెతేట లొలుకుమాటలతోఁ బుస్తకమును జదివి సింగునకు హృదయానందమును గలిగించును. అదిగాక ప్రొద్దుపోవునప్పుడు వృద్ధుఁడును వినోదకరములగు కథలను మ్లేచ్ఛరాజవృత్తాంతములను దనచిన్ననాఁటియుద్ధములను గడుఁజమత్కారముతో వర్ణించి చెప్పుచుండును. ఆ గ్రామవాసులందఱును రహిమానుఖాను చేష్టలను హాస్యరస ప్రసంగములుగ మార్చి వానికిఁజెప్పి నవ్వించుచుండురు. అందుచే నిరంతరానంద మగ్నుఁడయి సింగు త్వరలో నారోగ్యస్నానముఁ జేసెను. సింగు సద్గుణవంతుఁడనియు సద్వంశసంభూతుఁడనియు నెఱిఁగి వృద్ధయోగి తనదీనచరిత్రమును రాచకొమరునకుఁ దెలియపఱుపఁగోరి యాతనితోఁగూడ నొకటిరెండుసారులు తనయిచ్ఛఁ దెలిపెను. ఆతఁడును విన నుత్సహించెనుగాని యోగి యే కారణముననో చెప్పలేదు. చిత్తూరునుండి బయలుదేరి చిరకాల మగుటచే భీమసింగుమహారాజు తనకయి యెదురు చూచుచుండునని ప్రయాణమై పోవుటకు సిద్ధముగనుండియు యోగి బలవంతపెట్టుటచే మఱియొకవారము నుండ సమ్మతించి యొకనాఁడు రహిమానుఖానుగారి దర్శనముఁ జేసి యాకచ్చేరియుఁ గోటయుఁ జూడవలెనని పోయి యనేకరాజకార్యముల ముచ్చటించుచుఁ బ్రసంగవశమున మదనసింగు ఖానుతో నిట్లనియె—

మద—మిత్రుఁడా! నీవు కోపగింపకుందువేని నీకొక సలహా చెప్పెదను.

రహి—మంచిసంగతికి కోపమెందుకు! అవస్యముగాఁ జెప్పవలసిన దే.

మద — ఈగ్రామమున మీకీర్తి చక్కఁగాలేదు. మీరు ప్రజల నవమానము చేయుదురనియు బాధించుచుందురనియు నందఱుఁ జెప్పుకొనుచుండ వినుటకునాకుఁ గష్టముగ నున్నది. అదిగాక దొంగతనములు మొదలగునవి మీవలన జరుగుచుండునని జనులు దురభిప్రాయముఁ బడియున్నారు. అట్టి దురభిప్రాయమును మీసత్ప్రవర్తనము వలన మీరు పోగొట్టుకొనవలెను. మీదగ్గఱనున్న తుచ్ఛసేవకులను ద్వరితముగఁ బంపివేయుట మంచిది.

అని యివ్విధమున హితోపదేశమును జేయుచున్న రాజకులభూషణునిపయి మహమ్మదీయుఁడు త్రాఁచుపామువలలేచి తనచేత నున్న ఖడ్గముతో నాతని నొకదెబ్బవేయఁజూచెనుగాని నాజరుజంగాతనిఁ బట్టుకొని యాదౌర్జన్యము నివారించెను. వెంటనే సింగమువలె సింగును లేచి యాయుధపాణియై నిలువ ఖాను వెనుక దీసెను. అనంతరమామందిరము విడిచి మదనసింగు నాజరుజంగుతోఁ గలిసి మఠమున కరుదెంచెను. తనదురాచారమును జక్రవర్తికి నివేదించి తన కపాయమును గలుగఁజేయుదురని నాజరుజంగుమదనసింగులపై ఖానుసాహేబున కీవఱకే యాగ్రహమును, ననుమానము నుదయించినవి. గోరుచుట్టుపై రోకటిపోటనునట్లు నేటికథ దాని నత్యున్నతస్థితికిఁ దెచ్చినది. రాజనందనుని సంబంధమున సజాతీయుఁడైన నాజరుజంగుపై నతనికి మహాగ్రహము కలుగ, నేయుపాయములను బన్నియైనను నే నేరములను జక్రవర్తితోఁ జెప్పియైనను తాను నిర్దోషియనిపించుకొని, వారపరాధులని దండింపఁజేయవలెనని మహమ్మదీయుఁడు యోచింపుచుండెను. శత్రురాజ్యమున నుండుట ప్రాణాపాయకారణమని మదనసింగు ప్రయాణమగుచుండెనుగాని యతనిప్రయాణము హేమలతకుదుఃఖకారణముగ నుండెను. పైవాదము తటస్థమైనమరునాఁడు తెల్లవారునపుడు ప్రయాణము నిశ్చయింపఁబడెను. ఆరాత్రి హేమలత యన్నము ముట్టుకొన

లేదు. ఎట్లయినను రాకొమరుఁడు శోకతీరదని తలఁచి వృద్ధయోగి రహస్యముగ నొకగదిలో కాతనిం దీసికొనిపోయి రహస్యమును బయలుపరుపకుండ ననేకప్రమాణములఁ జేయించి యొట్టుఁబెట్టించి తన పూర్వాశ్రమ విచిత్రవృత్తాంతము నీతెఱంగునఁ జెప్పనారంభించెను. 'నాయనా! నీవు నాకుమారుని వంటివాఁడవు నిన్ను జూడ నాబంధువులందఱు వచ్చినట్లున్నది. నాదీనమైనచరిత్ర నీకుఁ దెలియఁజేయుమనియు నీవలన నా కుపకారము కలుగుననియు నాయంతరాత్మ నన్ను బ్రేరేపించుచున్నది. అంద ఱనుకొనునట్లు నేనుబావాజీని కాను నేనుత్తమరాజపుత్రవంశస్థుఁడను మాకాపురము జయపురము. కాలవశమున నే స్వదేశమును బాసి డిల్లీచక్రవర్తియొద్ద ఫౌజుదారుగ నుంటిని. నేనును నా కుమారుఁడగు జనార్ధనసింగును కిల్జీవంశస్థాపకుఁడగు జలాలుద్దీనువద్ద సేనానాయకులుగా నుండి యతని యన్నకుమారుఁడును బ్రస్తుతచక్రవర్తియునగు నలాయుద్దీనుతోఁ గూడి దక్షిణహిందూస్థానముపై దండెత్తి నారము. అచట మహారాష్ట్రరాజ్యమును జయించినపుడు నేను చాల సహాయ్యమును జేసినాఁడను. జలాలుద్దీనునకు నాయందు పుత్రవాత్సల్యముండెను. దక్షిణహిందూదేశమునుండి వచ్చినతరువాత నలాయుద్దీనునకు బినతండ్రిని గపటముగ వధించి తాఁ జక్రవర్తియగుటకు దురుద్దేశము కలిగెను. ఆకాలమున నే నాతని కాంతరంగికుఁడ నగుటఁ జేసి నాతో నాతఁ డాలోచింపరాఁగా నే నట్టి దుష్కార్యమున కీయకొనక నిరుత్సాహము గల్గించి రాజభక్తివలన యువరాజును గొంచెము నిందించినాఁడను. అలాయుద్దీను మహాగ్రహముతో మఱలిపోయి యారాత్రి—హా ఏమనిచెప్పుదును—నారెండుకన్నులును దనఖడ్గముతోఁబొడిచివైచి నాకుశాశ్వతమైనయంధత్వమును దెచ్చిపెట్టెను. తరువాత నన్నుఁజంపుమని సుబేదారులలో నొకనికతఁడుత్తరువిచ్చి నాప్రియపుత్రకు నారాత్రి చంపించెను. నాపూర్వస్నేహితులందఱు నన్నుఁజంపకుండ

మాయోపాయములచే రక్షించి నన్ను గ్రామమునకుఁ బల్లకిలోఁబంపిరి. ఈపిల్ల యప్పటి కేడుసంవత్సరముల పసికూన. నిష్ప్రయోజనమైన యీజీవనముకంటె మరణమే యుత్తమమని తలంచియు నీపసికూన నిరాధారయైనందునఁ జెట్టంతకొడుకును జంపుకొనియు మొండినై యిట్లు జీవించినాఁడను. ఆమరునాఁ డలాయుద్దీను తనపినతండ్రిని జంపించి మఱికొన్ని దినములకు మహావైభవముతోఁ దాను జక్రవర్తియయ్యెను. ఈతఁడు నీతియుఁ బాపభీతియు లేనివాఁడు. ఒకటితలఁచి యొకటి పలుకును కుమారా! నాదశయిట్టులున్నది. డెబ్బదియేండ్లవాఁడను. నాకుమరణము సమీపించుచున్నది. ఈబాల సంప్రాప్తయౌవన. నే మృతి నొందిన దీనినెవరైన బలాత్కారముగ నవమానింతురు. నాకుఁగల బెంగయిదియే. నాకిప్పు డెట్టులైనఁ జిత్తూరునగరము రావలెనని యున్నది. భీమసింగు మహారాజుతో నాదీనదశఁ దెలిపి నాపైననుగ్రహము గలిగించిన నీకు మిగుల పుణ్యముండును. నాపేరు నారాయణసింగు. అహాహా నారాయణసింగుదశ యెంతవఱకువచ్చినది. ఇరుపార్శ్వముల నెచ్చట దిక్కులేక యనాథుఁడనై యున్నానుగదా నాయనా! అనుచు సహజధైర్యమును విడుచుచుఁ గొలకులనుండి వేడికన్నీ రొలికి తన తెల్లగడ్డము దడియ నేడ్వసాగెను. వజ్రసమానహృదయమును గనికరమును సృజియించు నారాయణసింగు దీనచరిత్రమును విని మదనసింగు క్షత్రియకాఠిన్యమును విడిచి యొక్కనిమిషము విచారించి పిమ్మట “ తాతా నీవు విచారింపకుము కష్టములు దైవికములు. మీవిషయమయి భీమసింగు మహారాజుతో నేను జక్కఁగాఁజెప్పి మీపై వారి కనుగ్రహము గలుగునట్లు చేసెదను. మీకష్టములు గట్టెక్కినవని నమ్ముఁడు, మీమనుమరాలికిఁ దగిన యుత్తమవంశజాతుని వెదికి పెండ్లిచేయించెదను. నామాటనమ్మియుండుఁడు. కొద్దిదినములలో మీకు నేను వర్తమానమంపెదను. అప్పుడు మీరురండు. రేపుదయమున నేను నిశ్చయముగఁ

బ్రియాణమైచిత్తూరుపోయెదను" అనిచెప్పియారాత్రి సుఖముగా నిద్రిం చెను. మఱునాఁడు రహిమానుఖానుకొద్ద సెలవుఁదీసికొని నాజరుజంగు ను నాగ్రానగరమునకుఁ బ్రయాణమయ్యెను.

మఱునాఁడు వేకువజామున రాజపుత్రమహమ్మదీయ లోంకో రులవలన సెలవుగైకొనిపోవునపుడు మదనసింగు నాజరుజంగును రహ స్యస్థలమునకుఁ గొనిపోయి గాఢాలింగన మొనర్చి "మిత్రుఁడా ! మనమి రువుర మన్నదమ్ములవలె నుంటిమి మన మన్యజాతులవారమైనను మన కు భేదములేదు. ఇంక ముందుండదు. నాకిదివఱకుఁ జేసినదిగాక యిం కొక మహోపకారమును జేయవలయును. ఈవృద్ధుఁడును బాలికయు నిరాధారులయి యున్నవారు. వారికి రహిమానుఖానువలన భయము గలదు. అతనివలన నపాయము గలుగకుండ నీవు జాగ్రత్తపెట్టవలెను. ఈయూర నెవరికైనను వారి నప్పగింపుము" అన నాజరుజంగును నట్లే చేయుదునని యాపూఁటకుఁ బ్రయాణముమానెను. మదనసింగం తట నాజరునిజూచి "మనమింక మరల నెన్నఁడు కలియుదుమో? మామ హారాజును మీచక్రవర్తియు సంధిచేసికొందురేని మనము రాకపోక లు కలిగి మన స్నేహబీజముయొక్క ఫలముల నందవచ్చును. కాదేని ప్రళయయుద్ధరంగమున మనము కలిసికొందుము. సాధ్యమైనపుడు నీ క్షేమము నాకంపుచుండుము. నేఁ బోయివచ్చెదను సలాము" అని త నపరివారముతోఁడ బయలుదేఱి మాటిమాటికి హేమలతను దలఁచుకొ ని తిరిగిచూచి విచారించుచు వెడలిపోయెను. ఆనాఁటి మధ్యాహ్నము నా జరుజంగు తనతండ్రికిఁ జిరపరిచయుండగు నబ్దుల్ ఖరీముమౌలవీ యను నాతనిం బిలిచి నారాయణసింగు నొప్పగించి వారికపాయము కలుగున పుడుసహాయు మొసఁగుమని చెప్పి వానిచేనట్లుచేయుటకు వాగ్దానముల గ్రహించి యారాత్రి బయలుదేఱివెళ్లెను. మౌలవి యాగ్రామమునం దు జనమిత్రుఁడును, భగవత్సేవాపరాయణుఁడునయి యుండుటచే

ప్రజల కతనియం దతిగౌరవము కలదు. నారాయణసింగును వైద్యమూల మున సకలజనోపకారి యగుటచేతఁ బ్రజలెల్ల నతనికాప్తులైరి. ఈపరిచ యమువలన మాలవియు నారాయణసింగును మిత్రులై తమతమ మత ములఁగూర్చి వాదములు సలుపుచు సుఖముగఁ గాలముు బుచ్చు చుండిరి.

నాల్గవ ప్రకరణము.

మదనసింగు పాలిగ్రామమును విడిచిపోయినతరువాత హేమలత కొన్నిదినములవఱకు మునుపటివలె నన్నపానాదులపై నిష్టము నిలుపక బెంగఁగొని చిక్కియుండెను. కాని ప్రొఁతబడినవెనుక యథాస్థితి కామె మరలవచ్చి సుఖముగానుండినను రాజకుమారుని యందమును, మృదు మధురభాషణంబులును మఱవక యెల్లప్పుడుతలంచుకొనుచునుండెను. నారాయణసింగు, మదనసింగు తననిమిత్త మెన్నఁడు వర్తమానమంపు నో యెన్నఁడుతాము తురుష్కరాజ్యపు సరిహద్దులఁ బాసి చిత్తూరురా జ్యమున సుఖముగనుందుమోయని యెదురుచూచుచు నామార్గమునఁ బోవు బాటసారులనెల్లఁ బరీక్షించి యడుగుచు దినమొక యేఁడుగఁ గ డుపుచుండెను. మాలవికిని, నారాయణసింగునకును స్నేహము నానాఁటి కధికమైనందునఁ బ్రజలు వారిమైత్రికి మిగుల నానందించుచుండిరి. నా రాయణసింగునకును మనుమరాలికిని రహీమానుఖానుయొక్క దౌర్జన్య ములం జూచినకొలఁది భయమధిక మగుచుండెను. ఖానుసాహేబునకు హేమలతయం దనురాగము క్రమక్రమముగ నభివృద్ధిసెంద రాజకన్య మ్లేచ్ఛనాయకుని హృదయమునం దెల్లప్పుడు నుండసాగెను. బలత్కా రముగ నామెనుబట్టితెప్పించి తనయంతఃపురమున బంధించి సఫలమనో రథుఁ డగుట ఖానునకు సులభమేగాని యందున నేమికీడు మూడునో

యను భీతియు వారికాప్తుఁడైన మాలవి కాగ్రహము వచ్చునను భయమును వానిని బాధించుచుండెను. మాలవి సంపదలులేక సామాన్యస్థితిలో నున్నను, వాని విద్యాసంపదనుబట్టియు, సత్ప్రవర్తనమును బట్టియు, జనుల కాతనియెడ భయగౌరవములు గలిగియుండినవి. ధనము స్వీకరింపక దీనుల కుచితముగ నౌషధములిచ్చుటఁ బట్టియు, వయోవృద్ధుఁడగుటఁబట్టియు నారాయణసింగునందు జనులకు మిగుల గౌరవముగలదు. వారిరువుర కపకార మొనర్చినవారు ప్రజల కందఱకును విరోధులై యుందురు.

స్వామికార్యమునం దప్రమత్తుఁడై నందుఁడు శక్తివంచన లేక పాటుపడుచు నేవిధంబుననైన హేమలతను దనయజమానునకు సమకూర్పవలెనని సకల ప్రయత్నములఁ జేయుచు ముందుగ రాధతో స్నేహముచేసెను. ఈరాధ కిపుడు రమారమి పదునారు సంవత్సరములుండును. దానితల్లి భర్తను విసర్జించి లేచివచ్చి వ్యభిచారవృత్తివలన జీవించి రాధ కెనిమిదిసంవత్సరముల వయస్సున్నప్పుడు మృతినొందెను. అప్పటినుండియు రాధ బ్రాహ్మణులయిండ్లఁ ప్రాచిపనిఁజేసి బ్రతుకుచుండెను. అదియిప్పుడు గోవిందశాస్త్రియను బ్రాహ్మణునియింట నుండెను. ఆమె యుక్తవయస్కురాలైన వెనుక శాస్త్రి వివాహముచేయఁదలఁచెనుగాని రాధ తనతల్లివృత్తియందే ప్రవేశింప నిచ్ఛగలదగుటచే శాస్త్రియుఁ దనయుద్యమమును మానుకొనెను. రాధ మిగుల సౌందర్యముగల శూద్రాంగన యగుటచే స్వల్పకాలమున నామెగ్రామముననున్న పడుచువాండ్ర కందఱకుఁ ప్రాణమిత్రురాలయి యఱచేతి నిమ్మపండువలె నుండుటయెగాక యొకపర్యాయము ఖానుగారి హృదయమునుగూడ నాకర్షించెను. ధనమును నధికారమునుగల ఖాను మైత్రి యామెకిష్టమెగాని తన కన్నవస్త్రముల నిచ్చుచున్న హిందువుల కాగ్రహమువచ్చునని యామె వెనుకదీయుచుండెను. నందుఁడు

దాసీపుత్రిఁ డగనుక రాధతో సులభముగ స్నేహముచేసి తనస్వామి మనోరథమును దెలియపఱచి కార్యసాఫల్యముఁ జేయుమని ప్రార్థించెను. నందునిమాటఁ దీసివేయలేక రాధ యందున కియ్యకొని బావాజీ మఠమున కనుదినమునుబోయి హేమలతతో నేదోవంకఁబెట్టి మాటలాడుచు నామె పరిచయమును సంపాదించెను. పరిచయమయినది మొదలు హేమలత కామె పనిపాటలు చేయుచు వినోదకథలను జెప్పి యామెను నవ్వించుచు నుండెనుగాని దుస్సహవాసమొనర్చుట కిష్టములేక రాధతోఁ దిన్నఁగా మన హేమలత మాటలాడదయ్యెను. ఈ ప్రకారము మదనసింగు పాలిగ్రామమున నున్న కాలముననె రాధ రెండుసారులు హేమలతకొఱకు వచ్చి సింగును జూచి మోహించి యాతనితో మాటలాడఁ బ్రయత్నించినదయ్యు నతఁడు ప్రత్యుత్తర మొసఁగకుండుటచే మరలవలసినదయ్యెను. రాధకు మదనసింగునందుఁగల మోహ మతిశయింప దాసిగనున్న తనయంతరమును రాజపుత్రిఁడగు నతనియంతరమును నాలోచింపక నెట్లయిన నతనిని దనవలలో వేసికొనవలయునని యామె యత్నింపుచుండెను. హేమలతకు సింగునందనురాగము గలదని యెఱిఁగి యామెయందసూయ మనస్సున నిల్పి రహిమానుఖానున కీమెను సమకూర్చునెడలఁ దనకు సవతిగా నీమె యుండదనినమ్మి మదనసింగును దాను స్వాధీనపఱచుకొనవచ్చునని నిశ్చయించెను. అందుచే "నేకక్రియాద్వ్యర్థకరీ" యని యామె ఖానున కుపకార మొనర్చునట్లును దనమనోరథము నీడేర్చుకొన్నట్లును గూడ నగునని రాధ హేమలతమనస్సు విఱుచుటకయి ప్రయత్నించి యప్పటప్పుడు ఖానుయొక్క గుణరూపముల నామెకడ వర్ణించుచుండెను. ఒకనాఁడు ఖానుయొక్క రూపాతిశయమును రాధ వర్ణింపఁగా శరీరము వడఁక హేమలత భయమంది యాతని ప్రసంగమును దనవద్ద నెన్నఁడును దేవద్దని యామెను కఠినముగా మందలించెను. అప్పటినుండియు

సీదురాత్మురాలు ఖానుప్రసంగములను మానుకొని నందునితో “ నిఁక హేమలతపై ఖానున కాశయుండఁ దగదు. ఆమె కీతనియం దిష్టము లేదు. మదనసింగున కామె ప్రాణములిచ్చును. అని చెప్పఁగా ఖానుతో నందుఁడావార్త విన్నవించునపుడు వానికిగల్గిన దుఃఖము వర్ణింప నలవిగాదయ్యెనని యిట నేను వ్రాయనక్కఱలేదు. కామోద్రేకమును విచారమును మల్లడిగొన మహమ్మదీయుఁడు హేమలత నెట్లయినఁ జేకొని తీరవలయునని కృతనిశ్చయుఁడై నారాయణసింగునకును మాలవికిని మిత్రభేదము గల్పింపఁ బ్రయత్నించెను గాని యందుఁ గృతార్థుఁడు గానేరకపోయెను. అందుచేత నందుఁడును, ఖానును, హాని యితరసేవకులును దగు నుపాయమును వెదకుచుండిరి.

ఇది యిట్లుండగ ఖానునకు హేమలతయందు దృఢమోహము దగుల్కొన్నదని జనులు చెప్పుకొనుటవలన కర్ణాకర్ణిని నారాయణసింగును మాలవియు, హేమలతయు విని యేసమయమున నెట్టియపాయము మూడునోయని భయపడుచుండిరి. విదేశీయులయినవారిని రక్షించుట తనకు విధియసి మాలవి వారి కపాయమురాకుండ నేమి చేయుదునాయని చింతింపుచుండెను. మదనసింగువద్దనుండి యిప్పటికి నాలుగైదు మాసములు గడచినను వర్తమాన మేదియు రానందున నతఁడు తమవిషయము మఱచినాఁడని వారాలోచించి నిరాశపడి గతితోఁచక యుండిరి. తుదకు వారందఱు నాలోచించి వృద్ధుఁడును మనుమరాలును నక్కడకు నాలుగైదు క్రోసులదూరముననున్న యలీఘురుపురమునకుఁ బోవలెనని నిశ్చయించిరి. అందుచేత మాలవి వారిని బ్రయాణము చేసి యాయూరఁ దనకు గలయిర్వురు ముఖ్యమిత్రులకు నుత్తరములువ్రాసియిచ్చి సాధ్యమైనంతత్వరగఁ బ్రయాణమై పోవలసినదని చెప్పి వారితోఁ బోవుట కిర్వుర సేవకుల నేర్పఱచెను. ఆ

మధ్య హేమలతకు జ్వరమువచ్చుటచేఁ బ్రయాణ మాగిపోయెను. మా లవి నారాయణసింగుతో స్నేహముచేయుట తన కనిష్టముగ నున్నందున, ఖాను వానితో స్నేహము చాలింపవలసినదని యాయనకు వర్తమానమంపెను. మాలవి దానిని లక్ష్యపెట్టనందున కోప మతిశయింప వారి గర్వభంజన మొనర్చుటకుఁ గృతనిశ్చయుఁడై సమయమున కెదురుచూచుచు సాహేబు దినములఁ గడపుచుండెను. ఈనడుమ హేమలత జ్వరమువలన మిగుల బాధనొందుచున్నందునను, అది యే యౌషధముచేతను లొంగకున్నందునను వృద్ధుఁడు కొందఱియోచనమీఁద, నాగ్రామమునకు వచ్చియున్న గోసాయిని బిలిపించి యాతనితోఁ దనమనుమరాలి వృత్తాంతముఁ జెప్పెను. గోసాయినిజూచి హేమలత నమస్కరించి యెదుట నిలువ నతఁడామె నాశీర్వదించి యామెమొగ మువంక తేఱిపాఱఁజూచి ముసలివాని శరీరము నామూలాగ్రముగఁ బరీక్షించి మిగుల నానందమునొంది తనయానందసూచకముగఁ గొన్ని మాటల ననుటకు యత్నించియు, బలవంతముగఁ దనసంతోషము నాఁపుకొని "ఆహా మీ రిరువురును జీవించియున్నారా? ఎన్నిదినములకు మీఁగగపడినారు! భగవదనుగ్రహము మనపైఁ బూర్ణముగఁ గలదు" అని తనలో ననుకొని హేమలత నాడిపరీక్షించి కొంచెము దృష్టిదోషము తగిలినదని రక్షరేకు నొకదానినిచ్చి కంఠమునఁ గట్టుకొమ్మని చెప్పి, యామెచేయి ముద్దుపెట్టుకొని తరువాత వృద్ధునియొద్దకుఁబోయి యనేకవ్యవహారముల ముచ్చటించుచు నడుమ నిట్లనియె. "అయ్యా! తమసంగతినంతను నే నెఱుఁగుదును. మీరు బ్రతికి యున్నారని నే నిదివఱ కెఱుఁగను. నేఁడు సుదినము" అని గోసాయి వలుకఁగా, వృద్ధుఁడు భయపడి నాయనా నీవెవరు? నాసంగతి బయలఁ బెట్టకుము. అని బ్రతిమాలుకొనెను. గోసాయియు వృద్ధుని హస్తము నుబట్టుకొని నే నెవ్వరయిన మీకెందుకు? నాసంగతి ముందుముం

దెలుఁగఁగలరు. నాప్రాణముమీఁద మీకునమ్మకము గలదేని మీరహస్యమును నేను బయలు పఱుపనని ప్రమాణము చేయుచున్నాను. భయపడకుఁడు. నేనింక నిట నుండరాదు" అని చెప్పి వారవలన సెలవుఁ గైకొని గోసాయి యరిగెను. ఆదినమున గోసాయి గోవిందశాస్త్రి యింట విందారగించి యాగ్రామముననే యుండెను.

ఆనాఁటిసాయంకాలమున పాలిక్కోటలో నొకవిధమయిన కళవళము పుట్టెను. అక్కడనుండి కన్నులార యది చూచినవారికేగాని యన్యులకు దెలియదు. దీపములు పెట్టినతోడనే రహిమానుఖాను సాధారణముగ యుద్ధరంగమునకుఁబోవు సమయములయందు దాను ధరించు వస్త్రములను, గవచమును, ఖడ్గమునుధరించుకొని తనయధికారముక్రిందనున్న రాజభటులందఱు నట్లు కలహసమయానుకూలమగు వేషముల ధరింపవలెనని యాజ్ఞాపించెను. అట్లు సర్వప్రయత్నములు జరిగించి రాజభటసమేతుఁడయి ముష్కరుఁడగు నాతురుష్కుఁడు రెండు జాములరాత్రియైన వెనుక గ్రామమంతయు నిశ్శబ్దముగ నున్నపుడు, వృద్ధుఁడు నివాసముచేయుచున్న మఠమును జుట్టనేసి లోపలివారిని బిలువుమని సేవకులలో నొకని నాజ్ఞాపించెను. అతఁడును బావాజీయని పిలువ రోగపీడితు లెవరో యాపదలోనుండి వచ్చినారని, విసుగుకొనక తడవుకొనుచు లేచివచ్చి తలుపుఁదీసెను. వెంటనే నిర్దయాత్ముఁడగు కఱకుతురక డెబ్బదిసంవత్సరముల ప్రాయముగలిగి యశక్తుఁడయి నిరాధారుఁడయి గుడ్డితనమునఁ గదలలేక యతిదీనుఁడయి కాలముఁబుచ్చుచున్న నారాయణసింగు చేయిపట్టుకొని కఠినస్వరముతో, "నీదౌర్జన్యమును కుట్రలును విని నిన్ను తత్క్షణమే పట్టుకొని చెఱసాలయందుంచవలసినదని, చక్రవర్తిగారు మాకుత్తరువు నంపినారు. అందుచేత నిదిగో నిన్నిపుడు పట్టుకొన్నాను" అనిచెప్పి, "ఱెక్కలు విఱిచికట్టుఁడు జాగ్రత" యని సేవకులతో నుడివెను. కర్ణశూలములవలె నున్నయా

పలుకులు విని నిశ్చేష్టుఁడయి వృద్ధుఁడు నిలువఁబడి, "అమ్మా హేమలతా!" యని యొకకేకవేసి 'అయ్యయ్యో! నే నేమిచేసినాను. నావలన నేమియపరాధము వచ్చినది. చక్రవర్తి యుత్తరువు నే నెన్నఁడు నతిక్రమింపలేదు. నన్నుఁ బట్టుకొనుట యన్యాయము నన్ను విడువుఁడు' అని దీనస్వరముతో మనవిచేసికొనుచున్న వృద్ధునిమాటలను జెవినిడక రాజభటులు గట్టిగ బిగియఁదీసి చెక్కలు నొప్పివెట్టునట్లు వెనుకకు విఱిచికట్టిరి. నారాయణసింగు దీనాలాపముల నాలకించి రాజభటులుగూడ దయగలవారయిరి. కాని మూర్తీభవించిన పాపదేవతయగు రహిమానుఖాను వానివిలాపమును జూచి, 'ఓరీ! బద్మాషి! లుచ్ఛా! ముసలిదొంగ! నోరుమూసికొనుము; లేకున్న కొరడాదెబ్బలు తినెదవు. ఏమియు నెఱుఁగనివానివలె నఱచెదవేమి. నీవు రాజపుత్రులను గలిసి చక్రవర్తిమీఁదఁ గుట్రలుచేయుచున్నావు. మీయింట బసచేసిన మదనసింగుతో నీవు మాటాడిన రహస్యముల నే నెఱుఁగుదును. నాజరుజంగుఁ నీకుట్రలనెల్లఁ జక్రవర్తితోఁ జెప్పినాఁడు. అందుచేత నాతఁడు నిన్ను కారాగృహమున కంపుమని యాజ్ఞయొసఁగెను. నీపాపము నీవే యనుభవింపు" మని నిష్ఠురముగఁ బలుకఁ దనపై వచ్చిన యపవాదమునకును, దురవస్థకును నిగులఁ గుందుచు వృద్ధుఁడుండ నీకోలాహల మంతయు విని హేమలత దిగ్గున లేచి బంధింపఁబడియున్న పితామహుని గాలయమునివలె నెదుట నిల్చియున్న రహిమానుఖానుని, యమదూతలరీతిఁ దనపితామహుని బట్టుకొనియున్న రాజభటులను, జూచి వెఱఁగుపడి శరవేగముతో నతనికడకుఁబోయి 'దాదా! దాదా' యని కెవ్వున నఱచి, వానిని గౌఁగిలించుకొని రోదనము చేయసాగెను. రాజసేవకులకు వెఱచియో యనునట్లు, సహజగాంభీర్యమును ధైర్యమును నారాయణసింగును విడిచిపోవ, మనుష్యస్వభావమును బట్టి పొరలిపొరలి వచ్చుదుఃఖము నాఁపలేక యతఁడు మనుమరాలిని గౌఁగిలించుకొని స్త్రీవలె 'అమ్మా! నేను చెఱసాలకుఁ

బోవుచున్నాను' అని పెద్దపెట్టున నేడ్చెను. ఇట్లు వాపోవు వారి నిరువురను జూచి దయావిహీనుఁడగు రహిమానుఖాను విచారమును లేశమునొందక, హేమలత సౌందర్యాదులను గని యానందించుచు వారిని విడదీయ భటుల కాజ్ఞ యొసఁగి ముసలివానిని లాగ నారంభించెను. ఈ నడుమ గ్రామమున నున్న వారందఱు నీకలకలధ్వనులవలనను, మిన్ను ముట్టుచున్న వారి రోదనధ్వనులవలనను మేలుకొని, మరమునఁ జుట్టుకొని యీవిచిత్రమును జూచుచుండిరి. దుఃఖభారమున నిలువలేక తాత మెడను దనబాహులతికలను బెనవేసి గాఢాలింగనము చేసికొని విలపించుచున్న హేమలతను విడఁదీయుట దుర్ఘటమని తలఁచి తురుష్కులు ముసలివానిని లాగుచుండ నందొకఁడు కొరడాతో బాలిక చేతుల మీఁద రెండుదెబ్బలు కొట్టెను. ఆనొప్పిచే బాలిక కౌఁగిలింత వదలెను. వెంటనే రాజభటులు నారాయణసింగును గెంటుకొనిపోవుటఁజూచి 'అయ్యో! అయ్యో! దాదా! దాదా! నే నెట్లు బ్రతుకఁగలను. నన్నెవరి కప్పగించిపోవుచున్నావు! నా కెవరుదిక్కు! నన్నుఁ దీసికొనిపోవేమి? నే చచ్చిపోవుదును నే నుండలేను. అయ్యో! మాటాడవేమి! దాదా' యని సకలజనుల హృదయములును నీరై పోవున ట్లఱచి మొదలునఱికిన వృక్షమువలె నేలఁబడి మూర్ఛిల్లెను. ఆమె మూర్ఛిల్లిన వెనుక నారాయణసింగును రాజభటులు తీసికొని పోవుటకు వలనుపడెను.

అంతట రహిమానుఖాను సేవకులలోఁ గొందఱి కాతని నప్పగించి 'ఓరీ ముసలివానిని దీసికొనిపోయి కోటలోఁ జెఱలో నుంచుఁడు నాకింకను బనియున్నది. నేనిప్పుడే వచ్చెదను' అని వారలఁ బంపి హేమలతయింటికి నిర్వురసేవకులఁ గావలియుంచి తా నావలివీధికి గొంచెము సాగిపోయెను. అచట నారాత్రి గుమిగూడిన గ్రామస్థులలో హేమలతానారాయణసింగుల దురవస్థఁదలఁచి కంటఁ దడివెట్టనివారును మహమ్మదీయుని నిందింపనివారును లేరు కాని యాయుధపాణులయి

యున్న రాజభటులకు వెఱచి యెవరును సాహసించి యాదురాత్ముల దౌర్జన్యమును మాన్పరయిరి. గాఢమూర్ఛనొంది హేమలత, శరీరము నెఱుఁగక రెండుమూఁడుసారులు 'దాదా! దాదా! తెల్లవారినది లెమ్మ' అనియు 'మదనసింగు! మదనసింగు!' అనియుఁ బలవరించి మరల మూర్ఛిల్లెను. గ్రామస్థులు కావలియున్న రాజభటులకు వెఱచి యామెకు సహాయ మొసఁగకయె క్రమక్రమమున నొక్కరొక్కరుగఁబోవ నారంభింపఁ గొంతసేపటికి నెవ్వరును లేకపోయిరి. ముష్కరతురుష్కుఁడు సపరివారముగఁ బట్టణములో మహమ్మదీయులు నివాసముచేయు భాగమునకుఁ బోయి యబ్దుల్ ఖరీము మాలవీగృహమును ముట్టడించి, సుఖముగ నిద్రించుచున్న మాలవిని బక్కమీఁదనే పట్టుకొని బంధించెను. ఆతని దారపుత్రులు కర్తవ్యము నెఱుఁగక గొల్లున నేడ్వసాగిరి. ఆవీధివారందఱువచ్చి ఖానును కారణ మడిగిరి. కాని మొదటనాతఁడు నిరుత్తరుఁడయి తుదకిట్లనియె. 'ఈతఁడు మహమ్మదీయుఁడై యుండియు హిందువులతో స్నేహము చేయుచున్నాఁడు కాఫరులతో నాలోచనలుగల యీపాపాత్ముఁడు సత్యమతస్థుఁ డగునా! అదిగాక రాజపుత్రులఁ గలిసి చక్రవర్తిపైఁ గుట్రలు పన్నుచున్నాఁడు. మతవిరోధియు రాజద్రోహియు నగు నీ దురాత్ముని బట్టి బంధింపవలసినదని చక్రవర్తి వద్ద నుండి నాకు హుకుము వచ్చినది. అందుచేతఁ బట్టుకున్నాను' అని చెప్పి ఆక్కలు వెనుకకు విఱియఁగట్టించి మాలవిని జెఱ కంపెను. కామాతురుఁడును నీర్ష్యాపీడితుఁడగుటచే రహిమానుఖానుఁ డొక్కరాత్రి తనబలవద్విరోధుల నిరువురను బట్టుకొన్నందున కానందించుచు సఫలమనోరథుఁడయి వారినిరువురఁ జెఱయొకగదిలో నుంచి తలుపులు మూయించి తాళములు వేయించెను. తరువాత గడియరాత్రియుండ నతఁ డొంటరిగ బయలుదేఱి మఠమునకువచ్చెను. అప్పుడు తానచట కావలియుంచిన సేవకు లిద్దఱును గాఢముగ నిద్రించుచుండిరి. హేమలత ప్రథమమున

మూర్ఛిల్లినచోట లేనందున రహిమానుఖాను గదిలోనికిఁబోయి చూచెను. అందునునామె గన్పడనందున నిల్లునాలుగుప్రక్కలను దొఱ్ఱను ఖానుగారు స్వయముగ వెదకికొనిరిగాని హేమలత యగపడలేదు. ఆ శాభంగమును దుఃఖమును బాధింప సాహేబుండ లెఱుంగక నిద్రించు సేవకులను దన్ని నిద్రలేపి హేమలత యేదిరా! యని యడుగవారును దిగులుపడి మాటలాడక చూడనారంభించిరి. వారిని వెంటఁబెట్టుకొని ఖాను కోటకుఁ బోయి తనమందిరమున శయనించి గ్రామమున బ్రాహ్మణ క్షత్రియ వైశ్య శూద్ర వివేచనములేక ప్రతిగృహమును, మాల మాదిగగూడెములను మహమ్మదీయులయిండ్లను, నూతులు, గోతులు, చెఱువులు, మొదలగువానిని వెదకించెను; కాని హేమలత యెందునుగానంబడదయ్యెను. తుదకు నిరాశపడి కోప మొట్లునుదీరక కావలియుండి పరాకున హేమలతను దాఁటిపోవనిచ్చిన సేవకులఁ బిలిచి యందత్యంతోపకారి యగు వానిని క్షమించి మేదకుండగు రెండవానికి మరణదండన విధించెను. పాపము చిఱకాలము దారులు కొట్టికొట్టి, మార్గస్థులఁ జంపిచంపి దోపిడియై ఖానున కాప్తుఁడైన గులామల్లికి నేఁడు మరణము తప్పదయ్యెను. వానిని వృక్షమునకుఁ గట్టించి కత్తితో ఖాను తానే నఱికెనై చెను. అంతకును మనశ్శాంతిలేక పిచ్చివానివలె నటునిటుఁ దిరుగుచు గడ్డమునొకసారి సవరించుకొనుచుఁ గుళ్ళాయి నేలఁ బాఱవేయుచు, సేవకులనెల్లఁ దిట్టుచుఁజెఱసాలకడకుఁ బోయి నారాయణసింగును మనుమరాలివిషయమై యడుగుచు, వానిని సంహరించెదనని బెదరించుచు నన్నము ముట్టక సకలావస్థలఁ బొందుచు ఖాను విలపించుచుండెను. ఇది యిట్లుండ రాధ మఱునాఁటి యుదయమున లేచి హేమలత గృహమునకు వచ్చి మఠమంతయు వెలవెలఁబాఱి చిన్నఁబోవుటయు బాలిక పెంచురామచిలుక దిగులుపడి యుండుటయు నామె యొడుకొను వస్తువులన్నియు నెక్కడివక్కడ నుండుటయు ముసలివాని మందులసంచియు

వాని నెన్నఁడునుబాయని చేతికఱ్ఱయు నటఁ బడియుండుటయుఁ జూచి కఠినచిత్తయయ్యు నామె స్త్రీజనస్వాభావిక మగువిచారమును బొందక తప్పదయ్యెను. తరువాత రాధ గృహమునంతను వెదకి హేమలత మ్లేచ్ఛునిపాలఁ బడియుండునని, తన మనోరథ మీడేరునని సంతోషించి హేమలత వస్తువుల నన్నిఁటిని వెదక నారంభించెను. తనదగ్గఱనున్న మాఱుతాళములతోఁ బోషాణముదీసి యందున్న సందువాపెట్టెమూఁత తెఱచి హేమలత యాభరణములను దొంగిలించి యందున్న రెండుకాగితములను దీసి చదువుకొన్న దగుటచే వానిని మెల్లఁగఁ జదువుకొని, నగలకంటె వానికయి సంతోషించుచు నెవరునుజూడకుండ రవికెలోఁ బెట్టుకొనిపోయెను. అట్లు మదోన్మత్తుఁడై చిత్తవైకల్యము గలిగి ప్రవర్తించు రహిమానుఖానునకు నలాయుద్దీనుచక్రవర్తియొద్దనుండి పరమానాయొకటి వచ్చెను. చిత్తూరుదండయాత్రనుగూర్చి ఖిల్లాదారులతో నెల్ల యోజింపవలసియున్నదని ఖానును చక్రవర్తి రమ్మనెను. నిరంకుశమగు చక్రవర్తి యుత్తరువు నతిక్రమింపఁజాలక యొకవారములో ఢిల్లీకిఁబోవుచు, సింగును మాలవిని విడువవలదని తనక్రింది యధికారితోఁ జెప్పి చనెను. గ్రామస్థులందఱును హేమలత బలవంతముగ మృతినొందెనని నిశ్చయించిరి.

అయిదవ ప్రకరణము.

మహమ్మదీయులు భరతఖండమును బరిపాలించినంత కాలమును ఢిల్లీనగరము రాజధానియై యుండెను. ఈ ఢిల్లీచక్రవర్తులె రారాజులవలనఁ గప్పముల గ్రహించి మూర్ధాభిషిక్తులను బాదాక్రాంతులఁ జేసిరి. ఈ ఢిల్లీచక్రవర్తులె యాసేతుహిమాచలమగు భరతఖండము నేకచ్ఛత్రముగఁ బాలించిరి. గుజనీమహమ్మదు పండ్రెండుసారులు హిందూ

దేశముపై దండెత్తి దేశములనెల్ల కొల్లగొని లక్ష్మిని దనవెంటఁగొని దారిద్ర్యదేవత నిటనిలిపి చన్నయనంతరము మహమ్మదుగోరీయను నతఁడు ఢిల్లీమహారాజుగ నుండిన పృథివీమహారాజును ధనేశ్వరయుద్ధమున వధించి దేశమునాక్రమించెను. తన్మరణానంతరము బానిసరాజులు 1206 మొదలు 1290 వఱకు నుత్తరహిందూస్థానమును బాలించిరి. వారుబలహీనులయినవెనుక వృద్ధుఁడయ్యు జలాలుద్దీను భుజబలముచే బానిసలను గెల్చి సింహాసన మెక్కి కిల్జీవంశస్థాపకుఁడయ్యెను. జలాలుద్దీనుచక్రవర్తి 1290 మొదలు 1295 వ సంవత్సరమువఱకుమాత్రమె పరిపాలించెను. రాజ్యకాలము స్వల్పమయినను మహమ్మదీయు లదివఱకు నెన్నఁడెఱుఁగని దక్షిణహిందూదేశముపై ప్రథమదండయాత్ర 1294 వ సంవత్సరమున జరిగెను. అదిజలాలుద్దీనునకు నన్నకొమారుఁడును, కపటోపాయధురీణుఁడును, రాజనీతివిశారదుఁడు నగు నలాయుద్దీను సేనానాయకుఁడై నడిపి మహారాష్ట్రదేశము నాక్రమించెను. ఆకాలమున మహారాష్ట్రదేశమునకు దేవగిరినగరము రాజధానియై యుండెను. అలాయుద్దీను మహారాష్ట్రదేశాధీశ్వరుఁడగు రామదేవమహారాజును గెల్చి యాతఁడు ఢిల్లీకి సామంతరాజుగ నుండునట్లును గప్పముఁగట్టునట్లును నొడంబఱిచి బహునగరములను గొల్లఁగొన్న దోపుడుధనముతోడను, కానుకలతోడను, బినతండ్రి నెదుర్కొనుట కరిగెను. అరిగినతోడనె యతఁడు పినతండ్రిని జంపించి తాను జక్రవర్తి కాఁగోరి యపారసేనాసమేతుఁడయి యుండుటచేఁ దనమనోరథమును సులభముగ నెఱవేర్చుకొని మహావైభవముతో 1295 వ సంవత్సరమున సింహాసనమెక్కి 1316 వ సంవత్సరమువఱకును రాజ్యము చేసెను. ఈతఁడు లోకవ్యవహారములయం దారితేఱిన దిట్టరిమొగాని కుటిలుఁడు, కార్యసాధన మొనర్పఁగల బాహుశాలిమెగాని నీతిలేనివాఁడు. ఈతఁ డుత్తరహిందూస్థానమును దాదాపుగ స్వాధీనముచేసికొనినను, రాజపుత్రస్థానమును జయింపలేదు. అతఁడు

సింహాసన మెక్కు నాటికి దక్షిణమున మహారాష్ట్రము దక్క తక్కిన దేశము లెవ్వియు వాని పాలనమునకు లోఁబడియుండలేదు. దేవగిరి మహారాష్ట్రసామంతుఁడగు రామదే వేలుచుండెను. ఓరుగల్లు రాజధానిగ త్రిలింగదేశము కాకతీయవంశజులు పాలించుచుండిరి. భిల్లాలువంశస్తులు ద్వారసముద్రమునుండి మైసూరు రాజ్యము నేలుచుండిరి. కర్ణాటకమును స్వదేశరాజులు పాలించుచుండిరి. రాజస్థానమును దక్షిణరాజ్యములను స్వాధీనపఱచుకొనవలయునని యలాయుద్దీను చిఱకాలమునుండి కోరుచుండి, దక్షిణహిందూదేశముపై మాలికాఫరను సేనానాయకుని గొప్పసైన్యముతో నంపగా నతఁడును తనప్రభువువలె నీతిసంపత్తి లేనివాఁడగుటచే మాయచేతనో బలముచేతనో స్వదేశప్రభువుల నడఁచి రామేశ్వరమువఱకుఁగల దేశమును జయించి యనేక పురాతనరాజకుటుంబముల నిర్మూలన మొనర్చెను. ఈతఁడు దక్షిణదేశమందుండఁ జక్రవర్తి రాజస్థానదండయాత్రనుగూర్చి యోజించుచుండెను. ఢిల్లీనగరమునందున్న సైన్యమును జాలకాలమునుండి యుద్ధమునకు సిద్ధమగునట్లు చేయుచు నితరమండలములయం దుండు సైన్యంబులఁగూడ బిలిపించి సన్నాహ మొనర్చుచు సైనికులకెల్లఁ గావలసిన భోజనసామగ్రిలను, అశ్వములను, గజములను, బళువులను సిద్ధపఱచుచుఁ జక్రవర్తి ప్రయత్నము చేయుచుండెను. ఒకనాఁటిసాయంకాలము సంధ్యారాగము దర్శనీయమయి ఢిల్లీనగరముపైఁ గట్టఁబడిన యెఱ్ఱనివితానమువలె వెలయుచుండెను. సంధ్యారాగము క్రమముగ నదృశ్యమయి వెన్నెల వ్యాప్తమయ్యెను. నల్లనియమునానదిజలమునందు ఢిల్లీనగరము మేడలతోడను మిద్దెలతోడను మహాగోపురములతోడను నీటఁగట్టఁబడిన పట్టణమువలెఁ బ్రతిబింబితమై కనుపట్టుచుండెను. సాయఃకాలపు నమాదునకుఁ భక్తులఁ బిల్చువారి కేకలతో మసీదులుప్రతిధ్వను లిచ్చుచుండెను. మసీదుల యగ్రభాగములును, హిందూదేవాలయశిఖరములును మహోన్నతగోపుర

ములను వెన్నెలలో ధగధగలాడుచు నగరముయొక్క యున్నతస్థితిని దమ పొడవుచే దెలియఁజేయుచుండెను. నగరమధ్యముననున్న కోటలో సరోవరమధ్యమున విలసిల్లు తెల్లదామరవలె జక్రవర్తి వసియించు నేడంతస్తులమేడ క్రొత్తకాంతులతో నావెన్నెలయందుఁ గన్పట్టుచుండెను.

ఆనాఁటిరాత్రి నాలుగుగడియ లయినతరువాత చక్రవర్తి రహస్యములు మాటలాడుకొనుగదిలో మెత్తనిపరుపులు వేయఁబడిన యొకకుర్చీమీఁదఁ గూర్చుండి హుక్కా త్రాగుచునుండ నతివినయముతో నంతఃపురసేవకుఁడగు నొక నల్లని దీర్ఘకాయముగల తురకగదిఁ బ్రవేశించి చక్రవర్తి పాదములదగ్గఱ సాష్టాంగపడి భయవినయములతో, "మహాప్రభూ ! ఏలినవారి గులాపువాని దొక మనవి యున్న" దని మెల్లఁగఁ బలికెను. ఆమాటవిని యదివఱ కేదో యోజించుచున్న చక్రవర్తి మహాకోపముతో వానిస నొకతన్ను తన్ని, "ఏమిరా ! లుచ్ఛా ! నీవెందు కఱచెదవురా" యని భయంకరముగఁ గేక వేసెను. వానిసయు వడఁకుచు, "స్వామీ ! పాలిఖిల్లాదారు రహిమానుఖాను వచ్చి యున్నాఁడు, సెలవు దయచేసినపక్షమునఁ దమపాదములసన్నిధికిఁ దోడుకొనివచ్చెద" నని పలుకుటయుఁ జక్రవర్తి తనయంగీకారసూచకముగఁ దలయూఁచిన, సేవకుఁడు ఖానుగారిని వెంటఁబెట్టుకొని వచ్చి గదిలోనికంపి తానావల నిలుచుండెను. ఖానుసాహెబు పాలిగ్రామమున వసించునప్పటిగర్వమును వదలి, చక్రవర్తి సముఖమ్మున నేలఁబడి తత్పాదములనంటి సలా మొనర్చెను. చక్రవర్తియు వానిని జూడఁగానే వానిదురాచారములఁగూర్చి నాజరుజంగు విన్నవించినయంశములు జ్ఞప్తికిరాఁగా మండిపడి, "ఓరీ ! రాజద్రోహీ ! మాదేశమున గల ద్రవ్యవంతులను సామంతులను దోపించుటకా నీ కధికార మిచ్చినది ? ఛీ ! నీమొగము చూడరాదు. నీవు నాయెదుటనుండిపో" యని తనపాదములపైఁ బడియున్న యాతనిఁద్రోచివైచి రెండుతన్నులఁ దన్నెను.

స్త్రీవలె రోదనముఁ జేయుచు, “ఓమహామ్మదీయమతసంరక్షకా! ఓసకలలోకచక్రవర్తీ! నేను మీబానిసను. నేనేపాప మెఱుఁగను. నిర్హేతుకముగ నామీఁద నోర్వలేక తుచ్ఛులెవరో నేరములఁ జెప్పినా” రని విలపించుచున్న యానిర్భాగ్యునిజూచి చక్రవర్తి యించుక కరుణించి, “నీనిర్దోషత్వమును నీవెట్లు స్థాపింపఁగలవు? అట్లు చేసికొనినపక్షమున నే నీప్రాణములు దక్కఁగలవు. రేపు సాయంకాలమునఱకు నీకు గడువిచ్చినాను. రేపురాత్రి దర్బారు. ఆసమయమునకు నీవు సంసిద్ధుఁడవై యుండవలె” నని పలికి యాపూఁటకు క్షమించెను. ఈవాక్యములతో మనశ్శాంతికలిగి రహిమానుఖాను సంతోషించి, “మహాప్రభూ! ఏలినవారు ధర్మమూర్తులు. రేపుసాయంకాలము నేను నిర్దోషినని స్థాపించుకొనఁగలను. అంతేకాక రాజపుత్రస్థాన దండయాత్రనుగూర్చి యత్యంతరహస్యమయిన కాగితములుకూడ నాకు లభించినవి. అవి యన్నియు నేను మీకు నిచ్చెదను. అప్పుడు నాసత్ప్రవర్తనమును మీ రెఱుఁగఁగలరు. ఇంక నేను సెలవుఁగైకొని పోయివచ్చెద” నని ఖాను చెప్పిన నలాయుద్దీ నాశ్చర్యమును సంతోషమును గదురఁ జల్లనికటాక్షవీక్షణములు వానిపైఁ బఱపుచు, ‘నీకు లభించిన కాగితముల నీరాత్రి దెచ్చి మాకుఁ జూపవలయును. ఆకాగితములఁ జూచినదాఁక మాకుఁదోఁచదు. నీవతివేగ మేగి వానినిఁ దీసికొనిర’ మ్మని చక్రవర్తి పలుక మందహాసముతో ఖాను సెలవుఁగైకొని బసకుఁబోయెను.

ఆఱవ ప్రకరణము.

ప్రపంచమునం దిప్పటికి నిలిచియున్న పురాతనపు కట్టడములలో నెల్ల మిగుల నున్నతమయి సర్వజనస్తవనీయమయి యున్నది ఢిల్లీ నగరమునకు నైదుక్రోసులదూరముననున్న కుతుబుమైనరను గోపుర

మని చెప్పవచ్చును. ఇది కుతుబుద్దీనను మహమ్మదీయఋషి పేరఁ గట్టఁబడినది. ఇది కట్టుట కారంభించిన యిఱువదియైదు సంవత్సరములకు ముగింపఁబడినది. ఇప్పటి కది నిర్మింపఁబడి యాఱువందలయేఁబది సంవత్సరములు గడచినను, నేఁటికిని జూపరకుఁ గనులపండువు సేయుచు నాశనదేవత పాలఁబడక మహమ్మదీయుల శిల్పిశాస్త్రనైపుణ్యమును బ్రకటించుచున్నది. అది యిన్నూటనలువదిరెండడుగులయెత్తుఁ గలిగి, గర్భమందు వంకరగఁ బాముమెలికలవలెఁ దిరిగియున్న మున్నూటతొంబదితొమ్మిది మెట్లతో వెలయుచుండును. పూర్వకాలమున ఢిల్లీరాజ్యమును బరిపాలించిన మహమ్మదీయచక్రవర్తుల గోరీలు దీనిచుట్టు నున్నవి. నేఁడు దీనిసమీపమున నొక చిన్నగ్రామము బయలుదేరినది. మనము వర్ణించుచున్న కాలము నాటికిఁగూడ తత్సమీపమునఁ గొన్ని సమాధులుండుటచే జనులు రాత్రులయందుఁ దఱుచుగ నాప్రక్కకుఁ బోవుచుండుటలేదు. ఈగోపురముపైకిఁ బోవువారు శ్రమ కలుగకుండ విశ్రాంతిఁ గైకొనుటకు నడుమనడుమ సంతస్తులు మందిరములు కట్టఁబడియున్నవి. వీనినెల్లఁ గడచి చివరయంతస్తుపైకెక్కి చూచువారి నేత్రములకు గ్రిందనుండు మనుష్యులు పిల్లలవలెఁ గన్పడుదురు. దీనియందు సాధారణముగా పరదేశగతులగు ఫకీరులు వసించుచుందురు. అనాఁడు సూర్యాస్తమయమైన వెనుక నిద్దఱుశిష్యులు వెంటరా నొకఫకీరు మెల్లమెల్లగ గోపురపు మెట్లనుండి క్రిందికి దిగెను. మెట్ల నన్నిఁటిని దిగి క్రిందికివచ్చి తనశిష్యులతోఁ గొన్నిరహస్యములను జెప్పి చెఱియొకవైపునకుఁ బంపి వారు బయలుదేరిన నాలుగుగడియల కతఁడు తత్ప్రదేశమును బాసి పురమువంకఁ బోవుచుండెను. ఆతఁడు షష్టివయఃపూర్ణుఁడగు వృద్ధుఁడని నెఱసిన గడ్డము తెలియఁజేయుచుండెను. కాని శరీరదార్ఢ్యముఁజూచువా రంత వయస్సుండునని నమ్మరు. తనశరీరమునఁ బ్రాఁతయంగరకాధరించి తలగుడ్డనుబెట్టుకొని పూసలతావళమును

దిప్పుచు నతఁడు పురముఁ బ్రవేశించి వీథులవెంబడిఁ దిరుగుచుండె
ను. రహిమానుఖాను చక్రవర్తివద్ద సెలవుఁగైకొని రాజమందిరమును
బాసి వీథిలోనికి వచ్చువఱకు ఫకీరును దనచేతికారు చప్పుడు చేయుచు
వినోదమును గల్గించు పాటఁ బాడుచు నాస్థలమునకు వచ్చెను. చక్రవ
ర్తి తనవిషయమున నేమిచేయునో తన కాకితములను దనవృత్తాంత
మును నమ్మునో నమ్మక ప్రాణములఁ దీయించునో యని భయపడుచు
మందగమనముతో వచ్చుచున్న ఖాను, ఫకీరును జూచి వారు భూతభ
విష్యద్వర్తమానముల నెఱిఁగినవారగుటఁ దానును వినియుంటఁ దన
భవిష్యదవస్థ నీఫకీరు నడిగి తెలిసికొనవలయునని తలంచి యాతని స
మీపమునకుఁ బోయి వినయముతో, "అస్సలామాలేఖుం" అని స
లాముచేసెను. ఫకీరును 'ఆలేఖుంస్సలాం' అని యచట నిలిచెను.
అంతట వారిట్లు మాటాడిరి.

ఖాను—మీరు కులందర ఫకీరులా? ముదార్య ఫకీరులా?

ఫకీ—నేను కులందరఫకీరునే. అయ్యా! నాసంగతి నీకెందుకు?

ఖాను—అయ్యా! తమరు మహాత్ములు. పైగంబరులవంటి
వారు. నాకు నేడొక్కయాపద తటస్థించినది. అది యెట్లగునో మీరు
తెలుపవలెను.

ఫకీ—(మాటవిని కొంచె మాలోచించి) హా! మహమ్మదు!
మౌలాహాల్లీ? నామీఁద దయగలిగి యుండుఁడు. అయ్యా! నాకుఁ
దెలిసినంతవఱకు నీయవస్థను దెలిపెదను. అది నిజమగునేని నీవు నూరు
గురు ఫకీరులకు నన్నము పెట్టగలవా?

ఖాను—సందేహమేమి? మీసెలవుప్రకారము చేసెదను.

ఫకీ—అయ్యా! నీపేరు రహిమానుఖాను కాదా?

ఖాను—(ఆశ్చర్యముతో) చిత్తము. చిత్తము.

ఫకీ—నీపైని దుర్మార్గులు చక్రవర్తితో నేరములఁ జెప్పిరికాని మహమ్మదువారి దయవలన నీదగ్గఱనున్న కాగితములనుబట్టి నీమాటయే పైనుండును. నీశతృవులు నశింతురు.

ఈవాక్యముల నాలకించినతోడనే ఖా నత్యాశ్చర్యమునొంది "మీరు సర్వజ్ఞులరు నేను పాపాత్ముఁడను. నాపాపముల క్షమించునట్లును నాకు శుభములు గల్గునట్లును నన్ను మీ రాశీర్వదించి దేవతలఁ బ్రార్థింపవలెను." అని వేఁడుకొనెను. అంతట ఫకీరు సంతోషముతో 'నీపై నల్లాకు దయగలదు. మహమ్మదీయుఁడవగుట నీ పాపములు క్షమింపఁబడినవి. కాఫరులందఱు నీచేత హతులగుదురు. నీకు శుభమగు పొమ్మ' అని తాను సాగిపోయెను. ఖానును మహానందముతోఁ దనబస కరిగెను. ఆలోపునఁజక్రవర్తి ఖానురాక కెదురుచూచుచు, నిర్హేతుకమైన యాలస్యమునకు వానిని నిందించుచు సమీపముననున్న బానిసలపై మండిపడుచుఁ, గొంతసేపటికి ముఖ్యమంత్రియైన జహాందరులోఢీకి వర్తమానము నంపెను. అతఁడును వచ్చి చక్రవర్తికి సలాముచేసి చేతులు జోడించుకొని యెదుట నిలువఁ జక్రవర్తి కూర్చుండుమని కనుసన్నఁ జేయ నొకపీఠముపైఁ గూరుచుండెను. అంతటఁ జక్రవర్తి వజీరునుజూచి 'రహిమానుఖాను కొన్ని రహస్యములగు కాగితములఁ దెచ్చినాఁడఁట. వానిని మనము పరీక్షింపవలెను. అని చెప్పగా నా వజీరు ఖానునిమిత్త మెదురుచూచుచుండెను. అంతలో రహిమానుఖాను కాగితములకట్ట చేతఁబట్టుకొని మెల్లమెల్లఁగా మేడమెట్లనెక్కి మూఁడవయంతస్తు మీఁదకువచ్చి చక్రవర్తియు వజీరును నున్న మందిరముఁ బ్రవేశించి, వినయపూర్వకవందనముల సల్పి యెదుట నిలిచెను. చక్రవర్తి వాని నుచితాసనమునఁ గూర్చుండ నియమించి. యతనిచేతనున్న కాగితములకట్ట నందుకొని విప్పి చూడ నందు నాలుగైదు కాగితములుండెను. ఆకాగితములు మహారాష్ట్రభాషలో నుండుటవలన, నాభాష

యుం డెవరికిని దెలియకుండుటకు వారందఱు యోజించి రాజభక్తి గలిగి మాయోపాయములయం దాఱితేఱిన వసంతభట్టను మహారాష్ట్ర బ్రాహ్మణునకు వర్తమానము నంపిరి. అతఁడును నర్ధరాత్రివచ్చిన వర్తమానమునకు భయపడుచుఁ, జపలచిత్తుఁడైన పాదుషావలన నేమి కీడు మూఁడునోయని 'యీగండము గడిచినయెడల భవానికిఁ గుంకుమపూజ జేసెద' నని మ్రొక్కుకొని యచ్చటికి వచ్చెను. అతని నుచిత గౌరవముతోఁ గూర్చుండ నియమించి చక్రవర్తి యాకాగితముల నిచ్చి చదువుకొనెను. అతఁడును నామూలాగ్రముగ వానినెల్లఁ దనలోఁ జదువుకొని యైదు కాగితములలో నాలుగు బంధువు లొకరికొకరు వ్రాసికొన్న యుత్తరములనియు నైదవదిమాత్రము ముఖ్యమైనదనియుఁ జెప్పి దాని నిట్లుచదువ నారంభించెను.

“శ్రీ సూర్యకులప్రదీపకులగు భీమసింగు మహారాజువారికి దేవగిరిరాజు రామదేవు నమస్కారములఁజేసి వ్రాయుచున్న దేమనిన:—ఈ మధ్య మీకును గ్రూరుఁడైన యలాయుద్దీను చక్రవర్తికిని మనస్పర్ధగ నున్నట్లును, జిత్తూరురాజ్యముపై నతఁడు దండెత్త నూహించుచున్నట్లును మేము వినుచున్నాము. అది నిజమగు నేని మిగుల విచారము నొందుచున్నాము. ఈవఱకు దక్షిణహిందూస్థానమునకు వచ్చి మమ్మాతఁడోడించుట మీరు వినియుందురు. సమానాపదలోనున్న మన మిరువురమును క్షత్రియకులజులము నేకదేశీయులము నగుటచే నన్యమతస్థుఁడు దురాచారుఁడునగు చక్రవర్తిపైఁ గలిసి యుద్ధముచేసినపక్షమున గెలువకపోము. పౌరుషధనులును నభిమానసముద్రులునగు మీకు మేము దోడ్పడినయెడ దైవానుగ్రహమువలన ఢిల్లీనుండి మ్లేచ్ఛులను బాఱఁదోలవచ్చును. మ్లేచ్ఛుఁడగు చక్రవర్తి దురాచారుఁడగుటచే స్వబలమునం దనేకు లతనికనిష్టులుగ నున్నారని విని సంతోషించుచున్నాము. మీదేశముమీఁద దండయాత్ర ముందుగ జరుగునేని మాబలమును

మీకు సాహాయ్యముగనంపెదను. అదియుంతట జరుగదేని మాకు మీరు సహాయముచేయుఁడు. నీతివిశారదుఁడగు నీయోగి మనకుత్తరప్రత్యుత్తరములఁదెచ్చి యిచ్చుచుండును. దీనికి వెంటనే యుత్తరమునంపఁగోరుచున్నాము. త్వరపడవలయును. రామదేవువ్రాలు."

అని మహారాష్ట్రభాష నున్న యుత్తరమును పారసీకభాషలోనికి మార్చి చక్రవర్తికి విన్నవించి వసంత భట్టారకుండెను. చక్రవర్తి కాగ్రహమును నాశ్చర్యమును నేకకాలమున జనించెను. ఉత్తరహిందూస్థానమం దున్న గొప్పరాజ్యమగు చిత్తూరును దక్షిణమున గొప్పరాజ్యమగు దేవగిరియును గలిసిన జక్రవర్తి వారల గెలుచుట యసాధ్యము. అందుచేఁ జక్రవర్తి భయపడి కర్తవ్య మూహింపుచు 'నీకాగితము లెట్లులభించినవి' అని ఖాను నడిగెను. ఖా నేవో యబద్ధములఁ జెప్పుట కాలోచించుచుండెను. 'ఈయుత్తరమునుబట్టి చూడ నీవఱకు రాజపుత్రులు మహారాష్ట్రుల కేమియు వ్రాసినట్లు కన్పడదు. మహారాష్ట్రులు ముందుగ రసపుత్రులకు వ్రాసినకాగితములు మనకు దొరికినవి. కాఁబట్టి భీమసింగీవార్త యెఱుఁగఁడు'. అని వజీరు పలుకఁ దద్వచనములయందుఁ జక్రవర్తి విశ్వాసముంచి యౌనని తలయూఁచి 'నీకెవరివద్ద నివి లభించినవి?' అని ఖానును మరల నడిగెను. అంతట ఖానులేచి చక్రవర్తి కభిముఖుఁడై నిల్చి చేతులుజోడించి, 'ఓ మహాప్రభూ! మదనసింగుపై మీకుఁ గల గొప్పయభిప్రాయమును జెఱుపుటకు నాకిష్టములేదు. అయినను మీయాజ్ఞ శిరసావహించి రాజ్యముకొఱకును మీకొఱకును బాటుపడునట్టివాఁడ నగుటచేఁ జెప్పక తప్పదు' అనెను. విని యాశ్చర్యమునొంది 'మదనసింగు సమాచారమెందుకు? అతనికీవృత్తాంతము తెలియునా యేమి? వేగముగఁ జెప్పు' మని చక్రవర్తి త్వరపెట్ట ఖా నిట్లనియె. 'ఈ కాగితములు నాకుమదనసింగునొద్దనే లభించినవి. అతనిదగ్గఱ నీకాగితము లున్నవని విని నాసేవకులనంపి బల

వంతముగ వీనిని దెప్పించితిని. నేనీపని కేవల రాజభక్తితో నొనర్చినను, దారులుగొట్టించి దోపుడు చేసితినని యేలినవారితో దుర్మార్గులు చెప్ప విశ్వసించి నాపయినలుక వహించినట్లున్నది. ఆమదనసింగునకును యోగికిని బరమమైత్రి కలదు. అయ్యో యెవరో నిలుకడమీఁదఁ దెలియవలయును.' అనవుఁడు చక్రవర్తి యాగ్రహము పట్టఁజాలక 'తక్షణమే యాదుర్మార్గునిఁ బట్టి యేల చెఱలో వేయలేదు? నీవు సమయోచితబుద్ధిలేని గాడిదవు' అని తిట్టుచుండఁగా రహిమా నిట్లు చెప్పుచుండెను. 'మదనసింగును నఱకవలెననియే నేను రోషముతో ఖడ్గము నెత్తి యా పాపాత్మునిపయిఁ బడితిగాని నాజరుజంగు నన్నుఁ బట్టుకొని యాపెను.' అనవుఁడు మండిపడి పీఠమునుండి లేచి చక్రవర్తి 'నాజరుజంగడ్డువచ్చెనుగా? అతఁడును వానిలోఁగలసెనా?' యని యడిగెను. అందుకు ఖాను మెల్లన నిట్లనియె. 'దేవరవారు నన్ను క్షమించినపక్షమున నాసంగతి మనవిచేసికొందును. మదనసింగునకు నాజరుజంగాప్తమిత్రుఁడు. అతఁడీకుట్రలోఁజేరకున్నయెడ, విదేశీయులును విమతస్థులు నగువారి కీస్నేహమెట్లు కుదురును? దానికి నిదర్శనముగ నిప్పుడు చదివినయుత్తరములో మనబలములోఁ గొందఱు రాజపుత్రులతోను మహారాష్ట్రులతోను జేరుదురని యుండలేదా? నాజరుజంగు మొదలగువా రుండుటచేతనె యా యుత్తరముననట్లున్నది. అని చక్రవర్తికి సలాముజేసిఖానుకూర్చుండెను. తరువాత చక్రవర్తి వజీరును వసంతభట్టునుజూచి 'నాజరుజంగువిషయమున మీయభిప్రాయ మేమి?' అని పలుక, వజీ రిట్లనియెను. 'ఆవిషయమున నాతఁ డెట్లు చెప్పకొనునో విని కర్తవ్యమూహించుట శ్రేయము' అనుచుండగా ఫాదుషా 'దీని కతనివలన వినుట యెందుకు? లిఖిత నిదర్శన ముండఁగా నిం దబద్ధ మేమున్నది' అనెను. తాను త్రవ్వినగోతిలో మదనసింగును నాజరుజంగును దప్పక పడుదురని పూర్ణవిశ్వాసముతో రహిమానుఖానానంద మొందుచుండెను. చక్రవర్తి రాజపుత్రుల

పయి దండెత్తుట కర్తవ్యమగునా కాదాయని తనలోఁ దానాలోచించుకొనుచు ‘రాజపుత్రుల దేశముపయి దాడిపెట్టుదమా వద్దా? మదనసింగుతో దండయాత్ర లేదని చెప్పినాము. ఈవిషయమున మీయభిప్రాయమేమి?’ అని యడిగిన రహిమాను ఖా నిట్లనియె, ‘మహాప్రభూ! రాజస్థాన దండయాత్ర మీరు మానవలదు. రాజపుత్రులు పైగాంభీర్యమేకాని నిజముగ పిఱికివారు. చిత్తూరు జయింపకున్నయెడల మహమ్మదీయులు రజపుత్రులను జయింపఁజాలరని ప్రజలకు మనపై గౌరవము తగ్గును.’ అని చెప్పగానే చక్రవర్తియు నదిసరేయని ‘రేపురాత్రి దర్బారగును. అప్పుడు దండయాత్రసంగతి నెల్లరకుఁ దెలియఁజేయుదము. ఈ రాత్రి ప్రొద్దుపోయినది. మీరు రహస్యమును బయలుపఱుపకుఁడు.’ అని చక్రవర్తి లేవఁగా రహిమానుఖా నపుడు మరల ‘మదనసింగుతో దేవరవారు యుద్ధమునకు రామని చెప్పుట మిగుల లాభము. మనము దండెత్తిరామని వా రనుకొనుచుండ నాకస్మికముగ వారిపైఁ బడి యోడింపవచ్చు’ ననెను. పాదుషా పకపకనవ్వి శహబాస్ మంచియోజన చేసినావు. నీవంటి బుద్ధిమంతుఁడు మారాజ్యములో నింకొకఁడు లేఁడు. అని వజీరును వీడుకొలిపి రహిమానుఖానును వసంతభట్టును దీసికొనిపోయి వేఱువేఱుగ నిద్దఱికిని జెఱియొకరహస్యమును జెప్పిపుచ్చెను. ఖాను తనబసకుఁ బోవుచుండ మార్గమున గులందరుఫకీరు మరల నగపడి యతనిని బలుకరించి ‘నీపని నేఁ జెప్పినట్లయినది గదా?’ యని యడుగఁగా నైనదని చెప్పి ఖాను ఫకీరుకోఱకమీఁదఁ నతని కారాత్రి జరిగిన విశేషములన్నియు విన్నవించెను. మఱునాఁటి యుదయమున చక్రవర్తి రహిమానుఖానును దనసన్నిధికి రావించి దండయాత్రనుగూర్చి ముచ్చటించుచుండఁగా మఱింత ప్రోత్సాహము కలిగింపఁదలఁచి ఖాను ‘దేవరవారికి నేనొక ప్రియము విన్నవించెద. చిత్తూరురాజ్యసంరక్షకుఁడగు భీమసింగు మహారాజుభార్య పద్మినియనునొక జగన్మోహ

V.R.NARLA MEMORIAL LIBRARY
V.R.NARLA
D.P.R.I.
Acc. No 183

నాకారము గలదు. ఆమెనుబోలు సుందరులు ప్రపంచమున లేరు. మహాచక్రవర్తులైన తమ కాసుందరి తగినది. ఈదండయాత్రవలన రాజస్థానము లోఁబడుటయేగాక పద్మినియు మీకు లభించును. అని విన్నవించినతోడనే యమితానందభరితుఁడై చక్రవర్తి వజ్రపుటుంగరము ఖానునకు బహుమానము నొసంగి, సాయంకాలపు దర్బారునకు మరలరమ్మని యాతని నంపివేసెను.

ఏఁడవ ప్రకరణము.

ఆనాఁటిరాత్రి కొలువుకూటమున దర్బారుజరిగెను. నానాభాగములనుండి ఖిల్లాదారులు, జమీందారులు, ఫౌఁజుదారులు వచ్చి చక్రవర్తికిఁ దమతమ యధికారగౌరవంబుల కుచితమగురీతి నజరుల నర్పించి యర్హమర్యాదల నొందిరి. చక్రవర్తివలన ననేకబిరుదములఁ బొందిన ఢిల్లీనగరవాసులగు మహమ్మదీయప్రభువులుగూడ వచ్చి దర్బారు నలంకరించిరి. అందఱితో నాజరుజంగువచ్చి యుచితాసనమునఁ గూర్చుండెను. సభ పూర్ణమైన వెనుక చక్రవర్తి రాజపుత్రస్థాన దండయాత్రనుగూర్చి తన యభిప్రాయమును బూర్ణముగ నెఱింగించి సైన్యములును, సేనానాయకులును యుద్ధసన్నద్ధులై యుండవలయునని యాజ్ఞ యొసఁగెను. అదివఱ కెప్పుడును దర్బారులయందు నాజరుజంగు నతిగౌరవముతోఁ జూచి యాతని యాలోచన నడిగెడి చక్రవర్తి యాదిన మాతనివంక జూడక, దర్బారుముగిసెడువేళ కోపముతో, 'మనలో ననేకులు రాజద్రోహులున్నారు. మాసొమ్ము దినుచు మాశత్రుపక్షమునఁ జేరి మాప్రాణములఁ దీయఁగోరుచున్నవారీసభలో ననేకులు గల' రని పలుక సభాస్థలమెల్ల నిశ్శబ్దమయ్యెను. అచటఁజేరిన సామంతులందఱు నొకరిమొగమువంక నొకరుచూడ

నారంభించిరి. అప్పుడు జరుగుచున్న కలవలపాటు నవలోకించి చక్రవర్తి సభ నుద్దేశించి 'మీరందఱు నిట్లనుమాన మొందవలదు. మాకిట్టి యనుమానమునకు నెడ మొసఁగినవాఁడు మా కత్యంతాప్తుఁడని మే మిదివఱ కెంచుకొనుచువచ్చిన నాజరుజంగు. అతఁడు రాజపుత్రులలోఁ జేరి మనపైఁ గుట్రలఁ జేయుచున్నాఁడఁట. అతనికుటుంబమునకు మేము సలిపిన మహోపకారమునకు మాకితఁడు చేసిన ప్రత్యుపకార మిది" యని యెలుఁగెత్తి చక్రవర్తి పలుక, నాజరుజంగు గుండెలు ఝల్లుమనియెను. రహిమానుఖాను ముఖము మందహాసముతోఁ గూడుకొని యుండెను. మహమ్మదీయ సామంతుల హృదయము లాశ్చర్యవిషాద భరితము లయ్యెను. పిడుగువలెఁ దనపైఁబడిన యపనింద భరింపలేక నాజరుజంగు ధైర్యమునుదెచ్చుకొని చక్రవర్తి కభిముఖుఁడై "మహాప్రభూ! నాచేసిన యపరాధ మేమియు నేనెఱిఁగినంతవఱకు లేదు. నాయపరాధమును నా కెఱింగించి యది యిందు ఋజువుచేసి యీమహాజనమధ్యమున నన్ను శిక్షించుట యుచితముగాని నిష్కారణముగ శూలములవంటి మాటలతో నన్ను బాధఁబెట్టుట తగదు. నేనునారాజునకును నాదేశమునకును వ్యతిరిక్తముగ నెన్నఁడుఁ బ్రవర్తింపలేదు." అని సభ్యులకెల్ల జాలి జనియింపఁ బలికిన నాజరుజంగు వచనంబులు చక్రవర్తి లక్ష్యపెట్టక మహాకోపముతో "నీవింక మాటలాడవద్దు. నీవుచేసిన యపరాధమునకు నీయుద్యోగము నూడఁదీసినారము. నీవు సేనకధిపతిగ నుండఁదగదు. నీతండ్రితాతలయందలి గౌరవమునుబట్టి నిన్ను మేమింతటితో విడిచినాము. పొమ్ము" అని తక్షణము సభనుండి సాగదోలెను. నాజరుజంగు పరువుగల యుత్తరహిందూస్థాన మహమ్మదీయ కుటుంబములోనివాఁడు. అతనితండ్రి బానిసవంశమునాటనుండియుఁ జక్రవర్తుల కొలువునుండి యావంశనాశనానంతరమున జలాలుద్దీనువద్ద సేనానాయకుఁడుగ నుండెను. ఈకాలమున వృద్ధుఁడై

పనిచేయఁజాలక తనకుమారుని రాజసేవయందు నియోగించి తానింటి వద్ద సుఖముగఁ గాలక్షేపముఁ జేయుచుండెను. చక్రవర్తికి నాజరుజంగుపై నీవఱకును నమ్మకమును దయయు నుండెనుగాని రహిమానుఖానుని దుర్బోధవలన నిప్పు డలుకపుట్టెను. అట్లు పరాభవము నొంది నాజరుజంగు తనగృహమున కరిగి జరిగిన వృత్తాంతమును జనకున కెఱింగింప నతఁడా వార్తవిని యద్భుతపడి రాజభక్తికిఁ బుట్టినిల్లని ప్రజలచే స్తోత్రమునందిన తనకుటుంబమున కది గౌరవహీనతయని చింతాక్రాంతుఁడయ్యెను. ఇచటఁ జక్రవర్తి దర్బారునందున్నవారిని జూచి "యీకొలువులోని సరదారు లెవ్వరును లోలోపల కుట్రలు నలుపక నాకు ప్రతిపక్షులుగా నుండువారు నిరాటంకముగఁ నాకొలువు విడిచి పోవచ్చు" నని సెలవిచ్చెను. ఆమాట లాలకించి సభాసదు లెవ్వరును లేవరైరి గాని యొక పురుషుఁడుమాత్రము లేచెను. మాయలమారియగు వసంతభట్టను మహారాష్ట్రుఁడు తనయాసనమునుండి లేచి నిర్భయంబుగఁ గంఠమెత్తి యేలికతో నిట్లనియెను. "ఓమహాప్రభూ! ఈవఱకుఁ జాలకాలమునుండి తమవద్ద సేవఁజేసినవాఁడను. నేనింక తమవద్ద నుండఁజాలను. ప్రభువువారి క్రూరస్వభావముఁజూడ నాకిందుండుట కష్టముగ నున్నది. నాకు సెల వొసంగుఁడు" అని మహారాష్ట్రుఁడాడినతోడనే పండ్లు పటపటఁగొఱుకుచు "దురాత్మ! మాకొలువు నీకు భారముగ నుండినం బోదగునుగాని యిట్టికాఱుకూఁతలఁ గూయనేల? మాప్రతిపక్షులు నిర్భయముగఁ గొలువువిడిచి పోవచ్చునని మేమభయహస్త మిచ్చి యుండుటచే నిట్టికాఱు లఱచియును బ్రాణములతోఁ బోఁగలిగితివి పొమ్ము" అని చక్రవర్తి "ఈతఁడు మాకిదివఱకుఁజేసిన సేవఁబట్టి వధింపక విడిచినారము. వెంటనే యీతనిఁ దీసికొనిపోయి కారాగృహమున బంధింపుఁడు." అని భటుల నాజ్ఞాపింప వారట్లు చేసిరి. ఇట్లు రాజస్థానదండమాత్రను బ్రకటించి చక్రవర్తి

దర్బారుఁ జాలించెను. అందఱును దమతమనిలయముల కరిగిరి. నాజరు
జంగుతండ్రి మహావిచారమున మునిఁగి, తనకుమారుని వెంటఁబెట్టుకొ
ని యారాత్రి చక్రవర్తి దర్శనముచేసి యుచితసత్కారమునొంది
వేఁడుకోఁగాఁ జక్రవర్తి దండయాత్రలోఁ దనసైన్యముతోఁ గూడ
నాజరుజంగు వచ్చుటకు మాత్రము సెలవొసంగెను. అంతటితోఁ దృ
ప్తినొంది నాజరుజంగుఁ దండ్రియు నింటికిం జనిరి. మఱునాఁడు సూ
ర్యోదయకాలమున ఢిల్లీనగరమునందు వసంతభట్టు చెఱలోనుండి పాఱి
పోయెనని యొకవాడుక పడెను. అట్టిమహాద్భుత మిదివఱకు నెన్నఁడుఁ
గని విని యెఱుఁగమని జనులు పరిపరివిధములఁ జెప్పుకొనసాగిరి. కా
రాగృహాధికారి భయముచే వడఁకుచు వచ్చి ఫాదుషాపాదములపైఁబడి
యేడ్చుచు నావార్తఁ దెలిపి క్షమియింప వేఁడుకొనెను. చక్రవర్తి
యు నాశ్చర్యమునొంది యాతని కభయ మిచ్చి, వసంతభట్టును బట్టితె
చ్చినవారికి నూఱువరహాలు బహుమానముగ నిచ్చెదమని పట్టణమునఁ
జాటఁబంచి, యతనిని వెదకుటకై యనేకులను బంపెను.

అక్కడ నట్లు నారాయణసింగు చెఱలో నుంచఁబడినరాత్రి వ
ర్ణింప నలవిగాని మహాదుఃఖము నంది తెల్లవారినదాక నిద్రలేక తన
కు సంభవించిన మహాపదకంటె మనుమరాలి సంగతి యేమయ్యెనా
యని యెక్కువ సంతాపమునొంద నారంభించెను. మఱునాఁడుదయ
మున హేమలత యెచ్చటఁ గనపడలేదని తెలిసినప్పు డామె మృతి
నొందియుండునని నిశ్చయించుకొని యతఁడు కంటికి నేలకు నేకధారగ
నేడ్చుచు నడుమనడుమ మూర్ఛిల్లి యామూర్ఛలో 'హేమలతా?
మందులసంచి తె' మ్మని కలవరించుచు, గలతనిద్ర కలిగినప్పుడు మను
మరాలిపై దుస్స్వప్నములఁగనుచు, లేచి విలపించుచు, మెలఁకువగ
నుండునప్పుడు ''అమ్మా, హేమలతా చిన్నతనమునుండియుఁ దల్లి దం
డ్రులులేని పసిపిల్లను నిన్ను బెంచి నేఁడు నేలపాలు చేసినాను. అమ్మా

నీ వేనూతిలోపడి చచ్చినావు. నాకడుపుమీఁదఁ దలపెట్టుకొని నీ
వీఁక నెన్నఁడును నిద్రపోవుగదా. కథలను జెప్పమని నన్నిఁక రాత్రి
బలవంత పెట్టువారెవరు? అయ్యయ్యో! ఆనాఁటిరాత్రియే మనకుఁ
గడసారి కాఁబోలును. అని పరిపరివిధముల హేమలత చేసిన చేష్టల
లను, ఆమె ముద్దుమాటలను, తియ్యని పాటలను, దలఁచితలఁచి విల
పించుచుండెను. ఆమఱునాఁటిమధ్యాహ్న మతనికి గోవిందశాస్త్రి భో
జనమును దెచ్చిపెట్టెను. ఈప్రకార మొకవారము గతించునప్పటికి ఖా
ను ఢిల్లీకిఁ బోవలసివచ్చెను. ఖానుస్థానమునం దంతకంటె కర్కోట
కుండొకఁడు నియమింపఁబడెను. అతఁడు ఖాను చేతిక్రిందనున్న చిన్న
యుద్యోగస్థుఁడేయైనను, నధికారి యైనతోడనె గర్వముగలవాఁడై
జనసామాన్యముతో మాటలాడుట తన గౌరవమునకుఁ దగదనియుఁ ద
నతోసమానులు లేరనియు దురభిప్రాయము నొంది తనకంటె వెనుకటి
ఖానే గుణవంతుండని జను లనుకొనునట్లు ప్రవర్తించుచుండెను.
అతఁడా యుద్యోగమునకు వచ్చిననాల్గుదినములకుఁ జెఱసాలపరీక్ష చేసి
నారాయణసింగును మాలవిని జూచి 'నారాయణసింగు బ్రాహ్మణులు
తెచ్చియిచ్చిన భోజనమును దినఁగూడదు. ఇచ్చట మహమ్మదీయులు
వండినయన్నమును దినవలయును' అని యాజ్ఞ నొసంగెను. ఈయుత్తరు
వునలన మహమ్మదీయుఁడగు తనకు బాధ లేకపోయినను పరమత సహ
నముఁ గలవాఁ డగుటచే మాలవి నారాయణసింగుస్థితికి మిగుల దుఃఖిం
పనారంభించెను. మఱునాఁడు మధ్యాహ్నము తురక లిద్ద అన్నమువండి
చిప్పలోవైచి తెచ్చి నారాయణసింగును భుజింపమనిరిగాని యాతఁడు
తినక నుపవాసములు చేయుచుండగా, నతనికిఁ బ్రాణాపాయము వచ్చి
నయెడలఁ జక్రవర్తిచేఁ దనకు మాటవచ్చునని భయపడి యీక్రొత్త
యధికారి యాతని కెప్పటియట్ల బ్రాహ్మణు లన్నము పెట్టవచ్చునని
యుత్తరువు చేసెను. వారాప్రకారముగాఁ జేయుచుండిరి. ఈసాహేబు

మతవిషయమైన పట్టుదలగలవాఁడని మహమ్మదీయు లెఱిఁగి మాలవిని కారాగృహమునుండి విడువుమని సాహేబును బలవంతపెట్టసాగిరి. వారి ప్రోత్సాహమునకును స్తోత్రములకును సాహేబుమిగుల నుప్పొంగియొక నాఁడు చక్రవర్తి వద్దనుండి తనకు త్తరువు వచ్చెనని మాలవిని విడుదల చేసెను. తోడివానిని విడిచి తన్ను బాధించుట నారాయణసింగునకుఁ గష్టముగ నుండుటకు మాఱుగ మాలవి స్వేచ్ఛగా నున్న పక్షమునఁ ద నవిషయమై పనిచేసి తనకు బంధవిమోచనఁ గల్గించునని సింగు సంతోషించుచుండెను. మాలవియును విడువఁబడినతోడనె తనముసలి నెచ్చెలికి సాయము చేయుదునని వాగ్దానము చేసి తద్విషయమయి ప్రయత్నము చేయుచుండెను.

ఎనిమిదవ ప్రకరణము.

ఉత్తరహిందూస్థానమందలి క్షత్రియకుటుంబములలో రాజస్థానములోని మీవారు రాజ్యమునేలు కుటుంబమే మొక్కవోనిపరాక్రమములోడను సత్కీర్తితోడను నగ్రగణ్యమై యొప్పును. మహమ్మదుఘోరీ హిందూదేశముపై దండెత్తివచ్చి యాకాలమున నుత్తరహిందూస్థానమునందుండెడి రాజుల నెల్ల స్వదేశముల నుండి పాఱఁదోలెను. అప్పుడు రాజ్యభ్రష్టులయిన రాజకులశిఖామణు లందఱును తద్దేశమునస్వతంత్రరాజ్యముల నేర్పఱచుకొని వసించుటఁ జేసి యాదేశమునకు రాజస్థానమను పేరుగలిగెను. ఆరాజస్థానమునం దనేక రాజపుత్రకుటుంబము లున్నను వారిలోఁ జిత్తూరుకుటుంబము నేఁటికిని గౌరవమునందుఁ దొల్లింటిస్థితికిఁ దీసిపోకయున్నది. మీవారురాజ్యమునకుఁ జిత్తూరు రాజధానియై యుండెను. ఆకాలమునందు రాజస్థానమునఁ జిత్తూరునకు సమానమయిన పట్టణ మేవిషయమునను లేదు. చిత్తూరు రాజవంశము శ్రీరాముని

ద్వితీయపుత్రుఁడగు కుశమహారాజుసంతతి యని చెప్పుదురు. అందుచేత సూర్యవంశజు లనియు రాజకులప్రదీపకు లనియు వారిని రాజులందఱు గణింతురు. పరాక్రమమునందును సత్కులప్రసూనతయందును సద్గుణవైభవమునందును రాజస్థానమునందలి తక్కినరాజులు చిత్తూరు రాజులకుఁ దీసిపోవుటంజేసి వారందఱుఁ జాలకాలమునుండి చిత్తూరుకుటుంబగౌరవము నెఱింగి యారాజులను దమకు సార్వభౌములుగ నేర్పఱచుకొని వారియాజ్ఞలకు బద్ధులై యుండెడివారు. శత్రురాజులు, రాజస్థానముపైఁ దండెత్తినపుడు చిత్తూరురాజునకుఁ దక్కినవారందఱు నొకకట్టుగ వచ్చి సాహాయ్యముఁ జేయుచుండుటయుఁ గలదు. మనము వర్ణించుకాలమున చిత్తూరునకు మహారాజు లక్ష్మణసింగను నొకబాలుఁడు. చిన్నతనమునందె యాతనితండ్రి పరలోకగతుఁ డగుటచే నాతని పినతండ్రియు శూరశిఖామణియు సింహపరాక్రముఁడునగు భీమసింగుమహారాజు లక్ష్మణసింగునకు సంరక్షకుఁడయి రాజ్యపరిపాలన మొనర్చుచుండెను. అతఁడు యుద్ధమునందెంత శౌర్యవంతుఁడో రాజకార్యములయందంత నిపుణుఁడు. అతనికి రణరంగమున నెంత సాహసమో న్యాయపరిపాలనమునం దంత శాంతత యుండెను. లక్ష్మణసిం గప్పటికిఁ బదునాలుగేండ్లప్రాయముఁగల కుమారుఁడైనను శౌర్యసద్గుణములచే మిగుల వృద్ధుఁడై యుండెను. రాజస్థానముపై ఢిల్లీచక్రవర్తియగు నలాయుద్దీను దండెత్తునని భీమసింగు విని చక్రవర్తి సమ్ముఖమునకు మదనసింగును రాయబారిగ నంపెను. చిత్తూరుసేనానాయకుఁడగు ప్రతాపసింగునకు మదనసిం గన్నకుమారుఁడు. అతఁడు బాలుఁడయ్యు దృఢరాజభక్తియుక్తుఁడు విమలగుణసంపన్నుఁడు నగుటచే మహారాజున కాంతరంగికుఁడై రాజకీయవ్యవహారములయందుఁ గొంతభారము వహించి పాటుపడుచుండెను. అందుచేత నాతఁడు చక్రవర్తికడకు నంపఁబడి పాలిగ్రామము విడుచునంతవఱకును జరిగినవృత్తాంతమును మీరందఱెఱుఁగుదురు.

చిత్తూరునుండి రాయబారిగ నేగిన మదనసింగు దర్బారునందుఁ గ
నుచమత్కారముగ సంతరించుటచేఁ జక్రవర్తి యాతని నెక్కుడుగౌరవ
ముతో నాదరించెను. కాని కార్యములయందాతనితోఁ గపటము విడిచి
మాటలాడలేదు. చిత్తూరుపై దండయాత్ర జరుపుటకుఁ దనకిష్టము లేద
నియు, నెట్టికారణమునుగూడ లేదనియు రాజపుత్రులతో నత్యంతమై
త్రి నుండుటఁ దనమనోరథ మనియుఁ జక్రవర్తి యాతనితోఁ బలికి య
తనిని సబహుమానముగ దేశమున కంపెను. మదనసింగు చిత్తూరునకు
వచ్చిననాఁడె తనసందేశార్థమును భీమసింగుమహారాజునకు నిశ్శేషముగఁ
దెల్పెను. అంతట మహారాజును దక్కినయుద్యోగస్థులును సంతోషము
నఁ బొంగి మదనసింగును స్తోత్రముఁ జేసిరి. మదనసింగింటికి వచ్చినతోడనే
తనపినతల్లి యగు సువర్ణబాయికి నమస్కరించి యామె యాశీర్వచన
ముల నంది యనేకాంశములఁ గూర్చి యామెతో ముచ్చటించెను. మా
టలాడునపుడు పరధ్యానముచేతఁ దడబడుచుండుటయు నారాత్రి నిద్ర
లేక నటునిటు విహరించుటయు సువర్ణబాయి చూచి యతఁడు మో
హపరవశుఁడై యుండెనని కనిపెట్టెను. మఱునాఁ డుదయమున మదన
సింగుతోఁ గూడఁ బ్రయాణముఁ జేసిన కృష్ణసింగను సేవకునిఁ దత్కార
ణమడుగ నాతఁడు, హేమలతసమాచారమును, నామెయం దాతనిచిత్తము
దగులుటయు సమగ్రముగ విన్నవించెను. సువర్ణబాయి యుత్తమకుల
స్త్రీ లగుటచే హేమలతవంటి బీదకన్యను దనకుమారునకు భార్యగా
గ్రహించుట కిష్టపడక తనభర్తయగు ప్రతాపసింగున కావార్త నెఱిఁ
గించి యతఁడును దనతో నేకీభవించునట్లుజేసెను. మదనసింగు రెండు
సంవత్సరముల ప్రాయము గలవాఁడైనపుడు తండ్రిమాధవసింగు మ
హాయుద్ధమున మృతుఁడయ్యెను. మృతినొందిన భర్తకళేబరముతో నా
తనిభార్యయు మదనసింగు తల్లియునగు మోహిని యప్పటివాడుక ప్ర
కారము సహగమనముఁ జేసెను. సువర్ణబాయికి బిడ్డలు లేరుగనుక

బావకుమారుఁడగు మదనసింగును బెంచుకొని యామెకడు గారాముననే జూచుకొనుచుండెను. ప్రతాపసింగు మాధవసింగునకుఁ దమ్ముఁడగుటచేనాతనిసేనానాయకత్వమితని కిచ్చి చిత్తూరుపరిభువు లీతని గౌరవించిరి. ఆనాఁటనుండియు సువర్ణాను దనతల్లిగను ప్రతాపసింగును దండ్రిగను నెంచుకొని మదనసింగు తల్లిదండ్రుల మఱచి సుగుణసంపత్తిఁ గలవాఁడయి తండ్రికిని గుటుంబమునకును గీర్తిఁ దెచ్చుచుండెను. మదనసింగు చిత్తూరుఁ బ్రవేశించి హేమలతానారాయణసింగులను మఱవక యొకదినమున మహారాజుజొంటరిగ నున్నపుడు పాలిగ్రామమున సకలకష్టములతోఁ గాలము బుచ్చుచున్న వృద్ధుని వాని మనుమరాలిని రాజస్థానమునకుఁ బిలిపింపవలయునని చెప్పి యనేకవిధములఁ బ్రార్థించెను. దయాళుండగు భీమసింగు వారల దైన్యమును విని విచారించి చక్రవర్తికిని దమకును జరుగుచున్న సందేశములుముగిసినతరువాతఁ గొన్నినాళ్ళకు వారిని రావింపనగునని చెప్పి మదనసింగును సంతోషపెట్టెను. మదనసింగునకు హేమలతయందనురాగము నానాఁటికి దృఢమగుచుండ నామె యెంతదూరమున నున్నను సింగుహృదయ మామెసమీపముననె యుండెను. ఇట్లు మదనసింగు మదనాగ్నిచే వేగుచు నాగతానాగతవేదియని ప్రసిద్ధికెక్కిన చిదానందయోగి దర్శనముఁ జేయఁగోరి యొకనాఁడతఁడున్న రామదేవునిమఠమున కరిగి, యోగిని దర్శించి నమస్కారముఁ జేసి యతఁడు గనుసన్నఁజేయ నొకచోటఁ గూర్చుండి యితఁడింత నిండుజవ్వనమందే యోగాశ్రమస్వీకార మేలచేసెనోయని యోజించుచుండెను. చిదానందయోగి సాక్షాత్శివావతారమని జనులుచెప్పుకొనుట కలదు. మదనసింగు ముఖవిలాసము జూచి యాతఁ డేదోపనిమీఁద వచ్చినాఁడని తెలిసికొని యోగి 'బాబా! ఏమి నీ విటువచ్చినావు?' అని యడిగెను.

మద—స్వామీ! మీదర్శనమునకే వచ్చినాను.

చిదా—నీ వేదో యడుగవలెనని వచ్చినట్లున్నావు. అడుగవచ్చును.

మద—అయ్యా! దూరదేశమున నాకాప్తులున్నారు. వారు సుఖులై యున్నారా.

చిదా—వారు తురకలా! హిందువులా! ఏజాతివారు!

మద—హిందువులు. మా రాజపుత్రులు.

ఇట్లు మదనసింగు చెప్పినతోడనే కొంచె మాలోచించి చిదానందయోగిపైకిం జూచి స్ఫటికాక్షసూత్రము ద్రిప్పి సంచిలోనుండి యొక తాటియాకుల గ్రంథమును దీసి యొక చిన్న పుల్లతో మూఁడుమారు లాపుస్తకముపయిఁ గొట్టి గ్రంథమును విప్పి యేదియోఁ జూచి యోగి యిట్లనియె. 'బాబా నీవడిగినప్రశ్న రామదేవు ననుగ్రహముచే నాకుఁ బూర్ణముగఁ దెలిసినది. నీవడిగినవారిలో ముసలివాఁడొకఁడున్నాఁడు. పదునారేండ్ల కన్యయొక తెయుఁ గలదు. వారిద్దరు నాపదలో నున్నారు. ఆమె యతనివద్దలేదు. పరదేశమందున్నది. వారికింతలోఁ గష్టము తొలఁగునట్లు తోఁచదు. అని చెప్ప మదనసింగునకు ముఖవికాసము తగ్గెను. తరువాత యోగివద్ద సెలవుఁగైకొని యాతఁడింటికరిగి యాదిన మన్నమును ముట్టక విచారగ్రస్థుఁడై యుండెను. రాత్రిజామైనతరువాత మదనసింగు మంచముపై శయనించియుండఁ గృష్ణసింగు వచ్చి యాతనితో 'అయ్యా! మహారాజుగారు తమ్మొకసారి రమ్మని వర్తమానము పంపినారు. వీధిలో వారిసేవకుఁ డున్నాఁడు' అని నమ్రతతో విన్నవించుటయు వెంటనే మదనసింగుతల్లిదండ్రుల కావార్తఁ జెప్పి రాజసమ్ముఖమున కరుగుటకుఁ దగు వస్త్రాలంకారముల ధరించి యశ్వారోహణముఁ జేసి తిన్నఁగఁ గోటకుఁ జని, రాజపుత్రభటులు కావలియున్న యనేకద్వారములు గడచి మోతీమహాల్ బ్రవేశించి గుజ్జుముదిగి మహారాజు కూర్చుండియున్న గదిలోనికిఁబోయి

తన యేలికయెదుట నిలుచుండెను. భీమసింగతనిని జూచి 'కుమారా!
ఇచ్చటఁ గూర్చుండు' మని చెప్పి పీఠమును జూపెను. ఆగదిలోనొక
యున్నతాసనమున భీమసింగు గూర్చుండి యుండగా లక్ష్మణసింగును
బ్రక్కను గూర్చుండి పినతండ్రివైపుఁ జూచుచుండెను. వారికట్టెదుట
నెఱ్ఱనివస్త్రముఁ గట్టుకొని నిలువఁబడియున్న యొక పురుషుఁ జూచి
'కుమారా! ఈతఁడొక విచిత్రవృత్తాంతమును జెప్పుచున్నాఁడు. నీవు
నువానిని విని కార్యాంశము నాలోచింపుము. అని మహారాజు మద
నసింగుతోఁ జెప్పి యెదుట నున్న యాపురుషునివంకఁ జూడ నతఁడు 'మ
హారాజా! నేను మహారాష్ట్ర దేశస్థుఁడను. బ్రాహ్మణుఁడను. నాపేరు
వసంతభట్టు. నే నీవఱకును ఢిల్లీచక్రవర్తియగు నలాయుద్దీను కొలువు
లోనుంటిని. కాని యతని దౌర్జన్యమును దురాచారమును జూచి స
హింపలేక యాతనికొలువు విడిచివచ్చినాను. గోవులను జంపు పచ్చితురక
కలదగ్గఱ నింతకాలము కొలువుసలిపిన పాపము నాకాశీవిశ్వేశ్వరుఁడు క్ష
మించునుగాక! స్వదేశీయులును వేదశాస్త్ర సంరక్షకులును నగు మీకొ
లువునిఁక సేయవలయునని మీపాదములచెంతఁ జేరినాడను' అని విన్న
వించిన యాకథవిని మదనసింగు మహారాజున కభిముఖుఁడై "స్వామీ!
ఈతనిచరిత్రము నాకు సందేహాస్పదముగ నున్నది. దేవరవారును యో
జింపవలె" ననెను. ఆమాటలువిని భీమసింగుతో "దేవా! ఈబాలుని
మాటలు నమ్మి నాపై ననుమానపడఁబోకుఁడు. నేను చేయఁబోయెడి
యుపకారము ముందుముందు నాకార్యములవలననే మీకుఁ బోధపడు
ను. అలాయుద్దీనుయొక్క గుట్టుమట్టు నాదగ్గఱ నున్నందున నేను మీ
రనాయాసముగఁ జక్రవర్తిని గెలుచునట్లు చేయఁగలను" అనిమహారా
ష్ట్రుఁడు పలుక భీమసింగు సత్శీలుండగుటచే ననుమానపడక వానికి నెల
కు పదివరహాలు జీతమేర్పరచి యుద్యోగ మిచ్చెను. మహారాష్ట్రుని
చమత్కార సంభాషణమున బాలుఁడైన లక్ష్మణసింగు వానియెడల

ననురాగము గలిగియుండెను. మదనసింగున కేలనోగాని వసంతభట్టు చూపులును, రూపును జూచినవెనుక నాతనియందనిష్టము గలిగెను. కాని తనయేలిక వానినాదరించుటచేఁ దానును గౌరవముతో నాతనిఁ జూచుచుండెను. అందఱును సంభాషణ చాలించినతరువాత లక్ష్మణసింగు మహారాష్ట్రునిజూచి “ అలాయుద్దీను మాదేశముపై దండెత్తునా” యని యడిగెను. వసంతభట్టు కొంచెము యోజించి “ స్వామీ తమ దేశముపైఁజక్రవర్తి దండువెడలఁడు. అతనికి రాజపుత్రుల పేరువిన్నఁ గడుభయము” అనిపలికిన వసంతభట్టు మాటలను మహారాజును లక్ష్మణసింగు విశ్వసించిరి. మదనసింగు వారివలె దృఢవిశ్వాస ముంచ లేదు కాని కేవలము నమ్మకపోలేదు. ఆసంభాషణము ముగిసినపిమ్మట భీమసింగు, మదనసింగు ప్రముఖులకు సెలవు నొసంగెను. ఆనాఁడుమొదలు కుమారుఁడయిన లక్ష్మణసింగుమహారాజునకు వసంతభట్టు ప్రాణమిత్రుఁడయ్యెను. భీమసింగునకు నతఁడాంతరంగికుఁడై యుండి సర్వకాలములందు నాలోచనముఁ జెప్పుచుఁ బ్రభుసమ్మానముచే జనులకును గౌరవాస్పదుఁడై యుండెను. అదియట్లుండ మదనసింగు త్రికాలవేదియగు చిదానందయోగి మఠమున కనేకపర్యాయము లరిగి వేదాంతవిషయములను రాజకీయవ్యవహారములను ముచ్చటించుచు నుండుటచే యోగికిని మదనసింగునకును స్నేహమయ్యెను. అందుచేత మహారాజునకుఁగూడ యోగిని రెండుసారు లాతఁడు చూపి వారి కాతనియందు గౌరవము కుదురునట్లు చేసెను. యోగి రాజపుత్రులయం దత్యంతాభిమానమును మహమ్మదీయులయం దసూయయు మెండుగఁ జూపుచు, మదనసింగునకును రాణాకును ఢిల్లీవిషయవర్తమానముల నెట్లో తెప్పించి యనుదినమును దెలియఁజేయుచు వచ్చెను. అందుచేత యోగితోఁ బలుమారురాజు లర్ధరాత్రముల రహస్యములు మాటాడుచువచ్చిరి. ఇట్లునాలుగుమాసములు గడిచెను.

తొమ్మిదవ ప్రకరణము.

ఒక నాఁటిరాత్రి దీపములు పెట్టిన నాలుగుగడియలకు మదనసింగును బ్రతాపసింగును గూర్చుండి రాజకీయ వ్యవహారముల ముచ్చటించుకొనుచుండిరి. ఆసమయమున వ్రేలాడుచున్న జడలతోడను, శరీరమునిండ నలఁదుకొన్న భస్మముతోడను తెల్లమచ్చలుగల కృష్ణాజినముతోడను మెల్లమెల్లఁగాఁ జిదానందయోగి వచ్చి వారి కట్టెదుర నిలిచెను. అతఁడుతఱుచుగా రాత్రులయందు ప్రతాపసింగు గృహమునకు వచ్చుటకలదు. కాఁబట్టి యాతఁడరుదెంచిన కార్యము నెఱిఁగి ప్రతాపసింగు వెంటనే లోనికిఁజనెను. మదనసింగు లేచి 'నమోనారాయణ! బావాజీ!' యని నమస్కరించి యాతనిందోడ్కొని గదిలోనికిఁ బోయి వచ్చినకార్య మేమని యడుగ, యోగి యిట్లనియె. "బాబా! నీవురాజభక్తిగల రసపుత్రులలో నగ్రగణ్యుఁడవు. రాజునిమిత్తము ప్రాణములనైన ధారవోయఁగల సాహసికుఁడవు గనుక నేను నీనిమిత్తము వచ్చితిని. ఈరాత్రి చిత్తూరునగరమునందు నేను ముందుగా మీతోఁ జెప్పఁదగని ఘోరకృత్యములు జరుగఁదలఁచి యున్నవి. మనమీరాత్రి యేమాత్రమశ్రద్ధ చేసినను మన మాజన్మాంతము విచారింపవలసి వచ్చును. తెల్లవారినదాక నీవు నాతో నుండుము" అని యోగిపలుక మదనసింగుశరీరము వడఁక నారంభించెను. యోగి యాతనిపైఁ జేయివైచి 'నాయనా! భయపడకు. నే నుండఁగనీనగరమున కాపద కలుగదు. నీవువచ్చునపుడు యుద్ధములయందు నీహస్తమలంకరించు ఖడ్గమును దీసికొనిరమ్ము. నీవు నీరాజపుత్రవేషమును మార్చి బ్రాహ్మణవేషమును ధరించి జామునరరాత్రి యైనతరువాత యోగానందమఠము దగ్గఱ నన్నుఁ గలిసికొనుము. 'జయక్షీరసాగరశయన' యనినీవు పలికినవెంటనే నేను నిన్నానవాలు పట్టెదను. నేను మఱియొకరితో మాటలాడు

చుండిన యెడ నీవు నాకడకు రావద్దు. ఈరాత్రి నీరాజ్యమును నీదేశమును నీవు కాపాడుకొందు' వని యోగి చెప్పి వెడలిపోయెను. ఆతని సాగనంపి రెండునిమేషములు మదనసింగు వానిమాటలసారాంశ మేమై యుండునా యని యోజించెనుకాని తెలియరాలేదు. అతఁడు లోనికిం జని ప్రతాపసింగును జూచి యోగికిని దనకును జరిగినసంభాషణము నవిస్తరముగఁ దెలియఁజేయ నాతఁడు విస్మయము నొంది కుమారునితో నాయనా! నీ వాలస్యమును జేయక త్వరగ నరుగుము. యోగిమాటల యం దర్థమువిస్తారముగ నున్నదని నేనూహించెదను. అతఁడు మనరాజ్యముపై మిగుల భక్తిగలవాఁడగుటచే కారణాంతరమున యోగిగానున్నట్టు లగపడునుగాని నిజముగా యోగికాఁడని నాయభిప్రాయము. త్వరగా నీవు బ్రాహ్మణవేషము వేసికొనుము. అని యాతని కుత్సాహజనకములగు మాటలఁ జెప్పెను. మదనసింగు తక్షణమె లోనికిఁబోయి తన రాజచిహ్నములనెల్లఁ దీసివైచి మొగమునిండ బూదిఁ బులుముకొని చిన్న యంగవస్త్రమును గట్టికొని చేతితో నొకచెంబును భుజముపై నొకదర్భాసనమును బట్టుకొని తండ్రియెదుటికి వచ్చి నమస్కరించెను. అంతట ప్రతాపసింగు కుమారునిఁ జూచి 'నాయనా ! నిజముగ బ్రాహ్మణునివలె నున్నావు' అని లోపల కత్తియమర్చఁబడిన చేతికఱ్ఱ నతనికిచ్చెను. అది గైకొని మదనసింగు పోఁబోవుచుండఁగా నర్ధరాత్రిమునందు దుర్జనసంచారములగు వీధుల కొంటరిగఁ దనకుమారుఁడరుగుట కిష్టములేక ప్రతాపసింగు తత్సహాయముగ నిద్రించుచున్న కృష్ణసింగును లేపి, నిద్రమత్తునకు గంజాయిమత్తు తోడుగఁ దూలుచున్న వానిని వెంట నంపెను. అపుడు వారిరువురును గృహము విడిచి పోవునపుడు ప్రతాపసింగు 'నాయనా! కడుజాగ్రత్త. శత్రువు లనేకు లుందురు, నీకపాయమేదైన నుండునేని కృష్ణసింగును నావద్దకుఁ బంపిన నేను వెంటనే తగుబలముతో నీసహాయార్థము వచ్చెదను.' అని చెప్పి వారల

నంపెను. వారరిగిన వెనుక ప్రతాపసింగు తనశరీర మింటనున్నను మనస్సు కుమారునిమీఁది కేపోఁగా, నానాఁటి సంగతులనెల్ల మదిలోనూహించుకొనుచుఁ, జిత్తూరు రాజ్యక్షేమమునుగూర్చి భయపడుచు, పురమునఁ గుట్రలు జరుగుచున్నవని విచారించుచు నడుమనడుమ 'ఓభగవంతుఁడా! అతిపురాతనమైన చిత్తూరురాజ్యమున కాపద రాకుండఁ జేయుము. ఆవశ్యకమైనచో నాప్రాణమునైన నిచ్చెదను. నాకుఱ్ఱవానిని సుఖముగ నింటికిఁ దెమ్ము' అని ప్రార్థించుచు; నిద్రరాక పలుమాఱు వీథితలుపులు దెఱచిచూచుచు, నారాత్రి కలవలపడుచుండెను. అట్లు మదనసింగును గృష్ణసింగును బయలుదేఱి పదినిమిషములలో రాజవీథిఁజేరిరి. గంజాయిమత్తు పూర్ణముగఁ గృష్ణసింగును విడువనందున నడచుచునే యతఁడు కునుకుపాట్లు పడుచు యజమానుఁడు వచ్చి వీఁపుమీఁదఁ దట్టగా మేలుకొని వడివడిఁ బరుగెత్తుచు నతనివెంట వచ్చుచుండెను. వారు రాజవీథిమధ్యమునకు వచ్చునప్పటికి జాముసరరాత్రి యయ్యెను. అది వెన్నెలగలదినముగానందున నంధకారము నగరమునంత నావరించెనుగాని గగనమండలమునందు వజ్రములవలెఁ దళతళ మెఱయుచున్న నక్షత్రకోట్లు కొంచెము వెలుతురు నిచ్చుచుండెను. పట్టణమెల్ల మాటుమడుగుటచే మనుష్యసంచార మంతగా లేకపోయినను చలువవస్త్రములఁ గట్టుకొని యత్తరుమొదలగు సుగంధద్రవ్యములును గమ్మపూఁదావులును దమ రాకను దెలియఁజేయఁ దాంబూలము నములుచు వేశ్యాంగనాగృహముల నలంకరింపఁబోవు రశికశిఖామణులు మాత్రము కొంద ఱందందు వారి కగుపడుచువచ్చిరి. అక్కడక్కడ రెండుమూఁడు మిఠాయి దుకాణములును నొకటిరెండు తమలపాకుల దుకాణములును దక్క తక్కిన బజారెల్ల మూయఁబడియుండెను. మెల్లమెల్లగఁ నడచి రాజవీథిని దాఁటి ప్రక్కసందులలోనుండి కొంతదూరముపోయి, మదనసింగు తనకు యోగిచెప్పిన గుఱుతులనుబట్టి యావీథ

నున్న చిన్నమఠమునుజేరి, కృష్ణసింగును వీథిలోనుండ నియమించి తాను లోనికింబోయెను. అతఁడు మఠముఁ బ్రవేశించునప్పటికి చిదానందయోగి యెవరితోనో రహస్యములు మాటలాడుచుండుటఁబట్టి మదనసింగు వెంటనే యోగిదగ్గఱ కరుగక యొక యరుగుమీఁదఁ గూర్చుండి వారి సంభాషణము వినుచుండెను.

చిదా—ఏమిరా! దామోదరా! ఢిల్లీవార్త లేమి!

దామో—స్వామీ! చక్రవర్తి దండయాత్రమాట నిజము. ప్రయాణసన్నాహము జరుగుచున్నది. మురళీధరదాసు మఠములో మన వాండ్రిందఱు నిప్పటివర్తమానముల నప్పుడు తెలిసికొనుచున్నారు.

చిదా—అట్లయిన నీవుపో. (అని వానినంపి) ఓరీ సదాశివా! ఇటురా.

సదా—మహాప్రభూ! ఆపిల్ల మీరు చెప్పినచోట సుఖముగ నున్నది. నేనుచూచి మాటలాడి వచ్చినాను. ముసలివాఁ డందే యున్నాఁడు.

చిదా—గంజాయిదుకాణమునకు వెళ్ళినావా! అందలి విశేషములేమి!

సదా—ఆసంగతి చెప్పమఱచినాను. రాముఁడు గంజాయిమత్తుచే రహస్యము వెడలఁగ్రక్కినాఁడు. ఈదినమున జరుగఁదలఁచినది యు మనము విన్నదియు నిజమే.

చిదా—నీ వింకపొమ్ము. ఓరీ గంగా! రార్రా. నీవార్త లేమి!

గంగా—మహారాష్ట్రరాజులు మాలికాఫరుచే నోడింపఁబడిరి. ఆదేశమునుగూర్చి మనమింక యాశపడఁగూడదని మన బావాజీలు చెప్పినారు. గోకులమఠమున గోసాయీలిచ్చినయుత్తరము లివిగో! (అని యుత్తరము లిచ్చెను.)

ఆయుత్తరముల గ్రహించి చిదానందయోగి వారినందఱ నంపి తనయెదుట గుండమున వెలుఁగుచున్న యగ్నిహోత్రపుకాంతి నా లేఖలఁ జదువుకొని యేదోయోజించు చుండెను. అప్పుడు మదనసింగు 'జయ్ క్షీరసాగరశయన' యని యఱచెను. చిదానందయోగి త్వరితగతి లేచి మదనసింగును వెంటఁబెట్టుకొని లోపలికివచ్చి తలుపుగడియవేసె ను. కృష్ణసింగు వీధిలో మఱ్ఱిచెట్టుక్రింద పై బట్టఁ బఱచుకొని నిద్రపోవ నారంభించెను. చిదానందయోగి వేషభాషాదులఁజూచి మదనసిం గా శ్చర్యమునొంది కొంతసేపటికి 'స్వామీ మన మేమి చేయవలయును. దాదాపుగ రెండుజాములరాత్రియైనది' యనెను. యోగి తద్వచనము లాలకించి కొంచెము యోజించి మదనసింగును దగ్గఱఁగ రమ్మని యిట్ల నియె, 'బాబా! నీ వాయుధముతో సిద్ధమై వచ్చినావా! ఏదీ కత్తియె క్కడ' అనమదనసింగు 'నేనెవరినైన వధింపవలెనా యేమి! ఎవరిని. ఈ వేషమున నున్న మీరెవ్వరో నాకెఱిఁగింపుఁడు. ఈవిషయమున నన్ను సంతుష్టునిఁగఁ జేసిరేని మీసెలవునకు బద్ధుఁడను' అని రాకొమరుఁడు ప లుక యోగి వానికుడిచేయి పట్టుకొని 'కుమారా! నావృత్తాంతమును బూర్ణముగ నీ కెఱిఁగింపరాదు. అయినను నీసందేహనివారణార్థము నే నొకసంగతిఁ జెప్పెదను. చిత్తూరురాజ్య సంరక్షణమునకై నేను నా శక్తిని ధారవోయుచున్నాను. దేశముయొక్క నానాభాగములకు మాఱు వేషములతో మనుష్యులనంపి యాయావృత్తాంతము లెఱుఁగుచున్నా ను. నేనుగూడ శౌర్యవంతమైన వంశస్థుఁడనేకాని కారణాంతరమున నీ యాశ్రమంబును స్వీకరించితిని. నేను చెప్పినట్లు నీ వీరాత్రినడచుకొని న, నాప్రాణమునైనఁ గోల్పడి నీ కాపదరాకుండఁ జేసెదను' అని చెప్ప మదనసిం గాశ్చర్యపడి 'మీరు రసపుత్రులా ! అట్లయిన నేను తమ యాజ్ఞప్రకార మీరాత్రి నిస్సందేహముగ నొనర్చెదను' అనెను. ఈవ ఱకే రాత్రి ప్రొద్దుపోయినది. ఇఁక మనపనిమీఁద మనమరుగుదము.

రమ్ము’ అనియోగి లేచెను. మదనసింగును లేచి యాతనిని వెంబడింప నిరువురును నడువ నారంభించిరి. అప్పుడు సరిగ రెండుజాములరాత్రి యగుటచే నమ్మహానగరవాస్తవ్యులందఱు నిర్భయముగ నిద్రపోవుచుండిరి. వీధులన్నియు నిర్మానుష్యములై యుండెను. ఉత్తమకులస్థులెన్నఁడుఁ బ్రవేశింపఁగూడని పేటలును సందులును గొందులును వారు తిరుగుచుండిరి. అప్పుడు మదనసింగు ‘అహాహా! ఈవీధులయం దర్ధరాత్రముల నరహత్యలు జరిగినను దిక్కులేదుగదా. ఒంటరిగ నీసందుల నరుగువాఁడు నిరపాయముగఁ జనఁడు’ అని తనలో ననుకొనుచు గమ్యస్థానమెదురు చూచుచుఁ జిదానందయోగితోఁ గూడ నరుగుచుండెను.

పదవ ప్రకరణము.

ఆ మాఱుమూలసందులలో నొకచోట శిథిలమునొంది చూచువారలకుఁ జాలిఁగలిగించు నొకపురాతనమందిర ముండెను. అది పూర్వము సంపన్నులగు నున్నతవంశజులు గాఁపురముండు గృహమే కాని తద్వంశజులు కుమార్తెల వివాహములకయి చేసినఋణములఁ దీర్పలేక సర్వస్వముఁ గోలుపోయి యిల్లువిడిచి దేశాంతరముల కరిగిరి. అప్పటినుండియు నది పాడయి యుండెను. మదనసింగును జిదానందయోగియు నాఁటిరాత్రి యామార్గమునఁ బోవుచు దానికిఁ గొంచెముదూరమున నాలుగుపాడుగోడలను జూచిరి. ఆగోడలమధ్య నొకచిన్న పెంకుటిల్లుండెను గాని వీధిలోనుండి నడచిపోవువారి కందుగృహ మున్నట్లు కనఁబడదు. ఆయింటికి ద్వార మేవైపున నున్నదో యెవ్వరు నెఱుఁగరుగాని గోడ కడుగున నున్న పెద్దతూము మనుష్యుఁడు దూరిపోవునంతటి విశాలముగ నుండుటఁబట్టి గృహమున కరుగువా రందులోనుండి దూరి లోనికరుగుదురు. దీనింబట్టి యీగృహము మతాచారులకు శరణ్యంబై

యుండునని చెప్పనక్కఱలేకయే మన మూహింపవచ్చును. ఆగృహ సమీపమునకుఁ బోయినతోడనే చిదానందయోగి 'మనకుఁ గావలసినది యీయిల్లే. ఇక్కడ నిలువుము.' అని సింగునాపెను. చిదానందయోగి తూములోనుంచి లోని కరిగి, తన కాపద సంభవించునెడ మదనసింగును లోనికి రమ్మని యాతనిని తూముదగ్గఱ వీధిలో నిలిపెను. అతఁడు లోపలి కరుగునప్పటి కాయింట నిరువురు పురుషులు మాటలాడుచుండిరి. అందొకఁడు దృఢశరీరముగల దక్షిణహిందూస్థానవాస్తవ్యుఁడు. రెండవవాఁ డతిసుకుమారుఁడైన బాలుఁడు. వారిసంభాషణల నాలకింపఁ దలఁచి యోగి తనకడనున్న కంబళమును గప్పుకొని యాపంచను గూర్చుండి యుశ్వాసనిశ్వాసములను వదలక కదలక మెదలక యుండెను. అప్పుడందున్నవారిట్లు ముచ్చటించిరి.

బాలు—ఏమయ్యా! రెండుజాము లయినది. వా రింకను రాలేదేమి?

బ్రహ్మ—మహారాజా! చిత్తము. వారు తప్పక వచ్చెదరు. మదనసింగు మనలనందఱ నీరాత్రి నిర్మూలించుటకుఁ బ్రతిజ్ఞ గైకొన్నవాఁడు. మీరాజవంశమునకు మదనసింగు మిగుల క్షేమముఁ జేయు నట్లగుపడునుగాని వాఁడు చక్రవర్తితో మిగుల స్నేహముఁగలిగి యున్నాఁడు. మిమ్ముఁ జంపి మీశిరస్సును జక్రవర్తికిఁ గానుకగా నంపెదనని వాగ్దానముచేసినాఁడు. అందుచేతనే దుర్మార్గుఁడైన మ్లేచ్ఛునివలన నతఁ డట్టిగౌరవము నొందెను. వారు నీసమయమునకు వచ్చుచుందురు. వారు పట్టణమునఁ జేయు కుట్రలనెల్ల మీకు నివేదించుటకేసుఁ డీ మిమ్ము నీమాఱుమూలకుఁ దోడ్కొనివచ్చి నాఁడను. మీకు భయము రవ్వంతయు లేదు నాచేత కత్తియున్న దిదిగో—

బాలు—భయము నాకుఁగాదు. నాజాతిలో నెవ్వరికిని లేదు. నాచేత కత్తియుండఁగా నాకు భయమేల? మదనసింగు మాకింత

ద్రోహముదలఁచునని మేమెన్నఁడెఱుఁగము. వారినీదినమునఁ బట్టుకొని భీమసింగుమహారాజున కప్పగించవలెను.

బ్రాహ్మ—మహారాజా! దేవరవారికి నేనుపదేశించినదానికంటె మీరెక్కువ విషయముల నీరాత్రి చూడఁగలరు. వారు కుట్రలఁ జేయునపుడు సాధారణముగ నీగృహమునకు వత్తురు. నేఁ డెందుచేతనో యిటకు రాలేదు. వారూరిబైట తోఁటలో నేఁడు కుట్రలు చేయుచుండి యుందురు.

బాలు—మనమక్కడకు త్వరితముగ నరుగుదము. రమ్ము తెల్లవారకముం దెట్లయిన నాదురాత్ముల బట్టుకొందము.

బ్రాహ్మ—నానిమిత్త మొక సేవకుఁడు రావలెను. వాఁడు వచ్చినతోడనే మనమాస్థలమున కరుగుదము. నే నావలకుఁ బోయి చూచి వచ్చెదను.

అని బాలు నాచీఁకంటిలో నిలిపి బ్రాహ్మణుఁ డీవలకు వచ్చుటకు యత్నించుచుండెను. ఆమాటల నాలకించి చిదానందయోగి తూముల నుండి సత్వరముగా బైటకుఁజని మదనసింగును వెంటఁబెట్టుకొని 'అబ్బాయీ! ఇటురా లోపలినుండి బ్రాహ్మణుఁడీవలకు వచ్చుచున్నాఁడు. వానికి మన మగపడకుండ నాగోడచాటున నుందము. వాఁడొక సేవకునితో మాటలాడునఁట. ఆమాటలఁగూడ విందమ' ని యాతనిఁ దీసికొనిపోయెను—లోపలినుండి బ్రాహ్మణుఁడు బైటకు వచ్చునప్పటికి వానికిరువదిగజములదూరమున సేవకుఁడైన యానందదాసు వచ్చెను. అతఁడు తనదగ్గఱకు వచ్చినతోడనే బ్రాహ్మణుఁడు 'ఆనందా! విశేషము లేమి? బండిసిద్ధము చేసినావా?' యని యడిగెను. అంతట నానందుఁ డానందము నొంది 'చిత్తము సర్వము సిద్ధమైనది. మనశంకరుఁడును బండివాఁడునుగూడ నాయుధపాణులై సిద్ధముగ నున్నారు. మీరు కుఱ్ఱవానిఁ దీసికొనివచ్చుటయే యాలస్య' మని చెప్పెను. ఆమాటలు విని

బ్రాహ్మణుఁ డమితానందము నొంది యానందదాసును సంకేతస్థలమున కంపి మరల రహస్యగృహమును బ్రవేశించెను. పొంచుండియున్న చిదానందయోగియు మదనసింగును వారిసంభాషణల నాలించి తామును వారి ననుసరించిపోవుటకు నిశ్చయించిరి. ఆసమయమున యోగి రాజపుత్రుని విలోకించి "కుమారా! ఈబ్రాహ్మణుఁడు మనకుఁబరమశత్రువు. వానికొన్న కుబ్జవాఁడు మనకుఁ బరమాప్తుఁడు. మనప్రాణముల విడిచియైన బాలునిరక్షించి యీబ్రాహ్మణుని నెట్లయిన మట్టు పెట్టవలెను. నేను 'జయకాళి' యనునవ్వ డీబ్రాహ్మణుని నీఖడ్గముతో సంహరింపుము. దీని రహస్యము తెల్లవారకముందే నీవెఱుఁగఁగలవు" అని చెప్పి రసపుత్రునకుఁ బ్రోత్సాహమొసఁగెను. బ్రాహ్మణుఁడు లోనికరిగి యాబాలుని వెంటఁబెట్టుకొనివచ్చి తూముదాఁటి యూరిబైటనున్న మామిడితోఁపువైపునకుఁ బ్రయాణమయ్యెను. తమజాడ వారు లక్షింపకుండ యోగియు సింగును వారి ననుసరించుచుండిరి. ఇట్లు కొంతదూరము చనినపిదప గమ్యస్థానమగు మామిడితోఁపు కట్టెదుటఁ గన్పించెను. అంధకారదేవతకు నిలయమైన యాతోఁట ముందుగా బ్రాహ్మణుఁడును బాలుఁడును బ్రవేశించిరి. మనయోగియు శిష్యుఁడును వారివెనుకనే చనుచుండిరి. ఆతోఁటనడుమ నొకచోట బాలుని గూర్చుండ నియమించి బ్రాహ్మణుఁడు ముందుకువచ్చి రహస్యముగ తనసేవకులనుజూచి 'ఓరీశంకరా! ఓరీయానందా! తుపాకులు కత్తులు సిద్ధముగనున్నావా? తుపాకులలో మందుకూరి మీమీప్రయత్నముల నుండుఁడు' అని హెచ్చరించెను. అనవుఁడు బద్ధాంజలులై సేవకులు "మహాప్రభూ? సర్వము సిద్ధమైనది ఢిల్లీనుండి పాండురంగనాథుఁడు సన్యాసివేషముతోఁ గొన్నియుత్తరములను మీకుఁ దెచ్చి బౌద్ధమఠమునందు బసఁజేసియున్నాఁడు' అని విన్నవించిరి. ఆపలుకులు యోగి విని సంతోషించెను. బ్రాహ్మణుఁ డాసేవకులవచనములువిని "మనకార్యసాఫల్య మీదినమున నైనది.

ఇంక నుత్తరములతోఁ బ్రయోజనము లేదు. ఱేపు చిత్తూరిసంగతు
లను విని యతఁడే మనకడకు వచ్చును. మన మాతనిదగ్గఱ కరుగనక్క
ఱలేదు. బండికి గుఱ్ఱములఁ బన్నుఁడు' అని యాజ్ఞాపించెను. నిశాసం
చార మెన్నఁ డెఱుఁగని యాబాలుఁడు బ్రాహ్మణుని విపరీతచేష్టలను ర
హస్యాలోచనములనుజూచి సందేహింపనారంభించి యాయర్ధరాత్రిము
న నానిర్జనప్రదేశమున నాగాఢాంధకారమునం దాబ్రాహ్మణుఁడు స
హచరసమేతుఁడై యుండుటచేఁ దన కెట్టియపాయమునైనఁ జేయఁగల
డని భయపడసాగెను. ఒక విదేశీయునిమాటలు నమ్మి యంతఃపురము
లఁ బాసి తా నట్టియకాలమున మాఱుమూలకు వచ్చినందులకు నతఁడు
చింతింపఁజొచ్చెను. కాని బాలుఁడైనను ధైర్యసంపన్నుఁ డగుటచే మ
నస్థైర్యమును విడువక కాఁదలఁచిన కార్యమున కెదురుచూచుచుండె
ను. అంతట బ్రాహ్మణుఁడు బాలకుని సమీపించి 'స్వామీ వా
రు తోఁటలోనికి వచ్చినారు. మేము వారలఁ బట్టుకొనియెదము.
దురాత్ములవలన నపాయము కలుగకుండ మీ రీబండిలోఁ గూ
ర్చుండుఁడు.' అని తచ్ఛకటమును జూప భయసందేహములు ద్విగు
ణములై మనస్సును గలఁప బాలకుఁ డాశకట మధిరోహించెను. బ్రా
హ్మణుఁడు పిమ్మట నానందదాసుని శంకరుని దూరముగాఁ బిలిచి 'బండి
వడిగాఁ దోలుఁడు. ఆఱేసికోర్సుల కొకచోట నంచెబండ్లు కలవుగనుక
మన మతివేగముగఁ బోఁగలము. ఈతఁడు పెంకెతన మధికముగాఁ జేసి
నప్పుడు తుపాకులతోఁ బేల్చివేయవచ్చును గాన ముందుగా నట్టిపని
జేయక సాధ్యమైనంతవఱకుఁ బ్రాణములతో నీతని ఢిల్లీకిఁ దీసికొనిపో
వుఁడు' అని యాదురాత్ముల కుత్సాహ మొసఁగి తానును శకటములో
నెక్కెను. ఆసమయమునఁ దనయేలిక యవస్థ యపాయముగ నుంటఁ
జూచి గాంభీర్యమును విడిచి తొట్రుపాటుతోఁ జిదానందయోగి మదన
సింగునుజూచి 'బాబా! కత్తి; కత్తి. నవమన్మథసమానుఁడగు నా

బాలుఁడు మనస్వామియు రసపుత్రకులతిలకమునగు శ్రీకుమార లక్ష్మణ సింగుమహారాజుగారు. దుర్మార్గుఁడగు నాబ్రాహ్మణుఁ డాతని నపాయసముద్రమున ముంపఁదలఁచినాఁడు. కనుక జాగ్రత్తగనుండుము' అని రహస్యముగఁ జెప్పెను. అర్ధరాత్రమునఁ దన యేలిక నిజాంతఃపురములఁ బాసి పయోముఖవిషకుంభమును బోలు నొకదురాత్ముని విశ్వసించివచ్చినందుల కాత్మగతమున నొచ్చుకొనుచు నతని కపాయ మగునేమో యని ముందుకు దుముకఁజూచుచు దైవమును దూఱుచు మదనసింగు పరిపరివిధముల విచారింప నారంభించెను. చిదానందయోగిమాత్రము బండిపై దృష్టినిలిపి తెప్పవాల్పక చూచుచుండెను. తనతోఁగూడ బ్రాహ్మణుఁడును శకట మారోహించినందున బాలుఁడు వానిఁజూచి నిశ్శంకముగ నిట్లనియె. 'నన్నీతోఁటకుఁ దెచ్చుటలో నీయభిప్రాయ మేమి? నీవేమైనను ద్రోహము చేయఁదలఁచినావా?' అని యడుగఁగానే బాలుని కంఠముపైఁ జేయివైచి నొక్కిపట్టి 'నిన్ను నేను ఖైదీగ ఢిల్లీనగరమునకుఁ గొనిపోవుచున్నాను. అలాయుద్దీను నిన్నుఁ దెమ్మని మాకాజ్ఞనిచ్చినాఁడు. నేఁడు నీవు నాచేతఁ జిక్కినావు. నీవింకనేమిచేయఁగలవు? రాజపుత్రుఁడవగుదువేని ధైర్యముఁజూపి తప్పించుకొమ్ము. పాఱిపోవ యత్నించితివా నాచేతఁ జచ్చితివని నమ్ముము' అని క్రూరుఁడగు వసంతభట్టు రెండవచేయి తనవాడికత్తి వంకఁ జరపెను. ఆ యాపదఁ జూచి వెఱవక రాకొమరుఁడు తన మొలనున్న ఖడ్గము నూడఁబెఱికి హస్తమున ధరించునంతలో, మదనసింగు స్వామిప్రాణరక్షణమున కరుదెంచి 'నిలునిలు దురాత్మా! యని తోఁట ప్రతిధ్వను లెసఁగ నఱచి బండిమీఁద కుఱికి మూయఁబడియున్న బండితలుపును ఫడాలునదన్ని విరుగఁగొట్టి లోనఁబ్రవేశించెను. వసంతభట్టు బ్రాహ్మణవేషధారియగు మదనసింగును గుర్తింపలేక భయకంపితుఁడై యుండ, మదనసింగు కోపోద్దీపితుఁడై యామహారాష్ట్రాధముని బండిలోనుండి

యీడ్చి నేలఁబడవేసెను. ఆనందదాసును శంకరుఁడును ఖడ్గపాణియై యున్న యోగినిఁగూడఁ జూచి బెదరి ధైర్యమునఁదనకుఁ దీసిపోవని బండివానితోఁగలిసి వెనుకకుఁ దిరిగిచూడక పరుగిడిరి. మదనసింగు మొదలబ్రాహ్మణునిప్రాణము గాపాడఁదలంచెనుగాని దురాత్ముఁడైన వసంతభట్టు ఖడ్గముదనపై విసరినందునను, యోగి 'జయకాళీ' యని కేకవేసినందునను మదనసింగా దెబ్బ తప్పించుకొని తనఖడ్గముతోఁ బ్రాహ్మణాధముని నొక్కయేటున సంహరించెను. తరువాత నర్ధరాత్రము న నీచులను విశ్వసించి రాఁగూడని స్థలమునకు వచ్చినందుకు లక్ష్మణ సింగును యోగియు మదనసింగును మృదువుగా మందలించి యారాత్రి యాతని నింటికిఁ జనవలదని మఠమునకు వెంటఁబెట్టుకొనిపోయి యతని కి సకలోపచారములఁ జేసిరి. తనప్రాణము రక్షించిన యాబ్రాహ్మణుఁ డెవ్వఁడో లక్ష్మణసింగు తెలియఁ గోరెనుగాని వారుభయులు త్వరలో మావిషయమై మీరెఱుఁగఁగలరు గాన మమ్మేమియు నేఁడడుగవలదని ప్రత్యుత్తరమొసఁగ లక్ష్మణసింగు తనకృతజ్ఞతాసూచకముగ రత్నపుపిడిగల తనకత్తిని మదనసింగునకు బహుమానముగ నొసఁగి యారాత్రి యటఁబవ్వళించెను. చిదానందయోగి మదనసింగును వెంటఁబెట్టుకొని యవశిష్టమగు కార్యమును సమాప్తము నొందఁజేయుటకు మరలఁ బ్రయాణమై పోవుచు లక్ష్మణసింగుతో 'మీరు తెల్లవారినతరువాత మానిమిత్తము వేచియుండక మీగృహమున కరుగవచ్చును. మాసేవకు లీలోపల మీకుఁ గావలసిన యుపచారములు చేయుదురు.' అని సెలవుఁదీసికొని సాగిపోయెను.

పదునొకొండవ ప్రకరణము.

అట్లు లక్ష్మణసింగును మఠమునందు విడిచి మదనసింగును జిదానందయోగియు నవశిష్టకార్యములను సమాప్తినొందించుటకుఁ దమప్రయాణమును మరల నారంభించిరి. ఈపర్యాయము చిత్తూరునగరము యొక్క పశ్చిమభాగమునకుఁ బోవలసియుండెను. వారు ప్రయాణమై పోవునప్పటికి రమారమి జామున్నర ప్రొద్దుండెను. అప్పటికి వీథులు నిర్మనుష్యముగ నుండుటచే వారిరువురును మునుపటికంటె వడిగనడచి పెక్కుసందులఁ గడచి కొంతసేపటికి విశాలమైన బౌద్ధమఠసమీపమునకు వచ్చిరి. రాజస్థానమునం దాకాలమున బౌద్ధమతవ్యాప్తి లేదుగాని తన్మతము భరతఖండమున కెల్లఁ బ్రధానమతమై యుండు నప్పుడు చిత్తూరునం దీమఠము నిర్మింపఁబడినది. మనమువ్రాయుకాలమున కందు బౌద్ధులు నివాసము చేయుట లేకున్నను దాని పురాతననామముననే యది పిలువఁబడుచు వచ్చెను. అందు సన్యాసులును యోగులును ప్రయాణవశమున నొకటి రెండుదినము లుండి పోవుచుందురు. మనకపటబ్రాహ్మణుఁడును యోగియు మఠద్వారమునకుఁ జని లోపలఁ బ్రవేశింపఁబోయిరిగాని యొక సేవకుఁడు వారిని గదిమి నిలిపెను. మదనసింగంతట నిలువక సేవకుని నొకచేతితోఁద్రోసి యోగితోఁగూడ గుమ్మముఁ దాటఁగా నాసేవకుఁడు వారి కడ్డముపోయి వారితో నిట్లు మాటాడెను.

సేవ—మీ రెవరు? ఈమఠమునందు మీ కేమిపని యున్నది?

మద—ఇక్కడ మాస్నేహితుఁ డున్నాఁడు. ఆయన నిమిత్తమై వచ్చినాము.

సేవ—మిమ్మెవరు పంపినారు? ఎవరినిమిత్తము వచ్చినారు?

మద—నీ విక్కడివాఁడవా? విదేశీయుఁడవా? ముందామాట చెప్పు.

సేవ—మా దీగ్రామముకాదు. నేను జ్ఞానానందులవారి శిష్యుఁడను.

మద—జ్ఞానానందులవారి దర్శనమునకే మేమును వచ్చినారము.

సేవ—అట్లయిన నర్ధరాత్రమం దేల రావలెను? జేపుపగలు రండు.

చిదా—ఈరాత్రి రమ్మని స్వామి మాకుత్తరువు చేసినాఁడు. నీవీ యసంబద్ధప్రశ్నలతోఁ గాలముపుచ్చక మారాక వారి కెఱిఁగింపుము.

సేవ—అట్లయిన లోపల నున్నారేమో చూచివచ్చెదను. ఆయన యిట్టిసమయములయందు స్మశానములో జపముఁ జేసికొనుచుందురుగాని యింటిదగ్గఱ నుండరు. ఉన్నట్లయిన మీపేరు చెప్పెదను. మీరెవరు?

చిదా—మమ్ము వసంతభట్టు పంపినాఁడు. అతిరహస్యములున్నవి.

సేవకుఁ డీమాటల నాలకించి లోపలి కరిగి మఠమునకు వెనుకప్రక్క గోడలో సొరంగమువలె నున్న నేలకొట్టులోఁ గూర్చుండియున్న జ్ఞానానందస్వాములవారిం జూచి యామనుష్యులజాడలఁ దెలుప స్వామి కొంచె మాలోచించి యాక్రొత్తవారల విషయమై సమస్తముఁ దెలియఁగోరి తాను మఠమందున్న యొకగదిలోఁ బ్రవేశించి తలుపుమూసికొని వీరి నిరువురను తద్వారముదగ్గఱకు రమ్మని వర్తమానము నంపెను. వారట్లు వచ్చి గదిగుమ్మముదగ్గఱ నిలువ జ్ఞానానందులవారు మదనసింగుచిదానందులతో నిట్లు మాటాడిరి:—

జ్ఞానా—అయ్యా! మీ రెవరు? నాతో మీ కేమిపని యున్నది?

మద—అయ్యా! తమరు మావిషయమై యనుమానపడవద్దు. మేమన్యులముగాము. తలుపుతీసి మాతో మాటాడుఁడు.

జ్ఞానా—అట్లయిన నేను మిమ్ము నమ్ముట కొకయానవాలు [చెప్పుఁడు.

చిదా—మీపేరు పాండురంగనాథుఁడు కాదా?

జ్ఞానా—(ఆశ్చర్యముతో) అవునవును.

అని తక్షణమే తలుపుఁదీసి వెలువడెను. అతని పసుపుపచ్చని దీర్ఘకాయముఁ గన్గొనినతోడనే యోగియు సింగును వానిని గపటసన్న్యాసిగ నెఱిఁగిరి. అంతట వారందఱు నిట్లు సంభాషించిరి.

జ్ఞానా—అయ్యా! మీచరిత్రములను గొంతచెప్పి మావసంతభట్టు వృత్తాంతమును దెల్పుఁడు.

చిదా—అయ్యా! వసంతభట్టీనగరమునకు వచ్చినదాదిగ మేమిరువుర మాతని యనుచరులమై యుంటిమి. అతఁడు మాకు నెఱిఁగింపకుండ నీవఱకేకార్యమును జేయలేదు. ఈరాత్రి లక్ష్మణసింగును జెఱఁబెట్టినాము. అందుకే తమదర్శనమునకు నన్నాతఁడు వడిగ నంపెను.

ఆపలుకులు చాలించి జ్ఞానానందస్వామి యాత్రముతో 'పట్టుకున్నారా? పట్టుకున్నారా? ఆహాహా! శౌరా! వసంతా! ప్రజ్ఞయనఁగా నీదే ప్రజ్ఞరా. చక్రవర్తివలన మనకగుగౌరవమును నేను వర్ణింపఁజాలను.' అని యప్రయత్నజనితమగు నానందమును బట్టఁజాలక తత్సూచకములగు మాటలాడి 'అతఁడెక్కడనున్నాఁడు? నన్నేమి చేయుమన్నాఁడు." అని యడిగెను. మిమ్మీక్షణమే వెంటఁబెట్టుకొనిరమ్మని మాకు సెలవిచ్చినారు. జోడుగుఱ్ఱముల బండిపై బాలుని నెక్కించి బంధించినాము. మీరు వచ్చిన వెంటనే ప్రయాణమైపోవచ్చును. చక్రవర్తి వసంతున కిమ్మని తమచేతికిచ్చిన యుత్తరములఁగూడఁ దేవలయునని మీతో మనవిచేయు మనెను' అని చిదానందయోగి చెప్పెను. ఆమాటలు విని పాండురంగనాథుఁ డాశ్చర్యమొంది వారు వసంతుని

యాంతరంగికులని నమ్మెను. మదనసింగును జిదానందయోగియు జ్ఞానానందులవారిని ద్వరపెట్టి ‘ మననిమిత్తము వారుమామిడితోఁటలోఁ గనిపెట్టుకొని యుందురు. ఇంక ప్రొద్దెంతో లేదు. తమరాలస్యముచేసిన తెల్లవారునప్పటికి పదిక్రోసులదూరమయినసాగిపోలేము’ అని హెచ్చరింప జ్ఞానానందులవారు తనపాతాళమందిరమున కరిగి చెంబులోఁబెట్టి భూమిలోఁ బూడ్చినయుత్తరముల గ్రహించి మన శూరశిఖామణు లిరువురుఁ దనవారని భ్రమపడి ప్రయాణమయ్యెను. అట్లు బౌద్ధమఠము నుబాసి వారు ముప్పురును గలిసి తూర్పుదిక్కున కభిముఖులై నడువ సాగిరి. జ్ఞానానందులవారు చిత్తూరునగరముయొక్క మాఱుమూలసందుల నెఱుఁగరుగాన చిదానందయోగియాతనిని మార్గముఁదప్పించి క్రొత్తసందులనుండి తీసికొనిపోవుచున్నను నాతఁడది గ్రహింపలేకపోయెను. కొంతదూరము వచ్చినతరువాత వారికీ క్రిందిసంభాషణము జరిగెను.

జ్ఞానా—నా రీపాటికి మునుపటిచోటనుండి వెడలిపోరుగదా?

చిదా—మనము వెళ్ళినదాఁక వారక్కడనుండి యడుగైనను గదలరు. త్వరగారండు.

జ్ఞాన—మన మందఱము మిగుల నదృష్టవంతులము. మనకుఁ జక్రివర్తివద్దనుండి మంచిబహుమానములు దొరకఁగలవు. మనమొక్క పనిచేయవలయును. అది మీ రతిరహస్యముగ నుంచవలయును. ఈ బాలుఁడు మనవాఁడేకదా?

చిదా—ఈకుఱ్ఱవాఁడు మనవాఁడే మీరు సందేహింపక స్వేచ్ఛగా మాటలాడవచ్చును.

జ్ఞానా—‘సరే సరే. దగ్గఱగారమ్మ నాయనా (అని త్రోవలో నిలిచి మెల్లగా) ఈచిత్తూరునగరమునకు సంరక్షకుఁడై రాజున కాంతరంగికుఁడగు మదనసింగనునొక రసపుత్రవీరుఁడు కలఁడఁట. అతఁడు మహా పరాక్రమవంతుఁడఁట. అతఁడుండఁగ మన కీచిత్తూరురాజ్యము లోఁ

బడదుగనుక మనమెట్లయిన నతని నీరాత్రి పట్టుకొని వధింపవలయును. ఈవేళనతఁడుచిక్కకున్నపక్షమున మనమీపురమున నాల్గుదినములైన నిలిచి యాతనినంతము నొందింపవలయును. ఈకార్యముఁ జేయకున్న మనకుమాటదక్కదు. నీయభిప్రాయమేమి?' అని బ్రాహ్మణవేషధారి యగుమదనసింగునడిగెను. మదనసింగామాటలు విని జ్ఞానానందులవారికిఁడనపైనిగల మహాకోపమున కాశ్చర్యమొంది చేతికఱ్ఱతో నమర్చఁబడిన కత్తిపిడిపైఁజేయివయిచి యుత్తరువు నిమిత్తము చిదానందయోగి మొగమువైపుఁ జూచుచుండెను. చిదానందయోగి కొన్ని సంజ్ఞలచే మదనసింగు ప్రయత్నమును మాన్పి యింకను వానిదగ్గఱనుండి కొన్నిమాటలు వినఁగోరి స్వాములవారికిట్లు ప్రత్యుత్తర మిచ్చెను.

చిదా—"నాకును జిరకాలమునుండి మదనసింగును గడతేర్పవలెననియున్నది. ఆతఁడసహాయశూరుఁడు. వానిసంగతి మన యీకుఱ్ఱవాఁడు చక్కఁగా నెఱుఁగును" అని మదనసింగును జూపెను. వెంటనే మదనసింగిట్లు వారితోఁ జెప్పసాగెను.—

"అయ్యా! మదనసింగునకును నాకును నేనే యతఁడన్నంత మైక్యము గలదు; కాని యాతఁడు రాజులపక్షమువాఁడు నేను జక్రవర్తిపక్షమువాఁడను. అయినను బ్రభుభక్తిచేత మేమాతనిఁ గడతేర్చుట కీవఱకే కుట్ర నొకటి పన్నియున్నాము. అతనిందోడ్కొనివచ్చుటకు నొక మనుష్యునంపితిని. ఈపాటికివారు వచ్చియేయుందురు. కనుక మన మాసంకేతస్థలమునకు శీఘ్రముగఁ బోవుదము" అనెను. అంతటస్వాములవారానందపరవశులై "నేనే యీకార్యమును జేసెదను. ఈచేతులతో రాజపుత్రకుని ప్రాణములఁ దీసి చక్రవర్తివద్ద పారితోషికమును గైకొనవలెను." అని యుత్సాహవాక్యములు బలుకఁజొచ్చెను. తరువాత వారు ప్రథమమున వసంతభట్టు లక్ష్మణసింగుతో రహస్యాలోచనలు సలిపిన యాగోడలమధ్యనున్నకుటీరమువద్దకు స్వాములవారిని గొని

పోయి యదియే మదనసింగువచ్చెడు గృహమని చెప్పి ముందాతూము లోనుండి వారు లోని కరిగి పిమ్మట నతనింగూడఁ దీసికొనిపోయిరి. ఆ గృహమున కరిగి స్వాములవారు చీఁకటిలోఁ గూర్చుండి తనకక్షపాలయం దున్న యుత్తరముల వెదకికొనుచు "అయ్యా మననిమిత్తము వారు తోఁటలోఁగాచుకొని యుందురేమో. మనమరుగవద్దా" యని యడిగిరి.

"మనము మదనసింగును జంపుట యావశ్యకముగాని తోఁటకరు గుట ముఖ్యముగాదు. మనము రామని వారీవఱకే నిశ్చయించుకొని లక్ష్మణసింగుతోఁ బైనమైపోయియుందురు. లక్ష్మణసింగు వారిచేతఁబడ మదనసింగు మనచేతఁబడును. అందుచేత మన మీస్థలమును బాయవద్దు. మే మిరుపురము వీధిలోని కరిగి వారు వచ్చుచున్నారేమో చూచి వచ్చె దము" అని చిదానందయోగి చెప్పి స్వాములవారి నొడంబఱచి మదన సింగునుగూడి వీధిపైపుచని వారిట్లు మాటాడిరి.

చిదా—అబ్బాయి! ఈతని నిచట నేమిచేయుదము? చంపివేయు టుచితమగునా?

మద—నిరాయుధుఁడై యసహాయుఁడైనపురుషునిఁ జంపుట మనశౌర్యమునకుఁదగిన కార్యముగాదు. కాఁబట్టి నే నీక్షణమున మా పినతండ్రివద్ద కరిగి యాతనిదోడ్కొనివచ్చి వీనింబట్టుకొని ఱేపుదయము న రాణాకు నప్పగింపఁ బ్రయత్నించెదను.

చిదా—ఈయుపాయము చక్కఁగానున్నది. నీవు మీపినతండ్రి కడ కరుగుము నీవు వచ్చినదాఁక నే నిచట నుండెదను.

అనిపలికి యోగి మదనసింగు నంపి స్వాములవారు దాఁటిపోకుం డఁ దానచ్చటఁ గావలియుండి పరివ్రాజునిరాక కెదురుచూచుచుండె ను. మదనసింగును వడిగ నింటికిఁజని తనరాక నిరీక్షించుచున్న పినతం డ్రికడ కరిగి సపరివారముగ నాతని వెంటఁబెట్టుకొని యారాత్రి జరిగిన వృత్తాంతముల రహస్యముగ నాతనికిఁ జెప్పుచు స్వల్పకాలముననే

కుటీరమువద్దకు వచ్చెను. ఈనడుమఁ జిదానందయోగి లోపలి కరుగ 'వారువచ్చుచున్నారా?' యని స్వాములవా రడుగ యోగి 'వారినిమిత్తము మనబ్రాహ్మణకుఱ్ఱవాని నంపినాఁడను. ఇప్పటికి వారును వచ్చుచుందురుగాని మీ క్రొత్త మొగమును జూచినతోడనే పాఱిపోవుదురేమో యని భయమగుచున్నది.' అని పలికెను. ఎట్లయిన కార్యము విఘ్నముగాకుండ సఫలము చేయుట స్వాములవారి యభిప్రాయమగుటచే 'అయ్యా! నేను ముసుఁగువెట్టుకొనియిక్కడఁ గూర్చుండెదను వారు రాగానే నాకాలుగోకుఁడు. అప్పుడు నేను లేచి వానినివధించెదను' అని స్వాములవారు శరీరమునిండ ముసుఁగువేసికొని యొకమూలఁ గూర్చుండిరి. చిదానందయోగి వెంటనేవాని కక్షపాలయందలి కాగితములకట్టను సంగ్రహించి స్వామితోఁ గొన్నియంశముల ముచ్చటించుచుండఁ బ్రతాపసింగును మదనసింగునునాకస్మికముగ లోనికివచ్చిరి. వెంటనే స్వాములవారులేచి "వీఁడేనామదనసింగు? కత్తి కత్తి" యని కలవలపడుచుండ మదనసింగుముందఱికి వచ్చి 'ఓరీ పాపాత్ముఁడా! నీకుఁ గత్తి యెందుకురా? నీబ్రతుకునకుఁదోడు నీవు మదనసింగును జంపఁగలవా? అట్లయిన రారమ్ము. నేనే మదనసింగును. ఇదిగోకత్తి' అని కత్తి నందించుచుండఁ బ్రతాపసింగు నాజ్ఞచే నతని పరివారము స్వాములవారిపైఁబడి పెడరెక్కలుకట్టి బలవంతముగఁబట్టి బంధించిరి. తరువాత ప్రతాపసింగు స్వాములవారిని దనయింటికిఁ దీసికొనిపోయి తెల్లవారువఱకు వానినొక గదిలో నుంచెను. చిదానందయోగి తాను స్వాములవారి కక్షపాలనుండి సంగ్రహించిన కాగితములకట్ట మదనసింగునకిచ్చి దర్బారునం దాకాగితముల రాణాకు సమర్పింపవలయునని చెప్పి తాను మఠమునకుఁ బోయెను.

పండ్రెండవ ప్రకరణము.

ఆమఱునాఁడుదయమున మహారాణావారి దర్బారు నియమింపఁబడెను. సభామంటపమునకు రాజబంధువులును, రసపుత్రశూరులును సామంతులును వేఱువేఱుగఁ దమతమ బిరుదచిహ్నములతోడను, సేవకసమూహములతోడను, సమస్తభూషణముల ధరించి వచ్చి తమగౌరవమునకుం దగుస్థానములయందుఁ గూర్చుండిరి. అప్పుడు మదగజేంద్రమునుండి మెల్లగఁదిగి కనకదండముల ధరించి కైవారముసేయు వేత్రహస్తులిరుగడలఁ గొలువ సేవకులు మార్గమును బ్రదర్శించుచుండ శ్రీలక్ష్మణసింగుమహారాణావారును భీమసింగుమహారాజులవారును గొలువుకూటమును జేరిరి. సభామందిరము, రెండువేలమంది మనుష్యులేకకాలమునఁ గూర్చుండునంతటి వైశాల్యముగలిగి సాలగ్రామశిలానిర్మితములై స్నిగ్ధములయిన గోడలతోడను, పైనున్న బల్లకూర్పుమీఁదఁ జేయఁబడిన విన్నాణపు లక్కపనులతోడను, నేలఁబరువఁబడిన నానావర్ణముల రత్నకంబళములతోడను మహాలక్ష్మీవిలాసభాసురమై యలరుచుండెను. అట్టి కొలువుకూటమును జేరి తన్మధ్యంబున స్ఫటికశిలానిర్మితమగు వేదికపై ధగధగ మెఱయుచున్న బంగరుకోళ్ళదంతపుసింహాసనముపై మహారాణాలక్ష్మణసింగు సుఖాసీనుఁడయ్యెను. ఆయనకు దక్షిణభాగమున రసపుత్రకులప్రదీపకుఁ డగు భీమసింగును భీమసింగున కావల సింగపుఁగొదమలవంటి యాతని పండ్రెండుగురు కుమారులును వారి కావల వారి మేనమామయు రాజపుత్రసేనాధిపతియు భీమసింగునకు ముద్దులమఱఁదియు నగు గోరాసింగును, వానిముందఱ బాలుఁడయ్యుఁ బరాక్రమవృద్ధుఁడని పేరుఁగాంచిన గోరాసింగు పుత్రుఁడగు బేడల్‌యును గూర్చుండిరి. మహారాణా కెడమప్రక్కను సామంతరాజులును వారి కావల మంత్రి దండనాయక ప్రముఖనియోగులును,

వారివెనుక విదేశాగతులగు రాయబారులును గూరుచుండిరి. కాని ప్రతా
పసింగుమదనసింగు లేమికారణముననో రానందున సభ్యులందఱుఁ దత్కా
రణము నూహించుచుండిరి. లక్ష్మణసింగు, మదనసింగుప్రతాపసింగులు
రాకుండుటకుఁ గారణమును దెలియఁగోరి సభ నుద్దేశించి యిట్లనియె.
‘ఓసభాసదులారా! అల్లాయుద్దీను మన దేశముపై దండెత్తుటనుగూర్చి
న యదార్థస్థితి మీ రెఱుఁగుదురేమో తెలియఁగోరి మిమ్మిటు రప్పిం
చుటకయి దర్బారుఁ బిలిచినాఁడను. కాని నిన్నటిరాత్రి తద్విషయమై
పరిపూర్ణముగ మేము తెలిసికొంటిమి. ఆయంశముల నిచటనుపన్యసిం
చుట ముఖ్యమైనను మదనసింగుప్రతాపసింగులు రానందున సందే
హింపవలసి వచ్చెను. వారురాకుండుటకుఁ గారణమెవరయిన నెఱుఁగు
దురే?’ అనవుఁడు స్వామిపలుకులకు దొర లెల్లఁ దెల్లఁబోయి తత్కారణ
ము నెఱుఁగక యొండొరుల మొగములఁ జూచుకొనుచు రాత్రి జరిగిన
యంశముల నాలకించుటకు నాత్రముతోఁ గూర్చుండిరి. ఆసభలో
ననేకులు వసంతభట్టు రానందునకుఁ గుసగుసలాడుచుండ నాసమయము
న నొకసేవకుఁడు వచ్చి ప్రతాపసింగు మదనసింగు వచ్చుచున్నట్లు రా
ణాతోఁ జెప్ప సభ్యులందఱు వారిరాక కెదురుచూచుచుండిరి. అప్పు
డొక పచ్చని దృఢశరీరముగల మనుష్యుని వెంటఁబెట్టుకొని యాయుధ
పాణులై వారిరువురును వచ్చి రాణాకు నమస్కరించి యామనుష్యుని
రాజునెదుటనిలువఁబెట్టిరి. ఆమనుష్యునకు రెండుఱెక్కలును వెనుకకు
విఱిచి కట్టఁబడియుండెను. తలయెత్తక నేలచూపులఁ జూచుచు సన్యాసి
వేషముతో నిలువఁబడియుండిన వానిని జూచి సభ్యులు మహాశ్చర్యమే
దియో వినకపోమని యాత్రముతో నిశ్శబ్దముగ నుండిరి. అంతటఁ
బ్రతాపసింగు తనస్థానమునఁ గూర్చున్నంతనే మదనసింగు తనయేలి
కకభిముఖుఁడై చేతులజోడించి యిట్లు చెప్పసాగెను. “ఓమహాప్ర
భూ! ఈనిలువఁబడినవాఁడు మహారాష్ట్రబ్రాహ్మణుఁడు. ఇతఁడలా

యుద్దీనున కాంతరంగికుఁడై, మనవద్ద మాయోపాయముచేత జీవించు చున్న యావసంతభట్టునకుఁ జక్రవర్తివద్దనుండి యుత్తరప్రత్యుత్తరము లఁ దెచ్చుచుఁ దన్నెవరు బట్టుకొనకుండ సన్యాసివేషముతో నున్నాఁడు. ఈతనివృత్తి యిదియైనట్లును వసంతభట్టు దురాత్ముఁడై నట్లును వీనిదగ్గఱ నాకు దొరకిన యీయుత్తరములే సాక్ష్యము నిచ్చుచున్నవి. వీని నిజ మైన పేరు పాండురంగనాథుఁడై నను జ్ఞానానందస్వామియనుపేర వర్తిం చుచున్నాఁడు" అని తనచేతనున్న యుత్తరముల లక్ష్మణసింగున కంది చ్చెను. వసంతభట్టు దురాత్ముఁడని వినుటకు ననేకు లాశ్చర్యపడిరి. పా రసీకభాషలోనున్న యాయుత్తరములను లక్ష్మణసింగు గోరాసింగున కి చ్చి చదువుమన నతఁడా కాగితములనెల్లఁ బరీక్షించి యందు ముఖ్యమ గు నొకదాని నీక్రిందిప్రకారము చదువనారంభించెను. "శ్రీఢిల్లీచక్ర వర్తియగు నలాయుద్దీను వసంతభట్టునకు వ్రాయున దేమనిన—మిత్రుఁ డా! నీతో నేను గపటకలహమును గల్పించుకొనుటయు నిజముగ నాగ్ర హము వచ్చినవానివలె నేను సభయందు నటించుటయు నారాత్రి నిన్ను నేను రహస్యముగఁ జెఱనుండి విడిపించుటయుఁ జిత్తూరునగరమునకు ని న్ను నేను తద్రహస్యముల నెఱుఁగుట కంపుటయు నీవఱ కెవ్వరు నెఱుఁ గరు. నీవు లక్ష్మణసింగును జెఱఁబెట్టుటకు విశేషముగ శ్రమపడుచు న్నావని విని సంతోషించుచున్నాను. ఎట్లయిన లక్ష్మణసింగునుబట్టి తప్పక తీసికొనిరావలయును. అప్పుడు రాజపుత్రులు తమప్రభువు ప్రా ణములను రక్షించుకొనుటకు మన మెట్లుచెప్పిన నట్లు విందురు. దండ యాత్రమాట నిశ్చయమే యైనను, నేను దండెత్తనని వారితో దృఢ ముగఁ జెప్పుచు వా రేమఱియుండునట్లు జేయుము. మహమ్మదు అ లాయుద్దీను" అని యాయుత్తరమును గోరాసింగు చదివినతోడనే రాజ పుత్రులనేకు లాశ్చర్యకోపముగ్నులైరి. అంతట భీమసింగు పాండురంగ నాథునిఁ జూచి "దీనికి నీ వేమి చెప్పెదవు? నిజము చెప్పుము" అని

యడుగఁ బాండురంగనాథుఁడు "నేను మీకుబదులుచెప్పను. మీయిష్టమువచ్చినట్లు చేయుఁడు" అని యుత్తర మిచ్చెను. అంతట లక్ష్మణసింగు సభ్యుల నుద్దేశించి "వసంతభట్టు మనతావున గడుటక్కరియై ప్రవర్తించుటచే నతఁడు దుర్మార్గుఁడని యెవ్వరు నెఱుఁగరు. నాపైఁగొందఱు కుట్రలఁ జేయుచున్నారనియు వారలను నాకప్పగింతుననియుఁ జెప్పి నమ్మించి నన్ను నిన్నరాత్రి వాఁడొంటిగఁ దోఁటకుఁ దీసికొనిపోయి బండిలో నెక్కించి నన్ను ఖైదీగా ఢిల్లీకిఁ బట్టుకొనిపోవఁ బ్రయత్నించెను. నేను తప్పించుకొనఁ బ్రయత్నింప నాప్రాణములఁగూడ నపహరింపఁజూచెను. నాభాగ్యవశమున మన చిదానందయోగియు మఱొకఁడును వచ్చి యాగోముఖవ్యాఘ్రమునుజంపి నాప్రాణసంరక్షణ మాచరించిరి. యోగితోవచ్చి నాప్రాణములునిలిపిన మహాపురుషుఁడెవ్వఁడో?" యని పలుక మదనసింగు రాజపుత్రమధ్యమునుండి సింహమువలెలేచివచ్చి "దేవా బ్రాహ్మణవేషముతో మిమ్ము రక్షించినవాఁడను నేనే. మీరు నాకు బహుమానముగ నొసంగిన ఖడ్గరత్న మిదిగో" అని సభాసదు లాశ్చర్యపడునట్టు కంఠమెత్తిపలికెను. భీమసింగామాటలు విని తనపీఠమునుండి లేచి యానంద మాపఁజాలక కుమారప్రాణరక్షణ మాచరించినందులకు మదనసింగును గౌఁగిలించుకొని యనేకవిధముల స్తోత్రము చేసెను. తనప్రాణములఁ గాచినమహాత్ముఁడు మదనసింగని తెలియలక్ష్మణసింగు దనకంఠమున వ్రేలాడుచున్న ముత్యముల హారముదీసి మెడనువేసి యాతని నాలింగనము చేసికొనెను. భీమసింగు నాజ్ఞచేఁ బాండురంగవిభుఁ డప్పుడే కారాగృహమున కంపఁబడెను. అంతలవారు దర్బారును ముగింపఁ దలఁచుచుండగా నటకు వేగిరపాటుతోఁ జిదానందయోగి వచ్చి కొలువులోనున్న సమస్త రాజపుత్రపీఠకులను దాఁటి రాణాకు నెదురుగఁ జనెను. అతనిని జూచి రాణాయును భీమసింగును లేచి నమస్కరించి తమకృతజ్ఞతను దెలుపుమాట లేవో యనఁబోవు చుండఁగా

వారిని వారించి చిదానందయోగి ‘‘ఓమహారాణా! ఓభీమసింగుమహారాజా! దురాత్ముఁడైన వసంతభట్టుపలుకుల నమ్మి మీరు యుద్ధసన్నాహములు మానుకొనియున్నారు. అల్లాయుద్దీను దండయాత్రి వెడలి మనకు నిరువదికోసుల దూరమునకు వచ్చియున్నాఁడు రెండుమూఁడుదినములలో మనపై నాకస్మికముగఁ బడుచున్నాఁడుగాన నిఁక మీనిద్రలనుండి మేలుకొనుఁడు’’ అని యెలుఁగెత్తి పలికెను. భీమసింగు సాధారణముగ నట్టి యవసరములందుఁ దన్నెడఁబాయకుండు మనో ధైర్యమును జిక్కఁబట్టి యిట్లనియెను. ‘చిదానందులవారిమాట నిక్కము వారు సత్యమును దెలిసికొనినఁగాని మనకిట్లు చెప్పరు. అయినను మీరు భయపడక యిప్పటినుండి తగు ప్రయత్నములఁ జేయుఁడు.’ అనిన వెనుక యోగి ‘రసపుత్రులారా! సూర్యచంద్రవంశజులగు మీరు మీప్రతాపములఁ జూపునవసరము వచ్చినది. మీదేశమునందును మీరాజునందును మీకుఁ బూర్ణాభిమాన మున్నఁ బ్రాణముల కాశింపకఁ బోరాడుఁడు. కులదేశాభిమానము మాని దేవాలయముల నాశనముఁజేసి బ్రాహ్మణులను జంపి గోవులను వధించు మహమ్మదీయులకు మీరు చిత్తూరుకోట నప్పగించఁదలచినపక్షమున నూరకుండుఁడు.’ అని ప్రోత్సాహవాక్యములు పలికెను. రసపుత్రులేకవాక్యముగ ‘మారాజునిమిత్తము దేశమునిమిత్తమును మాప్రాణములను ధారవోసెదము. ఇదె యుద్ధసన్నద్ధుల మయ్యెదము.’ అని యఱచిరి. లక్ష్మణసింగును భీమసింగును వారినభినందించి వీడ్కొలిపి యంతఃపురములకుఁ బోయిరి.

పదుమూఁడవ ప్రకరణము.

‘‘హేమలతా! హేమలతా ఇటురమ్మ’’ అని లోపలినుండి యొకయెలుఁగిన మనుష్యకంఠము వినఁబడినతోడనె హేమలత వీధిగుమ్మ

మునుండి లోనికిఁబరుగెత్తి శివప్రసాదువద్దకుఁ బోయి "అయ్యా! ఎందు కుఁ బిల్చినారు" అని యడిగెను. శివప్రసాదామెను జూచి అమ్మాయీ! చక్రవర్తి చిత్తూరుపై దండువెడలుటకు సైన్యముల నానాభాగము లనుండి పిలిపించుచున్నాఁడు. అందుచేత మనయూరిమీఁదుగ దుర్మార్గు లగు రాజసైనికులు పోవుచున్నారు. నీవు వారికంటఁబడకుము. ఆయ న నాకు నిన్నప్పగించినందుకు మరలనిన్ను నేనాయన కప్పగించి మాట దక్కించుకొనవలెను. నీవు వీథిలోని కరుగకుము. అని హితోపదేశము చేసెను. హేమలత యామాటల గమనించి "వీథిలో నొకముష్టివాఁ డు చిత్రముగఁ బాడుచున్నాఁడు, అది వినుటకయి వెళ్ళినాను. ఇదె వాఁడు మనయింటికే వచ్చుచున్నాఁడు" అని హేమలత ప్రత్యుత్తరమి చ్చెను. హేమలత పాలిగ్రామమున రహిమానుఖాను ఘాటికోడి మూ ర్ఛిల్లియుండ, నామెకు జ్వరము తగిలినపుడు మందునొసంగి రక్షరేఖఁగ ట్టిన గోసాయి యామెను మెల్లమెల్లఁగా నావలకుఁ దీసికొనిపోయి యొక బండిపై నెక్కించి తిన్నగా కల్యాణనగరమునకుఁ గొనిపోయెను. అచ్చో టఁ దనకు బ్రాణమిత్రుఁడయిన శివప్రసాదునకు నామెనప్పగించి య త్యంతజాగ్రత్తగ నుంచుమనియుఁ, దాను వచ్చినపుడుగాని మదనసింగు వచ్చినపుడుగాని యామె నంపవలయు ననియుఁ జెప్పి యాతఁడు చనె ను. శివప్రసాదు పండితసంప్రదాయమునఁ జేరిన బ్రాహ్మణుఁడు. అ గ్రహారికుఁడు. అందుచే ద్రవ్యవంతుఁడును మాట చెల్లుబడిఁ గలవాఁడు నై ధర్మకార్యములఁ జేయుటయందు తనధనమును గొంతవ్యయపఱచు చు సత్కీర్తిధనుఁడైనందున హేమలత వారియింట నిరపాయముగనుం డెనుగాని పితృసమానుఁడయినందున తాత కారాగృహవాసి యగుటకును దనకుఁ దల్లిదండ్రులుగాని సోదరులుగాని మరి యేయితరదిక్కుగాని లేనం దుకును మనస్సున నెల్లప్పుడు నామె చింతనొందుచుఁ జిక్కి శల్యమై యుండెను. ఆమెనూరార్చుటకు శివప్రసాదు కుమారికయగు చంద్రావతి

యనేకప్రయత్నములఁ జేయుచువచ్చెను గాని యవియెల్ల వ్యర్థములయ్యెను. చంద్రావతిభర్త యప్పటికి రెండుసంవత్సరముల క్రిందట దేశాంతర మరిగి తిరిగి రానందున వ్యస్తురాలయిన యామె మిగుల దుఃఖభారముచేత నలిగియుండి తనతో సమానదుఃఖురాలగు హేమలత నూరార్చుచు నామెచేఁ దానాశ్వాసింపఁబడుచుఁ బ్రొద్దులుపుచ్చుచుండెను. కాలము సకలదుఃఖభారముల నుపశమింపఁజేసెను. కాబట్టి క్రమక్రమముగ హేమలత చంద్రావతి మధురభాషణములచేఁ గొంతయూరటఁ గల్గియుండెను. ఇట్లు కొన్ని మాసములు గడచెను. ఆనాటియుదయమున శ్రావ్యతరమయిన హిందీపాటలఁ బాడుచు ముష్టివాఁడు ప్రసాదుగారియింటికి రాఁగా హేమలత గానకళాప్రవేశము గలదగుటచే నాపాటలవిని ముష్టివానికిఁ బెట్ట దోసెడు బియ్యము దెచ్చెను. హేమలతను బిచ్చగాఁడెందుచేతనో యాపాదమస్తకమును ఱెప్పవాల్పక చూడజొచ్చెను. బిచ్చగాని వికృతిదృష్టికి జడిసి బియ్యము త్వరితముగఁ బెట్టి పాకలోనికిఁజని చంద్రావతి కామాటఁ జెప్పెను. విని చంద్రావతి వచ్చునప్పటికి బిచ్చగాఁడు మరలిపోయెను.

ఇదిజరిగిన కొన్నిదినముల కొకనాఁడు హేమలత దీపములుపెట్టినతరువాత మదనసింగునుగూర్చి తలంచుకొని తత్సంయోగము లభించుట దుర్లభమని విచారమునొందుచుండఁగా శివప్రసాదొక సేవకునివెంటఁబెట్టుకొని లోపలికి వచ్చెను. అతఁడు హేమలతను జంద్రావతిని దనవద్ద నుంచుకొని వానివృత్తాంతమును జెప్పుమనఁగా "అయ్యా! తమయింట హేమలత యున్నదని తెలిసి శ్రీమదనసింగుగారామెనువెంటఁబెట్టుకొని రమ్మని నన్నుఁ బంపినారు వివాహప్రయత్నము సర్వము జరిగి సిద్ధముగి నున్నది. చిత్తూరురాజు భీమసింగుగారీమెను దోడితెమ్మని పల్లకియుఁ బదెనిమిందుగురుబోయలను నిరువురబంట్రోతులను నావెంట నంపినారు. చక్రవర్తికిని రాజపుత్రులకును మహాయుద్ధము సంప్రాప్త

మగునుగనుక సాధ్యమైనంత శీఘ్రముగ రప్పింపుమని వారు సెలవిచ్చి నారు. మీఁద మీచిత్తము" అని చెప్పి సేవకుఁడూరకుండెను. ఈమాటలు హేమలత హృదయారవిందమును వికసింపఁజేసెను. చంద్రావతి హేమలతావియోగము గలుగునని విచారభరమును దాల్చెను. నీయిష్టమేమని శివప్రసాదు హేమలత నడిగెనుగాని యామె యుత్తర మీయదయ్యెను. శివప్రసా దనంతరమునఁ దనభార్యకావృత్తాంతమును జెప్ప నామెయభిప్రాయము నీయఁజాలక తడఁబడఁ జొచ్చెను. రాత్రిజామగు నప్పటికి బోయలు పల్లకి నెత్తుకొనివచ్చి గుమ్మము ముందట నిల్చిరి. శివప్రసాదు వారికందఱకు నన్నముబెట్టించి పండుకొను సదుపాయము చేసెను. చంద్రావతి హేమలత మనస్సులోఁ జిత్తూరుపోవుట కిష్టము న్నట్లు మాటలవల్ల సూచకముగా నెఱిఁగి తలిదండ్రుల కెఱిగింప వారును హేమలతనివాహము నాపుట మేలు కాదనియు మొదట నామె నప్పగించిన యోగికూడ మదనసింగువద్ద కంపుట కిష్టపడెననియు, నాలోచించి యామెను జిత్తూరునంపుటకు నిశ్చయించుకొనిరి. మఱునాఁడు మధ్యాహ్నము ప్రయాణము నిర్ణయింపఁబడెను. శివప్రసాదును, భార్యయు, నామెను దమపుత్రికవలెఁ జూచుకొనుచున్నఁదున చీరలు రవికెలు మొదలగువాని నిచ్చిరి. హేమలత వారిని వదలలేక కన్నీటితోఁ బల్లకినెక్కెను. శివప్రసా దామె నొంటిగా విదేశీయులతో నంపుట యుచితముకాదని మిగులగృతజ్ఞుఁడును, శూరుఁడు నగు లాహిరి యను నొక శూద్రుని బల్లకివెంట సహాయముగ నంపెను. మఱియును ఢిల్లీనగరముమీఁదుగఁ దీసికొనిపోవలదనియుఁ జిత్తూరునగరమునకు తిన్నగఁ గొనిపోవలసినదనియు, బ్రాహ్మణుఁడు చెప్పి సాగిపొమ్మని బోయల కాజ్ఞాపించెను. లాహిరియును నిరువురు సేవకులును వెంటరా నందఱదగ్గఱ వేఱువేఱ సెలవుంగైకొని హేమలత జాముప్రొద్దువేళ కల్యావపురమును బాసి మదనసింగునుగలిసి సుఖించున పేక్షతోఁ బ్రయాణముఁ జేయు

చుండెను. లాహిరి స్వామిభక్తిగలవాఁడు సాహసుండైయగునుగాని, యొక రేమిచెప్పిన నది సులభముగనమ్మి మోసపోయెడు మూఢుఁడు. అందుచేతనే శివప్రసాదాతనితోఁ బలుమాఱు జాగ్రత్తగానుండుమని చెప్పెను. లాహిరియు సాధ్యమైనంతవఱ కప్రమత్తుఁడై పల్లకివెంట నడచుచుండెను. ఇట్లు కొంతదూరము ప్రయాణము చేసినతరువాత వారు ఫజీబాదుకడకు సాయంకాలమునకు వచ్చిరి. ప్రయాణమువలన డస్సియున్న బోయలు కొంచెము కల్లునీరు త్రాగుటకు గ్రామమున నొక చెట్టుక్రింద పల్లకిని ద్రింపిరి. కూడనున్న సేవకులిద్దఱు గంజాయిదమ్మ పీల్చుటఁజూచి లాహిరి మనస్సు పట్టఁజాలక తానును రెండుగుక్కలు పీల్చెను. తదనంతరము బోయలు వచ్చి మరలఁ బ్రయాణము నారంభించిరి. ఫజీబాదుదగ్గఱనే చిత్తూరున కరుగుటకు వేఱుబాటను గ్రహింపవలయును. అయినను బోయలును సేవకులును మార్గమును దప్పింపక ఢిల్లీవైపుఁ బోవుచుండిరి. లాహిరి యదివఱకు మార్గమును మార్పుఁడని వారినడుగఁదలఁచియు మత్తుచే సమయమున కూరకుండి వారితోఁగలిసి చిత్రములైన పాటలఁబాడుచు నడచుచుండెను. మద్యపానమత్తులగుటచే బోయలు వడివడిగ నడువసాగిరి. రాత్రి జాముప్రొద్దు పోవునప్పటికి వారందఱు ఢిల్లీనగరముఁ బ్రవేశించిరి. నగరముఖద్వారమును దాఁటి వారు నాలుగడుగులు సాగిపోవునప్పటికి దీపపుఁ గ్రీనీడను గంబళమును గప్పుకొని కూరుచున్న యొక మనుష్యుఁడు బోయలంజూచి "ఓరీ! యిటుయిటు" అని మార్గమును జూపెను. అది యానవాలుగ బోయలు రాజవీథిని విడిచి సందుగొందులవెంట నడువసాగుటఁ జూచి లాహిరి గంజాయిమత్తు పూర్ణముగ దిగినందున వడివడి ప్రక్కనునిలిచి "చిత్తూరువచ్చినాములే అమ్మా" యని హేమలతను లేపెను. మదనసింగు దర్శనమును లభించునని యూటలూరుచు నందు శయనించిన యీబాలిక యామాటవిని ప్రాణము లేచిరాఁగాఁ దలుపులఁ

దీసి వీథులఁ జూచుచుండెను. తరువాత కొన్నివీథులఁ గడచి బోయ లోకసందులో నున్నతప్రాకారములు గల యొకగృహముదగ్గఱకుఁ బోయి కంబళమును గప్పికొన్న మనుష్యుఁడు నిలువుడనిచెప్పఁ దామచటనిల్చి పల్లకిదింపిరి. ఇప్పటికిలాహిరికి దాదాపుగఁ దెలివివచ్చెను. పల్లకి దింపినతోడనే కంబళముగప్పికొన్న సేవకుఁడు వచ్చి పల్లకితలుపులఁ దెఱచి 'అమ్మా స్త్రీలుకనిపెట్టుకొనియున్నారు. లేచిరమ్మ' అని పలికెను. లోపలస్త్రీ లోకదాసినయిన నేల యంపి తన్ను గౌరవింపరె రని హేమలత యోజించుచు మెల్లగఁ బల్లకివిడిచి లాహిరినివెంటఁబెట్టుకొని తప్పటడుగు లిడుచు లోనికిఁ జనెను. ఆయింట హేమలత ప్రవేశించు నప్పటికి నందు దీపమైనను లేదయ్యెను. ఈమాయ యేమని మనహేమలత యోజించుచుండ నొకసేవకుఁ డరుదెంచి 'లోపల స్త్రీలున్నారు. వారికి ఘోషాకలదు. మీలాహిరిని లోనికిఁ దీసికొని రాకుము' అని చెప్పెను. అంతట నామెచేయునదిలేక లాహిరిని జాగ్రత్తగ నుండుమని మెల్లగాఁ జని యొకగదిఁ బ్రవేశించెను. ఆగదిలో నొక చిన్నదీపము మాత్రము గూటిలోనుంచుటఁబట్టి నిలిచియున్నమనుష్యుల మొగమును జూడఁజొచ్చెను. ఆగదిఁబ్రవేశించి రెండడుగులుదూర మరిగి హేమలత కట్టెదుట నతిదీర్ఘకాయమును భయంకరమగు గడ్డమును దాల్చి ప్రత్యక్ష యమునివలెనున్న రహిమానుఖాను విగ్రహముఁ జూచెను. చూచి యాకస్మికభయముచే శరీరము గజగజ వడఁక నోట మాటరాక చేష్టలుదక్కి యెట్టకేలకు లాహిరీ! లాహిరీయని భయాతిశయముచే నేల మూర్ఛిల్లెను. నేలఁబడుచున్న యామెను దనచేతులతో నిలిపి "ప్రాణేశ్వరీ భయపడకు. నేనుండఁగ నీ కేమిభయములే" దని రహిమానుఖా నామె నాపఁబోయెను. కాని దుఃఖావేశముచే శరీర మెఱుఁగని యామెను మోహావేశముచే శరీర మెఱుఁగని ఖాను పట్టుకొనలేకపోయెను. హేమలతపై ధ్యానము నిల్పియున్న లాహిరి 'లాహిరి' యనుకేక

తనచెవినిబడిన తోడనే బాలిక కపాయమేదో తటస్థమయినదని లేచి గడియవేయబడియున్న తలుపుఁదన్ని చేతులతో గుంజెనుగాని యెవ్వరు ను దీయువారు లేరైరి, వెంటనే నిలువెడలి వీధిలోనికివచ్చి యెలుఁగెత్తి ,,అయ్యో! అయ్యో! రక్షింపుఁడు. రక్షింపుఁడు" అని కేకలువేయనారంభించెను. అప్పుడు రాత్రి జామున్నర ప్రొద్దుపోయినందున జనులందఱు నిద్రాసక్తులై యుండిరి. ఈకేకలచే వారు మేలుకొని మహాపాయమేదో వాటిల్లినదని యావీధిమనుష్యులెల్ల వడివడి నాయుధముల ధరించి లాహిరి యున్నవైపునకువచ్చిరి. లాహిరి వారిని జూచి ,,అయ్యా యీయింటనొకస్త్రీనిఁ జెఱబెట్టుచున్నారు. తలుపులు మూయఁబడియున్నవి. మీ రామెప్రాణముల రక్షింపవలెను" అని చెప్పవారందఱుఁ గోపోద్దీపితులై గడ్డపారలతోఁ దలుపులు బద్దలుగఁగొట్టి లోనఁ బ్రవేశించిరి. అప్పటికి రహిమానుఖానును, గంబళిఁ గప్పుకొని మార్గప్రదర్శకుఁడైన నందుఁడును బాఱిపోయిరి. బంగారు బొమ్మవలె హేమలత నేలఁబడి యప్పుడే తెలివిదెచ్చుకొని కనులమూసికొని భయముతో ,,అయ్యోదైవమా" అని యేడ్చుచుండెను. వా రామెనులేవదీసి యా దుర్మార్గు లందులేరని యామెకు ధైర్యము చెప్పిరి. ఆవచ్చినవారిలోఁ జక్రవర్తివద్ద నొక గొప్పయుద్యోగమున నున్న చంద్రసేనుఁడును బంగాళాక్షత్రియుఁ డొకడుండెను. ఆయన యేఁబదియేండ్లవయస్సు గలవాఁడగుటను సకలకష్టసుఖములు నాటినవాఁడగుటను, బాలికపై జాలిఁగలిగి తనయింటికి రమ్మనిలాహిరి సమేతముగ నామెను గొనిపోయెను. అందఱును రహిమానుఖానును నిందించుచు నిండ్లకుఁజనిరి. ఆయింటిదొడ్డిలోఁ జెట్లక్రింద దాగుకొనియున్న రహిమానుఖానును నందుఁడును మనుష్యుల సందడి తగ్గినతోడనె మరలగృహముఁబ్రవేశించిరి. అంతట రహిమానుఖాను విచారగ్రస్తుఁడై రెండుసారులు తనకు భంగపాటు గలుగుటకుఁ జింతిల్లి నందునితో ,,నందా పాపము నీవు బిచ్చగానివేషము వేసికొని

గ్రామములెల్లఁ దిరిగి హేమలతయున్న చోటెఱిఁగి వచ్చి నాకుపకార
ముఁ జేసినావు. మనము మదనసింగు పేరుపెట్టి యామెను రప్పించినా
ముగాని నామనోరథము సఫలము కాలేదు. నీశ్రమకైనను దైవము
మెచ్చలేదుగదా" యని నిట్టూర్పువిడుచుచు నాయిలువిడిచి నందుని
తోఁగూడఁ బోయెను.

అట్లు చంద్రసేనుఁ డామెను గృహమునకుఁ గొనిపోయి భోజన
ముఁ బెట్టించి తరువాత నిట్లనియెను. "అమ్మా నీవును క్షత్రియకన్య
వని చెప్పుచున్నావు. నీవు మాయింట నుండవచ్చును. కాని యింక నా
లుగుదినములకు మాచక్రవర్తి చిత్తూరుపై దండయాత్ర కరుగుచు
న్నాఁడు. నేను నాకుటుంబముతో నరుగుచున్నాను. నీవు వచ్చినయెడల
వెంటఁ దీసికొనిపోవుదును. రానియెడల నిన్నెవరి కప్పగించి పోవలెనో
తోఁచకున్నది." అనిచెప్ప నామె యాతనితోఁ జిత్తూరుబోయెద నన్నెను.
లాహిరి హేమలతతోఁగూడ చంద్రసేనునియింట మూఁడుదినము లుండి
కలకత్తానగరమునకుఁ బోయి యావార్త శివప్రసాదున కెఱింగించెను.

పదునాలుగవ ప్రకరణము.

చక్రవర్తి మహాసేనాసన్నాహమును జేసికొని రాజస్థానముపై
దండు విడియుటకు వెడలెను. ఆమహాసైన్యమందు హిందువులు, పిండా
రీలు, జాటులు, బౌద్ధులు, జయనులు, మొదలగు స్వదేశీయులును, అర
బ్బులు, పారశీకులు, తురుష్కులు, నాఫుగనులు, అబ్సీనియనులు,
తార్తారీలు, మొగలాయీలు మొదలగు ననేకమహమ్మదీయులును జేరి
యుండుటచేత నాశిబిరము కదలివచ్చుచున్న మహానగరమువలె నుండె
ను. క్రమశిక్షయుఁ దగుపరీక్షయు లేనందున సైనికు లెందఱో, శిబి

రానుచరులెందఱో కొల్లకము తమంతట వచ్చి చేరినవా రెందఱోయెవ్వరునెఱుఁగరు. ముందు రణదుందుభులు దిగంతములు ప్రతిధ్వను లెసఁగ మ్రోయఁ దళతళ మెఱయుఖడ్గములను హస్తములఁదాల్చి యమ్ములపొదుల మూపులనిడి జయైకదీక్షతోఁ గాల్బలములు మొదటనడుచుచుండెను. అవ్వెనుక పారశీక తురంగముల నెక్కి చేతులతో బల్లెములఁగొనినెక్కుమ్మడి నాశ్వికులు వెడలుచుండిరి. వారివెనుక మదగజేంద్రములపై బంగరుకంబళములతోడను వెండికప్పులతోడను గ్రాలు నంబారీలో నెక్కి పచ్చపట్టుపరుపులపైఁ గూర్చుండి సేవకులు వింజామర లిడ సకలసేనాసముద్రనియామకుఁడై శ్రీఢిల్లీశ్వరుండగు నలాయుద్దీను చక్రవర్తి వచ్చుచుండెను. చక్రవర్తికిరుకెలంకులను దృణీకృతమృత్యుదేవతలగు మహమ్మదీయసామంతు లంగరక్షకులై నడచుచుండిరి. వారివెనుక శిబిరానుచరులును వారివెనుక నేనుఁగుల నెక్కియు బల్లకులలోఁ గూర్చుండియు శ్రీచక్రవర్తి యొక్కయు హిందూమ్లేచ్ఛ ప్రభువుల యొక్కయు సైనికులయొక్కయు నంతఃపుర స్త్రీజనంబులును నరుగుచుండిరి. ఇందే చంద్రసేనుని కుటుంబమును వచ్చుచుండుటఁ జేసి మన హేమలతయు నొకపల్లకియందుఁ గూర్చుండి ప్రయాణముఁజేయుచుండెను. చంద్రసేనునిభార్య హేమలతను దనసోదరివలె గాపాడుచుండెను. సైనికుల కోలాహలధ్వనులును హయహేషలును, గజబృంహితములును, బల్లకుల యోంకారనాదములును, బ్రహ్మాండమును బ్రద్దలుచేయ సాగెను. ఈసైన్యము చిత్తూరునకుఁ బదునేను క్రోసుల దూరమునకు వచ్చినప్పుడు చక్రవర్తిసైన్యము నిశ్శబ్దముగా నడువవలయు ననియు, శత్రువులు తమరాకను గుర్తింపరాదనియు, రణదుందుభులు మ్రోయింపవల దనియు, నానతిచ్చెను.

నిరంతర మప్రమత్తుఁడై తిరుగు చిదానందయోగిచే నంపఁబడిన వేగులవాండ్రు సైన్యమువచ్చుటెఱిఁగి యోగికి విన్నవింప నతఁడావార్త

రాణాకు దర్బారునందు దెలియఁజేయుట మనమీవఱకే చదివినారము. ఆరాత్రి చక్రవర్తి సైన్యముయొక్క రాకను దానిస్థితిని దెలిసికొమ్మని భీమసింగు, మదనసింగును గోరాసింగునుబంప వారు చూచివచ్చి యావార్త రాణానుభీమసింగునకును విన్నవించిరి. అంతటరాజపుత్రులు చిత్తూరుసంరక్షణమునకు సమస్త ప్రయత్నములఁ జేయసాగిరి. రాజపుత్రసైన్యమునకు శూరాగ్రేసరులగు గోరాసింగును బ్రతాపసింగును సేనాధిపతులుగ నియమింపఁబడిరి. మదనసింగు శ్రీభీమసింగుగారికిని శ్రీరాణాకును సంగరక్షకుఁడుగ నియమింపఁబడెను. మూర్తిమంతమగు ప్రతాపమువలె ప్రతాపసింగు సైన్యమునెల్లఁ జక్కఁజేయనారంభించెను.

ఆమహమ్మదీయ సైన్యమట్లు ప్రయాణముచేసి మెల్లమెల్లఁగఁ జిత్తూరునగరమునకువచ్చి కోటయెదుటవిడిసెను. సైన్యమును గనుగొని భీమసింగు రసపుత్రులనెల్ల సిద్ధముఁజేసి కోటసంరక్షణమున కాజ్ఞనొసఁగెను. అల్లాయుద్దీనుచక్రవర్తియుఁ గోటముట్టడికారంభించి తన కాప్తుఁడును రాజకీయ వ్యవహారములయం దాలోచన చెప్పువాఁడునగు రహిమానుఖానునకు సేనాధిపత్యము నొసఁగెను. రహిమానుఖాను కత్తిఁబట్టనేరని పిరికివాండ్రలోఁ జేర్పఁబడదగినవాఁడయ్యు, గౌరవార్థమీమహోద్యోగము నంగీకరించెను. కోటగోడ యిరువదిరెండడుగుల యెత్తుగలిగి యైదడుగుల వెడల్పుఁ గలిగియుండెను. కోటచుట్టునగాధమైన కందకముండెను. ఆకందకముమీఁదనుండి లాగివేయఁబడుటకు వీలుగానున్న యొక వంతెనయుండెను. ముట్టడి యారంభమైనతోడనే మహమ్మదీయులు ఫిరంగులుబారుచేసి కోటగోడను నిర్మూలింపఁ బ్రయత్నించిరిగాని యదిదుర్లభమయ్యెను. పలుమారు పటాలముల వెనుక పటాలములువచ్చి యగడ్త మట్టితోఁబూడ్చి కోటగోడలపై గవిసెనుగాని రసపుత్రులబాణాసారమున హతములయ్యెను. తరువాత మ్లేచ్ఛులు లగ్గల కెగసి కోటఁబట్ట

సాహసించిరి కాని పైనుండి రాజపుత్రులు నిప్పులును మసలిన చమురును, శిలలను వారిపై వేయుటచేఁ జచ్చిరి. మహమ్మదీయు లెన్నిభంగులఁ బ్రయత్నించినను, కోట స్వాధీనము గాకుండుటఁ జూచి చక్రవర్తి స్వసైన్యనాశనమునకు విచారింపఁదొడఁగెను. ముట్టడి ఫలములేక యనేకమాసములుండుటఁ జేసి యుభయసైన్యములును విసిగి యెట్లయిన ముట్టడి నివారణమైన బాగుండునని తలఁచుచుండెను. అలాయుద్దీను సంధిఁ జేసికొనుటకు సిద్ధముగ నుండెనుగాని రసపుత్రులు ముందుగ సంధికి రారైరి. ముందుగ సంధియగుటఁ దనకవమానకరమని చక్రవర్తి వెనుదీయుచుండెను. భీమసింగుమహారాజు భార్యయగు శ్రీపద్మినిని చక్రవర్తికి సమర్పించిన పక్షమున నాతఁడు చిత్తూరుముట్టడిమాని స్వదేశమున కరుగుటకు సమ్మతించునని చక్రవర్తి రహిమానుఖానుచే సందేశము నంపుటచే నభిమానధనులగు రాజపుత్రులు తమకోపాగ్ని ప్రజ్వరిల్ల శాత్రవారణ్యమును దహింప కృతప్రతిజ్ఞులైరి. రాయబారనివధించుట పాపమని భీమసింగుచెప్పి వారింపకున్న నాదినమున ఖాను శిరస్సు వేయివ్రక్కలై యుండును. రాజపుత్రులెల్ల రోషమున జేవురించిన మొగములతో భయంకరాకారులై పగదీర్చుకొనవలెనన్న యుత్సాహముతో సింహనాదములఁ జేసిరి. రహిమానుఖాను శత్రుమండలమధ్యమున గజగజ వడఁకుచుఁ బ్రాణములు నఱచేతఁ బట్టుకొనియుండెను. తరువాత వారు ఖానునంపి కవచశిరస్త్రాణములు ధరించి యుద్ధసన్నద్ధులైరి. ఈవార్త నలాయుద్దీను విని మరల ముట్టడి నారంభించెను. ఉభయసైనికులు నొండొరులపై దారుణాగ్నివర్షములఁ గురియించుచుండిరి. చిత్తూరుఁ బ్రవేశించిన కొన్నిదినములకు హేమలత చంద్రసేనునితోఁ దనకు మదనసింగుపైఁగల యనురాగమును మదనసింగునకుఁ దనపైఁగల యనురాగమును దెలిపి నాజరుజంగునకుఁ దనరాక నెఱిఁగింపుమని ప్రార్థించెను. అతఁడు హేమలత శిబిరమున నుండుట నాజరుజంగున కెఱిఁగింప వారిరువురు నెట్లయిన నామెను

మదనసింగువద్ద కంపుట కుపాయముల వెదకుచుండిరి. అట్టి యుద్ధ సమయమున నామె నవలి కంపుట తమకు హానికరమనియెంచి వారప్పటి కూరకుండిరి.

ఆరాయబారము జరిగిన నాలుగుదినములకు ముట్టడి యతితీవ్రముగ నుండఁగ సాయంకాలమునందు ప్రతాపసింగు గృహమునెద్ద కొకబండివచ్చి నిలిచెను. ఆబండిలో నొకముసలిదియుఁ బదునాలేండ్ల ప్రాయముగల యొక కన్నియయుఁ గూర్చుండిరి. బండి వారిగుమ్మమువద్ద నిల్చినతోడనే ముసలిది బండిదిగి "మదనసింగుగారున్నారా" యని వాకిటఁ గూరుచున్న కృష్ణసింగు నడిగెను. మదనసింగంతకుముందె రెండుగడియలక్రిందట నింటికి వచ్చియుండుటచే గృష్ణసింగామాట విని తలయూఁచి లోపలికరిగి తనయజమానుని వెంటఁబెట్టుకొని వచ్చెను. బండివైపువచ్చుచున్న మదనసింగునుజూచి ముసలిది యెదురుగాఁబోయి "అయ్యా! మీదర్శనమునిమిత్తము మీప్రియురాలగు హేమలత వచ్చినది. అదిగో" అని మేలిముసుఁగుమఱుఁగుననుండి సిగ్గుచే బండి చాటుననున్న యాసుందరిని జూపెను. ఆమాటలు విన మదనసింగునకుఁ బంచప్రాణములును లేచివచ్చిరా సంతోషమును నివారించుకొని లోపలికి రండని యిరువురను బిలిచెను. అంతట నాబాలికనుమాత్రము మదనసింగు వెంటఁబెట్టుకొని తనగదిలోనికిఁ దీసికొనిపోయి కూర్చుండ నియమించి, యెల్లు పాలిగ్రామమునుండి యామె వచ్చెనో యావృత్తాంతము నెఱుఁగఁ జేయుమని యడుగ "అయ్యా నేను మిగుల శ్రమఁ జెంది మీనిమిత్తము వచ్చినాను. మాతాతగారు మృతినొందినారు. నేను దిక్కులేక యున్నాను. నాసంరక్షణభారము మీదేయని యిటు వచ్చితిని." అనిచెప్పి కంట నీరుపెట్టుకొనసాగెను. మదనసింగామె యెడ దయాద్రుఁడయి సుందరీ నీకు భయములేదు. మాపినతండ్రితోడను బినతల్లితోడను జెప్పి నిన్నెట్లయిన నేను తప్పక వివాహమాడెదను.

నీవు మాయింట నుండుము' అని చెప్పునప్పటికి ప్రతాపసింగు వారున్నగదిఁ బ్రవేశించెను. పినతండ్రినిజూచి మదనసింగు సంభ్రమముతోఁ డెల్లఁబోయి చూడసాగెను. ప్రతాపసింగు క్రొత్తవిగ్రహములఁ జూచి "నాయనా వీరెవరు? అని యడిగెను. మదనసింగు లజ్జావనతముఖుఁడై యూరకుండ ముసలిది 'అయ్యా! మీకుమారుని హృదయము నాకర్షించిన హేమలత యీమెయే' యని యుత్తరమిచ్చెను. ప్రతాపసింగున కట్టివివాహ మనిష్టమైనను కుమారుని కాగ్రహము కలుగునని వారిని లోనికిఁదీసికొనిరా నాజ్ఞాపించెను. అంతలో ముసలిదియు నావలకరిగినందున నబ్బాలికమోహాతిశయముచే శరీరము నెఱుఁగక మదనసింగు సమీపమునకుఁ బోయి నేను నీదాననే నీవు నన్ను వివాహమాడునట్లు నాకు వాగ్దానము చేయుము. అని మదనసింగును గాఢాలింగనము చేసికొని వదలకుండెను. భయముతో మదనసింగాకౌఁగిలింతను వదలించుకొని 'సుందరీ! నీవు రాచకన్నియవు. పెండ్లిగాకముందు నన్ను గౌఁగిలించుకొనుట తప్పసుమీ! యని నివారించి యుత్తమక్షత్రియకన్యయగు హేమలత కన్యాజనస్వభావమగులజ్జను బరిత్యజించి యట్లుచేయుట కాశ్చర్యపడుచు గదివెలుపలికి వచ్చెను. అంతలో భర్తచేనంపఁబడిన సువర్ణభాయి తత్ప్రదేశమునకరిగి కుమారుని జూచి నవ్వుచుఁ దనకుఁ గోడలు కాఁదలఁచిన యాబాలికను సగౌరవముగ గృహమునకు వెంటఁ బెట్టుకొనిపోయెను. ముసలిది యుఁదనకు బంధువు లున్నారని చెప్పి వెడలిపోయెను.

పదునేనవ ప్రకరణము.

ఆ మరునాఁడు పద్మినినైనఁ, బద్మిని ప్రతిబింబమునైన నొకపర్యాయము రాజపుత్రులు తన్నుఁ జూడనిచ్చినయెడ ముట్టడి మాని

పోవుటకుఁ జక్రవర్తి సమ్మతించి వర్తమానము నంపెను. అందువిషయమై దర్బారుజరుగ, నందుఁజేరిన సామంతులలోఁ గొందఱదియు నవమానకరమని వాదించిరి. మఱికొంద ఱద్దములోఁ బద్మినీదేవినీడను జూపుట యవమానకరము కాదని యభిప్రాయపడిరి. స్వకులక్షయమునకును, దేశనాశనమునకును, భీమసింగు వెఱచి తనభార్యయొక్క నీడను జక్రవర్తికిఁ జూపుటకు నియ్యకొనెను. కాని చక్రవర్తి యొకఁడె రావలయునని పట్టుఁబట్టెను. రాజపుత్రులు నిరాయుధుఁడుగను నిస్సహాయుఁడుగను నున్నవానిని వధింపరన్న దృఢవిశ్వాసముతోఁ జక్రవర్తి కామాంధకారముచేఁ గనులుగానక రహిమానుఖాను నొక్కని వెంటఁబెట్టుకొని కోటఁజొచ్చెను. చక్రవర్తికిఁ దగినగౌరవముల నొనర్చి భీమసింగు తనభార్యనీడ నొకయద్దములోఁ బ్రతిబింబిత మగునట్లు చేసి యాతనికిఁ జూపెను. నీడలో జగన్మోహనాకారముఁ దాల్చియున్న యాత్రిలోకసుందరి యగుపద్మిని నిజముగ నెట్లుండునో యని యద్భుతపడి సంతుష్టాంతరంగుఁడై పిమ్మటఁ గోటఁ వెడలిపోవుటకుఁ జక్రవర్తి సిద్ధమైయుండెను. ఆసమయమునఁ జక్రవర్తియు భీమసింగును నిట్లు మాటాడిరి.

చక్రి—నేను మీరుచేసిన మర్యాదలకుఁ జాల సంతోషించినాఁడను. ఈవఱకు నేను మిమ్ముఁజేసిన యవమానములకు నాకు విచారముగనున్నది. ఇఁకముందు మీరును మేమును స్నేహితులమై యుండవచ్చును.

భీమ—మీచిత్తమువచ్చినట్లు చేయవచ్చును. మానహానికంటెఁ బ్రాణహానిమేలు. మే మెవరికైనను వెఱచువారము కాము.

చక్ర—అవును నేను మీసంగతినెఱుఁగక దుర్మార్గుల యోజనమువలన మీదేశముపై దండెత్తినాఁడను. క్షమింపవలెను.

భీమ— క్షమియించుటయేల ? పొరబాటునకు నెవ్వరేమి చేయఁగలను?

ఇట్లు చక్రవర్తియు భీమసింగును, మాటాడుచుండ నొంటిగ దొరకిన మహమ్మదీయవిభుని వధింపవలెనని కోరిక యేరికి జనింపదయ్యె. అంతటఁ జక్రవర్తి తనశిబిరమునకు మరలఁ బ్రయాణమగుటచే భీమసింగు జక్రవర్తిని సాగనంపుటకుఁ దనకోటవిడిచి కొంతదూర మొంటరిగ సాగిపోయెను. అప్రస్తుతములగు కొన్నిమాటలఁ జెప్పుచుఁ జక్రవర్తి భీమసింగును దనసేనానివేశముదాఁక గొనిపోయెను. అప్పు డాకస్మికముగ నదివఱకుఁ జక్రవర్తిచే నియమితులై పొంచుండియుండిన కఱకుతురక సైనికులు భీమసింగు మహారాజుపై నొక్కపెట్టునఁ బడిరి. మనోధైర్యమున హిమాద్రియగు భీమసింగు ఘోరమైన యీమోసమునకు నాశ్చర్యపడి తనకత్తితో ననేకభటుల నాపెను. కాని సైన్యము లపారముగనుండుటఁబట్టియు రసపుత్రులు దూరముగా నుండుటఁబట్టియు భీమసింగు విజయమొందఁజాలక యలసియుండ రహిమానుఖానువచ్చి యాతనిపైఁ జేయి వైచి "నిన్ను ఖైదీగఁ బట్టుకొన్నాము. రారమ్ము" అని లాగెను. అప్పుడు మహమ్మదీయప్రభువులు వచ్చి రాజపుత్రసింహమును జెఱఁబెట్టిరి. పద్మినిని సమర్పించినంగాని బంధవిమోచనముఁ జేయుటలేదని చక్రవర్తి స్పష్టముగనుడివెను. భీమసింగు మ్లేచ్ఛులచేఁ జిక్కినవార్త చిత్తూరుకోటలోఁ దెలిసినపుడు కోటలోనున్నవారి దుఃఖమింతింత యనిచెప్పనలవికాదు. దుర్నిరీక్ష్య ప్రతాపుండగు భీమసింగను సూర్యుఁడు శాత్రవసైన్యమను పశ్చిమాంబుధి నడఁగిపోవుటచే నపుడప్పద్మినీముఖారవిందంబు వికాసహీనత నొందెను. నగరమున నాబాలగోపాలముగ జనులు, భోజనంబులుమాని దుఃఖావేశముచే మాటలాడఁజాలరైరి. కత్తివాటువేసిన నొకరిమొగమునను నెత్తురుచుక్కలేకుండెను. కోటయు మేడలు నుద్యానవనములు మందిరములు వెలవెలఁబారుచుఁ జిన్నవోయెను. సైనికులెల్ల నుస్సురస్సురనుచు దిగులునొంది యుండిరి. మదనసింగు తనబోటిసాహసికులు కొందఱితోఁ జక్రవర్తి సైన్యముపై

జొరఁదలఁచెనుగాని యీపడుచుఁదనపు బ్రయత్నము గోరాసింగు మాన్పెను. అనంతరము రాజపుత్రవీరులు నిజమందిరముల కరిగి యా రాత్రి కర్తవ్యము నూహింపుచుండిరి. ప్రతాపసింగును మదనసింగును విచారముతో నింటికిఁ జనిరి. మదనసింగు తనప్రియురాలి సేమముఁ గనుఁ గొనినతరువాత నొకకుర్చీమీఁదఁ గూర్చుండినపుడు మెల్లగ సువర్ణభాయి వానికడకువచ్చి కూర్చుండి యిట్లని చెప్పనారంభించెను. 'నాయనా! నా దొక్క చిన్నమాట కలదు. నీకీబాలికపై నెట్లు ప్రేమ కుదిరెనో నేనెఱుఁగను గాని యిది దౌర్భాగ్యురాలని తోఁచుచున్నది. మేలిముసుఁగుఁ దీసిచూడ నది నాకంతయందముగఁ గనఁబడలేదు. అందమట్లుండ దీనిదగ్గఱ దొంగతనముకూడ నున్నది. ఈదినమున నావజ్రపుటుంగరము పోయినది. అది తీసినట్లు దాసీజనులు చెప్పినారు. అది నీప్రియురాలగుటచే వారేమియు ననఁజాల కూరకుండిరి. అని తల్లి వచించినమాటలు శూలములవడువునఁ దనచెవులఁబడ మదనసింగు దుఃఖమునకు మితము లేకపోయెను. కాని తల్లి యబద్ధమెన్నఁడుఁ దనతోఁ బలుకదని తానెఱిఁగి యిది సేవకులు చేసినమాయ యని నమ్మి తల్లితో 'అమ్మా! హేమలతపయి నీకు నిష్కారణముగ దురభిప్రాయము కలిగినది. ఆమె సద్గుణపుంజము సుమీ నీకు నిలకడమీఁద నిజము దెలియును. నీమాటలచే నన్ను బాధింపకుము' అని పలికెను. 'ఎట్లయిననీవు దీనిని వివాహమాడవలనుగాదుసుమీ' యని సువర్ణభాయి లోపలికరిగెను. మదనసింగు సందేహాస్పదహృదయముతోఁ దనప్రియురాలున్న గదిలోనికిఁబోయెను. అచట మంచముపైఁ బవ్వళించియున్న యాబాలిక మేలిముసుఁగు వెంటనే మొగమున వేసికొని రోదన మొనర్చుచు మదనసింగు పాదములపైఁబడి యిట్లు చెప్పసాగెను. "ప్రాణేశ్వరా! మీతల్లిగారును సేవకులును నన్నవమానించుచున్నారు. నే నెందైనను బడి మృతినొందుటకు సిద్ధముగనున్నాను. మీదర్శనము జేసిపోవలెనని జీవించితిఁగాని యిది

వఱకే నేను మృతినొందవలసినది. నామీఁద మీరింత నిర్దయఁబూను ట ధర్మముగాదు. మీతాత మీకుఁ జేతిలోఁజేయివైచి నన్నప్పగించి నాఁడుగదా' యని విలపించుచున్న ప్రియురాలి మాటలకు హృదయ ముకరఁగి మదనసింగు నిరుత్తరుఁడయ్యెను. ఆమె యంతటితో నిలువ క మూఁడుత్తరములఁదీసి నావిషయమై మాలవి నాజరుజంగు ప్రముఖు లకు వ్రాసిన యుత్తరములఁ జూడుఁడు. అందు నాసత్ప్రవర్తనమును గూర్చి యాయన యెట్లుశ్లాఘించినాఁడో మీ రెఱుఁగుదురు' అని యుత్తరములఁ జేతికిచ్చెను. మదనసింగు వానిం జదువుకొనిన తరు వాత నారాత్రి తన ప్రియురాలివిషయ మగు విచారమును భీమసింగు ను గూర్చినచింతయుఁ దన్ను బాధింపఁ జిదానందయోగితోఁ దనకాల మును గడుపుటయుచితమని యెంచి యాతనిమఠమున కరిగెను. విచా రమును సూచించుచున్న యాతనిమొగమును జూచి యోగి కారణము ను చాలసారులు తరచితరచి యడిగ తుదకు మదనసింగు తనప్రియురా లివిషయమయిన చర్యనెఱిఁగించెను. హేమలత మదనసింగునియింట వసియించుచున్నదని యోగి విని యామెపయి నపనింద వచ్చినందుల కుఁ జింతించి మదనసింగుతో 'ఆమె వచ్చినదా? తల్లిదండ్రులులేని యాపిల్లపై నేటినిందవచ్చెను? ఆమెను నేనుజూచి మాటలాడవలెనని యున్నది. నీకేమయిన నభ్యంతరము కలదా?' అని పలికెను. తన క ట్టి యభ్యంతరము లేదని మదనసింగుత్తరముజెప్ప యోగి తక్షణమే వారియింటి కారాత్రి పైనమయ్యెను. మదనసింగు యోగితో గృహ మును బ్రవేశించి బాలికయున్న గదిఁజేరి యామెనుజూపెను. ఆమెతోఁ గొన్ని రహస్యములు మాటలాడవలసియున్నవని యోగి చెప్ప మదన సింగు వెలపలి కరిగెను. తరువాత యోగి బాలిక కడకరిగి 'అమ్మా! జ్వరము నింపాదిగానున్నదా? యని యడిగెను. దానికామె యుత్తర మునీయక యోగిపై నూరక చూచుచుండ నతఁడును నీ వెందుండి

యిక్కడకు వచ్చినావు? కుమారీ యనియడుగ నామెమాటలాడదయ్యె. యోగి యామెహస్తమును బట్టుకొని 'నీవునాపుత్రికవు. సిగ్గుపడకుము' అని ప్రియములాడ నామెసిగ్గువదలి మాటలాడుటకు సమ్మతించెను. వారిట్లు మాటాడిరి.

చిదా—నీవు నేటిదాఁక నెందున్నావు? ఎవరిసంరక్షణమున నున్నావు?

బాలి—నేనా యలీఘరులో రాజులయింట నుంటిని.

చిదా—నిన్ను పాలినుండి యెవరు తీసికొనివచ్చినారు?

బాలి—ఆగడబిడనుండి నేనే వచ్చినాను. నన్నెవరు దేలేదు.

ఈపలుకులువిని చిదానందయోగి యనుమానపడి యామె మేలి ముసుఁగుఁ దీసి మొగమువైపుఁ బాఱఁజూచి మరల ముసుఁగిడి యీవల కు వచ్చి మదనసింగుతో 'నీమెకు నీసదుమఁ గలిగిన కష్టములచే మతి చాంచల్యము సంప్రాప్త మైనది. నాకడకంపుము. నేనుమందులనిచ్చి రెండుదినములలో జాడ్యము కుదురునట్లు చేసెదను' అని లోనికరిగి బా లికతో 'అమ్మా! నీకు మదనసింగు తప్పక భర్తకాఁగలఁడు నీకు శరీర మున కొంచెము రుగ్మతకలదు. నామఠమున నిన్ను రెండుదినము లుం చుకొని మందిచ్చిపంపెదను రా!' యనిచెప్పి మదనసింగు సమ్మతిమీఁద నామెను గొనిపోయెను. మదనసింగును జింతాక్రాంతుఁడై యారాత్రి పండుకొని నిద్రరాక కలవలపడుచుండెను. యోగిమఠమునకు బాలికను గొనిపోయి యామెను నిద్రపుచ్చి తనప్రియశిష్యుఁడైన సదాశివునిఁ బి ల్చి యాచిన్నదాని విషయమున నాతనితో నేమోచెప్పి యారాత్రితా నును సుఖముగ నిద్రించెను.

పదునాలవ ప్రకరణము.

ఆమఱునాఁడుదయమున నిద్రమేలుకొనకముందే సేవకులరుదెంచి మహారాణావారు రమ్మని వర్తమానమంపిరని చెప్ప మదనసింగు వస్త్రాలంకారములఁ దాల్చి తనయశ్వముపై నెక్కి మఠమునం దున్న తన ప్రియురాలి యోగక్షేమము నరసికొనుటకు యోగికడకు వచ్చెను. యోగి మదనసింగును రహస్యముగ నొకగదిలోనికిఁ గొనిపోయి యాతనితో 'బాబా! యాపడుచు హేమలతకాదు పాలిగ్రామమునుండెడి రాధయను దాసిసుమీ. దీనివిషయమై దయఁదలఁపక నేను దగినట్లు శిక్షించెదను. నీదారిని నీవరిగి పనిఁ జూచుకొనుము' అని చెప్పెను. ఆపలుకులు విని మదనసిం గత్యంతాశ్చర్యమునొంది తన్నట్లు మోసపుచ్చిన రాధ శిక్షార్హురాలని యొప్పుకొనెను. కాని స్త్రీయగుటచే క్షమించి ప్రాణహానిలేకుండఁ జేయుమని యోగిని బ్రార్థించి తాను కోట కరిగెను. అప్పటికిఁ బ్రతాపసింగు గోరాసింగు మొదలగు ప్రధానయోధులు వచ్చి దర్బారునఁ గూర్చుండిరి. మదనసింగును దన కుచితమగునాసనమునఁ గూర్చుండి భీమసింగును మ్లేచ్ఛులబారినుండి తప్పించుటకుఁ దగునుపాయమాలోచించుచుండెను.

అప్పుడు గోరాసింగు లక్ష్మణసింగును సభ్యులను జూచి యిట్లనియె. మనమీసమయమునఁ జక్రవర్తియొద్దకు మదనసింగును రాయబారిగ నంపుదము. అంతటిన్యాయముతోఁ బ్రవర్తించిన మాయెడ మీరింతయన్యాయముతోఁ బ్రవర్తించుట సత్పురుషోచితము కాదని చక్రవర్తికి నతఁడు దెలిపి యతనిలోపము నతని కెఱిఁగించినను నతఁడు మనమాట కియ్యకొనఁడేని తగుచర్య జరుపుదము. అని గోరాసింగు నుడువ నందఱదియుక్తమని మదనసింగును సందేశార్థ మరుగు మనిరి. మదనసింగు స్వామికార్యార్థ మెంతటి సాహసకార్యమునైన నాచరింప

నుద్యుక్తుఁ డగుటచే నీకార్యమునకు సమ్మతించెను. అతఁడు మరల నింటికిరాక సువర్ణభాయికడ సెలవుఁగైకొనక కొలువుననున్న పినతం డ్రికి నమస్కరించి యాతనిచే నాశీర్వచనములఁ బడసి రాణావద్ద సెల వుఁగైకొని చక్రవర్తిసమ్ముఖమునకుఁ గతిపయసేవకులతోఁ బోయెను.

ఇటఁ జిదానందయోగి యరుణోదయమున లేచి స్నానసంధ్యా దికములఁ దీర్చుకొని సదాశివునిచే రప్పింపఁబడిన మంగలివాని నొకచోటఁ గూర్చుండుమని గాడిద నొకచెట్టునకుఁ గట్టించి రాధను దనకడకుఁ బిలిపించి యాగ్రహముతో 'ఓసీ మూర్ఖురాలా! నీసంగతి నే నెఱుఁగుదును. నీవు పాలిగ్రామములోనుండు రాధవు. చిత్తూరు నీ వేట్లువచ్చితివి? అని యడిగెను. అది భయసంభ్రమములచే నోడలెఱుంగక కొంతసేపుండి తెలిసి యింక బొంకిన కార్యములేదని యిట్లనెను. 'స్వామీ! మదనసింగు పాలిగ్రామమునకు వచ్చినపు డాయనమీఁద నాకు నెట్టిమోహ ముదయింప నాఁపుకొనలేక హేమలత భానుపాలయినదని యెంచి నేనామెవేషము వేసికొనివచ్చి నాకర్మవశమునఁ బట్టుపడితిని. నాకుఁ బ్రాణదానముఁ జేయవలెను. నేను మీబిడ్డను' అని యోగిపాదములపైఁబడి హృదయము కరఁగునట్లు రోదన మారంభించెను. యోగి జాలిఁగొని ప్రాణదానముఁ జేయుటకు వాగ్దానముఁజేసి దానిని దొడ్డిలోనికిఁ దీసికొనిపోయి తానొక చేయియు సదాశివుఁ డొకచేయియుఁ బట్టుకొని యౌవనపరిపూర్ణురాలగు నామెను వికృతాంగిగ నొనర్పఁదలఁచి క్షౌరముఁజేయుమని మంగలివాని కాజ్ఞయొసఁగ వాఁడు తుమ్మెదరెక్కలవలె నల్లనివై నిడుదలగు రాధశిరోజముల భారముఁబాపి విధవవలెఁ జేసెను. వికృతాంగి యగునామెను యోగితత్క్షణమె గాడిదపైఁ గూర్చుండ నియమించి చిత్తూరునగరమున వీధులవెంటఁద్రిప్పించెను. గ్రామనివాసులెల్ల మందలుమందలుగ నామెనుజూడవచ్చి కడుపులు పగులునట్లు నవ్వసాగిరి. ఇట్లు సంభవించిన పరాభవము భరింపలేక

రాధ యాపూఁట నగరమువిడిచి గ్రామాంతరముఁ బోయెను. అక్కడ మదనసింగు చక్రవర్తి శిబిరమునకుఁ జని తనరాక నతని కెఱింగించెను. మదనసింగువంటి శూరశిఖామణిని శత్రుమండలమున లేకుండఁ జేయుటకుఁ జిరకాలము నుండి ప్రయత్నించుచున్న చక్రవర్తి యాతనిరాక విని రహిమానుఖానుకు వర్తమానము నంపెను. రహిమానుఖాను మదనసింగుపైఁగల యసూయచే నాతని రాయబారము విననక్కఱలేదనియు వెంటనే యాతనిఁ జెఱబెట్టఁదగు ననియుఁ జక్రవర్తికి నాలోచనఁ జెప్పెను. చక్రవర్తి తత్ప్రకారముగ మదనసింగును గారాగృహమునఁ బెట్టించి రహిమానుఖానును నచటఁ గావలియుండ నాజ్ఞాపించెను. మదనసింగు ననుచరులలోనొకండు సత్వరముగఁ బఱతెంచి యతని యవస్థను బ్రతాపసింగునకు విన్నవించెను. భీమసింగు చెఱలోఁబడిన నాఁడెట్లు చిత్తూరున దుఃఖముదయించెనో యట్లే నేఁడును మదనసింగువిషయమై దుఃఖముదయించెను. ప్రతాపసింగు విచారమునకు నలవిలేదు. సువర్ణబాయి కీసంగతి తెలిసిన పుడు గాలితాఁకున నేలపైఁ బడుతీఁగవలె నామె మూర్ఛబోయి, తెలిసినతరువాత నన్నపానములు ముట్టక దుఃఖపారవశ్యము నొందియుండెను. ఆదివస మట్లు మహమ్మదీయ శిబిరమున మహానందముతోడను రాజపుత్రశిబిరమున దుఃఖముతోడను గడచిన వెనుక మఱునాఁడుదయమునఁ జక్రవర్తి మదనసింగును జెఱఁ బెట్టినగుడారమునకుఁ జని యొకపీఠముపై నాసీనుఁడై యతనిని దనయెదుటకుఁ దీసికొనిరమ్మని యాజ్ఞాపించెను. భటులట్లతనిఁ దోడితేర మదనసింగుఁ తురుష్కుని కట్టెదుట నిర్భయముగ నిలిచియుండెను. ఆతని ధైర్యసంపదకుఁ దనలోఁ జక్రవర్తి యచ్చెరువడి వానితోఁ నిస్సందేహముగా నిట్లని చెప్పఁదొడంగెను. 'ఓయీ కాఫరు! రాజపుత్రా నీవు మాచేఁ బడినావు. నీకు ప్రాణములఁ దక్కించుకొనవలెనని యున్నపక్షమున నాకార్యముఁ జక్కఁజేయుము. పద్మినిని మాకు సమ

కూర్చునట్లు మీభీమసింగునకు సలహాచెప్పి కార్యసాఫల్యముఁ గావింపుము. అట్లయిన నీప్రాణసంరక్షణ మొనర్చుటయేకాక భీమసింగును విడుచుటయు నీకనేకబిరుదులను బహుమానములను నొసఁగుటయుఁ గూడ నగును. లేకున్న నీకు మరణదండన విధించెదను. నీసుందరకాయమును నీపరాక్రమమును జూడ నాకు జాలియగుచున్నది. నీవుమరణమును గోరెదవా నీప్రాణములను రక్షించుకొనఁగోరెదవా?' అని చక్రవర్తి పలుక మదనసింగు మహాకోపోద్దీపితుఁడయి నేత్రద్వయము చింతనిప్పలవలె జేవురింప మొగ మెఱ్ఱఁబారఁ బరవశుఁడై తాను మ్లేచ్ఛసార్వభౌముని స్వాధీనమునం దుండుటయుఁ దనకు మరణము సంప్రాప్తమగుటయు మఱచి నిర్భయముగ నిట్లు పలికెను. "ఛీ! నీదురాలాపముల నింకఁగట్టిపెట్టుము. నీవు పౌరుషవంతుఁడవనియు, మానాభిమానములు గలవాఁడవనియు నేననుకొంటినిగాని యింత నీచుఁడవని నేనెన్నఁ డెఱుఁగను. నీకు భీమసింగు మహారాజుభార్యయగు మహాపతివ్రిత పద్మిని కావలయుఁగా? మే ముత్తమక్షత్రియవంశసంభూతులము గాని కఱకుతురకలము గాము. మాకు మానాభిమానములే తల్లిదండ్రులు. ప్రాణములఁ దీసివేయుదునని నీవు బెదరించుమాత్రమున తుచ్ఛప్రాణములకు జడిసి నీచకర్మము నొనర్చువా రనుకొంటివి కాఁబోలును. ఈ తుచ్ఛకర్మములనొనర్చి జీవించుటకంటె మాకు శూరజనసులభమగు మ్లరణమే మేలు. పరాక్రమవంతుఁడవేని యీదుర్భాషలుడిగి కత్తిఁగట్టి మాతో మగవాఁడవై పోరుము." అని యనేకభంగుల నిందించుచున్న మదనసింగుమాటల కాశ్చర్యపడి చక్రవర్తి మేరమీఱినకోపముతో 'నీదుర్మార్గుని జంపివేయుఁడు. వీనినాలుకను గోసి యెఱ్ఱగాఁగాలిన యినుపకఱ్ఱలను వీనికన్నులలోఁజొప్పించి పిమ్మటఁ దలఁ దెగవేయుఁడు' అని రహిమానుఖానున కానతిచ్చి తక్షణమె యాగుడారమునుండి వెలుపలికిఁ జని భీమసింగును జెఱబెట్టిన గుడారమున

కరిగెను. కామపీడచేఁ జక్రవర్తికి యుక్తాయుక్త వివేకజ్ఞానము నశించి
నందున నతఁడు భీమసింగుసమ్ముఖమున కరిగి తనహృదయపద్మమును
బాయకుండిన పద్మిని సంయోగమును దనకుఁ గూర్పవలసినదని యాత
సి వేఁడుకొనెను. కీచకునిమాటల కలిగిన భీమసేనునివలెఁ జక్రవర్తి
మాటల కలిగి భీమసింగు రౌద్రరసమొల్క నిట్లనెను. 'అపకీర్తితోఁ
జిరకాలము జీవించుటకంటెఁ గీర్తితో మరణమునొందుట యుత్తమ
ము. రాజపుత్రరక్తము నరములయందుఁ బ్రవహించునంతకాలము
ను, కంఠమునఁ బ్రాణము లుండునంతకాలమును భీమసింగు మరణము
నకు వెఱచి నైచ్యమున కొడంబడునని స్వప్నమున నయిన నమ్మకుము.
నాకు మరణము మాటవంటిది కాని భయకారణముకాదు. నాకు మ
రణము సంభవించిననుసరె రసపుత్రవంశములు నిర్మూలమైననుసరె నే
నట్టికార్య మొనర్పను' అని ప్రత్యుత్తర మియ్యఁగా నామ్లేచ్ఛచక్రవ
ర్తి భీమసింగు మదనసింగుల నిరువురఁ జంపివేయవలెనని సంకల్పించు
కొనెను. అందుచేత మదనసింగును దక్షణమే యంత మొందింపవలద
నియు మఱునాఁడు భీమసింగుతోఁ గూడఁ దుదముట్టింపవచ్చుననియు ర
హిమానుఖానుతోఁ జెప్పెను. కాని మరల నారాత్రి కొందఱియాలో
చనముచొప్పున భీమసింగును వధించుట మానుకొనియెను. ఇప్పటికై
నను బద్మినిపైఁ దన కాస నశింపనందున భీమసింగుఁ జంపిన వ్యవహార
ము మొదలే మోసమగుననియు నతఁడు సేమముగనుండిన రసపుత్రులు
పద్మినిఁ దనవద్ద కేనాటికైన నంపి యతనిప్రాణముల రక్షించుకొందుర
నియు నమ్మి భీమసింగునకు మరణదండన మాన్పెను. మదనసింగు
చావా మఱునాఁడు నిశ్చితమయ్యెను. రహిమానుఖానా కార్యనిర్వా
హమునకు నియమింపఁబడినందున నతనియానందము వర్ణనాదుస్సా
ధ్యమైయుండెను. ఆమధ్యాహ్నమె యిఁచుపకజ్జలను గొలిమిలోఁ బెట్టి
యెఱ్ఱగఁ గాల్పించుచుండెను. ఆసాయంకాలమునందు రహిమాను

ఖానువద్దకు నందుఁడువచ్చి 'స్వామీ హేమలత చంద్రసేనుని గుడారము లోనేయున్నది. ఆరాత్రి చంద్రసేనుఁ డామెను గొనిపోయెనని విన్నాను. మీఁద మీచిత్తము' అని విన్నవింప నాడఁబోయినతీర్థ మెదురయినట్లు తనహృదయమును బీడించు కన్య తనశిబిరమున నుండుటకు సంతోషించి రాత్రి రెండుగడియ లైనతరువాతఁ దనయశ్వము నెక్కి ఖాను చంద్రసేనునిగుడారమున కరిగి యాతనిఁ బిలిచి తనకు నెట్లయిన హేమలతను సమర్పింపుమని యాతనిఁ బతిమాలుకొనెను. ఆతని మౌఢ్యమునకును దుర్వర్తనమునకును జంద్రసేనుఁ డచ్చెరువడి యాతనితో 'మేము రాజులము మీరు తురకలు మాకన్యనెట్లు మీకియ్యఁగల మని యడిగినావు? చాలుచాలు నీచరియలు గట్టిపెట్టుము. లేకున్న చక్రవర్తితో నిది చెప్పెదను.' అని మందలించెను. రహిమాను ఖా నింటికరిగి భగ్నప్రియత్నుఁడగుటకుఁ జింతిలుచుండెను. చంద్రసేనుఁడు వెంటనే చక్రవర్తిసన్నిధి కరుగుదెంచి వినయపూర్వకంబుగ జరిగిన వృత్తాంతమంతయు నెఱిఁగించెను. రహిమానుఖానుయొక్క ద్రౌజన్యమునకుఁ జక్రవర్తి మండిపడి చంద్రసేనుని బంపి ఖానును బిలిపించి కఠినముగ నాతని మందలించెను. అంతటఁ దనమీఁద నేరముఁ దప్పించుకొనుటకు ఖా ను.పాయమును వెదకి తుదకొక పన్నుగడ నూహించి యేలికతో నిట్లువిన్నవించెను. 'మహాప్రభూ! అతనివద్దనున్న బాలిక నిజముగ నప్సరసపద్మినివలె నుండును. పద్మినికామె బంధువని విని యామె నెట్లయినఁ దమకు సమర్పింపవలెనని చంద్రసేనుని నేనడిగితిఁగాని యాకన్య నానిమిత్తముకాదు' అని విన్నవించినఖాను మాటలచే మదనవికార ముదయింప ఖానుపై దయఁజూపి యంపి తక్షణమే చంద్రసేనుని రప్పించి హేమలతను దనశిబిరమునకుఁ దీసికొనిరావలయునని యానతిచ్చెను. ఆమాటలువిని చంద్రసేనుఁడు నిర్విణ్ణుఁడై యది రహిమానుఖాను మాయగాఁ దెలిసికొని చక్రవర్తి సమ్ముఖమ్మున మారు

మాటాడలేక సరేయని వెడలెను. మార్గమునఁబోవుచు దానింతకాలము దిక్కులేని రాచకన్నియ మర్యాదఁ గాపాడి తుదకు నిర్దయాత్ముఁడయిన మహమ్మదీయచక్రవర్తికి కప్పగింపవలసి వచ్చెనని విచారము నొంద గుడారమునకువచ్చి యతఁడావార్త దనయింతికిని హేమలతకును దెలియఁజేసెను. హేమలత యవ్వచనము లాలకించి సకలదీనులకును న్యాయమొసఁగి స్త్రీలఁ జెఱఁబెట్టుదురాత్ముల శిక్షింపవలసిన చక్రవర్తియే స్త్రీలఁ జెఱుపఁదలంచినపుడు తనమర్యాద నిల్పుట దుర్ఘటమని నిశ్చయముగ నమ్మికొని దైవముపై భారమువైచి యెంతెంతవారి నాశ్రయించిన నెన్నిదినములకును దనకష్టముల కంతము సంభవింపదయ్యెనని యారాత్రియెల్ల విచారించుచుండెను.

పదునేడవ ప్రకరణము.

హా దైవమా నన్నింత దిక్కుమాలినదానిగ నేలఁ జేసితివి. పవిత్రమగునట్టియు గౌరవము గలిగినట్టియు, రాజపుత్రవంశమునఁ బుట్టి తుదకు నిర్భాగ్యురాలనయి శివప్రసాదుపంచను గొన్నినాళ్ళను, జంద్రసేనునియింటఁ గొన్నినాళ్ళను వసియించి మహమ్మదీయుల బారిఁబడుచున్నాను. నాకేల మరణముఁగలుగఁ జేయవు? హా తాతా ఎందున్నావు? అమ్మా తల్లీ! నాబాల్యమునందె నీవు మృతినొందుట చేతగద నాకిట్టి యవస్థ సంభవించినది. కడుపులోనున్న దుఃఖము నెల్లఁ దెలుపుకొందమన్న నిరుపార్శ్వముల బంధువులైన లేరు. నేనేమి చేయుదును. మరణమే నాకు శరణమగుఁగాక! బలవంతముగఁ జక్రవర్తిచే నవమానింపఁ బడుటకంటె మర్యాదగ మృతినొందుట మేలుగద" అని తనలోఁ భావనసుకొనుచున్న హేమలతవద్దకుఁ జంద్రసేనుఁడు వచ్చి యామె గౌరవమును గాపాడలేకుండి నందులకు విచారించుచు 'అమ్మా! యీదినమున

నిన్ను దప్పక తీసికొనిరావలసినదని చక్రవర్తి మరల నాకు వర్తమానము నంపినాఁడు. ఈమాట నీతోఁ జెప్పఁజాలక నేను సందేహించుచున్నాను. ఏమి చేయుటకును దోఁచదు. అయినను నాప్రాణముల నీనిమిత్తము పోగొట్టుకొందును. నామరణానంతమునఁగాని నీకుఁ బరాభవము సంభవింపదు. భయపడకుము.' అని పలుక హేమలత యామాటలువిని "నానిమిత్తము మీరు మృతినొందవలదు. నాకవమానము ఘటిల్లిన పక్షమున నాచేతనున్న వజ్రమును నూరుకొని త్రాగుటకు సిద్ధముగనున్నాను. నావజ్రంపుటుంగరమె నాయవమానమును బాపనోపును. ఆచెఱలో నీవఱకు మృతినొందియున్న మాతాతను సత్వరమె నేను గలిసికొందును." అని యాత్మహత్యకు సిద్ధముగనున్న సుందరాంగికిఁ బ్రత్యుత్తర మీయఁజాలక "మరల నొకపర్యాయము నీవిషయమై ప్రయత్నించెద" నని చంద్రసేనుఁడు కన్నీళ్ళతో వెడలిపోయెను. హేమలత ప్రతిక్షణమును దనకొఱకుఁ బల్లకి వచ్చునని యెంచుచు మృత్యుదేవతరాక కెదురుచూచుచుండెను.

ఆదిన ముదయమైనది మొదలు రహిమానుఖాను మదనసింగును దుదముట్టించు మహోత్సవము గలుగునని మహానందముతో నుండెను. హేమలత తన సంయోగమునకు సమ్మతింపనందున నామెపైఁ గసిఁ దీర్చుకొనఁదలంచి చక్రవర్తి కామె నెఱింగించెను. ఆకారణముచే నతఁడు రెండురెట్లు సంతోషముగ నుండెననుటకు సందేహము లేదు. జాముప్రొద్దెక్కిన తరువాత మదనసింగును బూర్వోక్తప్రకారముగ వధింపవలసినదని చక్రవర్తివద్దనుండి ఖానున కుత్తరువు వచ్చెను. వెంటనే ఖాను మిగుల నెఱ్ఱఁగఁగాలిన యినుపకఱ్ఱలను బట్టించుకొని యిరువురు సేవకులతో మదనసింగు వసించు గుడారమునకుఁ బోయి మదనసింగునుజూచి మరణమునకు సిద్ధముగ నుండుమని చెప్ప ఖానుతో నతఁడు దనకు మృత్యువు తృణప్రాయమనియుఁ దాను సిద్ధముగ నుండెననియు

ధైర్యగాంభీర్యములతోఁ బలికెను. అంతట ఖాను కోపమునఁ బండ్లు పటపటఁగొఱుకుచు నినుపకట్లను మదనసింగుకన్నులపైఁ బెట్టి కాల్పుఁడని సేవకుల కానతిచ్చెను. సేవకులును నరహత్యలయందారితేఱిన వారగుటచే యజమానునియాజ్ఞ తక్షణమే శిరసావహించి కాలినయినుపకట్లలనెత్తిపట్టుకొని మదనసింగు సమీపమునకరిగిరి. వెంటనేనందుఁడు సింగును వెనుకకుఁ బడద్రోయఁ దక్షణమే యిరువురు సేవకులు మదనసింగు రెండుచేతుల నొకత్రాటఁటవిరిచికట్టి పాదముల బొటనవ్రేళ్ళనుగూడ బంధించిరి. అప్పుడు మదనసింగుఁ మనస్సున నీశ్వరధ్యాన మొనర్చుచుండెను. "ఇపుడైనఁజక్రవర్తి మాటవిందువేని నిన్నురక్షించెదను. అట్లు చేసెదవా?" యని రహిమానుఖా నడుగ నిర్భయముగ నతఁడు "నేనట్లుచేయను. నీయిష్టము వచ్చినట్లు చేయుము." అని యుత్తర మిచ్చెను. అపుడు వారినుపకట్లలను గనులదగ్గఱకుఁ దెచ్చునప్పటికి వెనుకనుండి యొకసేవకుఁ డఱచుచు వచ్చి "నిలువుఁడు, నిలువుఁడు చంపవద్దని కేకవేసెను. ఆమాటలువిని రహిమానుఖాను తిరిగిచూచి యామనుష్యుఁ డెవ్వఁడని యరయుచుండ నతఁడు సాహెబుతో వధనాపవలసినదనియుఁ జక్రవర్తి ఖానును రమ్మనెననియుఁ జెప్పెను. ఆఘోరకృత్యము నాపి ఖాను మదనసింగు బంధములను విప్పించి చక్రవర్తిగుడారమున కరిగెను. చక్రవర్తియెదుట రసపుత్రుఁడొకఁడు కూర్చుండెను. ఖానును జూచినతోడనే చక్రవర్తి రసపుత్రునివంకఁ దిరిగి రాయబారమును విశదీకరింపుమని కోరెను. రాయబారములు నడుపుటయందు మిగుల నేర్పుగల దుర్గసింగు చక్రవర్తితో నిట్లనియెను. 'అయ్యా! మారాణయును శ్రీపద్మినీదేవియు విన్నవింపుమన్న సంగతులను నేను మీతో మనవిచేయుచున్నాను. భీమసింగుగారిని మదనసింగునుమీరు చెఱనుండివిడిపింతురేని పద్మినీదేవి మీభార్యయైయుండుట కొప్పుకొన్నది. భర్తప్రాణరక్షణమునకుఁ దనకాయమునైన నర్పింపఁదలఁచి పద్మిని

మీసాంగత్యమునకు సమ్మతించినది.’ అనిదుర్గసింగు విన్నవింపఁజక్రవర్తి యమితానందపరవశుఁడై యఱచి పీఠమునుండి లేచి రహిమానుఖానుని గౌఁగిలించుకొని దుర్గసింగును మెచ్చుకొనెను. అంతట దుర్గసింగు మరల “ఆపద్మినితోఁగూడ నానగరమునందుఁగల గొప్పస్త్రీలందఱు నిటకువచ్చి సాగనంపెదరు. వా రేడువందలకంటె నెక్కువగనున్నారు. అందఱుఁ బల్లకులలో నెక్కివత్తురు. వారు ఘోషాస్త్రీలు కాఁబట్టి వారికి ప్రత్యేకముగ నొక గుడారమునిచ్చి మహమ్మదీయుల దృష్టిఁబడకుండ మీరు జాగ్రత్తపెట్టవలెను.” అనవుఁడు జక్రవర్తి “సందేహమెందుకు? మిగుల జాగ్రత్తపెట్టెదను. త్వరగారమ్మను త్వరగారమ్మను. పో. పో” యని కేకలు వేయసాగెను. ఇట్లు చెప్పి దుర్గసింగు చక్రవర్తిని వీడుకొనిపోవునపుడు చక్రవర్తి రసపుత్రునకుఁ దనకంఠముననున్న రత్నముల హారమును బహుమానముగ నొసఁగెను. ఆరాజపుత్రుఁ డరిగినది మొదలు చక్రవర్తికిఁ బద్మినిపై ధ్యానమెక్కువగుటచే నతఁడు తీవ్రముగ మదనాగ్ని పాలయ్యెను. ఒకమాఱు సంతోషముచే వెఱ్ఱివానివలె నఱచుచు, నొకపర్యాయము సేవకులకు బహుమానము లిచ్చుచు, నొకమాఱు తోఁచక గుఱ్ఱముపై సవారుఁజేయుచు మదనావస్థనొందుచుండెను. పద్మినీప్రముఖులగు రాజపుత్రసుందరు లబలలగుటచే నాయుధపాణులగు భటులను జూచి భయపడుదురని చక్రవర్తి నిరాయుధులై యుండునట్లు సైనికుల కానతిచ్చెను. వారును నాయుధములను వదలి భంగు నిషాచేయ హాయిగనిద్రపోవుచుండిరి. మదనపీడితుఁడగు నతనికి నెంతసేపటికిఁ బ్రొద్దుపోనందునఁ దనఖాజీని రహిమానుఖానును రప్పించి వారితోఁ గొంతసేపు దనకు రాఁబోవు నూతనభార్యనుగూర్చి పరిపరివిధముల ముచ్చటించుచుండెను. అట్లు కొంతసేపు ముచ్చటించి తనపెండ్లి నిశ్చయమని యెంచి తాను శయనించు మందిరమును జక్కఁగ నలంకరింప నాజ్ఞాపించి యమూల్యవస్త్రాభరణములను ధరించెను. దుర్గసింగు

దెచ్చినరాయబారమును వినుచుండుటచేఁ జక్రవర్తి హేమలతమాట మఱచి మధ్యాహ్నము చంద్రసేనులకు వర్తమానము నంపఁడయ్యెను. సాయంకాలమునఁ జంద్రసేనుఁడే ప్రభుదర్శనమునకు వచ్చి పద్మినిరాకను జక్రవర్తిముఖమున విని యిదియె హేమలత నపాయమునుండి రక్షించుట కద నని యెంచి చక్రవర్తితో నిట్లనియె. "మహాప్రభూ! హేమలతను దీసికొనివత్తునా? వద్దా? ఆమె మీయొద్ద నుండినయెడలఁ మీ కొక కష్టము సంభవించును హేమలతయుఁ బద్మినియు సవతులై యుండుటకు మహారాజపత్నియగు పద్మిని యొల్లదు. ఆమె యిందు కాగ్రహముఁ దెచ్చుకొని మరలిపోవునేమోయని నాకు భయమగుచున్నది." అని చంద్రసేనుఁడనఁ జక్రవర్తి హేమలత తన కావశ్యకము లేదని వాక్రుచ్చెను. వ్యాఘ్రముఖమునుండి బయలువెడలిన కురంగమట్లు చంద్రసేనుఁడు సంతోషించుచుఁ బ్రభువునొద్ద సెలవు గైకొనిపోయి యావార్త హేమలతకును దన భార్యకును దెలిపి వారితోఁగూడ నానంద మొందుచుండెను. సాయంకాలమగుట తోడనే చక్రవర్తి మధురాహారములు భుజించి యభ్యంగన మొనర్చి పద్మినిరాకను నిరీక్షించుచుండెను. వచ్చెడు స్త్రీజనంబున కెల్ల నొక పెద్దగుడారము వేయబడియుండుటచే వారు ఘోషాతో లోపలి కరుగుటకు వీలేర్పడెను. ఈమహాట్టహాసమునువిని పద్మినిసాహసమునకును రాజపుత్రులయవినీతికిని రాజస్థానముయొక్క దురవస్థకును మదనసింగు భీమసింగులద్భుతపడుచుండిరి. పతివ్రతయగుపద్మిని మ్లేచ్ఛరాజసంభోగమున కియ్యకొనుటకుఁ గారణ ముండకపోదని చంద్రసేనాదులును, నాజరుజంగును నాలోచించిరి. నాజరుజంగుపైఁ జక్రవర్తికి రహిమానుఖాను చెప్పెడు మాటలవలనఁ గోపము నానాఁటి కధికమగుటచేఁ గనబడినచోట మాటలాడుటయును నతఁడు మానెను. నాజరుజంగు మహావిచారముతోఁ దనరాజభక్తిని జూపుసమయ మెపుడు వచ్చునాయని దేవునిఁ

ప్రార్థించుచుండెను. ఆసాయంకాలమున సూర్యాస్తమయ మైనతరువాతఁ జిత్తూరుకోటలోనుండి యొక్కవరుసగఁ దురుష్కశిబిరమునకు నేడువందల పల్లకులు రాసాగెను. పల్లకికి నల్వురు బోయలుండిరి. కోటమొదలు శత్రువుల స్కంధావారముదాఁక నేకపంక్తిగ నున్న పల్లకులను మోయుబోయల యోంకార నాదములవలన మహమ్మదీయుల కర్ణపుటములు పగులుచుండెను. శిబిరమున నొకచోట నాలుగుప్రక్కలను డేరలఁగట్టించి చక్రవర్తి స్త్రీలపల్లకులను నాస్థలమునకుఁ దీసికొని పొండని బోయల కాజ్ఞాపించెను. లోపల కరిగిన మనుష్యులు తురకల కగపడకుండఁ దమఘోషా నిలుపుకొనిరి. శత్రుసైన్యము పల్లకులవంకఁ జూచుచు నశ్రద్ధతో నిరాయుధులై యుండిరి. ఆపల్లకులలో బంగరపుఁ బనిచేసిన పల్లకియందుఁ బద్మిని కూర్చుండెనని చక్రవర్తితో బోయలు చెప్పిరి.

పదునెనిమిదవ ప్రకరణము.

పల్లకులెల్ల నియమితప్రదేశమున కరిగిన తరువాత వానితోఁ గూడ వచ్చిన దుర్గసింగు చక్రవర్తియొద్దకుఁ జని యిట్లనియె. 'అయ్యా! పద్మినీదేవి యింక మీపట్టపుదేవి యగును. కాఁబట్టి శాశ్వత వియోగము సంభవించుచుండుటచేఁ దనభర్తతో నొకమాఱు కడసారి మాటలాడఁగోరుచున్నది. అందుచే నొకగడియ సెలవుదయచేయింపవలెను" అని పలుకుటయుఁ జక్రవర్తి సరేయని సెలవొసఁగెను. పిమ్మట పద్మినిపల్లకి భీమసింగు గుడారమునకుఁ గొనిపోఁబడ వారిరువురు నొకగడియవఱకును మాట్లాడుచుండిరి. కామాతురుఁడైన యల్లాయుద్దీను నిమిషమైనను వియోగమున కోర్వలేక పద్మినితో సత్వరముగా సంభాషింపఁదలఁచియు, భీమసింగును విడువక ఢిల్లీనగరమునకుఁ బంపె

గాఁ గొనిపోవఁ దలఁచియు, రహిమానుఖానును బిలిచి యాదంపతుల ను బట్టుకొమ్మని యానతిచ్చెను. రహిమానుఖాను నిజసైన్యముతో నచటి కరుగునప్పటికి రాజపుత్రస్త్రీలుండు మందిరమునుండి యొకపల్లకి వారి కెదురుగ వచ్చెను. పల్లకివెంట నాయుధపాణులగు రసపుత్రులనే కులుండి యందున్నవారిని రక్షించుచుండిరి. ఎదురుగ వచ్చినవారి ప్రయాణమును నివారించుటకు మ్లేచ్ఛభటులు ప్రయత్నించిరి. కాని రసపుత్రులు నిలువనందున వారలకిరుపురకును సంకులయుద్ధముఁ జరుగసా గెను. అంతలో భీమసింగు పారిపోవుచున్నాఁడని మహాధ్వని యొకటి శిబిరమున వ్యాపింప రహిమానుఖాను మోస మేమో సంభవించినదని తెలిసికొని ప్రాణభయమగు నని యెంచి వడివడిఁ జక్రవర్తివద్దకుఁ బరుగెత్తి విచారముతో "స్వామీ! మోసము మోసము జరిగి నది." అని యఱచెను. అల్లాయుద్దీ నులికిపడి లేచి యది యెట్టిదని యడుగ ఖాను తొందరతో నిట్లు చెప్పెను. "మహాప్రభూ! పల్లకు లలోఁ గూర్చుండి వచ్చినవారు స్త్రీలుకారు. ఒక్కొక్క పల్లకియం దొకరసపుత్రశూరుఁడు కూర్చుండెను. పల్లకులమోయువారందఱు రస పుత్రశిపాయిలెగాని బోయలు కారు. వారు బోయలవేషములఁ దా ల్చి పల్లకులలో నాయుధములఁ దెచ్చుకొన్నారు మనసైనికు లశ్రద్ధగ నున్నందున మన మీదినమున నోడిపోదుము. భీమసింగు పల్లకిలోఁగూ ర్చుండి కోటకుఁ బాఱిపోవుచున్నాఁడు. నేనాతని నాపఁజాలనైతిని" అని ఖాను విన్నవించుచుండఁ జక్రవర్తి నిశ్చేష్టితుఁడై కొంతసేపటి కొడ లెఱిఁగి రాజపుత్రులు త్రవ్విన మహావిపత్సముద్రమునఁబడి తానును దన సైనికులును మృతినొందవలసి వచ్చెనని చింతించి ధైర్యమును దె చ్చుకొని "అమాలాఅల్లీ! హా మహమ్మద్! హా హస్సేన్! హుస్సే న్! అరే నాజరుజంగు! అరే అరే అల్లా, అల్లా, అల్లా, అయ్యో! పరుగెత్తి భీమసింగును దఱిమి పట్టుకొనిరండు. అయ్యో పద్మినీ పద్మినీ

పట్టుకొండు. సిపాయిలులేచి యుద్ధసన్నద్ధులు గండు. ఓయీ! యిబ్రహీం, ఓయీ! జహందరు, లెండి లెండి, అరే జోహారుల్లా త్వరపడు. అని యఱవఁజొచ్చెను. ఈలోన మునుపటి స్థలమున దాఁగియున్న రాజపుత్రశూరులు భటసమేతముగ నాలుగువేల తొమ్మిదివందలమందియు నొక్కసారిగ హుమ్మనివచ్చి యశ్రద్ధగనున్న మ్లేచ్ఛసైన్యమును దాఁకిరి. అతిత్వరితముగ లేచి మహమ్మదీయ సైనికులు తమతమయాయుధముల ధరించి రసపుత్రుల నెదుర్కొన నుభయసైన్యములకును ఘోరయుద్ధము జరిగెను. ఈయాకస్మిక మహాయుద్ధములో మహమ్మదీయులు స్వసైన్య పరసైన్య భేద మెఱుఁగఁజాలక తమవారిని సహిత మాచీఁకటిలో పొడుచుకొనసాగిరి. ఈలోన సురక్షితముగ నగరమఁజేరి భీమసింగు మూలబలము నెల్లఁ దీసికొని దక్షిణభాగమున మహమ్మదీయ సైన్యమును దాఁకెను. బలవడిన యీ సైన్యమునకు మ్లేచ్ఛులకును జరిగిన మహాయుద్ధము వర్ణనాదుస్సాధ్యమై యుండెను. తమమానప్రాణములకు హాని తటస్థించునని శిబిరమునందున్న స్త్రీలాక్రందనధ్వనిఁ జేయ యుద్ధమునూని కొందఱుసైనికులు దారపుత్రాదుల సంరక్షణకై వెనుకకుఁ బరుగులిడుచుండిరి. కొబ్బరిపుచ్చెలవలె దెబ్బదెబ్బకు నెగిరిపడుచున్న మనుష్యుల పుఱ్ఱెలును స్రవించురక్తముతో నేల గుభాలునఁ బడు మొండెములును దళతళ మెఱయు యోధుల మాయుధఁబులును దక్క మరియేమియు నచ్చట గనఁబడుటలేదు. రసపుత్రులును మహమ్మదీయులును హతులయిన తమబంధుమిత్ర కళేబరములమీఁదనుండి నిర్దయాత్ములై నడచిపోవుచు యుద్ధము నొనర్చుచుండిరి. పడినవారితోడను పడెడువారితోడను, గాయములచే బాధపడి యేడ్చువారితోడను, దేహమును విడుచునెడ నీశ్వర స్మరణము జేయువారితోడను వెన్నిచ్చి పరుగెత్తువారితోడను, యుద్ధభూమి నిండియుండెను. ఈమధ్య మహాశూరుఁడగు ప్రతాపసింగు భీమసింగును

విడిచి చక్రవర్తిని జెఱఁబెట్ట నుద్యమించి నాలుగువందల సైనికులను దోడుకొని యలాయుద్దీను గుడారముపై నరిగెను. చక్రవర్తి మీఁదికి రాజపుత్రు లరుగుటఁ జూచి స్వామీ ప్రాణరక్షణ మవశ్యము కర్తవ్యమని మహమ్మదీయులెల్ల వడి వడిఁ బ్రతాపసింగు నాఁపుటకు వ్యాఘ్రములవలె రోషావేశపరవశులై చని ప్రతాపసింగును దాఁకిరి. ప్రతాపసింగు మధ్యాహ్న సూర్యునివలె దుర్నిరీక్ష్యప్రతాపుఁడై మహమ్మదీయభటులకు భీతి గొలుపుచుండెను. మహమ్మదీయులు రసపుత్రులమీఁదికి వచ్చుటయుఁ జచ్చుటయు నేకకాలమున సంభవించెను. ఎందఱుతురకలను రసపుత్రులు చంపినను తురకలసేన యధికమగుటచే మరల యథాప్రకారముగ సైనికులు ముందుకుఁ జనుచుండిరి. తుదకుఁ జీమలపుట్టవలె మోటతురకలు చుట్టుముట్టుటచే స్వల్పసంఖ్యగల రాజపుత్రులు క్రమక్రమమున క్షీణించిరి. ఏమిచిత్రమోగాని రాజపుత్ర సైనికులలో నొక్కఁడైనను రణరంగము విడిచి పరుగెత్తఁడయ్యె. కంఠమునఁ బ్రాణమున్నంతవఱకును రసపుత్రులు ఖడ్గమును విడువక యుద్ధము జేసిరిగాని శత్రువుని చేతికిఁ గత్తి నీయరైరి. ఇట్లు సైన్యము పలుచబడినందునఁ బ్రతాపసింగు ఖడ్గమును డాలును బూని యకాలమృత్యుదేవతవలె తురకలపైఁబడి యనేకులను డెగనఱక నాతని ధాటికివెఱచి ముందఱివారు చెల్లాచెదరై పరుగులిడిరి. తరువాత నలువది యోధులతో రణరంగమున నిలిచియున్న ప్రతాపసింగుపై వెనుకనున్న తురకలు గవిసిరి. ప్రతాపసింగు దేహమంతయు గాయములతో నిండి చిమ్మన గొట్టములనుండివచ్చు వసంతమట్లు గాయములనుండి రక్తముస్రవించి చుట్టుప్రక్కలనున్న వారిపైఁ బడుచుండెను. రక్తక్షయముచే బలక్షయమగుటయు, సింగు నడుమనడుమ సొమ్మసిలుచు దెబ్బదెబ్బకు నొక్కొక్క తురకను గూల్చుచుండెను. ఆవేళఁ బ్రతాపసింగుచే నిహతులయినవారె దాదాపుగ నూరుమంది యుండిరి. బల

హీనుఁడై యున్న ప్రతాపసింగుమీఁదికి రహిమానుఖాను వడివడి వచ్చి తాఁక, సింగు గుఱ్ఱముమీఁదనున్న ఖానును దిగలాగి తనఖడ్గ మాతని పై నెత్తెను. అప్పుడు మ్లేచ్ఛసేనాధిపతియగు రహిమానుఖాను ప్రతాపసింగు పాదములపైఁ బడి "నేను నీబిడ్డవంటివాఁడను నన్ను జంపినను మీయింటి కుక్కను జంపఁ జూచినను నొకటే. బాబూ! నాకుఁ బ్రాణదానముఁ జేయుము. నాతల్లికి నే నొక్కండనే కుమారుఁడను నాకు బిడ్డలుపుట్టిన మీపేరు పెట్టెదను నన్ను వదలిపెట్టు మహాప్రభూ! నన్ను వదలిపెట్టినయెడల మాచక్రవర్తియున్న రహస్యస్థలమును మీకుఁ జూపెదను. అతనిని మీరుచంపి మీకసిఁ దీర్చుకొనవచ్చును, గాని నావంటి దిక్కుమాలిన వానినిఁ జంపిన నేమిప్రయోజనము" అని వీరపురుషలక్షణముల విడిచి పరిపరిభంగుల వేఁడుకొన జాలిగుండెగల ప్రతాపసింగు వానిని విడిచిపుచ్చెను. రహిమాను గండము నుండి బయలువడి మఱియితరయోధులకు కనఁబడకుండఁ గొంతసేపు చచ్చిన యొకయేనుఁగు చాటున దాఁగుకొని యక్కడనుండి లేచి రాజపుత్రులెక్కివచ్చిన పల్లకులలో నొక దానియందు, రహస్యముగఁ దలఁ దాఁచుకొనెను. అదివఱకు చెఱలోనుండిన మదనసింగు మహమ్మదీయుల కలవలము చూచి చక్రవర్తి తన్ను విడిపింపఁడని యెఱిఁగి యాతనిచే మోసపోకముందే మేలుకొని తనగుడారమునుండి వెడలివచ్చి రసపుత్రవీరులను గలిసికొనెను. భీమసింగు వానినిఁ గనుఁగొని కొంతసైన్యమాతనికిచ్చి ప్రతాపసింగునకు సహాయమొనర్పుమని యంప నాతఁడును సత్వరముగఁ జక్రవర్తి గుడారమువంక వచ్చి ప్రాణావశిష్టుఁడై యప్పటికిని దనప్రాణరక్షణ మొనర్చుకొనుచున్న పినతండ్రిని జూచెను. మదనసింగు పినతండ్రియవస్థను గనుఁగొని యతని శరీరమును బరీక్షించునప్పటికిఁ ప్రతాపుని దేహమున ముప్పదిరెండు పెద్దగాయములును నెనిమిది చిన్నగాయములు నుండెను. మదనసింగుపినతండ్రితో, 'అయ్యో!

మీరుమనశిబిరమున కరుగుఁడు మీరింక యుద్ధ మొనర్పలేరు. వ్రణవైద్యులచే గాయములకుఁ గట్టుకట్టింపుఁడు" అని చెప్పవ్రతాపుఁడు "నాయనా! రణమునుండి యింటికి మరణభయమున నీవఱకు నే నరుగలేదు. నే నింకఁ బోఁజాలను. రక్తవర్షముచేఁ దడిసిన యీమంటిపరుపుపైఁ బండుకొనియెద. నీవుచక్రవర్తిమీఁద కరిగి వానిని బట్టుము. లేకున్న వధింపుము. నానిమిత్తమై విచారింపకుము" అని పలుక మదనసింగు విచారముతోఁ బినతండ్రిప్రాణముల కాశ వదలుకొని చక్రవర్తిమీఁది కరిగెను. చక్రవర్తి యంగరక్షక సైన్యములతోనొక చిన్నగుడారమునుండి సైన్యము పలాయన మగుటకును, రాజపుత్రులుచేసిన యుక్తికిని విచారించుచుఁ బ్రాణసంరక్షణ మొనర్చుకొనుచుండెను. మదనసింగును జూచి యంగరక్షకులు నిశ్చేష్టితులుగా నతఁడు శత్రుమధ్యముననుఱికి యాకస్మికముగ సింగంపుఁగొదమవలెఁ జక్రవర్తియెదుట నిలిచి యాయుధ మెత్తులోనఁ జక్రవర్తి సమీపమున నున్న నాజరుజంగు వారి రువురకును నడుమవచ్చినిలిచి ఖడ్గమును ద్రిప్పుచు నాతనిఁ దాకెను. నాజరుజంగు సమయమునకు రాకుండినఁ జక్రవర్తి యాదినమునఁ బరలోకవాసియై యుండును. చక్రవర్తి మదనసింకునుజూచి నిర్విణ్ణుఁడై చేష్టలుదక్కి కదలి పాఱిపోఁజాలఁ డయ్యెను. అప్పుడు నాజరుజంగు మదనసింగుతో నిట్లనియె. "మిత్రుఁడా! నాఁటికి నేఁడు నీదర్శనమైనదని నే నూరుకొనను నాప్రాణము లుండి నంతవఱకును నీవు చక్రవర్తినై పరుగఁజాలవు. అక్కడనే నిలువుము. ఒక్కడుగు దాఁటివచ్చితివా నీప్రాణములు నీకుఁ దక్కవు. మాస్వామి ప్రాణరక్షణముకంటె నారక్షణ మెక్కువకాదు" అని శౌర్యరస మొలుక రాజభక్తిప్రపూరములగు మాటలతో మదనసింగును నిలుప నతఁ డాశ్చర్యపడి "చక్రవర్తి యదృష్టవంతుఁ డగుటచే నీవాతనికి నేఁ డడ్డమువచ్చినావు. నీతో యుద్ధముచేసి గెలిచి చక్రవర్తిని బరిమార్చెదను" అని పలికి యాతనితో యుద్ధ

మారంభించెను. అట్లిరువురును కొంతసేపుయుద్ధమును సలిపి యెవ్వరును గెలువనందున విసుగుచుండిరి. అంతలో యుద్ధ మాపివేయుమని భీమసింగు త్తరువుఁజేయ మదనసింగు మరలెను. ఆదినమున రాజపుత్రవీరులనేకులు మృతినొందినను తుదకు మహమ్మదీయులు చెల్లాచెదరై నానాముఖములకుఁ బాఱిపోయిరి. ఈసమయమున చిదానందయోగి కాగడాలను వేయించుకొనివచ్చి నూరుగురుభటులతో రంగస్థలముఁ జొచ్చి తురకల గడ్డములను దివిటీలతోఁ గాల్చుచు వారివస్త్రములను శరీరములను దహన మొనర్చుచుఁ జిత్రవిచిత్రముగ వారినిఁ జంప నారంభించెను. మహమ్మదీయు లప్పటికి నిశ్శేషముగ నోడింపఁబడిరి. సరదారులు చచ్చిన గుఱ్ఱము లొకవైపురుగ నేనుఁగులు మఱియొకవంకకుఁ జనసాగెను. స్త్రీలార్తనాదములతో నటునిటుఁ బరువులిడ మ్లేచ్ఛసైన్యమున గలవలమును బాధయు నధికమయ్యెను. ఎచటఁ జూచినఁ బీనుఁగులు, నెచటఁ గనుఁగొన్న రక్తప్రవాహములు, నెందు నడిచిన నెముకలు, నేమివిన్న నార్తధ్వనులు, నయ్యెను. అట్లున్న రంగస్థలమున మృత్యుదేవత విచ్చలవిడిగ సంచరించుచున్నట్లు మహాభయంకరమై యుండెను. రాత్రి రెండుజాములకు సైనికులు శిబిరమును విడిచి పాఱిరి. రసపుత్రులు తెల్లవారువఱకు నుండిరి.

పందొమ్మిదవ ప్రకరణము.

ఇట్లు సమస్తసైన్యమును శత్రువులచే వధింపఁబడుటయుఁ దనకపారకష్టము సంభవించుటయుఁ బద్మినీదేవి చేకూరకుండుటయుఁ జూచి చక్రవర్తి రణరంగమువిడిచి సత్వరముగ భద్రగజముపై నెక్కి తన కాపత్కాలమునఁ సహాయ మొనర్చిన నాజరుజంగును వేనోళ్ళ నుతియించుచు నాతనిఁగూడ నేనుఁగుపై నెక్కించుకొని దీనుఁడయి ఢిల్లీనగరమునకుఁ

బ్రియాణమయ్యెను. శిబిరము ననుసరించివచ్చిన స్త్రీజన మెల్ల నాక్రిందనధ్వనులతోఁ బరుగెత్త నారంభించినపుడు వారివారి భర్తలు వారికి సహాయముగఁ బోయి వారికపాయము వాటిల్ల కుండఁగఁజేసిరి. చంద్రసేనుఁడు యుద్ధము జరుగుచున్నంతవఱకును రంగస్థలమును బాసి చనక చక్రవర్తిసైన్యములు పఱచిన వెనుక జయాశవీడి శిబిరమునకుఁ జని భార్యను గనుఁగొని హేమలతతోఁగూడఁ బ్రియాణమై వెడలుమ ని యానతిచ్చెను. హేమలత వారిగుడారమున లేదని భార్య యెఱిఁగింపఁ గొంతసేపు చంద్రసేనుఁడు బాలికకొఱకు వెదకి యామెను గనలేక తుదకు విసిగి హేమలతను మహమ్మదీయులో, శత్రువులో యెవరో తీసికొనిపోయియుందురని నిశ్చయించి కొంచెము విచారించి తనరాజు వెంటఁ దా నరిగెను. మదనసింగు పినతండ్రి యవస్థయెట్లున్నదో య ని త్వరితగతి నావంకకు వచ్చెనుగాని యానడుమనే భీమసింగు ప్రతాపసింగునిమిత్తము మనుష్యుల నంపి వెతకి యాతనిఁ దోడ్కొనిరమ్మని వారి కానతిచ్చినందున గాయమునిండ గాయములతో నున్న యమ్మహాశూరశిఖామణిని వారు భీమసింగుగారిదగ్గఱకుఁ దీసికొనివచ్చిరి. భీమసింగును వారిస్థితినిబట్టి యతఁడు జీవించుట దుర్ఘటమని యెంచినను బ్రాణము లున్నంతవఱకు మనుష్యప్రయత్నముల మానుటయనుచితమగుటచే వ్రణవైద్యుని కాతని నప్పగించి, తమమందిరమునకుఁ గొనిపోవ నియమించెను. పినతండ్రి భీమసింగువద్ద సురక్షితుఁడై యున్న వార్త మదనసింగు విని గాయములు తగిలి ప్రాణములతో యుద్ధభూమిని బడియున్న తనయాప్తులగు రసపుత్రుల కౌషధ మిప్పించి బ్రతికింపఁదలఁచి కొందఱు రాజపుత్రులతో యుద్ధభూమిని సంచరించుచుండెను. రహిమానుఖాను ప్రాణభీతిచే ఖడ్గమును దాఁచి యంతఃపురస్త్రీవలె నొకపల్లకిలో యుద్ధముముగియువఱకుఁ గూర్చుండి తనసైన్యమును శత్రుసైన్యమును యుద్ధభూమిని విడిచినతరువాతఁ బల్లకితలుపులు

తెఱచి బైటకువచ్చి మెల్లఁగా నడచుచుండెను. అతఁ డట్లు పోవుచుండ నతని యదృష్టహీనతచే మార్గమున మదనసిం గెదురుపడెను. అతనిఁ జూచినతోడనే ఖానుసాహేబుగారు మీఁదిప్రాణముల మీఁదనెపోవ జీవచ్ఛవమువలె నిలువఁబడి తనకు మరణమతనిచేఁ దప్పదని శూరుని చావుఁజచ్చుట కిష్టముగలుగ ఖడ్గమును జేతఁబట్టుకొని మదనసింగుపైఁబడ నరిగెను. మదనసింగతని యేటుఁ దప్పించుకొని మ్లేచ్ఛసేనానాయకుఁ డుక్కుదక్క నేల వ్రాలునట్లొక దెబ్బకొట్టెను. బాటసారులను దోపించిన పాతకమును స్త్రీలను జెఱఁబెట్టిన దోషమును నిరపరాధులపైఁ జక్రవర్తి కాగ్రహముఁ గలిగించిన క్రౌర్యమును వాని కాసమయమున జ్ఞప్తికిరా నతఁడు మనఃక్లేశము నొంది తుదకు మహమ్మదువారిని సర్వేశ్వరుఁడైన యల్లాను దలఁచుకొని మక్కావైపు మొగముఁద్రిప్పి ప్రాణము విడిచెను. తనమిత్రులకు మందుమాకు లిప్పించి తగినవారి నుపచారమునకు నియమించి మదనసింగు ప్రొద్దుఁజూచి రెండుజాములైనదని తెలిసికొని గృహాభిముఖుఁడై యరుగుచుండ నతనివెనుక నొక మనుష్యవిగ్రహము వచ్చి వీపుపైఁ జేయివైచి యాకస్మికముగ నతనిని నాపెను. మదనసిం గులికిపడి తిరిగిచూచి తనయెదుటఁ బదునాఱువత్సరముల ప్రాయముగల యొక బాలకునిఁ జూచి యాశ్చర్యపడి నీ వెవ్వఁడ వని యడిగెను. "నాపేరుకుమారసింగు; నేనురాజపుత్రుఁడను" అని యాతఁ డుత్తరమిచ్చెను. అంతట వారిట్లు మాటాడిరి.

మద—నీ వీరాత్రి యెందుండి యిటువచ్చుచున్నావు? నీచరిత్రమును గొంతచెప్పుము.

కుమా—అయ్యా! నే నీవఱకు చక్రవర్తికొలువున నుంటిని. పాలిగ్రామమున నున్న నారాయణసింగు మాతాత, హేమలత నాచెల్లెలు; మేము చాలకాలముక్రిందట వియోగము నొందినాము. మాతండ్రి నాచిన్నతనమునందె మృతినొందెను.

మద—అహాహా! నీమాట లాశ్చర్యమును గల్గించుచున్నవి. హేమలతకు నన్నయుండుట నేనిప్పుడు విన్నాను. ఆహా! నీమొగ మచ్చముగ నామె మొగమువలెనే యున్నది. హేమలత యిప్పు డెందున్నది? ఆమెనుజూచి చాలకాలమైనది. మీతాతయేమయ్యెను.

కుమా—మా హేమలతా? ఆమెయునీశిబిరముతో వచ్చినది కాని యీయల్లరిలో నెటకో పోయియుండును. ఆమెదొరకుట దుర్లభమని నాకుఁ దోఁచుచున్నది.

మద—అయ్యో! నా కాసంగతి తెలియదయ్యెను. నేనేమి చేయుదును? నా కామె దొరకుటెట్లు? దైవము నాయెడ నిర్దయుఁడై యున్నాఁడు.

కుమా.—నీ కామెయందం దంతప్రేమ యేల? నీవామెను వివాహమాడెదవా యేమి? నీకామెపై ననురాగమున్నట్టు లామెకు నీపై నుండునా?

మద—నీవాలాగున ననుకొనఁబోకుము. ఆమెకు నాయం దనురాగ మున్నది. ఆమె యెందున్నదో నే నెఱుఁగఁగోరుచున్నాను. దయచేసి నీవు చెప్పుము. ఆమె నిజముగ నీశిబిరముతో వచ్చినదా? అట్లయిన నామెకొఱకు వెదకుదము. నాతోరమ్ము.

అని మదనసింగాత్రముతో నడుగఁ గుమారుసింగు మందహాసముతో "నీవు తొందరపడకుము. తెల్లవారినదాఁక నోపికపట్టుము" అని చెప్పి పాలిగ్రామమున రహిమానుఖాను హేమలతవిషయమున జరిగించిన దౌర్జన్యమును, నారాయణసింగును జెఱసాల కంపుటయు, హేమలత గోసాయిదయవలన కుల్వానగరమున శివప్రసాదునింట నుండుటయు, మాయోపాయమున నామెను రహిమానుఖాను ఢిల్లికిఁ దీసికొనిపోయి బలాత్కరింపఁ జూచుటయుఁ జంద్రసేనుని దయవలన బాధావిముక్తినొంది యామె చక్రవర్తిశిబిరముతో వచ్చుటయు నాదిగాఁ

గల పూర్వవృత్తాంతము నెఱింగించెను. రహిమాను చేసినదౌర్జన్యమును విని సింగు మిగుల విచారమునొందె. హేమలతపై జాలియు ననురాగము నెక్కువకాఁగా నామెను జూపుమని కుమారసింగును వేగిరపెట్టెను. కాని యతఁ డేమియుఁ జెప్పక "నన్ను నీ వేవిషయమునను బ్రశ్నలువేసి బాధఁబెట్టకుము. రేపు నాసంగతిఁ జెప్పి మాచెల్లెలిసంగతిఁగూడ బయలుపఱచెదను" అని పలుక మదనసింగూరకుండెను. అతని మనసున నాందోళన మధికమయ్యెను. వారిరువురును గొంతసేపు నడచి నగరమును సమీపించునప్పటికి వారికిఁజిదానందయోగి కనఁబడెను. యోగినిజూచి కుమారసింగు వినయముతో నమస్కరించి చేతులు జోడించి నిలువ యోగి వాని నాశీర్వదించి యాసవాలుపట్టి తనబసకు రమ్మని బలవంతము జేసెను. కుమారసింగు మదనసింగునొద్ద సెలవుంగైకొని యారాత్రి యోగితోనరిగెను. మదనసింగుమాత్రము కుమారసింగు మాటలయం దర్థమునరయుచు నాతని ముఖవిలాసమునం దొకయాకర్షణ మునుఁగుటచే ధ్యానమగ్నుఁడై పునుంచి యింటి కరిగెను. కుమారసింగారాత్రి చిదానందయోగి మఠమున భుజియించి సుఖముగా నిద్రించెను. మదనసిం గింటి కరుగునప్పటికి గృష్ణసింగు రోదనము జేయుచుఁ బ్రతాపసింగు గాయములచే మరణావశిష్టుఁడై రాజమందిరమున నుండెననియు, సువర్ణాభాయియు నట కరిగెననియుఁ జెప్పి యాతని నటకుఁ బొమ్మనెను. ఆమాటలు విని మదనసింగు దుఃఖభారముచే నడువఁజాలక కన్నీళ్ళు విడుచుచు మెల్లమెల్లగా రాజాంతఃపురముఁబ్రవేశించెను. భీమసింగు, మహారాణాలక్ష్మణసింగు, గోరాసింగు మొదలగువారందఱు మదనసింగున కెదురుగ వచ్చి శత్రుజయమున కాతని బహూకరించి పినతండ్రియొద్దకుఁ దోడ్కొనిపోయిరి. జయసంతోషమును బితృమరణ దుఃఖమును నేక కాలమున సింగుహృదయమున జనియింప నాతఁడు లోపలికరిగి గాయములచే బాధపడుచు

ధైర్యమును విడువని పినతండ్రినిం జూచి దుఃఖమును బట్టఁజాలక యాతనిపైఁబడి యేడ్వ నారంభించెను. సువర్ణాభాయి కుమారుని గాఁగిలించుకొని “నాయనగారు పోవుచున్నారు తండ్రీ” యని రోదన మారంభించెను. అంతట మదనసింగు ప్రతాపసింగు మొగముమీఁద మొగముబెట్టుకొని “కాకా నేను తల్లిదండ్రుల నెఱుఁగను. నీవే నన్ను గారాముతోఁ దండ్రిలేని లోపము కనఁబడకుండఁ బెంచినావు. అయ్యో! నన్ను విడిచి పోయెదవా? నాకెవరుదిక్కు? నేనింక నెట్లు జీవింతును?” అని వాపోవఁ దొడగెను. శౌర్యరాశియగు ప్రతాపసింగు వానిని వారించి “నాయనా! నీవు రాజపుత్రుఁడ వగుదువా కావా! మరణ మెన్నఁడయినఁ దప్పదుగద. నేను వీరపురుషోచితమగు మరణము నొందుచున్నాను. దేశస్వాతంత్ర్యమునకుఁ బోరాడి మృతినొందుచున్న నన్ను గూర్చి సంతోషించుటకు మాఱు దుఃఖించెదవేల? నీవు రాజభక్తిఁగలిగి జాగ్రత్తగ నుండుము” అని యూరార్చి భీమసింగును మహారాణాలక్ష్మణసింగును బిలిచి మదనసింగునుజూపి “అయ్యా! నాకును మాయన్నయగు మాధవసింగునకును నితఁడే కుమారుఁడు. ఈతని మీకుమారునిగ నెంచుకొని లోపములు క్షమియించి రక్షించుకొనుఁడు.” అని చేతిలోఁ జేయివైచి యప్పగించెను. ఇంతలోఁ బ్రతాపసింగున కాయాసముసాఁగా నందఱును “రామ రామ, రామ’ యనుచు హరినామస్మరణ మొనర్చిరి. అప్పుడు భగవద్ధ్యానముతోఁ బ్రతాపసింగు లోకాంతరమున కరిగెను. తరువాత నమితగౌరవముతో నూరేగించి ప్రతాపునకు భీమసింగు దహనసంస్కారములు చేయించెను. మదనసింగు పినతండ్రి కుత్తరక్రియలు చేసి పితృఋణమును దీర్చుకొని పితృవియోగమునకు హేమలతావియోగము తోడ్పడఁ జింతిల్లుచుండ సువర్ణాభాయి మెఱిఁగి కుమారునిజూచి “నాయనా నీవింక వివాహమాడి యిల్లు నిలువఁబెట్టుకొమ్ము. నీమనోనాయకియగు హేమలత

యున్నచో నామెను జేకొనుము" అని పలుక నామాట యమృత సేవనమట్లు మదనసింగున కపారసౌఖ్యమును గలిగించెను. కాని హేమలత యెందును గానరానందున నతఁడు దీర్ఘవిచారమగ్నుఁడయి యానాఁడుదయమునఁ జిదానందయోగి మఠమున కరిగెను. కుమారసింగాతో లినాఁడే మఠమును బాసి చనినట్లు చిదానందయోగి యెఱింగింప మదనసింగు హేమలతజాడలు తెలియనందులకు విచారించుచు నింటికి వచ్చుచుండెను. అపుడు రాజవీథిలో నొక పల్లకి యాతనికంటఁబడెను. ఆపల్లకివెంట వచ్చుచున్న యేఁబదివత్సరముల ప్రాయముగల యొకతురక మదనసింగును గురుతుపట్టి "మదనసింగుగారూ! నిలువుండీ" యని పిలువ నతఁడును నిలిచి చూచి యామనుష్యుని నానవాలుపట్టి పేరు స్మరణకు రానందున జ్ఞప్తికిఁ దెచ్చుకొనుచుండెను. అంతటనాతురక సింగుతో "అయ్యా! మీరు నన్ను గుర్తింపఁజాలరు. నాది పాలిగ్రామము; నాపే రబ్దుల్ ఖరీము వహాలవి. పల్లకిలో నున్నయతఁడు ముసలి నారాయణసింగు. ఇతని మీరాదరింపుడు" అన సంతోషముతోఁ బల్లకి నింటికిఁ దోడ్కొనిపోయి నారాయణసింగును సగౌరవముగ నాదరించి హేమలతకై యాతఁడు వెదుకుట విని చిత్తూరునందామె లేదని చెప్పి "మీరు పాలిగ్రామమునుండి యిటకెట్లువచ్చిరో మాకుఁ దెలియఁజేయుఁడి" యని మదనసింగడిగెను. రహిమానుఖాను దౌర్జన్యమును దాను జెయిసాలయందుండుటయు, రహిమానుకు బదులుగ వచ్చినవాఁడు తన్ను హింసించుటయు, వేటకుబోయినప్పు డొక వ్యాఘ్రము వానిపైఁబడి వధించుటయు గ్రామస్థులు తన్ను విడిపించి హేమలతను వెదకించి యెందును గానకుండుటయుఁ జెప్పి "ఆమె చిత్తూరునం దున్న దేమో యని హవాలవిని సహాయముగఁ దీసికొని నే నిటకు వచ్చినాఁడను. ఈతని దయవలననే, నే నాపదనుండి బయలఁబడితిని. అన్య మతస్థుఁడై నను నీతఁడు నా కొనర్చిన యుపకారమునకు నే నీతని

ఋణము నెన్నిజన్మముల కయినను దీర్పఁజాలను. మాహేమలత యెందు ను లేదని మీ రనుచున్నారుగద. అయ్యో! నే నేమి చేయుదును? ఆమె యిక్కడ నుండునని గంపంతయాసతో వచ్చినాఁడను. ఇంక నే మృతినొందుట మేలుకాని జీవించుట మేలుగాదు. ఈ మాలవి నన్నున మ్ముకొని చక్రవర్తి రాజ్యమును బాసి చిత్తూరునఁ గాఁపురముండ నిశ్చ యించుకొని వచ్చినాఁడు. నే నొకవేళ మృతినొందినను నీ వీమాలవిసా హేబున కుపకారముఁజేసి యిక్కడ నుండునట్లు చేయుము" అని చెప్ప నారాయణసింగుపలుకుల విని మదనసింగబ్దుల్ ఖరీమున కభయ మిచ్చి హేమలతను వెదకించుచుండెను.

ఇరువదవ ప్రకరణము.

అమఱునాఁడు మధ్యాహ్నము దర్బారుజరుగునని భీమసింగు ప్రకటించెను. రాజపుత్రులెల్ల నియమితకాలమునకు సభామంటపమున కరిగి యుచితాసనములఁ గూర్చుండిరి. భీమసింగును మహారాణాయును వచ్చి కొలువుదీర్చి యుద్ధమునందు వీరస్వర్గమునకుఁ జన్న శూరశిఖామ ణులనుగూర్చి విచారము తెలిపి శరీరముల కాశింపక యుద్ధమొనర్చిన వి క్రమశాలుర కనేకబహుమానములను బిరుదులును నిచ్చి, వారిని మిగు ల గౌరవించిరి. అందు ముఖ్యముగ మదనసింగు సాహసధైర్యములకు రాణా మెచ్చుకొని శౌర్యనిధియగు ప్రతాపసింగు సేనానాయకత్వమున కు నాతనిని యోగించిరి. రాజపుత్రసేనానాయకత్వము నందుటకు మ దనసింగు మహానందము నొందినను, నాఁడు చిత్తూరు సభామంటపము నఁ బినతండ్రి లేకుండుటయు, సభయెల్లఁ జిన్నఁబోవుటయు, నాతని యుద్యోగమును దాను స్వీకరించుటయు నాతనికిఁ గొంతదుఃఖము గల్గిం చెను. ఆయుత్సవము దాదాపుగా ముగియునప్పటికి నలుబదియేండ్ల

వయస్సుగల యొకచామనచాయమనుష్యుఁ డుత్తమరసపుత్రులు ధరించు
కొను వస్త్రాలంకారములతో సభ కరుగుదెంచి రాణాయెదుట నిలిచెను.
అతఁ డారీతిగ మున్నెన్నఁ డాకొలువునకు రానందున నాతని నెవ్వరు
నానవాలుపట్టి తగుగౌరవము నొనర్పక విస్మయ మొందుచుండ భీమసిం
గాతని నుచితాసనమునఁ గూర్చుండఁ బనిచెను. మదనసింగు మొదల
గువారీతని మొగము మున్ను చూచినట్లున్నదని తమలోఁ దాము గుస
గుసలాడ నారంభించిరి. అప్పు డానూతనపురుషుఁడు లేచి సభాసదులను
దనవృత్తాంతమును విన నవధరింపుఁడని వేఁడుకొని యిట్లు పలికెను.
"ఓరాజపుత్రులారా! నాచరిత్ర మతిదీనమైనది. నే నొక పరువుగల
రాజపుత్రవంశమునం దుదయించితిని. నాబాల్యముననే నాతల్లి మృతి
నొందుటచే నేను బ్రయాగలో నామేనమామలవద్దఁ బెరిగితిని. మా
కాఁపురము రాజస్థానముననున్న జయపురమైనను నేను ఢిల్లీచక్రవర్తుల
పాలనముక్రింద నున్న దేశములోనుండుటచే జలాలుద్దీనుచక్రవర్తివద్దసే
నాధిపత్యమును గ్రహించి, యిరువదియేండ్లుదాఁటకముందే నేనాచక్రవ
ర్తి యనుగ్రహమునకుఁ బాత్రుఁడనై గొప్పవాఁడనైతిని. జయపురము
నందు నాతండ్రి నాతల్లి పోయినతరువాత మరల వివాహమాడి ద్వితీ
యభార్యయు బిడ్డలును మృతినొందుటచే వైరాగ్యముఁ గలవాఁడై ప్ర
యాగకువచ్చి మామేనమామల ప్రోత్సాహముచేఁ జక్రవర్తివద్ద సై
న్యాధిపత్యమునుసంపాదించెను. అలాయుద్దీను దక్షిణదేశమునుండి వచ్చి
జలాలుద్దీనును జంపించి తానె చక్రవర్తి కాఁదలంచి యాకార్యమునఁ
దోడ్పడుమని నన్నును నాతండ్రిని నడుగ మేము నిరాకరించితిమి. అందు
చే మాపై నాగ్రహముగల్గి మాతండ్రికన్నులను దనచేతికత్తితోఁ బొ
డిచివైచి నన్ను వధించుటకు యత్నింపగా నే నామహాపదఁ దప్పించుకొని
పాఱిపోతిని. నాభార్యయు నంతకుముందే రెండుసంవత్సరములక్రిందఁ
బరలోకగతురాలయినందున నప్పటికి నేఁడెనిమిదేండ్లవయసుగల నాచిన్న

కుమారికను శిబిరమున విడిచి నే దేశాంతరములకు మాఱువేషముతో నరుగఁబూనితిని. తురకలవలన నా కింతద్రోహము జరుగుటచే నెల్లయిన నల్లాయుద్దీనుపై హిందూరాజులఁ బ్రేరేపించి దండెత్తించి కసిదీర్చుకొనఁదలఁచి నేను దక్షిణ హిందూదేశమునకుఁ బోయి మహారాష్ట్రరాజగు రామదేవుని మీతోఁ గలియునట్లొడఁబఱచి వారివద్దనుండి మీకుత్తరములనుగూడఁ దెచ్చితిని కాని మథురానగరమున నే నొక పాడుదేవాలయమున యోగివేషముతో నుండ రహిమానుఖాను సేవకులు నన్ను యమునానదిలోఁ బడఁద్రోసి యాకాగితముల నపహరించిరి. ఈతవచ్చినవాఁడ నగుటచే దైవానుగ్రహమున నే నాజలగండమునుండి బైటఁబడి, గోసాయివేషముతోఁ బాలిగ్రామమున కరిగి యచ్చోట నాతండ్రియగు నారాయణసింగును నాముద్దుకూఁతురగు హేమలతయు బ్రతికియుండుటకు సంతసించి, రహిమానుఖాను హేమలతను చెఱఁబెట్ట నుంకించుచుండ నామెను రక్షించి కుల్వానగరమునకుఁ దోడ్కొనిపోయి నాస్నేహితుఁడగు శివప్రసాదునింట నుంచితిని. తరువాత రాజస్థానముపైఁ జక్రవర్తి దండెత్తునను మాట విని ఢిల్లీనగరమున జరుగుచర్యలను గ్రహించి రాజపుత్రులకెఱిఁగింపఁగోరి, కులందరు ఫకీరుగా రహిమానుఖానువద్దనుండి రహస్యములు బైటఁదీసితిని. అంతటనుండియు నేనీనగరమునఁ జిదానందయోగివేషముతో నుండి రాజపుత్రులసేమమునకు నాతపస్సునెల్ల ధారపోసితిని. ఆరాత్రి మహారాణా లక్ష్మణసింగుగారిని మదనసింగు సాహాయ్యమువలన రక్షించి, వసంతభట్టును జ్ఞానానందస్వాములవారివేషము వేసికొని యుత్తరములఁ దెచ్చిన పాండురంగనాథునిఁ బట్టుకొని వసంతభట్టును జంపించి పాండురంగనాథుని మీ కప్పగించితిని. నే ననేకసేవకుల నుంచుకొని, వారిని నానాభాగముల కంపి వసంతభట్టాదుల రహస్యముల నెఱిఁగి నేఁడు తురకలనోడించి సఫలమనోరథుఁడనైతిని. నాపేరు జనార్దనసింగు. హేమ

లత. నాకూఁతురు; అంధుఁడగు నారాయణసింగు నాతండ్రి. హేమలత నావద్దకు వచ్చినదికాని నాతండ్రి జాడలు దెలియులేదు. ఎఱింగినవా రున్నయెడల నా కాతనిజాడ నెఱింగించి నన్ను ధన్యునిజేయుఁడు. నాకూఁతురను మదనసింగునకిచ్చి వివాహము చేసెదను.” ఇట్లు జనార్దనసింగు తనపూర్వవృత్తాంతమును సభ్యులకుఁ దెలియఁజేయ వా రాశ్చర్యపడి యందఱు నాతనివంక దృష్టినిలిపి చూచుచుండ హేమలత చిత్తూరునగరమున నున్న దనియు నామెను దన కిచ్చి వివాహము చేయుట నిశ్చయ మనియు జనార్దనసింగు పలుకుటచే, మొదట మదనసింగు మిగుల నుప్పొంగుచు, నారాయణసింగు తనగృహమున నున్నట్లాతనితోఁ జెప్పి తనతో రమ్మని పిలిచెను. పాలిగ్రామముననుండి రాజస్థానమున కాయంధుఁడు వచ్చుట కాశ్చర్యము నొంది జనార్ధనసింగు చిరకాలముక్రిందటఁ జూచిన తనతండ్రిని దర్శింపఁగోరి రాణావద్దను సభ్యులవద్దను సెలవు గైకొని తనమఠమునకుఁ జని యొకపల్లకిలో హేమలతను గూర్చుండఁబెట్టి వెంటఁ బెట్టుకొని మదనసింగుతో నరిగెను. చిరకాలమునుండి పరస్పరవియోగముగల యాప్తబంధువుల విచిత్రసమ్మేళనమును నేత్రోత్సవముగఁ జూడఁగోరి, భీమసింగును సభ్యులును మహారాణాతో బయలుదేఱి మదనసింగు గృహమునకుఁ జనిరి. మదనసింగు తనయదృష్టవశమునఁ దనగృహమునలంకరించిన మహారాణా ప్రభృతులను యథాశక్తిని గౌరవించి యర్హాసనముల నిడ వారందఱుఁ గూర్చుండిరి. మనుమరాలు గనఁబడనందులకు దుఃఖించుచున్న నారాయణసింగు వద్దకుఁజని, మదనసింగు “తాతా! మీ హేమలత వచ్చినదిసుమీ” యనిపలికెను. తోడనే నారాయణసిం గదరిపడి “నాయనా! ఏదీ మా హేమలత? ఏదీ! నాయనా! నిజమేనా, చెప్పు చెప్పు” మని వేగిరపడుచుండ నంతలో హేమలత మేఘముల చాటు మెఱుపువలె వచ్చి ‘దాదా! దాదా!’ అని పిలుచుచు నానందాతిశయమున నన్యపురుషు లుండి

రనుమాట మఱచి, యానందబాష్పములతో ముసలివాని యొడిలోఁ గూర్చుండి యాతనికంఠమును గట్టిగఁ గౌఁగిలించుకొని విలపింపసాగెను. నారాయణసింగు మనుమరాలిపైఁ జేయివైచి కనులనుండి బాష్పములామెశిరముపైఁబడ "అమ్మా నాటికి నిన్ను నేఁడు చూచితిని. నిన్నుజూచి యానందించుటకు నేత్రంద్రి లేఁడుగదా తల్లీ" యని పరిపరిభంగులఁ దనసంతాపసంతోషములను మాటలచేతను చేష్టలుచేతను దెలుపుచుండెను. అప్పుడు మదనసింగు వృద్ధునితో "తాతా! నీకుమారుఁడు వచ్చినాఁడు చూచెదవా?" యనిపలుక నారాయణసింగు తనపుత్రుఁడావఱకె యలాయుద్దీను చక్రవర్తిచేఁ జంపబడినట్లు దృఢమగు నమ్మకము గలవాఁడగుటచే నామాట నమ్మక "నాయనా! మీరు నన్నేల పరిహాసించెదరు? నాకొడు కెక్కడ? నా కగపడుటయెక్కడ, జలాలుద్దీను చచ్చుటకుముం దారాత్రి నాకును నాకుమారునకును ఋణముతీఱినది. అటువంటి పుత్రరత్నము నావంటి పాపకర్మున కేల దక్కును? నాయనా జనార్దనసింగూ! ఇఁక నాకగపడవుగద" అని విలపించుచున్న నారాయణసింగు మాటల కడ్డమువచ్చి జనార్దనసింగు "దాదా! నామాటలనానవాలు పట్టఁజాలవా? నేను జనార్దనసింగును. ఆరాత్రి నే నల్లాయుద్దీనుచేతఁ బడకుండ దైవానుగ్రహమునఁ బ్రతికి శిబిరమును విడిచి యింతకాలమును మారువేషములతో బహుదేశములఁ దిరిగి సమస్తయాత్రలు సేవించి తుదకుఁ బాలిగ్రామమునకు వచ్చి మీరు బ్రతికియుండుట నెఱిఁగి మనశ్శాంతిఁ గలిగియుండి నేఁడు గలిసికొన్నాను." అని జనార్దనసింగు తనపూర్వాశ్రమవృత్తాంతమును నెఱిఁగింప నారాయణసింగు వానికంఠస్వరమునుబట్టి తనకుమారుఁడని తెలిసికొని యక్కునఁ జేర్చి, యనిర్వాచ్యానందము నొంది "నాయనా! చక్రవర్తి నాకన్నులను బొడిచివేయకముందు నిన్నుఁ గన్నులారఁ జూచినవాఁడను నేఁడు నిన్నుఁ జూచి సంతోషింప నాకుఁ గనులు లేవు. అయినను నీవును హేమలతయు

నాకు రెండుకన్నులయి యున్నారు. మీరు దొరకుటె నాకు గను
లు లభించుట" అనిపలికి సంతోషమున వెఱ్ఱిదాని వలె నుండెను. జనా
ర్దనసింగు హేమలతను శివప్రసాదు గృహమునకుఁ గొనిపోవునాఁడు
గాని, యీరెండుదినములలోఁ దనయొద్ద నున్నపుడుగాని, తా నామెకుఁ
దండ్రియగుటఁ జెప్పనందునఁ దనకు జ్వరము తగిలినప్పుడు రక్షరేఖగట్టి
న గోసాయియె తనతండ్రియని హేమలత ప్రథమపర్యాయమున విని
విస్మయమొందెను. తా నామెను విడిచిపోవునాఁటికి నొమ్మిదిసంవత్సర
ముల బాలికగనుండి నేఁడు సంప్రాప్తయౌవనయయి యుండుటచే జనా
ర్దనసింగు చాలకాలమునకగుపడిన కూఁతును ముద్దుపెట్టుకొని యొడి
లోఁ గూర్చుండఁబెట్టుకొనెను. తరువాత సువర్ణాభాయి హేమలతను
జూడఁగోరినందున జనార్దనసింగామెను లోనికంపెను. సువర్ణయు
హేమలత సౌందర్యాదులను, మొగమున రసపుత్రికళను, సత్కులజాత
చిహ్నమును, వినయసంపత్తిని జూచి యామె యెట్లయినఁ దనకుమా
రున కిల్లాలయినఁ జాలునని కోరుచుండెను. అప్పుడు మదనసింగు జనా
ర్దనసింగునుజూచి "అయ్యా హేమలతకు సహోదరుఁ డైనకుమా
రసింగెచటనున్నాఁడు? అతఁ డాదినమున మీమఠమునకు వచ్చెఁగద"
అని యడుగ "నాయనా! ఆకుమారసింగే యీహేమలత యయ్యెను.
యుద్ధమునందు జరిగినకలకలములో హేమలత దుష్టులపాలఁబడకుండ పు
రుషవేషమును వేసికొని యాపేరుఁ బెట్టుకొన్నది.' అని జనార్దనసిం
గుత్తరము చెప్పెను. హేమలతయొక్క సమయోచితబుద్ధికిని యుక్తికిని
మదనసిం గాశ్చర్యపడుచుండ నపుడు భీమసింగు లక్ష్మణసింగులయె
దుట, జనార్దనసింగు హేమలతను మదనసింగున కిచ్చి వివాహము
చేదునని చెప్పి, తనతండ్రికిని నావివాహమిష్టమగుటచేఁ దద్విషయప్ర
యత్నముల నొనర్పుఁడని భీమసింగుతోడను దక్కినరసపుత్రులతోడను
జెప్పెను. ప్రతాపసింగు మృతినొందుటచేఁ బెద్దలెవ్వరును లేరని మదన

సింగుపక్షమున భీమసింగు సర్వప్రయత్నములను జేయించి పందిళ్లువే యించెను. నారాయణసింగును జనార్దనసింగును హేమలత వివాహ మగువరకును దమమందిరమునకు రండని భీమసింగు పిలుచుకొని పోయెను. సంపూర్ణశరత్కాల చంద్రమండలము నపహసించు హేమలతముఖము నవలోకించి ముద్దుపెట్టుకొని మెఱుపుతీఁగెఁబోలు నామెదేహమును బిగ్గఁ గౌఁగిలించుకొను సమయ మెన్నఁడు వచ్చునాయని మదనసింగు నిమిష మొక గడియవలె గడపుచుండెను. రూపొందిన మన్మథునివలె నల్లపట్టుకుచ్చులఁబోలు మీసములతోడను నీలోత్పలములవంటి నేత్రములతోడను సంపూర్ణచంద్రబింబమువంటి ముఖముతోడను దనహృదయమును బాయకున్న మదనసింగును దలఁచుకొని హేమలతయు వానిఁగలిసికొను సుదినమెపుడుచూచుచుండెను. అంతట నొక సుదినమున సుముహూర్త మేర్పఱచి జనార్దనసింగు హేమలతామదనసింగులకు సకలరాజపుత్రముఖ్యులసన్నిధిని మహావిభవముతో భేరీమృదంగాది మంగళధ్వనులతో వివాహముగావించెను. పద్మినీదేవి హేమలతయొక్క వినయాదిసుగుణములకు మెచ్చియో, పుత్రసమానుఁడైన మదనసింగుపైఁ గల ప్రేమనెంచియో, యామెకు సమస్తాభరణములను బెట్టి తనయింటఁ బెండ్లికుమార్తెనుజేసెను. చూచినవారందఱు నదియనుకూలదాంపత్యమని పొగడ హేమలత మదనసింగును వివాహమాడెను. వివాహమహోత్సవ మైదునాళ్లును మహావైభవముతో నడచెను. అతఁడేకపత్నీవ్రతస్థుఁడై విద్యావంతురాలయిన యామెసాంగత్యముచే నపార సౌఖ్యము నొందుచు నారాయణసింగుతోడను మామగారితోడను సుఖముగాఁ గాలక్షేపము చేయుచుండెను. వివాహమైన నెలదినములకబ్దుల్ ఖరీము మాలవిని మదనసింగు భీమసింగునకుఁ జూపి యాతఁడు మ్లేచ్ఛరాజ్యమును బాసి చిత్తూరురాజ్యమున నుండుటకనుజ్ఞ వేఁడుచుండుటఁ దెలియఁజేయ భీమసింగందులకు సంతోషించి యాతనికి నెలకుఁ

బదులైదువరాలవేతనము గల యుద్యోగమునిచ్చి యాతనికుటుంబమును గూడ రప్పించెను. ఆనాఁటనుండియు మాలవి చిత్తూరువాస్తవ్యుఁడై మహారాణాకొలువులో నుండెను.

తరువాత హేమలత సుఖముగనున్న వార్తను శివప్రసాదునకుఁ జంద్రసేనునకును దెలియఁజేయుటకు మదనసింగు వారికడకు మనుష్యుల నంపెను. తనకుఁ గడుసహాయమొనర్చిన చంద్రావతి కుత్తరమువ్రాసి యామనుష్యులచేతికిచ్చెను. హేమలతామదనసింగుల యనురాగఫలమై, వివాహమైన రెండుసంవత్సరములనాఁటికి వారికొక కుమారుఁడుదయించెను. అతనికి మదనసింగు మాధవసింగని తనతండ్రిపేరు పెట్టెను. తరువాత వారికనేకులు కుమారులు కుమార్తెలు జనించిరి. మదనసింగు రాజభక్తియుక్తుఁడై తనతండ్రికంటెను బినతండ్రికంటెను బరాక్రమమునఁ బేరుగాంచి శత్రువులకుఁ బ్రక్కలో బల్లెమై రాణాకు గుండెకాయమై పుత్రపౌత్రాభివృద్ధిగలిగి వర్ధిల్లుచుండెను.

సంపూర్ణము

అహల్యాబాయి

మొదటి ప్రకరణము.

మహారాష్ట్రదేశమునకుఁ గస్తూరితిలకమువలె నలరు శ్రీ పునహానగరము భయంకరశాసనుండగు శ్రీ పీష్వామాధవరాయని పాలనమునం దుంచుటచేఁ జోరకిరాతభీతిలేక తన్నగరవాసులందఱు హాయిగా గుండియలపైఁ జేతులువైచుకొని నిద్రించుచుండిరి.

ఆహాహా! రాత్రి సకలజంతుసంతతికి నపారనిద్రాసుఖము నొసంగు మహోపకారియయ్యు, మదనపీడితులకును, విచారవినమ్రులకును, పాపకర్ములకును, గంటికిఁ గూర్కు రానీయక నాలుగుజాములకాలమును నపకారియై యుండునుగదా! అయినను సర్వరహస్యములను దన కడుపున నిడుకొని కన్నతల్లివలెఁ గాపాడునట్టిది రాత్రియే గనుక దురాచారులకుంగాక మానధనులకుఁగూడ నది యుపకారియగు. ఆనాఁటిరాత్రి నగరమంతయుఁ గాలపురుషుఁడు వేసిన సమ్మోహనాస్త్రముచేత బద్ధమై పరవశత్వంబు నొందెనేమో యనునట్లు ప్రాణంబులఁ బరమేశ్వరునకును నర్థంబుల రాజసేవకులకును సంరక్షణార్థ మొప్పగించి నిద్రించుచుండెను. వేయిగన్నులతో సర్వేశ్వరుండు రక్షింపఁ దమపని యేమున్నదనియో, నియమితకార్యంబుల మఱచియో, యవిలంఘనీయ మగు నిద్రాదేవి కెదురాడనేరకయో, రాజభటులుఁగూడ నెక్కడివా రక్కడ నిద్రించుచుండిరి. తమపనియం దత్యంతశ్రద్ధాళువులు కొందఱువీరులు గస్తీదిరుగుచు నడుమనడుమ నిద్రవచ్చునపుడు స్తంభమునకో గోడకో చేరఁబడి కునికిపాట్లుపడుచు నట్టేటుఁ బనిచేయుచుం

డిరి. నగరమునందలి దీపములన్నియు నొకటితరువాతనొకటి క్రమముగ నారిపోయెను. ఆరాత్రి యొకబాలిక దీపములు పెట్టినదిమొదలు పలుమాఱు తమపెరటితలుపుఁ దెఱచుచు మూయుచు మాటిమాటికిఁ దనముద్దుమొగమ్ము బాటసారుల కగపడునట్లు తొంగితొంగి చూచుచుండెను. జామురాత్రియైనతరువాత నొకమాఱట్లుచూచి వీథిలోనికి రావలెనని గుమ్మములోనడుగిడ నిద్దఱుబాటసారు లాదారినేగుచుండిరి. అందుచే నామె చెంగున లోనికిఁజని తలుపుమూసెను. మఱి రెండుసారులట్లు గృహము వెడలిపోవఁ బ్రయత్నించుచుండ నొకమాఱు తల్లి మేల్కని యామెస్థితినిగూర్చి పరీక్షించి యామెను బండుకొనఁజేసెను. రెండవమాఱు తనచిన్నతమ్ముఁడు నిద్రలో దుస్స్వప్నముం గని యేడ్చుటచే నాతని నూరడింపవలసి వచ్చెను. రెండుజాములరాత్రి యైన వెనుక ద్వారము వెడలి యాసుందరి వచ్చునప్పటికిఁ దన కెదురుగ నరఁగుపై నిద్రించు రాజభటుఁడు "పోకుపోకు జాగ్రత" యని పలువరించెను. రహస్యకృత్యములఁ జేయువారు ప్రపంచమునందలి యన్నియంశములు దమవిషయమే యనుకొందురుగాన నామె యామాటలకు వెఱచి యిలు వెడల సాహసింపదయ్యెను. తుదకీ కన్య రేయియంతయు నిదురలేకయే నిష్కారణముగ శ్రమపడి యింకఁ దనకుఁ దగుసమయము లభింపదనుకొనుచుండ జాముకోడి 'కుక్కురో' యనికూసి యామెకు మఱింత విచారమును గలిగించెను. అయినను నామె తన ప్రయత్నము ను మానక కడపటిసారి తలుపు దెఱచిచూడ వీథి నిర్మానుష్యమై యుండెను. ఇంట నందఱుఁ దెల్లవాఱుజామున వీచు మందమారుతములు తమ్ము సోఁకుటచే గాఢనిద్రం దేలుచుండిరి. అది తగిన యదనని మది నెఱింగి యాసుందరి మార్గ మెఱుఁగుటకుఁ దన రెండుకన్నులందక్క తక్కిన శరీరాంగముల నెల్లఁ గప్పు మేలిముసుంగు ధరించుకొని గృహావరణము దాఁటి యావలఁబడి తనకోరిక క్రొళ్ళుదాఁటుచుండినట్లు తనగమనం

బున నతివేగమై యుండునట్లు నడిచి తాను నిర్ణయించుకొనిన స్థానమునకుం జనుచుండెను. అప్పుడు చీఁకటి పూర్ణముగ నున్న నాకాశమును పాలవెల్లిని విలాసార్థము గట్టిన పాదరసపుబుడ్డివలె, దోఁచిన వేఁగుఁజుక్క మినుకుమినుకు మని వెలుతురు నిచ్చుటచేతను, ధాళధళ్య మగు మేలిముసుఁగు తనవెంట నుండుటచేతను నామె కితరులు, నితరులకామెయు నగపడకుండిరి. ఇట్లు కొంతదూర మాయింతి నడచినడచి యెవ్వరో మనుష్యు లాత్రోవను వచ్చుచుండుటచేఁ గొంతతడ వొక యరుఁగుపైఁ గూరుచుండి మరలఁ దన ప్రయాణము సాగింపఁ గొంతనడచి నాలుగుసందుల మొగదగ్గఱ తన గమ్యస్థానమునకు దారియెఱుఁగక నిలుచుండెను. అపుడు తనముం దిరువదియైదు సంవత్సరముల యీడుగల మనుష్యుఁ డునడచి పోవుటఁ జూచి యొంటరిగ దీర్ఘాలోచన మొనర్చుచు శిరమున వెల్లపాగయు, వెల్లదేహమునఁ దెల్లయంగరకాయు ధరించి మెల్లగాఁ బోవు నొక లేఁబ్రాయపువానిఁ గనుఁగొని చకచక వానివైపునకు నడచి చల్లగ వానివీఁపునఁ జేయివేసెను. అదివఱకు నిర్మానుష్యమగు వీధినిఁ బోవు నాపురుషుఁ డీచల్లని హస్తస్పర్శముచే నులికిపడి తిరిగిచూచి యెదుట మబ్బుమఱుంగున మసలు మెఱుంగుతెఱఁగున ముసుంగుమఱుఁగున మెలంగు నంగనం జూచి యాశ్చర్యపడి యామెతో మెల్లగ, „నీ వెవ్వరిదానవు! నాతో నేమిపనియున్నది?” అని యడిగెను. ఆమెయు మృదూక్తులతో, „నాపే రెందుకు? భవానీదేవి యాలయమునకు దారి నీ వెఱిఁగినచోఁ జెప్పుము, నేనటకుఁ బోవలయు” నని ప్రత్యుత్తర మొసంగ నాతఁడు, „నీ యెదుట నాచెట్లచాటున నొక మేడయున్నది. ఆమేడ కావలిదే భవానీదేవాలయము” అని చెప్పి, యట్టిసమయంబునఁ జీఁకటియని శంకింపక, దురాచారులకు వెఱవక, కావలివాండ్రికు జంకక యతిసాహసముతో నొంటరిగఁ బయనము చేయుచున్న యామె తెగువకు మెచ్చుకొనుచు నామెపైఁ గన్నులు నిగిడ్చి నిలువఁ

బడెను. ఆమాటలు వినఁబడినతోడనే యన్నెలంత యాదేవళమువంక కరుగుచుండెను. ఆసుందరి యాలయమునం దెవ్వరినిమిత్త మేపనికయి చనుచున్నదో తెలియఁగోరి మన తెరువరి యామె వెనువెంటఁ దగిలి యామెచేఁ గనుగొనఁబడకుండ నడుచుచుండెను. ఆమె యాలయమును జేరి మూసియున్న కవాటములు గుభాలునఁద్రోసి లోనికిఁ జని దేవియున్న గుడితలుపులయొద్దకుం బోయి నిలిచెను. గర్భగుడితలుపులు మూయఁబడినందున నామె ముహూర్తమాత్రము యోజించి గుడియెదుట నేలసాష్టాంగనమస్కార మొనర్చి తనమొగ మాగుడిగడపపై మోపి కొంచెముసేపు వెక్కి వెక్కి యేడువసాగెను. ఈనడుమ వెంటవచ్చిన యబ్బాలుఁడు బాలికస్థితికిఁ దొంటికంటె నక్కజపడుచు తెప్పవాల్పక యామెను జూచుచు నొకమూల నామెచే లక్షితుండుగానట్లు గూరుచుండెను. ఊరడించువారు లేనందున దుఃఖము వెంటనే యుపశమిల్లెను. బాలిక తేలికయగు హృదయముతో నచ్చటినుండి యిట్లనెను. "అమ్మా భవానీ! జగన్మాతా! తండ్రిలేనిబిడ్డను నన్నిటుచేయుట నీకు ధర్మమా? ఇపుడు నామనస్సున కిష్టములేని యీకార్యముఁ జేయుటకంటె నన్నుఁ జంపివేయరాదా? ఈకార్యమునుండి తొలంగుమని మాయమ్మకునేల తోఁచునట్లుచేయవు? తల్లీ!నామనోరథము నెరవేఱదేని నాకు విషమే గతి. ఆమాట నీకే దక్కఁగలదు. నాసాహసము నీ వెఱుఁగనిది కాదుగదా!" యని పరిపరివిధముల నమ్మహాదేవిని బ్రార్థించి తెల్లవాఱుచుండుటచేఁ దన్నెవ్వరైనఁ గన్గొందురేమో యని మరల గృహమునకుఁ దనవారు మేల్కనకమున్నరుగఁదలఁచి లేచెను. లేచుచుండఁగా, "నీమనోరథము నెరవేఱును భయపడకుము" అని యొక యమానుషవచన మామె చెవులకు వినవచ్చినట్లయ్యెను. అందుచే సఫలీకృతమనోరథ నయ్యెదనని యామె సంపూర్ణోత్సాహము గలిగి గుడివెడలి పదిబారలు వచ్చునప్పటికి నావల నాలయమున నక్కిన యక్కుమారుఁడు సుందరిం గలిసికొని

వచ్చుట కారంభించెను. తనరహస్యముల నాతఁ డాలకించెనేమో యని యామె దిగులుగొని యాతని నసూయతోఁ జూచుచుండ నావయసుకాఁడు పరవశుఁడై యామెహస్తముఁ బట్టుకొని, "సౌందర్యమంతయు సంపూర్ణముగ నీసొమ్మయినది. ఇఁక నేమివరములకై దేవినిఁ బ్రార్థించుచున్నావు, నావంటివానిపై దయయుంచు" మని యామెచేయి ముద్దుఁబెట్టుకొన యత్నించుచుండ నామె సహజముగ బలముఁ గలదగుటచే స్త్రీసామాన్యమగు నధైర్యమునువిడిచి చేయివిదలించుకొని కనులెఱ్ఱఁజేసి కోపముతో నాతనిఁ గసరఁబోయెను. కాని యాతఁ డామెను మరలఁ బట్టుకొని, "నాతోరా, నీవెక్కడి కరుగఁగలవు. రా!" అని లాగఁదొడఁగెను. పడుచుఁ గన్నియ యగు తాను నిశాసమయమున నొంటరిగా వచ్చినందుకు విచారించి, విచారించినఁ గార్యములేదని యరక్షితరక్షణియగు నాభవానీమాతం దలంచి హా! జగన్మాతా! యని గద్గదస్వరముతో నఱచెను. ఆయఱపు గుడియరుగుపై నిద్రించుచు నప్పుడే మెలఁకువ గాంచిన యొకసన్యాసి విని "దురాత్మా! యెవఁడవురా నీవు" అని దగ్గఱకు వచ్చెను. వెంటనే యద్దురాత్ముఁడు పిక్కబలముఁ జూపి యదృశ్యుఁడయ్యెను. సన్యాసి యామెనూరార్చి యిట్లొంటరిగా రాఁగూడదని చెప్పి యింటిదనుక సాయముఁ జనియెను. ఆమె యిల్లుచేరి తనవారెఱుఁగకుండ మెల్లన మంచముపైఁ బవ్వళించెను.

రెండవ ప్రకరణము.

హోల్కారురాజ్యమునకు రాజధానియగు నిందూరునగరమునకు నేఁడుక్రోసులదూరమున, మూహూ యనుపట్టణము కలదు. నిత్యకళ్యాణప్రద మగు పచ్చనియడవినడుమ నాపుర ముండుటచే నుద్యానవనమందలి మేడలాగు ముద్దులు మూటగట్టుచు నుండుటయేగాక వ్య

ధిగ్రస్తులకు నిరామయత నొసంగు నారోగ్యస్థానమై యలరుచుండెను. దానికి మూఁడుక్రోసుల దూరమున వింధ్యపర్వతసంబంధము లగుకొండలచే నావరింపఁబడి యొకగూఁడెము కోటనడుమనున్న పల్లెవలె సురక్షితమై యుండెను. ఆపల్లె కులవృత్తివలన జీవించు గొల్లలకు నివాసస్థానమై వారికిఁ గామితసౌఖ్యప్రదాయిని యయి యుండెను. ఆగొల్లలచే భగవదవతారమని పూజింపఁబడుచు మాహూనగరవాసులచే నాగతానాగతవేదియగు మహర్షి యని యెన్నఁబడు నొకవృద్ధుఁ డుండెను. ముడుతలుపడిన మొగమును, నాకులన్నియుఁ బండి రాలిన వెనుక మోడగు చెట్టువలె నున్నవయి వెండ్రుకలు లేకయున్న శిరస్సును నాతఁడు కాలము దీటినవాఁడని వేనోళ్ళఁ జాటుచున్నను నాతని యద్భుతదార్ఢ్యమును దంతపటిమయుఁ జెవుడురామియుఁ గమనవేగమును నతఁ డంత యీడుగలవాఁడా యని సందియము గొలుపును. కొంచెము రేచీఁకటి తప్ప నేత్రరోగముగూడ, పగటివేళల, నెద్దియు లేదు. కనులయెదుట బంధుగణమెల్ల నశించుటయుఁ దనకుఁ జిరాయువు కలుగుటయుఁ జూచి యావృద్ధుఁడు తన ముప్పెట్లు గడచునని చింతించుటప్పుడప్పుడు కలదుగాని మూఢభక్తిగల గొల్లలు మహానుభావుఁడని వాని కఖిలోపచారములు చేయుచుందురు. దిక్కులేనివారికి దేవుఁడే దిక్కునైనఁ జూపునుగదా! గొల్ల లందఱు మహర్షులు వసియింపఁదగు పర్ణశాలవలె నొక కుటీరమును నిర్మించి యం దాతని నుంచిరి! శతవత్సరపూర్ణుఁడయినను మనోబలము చెడనివాఁడగుటచే రాజకార్యములయందుఁగూడ నతనియాలోచనమమోఘము. పూర్వకాలపుసంగతుల నెఱుఁగఁగోరినవారును, క్రొత్తపనులఁ దలపెట్టి యవి నెరవేఱునో లేదో యనుసందేహము గలవారును నీవృద్ధునడిగి వానియిచ్ఛాప్రకారము వర్తింతురు. ఒకనాఁడు సాయంకాలమున గడియరాత్రియైన తరువాత నొకపడుచువాఁడు సత్యఋషియని ప్రసిద్ధికెక్కిన వృద్ధునియొద్దకుఁ బాదచారియై వచ్చుచుండెను. వంపులు

తిరిగి తుమ్మెదరెక్కలతో నెక్కసక్కెముసేయు మీసములసొరును వెడఁదనుమరు సోయగమును, చెవులస్పృశించు కొనలుగల కనులతీరును చక్కనివారిలోఁ జక్కనివాఁడని యతనికి బిరుదునామము గలుగుటకుఁ గారణములయ్యెను. యౌవన మంగసౌష్టవమును బరిపూర్ణముసేయ విద్య గుణసౌష్టవమును బూర్ణముజేసెను. చిన్ననాఁటనుండియు సాముకసరతులు చేయుటచే దండలు తిరిగినభుజములును, విశాలవక్షమును, మూర్తిని స్తోత్రపాత్రములుగఁ జేసినట్టులె విద్యవలనఁగలిగిన శాంతము, సువర్తనయుఁ గీర్తిని సుజనస్తోత్రపాత్రముగఁ జేసెను. బలమునకుఁ గార్యములయందలి చలము వానికివన్నెఁదెచ్చెను. చుట్టుజరీగల యెఱ్ఱతల పాగయు, పచ్చపట్టంగరకాయు, తెల్లని మఱుపుదోవతియు, వల్లెవాటుగనిడ్డ యుత్తరీయమును వానియలంకారమును సమాప్తముచేసెను. ఆవన్నెకాఁడు సత్యఋషికుటీరమును బ్రాపించి తలుపుఁద్రోసి ప్రత్యుత్తరము రానందున నచట నిలువఁబడియుండెను. వృద్ధుఁడు లోన నెవరితోడనో గుసగుసలాడుచున్నట్లు శబ్దము వినవచ్చెను. ఆమాటలు వినఁబడకమున్నే శ్యామసుందరదత్తు మరల తలుపుఁ ద్రోయుటచే ఋషి తననిమిత్తమెవరో వచ్చినారని లోపలనున్న మనుష్యుని వెడలిపొమ్మని యానతిచ్చి తలుపుఁదీసెను. అంతట వృద్ధుఁడు శ్యామసుందరుని రమ్మని పిలువ నాతఁడు కుటీరము వెడలి ముసుఁగువేసికొని చనుచున్న యతిదీర్ఘకాయుని, మహాసత్త్వుని దేరిపారిచూచుచు వెంటనే లోనికింజనఁడయ్యెను. ఆపురుషుఁ డెవ్వండయియుండునని యోజించి శ్యామసుందరుఁడు లోనికింజని లెక్కకుమించినచిరుగులతో నేలవేయఁబడియున్న ప్రాఁతకంబళముపై వృద్ధుఁ డొసంగిన యాతిథ్యమునకు సంతసించి కూర్చుండినతరువాత వారొకరితో నొకరిట్లుమాట్లాడిరి.

ఋషి—నాయనా నీ వెవ్వరిచే నంపఁబడి నానిమిత్తము వచ్చినావు? నీ పేరు శ్యామసుందరదత్తు కాదా?

శ్యామ—ఔను. రాధాకాంతరావుగారు మీదర్శనముచేసి యా యన మొన్న మనవిచేసిన యంశమును గూర్చి మీ రాలోచించిరేమో యని తెలిసికొనిరమ్మనిరి.

ఋషి—(తలయూచి) ఆ, నే నావిషయమై యోచించినాను. తుద నెగ్గుట కష్టసాధ్యము.

శ్యామ—కష్టమునకు నేమి? వారిధనముఁ దినుచు మేము వారి పక్షమునఁ గష్టపడుదుము. శ్రమ కేమియు సంశయింపము.

ఋషి—మీ రెంతకృతజ్ఞతతోఁ బనిచేసినను నామె స్త్రీకదా, పురుషులపైఁ గక్షవహించి తుదనెగ్గుట యసాధ్యము. నే నిట్టి వెన్ని చూచినాను? ఆమె జస్వంతరావు చెప్పినట్లు వినుట మంచిది.

అని, యాతఁడు తనయభిప్రాయ మెఱిఁగింప దత్తునకు ముఖవి కాసము రవ్వంతమంద మగుటఁ గనిపెట్టి ఋషి యాతనికి ధైర్యము క లుగునట్లు మరల "అయినను దైవము మన పక్షమున నున్నాఁడు. హో ల్కారువంశమును మొదటినుండియు నెఱిఁగిన నేను మనరాణి గెలుచున ట్లు నాయాశీర్వచన మొసఁగెద" నని హెచ్చరించెను.

శ్యామ—అయ్యా! మీరు రాణిగారిపూర్వుల నెఱుఁగుదురా? మీవయసెంత?

ఋషి—నావయ సెంతయున్నదో నే నెఱుఁగను. సంగతులను బట్టి తెలిసికొనుము.

శ్యామ—మీరు శివాజీమహారాజు నెఱుఁగుదురా?

ఋషి—స. సరి. నాకర్మముకాల, నేను శివాజి నెఱుఁగకపోవలె నా? అతఁడు మృతినొందునప్పటికి నేను పండ్రెండేండ్లవాఁడను.

శ్యామ—శంభాజీ, సాహుమహారాజులను జక్కఁగా నెఱుఁగుదురని నేఁ దలంచుచున్నాను.

ఋషి—బాగున్నది. సాహు మొన్నటివాఁడు కాఁడఁటయా? నాకనులముందరఁబుట్టి, నాకనులముందట మృతినొందినవాఁడు.

శ్యామ—ఔరంగజేబును మీరు స్వయముగా నెన్నఁడైనఁ జూచినారా?

ఋషి—అలంఘురునుజూచినారాయని యడుగుచున్నావా? అలంఘురుసేనలతో యుద్ధము చేసినవా రెవరు? నేనుకానా?

శ్యామ—పీష్వా బాలాజీ విశ్వనాథులఁగూర్చి మిమ్మడుగ నక్కఱయే లేదు వారందఱు మీకు లెక్క లేదు.

ఋషి—నిన్నటివాండ్రి సంగతి నన్నడిగెదవేమి? పూర్వాంశముల నేమయిన నడుగవలసినయెడల నడుగుము.

శ్యామ—మలహారురావు హోల్కారుగారి బాల్యము మీరు చక్కఁగ నెఱుఁగుదురు కాఁబోలు.

ఋషి—మలహారురావుగాదు. ఆయనతండ్రియు నేనును మిగుల స్నేహితులము.

శ్యామ—అట్లయిన నూఱుసంవత్సరముల యీమధ్య మీ రెఱుఁగని యంశములు లేవు. మీరు జాంబవంతునికన్న నేమాత్రమో కొంచెము పెద్దగా గనుపించుచున్నారు.

ఋషి—ఎన్ని యెఱిఁగిన నేమి? ఎంతవయస్సున్న నేమి. ఈమెకు సహాయము నొసర్పఁగలిగితినేని నాజన్మము ధన్యతఁగాంచును. కృతజ్ఞులామె చుట్టును లేరుగనుక యామె నిరపాయమయినస్థితిలో లేదు.

శ్యామ—(తొందరతో) ఎవరు కృతజ్ఞులుగారు?

ఋషి—ఎవరునుగారు. రాణోజీ, దౌలతరావు, గోమోజీ దక్క తక్కినవా రెవ్వరును గృతజ్ఞులుగారు. రాధాకాంతరావుగూడ మంచివాఁడని చెప్పవచ్చును.

రాధాకాంతరావువిషయములో ఋషి పలికిన సందిగ్ధవచనములు శ్యామసుందరుని మనసునకుఁ గొంత వ్యాకులపాటుఁ గలిగింప నదివఱకు తాను కన్నులారఁ జూచుచుండినదానికి నేఁడు చెవులారవిన్న దానికిఁగల వ్యత్యాసమునకుఁ గారణమూహించుచుండెను. మార్పునొందినవానిముఖవైఖరి నవలోకించి ఋషి యేమో మరలఁ బలుకఁబ్రయత్నించుచు తనపెదవులఁ గదపుచుండ నంతలో కుటీరపువాకిట "అయ్యో! అయ్యో! నిష్కారణ మిద్దఱును జచ్చిపోవుచున్నారు. రక్షింపుఁడు రక్షింపుఁడు. కటకటా! ఆఁడుదిగూడ దారుణమగు వధపా లగుచున్నది, రండి రండి" అని యెవఁడో యంగలార్చుచుఁ బరుగెత్తసాగెను. కరుణార్ద్రహృదయుఁ డగు శ్యామసుందరుఁడు యోగితో సంభాషణము మాని యోగియింట గోడపైనున్న చిలుకకొయ్యకుఁ దగల్పఁబడినవిల్లును నమ్ములంగొని మొలలోనున్న చిన్నకైజారు నూడఁబెఱికి యాస్థలమువంకఁ జనెను. ఋషి యార్తనాదము సేయు నాపురుషునిఁ బిలిచి యాపదనొందినవా రెవ్వరనియడిగెనుగాని వాఁడు పేరుఁజెప్పకయే దత్తును వెంబడించిపోయెను. అపుడు ఋషి తనలో "ఈదినమునన్ శేషో యాతఁడు వచ్చునని తెలిసినది. ఈయదృష్టహీనుఁడు వాఁడై యుండఁడుగద" యని వితర్కించుకొని యెద్దియుందోపమి యిటునటుఁ దిరుగులాడుచు నెందుచేతనో యాస్థానమునకుమాత్ర మరుగక తామరాకులోని నీరుతీరున తటతటఁ బరితపించుచుండెను.

మూఁడవ ప్రకరణము.

రాహోజీపల్కారున కప్పటికి నేఁబదిసంవత్సరములకంటె నొకటిరెం డెక్కువయుండెనేకాని తక్కువలేవు. చిన్నతనమందు మలహారురావు హొల్కారునకుఁ దమలపాకుచుట్టలు, దుస్తులు నందించు

నీచసేవకకోటిలోనివాఁడై యాప్రభువు ననుగ్రహమునకుఁ బాత్రుఁడై సైన్యమున నొకసరదా రయ్యెను. తెలివితేటలుగల మహారాష్ట్రుఁడగుటచే నతిత్వరితముగ రాజ్యమునన్న ముఖ్యోద్యోగస్థులలో నొకఁడై మలహారురావు చనిపోవునప్పటికిఁ బ్రధానవర్గములో నొక్కఁడయ్యెను. ఈతఁడు సచ్ఛీలుఁడును, సదాచారుఁడును, గాకుండినను మిగుల ప్రజ్ఞగలవాఁడు. అందు యుక్తులకుఁ బెట్టినది పేరు. మోసమున నితనిఁ జెప్పి మఱియొకరిని జెప్పవలయును. అతఁడు సౌందర్యములేని నల్లని మోటమనుష్యుఁడని చెప్పటకంటె వానియాకారము వర్ణింప నక్కఱలేదు. ప్రథమకళత్రము వియోగమొందుటచే మరల వివాహమాడఁ బ్రయత్నించి తనప్రియమిత్రుఁడగు హరిహరపాండ్యాజీ సహాయమున సౌందర్యరాసియగు నొక కన్యం జేకొని మఱికొన్ని రాజకార్యవిషయములగు నుత్తరములు సంగ్రహించుకొని యిందూరునగరమునకు వచ్చుచుండెను. ఆరాత్రి యెట్లయిన మహాపురముఁ జేరవలయునని నిశ్చయించి పొద్దుపోయినవెనుకఁ గూడఁ బయన మొనర్చుచుఁ దాము వచ్చునప్పటికి వంటకములఁ జేయించి సిద్ధముగ నుంచుమని దండిరావు నంపెను. పల్లకియందుఁ బదునెనిమిదివత్సరములవయస్సుగల సుందరియోర్తు గూర్చుండి తలుపు లించుక తెఱచి చుట్టునున్న కొండలను, మహావృక్షములను, నిష్కలుషమైన యాకాశమును జూచుచుండెను. ఓంకారనాదములతో బోయలు పల్లకిమోయుచుఁ దనవెంట రాఁగా రాణోజీపల్కారు గడియగడియకు సకిలించుచు నలసి మోయలేక తన్నుమోయుచున్న గుఱ్ఱమునెక్కి యిరుప్రక్కల నిరువు రాయుధపాణులగుభటులుగొల్వ బడలికతోఁ బయన మొనర్చుచుండెను. మార్గశ్రమచేఁ జెన్నుచెదరి విసిగియున్న యాసుందరి పల్లకికి సరిగా మధ్యమధ్య నొకమాఱు తనగుఱ్ఱమును దడిపించుచు "కమలా నీవు మిగుల శ్రమపడినట్లున్నావు. వచ్చినంతదూరము రానక్కఱలేదు. కావలసిన

యెడల నాదగ్గఱనున్న రొట్టెలు నాల్గుతినుము" అని యూరార్పుమాటలు పలుకుచు వడిగ నడుగులు వేయుమని బోయలను హెచ్చరించుచు రాణోజీ రెండుగడియలరాత్రికి ఋషి వసియించు ప్రదేశమునకు సమీపముగ వచ్చెను. అది కృష్ణపక్షమున కారంభ మగుటచే నాపాడ్యమి నాఁడు చంద్రోదయము రెండుగడియల కగుచుండెను. తూర్పునఁ దెల్ల దువ్వలువఁ బఱచినట్లు రేఖలు గానఁబడెను.

అట్లు పయనము చేయు నామనుష్యులయెదుట చెవులు బ్రిద్దలగునట్లు మోరయెత్తి ఘుశిల్లు ఘుశిల్లుమని అంకెవేయుచు నొకవృషభము కాలిడెక్కతో నేలద్రవ్వి దుమ్మురేఁపుచు భయంకరాకారముతో దారికడ్డముగనిలిచియుండెను. మార్గమునుండి యాయెద్దు మొద్దువలెఁ దొలఁగనందునఁ దాముపోవుటకు నెద్దును బెదరింపుమని రాణోజీ తనసేవకులలో నొకనినాజ్ఞాపించెను. మందబుద్ధియు మోటచొరవయుఁగల నాసేవకుఁడు ద్విపాదపశువుగనుక నాపశువును బెదరఁగొట్టుట కుపాయమేదియులేక తనపైనున్న యెఱ్ఱగుడ్డవిప్పి హుతాత్తుహుతాత్తని యాగుడ్డ దానిపై వేయఁబోయెను. ఆపశు వదివఱకొక కారుదున్నపోతుతోఁ బోరాడి దానిచే గాయములు తగుల నొచ్చి కడుఁగోపముతో నుండెను. అంతలో గుఱ్ఱమొకసారి సకిలించెను. బోయలోంకార మెక్కువచేసిరి. ఎఱ్ఱగుడ్డఁ జూపుటచే బెదరి, బోయల యోంకారముచేఁ గలవలపడి గుఱ్ఱపుసకిలింపుల సహింపనోపక నాలపోతు మార్గస్థుల గుండెలు వ్రిక్కలగునట్లు అంకెవేసి రభసంబున వారిపైఁబడెను. దీనికంతకుఁగారణుఁడైన మూర్ఖసేవకుఁడు దానిబారినుండి తప్పించుకొని యావలఁబడెను. ఆమనుష్యుని వెనుకనే వచ్చుచున్న రాణోజీపై నాజంతువుదుమికి మునుముందు నడువలేక సగముచచ్చినయశ్వముపైఁబడి దానిని నేలఁగూలఁద్రోయ వాహనముతోఁ గూడనాతఁడును నేలఁ గూలెను. కూలినతోడనె యాతఁడు లేవఁబ్రయత్నించుచుండునంతలో గుఱ్ఱముమీఁద నుండి యాతనిమీఁదికి దుమి

యప్పాపపుఁబశువు దేహమెఱుఁగక సూదిమొనవలె వాఁడిగనున్న కొమ్ముతో నాతనిగుండెలమీఁదను డొక్కలోను, నెమరకణతమీఁదను గ్రుమ్మి తనయిచ్చవచ్చినట్లు గాయములుచేసి వెడలుకొన్న నెత్తురుతోఁ దనకొమ్ముల నలంకరించుకొనెను. సేవకు లిరువురును భయకంపితులై యాయుధములు తమంతటఁదామె వారిచేతులనుండి నేలజాఱ వెనుకదిరిగిచూడక పరువెత్తిరి. బోయలు మోయుపల్లకి నచ్చటవిడిచి చెల్లాచెదరై నలుదెసలకుఁ బలాయితులైరి. ఒకనిమిషమున నచ్చటఁ గ్రిందఁబడిన నాయకుఁడును, పల్లకిలోనున్న సుందరియుఁదక్క నెవ్వరు లేరైరి. పాఱిపోయిన సేవకులలో నొకఁడు తనస్వామిపై జాలిగలిగి ఋషికుటీరము దగ్గఱకు వచ్చి యాఘోరవార్త నచటివారికిఁ దెలుపుటయు శ్యామసుందరదత్తు సహాయార్థము బయలుదేఱుటయు మీరందఱు నెఱుఁగుదురుగదా.

శ్యామసుందరుఁడు కడువేగమున నడచి వచ్చెను. ఈలోన నాస్త్రీ, పడియున్న రాఘోజీని, తన యసహాయస్థితినిఁ జూచి కదలిమెదలిపోవుటకు నంగములాడక కొయ్యయయ్యెను. బోయలు పల్లకిదింపుటయు రాఘోజీపై నెద్దుపడుటయు నామె యెఱుఁగునుగాని తరువాత నేమిజరిగెనో యెఱుఁగదు. పండుకొన్న దేహము పండుకొన్నట్లె యుండెను. చూచెడుకన్నులు చూచినట్లుండెను. ఇట్లామె మహాభీతితోనుండ నాయెద్దు కోపాగ్ని చల్లారకపోవుటచేఁ గాఁబోలు చెంగున నాపల్లకిమీఁదఁబడి కొమ్ములతో గుభిల్లు గుభిల్లుమని యాపల్లకిం బొడుచుచు తనమహాబలముచేఁ దానినడ్డముగాఁబడఁద్రోసి దానిపై నెక్కి తన్ని పగులఁగొట్టుచుండెను. ఆనారీమణి స్మారక మెఱుఁగక మొదటమాత్ర మొకకేక వేసి మూర్ఛిల్లి యందుఁ బడియుండెను. దత్తు తత్తరపడుచు ననతిదూరమున నామె కేక విని యతిత్వరితమున వచ్చి మనోధైర్యమును జిక్కఁబట్టి విల్లుపయోగింప నెంచి యం దసమానప్రజ్ఞగల మహారాష్ట్రుఁడగుటచే

వరుసగా రెండు బాణముల దాని మొగమున నాటనేసెను. వెంటనే యది రోసముచే పైఁబడనుంకింప నతఁడు మఱి రెండుబాణములను రెండుకన్నులమీఁద గీలింప నది 'యంబా' యని నేలఁబడెను. వెంటనే యాసేవకుఁడు వచ్చి తనకత్తితో దానినినటికి తనయసహాయశూరతఁజూపెను. అపుడు దత్తు పల్లకి యథాప్రకారముగఁ బెట్టించి తలుపులఁదెఱచి యందు మాటలాడనేరని పోతపసిఁడిబొమ్మయై, నిలుకడఁగన్న మెఱుపుఁదీగయై మన్మథరాజ్యలక్ష్మియై, పడుచువాండ్రబాధించు హృదయశల్యమై నిశ్చేష్టురాలగు నయ్యతివం జూచి యామెను లెమ్మని పిలువ నామె పలుకదయ్యె. ఆమెను లేవఁదీయుటకుఁ దనకు సహాయము చేయుమని సేవకు నడుగ 'నిద్రపోయెడుదానిని లేపెదరేమి? ఆమెను బండుకొననిమ్ము నీ విటురా' యని వాఁడు మందలించెను. కొంచెము చల్లని నీరు తెమ్మని సేవకు నంపి తానె యమ్మగువను పందిటఁబట్టి కూరుచుండఁబెట్టి పడకుండ నామెను దానుఁగూడఁ బట్టుకొని యుండెను. ఆమె జీవచ్ఛవమై మాటయుకదలికయు లేక యెటులుంచిన నటులుండెను. మేనెల్లఁజెఱుచెమ్మటలు గ్రమ్మి కణములుగాఁబరిణమించి మొగమున ముత్యాలువెట్టినట్లు వింతవిన్నాణము నొసంగెను. విలాసార్థమామెకొప్పున గ్రుచ్చిన మల్లెపుష్పములు నలుదెసలుజాఱి యామెనలె పసివాడియుండెను. వటుప్రలయి పెద్దవగు పిఱుఁదుల స్పృశియించి నిడుదవెండ్రుకలు మొగమ్మునంతయు గ్రమ్మునట్లు చీకాకుపడుటచే నామెవదనము భూచ్ఛాయతోఁగూడుగ్రహణకాలచంద్రునివలె నుండెను. చెమటలచేఁగరఁగి మొగమంతయు వ్యాపించిన కుంకుముబొట్టుముఖారవిందమున కొక్కయారుణ్యమునుదెచ్చి సంధ్యారాగములోనున్న చంద్రమండలము లాగు మొగమునకు వన్నెవెట్టెను. బెదరిన లేడికన్నులవలె చలించునేత్రములును, భయమున వడఁకు గాత్రమును, నందకత్తియల గరువ మడంచు కీవియు, దొండపండునకు బంధువగు మోవియు నామెయందమునకు

వింత యందమునుఁజేయ నొడలెఱుఁగని స్థితియందుండియు నామె మోహి
నీదేవివలె నుండెను. సుందరాంగ శెట్టియవస్థలోనున్నను స్తోత్రపాత్రలె
కద! శ్యామసుందరదత్తు కమలాబాయి మొగమువంక కోరికలూర కన్ను
ల కఱవుదీఱ నూహ లెంతదూరమో పార పలుమారు ఱెప్పవాల్పక
చూచి యామెకు సముచితోపచారములఁ జేసెను. ఇంతలో సేవకుఁడు
నీరుదెచ్చుటయుఁ జల్లని యాజల మామె మొగమునఁ గొట్ట నామె కొం
త సేదదేఱి కొంచెము నీరుద్రావి మఱల సొమ్మసిల్లి తిరిగి కొంత యుద
కముఁ గ్రోలి కనువిచ్చెను. కనువిచ్చి యాసుందరి భువనసుందర విగ్ర
హుఁడగు శ్యామసుందరుఁ గనుఁగొని సిగ్గునఁ దలవంచి పరపురుషుని
యెదుటఁ గూరుచుండుట కిష్టములేక మెల్లగాలేచి యావలకుఁ జరిగి క్రిం
దపడిన యుత్తరీయము మేలిముసుఁగుగా వేసికొని యాతఁ డెవఁడా య
ని యాలోచించుచు ప్రభువెట్లుండెనని సేవకునడిగెను. ఈనడుమ శ్యామ
సుందరుఁడు రాణోజీయొద్దకుఁబోయి శరీరమునిండ గాయములఁ జూచి
యాతఁడు జీవించుట యసాధ్యమని యెంచియుఁ దగుచికిత్స చేయఁదలఁ
చి మెల్లఁగ దానును సేవకుఁడును వాని నెత్తి పల్లకిలోఁ బరుండఁబెట్టిరి.
అప్పుడు రాణోజీ 'నాభార్య నాభార్య' యని మెల్లగా నన "నీభార్యను
రక్షితముగ నున్నది. భయములే" దని దత్తు ప్రత్యుత్తరమొసంగి రెం
డుగుడ్డలు మసిచేసి యా గాయములకుఁ గట్లుకట్టెను. ఆరెండుమాటలు
గాక యెన్నిసారులు పిలిచినను రాణోజీ పలుకక తనలోఁ దాను
పలుమాఱు పలువరింపఁదొడంగె. సేవకునివలనఁ దనప్రభు విం
కను సురక్షితుఁడని యెఱిఁగి కమలాబాయి "ఇంకను జీవించియు
న్నాఁడా, దైవమునకు నాపై నింత కోపముండ నాకు సుగతి యె
ట్లగును. ఎద్దు నాకు బూర్ణముగ నుపకారము చేయలేదు. నన్నుఁ జం
పినను మేలుగా నుండును." అని తనలోవిచారించెను. ఇంతలో బోయ
లు తిరిగివచ్చుటచే రాణోజీని పల్లకిలో మోయించి గూడెమునుండి

బాడి తెప్పించి కమల నందుఁగూర్చుండఁబెట్టి వారినందఱిని మహానగరమునకు శ్యామసుందరదత్తు తీసికొనిపోయెను.

నాల్గవ ప్రకరణము.

మహానగరమున మురళీధరదాసను నొక మనుష్యుఁడు సుందరియు గుణవతియునగు నానందబాయియను భార్యతోఁ గాఁపురము సేయుచుండెను. అతఁడు పిల్లలుగలవాఁడును బీదవాఁడు నైనను గొంచెము వ్రాఁతనేర్చినవాఁడగుటచే హజారుమల్లను మార్వాడీ వర్తకుని యొద్ద లెక్కలువ్రాయుచు స్వల్పజీతమును గ్రహించుచు మిగుల గౌరవముకలిగి కాలక్షేపముసేయుచుండెను. ఆనందబాయి యిప్పటికి ముప్పది వత్సరములు వయస్సుగలదై మగనికంటె మూఁడు సంవత్సరములు చిన్నదై యుండెను. మురళీధరదాసు పొడుగుగ నుండునుగాని బక్కపలుచని పసిఁడివన్నెగల శరీరముతో నందగాఁడని పేరొందినవాఁడే. రమారమి జాముర్రాత్రి యగునప్పటికి శరీరమెఱుఁగక పడియున్న రాణోజీని, దిక్కులేక భయవివశురాలైన కమలాబాయిని, వెంటఁబెట్టుకొని శ్యామసుందర దత్తు మహానగరముఁ బ్రవేశించి మురళీధరదాసు గృహమునకు రమ్మని బోయల కానతిచ్చి తాను ముందుగా నాగృహమువైపు జనెను. భోజనముచేసి భాగవతము చదువుకొనుచున్న మురళీధరునియెదుట శ్యామసుందరుఁడు నిలువ నతఁ డమితానందమునొంది భార్యను బిలిచి "మన దత్తువచ్చినాఁడు. మనదత్తు" అని యఱచెను. ఆనందబాయి చాలకాలము క్రిందటఁ జూచుటచే దత్తును జేరరమ్మని "ఏమి నాయనా యింతకాలము జాగుచేసినావు" అని తలపైఁ జేయివేసి నిమిరెను. "అక్కయ్యా! నారాకకేమిగాని శ్రీరాణీ యహల్యాబాయిగారి కొలువులో గొప్ప యుద్యోగియగు రాణోజీ, చచ్చుటకు సిద్ధముగ

నున్నాఁడు. అతనితో భార్యకూడ వచ్చినది. వారివిషయమై మన మతి జాగ్రత పుచ్చుకొనవలెను" అని జరిగినవృత్తాంతము నంతయుఁ దన భావకును సోదరికిని దెలియపరచెను. అంతలో మనకమల యెక్కిన బండియుఁ బల్లకీయు వచ్చినందున నిస్పృహుండగు రాణోజీని మెల్లమెల్లగఁ జేతులమీఁద వేసికొని లోపలికిఁ దెచ్చి యొక గదిలో నొకపరుపు మీఁదఁ బండుకొనఁబెట్ట పాపము రాణోజీ మూలుగుటయె గాని బాధ యిదియని చెప్పనేరక పిలిచినఁ బలుకక ప్రక్కపైఁ గొట్టుకొనసాగెను. వారారాత్రి యొక్క వైద్యుని రప్పించి యాతనిఁ జూపగా నతఁడు పెదవి విఱిచి, "రోగి బ్రతుకుట దుర్లభ" మని చెప్పెను. ఆనందబాయి కమలాబాయిని మిగుల గౌరవముగలోనికిఁదెచ్చి కొంచె మెంగిలిపరచి దుఃఖభారమున నాత్మహత్యఁ జేసికొనునేమోయని కడు మెలఁకువతోఁ గాపాడుచు నామె నొక నిమిషమును వదలక నడుమనడుమ నామె యందమున కాశ్చర్యమునందుచు, "కాకి ముక్కునకు దొండపండుఁ గట్టినట్లు ముదివాని కీచిన్నదానిని తల్లిదండ్రు లెట్లిచ్చిరోకదా? ఆముసలివానితోనైన నింత పసపు కుంకుము బెట్టుకొని పదికాలములపాటు కాఁపురము జేయనీయక దైవమామెకు ఘోరమైన వైపరీత్యముఁ దెచ్చిపెట్టుగాఁబోలును. ఈరూప మడవిఁగాచిన వెన్నెలయగునా" యని విచారపడుచు నామెపైఁ జేయివైచి పండుకొనెను. రాణోజీస్థితిఁజూచి మురలీధరదా సతనితమ్ముఁడగు దాంతురావునకు నొక మనుష్యునిచే వర్తమానమంపెను. ముందు రాణోజీకి వంటచేయుటకుఁ బంపఁబడిన దుండిరావు గంజాయిదుకాణమున దిట్టముగ గంజాయిదాగ్రి మెలఁకువలేక పండుకొనియుండ మార్గమున నెద్దును బెదరించిన లక్ష్మణుఁడు దుకాణమునకు గంజాయికిఁబోయి దుండిని లేపి జరిగిన వృత్తాంతమును జెప్పి పంపెను. దుండిరా వచ్చుటకే వచ్చి, తనయజమానునకు సహాయమెద్దియు నొనర్పఁజాలక యాతని నాధారముగఁ జేసికొని తాను బన్నిన

పన్నుగడలన్నియు వ్యర్థములయ్యెనని చింతించుచు నిద్రినాపలేక రెండు కునుకులు కునికెను. ఈనడుమ నానందబాయి కొంచెము కన్నుమూసినందున పలువిధములగు తలఁపులు మనసునమల్లడిగొనుటచే తెప్పపాటు లేక నిట్టూర్పువిడుచుచు కమల లేచికూర్చుండి కన్నులనిండ ముక్తాఫలములవలెఁ గ్రిందుకొనియున్న బాష్పములు మాటిమాటికిఁ దుడుచుకొనుచు మిగుల దుఃఖించుచు, ‘అమ్మా నీవెంతకఠినురాలవు నీవునాకుఁ జేసిన యీద్రోహమునకు నేనీజన్మమున మఱలమీదగ్గఱకు రాను. అంత మీఁదుమిక్కిలివచ్చిన నిచ్చటనే శరీరసమాప్తముఁ జేసెదను. దైవమా! నాకేలమరణము కలుగఁ జేయవు? ఆయెద్దు నన్నేలఁ గ్రుమ్మకపోవలె? ఈయనపని యెట్లయినను నేను దురదృష్టవంతురాలనే” యని వగచుచుండెను. అంతలో నానందబాయి మేలుకొని ప్రక్కలోనామె లేకుండుటకుఁ గలవలపడి లేచి దూరమునఁగూర్చుండిన యాకన్నియంజూచి తన యజాగ్రత్తవలన నపాయ మప్పటికి రానందుకు సంతోషించెనుగాని యప్పుడప్పుడే తొందరతోఁ దనకన్నీళ్ళగపడకుండఁ గమల తుడుచుకొనినను నామె దుఃఖించుచున్నట్లు లానంద తెలిసికొని మితిమీఱిన జాలిచే నామె దగ్గఱగఁ జని స్త్రీయగుటచే స్వాభావిక లక్షణము పోకుండఁ దానుగూడఁ గంటఁదడిఁ బెట్టుకొని, “అమ్మా! యేల వాపోవుదు? నీముఖ సౌందర్యమును నీవిలాసమును జూడఁగా మఱియొక యుపద్రవము జరుగఁ గూడదని నాకుఁ దోఁచుచున్నది. అయినను విలపించినఁ గార్యమేమి? నీభర్తప్రాణములవిషయమైగాక మఱియేవిషయమైనను నాతమ్ముఁడు నీకుఁ గావలసిన సాయము చేయును. అతఁడుమంచివాఁడు” అని యూరడించెను. కమల యప్పుడు తన వెనుకటి యవస్థయెల్ల మనసునఁ దట్టుటచే నొకమారామె యొడిలోఁ దలపెట్టుకొని గట్టిగ రోదనమొనర్చి, “అమ్మా! నీవు మాతల్లి వంటిదానవు. నీతమ్ముఁడు మిగుల మంచివాఁడు. అన్నివిధముల నంతటివానిఁజూచి యెఱుఁగను. ప్రాణములు నిలిపిన

మహాత్ముఁ డతఁడుకాదా? ఎన్నటికైన నాకతఁడే దిక్కని నేను నమ్మకొనియుంటిని" అని పలికెను. ఇంతలో శ్యామసుందరదత్తుతలుపుఁ దెఱచి గదిలోని కరుదెంచుటచే వారిసంభాషణము ముగిసెను. కమలయాతనిఁజూచి చటుక్కున లేచి గోడకుఁజేరి నిలిచి సిగ్గునఁ దలవంచి పదాంగుళముతో నేలవ్రాయుచుండెను. ఆమెవైపు చూడ్కినిగుడించి దత్తు తన సోదరితో, “అక్కయ్యా! రాణోజీగారికి రవ్వంత నిలబాటు చేసినదని తోఁచుచున్నది. కుదురవచ్చునని నాకాశకలదు.” అని తనరాకచే వారి సంభాషణ యాఁగినదనియుఁ గమల సిగ్గున నిలువవలసి వచ్చినదనియుఁ దానా గదివిడిచి వీథిలోనికిం జని యేమియుఁదోఁచక యిటునటు పచారుచేయుచుండెను.

అప్పుడు రెండుజాములురాత్రికంటె నధికముగఁ బ్రొద్దుపోవుటచే వీథులలో నెవరును లేరైరి. పిండియారబోసినటుల వెన్నెల ధవళధవళమై వ్యాపించియుండ నున్నతసౌధములయొక్కయుఁ దమయింటి కావలనున్న దేవాలయముయొక్కయు నీడలు వీథిలోనికి వ్యాపించి యసమానమైన సౌందర్యము నొలికించుచుండెను. ఆవెన్నెలకెరటములలో మునిఁగి యానందము నొందుచు శ్యామసుందరుఁ డాసాయంకాలము తన హృదయము నపహరించిన దొంగను బలుమాఱు దలఁచుకొని మనస్తాపము నొందసాగెను. ‘అహాహా! ఏమి యాకమలసోయగము! ఆమెసార్థకనామము నిజముగ లక్ష్మియె. వేయిజన్మములకైన నేనీమెను మఱువఁజాలను. ఈమె నాయది. ఎంతవెఱ్ఱివాఁడను పరధనమైనయామెనునాసొత్తనుటకంటె వెఱ్ఱియేమున్నది? ఈరాణోజీ చావక బ్రతుకునా? ఛీఛీ! మోహపాశమునఁ దగిలి పాపమనక పుట్టెడు దుఃఖములోనున్న యామె భర్తమరణమును గోరుచున్న నాహృదయము వజ్రమాయేమి! అతండు జీవింపక పోయినమాత్రమున నాకామె లభించుటయెట్లు? ఆమె పతివ్రత గదా! అయినను సర్వేశ్వరుఁ డఘటనఘటనసమర్థుఁడుగదా” అని మెల్ల

మెల్లన లోనికిం జనెను. అక్కడికిఁ బదునాల్గుమైళ్ళ దూరమున నున్న యిందూరు నగరమునకు మనుష్యుఁడుపోయి దౌలతరావును వెంటఁ బెట్టుకొని తెల్లవారునప్పటికి వచ్చెను. దౌలతరావు శవమువలె పడియున్న సోదరునిజూచి విలపించి యాతనిఁ బొరుగూర నుండనీయఁజనదని కమలను సహోదరుని బ్రయాణముఁజేసి పల్లకిలో వానినుంచి, దుండిరావును సేవకులు వెంటరాఁ బయలుదేరెను. కమల హృదయ మానందబాయి యొద్దనుండి బయిలుదేర నెప్పటియట్ల చింతిల్లుచుండెను. శ్యామసుందరుఁడామెను సాగనంపుటకుఁ గడుదూరమరిగి, కమలావియోగమున విషర్ణముఖుఁడై దౌలతరావును వీడ్కొని యింటికిఁ జనెను. కొంతదూర మిట్లు పయనము సాగినతరువాత రాణోజీ మిగులనాయాసమొందఁ బల్లకిఁ జెట్టుక్రింద దింపిరి. దౌలతరావు గుండెలు బాదుకొని యేడ్వ నారంభించెను. కమల నిశ్చేష్టయయ్యెను. పల్లకిలోనున్న రాణోజీ పల్లకిలోనే మృతినొందెను.

అయిదవ ప్రకరణము.

రాణోజీ పల్కారునకు దౌలతరావు తమ్ముఁడు. వయసున నీతఁడు రాణోజీకిఁదమ్ముఁడైనను గుణములయం దతనికి దౌలతరావన్నయనియు, రూపమున నచ్చముగ నన్నగారినోటనుండి యూడిపడినటులుండెననియుఁ జెప్పఁదగును. అభిమానముచేత నతని భార్యయుఁ బక్షపాతముచేత నతని స్నేహితులును, నీలమేఘశ్యాముఁడని వర్ణింతురుగాని యతఁడు నిజముగ మాలకాకివలె కఱునల్లనై యందమనుమాటయైన లేని వికారాకారుఁడు. దుబ్బులవలెఁ దెగపెరిగిన మీసముల నలుపునకు వాని మొగము యొక్క నలుపునకును, రవంతయు భేదముండదు. అతని చక్కఁదన మంతటితో సమాప్తము నొందక మెత్తుగఁబెరిగిన బొజ్జకడుపుతోడను,

శరీరముయొక్క విపరీతపులావుతోడను, గొంచెము దీర్ఘమగుముక్కుతోడను, జూచువారికి నవ్వుఁ బుట్టించుచుండును. అన్నకుఁ గుయుక్తులలో సహాయమై యిరువురును గొప్ప యుద్యోగములు సంపాదించి, హోల్కారు సంస్థానమున మంచివారని పేరుసంపాదింపక పోయినను దేశమున దుర్మార్గమునకయినను బేరువహించిరి. అట్లుండియు నంతవఱకుఁ దమయేలికవిషయ మేద్రోహమును దలఁచినట్లులేదు.

ఇట్లు రాఘోజీ తనపాలిటి మృత్యుదేవతయైవచ్చిన యెద్దుచే గాయములు దగిలినందునఁ బల్లకియందు మృతినొందిన దౌలతురావు శవము నందేయుంచి జాముప్రొద్దెక్కువఱకు కమలాబాయితో నిందూరునగరముఁ బ్రవేశించెను. శవమును దనగృహమునకుఁ గొనిపోక శ్మశానమున కాదారినిదీసికొనిపోయి కమల నింటికంపి తనభార్య కప్పగింపుమని దుండిరావునంపి బంధుజనులను రుద్రభూమికి రమ్మని వర్తమానమంపి వారు వచ్చినతరువాత తనసోదరునకు యథావిధిగ నగ్నిసంస్కారముఁ జేసెను. అక్కడకువచ్చిన కులస్థులందఱును, "మనుష్యులు కాలముతప్పినతరువాత వివాహ మాడఁగూడదనియు దైవవశమునకు నెవ్వరేమిచేయఁగలరనియు నంత సుందరికి వివాహమైన నెలకే వైధవ్యమువచ్చుట యన్యాయమనియు నామెకీ దురవస్థకే యీశ్వరుఁడీపెండ్లి సంకల్పించె" ననియు బహువిధముల జాలినొందిరి. దౌలతరావు భార్యయగు దుర్గబాయి పెద్దపెట్టున నేడ్చుచు వీధిగుమ్మముదగ్గఱ కెదురుగవచ్చి తోడికోడలిని, గాఁగిలించుకొని రోదనముచేసి, "అమ్మా తోడికోడండ్రమని పట్టుమని మనమిద్దఱమును నొకనెలయైనను గాఁపురము చేయమైతిమి. నీవెంత దురదృష్టవంతురాలవో యేభోగ మనుభవింపకముందె, పసపుకుంకుమ్మైన మనసుదీరఁ బెట్టుకొనకముందె, యొకముచ్చటచ్చట దీరకముందె, పెండ్లియైన నెలకే యీలాగైతివిగదా! అమ్మా! మొదటి ... మే నిన్నివ్రాఁతలోఁ జూడవలసివచ్చెఁగదా. తల్లీ నీవింకను

వచ్చినతరువాత నిద్రజము గా, పురము జేయవలె నను కొన్నానుగాని యింతవఱకు వచ్చునని యెఱుఁగనుతల్లీ" అని పరిపరిభంగుల సంగలా ర్చ కమలయుఁ గొంచెము దుఃఖింప నామె నూరార్చి తానూరకుండెను. కమల యెంతమ చేతనో ధైర్యముఁ జిక్కఁబట్టి యంతవిస్తారముగాఁ బొగ లుట మాని గుండె రాయిచేసికొనెను. అగ్నిసంస్కారములఁజేసి దాల తరావు కర్మ నారంభించి రెండు దినములు గడచిన వెనుక ఢుండిరావును బిల్చి, కమలనుగూర్చి కొన్ని సంగతులనుగఁదలఁచి యిట్లనియె.

దాల—ఓరీ! ఢుండీ! మాయింటి కెంత దుర్దశవచ్చినది. నా కు నాకుడిహస్తము పడిపోయినదిగదా, యింక నాబ్రతుకేల?

ఢుండి—అవును దైవవశమున కేమిచేయఁగలము? మీకేమి మూఁడేండ్లదామె మీ వదినగారిమాటఁ దలఁచిన నాగుండెలు తాళు టలేదు.

దాల—ఆహాహా! ఏమి యీామెయందము! దైవము మిక్కిలి యయోగ్యపుపని చేసినాఁడు. ఇంతటి యందకత్తెను నేనెందును జూచి యెఱుఁగను. ఇటువంటి కన్య యెంత యదృష్టవంతునకు భార్యయగును.

ఢుండి—(కొంచెమాలోచించి సందేహముతో) ఆమె యెక్కడి కరుగఁగలదు. పాపము! ఇఁకనీవెదిక్కు నిన్నుఁగనిపెట్టుకొని యుండునుగ నుక నీవామె సుఖముఁ జూడుము.

దాల—మఱే. ఆమె నాదగ్గఱనుండునా? పుట్టినింటి కరుగునే మో. అయితే నీమెను మాయన్నగారు వివాహమాడినారా?

ఢుండి—వివాహమైనపుడు నేనక్కడలేనుగాని పెండ్లియైనదని మీయన్నగారు నాతోఁ జెప్పినారు. తోవలోఁ దన్నడిగినవారందఱి తోడ నీమె తనభార్యయనియే చెప్పెను. పెండ్లియగుటను సందేహ ములేదు.

V.R NARLA MEMORIAL LIBRARY D.P.R.I. Acc. No.

దౌ॥—అయినదా? నేను కాలేదనుకొన్నాను. సరే. ఇక విచారమే లేదు.

దుండి—విచారమెందుకు? నాదగ్గఱదాచక నీమనస్సులోనున్నది చెప్పు. నీకేమైన నాశకలదా? మనకు లాభించు నెడలఁ బెండ్లి కాలేదని చెప్పుదము.

దౌల—మిత్రుఁడా! నీవు నాకేమయిన సహాయముఁ జేసెదేని యీ కమలను మాయన్న పెండ్లియాడలేదని నేను వివాహ మాడవలయునని యున్నది. నీవు నన్ను మఱియొకలాగెంచవద్దు.

దుండి—నీకుఁ బ్రియముఁ జేయుటకంటె నాకు గర్తవ్యమేమున్నది? ఆమెను నయమున భయమున లొంగఁదీసి నీకు వివాహముఁ జేయింతు. ఈపదిదినములకర్మ ముగిసినదాక నోరెత్తబోకు.

అని వారు మాటలాడుకొనుచుండ దుర్గాబాయి లోపలినుండి వచ్చి కమలబాయిదురవస్థఁ గొంచెము విచారించి, యామెతల్లికిని దమ్మునకును వర్తమానము నంపుమని భర్తతోఁ జెప్పెను. సాధారణముగ నేమి కారణముచేతనోగాని దుండిరావునకు దుర్గయనిన దో నొకవిధమైన భయముగలదు. అందుచే నామె వచ్చినతోడనే లేచి యతఁడు మెల్లగా జారెను. తరువాత దౌలతరావు కమల పుట్టినింటికి వర్తమానము నంపుటకు సమ్మతించి తనమనోరథమును భార్యకు నెఱిఁగింపఁ గోరి యామెయొద్ద భయముగలవాఁడగుటచే నవంత సంశయించి యూరకుండెను. దుర్గాబాయి సద్వంశమునఁ బుట్టి సద్గుణములుకల యొకసుందరి. సదాచారుఁడు కాని భర్త సద్గుణపుంజమగు భార్యను జడియుట స్వభావమే యగుటచేత దౌలతరావున కామె పిఱికిమందయినను నీమూర్ఖుఁడు చీవాట్లను వెఱవక యప్పుడప్పుడు తనమనోరథములను నామెకుం దెలిపి యామెచే మొదలింపఁబడు వాడుకగూడ గలదు. దౌలతరావు దుర్గను జూచి సంశయమెల్ల విడిచి యిట్లనియె.

దౌ—పిల్లలులేనివారికి బ్రతుకు వ్యర్థముగదా! మాయన్నకు బిడ్డలు లేకపోవుటచేత నేనే కర్మచేయవలసివచ్చినది. నాకును బిడ్డలులేరు. ఈహల్కారువంశ మింతటితో నాశనమే కాఁబోవును.

దుర్గ—(ఈమాటలువిని సిగ్గునఁ దలవంచుకొని) "మీరెవరినైనఁ బెంచుకొనుఁ" డని ప్రత్యుత్తరమిచ్చెను.

దౌ—పెంచుకొనినవారికి ముప్పు గడచుట యరుదు. అంతకన్న తెగించి మఱియొకదానిని బెండ్లియాడుట యుత్తమము. నీకిష్టమయినచో నట్లు చేసెద. [వరు?

దుర్గ—నాకిష్టమయినదికాని మీకీవయసునఁ బిల్లనిచ్చువా రె

దౌ—ఇచ్చెడువారెవరు? పిల్ల సిద్ధముగనె యున్నది. నీవయ యొడిన—నది—

ఈమాట లతని నోటినుండి రాఁగానే దుర్గ వెలవెలఁబోయి చూడసాగి, "ఎవరు పిల్లయెవరు?" అని యడిగెను. అప్పుడు దౌలతరావు లేచి భార్య చేతులురెండును బట్టుకొని, "నేనొకమాటఁ జెప్పెదను కోపపడక వినుము. కమలను నాకిచ్చి వివాహముఁ జేయుము." అని యింక నేమో చెప్పఁబోవుచుండ దెబ్బఁదిన్న పామువలె బుస్సునలేచి దుర్గ కోపావేశముచేఁ బెదవులు తడఁబడ నిట్లనెను. "ఛీఛీ నీవంటి కఠినచిత్తునిఁ బాపకర్ముని నేనెందుం గనలేదు. అన్నగారి చితి తిన్నగఁ జల్లారనైనలేదు. అప్పుడే పుట్టెను దుఃఖములోనున్న యాయనభార్య నోదార్చుటకు మారామెను బెండ్లియాడెదనని చెప్పుటకు నోరెట్లువచ్చెను. విధవయని సందేహము లేదు. అన్నపెండ్లాము తల్లివంటిదిగదా యని గౌరవములేదు. నీముఖముఁ జూచినవారికి పంచమహాపాతకములు జుట్టుకొనును." అని యామె నిందసేయుచుండ దౌలతరావు మెల్లగ నామెతో "ఆమె నిజముగ విధవయైనచో నాది తప్పే మాయన్న యామెను బెండ్లియాడలేదఁట" యనెను.

దుర్గ—"ఈమాయమాట లెవరునీతోఁ జెప్పినారు? దుండిరావా యేమి? వానియమ్మకడుపు మాడ వానికి మరణమురాదు. ఆకాళికాదేవికి వానిమీఁద దయ. ఆదిక్కుమాలినవాఁడే నాకొంపఁ దీయుచున్నది. ఊరిలో సాటివారు విన్న నేమందురు? ఆమెకు పెండ్లిగాకున్న వైధవ్యమనుభవించుట యామెకు ముచ్చటా?"

అని పలుక దౌలతరావు భార్యను గోపింపవలదని బ్రతిమాలి, "నీకు సవతివచ్చునను రోషముచే నిట్లనుచున్నావు. కోపపడక నామద్దు చెల్లించు" మని వేఁడెను. దుర్గ యప్పలుకుల కలుకరెట్టింప, "నాతో మీరుమాటలాడవద్దు నాపనిమీఁద నేనుబోయెదను" అని చేయి వదలించుకొని లోనికిం బోయెను. తనకు సవతివచ్చునను నీర్ష్యచేతనో, విధవను వరించుటచేఁ గలుగు నప్రతిష్ఠను భరింపలేకయో, దుర్గ మిగులకోపమును విచారమునొంది తనభర్తకుం దనకుఁ జరిగిన ప్రసంగమంతయుఁ బూసగ్రుచ్చినట్లు కమలకుం దెలిపి జాగ్రతగ నుండుమని చెప్పి యామెకు నేసహాయము గావలసినఁ, దానుచేసెదనని వాగ్దానముఁ జేసి యంతతోఁ దృప్తిగలుగమిఁ దమయింటిపొరుగుననున్న రాధాకాంతరావు భార్యయగు రోహిణిబాయియొద్దకుఁ బోయి యీవార్త యామెకుఁ జెప్పి, రాధాకాంతునితోఁ జెప్పి సాయముజేయుమని కట్టుదిట్టముజేసివచ్చెను. దుర్గబాయి దౌలతరావుయొక్క దురుద్దేశముల నెఱిఁగించిన వెనుక కమల మిగుల భయపడుచుఁ దోఁడేలు నోటనుండి విడిపింపఁబడి పులినోటఁ బడితినిగదాయని దుఃఖింప నారంభించెను. మఱునాఁడు రాధాకాంతరాయలు భార్యచే విని దీనురాలగు స్త్రీకి మానహాని రాకుండఁ గాపాడవలెనని నిశ్చయించి, "కమలతో మాటలాడి ర" మ్మని రోహిణినంపెను. రోహిణియు దుర్గయు నెన్నివిధములనో తరచితరచి యామెవివాహమునుగూర్చియు స్థితినిగూర్చియుఁ దెలియఁగోరి యనేక ప్రశ్నలనడిగిరిగాని యామె తిన్నగాఁ బ్రత్యుత్తరమీయక, "నాకర్మము

నేననుభవింపక తప్పదు. జలమరణమొ, యగ్నిమరణమొ నా మొగమున వ్రాసియున్నది. నాకు మానహాని కలుగకుండ మీరుమాత్రము చూచుచుండుఁడు" అని యుత్తరముచెప్పెను. ఆమాటలఁబట్టి యామెకు మృతుఁడైన భర్తపై గాఢానురాగము గలదనియు నందుచే నామె ప్రాణత్యాగముఁ జేసికొనుననియు నిశ్చయించి రోహిణి మిగుల జాగరూకతతోనుండుమని దుర్గకు బోధచేసి మానహాని సంభవించునెడలఁ దనయింటి కామె నంపుమని నొక్కి పలుమారు చెప్పి యింటికరిగెను. ఆవేళ మధ్యాహ్నము రాధాకాంతరావు దౌలత్‌రావునకు నట్టిదుష్కార్యముఁ జేయవలదని హితోపదేశము చేసెను. ఆహిత మతనికి విషప్రయోగ మగుటచే దౌలతరావు మండిపడి వృద్ధుఁడగు రాధాకాంతుని ననరాని మాటలనెను. రాధాకాంతుఁడు వానిమాటలకుఁ దలపంకించి యీవిషయమున నెంతపనియైనఁ జేయ నిశ్చయించెను. దౌలతరా వామెను దప్పక వివాహమాడుటకు నిశ్చయించెను. కమల మానహాని సంభవించునని మృతినొంద నిశ్చయించుకొనెను.

ఆఱవ ప్రకరణము.

మహారాష్ట్రప్రభువులలో హోల్కారు కుటుంబము మిగుల గౌరవమునకుఁ బాత్రమైనది. ఈహోల్కారు వంశమును స్థాపనముఁ జేసిన శూరుఁడు మలహారురావు హోల్కారు. ఈతఁడు క్రీ॥ శ॥ 1683 వ సంవత్సరమున జనియించి, మొదటపీష్వాయొద్ద సిపాయిగ బాహుబలాతిశయముచేత వాసికెక్కిన యోధవరుఁడై తన ప్రభువులకు ననుగ్రహపాత్రుఁడయ్యెను. అందుచేఁ బీష్వాయగు బాలాజీరావితనికి మాళవదేశమున జాగీరులిచ్చి తనకు లోఁబడియుండున ట్లొక చిన్నరాజుగ నొనర్చెను. తరువాత మలహారురావు మఱికొంతరాజ్యము సంపాదించి మాళవ

దేశముననున్న యిందూరునగరమును రాజధానిగఁ జేసికొని పేరునకు మాత్రము పీష్వాకు లోఁబడినట్లుండి మాటలచేతను నప్పుడప్పుడంపు స్వల్ప బహుమానముల చేతను, దమ లొంగుబాటును దెలియఁజేయుచు, నిజముగ సర్వతంత్రస్వతంత్రుఁడై యథేచ్ఛగ రాజ్యముఁ జేయుచుండెను. కులమున నీచుఁడగు గొల్లవాఁడయ్యు బాహుబుద్ధిబలమున గొప్పవాఁడై మలహారురావు కొలఁదికాలమున నొకసామంత రాజగుటయె గాక యెల్లవిధముల నైశ్వర్యశాలియయ్యెను. కాని యాతని యుత్సాహవృక్షమునకు మూలము వదలించినట్లు భగవంతుఁడాయన కుమారరత్నమగు ఖండేరావును స్వర్గలోకమున కెత్తుకొనిపోయెను. ఖండేరావు మృతినొందునప్పటికి, శతవృద్ధుఁడై కాటికిఁ గాళ్లుచాపుకొనియున్న తండ్రియు మాలిరావను నొక మగ శిశువును, గుణవతియు విద్యావతియునగు నహల్యాబాయి యనుభార్యయు, గుణ ముక్తాభరణయగు ముక్తాభాయి యను కూఁతురునుండిరి. మలహారురావు మనుమని మనుమరాలినిఁ జూచుకొని పుత్రునిమరచి నిండుజవ్వనమున భర్తృహీనయయ్యుఁ బాతివ్రత్యమె ప్రధానముచేసికొని యొంటిపూఁట భుజించుచు, నేలఁ బండుకొనుచుఁ బుణ్యకార్యములఁ జేయుటచేఁ గాలముఁ బుచ్చుచు వివేకురాలగు కోడలిం జూచుకొని దుఃఖము దిగమ్రింగి యెట్టటో రాజ్యభారముఁ గొంతకాలము మోసెను. తదనంతరమునఁ గొన్ని దినములకు మలహారురావు కాలధర్మమునొంద మనుమఁడగు మాలిరావునకు మంత్రులందఱుఁ బట్టముఁగట్టిరి. కాని యచిరకాలంబుననె వానికిఁ గాలమాసన్న మగుటచే నతఁడును దండ్రితాతల దర్శింపఁబోయి హోల్కారువంశము సంతతితో నస్తమించునట్లు మగపురుగు లేకుండఁజేసెను. భర్తయు, మామయుఁ గుమారుఁడు నించుమించుగ నొకమారు కాలధర్మమునొందుటయు హోల్కారువంశము నశించుటయు నిందూరురాజ్యలక్ష్మి తనవలె ననాథయగుటయు, జనులు రాజహీనులై

యుంటయుఁ జూచి యహల్య యబలయయ్యు దుఃఖసముద్రమున మునిఁగియు విధిలేక ప్రజారక్షణార్థమై రాజ్యముఁబూనెను. ఇది యామె మంత్రులలో ననేకుల కిష్టములేదు. ఇష్టములేకున్నను, దేశ మరాజకమై పరరాజులపాలగుటఁ గన్నులారఁ జూడలేక యహల్యాబాయి యంతటి సాహసముఁ బూనవలసివచ్చెను.

రాణోజీ పల్కారు మృతినొందిన నాల్గవనాఁడు మహులాపురము నుండి శ్యామసుందరదత్తు రాధాకాంతరావు గృహమునకువచ్చి ఋషికిం దనకుజరిగిన ముచ్చటలను రాణోజీ మరణవిధమును దన సహాయమును దెల్పెను. శ్యామసుందరదత్తుయొక్క తండ్రియగు పరమేశ్వరదత్తు రాధాకాంతరాయునకుఁ బ్రాణమిత్రుఁడై నందునఁ దనమిత్రుని కుమారుని బాగుచేయవలెనని రాధాకాంతుఁడు శ్యామసుందరునకు నప్పటికి స్వల్పకాలముక్రిందట నెలకు ముప్పదిరూకల జీతముగల యుద్యోగమును జెప్పించి, యతనికి నెవ్వరు బంధువు లచ్చటలేమి, తనయింటనె భోజనమిడుచు వానినభివృద్ధికిఁ దెచ్చుచుండెను. రాధాకాంతరావు, చనిపోయిన మలహారురావునకు గుండెకాయయనియు, బహిఃప్రాణమనియుఁ బ్రజలు చెప్పుకొనుటయెగాక వా రతనియందమితగౌరవముంచి యతని యాజ్ఞానువర్తులై యుండిరి. రాధాకాంతుఁడు డెబ్బదిసంవత్సరముల కన్న నెక్కువ వయసుకలవాఁడు. అయినను దేహపటుత్వము చెడక దార్ఢ్యముకలిగియుండెను. జీవించియున్నపుడు మలహారురావునకును, నతఁడును మాలిరావును మృతినొందిన వెనుక నహల్యాబాయికిని, రాధాకాంతుఁడు తనప్రాణములుగూడ ధారపోయునంతటి భక్తికలిగి నిష్కపటియై వర్తించెను. శ్యామసుందరదత్తు రాధాకాంతునియెడలను నంత కృతజ్ఞతఁ జూపుచు రాణియందు నట్టి భావముంచి పనిఁజేయ సాగెను.

వచ్చిననాటిరాత్రి రాధాకాంతరావు శ్యామసుందరుని వెంటఁ బెట్టుకొని శ్రీయహల్యాబాయి రాణీగారిని దర్శించుటకుఁబోయి వాకిటనిల్చి తమరాక నెఱుంగఁజేయుమని లోనికిఁ బ్రతీహారినంపెను. లోపలకిరమ్మని రాణీగారి సెలవైనదని సేవకుఁడు వచ్చి తెలుప నంతఃపురమున నొకగదిలోనికి వారిం గొనిపోయెను. ఆగదిలో ముత్యాల జాలరువలె నమర వేయఁబడిన తెల్లతెరచాటున నల్లనిబక్కపలుచని యంగనయు నామెకుఁ గొంత వెనుకగఁ బదునాఱు వత్సరముల యీడుగల జవ్వనియొక్కతెయుఁ గుర్చీలపైఁ గూర్చుండిరి. రాధాకాంతరావును శ్యామసుందరుఁడును తెరసమీపమునకుఁ జని యానల్లని స్త్రీకి నమస్కారము గావించి తమకై వేయఁబడిన పీఠములపై సుఖోపవిష్టులైరి. దత్తుదివఱ కెన్నఁడు నహల్యాబాయిని జూచియెఱుఁగఁడు. కాఁబట్టి, సౌందర్యవతిగాక నల్లని శరీరకాంతి గలిగి సామాన్యస్త్రీవలె సాధారణ వస్త్రములు గట్టుకొని యాభరణములనైనఁ దాల్పక కృశించియున్న యా యంగనను దన యేలికయగు రాణిగఁ గొంతసేపటివఱకుఁ దలంపక రాణీ యెంతో వైభవముతో నుండుననియు నిఁకనుముందు వచ్చుననియు నెదురుచూడసాగెను. అట్లు వీరిరువురు లోని కరిగి కూర్చుండినవెనుకఁ గ్రొత్తవాఁడగుదత్తునిఁజూచి పడుచుకన్నెయగు ముక్తాబాయి దగ్గఱనున్న గదిలోనికిఁ జనెను. అప్పు డహల్యాబాయి తెరఁ దీయించి దత్తును రాధాకాంతుని దేఱిపాఱఁజూచి, “నీవుమాతో మాటలాడిన దీబాలునివిషయమేనా” యని యడిగెను.

రాధా—చిత్తము. ఈకుఱ్ఱవాఁడే. ఏలినవారు నాయం దెట్టిభావముంచినారో యీబాలునియందుఁగూడ నట్టిభావ ముంచఁదగును.

అని రాధాకాంతరాయలు మెల్లగ నుడువుచుండ రాణికనుల కొలుకులనుండి వేఁడికన్నీళ్ళ బిందువులు జార నారంభించెను. అంత యాకస్మిక దుఃఖమునకుఁ గారణమేమని వీరాలోచించుచు గొంతసేపటికి గద్గద

స్వరముతో రాధాకాంతరా విట్లనియె. "అమ్మా యేమిది. ఇట్లు మీరుండుటకుఁ గారణమున్నను ధైర్యమూనక విధిలేదు"

అహల్యాబాయియు నామాటలువిని యూరటములేక, "యీ బాలుని ముఖముచ్ఛ్రముగ నాతనివలె నున్నది. హా! మాలిరావూ! నాయనా! నీమరణముచేత నేగదా నేనీ విశ్వాసహీనులగు మంత్రి పశువుల నాశ్రయించుట? హా! తండ్రీ! నన్నే కాకిఁ జేసిపోతివా!" యనియామె విచారించుచుండ లోపల గదిలోనుండి ముక్తామణులవలె బాష్పములు చెక్కులమీఁదినుండి జార ముక్తాబాయి బేలయై రోదనముఁ జేయసాగెను. రాధాకాంతుఁడు వారి విలాపముచే హృదయము గరుగ రవంతవంతఁ దానుగూడ నొంది యనుచితమగు నాకార్యము మానుల పురుషలక్షణమని కన్నీరుఁ దుడుచుకొని, "అమ్మా యేలినవారు విలపింప ధైర్యముఁ జెప్పువారెవరు? మాలిరావు మీగర్భమునఁ జిచ్చుపెట్టిపోయెను. ఇది యాజన్మాంతమును బోవునదియు మరపు వచ్చునదియుఁగాదు. ధైర్యము దెచ్చుకొన్నను మీరే. దుఃఖించినను మీరే. ప్రజలు మీ బిడ్డలు. ఆకుమారుఁడు పోయిన మేమున్నవారము." అని యూరార్ప రాణి కొంత సేదదేరెను. తరువాత వారిట్లు మాటాడిరి.

అహల్య—నేను నీవు చెప్పినట్లు ప్రజలనె బిడ్డలుగ నమ్మకొంటినిగాని వారు నాయందు విశ్వాసములేక రాజ్యమునకు శత్రువులుగాఁ గొందఱున్నారు.

రాధా—అమ్మా! అంతటి పాపకర్ములు, నదృష్టహీనులెవ్వరు?

అహ—నేను నీయందును గంగాధర జస్వంతరావునందును నాయాసలన్నియు నిల్పియుంటినికాని నాయాస—

రాధా—(తొందరతో) అమ్మా! నావిషయమై మీకు సందేహమేల? ఇదిగో మీపాదములుసాక్షి. నేను నాప్రాణమునకై నన్ను లెక్కసేయను. నావిశ్వాసము మీకు విశదము.

అహ—నేను నీవిషయము చెప్పలేదు. గంగాధర జస్వంతరావునుగూర్చి- నిన్న నతఁడు నాదగ్గఱకువచ్చి కుమారుని బెంచుకొమ్మని నాకనేకవిధముల నుపదేశమొసర్చి నేను రాజ్యము పరిపాలించుట ప్రజల కిష్టములేదని కఠినముగాఁ బలికెను. పురోహితుఁడును మంత్రియుఁగదా నాకుపకారము సేయునని దలఁచితినిగాని యిట్లగునని యెన్నఁడెంచలేదు. ఈమాటలు చెవిఁబడ ముక్తాబాయికి మనస్సు మనస్సులోలేక, “జస్వంతరావునకు మా యమ్మగారికిని వివాదము లేకయుండవలెనని నాకోరిక. దైవమా! నీవు వీరికి సఖ్యముఁ గలుగఁజేయుము.” అని తన మనస్సున బ్రార్థనజేసెను. రాధాకాంతరావు గంగాధరుని విషయమై మొదటనుండియు సందేహము నొందుచుండుటచే నతని యనుమానము రాణి తెలిపిన సంగతులచే ధృవపరుపఁబడెను. దత్తు రాణిమాటలకు నర్థము స్పష్టముగా నెఱుఁగక, సత్ప్రవర్తనమునకు నిధివలెఁ గనఁబడుచుండు జస్వంతరావు దుర్మార్గమునకు నొడఁబడునాయని వితర్కింపసాగెను. తరువాత నీక్రింది సంభాషణ జరిగెను.

అహల్య—ఇంకను విశేషములేమి? రాణోజీ, పాపము పోయినాఁడట. దౌలతరావునకుఁ జాలకష్టము సంభవించినది.

రాధా—అతనికేగాదు. చచ్చెడివాఁడు చచ్చుచు నతఁడొక పిల్లగొంతుకఁగోసినాఁడు. వివాహమాడి యిప్పటికి నెలకాలేదు. పాపమా భార్యకూడ నిక్కడికివచ్చినది. ఆమె యతి సౌందర్యవంతురాలు

దత్తు—అతిదుర్మార్గుఁడగు దౌలతరావు పాప మామెను బాధించుచున్నాఁడఁట.

అహ—ఏమీ! నా పాలనారంభమందుఁ బతివ్రతలకు బాధకలుగునా? అట్లయిన నామీఁద నతని కాగ్రహమువచ్చినను వచ్చుఁగాక. దౌలతరావును నేను మందలించి యామెకష్టమును మాన్పెదను. ఆ కష్టమెట్టిదో నాకుఁ దెలియఁజేయుఁడు.

రాధా—వదినెగారిని తాను పెండ్లియాడునంట. ఇది మంచిది గాదని మావంటివారు తెలుప నామెకు వివాహముకా లేదని చెప్పును. ఆమె వివాహమైనదని వైధవ్యమనుభవింప సిద్ధముగ నున్నది. అయిన ను దమరింక జోక్యము గలుగఁజేసికొనవద్దు. అతఁడు దుష్టుఁడు. అ తఁడు శతృగణములోఁ జేరిన మనకు నష్టముకలదు.

అహ—అతఁడు శతృపక్షమునఁ జేరిననుసరే, నారాజ్యము పోయిననుసరే? ఇంతపాపకర్ముని నేను జూచుచు సైరింపఁ జాలను సా ధుబాధ నివారింపకున్న నారాజ్యమెందుకు?

దత్తు—(తనలో) ఆహాహా యేమి యీమె ధర్మగుణము! ధర్మ దేవత యీమెగానవతరించియుండును. దేవుఁ డీమెను రక్షించుఁగాక.

రాధా—అమ్మా! అట్లయిన జస్వంతరావు మొదలగువారిలో నెవ్వరుచేరినారు? ఏమి ప్రతిక్రియ మనము చేయవలయును?

అహ— జస్వంతరావులో దౌలతరావు చేరును. ఇంక నెవరుచే రుదురో తెలియదు. మీరు నాయందు గాఢానురాగు లగుదురేని నే ను గెలువఁగలను. నేను శౌర్యము ప్రధానముగాఁ గల మహారాష్ట్రస్త్రీ నని నమ్ముఁడు.

రాధా—అమ్మా! మీపాదములు సాక్షులుగా శ్రీవిశ్వేశ్వరుఁ డుసాక్షిగ, నేను నా జన్మాంతరముదాక మీయెడ విశ్వాసము గల్గి యుండెద. అబ్బాయీ! దత్తూ నీవుగూడఁ బ్రతిజ్ఞఁ జేయుము.

దత్తు—అఖిలదేవతలు సాక్షులుగ నేను మీయాజ్ఞ నెఱవేర్తున ని, యట్లు ప్రమాణము చేయుచున్నాను.

ఇట్లు వారుపలుక నహల్య సంతోషించి వారినారాత్రికి వీడ్కొ ల్పినదయ్యెను.

ఏడవ ప్రకరణము.

గంగాధర జస్వంతరావు నలుబది యేండ్లలోపు వయస్సుగల వాఁడు. బుద్ధిబలముచేతను, బాహుబలముచేతను నతఁడు తలఁచిన కార్యములెల్ల నిర్వహింపఁగల సమర్థుఁడు. మలహారురావు హోల్కారుకాలమునుండియు నతఁడు పురోహితుఁడును మంత్రియునై వైదికలౌకిక కార్యముల నమోఘముగ నిర్వర్తించుచు రాజమందిరమునకు మూలస్థంభమైయుండి, యాతఁడు మృతినొందినతరువాత నధికారమునంతను దనచేత నుంచుకొనవలెనని దురాశ జనియించినందున రాజ్యము నహల్యాబాయి వహించినఁ దనయాటలుసాగవని యామెను కుమార స్వీకారము జేసికొమ్మని బలవంత పెట్టసాగెను. కుమారుని బెంచుకొన్నయెడల నతఁడు యుక్తవయస్కుఁడగువఱకు రాజ్యము మంత్రులచేతులలో నుండుననియు, నందుచే దురాశాపీడితులగువారిమూలమున దేశమునకుఁ గీడురాఁగలదనియు, విశేషించి తనకు ముద్దులుమూటగట్టు కొమార్తె యుండఁగా నామెను రాజ్యమొసఁగక పరుని నెవనినో తెచ్చి వానికి రాజ్యమును గట్టఁబెట్టుట యనుచితమనియునెంచి యామె పెంచుకొనదయ్యెను. అందుచే గంగాధరుఁ డాగ్రహించి తనలో నింక గొందఱిని జేర్చుకొని రాణిపైఁ గక్షవహించెను.

వెనుకటి ప్రకరణమునఁ జెప్పఁబడిన సంగతులుజరిగినమఱునాఁడు రాత్రి గంగాధరజస్వంతరావు భోజనముచేసి తన మిత్రుల నిమిత్తమెదురుచూచుచుండెను. అంతలో హరిహరపాండ్యాజీయను బ్రాహ్మణుఁడు తన యెట్టని స్థూలదేహము దీపపువెలుతురులోఁ బెద్దనీడను వ్యాపింపఁజేయవచ్చి, “ అయ్యా! గోమాజీరావు దౌలతురావు మొదలగు వారు సిద్ధముగ నున్నారు. వారి నిక్కడికిరమ్మని నేను జెప్పినాఁడను. వారు త్వరలో రాఁగలరు. మీ భోజనమైనదా? అని యడిగెను.

"ఆహా నేను సిద్ధముగనుంటిని. కాని రఘునాథరా వేమనుచున్నాఁడు? నేను చెప్పినట్లు నీవు చెప్పినావా? అని పాండ్యాజీతోఁ బ్రత్యుత్తరమిచ్చి కొన్ని ప్రశ్నలు వేసెను.

హరి—ఈకార్యము రఘునాథరావున కిష్టమే. నీవెపుడు రమ్మనిన నపుడె దండెత్తివచ్చి యహల్యాబాయిని సింహాసనమునుండి లాగును.

జస్వ—నిజముగా నాతఁడట్లు వాగ్దానముఁ జేసినాఁడా?

హరి—అతనికి నేను గుండెకాయను. నాతో నిజముపలుకును గాని యబద్ధము పలుకఁడు. నీవు కొంతరాజ్యము వానికిచ్చుటకు సమ్మతింతువని నిన్నే హోల్కారుగఁ జేయునట్లుగూడ నేను జక్కఁజేసినాను.

జస్వం—ఆహాహా! నాకు నీకంటెఁ బరమమిత్రుఁడు లేఁడు. నన్ను హోల్కారుగఁ జేసినపక్షమున నేనతనికి సగమురాజ్యము నిచ్చుట కాశ్చర్యమా కష్టమా? కాని నేను హోల్కారును గావలెనని పట్టింపు లేదు. ఈయాఁడుదాని పాలనలో నుండకపోయినఁ జాలును. అహల్యనుజూడ నామొదలు మండునుగాని ముక్తాబాయిని గనుగొన్న నాహృదయము జాలినొందును.

అని జస్వంతరావును హరిహరపాండ్యాజీయును ముచ్చటించు సమయమున సేవకసమేతుఁడై గోమాజీరావు గుమ్మమును దాఁటివచ్చెను. అంతట జస్వంతరావు మాటలాడవలదని పరమవైరిసుఁడగు హరిహరునకుఁ గనుసన్నఁజేసి ముందుగా, "ఓహో కొత్వాలుగారు కాఁబోలును. మమ్ముఁ జెఱసాలలోనుంచుటకు వచ్చినారాయేమి! ఆయన యెవ్వరు!" అని పరిహాసముగఁ బలికెను. గోమాజీరావు నవ్వుచు "మీరు రాణిపైఁ గుట్రలు గావింపుచుండ వారిసొమ్ము దినువారము మేమూరకుందుమా! అయితే దౌలతరావు రాలేదా! ఈతఁడు నాస్నేహితుఁడు. ఈతని కాఁపురము ఘాసిమూగాఁవునుము. మనకార్యమున కనుకూలుఁడు.

ఇతని పేరు సకారాం" అని చెప్పునంతలో ద్వాపర సమేతుఁడగు కలివలె దౌలతరావు దుండిరావుతోఁగూడ గృహము నలంకరించెను. జస్వంతరావు వారినిగూడ సన్మానించి యంతటిని మేడమీఁదికిఁ గొనిపోయెను. అందఱు నొకరి నొకరెఱిఁగిన వారేగాని సకారాము నెవ్వరు నెఱుఁగరు. అతఁడువచ్చి గోమోజీకి కుడిప్రక్కను గూర్చుండెను. అతని యెదుట తమ రహస్యములను మాటలాడుకొన నందఱు సందేహించిరి. కాని గోమోజీరాయుని ప్రోత్సాహముచే నివారితసంశయులై మూటగట్టుకొనివచ్చిన రహస్యములను విప్పిరి. అప్పుడు వారందఱు నీక్రిందివిధమున మాటలాడిరి.

జస్వం—స్నేహితులారా, మన మిచ్చటఁజేరిన దెందునిమిత్తమో మీ రెఱుఁగుదురు. మనస్వామియైన మల్హారురావుగారు చనిపోవుటయు వారికిఁ గుమారులును మనుమలును లేకపోవుటయు మన కెంతటి విచారమును శ్రమను గలిగించినవి. అది యటుండ, వంశనాశనమయ్యెనని విచారము గలిగి మన రాణిగారికిఁ బుత్రస్వీకారము జేయవలెనని నేను బ్రయత్నముఁ జేయుచుండ మనరాణి—రాణియనుటకునోరాడలేదు—యహల్యాబాయి మనపై నధికారముఁ జేయవలెనని పెంచుకొనననని స్పష్టముగఁ జెప్పినది. అదిగాక నన్నడ్డమైన మాటలాడినది.

గోమో—ఆహాహా! యెంత దుష్కార్యము, ఆఁడుది రాజ్యముచేయుట కూడవచ్చినది.

దౌల—ఆమెకు మామగారిచావు కుఱ్ఱగుంటచావు పండుగయైనది. ఎంతకఠినరాలుగాకున్న కుమారుఁడు కడతేఱి మూఁడుమాసములు కాలేదు. ఇంతలోనే రాజ్యమేలఁదలంచునా!

జస్వం—కొడుకు చచ్చెనని విచారముగాని, ప్రజలు తన్నేమందురో యనులజ్జగాని యామెను బాధించుటలేదు. రాజ్యకాంక్ష దుఃఖమును లజ్జనుగూడ మఱపించునుగదా!

మండి—కర్తవ్యాంశమును వేగమె వితర్కించుట మంచిది.

జస్వం—ఇపుడు నేఁజెప్పఁదలఁచిన దేమన్న మనమందఱము పరువుగల మహారాష్ట్రులము. శివాజికాలమునుండియు మనవారు ప్రాణములకంటె మాన మెక్కువగనెంచినమాట నేను వర్ణింప నక్కఱలేదు. ఇంతంత బలవంతులమై యింతంత బుద్ధిమంతులమై కటకటా! తుదకు పనికిమాలిన యాఁడుదానిచేతఁ బరిపాలింపఁ బడవలసినంతటిదురదృష్టవంతులమైతిమి. ఈయాఁడుదాని ప్రభుత్వమున మనకున్న గౌరవము నిలుచునా! మీరీమెచే నేలఁబడుట కిచ్ఛగలవారా! మీకు మీసములేదా! శూరులుకారా! మహారాష్ట్రులకుఁ బుట్టలేదా! మీరు మహారాష్ట్రులగుదురేని యామెనురాజ్యవిహీనురాలుగఁ జేసి ప్రీతి విషయమును నామె యత్నములకు విఘ్నము గావింపుఁడు. ఇది మీకు సమ్మతమేనా!

డాల—సమ్మతమాయని యడుగుచున్నావా! ఆఁడుదాని పాలనలో రెండుమూఁడు నెలలున్నందుకే సిగ్గుపడి తలపొట్టలోఁ బెట్టుకొనుచున్నాను. నీవెట్లుచెప్పిన నట్లు చేసెదను. ఈమెప్రయత్నము భంగముచేయుటకు దేశముననున్న భిల్లులను సహాయము జేసికొని మనము దేశము కొల్లఁగొందము. అప్పు డామె లొంగును.

జస్వం—ఆమెమీఁదఁ గోపముచే నిష్కారణముగ నిరపరాధులగు ప్రజలను క్షోభ పెట్టుట మంచిదికాదు. మనమెంత కొట్టుకొన్నను, దేశమున కరిష్టము రాఁగూడదు. ప్రజలసుఖము చెడరాదు.

గోమా—నే నిదివఱకే దీనినిగూర్చి కొంచె మాలోచించినాను. ఉదయపురమహారాణావారికి వర్తమానమంపి మన దేశముపై దండెత్తుమని ప్రోత్సాహపెట్టి యతనికిఁ దగుసహాయముఁ జేయుట యుక్తము. భేతాళసింగుతో నే నిదివఱ కామాట తలపెట్టినాను.

జస్వం—రాజపుత్రు లసాధ్యులు. తీసికొని వచ్చుటయేగాని మరల వదల్చుకొనుట మన తాతతరముగాదు. అందుచే వారిని బిలువవలదు. ఒకరిని బిలుచుటయే యుక్తమైన శ్రీ రఘునాథరావును రమ్మందము.

దాల—కొంచెమది బాగున్నది. (అని దుండీరావు చెవిలో) ఈజస్వంతరావుమెల్లగ రఘునాథరావును రప్పించి తన మనోరథసిద్ధికైఁ బ్రయత్నించుచున్నాఁడు. మనము భిల్లుల వదలఁ గూడదు.

దుంఢీ—అయ్యా, యింకొకసంగతి. మన రహస్యముల నెఱుఁగుటకు రాధాకాంతుఁడును, వానితో నున్న శ్యామసుందరదత్తుడు, దమతపస్సుధారపోయుచున్నారఁట. వారు మనలను బట్టుకొందురఁట, జాగ్రత్త.

దాల—చెప్పుట మఱచితిని. ఆకుఱ్ఱవాఁడు, శ్యామసుందరుఁడు, తెగ నీలుగుచున్నవాఁడఁట. ఓయీ, గోమోజీ, యేదోవంకఁబెట్టి వానిని గడతేర్చెడునుపాయముఁ జూడుము. నీవు కొత్త్వాలువ్రగడా చేయఁగలవు.

గోమో—వాఁడక్కడ నన్నుఁగూర్చి ప్రేలుచున్నాఁడఁట. వాని విషయమై యేపనిచేయుమన్నను జేయుదును. ఇఁక మన మరుగుదము లెండు.

జస్వం—మీరు నాపలుకుల కియ్యకొనిరిగనుక నేనామెతోఁ బ్రత్యక్షకక్ష వహించెద. ఆమెదగ్గఱ నాకుద్యోగము వద్దనియు, గొడుకును బెంచుకొనకయున్న నామెకు మాకు సంబంధము లేదనియు నామెకు నే నుత్తరము వ్రాసెద.

గోమో—నా మాట నీవందు వ్రాయకుము. నే నీకొత్త్వాలు పనిలోనుండియే నీకు సమస్తసహాయములు జేసెదను. ముందుగా నుద్యోగము మానుటెందుకు?

జస్వం—ఇంతటి ధైర్యమేనా నీది? ఓయీ దౌలతరావూ, నీవు మీయన్నభార్యను వివాహమాడెదవని విన్నాను. ఆపనిమాత్రము వద్దు. అట్లయిన మనపైఁ బ్రజలకు నమ్మకముండదు.

దౌల—దానికేమిలే యెట్లో సాపాయించవచ్చును. అప్పుడే మైనదా, మనమందఱు మింక్లకుఁ బోదమురండు.

అని యందఱును లేచి యుచితపరికారమున సెలవు గైకొని పోయిరి. సకారాము దేవళములో విగ్రహమువలెఁ గూర్చుండెనేకాని యొక మాటయు మాటాడలేదని జస్వంతరావు సందియమందియుఁ గారణ మడుగఁడయ్యెను. అందఱును గృహము వెడలిరి. గోమాజీరావు సకారామును వెంటబెట్టుకొని కొంతదవ్వరిగి యచ్చట నతని చెవిలో మెల్లగా "ఓయీ స్వలాభపరాయణులు దురాత్ములునగు వీరిని నమ్ముకొని నాయుద్యోగము మానుకొందునా? యెటుపోయి యెటువచ్చునో దౌలతరావుజస్వంతరావులు తమ తమ మనోరథముల నెరవేర్పఁదలఁచి యీ యెత్తులెత్తిరి. అని నేనెఱుఁగనా? ఏమైనను రాణావారిని వచ్చి నింబపురమును గైకొమ్మని చెప్పము. ఇంక నీవరుగుము. అని నెక్కిపలికి వానినంపి తాను స్వగృహమున కరిగెను.

ఎనిమిదవ పరికరణము.

"నేను మీముఖ్యమంత్రులలోనివాఁడనని మీరెంచుకొనుట లేదు. అట్లు మీరెంచుకొనినపక్షమున నా యాలోచనమునకు మీరు చెవియొగ్గియుందురు. పుత్రస్వీకారము చేసికొని నిర్మలమయిన హోల్కారువంశమును నిలుపుమని హితోపదేశము గావించితిని. కాని నేనెగ్గుచేయలేదు. అయినను నామాటలు విషభోజనమువలె మీకు రుచింపవయ్యె. మతిలేని వృద్ధజంబుకముయొక్క మాటలను జితుకులమంట

వలె వేగిరపాటుగల పడుచువాని కారుకూఁతలను, నమ్ముకొని వారు మి మ్ముద్ధరింపఁగలరని చిరకాలమునుండి రాజ్యమునకు మీకు నమితోప కారమొనర్చిన మావంటివారిని నిరాకరించితిరి. వారు మిమ్ము ద్రో హముచేసినపుడే మీరు పశ్చాత్తాపమునొంది మరల మమ్మాదరింపఁగల రు. ఇంక నేను మీవాఁడనని నాయందాశయుంచుకొనవద్దు. నేను మీ కును మీరాష్ట్రమునకును నిష్టుఁడనని మీరెంచినారు కారు గనుక నేనల్లె యుందును. కుమారుని పెంచుకొనలేని మీయొద్ద నేనుద్యోగము చేయ ను. ఇవి త్రికరణశుద్ధిగ నేను వ్రాసినమాటలు. ఇందుకు తిరుగు లేదు.” అని యున్న లేఖను జదువుకొనుచు మహారాణి యహల్యాబాయి తన గదిలో నొక పీఠముపైఁ గూర్చుండి నడుమనడుమ ముక్తాబాయి జాబు నుగూర్చి యడుగు ప్రశ్నలకుఁ బరాకుగఁ బ్రత్యుత్తరమిచ్చుచుఁ గర్త వ్యము నూహింపుచు రాధాకాంతుని నిమిత్తమెదురు చూచుచుండెను. అంతలో రాధాకాంతుఁ డరుదెంచి యథోచితముగఁ దనరాణికి నమ స్కరించి యుచితాసనమునఁ గూర్చుండెను. ముక్తాబాయి చిన్నతనము ననుండి రాధాకాంతునియందుఁ బితృభావముంచి గౌరవించుటచే నతని యొద్ద ఘోషాపద్ధతి యక్కఱలేక యథేచ్ఛముగ మాటలాడును. మ హారాణి యంత రాధాకాంతుని మొగమువైపుజూచి ‘యీచమత్కా రమును నీవెఱుఁగవు కాఁబోలును. ఈ చీటి చదువుకొమ్ము” అని యాయు త్తరము నతనిపై వైచెను. అతఁ డాయుత్తరమును నామూలాగ్రముగఁ జదువుకొని విస్మయముతో నొకమాఱు గుండెకొట్టుకొని ‘అమ్మా జ స్వంతరావెంతవాఁడయ్యెను. ఇంతవాఁడగునని నేనెన్నఁడు నెఱుఁగను. అమ్మా వ్యవహారము శ్రుతిమించి రాగమునఁ బడినది. మనము జాగ్ర త్తగ నుండవలె” నని చెప్పెను. అనవుఁడు నాదేవి ‘ఇటువంటి తుచ్ఛు లు వేయి పన్నుగడలు పన్నినను నేను బెదరను. వారికి వినాశకాల మాసన్నమగుటచే నిట్టిబుద్ధులు పుట్టినవి. వారు నాకు లోఁబడకున్నను

వారిప్రాణములు నాఖడ్గమునకు లోఁబడకమానవు. కాని మనకు నెవ్వరు కృతజ్ఞులుగ నుండరో వారినందఱఁ జేర్కొనుము" అని ప్రత్యుత్తరమిచ్చెను. రాధాకాంతరావుపలుకుల నాలకించి రాణి మనోధైర్యమున కుబ్బి "శివనానా మన కాప్తుఁడు. అతని నింబపుఁ మందుంచుటలో మీరు మంచిపని చేసినారు. గోమాజీరావు కొత్వాలుకూడ మంచివాఁడనియె తోఁచుచున్నది. తుకాజీహోల్కారు కుక్కవంటి విశ్వాసము గలవాఁడు. కాని నీచుఁడగుటచే నతనికి గొప్పయుద్యోగమీయఁదగదు" అని యుగ్గడించుచుండ నతనిమాట కడ్డమువచ్చి రాణి "వంశము చేత నీచుఁడైనను గుణములచేతను రాజభక్తిచేతను మన తుకాజీయుత్తముఁడు. అందుచే నతనికి సైన్యాధిపత్య మొసఁగితిని. గోమాజీరావు సంగతి నిశ్చయముగఁ జెప్పఁజాలను. నీవాతనిఁగూర్చి వాకబుచేయుచుండుము. కాని వీనికంటె నాకు నొకయెక్కువవిచారము పట్టినది. ముక్తాబాయి కలతపడియున్నది. ఆమెతమ్మునినిమిత్తము బెంగపెట్టుకొనినది. మనోవ్యాధికి మందులేదుగద! దీనికేమియుపాయము చేయవలెనో యెఱుఁగ" నని పలికెను. ఆపలుకులు విని రాధాకాంతరావు, రాణితో నిట్లనియెను. "ఆమె నిజముగ బెంగపెట్టుకొన్నది. మనసు తమ్మునిమీఁద కరుగకుండ నిరంతరము నామె కుత్సాహ జనకములగు పలుకులు చెప్పువా రుండవలయు. అట్లు చేయుటకు మీకు తీరిక లేదు. నాదగ్గఱ నొకదాసియున్నది. ఆమెబహు చమత్కారకథలనేర్చును. ఎవ్వారికైన నామె మొగముచూడ సకలదుఃఖములు పోవును. ఆమెను నేనిక్కడ కంపెదను. ముక్తాబాయి నామెగు జతఁజేయుఁడు. అంతట నామెదేహమునఁగల రుగ్మత నశించును. ఇంక నే సెలవుగైకొని పోయివచ్చెదను. కానియెడుగ మఱచినాఁడ దౌలతరావు విషయమై యేమిచేసినారు. స్త్రీరాజ్యమేలుచుండ స్త్రీకి మానగౌరవము దక్కకున్నచో నింకఁ జెప్పనదియేమి? అన్నియు ముగిసినవెనుక మూరుకనుగొన్న నేమిలాభము?

ఆమె ప్రాణత్యాగము చేసికొనక మునుపే యామె పాతివ్రత్యము చెడకమునుపే, మీరు సాయము చేయవలెను.” అను రాధాకాంతుని కఠినోక్తులచే రాణికి రోసము జాలియుఁ గల్గినందున నామె ‘ఓయీ నేను జీవించియుండిన కమలాంబాయికి మానభంగమగునా! దౌలతరావును బిలిపించి యిపుడే మందలించెద. ఇదివఱకే రమ్మని వానికి వర్తమానము బంపితిని. ఎంతకష్టమునకైన నోర్చి యామెను రక్షింతు నీవింక బొమ్ము దౌలతరావు వచ్చువేళయైనది” అని పలికెను. రాధాకాంతుఁడందుకు సంతసించి సెలవుగైకొని స్వగృహమున కరిగి కమలాబాయి స్థితిఁ గనుగొనుమనియు నామెతోఁ గొన్ని రహస్యములు జెప్పుమనియుఁ దనభార్యనంపి యామెవిషయమై జాగ్రతగనుండెను.

రాధాకాంతరా వరిగిన యొక గడియలోపున దౌలతరావు తన యేలిక దర్శనమునకువచ్చి గుమ్మమునందుండి తనరాకఁ దెలియఁబఱచెను. లోపలికి రమ్మని సెలవయినతోడనే మొగమున లేని గాంభీర్యమును దెచ్చిపెట్టుకొని మొలలో నెకవేళ నపాయమేదయిన జరుగునేమోయని ప్రాణసంరక్షణార్థమై తెచ్చిపెట్టుకొన్న కయిజారు గనఁబడకుండజేసి లోనికరిగి రాణిదర్శనముచేసి సాష్టాంగనమస్కార మొనర్చి నిలువబడెను. రాణి నాలుగు నిమిషములు వానివంకఁజూచి కూర్చుండుమనెను. తరువాత వారియుభయులకు నీక్రింది సంభాషణ జరిగెను.

అహ—పాపము మీయన్నగారు పోయినందుకు మాకు చాల విచారముగనున్నది, ఈవేళకు నాఋనెకటికాదా నీకు చెడ్డకష్టము వచ్చినది.

దౌల—(తలవంచి) ఏమిచేయఁగలము. కాలవశము.

అహ—ఆతనిభార్య యెక్కడనున్నది, క్రొత్తగాఁ బెండ్లియైనదఁట కాదా?

దౌల—ఇక్కడనేయున్నది. పెండ్లికాలేదని చెప్పుచున్నారు.

అహ—ఛీ ఏమిమాటలు, నాదగ్గఱకుండ నట్లియనెదవేల? నీ వామెను బలవంతముగ వివాహమాడయత్నించుచున్నావఁట, నారాజ్యములోనీవు దుర్మార్గము చేయకుము. ఇటువంటివానిని క్షమియింపను. అన్నభార్యను బెండ్లియాడుటకు నీకు సిగ్గులేదా?

దౌల—అమ్మా! నే నామెవిషయమై యట్టి దుష్కార్యము దల పెట్టలేదు. కిట్టనివారు చెప్పిన యబద్ధముల నమ్మి మీరు నన్ను శిక్షింపఁ దలంచుచున్నారు. నే నట్టిపనిఁచేయుదునా? అన్నభార్య తల్లి కాదా? పెండ్లికాలేదని నేను స్వీకరింపఁ దలఁచితిని. పెండ్లియైనమాట నిజమైన నాకామెవద్దు.

అహ—సరే. జస్వంతరావు మాపై నలుకవహించినాడఁట. నీవును నందుఁజేరినవాఁడవేనా? ఇంక నీవంటి శూరులెందఱు—

దౌల—రామరామ! నే నేపాపమెఱుఁగను మీపాదములతోడు శ్రీవిశ్వేశ్వర స్వామివారితోడు. సెలవైన జస్వంతరావును బట్టియిచ్చెదను.

అహ—తన ప్రాణముల కాసపడవద్దని జస్వంతరావుతోఁ జెప్పుము. మీరందఱు చచ్చినట్లు భావించుకొనుఁడు. ఇఁక నీవుపో.

అని యహల్యాబాయి దౌలతరావునంపెను. దౌలతరావు నోటికివచ్చినన్ని యనృతములాడి రాణి యాగ్రహమునకుఁ బాతుఁడు కాకుండ పులినోట బడి తప్పించుకొనిన మేకవలె సంతసించుచుఁ బోయెను. అట్లు దౌలతరావింటికి వచ్చునప్పటికి భార్య దుర్గబాయి గృహమునందు లేనందున నిదె సందని కామబాధావివశుఁడై కమలాబాయియొక్క కమలములవంటి పాదములపైఁబడి తన్ను వివాహముచేసికొమ్మని యామెను బహువిధములఁ బ్రార్థించెను. కమల భయసంభ్రమములతో వడఁకుచు నాతని దనపాదములతోఁదన్ని యాడరానిమాటలాడి యనేక విధముల నిందించి రోదనముచేసెను. మన్మథబాణముచే దేహము

చిల్లిపడ ములుకులవంటి యామెపలుకు లంతపనిఁ జేయవయ్యెను. సిగ్గత
ని నీవఱకే విడుచుటచే నగ్గు వాని కగుపడదయ్యెను. అందుచే నాతఁ
డు వడకుచున్న యావన్నెలాడిని గట్టిగఁ బట్టుకొని సందిటఁ జేర్చి యా
లింగనసౌఖ్యముకొఱకు యత్నించుచుండ నామె బెదరిన మార్జాలమువలె
నొడలెల్ల రక్కి యఱువసాగెను. ఆమె బరుకులు వాని యంగములనుం
డి రక్తము స్రవింపఁజేసి కుంకుము నలందుకొన్న పెండ్లికుమారుని విలా
సము నతని కొసఁగెను. అంతలో దుర్గవచ్చి తలుపుఁగొట్టినందున కమల
యామెకు తలుపుఁదీసెను. దౌలతరావుచేసిన చర్యలను దుర్గ కమల
ముఖమున విని యిట్టిమగనికి దాను భార్యగానుండుటకు సిగ్గుపడి కమల
నూరార్చి మగనిని శూలములవంటి మాటలతో నొప్పించెను. కాని న
ల్లరాయివలె నతఁడు నిరుత్తరుఁడై కమలను వశముచేసికొను నుపాయ
మును వెదకుచుండెను ఇట్లతఁ డాలోచనలు సలుపుచుండఁగానే సూ
ర్యుఁ డపరశైలశిఖరము నలంకరించెను. రాత్రి యందఱు భోజనముచే
సి పండుకొన్నతరువాత నిద్రాసక్తులైరి. రెండుజాములరాత్రి యైనత
రువాత దౌలతరావు తాను నిద్రించుచున్న గదివిడిచి తళతళ మెఱయు
చున్న ఖడ్గమును గేలఁబూని కమల శయనించు గదిఁ బ్రవేశించి, "దురా
త్మురాలా, కమలా నీవు నాకు నక్కఱకురానిదానవు. నీవుండిన నేమి
చచ్చిన నేమి? నిన్నిపుడు చంపివేయుదును." అని ఖడ్గ మామెమెడమీఁ
దనుంచి యొకయేటున వేయఁ గత్తి నెత్తెను. అంతలో నామెముఖవికాస
చంద్రికలు కోపావేశాంధకారమును బాపినందున, "ఈమె నిపుడు చంప
ను ముందుముందీమె తప్పక నావశముకాఁగలదు కాకపోయినచో నపుడే
తుదముట్టించెద" నని తన దుష్ప్రయత్నము మాని మరల లోనికిం జని
నిద్రించెను. నాలుగుగడియలరాత్రియుండఁ గమల మొగమున మేలిము
సుఁగు దిగజారవేసికొని యెవరితోడను జెప్పక గృహమునుండి వెడలిపో
యెను. ఎక్కడికరిగినదో యెవ్వరు నెఱుఁగరు. ఉదయమున దుర్గయు

దౌలతరావును గమలం గానక కలవలపడి దుండిరావును లక్ష్మణుని వెదకుమనిపంపెను. అందు దుండిరావెచ్చటనో గంజాయిదాగి మత్తుగొని పండుకొని సాయంకాలమునవచ్చి కమల కనబడలేదనిచెప్పెను. దీపములు పెట్టినతరువాత లక్ష్మణుఁడు వగరుచుకొనుచువచ్చి దౌలతరావుతో రహస్యముగ, "అయ్యా నల్లమందుచెట్లతోఁటలోనున్న నూతిలోఁబడి కమల చచ్చినది. శవమొకగడియకిందట తేలినది" అని భయపడుచుఁ జెప్ప దౌలతరావు తలయూఁచి, "సరే భయమేమి నేను చేయవలసినపని తానే చేసికొనినది. కాని యెవరికిఁ దెలియకుండ దహనముచేయుఁడు." అని పలికి నాలుగురూపాయలిచ్చి వానిని దుండిరావునుబంపెను. వీరిరువురు తోఁటలోనకుఁజనునప్పటికి నూతియొద్దను నొకవృద్ధుఁడును నొక పడుచువాఁడును నపుడే తేలిన శవమునుజూచి విలపించుచుండిరి. అందు వృద్ధుఁడు, "అమ్మా నిన్ను బలవంతమరణము పాలుచేయుటకే వానికిచ్చి పెండ్లిచేసితిని. కాకున్నచో నీమఱిది కింత చేటుకాలమురాదు. అనివిలపింప నందు పడుచువాఁడు వానినూరార్చి యిదియేడువఁదగిన సమయముగాదు. ఎవ్వరోవచ్చుచున్నారు పదపద యని వానిని గెంటుకొనిపోయెను. తరువాత దుండిరావును లక్ష్మణుఁడును మెల్లగా శవమును బయటకిఁదీసి మోసికొనిపోయి దహనముచేసిరి.

తొమ్మిదవ ప్రకరణము.

ధరణీరమణికిఁ గాలపురుషుఁడు పట్టిన ధవళచ్ఛత్రమువలె చంద్రుఁడు గగనభాగము నలంకరించి చెట్లకుఁ బర్వతములకు సమస్తపదార్థములకు సఫేదుపూఁతపూసిన తెఱఁగున తన వెన్నెల వ్యాపింపఁజేసివానికపూర్వభావశ్యము నొసంగెను. ఆవెన్నెలలోఁ దన యజమానునియాజ్ఞ శిరసావహించి దుండిరావు మహూపుర సమీపముననున్న గూడెముఁ

చేరి యందున్న ఋషి కుటీరముఁ బ్రవేశించెను. ఋషి వానిం
జూచి యాలింగనముఁ జేసికొని, 'నాయనా! ధుండీ! నీవు వచ్చితివా!
మన రాణోజీ మృతినొందినాఁడుగదా, దౌలతరావుచేయునది యేమి
యని యడుగుటయు ధుండిరావు వానికి నుత్తరము చెప్పుటకు యత్నించు
చుండ నింతలో దీర్ఘకాయుఁడును మహాసత్వుఁడునగు నొక నల్లని
మనుష్యుఁడు కుటీరముఁ జొచ్చి వారిసంభాషణ కాటంకముగావించెను.
ఆపురుషుని గడ్డము కాయము కంటె కొంచెము నల్లనై జుట్టువలె నతిదీ
ర్ఘమైయుండెను. ఆతనిశిరమున నల్లుకొన్న జడలును జడలనడుమ న
తఁడు చూడామణిగ నుంచుకొన్న నెమలి పింఛములును మెడను ధరించి
న పలురంగులుగల పూసలును చేతనున్న గండ్రగొడ్డలియు నతఁడు ప
ర్వతప్రాంతముల వసించు నాటవికుఁడని తెలియఁజేయును. చింతనిప్పుల
వలెనుండు వాని కన్నుగవనుండి వెడలు దృష్టి రాతిగుండెగల ధుండిరా
వునకుఁగూడ భయంకరమై యుండెనన నింక చెప్పనదియేమి? అతఁడు
లోపలఁ బ్రవేశించి తన మోటమహారాష్ట్రపుమాటలతో నిట్లనియెను.
'తాంతియా రాలేదా? ఈధుండిరావు వచ్చి మీతో నేమి చెప్పినాఁ
డు? మనమితఁడు చెప్పినట్లు చేయవచ్చునా'? అనియన ఋషి, 'ఓయీ
గండా! వచ్చికూర్చుండుము" అని నిమ్మళముగ, "విచారింపవలసిన యం
శములు, నీధుండిరావుచెప్పినమాటలు విను." అని సందేశ మెఱిఁగింపు
మని ధుండిరావును హెచ్చరించెను. అనంతరము ధుండిరావు మెల్లమె
ల్లగా నిట్లు పలికెను. "ఓయీ గండాభిల్లుఁడా! మన పుణ్యము పుచ్చి
నది. జస్వంతరావు, దౌలతరావు, గోమాజీరావు మొదలగు ప్రబలు
లు రాణితోఁ బగసాధింపఁ గత్తికట్టినారు. అందుచే నీవును నీభిల్లసైన్య
ముతో వారికి సహాయముగవచ్చి రాణి నెదిర్చితివేని యుభయులకును
లాభముండును. నీవు దోఁచుకొన్నసొమ్ము నీవేగైకొమ్ము. అదిగాక మ
లహారురావు హోల్కారు మరణము నొందునపుడు తన మనుమఁడు

చచ్చునేని కోడలు మరల నొకని దత్తమొనర్చుకొనవలయునని మరణశాసనమును వ్రాసినాడు. వారి బంధుగులకుత్తరవాదియై యున్నాడు. మన వారాబాలుని హోల్కారుగఁజేసి కొద్దిదినములలోఁ బట్టాభిషేకముఁ జేతుము. క్రొత్త హోల్కారునకు మీరు సహాయముఁ జేయుఁడు.

ఋషి—ఆహోల్కారును నే నెఱుంగుదును. ఆహాహా! మిక్కిలి బాగున్నది. గండా, నీకు సందేహమెందుకు? అహల్యాబాయి సింహాసనముమీఁద నుండదు. రాధాకాంతరావుతోఁ జెప్పినాను. శ్యామసుందరదత్తు నాతో మాటలాడినప్పుడు నేను వారిపక్షము పల్కితినిగాని నేను వారి సంహారముఁ జూచువాఁడను. మలహారురావు నాకపకారముఁ జేసినాఁడు. ఆకసి నేనిపుడు తీర్చుకొందును. దేశమును మంగలములోఁ బెట్టి వేఁచివేయవలెను. నీ రెండువేలభిల్లసైన్యముతోఁ దోపిడు వెంటనే యారంభింపుము. నీకు నాదీవన నిచ్చెదను. ప్రజలకు నావయస్సునుబట్టి నాపై మిగుల భక్తిగలదు. వారు నా మాయాసముద్రము నఁబడి మునిఁగినవారలు. నీవు జంకకు.

గండాభిల్లీపలుకుల నాలకించి యడవిజంతువువలె ఖణిల్లని యొక వింతకేక వేసి యిదిసరి, యిదిసరి, నాతమాష చూడుము. ఈపని నెఱవేరునేని నూరు దున్నపోతులను శ్రీ కాళికి బలియిచ్చెదను. దొరకిన యెడల మనుష్యుని బలియిచ్చెదను. దుండీ నేనిందులకు సమ్మతించితినని మీదౌలతురావుతోఁ జెప్పుము" అనెను.

దుండి—మలహారురావు, మనయీఋషికి నపకారముఁజేసెను. అహల్య కమలాబాయిని వివాహమాడవద్దని దౌలతరావును నిందించి యనరాని మాటలని పరిభవించినది. అదిగాక కమల నూతిలోఁబడి మృతినొందినది. కాఁబట్టి దౌలతరావు రాణిపైఁగల కసిఁ దీర్చుకొనుటకుఁ మిమ్ము గలియఁగోరినాఁడు. ఇది ఋషికిని మీకును నిష్టమని

ప్రభువుతోఁ జెప్పి క్రొత్త హోల్కారు పట్టాభిషేకప్రయత్నములు చేయుచుండెదము. నీవును దోపుడు నారంభింపుము.

అని చెప్పి ఋషికి నమస్కరించి గండాభిల్లుకొద్ద సెలవుఁ గైకొనఁబోవుచుండ నొక మనుష్యుఁడు పదునేడువత్సరముల బాలుని నొకని వెంటఁబెట్టుకొనివచ్చెను. ఈవచ్చినమనుష్యుఁడు సర్వలక్షణముల గండాభిల్లుకంటె నెక్కువ విలక్షణముగను, నెక్కువ భయంకరముగాను నుండెను. కాని యతనికంటె నొక యరయడుగుపొట్టి. గండాభిల్లునికంటె పొట్టియగాక యతఁడు వానికంటెఁగ్రూరుఁడు. వెంటనున్న బాలుఁడు గడగడవడఁకుచు వెఱ్ఱివెఱ్ఱిచూపులు చూడసాగెను. అతఁడు సౌందర్యశాలి. తాంతియాభిల్లు బాలునితోఁ ఋషి కుటీరము జేరి గండాభిల్లుని జూచి, "ఓరీ నీనిమిత్త మీసుందరుఁడగు పిల్లవానిఁ దెచ్చినాను. పునహానుండి యీ కుఱ్ఱవాఁ డిందూరునగరమునకుఁ బయనమై పోవుచున్నాఁడు. ఈతని నీయిష్టమువచ్చినట్లు చేసికొమ్ము" అని యబ్బాలుని చేయిపట్టి లాగి చూపెను. ఋషి వానిమొగమును దీపపువెలుఁగునఁ బరీక్షించిచూచి, "యీతఁడు కాళికి బలినిమిత్త ముపయోగించును. తీసికొనివెళ్ళి బలియిమ్ము" అని యుత్సాహముగల్గునట్లు పల్కెను. పలుకుటయు నబ్బాలుని గుండె జల్లుమని యొడలెల్లఁ జెమటలు పట్టెను. పట్టినతోడనే, "అయ్యో" యని కేకవేసి గుభాలున మూర్ఛిల్లి నేలవాలినమోఁదునలెఁబడి స్మృతిదప్పియుండెను. తాంతియా వానినిఁజూచి మహాకోపముతో "దొంగవేషము వేసెదవా? బద్మాష్" అనికొరడాతో చెళ్ళుచెళ్ళున వీఁపుపై రెండు చరపులఁజరచెను. కాని భయావేశమెకవచముగాఁగలయాబాలుఁడు దెబ్బలవలన మేలుకొనఁడయ్యెను. "ఇప్పుడే యీతని బలిపెట్టుదమురా" యని తాంతియాభిల్లు గండాభిల్లుని వెంటబెట్టుకొని యాబాలుని శవమువలె మోసికొనిపోయిరి. ఈబాలుని ప్రాణముల నెట్లయిన రక్షింపవలయునని ధుండీరావునకు సదుద్దేశముఁ గలిగినది. కాని

యీమాట వారితోఁ జెప్పినచో వారుతన్నే చంపుదురని భయపడి యూరకుండి మెల్లగా దన స్వామియొద్దకుఁ జనెను.

ఇదియైన కొన్నిదినములకే దేశమునం దక్కడక్కడ బందిపోటులు కన్నపుదొంగతనములు దారులు గొట్టుటయు నారంభమై దేశమంతయు వట్టుడికిన ట్లుడుకసాగెను. స్త్రీలను జెఱపట్టుట దొంగతనము మాన్పి మానప్రాణములకును మర్యాదలకును భంగములేకుండఁ జేయ జనులందఱు రాణితో మొఱ్ఱలుపెట్టుకొని యీ రాజ్యమునుండి పాఱిపోవుదుమని చెప్పిరి. నిరంతరమును గ్రామములు పరశురామప్రీతి యగుటచేతను, జనులు పులులవలె వేటాడఁబడుటచేతను నహల్యాబాయి ప్రజల ధైర్యమును స్వసైన్యద్రోహమును దన యసహాయస్థితియు నరాజకమును జూచి విసిగి చేయునది లేక దుఃఖితయయి రాజ్యభారమును విడిచి మంత్రులకు లోఁబడుట యుచితమని యోజించుటకుఁ గూడ సిద్ధమయ్యెను. అటుండి, రాధాకాంతుని శ్యామసుందరునిఁ బిలిపించి యామె వారితో నిట్లనియెను. "అయ్యా! ఇఁక నారాజ్యమెందుకు? నేను దీనినివదలి కాశీనగరముఁజేరి విశ్వేశ్వరస్వామివారిచరణముల నాశ్రయించుట మంచిదని తోఁచుచున్నది. పరమపతివ్రతయగు కమలాబాయి నిష్కారణముగ నూతిలోదిగి చచ్చినది. ఆనేరమును బట్టుకొని యీపాపాత్ముల శిక్షించువారు లేరైరి. మీదు మిక్కిలి జస్వంతరావు ప్రేరణచే రఘునాధరావు మనపై దండువెడలునఁట! అది నిజమని పేష్వా సభలోనున్నదాదాజీగోక్లా తనతోఁ జెప్పెనని మనకృష్ణపంతు నిన్ననే పునహానుండి వచ్చి చెప్పినాఁడు. భిల్లులొకమూల ప్రజలను మాడ్చుచున్నారు. ప్రజలు నాజీవమున కుసూరుమన్న తరువాత నారాజ్యమెందుకు? పన్నులుగైకొని సుఖియించుటకా! నేనేమిచేయుదును" అని నిర్విణ్ణురాలై పలుకు మహారాణిని జూచి రాధాకాంతుఁడు, "అమ్మా! యీ దురాత్ములు లోఁబడకపోరు. పాప మెన్నఁడును నెగ్గదు.

నేను, శ్యామసుందరదత్తు, తుకాజీ, శివనానా జీవముతోనుండ నిందూరు రాజ్యలక్ష్మి యీదురాత్ములచేఁ జిక్కదు. మీరు మాకు ధైర్యము చెప్పవలసినది. మీరధైర్యపడకుందురేని మే మెంతెంతకార్యములనైన సాధింపనేర్తుము. విచారమువద్దు. అమ్మా యీ ముక్తాబాయికి శరీరమున సుఖముగనున్నదా? దాసి యెట్లున్నది' అని పలుక నహల్యాబాయి, "నేను మిమ్ము నమ్మియున్నాను. నీవును, శ్యామసుందరదత్తునుబోయి దొంగలఁ బట్టుకొనుఁడు. మఱియేకవిచారము నాకు లేదు. నీవు పంపిన దాసిమూలమున నాకూఁతురు బ్రతికినది. అది కడుచమత్కారి. ఏడ్చువారిని నవ్వించును. సీతాబాయి మొగముఁజూడ నన్నివిచారములు నశించును" అని చెప్పెను. శ్యామసుందరుఁ డంత, "అమ్మా యిదె నేనును రాధాకాంతరావు గారును నరిగి దొంగలలో ముఖ్యులఁ బ్రాణములతోఁ దెచ్చి మీ కప్పగించెదము. సెలవొసంగుఁడు పోయెదము. తుకాజీని సైన్యముతో సిద్ధముగ నుండుమని యానతిండు" అని రాధాకాంతరావును దత్తును రాణిని వీడ్కొనిపోయిరి.

పదియవ ప్రకరణము.

సూర్యరశ్మి యెట్టిదో యెన్నఁడు నెఱుఁగనట్టి చీమదూరని చిట్టడవియని చెప్పఁదగిన వింధ్యపర్వతప్రాంత వనభూమియం దొకచోట, కొండగుట్టలచే నావరింపఁబడు నొక కోనలో నొకనాఁ డుదయమున నాకాశమును బీటలువారఁజేయుమహాకోలాహల ముదయించెను. అడవి మృగములవలె ఘీంకారాది భయంకర ధ్వనులతోడను భిల్లులందఱు మతావేశమునొంది భక్తిపారవశ్యముచేత నెదుట వృక్షమునఁ గట్టబడిన బాలకునిపై దృష్టులు నిగుడ్చిరి. ఆబాలకుని శరీరమందంతట జేగురుగందము పూయబడెను. మొగమున నెఱ్ఱని కుంకుమబొట్టు పెట్టియప్పు

డప్పుడె యంటఁబడిన తలనుండి నీటికణములు జార వికచారవిందములఁ
బోలు రెండుకన్నులనుండి బాష్పజలము లొలుక నా బాలకుండు భిల్లు
లవలన శ్రీ కాళికి బలియీఁబడుటకు సిద్ధముగ నుండెను అతని హృ
దయస్థితదుఃఖమును వేఁడికన్నీరు తెలుపుచుండెనే కాని మోటుమాటలు
తెలుపుటలేదు. వెనుక తాంతియాభిల్లు తోవతోఁబట్టుకొన్న సుందరా
కారుఁడగు బాలుఁడాదినమున గండాభిల్లుచేఁ దమదేవతకు బలియీఁబ
డుచుండుటయే యీ కోలాహలమునకుఁ గారణము. అమితానంద రస
మున నోలలాడుచు భిల్లులు భిల్లాంగనలుండ బల్లివలె చెట్టున కంటిపెట్టు
కొని యమితదుఃఖరసమున నీవత్స యమలోకప్రయాణమునకు మూట
గట్టుకొనెను. అపుడు వారిలోఁ గులపెద్ద తళతళ మెఱయు ఖడ్గముఁబూని
యెటునుండి నఱకుటకు సులువుగ నుండునోయని కత్తి మెడపైనిడి భిల్లు
లు సింహనాదముసేయ భిల్లాంగనలు చప్పట్లు చరువ నొక్కవ్రేటున
వేసెను. ఆవ్రేటుతో బాలుని శిరము తెగి నేలఁ బడవలసినదే కాని
యాకుఱ్ఱవాఁడు మెడ రెండవవైపునకుఁ ద్రిప్పినందున నావ్రేటు వాని
కిం దగులదయ్యె. అంత నాకుమారుఁడు స్మృతిఁదెచ్చుకొని చేతులుజో
డించి గండాభిల్లునిఁజూచి నమస్కరించి, " అయ్యా నన్నేల మీదేవ
తకు బలియిచ్చెదరు. మాతల్లికి నే నొక్కఁడనె కుమారుఁడను. ఈన
డుమ మా చిన్నతమ్ముఁడు మశూచకమువచ్చి చచ్చినాఁడు. నేను
మాయక్కను జూచిపోవలయునని పునహానుండి వచ్చుచున్నాను. నే
ను తండ్రిలేనిబిడ్డను. మిగుల బీదతనము ననుభవింపుచు దిక్కులేని
నాకుటుంబమును బోషించుటకు నెక్కడనైన పదిరూపాయల యు
ద్యోగము సంపాదింప వలెనని పుట్టెడాశతో మాబంధువుల నాశ్రయిం
ప నిటు లిందూరు నగరమునకుఁ బోవుచున్నాను. నేనేమో యుద్యోగ
ము సంపాదించి తమ్ముఁబోషించునంతటి ప్రయోజకుఁడ నగుదునని గం
పంత కోర్కెతో నాతల్లి నాకయి యెదురు చూచుచుండును. నన్ను

విడచి యీపుణ్యముఁ గట్టుకొమ్ము" అని ప్రార్థించెను. ఆప్రార్థనలు వినఁ గొందఱు భిల్లులకును భిల్లాంగనలకును హృదయములఁ గరుణారసముదయించెను. కాని తాంతియాభిల్లున కాగ్రహముదయించి గురువునుజూచి, "ఈపాపాత్ముని వదలవద్దు వదలినచో దేవికాగ్రహమువచ్చెను. ఇదివఱకు మనమిన్నిపల్లెలుదోఁచిన మనము పట్టుపడకుండుట కీమె కారుణ్యమె కదా కారణము. కావున వేగమె తల తెగవేయుఁడు" అని పలికెను. పలికినతోడనే మనుష్యాకారము నెత్తిన వ్యాఘ్రమువంటి యాగురువును మనుష్యప్రాణములఁ దీయుటలోఁ జిరతరానుభవముగల తన కుడిచేయి నెత్తి శిరము దేహమునుండి తెగవేయుటకుఁ గత్తి మెడపైఁజేర్చె వాటముజూచి మఱల ఖడ్గము నెత్తెను. అందఱు, 'జయభగవతి' యని యఱచిరి. ఆబాలుఁడు కనులు మూసికొని రామరామయంచు మెడపైఁగత్తిపడిన దనుకొనెను. అంతలో మూగిన మనుష్య సంఘమునందు, 'వచ్చె వచ్చె, మరాటిదండు మరాటిదండు' అని మహాధ్వనులు వెడలెను. వెంటనే ప్రాణములకై పరతెంచువారును, బాణములకై పరుగులెత్తువారును, విండ్లు గేలఁబూనువారును, చెండ్లవలె రాళ్ళుపట్టువారునునై భిల్లభిల్లాంగనాబృందము చిందరవందరయయ్యెను. ఈనడుమ మరాటిదండు వారిపైఁ బడ తత్సైన్యముఖమున నుత్తమ తురంగముపై నెక్కి భిల్లుల కనులకు రుద్రునివలెనున్న రాధాకాంతబాపును, కుమారస్వామివలె వెనుకనున్న శ్యామసుందరదత్తును గానఁబడిరి. గురువు ఖడ్గమును జంకక్రిందఁ బెట్టుకొనిపారిపోవుటయుఁ గొందఱు భిల్లులు గురువుగారి మార్గము నవలంబించుటయు, మిగిలిన యాటవికులు మరాటులపైఁబడి యెదిర్చి కొంతసేపు దూరమునుండి శిలావర్షము గురిసియుఁ గొంతవడి యమ్ములవానలు వర్షించియు, గొంతసేపు ఖడ్గాఖడ్గినిబోరియు, హోరాహోరిగా యుద్ధముచేసిరి. తుపాకులు, పిచ్చుకత్తులు, మొదలగు నాకరికపు పనిముట్లుఁ గుటచే మరాటులు శత్రుసంహారమున

నెక్కువ నలువు గలవారై మోటకయ్యముసేయు భిల్లులఁదోలిరి. వీరశి ఖామణియగు రాధాకాంతునకు వీపుపై నొక కత్తిపెట్టుగాయము తగు లుటయు, నీదుఃఖ ముపశమింప శ్యామసుందరదత్తుచే భిల్లనాయకుఁడగు గండాభిల్లు పట్టుబడుటయు నను రెండుకార్యము లీ యుద్ధఫలితములు. వృద్ధుఁడగు రాధాకాంతునకుఁ దగిలిన గాయ మపాయకరమైన దగుటచే నటఁ దగిన వైద్యము జరుగదని దత్తాతనికొక బండి చేయించి తగు పరివారమునిచ్చి ముందుగా నిందూరునగరమున కంపి తాను వెనుకనుండి దొంగను దీసికొని వత్తునని చెప్పి యాతని నంపెను. యుద్ధము జరుగు చుండఁ గొందఱు భిల్లులు బలి యీఁబడుటకు వృక్షమునకుఁ గట్టఁబడ్డ బాలుని కట్టు తొ్రటుపాటుతో విప్పి బరబర లాగుకొని పోయిరి. శ్యా మసుందరదత్తు గండాభిల్లుని వెంటఁబెట్టుకొని నలుగురు సేవకులతో మెల్లమెల్లగఁ బయనము సేయుచుఁ గడుమన్నెములును, బర్వత ప్రాం తములును దాఁటి రెండుదినములకు మన ఋషియున్న కుటీరసమీపము నకువచ్చి సాయంకాలమైనందున నచ్చట విశ్రమింపఁ దలఁచెను. దత్తుతో నున్న నలువురు సేవకులలో నొకఁడు గండాభిల్లునకు పరిచితుఁడుండుటచే వాఁడతనితో నపుడపుడు సగము వినఁబడి వినఁబడకుండునటు మాట లాడుచు జాలి గల్గునటు కన్నీరువిడుచుచుఁ దన్ను చెఱనుండి విడిపింపు మని బహువిధములఁ బ్రార్థించెను. కాని కత్తెరబోనువలె దత్తుఁడక్కిన భటులు నుండుటచేఁ బ్రత్యుత్తరమిచ్చుటకుఁగాని చెఱనుండి వానిని విడిపించుటకుఁగాని యాబంటౌతునకు వీలులేదయ్యె. గండాభిల్లు తన మరణమింక నిశ్చయమనియు నేచెట్టునకో గట్టి తన్నహల్యబాయి యురి దీయుననియుఁ గడువిచారగ్రస్తుఁడై చచ్చినపులివలె నుండి యేపనిచేయు టకు వీలులేకుండఁ జేతులువిరిచి కట్టఁబడినందున నప్రయోజకుఁడై యుండెను. ఇందూరునగర మొకక్రోసుదగ్గఱకు వచ్చినకొలఁది తనమర ణ మొకదినము సమీపమగుచున్నదని గండాభిల్లు రోదనముసేయుచుఁ

దాను చేసిన పాపములను, నరహత్యలను, రాజద్రోహములను దలంచి బెంగ పెట్టుకొని నిద్రాహారములఁ గైకొనఁడయ్యె. గండాభిల్లు చేఁజిక్కిన వార్త విన్నవారందఱు సంతసించి పండుగలు చేసికొనుచుండిరి. ఈదొంగను శ్యామసుందరదత్తు ఋషికుటీరమునందుంచి కాలుసేతులు గట్టి నలువురు సేవకులను జుట్టు కాపుపెట్టి, జామున కొక్కరిని మేల్కొనుమని యానతిచ్చి తాను వెలుపల నొకమంచముపైఁ బండుకొనెను. అంతట ఋషి యాతనితో, "నాయనా యీపాపాత్ముఁడు దొరకినందుకు దేశమంతయు సంతసించుచున్నారు. వీనిని వేగముగఁ గడదేర్పుము. ఈ కార్యము చేసినందుకు నీకీర్తి శాశ్వతమైయుండును. ఈదురాత్ముఁడు ప్రజలనుబెట్టిన క్షోభ యింతింతకాదు. వారి యుసురు నేఁడు తగిలినది కాఁబోలును." అని ముచ్చటించెను. "ఇదిమీ యాశీర్వచనము. మీరు హోల్కారువంశమునకు మేలుసేయఁదలఁప మేలెందుకు సేకూరదు. ఇది మీ చలవకాదా" యని దత్తుత్తరము చెప్పెను. ఆసమయమున నొక తురక వెదకుకొనుచువచ్చి "అయ్యా, యిచ్చట శ్యామసుందరదత్తుగా రున్నారా" యని యడిగెను. దత్తు తత్తరపాటుతో లేచి, "అబ్దుల్ నబీ యేమి యిపుడు వచ్చినావు? తొందరలేమైన నున్నవా?" అని యడుగ, "మహారాజా తొందరలులేవు. రాణీగారు మీకు హుకుము జారీచేయించినారు. అది తెచ్చినాను." అని చెప్పి యుత్తరమును జేతికీయ నాజాబును దత్తు చదువుకొని, 'పాప మింతత్వరగా నది యగునని నేను తలఁపలేదు." అని యుత్తరమును మడచుచుండెను. ఋషి యది యేమని యడుగుచుండఁగనె దత్తు లోపలికిపోయి ఋషిని రమ్మని పిలిచి గండాభిల్లును మేలుకొలిపి యిట్లనియెను. ఓయీ మహారాణిగారిట్లుత్తరము వ్రాసినారు, చదువుచున్నాను విను, "గండాభిల్లు నిటకుఁ దీసికొనిరానక్కఱలేదు భిల్లులు, బిడారులు, గాండ్లు మొదలగు వనవాసు లింకముందిట్టి రాజద్రోహము సలుపకుండ బుద్ధిగలుగునట్లు వారి

నందఱిం జేర్చి వారికి భయముగలుగునట్లు చెట్టునకుఁగట్టి గండాభిల్లును తేపుదయమున నురిదీయవలెను." అనివ్రాసినారు. కాఁబట్టి నీమరణము తేపుదయమున నని కఠినముగాఁ జెప్పి తనకుఁగొంచెము కన్నీరు వచ్చుటచే నటనుండలేక వెలుపలికిఁ జని పండువెన్నెలలోఁ బచార్లించెను. గండాభిల్లు దత్తువచనములు విని పిడుగుపడినవాని చందంబున కట్టుబొమ్మయై యపుడే చచ్చినట్లుండెను. తరువాత ఋషి వానినిగొంత యోదార్చెను. ఆపండువెన్నెలలో నాటిరాత్రి దత్తునకు గండాభిల్లుయొక్క మరణవృత్తాంతమును దెలుపవలసి వచ్చినందుకు విచారమేగాక మఱియొక విచారముకూడ జ్ఞప్తికివచ్చెను. ఆనాటి పూర్ణచంద్రసందర్శనముచే దత్తుయొక్క మోహపయోధియుబ్బి మలయమారుత ప్రేరితములగు మహామోహతరంగము లున్నతములగుటచే హద్దుమీఱెను. కమలయొక్క ప్రథమదర్శనమును వృషభసంహారమును మొదలగు నాటిపనులెల్లఁ గన్నులకుఁ గట్టిన ట్లెదుటఁ గనఁబడి దత్తున కించుకసేపు గండాభిల్లుపై మఱుపుగొల్పి రాజభక్తి నిగూఢ మఱపించెను. అందుచే చిత్తనైర్మల్యంబు చెడినందున నాతఁడు లేచి జాగ్రతగ నుండుమని సేవకులతోఁ జెప్పి వానిని ఋషి కప్పగించి తనకుఁ గమలాదర్శనమైన స్థానమునకుఁ జనెను. అరిగి హా సుందరీ! హా కమలా! నీవెంత యల్పాయుష్మంతురాలవైతివే? వృషభము బారినుండి తప్పించుకొంటివి గనుక చిరకాల జీవిని వగుదువనుకొంటినిగాని యింతలో నిట్టి బలవన్మరణము గలుగునని తలఁపనైతిని. నీవు స్వర్గమునకుఁబోవుచు నాహృదయము నపహరించుకొని పోయినావు నన్నుఁగూడ నీసాన్నిధ్యమున కేలగొనిపోరాదు? నిన్నుఁజూచిన కన్నులతో నింకొకకన్యను జూడఁజాలను. నిన్నుదలంచిన మనసుతో నింకొకకన్యం దలఁపజాలను" అని విలపించి యూరటలేక, "ఇచ్చటనెకదా నీ నిమిత్తము నే నెద్దును వాడికోలలచేఁ గూలనేసితిని. ఇచ్చోటనెగద నిన్ను సందిటం గదియఁబట్టి నామనసార నీమొగము తప్ప

వాల్పక చూచుచు నిన్నుఁ గూర్చుండఁబెట్టినది. ఇందేగదా నీవు నన్ను వాలుచూపులఁజూచి నా కాసఁగొల్పినది" యని యానాటిచర్యలెల్లఁ దలఁచి యాయాస్థానములకరిగి కూర్చుండుచు, లేచుచు, బవ్వళించుచు మన్మథబాణప్రహారముల కోర్వక విహరించుచుండెను.

పదకొండవ ప్రకరణము.

ఇట్లు శ్యామసుందరదత్తు విచారించి విచారించి ప్రొద్దుచూచునప్పటికి రమారమి జాముభాత్రియుండెను. అందుచేఁ జాల నాలస్యమైనదని యెంతసేపు విచారించినను గతజలసేతుబంధనమేకాన మృతినొందిన కమల మరలరాదనియెఱింగి ఋషి కుటీరాభిముఖుఁడై చనెను. చనుచు మార్గమధ్యమున, "తెల్లవారుచున్నది. గండాభిల్లును నే నుఱిదీయింపవలెను గాఁబోలు. ఈవఱ కెన్నండు నిట్టిదారుణకార్యము నేనొనర్చి యుండలేదు. ఈపని నాపాలఁబడినందుకు నాకు మిగుల కష్టముగనున్నది నేనెట్లుచేయుదును. అయినను రాజభక్తియుఁ బ్రజాక్షేమముఁ జూచి యిద్దురాత్ముని జంపవలె. రాణిసెలవు తప్పదుగద" యని తనలోఁదాను వితర్కించుకొనుచు నే వృక్షమునకు త్రాడువేయించి యురిదీయింపఁ దగునని యోచించుచు నిరుప్రక్కలనున్న మహావృక్షములఁ బరీక్షించుచు నడువసాగెను. ఇట్లు నడచి నడచి యొక కొంతసేపటికి ఋషి కుటీరసమీపమునకు నరుగుదెంచి యాగుమ్మముముందరఁ గన్నుచెదరునట్లు కుంకుమ నీటివలెనున్న రక్తమునుజూచి యాశ్చర్యమునొంది నిర్ఘాంతపడినిలుచుండెను. నిలిచి నలుదెసలుఁ బరికింపఁ దన సేవకులలో నొకనిశిర మొకవైపునను మొండెమొక వైపునను బడియుండుట తన కన్నుల కగుపడఁగా దత్తుచిత్తము తత్తరమంద లోనికింజనియెను. చనినతోడనే వాని యాశ్చర్యమేమని చెప్పుదును. కుటీరములోఁ దన ము

వ్వురు సేవకులుగాని గండాభిల్లులుగాని కనఁబడరైరి. కాలు సేతులు వెనుకకు విఱుగఁ గట్టఁబడుటచేఁ గదల మెదలనేరక నోట గుడ్డలు గ్రుక్కబడుటచే మాటలాడనేరక యొకమూలఁ బడియున్న ఋషినిమాత్ర మతఁడుచూచి మెల్లగా వానిని లేవనెత్తి యొకచోటఁ గూర్చుండబెట్టి కట్లువిప్పి నోటనున్న గుడ్డలనూడఁదీసి యీవైచిత్ర్యమునకుఁ గారణమడిగెను. ఋషి కొంత సేదదేరి నీరసముతో నిట్లుచెప్పెను. "నాయనా, నీవేలయడిగితివి? నీకొంప నాకొంపఁగూడ దీసితివి. నీవెట్టి పాపపుగడియల బయలుదేఱితివో నీవు కుటీరము వెడలినతోడనే నలువురు భిల్లులు మాపైఁబడిరి. తరువాత నేమిచెప్పుదును తండ్రీ, విశ్వాసముగల శూరశిఖామణియగు నీ సేవకుఁడు కావలికాఁచుచు వారి నెదుర్కొన వారొక్క ముహూర్తమున వానిని దుమకత్తిక నెఱఁజేసిరి. తరువాత, నే నెదిరింపఁబోవ నన్నిట్లుచేసి చెఱలోనున్న గండాభిల్లును వదలించుకొని పారిపోయిరి. వారరిగిన కొంతసేపటికి నీమువ్వురు సేవకులు మెలఁకువఁ దెచ్చుకొని నాస్థితినిఁ జూడకయె దొంగ లేఁడని భయపడి యెక్కడికో పరుగెత్తిరి. ఇంతకుమించ నే నేమియు నెఱుఁగను నాకుటీరమున నిట్టి పని జరిగినందున నన్నుఁగూర్చి ప్రజలేమని చెప్పుకొందురో యని నాకుఁ దలకొట్టినట్లున్నది. పాపము పుణ్యము పరమాత్ముం డెఱుఁగును." అని ఋషి తనవాక్యము సమాప్తముఁ జేయునప్పటికి, దత్తును విచారాశ్చర్య సముద్రమగ్నుఁడై తనజీవనము సమాప్తమయ్యెనని యెంచుకొనెను. ఈసేవకులె వానిని విడచిరో భిల్లులే వదలించుకొని పోయిరో యని సంశయమొందుచుఁ దన భవిష్యదభివృద్ధియను వృక్షమునకుఁ బిడుగుపాటువలెఁ దటస్థించిన యీకార్యమునకు వగచుచు నిశ్చేష్టుఁడై గోడకుఁ జేరఁబడి కూర్చుండి యిట్లు వితర్కించెను. 'హా దైవమా! ఎంతపని జరిగించితివి! నాకా విరహతాపము నాపాపముచేఁ గలిగినది కాఁబోలును! ఏల ఖయిదీని విడిచి యేమరితిని. ఏ మొగముబెట్టుకొని

యింక నిందూరు పోవుదును. ఏమొగము బెట్టుకొని యహల్యాబాయి రాణిమొగము జూతును. నేనేమో సంస్థానమంత నుద్ధరింపఁగల సమర్థుఁడననియుఁ, గృతజ్ఞుఁడననియు, నన్నీ కార్యమునందు రాణియు రాధాకాంతరావును నియోగింప నేను గామాతురుఁడనై చేతులార దొంగను వదలుకొంటిని. వాఁడు పారిపోయెనని నే నెంత చెప్పినను నామాటలీ కుట్రదినములలో నమ్మువారెవ్వరు? జస్వంతరావుతోఁ గలసి దొంగను నేను విడిచితినని జనులు నన్నాజన్మాంతము కళంకునిగ నెన్నుదురు. నేనిచ్చట మృతినొందక యిందూరిపురి కేల పోవలయును? అయినను రాణితో నాతప్పు విన్నవించి ప్రథమలోపమును క్షమింపుమని యామె పాదములపైఁబడెదను. నాకంటె నాసేవకుఁడే కృతజ్ఞుఁడుగదా! రాణిసొమ్ము దినుచుండుటచేఁ దనప్రాణమును రాణికిచ్చి రాజఋణమును దీర్చుకొనెను. ఇంతచదువు చదువుకొని యెక్కువ యధికారినై యైదురూకలు జీతముగల బంటురౌతుపాటి రాజభక్తిని జూపఁజాలనైతిని. ఛీ! నాబ్రతుకేల! అని పరిపరివిధములఁ జింతించునంతలో సేవకులు మువ్వురు దీనముఖులై వచ్చి శ్యామసుందరదత్తుముందట నిలిచిరి. దత్తు వారిని గనుగొని దిగ్గున లేచి, "దొంగయేమైనాఁడుగా" యని యడిగెను. అడుగుటయు వారుకన్నీరు తమ నిర్దోషత్వమును దెలియజేయ దత్తుపాదములపైఁబడి, "స్వామీ మేము మువ్వురము నిద్రించుచుంటిమి మానిద్రలో నీగొడవయెల్లఁ జరిగినది. మేము లేచునప్పటి కీఋషి బద్ధుఁడై యుండెను. మాప్రియమిత్రుఁడగు మీసేవకుఁడు నిష్కారణముగ మృతినొందెను. మేము మెలఁకువ వచ్చినతరువాత దొంగలు దొరుకుదు రేమోయని తఱుముకొనిపోతిమి కాని మాశ్రమ వ్యర్థమైనది. "అని రోదనముజేయుచుఁ దన పాదములు విడువక యున్న వారికి హెచ్చరికపుట్టఁ బలికి యభయహస్తమునిచ్చి ఋషియొద్ద సెలవు గైకొని పయనము సాగించెను. ప్రాణములకు మానములకుఁగూడ హాని

కరమగుపని తానే చేఁజేతఁ జేసికొంటిననియు రాధాకాంతారావునకుఁ గూడ తనమూలమున నపకీర్తి సంఘటిల్లుననియు, రాణి యిట్టివిషయములను దన్ను క్షమింపదనియు, నెఱింగి యారంభమున విచారభారము మెండగుటచే నాహారనిద్రల మాని హెచ్చరికలేమిచే నడక చకచక సాగక మెల్లగ నిందూరిపురి కరుగుచుండెను. త్రోవలో సేవకులలో నొకఁడు దత్తును గనుగొని, "అయ్యా మనప్రాణముల రక్షించుకొనుట కుపాయమొకటి కలదు. దొంగ పారిపోయెనని చెప్పుటకు మాఱు దొంగనురిదీసితిమని మనము చెప్పినచో మనప్రాణములు దక్కును.

అన శ్యామసుందరుఁడు తన సుందరముఖమున మందహాస మలంకరింప "ఓయి పిచ్చివాఁడ! అబద్ధమాడినచో దాగునా? భగవంతునియెదుట మనముదాఁచగలమా? అనృతము పైకెన్నఁడైన పొక్కకపోదు. ఆయాలోచనఁ గట్టిపెట్టి మనమందఱమునిజమొప్పుకొందము. పైనదేవుఁడున్నాఁడు" అని మందలించి మెడతెగని పయనముతో దత్తు మహానగరమునఁ దనసోదరినైనఁ జూడక యా నాటిమధ్యాహ్నము రెండున్నరయామములకు నిందూరునగరముఁజేరి రాధాకాంతుని యింటికిఁ జనక తనప్రమాదము నెవ్వరితోను జెప్పకొనక మృత్యుదేవత కెదురు సన్నాహము సేయువాని తెఱంగున నతిధైర్యముతోఁ గోటకుంజని రాణికి దనరాక నెఱుకచేసెను. రాణియుత్తరవు ప్రకారము లోనికింజని శ్యామసుందరుఁడు నిలిచినతోడనే యామె యాత్రముతో, "గండాభిల్లు నురిదీసినావు కాదా? చచ్చునప్పుడు వాఁడేమన్నాఁడు? భిల్లులకు బుద్ధిజెప్పితివా" యని యడిగెను. ఆమాటలకుఁబ్రత్యుత్తర మంతటియాత్రముతో నీయక కొయ్యవలె నిలువంబడియున్న దత్తుంజూచి యామె, "ఏమిది పలుకవు? వాఁడేమయినాఁడు చెప్పవేమి?" యని తొలుతకంటె నెక్కువ యాత్రముతోడను, నెక్కువ వేగముతోడను దత్తును బలుకరించెను. అంతట వారిట్లుమాటలాడిరి.

దత్తు—(చేతులుజోడించి) అమ్మా యేమని చెప్పుదును! గండాభిల్లా పారిపోయినాఁడు.

అహల్య—(చెవుల నీ పలుకులు పడునప్పు డామె చమురుచుక్క తగిలిన తప్తలోహమువలె దుర్నిరీక్ష్యయై) నీవింక ప్రాణములతో నుండఁగనే?

దత్తు—నేనీవార్త నేలినవారికి విన్నవించుటకు జీవచ్ఛవమునై యున్నాను.

అహ—ఓఁమూర్ఖుఁడా, రాజద్రోహీ! జస్వంతరావు ప్రముఖులతోఁగూడి రాధాకాంతరావు కష్టపడి పట్టుకొన్న దొంగను లంచములు గ్రహించి వదిలిపెట్టి దొంగ పారిపోయెనని చెప్పుట కింకను బ్రతికియున్నావా? ఇంతదూరమురానేల. అచ్చట నెందుకు నీవు పొడుచుకొని చావనైతివి? నీప్రాణములు నీకు దక్కనిత్తుననుకొంటివా యేమి పశువా?

దత్తు—అమ్మా! అది నా రాజద్రోహమువలన నైనదిగాదు. పొరపాటు.

అహ—ఛీ! సిగ్గులేక వంకలుచెప్పుకొనెదవేల? పొరబాటా? చేఁజిక్కిన యపరాధిని జేతులార విడచితివి పొరబాటెట్లగును? ఛీ నాయెదుటలే. నీమొగమును జూచి నేను భరింపఁజాలను; నీయాయువు నేటితో మట్టమయినది. నా మంచితనము నాయాదరణము నీకు విషమైనది. ఓరీ, ఎవరురా. వీనిచేతుల విఱిచికట్టి వీనినిఁ బట్టుకొమ్ము. రాధాకాంతునిఁ బిలుచుకొనిరమ్ము.

ఇట్లు మెత్తని లేఁడిపిల్లపై నుంకించు నాఁడుసింగమువలె రూక్ష వచనముల శ్యామసుందరదత్తును నొప్పించి వాని నొక భటుని యధీనముఁ జేసి రాధాకాంతాదులయాగమనమును నిరీక్షించుచుండెను. దత్తుతోఁ గూడవచ్చిన ముగ్గురి సేవకులలో నొకఁడు రాధాకాంతుని గృహమునకుంజని, జరిగిన వృత్తాంతమంతయు వాని కెఱింగించెను. దత్తును దన కుమారునికంటె నెక్కువ ప్రేమతోఁ బెంచుకొనుచున్న రాధాకాంతుఁ డాయాకస్మిక దుర్వార్తచే నడుమువిఱిగినట్లు దుర్బలుఁడై తాను నాటిన మొక్క నిర్మూలమగు సమయము వచ్చినదని విచారింపఁ దొడఁగెను. ఇంతలో రాజసేవకులు వానిని బిలువవచ్చుటచే నాతఁడు పయనమై తనగాయపు బాధపూర్ణముగఁ గుమరనందున మెల్లమెల్లగఁ జేతికఱ్ఱ సాయమున నడచుచు నంతిపురముఁ బ్రవేశించి నరకాసురసంహారణోన్ముఖియగు సత్యభామవలె వెఱపుఁ గొలుపు చూపుగల యహల్యను గని యుచిత నమస్కారముల నొసర్చి యెదుట నిలిచెను. అంతట నచట నీక్రిందివ్యవహారము జరిగెను.

అహ—ఏమయ్యా నీవు మాకు మేఁకలమందలోఁ బెద్దపులినిఁ దెచ్చి పెట్టినావు సుగుణములకెల్ల నితఁడు మణియే కాదూ. రాజభక్తికిఁ బెట్టినది పేరుగదా యితఁడు? ఆగుణము లేమైనవి? దొంగను జల్లగాఁ బంపినాఁడు.

రాధా—అమ్మా! జరిగినసంగతి యేమో మీరు విచారింపవలెను. అంతవఱకు నతని యుద్దేశమిదియని చెప్పఁదరముకాదు—

అహ—నీ కింత పక్షపాత మతనియం దుండుటచేతనే యింత మునిఁగినది. తేనెపూసిన కత్తియగు నీమూర్ఖునిచే నిష్కారణముగ మేము వంచింపఁబడితిమి. జస్వంతరావు మొదలగువారు నన్నుఁజూచి యిపుడు నగరా? మిమ్మునమ్ముకొని నే నుభయత్ర వ్యర్థురాలనైతిని. ఇటువంటి పాపాత్ముని విడువరాదు. ఓయీ శ్యామసుందర! రాజద్రోహమునకు నీకు మరణదండన విధించినాను. అంతటఁగాని నాకోపాగ్ని చల్లారదు.

రాధా—(విచారముతో) అమ్మా! బాలునియందు దయఁజూపుటకు నాప్రార్థన.

అహ—ఏమిదయ? దేశమును దోఁచుకొనుదురాత్ముని విడిచిన దురాత్ముని, రాజద్రోహము సల్పినయపకారిని, శత్రువులలోఁ దూరిన దుర్నీతిపరుని నేనెట్లు శిక్షచేయకుందును. నీముసలిమాటల నింక గట్టిపెట్టుము. ఇతని నొక్కనిఁజంపుట నాయభిప్రాయముకాదు. ఈకుట్రలో నింక నెందఱుచేరిరో విచారణఁజేసి వారి కందఱకు సంఘమరణము గల్పించుట కర్తవ్యము. కాఁబట్టి విచారణ సలుపుమని గోమాజీరావువద్దకు వీని నంపెదను. శ్యామసుందరా! నీసాక్ష్యమును నీవుఁ దెచ్చుకొనుము. ఓరీభటులారా! వీనిని జెఱసాలలో నుంచుఁడు.

రాధా—అమ్మా! నేను జామీనుండెద నాకు వీనినప్పగింపుఁడు.

అహ—జామీను గీమీను బనికిరాదు. విచారణకావలయును. మీరందఱునింక నరుగుఁడు.

అని యామె లేచునప్పటికందఱును జనిరి. శ్యామసుందరుఁడు మరణదండన విని నప్పుడును మనోధైర్యము విడువక నిశ్చలుఁడై యుండి రాధాకాంతుని వీడ్కొని భటులుగొనిపోవఁ జెఱసాలకుఁజనెను. రాధాకాంతుఁడు కన్నీళ్ళతో నాతని విడిచియింటికిఁ జనెను.

పండ్రెండవ ప్రకరణము.

గండాభిల్లు శత్రువులచేతఁ జిక్కినాఁడనివిన్నది మొదలు విచారణసమయమున దమకుట్రను భిల్లులుబయలు వెట్టుదురేమోయనియుఁ దమకాప్తుఁడగు గండాభిల్లు నిష్కారణముగ నురిదీయఁబడుననియు బెంగఁగొని కాలుగాలిన పిల్లులవలె దౌలతురావును దుండిరావును జస్వంతరావు గృహముచుట్టును గోమాజీరావు గృహముచుట్టును దిరుగసాగిరి.

అందుఁబిడికివాకిలిలో నగేశ్రసహుండగు దుండిరావు తనప్రాణములు బిక్కు బిక్కు మనుచుండుటచే నగరమునకుండక దగ్గఱనున్న యొక గ్రామము నకుఁబాఱిపోయి బందుగులయింట దాఁగెను. శ్యామసుందరుని స్వాధీనమునందుండిన భిల్లుతప్పించుకొనిపోయిన వార్త చెవులకుఁ జల్లగ వినఁబడుట మొదలు తనప్రాణమిత్రుఁడు తప్పించుకొనినందులకును దమ రహస్యములు బయలుపడు నవస్థలు తప్పినందులకును రాణితలంపులు భగ్నములైనందులకును దౌలతరావు మితములేని యానందము నొంది శ్యామసుందరదత్తునకు రాణి మరణదండన విధించెననియు గోమాజీరావుచేత నతఁడు విచారణఁజేయఁబడెననియుఁ దెలిసినపుడు కోర్కెలెల్ల సిద్ధించినవనుకొని దుండిరావును బిలిపించెను. ఆపగలంతయు వగల బొగలుచు దత్తు చెఱసాలలోనుండి తనయకాలమరణమునకును శాశ్వతాపకీర్తికిని దనసోదరికిఁ దనపైఁగల యనురాగమునకును సర్వేశ్వరు మాయలకును నక్కజపడఁజొచ్చెను. దీపములు పెట్టినవెనుక రవంత కలఁతనిద్రపట్టె యందుఁ దన్నురిస్తంభములపై నెక్కించినట్లును దాను మృతినొందినట్లును దనసోదరివచ్చి తనశవముపైఁబడి యేడ్చినట్లును దుస్స్వప్నముం గని మేల్కొని నలుదెసలుచూచి మరునాఁడుదయమున జరుగఁబోవునది ముందుగా దృగ్గోచరమయినదని తెలిసికొని మనసులో హా దైవమా! నిన్న నీపాటికి గండాభిల్లునకు వాని మరణవార్తను నేను జెప్పుచుంటిని. నేఁడు నా మరణవార్తను దలఁచుకొనుచుంటి. ఏమి నీ వైచిత్ర్యము! ఈవృథావిచారముతోఁ గాలయాపన మేల? త్వరగా నాకు స్వర్గలోకసుఖమును గమలాదర్శనమును జేయింపుము. అని వేడుకొనుచు నొకమారు కన్నీరు పెట్టుకొనుచుఁ బరితాపమొందసాగెను. "శ్యామసుందరునివంటి బుద్ధిశాలియు బలశాలియుఁ దమ పక్షమునకు వచ్చునేని తమకక్ష నెగ్గునని యాతని నెట్లయినఁ దమ వైపు ద్రిప్పుకొనుటకు జస్వంతరావు ప్రముఖులు ప్రయత్నములు చేయఁదలఁచి" కారాగృహాధికారి తమ

కుట్రిలోని వాఁడె యగుట జామురాత్రియైన తరువాత జస్వంతరావు రహస్యముగఁ జెఱసాలయొద్దకరిగి జీవచ్ఛవము వలెఁ బండుకొనియున్న దత్తునుఁ జూచి జాలినొంది మెల్లగవానిని లేపెను. దత్తులేచి తనయెదుట జస్వంతరావునుజూచి యదికలయేమోయని కలవలపడి నిజమని తరువాత నెఱిఁగియతఁడక్కడకు వచ్చుట కాశ్చర్యపడెను. అంతట జస్వంతరావు వానిని బలుకరింప వారిట్లుమాట్లాడిరి.

జస్వంత—శ్యామసుందరా! రాజులను రాణులను నమ్మినవారి బ్రతుకులు తుదకెంతవఱకు వచ్చునో నీవు స్వానుభవముచే నిప్పుడెఱిఁగితివా? చలచిత్తులగు ప్రభుపిశాచముల సేవించుటకంటె ముష్టియెత్తుకొని బ్రతుకుటమేలు. నిన్నుఁగూర్చి నాకు విచారమగుచున్నది.

దత్తు—నాకర్మమునకు రాణియేమిచేయఁగలదు? నేనుజేసిన యపరాధమునకు నేను దగినశిక్ష ననుభవించుచున్నాను. ఆమెలోపము లేదు.

జస్వంత—నీపిచ్చి నీకింక వదలలేదు. నేను నిన్ను బ్రతికించు నుపాయమొకటిచెప్పెదను. నామాటవిని ప్రాణమును దక్కించుకొనుము. నిన్ను తేపురకొత్వాలగు గోమోజీరావు విచారణచేయునుగదా? గోమోజీనాకు మిత్రుఁడు. నీవు రాణిపక్షము విడిచి మాపక్షము వత్తునని ప్రమాణముచేసి తరువాత మాకక్షలోనుండి రాణితోఁ బోరెదవేని గోమోజిరావుతోఁ జెప్పి నిన్ను రక్షింపఁజేసెదను. అట్లు చేసెదవా?

ఈప్రశ్నమునకు దత్తుత్తరము సత్వరముగఁ జెప్పలేకపోయెను. మహాపాతకహేతువును దుర్దశాప్రాప్తి కారణము నైన రాజద్రోహమున కొడిగట్టి యాత్మరక్షణ మొనర్చుటుచితమో, తుచ్ఛ ప్రాణములపై నాసఁగోసి న్యాయమగు దండననొంది దేహముఁ జాలించుట యుచితమో వేగమునిర్ణయింప నేరక తటపటాయించుచుఁ గొండొక సేపటి కిట్లు చెప్పెను. అయ్యా నా ప్రాణము రాజభక్తి విషయమున ధార

పోయెదనని ప్రతిజ్ఞ గైకొన్నవాఁడను. రాజద్రోహము జేయుటకు నా ప్రాణ మొప్పకున్నది. మరణ మెన్నఁడైనను దప్పదుగదా. కుటిలవారి లోఁజేరి రాణిని క్షోభపెట్టి ప్రజలను గేపి కొలఁదికాలము సుఖపడుటకంటె గౌరవముతో నీ తుచ్ఛప్రాణమును విడుచుట మంచిది. నన్ను బరీక్షించుటయు జంపుటయు ననుకీర్త్యపకీర్తులు రాణికెదక్కవలె.' అన జస్వంతరావు వాసిని మ్రింగివేయునంతటి యలుకతోఁ గన్నులెఱ్ఱఁజేసిఁ దారుణపుచావు చావవలసినయోగము నీ కుండఁగ నా మాటలువిని బాగుపడుటకు నీకు మంచిబుద్ధి యెట్లుపుట్టును ? నీకర్మమంతే చావుము" అని చివాలునలేచి చెఱసాలవిడిచి పోయెను. నాడఁట శ్యామసుందరుఁడు కాలి ముందరికివచ్చిన యదృష్ట దేవతను ద్రోచివైచితినని కొంచెము పశ్చాత్తాపమునొంది మఱల తాను సలిపినదియె యుత్తమ కార్యమని యూరటనొంది యెపుడు తెల్లవారును ? ఎపుడీయైహికదుఃఖము పొయునని సిద్ధముగ నుండెను. ఆరాత్రి దౌలతరావు గోమోజీరావును జూడఁబోయి కొన్ని రాజకీయ వ్యవహారముల ముచ్చటించి నడుమ దత్తువిషయమై ప్రసంగమురాఁగా వారిట్లుమాట్లాడిరి.

దౌల—జస్వంతరావుమాట మనము నమ్మజాలము. భిల్లులు దేశముపైఁబడిదోఁచుకోవలనుగాదఁట! రాజపుత్రులు దండెత్తిరా వలనుగాదఁట! నీతియునుండవలెనఁట! కక్ష సాధించవలెనఁట! అదియుండిన నిదిరాదు. అంత నీతిమంతుఁడయ్యెనేని కక్షలోఁ దిగనేకూడదు. దిగిన వెనుక నన్నిపనులు చేయవలెను.

గోమో—అతనిని మొదటినుండియు నేను నమ్మలేదు. అయితే దత్తుగతి యీలాగునవచ్చినదేమి ? అతనిని విచారణ చేయుమని రాణి నాతోఁ జెప్పినది.

దౌల—నేను పన్నిన పన్నుగడసఫలమైనది కాని నీదగ్గఱ విచారు వచ్చినప్పుడు మనమిదివఱ కనుకొనినట్లు నీవుదత్తునుఁ గడతేర్ప

వలయునుజుమీ ? అతఁడును రాధాకాంతుఁడును జచ్చినఁగాని మనము నెరవేరము. వారె కమలను నేను బాధపెట్టుచున్నాననియు నామెను నేను వివాహ మాడుదుననియు నాపై నేరములు రాణితోఁజెప్పి లోకములో నారెండు సంగతులనుజాటి నాకప్రతిష్ఠ ఘటించినవారు. రాణిమీఁదకంటె వారిమీఁద నా కెక్కువకసికలదు. అందు శ్యామసుందరునిపై నాకుఁగల కోపమునకు మితములేదు. వాని నుఱిదీయించునట్లు సెలవీయవలెను.

గోమో—నేనిందు లేశమైన నన్యాయముఁ జేయను నేనుపిల్లలుగలవాడను, ముక్కునకు సూటిగఁబోయి న్యాయమే చేసెదను.

దాల—మనలోమనకె యిన్ని భేదములుండఁగ మనమెట్లు నెగ్గగలము?

గోమో—అన్యాయముగఁ జంపినచో నామీఁదఁ బ్రజలకుఁ గోపముండదా?

దాల—సరే నీయిష్టము వచ్చినట్లు చేయుము నేనరుగుచున్నాను.

అని దాలతరావు విసుకుతోఁ దన గృహము విడిచిపోయిన తరువాత గోమోజీరావు మొదట లోపల దాగియున్న యొక పురుషుని “ భేతాళా యిఁకరావచ్చునురా” యని పిలిచి తన ప్రక్కను గూర్చుండఁబెట్టుకొనెను. భేతాళసింగు హిందూస్థాన నివాసియగు రాజపుత్రుఁడు. ఇనుపకడ్డీలవంటి భుజములును గుండ్రనితలయుఁ బచ్చని మొగమునకు నీలికాంతుల నొసంగు కోరమీసములును వాని యాకారము భయంకరముగఁ జేసెను. అతఁడు గూర్చుండిన వెనుక వారిట్లు మాటలాడిరి.

గోమోజీ—సైన్యము లీపాటికి నింబపురము వచ్చియుండునా ?

భేతా—ఇంకను వచ్చియుండవు. ఈనడుమ మహారాణావారికి దేహముననించుక భారముగనున్నది. అందుచే నాలశ్యమైనది.

గోమో—శివనానా తప్పకపారిపోవును. అతనిదగ్గఱ విశ్వాస మెగాని బలములేదు. మీరు తుకాజీ హుల్కారునకు మాత్రమే జడియవలెను.

భేతా—అతఁడు నింబపురము మీఁదికి రాకుండ మీరుజాగ్రత్త పెట్టవలయును నిన్ననొ నేఁడో రాణావారు నింబపురము వచ్చియుందురని తలంచుచున్నాను.

గోమో—నాకువేఱేపనియున్నది. నీ వింకబొమ్ము. మఱచిపోక నా సొమ్ము నాకిప్పించుసుమా!

అన భేతాళసింగు పీఠియుఱుగుపై నిద్రించు భైరవసింగును వెంటఁబెట్టుకొని తన దారిని బోయెను. అనంతరము గోమోజీరావు (తనలో) "నా కోరిక యెన్నఁడైన నెఱవేరి యీ రాజపుత్రులు నింబపురముఁ బట్టుకొని యహల్యాబాయిని బారదోలి తామే దేశమంతయు నాక్రమించుకొని నాకు మంత్రిపదము నొసఁగుదురా? నేనంతటియదృష్టవంతుఁడ నగుదునా" అని యోచించుచుండఁ దలుపుఁ దోసికొని వామనభట్టువచ్చి యెదుట నిలిచెను. ఆలోచనలమాని కొత్వాలు వానివైపుఁజూడ వాఁడిట్లనియె "అయ్యా అతఁడేమియు లంచమిచ్చునట్టి స్థితిలో లేఁడు వానికి బంధువులు లేరఁట.

గోమో—ఇచ్చువారు లేకేమి? మహూపురములో నతని బావ యున్నాఁడఁట. అతఁడు వీనిని వదలించుటకు నెంతధనమైన నాకు లంచమిచ్చును. దత్తు ప్రాణరక్షణమునకు రాఘాకాంతరావే లంచమిచ్చును. కాని నే నాతనిదగ్గఱనుండి లంచము గ్రహింపను. అతఁడు నమ్మదగినవాఁడు కాఁడు.

వామన—నేను సాధ్యమైనంత ప్రయత్నముచేసి మీకు రెండువందలైన లంచము తెప్పించెదను. మీరు లంచములేని పని చేయనని ప్రతిజ్ఞఁగైకొన్నారుగదా?

గోమో—ఏమాత్రమైనను సరే కార్యముచెడకుండఁ దీసికొనిరా. నీ వింకపో నేను నిద్రపోవలయును.

అని వామనభట్టునంపి తెల్లవారుదాఁక నిద్దురలేక యిటునటు పొరలుచు నెట్లో యారాత్రి నాలుగుజాములు గడపి యుదయమునఁ బెందలకడ మేల్కని రాణిదర్శనార్థమరిగెను. గోమోజీని పరమవిశ్వాసముగల యుద్యోగస్థులలో నొకనిగ రాణి పరిగణించుటచే నాతనికిఁ దగునాసనమొసంగి కూర్చుండఁ బనిచి గౌరవించి పనియేమని యడిగెను. అంతట గోమోజీలేచి "అమ్మా! రాజ్య మల్లకల్లోలముగ నుండుటచే నాకు నిద్రపట్టుటలేదు. జస్వంతరావు ప్రేరణచే రఘునాథరావు సైన్యమును వెంటఁ బెట్టుకొని మనపై వచ్చుచున్నాఁడఁట.

అహ—ఏమీ వచ్చుచున్నాఁడా! నీకెవరుచెప్పిరి? నిజమని తోఁచదు.

గోమో—అయ్యయ్యో మీరు మాయమర్మ మెఱుఁగరు. శ్రీపేష్వామాధవరావుగారు పిన్నతండ్రిని దగుబలమిచ్చి పంపినారు. మీరుతక్షణమె తుకాజీ హోల్కారును వారిపై కంపఁదగును.

అహ—తుకాజీనిగాదు. రాధాకాంతరావు నంపుదును. ఈ వేళ నీవుదత్తుపై వచ్చిన యభియోగమును విచారించి న్యాయమైన తీర్పుఁజేయుము.

గోమో—రాధాకాంతుఁడు ముసలివాఁడు. ఆతఁడేమియుఁ జేయఁజాలఁడు. తుకాజీని బంపుట యుచితము. మీఁద మీచిత్తము.

అహ—ఎవరైననేమి? విశ్వాసముతోఁ బనిచేయవలెనుగాని నీవింకఁ బొమ్ము.

అన గోమోజీ తనయేలికవద్ద నుచితప్రకారముగ సెలవుగైకొని నిష్క్రమించెను. రాణి రాధాకాంతుని బిలిపించి, తగుసైన్యముతోఁ దక్షణమె పూనానగరమునుండి వచ్చుచున్న రఘునాథరావున కెదు

రుగఁజని వానినోడించిరమ్మని యానతిచ్చెను. దత్తునకు మరణదండన తప్పించుటకుఁ బ్రయత్నింపఁదలఁచుచున్న రాధాకాంతరావు పొరుగూరు పోవలసి వచ్చినందులకును దత్తునకు సహాయము చేయలేకపోయినందులకును జింతించి వెళ్ళుట కిష్టములేక తప్పక పురి వెడలెను.

పదుమూఁడవ ప్రకరణము.

రాణి దర్శనముచేసి సంగతుల ముచ్చటించి గోమోజీరావు తిన్నగాఁ దనకచ్చేరికి వచ్చెను. కళాహీనమగు మొగముతోడను, దయాహీనమగు హృదయముతోడను, దన మొగమువలె వెలవెలబోవు తెల్లనివస్త్రములతోడను, టక్కుటక్కు మను ముచ్చెలచప్పుడులు వందిమాగధులై తనరాకఁ దెలియఁజేయఁ జేత నొక కణుపులుగల పాలకఱ్ఱ విలాసార్థముగఁ బట్టుకొని కచ్చేరికి దయచేసిన కొత్వాలును జూచి బంట్రౌతులు దండములు పెట్టిరి. అతఁడు కచ్చేరిలో నడుమ వేయఁబడిన తనపీఠము నలంకరించినతోడనే నేరములు చేసినవారు క్రమక్రమముగ వానియెదుటికిఁ దీసికొని పోఁబడిరి. తనకు సహాయము నొనర్పఁదగిన రాధాకాంతుఁడు తక్షణమె యూరికిఁ జనుటయు, శత్రుగణముతోఁ జేరి తనపైఁ గక్షవహించిన గోమోజీ తన్ను విచారణసేయుటయు, స్వయముగ రాణికి దనపైఁగోప ముదయించుటయు నరసి దత్తు తనకు మరణము తప్పదని ప్రాణరక్షణార్థము ప్రయత్నములఁగూడ మానెను. శ్యామసుందరుని, వాని గుణములును, నెఱిఁగిన వారగుటచే నతని విచారణఁ జూడవలయునని నగరవాసులలోఁ బెక్కండ్రు కచ్చేరికి వచ్చి యెడతెరపినీయక గణగణ ధ్వనిఁజేయుచు నెక్కడఁ జూచిన తామే మై యుండిరి. రాధాకాంతుని భార్యయగు రోహిణీబాయి రాణిదర్శనము చేసి మెల్లగాఁ బ్రసంగవశమున దత్తుమాట నెత్తి యతని ప్రాణరక్షణఁ

జేయుట యుచితమని రాణితో మనవి నొనర్చినదయ్యు నామె కసరికొట్టి యిట్టి యనావశ్యకవిషయములో జోక్యము కలుగఁ జేసికొనవలదని గట్టిగ మందలించినందున రోహిణియేగాక యితరులుగూడ నట్టి పరాభవమె తమకుజరుగునని భయపడి రాణితో దత్తువిషయమై ప్రసంగించుట మానుకొనిరి. తనమాట వినలేదని జస్వంతరావు దత్తుపై నలుకఁబూని వానిపై సాక్ష్యముఁ గుదుర్చుచుండ దౌలతరావు సహజముగ నాతని నాశనమును గోరుచుండ లంచము దనకునీయలేదని గోమాజీరా వలుకవహించి తన తొంటికోపము నిప్పుడు దీర్చుకొనఁ జూచుచుండెను. దత్తు తనకు లంచము నొసంగినచో గోమాజీరావు ప్రతికక్షులోని వాఁడని కోపమువదలి వానిని విడిచియె యుండును. గోమాజీకిధనము నధికారము, ప్రధానముగాని తనకక్ష, నీతి, ధర్మము మొదలగు పట్టింపులులేవు. అప్పటికింకను శ్యామసుందరుని బావమఱఁదియగు మురళీధరదాసును వీనిసోదరియగు నానందయురాలైరి. ఇట్టి స్థితిలో స్వపక్షపరపక్ష సహాయశూన్యుఁడును, విచారవివశుఁడును, నిరంతర నిర్మలచిత్తుఁడునగు శ్యామసుందరదత్తు కొత్వాలుగారి యెదుట నిలువఁబెట్టబడఁ జూడవచ్చిన జనులెల్ల వాని సౌకుమార్యమును దలఁచియు, గుణములఁదలఁచియు దుఃఖితులై తేఱి యాతనిఁజూడజాలరైరి. దత్తుతోనుండిన మువ్వురు సేవకులు సాక్ష్యము నిమిత్తము కొత్వాలువలన రప్పింపఁబడి యెదుట నిలిచిరి. ఋషి కుటీరములోనుండి దొంగ పలాయన మొందుటచే యాతనిసాక్ష్య మావశ్యకమని వానికై క్రిందటిరాత్రియె కొత్వాలు పల్లకి నంపినందున నాతఁడును బయలుదేఱెను. కాని యప్పటికిఁ గచ్చేరికి రాలేదు. అట్టహాసము విస్తారముగ జరిగెను. కాని విచారణ ముహూర్తకాలములో మూఁడు ముక్కలతో ముగిసెను. అపుడు విచారణ మారంభముకాఁగా, కొత్వాలు దత్తును గనుఁగొని “నేరమును జేసితివా” యని యడిగెను. “నేను బుద్ధిపూర్వకముగ నేరమును

జేయలేదు" అని ప్రత్యుత్తరమునుజెప్పి యెదురుబెదురులేక యొఱఁదీసిన కత్తివలె నిలువఁబడెను. తరువాత సాక్షివిచారణ మారంభించి కొత్త్వాలు మువ్వురుసేవకులలో నొకని నీవిషయముఁ గూర్చియడుగ వాఁడిట్లనియె. "నేనెఱిఁగినవఱకు నిజము మనవిచేసెదను. ఋషికుటీరములో మేమాదఱముండఁగ, దత్తుగారు గండాభిల్లుని దనవెంటఁదీసికొని యెక్కడికో పోయిరి. అర్ధరాత్రి ఖయిదీని దానొంటరిగ · వెంటఁబెట్టుకొని పోవలదనియు నది ప్రమాద కారణమనియు, మేమువలదని వాదించినను మామాటలువినక యతఁడట్లు దొంగతో నెటకోయరిగెను. మేమును వెనువెంట రహస్యముగ నరిగి వారి సంభాషణఁ గొంతవింటిమి. మాకు వారిమాటలు స్పష్టముగా వినఁబడలేదు. "కాని నాలుగువందల రూపాయలు కావలెను. లేనియెడల నేనిన్ను విడువను" అనుమాటలు మాచెవులఁబడినవి. తరువాతఁ గొంతసేపటికి దొంగ పారిపోయినాఁడని యాతఁడే మాతోఁ జెప్పెను. ఇంతకుమించ మే మేమియు నెఱుఁగము శ్యామసుందరుఁ డానుడువుల నాలకించి వింతకథలు సృష్టించిన బంట్రౌతుయొక్క ద్రోహసాహసముల కచ్చెరువడి "ఇది కేవల మబద్ధము. దౌలతరావు మొదలగువారి కుట్ర" అను దత్తుపలుకుల కాగ్రహించి "ఛీ నోరుమూయుము. నిన్నెవరడిగినారు! ఇతరులజోక్యము నీ కెందు" కని గోమోజీరావు వానిని మందలించి రెండవసాక్షిని విచారణసేయ, వాఁడును మొదటివాఁ డప్పగించిన పాఠమునే యప్పగించి దత్తునకు మఱియు నక్కజముఁ గల్గించెను. మూఁడవవాఁడు కొంచెము మేదకుఁడుగావున సాక్ష్యమిచ్చునపుడు తడఁబడి యొకమాటఁ కొకమాట జెప్పి తనసాక్ష్య మిరువురకుఁగూడ నిరర్థకము సేయుటయేగాక నడుమ నొకసారి "యిట్లు నిన్నెవరు చెప్పమన్నా" రనిదత్తు బుకాయించియడుగ "దౌలతురావు చెప్పమన్నారండి" అని లేదండి నేనే చెప్పినానండి యనివడఁక నారంభించెను. కచ్చేరీలో వేడుక చూడవచ్చి కూర్చున్న

దాలతరావుమొగము చిన్నబోయెను. చూడవచ్చిన వారందఱు మిక్కిలి యన్యాయ మన్యాయమని యఱచి చప్పటలు గొట్టిరి. గోమోజీరావు మిగులఁ గోపముతో ఛీ మూర్ఖుఁడా నీ దొంగసాక్ష్యము నేను నమ్మను. నీతోడి వారిద్దఱు నిజముఁ బలుక నీవు దత్తువద్ద లంచము పుచ్చుకొని యబద్ధ మాడెదవా. చూడు నిన్నేమిచేసెదనో చూడుమని యూనెంగిలి బంట్రోతునకుఁ జాలునంత పిటికీమందుఁ బెట్టెను. దానితో వాఁడు తిరుగ తెలివిఁ దెచ్చుకొని చెప్పవలసినట్లు చెప్పెను. ఇంతలోఁ బల్లకిలోఁ గూరుచుండి ఋషి యరుగుదెంచుటయు సభ్యులును కొత్వాలునుగూడ నాతని సన్మానముచేయుటకు లేచి నిలిచి నమస్కారముఁజేసిరి. ఋషి నారాయణ, నారాయణ యనుచు నందఱఁగూర్చుండ నియమించి యున్నతాసనమునఁ గొత్వాలునకు సరాసరిగఁ దానును సుఖాసీనుఁడయ్యెను. అనంతరము వినయవిధేయతాపూర్వకముగ ఋషిని గన్గొని కొత్వాలు మీ కీవిషయమునఁ దెలిసినంతఁ జెప్పవలయు” నని నాప్రార్థనయన ఋషి యిట్లనియెను. నన్ను మీరు ప్రశ్నవేయవలదు. భగవంతునిమోముఁ జూచి నిష్పక్షపాతముగ నేను జెప్పెదను. శ్యామసుందరదత్తు నాకుటీరమున కప్పుడప్పుడు వచ్చుట గలదు. నాతో రహస్యమున గొన్నిఁగొన్ని యోచనలు సేయఁ బ్రయత్నించెను. దొంగ పాఱిపోవుటలో దత్తు పొరఁబాటుపడెనో బుద్ధిపూర్వకముగఁ జేసెనో చెప్పఁజాలను. రాజభక్తి యతనికి విస్తారముగ నున్నదని నమ్మఁజాలను. పొరబాటుచేతనో బుద్ధిపూర్వకముగనో రాజద్రోహము జరిగినదిగనుక శిక్షకుఁ దగినవాఁడేయని నాకుఁ దోఁచుచున్నది. ఇతఁ డసత్పురుషుఁడని నాయభిప్రాయము. అని ఋషి పలుక ‘ఛీ! ఈ ఋషీగూడ నబద్ధమాడుచున్నాఁడు. ఏమిది యని దత్తు బిగ్గఱగ నఱచెను. “ అయ్యయ్యో! దైవస్వరూపుఁడగు ఋషి యబద్ధమాడుచున్నాఁడని యనుటకు నీ నాల్క యెట్లాడెను? మూర్ఖుఁడా నోరు మూసికొ

ను" మని గోమోజీరావు దత్తును గదిమి యీయభియోగము నిట్లు సమాప్తము జేసెను. 'ఓయీ శ్యామసుందరదత్తూ ! నీ యందమును నీవయసునుజూడ నాకు మనసు గరఁగుచున్నది. కాని నీ చేష్టలు, నీస్థితికిని వయస్సునకును దగినవికావు. చిన్నతనమునందే యింతటికుట్రలు చేసినవాఁడవు నీవు పెద్దవాఁడవగుదువేని లోకములు ముంచివేసెదవు. అంతటి ధర్మస్వరూపురాలిని మోసముచేయుటకు నీమనసెట్లు లొప్పినది? ఋషిమాటలఁబట్టి చూచిన సేవకుల సాక్ష్యముఁబట్టి చూచిన నీ వపరాధివని నాకుఁ దోఁచుచున్నది. నీకిప్పుడు శిక్ష విధింపవలయును.' అనునప్పటికి దత్తు వానిమాటల కడ్డమువచ్చి "అయ్యా ! మీరునాకు విధించెడు శిక్ష మరణముకంటె నెక్కువగ నుండదు. నే నందుకు సిద్ధముగనుంటిని గనుక నే నెఱిఁగిన నిజ మందఱి ముందుఁ జెప్పుచున్నాను. దొంగయు మనుష్యునివంటివాఁడే. నీవును, జస్వంతరావుతోడను దౌలతరావుతోడను జేరి పెక్కుకుట్రలుసేయుచు నేమియు నెఱుఁగనివానివలె వేదాంతములు పలుకుచున్నావు. నీ కుట్రలు నే నెఱుఁగుదును. నన్నుఁ గోసినను రాజద్రోహము నాదగ్గఱలేదు. నేను ఘనమైనచావు చచ్చుచున్నాను. నీవు నీచమైన బ్రతుకు బ్రతుకుచున్నావు. ఎప్పటికయినను నీసంగతి వెలుతురులోనికి రాకమానదు. డంబము చిరకాలముడాగ" దని దత్తు జనులు విస్మయమును జాలియు నొందునట్లును గోమోజీరావు నిశ్చేష్టుఁడగునట్లును నిష్ఠురముగఁబలుకుటయు సభయెల్ల నిశ్శబ్దమయ్యెను. ఋషి వచనంబుల నమ్మి కొందఱు శ్యామసుందరుఁడు దోషియని వాదింప వానిమాటలు విని కొందఱు దత్తు నిర్దోషియనియు మరణమున కనర్హుఁడనియు నెంచి కొత్వాలు తీర్పు నియ్యకముందే దత్తాతని క్రూరవచనములచే నొప్పించుటచే నతఁడేమి విపరీతపు తీర్పు నిచ్చునో యనియోచింపఁ దొడఁగిరి. అంతలో నొక సేవకుఁడు త్వరితముగవచ్చి కచ్చేరిలోనున్న జనుల నొత్తిగించుకొని

కొత్వాలు సమీపమునకుఁ బోయి నిలిచి వానిచేతి కొకలేఖ నిచ్చెను. ఆజాబును మెల్లగాఁ జదువుకొని గోమోజీరావు చిఱునగవుతో సభ్యులను జూచి "చూచితిరా వింత! శ్యామసుందరదత్తుపైఁగల ప్రేమచే రాధాకాంతరావు నాకువ్రాసిన లేఖ యెట్లున్నదో చూడుఁ" డని "నీవును నేనును స్నేహితులమగుట నేఁడుసార్థకము కావలయును. కావలసినవాఁడవు. గొప్పయుద్యోగమున నున్నందులకు నా కీమేలుఁ జేయుము. శ్యామసుందరుని నేను వృద్ధిలోనికిఁ దెచ్చుచున్నాను. వాఁడునాకుఁ బుత్రప్రాయుడు. వానిమీఁద వచ్చిన యీ నేరము నీవు తప్పించి శిక్షలేకుండ వాఁడు తప్పించుకొనునట్లు చేసి ప్రాణములు కాపాడుము. నీమేలు మఱవను. నన్ను రాణీగారు దూరదేశము పంపినారు గనుక ప్రయాణములో నుండుటచే నేను నీతో స్వయముగ మాటలాడఁ జాలనైతిని. నీకుఁ గావలసినచోఁ గొంతలంచముఁగూడ నేనుజాగ్రత్త పెట్టఁగలను. ఎట్లైనఁ గుఱ్ఱవానినివిడువుము. రాధాకాంతరావు" అను నొక చీటీఁ జదివి వినిపింప సభ్యులు రాధాకాంతుని తెలివితక్కువను న్యాయవిరుద్ధబుద్ధిని వేనోళ్ళ నిందించిరి. అట్టి నీతిబాహ్యమగు ననాలోచనపూర్వకకార్యము రాధాకాంతునివంటి లోకజ్ఞుఁడు చేయుట యనుచితమనియు నందును శత్రువునిపేర నట్టి రహస్యములగు జాబులువ్రాయుట బుద్ధిహీనతయనియు, రాధాకాంతుని కీర్తికిభంగము గలిగినదనియు, దత్తు విచారింపఁ దొడఁగెను. లేఖను జదివి గోమోజీరావు బిట్టలుకతోఁ బండ్లు గీటుచు గుడ్లెఱ్ఱజేసి నాకు లంచము నిచ్చుటకు రాధాకాంతరావు ప్రయత్నముచేయుట చూచినారా! బుఱ్ఱపోయినను నేను లంచము దీసికొందునా? నన్నింత యవమానము నతఁడు చేసినందుకు నేను రాణితోఁ జెప్పి దీనికిఁదగినంత చర్య జరుపక మానను. అనుచితమయిన యీ లేఖను వ్రాసి రాధాకాంతుఁడు దన నీచబుద్ధిని గనఁబరచుకొన్నాఁడు కాని నేను రాణివిషయమై యన్యాయముచేయుదునా?

ముక్కునకు సూటిగఁ బోయెదను. నాసంగతి యెవ్వరెఱుంగరు. అని పలికి తత్క్షణమే తీర్పుఁజెప్ప నుద్యుక్తుఁ డయ్యెను. చూడవచ్చినవారందఱు చెవులు దోరఁబెట్టుకొని తీర్పువిన సిద్ధముగ నుండ శ్యామసుందరుఁడు నిశ్చలహృదయముతోఁ దన గతిని జెవులార వినుటకు వేగిరపడుచుండెను. అప్పుడు కొత్వాలిట్లు దీర్పువినిపించెను. "ఓయీ! శ్యామసుందరా! నీవు చేసిన రాజద్రోహమునకు నీకు నేను మరణదండన విధించినాఁడను. రేపుసాయంకాలము నీ కురిశిక్ష యగు" నని బంట్రోతులను జూచి వీనిని జెఱసాలకుఁ గొనిపొండని యానతిచ్చి వెంటనే సభాస్థానమునువిడిచి యాతఁడు రాణిచేఁ దనతీర్పు నామోదింపఁబడఁ జేసికొనుటకంతిపురికిఁ జనెను. తీర్పువిని జనులు రామరామ! హరిహరీ! ఎంతకష్ట మెంతకష్టము! అయ్యో! అనుచు విలపించి యొక్కరొక్కరుగ గోమాజీని నిందించుచు నిండ్లకుఁజనిరి. అనవసరమగు మనోవ్యథను దొలఁగించి కమలను సందర్శించు సుఖమును ద్వరితముగఁ జేకురఁజేసినందులకుఁ గొత్వాలునకు మ్రొక్కుచు శ్యామసుందరుఁడు మొక్కవోని మనోధైర్యముతోడను గలవలపాటులేని చూపులతోడను రాజభటులచేఁ జెఱసాలకుఁ గొనిపోఁ బడుచుండెను. అంతలో మహూపురినుండి దత్తుమొక్క సోదరియగు నానందబాయియు నామెమగఁడు మురళీధరదాసును వచ్చి వాని దురవస్థ విని విలపించుచుండ, నందు నానంద, కడసారి తనముద్దులతమ్మునిఁ జూడఁగోరుటచే మురళీధరుఁడు త్రోవలో దత్తునకెదురుపడి యాతనిఁజూచి మనస్సుచెడి వగచి సోదరి కొకసారి వానిఁజూపుమని బంట్రోతును వేఁడుకొనెను. తన సోదరినట్టి సమయమునజూచుట కిష్టములేక దత్తువలదని రాజభటులతో వాదించినను దయాళు రగువారు వాని మాటఁద్రోచి తిన్నగా వాని నానందకడకుఁ గొనిపోయిరి. లావణ్యవర్షము గురియు తమ్ముని మొగము విన్నఁబోవుటయు దీర్ఘబాహులు వెనుకకు విఱుగఁగట్టబడుటయుఁ జక్కని తలవెండ్రుకలు చీకాకు

పనుటయు విచ్చుకత్తులతో రాజభటులు వాని వెంబడించుటయుఁ గనుంగొని యానంద డెందంబువగుల దుఃఖమ్ముపట్టలేక యోతమ్ముఁడా యని కేకవేసి మూర్ఛిల్లెను. తనతో సమానదుఃఖితుఁడైన మురళీధరుని చేఁ జేయబడిన శైత్యోపచారములచే నామె తెలివినొంది హా తమ్ముఁడా? యెంత కష్టమురా? నాయనా? నేనెట్లు బ్రతుకుదునురా? తండ్రీ? నీకుఁ బెండ్లివారు వచ్చినారు వారితో నేమని చెప్పనురా నాయనా? నావరాలచెట్టూ! నిన్నుఁజూచుకొని నాముద్దులు ముచ్చటలు చెల్లునని మురియుచున్నానురా తండ్రీ! యీపాపిష్టి యుద్యోగము నీచావునకు వచ్చినదటరా! యింతమందియుండ దేవునికంటికి నీవే కనఁబడితివటరా! అని పరిపరివిధముల గుండెలుబాదుకొని తలగోడకువేసి కొట్టుకొని యెక్కడనైన మష్టియెత్తుకొని బ్రతుకకుండ నీకీకర్మ మెందుకువచ్చెనోయి మీబావను వేళాకోళముఁజేసెడు వారెవ్వరు బాబు! నాతో మాటలాడవేమిరా! నామీఁద కోపమాయని గడ్డముపట్టుకొని బ్రతిమాలుచు ముద్దుఁబెట్టుకొనుచు నేడ్వసాగెను. "అక్కయ్యా! నాఋణము తీరిపోయినది. దుఃఖించిన కార్యములేదు. నేను నీవాఁడనుగాను. బావా! ఆమెనూరడింపు. నాకు సెలవిమ్ము. పోయెద" నని పలికె దుఃఖమాగక తానుగూడ సోదరియొడిలోఁ బండుకొని దత్తు పెద్దపెట్టున నొకమాఱు రోదనము సల్పెను. ఆదుఃఖముఁ జూడలేక బంట్రౌతులుగూడ నేడ్చిరి. తుదకు రాజభటులు దత్తును దీసికొనిపోవుటకుఁ బ్రయత్నముచేయ, నానంద దుఃఖావేశముచే నొడలెఱుంగక 'ఓరీ దుర్మార్గులారా! నాతమ్ముని దీసికొనిపోవుటకు మీరెవ్వరురా? మిమ్మును జంపివేసెదను. నాయెదుటనుండి పొండి" యని విఱిచికట్టఁబడిన దత్తుయొక్క చేతులను విప్పసాగెను. మురళీధరదాసును రాజభటులును వారించి యామెనొక మూలగదిలోనికి సాయముబట్టి యీడ్చుకొని తీసికొనిపోయి యందుఁబడవేసిరి. తరువాత నానంద మూర్ఛిల్లినందున నదియె దాఁటిపోవుటకుఁ

డగు సమయమని దత్తు బావా నామీఁద దయయుంచి నేనిదివఱకుఁ జేసిన తప్పులు క్షమియింపుము. నాయాస్తి నామేనల్లునికి వ్రాసి నన్ను జ్ఞాపకముంచుకొనుము. మాయక్కను దయతోఁ జూచుచుండుము. అని బంటొత్రితులతో గుమ్మము దాఁటివెడలెను. మురళీధరుఁడు వెనువెంట జని, నాయనా నిన్ను క్షమియించుటకు నీస్వల్ప జీవితకాలమున నీదగ్గఱఁ గలిగిన తప్పులేవి? నాకుడిభుజము పడిపోవుచున్నది. మేరుపర్వతమువలె నీవున్నావుగదా యని నిన్ను నేను నమ్మికొన్నాను. నీవు నన్నేకాకినిజేసి నీతోవ్రివను బోవుచున్నావుగదా? నాయనా నీయందము నేలపాలు గావలసినదినమువచ్చినది. అని విలపించెను. అంతలో భటులు వేగిరపడి గోమాజీరావునకు దత్తుకడకువచ్చుటఁ దెలిసినఁ దమకు మాటవచ్చునని యాదత్తును జెఱసాలకుఁగొనిపోయిరి. ఆదినమున నే భోజనములు లేక యానందామురళీధరులు మహూపురి కరిగిరి. రాణీ దత్తునకు గోమాజీవిధించిన శిక్ష నంగీకరించెను.

పదునాల్గవ ప్రకరణము.

ఓసీ! సీతా నీవు చెప్పెడు కథలు మిగులఁ జమత్కృతితో నిండియుండును. ఇంత చిన్నతనములో నింతింత చిత్రములనెన్నఁడు నేర్చుకొంటివి? ఒకపర్యాయము కడుపు చెక్కలగునట్లు నవ్వింపఁగలవు. మరియొకపర్యాయము భోరున నేడిపింపఁగలవు. హాస్యశృంగారకరుణారసములు నీసొమ్ములేయని తోఁచుచున్నది. నీవు వివాహముఁ జేసికొని నీయత్తవారింటి కరుగుదువేని నే నెట్లుండఁగలను? అని ముక్తాబాయి తనకెదురుగఁ గూర్చుండియున్న సీతాభాయినింగూర్చి పలికెను. రాధాకాంతరావొప్పగించినది మొదలు దాసియగు సీతాభాయి రాణిమొదలఁ దత్తుమారికమొదల నత్యంతవిధేయతతో నడుచుకొనుచు సమయో

చితముగ వారిచిత్తరంజనకరములగు వినోదకథలనుఁ జెప్పి వారిచే శ్లాఘింపఁబడుచు వచ్చెను. మొదట నామె ముక్తాభాయి నిమిత్తమేర్పఱుపఁబడినను దనవాక్చమత్కారముచేతను, వాక్చమత్కారమునుమించు ముఖసౌందర్యముచేత ముఖసౌందర్యమునతిశయించు వినయాదిసద్గుణసంపదచేతను రాణి హృదయమునుఁగూడ నాకర్షించినందున రాణిగూడ నామె చెప్పుకథలను వినుచుఁ దన విచారములఁ బాపుకొనుచుండెను. సీత దాసియనియు ముక్త యజమానురాలనియుఁ బేరేకాని వారిరువురు నన్యోన్యానురాగముగలవారై నెచ్చెలులై యొకరినివిడిచి యొకరు నిమిషమయిన తాళఁజాలక ప్రొద్దులు పుచ్చుచుండిరి. సీతకుఁ బెట్టకుండ ముక్త యే పదార్థమును భక్షింపదు. రాత్రిలు దనతల్లి చూడకుండ ముక్త సీతను దనమంచముపైఁ బండుకొనఁ బెట్టుకొనుటయు యౌవనాతిశయమువల్ల నుదయించు కోర్కుల నామెకుఁదెల్పుటయుఁగూడ కలదు. దాసి నంతదయతోడను సమాన గౌరవముతోడను నాదరించిన స్వపరగౌరవ తారతమ్యమెఱిఁగిన తల్లి యేమనునో యను భయమున ముక్తతల్లియెదుట నితరులయెదుట సీతను దాసిగాఁజూచి యాంతర్యమునఁ జెలివలెఁ జూడసాగెను. అహల్యాబాయియు సీతను సామాన్యముగ దాసియెడఁజూపుగౌరవముకంటె నెక్కువ గౌరవమును జూపుచుఁ బ్రేమము నూల్కొల్పుచు నామెకుఁ గొఱతరానీక బహువిధముల నరయుచుఁ జిన్న చిన్న యంశములలో నామెయోచనముఁగూడఁ గైకొనుచు నామె బుద్ధి మెచ్చుకొనుచుండెను. ముక్తాబాయి పైనుదహరింపఁబడిన పలుకులఁ బలుకుటయు సీత నవ్వుచు దీనికంతకు మీ దయయే కారణము. నేను మిమ్ము విడుతునని భయపడకుఁడు. బ్రహ్మచర్యముతోనే కాలముఁ గడతేర్పవలెనని యూహించుచుంటినిగాని వివాహప్రయత్న మింతట తలఁపులేదు. మీరు వివాహానంతరము నన్ను విడుతురేమోయని భయపడుచున్నాను సుఁడీ యని పలికెను. ఆపలుకులువిన-

ముక్తకు శరీరమంతట గగుర్పాటుదయించెను. తలవంచికొని సీతను జూచి “ నీకు బొత్తుగా భయములేదు. అప్ప డప్ప డిట్టిమాటలు నా కుజ్ఞాపకముచేసి నాకుఁగలవలపాటుఁ గలుగఁ జేయుచుందువు. నీవావిష యమై యెత్తఁబోకు. అని మందలించి జస్వంతరావును నేను గలిసికొను భాగ్యమే నాకుఁగల్గునేని మాయమ్మకు వానికి నిట్టికలఁతలు కలుగవు. దైవమా మాకు సంయోగము గలుగఁజేయవుకదా ? అని చింతింపుచు సీతతో నీక్రింది సంభాషణము జరిపెను.

సీత—అమ్మా గంగాధరజస్వంతరావుగారు మీకుఁదప్పక లభిం పఁగలరు ! చింతపడకు.

ముక్త—కోరికలతో నాకుఁ బనిలేదు. అది వ్యర్థమనోరథము ని నేనెఱుఁగుదును. విరోధముచే మాయమ్మ నన్ను మఱియొకరిని వరి యింపుమని నాకాజ్ఞాపించును. ఇష్టముఁగలవానిని విడిచి వేఱొకరినిం జే సికొనుటకంటె మరణముమేలు.

సీత—నిజమే. అందుచేతనే కమలాబాయి, పాపము దౌలతరా వును వరించుటకంటె మరణ ముచితమని యట్లుచేసినది. మీయమ్మగా రిపాలనములో నిదియొక్కటియే ఘోరమైన కార్యము జరిగినది.

ముక్త—అవును. ఆమె కడుసందగత్తెయఁట! నిష్కారణముగఁ జచ్చినది. సరే చచ్చిన వారి జోలి మన కెందుకు ? నాకాసంగతులు చె ప్పకుము రాత్రి పీడకలలువచ్చును. నీవేదైన నొక వినోదకథఁ జెప్పు ము. నీవు కథలను జెప్పి నాకారోగ్యముగలుగఁజేసినందుకు ముందు ముందు నీకు నేనొకయుపకారముఁ జేసెదను. ఇదినావాగ్దానముగ నీవు గ్రహింపుము. నీయందు నాకట్టిదయగలదు.

సీత—(సంతోషముతో) అమ్మా యిది నాకొక్కవరము. స మయమైనప్పుడు తప్పక యియ్యవలయును సుఁడీ. ఈవేళ మీకు వింత

మైనకథఁ జెప్పెదరు. అమ్మగారుగూడ వచ్చి యాలకింపవలసినట్టి కథ. వారు వత్తురేమో మీరు గనుగొందురా?

ముక్త—అమ్మగారు కథల నాలకించుటకు మనస్థిమితముఁ గల వారుగ లేరు. రఘునాథరావు దేశముపై వచ్చుచున్నాఁడని తెలిసి వానిమీఁదికి రాధాకాంతునిబంపినది. ఇంకను రాధాకాంతుని వద్దనుండి యుత్తరమురాలేదు. అతఁడుగూడ శత్రులఁ గలిసినాఁడని యీవేళ గుమారు బయలుదేరినది. రాజపుత్రులు నింబపురముమీఁదికివచ్చుచున్నారనియు సైన్యముల నంపుమనియు శివనానా జాబులు వ్రాసినాఁడు. లేఖను జూడఁగనే మాయమ్మగారికి గుండెలో రాయిపడినది. అదిగాక క్రొత్త హోల్కారొకఁడు మాజ్ఞాతి బయలుదేరినాఁడఁట. వానికి నేఁడో రేపో పట్టాభిషేకమగునఁట. ఇవియన్నియు నీవేళ యుదయమునఁ దెలిసినవి. ఆమె కేమియుఁ దోఁచుటలేదు. ఇంతియేగాక గండాభిల్లను దొంగను విడిచినందుకు నొకని కీదినమున నురిశిక్ష విధించినది. ఆమె యాపనిఁ జేయించుచున్నది. అందుచేఁ గథ వినదు.

సీత—అమ్మా యాయదృష్టహీనుఁ డెవఁడు? వాఁడు శిక్షింపఁ బడవలసినదే.

ముక్త—నీ వెఱుఁగవా? రాధాకాంతు నింటనుండెడు పడుచువాఁడు శ్యామసుందరదత్తు.

ఆమె వచనములు చెవులఁబడినతోడనే సీత భీతకురంగమువలె బెదరుజూపులు గలిగి నాలుక కొంకుపోయినదానివలె తడబాటు మాటలతో 'హరి హరీ! ఆపిల్లవాఁడే' అని కూర్చుండలేక స్తంభమునకుఁ జేరబడెను. ఆమె యవస్థఁ గని ముక్త భయపడి, "ఏమిది? నీవు దత్తు నేమెఱుఁగుదువు? నీకింతవిచారమేల" అనెను.

సీత—అమ్మా, పాపమాదత్తును, నేనును, చిన్నతనమునందు మిగుల స్నేహితులము దైవవశమున నిట విడిపోయినతరువాత నేను

మీయింట దాసినైతిని. అతఁ డుద్యోగియయ్యెను, చిన్నప్పటిస్నేహముచే మిగుల జాలిగలదు.

ముక్త—మనమేమి చేయఁగలము? రాజద్రోహముచేసిన దురాత్ముఁడు శిక్షాపాత్రుఁడని నీవిప్పుడేకదా పలికినావు. నీమాట నీవు నిలుపుకొనుము.

సీత—దాసినగు నేను నామాట నిలుపుకొనఁజాలను. రాజపుత్రికలగుమీరు మీమాట నిలుపుకొనుఁడు. నాకుఁ గావలసిన సహాయముఁ జేసెదనని మీ రిప్పుడే వాగ్దానముఁ జేసినారుకదా? ఇప్పుడామాట నిలుపుకొని మీయమ్మగారితోఁ జెప్పి నానిమిత్త మీదత్తు ప్రాణములు రక్షింపుదురా? ఆమేలు నాకుఁ జేయుఁడు.

ముక్త—ఇది యసాధ్యము. రాజకార్యములలో మాయమ్మ నామాట వినదు. నే నీపనిఁజేయఁజాలను,

అని ముక్త సందేహవిముక్తయై పలుక సీత కనుదమ్ముల మంచుబిందువులచందమున బాష్పకణములు దిగజార దుఃఖావేశముచే ధైర్యముజార భోరున రోదనము సేయఁదొడంగెను. అందుచే ముక్త జాలిఁగొని యెట్లయినఁదనఁ యావచ్ఛక్తి వినియోగపరచి తల్లి మనస్సు ద్రిప్పుమనని బయలుదేరి విచారగ్రస్తయై యున్న కాంతామతల్లియగు తల్లిం గనుగొని యొకచోట మెల్లఁగఁగూర్చుండి కొంతసేపటి కామెతోఁ, 'అమ్మా రాజపుత్రులుః నింబపురము నాక్రమించినారా' యని పలికెను.

అహ—ఆక్రమింపలేదు, ఱేపో యెట్లుండియో యాపని జరుగును.

ముక్త—అమ్మా యీదినము నాదొకమనవియున్నది. నీవు శ్యామసుందరదత్తును—

అహ—తెలిసినది. చాలుచాలు. నీమనవిని గట్టిపెట్టుము. ఆ విషయమై చెప్పకు.

ముక్త—అమ్మా! అట్లనవద్దు. వానిని బ్రతికింపుమని సీతనన్ను వేఁడుకొన్నది. నాముద్దు చెల్లించుము.

అహ—నీకు భయభక్తులు లేవు. రాజకార్యవిషయములలో నీకుఁ జోక్యమెందుకు? ముక్కుపచ్చలారని పసిదానవు. నీవునాకు రాజకార్యములలో నాలోచనఁ జెప్పవచ్చితివా? ద్రోహులను నే నురిదీయింపక నీసిఫారసు విని రక్షించినచో రాజ్యమునకు వైపరీత్యము తప్పకవచ్చును. నీవెన్నఁడు నిఁకమీఁద నిటువంటి స్వతంత్రములు గైకొని నాకు నేవిషయమున నుపదేశము జేయకుము.

ముక్త—అమ్మా నేనుపదేశము జేయలేదు. నేను ప్రార్థించుచున్నాను.

అహ—ఆదాసి వేఁడుకొనుటయు నీవు వేఁడుకొనుటయునా? ఏమీ కొంచెముదయతో నాదరించుచున్నామని దానికిమోడలు దెలియుటలేదా? దాసియగు తనయంతరమును రాణినగు నాయంతరము నెఱుంగక సీత సిఫారసులుచేయ సాహసించినదా? జాగ్రత్తయని చెప్పు. ఆలస్యమైనకొలఁది నేఁదఱో సిఫారసులు చేయుచుండును. కనుక నీపూఁటనే వానినురిదీయించెదను. నీత్రోవను నీవుపోయి చదువుకొనుము. నేనిట్లన్నానవిచారమొందకుము.

అన ముక్తాబాయి యుడుకుఁబోతుతనమును దుఃఖమును డెందమున సందడింపఁ జిన్నఁబోయి తల్లివద్దనుండిపోయి గంపంత యాసతోఁ దనకై యెదురుచూచు సీతతో నిరాశగొలుపు నీపలుకులఁ దెలుప నామె విన్నఁబోయి విచారభారముచే నన్నము నీళ్ళు ముట్టక క్రోజుచుండెను.

పదునేనవ ప్రకరణము.

ఉదయగిరి శిఖరంబున రతనంపు బంతిచాయలఁ బ్రభాకరబింబంబు నేత్రానందకరమై పొడజూపి యజ్ఞానముఁ బాపు సద్గురూపదేశ వాక్యములవలె నంధకారమును బాపు తనకిరణ సహస్రములచే జగమున కమితోపకారము నొనర్చెను. వ్యాఘ్రసింహాది క్రూరమృగములు చీఁకటి గుహలలో డాగి తమవేఁట కనుకూలముగఁ బగ లేటికరుదెంచెనని విచారింపఁజొచ్చెను. ఆసమయమున మహాపుర సమీపారణ్యమున నొక యున్నత పర్వతశిఖరముపై వేనవేలుజనులుచేరి మహాకోలాహలధ్వనులఁజేయుచుండిరి. ఏనుఁగుదంతములు నడవిపందికొమ్ములు నెమలి పింఛములు పలువిధములగు పూసలపేరులు మొదలగు ననాగరికతసూచించు నలంకారములఁగైకొని భిల్లులు నాగరికతసూచించు వేషములతోఁ గొందఱుపురవాసులును మధ్యస్థితిలోనుండిన కొందఱు కాఁపులును వచ్చి తత్పర్వతమున నాతురతతో నొక మహాకార్యమున కెదురుచూచుచుండిరి. పర్వతముపైఁ జల్లదనమును వెదఁజల్లు విశాలమగు పందిళ్లు వేయఁబడియుండెను. పందిళ్లకు నలుదెసలను మంగళకరముగఁగట్టఁబడిన పచ్చని మామిడాకులతోరణములును నడుమ తోరణములతో దండలుగాఁగట్టఁబడిన వనపుష్పములును స్తంభములకు జతగనాటఁబడిన కదళికాతరువులును తత్ప్రదేశమునకు శృంగారలక్ష్మిని రాజ్యలక్ష్మిని నాహ్వానము సేయుచుండెను. ఈకోలాహలముతో జనులు మహోత్సాహాభరిత మనస్కులై యుండఁ గొందఱు పెత్తనమువహించి సందడి సేయవలదని జనుల నాజ్ఞాపించుచు హస్తములయందుఁ దమకు నెవ్వరునీయని యధికారమును దెల్పు కఱ్ఱలఁదాల్చి యటునిటుఁ దిరుగసాగిరి. అంతలో 'నిశ్శబ్దముగ నుండుడు వచ్చుచున్నారు. వచ్చుచున్నారు జాగ్రత్త" యను పలుకులు వినఁబడ. బ్రజలందఱు వచ్చుచున్న యాపురుషునిపైఁ గన్నులనిగుడ్చి

చూడసాగిరి. అప్పుడు ముందును వెనుకను నిరుఁగెలంకులను హస్తముల దండములఁ బూని వేత్రహస్తులు స్తుతిపాఠములుసేయ ధనము చెరఁబెట్టుటచేఁ బల్లెలనుండివచ్చిన లోభిబ్రాహ్మణులు స్వస్తిచెప్ప దుర్గంధభూయిష్ఠమగు నొక యడవియేనుఁగుపయి నమర్పఁబడిన ప్రాఁతయంబారీలో బాలీసునకు జేరబడి యొకసుందరపురుషు డిరువదియాఱు సంవత్సరముల వయస్సుగలవాఁడు కూర్చుండి యెడనెడఁదనరాకకై ప్రజలు గావించిన యలంకారమును మెచ్చుకొనుచు వచ్చెను. అంబారీలో నాతని కెదురుగ నొకనల్లనిష్ఠూలకాయుఁడు కొన్ని రాజకీయ వ్యవహారముల నాతనితో ముచ్చటింప నీబాలుఁడు తలయూచుచుఁ గేల నప్పుడే తుప్పుపోవఁదోమిన ఖడ్గము తళతళమెరయఁ, దనభవిష్యద్వృత్తాంతమును గూర్చి యువ్విళులూరుచునుండ నింతలో మావటివాఁడు గజమును బందిళ్ళమధ్యమున నిలిపెను. వెంటనే దౌలతరావు మెల్లగా నంబారిదిగి యాబాలునింగూడ వినయముతోడను భయముతోడను నొకరత్నకంబళముపై దింపెను. దింపునప్పటికి భిల్లులు ఘీంకారనాదములఁజేసిరి. పల్లెలనుండివచ్చిన కాఁపులు భయముచే నొత్తిగిలిరి. కొందఱు మనకొత్త హోల్కారుగారు వీరేయని యా బాలునిజూపఁ దొడఁగిరి. గండాభిల్లు తాంతియాభిల్లు వెనువెంటనడువఁ, జోపుదారులు మనుష్యులనొత్తిగించి మార్గముఁజూప, దౌలతరా వొకహస్తమును హరిహరపాండ్యాజీ యొకహస్తమునుబట్టి తన్నునడిపింప నీబాలుఁడువచ్చి సభాంతరమున వేయఁబడిన యొక వేదికపైనున్న చిన్నకుర్చీపైఁ గూరుచుండెను. దాని ప్రక్కనే సింహాసనమని యొకపెద్ద పీఠము వేయఁబడియుండెను. అందతఁడు సుఖాసీనుఁడయిన తరువాత సభ్యులందఱు దమ తమ యథాసనములపైఁ గూరుచుండ నంతట దౌలతరావులేచి సభలోనున్న ధ్వనినివారించి యిట్లుచెప్పెను. "ఓహోప్రజలారా! మిమ్ముల నిక్కడికి నేనురావించిన కార్యము మీరెఱుంగుదురు. ఈదినము సుదిన

ములలో సుదినము. ఈయన మనయేలికయగు హోల్కారుగారు. తన మనుమఁడుగతించిన పక్షమున నీయననే పెంచుకొమ్మని మలహారురావు హోల్కారుగారు మరణశాసనము వ్రాసిరి. ఈయన యున్నతమైన హోల్కారు కుటుంబమున నుదయించినవారు. ఆఁడుదాని యధమ పరిపాలనములోనుండుట కష్టము, పరువుగల మగవారి కుండఁగూడదు. మీరీమహారాజుగారి పాదములు నమ్ముకొనియుండుఁడు. ఈయన ధర్మప్రభువులు. వెనుకటి హోల్కారుగారికి సన్నిహితజ్ఞాతులు. ఈయనను బెంచుకొమ్మని జస్వంతరా వెన్ని చెప్పినను రాణివినదయ్యెను. మీకందఱకు నిష్టమయినచో నీయనకుఁబట్టముఁగట్టెదను. ఇది మీకుసమ్మతమేనా?" అని దౌలతరావుపన్యసింప, భిల్లులు కాఁపులు మొదలగువారందఱు నైకకంఠ్యముగ మాకు సమ్మతమే మాకుసమ్మతమే యని యఱచి చప్పటలఁ గొట్టనారంభించిరి. నింగిముట్టునట్టి చప్పటలతోఁ బర్వత ప్రాంతముననున్న మృగసమూహములు బెదరిపారుచుండ దౌలతరావు శ్రీమద్రాజాధిరాజ శ్రీమంతపంతు శ్రీయిందూరుపదపాదుషా శ్రీమహాదేవ రఘునాథ గోవిందశాయాజీ హోల్కారుగారు దయచేసి సింహాసనమెక్కుఁడని యాతని సింహాసన మెక్కించి యొక జరీకుళాయిని దెచ్చి ప్రస్తుతమిదియే నవరత్నకిరీటమని వాని శిరమునఁబెట్టెను. తరువాత హరిహర పాండ్యాజీలేచి "ఓజనులారా! ఇఁకమీఁద మనయేలిక శాయాజీహోల్కారుగారు. అహల్యాబాయికి మీరుదమ్మిడియైనఁ గప్పముఁగట్టవద్దు. కట్టినచో మరల మహరాజుగారికీయవలసియుండును గనుక మీరు రెండునష్టములుగల్గి చెడిపోదురు. ఇందూరు రాజ్యముననున్న గ్రామములకన్నింటికి నీ విధముగానే మేముత్తరములు తాఖీదులు వ్రాయుచున్నాము. అహల్యాబాయి రాణిమునియెంచిన వారికి మానప్రాణములు దక్కవు. ఇదివఱకున్న యుద్యోగస్థులఁదీసివేసి క్రొత్తవారి నేర్పరుతుము. మీరందఱు మహారాజుగారికి లోఁబడినట్లు

మీభక్తిఁ దెలుపుఁడు" అని సింహనాదముతో నఱచెను. అంతట గండాభిల్లు తాంతియాభిల్లు మఱికొందఱు కాఁపులు కరణాలు చేరి రాజసింహాసనమునకు సాష్టాంగనమస్కారమొనర్చి తమకత్తులపిడులు రాజున కందిచ్చి యందుమూలముగఁ దమరాతనికి లోఁబడుటఁ దెలిపి 'స్వామీ మేము మాపన్నులను మీకిచ్చెదము. అహల్యను రాణిగా నెంచము. మేము మీ కొఱకు హోల్కారు రాజ్యముకొఱకుఁ బ్రాణములుధారఁ బోయుదుము. దేశములందోఁచుకొని యామెతోఁ గత్తిఁగట్టి యుద్ధముఁ జేసెదము' అని ప్రమాణములఁ జేసిరి. అంతట శామాజీ హోల్కారుమహారాజుగారు సింహాసనము విడిచి లేచి యిట్లనిరి. 'కాఁపులారా! మీకందఱకు సమస్తసుఖములుఁ గలుగునట్లు మేము పరిపాలించెదము. అహల్యాబాయి కాలమున మీకుఁగల కష్టములన్నియు నశించెను. ఖర్చులకు సొమ్ము గావలయును గనుక మీరు పన్నులు త్వరగా దౌలతరావునకు హరిహరునకుఁ జెల్లింపుఁ' డని దౌలతరావును జూచి 'నిన్ను మా సైన్యమునకు సేనాధిపతిగా నేర్పఱచినాము. హరిహరను జస్వంతరావును మంత్రులుగా నియోగించితిమి గండాభిల్లు మన్నెసుల్తాను బిరుదముతో నీయుడవుల నేలవలసినది. మఱియు నహల్యకు జాబు వ్రాయుము. ఇందూరునగరము, కోట, సైన్యము, రాజ్యము, ఖజానా, మాదత్తజనకులగు మలహరురావువారి యాభరణములు, మా కామె వారముదినములలోపున నొప్పగింపవలసినదనియు నట్లు సమర్పింపదేని యుద్ధము సిద్ధమనియు గలహ మొనర్చినదేని ప్రాణములతో విడుచుట లేదనియు జీవితాశ గలిగినపక్షమున మాసొత్తు మాకిచ్చి మారాజ్యము నుండి యెచ్చటికైనఁ బారిపోవలసినదనియు, నామెకు వ్రాయవలసినది. రీవాసర్కారువారికిని గ్వాలియరు ప్రభువులగు సింధియామహారాజుగారికిని మాకు సహాయము రమ్మని యుత్తరములు వ్రాయుఁడు. ఇది మీపని" యని ముచ్చటించెను. అంతలో గండాభిల్లు పదునేండ్ల వయస్సుగల

యొక సుందరుఁడగుబాలుని దెచ్చి మహారాజునకు మ్రొక్కించి “ దేవా ! మాతాంతియాభిల్లు వీనిని మార్గమధ్యమునుండి తీసికొనివచ్చినాడు. మాదేవతకు వీనిని బలిపెట్టఁ దలఁచితిమి. కాని రెండు మూఁడాటంకములు వచ్చుటచే వాని యదృష్టమున బలి మానితిమి. వీఁడు చదువువ్రాఁత నేర్చినవాఁ డఁట. వీనిని దమయొద్ద నుంచుకొని మావిషయములగు పనులఁ జేయించుచుండుఁడు” అని యాతనిని సమర్పింప మహారాజు బాలుని సౌందర్యమునకు మెచ్చుకొని వానిఁ దానుంచుకొనుట కంగీకరింప, నిదివఱకు రెండుసారులు మృత్యుదేవత నోటనుండి బయిటఁ బడినందులకు సంతసించు నాబాలుఁడు హోల్కారువద్ద కరిగెను. తరువాత మహారాజు తన నిమిత్తమువేయఁబడిన గుడారములలోనికి నీబాలసుతోడఁగూడి వందిమాగధస్తోత్రములతోఁ జనియెను. కాఁపులు తమతమ గ్రామముల కరుగ భిల్లులాయుధముల ధరించి యాపందిళ్ళలోఁ బండుకొని యక్కడికే తమ భోజనముల దెప్పించుకొని భుజియించిరి. క్రొత్తహోల్కారుగారు పట్టాభిషిక్తులయిన వార్త గ్రామములలో దెలియుటతోడనే సైన్యమభివృద్ధి నొందసాగెను. పెండ్లిళ్ళులేని ఘోటకబ్రహ్మచారులు బిడ్డలులేని గొడ్డుబోతులు కొంపలుగాల్చుటలో నాఱితేఱిన ప్రౌఢులు, దారులఁగొట్టు పచ్చిదొంగలు, బందిపోటుఁజేయు దోఁపుడుగాండ్రు సవలీలగ నరహత్యలుగావించు హంతకులు, రాజులక్ష్యములేని గడేకాపులు, మొండిబండలు, రాజుపై నాగ్రహముగల దురాత్ములు వెయ్యేల దుర్నీతిపరులందఱు శాయాజీ మహారాజు సైన్యమునఁజేరి యెపుడు దేశముఁగొల్లఁగొందుమో యెపుడు స్త్రీలఁ జెరబట్టుదుమోయని కోరుచుండిరి. అహల్యపాలనమున నిష్టములేని వారికిఁగూడ నీసైన్యమును జూడ నానవిధమైన భయముదయింప సకలదోషములు మూర్తీభవించి కొలువ నధికారముసేయు కలిపురుషునివలె

శాయూజీని వారెంచఁదొడఁగిరి. ఇదియైన మరునాఁడుదయమున హరిహరుఁడును దౌలతరావు నొకటిగఁ గూర్చుండి యిట్లుముచ్చటించిరి.

దౌల—ఓయీ హరిహరా! జస్వంతరా వీపట్టాభిషేకమున కేమన్నాడు? నీవతనివదలి యిక్కడికి వచ్చినావేమి?

హరి—జస్వంతరావునకు మన యీకార్యమిష్టము. అందుచేత నతఁడీవిషయమై మనతో మాటలాడునఁట. కాఁబట్టి యీవేళరాత్రి మన మిందూరునగరమునకుఁ బోవలయును. ఇష్టమున్నను జస్వంతరావు నాశ్రయించి నేనుండినచో నాకు నొకగవ్వయైన దొరకదు. అతఁడు దేశముదోఁచుకొనుటకు నొప్పుకొనఁడు. నీదయవల్ల నేను నాల్గుడబ్బులసొమ్ము నార్జింపవలెననియున్నది.

దౌల—నిజమే. అతఁడెందులోను జేరఁడు. చివరకు రాణినిదటిమి మనమేబాగుపడుదుము. చూడు నాకు ధనమార్జింపవలెనని లేదు. కమలాబాయి విషయములోనాకు, రాణికిఁ గలుగవచ్చినందున నన్నామె యాడినమాటలకుఁ గసిదీర్చుకొనుటయే నాముఖ్యోద్దేశము. పిల్లలుగల వాడవు కావలసినధనము నీవుదోఁచుకొని స్వీకరింపుము. మీవంటిబ్రాహ్మణునకిచ్చినపుణ్యము.

హరి—నీవునాకు జేసినయుపకారమునకుఁ జాల సంతసించితిని. శూద్రులలో నిన్నుమించినవాఁ డెవ్వఁడు లేడు. సరే కాని యీచచ్చు ముండకొడుకును హోల్కారుగఁ జేసినావేమి! అనక వీఁడు మననెత్తిని బేడరాయునేమో.

దౌల—ప్రస్తుతమువీనిని హోల్కారుగఁజేసితినికాని రాజ్యము స్వాధీనమయినతరువాత నీయుపాత్రపుచచ్చుపీనుఁగును సాగనంపి నేనే రాజ్యముఁ గైకొందును. అంతవఱకు నామకా, వానినేర్పరచితిని. ఇది రహస్యము జాగ్రత.

అనివారు సంభాషించుచునంతలో నొక క్రొత్తపురుషుఁడటకు వచ్చుటచే వారు తమమాటలు సమాప్తముకావించి మహారాజుగారున్న గుడారమునకై పరిగిరి.

పదునాఱవ ప్రకరణము.

“అమ్మయ్యా! నాప్రాణము లిప్పటికిఁ జల్లబడినవే సీత. నేనదృష్టవంతురాలను సుమీ” యని ముక్తాబాయి పలుకుటయు, సీతయాత్రముతో, ‘అమ్మా యేమి జరిగినది యెందుచేత మీరదృష్టవంతులు, చెప్పవచ్చునేని నాకాసంగతిఁజెప్పుడు,’ అని ముక్తనువేగిరపెట్టుటచే నామె యిట్లనిజెప్పఁ దొడఁగెను. ఓసీ సీత నీవింకను నెఱుఁగనే యెఱుఁగవా నిన్నరాత్రి మాయమ్మ సర్వజనశ్లాఘ్యమయినయొక కార్యమొనర్చెను. శ్రీగంగాధరజస్వంతరావుగారు, దౌలతరావు, హరిహరపాండ్యాజీ మొదలగువారు దాదాపుగ నూఱ్వురుగూడి యొకమందిరమున మాయమ్మపైఁ గుట్రలుపన్నుచుండిరి. ఆసాయంకాలముననే మాయమ్మగారికి వ్రాలులేని యొకయుత్తరమువచ్చెను. ఆజాబులో వీరందఱుఁ గుట్రపన్నుచుండిరనియు జస్వంతరావుగారి వసంతగృహములోఁ గలిసికొందురనియు వారిం బట్టుకొనుటకదియె యదననియు నున్నది. ఆజాబుచదువుకొని వీరావేశమునొంది యమ్ములు విండ్లు ఖడ్గములు మొదలగు నాయుధములతో మదగజేంద్రమునెక్కి నయనకల్హారముల యారుణ్యమును జూచి పౌరులు భయకంపితులై పార వీరపురుషోచిత వాక్యములు దురాత్ముల గుండియలుజల్లుమనఁజేయ బయలుదేరెను. బయలుదేరి యాకస్మికముగఁ దనపైఁ గుట్రలఁబన్నుచున్న నరాధములతోటఁ జేరి కవాటములు బలిమిం భేదించి యా వసంతగృహమున వసంతజయంతకాంతుఁడగు జస్వంతుని, వానిచెలిమికాండ్రను గొందఱను జూచి వారిలోఁ

చెక్కండడ్రిఁ బట్టుకొని బంధించెను. కాని దౌలతరావు మొదలగు వారు గోడలుదాఁటి పలాయితులైరి. అంతట వారందఱు దమకుఁ బ్రాణ దాన మొసంగుమని రాణిని బ్రార్థింపఁ గాంతామతల్లియగు నాతల్లి క రుణారసైకపరిధానురాలయి యందఱ క్షమించి యభయహస్తంబిడెను. దౌలతరావుమొదలగువారు మందమతులై పాఱిపోయిరికాని లేకున్న మాయమ్మ వారిఁగూడ క్షమియించియుండును. వారు మృత్యుదేవతకు బంధువులగుటచే పాఱిపోయిరి. నాకోరికదీర మాయమ్మయు జస్వంత రావుగారును సఖ్యత వహించినారు. అదియే నాకు శుభసూచకము” అ ద్భుతరస ముదయింపఁజాలు నాపలుకులనాలకించి సీత తన చెలి మనోర థము సగము నెరవేఱినదను నానందమును, దనమనోరథము పూర్ణము గ భిన్నమైనదను విచారమును డెందమున మల్లడిఁగొన నిట్లనియె. “అ మ్మా! మన మిరువుర మొకశరీరముగ నుండునంతటి నెయ్యముగల వారము. కాఁబట్టి శరీరము సగభాగము సంతోషమను చిరువులతోనుం డ రెండవయర్థము విచారమను పక్షవాతముచే స్పర్శజ్ఞానములేక యు న్నది. ఇదినీకు సమ్మతమేనా? నిరపరాధియగు శ్యామసుందరుని నాని మిత్తము బ్రతికించుము” అని నల్లగలువఱేకులనుండి వెడలు మకరంద బిందువుల వలె కాటుకకన్నులనుండి జారిన నల్లనిబాష్పములు ముక్త హృదయముఁ గరఁగింప, సీత విలపించిన ముక్త తనచేతనైనంత ప్రయ త్నముఁ జేయఁదలంచి “ఓసీ యీదినమున మాయమ్మగారు నింబపుర మున కరిగెదరు. రాజపుత్రులువచ్చి నింబపురమును బట్టుకొని దుర్గా ధ్యక్షుఁడగు శివనానాను బారఁదోలిరి. అతఁడీనెపమున మాయమ్మవద్ద కు వచ్చినాఁడు. అందుచే ఱేపు మనమందఱము సైన్యసమేతముగ నింబ పురములోని కరుగవలయును. అచ్చటికరుగుటసుమండె దత్తును గూ ర్చిచెప్పెద నీవు విచారింపక ప్రయాణమునకు సిద్ధమైయుండుము” అని పలికి తనతల్లియొద్దకుఁ జనియెను. అదివఱకహల్య శివనానా, తుకాజీ

హోల్కారు, క్రొత్తగాలోఁబడిన జస్వంతరావు, మొదలగువారు పరివే
ష్టింప రాజకార్యాలోచనము సేయుచుండుటచే ముక్త తత్సమయమున
నరుగుట యనుచితమని ప్రక్కగదిలోఁ గూర్చుండి వారి విస్రంభసం
భాషణముల నాలకింపుచుండెను. అంతట నహల్యాబాయి యించుక
విచారగ్రస్తయై శివనానాను జూచి యిట్లనియె. "ఓయీ రాజపుత్రు
లు నింబపురముపై నెంతటిసైన్యముతో వచ్చినారు? మనసైన్యంబు
నం దెంతమనము దీసికొనిపోవలయును?" అన శివనానా 'పదివేలుండున
ని నేఁ దలంచినాను. రాజపుత్రులు శౌర్యవంతులు. వారినిం గెలుచు
టయసాధ్యము. కాఁబట్టి మనసైన్యముగూడ నంతయుండవలెను. తుకా
జీహోల్కారును నన్నును ముందుగనంపుఁడు మీరు తక్కినసైన్యము
తో రావచ్చును." అని రాణికుత్తరమొసంగెను. రాణి యాపలుకులు
మెచ్చుకొని యున్నవారిలో నీవును దుకాజియుఁగాక విశ్వసనీయు లెవ్వరు
న్నారు? రాధాకాంతరావును నేనిదివఱదాక నమ్మియుంటిని. శ్యామ
సుందరదత్తు నరిదీయించుచున్నానను కోపముతో నతఁడు రఘునాథరా
వులోఁ జేరినాఁడఁట. అతఁడు నాశత్రువులలోఁ జేరునని నేనెన్నఁడుఁ ద
లఁపనైతి' నని విచారింపఁదొడఁగ నప్పుడు తుకాజీ మెల్లగా నమ్మా
రాధాకాంతుఁడట్టివాఁడని నేను నమ్మను. అతని నియమములకు శత్రు
వులలోఁ జేరుట విరుద్ధకార్యము. ఇది యబద్ధమేమోయని తలంచెదను.
అని మనవియొనర్చెను. ఆమనవి ననుగ్రహముతో చెవియొగ్గి విని రా
ణి తనచందువా పెట్టెలోనుండి యొకజాబుఁదీసి "నామాటలు మిమ్మున
మ్మింపలేకుండినను నీచిన్ని చీటియైనను మిమ్ము నమ్మింపకపోదు చదువు
కొనుఁడీ" యని యాచీటి తుకాజీపైఁబడవేయ నాతఁడు దానినిట్లు చదువ
సాగెను. "శ్రీరఘునాథరావు రాధాకాంతరాయున కాశీర్వచనపురస్స
రముగ వ్రాయునదేమనిన, నీవు నాకు మిత్రుఁడవని నేను మిగుల న
మ్మియున్నాను. నన్ను మొదట మీదేశముపై రమ్మని జస్వంతరావు

పిలిచినాఁడు. అతఁడు చలచిత్తుఁడని వినుటచే నాతనిమాటలునమ్మి నే ను రానైతిని. నీవు నాతోఁ జేరి యహల్యాబాయితో యుద్ధముఁ జే యుటకు సమ్మతించితివి గనుక నేను జేపువచ్చి నిన్నుఁ గలియుచున్నా ను. నీవు పుత్రభావముతోఁ బెంచుకొనుచున్న శ్యామసుందరుని మీ రాణి యన్యాయముగఁ జంపింపఁ దలఁచుటచే నీకాగ్రహము కలుగుట దోషముకాదు. నీవుచేసినది రాజద్రోహముగాదు కాని యిందూరు రాజ్యముయొక్క గుట్టుమట్టులన్నియుఁ జెల్పుదువని నీవు వాగ్దానముఁజే సితివి కనుక యీవాగ్దానము నిలుపుకొంటివేని మాపేష్వావద్దనీకుఁ దగి నయుద్యోగ మిప్పించెదను. రఘునాధరావు.” ఆయుత్తరము చదువుకొ న్న తుకాజియు, విన్న శివనానాజస్వంతరావులును, నాశ్చర్యముచేఁ గొయ్యలయి మాటలాడనేరకుండిరి. రాణి వారి యాశ్చర్యముజూచి “యాశ్చర్యమెందుకు? ఇట్టివారు మన రాష్ట్రములో ననేకులున్నారు. గంగాధర జస్వంతరావూ! నీవు పాతిన కలహాంకురము మహావృక్షమై పెరిగియున్నదిగదా నీవులొంగినను నీచేఁ బ్రేరితులగువారు లోఁబడలేదు. దీనికంతకు నీవేకారకుఁడవుగదాయన తలవంచుకొని జస్వంతరావు తన మేలికతో “అమ్మా యీద్రోహమునకు మార్గప్రదర్శకుఁడను నేనే. నాపొరబాటు క్షమించి నన్నెప్పటియట్ల మన్నింతురని ప్రార్థించుచున్నా ను. నేను చేసినపాపమునకు నాపశ్చాత్తాపమే నన్ను దహించుచున్నది. మీరు వేఱ శిక్షింపనక్కఱలేదు. ఇంక మీయాజ్ఞ నతిక్రమింపనని ప్ర మాణము చేయుచున్నాను” అని పరిపరివిధముల నామెను వేఁడుకొనెను. రాణియు వానిమాటలకు సంతసించి కారుణ్యమొలికించు కటాక్షములు బరపి వానితోనిట్లనియె, ‘ఓయీ మనరాష్ట్రమున భిల్లులబాధ యెక్కు వగానున్నది. అదిగాక రెండుదినముల క్రిందట శాయాజీహోల్కారను పేరుతో నొకక్రొత్త రాజు బయలుదేరి పట్టాభిషేకము చేసికొన్నాడఁ ట. వాఁడెవ్వఁడో యీయనామధేయుఁడు మాకుసన్నిహితజ్ఞాతినని చెప్పు

కొని ప్రజలను మోసముజేయుచున్నాఁడు. శాయాజీయను నొకజ్ఞాతి మాకుండెను. కాని యతఁడు మృతినొందెనని యెవ్వరో చెప్పినారు. ఆ మాట యబద్ధమో యీమాటయబద్ధమో తెలియదు. భిల్లులు వానిలోఁ జేరినారు. దేశమునకు నిదివఱకే సేమములేదు. ఇంకముందు బొత్తుగ సేమముండదు. అందుచేత నేశూరుఁడైన భిల్లులనందఱ శిక్షించి వారినాయకులగు గండాభిల్లు మొదలగువారలఁ బట్టుకొని నాకొప్పగించి దేశమున దొంగపిడిమాన్పఁ గలిగనేని వానికి నా కొమార్తె యగు ముక్తాబాయినిచ్చెదను. ఆకార్యమును జేయఁగలవాఁడు పళ్ళెరములోని యీతాంబూలమును గ్రహింపవచ్చు" నని బంగారుపళ్ళెరమునఁ గర్పూరతాంబూలమిడెను. అందఱు నొకరిమొగము నొకరు చూచుచు సందేహింపుచుండ జస్వంతరావు సంతోష భరితాంతరంగుఁడై లేచి యేలికతో నిట్లనియెను. 'అమ్మా నేనీకార్యమును బూనెదను. భిల్లుల లోఁబఱచుకొనక జస్వంతరా వేలినవారిమొగముఁ జూడఁడు. రాకాచంద్రవదనయగు ముక్తాబాయిని విజయలక్ష్మితోపాటు పాణిగ్రహణము చేయుటయో, యోడిపోయి మృతినొంది వీరస్వర్గమున రంభాపాణిగ్రహణము చేయుటయో, నాకు నీశ్వరుఁడు విధించినాఁడు. ఈ తాంబూలము నేనందుకొనుచున్నాఁడను.' అని తుకాజీ శివనానాలు విస్మయమునొందఁ దాంబూలము నందుకొని గంగాధరుఁడు పలికి నిలువ యహల్య యాతనింగని, గంగాధరా! నీ వంతటికార్యమునకుం దగుదువు. చిరకాలము క్రిందట నంకురించిన యనురాగ ఫల మచిరకాలమున నిచ్చుఁగాక. నేను నింబపురముపైఁ జనియెద. నేను మరల వచ్చువఱకు గండాభిల్లు గండడంచి నీవు భిల్లులగండఁడవై యుండవలెను. నీవిఁక పొమ్ము. తుకాజీ! నీవు మనసైన్యములలో నొకవంతు నుంచి తక్కిన వాహినులఁగొని శివనానాసమేతుఁడవై రాజపుత్రులమీఁదికిం జని రాణాకు బుద్ధిఁ జెప్పుము. తక్కిన

సైన్యముతో రెండుదినములలో నేను వత్తునని యానతిచ్చెను. వెంటనే రాణికి జోహారొనర్చి సెలవుగైకొని వారరిగిరి. అపుడు ముక్తాబాయి మాలిన్య మెడలిన ముక్తాఫలమునలె ముక్తవిచారయై ముక్తినొందిన దానివలె ముక్తభయమై యౌవన ప్రాదుర్భావముచే పరిపూర్ణముగనొందిన తనయంగముల సౌష్ఠవము వసంతకాలమున గెంజిగురాకులనెప్పు మల్లికాలతచందములు విడంబింప నెన్నడుము జవజవలాడ మందగమనముతోఁ జిరునగవుతో నలంకరింపఁబడిన నెమ్మొగముతో వికచారవిందయుగము బోలు కన్నుగవతోఁ దల్లికడకువచ్చెను. తల్లిచేసిన శపథమును బురుషతల్లజుఁడగు గంగాధరుఁడు చేసిన శపథమును ముక్తను సంతోషసముద్రమున నోలలాడించు రెండు తెప్పలయ్యెను. వచ్చిన కూఁతుంజూచి తల్లి "తల్లీ! నీనగుమొగము క్రొత్తవిలాసము నొందియున్నది. జరిగినసంగతుల వింటివా యేమి" యని తనకూఁతు హృదయమూవఱకే జస్వంతునివంక మరలినదని యెఱుఁగుటచే నవ్వుచుఁ బలికెను. ముక్త లజ్జచే శిరమించుక వంచి నేలఁజూచుచు "తల్లీ! నామనవి నాలకించి మనసీత హృదయము చల్లఁబడునట్లు దురదృష్టవంతుఁడగు శ్యామసుందరుని విడువుము. ఇది చేయవేని సీత దుఃఖించును. సీతదుఃఖించిన నేను దుఃఖింపక మానను. నేను దుఃఖించిన నీకు దుఃఖము రాకమానదు. కాఁబట్టి నన్ను దయఁజూడుము తల్లీ" యని బ్రతిమాలెను. ఆదీనాలాపములు విని తనకూఁతునకు సీతపైఁగల ప్రేమాతిశయమును జేయఁదలఁచిన కార్యమునఁ గల పూనికయు నెఱిఁగినదగుటచే రాణి కూఁతుంగనుఁగొని "నీవింత మొూర్ఖపుపట్టు పట్టినావు. నీ నిమిత్తముననే నతనిప్రాణముల నిచ్చితిని. కాని యాతని నారాజ్యమున నుండనీయను. అతఁడు నాదేశమువిడిచి పోవునట్లుత్తరవుఁ జేసెదను. నీవును సీతయు నింక నింబపుర ప్రయాణమునకు సిద్ధముగనుండుఁడు" అని పలికి కూఁతునొడఁబరచి పంపెను. ఆమధ్యాహ్నమే శ్యామసుందరుడు

చెఱలోనుండి విడిపింపఁబడి రాష్ట్రమునుండి తఱుమఁబడెను. తుకాజీయు శివనానాయు నరిగిన రెండుదినములకు రాణి విజయభేరీకాహళధ్వానముల శత్రువులహృదయముల వ్రక్కలుసేయ మహిషాసుర నిర్మూలన కేళికరుగు దుర్గామహాశక్తివలెఁ జతురంగబలముతో నింబపురముపైఁ జనియెను.

పదునేడవ ప్రకరణము.

తుకాజీహోల్కారును శివనానాయును సైన్యమును దీసికొని నింబపురమునకుంజని రాజపుత్రులచే నాక్రమింపఁబడిన నింబపురపుకోటను ముట్టడింపసాగిరి. రాజపుత్రసేనకు నుదయపురరాణా నాయకుఁడై కోటలోనుండి మహారాష్ట్రసేనల నెడతెరపి లేకుండునట్లు తుపాకులబారులచే నొప్పించుచుండెను. రాణాకు రెండుకన్నులవలె గపటోపాయవేదులగు భేతాళసింగు, భైరవసింగు లిరువురు రాజపుత్రులు సమస్తసహాయములఁ జేయుచు నిందూరుపురవార్తను నహల్యప్రయాణవార్తలను విన్నవించుచుండిరి. రాజపుత్రులు నింబపురము నాక్రమించుటకు ముఖ్యకారకుఁడు గోమోజీరావే గనుక నతఁ డెప్పటి వర్తమానమప్పుడు గూఢ సంచారులగు చారులముఖమున భేతాళసింగునకు నెఱుఁగఁజేయుచుండ నతఁడు రాణాకునెఱుఁగఁజేయుచుండెను. గోమోజీరావు హోల్కారురాజ్యముయొక్క గుట్టుమట్టుఁజెంగించిన పక్షమున వేయివరహా లతని కిచ్చెదునట్లు భేతాళసింగు వాగ్దానము చేసినందున నింబపురముపై రసపుత్రులను రమ్మనియు నచట దుర్గాధిపతియగు శివనానా పరాక్రమ హీనుఁడనియుఁ జెప్పి గోమోజీ రాజపుత్రులను రావించెను. రసపుత్రుల మనోరథము తీరినను గోమోజీయొక్క మనోరథము తీరదయ్యెను. భేతాళసింగు వాగ్దత్తముచేసిన ద్రవ్య మతనికిఁ బంపుటఁగాని

యతఁడు వ్రాసినజాబులకుఁ బ్రత్యుత్తరమొసఁగుటఁగాని సలుపఁడయ్యె ను. అందుచే గోమోజీ తన కిష్టుఁడైన వామనభట్టుచేతికిఁ గొన్ని యుత్తరములు వ్రాసియిచ్చి యవి భేతాళసింగునకిమ్మనిచెప్పి వానిని నింబపురమునకంపెను. అతఁడటుండ జస్వంతరావు రాణీపక్షమునకు దిరిగిపోవుటయు గోమోజీరావు స్వలాభపరాయణుఁడై ప్రత్యక్షకక్షకు దిగకుండుటయుఁజూచి దౌలతరావు భిల్లులను శాయాజీహోల్కారును నమ్మియుండుట కేవలము మంచిదికాదని రసపుత్రులతోఁ గలిసి కొంతపనిఁజేయుట యుచితమని నింబపురమునకుఁ దానుఁగూడ మహారాష్ట్రసైన్యముకంటె ముందుగఁ జని రాణానుదర్శించి యాతనిచే గౌరవింపఁబడి యచ్చటనుండెను. తుకాజీ బయలు వెడలిన రెండుదినములకు శ్రీరాణి యహల్యాబాయి కొంతసేనతో నింబపురముపైఁ జనుచు మార్గమున నచ్చటచ్చట నిలుచుచు నాయాగ్రామముల ప్రజలంబిలిపించి భయపడవలదనియు భిల్లులను జస్వంతరావు సంహరించి దేశమున కుపకారము సేయుననియు దురాత్ములు చెప్ప తేనెతేటలవంటి మాటలకునోడి చెడిపోవలదనియు నుపదేశించుచుఁ బయనముసేయుచుండెను. చెలియొక పల్లకీలోఁ గూర్చుండి ముక్తాబాయియు సీతయు రాణివెంట వచ్చునెడ గ్రామముల ననాగరికులఁ గనుంగొనునపుడు వారొందు నాశ్చర్యమును వనములఁ బ్రయాణముసేయునపుడు నెమలి లేడి మొదలగు ముద్దులమూటఁగట్టు జంతువులంజూచి పొందినయానందమును గుట్టలను మహోన్నత పర్వతములను గొండకనమలను సెలయేళ్ళను వీక్షించి యనుభవించిన సౌఖ్యమును, వర్ణింప నలవిగాదయ్యెను. అదివఱకెన్నఁడు నంతఃపురము వీడినవారు గాకుండుటంబట్టియు నిట్టివినోదములకుఁ గ్రొత్తవారగుటఁ బట్టియు, యౌవనప్రాదుర్భావముచే ముందువెనుక నెఱుఁగని వారగుటఁ బట్టియు బయనమే సుఖతరమని మంచి నిర్భయముగఁ దలుపులం దెఱచి చూచుట కారంభించిరి

సైన్యమున విస్తారభాగము తుకాజీతో నంపఁబడుటచే నహల్య కొలఁదిమూఁకలతో బయలుదేరి మదగజాధిరోహణము చేసి తాను సే నాగ్రిభాగమునుండి శత్రువు లొకవేళ పయిఁబడిన స్త్రీలకపాయములుగలుగకుండునట్లు ముక్తను సీతను వెనుక రాఁబనిచెను. ఇందూరు వదలిన మూఁడవనాఁడు సాయంకాల మీచిన్నసేన యొకయడవిలో మువ్వురు మనుష్యులొకమాఱు వరుసగా నడచి పోవుటకుఁదగిన వెడల్పులేని యొక యిఱుకుత్రోవఁబట్టి పోవుచుండెను. రాణియధిరోహించిన యేనుఁగు సుఖముగానడచుట కామార్గముచాలనందున నాజంతువును మిక్కిలికష్టముతోఁ బయనముసేయఁ దొడఁగెను. వెనుకవారు ముందుకుఁగాని ముందువారు వెనుకకుఁగాని వచ్చుటకువీలులేదు. అందుచేత, మనుష్యులందఱుఁ జీమలబారువలె నొకరివెనుక నొకరు నడచియక్కడికి సమీపగ్రామమునకు సాధ్యమయినంత వేగముతోఁ బోవఁజూచిరి. గాటముగచీఁకటి నభమంతయు వ్యాపించి యప్పుడప్పుడే పట్టిన నల్లమబ్బుల సాయమునొంది యామార్గస్థులకు దారి తెన్నుఁగానసీయకుండెను, ఉఱుములు మెఱుములు నట్టహాసముచేసినందున జవ్వనులిద్దఱు ప్రయాణము గొంచెము కష్టమని యోచించిరి. అంతలో నొండొరుల ధ్వనులువినరాకుండ ఝంఝూమారుతము వీవఁదొడఁగెను. ఆసమయమున నేమూలనుండియో కొండయేటిప్రవాహమువలె మహారావములతో నలుదెసలనున్నకొండలు చరచరదిగి యుగ్రధనుఃపాణులును విలక్షణాకృతులు నగుభిల్లులమూకలువచ్చి యొక్కపెట్టున సేనయొక్క వెనుకచక్కిఁదాకెను. తాకుటయు బాలికలిరువురు నాక్రందనధ్వనిఁ జేసి అమ్మా! దొంగలు దొంగలని యఱచిరికాని వారిరోదన మరణ్యరోదనమై యామహావాయువుచే దిగమ్రింగఁబడి యహల్యచెవుల కెక్కదయ్యెను. భిల్లులయఱపులు మోటసకిలింపులు కొంచెము రాణిచెవికిఁ బొడఁగట్టెనుగాని యామె తనసేనల వారు దాకిరని తెలియలేకపోయెను. అంతట సాముగ్రిమోయుకూలివాఁడ్రు

నిర్విణ్ణహృదయులై భుజములపైఁ బరువులదింపి శత్రులకుఁ జేతులు జోడించి దండములఁబెట్టి తమ ప్రాణములఁ గాపాడుకొనిరి. ఎదిరించువా రెవ్వరును లేనందున గండాభిల్లు తక్కినభిల్లులసైన్యమున బియ్యము మొదలగు పదార్థములఁ దమసేవకుల చేతికిచ్చి బాలికలున్న రెండుపల్లకులదగ్గఱకువచ్చి తలుపులఁ దెఱచెను. అతనిభయంకరాకారముఁ జూచి ముక్తబాష్పయుక్తయయ్యెను, సీతభీతయయ్యెను. అనంతరము భిల్లులతోఁ గొల్లసలుపవచ్చినహరిహరపాండ్యాజి యామిటారులపైఁ జేతులు వైచి యందు ముఖ్యముగ ముక్తయొంటనున్న యమూల్యరత్నములను జాళువాబంగారునగలను దనివి దీఱఁ దోచుకొనుచుండ నాలతకూన లిరువురు మూర్ఛిల్లి యెన్నఁడో చచ్చినట్లుండిరి. ఇట్లు దోఁపిడిచే కోరికసఫలమైనందున హరిహరుఁడు సంతోషపారవశ్యముచేఁ బలుకఁజాలక మాటిమాటి కానగలమూటఁ జూచి మురియుచుండ "నీమెకా దామె ఆమె కాదీమె" యని భిల్లులలో నొకవిధముగ వాగ్వాద ముదయించెను. ఒకపట్ల నోరెత్తి మాటలాడఁజాలని హరిహరుఁడు వ్రేలితో నొకపల్లకిని జూపినందున వారు వాదముమాని యిదియె ముక్తాబాయియని యాపల్లకి నాభిల్లులు భుజముపై నిడుకొని యనాయాసముగఁ గొండలు సెలయేళ్ళు దాటి పఱువెత్తి యదృశ్యులయిరి. ఇంతలో నీవార్త కర్ణాకర్ణిని రాణియాలకించి పుత్రికావియోగదుఃఖముచే వెడలుబాష్పములం దుడుచుకొనుచుఁ గతిపయసైనికులతో రంగస్థలమునకు నొక్క నిమిషమున వచ్చి వ్రాలెను కాని దొంగలు స్థలమువిడిచి పోవుటయేగాక దృష్టిపథముం దప్పిరి. అంతటనామె హా ముక్తా నన్నువిడిచి యడవులపాలైతివే యని విచారించుచు రెండవపల్లకివద్దకఱిగి మూర్ఛిల్లియున్న కన్నెం జూచి సీతా సీత యిటురా నీచెలి భిల్లులపాలయినది యని లేపెను. ఆపలుకులామెను మూర్ఛనుండి మేలుకొలిపినందున బాలిక కన్నుదమ్ములవిచ్చి చూచి అమ్మా దొంగలు పోయినారా నాస్నేహితురాలిని గొని

పోయినారా అని యహల్యకంఠముసకు చేతులుపెనవేసి కౌఁగిలించు కొనెను. అహల్య యాశ్చర్య నిమగ్నయై యేమిది అమ్మా నీవు ముక్తాబాయివా. పాపము సీతనే దొంగలెత్తుకొని పోయినారా యని కూఁతుగన్న మోదము సీతచన్నఖేదము చిత్తమున మల్లడిఁగొన ముక్తాబాయిని లేవనెత్తి ముద్దుపెట్టుకొని సీతకై మిగుల విచారించి తనకాబె చెలినిమిత్తము మిక్కిలివ్యథనొందు గూఁతునూఱార్చుచు నామెను సేదఁదేర్చి వెంటఁబెట్టుకొని తనగజముపై నెక్కించుకొని సైన్యమునఁ గలకలముడిపి తిరిగి పైనముసాగించెను. త్రోవలో ముక్త సీతనుదలంచుకొని అమ్మా యింకనేను సీతనుజూడను గాఁబోలును. దానిమాటలేమమ్మా అదిపలుకుట యమృతవర్షము గురియుటకాదఁటమ్మా. అహహా మఱువఁదలచినను దానిచర్యలు మఱపురావు తల్లీ. అది దాసియటమ్మా పరిహాల కుప్పగాని హా సీత భిల్లులచేతఁ జిక్కినతరువాత నీవు నాకుదక్కుట యెక్కడిది. వారే దేవతకో బలిపెట్టుదురుగదా యని విలపింప కన్నీరుదుడిచి తల్లి యామె నూరడించి సీతను వెదకించి తెప్పింతునని పలికి భిల్లులమీఁది కరుగునపుడు సీతజాడలు దీయుమని జస్వంతరావునకు రాణి జాబులనంపెను. అట్లు చని యాఁరాత్రి సమీపగ్రామముచేరి యందుండి మఱునాఁడు మఱలబయలుదేరి పయనముసాగించి కొన్నిదినములలో నింబపురసమీపమునకుఁ జనిరి. రాణిరాకమున్నె విని తుకాజీ శివనానా మొదలగు సేనాధిపతులు భయసంభ్రమములతో నామె నెదురుకొని యామె యేనుంగుల కిఱుకెలంకులం దారునడచి ప్రత్యేకమామెకై వేయఁబడిన గుడారములో నామెను బ్రవేశపెట్టి తద్దేహసంరక్షణార్థమై యేనూరుగురుజోదులను గుడారముచుట్టుఁ గావలియుంచి రాణితో శివనానా యిట్లనియెను. అమ్మా మేమువచ్చి నాలుగుదినములయినది. తుకాజీయు నేనును గట్టిగాఁగ్రత్తగఁ గోటముట్టడించుచున్నాము. మీరుకూడ శ్రమపడనక్కఱలేకయే కోటలోఁబడును. మీదేహసంరక్షణార్థము మే

ముంచిన యీసేవకులలో నేఁబదుగురు తురకలున్నారు. తురకలని వీరిని తిరస్కారభావముతోఁ జూడవలదు. మనవిషయమున హిందువులకంటెను గృతజ్ఞులుగ నున్నారు. అందీజమాల్ ఖాన్ సాహసవిక్రమార్కుఁడు. రాజపుత్రులువచ్చునప్పటి కీశూరశిఖామణి యూరలేఁడు కాని యుండినచో నింబపురము మీరు రావలసినయవసర ముండకపోవును. ఈతనిచేత మీరన్ని కార్యములు చేయించుకొనవచ్చును. అనిచెప్పి యొక్క సుందరుఁడగు తురుష్కవీరునిఁజూపి యొప్పగించెను. రాణి యాపలుకులకలరి జమానుఖాను మొదలగు మహమ్మదీయులయందు నమ్మకముంచి వారిచే సంరక్షింపఁబడుచు గాఢముగా ముట్టడిజరుపుమని యానతిచ్చి యుద్ధములనారితేఱని స్త్రీయయ్యు భయమనక పగలనక రాత్రియనక గుఱ్ఱముపై నెక్కియు నేనుఁగుపై నెక్కియు స్వయముగా సేనలఁబురికొల్పుచుఁ బ్రాలుమాలిన స్వభటుల రక్షింపుచుఁ బరభటులను జాకఁజేయుచు నిరువురచే శ్లాఘింపఁబడఁజొచ్చెను. నింబపురాంతఃపుర కాంతల గర్భంబు లవియఁజేయు ఫిరంగిగుండ్లు గభిల్లుగభిల్లుమని కోటగోడలు దూట్లుపడఁజేయుచుండెను. రాజపుత్రమహారాష్ట్రసైన్యములు దూరములనుండి యొకరిపై నొక రగ్నివర్షములు కురియించుచుండిరి. ఇట్లు ముట్టడిజరుగుచుండ రాణివచ్చిన మఱునాఁటిరాత్రి గుడారములో రాణియు ముక్తయుఁ గూర్చుండి సీతనుగూర్చి ముచ్చటించుచుండఁ గావలిగాఁచు జమానుఖానుయొక్క కఠినమయిన కంఠధ్వని వారికి వినఁబడ రాణీ యొకసేవకునిఁబిలిచి యదియేమని యడిగెను. ఆసేవకుఁడు నమస్కారముఁజేసి 'అమ్మా నలుబదియేండ్ల వయస్సుగల స్త్రీ తమదర్శనమునకు రాఁగోరుచున్నది. యుద్ధసమయములయందుఁ బరుల రానీయనని జమానుఖానామెను నిరోధించినాఁడు. అదియే నాగడబిడయని విన్నవించెను. రాణి యామాటలువిని సభ్య స్త్రీలనురానిచ్చిన నేమి నష్టముండును. ఆమెను రానిమ్ము. ఆమె యేమి చెప్పనోయని జమానుఖానునకు

వర్తమానమంప నతఁడామెను లోపలికివదలెను. పచ్చని దబ్బపండు వంటి దేహచ్ఛాయఁగలిగి పొట్టిగ లావుగ నున్న యాయంగన యెఱ్ఱని చీరఁగట్టుకొని మొగమున నెఱ్ఱనికుంకుమబొట్టుతోడను గుఱుచలగు వెండ్రుకలతోడను బలుచని మొగముతోడను వచ్చి రాణియెదుటనిల్చి 'అమ్మా నామొఱనాలకింపుఁడు. నేను నింబపురవాసురాలను. నాకుమారుని శివనానా నిర్హేతుకముగఁ జెఱలోనుంచినాఁడు. అదిగాక యా ముట్టడిలో నాపనిపట్టెదనని యిదివఱకుఁ బ్రతిజ్ఞఁజేసినాఁడు. అందుచే నేనసహాయురాలనగుట నబలనగుట మీవద్దనుండఁగోరివచ్చితిని. నాకుమారుని చెరనుండి విడిపింపుఁడు'. అని రోదనముచేయసాగెను. శివనానా యామెకుమారుని నిర్హేతుకముగఁ జెరలోఁబెట్టెఁడని నిశ్చయముగ నెఱింగి యతని నీసమయమున నావిషయమైయడిగినచో నేమికార్యభంగము వాటిల్లునోయని శివనానానడుగుటకు నుద్యుక్తురాలుగాక భయపడిన యాయంగననుమాత్రము తనతోనుండుమని "అమ్మా నీకుమారునకుఁగాని నీకుఁగాని భయములేదు. ముట్టడియగువఱకు నీవు నా గుడారమున నుండుము. నేనుండ భయమేల" యని యామెభయముడిపి రాణి యారాత్రి నిద్రించెను.

పదునెనిమిదవ ప్రకరణము.

మనుష్యరక్షితములు గాక యెండకునెండి వానకుఁదడిసిన యడవిచెట్లనున్న పరిమళముల గ్రహించి మందములయానిలుండు తన గంధవహనామము సార్థకముగా నరుదెంచి యున్నతపర్వతముపై గుడారమునఁ గొలువుఁదీర్చిన శాయాజీహోల్కారుయొక్క శ్రమలన్నియుఁదొలంగఁ జేసెను. అతఁడొకకుర్చీమీఁద సుఖాసీనుఁడై యదివఱకుఁ బీల్చిన గంజాయిమత్తు తగ్గినందున మఱలఁగొంచెముగంజాయి తనదగ్గఱనిలువఁ

బడిన బాలకునడిగి నాలుగుగ్రుక్కలు పీల్చి వహవ్వా వహవ్వా నీవు మంచివాఁడవురా కుఱ్ఱా నీపేరెవ్వరురా మఱచినాను ఘాజీకాఁదాయని యాబాలునడిగెను. హోల్కారురాజవంశమున నుదయించినవాని కిట్టి తుచ్ఛమయిన యభ్యాసము లెట్లలవడెనని మనస్సున నొచ్చుకొనుచు నాబాలుఁడు నాపేరు బాజీరావుకాని ఘాజీకాదండి యని యుత్తరమిచ్చెను. శాయాజీ ప్రత్యుత్తరమిచ్చుటకుఁ బ్రయత్నించుచుండ నింతలో గండాభిల్లుపాండ్యాజీలు గుడారపువాకిట నిల్చి హోల్కారువారి దర్శనముఁ జేయఁగోర నతఁడు వారిరమ్మనియెను. వారు లోనికివచ్చు నప్పటికి శాయాజీ బాజీరావు నావలికంపి వారచ్చటికి వచ్చినకార్యమేమని యడుగ హరిహరుఁ డిట్లనియెను. మహారాజా! అహల్యాబాయికి ముక్తాబాయిపై ప్రేమ మిక్కుటమని విని కూఁతును మనస్వాధీనములో నుంచుకొన్నపక్షమునఁ దల్లి మనము చెప్పినట్లొప్పుకొని కుమార్తె ప్రాణరక్షణార్థము మనకు రాజ్యమును వదలివేయునని ముక్తాబాయిని దెచ్చినాము. ఈపర్యాయము తమరు తప్పక రాజ్యము గైకొనవచ్చును. కావలసినచో నీమెను వివాహమాడను వచ్చును." ఈపలుకులు శాయాజీ చెవులఁబడినతోడనే యేదీ నాప్రియురాలేదీ యని దిగ్గునఁబీఠమునుండి లేచి గుడారమువెలుపలికి వచ్చెను. గండాభిల్లింతలోఁ బల్లకిఁ దెమ్మని బోయల కానతిచ్చుటయు వారందున్న యందకత్తెను మోసికొనివచ్చి హోల్కారు నెదుటనుంచి తలుపులఁ దెఱచిరి. తనకు మన్నెసుల్తానుబిరుదునొసంగిన తనయేలికయెడ విశ్వాసమధికమగుటచే గండాభిల్లు పల్లవాధరింగని ప్రభువువారు నీనిమిత్త మెదురుచూడ ముద్దులాగునఁ గదలిరావేమి యీపాటికిరా యనిమృదుకరమృణాలముల నిరసించు నామె బాహువల్లిఁ బట్టుకొనిలాగ మడకత్తువంటి భిల్లుని మోటచేయి సోకుటచే నరము బెణికి కడుబాధ గలుగ, 'అమ్మా' యనిజాలిపుట్టనఱచి ప్రతిమలాగు సీత వాఁడులాగినవైపునకుఁ జని నిశ్చేష్టురాలయి పల్లకిఁ జేర

బడెను. శాయాజీశరీరము పులకలెత్త కన్నెత్తి యాపుత్తడిబొమ్మంజూచి
మేలిముసుంగు దీయుమనియానతీయ గండాభిల్లుకన్నియండాసి వలదువల
దనియామెచేతులతో నడ్డగించుకొనుచున్నను జేతులువిడలించి మేలిము
సుంగుదీసెను. తీయుటయు మేఘమునుండి వెడలు మెఱుపునలె తెరచా
టునుండి వచ్చు భామవేషమువలె భూమిని సంచరింపవచ్చిన యచ్చరవ
లె నపుడుదయించిన పూర్ణచంద్రబింబమువలె ముఖకళలు పర్వఁజేయు
చు నాలతాంగినిలువ ముసలివాఁడగు హరిహరుఁడు, శృంగార రస మె
ఱుఁగని మోటవాఁడగు భిల్లుండును మోహాతురులై యువ్విళులూర నా
గరికుఁడును బహుచువాఁడునగు శాయాజీస్థితి వర్ణింప నేరితరము! ఇట్లు
మోహసముద్రమునఁ గొంతసేపు మునకలు వేసివేసి వారుమువ్వురొక
రినొకరు చూచుచు భయలజ్జలచే వారింజూడఁజాలక మొగ మావలివై
పున కాబాలిక త్రిప్పుకొన్నను వంగి యాముఖముఁ గనులారఁ గనుచు
నుండ శాయాజీ వారలతో 'హరహరా! యీమె ముక్తకాదు. ము
క్తను నే నెఱుఁగుదును. ఆమె యింత సౌందర్యవతికాదు. ఈమెపేరె
ఱుగను. కాని యాకారము నాకుఁ గ్రొత్తదికాదుసుమీ యని, సుం
దరీ! నీవెవరే" యని యడిగెను. మహారాజుగారిప్రశ్న కామె యుత్త
రము నొసంగుట కిష్టములేనిదయ్యెఁ దన్ను వారు ముక్తాబాయిగా భా
వించుచుండిరి గనుక తనపేరు ముక్తాబాయి కాదని మనవియొనర్చినచోఁ
దన్ను వారు విడుతురను నాసచే నామె, 'నేనుముక్తనుగాను నాపేరు
సీత ముక్తాబాయికి నేను దాసిగనున్నాను. నన్ను దయచేసివిడువుఁడు
స్వామీ! మహారాజులు నున్నతగుణవంతులునగు తమకు దాసీసంగమ
ముకూడదుగదా" యని ప్రార్థింప నాముద్దుమాటలాలకించి శాయా
జీ, సుందరీ నేను నీకుజ్ఞాపకమున్నానా, నాఁడు పునహానగరములో గుడి
లోనికి నీవు పోయి మరలివచ్చుచుండ నేను నిన్ను బాణిగ్రహణము చే
యలేదా యని తన్నామెకు విన్నవించుకొనెను. అర్ధరాత్రివేళ నడివీధిలో

V. R. NARLA MEMORIAL LIBRARY P. R. I. Acc. No.

స్త్రీని జెఱఁబట్టఁ దలఁచిన దోషకర్ముఁ డొంటరిగఁ జిక్కినదానిని విడువఁడనియుఁ దనపుణ్యమట్లున్నదనియు భగవంతుని కేభారము వైచి సీత యిన్నకుండ, వివాహప్రయత్నము చేయింపుమని హోల్కారు చెప్పెను. ఆపచ్చనిపందిళ్ళనడుము నాపర్వతశిఖరమున పట్టాభిషేక మహోత్సవము వలెనే వివాహమహోత్సవమును జరుగుటమంచిదని గండాభిల్లు తగినముహూర్తమెంచుమని హరిహరపాండ్యాజీతోఁ జెప్పి కావలసిన మృగములనుఁ జంపితెమ్మని నలుదెసలకుఁ దన భిల్లులనంపెను. శాయాజీ హోల్కారున కీకన్యను వివాహము సేయుట యెందుచేతనో హరిహరున కిష్టము లేదయ్యెను. ఈవృద్ధబ్రాహ్మణునకుఁ గూడ నామెయం దాశ గల్గుటయే ప్రాయశః దీనికిఁ గారణమై యుండఁబోలు. అందుచే నాతఁడు శుభముహూర్తము నాలుగైదు దినములలోపున లేదని తెలియఁజెప్ప వారందఱు సీత నొకగుడారమునఁనుంచి చుట్టు నలువురు భిల్లులను గావలియుంచిరి. మొదట సీత యక్కడికి వచ్చుటతోడనే శాయాజి బాజీరావును గుడారమునుండి యావలకుఁ ద్రోలినందున నాతఁడు గుడారపు చాటున కరిగి యచ్చటఁ గూరుచుండి వచ్చినయాయంగన యెవ్వరో యనిమాత్రము ప్రేరేపింప గుడారపుగుడ్డకున్న చిన్నరంధ్రమునఁ దనకన్నులుంచి సీతను జూచెను. చూచినతోడనే యాతనిమనస్సున కేమి పుట్టెనోగాని చోటచోటఁ గన్నీరు కాలువలై చెక్కులమీఁదుగ నేత్రద్వయమునుండి ప్రవహింప బాజీరావు హాదైవమా! మాకిరువురకుఁ గూడఁగనియాపదఁ దెచ్చిపెట్టినావుగదా యని విలపించి తాను దుఃఖించిన జాడయేరికనైనఁ దెలిసిన వారు తన్నుఁ గారణమడిగి తెలిసికొని బాధింతురని కన్నీరుసత్వరమే తుడుచుకొని యెటులైన సీతనొకపర్యాయము కలిసికొని మాటలాడవలయునని ప్రయత్నించెను. కాని యాదినమున సమయము దొరకదయ్యె. అతఁడొకటి రెండుసారులు సీతయున్నగుడారము ముందఱ కరిగినిలువ భిల్లులతనిఁ గదిమికొట్టిరి. అందుచే నేమియుం

దోఁచక కాలుగాలిన పిల్లివలె నిటునటుఁదిరుగుచుఁ జెప్పిన మాటలుచక్కఁగ వినఁబడమి శాయాజీచే చీవాట్లు దినుచు మిత్తిమీఱిన సంతాప మొందసాగెను. ఆగుడారమునఁ బ్రవేశించుటాది సీత నెమ్మనమున నమ్మలికము హెచ్చ "హా భవానీమాత నాఁడు సన్యాసిరూపమున నీవే నాపరాభవము దప్పించితివి నేఁడుపంచాగ్నిమధ్యమందు నన్నుంచినట్లు క్రూరజనమధ్యమున నుంచితివి. నన్ను భంగపుచ్చుటకు యత్నించువారేకాని నివారించువారులేరు. ఏమిపనిచేసినను నీదాననే యని వేవిధముల మ్రొక్కుచు హరిహరుఁడు తనకంపించిన భక్ష్యములుగాని మహారాజుగారు ప్రత్యేకముగఁ దననిమిత్తమైవండించి పంపించిన మాంసాదికములుగాని భక్షింపక యన్నముముట్టక నీరుగూడఁ ద్రావక శుష్కోపవాసముచేసి భిల్లుల చెఱినుండి తప్పించుకొని పోవువఱకు నుపవాసములు చేయునట్ల ప్రతినగావించెను.

శాయాజీ హోల్కారు సూర్యాస్తమయ మయినతరువాత మదనబాణాహతుఁడై పలుమాఱు సీత యున్న గుడారము యొద్ద కరిగి యటనుండుభిల్లులకుజంకి మఱలుచు మఱల నటువైపరుగుచుఁ బ్రతిమాలియో బలాత్కరించియో యామెను దనస్వాధీనముఁ జేసికొనఁ గోరుచుండెను. హరిహరపాండ్యాజీ వృద్ధుఁడయినను వానికోరిక పసుచుతనమందుంచుటచే నెట్లయిన నయముననో భయముననో బాలికను దాను స్వీకరింపఁగోరి నిద్దురలేక సమయమున కెదురు చూడసాగెను. బలవంతముగ గుడారముఁ జేరినపక్షమున హరిహరుఁ డేమనుకొనునోయని శాయాజీయు శాయాజీయేమిచేయునోయని హరిహరుఁడు నొకరికొకరు జంకి చతురంగమున నొకగుఱ్ఱమొకగుఱ్ఱముచేఁ గట్టఁబడిన వధువున నామెదగ్గఱ కరుగరైరి. దైవయోగమున నావృద్ధుఁడు బాలుఁడు పరస్పర మత్సరబద్ధులై భిల్లులు నిద్రించుచున్నను గుడారమును గాచుచుండిరి. హరిహరుఁడు నిద్రలేక శవమువలె నేలమేలుకొనుచున్నాఁడో యని

మహారాజునిందింప నీకుజ్జపీరుఁగేలదయ్యా మునవలెఁదిరుగుచున్నాడోయని హరిహరుఁడు వాని నిందింపఁదొడఁగెను. ఒకమారు కామాగ్నికిఁదోడు క్రోధాగ్నికూడఁజనింప శాయాజీఁ ఖడ్గముధరించి హరిహరుని జంపనుంకించి చప్పున తెలివిఁదెచ్చుకొని యది తనభవిష్యదభివృద్ధికి నాశనకారణమని యాపనిమాని తుదకుఁ బ్రాణములువిసికి కామపారవశ్యమునుండి తొలఁగింపఁబడి నిద్రాపారవశ్యము నొందెను. అప్పుడు హరిహరుఁడాజాడఁ దెలిసి గుడారము జేరఁబోయి యమదూతలవలె భిల్లులు మేలుకొనుటచే వెనుకకుంజని రవంతసేపు కునికెను. ఆవగింజంత సమయమెట్లయినఁ జేకుఱునేని దానింబట్టి సీతాదర్శన మొనర్చి మాటలాడఁ దలఁచి రేయి కునుకులేక శ్రమపడుచున్న బాజీరావు వీరిరువురు నిద్రాసక్తులుగాఁ జూచి భిల్లులంతకుముందే దేహములనుమఱచి గాఢసుషుప్తలగుట నెఱిఁగి యదిచీఁకటిరాత్రియగుట నెంచి మెల్లమెల్లగ సీతయున్న గుడారపుప్రక్కకు వచ్చి నిశ్శబ్దముగఁ గూరుచుండెను. కూరుచుండి భూమిని దాకు గుడారపు ముతకగుడ్డను దనచేతులతో మీదికి నెత్తి యల్లన దానిక్రిందఁ దూరి లోపలఁ బ్రవేశించి చప్పుడుగాకుండ దేకి సీతకడ కరిగెను. నిద్రపట్టకున్నను బరధ్యానముగ నేమో యాలోచన సల్పుచుండిన సీతయొక్క మృదుదేహముపై బాజీరావు చేతులువైచి తట్ట నామె యులికిపడి శాయాజీయేమోయని వడఁకి ఛీఛీ దురాత్మా పోపో యని గద్గదస్వరముతో నఱచెను. ఆపలుకుల కలుగక బాజీరావు నేను అక్కయ్యా నేను బాజీరావును. నీవు భయపడకుమని మెల్లనఁ జెవిలోఁజెప్పెను. అమృతసేచనముఁ జేసిన చందమున నామాటలు తనచెవికిఁ దృప్తియొసంగఁ జేతులతో వానిదేహముఁదడవి పూర్వము దానెఱింగిన యానవాళ్ళనుబట్టి యతఁడు బాజీరావని గ్రహించి "నాయనా నాయనా నీవును నీమాయభిల్లులచేతనే చిక్కితివా" యని రవంతసేపు వగచి యాతనిదగ్గఱఁ దీసికొననాతఁడు నామెయొడిలోఁ బండు

గొని ముహూర్తముదాక అక్కయ్యా నన్ను భిల్లులు రెండుసాఱులు
వారిదేవతకు బలిఁబెట్టనెంచిరి. ఈపర్యాయము మనమిద్దరముఁ గూడ
నశ్లేయగుదుమేమోయని యేడువసాగెను. సీత వానివిలాపమును వారిం
చి యిది దుఃఖమునకుఁ దగినయదనుకాదు. ఉపాయములచే మనమిచ్చ
టనుండి దాఁటవలయును. నీవు నేను చెప్పినట్లుచేయుము. అని వానికిఁ
గొన్నిరహస్యములుచెప్పి యిక్కడనీవున్నచో మనకు నిరువురకు నాపద
వాటిల్లును. సత్వరమే సాగిపొమ్ము. లేయని వానినంపెను. అతఁడును
బూర్వప్రకారమున గుడారమునెత్తించుకొని యావలఁబడి తన యేలి
కహజారమున కరిగి తనస్థానమునఁ దానెప్పటియట్ల శయనించెను. ఉద
యమున హరిహరుఁడు హోల్కారుకన్న మున్నే లేచి కాల్యకృత్యము
లం దీర్చుకొని బాజీరాయుని జేరఁబిలిచి సుల్తాం సీతవద్దకు నీవు సేవకుఁడ
వగుటచేఁ బలుమాఱు నీవు పోవుటకు నీ కుత్తరవు గల్గునట్ల చేసెదను.
నీవామెతో నాపై ప్రేమగల్గునట్లు నన్ను వివాహమాడునట్లు నొత్తిచె
ప్పి నాకీయుపకారముఁ జేతువేని చెఱనుండి నిన్ను వదలించెదను. కావ
లయునేని నీకుధనముఁగూడ సర్పించెద. అట్లచేయఁగలవా యని విన
యమునఁబలికెను. ముసలి వానికింత కోర్కెయున్నందుకు నగవును
దన్నట్టిదుష్కార్యమున కాతఁడు నియోగించినందు కలుకయు నతనిమ
నస్సున నుదయింప బాజీరావు వానినివారించుకొని కాలానుసారముగ
నర్తింపఁదలఁచి, అయ్యా నాకిదియిష్టమే. బాయాజీకూడ నామెనుగో
రుచున్నాఁడు. వానిని గడతేర్చిన పక్షమున మీకేమి దక్కునని యు
త్తరమీయ హరిహరుఁ డదియెంతపని యూరాత్రి చేతునని సంతోష
ముతో వానంపెను.

పందొమ్మిదవ ప్రకరణము.

అట్లు భిల్లులశిక్షించుటకుఁ బ్రతినఁబూని జస్వంతరావు రాణిఁ
డిగి కొంతసైన్యమును వెంటఁబెట్టుకొని భిల్లుల గూడెములపైఁబడి హ
రిలోఁ బలువురఁబట్టుకొని కొందఱఁజెరలోనుంచుచు ముఖ్యులగునాయ
కుల వృక్షములకుఁగట్టి యురి దీయించుచు నొకమాఱు వారుతిరుగఁబ
డునపుడు వారితో వెనుదియ్యక కయ్యములు సల్పుచు నొకమాఱపజ
యము నొందుచు జయాపజయములవలన నుదయించు సంతోషవిచా
రములకుఁ దనమనసు పుట్టినిల్లగునటుల ముక్తాబాయిపై హృదయముని
ల్పి విజయకాంక్షపై దృష్టినిల్పి విహరింపఁజొచ్చెను. ఒకమూలఁ గొంద
ఱఁబట్టి బరిమార్చుచుండ రెండవమూల మఱికొందఱు భిల్లులు పల్లెల
పైబడిదోఁచుకొని బీదకాఁపులగృహములఁ బరశురామప్రీతిఁ జేయ
సాగిరి. అహోరాత్రములు నిద్రాహారములు లేక జస్వంతరావు
ప్రాణములకు లక్ష్యపెట్టక యందఱి శిక్షింపుచున్నను భిల్లు లిసుక
పాతరలవలె తగ్గరైరి. కాని యాతని మొడతెగని పూనికవల్లనఁ
వహించినక్రౌర్యమువల్లనుఁ భిల్లులకుఁ దమ వినాశకాలము దా
పయినదనుమాట తెలియుటయేగాక జస్వంతరావుపేరును విన్నపు
డు వారి కొకవిధమయిన యడలుకూడ గలిగెను. కాని యాటవి
కనాయకుఁడును మున్నొకసారి చిక్కి శ్యామసుందరుని లోపమున
బారినవాఁడును శాయాజీకిఁ గుడిచేయియయినవాఁడును, నగు గండాభి
ల్లున్న స్థానమున జస్వంతరావెఱుఁగక వానిని బట్టుకొన్న తనజన్మము
సార్థకమనియు నతఁడు చిక్కినతోడనే భిల్లులు కోరలుదీసినపాములవలె
లొంగుదురనియు నందు శాయాజీ యసహాయుఁడయి రాణికిఁ లోబడు
ననియుఁ దలఁచి గండాభిల్లు నిమిత్తము సమస్తప్రయత్నములను సల్పు
చుండెను. భిల్లువంశమునకు జస్వంతరావుత్పాతహేతువయి పులులచంద

మునఁ దమవారి నతఁడు వేటాడుటవిని గండాభిల్లు సహింపనోపక శా యాజీదగ్గఱ తాను గొలువుండి తాంతియాభిల్లు నిచ్చి తనసేనలఁగూడ దేశనాశనముఁ జేయుమని పంపెను. భిల్లులతోడనేగాక సకలపాపము లు మూర్తీభవించినట్లు బహుదురాత్ములతో నీసేనగూడియుండినది. గ్రామముల పైఁబడినదాదితల్లులకుబాసిన పిల్లలతోడను మగలకుఁబాసిన భార్యలతోడను దినుట కన్నములేని బీదలతోడను దేశ మెంతక్షోభప డవలయునో యంతక్షోభ పడసాగెను. కాని లయకాలరుద్రుఁడయిన జస్వంతరావును మృత్యువు మూర్తిగైకొన్న తెఱఁగున కృష్ణపంతను నొ కయోధవరుఁడును గలిసి విధివిరామము లేక శతసహస్రములుగా వారి ని యమాలయమున కంపుచుండిరి. హరిహరపాండ్యాజీ సీతకును శా యాజీకిని వివాహము జరుగు ముహూర్తము నాలుగుదినములున్నదని చెప్పినతోడనే గండాభిల్లు తాంతియాను వెంటఁబెట్టుకొని జస్వంతరావు యొక్క ధాటిని చవిచూతమని తనకొండ విడిచి తక్కినభిల్లులకును రాణి భటులకును గయ్యములుజరుగుస్థలమునకుఁజనెను. ఆస్థలమునకరిగి మొ గముపైఁ గన్నులకుమీఁద చేయిఁబెట్టుకొని యతఁడు పాఱఁజూచునప్పటికి నిఱువదిమంది గుఱ్ఱపురౌతులతోఁ బోవుచున్న యొక యోధుఁడు దూ రమున కనఁబడ "తాంత్యా అతఁడు జస్వంతరావని తోఁచుచున్నది. మన మీసమయమున వానినెదుర్కొనఁజాలము. నీవుపోయి యీచుట్టు పట్లనున్న మనవారినందఱ సిద్ధముగ నుండుడనిచెప్పుము" అని వాని నంపి తానొక గుహలో డాఁగెను. తాంత్యాభిల్లు తన యజమానుని సెలవుప్రకారముగ సమీపముననున్న పల్లెలకరిగి భిల్లులకు గండావచ్చిన వార్త తెలియఁజేసి మరల నాగుహవైపు పోవుచుండెను. ఇంతలో నిరు వదిమందిగల యాసమూహము గుహవద్దనిలిచి పలుదెసలు పరికించున ప్పటికి వృక్షములచాటున నక్కియున్న యొక భిల్లుఁడు గనఁబడ "అదె భి ల్లుఁడు! అదె, భిల్లుఁడువచ్చె, నని యఱచిరి. తోడనే జస్వంతరావు

మార్గాయాసమున నడివఱకు మిగుల నసివాడిన కృష్ణపంతును గుహాముఖమున నొక చెట్టుక్రింద నిల్పి తాను దక్కినభటులుంగలిసి యాభిల్లుని దెసకరుగ నతడును లేడివలెదాఁటులువైచుచు ముండ్లపొదలను రాతిగుట్టలను నవలీలగ దుముకుచు వీరికిఁజిక్కక పరుగెత్తసాగెను. ఇచ్చట కృష్ణపంతొక్కఁడును వృక్షచ్ఛాయ విశ్రమించుటఁజూచి గండాభిల్లు మెల్లగ నీవలకువచ్చి "తమరెవరి నిమిత్తమిందున్నవారు స్వామీ" యని వానిఁబలుకరింప నాతఁడు భిల్లునిమిత్తమై మేమువచ్చినాము. గండాభిల్లును నీవెఱుఁగుదువా ? అతని నొప్పగించిన పక్షమున నీకపాయము లేకుండఁజేసెదను" అని కృష్ణపంతు ప్రత్యుత్తరమిచ్చెను. అంతట గండాభిల్లు "స్వామీ! గండా యింతకుముందె యీప్రాంతములకు వచ్చినాడు. ఒక నిమిషము క్రిందట మీరు వచ్చితిరేని నేనుజూపియుందును. అయినను వాఁడీగుహాలోనుండవచ్చును. నావెంటరండి" యని యాతని నాగుహాప్రవేశముచేయించి యందతని నొక రాతిపైఁగూర్చుండఁబెట్టి యెవరయినవచ్చుచుండిరేమోయని మఱల నొకమాఱు గుహాద్వారమునకువచ్చి యెవరులువచ్చుటలేదని సంతసించి లోనికింజనెను. ఇచట పరధ్యానముగనున్న కృష్ణపంతును బలిమిని వెనుకకుఁబడఁద్రోసి తన మొలలోనున్న సూరకత్తితో నాతని ముక్కుఁగోసి యొక చెవిలో నొకభాగము ఖండించి "యోరీ దురాత్మ నేనేరా గండాభిల్లుడు నన్నుఁ బట్టుకొనువారు మీరా!" యని తత్క్షణ మాగుహానువిడిచి కొండమీఁదికెగఁబ్రాకి తనయొంట వ్రేలాడు నిడుదగొరకొమ్మున విపరీతమయిన విధమునఁ జెవులు గింగుఱుమనునటులూఁదెను. ఆకొమ్మునాదుట యానవాలుగఁగొని యాప్రాంతవాసులగు భిల్లులు మఱలనొకకొమ్మునెత్తి ప్రతిధ్వనిచేసి పుట్టలోనుండి వెడలు చీమలవలె నొకవరుసను రెండుమూఁడువందలమంది గండాభిల్లున్న దెస వచ్చిరి. తాంతియాభిల్లు తమకాసఁగొల్పి చిక్కనందున జస్వంతరావు తనచిన్నసేనతోఁగూడ వెనుకకుందిరిగి గుహాముఖమున్న

బోసిముక్కును దెగినచెవియును గల్గి స్రవించురక్తముతో బాధగొను చున్న కృష్ణపంతునిజూచి తెల్లబోయి స్పష్టముగఁదెలియని వానిముక్కు మాటలవల్ల గండాభిల్లుచేసిన పరాభవము నెఱిఁగి క్రోధోద్దీపితుఁడై యుండ నింతలో గుమిగూడిన భిల్లులు కొండమీఁదనుండి వీరిమీఁద నమ్ములవర్షములు గురియింపనారంభించిరి. మూఁడువందలమందితో నిరువదిమంది కయ్యముచేయుట మృత్యుస్నేహముసేయుటయే యని జస్వంతరావు స్పష్టముగ నెఱిఁగియుఁ దాము వెన్నిచ్చిపారినచో వారు తరిమికొట్టి మొదలే బ్రతుకనీయరని తుపాకులతోఁ గొంతయుద్ధముచేసెను. ఇట్లు జరిగినకయ్యమున మహారాష్ట్రులు తుపాకీదెబ్బలుతిని ముప్పదైదుగురు కంటె నెక్కువ సంఖ్యగల భిల్లులు నేలపాలయిరి. జస్వంతరాయని బలములో సగముకంటె నెక్కువహతులైరి. అంతట జస్వంతరావు రంగమువిడిచి పోవఁజూచుచుండ దూరమున నాతనిసేనలో నొకభాగము వానిని వెదకికొనుచు వచ్చుచుండెను. ఆబలము దృగ్గోచరముకాఁగా భిల్లులు పిట్టలవలె తుట్టుఁగొండమీఁదనుండి నానాముఖములఁబారి యదృశ్యులైరి. ఇట్లు పూర్వము లక్ష్మణునిచే శూర్పణఖకు జరిగిన పరాభవమే గండాభిల్లుచే కృష్ణపంతునకు జరుగ నాతఁడు యుద్ధమునుమాని సిగ్గుచే దనవికలాంగత తనకే యసహ్యకరముగఁదోప మెల్లగ నింటికిఁజనెను. గండాభిల్లు తాంతియాను గూడుకొని మఱునాఁడు సాయంకాలమునకు శాయాజీహోల్కారువారి సమ్ముఖమునకువచ్చి తనపూర్వోద్యోగముఁ గైకొనెను.

అట నింబపురమున దౌలతరావు రసపుత్రులతోఁ గలసి యహల్యాబాయి సైన్యమును నోడింపవలెనని యెంతప్రయత్నము సల్పుచున్నను మహారాష్ట్రులే యీముట్టడిలోఁబయిచేయిగలవారుగనుండిరి. గోమోజీరావు రాజపుత్రులకుఁ గావలసిన ప్రతిసహాయముఁ జేయుదునని వాఁరిని బిలిపించి తనలంచము వారు సత్వరముగ నందఁజేయింప

హైరని వారిపై పలుకఁ బూననేకాని తాను వాగ్దానమొనర్చిన సాయము వారికిఁ దానొనర్పఁజాలనందుకుఁ జింతిల్లఁడయ్యెను. కొత్వాలువద్దనుండి యేసహాయము లేకున్నదని రసపుత్రప్రభువగు నుదయపురరాణా వారు భిల్లులను శాయాజీనైనఁ దమకుఁదోడుగ రప్పింపుమని దౌలతరావును బలుమాఱడుగుచు వచ్చెను శాయాజీరా వప్రయోజకుఁడనియు వానినిబిలిచిన ముప్పున్నగోడు చెడుననియు భిల్లులాటవికులగుటచే దేశమును గొల్లగొనుటకే యుక్తులుకాని నిల్చి కోటలుముట్టడించి క్రమమయిన యుద్ధములుచేయుటకు తగరనియు నెఱిఁగి వారిని రప్పింపఁదలఁచక, యట్లున్నచోఁదనకు సేమములేదని యిదిగోవచ్చెదరదిగోవచ్చెదరని తేపుచూపని కాలయాపన మొనర్చుచుండెను. రసపుత్రుల కాగ్రహమువచ్చి తన్నెపుడుతుదముట్టింతురోయని భయముగలిగి వారినాతఁడు వదలఁబ్రయత్నించెను. కాని వారతనినిదాఁటిపోనీయక వేయికన్నులతోఁ గాచుచుండిరి. ఒకవేళ నేమాయోపాయముచేసియైన నీబందెనుండి వదలించుకొని పోవుదమన్న నీవల జస్వంతరావు భిల్లులనిర్మూలమునకు నొడలుదాఁచుకొనక పనిచేయసాగుటచేఁ దనకు వారికడసేమముండదను మాట నిశ్చయమని తెలిసికొని యక్కడికిఁ బోవుట యవివేకముగనెంచి యెట్లయినను రసపుత్రులతో నుండుటయుక్తమనుకొనెను. రసపుత్రప్రభు వాడినమాటతప్పని పురుషుఁడగుటచే గోమోజీరావునకుఁ దానువాగ్దానముచేసిన వేయివరాలును భేతాళసింగుచేతికిచ్చి యంపినను జిత్తులమారితనమున నక్క-ను జంపిపుట్టినభేతాళుఁ డావిత్తముదానే యపహరించి గోమోజీరాయనకిచ్చినట్లు రాణాకు విన్నవించెను. గోమోజీరావునద్దనుండి భేతాళసింగువద్దకు రాయబారమంపఁబడిన వామనభట్టు మెల్లగాఁ గోటలోఁ బ్రవేశించి కొత్వాలుకీయవలసినసొమ్మ నిమ్మనియు సొమ్మిచ్చినవెనుక నెంతయు సహాయముఁ జేయుననియు వానినడిగెను. భేతాళుఁ డాతనిపలుకులువిని “యోయీ, వామనభట్టూ గోమోజీ

రావునకు నేమసొమ్మునిచ్చుటకు వాఁడుమూఁకుచేసిన సాయమేమి. నేనొక్కదమ్మిడీయైన వానీయను. నీకు నూరురూకలనిచ్చెదను. నీవుసొమ్ముఁ దీసికొని యీసంగతి రాణాకుఁదెలియనీయకుండు" మని వానినోడఁబఱచి వానికిముందే బదిరూకలనిచ్చి తక్కినదితరువాత నొసంగఁగలనని చెప్పి వానిని సమ్మతింపఁజేసెను. తరువాత దౌలతరావు రాణానుదర్శించి శాయాజీమహారాజు పక్షమున నహల్యాబాయికి సందేశమంపుటకర్తవ్యమనియు రసపుత్రులు శాయాజీతోఁ గలసిరని విన్నచో రాణి తప్పకకోరిన పద్ధతులపరికారము నొడంబడిక గావించుకొనుననియు నట్లు వామనభట్టు రాయబారిగ నేగఁదగినవాఁడనియు నచ్చఁబలికి రాణాతోఁ జెప్పవలసినయంశములనెల్ల మనస్సునకు నాటఁజెప్పి వామనభట్టును రాణాయనుమతిమీఁదఁ దగుపరివారముతోడను జెండాలకోటకు రాయబారమంపెను. వచ్చి యహల్యాబాయియనుమతిని నామెహజారముఁ బ్రవేశించి వామనభట్టు ప్రాణముల నుగ్గఁబట్టుకొని భయపడుచుఁ గూరుచుండ జమానుఖాను మొదలగు తురకలు పదుగురు తుకాజీశివనానా మొదలగు సేనాధిపతులు రాణిని బరివేష్టించి యీసందేశమును వినఁగోరిరి. అంతట రాణిమొగముఁ జూచి వామనభట్టిట్లనియెను. "అమ్మా శాయాజీ హోల్కారుమహారాజుగారు నన్ను దమవద్దకంపినారు. ఇందూరు రాజ్యమున మీకు లేశమైన భాగమీయమనియు సర్వస్వము తమపాలకజనకులగు మలహారురావుగారిదే యగుటఁ దమకే రావలయుననియు మనోవృత్తిగ మీకుఁ గొన్ని జాఘీర్లిచ్చెదమనియు రాజ్యము వదలవలసినదనియు వదలకున్న పక్షమునఁ దాము రసపుత్రులతోఁ జేరుదుమనియుఁ దమతో మహారాజుగారు మనవిచేయుమన్నారు. రాజపుత్రులకుఁగూడ నాలవవంతు రాజ్యమొసంగవలయునఁట. దీనికుత్తరముఁజెప్పి నన్ను సత్వర మంపవలయునని ప్రార్థించుచున్నాను." అనిచెప్ప నహల్య పక్కున నవ్వి "మీమహారాజుగా రెందున్నవారు వారు మాకగపడుదురా",

యన నాతఁడు చిత్తము వింధ్యపర్వతములలో నున్నారు. తల్లీ" యని ప్రత్యుత్తరమిచ్చెను. ఇచ్చునప్పటికి జమానుఖాను వెనుకపాటునవచ్చి వామనభట్టుయొక్క భుజదండము గట్టిగఁబట్టుకొని రాణితో, "అమ్మా వీఁడు కుటిలులోఁజేరినవాఁడు వీనినిబట్టి చెరఁబెట్టినచో నద్భుతములుకొన్ని మనకుఁ దెలియఁగలవు సుఁడీ" యని విన్నవించి వానిరెండుచేతులకు నరదండలు బలిమిచే వేసి, "నీవు ఖయిదీవయినావురా" అని నిలువఁబెట్టెను. ఇంతలో నీకార్యముసహింపనోపక వానితోవచ్చినరాజపుత్రులు వరలలోనుండి తళతళమెఱయు కత్తులనూడఁబెఱికి మహారాష్ట్రులపైఁబడి నఱుకఁబోవఁ బ్రతివిధానము నొనర్పఁబోవు తుకాజీమొదలగువారి వారించి; జమానుఖాను వారిపై సింగపుఁగొదమచాడ్పున దుమికి యాపదుగురిలో సగమును తత్క్షణమే మృతిఁబొందించెను. తక్కినతురకలు రసపుత్రులఁ బారిఁగొనుటచేఁ దక్కినయేవురురసపుత్రులు నంతమడిసిరి. వామనభట్టును జెరఁబెట్టినవార్త దాంతరావువిని యుక్కఁడక్కి శవమువలె కళకాంతులులేక దీర్ఘోచ్ఛ్వాసములచేఁ దన యంటమటము బహిర్గతముకాఁగ నింకఁ దనమరణము నిశ్చయమని వెంగఁగొనెను.

ఇరువదియవప్రకరణము.

హరిహరపాండ్యాజి తన హృదయమును దెఱచి మనోరథమును దెలియఁబరచి బాజీరావు నాకార్యమునఁ గానిసేయుమని నియోగించిన తరువాత శాహూజీమహారాజు మేల్కొని బాజీరావును జేరఁబిలిచి యదినఱకెన్నఁడు జూపనిదయ నాతనిపైఁజూపి మెల్లగా నాతనితో నిట్లనియెను. 'ఓరీ కుఱ్ఱవాఁడా! నీవు నాకొకకార్యముఁ జేయవలయును. నీతనునాకు వివాహముసేయుటను గండాభిల్లు మొదలగువారు నిశ్చయించినారుకాని యామెకిష్టములేనట్లు గనఁబడుచున్నది. నామీఁదఁ గాఢాను

రాగ ముదయించునట్లు నీవామెతోఁ బలుకవలయును. నీవామెయొద్ద
కుఁ బలుమాఱు పోగలుగునటుల నేనుత్తరవు జేసెదను. నావంటి మ
హారాజు చెట్టవట్టి సుఖింపఁ గలుగుట యామె కెన్నిజన్మములకైనను దొ
రకునా. ఇప్పుడీపర్వతముమీఁద నొంటరిగ నేనుండుట నామెకలక్ష్యము
గనున్నది కాఁబోలును. రేపు రాజ్యము స్వాధీనమైనతరువాతఁ దాను
రాణికావచ్చును. వెండిగొలుసులతూఁగుటుయ్యలలోఁ దులలేని రత్న
భూషణములు ధరించుయోగ్యత కామె నోచుకొన్నది. కనుకనే తనవంటి
దానిపై నావంటి మహారాజునకు ననురాగ ముదయించినది. నాకు శ్రీ
కొల్లాపుర మహారాజుగారు సింధియా మహారాజుగారు పిల్లనిచ్చెదమని
వర్తమానమంపించినారు. కాని నామనస్సీమెపైఁ దగిలియున్నది. ఈ
మె నన్ను నిరాకరించినను బలిమిచేనైన నేనీమెపొందు నొందకమానను.
కాఁబట్టి యీవివాహమునకు సమ్మతింపుమనియు ముందుగా నేనుదాని
తోఁ గొన్నిరహస్యములు మాటలాడవలయును గనుక సమయమొసం
గఁ జేయుమనియు నామెతో నాపలుకులుగా మనవిజేసి యొడఁబఱచి
రమ్ము. ఇదియేరికిం దెలియనీయవలదుసుమీ" అని మహారాజునుడువ
బాజీరావు కొంచెము యోచించి, "మీసేవకుఁడనగు నేను మీకుఁబ్రియ
మునుజేయనా! ఆమెను హరిహరపాండ్యాజీకూడ మోహించియున్నాఁ
డు వానిని మీరు రహస్యమునఁ గడతేర్తురేని యీమె మిమ్ముదప్పక
వరింపఁగలదుసుఁడీ' యని విన్నవించుకొన మహారాజుబ్బి యీవేళ సా
యంకాలముననే హరిహరునకు స్వర్గసుఖమిప్పించెద చూడునాశక్తి యని
ప్రతినఁజేసి కుబ్జవానిని లోనికిఁజననిమ్మని భిల్లులతోఁజెప్పి మదనాయత్త
చిత్తుండై తహతహఁ బొందుచు శామాజీ హరిహరుని జంపుటకు గన
లుచుండెను. జస్వంతరావుచేఁ దనబలము ముక్కముక్కలుగ ఖండింపఁబ
డుటకువగచి గండాభిల్లు ప్రభువును దమ ముందుపోకలఁగూర్చి కఠినము
గ నడుగఁదలంచి వచ్చి గుడారముసొచ్చి యిట్లనియె. "మహాప్రభూ!

ఏలినవారికిఁ బట్టాభిషేకమయినది మొదలు జస్వంతరావు మాచుట్టములను మేఁకపోతుల నఱికినట్లు నఱుకుచున్నాఁడు. దౌలతరావు త్వరలో వత్తునని చెప్పి యీవఱకు రాఁడయ్యె. మేము దోఁచుకొనివచ్చిన ద్రవ్యమంతయు వ్యయముచేసి హాయిగాఁ బిండివంటలతో మీరు ముమ్మారు భోజనముసేయుచు మానిమిత్తము శ్రద్ధచేసినారు కారు. మీరు పరాక్రమవంతులనుకొని యింతమహాపదవి మీకిచ్చితిమిగాని మొదటనే యింతటి వారగుటఁ దెలిసినచో బట్టముఁ గట్టింపకుందుము మాతో మీరు కలిసి యుద్ధమునకు వచ్చెదరా లేదా" యని నిష్ఠురోక్తులనాడి భిల్లుఁడు నిలువ శాయాజీ వానింగన్నెత్తి చూడలేక తలవంచి మెల్లగా నిట్లనియెను. "నేను మిమ్మునడిపించి మీకు సేనానాయకుఁడనై రాజ్యముఁగొన యత్నించుచుండఁగా నన్నిట్లాడఁదగునా? వివాహమైన తరువాత కత్తిగట్టి యుద్ధముచేయవలెననియున్నది. అదియటుండ హరిహరపాండ్యాజీ మనపై రాణితో నేరములు చెప్పుచున్నాఁడఁట. ఇతఁడున్నపక్షమున మనము నెగ్గఁజాలము. నీవీరాత్రి వీనిని గడతేర్తువేని పెండ్లియైన వెనుక మన మఱుగునము" అనిచెప్ప భిల్లుఁడు గోపముతోఁ గన్నులెఱ్ఱఁజేసి 'యుద్ధమైన తరువాత నీవు వివాహమాడవచ్చును. ముందుగావద్దు. అదిగాక యీదినమున నారెండవకొడుకును నాకు జయముకలుగుటకై కాళికి బలియిచ్చుచున్నాను. బలియైనవెంటనే మనము వెళ్ళినచో జయముఁగల్గును. తేపుతప్పదు. హరిహరుఁడు మనపైఁ గుట్రలెన్నఁడుఁ బన్నకుండఁ జేసెదనులే" యని గుడారమువెడలి యావలకుంజనెను. అతఁడరిగిన వెంటనే బాజీరావు మహారాజువద్దకువచ్చి నిలిచి సంతోషముతో, 'స్వామీ మీరుచెప్పినట్లు సీతతోఁ జెప్పినాను. మీవంటి నవమన్మథుని మహారాజును జెట్టపట్టుటామెకిష్టముగ నుండకపోవునా? అన్నిఁటికి నామె యొప్పుకొన్నది కాని మీరాగుడారమునకు రావలదనియుఁ దానే మగవేషము వేసికొని యీగుడారమునకు రాత్రి వత్తుననియుఁ జెప్పుచున్నది కాని మీరు నన్ని

దినమునఁ జెరవిడిపింపవలయును. లేకున్న నేనిదిచక్కఁజేయనుసుఁడీ" యని కర్ణానందకరముగఁ బలుక మహారాజుయొక్క శరీరము పులకలెత్త మనోరథసిద్ధి నేఁటికిగదా చేకుఱుటయని యానందమొందుచు నాతఁడు నిన్నీవేళ సాయంకాలముననే చెరవిడిపించి పంపెదను భయపడకు. నీమేలు నేను మఱువఁజాలను. మిత్రుఁడా యని గాఢాలింగన మొనర్చి యభ్యంజనముచేసి నూతనవస్త్రాలంకృతుఁడై సూర్యుఁ డెపుడస్తమించునాయని పరితాప మొందసాగెను. ఒకమారు బాజీరావును బిలిచి నీమాటలు నాకు నమ్మకముగ లేవు. ఆమెచేనట్లు సమ్మతమని పలికింపుము. అని వేఁడుకొనుటచే గుడారము ప్రక్కకు మహారాజును గొనిపోయి, బాజీరావు, సీతా నీవిందాకఁ జెప్పినట్లు చేయుమపుగా యని యావలనుండి కేకవేయ నామెయు నిశ్చయముగఁ జేసెద సందేహమేలయని మృదుమధురస్వరముతోఁ బ్రత్యుత్తరమొసంగెను. అంతట గుండెమసుకు తీరనందున శాయాజీ బాజీరావును బంపుప్రయత్నముచేయుచు దౌలతరావునొద్దకు నాతనినంపెదనని గండాభిల్లుతోఁ జెప్పి యొడఁబరచి పల్లకినిబోయలను సిద్ధముగఁజేసెను. ఇంతలో సాయంకాలమైనందున సీత బాజీరావుచెప్పిన చొప్పున మాటఁ దప్పకుండ వర్తింపఁదలంచి, చక్కని తెల్లనిజామాను నట్టిదేమంగరకాయు నట్టిదేతలపాగయును ధరించుకొని చేతనొక ఖడ్గముం బూని తన గుడారమునుండి సమయముఁ బ్రతీక్షింపఁదొడఁగెను. ఆరాత్రి సీతనిమిత్తము శాయాజీని సంహరింపఁదలఁచి హరిహరపాండ్యాజీ రెండుజాముల రాత్రియైనతరువాత గాఢనిద్రాసమయమున వానిఁ ద్రుంపఁదగునని ముందుగాఁదాను నిద్రించుచుండెను. ఇంతలో గండాభిల్లు గండ్రగొడ్డలి భుజముపై వేసికొని యెవరితోడఁ జెప్పక హరిహరుని గుడారము సొచ్చి నిద్రాసక్తుఁడై తలనిండనున్న కోర్కులచే గడియకొక స్వప్నముగనుచున్న యానిర్భాగ్యుని గని గొడ్డలినెత్తి సత్తువమీఱ నాతనికంఠభాగమున నొకదెబ్బఁదీసెను. వెంటనే శిరమును మొండెమును వేఱుగఁ

దొలఁగింపఁబడ మొండెము కొట్టుకొనుటయు నెఱ్ఱనిరుధిరప్రవాహము గుడారము నిండుటయు భిల్లుని నయనములకుఁ బర్వముసేయ, నాతఁడు జుట్టుపట్టుకొని చచ్చినవాని తలయెత్తి తిన్నగా శాయాజీయున్న గుడారమునకుంజని వానింగని, "మాను నీహరిహరుఁ డెట్లున్నాఁడో" యని యా రక్తశిక్తమగుబుఱ్ఱ వానితోడపైఁబెట్టెను. అదిరిపడి శాయాజీలేచి గడగడవణఁకి భిల్లుఁ డలుకవహించెనేని తనపని యట్లయగునను తలంపు మదికిఁదట్ట మెల్లగా, "నీవుసాహసుఁడవు మంచిపని చేసినావు నీవంటివాని నెందుఁజూడలేదు. మన్నెసుల్తాను బిరుదుకంటె ఢిల్లీసుల్తాను బిరుదు నీకుఁదగునుమీ" యని వానిని స్తవమొనర్చి చల్లనిమాటలతో సాగనంపి తన పనిమీఁదఁ దానుండెను.

హరిహరుఁడు ధనమును విడిచి, సీతనువిడిచి ప్రాణములు విడుచుటయు, సీత తనపొత్తున కంగీకరించుటయు, శాయాజీ, బాజీరావును ముందుగఁ జెరవిడిపించి పంపఁదలఁచి పల్లకిఁ దెప్పించి బోయలసిద్ధముఁ జేసి సీతతో మజిల మాటలాడుచున్న బాజీరావును బిలిచి పల్లకి నెక్కుమనెను. వెంటనే గుడారమునుండి యొక విగ్రహమువచ్చి యందుఁ గూర్చుండఁ బోయలొక్కమహూర్తములో వానిని మోచుకొనిపోయిరి. అట్లు బాజీరావును బంపి సీతనిమిత్త మెదురుచూచుచు శాయాజీ మదనతాపము నొందుచు మాటిమాటికి నామె వచ్చుచున్న దేమో యని గుడారము వెడలివచ్చి చూచుచు మనస్తాపము నొందుచుండ నింతలోఁ దన మనోరథసిద్ధి చేయఁదలఁచిన పారిజాతవృక్షమువలె సుందరవదనారవిందము చీఁకటిగుడారమున వెన్నెలఁగాయఁ గావలియున్న భిల్లులు నిద్రించినవెనుక నా పురుషవిగ్రహము మహారాజయొక్క గుడారముఁ బ్రవేశించెను. ప్రవేశించినతోడనే యెదురుగ నేగి శాయాజీ యాభువనమోహన విగ్రహమును జేయిపట్టుకొని ముద్దుపెట్టుకొని తన మంచము నొద్దకుఁ దీసికొనివచ్చెను. ఆకపటపురుషుఁడును మెల్లగవచ్చి ప్రాణేశ్వరా!

మిమ్ము వివాహమాడుటకు నాకు సందేహములేదు. కాని మీరు
యుద్ధములుచేయుట కలుగుచుండు. యుద్ధమున మరణమొందుదురేమో
యని నాకు భయము గలదుసుండీ యని పలికెను. హోల్కా రామెప
లుకులకు సంతసించి నేను యుద్ధమున కెన్నఁడును బోవను. భిల్లులను
మోసపుచ్చుటకు కయ్యము సేయుదునని నేనందునేకాని యామాటయ
బద్ధము. నిన్నువిడిచి నేనెందరుగుదును? ఇన్నిదినములనుండి నేఁ జే
యుప్రయత్నములు సఫలములయినవి. ఏదీ యొకముద్దుఁబెట్టు ప్రాణే
శ్వరీ యని ముద్దుపెట్టుకొని చెక్కిలి నొక్కుచుండ నీవేషధారి యాకా
మాతురుని చెళ్లున నొకచెంపకాయఁ గొట్టెను. చుఱ్ఱున నసాల మంటిన
యాదెబ్బతో శాయాజీకిఁ గన్నులనుండి బాష్పములురా నదితుడుచుకొ
ని మెల్లన నిట్లనియె. “సుందరీ అబ్బా! యిదేటిసరసమే గూబపగిలినది.
మాటలతో సరసముకాని చేతులతో నేమిటే” యని మందలించి యా
సుందరిని గౌఁగిలింపఁబోవ నాటక్కరి తనమొలలోనున్న బాకుఁదీసి శా
యాజీని నేలఁబడఁద్రోచి కుడిప్రక్క నొక్కపోటుపొడిచి యాక్షణమే
యేరికిం గనఁబడక యెటకో చనెను. శాయాజీ యాపోటుతో కెవ్వున
కేకవేయుటచే నార్తరవము నాలకించి గండాభిల్లు గండ్రగొడ్డలి భుజము
పై వేసికొనివచ్చి పడియున్న శాయాజీని జూచి యాశ్చర్యమొంది మె
ల్లగ వాని లేవనెత్తి కారణమడుగ నాతఁడు జరిగిన వృత్తాంతమును స
విస్తరముగ నీరసముతోఁ జెప్పెను. ఆమాటలు చెవులసోఁక గండాభిల్లు
మహాగ్రహమునఁ గన్బొమలు ముడివడ రూక్షనిరీక్షణముల నాతనిఁజూచి,
“దురాత్మా నాతోఁజెప్పక నీవిట్లుచేసితివి కనుక నీకింతేకావలయును.
నీతచంపుటకాదు నేను నిజముగఁ జంపివేసెదను చూడు నీవు నీచుఁడవు
కాని రాజువుకావు” అని మాటలచే నొప్పించి చేతిగొడ్డలి నెత్తెను. అప
రిమితబాధపడుచు శాయాజీ యెట్లో లేచి భిల్లుని రెండుపాదములం బ
ట్టుకొని నాతండ్రీ నన్ను రక్షింపుము. నన్ను నిష్కారణముగ దౌలతరావు

గంగలో దింపినాడు. నాకేదైన కట్టుకట్టి నాప్రాణములు దక్కిం
పుము. అని జాలికలుగఁ బ్రార్థనలుచేసి యేడ్చుటకు మొదలుపెట్టఁ
గా, గండాభిల్లు గొడ్డలిదింపి నీకునేను గట్టుకట్టను చావుమని తిట్టి గుడా
రము విడిచిపోయి సీతకై వెదకి యామెను బాజీరావును గూడఁ గానక
విసికి తనబస కరిగెను.

ఇరువదియొకటవ ప్రకరణము.

మరునాఁ డుదయమున మంగళతూర్యారావములు సెలంగ న
హల్యాబాయి మేల్కొని కార్యముల నిర్వర్తించి మహోత్సాహపూ
రితమానసయై కోటముట్టడి జరుపుచుండ జమానుఖాఁ నామెకు సలాము
చేసి రాధాకాంతరావు వచ్చియున్నాఁడనియు రాణిదర్శనముం గోరుచు
న్నాఁడనియు విన్నవించెను. రాధాకాంతరావుపై సంపూర్ణముగ నలు
క వహించిన దగుటచే రాణి జమానుఖానుతో, "నోయీ రాధాకాం
తుని మొగము నేనింక చూడఁజాలను. అతని విశ్వాసమును గూర్చి
మాకుఁగల పిచ్చినమ్మకము పోయినది. శ్యామసుందరదత్తును వదలిపె
ట్టుమని గోమోజీరావునకు జాబువ్రాయుటయు రఘునాథరావుతోఁ దా
నుఁజేరి నాపై కక్షఁ బూనుటయు నాహృదయమున నాటినవి. అందుచే
నాతఁడు నావద్దకు రావలసిన పనిలేదు. రఘునాథరావువద్ద కఱుగుమన
రాదా?" యని యుత్తరముం జెప్పెను. చెప్పి ఖానుని వాని పనిమీఁది
కంపెను. ఖాను వృద్ధుండగు రాధాకాంతరాయునిపైఁ దన యేలికకువ
చ్చిన నిర్హేతుకాగ్రహమునకు విచారించి తనశక్తిలో నాకార్యము లేకుం
డుటచే నప్పటి కూరకుండెను. రాధాకాంతరావీయలుకకుఁ గతమేమయి
యుండునాయని కొంత తడవు విచారించి జమానుఖానుని బిలిచి తాన
రిగిన దండయాత్రలో జరిగిన విశేషాంశములనెల్ల నాతనికి రహస్యముగఁ

జెప్పి రాణిదయను సంపాదింపఁ బ్రయత్నలోపము లేకుండ నింబపురమునందె నివసించెను. అప్పటికి నింబపురి ముట్టడిలో రసపుత్రులకంటె మహారాష్ట్రులే జయము నొందువారివలె గన్పడుచుండిరి. రాణికందుచే రాజపుత్రులను జయింపవచ్చునను ధైర్యముదయించెను. అమెకు ధైర్యమును శత్రుల కధైర్యము నొకమాత్రే జనియించినందునఁ గడపటివారు జయమున కుపాయములు వెదకుటమాని సురక్షితముగ పారిపోవుట కుపాయము వెదుకనారంభించిరి. రాజపుత్రసేనకు దినుబడిసామగ్రిమైనందున వారాఁకలికి నోర్వఁజాలక చిక్కులఁ బడుచుండిరి. కోటలోనికి నీటిచుక్కయైనఁ బోనీయక యహల్యాబాయి నీటియాధారముల నెల్లఁ గప్పించెను. ఫిరంగుల మూలమునఁ గోట భేదింపఁబడి రంధ్రములతో నిండియుండఁ జొచ్చెను. అందుచేఁ దమకు జయమునొందు నాశలేశమయినను లేదనియు నహల్య తమతో సంధిఁ జేసికొనదనియు నుదయపుర రాణావారు నిశ్చయించి పారిపోవుటకు ముహూర్తము నిర్ణయించుకొనుటకు మొదలుపెట్టిరి. శత్రువుల బలమును గుట్టును దనకుఁ జిక్కినందున నహల్య వారిలక్ష్యములేక వారు లోఁబడినట్లే యెంచుకొని జస్వంతరావు గండాభిల్లును దక్క తక్కినభిల్లులనెల్ల దాదాఁపుగ నిర్మూలించినట్లు విని యొక్క శాయాజీ హోల్కారువిషయమై చక్కఁజేసికొనవలయునని నిశ్చయించి జమానుఖానుని బిలిచి శాయాజీయొద్దకు రాయబారము గైకొనిపొమ్మని యానతిచ్చి యొకమూల పీనుఁగువలె నొదిఁగియున్న వామనభట్టునోటినుండి మహారాజు వసించుకొంప నానవాలు చెప్పించి తగుపరివారముతో నంపెను. నింబపురమున కాకొండ యొక వారము పయనములో నుండినందున జమానుఖాను రేయింబవళ్లు నడచి శ్రమయనక యెండయనక కొండలెక్కి వాఁగులుదాఁటి యరణ్యములం గడచి మూఁడుదినములకు శాయాజీయున్న స్థానమునకువచ్చెను. నాఁటిరాత్రి శాయాజీ సరసమాడఁబోయి కత్తిపోటుదిని గండాభిల్లు

వద్దనుండి సహాయము నందక కొంతసేపు బాధపడి తనప్రక్క గుడ్డలలో నొకదానిని గాల్చి మసిచేసి తనగాయమునకుఁ గట్లుకట్టుకొని మఱియొక భిల్లుసాయమున మఱికొంత యుపచారముచేయించుకొని గాయము గుమర్చుకొని సత్తువ దెచ్చుకొని సమయము దొరుకునేని తనకు రాజ్యము గీజ్యము వలదని భిల్లుల బారినుండి పరతెంచి యేకాళిలోనైన మట్టిమెత్తుకొని బ్రతుకవచ్చునని యత్నము గావించుచుండెను. పట్టాభిషేక మహోత్సవకాలమునఁ దన్ను సేవించిన భిల్లు లొక్కరొక్కరుగ దేశముల పైఁబడి జస్వంతరాయుని ఖడ్గధారాగ్నికి మిడుతలగుటచేతను గొందఱాతనిధాటికి వెఱచి దూరదేశములకు బారుటచేతను మఱికొందఱు వనమృగములవలె గొండ గుహలలో దాఁగుటచేతను జమానుఖాను వచ్చునప్పటికి రెండువందలకంటె నెక్కుడుభిల్లు లాపర్వతమున లేరైరి. ఆరాత్రి గాయమేతగులకయున్న బలవంతముగ గండాభిల్లు శాయాజీని తనతోఁ గూడ యుద్ధమునకుఁగొనిపోయి యుండును. రాజభటముఖదర్శనము సేయు వారికిఁగూడ నమితమైనభయమే కాని సాహసధైర్యములు గలుగకుండెను. జమానుఖాను రాణి వద్దనుండి సందేశార్థములు దెలుపవచ్చినాఁడని విని యామె యొడంబడిక చేసికొనుననియుఁ దనకురాజ్యము పూర్ణముగ రాకపోయినను గొన్ని జాగీరులైన రాకపోవనియు శాయాజీ యువ్విళ్ళూరుచుండ నతనికి రాజ్యముగల్గిన తమకు నిలువ నీడచేకురునని భిల్లులానందమొంది ఖానుగారిని సగౌరవముగ నాదరించి సందేశము జనుపుటకు వారునిశ్చయించిరి. శాయాజీయుఁ దనపట్టాభిషేకకాలమునధరించు దుస్తులను నాభరణములను దొడుగుకొని శూరశిఖామణివలె మహారాజ శ్రీవిత్తోఁ దన గుడారమునఁ గూరుచుండ నింతలోఁ దన పరివారముతో జమానుఖాను ప్రవేశించి మహారాజునుజూచి తనలోనగవుకొని తలయూఁచి సమర్యాదగా నమస్కారముచేసి యర్హాసనముపై నాసీనుఁడయ్యెను. గండాభిల్లు గండ్రగొడ్డలినిబూని తనమహారాజుయొక్క

వామభాగమున నిల్చెను. అప్పుడు ఖాను హోల్కారుతో, "స్వామీ! మీతో నేను గొన్ని రహస్యములు మాటలాడవలయును. మీభిల్లుల నావల కంపివేయువలయును. మీ కొక సందేహములేకుండ నాతురక మహారాష్ట్రసేవకులఁగూడ నావల కంపెదను. మీరట్లుచేయుదురా" యని మనవి యొనర్చెను. అంతట భిల్లులు, మహారాష్ట్రయోధులు గుడారముబాసి దూరముగాఁజన, శాయాజీయు జమాన్‌ఖాను నిట్లు మాటాడిరి.

జమా—దేవా! మీరు రాణీగారివిషయమున నేదో సహాయమును జేయువలయును. ఆమెకు ముద్దులుమూటగట్టు నొక కొమార్తె కలదుగదా.

శాయా—రాణికి నేను రెండుమూఁడు జాగీరులుమాత్ర మిచ్చెదను. నాకు రాజ్యమునంతయు నొప్పగించి యిందూరునగరమువిడిచి యామె యరుగవలసినది. ఇటు లొప్పుకొనకున్న నే నొడంబడికఁ జేసికొనను.

జమా—పాపము దిక్కులేని యాఁడుదానిని మీరింత శ్రమపెట్టుట న్యాయముగాదు మఱి యేషరతులనయినఁ గూడ నేర్పఱుపుడు.

శాయా—ముక్తాబాయిని నాకిచ్చి వివాహము జేసినయెడల నే నామెను రాజ్యము నందుంచి యన్నవస్త్రములిచ్చి కాపాడెదను.

జమా—పోనీ రాజ్యమంతయు మీ కామె వదలివేసినచో మీరామె కేమియిచ్చెదరు. మీతోడను మీభిల్లులతోడను నామె యుద్ధము చేయఁజాలదు.

శాయా—నెలకు నొక వేయిరూపాయిల మనోవృత్తి నిచ్చెదను. అంతకంటె నెక్కువగా నేనేమియు సహాయ మామె విషయమునఁ జేయఁజాలను.

జమా—ఆమె మిమ్ము పెంచుకొన్నచో మీరు దత్తులగుట కంగీకరింతురా?

శాయా—ఏమో ఆలోచించి చెప్పవలెను. ఆమె నాకు దల్లి యగుట నాకు శ్రేయముకాదు.

జమానుఖా నెందుచేతనో కడుదీనముగా మాటలాడుటఁ జూచి శాయాజీహోల్కారు తనకు వారు జంకినారనుకొని గర్వించి యంతకంతకు నిర్లక్ష్యముగఁ బల్కనారంభించి యావల తన బాహుబలమును దాను నుతియించుకొని జమానుఖానుతో, 'నోయీ నీవాడిన మాటలు మాకు మహానందమును గలిగించుచున్నవి. నీవు మాయెడ నింతభయభక్తులతోఁ బలుకఁబట్టి నిన్నిట్లు విడిచితిమికాని కొంచెము గౌరవ హీనముగాఁ బల్కితివేని నిన్నిక్కడ మట్టుపెట్టుదుము నీ వదృష్టవంతుఁడవు చెడ్డటక్కరివి. ఎవరివద్ద నెట్లు మాటాడవలయునో పరిపూర్ణముగ నెఱుఁగుదువు సుమీ' యన ఖానునకు నిలుపలేనంత యాగ్రహము పొడముటచే నాతఁడు దిగ్గున లేచి, "నేను మీపరాక్రమ మెఱుఁగుదును. మీరు చెప్పవలెనా" యని యాతని రెండు భుజములుపట్టి గట్టిగనొక్కి చేతిలోనున్న ఖడ్గము నూడఁబెఱుకుకొనెను. తెల్లపోయి శాయాజీ నోరెత్తకయుండ ఖాను నిన్ను రాణి తీసికొనిరమ్మనినది రా" యని నేలకుందోచి రెండుచేతులు వెనుకకుఁగట్టి గుండెలపైఁ గత్తిమోపి, "దురాత్మా నీవు హోల్కారువా! నిన్నిపుడు నేను దునుముదుంచెద. నీకు దిక్కెవ్వఁడురా ?" యని యొక్కయేటున వానినేయఁబోయి యంతట నిలిచి రాణి కాతని జీవముతోడనుండంగనర్పించుట యుచితంబని పల్కిఁదెమ్మని తనభటుల కానతిచ్చెను. ఇంతలో నీసంరంభమును జూచి నూతిలోఁబడిన వానిలాగు శాయాజీ వేసిన కేకలు విని గండాభిల్లు తన మూఁకలం దోడుకొని తుకకను నఱుకుటకువచ్చెను. భిల్లుల యట్టహాసమును సైరింప నోపక ఖానుయొక్క యంగరక్షక సేనలోనున్న ముప్పదుగురు మహారాష్ట్రులు నిరువదిమంది వచ్చి తుకకలు నదివఱకే తుపాకులలో మందు దట్టించియుంచున నొక్క పెట్టున

వచ్చి గుడారపుగుమ్మముకడనిలిచి భిల్లులను లోనికరుగ నియ్యరైరి. భిల్లసైన్యపరివాహము మహారాష్ట్రబలమను గట్టుచే నాపఁబడినందున శాయాజీ నిర్విణ్ణుఁడై హోరున నేడువఁబ్రారంభించి తన్ను వదలుమని ఖానున నేకభంగుల వేఁడుకొనెను. కాని ఖానుహృదయము రాజద్రోహులవిషయమున మాణిక్యమువంటిదగుటచే వాని దీనాలాపములు వాని డెందమును గరఁగింప నేరవయ్యెను. అప్పుడు కుపితులగు రెండు వందల భిల్లులకును నేఁబదుగురు మహారాష్ట్రసైనికులకును ఘోర యుద్ధము జరిగెను. మనుష్యులు మనుష్యులను గొట్టుటయటుండ ధమ్మధమ్మన వేలు మహారాష్ట్రుల తుపాకులగుండ్లును రివ్వురివ్వున వచ్చి భిల్లుల యమ్ములను నొండొంటితో వియ్యమొందనాగెను. తుపాకినుండి వెడలిన ప్రతిసీసపుగుండు నొక్క నిండుప్రాణమును గొనుటచే జస్వంతరావుచే హతముఁగాక శేషించిన భిల్ల ప్రపంచమున కది ప్రళయకాలమయ్యెను. ఆదినమున నూరువురు భిల్లులు యుద్ధరంగమునకు బలియైరి. ఒక తుపాకీగుండు గండాభిల్లుయొక్క చెవికిఁదగిలి దూసికొని పోవుటచే నాతఁడు రణరంగమును విడిచి వెంటనే ప్రాణరక్షణార్థమొక కొండగుహలోనికిం జనెను. యజమానుఁడరుగ గొఱ్ఱెదాఁటువలె భిల్లులందఱు నొకరివెంట నొకరరిగి యరనిమిషములో రణభూమి నిర్మానుష్యముగాఁజేసి శాయాజీయొక్క హృదయమునుగూడ ధైర్యశూన్యమగునట్లు చేసిరి. మహారాష్ట్రసైనికులు హతులయిన భిల్లులపైఁబడి వారికడనుండిన గొఱకొమ్ములును నేనుఁగు దంతములును మొదలగువానిని దోఁచుకొని యుద్ధాంతమందు జగుగవలసిన పూర్వాచారమగు దోఁపుడున్నదనిపించిరి. తరువాత నొక ప్రాఁతపల్లకీలో శాయాజీని గూర్చుండఁబెట్టి జమానుఖానాస్థలమును విడిచి ప్రయాణము సాగించెను. ఈ ప్రయాణములో శాయాజీ తనయుత్కృష్టదశనుండి తప్పించుకొనుటకు జేతన యినంత యత్నము సలిపి కృతకృత్యుఁడుగాక ప్రాణములువారి

కప్పగించి యీశ్వరునిపయి భారమును వేసెను. జమానుఖాను మూఁడు దినములకు నింబపురమునకుంజని తన ప్రజ్ఞాదికమును దెలియఁజేయ నామె వానిని బహువిధముల మెచ్చుకొని యొకరత్నపుటుంగరమును బహుమానముగ నొసఁగి, తనయెదుటకు శాయాజీని రప్పించెను. నిర్జీవప్రతిమలాగున బద్ధుఁడై యున్నవానిని జూచి రాణి, “నాజ్ఞాతి నిట్టియవస్థలో నుంచుట నాకిష్టములేదు. నాతోసరిసమానుఁడు. నాకు మనోవృత్తి నియ్యఁజాలినవాఁడు. ఈతనిని గౌరవింపక యవమానింప నామనస్సు తాళ” దని పల్కి బంధవిమోచనము జేయించి యొకపీఠముపైఁ గూర్చుండఁబెట్టెను. ఆపలుకుల కులికి శాయాజీ జమానుఖాను చేసిన యన్యాయమునుగూర్చి రాణితోముచ్చటింపఁదలంచి రాణి తనపక్షమున నున్నదని నమ్మి యిట్లనియె. “ మనమిరువురము సమానులమయి యేకకుటుంబములోఁ జేరినవారమయితిమి. అట్టి నన్ను నాగౌరవము నెంచకుండ నీతురక చేతులు విఱిచికట్టి యిట్లిపుడు తెచ్చుట మీరంగీకరించితిరా? ఈతఁడు నన్ను మీదగ్గఱకుఁ దెచ్చుటలో నీతని గొప్పలేదు. నేను రావలెననుకొనుచుండఁగఁ దాను మీచే సన్మానింపఁబడుటకునన్నిట్లు పరాభవించినాఁడు తల్లీ” అని మనవియొనర్ప రాణి తలయూఁచి సరే యావిషయమయి నేను విచారణసల్పెదఁగాక నీవాగుడారమున నుండుము. అని యానతిచ్చి విచ్చుకత్తులతోనుండు పచ్చితురకలఁ గావలియుంచి సురక్షితముగ నాతని నాగుడారమున నుంచెను.

ఇరువదిరెండవ ప్రకరణము.

శాయాజీహోల్కారను నామధేయము నొసంగి యీకుఱ్ఱవానిని బయికిఁ దెచ్చుటలో దౌలతరావుయొక్క ముఖ్యోద్దేశ మొక్కటియు జరిగిన దొక్కటియు నయ్యెను. క్రొత్త హోల్కారునకుఁ బట్టాభిషేక మ

గుట బ్రిజలు వినినతోడనే యహల్యాబాయిని విడిచి తమవద్దకు వత్తు
రనియు రాణికిఁ గప్పము గట్టరనియు రాణి జంకి రాజ్యము విడిచి
పోవుననియు నతఁడు గొంతెమ్మకోర్కెతో నీకార్యము గావించెను.
తరువాత ప్రజలు తనమొగముఁ జూడకపోవుటయుఁ గొందఱు దురా
చారులుమాత్రము తమ్ముఁజేరుటయుంజూచి దౌలతరావు బెంగఁగొని
రసపుత్రులతోఁజేరి వారి కేవిధమైన సాయముఁ జేయఁజాలక పట్టినప
ట్టు వీడవలదని ప్రోత్సాహము జేయఁదొడఁగి మరల శాయాజీయొక్క
మొగముఁ జూడక భిల్లులఁ దలపెట్టక యేమిచేసినను రాజపుత్రులే దిక్క
ని వారిని నమ్మియుండెను. తమరాణిపయిఁ దిరుగుబాటుచేసిన కొంద
అనామధేయుల మాటలునమ్మి రాణిత్రాణ దెలియక యట్లు దేశ
ముపై దండువిడియుటకును లంచముఁదిని గోమాజీరావు సహాయ మొ
సంగనందులకును దౌలతరావు మాటలుచెప్పుటయేగాని చర్యలు జరు
పలేనందులకును నుదయపుర రాణావారు మిగుల నొచ్చుకొనుచుఁ బశ్చా
త్తాపమునొంది యాఁడుదానిని గెలువలేకవచ్చినాఁడని రాజపుత్రకుటుం
బములు తన్ను దెప్పునని విచారింపసాగెను. అట్లు పశ్చాత్తప్తులగు మ
హారాణావారి పాదసన్నిధికివచ్చి నిల్చి భేతాళసింగు నమస్కరించి యిట్ల
నియెను—“ దేవా! యీదౌలతరావు మనకుండియేమి? లేక యే
మి? ఈతని నేలసాగనంపరాదు. అదియటుండ నేను దమకార్యమునకుఁ
బ్రాణములనైన విడిచెద. నేను గోమాజీరావు మాటలునమ్మి మిమ్ము
ప్రోత్సాహపెట్టి యిటకుం దీసికొని వచ్చితి. అందుచేత నేనీరాత్రి యొక
యద్భుతముఁజేసి తమకు జయము చేకురఁజేసెద. నాకనుజ్ఞమాత్ర మొ
సంగుఁడు.” అని రాణాచెవిలో నొకరహస్యముఁజెప్పి యాతనిసమ్మతిఁ
బడసి తనప్రయత్నమునఁ దానుండెను. అంతట వైరానలము చల్లారెన
దని యెఱిఁగింపనోయన నెండ చండతమాని, యగుపడదయ్యెను. దేశ
మంతయు వేఁపిమాడ్చిన శత్రుమండల మిదెగుబ్రింకుచున్నదనియు దుఃఖ

జలధి మునుఁగుచున్నదనియుఁ జాటనా, భానుమండల మపరజలధి గ్రుంకె. శత్రువుల చండతేజం బడిగిన వెనుక సన్మార్గవర్తులగు ధవళయశు లనేకులుందురని వెల్లడిసేయు తెఱఁగున నంబరమున నక్షత్రకోటు లుదయించె. అది కృష్ణపక్షమగుటచే వెన్నెలమాత్రము లేదయ్యె. ఆరాత్రి జామయిన తరువాత ముక్తను నిద్దురఁబుచ్చి యహల్యాబాయి దగ్గఱనున్న యాస్త్రీనిఁ జూచి యమునా! నీకింతవిచారమెందుకు? ఈయుద్ధము ముగిసినదికనుక శివనానానుబిలిచి నీకుమారుని వదలించుటకు నేమియభ్యంతరమున్నదో యడిగెదను. నీవిట్లు విచారింపకు. ఆహా కడుపుతీపును మించిన దేదియు లేదుగదా. ఇన్నిదినములుగడపితివి. ఈరాత్రి కూడఁ గడుపుము. నాకు నిద్రవచ్చుచున్నది నీవు మేలుకొనెదవా యని యడుగ, "నమ్మా నాకు నిద్రవచ్చునా? ఇన్నిదినములనుండి యన్నమెట్టిదో యెఱుఁగను తల్లీ నాకు పుత్రభిక్షఁ బెట్టవేని యింక మృతినొందుదునుమీ యమ్మా" యని రాణిపాదములపైఁబడి కొంతసేపువిలపించి లేచి తనపక్కపైఁ గన్నులు దెఱచి పండుకొనెను. అహల్యాబాయియును ర్ముక్తమనఃకంటకయై హాయిగ గుండెపైఁ జేయివైచుకొని నిద్రించెను. దాంతరావారాత్రి నిద్దురలేక తన యవస్థఁ దలంచుకొని యింక తన కెట్టియాసయు లేదని యేమియుందోఁచక యిటునటుఁ దిరుగుచుఁ గొంతసేపొకచోటఁగూరుచుండి యిట్లని విలపించెను. "హా నేనేల రాజద్రోహము చేసితిని. చేసినవాఁడ నిందునెరవేఱనైతి. ఈరసపుత్రులు నన్ను నమ్ముటలేదు. ఏసహాయమును వారికి సలుపలేని నావంటి యప్రయోజకునియందు నమ్మకము వారేల నిల్పుదురు? ఆకమలపై నాకావెఱ్ఱిమోహమేల యుదయింపవలయును. నాభార్యా! హా దుర్గదుర్గా! నేను నీగొంతుకోసి నా గొంతు కోసికొంటిని. ఇఁక నీసుందరవదన దర్శనమును నీమధురాలాపములు నాలకించుట నాకులేదు. భిల్లులతోఁజేరి యచ్చటనుండక యేటికిచ్చటికి వచ్చితిని. నీవు

నన్ను గదలనీయరు. నాభార్యచేసిన హితోపదేశమును మండోదరీ వాక్యమును నిరాకరించిన రావణునివలె నిరాకరించి యిట్టిముప్పు దెచ్చిపెట్టుకొంటిని. నేను జచ్చుచు నిరపరాధియగు శాయాజీ యనుపేరుగల యాకుఱ్ఱవానినిబ్రాణములఁదీసి వానిని గోతిలోఁ బడఁద్రొక్కి బిచ్చమెత్తుకొనుటకైనఁ బ్రతుకకుండఁ జేసినాడను. ఇప్పుడొకవేళ రాణి పాదములపైఁబడి క్షమార్పణఁ జెప్పుకొన్నచో లాభముండునేమో? ఏమీ నావెఱ్ఱి? నావంటిద్రోహిని రాణి బ్రతుకనిచ్చునా? హా దుండీరావా! నాజీవనమున కుసూహమనుచు నీవెందున్నావు? హాదైవమా! నేను పాపినగుటచే నాకీమరణమనఁ గడుభయముదయించి యీమొండిబ్రతుకు బ్రతుకవలెనని యున్నదిగదా" ఇట్లు పశ్చాత్తాప మొందుచుండిన దౌలతరావునొద్దకు హఠాత్తుగావచ్చి, "నీతోఁగొంచెము పని యున్నది. రాణావారు నీతోఁ గొన్నిరహస్యములఁ జెప్పుచున్నారు. ఒకమాఱు కోట బురుజమీఁదికిరా? అని భేతాళసింగు వానిం బిలిచెను. కోటబురుజుమీఁది కొంటరిగ నేగుట కిష్టములేనివాఁడయ్యు, నెట్లైనఁ దప్పదుకదాయని సింగువెంట నియమితస్థానమునకు విధిలేక నడచిపోయి దౌలతరావు, ఎక్కలేకయెక్కలేక బురుజుపైనెక్కి కోటక్రింది కొకమారు తన దృష్టిఁ బరపెను. వెంటనే మహానరకమువలె నగాధమైయున్న కందకమును దిమ్మని దెసల నావరించిన యంధకారమును మహారాష్ట్రునకు భీతిఁగలిగించినందున నాతఁడు గజగజ వణఁకఁజొచ్చెను. ఇంతలో భైరవసింగు వచ్చి వారిం గలిసికొని దౌలతరావును దాదాపుగఁ బ్రాణములు లేనివానిగ నొనర్చెను. వాని భయమును జూచి నవ్వి భేతాళసింగు, "నీకెంత భయమేల? నేను నిన్ను సలహాయడుగుటకుఁ దీసికొనివచ్చితిఁగాని నీకు హాని చేయుటకుఁగాదు. అహల్యాబాయి సైన్యమునఁ గలకలము పుట్టినది. వారు పరుగెత్తుచున్నట్లున్నారు చూడు. నావ్రేలిచాయపై నిదానించిచూడు" అని రెండవవ్రేలితో

రాణిసైన్య మున్నచాయ నాతనికిఁ జూపెను. దౌలతరావు వెఱ్ఱివెఱ్ఱి చూపులఁ జూచుచు వానితో, "వారు నాకగపడుచున్నారు. పారి పోవుచున్నది. నిజమే" యని యుత్తరమిచ్చునంతలో భేతాళసింగు భైరవసింగును మెల్లన గోకెను. తోడనే భైరవరూపుఁడగు భైరవసింగు ఖడ్గమును దీసి యొక్కయేటున సకలకలహకారణుఁడగు దౌలతరావు శిరముఁ దెగవ్రేసెను. మాఱుమాటలేక మహారాష్ట్రుఁడు బురుజుపైఁబడ భేతాళసింగు నిర్దయుఁడై గుభాలున నాతని నధోలోకమునకుఁ ద్రోచినట్లు కందకములోనికిఁ ద్రోచివైచి వెంటనే యాతని స్థూలకాయము దడదడ దొర్లుచుండ భేతాళసింగు మహానందమొందుచు వానిమొండెమును గనులపండువుగఁ జూచుచు భైరవసింగుతో, "మిత్రుఁడా లంచముపొమ్ము మనమే యపహరించితిమని యీదురాత్ముఁడు రాణాతోఁ జెప్పునని నాకనుమానము గల్గినది. అందుచేత నింతపని జేసినాఁడను. ఇఁక మనము సేయఁదలంచిన రెండవకార్యమున కరుగుదముగమ్ము" అని బురుజులుదిగి పాణిద్వారముదాఁటి కోటవెలువడిరి. అప్పుడు సరిగా రెండు జాములయ్యె. ఉభయసైన్యములయందుఁ గావలి గాచు భటులు దక్క తక్కినవాండ్రందఱు నిద్రాసక్తులైరి. శత్రువులు పరాజితులై రేపోమాపో నింబపురమును విడిచిపోవుట కుద్యుక్తులై యున్నవారనివిని యహల్యాబాయిసేన యంతయు నిద్రించుటయేగాక కావలిగాచు యోధులుగూడ నిద్రకులోఁబడి నడుమనడుమ యులికిపడి చేతులతోఁ దుపాకులంబట్టుకొనుచు నెడ లెఱుంగకుండిరి. రాణి గుడారముననున్న యమునయను నాసుందరి కుమారవియోగముచేతనో మఱి యెందుచేతనో కునుకు లేక పలుమాఱు తనగదిలోనుండి రాణిగదిలోని కరిగి యహల్యను ముక్తాబాయిని బరీక్షించి చూచుచు గుడ్డతలుపులం దెఱచి యావల కరిగి యడుగులచప్పు డగుచున్న దేమో యని యాలకింపుచు మనస్స్థిమితము లేక తిరుగసాగెను. ఒకమాఱామె వీథి

లోనికిరా జమానుఖా నామె యాత్రికను గని యేదియో నేఁడు జరుగనున్నదని నిశ్చయించి నిద్రనువిడిచిపెట్టి భద్రముగనుండి యామెలక్షణముల మెలఁకువతోఁ బొడఁ గనుచుండెను. ఆమె నాలుగుసార్లు గుడారము యొక్క వెనుక గుమ్మముదాఁటి యావలనిల్చి యేరినిగానక గుడారమున కరిగి కొంతసే పచ్చటవిశ్రమించి యైదవసారి గుమ్మముఁ జేరునప్పటి కామె పాదముల కేదియో తగుల్కొనెను. సర్పము కాలిని జుట్టుకొన్న దేమోయని భయపడి తొందరతోఁ గాలువిదలింప మెత్తనియామె పాదములకు దృఢమైన మనుష్యదేహము తగిలెను. అదియేమని యామె వంగిచూడ నొకమనుష్యుఁడు మెల్లగా, ,,నేను, భయపడి కేకవేయకు యమునా! లోపలికిరా! యని పలుక నామె తొట్రుపాటుతో వచ్చినావా వచ్చినావా లోపలికిరా యని తాను మునుముందు గుడారముఁ బ్రవేశించెను. వెంటనే యామనుష్యుఁడును తనతోవచ్చిన తనమిత్రుని గూడ లెమ్మని యిరువురును యమునయున్నస్థలముఁ జేరిరి. ,,యమునా! భోగముదాన వన్న నీవే భోగముదానవు. నిన్ను నేనుంచుకొన్నందుకు నాసొమ్ము నీవింతకాలము దిన్నందుకు నాకీరాణిగుడారముఁ బ్రవేశింప వీలుచేసితివి. నడచివచ్చినచో మనుష్యవిగ్రహము నానవాలు పట్టుదురని నేనును వీఁడును నేలఁబండుకొని దొర్లిదొర్లి వచ్చినాము. ఇంక మేము కృతకృత్యులమైనఁ జాలును. ఐనను దైవమేమి చేయునోయని యమునయొక్క నిద్దంపు చెక్కుటద్దముల ముద్దుపెట్టుకొని లోపలికిఁ దమ్ముఁదీసికొని పొమ్మని యామెయడుగ నామె మార్గప్రదర్శకురాలయి వారి నహల్యయున్నగుడారమునకుఁ దీసికొనిపోయెను. వీరిరువురు యమునాసమేతముగ లోని కరుగునప్పుడే మఱియొక పురుషుఁడు జోడుతుపాకులను మందుగూర్చి సిద్ధముగనుంచుకొని యహల్య నిద్రించు గుడారమునకు వెనుక ప్రక్కనున్న గుమ్మముచాటునఁ బొంచియుండెను. క్రొత్తపురుషులలోఁ బ్రథముఁడు గుడారమునంతయుఁ బరికించి యొక

మెత్తని పాన్పుపై శరీరమును మఱచి జస్వంతరాయనిఁదలంచుకొని ప
లువరించు ముక్తాబాయి ముఖారవిందముఁగాంచి నేను దీని జోలికిఁబో
వను. ఇది పసికూన యని యామెనుగడచి రాజకార్యాంశములఁ బలువ
రించుచు నొకమూల బ్రహ్మచర్యవ్రతము జరుపుటఁ దెలియఁజేయ
నొకచాపపై మృదుబాహువు దలగడజేసికొని పవ్వళించిన రాణిఁ జూచి,
"యీమెయే మనరాణావారి హృదయశల్యమగు నహల్య. ఈమెను
గడతేర్చెద" నని వెండిదీపస్తంభముపై వెలుఁగు దీపిక నుఫ్ఫున నూది
వేసి యహల్యను దగ్గఱగవచ్చి గుమ్మముముందఱ కావలియుండుమ
ని రెండవవాని కానతిచ్చి మొదట ఖడ్గ సాధనమున నామెను దునుము
టకుఁదలఁచి కత్తియెత్తెను. కాని యొక్కపోటున కామె చావవచ్చుఁ
జావకపోవచ్చు చావకుండినచో నల్లరియగునుమీ యని యమున సమ
యానుకూలముగఁ జెప్పిన యాలోచనముఁ బట్టి యాతఁడు తుపాకి నుప
యోగింపఁదలఁచెను. ఆపురుషుఁడు తుపాకి బారుచేసికొని రాణియొక్క
కుడివైపున మోకాళ్లు నేలవాల్చి కూరుచుండ నాతనికి సరిగ నెదురుగ
యమున, సమయమునకు రాణినికదలకుండఁ బట్టుకొనఁదలఁచి రెండవప్ర
క్కను గూరుచుండెను. అంతట నాతఁడు తుపాకి రాణిగుండెపై గురిపె
ట్టి యింతకంటె నెమరు కణతనుగొట్టినచో మఱల మాటాడక పరలోక
యాత్ర కామె వేంచేయునని యాగురిమార్చి కణతకుఁబెట్టి జాగ్రత్త
యని యమునతోఁ జెప్పెను. ఆవల రెండుతుపాకులఁగైకొన్న పురు
షుఁడు కూడ రాణివైపే గురినిల్పి ఱెప్పవాల్పక చూడసాగెను. యము
నయు మెల్లగ నహల్యాబాయిపైఁ జేతులువైచెను. వైచినక్షణమే
గభిల్లుమని తుపాకి నాదము వినఁబడెను. ఆధ్వనితో దద్దరిల్లి మహారా
ష్ట్రసైన్యమంతయు నిద్రనుండి ప్రబోధింపఁబడి శివనానా తుకాజీహో
ల్కారు మొదలగు సేనాపతులు సకలయోధులు కలవరపడి లేచి హాహా
కారములతో రాణిమృతినొందినది రాణిమృతినొందినదియని యఱచుచు

నామెగుడారమును జేరిరి. సైనికులందఱు నాక్రందనధ్వనులతో నానా ముఖములనుండి రాణిగుడారమువైపు పరుగసాగిరి. శివనానా కన్నీళ్ళతోఁ గావలివాండ్రఁ దిట్టుచుఁ గొట్టుచు మీయజాగ్రత్తచే నేఁడు రాణిచచ్చినదిరా దున్నపోతులారా వెధవలారా పశువులారా మిమ్ము నందఱఁజంపెదను చూడుఁడీ. ఆయ్యో యని దుఃఖించుచులోనికరిగి దీపముఁ దెప్పించి యతిదీనముగఁ బడియున్న యొక యాఁడుశవమునుగాంచి ‘మోతల్లీ!’ యని యామెపైఁబడి యేడువనారంభించెను.

ఇరువదిమూఁడవ ప్రకరణము.

అహల్య మృతినొందినవార్త శ్రవణానందకరముగ విని శాయాజీహోల్కారు తనకింక సింహాసనము దప్పక సీయఁబడునని యాస జనింపఁ దన దురవస్థను మఱచి, “యామెను నేను దహనముసేయవలెను. సన్నిహితజ్ఞాతి నుండఁగ మఱియొకఁడు వల్లకాదు. నన్ను వదలండి” యని భటులను వేగిరపెట్టెను. కాని వారుజాగరూకులయి హానినిగాని వామనభట్టునుగాని విడువరైరి. శాంతమునకును నిదానమగు నాలోచనమునకును బ్రసిద్ధికెక్కిన తుకాజీహోల్కారు గుడారముఁ బ్రవేశించి యేడ్చుచున్న శివనానాను గనుంగొని వారించి యాస్థలముఁ బరికించి తనగంభీరస్వరముతో నిట్లనియె. “రాణిగారు సురక్షితలైయున్నారు గడబిడవద్దు భయములేదు. ఈయమున చచ్చిపడియున్నది. ఆమెప్రక్కను రాజపుత్రుఁడొక్కఁడుకూడఁ బడి చచ్చినాఁడు ప్రాయశః వీఁడు భేతాళసింగయియుండు నూరకొనుండి” యని పలుకఁ బ్రజలు నిశ్శబ్దముగ నుండిరి. శివనానా యామాటల నాలకించి యాశ్చర్యముతో నా రెండుశవములను నిదానించి చూచి కలవలపాటుచే లేచి జడిసిన బాలహరిణమువలె నోటమాటలేకయున్న కూఁతు

వీఁపుపైఁ జేయివైచుకొని కూరుచున్న యహల్యనుగాంచి, అమ్మా మీరు బాగున్నారా యని పాదములపైఁబడి రోదనముచేసెను. రాణి వానిపైఁ దనచల్లని యభయహస్తమువేసి, యీప్రాణదాన మెవఁడు చేసెనోకాని నేనీగడియవఱకు బాఁగున్నాను. తనకుమారుని నీవు చెఱలోఁ బెట్టితివను నొక వంకబెట్టుకొని యీయమునాదురాత్మురాలు శత్రువులచే నంపఁబడినది కాఁబోలు. నేనది యెఱుఁగక దానిమాటలు నమ్మి లోన నుంచినందులకు నాపని పట్టినది. వీఁడేనా ఛత్రాళసింగు? వీనినిగూర్చి పలుమాఱు విన్నదానను. వానిచావునకే వాఁడిందు వచ్చెనని పలికి తాను ముక్తయు నందఱ కగుపడుటకు గుడారము ముందఱకువచ్చి నిలిచి వెలుతురువచ్చుటకు నెగళ్లు వేయించిరి. అప్పుడు రాణి సజీవురాలయియున్నదని తెలియుటచే శాయాజీకి నిలువునఁబ్రాణములుపోయెను. అప్పుడు తుకాజీహోల్కారు రాణితో, "అమ్మా యీమహోపకారముఁ జేసినవాఁడు మనజమానుఖానయి యుండవలయును. ఏడీ యాతఁ డెక్కడనున్నాఁడు రాఁడేమి?" యని నలుదెసలంజూచి యాతనింగానక యతఁడొకవేళ శత్రువులచేఁ జిక్కెనేమోయని భయపడసాగెను. అంతలో వారియెదుటఁ జుట్టుజరీపట్టెలుగల యెఱ్ఱతలపాగఁ జుట్టుకొని పచ్చపట్టుషరాయి సన్నపట్టు నిలువుటంగీ దొడుగుకొని తనయాకారము నగళ్లవెలుతురులో నొక వింతకాంతి నొంది ముద్దులు మూటఁగట్ట నొక క్రొత్తవిగ్రహము నిలిచెను. అంద ఱాశ్చర్యనిమగ్నమానసులై వానిమొగముజూచి, "ఏమిది శ్యామసుందరద త్తిట్లు వచ్చినాఁడేమి నీవింతకాలము నెచటనున్నావోయి" యని యడిగిరి. అహల్య వానిని తప్పక చూచి నీవిక్కడనేయున్నావా యని వానిని బలుకరింప, "అమ్మా నిరపరాధియగు శ్యామసుందరుఁడే జమానుఖాను సుమీ" యని యేలికకు నమస్కరించెను. ఆనందబాష్పములతో వాని నెత్తి రాణి నాయనా నీమూలమున శాయాజీ మాచేతఁ బడినాఁడు

నీమూలముననే నేనును గూఁతురును ఖేశ్రాళసిఁగు పాలఁబడక బ్రతికి తిమి. నిరపరాధినగు నిన్ను నిర్హేతుకముగ నుపద్రవింప యత్నించి తుదకు రాజ్యమునుండి తఱిమితిని. నాయపరాధము నీవు సైరింపఁ దగు సుమీ నాయనా" యని యాతని మందమందమృదూక్తులతో లా లించెను. శ్యామసుందరుఁ డాపలుకుల కలరి, "అమ్మా నేనెప్పుడును రాజభక్తియందుఁ దీసిపోవనివాఁడనే నేనాదినమున నురిదీయఁబడుటకు సిద్ధముగనుండియు జస్వంతరావుగారి వసంతగృహమున వారందఱు చే రుదురని మీకుత్తరమునంపితి. అందువల్లనే కదా మీరు వారలంబట్టు కొనఁ గలిగినారు" అనెను. ఆమాటలు విని యచ్చట నున్నవారంద ఱు నాశ్చర్యముపొంది దత్తుయొక్క రాజభక్తిని వేనోళ్ళఁ బొగడసా గిరి. ఇంతలో నీకోలాహలము నాలకించి రాధాకాంతరావు వినయసం భ్రమములతో నేలికయెదుటకునరుగుదెంచి చేతులుజోడించి, "అమ్మా ఇదె రాధాకాంతుఁడు కనువిచ్చిచూచి రక్షింపుమీ" యన దేవి వా నిమొగముజూచి నీరఘునాధరావును విడిచినావేమని యడిగెను. తనపై రాజద్రోహమును హేయమైననేరమును స్థాపింపఁబడినందునఁ గొలకుల నుండి కన్నీరు గారఁ దన వృద్ధశరీరము వడఁక నతఁడిట్లనియెను. "త ల్లి గోమాజీరావునందు మీకు మిక్కిలి నమ్మకము కలదుగాని యా తఁడు ద్రోహి. అతఁడు తమ ప్రతికక్షులఁ జేరె కృతఘ్నుఁడనగు నన్ను మీసన్నిధినుండి సాగనంపఁదలంచి రఘునాధరావు వచ్చుచున్నాఁడని మీతోఁ జెప్పి నన్ను దూరదేశమున కంపెను. నేనెంతకాలము కనిపె ట్టుకొని యున్నను రఘోబాకాని యాతని బలముకాని నామీఁదికి రా దయ్యెను. తుదకాతఁడు దండెత్తిరా నిశ్చయించుకోలేదని నాకుఁ దెలి సినది" రాణి చెవుల కీమాటలు వినిపించినతోడనే విశేషాశ్చర్యమొం ది రాధాకాంతునితో, "సరే నీవు దత్తు నన్యాయముగ వదలిపెట్టి మని గోమాజీరావునకు లేఖవ్రాసినావు. తరువాత రఘునాధరాయుని

వద్దనుండి నీకు వచ్చిన జాబుఁగూడ మాకు దొరకినది. అందుకేమి
యుత్తరముఁ జెప్పెదవు" అని ప్రశ్నవేసెను. ఆప్రశ్నవిని యుత్తర
మీయలేక యొకకొంతసేపు తత్తరపడి యెట్టకేలకు నాతఁడు, "నేను
గోమోజీరావునకు జాబులువ్రాసినానా? రఘునాథరావువద్దనుండి నా
కుఁగమ్మవచ్చినదా? అమ్మా మీ రెంతవఱకు మోసపోయినారు.
నాపై నసూయ గలిగింపవలెనని గోమోజీరావు స్వయముగ వ్రాసి
యో మఱియొకరిచేత వ్రాయించియో యీజాబులు మీకుఁ జూపినాఁ
డు. జాబుఁ జూడనిచ్చినచో వ్రాఁత యెవరిదో చెప్పెదను" అని విన్న
వించెను. విన్నవింప రాణి యారహస్యము వినవలెనను నాతురముతోఁ
దనకు మున్నిచ్చిన గోమోజీరావు సంబంధములగు రెండులేఖలను
రాధాకాంతునిచేతికిచ్చెను. ఆయుత్తరములఁ జదువుకొని రాధాకాంత
రావు తన యేలికతోఁ దల్లి యీవ్రాఁత వామనభట్టుది. వానిచేత
వ్రాయించి గోమోజీ మిమ్ము మోసపుచ్చినాఁడు. వామనభట్టువల్ల
కొన్ని రహస్యములు బయలకువచ్చునని పలికెను. తమచేతఁ జిక్కి
యున్న వామనభట్టును రప్పించి రాణి వెంటనే యాయుత్తరములఁజూపి
యది యెవరివ్రాఁతయని యడుగ నతఁడు గద్గదస్వరుఁడై యీవ్రాఁత
తనదని యొప్పుకొనెను. అంతట శ్యామసుందరదత్తు భట్టుదొడుగుకొ
న్న యంగరకా జేబులు వెదకి యందుండు మఱియొకజాబును దీసి రా
ణి కిచ్చెను. వింతతరువాతవింత బయలుదేరుటచే రాణి కోపము నా
పుకొని నవ్వుచు నాయుత్తరమును నీక్రిందివిధమునఁ జదువసాగెను. "గో
మోజీరావు భేతాళసింగునకు వ్రాయున దేమన, మీకు నింబపురికోట
స్వాధీనమగునట్లు నేను సకలసహాయములును జేసియుండ నాకీయవలసిన
సొమ్ము నిచ్చుట మీ కింత కష్టముగ నున్నది. మీరు వచ్చునప్పటికి
మహాధీరుఁడైన రాధాకాంతుని, మంచియుపాయముచే, దూరదేశము
న కంపితిని. ఆవిశ్వాసమైన మీకు లేదు. ఈయుత్తరమందిన తక్షణము

నాసొమ్మునాకంపుము" అని రాణి చదివిన యాలేఖను విని తుకాజీ శివనానా మొదలగువారు, దత్తు, రాధాకాంతుఁడు నోరెత్తలేక కొత్వాలుచేసిన ద్రోహమునకు సిగ్గుపడి మిన్నకుండిరి. రాణి వారింజూచి నే నింతకాలమును క్రూరభుజంగములమధ్యఁ గాఁపురముచేసితిని. ఇంతింత దుర్మార్గులుండ దేశమున కెట్లు క్షేమముగల్గును. రాజపుత్రులు నింబపురిపై వానిమాటలు నమ్మి వచ్చినారు. ఈభేతాళసింగు నాప్రాణములఁ దీయఁ దలఁచుటలోఁగూడ గోమాజీయొక్క యాలోచనయుండవచ్చునుసుమీ యనెను. అనవుడు వామనభట్టు మెల్లగ, "అమ్మా! గోమాజీరావుగారు సకారామను పేరుపెట్టి భేతాళసింగును వెంటఁ బెట్టుకొని గుట్టులన్నియుఁ జెప్పినారు. నేను కడుబీదవాఁడనై తినుటకన్నములేక యీతఁడు చెప్పినపనిచేసి పొట్టబోసికొనుచుంటిని గాని నే నేలినవారిమీఁదఁ గుట్రఁబూనుటకు వీరిలోఁజేరలేదు. తమ పాదరక్షలుమోయుటకైనఁ దగని బీదబ్రాహ్మణుఁడను. నేను తమపైఁ గత్తిగట్టుట కెంతవాఁడను. నన్ను క్షమియింపుము తల్లీ యని వేఁడుకొనెను. ఇది యగునప్పటికి జాముకోఁడికూసెను. రాణి నిద్రాభారముచే నలసి యందఱకును సెలవిచ్చి ముక్తతోఁగూడఁ దాను నిద్రింపసాగెను. చిరకాలమునకైన పరస్పరసమాగమునకు రాధాకాంతుఁడును శ్యామసుందరదత్తును నానందభరితాంతరంగులై నిద్రపోవక తమకష్టములు జెప్పుకొని యామిగిలినరాత్రికాలముం గడపిరి. ఆరాత్రిభైరవసింగు తప్పించుకొనిపారిపోయి కోటఁజేరి భేతాళసింగుయొక్క దుర్మరణవార్త రాణావారికి విన్నవించెను. రాణావా రావార్తవిని భేతాళసింగుతోఁ దనరహస్యముఁ దుదముట్టినదని యెంచి ప్రాణములతో నింబపురము విడిచి యుదయపురము బ్రవేశించుట యుక్తమని యెంచి మఱునాఁడురాత్రి భేరీఢక్కాదిధ్వానులు గట్టిపెట్టించి ఱెక్కలు చుట్టించి చడీచప్పుడులేకుండ మాత్రశేషమైనసేనతోఁ గోటవదలి పారిపోయెను. అర్ధరాత్రి శూరశిఖామణులగు

రాజపుత్రులుచేసిన తెగువ నుదయమున నహల్య విని సంతసించి రణదుందుభినాదములు తనవిజయవార్తలఁజాట, నున్నతధ్వజములు దనయౌన్నత్యముం దెలుప రత్నాకరము చందమున మహాఘోషసమేతమగు సేనలతో నుభయపార్శ్వముల ముఖ్యసేనాధిపతులు గొల్చిరా, నహల్య నింబపురికోటఁ బ్రవేశించెను. అట మహాపురమున నానందబాయి యొకనాఁడుదయమున నింటఁ బ్రాచిపని జేసికొనుచుండగ మునుపొకసాఁదివలె గుమ్మములో నొకపల్లకి దిగెను. ఆసమయమునఁ బల్లకి నెక్కి వచ్చువారెవ్వరని సంశయముకలిగి యానంద పరుగెత్తుకొనివచ్చి చూచునప్పటికి మెల్లగఁ బల్లకిఁదిగి యొకవిలాసవతి యానందకెదురుగవచ్చి యామెను గౌఁగిలించుకొనెను. ఆనంద యామెరాక కద్భుతమొంది "కమలా! నీవు బాగున్నావా? నిన్నుజూచి చాలకాలమయినది. నీవు మృతినొందితివని లోకులు చెప్పుకొన్నారు. మాదత్తును రాణి రాష్ట్రమునుండి వెళ్ళఁగొట్టినది వాఁడేమైనాఁడో నే నెఱుఁగనమ్మా" యని కంటఁ దడిఁబెట్టుకొనెను. శ్యామసుందరదత్తునకు భయములేదని కమల యామెనూరార్చి మాతమ్ముఁడు మార్గాయాసముచే డస్సినాడు. వానికిఁ గొంచెమన్నమును బెట్టఁగలవాయనుచు నడుగ నానంద యానందమున వానికన్నము బెట్టెను. బాజీరావు భోజనము సేయుచుండగఁ గమలయు నానందయు నిట్లు మాటాడిరి.

ఆనంద—నీతమ్ముఁడు నిన్నెచటఁ గలిసికొన్నాఁడు? నీవెందుండి వచ్చినావు?

కమల—నానిమిత్తము మాయమ్మ మాతమ్మునిటకుఁ బంప వాఁడదృష్టహీనుఁడై భిల్లులచేతఁబడి రెండుసారులు చావుదప్పించుకొని యిట్లటునుండగ నేను రాణిదగ్గఱ సీతయనువేషముతో దాసిగనుండి దైవయోగమున భిల్లులచేతఁ బడితిని.

ఆనంద—అయ్యో! ఆదుర్మార్గులచేతనుండి యెట్లు తప్పించుకొన్నావు.

కమల—అక్కడ శాయాజీహోల్కారను నామధేయుఁడొకండు నన్ను బెండ్లియాడవలయునని యత్నింప మేము వానిని మోసముఁజేసి యిటకు వచ్చినాము బాజీరావు నాతమ్ముఁడు గాడనుకొని యాదురాత్ముఁడు తనకొఱకు నన్నుఁగూర్చి వీనిద్వారా ప్రయత్నించి నన్ను దనకు సమకూర్చినపక్షమున మాతమ్ముని జెరవిడిపించునట్లు వాగ్దానము చేసెను. నేను మగవేషము వేసికొని రాత్రి శాయాజీని దర్శించునట్లు నిర్ణయింపఁబడినందున నేను మగవానిలాగులాఁగు దొడుగుకొని యుంటిని. అప్పుడు మూర్ఖుఁడగు శాయాజీ ముందుగ నాతమ్ముని జెర విడిపింపఁదలంచి పల్లకిఁ దెప్పింప నేనాపల్లకింగూరుచుంటిని. మగవేషముతోనుండు నాకు నాతమ్మునకును భేదమేర్పరచుట కష్టమైనందున మాతమ్ముఁడే పోవుచున్నాడనుకొని యామూఢుఁడు నన్ను విడిచిపుచ్చెను. తరువాత మాతమ్ముఁడు వానియొద్దకరిగి వాని నొక్క పోటుపొడిచి యాస్థలముఁ బాసి ముందు పయనముసేయు నన్నుఁ గలిసికొనెను. వింటివా మా యవస్థ నాటి నీయుపాయ ప్రకారముగ నేటివఱకు నేను వర్తించుటచే నాకు మానహాని వాటిల్లలేదు.

ఇట్లు వారు పరస్పరప్రేమముచే గష్టసుఖములఁ జెప్పుకొనుచు నా దినమును గడపిరి. కమల యచ్చటఁ గొన్ని దినములుండెను.

ఇరువదినాల్గవ ప్రకరణము.

వామనభట్టు రాణి శిబిరమునఁ జిక్కినాడను వార్త వినినతోడనే గోమాజీరావు తనగుట్టిఁక దాగనేరదని తెలిసి దారాపుత్రాదుల విడచి యుద్యోగము మానుకొని నాఁడర్ధరాత్రియందు నిందూరునగరము

బాసి పలాయనుఁడయ్యెను. ఎక్కడికరిగినాఁడో వాని సేవకులుగాని దారపుత్రులుగాని యెఱుఁగరు. గోమాజీ యధికమయిన యాశయు స్వల్పమయిన ధైర్యమునుగల పిఱికి మహారాష్ట్రుఁడగుట నతఁడు తన చర్యల భరింపనేరక దేశముల పాలయ్యెను. జస్వంతరావు భిల్లులనందఱి నాశనముచేసి కృతకృత్యుఁడయ్యె గండాభిల్లు దొరకమి నిండారు సంతోష మొందక కొండలు గుహలు నడవులు వాఁగులు సంచరింపసాగెను. దేశమును గొల్లఁగొన్న భిల్లులును శాయాజీతోఁ జేరిన భిల్లులును దాదాపుగ హతులగుటచే నితరభిల్లులు భయకంపితులై దోఁపుడను తలంపువిడిచి వ్యవసాయములు చేసికొనుటయు బిచ్చమెత్తుకొనుటయు నారంభించిరి. కొందఱు దొంగతనములు మొదలగు వానినిమాని మాఱువేషములతో జనులయొద్ద సేవకులుగాఁ బ్రవేశించి పొట్టఁబోసికొనసాగిరి. అందుచే గండాభిల్లు చిక్కుట యసాధ్యమని జస్వంతరావు నిరాశనొంది తుదకల్లీ రాణికి లేఖవ్రాసి వాని నప్పగించినంగాని ముక్తాబాయి నిచ్చుటలేదని రాణి వానికుత్తరమంపెను. అదివఱకుఁ బడినశ్రమ యంతయు వ్యర్థమైనదని గంగాధరుండు మఱలఁ బ్రయత్నముచేయుచు గోసాయీలను బయిరాగులను రప్పించి యడవులయందుఁ దిరుగునెడ వారికి గండాభిల్లుఁ డెందైనఁ గానఁబడునేమోయని యరయుచు నానాశ్రమలొందుచుండెను. అతఁడొకనాఁడు మహానగరమున కరుగ నచ్చటి జనులెల్ల నొకమహాత్ముఁడు గ్రామమునకు వచ్చినాడనియు నాతఁడు గండాసంగతి నెఱిఁగింపవచ్చుననియుఁ దెలిపిరి. “ఇట్టి మహాత్ముల నెందఱినో నేనిదివఱకుఁ జూచినాడను. ఎవరును నాకువానిజాడఁ దెల్పరైరి.” అని తిరస్కారభావముగఁ బల్కి తనబసకుం జనియెను. అయినను మనసు తాళక మధ్యాహ్న మొకసారి యామహాత్ముఁడు జయదేవుని మఠమున కరిగి యాతని దర్శించెనుగాని యాతఁడు మౌనముద్రాభరణ మొనర్చిన బయిరాగి యగుటచే నాతని నీతఁడు

పలుకరింపకయే యింటికి వచ్చెను. రాత్రి జపము ముగిసిన తరువాత నాబయిరాగి వచ్చియు రాని హిందీకీర్తనలు పాడుచు శ్రీకృష్ణుని యమునావిహారములు రాధాసరసములు స్తవమొనర్చి యానందించుచుండ నచ్చటికి మఱియొకబయిరాగి వచ్చి తన సంచి నందుదింపుకొని మొదటివానినడిగి గంజాయి కొంచెము గ్రహించి పీల్చి మహారాష్ట్రభాషలో వల్లభాచార్య స్తవాదులగు పాటలు పాడసాగెను. ఇట్లిరువురు విసుగు వచ్చువఱకు భగవద్ధ్యానముచేసి తమతమ కంబళములపైఁ దాము పవ్వళించిన తఱి రెండవ బయిరాగి మొదటి వానిని బలుకరింప మొదలుపెట్ట నాతఁడు మానభంగమగునని కాఁబోలు పలుక నిష్టపడక పదిప్రశ్నల కొక్కయుత్తరముఁ జెప్పుచు నిద్రింపఁజొచ్చెను. రెండవ వాఁడు విధివిరామములేక ప్రశ్నలడుగఁ జొచ్చుటచే నాతఁడు విసిగి లేచి కూరుచుండి నీవెన్నిప్రశ్న లడుగఁదలఁచితివో యన్ని యడుగుమని కోపముతోఁ బలికెను. అప్పుడు వారికిట్లు సంభాషణ జరిగెను.

రెండ—మీరు నామీఁద కోపపడవద్దు. గోసాయీలము మనలో మనము చేదోడువాదోడుగనుండకుండిన నన్ను లెవ్వరుందురు. నేను క్రొత్తగ నీయాశ్రమమును స్వీకరించితిని. మీరు మహాత్ములు నాకుపదేశమేదైనం జేయుఁడు.

మొద—నాకుమంత్రములురావు. రామారామా యనుమాట తప్ప నాకేమియురాదు.

రెండ—మీ రేయేతీర్థములు తిరిగినారు. మిమ్మెక్కడనో చూచినట్లున్నది.

మొద—నేను ప్రయాగ, కాశి, గయ, వెళ్లినాను. నన్ను నీ వందుఁజూచితివా?

రెండ—అయ్యా యీదినములలో బైరాగులకు సన్యాసులకు దేశసంచారము కష్టముగనున్నది.

మొన—అవును. ఈదేశమున మిక్కిలి కష్టము. జస్వంతరావు బయలుదేరి ప్రతిసన్యాసిని బిలిచి గండాభిల్లును నీవెఱుఁగుదువా యని యడుగుచుండును. అందుచే ననేకులు తమకుఁ దెలియకపోయినను వానినుండి తప్పించుకొనుటకు నేదియో యబద్ధము జెప్పుచుందురు.

రెండ—నన్నావిషయమై యాతఁడడిగినాఁడు. నేనేమియుఁ జెప్పలేదుకాని మీరు చాలదేశము తిరిగినారు. మీరెక్కడనైన గండాభిల్లును జూచియుంకిరా. పాపము వానిజాడ కొంచెము నాకుఁ దెలుపఁగలరా.

మొన—నాకు గండాభిల్లు కనఁబడలేదు. అతని విషయమై వేరేప్రియత్నించుటకంటె మహానగర సమీపమునయున్న ఋషిని బట్టుకొన్నచో నన్నియుం దెలియును. ఆఋషియు గండాభిల్లుఁడును నొక్కటి. భిల్లుల కాలోచన మతఁడేచెప్పి వారినింతదూరముఁ దెచ్చినాడఁట.

రెండ—అవును. ఆఋషియే వారి పక్షము గాకున్నపక్షమున నిష్కారణముగ మొదట పట్టుబడిన గండాభిల్లు వారి కుటీరమునుండి యెట్లుపారిపోవును? ఆఋషిని బట్టుకొని యుక్తిదీయింపఁ బ్రియత్నింతము. కాని గండా యెట్లుపారిపోయెనో చెప్పఁగలరా.

మొన—అయ్యా నాకెందుకు. గోడలకు జెవులుండును. ఈ సంగతులుపైని పొక్కినచో నేదియు నెఱుఁగని మనలఁబట్టి యహల్యాబాయియు జస్వంతరావుగారును బాధపెట్టుదురు. మనమాసంగతులు చెప్పకొనవద్దు. రాజుతో పని పాముతో చెలగాటము.

రెండ—ఆమాట నిజమేకాని యీ సంగతులు నే నెవరికిఁ జెప్పను. ఊరూరఁదిరుగు సన్యాసులము. మనకట్టివెందుకు? వినవలెనను కోర్కచే నడిగితి. మీకిష్టమైనచో జస్వంతరావును నేనెఱుఁగుదును గనుక వానితోఁజెప్పి ఋషిని శిక్షించునట్లు చేసెదను. ఇష్టములేనిచో నదియు మానెదను.

మొద—దుర్మార్గుఁడైన యాఋషిని శిక్షించుట నాకిష్టమే. మన రాణీవిషయమై మనము పనిచేసి దొంగల నప్పగింపక పోయిన యెడల మనబ్రతుకెందుకు. ఆమె సదావ్రతములిచ్చి మనలను రక్షించుట యెందుకు. ఆఋషిసంగతి ప్రయాగలో నొకనాఁడు తులసీదాసు మఠములో నొకగోసాయి చెప్పఁగావిన్నాను. అది చెప్పెదను విను వాఁడు ఋషికాఁడు. మూఁడవపానిపట్టుయుద్ధమున వీఁడు మహారాష్ట్రులలోనుండి సగము యుద్ధమైన తరువాత తురకల పక్షమునకుఁ దిరిగిపోయినాఁడు. తరువాత తురకలు గెల్చియు వీని నిరాకరించుటచే మరల పీష్వారాజ్యమునకు వరిగినచోఁ దనను చంపుదురని యీహోల్కారు రాజ్యమున నున్నాఁడు వీనిపేరు మురారిపంతు. మిక్కిలి వృద్ధుఁడనని చెప్పుకొనునుగాని యంతవయస్సులేదు. తా నెఱుఁగుదునన్నవిషయముల నెఱుఁగడు. వయస్సునుబట్టి వీనియందుగౌరవముగల్గి మాటలనుబట్టి భక్తిగలిగి ప్రజ లీతఁడాగతానాగతవర్తమానవేదియని యనుకొని వానితో సర్వకార్యములలో నాలోచనము సల్పుచు మోసపోవుచువచ్చిరి. రాఘాకాంతరావు మొదలగు బుద్ధిమంతులుగూడ వీనిచే మోసపోయిరి. వాఁడు భిల్లులకు సాయమై, దేశముల దోఁపించినాఁడు. కొడుకులు లేరని దిక్కులేని వాఁడనని వాఁడు చెప్పుకొనునే కాని కొంకణదేశములో వీనికందఱు నున్నారు. భిల్లులతో స్నేహముచేసి వారిచే నూళ్లుదోఁపించి యాసొమ్ము బిడ్డలకంపును.

రెండ—ఆహాహా! యెట్టిచిత్రము నేఁడు విన్నామండి మీరు రాణికి నాప్తులుగదా కాని గండాభిల్లెట్లు పారిపోయినాఁడో తెలియఁజెప్పినారు కారు.

మొద—ఆహా! అరే మఱచిపోయినాను. నాఁడు ఋషికుటీరముచేరి దత్తు దొంగనక్కడవిడిచి యెక్కడికో యురుగ ఋషియొక గొల్లనిచే దాపునున్న భిల్లునకు వర్తమానమంపి మువ్వురనురప్పించి గండా

భిల్లును దోడుకొని పోమ్మనెను. వారు కావలిగాఁచు బంట్రౌతునుజంపి గండాను వదలించుకొని పోవుచుండ ఋషి తనమీఁద దత్తున కనుమాన ములేకుండఁ దన్నుగూడ కాలుసేతులు కట్టుమని కోరె తన యిష్టప్రకా రమే బంధింపఁబడెను. అంతటియుక్తి చేయఁబట్టి వాని దొంగతనమును రాణియు దత్తును బట్టుకొనలేరైరి.

ఈపలుకులు విని రెండవయోగి యెందుచేతనో మితములేని యానంద మొందుచు "మీరు సాక్షాత్తువిశ్వేశ్వరులు, రాణి మీయె డల మిగుల కృతజ్ఞతగ నుండునుసుడీ" యని పలుక నాతఁడు "మీ రు ఋషిని బట్టుకొనవచ్చును. కాని యీసంబంధమున నాపేరు చెప్పఁ బోకుఁడీ. నానిష్ఠలు తపములు చెఱుపుకొని నేను సాక్ష్యములకుఁదిరుగ నేర" నని పలికి యప్పటికి రాత్రి యతిక్రమించుటచే గుఱ్ఱుపట్టి గాఢ ముగానిద్రపోయెను. రెండవయోగి నిద్రరానందున రామస్మరణముఁ జేసికొనుచు మేలుకొనియుండి మొదటివాఁడు నిద్రించిన వెనుక వానిదగ్గఱ గనరిగి మొగముపై మొగమువెట్టి చక్కగవానిఁ బరీక్షించి తలయూఁ చి యనంతరమున దూరముననున్న వానిసంచి దగ్గఱగఁదీసి యది తన చంక నదగిలించుకొని చప్పుడుగాకుండ మెల్ల మెల్లగఁ దలుపులుదీసికొని మరముదాఁటి చనెను. తరువాత నాతఁ డాసంచిలోనున్న వస్తువులనెల్ల వెలికిఁదీసి యందొక ముద్దుటుంగరముచు మిగుల విలువగల రతనములు ర్పఁబడిన దానిని గని సంతసించి "యుంగరమా నీవు విడిగానుండి నా హృదయము దహించుచున్నావా? ఆమె యెందరిగినది" యని కన్నుల నద్దుకొని ముద్దుపెట్టుకొని దానిని మూటగట్టుకొని తనయిచ్చవచ్చిన త్రోవ నరిగెను. ఇంతలో మొదటి బైరాగి మరికొంత గాఢముగనిద్రించి "ఓ జస్వంతరావు రాకురాకు" మని పలవరించి మరల నిద్రించెను. అనంతర మున సరిగ నొక జాముగువఱకు నిరువదుగురు దృఢ దేహులగు భటులతో జస్వంతరావు జమదేవమరమునదగ్గఱకు వచ్చి నిద్రించుచున్న యాబైరాగి

నిలేపి "స్వామీ మిమ్ము దోడుకొని రమ్మని రాణి సెలవయినది మీరు భిల్లులసంగతియు ముఖ్యముగ గండాభిల్లుసంగతియు నెఱుగుదురని వారికిం దెలిసినది. అందుచే నీలాలకిలో నెక్కి మీరు రాణిగారివద్దకు దయచేసి ఋషివిషయమై భిల్లులవిషయమై సాక్ష్యమియ్యవలయును. రండి" యని పలికెను. బైరాగి యామాటల కాశ్చర్యమునొంది యాశ్చర్యమువదలి తన్నుభయము దృఢముగా నావేశించుటచే నివ్వెరపడి తడఁబాటుతో "నేనెఱుఁగను నేను సాక్ష్యము నీయఁజాల; నాజపము విఘ్నమొందును. నన్నువిడువు" మని వేఁడుకొనెను. కాని జస్వంతరావు తాను పట్టిన పట్టువదలక "మీమూలమున రాజ్యమునకు మహోపకారము జరుగును. దయచేయుఁడి" యని వానిని లాలకిలో నెక్కించి తిన్నగా నిందూరు నగరమునకుఁ గొనిపోయెను.

ఇరువదియైదవ ప్రకరణము.

అట్లు నింబపురపు కోట నాక్రమించుకొని రాణి గండాభిల్లు దొరకలేదనుచింతదక్క తక్కిన సమస్తశత్రుసంహారమును దనచే నయినదని శ్రీకాళికావిశ్వేశ్వరునకు నమస్కరించి పూర్వ మౌరంగజేబుచే నాశనముచేయఁబడిన యాదేవుని యాలయమును దాను గట్టింతునని మ్రొక్కుకొని శాయాజీతోడను వామనభట్టుతోడను ముక్తతోడను బయలుదేరి మహాసంతోషముతో నింబపురముఁబాసి తుకాజీ, శివనానా, రాధాకాంతరావు, శ్యామసుందరదత్తు మొదలగు సేనానాయకులు పరివేష్టించి యుభయపార్శ్వములఁగొలువ నిందూరుపురికి వచ్చెను. రాణిచేసిన యాదరణముచే శాయాజీ ధైర్యముంబూని తనకామె కొన్నిజాగీరులనైన నిచ్చునను పేరాసగల్గి నడుమనడుమ నేమిచేయునోయని సందేహముతోఁ దానుచేసిన పొరబాటునకు వగచుచు రాణితో నరు

దెంచెను. రాణివచ్చునప్పటికి జస్వంతరావు యోగినొక మందిరమున నుంచి తానెన్నండును వానిఁబాయక సకలోపచారములు స్వయముగఁ జేయుచు నతిగౌరవమున నాదరించి నగరమందంతటఁ బచ్చని పందిళ్ళు వేయించి తోరణములు కట్టించి యనంటిబోదెలు నాటించి కలయంపు లుజల్లించి ముగ్గులువెట్టించి శృంగారించి తనసేనతో నామె నెదుర్కొని యామెచే గారవింపఁబడి యామెను నగరప్రవేశము చేయించి యామె సెలవుప్రకారముగ వామనభట్టును శాయాజీమహారాజును గారా గృహప్రవేశము చేయించెను. అప్పటికి తన కాశలుచచ్చినవనుకొని శాయాజీ తానును జచ్చినట్టే యెంచుకొని చెరసాలలోఁ గంటికి నేలకు నేకధారగా నాఁడుదానికంటె పసివానికంటె నన్యాయముగ రోదనము సేయఁదొడఁగెను. సీత యొందును దన కగపడదయ్యెనని ముక్త బెంగఁగొని నింబపుకె కరగిన దాది చిక్కి మఱల నలతగనున్నందున రాణి సీతవిషయమై మరలఁ బ్రియత్నముసేయ నిశ్చయించి తన సరదారుల తో నామెను వెదకుమనెను. ఆరాత్రికి మురళీధరదాసును నానందబాయియుఁ దనవెంటరా సోదరసమేతయయి సీత రాధాకాంతుని యింటికి వచ్చిచేరెను. రాధాకాంతరా వామె నాదరించి రోహిణీబాయికిం జూప నామెయు సగౌరముగ లోనికిఁదోడ్కొనిపోయి యామెకు నానందకు భోజనమిడెను. మధ్యాహ్నమామెయు రోహిణియు నానందయు రాణిదర్శనమున కరుగ రాణియు ముక్తయు సీతరాకవిని దిగ్గునలేచి యెదురుగవచ్చిరి. అందు ముక్త వీధిగుమ్మమువఱకువచ్చి సీతంగని కౌఁగిలించుకొని "యేమే నీవింతకాలము నన్నువదలి యెట్లుంటివె? అయ్యో నాకు నిజముగ నోటికన్నముపోలేదేసీతా. ఈవేళ నేనెంత యదృష్టవంతురాలనో సుమీ రావే, మాయమ్మనీకై వేగిరపడుచున్నది" యని వారలనందఱ నంతిపుకేఁ దోడ్కొనిపోవ రాణి వారిముగ్గుర సగౌరవముగఁ గూర్చుండఁబెట్టి సీతంగని "యింతకాలము నీవెట్లుంటివి. భిల్లులు

పాపము నిన్ను బ్రతుకనిచ్చినారా" యని యడిగి యామె భిల్లుల వలన జరిగిన బాధనెల్లఁ గడుచమత్కారముగఁ దెలుప వినినెను. తరువాత నాస్త్రీమండలమునకు నిట్టి సంభాషణజరిగెను.

అహల్య—చేయఁదలంచిన కార్యములన్నియు నైనవి. జస్వంతరావు లోఁబడి నాఁడు రాజపుత్రులు పరాజితులైరి. దాలతరావు వారిచే నిహతుఁడయ్యె. దుర్మార్గుఁడగు గోమాజీ పలాయనుఁడయ్యె. భిల్లులు నిర్మూలింపఁబడిరి. సీతదొరికినది. శామాజీకూఁడ చేతఁజిక్కెను.

ముక్త—ఇన్నిటిలో సీతదొరుకుట ముఖ్యముగాదా, అమ్మా!

అహల్య—కాని గండాభిల్లు చిక్కలేదు. ఎప్పటికైన దొరకకపోదు. అన్నిఁటికంటె నాకెక్కనబాధ యొక్కటియున్నది. నేను కమలను రక్షింపలేనైతినను విచారము హృదయశల్యమైయున్నది.

రోహిణి—అమ్మా! ఆవిచారము తమకెందుకు? ఈసీతయే కమల. దాలతరావుచే నీమె బాధింపఁబడునని మావారు సీతయను పేరుపెట్టి దాసిగ మీకప్పగించిరి.

అహల్య—ఆమెచావలేదా? ఈమెయే ఆమెయా? ఇదిమాయగానున్నదే శవమునుగూడ దహనముచేసినారని చెప్పినారే.

రోహిణి—అమ్మా! ఆదినముననే మఱియొక స్త్రీ మఱఁదలుతో వివాదమాడి నల్లమందు చెట్లతోఁటలో నూతిలోఁబడి మృతినొందినదఁట. ఆమెతండ్రి మొదలగువారామె బలవన్మరణముచేఁ దమకు మాటవచ్చుననియుఁ దనయల్లునకు మాటవచ్చుననియు నోరెత్తక యూరకొనుటచే నాశవము కమల శవమేయని పౌరులు భావించినారు. ఇట్లు మావారుచెప్పినారు.

అహల్య—అలాగునా. ఇదిమఱియు వింతగనున్నది. పాపము విధవవయిననీమొగము నాఁకు చూచుటకు బదులు నేఁడేచూచిపరా

మన్న చేయవలసివచ్చినదికదా. కమలా! నీవింతకాలము నాయొక్కయన్న ను నేనెఱుఁగ నైతిని.

ఆనంద—అమ్మా! నామనవిఁ జేకొనవలెను. ఈమె విధవకాదు. అవివాహితయగు కన్యక.

అహ—(కోపముతో) ఈయబద్ధములను గట్టిపెట్టి నిజము బల్కుఁడు.

రోహి—అమ్మా! ఆగ్రహింపక యావిషయమై యామెనడుగుట మంచిది.

ముక్త—కమలా! సత్వరముగ నీచమత్కారవచనములతో నద్భుతమగు నీచరిత్రముఁజెప్పి చాలకాలమునుంచి తుప్పుపట్టిన మాచెవులకు విందుచేయుము.

అహ—కమలా! నీచరిత్ర మామూలాగ్రముగ నెఱింగింపు.

కమల—తల్లీ నాచరిత్రము నాలకించి న్యాయమయినరీతి నన్నాదరింపఁగోరెద. శ్రీమానవరావుగారి పాలనమునందున్న పునహానగరము. మాకాఁపురము. కులమున నున్నతుఁడై సంపదలలో నిరుపేదయగు నీశ్వరచంద్రుని కొమార్తెను. మాతండ్రిగారి మరణానంతరమున మాతల్లి ధనాశకులోఁగి హరిహర పాండ్యాజీయను బ్రాహ్మణాధముని ప్రేరణచే నన్ను వృద్ధుఁడగురామోజీపల్కారున కీయఁదలంచిన నేనెన్నిసారులు వివాహమున కనిష్టత సూచించినను మావారు నామాటలు సరకుఁగొనకపోవుటచే రెండుమూఁడుసారులు రాత్రివేళ నేనొంటరిగ భవానీమాత యాలయమున కరిగి నాకా వివాహము దప్పింపుమని యామెను వేఁడుకొంటి. దేవి యప్పటికేమియుఁ బ్రత్యక్షోపకారము నాకుఁ జేయనందున మాతల్లి యాత్మలాభముం జూచుకొని కొంత ద్రవ్యము పల్కారువద్ద నుండి గ్రహించి పెండ్లి నిశ్చయించి తాను పునహాలో వివాహముజరుప శక్తిగలదికానందున నిందూరు నగరమునకు నను దీసికొనిపోయి

పెండ్లియాడుమని నన్నువానికప్పగించెను. అతఁడు నన్ను పెండ్లియాడవ లెనని బయలుదేరుటయు మార్గమధ్యమున వృషభముచే మఱియుట యు మీారెఱుఁగుదురు. తల్లిమాట కెదురుచెప్పఁదలఁచుకొనక యామె యాజ్ఞ నెరవేర్ప నాసౌఖ్యమునైన మానఁ దలఁచుకొంటిని గనుక నా మె యిష్టప్రికారము నేను పల్కారును బెండ్లియాడుటకు నిష్టములేక యిష్టపడి వాని వెంటవచ్చితిగాని వివాహమాడకముందె యాతఁడు మృ తినొందినాఁడుగాన నేను కన్యను.

అహ—ఏమిా! దైవయోగము. నీమాటలయందు నాకపనమ్మ కము గల్గుచున్నది. నిన్నాతఁడు పెండ్లియాడకపోయినపక్షమున నీవట్లు నె వ్వరితోడను నేల జెప్పవైతివి. పోనీ, వైధవ్యమేల యనుభవించితివి?

కమల—ఆమాటకుత్తర మానందబాయి చెప్పవలయును.

ఆనంద—అమ్మా! అందుకుత్తరము నేను జెప్పెదను ఈమెయు గాయముతగిలినరాణోజీయు మాయింటికివచ్చిననాటిరాత్రి తనయవ స్థనంతయు నాకుఁ జెప్పి యీామె తనబ్రితుకుతెరువునుగూర్చి నన్నడు గ నేనిట్లు చెప్పితిని "రాణోజీ బ్రితికినచో సరే. నీవాతనిం బెండ్లియా డుట కర్తవ్యమే. అతఁడు పోయినచో నీవు దురాత్ముఁడైన దౌలత రావు నింటనుందువు గనుక వివాహముకాని కన్యకనని చెప్పవద్దు కన్య నన్నచో నీవంటిదాని నతఁడు పెండ్లియాడక పోవఁడు. ఇదివఱకు రా ణోజీ యందఱితోడను తన భార్యవని చెప్పచున్నాఁడు గనుక జనుల నాయభిప్రాయములోనే యుంచుటమంచిది. లోకులు నిన్ను విధవయ నుకొందుఱు కాఁబట్టి దౌలతరాయని దౌర్జన్యమును వారు వారించి నీ పక్షమున నుందురు. కన్నెనని చెప్పినచో నిన్నితనికిఁ గట్టిపెట్టక మాన రు. అందుచేతఁ గొంతకాలము దౌలతరాయనియిల్లు విడుచువఱకు భ ర్తృహీనవలె నుండు" మని యుపాయముఁ జెప్పితిని. దానింబట్టియీా మె వర్తించియుండును.

ఆమాటలువిని యహల్యయు ముక్తయుఁబొందిన యాశ్చర్యము వారిమనస్సులెఱుఁగవలయును. తత్కథాశ్రవణముఁ జేసిన వారెఱుఁగ వలయును. ఎట్టిసారములేని పాడిమాటలనైన రసవంతముగఁ జెప్పనే ర్పుఁగల కమలాబాయి స్వారస్యములతోఁ గూడిన స్వచరిత్రము నద్భుతముగ విన్నవింపఁదగిన సాక్ష్యముచూటచే నహల్య నమ్మి యానిరుపమానలావణ్యరాశి విధవకానందుల కమితానంద మొంది "నీకు మాముక్తకు నింక వివాహములు చేయుట యావశ్యకమే నీమనోహరు నేనెఱుఁగుదు. మిగులశ్రమఁజెంది యేసుందరకారుని ప్రాణములు నీవు నాతోఁజెప్పి రక్షించితివో యాశ్యామసుందరుఁడని నేఁదలంచెద" నని యానందనుజూచి "నీతమ్మున కీమె నిచ్చి వివాహముసేయుట నీకిష్టమేనా ? రోహిణీబాయీ నీవు కుమారునివలెఁ బెంచుకొనుచున్న మీవత్తునకీమె యనురూపయగు నిల్లాలుకద" యని యనుగ వారిరువురు దమకు సమ్మతమని నొక్కి చెప్పిరి. అంతట నప్పలుకులకు ముసిముసి నగవులు నగి కమల ముఖకమలము వికసింపఁ జెంగున నొక తెరచాటున కరిగి సిగ్గునఁ దలవంచుకొని చిరకాలముక్రిందట నాటఁబడిన మనోరథబీజము లంకురించి శరీరమందంతట మొలకలెత్తెనోయన పులకలు వొడసూప మనోనేత్రముఁ దెఱచి భువనసుందరుఁడగు శ్రీశ్యామసుందర సుందరముఖారవిందము నానందమున ధ్యానించిచూచుచు నానంద మహాంబుధి నోలలాడఁదొడఁగెను. అంతట వారికందఱకు సెలవిచ్చి ముక్తాబాయి కోరికప్రకారము కమలను మందిరమున నుండఁ బంచి రాణి జస్వంతరావును బిలువనంప నతఁ డూరలేఁడని చెప్పిరి. మధ్యాహ్నము బైరాగిదగ్గఱ శ్యామసుందరుని గాఁపుంచి జస్వంతరావు తురంగము నెక్కి తగుపరివారముతో ఋషికుటీరముఁ బ్రాపించెను. రాత్రి జామగువఱకు ఋషిని వెంటఁబెట్టుకొనిరాకయే తానొక్కఁడు వచ్చి రాణిదర్శనముఁజేసి భిల్లులవిషయమై యెఱిఁగిన బైరాగి

వచ్చియుండుటఁ దెలిపి విచారణసేయుమని యడుగ మఱునాఁడుదయము నఁ జేయవచ్చునని వారినంపి రాణి నిద్రించెను. భిల్లులబాధ యడఁగి రాజ్యమున సౌఖ్యోదయమైన యట్లు చీఁకటిబాధ యడఁగి సూర్యోదయము కాఁగానే రాణి కాల్యములు దీర్చి బైరాగిని వెంటఁబెట్టుకొనిరమ్మని జస్వంతరావునకు వర్తమానమంపెను. బైరాగిని సగౌరవముగఁ దీసికొనివచ్చి రాణియెదుట నొకపీఠముపైఁ గూరుచుండఁబెట్టి జస్వంతరా విట్లనియెను. ఓయీ నీకీరతనపు ముద్దుటుంగర మెక్కడిది స్వామీ' అన డెల్లఁబోయి బైరాగి ప్రత్యుత్తరమేమియీయవలయునని యోచించుకొనుచు దిక్కులు చూచుచుండ రాణి యాయుంగర మందుకొని చూచి " యిది మాముక్తాబాయిది. నాఁడు భిల్లులు దోఁచుకొన్నపుడు పోయినది. ఈబైరాగియు భిల్లులలోనివాఁడా యేమి" యని యడిగెను. ఆపలుకులు విని జస్వంతరావు " శాయాజీని రప్పించినచో దీని విషయమై తేలును. అట్లుచేయుఁడీ" యన శ్రీకుమారమహారాజుగారిని రాణి చెఱనుండి రావించెను. రాజభటులు శాయాజీని నిలువఁబెట్టిన తరువాత జస్వంతరావు వానినిజూచి బైరాగినిజూపి " ఈతఁడెవ్వరి"ని యడిగెను. శాయాజీరోదనధ్వనితో " నీతఁడు గండాభిల్లు గాఁడా " యనిపలికెను. వెంటనే రాణి యాశ్చర్యమొంది యిట్లనియె. " అహల్యాబాయికి హృదయశల్యమును జస్వంతరావునకు జిరకాలప్రయత్న ఫలమును దేశసౌఖ్యమునకుఁ గాఱుచిచ్చునగు దురాత్ముఁడా యీబైరాగివేషము ధరించినవాఁడు. గండాభిల్లుపేరు విన్నచో నిందూరురాజ్యమున నున్న సుందరులకు గుండియ లవిసెనుగద! ఈతని మూలమున నేనును నా ప్రజలును నొక్కనాఁడైనను కనుపారఁ బట్టెడన్నము దినియెఱుఁగము కన్నార నిద్రయెఱుఁగము. ఈతఁడు నాభాగ్యవశమునఁ జిక్కినాఁడు భిల్లులనందఱిఁ గూల్చుట యొకయెత్తు వీనినిగూల్చుట యొకయెత్తు సుమీ నీఋణము నేను దీర్పఁజాల గంగాధరా" యని పలుకు

చుండ భటులు గండాభిల్లునకు సంకెళ్ళువేసిరి. అంతట జస్వంతరా విట్లనియె ' అమ్మా! నేనే స్వయముగ బైరాగివేషముదాల్చి జయదేవరమఠమున వీనిం గలిసికొని యనుమానపడి ముక్తాబాయియొక్క యుంగరము వీని సంచిలోఁ జూచి వీఁడే గండాయని పట్టుకొంటిని ఋషి కూడ బట్టుకొనవలెనని నే నాకుటీరముఁ జేరి వానిని బట్టుకొంటినికాని వెంటనే వాఁడు విసముదిని యక్కడనే మృతినొందినాడు. గండాభిల్లు ఋషికుటీరములోనుండి తలదాఁచుకొనఁ బ్రయత్నింపనాఋషి తనకు మాటవచ్చునని యందుఁకు సమ్మతింపఁడయ్యెనంట. అందుచే గండాభిల్లు కోపించి బైరాగివేషముఁదాల్చిన నాతో ఋషిపై నేరములు చెప్పినాడు. అందుచే నీతఁడు చిక్కెనాతఁడు చచ్చె. ఇక్కడికి శత్రుశేషముఁగూడ నిర్మూలమైనదిగదా" ఆపలుకులువిని రాణి భిల్లునకు మరణదండన విధించెను. తరువాత శామాజీని గని "నీవు మొదట మహాజ్ఞాతియగు శామాజీవేమో యనుకొంటిని. అతఁడు మృతినొందినాడఁట. నీ నిజనామము నీయునికి నీ నీచజన్మము నాకుఁ దెలిసినవి. నీకును మరణదండన విధించినానుపో', యని యానతీయఁ దనసుందరకాయము నేలఁగూల వాఁడు మూర్ఛిల్లి, అయ్యో బిచ్చమెత్తుకొని బ్రతుకకుండ దౌలతరావు నాకొంపఁ దీసినాఁడు. ఎనుబదియేండ్లదిమాయమ్మ జీవించియున్నది. చచ్చి చచ్చి నేనెక్కడను బ్రతికినాను. క్షమింపు తల్లీ' యని ప్రార్థించి యాతఁడేడ్చెను. కాని యామె వాని క్షమింపదయ్యె. నెమిలి యీకెలఁదగుల్చుకొని నెమిలినని చెప్పుకొను మాలకాకివలె శామాజీయను పేరుబెట్టుకొని రాణికి సన్నిహితజ్ఞాతినని స్వల్పకాలము మహారాజభోగ మనుభవించి దౌలతరావుచేతిలోని కీలుబొమ్మయై దేశద్రోహకుఁ గారణుఁడైన మహారాజుగారును మన్నెసుల్తానుగారు గండాభిల్లును నేకకాలముననే యురి దీయఁబడుటకుఁ జెట్లకుఁ గట్టఁబడిరి. పాపము దుండిరావున కెంతకష్టమువచ్చినది? దుండిరావును గండాభిల్లును నేక

కాలముననే యురిదీయఁబడిరి. వామనభట్టును క్షమియించిరాణివానిని రెండు సంవత్సరములు చెరసాలనుంచెను. వికలాంగుఁడైన కృష్ణపంతునకుఁ బనిసేయనక్కఱలేకయే నెలకునేఁబదిరూకలు జీవితమేర్పఱచెను. కమల తమ్ముఁడగు బాజీరావునకు నెలకు ముప్పదిరూకలు జీవిత మేర్పఱచి యొక యుద్యోగ మొసఁగెను. తరువాత వెనుకటియుద్ధములలో విశ్వాసవంతులగు వారికి బహుమానములు బిరుదులు నొసంగుచు శ్యామసుందరునకు గోత్వాలుపని యొసంగెను. తరువాత వివాహములుసేయ నిశ్చయించి దత్తును గమలయు సమానశాఖలోఁ జేరిన శూద్రులేయని తెలిసి శుభముహూర్తమున వారిరువురకును ముక్తకును ప్రతిజ్ఞాసముద్రమును ధైర్యమను తెప్పచేసిఁదిన జస్వంతరావునకు వివాహముచేసెను. శ్యామసుందరదత్తామన్మథసామ్రాజ్యలక్ష్మిని నాఁటికినేఁడు కన్నులకఱవుదీఱ వీక్షించునపుడును శరీరము శరీరముతోఁదాకి నిలుచునపుడును వానికంటెనామెయు నామెకంటె నతఁడును ననుభవించిన యానందమును మన్మథవ్యాపార పారీణులును నిండుజవ్వనముననుండి ప్రథమసంయోగము గలవారును నూహించుకొందురుగాక! అట్లు వివాహితులై కమలాశ్యామసుందరులు మహానందముతోఁ జిరకాలము సకల సౌఖ్యములు ననుభవించిరి.

సమాప్తము.

420(a)

సౌందర్యతిలకం

420 (b)

427

సౌందర్యతిలక.

మొదటి ప్రకరణము.

“భగవంతుఁడగు నారాయణుఁడు మనుష్యరూపము ధరించి ప్రత్యక్షముగ ద్వారకానగరమునందుండి జగముల నేలుచుండఁగనే, నావంటి వృద్ధుల కింతపాటును మనుష్యుల కింతచేటును గల్గుచున్నదిగదా! ముందు రాఁగల యుగముయొక్క ధర్మములు మందుఁడనగు నాకే కనులకుఁ గట్టిన ట్లైనటుఁ గనఁబడుచుండ వేదవ్యాసునంతటి మహాత్మునకుఁ గనఁబడకుండునా? నేఁ డుదయమునుండి నే నెవ్వరియింటికిఁ జనినను నాకు నొక కబళమన్న మయినను దొరకదయ్యె. ఇదియేమి యాఁకలియొకాని కడుపులోనున్న ప్రేవులను, మాంసమునుగూడ హరించుచున్నది. ఈముసలితనమునకుఁ దోడై నాయాఁకలి నన్ను బెట్టు తిప్పలు చెప్పకొందమన్న నాలకించువారెవ్వరు నీగిరివ్రజపురమునఁ గానరారు. అయ్యో! కొడుకా! నీవెంత చేసితివి! కొడుకులనందఱి దిగమ్రింగి సంపూర్ణమయిన యాయువుతో నేనింక నెన్ని సంవత్సరములు జీవింతునోకద. దైవమా! కనులు గానక చెవులు, వినరాక ప్రజలఁ బీడించుచు, దినమంతయుఁ బంచపంచకుఁ దిరిగి పట్టెడోగిరమునయినఁ దెచ్చుకొనఁజాలక హేయమయిన జీవనముఁ జేయుచున్న నాకు బూర్ణాయువొసంగి ప్రజ్ఞావంతులను, సకలైశ్వర్యసంపన్నులను, శ్రీయఃకాములను నేదమో వంకఁ బెట్టి తెప్పవేయునంతలో నంతమొందించెదు. నీకార్యవైపరీత్యములకెవరుఁ గారణము జెప్పనున్నారు! హా విధీ! నామీఁద నీకింత నిందాను ప్రేమమేల? నాకు నేనే భారముగనుండ

నీభూమికి నీనగరమునకు నిండలి ప్రజలకు భారమని తోఁచుట యొ
క యాశ్చర్యముకాదు. ఎంతలేసి సంకటములు నాకు సంభవించియు,
మంచు విరియునట్లు చులకనగ నెగిరిపోవును. భగవంతుఁడా! నానిమి
త్తము నీవెన్ని క్రొత్తక్రొత్త దుఃఖములు నిలువచేసియున్నావో యన్ని
యు నొక్కసారిగ నాపై దండెత్తఁ బంపి నన్ను నీకడకుఁ గొనిపోవఁ
గటాక్షింపుము. అహాహా! ఇంతపొడవును నిడివియుఁ గలిగి సకలైశ్వ
ర్యములతో విలసిల్లు నీనగరమేమి! కుబేరునైనఁ దిరస్కరించు నీవణి
క్సంఘమేమి! కైలాసపర్వతమువలెఁ గ్రొత్తగా నలఁదిన సున్నముతో
నలరారు నీమేడలేమి! నాకుఁ గూడుదొరకకుండుటయేమి. నేనెచ్చటి
కిఁబోయిన నచ్చట లేదు పొమ్మనువారును, నీకొఱ కెవ్వ రాయత్తము
చేసి యుంచినారనువారును, నీ యఱవకు మనువారును జెయి యూర
కొనలేదనువారును లోనికి రావలదనువారును గఱ్ఱఁదీసికొని కొట్టవచ్చు
వారును దిట్టువారునే కాని యీముసలిదయ్యమునకుఁ బిడికెఁడు బియ్య
మో పట్టెఁడన్నమో గుక్కెఁడునీరో యాదరించి యొసఁగినవారు లే
రయిరి. నేయియుఁ బెరుగుఁ గమ్మని కూరలు బిండివంటలుఁ బొట్టలు
విచ్చునట్లుమెక్కి పొద్దువోక సొగటాలో, కల్లజూదమో యాడుచు నె
కరిని మించున ట్లొకరు పందెమునకుఁ బయిపందె మిడుచు నన్నుజూచి
జాలిపడుటకు మాఱు వికవికనవ్వి, వీఁడుముచ్చ పీని కాఁకలి యెక్క
డిది. వెడల నడువుండని సేవకులకానతిచ్చుపడుచువాండ్ర నాలుకలు
నాలుకలో యినుపతునకలో నే నెఱుంగను. మద్యపానమునకును గాం
తాప్రసన్నతకును బ్రణయద్యూతమునకును నీ ప్రభువు లొకనాఁడు
వ్యయముఁజేయు ధనము నాకు రెండేండ్లు బ్రతుకఁజాలు నర్థముగదా.
అహాహా! అప్పుడప్పుడే వార్చిన వెచ్చవెచ్చని గంజిలో రవంత యుప్పుఁ
గూడ వైచి పుల్లని యూరుగాయి నంజుకొనుచు నాకలిదీఱ నారగిం
చి నేఁటికి మూఁడుదినములయినది. అయ్యో! ఆఁకలి, ఆఁకలి, దాహము.

ఓరోరి పాపాత్ములారా! ఓరోరి పౌరులారా! నాకడుపు కాలుచున్నది. ఏసత్రములకుఁ జనినను బోతరించియున్న బ్రాహ్మణుల నాదరించువారేకాని నాదెసఁ జూచువారు లేరేమి? మీరందఱుఁ గటికవాండ్రవలెఁ గనఁబడుచున్నారు. ఇండ్లదగ్గఱఁ గావలియుండు సేవకులు యజమానుల సెలవగుటతోడనే కనికరము దొలఁగి తాతిమెట్లమీఁదనుండి దొర్లునట్లు నన్ను మెడఁబట్టి గెంటుటకు సాహసించిరి. ఆసమయమునఁ దగిలినదెబ్బలు నన్నింకను బాధించుచున్నవి. అయ్యో! అన్నమన్నము. నాతండ్రులారా! ఇంక నిలువఁజాల" నని యఱచుచు నొకముసలివాఁడు వాడలంబడి తిరుగుచు గిరివ్రజపురజనుల యాచించుచుండెను. అతఁడు శతవృద్ధగుట జీర్ణమయిన కాయము గలవాఁడు. శరీర మెంత జీర్ణమైయుండెనో యతఁడు దాల్చిన వలువయు నంతియ జీర్ణమై పలుచిరుఁగులు గలదై కడు మాసి దగ్గఱనుండు పౌరుల కతనిపైఁగల సహజమగు నసూయను ద్విగుణము సేయుచుండెను. వివర్ణమై మోమంతయుఁ బెక్కు ముడుతలతో నిండియుండెను. అవయవపటుత్వము తప్పియో, యెల్లప్పు డన్నమన్నమని యఱచుచుండుటనో వానినోరు నిరంతరముఁ దెఱచుకొని యుండుటయు రెండు సెలవులనుండియు లాలాజలము లాఁపిననాఁగక స్రవించుటయు కనుబొమ్మలమీఁది వెండ్రుకలు సయితము నరయుటయుఁ దమ పాటవము సడలినందుకుఁ గన్నులు విలపించుచున్నవో యనునట్లు వానినుండి దుర్జలము దొరఁగుటయు, మొగమునకు విపరీతమైన భయంకరరూపము గల్గుటయు, నాయా కారున కాయా లక్షణము లనురూపములగునట్లు ముసలికారునకుఁ దగునట్లు వచ్చి యీతని నాశ్రయించెను. పూరింపఁబడిన గాలి యంతయుఁ బోయినవెనుక మెత్తనై యణఁగియుండు చర్మభస్త్రివలె వానిదేహము శల్యావశిష్టమై వ్రేలాడుచు రక్తమాంసక్షయమును వెల్లడిసేయుచుండెను. బహుసంవత్సరముల భారము

వహించుటచేఁ గ్రుంగెనోయనునట్లు వానినడుము నేలఁ దాఁకునట్లు వంగియుండెను. కనులకుఁ జూపులేదు. చెవులకుఁ జక్కని వినికి లేదు. దంతములు మొదలంట నూడుటచే నాతని బోసినోటనుండి వెడలుమాట యొకపట్టున విస్పష్టముగఁ దెలియుచుండుట లేదు. దేహబలముతో నర్థబలమును, నర్థబలముతో బంధుబలమును దానితో మనోబలమును క్షయము నొందుటయు, విసుగు చిరాకు మొదలగు ముసలి చిన్నెలు వొడసూపుటయు, గిరివ్రజ నివాసులు కాంచి యతని నాదరింపరైరి. పైనుదహరింపఁబడిన తెఱఁగున నాదినమున నీ ముసలివాఁడు వీథులంబడి యఱచుచుండ నత్యంతవినోదముగ నుండి కాఁబోలును గొందఱు బాలురా నిఱుపేదవెంబడిం బడి చేతినుండి యూఁతకోల దిగలాగుచుఁ దిరిపమెత్తుకొను పాత్ర నూడఁబెఱుకుచు ఱాల రువ్వుచు నింక బహువిధముల విసిగింపఁజొచ్చిరి. మితిమీఱి ఱవులుచున్న క్షుదానలంబునకుఁ గ్రుధానలంబు తోడయినతఱి వానియవస్థ యెట్లుండునో వర్ణింప నేరితరము? జరాభారమును నీరసత్వమును, బాధించు బాలకులను శిక్షలేనివారిగా నొనర్చినను దననోటిలో నేమో గొణుఁగుకొనుటయు నోపిక యున్నప్పుడు స్పష్టముగాఁ దిట్టుటయు మాత్రమతఁడు మానఁడయ్యెను. కందిరీఁగలపోటున కోర్వలేక యటు నిటు విదుర్చుకొను ముసలియాలబోతు బలె నతఁడు కొందఱు నవ్వులఁ గసరికొట్టుచుండ నొకఁడు మెల్లమెల్లవచ్చి వాని చెవిలో ఢామ్మని పెద్దపెట్టున గొంతు వేసెను. వృద్ధుఁ డదియేమోయని యడలి బెదరిబెదగి చూచుచునుండఁ జేతనున్న దండము లాగుకొని యొక పలుగాకి వాని నిరాధారుని జేయ వాఁడును వడవడ వడఁకుచు నేలంబడి బికిరపుటన్నమున్న పాత్రముఁ బగులఁగొట్టుకొనెను. అంతలో నొకరథముచప్పు డప్పుడు చెవిఁబడుటయు వారు పెఱిగిన హారములోని ముత్యములవలె యథాయథలై నలుదెసలకుఁ బరుగత్తిరి. వెంటనే సేవకు లిరువురు ముందు పరుగులిడుచువచ్చి బాట

నడుచు జనుల నొత్తిగించుచు, "లెండు. తప్పుకొనుఁడు. ప్రధానమంత్రియగు పుష్పకేతుని కొమరుఁడు వజ్రదంతుఁ డరదము నెక్కి ప్రియురాలితోఁ గూడ మధుసాగరమను నుద్యానవనమున కరుగుచున్నాఁడు. దారి యొసఁగుఁడీ" యని యఱచుచు జారినయాత్రికులకుఁ దడవువాని భిన్నమగు భిక్షాపాత్రమునకు వగచువానిఁ గుఱ్ఱలనునిందించువానిఁ దనయవస్థకు రోదనము సేయువాని, ముసలివానిఁ దొలఁగుమని చెప్పిరి. కాని వానిగోడవలో వాఁడుండి వీరిమాటఁ జెవి నిడఁడయ్యె. సేవకులాబలహీనుని బలిమిచే నీవలకు లాగఁ బ్రయత్నింపుచుండ నింతలో నరదము సమీపించెను. ఏమియుఁ జేయునది లేక భటులు తొలఁగిరి. అధికారగర్వముచేఁ బోతరించి రథముతోలు సూతుఁడు కనులఁ గానకయో దయారసము లేకయో, నిలుపక రథముఁ దోలెను. నిమిష నిమిషము దొర్లుచు నిరుసుపైఁ దిరుగు నిలువనిచక్రములతోడను నానావర్ణములఁ గనులు మిఱుమిట్లు గొలుపు కాంతులతోడను జంగుచంగున నిరాఘాటముగఁ బఱుగువారు ధవళాశ్వంబులతోడను, వెలయు నారథంబు ముసలియనదయెడమకాలిపై నుండి పోయె. సూతుఁ డెట్టి యవినీతుఁడో కాని మునుముం దావృద్ధునిఁ దాఁ గనుంగొనకున్నను, వానికాలిపై నరదము పోవుటఁ దెలిసినంతటనైనఁ దాను జాలిపడఁడు. రథము నిలుపఁడు. యజమానున కావార్త విన్నవింపఁడు. యజమానుఁడు స్వయముగా నేల వారింపఁడందురో యాతఁడును మద్యపానమత్తుఁడై ప్రియురాలిపై నానుకొని ప్రపంచ మెఱుఁగక పొరలుచుండెను. ఇట్లు సారథి కనుమూయునంతలో నెంతయు దవ్వునకు రథము తోలుకొనిపోవుటయు నీయనాథుఁడు కెవ్వున నఱచి నేల మూర్ఛిల్లెను. అతని యొడలనున్న నాలుగు నెత్తురుచుక్కలు నాఁ డచ్చట నేలఁబడి రాజమార్గంబున నరుగు ప్రజకుఁ గనికరంబు గలిగించె. ఈవినోదంబు సందర్శింప జనంబులు తండోపతండంబులుగ వచ్చి యాతనిచుట్టుఁ

జేరి యీపాపి యింతకాల మేల జీవింపవలయుననియు, దైవము నిందా ర్హుఁ డనియు సూతుఁడు శిక్షార్హుఁడనియు, వజ్రదంతుఁడు కడుఁ బోగ రుబోతనియు, నేలిక కీది యెఱిఁగించినఁ దప్పక యతఁడు రథికసారథుల దండించుననియుఁ బలుకుచుఁ గాలముబుచ్చువారేకాని కాలోచితమగు చికిత్సఁ జేయనెవ్వరు సాహసింపరైరి.

రెండవ ప్రకరణము.

“రోహణకా! ఎంతసేపు నీయంగడిమీఁదఁ గూర్చుండుదువు? ప్రొద్దు వ్రాలినది. నేవచ్చి చాలతడవయినది. నాప్రియసఖి యేమని యలుకఁ బూనునో? నాకన్న నేడువెనుక లాలస్యముగ వచ్చిన ము వ్వుర నంపితివి. బేరగాండ్ర నందఱ వెంటవెంటనే పంపి నాపట్టున నిట్లాలస్యముఁ జేసెదవేమి? ఇప్పుడేకాదు. నీ వేమిచేతనోకాని నేనె ప్పుడు నీయంగడికి బేరమునకు వచ్చినను జాలసేపు నన్నిందు నిలుపక యనుపవుగదా” అని చిఱునగవు మొగము నలంకరింపఁ దలవంచి ప లుకు నాగవల్లిఁ గనుఁగొని, “బాలా నీకడ నాకుఁగల చనువుచే నిన్న గొంతతడవాఁపి క్రొత్తగావచ్చిన బేరగాండ్రవలియంగళ్ళకుఁ బోవ కుండ ముందు వారి నంపితిని. నిరంతరమును మీ యంతిపురమున నే యున్న మాయంగడి పావనంబగుట యెన్నఁడు? ఇంచుకసేపు మా యంగడిపై నుండి నీదు వాలుగంటిచూపులు మాపై, మాపూవులపై, మాయంగడిపైఁ బ్రసరింపఁజేయరాదా?” అని పూలవర్తకుఁడగు రోహణకుఁ డాపకుచును హెచ్చరించుటయు నామె కినుకతో, “నీపలు కుల కేమి? దండలనిమ్ము. ఈయువేని వేఱొక వర్తకునియొద్దఁ గొనఁ బోయెదనుజూమా!” అని బెదరించుటకు రెండడుగు లిడియె. రోహణ కుఁ డామెచిత్త మెఱిఁగియు రా రమ్మని పిలిచి యిట్లనియె. “ఇవె జాజి

పూవుల దండలు. ఇట్టి వీ మగధలో నెందును దలకిందుగఁ దపముఁ జేసినను నీవు తేఁజాలవు. ఇవి కమ్మసంపఁగిపూలచెండ్లు. రసికురాలవగు నీకు నేను వీని యుపయోగమును జెప్పనక్కఱలేదు. ప్రణయకలహములుగల క్రొత్త దంపతు లొకరినొకరు మోదుకొను నాయుధములుగా నుండునట్లు వీనిఁ జేయించితిని. ఇట్టివి వేయివరా లిచ్చియు నీవు సంపాదింపనేరవు. ఇవె మల్లెపూవులయంగీలు. ఇవి తప్పక మీచెలివద్ద నుండఁదగినవి. నాణెముఁజూచి వెల యడుగుము. మీనిమిత్తమే వీనిఁ జేయించితిని." అని సోత్కర్షముగఁ బల్కుచున్న యవ్వణిజుని గాంచి నాగవల్లి, "నీసొమ్ము నీవుపొగడుకొనుట సహజము. తనవస్తువులు చక్కఁగ లేవను వెంగలి వర్తకుఁ డే నెన్నఁడు నెఱుఁగ. దానికేమి. ఒక దండయు, నొకచెండును, నొకయంగియు, నిమ్ము. వాని నింటికిఁ గొని పోయి మా యమ్మకుఁ జూపి కావలయువాని వలయు వెల యిచ్చి తీసెద. అక్కఱలేనివాని మరలఁ దీసికొనవలయుఁజుమీ; అయినను వెల ముందుగా నిచ్చెద. ఇదిగో మూఁడుమాడలు తీసికొమ్ము" అని వానిపై నాణెములవైచి యాసరులు చేతఁబట్టుకొని నిజగృహమువై పరుగుచుండెను. అంతలో రోహణకున కెద్దియో మాట జ్ఞప్తికి రాన తఁడు, "నాగవల్లీ! నాగవల్లీ!" యని పిలువ నాబాలికయు విసుగుకొనుచు వెనుకకువచ్చి, "మాటిమాటికి నిటు లాటంకములు కల్పించుచుందువు. నాతో నిపుడేరాజకార్యము మించిపోవుచున్నది" అని యించుక యలిగి నిలుచుండ రోహణకుఁడు మందహాసముతో, "సుందరీ! పూలచెండొకటేదలఁచి మఱొకటిచ్చితిని. ఇదె గుబుగుమతావుల నెల్లదెసలకుఁ బర్వఁజేయుచున్న యీ సంపఁగిచెండు చూడుము. దీని గర్భమున నొక దివ్యకుసుమం బమర్పఁబడియున్నది. దాని నొక సిద్ధుఁ డొసఁగుచు నందలి తావుల నాఘ్రాణించు స్త్రీ పురుషులకు మనోరథములు కరతలామలకములని యానతిచ్చెను. అందుచే బ్రత్యేకముగ

మీ నిమిత్తమయి దీనిఁ గట్టించితిని." అని కాంచనకందుకమువలె కాంతుల వెదజల్లు నొక పూలచెం డొసంగిన దానిఁ గైకొని మునుప టిదాని నా రోహణకునకుఁ గ్రిమ్మఱ నొసఁగి వెడలుచుండ బేరమునకు వచ్చి నిలువఁబడిన యొకవృద్ధాంగనయు నామెకన్న నించుక చిన్నయ గు నొక పురుషుఁడును బ్రసంగవశమున నుజ్జయినిమాట యెత్తినఁ ద నకానుదుప్ర రుచించుటచే నాగవల్లి యించుక తాళి తానేమియు నె ఱుఁగని దాని తెఱఁగున వారి పరస్పర సంభాషణముల నాలకింపఁ దొ డఁగెను.

పురు—అవును. ఈనడుమ నే నిచటఁలేను. ఉజ్జయినికిఁ జని నాఁడను.

స్త్రీ—వృద్ధుఁడయిన విక్రమసింహ మహారాజు కుశలముగ నున్నాఁడా?

పురు—ఆఁ, పరలోకమున.

స్త్రీ—పాపము, అతఁడు లోకాంతరమునకరిగెనా! కుమారున కుఁబట్టాభిషేకమహోత్సవమయినదా? అందుల కాటంక మేముండును?

పు—అంతయు నాటంకమే! పితృవియోగముచే ఖిన్నుఁడయిన యాతని శోకమును వాస తల్లి పాండురాజమరణానంతరమున మాద్రి యట్లు చేసినట్లె తనపాతివ్రత్యముఁ జూపి ద్విగుణముఁ గావించెను—తల్లిదండ్రు లి ట్లేకకాలముననే మృతినొందుటచే దుస్సహమైన దుఃఖవా ర్ధిఁ దాఁటలేక చిన్నరాజు రాజ్యసన్న్యాసముఁ గైకొని హిమాచలము న కరిగి తపమాచరింప నిశ్చయించుకొనెనని ప్రజలు చెప్పుకొను చున్నారు.

స్త్రీ—అట్లయిన నింక నేల సన్న్యసింపలేదు?

పురు—ఈనడుమ సింధురాజు తనదేశముపై దండు వెడలున నియుఁ గౌరవులు వానికి సహాయము వత్తురనియు విని తానీ సమయ

మున సన్యసించినఁ గౌరవులకు వెఱచి యట్లు చేసెనని లోకు లపనింద మోపుదురని జంకి యీ దండయాత్రయే మోఁచూఁచిన వెనుక తన సంకల్పము నెఱవేర్పఁ దలఁచుకొన్నవాఁడు.

స్త్రీ—ఇది మనయూరిలోఁ గొందఱు ప్రజలకు సంతాప హేతువే.

అని పూలదండలఁ దీసికొని యిరువురు ముచ్చటించుకొనుచుఁ బోయిరి. నాగవల్లి వారిసంభాషణలో నొక్కొక్క శబ్దము వినఁబడుచున్నకొలఁది నామె మొగముతేటలో నొక్కొక్కవన్నె తఱుగఁ జొచ్చెను.

ఆపలుకు లామెపాలికి మంత్రాక్షరములుకా నాయొయ్యారి మాంత్రికుని చేతనాడు పామువలె కదలఁజాలక నిల్చి వారి ప్రసంగము ముగియుననంతరము వారిచేఁ జూడఁబడకుండ వెనువెంటఁ జని యా యిరువురయిండ్లుఁజూచి గుఱుతెఱిఁగి మన్మథునిచేతి యమ్ములవలె నలరుచున్న యలరుదండలతో సందిగ్ధమగు మనసుతో, విచారాతిశయముచే మందమైన నడకతో గృహమువైపు రాఁదొడఁగె. అట్లు కొంతతడవు తత్ప్రసంగాయత్తమగు చిత్తముతో నడచి, యొకచోట రాజమార్గమున వలయాకారముగఁ బలువురు పౌరులు మూఁగియుండ నాగుంపునడుమనున్న వింతఁ దానును నేత్రోత్సవముగ విలోకింపఁ దలఁచి దండలు నలుగకుండఁ జేయి పైకెత్తి యామనుజులనడుమకువచ్చి నిల్చెను. ఇట్లు నిల్చి కట్టెదుట బడుగుమేనితో నొక పీనుఁగుచాడ్పునఁ బడియున్న యా వృద్ధునికాలినుండి తొరఁగు రక్తముఁజూచి, మేను గగుర్పొడువ నటుచూడఁజాలక యించుక యావలిప్రక్కకు మోముఁ ద్రిప్పి లోనుండి తనంతఁ బట్టరాని వేగముతో బయలువెడలు జాలికి వగపునకు లోనై యామె యిట్టు విచారించెను. "కటకటా పట్టెడన్న మడుగుకొని పొట్టబోసికొను నీముదిబిచ్చగానికి దైవ మీ

యాపత్తుఁగూడఁ గల్పింపఁజనునా? ఇట్టి నిరుపేద కాపత్కాలమున నుపచరించిన నాపుట్టువు సార్థకమవునుగదా! కావున నాయోపినకొలఁ ది వీనికి సాయమిాయఁ బూనుకొనియెదను” అని కుడిచేతి దండల నె డమచేతఁ బుచ్చుకొని యెల్లరు తెప్పవాల్పక చూచుచుండ నాజీవచ్ఛవ మును సమీపించి నాసికాపుటములకడ వ్రేళులుంచి కొనయూపిరితో నాతఁడుండుటెఱిఁగి పరుగుపరుగునఁ బొరుగింటికిఁ జని గుక్కెఁడు గం జియుఁ గొంచెము శీతలోదకమును దెచ్చి నీటమొగముఁ దుడిచి బలి మిచే నోరు తెఱచునట్లు చేసి యందు గంజిఁ బోసి కడుపుపైఁ జేతి తో నిమురసాగెను. వాఁ డందుఁగొంత చప్పరించి త్రావి మిగిలినదా ని నుమిసి యించుక సేదదేరి యంధుఁడగుటఁ దనకుపచారమొనర్చు బా లికను దన్ను మున్ను సిలుగులఁబెట్టిన పలుగాకి పడుచులలో నొకరితగ భావించి, చేరుకొన్న సత్తువతో నల్లనల్లనఁ గఱ్ఱయెత్తి యోపికకొలఁది నాగవల్లిని దానితో మోఁదెను. అప్పటికిఁ గొన్నిదినములకిందట నా మె కౌముదీమహోత్సవమునకు మనసుపడి తొడిగించుకొనిన వింతగాజు లాదండపరిహారమునకుఁ బొడిగాఁ జిటిలెను. తోడనే వేడుకఁజూడవ చ్చిన జనులు ముక్కున వ్రేలువైచుకొని యక్కజపడి యుపకారమున కుఁ బోవ నపకార మెదురువచ్చెనను మాట యనృతముకాదు. ఇతఁ డెన్ని కానిపనులు చేయుటచే నిట్టి దుర్దశ సంప్రాప్తమయ్యెనో. బా లా! యీ దోసకారికి నీవు పోసిన గంజి విషమై తలకెక్కినది. చచ్చి నఁ జచ్చు. నీవీవలికి రమ్ము. వీనితోనేల” అని మందలించిరి. ప్రా ణతుల్యముగఁ జూచుకొనుచున్న తనదినుసుగాజులు పగిలెననియైనఁ గోపింపక చివురుటాకువంటిమేను గఱ్ఱతాకునఁ గందెననియైన వగవక వారిమాటలు సరకుసేయక వారితో, “మీపలుకులు చాలింపుఁడు. వీనికాలినుండి నేలఁగాఱు రక్తబిందువులతోడ నాకన్నులనుండి వేఁడికన్నీ టిచుక్కలు గాఱుచున్నయవి. ఇంతసేపటినుండి యీతీరుననిలఁడు గా

సిపడుచుండఁ జూచుచు నూరకుండుటకు మీమనసు లెట్లొప్పెను?
మీఁదుమిక్కిలి సాయముచేయు నన్ను వెనుకకు దిగలాగెదరేల? మీ
రెఱుఁగుదురేని వైద్యుని యిల్లు నాకుఁ జూపుఁడు. లేకున్న నరుగుఁ
డు" అని తన నెమ్మొగమునఁ గెంపుగదుర వారిఁగసర నందొకఁ డా
మెను మెచ్చి, "అమ్మా! ఈమూఁడుకాళ్ళముసలి భూషించిననేమి
దూషించిననేమి నీయుద్యమము సంస్తవనీయము. రాజుగారి యుద్యా
నవనమగు పుష్పకరండము సమీపమున ధావకుఁడను మంగలి వ్రణ
వైద్యమునఁ బేరుమోసినవాఁ డొకఁడు గలఁడు. అతనికడకుఁ దీసికొ
నిపొమ్ము" అని పలికి తనదారిం జనియెను. నాగవల్లియు ముసలివాని
పాలి తల్లియై యొకబండిఁ దెప్పించి, యిరువురు మనుజుల సాయమున
నం దెక్కించి, దాని ధావకునిగృహమునకుఁ దోలించుకొనిపోయి, గా
య మావైద్యునకుఁ జూప నతఁడు రెండుమాడ లిచ్చినఁగాని మందిడ
ననియె. అనుడు నావఱకుఁ దనహస్తము నలంకరించుచున్న విరిసరము
లఁ త్రోవంబోవు నొక వన్నెకానికి మూఁడుమాడలకు విక్రయించి, వై
ద్యునకును, బండివానికిని వలయుపైక మొసంగి, ధావకుని యింట నా
రోగినిఁ బుండు మానుదనుక నుంపఁదలఁచి, యాతని భోజనమునకు మ
ఱినాలుగు మాడల నీయనొప్పుకొని యామొత్తము తనకడలేమి తన
ముద్దుటుంగర మాతనివద్దఁ గుదువపెట్టెను. ధావకుఁడు వ్రణపట్టిక వై
చిన వెనుకఁ దన్నక్కడకుఁ గొనితెచ్చినందులకు నోటికివచ్చినట్లు లెల్లఁ
దిట్టుచున్న మతిమాలిన యాముసలి నందువిడిచి జాగరూకతతో చికి
త్స జేయవలయునని ధావకునితోఁ బలుమాఱు నొక్కిచెప్పి కన్నబిడ్డ
నెడఁబాయు తల్లివలెఁ దద్గృహ మామె నిర్గమించి స్వస్థానముఁ జేరెను.

మూఁడవ ప్రకరణము.

జయసేనుఁడు విజయసేనునకుఁ గడుఁ గూర్చెడు తనయుఁడు. విజయసేనుఁడు మగధరాజు సేనలలోఁ గొన్నిఁటి కధికారియై, రాజున కత్యంతము హితుఁడై ప్రసిద్ధి వడసిన క్షత్రియవంశ భూషణుఁడు. జయసేనుఁడు తల్లిదండ్రులకుఁ జిరకాలమున కుదయించిన నోములపంట యగుట నెంతయు గారామునఁ బెరిగి చిన్ననాట హస్తిపురమున ద్రోణాచార్యునియొద్ద విలువిద్దె నేరిచి, వేదములు వేదాంగములు కాశికా నగరమున భ్రమరేశ్వరుండను నొక సన్యాసియొద్ద నభ్యసించి తండ్రి యనుమతిఁ బెండ్లియాడఁదలఁచి చక్కఁదనంబున రతీదేవియు గుణముల దేవియు నగు తారామతిని బాణిగ్రహణము చేసికొనెను. ఆదంపతుల మోహలత పూచిన పూవుచందమున వారికి, నిరుపమానమయిన తెగువయు సోయగమునుం గల రాజసేనుఁడనుకొడుకు కల్లారుముద్దుగా నుదయించి, వృద్ధులగు నవ్వకుం దాతకుఁ బ్రొద్దులుపుచ్చు ముద్దులబొమ్మయై వర్ధిల్లుచుండెను. తండ్రి కొలుచుచున్న రాజు లక్ష్మీకటాక్ష సంపన్నుఁడయ్యు, గుణసంపన్నుఁడుకామి యెఱిఁగి జయసేనుఁ డాతని సేవింపఁదగదని యూరకుండెను. అయినను లావును వెరవును గల యీరాచపట్టి మగఁటిమి రాజెఱిఁగి యప్పటికిఁ గొన్నిదినములక్రిందట శ్రీకృష్ణునితో జరిగిన మహాయుద్ధమునఁ దనకుఁ దోడురమ్మని జయసేనుని బిలిచెను. మనసులోఁ దన కిట్టికార్య మిష్టము గాకున్నను, దనతండ్రి కాగ్రహముపుట్టునను భయముతో నాకయ్యమునకుం బోయి యాదవులెల్లఁ జెల్లాచెదరై పఱచునట్లు చేసి తన స్వామియగు జరాసంధునకు విజయముఁ గల్పించి వాసుదేవునిఁ బరాజయము నొందించెను. సకలసద్గుణరాశియని జయసేను నందఱుఁ బొగడుచుండినను, రాజును,

రాజుంబట్టి తండ్రియు, దండ్రింబట్టి తదనుచరులును, గొన్నిసమయములయందు, "మనజయసేనుఁడు సర్వవిధముల యోగ్యుఁడేకాని, వానికి వాసుదేవుపై భక్తిమెండు. అతని హృదయమునుండి యావెఱ్ఱితనమును బాఱదోలవలయుఁసుడీ" యని తలంచుచుందురు.

ఒకనాఁడు జయసేనుని కుమారుఁడు రాజసేనుఁడు, సంజవేళఁ గార్యాంతరముమీఁదఁ దన మిత్రునిఁ గనఁబోవుచున్న తండ్రితోఁ బోవఁ బయనమై, యాతఁడు రా వలదని కసరఁ జిన్నమొగము చేసికొని పోరుపెట్టి వెక్కివెక్కి యేడువసాగెను. తండ్రిపోయినదిక్కు మొగముఁ ద్రిప్పి బాలకుఁడు తన్నెంద ఱూఱడించినను నూఱడక చేతికిచ్చినబొమ్మల దూరమ్మునఁ బాఱవైచి, యోదార్పవచ్చిన తల్లిచంకను నిలువక, యెవ్వరియొద్దకును బోవక మువ్వలందెలరాపిడి నేలయొరయునట్లు కాలు నేలరాయుచుఁ గన్నుల నీరు నించుచు గుక్కపెట్టి యేడ్చుచుండెను. ఇంతలో నెటనుండియో వచ్చిన దాసి బాలుని డాసి, చనువుపలనఁ దనవంకకుఁ జేతులుచాఁచు రాజసేను నెత్తుకొని, కన్నీగదుడిచి, చెమటలార్చి, తల్లిదండ్రులపై యప్పసిపాపఁడు తనతోఁ జెప్ప నేరముల నాలకించి, తలవాకిటికిఁబోయి, సంజకెంజాయఁజూపి, మెల్లమెల్లఁ వ్యాపించువెన్నెలలంజూపి, రాజవీథినరుగు పౌరులంజూపి, తండ్రిమాట మఱపించి, వానినూరడించి, తనవద్దనున్న యొకపూలచెండును దండయు నాడుకొమ్మని వానిముందు వైచి, క్రిందఁ గూరుచుండఁబెట్టెను. అవి కంటఁబడినతోడనే విలక్షణమైన యొకయానందము బాలునకుదయింప వడివడి నారెంటిని జెఱియొకచేతను బట్టుకొని తాళము వాయించుచుఁ, దనముందున్న దాసిపై విసరి నవ్వుచు, గొంతసేపు నోటఁ బెట్టుకొసి పంటఁ గొఱికి, యొక్కొక్కపూవు నేలరాల్చుచు, రాలినవానివంక రెప్పవాల్పక చూచుచుఁ గిలకిలనవ్వుచు, నాడిన కుసుమములఁ బట్టి పరీక్షించుచు నత్యానందకరములగు శైశవక్రీడావినోద

ములఁ దేలి తేలి యొకనిముసములో నాదండను జెండును నూడఁబెటికి పూలకుప్పచేసెను. మఱికొంతసేపున కా రాజసేనుఁడు పూలకుప్పను విఱఁజిమ్మి దానినడుమఁ గానఁబడు ముడిఁచిన తెల్లని మొగలిరేకు నొక దానిని బైటికిఁ దీసి యిదె బూచిబూచియనుచు బెదరించుచు దాసిపై వైచెను. దాసియు బాలుని చాపలమును రెట్టించు తలఁపున జడిసి నదియుఁ బోలె వెనుక వెనుకకు జఱిగి భయము నటింపుచుండఁ గుజ్జిఁ డును మరల మరల దానిపై రేకు వేయఁదొడఁగెను.

రేకు కనులఁ బడినప్పుడెల్ల దాసియందలి మహిమమేమోకాని దాసికి దానిఁగైకొనవలయునను నాసక్తి యుదయింప నది మెల్లమెల్లగఁ బిల్లని బెల్లించి దానిని సంగ్రహించుకొని దీపికవద్దకుఁ జని యందులిఖి తములగు ముత్యములవంటి యక్షరములఁ జదువుకొనుచుండెను. అం తఃపురమునుండి తారామతి బాలకుని నూరడించినందులకు దాసిని మె చ్చుకొనుచువచ్చి, దాని వీపుపైఁ బండుకొనియున్న చిన్నికొడుకు నెత్తు కొని ముద్దాడి దానిచేతి కేతకీదళమును బుచ్చుకొని చదివి యందలి యర్థముగోచరింపమి, ‹‹ నీకిట్టి యుత్తరమెక్కడిది. నీకెవ్వరువ్రాసినా రే రాజలేఖా !” అని యనుగుచు నించుక యలుకఁబూని చీటిమరల గడముట్ట లోలోపలఁ జదువుచుండెను. అంతలో మిత్రదర్శనముచే సి సఫలమనోరథుఁడై మందహాస మొనర్చుచు జయసేనుఁడు గుమ్మ ముదాఁటి లోపలఁ బ్రవేశించెను. దాసియుఁ దారామతియు దివ్వెవం కఁ దిరిగి రేకుఁ జదువుకొనుచుఁ బరాకుననుండి యాతనిం జూడరయిరి. అట్లు సందడిలోనున్న కులకాంతను దాసిని జమత్కారార్థము జడిపింప వలయునని రాచకొమరుఁడు, చిరునగవు నగుచు వెనుకనెవచ్చి రెండు చేతులతో భార్య కనులుమూసి చెప్పవలదని దాసికిఁ గనుసన్నసేయ నింతలోఁ జంకనున్న రాజసేనుఁడు చప్పటలు చఱచి యప్పప్పయని యఱచెను.

V. R. NARLA MEMORIAL LIBRARY
V.R.NARLA D.P.R.I. Acc. No.

ఆమాటలు వినఁబడుటయు దాసి వెలవెలఁబోయెను. తారామతి తెలతెలఁబోయెను. దాసి నెమ్మేను జెమర్పసాగెను. తారామతి తనులత గడగడ వడఁకఁదొడఁగెను. బాలుఁడు తనంతఁ దల్లిచంకనుండి దిగఁజారెను. తారామతి చేతనున్న కేతకీదళ మప్పు డప్రియత్నముగ నేలరాలెను. యజమానురాలు దాసివంకయు, దాసి యజమానురాలి వంకయుఁ జూడ నారంభించిరి. ఈవిలక్షణతలఁగని జయసేనుఁడు కారణ మారయఁజాలక, నివ్వెఱపడి యిరువుర మొగంబుల నవలోకించుచుండెను. కార్యము తప్పివచ్చినదని సమయోచితమగు యోచనమునేసి దాసి దీపపుఁ గ్రీనీడనిలిచి మొగలియాకును గాలితో నల్లనల్లనఁ దనవైపు లాగుకొనుచుండ బాలుఁ డదిచూచి ‘‘ఆ! అదినాది యదినాది’’ అని యఱచి యారేకుఁ గైకొనెను. తండ్రియుఁ గుమారకుని చేతినుండి చల్లగా దాని గ్రహించి చూచునప్పటి కందు ముత్తియముల కోవవలె వ్రాఁత కనఁబడియె. ఆవ్రాఁతఁ దనలోఁ దానె చదువుకొనుచుండఁ దారామతి యక్కడ నిలువక బాలునైనఁ బిలువక శయనాగారమునకుఁ జనియెను. దాసి నిలిచినది నిలిచినట్లెయుండి కాఁగల దైవకృత్యమున కెదురుచూచుచుండెను. అందు లిఖింపఁబడినమాటలలో నొక్కొక్కదానిం జదువునపు డాసూంశిఖామణి యలుకయొక్కొక్కమెట్టెక్కి యుత్తరముచదువుట పూర్తియగువఱ కాకాశమంటెను.

అనంతరము జయసేనుఁడు లేచి, రాజలేఖ నుద్దేశించి, ‘‘ఏమే దీని వృత్తాంతమేమి? దీని లిఖించినవా రెవరు? పూలదండయను నమ్మకముతో నింతకాలమును నాలోగిటదాఁచుపామును బాలువోసి పెంచుకొంటినిగదా! అని యించుకయోచించి తన్నుద్దేశించుకొని, ‘‘జయసేనుఁడా! నీవు నిర్హేతుకముగా వంచింపఁబడితివో భ్రాంతిమంతుఁడవై యపోహపడుచుంటివో యింకను నిర్ణయింపఁదగియున్నది సుమీ! కమ్మనీనములును, నీయనురాగములును శోధింప నిదేయుదను.’’

అని పలికి, తనకాళ్ళు చుట్టుకొని విడువకున్న కొడుకును విడల్చి లోనికిం జనుమని యానతిచ్చి యొక పీఠమునఁ గూరుచుండి, తల మీఁదికెత్తి చూచుచు నెడమమీసముపై నెడమచేయివైచి ద్రవ్వుచు నంతరాయములేని యోచనము సలుపఁదొడఁగెను. దాసి కొండొకసేపటికటుడాసి, రాజసేనునిఁ జంక నిడుకొని మందిరంబున కరిగి సంతాపతప్తయగు తారామతికి మగని తెగువమాటలు నతఁడున్నయునికియు విన్నవించుచుండ నాపడఁతి చెప్పరాని రోసము దన్నావేశింపఁ బానుపుపైఁ బవ్వళించి కారణములేక పతిమనమునకు సందియము గల్గి నందులకుఁ దద్దయుఁ బొక్కుచు నెద్దియు నుపాయముగానక, వెక్కసపడుచుండెను. ఈవల నీమగువ యవస్థయు నావల నామె మగని యవస్థయుఁ, గని రాజలేఖ తనకతమున నింత పుట్టెఁగదాయని చింతిల నారంభించెను. జయసేనుఁడు కేతకీదళ వృత్తాంతముఁగూర్చి దాసిని జక్కఁగా నడుగకయు, లోనికిఁజని తారామతితోఁ బ్రసంగింపకయు, నామె పూర్వచారిత్రము జ్ఞప్తికిఁ దెచ్చుకొనకయు, గాటమగు ననుమానము నెమ్మనమునఁ బూని పరితపింపఁజొచ్చెను. ఆదినమున నెద్దియో కార్యాలోచనము సేయవలసియుండుట, రాజు విజయసేనునిఁ దన కోటకుఁ బిలిపించుకొనియె. పరిజనములు జయసేనుని యవస్థఁ జూచి దేవితోడను, దేవియవస్థఁజూచి జయసేనునితోడను జెప్పఁబోయి కళవళపడఁజొచ్చిరి. అనుదినమును సంజవేళ తల్లికిఁ బాదాభివందన మాచరించు వాడుకయున్న నాఁడు దేవతాపూజయు మాతృదేవతాపూజయుఁ గూడ మఱచి జయసేనుఁడు, భోజనార్థము సేవకులు పిల్చినను జనక యొక్కమొగి వితర్క సముద్రమున మునిఁగియుండె. తల్లియుఁ గుమారునియొద్దకు వచ్చి సంతాపకారణమడిగియుఁ దెలియఁజాలక భోజనమునకు రమ్మని బ్రతిమాలి నిరుత్తరుఁ డయినకొడుకుదెస నిరాశచేసికొని లోనికిం జని మగని దాపుని వగఁగూర్చిన కోడలివలనఁ గారణమంత

కన్న నెఱుఁగలేక యీయాకస్మికమగు మార్పున కక్కజపడుచుండె ను. సతీపతులు వేడుకలవెల్లిలో మునిఁగినపుడు నిమిషములవలెజాములు పరుగులెత్తునట్లు చేసిన కాలము నేఁటిరేయి నిముసములను జాములుగాఁ జట్టుపఱిచి వారి నలయించెను. దురంతమయిన ప్రళయకాలపు రాత్రియో యిదియని జయసేనుఁడు సందేహమందుచుండ నంతలోఁ గాముకులచెవులకుఁ బిడుగుపాటై నాలవజామున కొక్కరో క్కోయని కుక్కుటములకూఁతవినవచ్చెను. అనంతరము రాజుకోటవైపు నుండి వేకువ జరుగు తూర్యాది మంగళధ్వనులును, వందిమాగధవైతాళికుల కైవారములును, దెల్లవాఱుటఁ దెలియఁజేసెను.

నాలుగవ ప్రకరణము.

మితిమీఱిన బిట్టలుకచేఁ గెంపుగదిరియున్న జయసేనుని ముఖమండలమువలె సూర్యమండలము పద్మరాగ మాణిక్యముల కాంతులు దిగంతముల వెదజల్లుచు, నుదయపర్వతముపైఁ దోఁచెను. దినాంతమునఁ దాను విడిచిపోయిన ప్రపంచమంతయుఁ బరికించుటకో యన సూర్యుఁ డుదయశైలమున నించుక మీఁదికి లేచుచుండుట జనులకగపడఁజొచ్చెను. ఒకరాజు నేలుబడిలో నెంతయు సంతసము నొందువారు పరరాజు లాక్రమించుతఱి ధాటికోర్వఁజాలక సుక్కుదురను నీతి లోకవిదితమగునట్లు చెంగలువలు మూతి ముడుచుకొనుటయుఁ, దమ్ము నేలిన స్వామి యేలుబడి వచ్చునప్పుడు ప్రజలు చెందు ప్రమోదము వర్ణింప నలవికాదని చాటునట్లు తామరపూవులు విచ్చుటయు మొదలగు చర్యలు జరుగసాగెను. పౌరులు తూరుపురేక లాకసమునఁ బొడగట్టునప్పుడు లేచి సముచిత కర్మములు దీర్చుచుండ జయసేనుఁడు చింతానిమగ్నుఁడగుటచేఁ బ్రభాతమగుటయుఁ దెలియక, కొంత

తడవు, గవాక్షములనుండి వేఁడి కిరణములు సూదులవలెఁ జుఱుకు జుఱుకున నాతని మేనుదాఁకుట తోడనే, లేచి, ప్రాభాతికకృత్యముల నిర్వర్తించుటకు లోనికిం జనియె. పోవుచు నిద్రాభారమునను, మనోవికారమునను మొగలిరేకచ్చటవిడిచి, కొన్ని యడుగులు చనినపిదప జ్ఞప్తికివచ్చి మరల రానశ్రద్ధవొడమ, నింతలో నేమగునని లోనికరిగె. పరిచారకులు యజమానసమేతముగ ,లోననున్న యాసనమయమున జయసేనునితోఁ బనియుండి యొక పురుషుఁడు ముప్పదియేండ్ల ప్రాయపువాఁడు కవాటముదాఁటి లోనఁ బ్రవేశించి జయసేనా జయసేనా యని రెండుమూఱులు పిలిచి యాతఁడు పలుకకునికియు నెవ్వరుత్తరమీయకునికియుఁ జూచి ముహూర్తమాత్ర మచ్చట నొకపీఠమునఁ గూరుచుండె.

అతఁడు మిగుల పొడవగు మేనితో మేని పొడవునకుఁ దగిన యంగపుష్టిలేక గడకఱ్ఱలాగున నుండును. మేనికాంతి పసిమికెక్కియు నేమికతముననో యుండవలసిన నవకముతో నుండదయ్యె. మొగము, బాల్యమున మిక్కిలి చక్కనిదని పలువురు వర్ణించిరికాని యతఁడు బాల్యమును విడిచి యౌవనమునఁ బ్రవేశించునపుడు మీసకట్టు రామిచే వేడిమూతి యతని లావణ్యమున నొకకళతగ్గించెను. అంతతోఁ బోవక లోనికి దించుకొనిపోయిన చిన్నకన్నులు వానిసొగసున కంతకు భంగము వాటిలఁజేయుటచే నాతనిపైఁ గిట్టని కొంటెపిల్లవాండ్రు తిలాంబకుఁడని పరిహసించుచుందురు. ఇవితక్క తక్కిన యంగసౌష్ఠవమునం దాతనికిఁ గొరంత గోరంతయు లేదు. నాఁడతఁడు తాల్చిన వలువలు విలువగలయవి. మెడలోని హారములును, ముంజేతుల కంకణములును, వ్రేళ్ళల వజ్రపు టుంగరములును, వాని సంపదను వెల్లడిజేయకపోవు. ముఖలావణ్య విహీనమయిన వానిరూపు చంద్రదర్శనము

లేక కేవల నక్షత్రకాంతిగల యాకాశమట్లు భూషణకాంతులచే నంతగాఁ బ్రకాశింపకుండెను. జరాసంధున కీపురుషునిమీఁద ప్రేమము మెండు. ఆకారణమున నీతఁడు సలుపు దుండగములకెల్ల రాజునకు వెఱచి పౌరులు సహించుచుందురు. చక్కఁదన మేటులున్నను గుణముల నీతని కీడగువా రాకాలమున నేకాకికాలమునను లేరు. అంతిపురమున నుండు పరిచారకులఁ గూర్చియు, మంత్రి, సేనాధిపతి, లోనుగాఁగల యుద్యోగులఁ గూర్చియు, సత్కుటుంబములఁ జనియించి గౌరవమునఁ గాలక్షేపముసేయు పౌరులఁ గూర్చియు, నీతఁడు రాజసన్నిధిని యధేచ్ఛముగ నోటికివచ్చినట్లెల్లఁ బలికి యేలికకు వారిపై నిగ్రహానుగ్రహములను బర్యాయముగఁ గలిగించుచుండును. ఎరిపైనైనఁ జెడువాఁడు కమొకటి పగవారివలనఁ బుట్టి పొక్కినప్పుడు, కల్ల నిజమ్ము లరయక తా నది యెఱిఁగినవాఁడపోలె రాజునకు విన్నవించి నమ్మించుచుండును. అతఁ డుపకారముసలుపునని చేనితో నొక్కని గూర్చియుఁ జెప్పి యెఱుఁగఁడుగాని, మాపినకొంపలు వేనవేలు. అతని మాటలవలనఁ జెక్కండ్రు నిరపరాధులు తమ యుసుఱులు గోల్పడుటఁబట్టి పురజనులు వాని నాలుక కెఱ్ఱలఁచనియు, మెత్తని కత్తియనియుఁ బేళ్ళువెట్టిరి. ప్రపంచమున మాయలె ముందు బయలువెడలెనో యాతఁడె ముందు జనించెనో కాలనిర్ణయముసేయుటకుఁ దగిన యాధారములు గనఁబడవు. అయినను వీని కుచ్చితములకుఁ గపటోపాయములకు, మాయలకు మెచ్చి, జరాసంధుఁడు రత్నములకు స్థానమగు సంద్రమునకు రత్నాకరశబ్దము సార్థకమగునట్లు, మాయలకుఁ బుట్టినిల్లగువానికి మాయాకరుఁడని పేరునెట్టుట యొప్పదాయని యాముద్దుపేరం బిలచుచుండెను. శ్రీకృష్ణపక్షచరులందఱు వీఁడు రాక్షసాంశమునఁ బుట్టెననుకొందురు. గిరివ్రజపురమున నెవ్వఁడేమూల నేరహస్యముఁబనిసేయు, నెవ్వఁడేయుత్తరముల నెవ్వరికి వ్రాయు, నెవ్వఁడెవ్వరితో నెట్టిపలుకులు

పలుకు, నవియెల్ల నాపూఁట నీతఁడు తెలిసికొని సత్వరమే విభునకు నివేదించుటచే నితఁడు రాజునకు మూఁడవకన్నుగానుండెను.

అతఁ డట్లానిర్మానుష్య మైనచోట రెండుగడియలు జయసేనుని నిమిత్తము ప్రతీక్షించి, కొంచెము యోచించి రెండుసారులు తొంగి చూచి యిటునటుఁ బరికించి, యెంతకు నాతఁడు రామికి విసిగి యటనుండి లేచిపోవ సమకట్టి యెట్టయెదుట, రాతిరియెల్ల జయసేనుని చేతనుంట, మొయికాఁకం గమలి, నలిగి, వాడియున్న మొగలిరేకుంగని యెత్తి యందలి యక్షరములఁ జదివి చడి చప్పుడుగాకుండ దానిఁ గత్తిరియొఱలోఁ బదిలపఱచి, యొక్క నిమేషమయిన నచ్చట నిలువక, వడివడిగ నడచుటలోఁ దనకుఁగల బలమంతయు వినియోగించి, తిరిగియైనఁజూడక, యిల్లుదాఁటెను. ఇతఁ డిలుసొచ్చుటయు, నిలువెడలుటయు, నింటివా రెవ్వరెఱుఁగరు. అంతట నాతఁడు చనిన మఱియొక గడియకు జయసేనుఁడు ప్రాతఃకాలోచితముల నిర్వర్తించుకొని యథాస్థానమునకు వచ్చి కూరుచుండి, తనకు సంతాపకారణ మగులేఖలోని కొన్ని మాటలుజ్ఞప్తికిరా మఱల దానిఁ జదువు తలఁపున రేకున కిటునటు వెదకుకొనియెను. ఎంతవెదకిన నది దొరకకపోవ నంతస్వల్పకాలములో నది యేమయియుండుననని తలపోఁతలకుఁ జొచ్చి, యిట్లనుకొనియెను.

“ నేనీస్థలము వాయునప్పటి కిక్కడ నెవ్వరులేరు. ఒరులు వచ్చినారనుటకు వీలులేదు. వచ్చిరనుకొనుము. వారు మాయుత్తరువులేక యిచ్చట వస్తువుల నేలఁగైకొనిపోవుదురు? కైకొనువారు కలరన్నను వారికది యెట్టి ప్రయోజనకారియగు? ఏమీ! యీయాశ్చర్యము. ఇది యుత్తరముకన్న నెక్కుడు వింతగానున్నది. తారామతియు, రాజలేఖయుఁ దమమీఁద నాకుఁగల యనుమానము మాన్పుకొనుటకు రేకు రూపుమాపఁ దలఁచి యిట్లు సేయవలయు. వారికన్న నన్యులకీ కేతకీదళముతో నక్కఱయున్నట్లు నామతికిఁ దోఁపదు. ఈగడియవఱ కీయు

త్తరమునకుఁ దారామతికినిఁ గల సంబంధ మస్తినాస్తివిచికిత్సాహేతువై యుండెను గాని మొగలిరేకు మాయమగుటవలన నాయనుమానము దీఱిపోయినది. ఈసాహసము తప్పక యీమెదియే యైయుండనోపు. ఇట్టి నెఱజాణయగు దాసి యింటనుండ నామె కట్టిపనులు కరతలామలకములగుట కేమియాశ్చర్యము? హా! తారామతి! ఎంతపనిచేసితివి? కలంక మెన్నఁడెఱుఁగని నీ పుట్టినయింటి గౌరవమును, నీకన్నతండ్రి పరువునైనఁ దలపోయవయితివి. ఈవల నామాట కేమిగాని పావనులలోఁ బావనుఁడగు మాతండ్రిని మావంగడమునైనఁ దలంపవైతివి. అచ్చపుఁగోలములకు రెంటికి మచ్చదెచ్చిన నీవు నామనస్సనియెడు దూదిబుంగకు రవులుచున్న కొఱవివి సుమీ? నాఁటి నీ ముఖస్తోత్రములఁ దలఁచి నేఁటి యీ కేతకీదళమునందలి వాక్యములఁ దలఁప నీకడ నింత సాహసము కలదేయని సందేహమొదవును. రాచపుట్టుకపుట్టి యిట్టిచెట్టజేసిన పడఁతికి మగఁడనై యుసుఱులు నిలుపుకొనుటకన్న యీ వాఁడివాలున నన్ను నేఁబొడుచుకొన్న నొప్పదే. గుణసౌందర్యముల నాకన్ననిన్ను వలపించిన యవ్వీరుఁ డెవ్వఁడో యెఱుఁగనైతి. స్త్రీలసాహసములు గ్రంథములలోఁ జదువుటయుఁ బెద్దలనోట వినుటయుఁ గాని యనుభవసిద్ధముగ నెఱిఁగినవారుండరు. నీవు స్త్రీ స్వభావమును నాకనుభవసిద్ధముగ నేర్పిన యొజ్జవగుట నాకు వందనీయురాలవయితివి గనుక మానసిక నమస్కారము నిండారుబత్తితో నీకు నేనొనర్చెదను. ప్రత్యక్షవందన మొనర్చుటకు నీముఖముచూచి యేను భరింపనోప. హా! మాలదైవమా! జయసేనుని బ్రతుకింత యాఱడివోవఁ జేయుదువే. ఇంకఁ బౌరుల మొగము లెత్తెఱుఁగునఁగాంతు? మాయయ్యతో నేమొగముపెట్టుకొని మాటలాడుదును? ముద్దులాఁడు రాజసేనునకు నాకు నింతటితో ఋణము దీఱెనోకో! ఏమిసేయుదు? ఎద్దియుపాయము? అయ్యో! కేతకీదళమా! నీవు సన్నిధినుండియు లేకుండియు నా

కలవటఁ గలిగించుచున్నావుగదా" అని వగచుచుఁ బ్రాణముపై నిరాశనొందుచు, దైవమును దూఱుచుఁ, గులకాంతను నిందించుచు, నడుమనడుమఁ దన్నుఁ దామఱచుచు, నాఁకలి యగుటయుఁ, దప్పిగల్గుటయుఁ, బ్రొద్దెక్కుటయు నెఱుఁగఁడయ్యెను.

అటఁ దారామతియు సెజ్జపయిఁ జేర్చిన మేను చేర్చినట్లెయుండ, కనులనుండి రాలుచున్న బాష్పములు రాలుచునెయుండ, వీడిన కచభారము వీడినట్లయుండ, నూరక పతిమతము తెలియక వాపోవుచునుండెను. ఆమె నూఱడింపఁ బలుమాఱు దాసి డగ్గఱియు నోరురాక, దేవికంటె నెక్కువ కన్నీరు కాలువలుగట్టఁ దన తెలివిమాలినతనమునకు జయసేనుని కారణ మరయని యలుకకు వగచుచుండెను. తారామతియు నొకమాఱు దాసిమొగమువంకఁ జూపులునిలిపి తనయవస్థయె యదియు ననుభవించుట యెఱిఁగి, యిట్లని విచారించె. ప్రాణేశ్వరుఁడు మొగలిరేకు నాచేతఁ జూచినదిమొదలు లోనికి రాడయ్యెను. నిద్రాహారములులేక డస్సియున్న వాఁడు నాపయిం గట్టియనుమానము నెమ్మనమున నుదయింపనోపు. దాసిపో నన్నొ, చేరంబిలిచి కారణ మరయఁడు. మునుముందు నేనె యీజాబు పూర్వోత్తర సందర్భముల విన్నవింపుదమనుకొన్న, నాయనకట్టియనుమానము కలిగెనో, లేదో తెలియరాదు. ఏమనుకొనుచున్నవారో, యేమి యోచించుచున్నవారో తెలిసికొనక మగవారియొద్దఁ జనువుఁగైకొని సంభాషించితిమేని మానహాని వాటిల్లు. నిజము విన్నవింపకున్న హృదయేశ్వరుని మనంబెంతదవ్వుల కరుగునో యని భయము వొడముచున్నది. అయిన నట్లేలయగు? ఇంతకాలమునుండి యామహాత్మునితోడఁగూడి కాఁపురముసేయుచున్న యిల్లాలి సుగుణ దుర్గుణముల నరయక మనోనిశ్చయముఁ జేసికొనుటకు విజయసేనుని కుమారుఁడు సామాన్యుఁడా! కటకటా మొగలిరేకు వజ్రపుబాకువలె నాహృదయమును హృదయేశ్వరుని

హృదయమును వ్రక్కలించుచున్నది. జీవితేశ్వరుఁ డుడుగకున్నను నేనైనను నిందలి నిజ మరయవలయుఁగదా" అని దాసినిఁ బిలిచి, దానివెన్నుఁదీర్చి లాలనముతో "రాజలేఖా! ఇంతకాలమునుండి నీవు నా యంతిపురమునఁ దలలో నాలుకవలె మెలఁగుచు నెఱిఁగియో యెఱుఁగకయో పండువంటి నా కాఁపురమునకుఁ జేతులార ముప్పు తెచ్చితివి. గిరివ్రజపురమున నీ కెవ్వరయిన మనోహరుఁడుండి యీయుత్తరము లిఖించెనా? లేక తారతమ్యమెఱుఁగక నానిమిత్త మేదోసకారి యెవ్వఁడైన నిది యుద్దేశించెనా? ఇందలి నిజముదాఁపక నీకు నేను దల్లివంటిదాననగుట నాతోఁ జెప్పుమని" మందలించెను. రాజలేఖ యమ్మాటలవిని గడగడ వడఁకుచు గద్గద స్వరముతోఁ గన్నీరు దేవిపవ్వళించిన పానుపుం దడుప నిట్లనియెను. "అమ్మా నేను నిక్కము దాఁపక తెలిపెదను. నేనిందే పాపమెఱుఁగను. ఇందలి సత్యమును గ్రమముగ నెఱుఁగవలయునుగాని యిది యిట్టిదని యిప్పుడు తెలుపఁజాలను. మీ పాదములాన.

అయిదవ ప్రకరణము.

అట్లు నాగవల్లి బయలుదేరి పెద్దయుం దడ వగుటకుఁ దన చెలికత్తె చీవాట్లుపెట్టునో యని శంకించుచుఁ గడువడి నడువ నుంకించుచు రాజమార్గమునఁ దన కెదురై తఱుచుగ వచ్చు జనుల గుంపునకుఁ దొలఁగి నిలుచుచుఁ దనతోఁ బని కలిగియో, తన్నానవాలెఱిఁగియో పలుకరించు స్వపరిచితులమాటల వినుటకు వ్యవధి గానక, సత్వరముగ నిలుచేరు నభిలాషతో నరుగుచుండఁ, దాను విక్రయించిన పూలవృత్తాంతము దన మనమునకు ములుగ్రుచ్చుకొన్న తెఱఁగున స్ఫురణమునకు వచ్చెను. వచ్చుటయు నా సుందరి ముందటి కడుగిడఁజాలక యిం

చుక నిలచి “హా యిదియేమి? ముసలివానిపయిఁ గలిగిన యక్కటి కము మిక్కుటమగుట నొడలెఱుఁగని సివమెత్తి పూలదండకు చెండును మొగమెఱుఁగనివాని కెవనికో విక్రయించితిని. చెండునందు దివ్య కుసుమదళ మమర్పఁబడియున్నదని పూలవర్తకుఁడు నన్నుఁ బిలిచి నొక్కిపలికి దానినిచ్చెను. సాధారణమైన చెండుగదా యని విక్రయించితిని. కాని యామాట తత్సమయమున జ్ఞప్తికిరాదయ్యె. ఈమాట మాచెలికత్తెకుఁ దెలియకుండ దాఁచియుండునా? కాలక్రమమున నిది పొక్కకపోదు. అపుడు మాగుణోత్తమకు నామీఁద నలుక వొడముటయు, నీవఱకు నాయందుఁగలవిశ్వాసము, గారవము నశించుటయు సంభవించును. కావున నిజముపల్కి తప్పు నొప్పుకొని యప్పడంతి పాదములపైఁ బడుట యుచితమని తోఁచెడిని. దీనసంరక్షణమన్న మాగుణోత్తమకుఁ జిత్తానందకరముగదా. ఈముసలియనద యుసురుల నిలుపుటకు నేనొనర్చిన యీసాహసమునకు నన్ను నామెసైరింపదే. నాయొద్ద నాచెండు గొన్నవాఁ డెవ్వఁడో గుఱుతుపట్టఁజాల; నైన వెదకెదఁగాక” యని ముందునుండి వెనుకకును వెనుకనుండి ముందుకును రెండుసారు లావీథిందిరిగి వానిం గనుఁగొన నేరక నిబిడమగు నెవ్వగచే నిట్టూర్పువిడిచి “దైవముపై భారమువైచి యిఁక నిలుసేయుట మంచిదని తోఁచుచున్నది. ఇదియిటులుండ నాచేతి ముద్దుటుంగరమును గూర్చి యేమి మూఁడ నున్నదో యని జంకుచు యోచన సేయుచు మనమున సంశయించుచు నెట్టెటో తనవు నింటికిఁ జేరవేయఁదొడఁగెను. ఆమె తెరవున నడచుచుండిన నామె మనస్సుమాత్ర మాపొంత నిలక పలుతావులఁ దిరుగులాడుచుండుకతన నీయింతి గమ్యస్థానము మఱచి తన యిలుదాఁటి కూఁతవేటు దవ్వేగి, యచ్చట నిటు నటు నలుదెసలు పరికించిచూచి క్రొత్తక్రొత్త మేడలు, వింతవింత గోపురములు దనకంటఁ బడ నయారే దారితప్పి కూడని తావులకు వచ్చితిని. ఈ యుద

యమున నేరిమొగము గనుఁగొంటినో యన్నియు సంకటములె తటస్థిం చుచున్నయవి. ఇది జరాసంధుని యుంపుడుకత్తెకొడుకును, రాక్షసాంశమునఁబుట్టిన దుండగీఁడును నగు రణార్ణవుని యిల్లని తోఁచుచున్నది. ములుకంపఁదవులొ్కన్న సన్నచీరవలె వీని కంటఁబడిన పడుచు సిలుగులఁ బడక యూరక నీవలకు రాదు. అదియునుఁగాక నీతఁడు మాగుణోత్తమపైఁ గన్ను వేసినాఁడు. ఇటనుండి సత్వరమ దాఁటుట కర్జము" అని తలపోసి కదలుటకు యత్నించుచుండ, నింతలో వెనుకనుండి యెవ్వఁడో చప్పటలు చఱచుచు భాగవల్లీ భాగవల్లీ కాదు కాదు, రాగవల్లీ! యిటురా, యిటురా యని పిలువఁదొడఁగెను.

ఆ నుడుగు పిడుగువలెఁ జెవులఁ బడుటయు నామె వానికడకరుగుటకిష్టములేక ముందునకు సాగిపోవుటకు ధైర్యమురాక, కదలక నిలువంబడియుండెను. అంతలో నొక వికృతాంగుఁడగుపురుషుఁడు వికవిక నవ్వుచువచ్చి ఓసీ త్యాగవల్లీ! పిలుచుచుండఁగనే బొంతకాకివలె నిలిచెదవేమి? ఇంతమాత్రము రాఁగూడదా మాసామి నిన్నుంబిలుచుకొని రమ్మని యానతిచ్చె. ఒక్కమాట వినిపొమ్ము. రా యని, యదరుబెదరు గొనక, యీపలుకులు ములుకులవలెనాటి స్థంభమువలెనున్న యామె యన్నుం గుడిచేయి పట్టుకొని 'నిన్ను నేను బెండ్లియాడునపుడు నీ కేలుదమ్మినిటులె గ్రహియింతునుజుమీ' యని లాగ, నాగవల్లి కన్నులనీరు నించుచుఁ దనకు సాయముసేయుమని దారింబోవువారిఁ జీరుటకునైన సత్తువలేమి నూరకుండెను. అంతట నాసేవకుఁడు కోపముతో సహజముగఁ గాఱు నల్లఁదనముగల తనమొగము బిగఁబట్టి నీవిపుడ రావేని రావణుఁడు దమయంతి నెత్తుకొని చన్న వితమున నిన్నెత్తి మాయజమానుస మ్ముఖమునఁ బెట్టఁగలనుజుమీ. జాగ్రత్త హస్తినాపురమున ధర్మరాజు తమ్ముఁడగుకుంభకర్ణునితో చిన్ననాఁడు దండపట్టులుపట్టి గెలిచిన సర్వ

వకుప్రిని నన్నెఱుఁగవు గాఁబోలును. నడు. నడు. ప్రాణేశ్వరీ! యని య
సందర్భము లగుపలుకులు పలుకుచు మందలించెను.

మద్యపానముచేతనో బుద్ధిమాంద్యముచేతనో రానిమాటలు,
పురాణగాథలు, నాగవల్లి కర్థముఁగాక వచ్చియురానిచిఱునగవుందెచ్చి
యామె మొగమునకు భయములో నొకవింతశృంగారముఁగలిగించెను. ఆ
మొఱకునియాకార మెంతవికారముగనుండునో మాట యంతమోటదై
యుండును. ఇంతలో లోపలనుండి వేఱొక సేవకుఁ డరుదెంచి సర్వప
కుప్రిని నివారించి కనుచీఁకటిగానున్న యత్తఱి నత్తెరువున నేరు సనకుంట
జూచి నిలుచున్న నాగవల్లిని సందిటంబట్టి యెత్తి గరుడుఁడు నాగకన్య
ను బోలె పట్టి "దింపు దింపు. నేనే యామెనెత్తికొనివచ్చెద" నని వె
నుకకుదిగలాగుచున్న సర్వపకుప్రినిమాట సరకుగొనక లోనికింజనియె.
ఐంద్రజాలికునిచేతి కీలుబొమ్మలాగున నాకొమ్మ సందిట నిమిడియుండి
భయకంపితయై వానిచేతులలో మూర్ఛనొంది కనుదమ్ములు మూసికొ
ని కాలభుజంగమంబు చాడ్పున విడి వ్రేలాడుచు నేలదాఁకు కచభారము
తోఁ దన్నెఱుంగకయుండెను.

నాగవల్లి లోనికిం గొంపోవఁబడుటయు రణార్ణవుఁడు తను సన్న
యొనర్ప నద్దానియర్థమెఱిఁగి సర్వపకుప్రిఁడు తటాలునఁ దలుపుమూసి,
తమ యనార్యకృత్య మొరులకుఁ దెలియకుండఁజేయ యత్నించె. మూ
ర్ఛిల్లిన నాగవల్లిని రెండవసేవకుఁడు మెల్ల మెల్లగ రణార్ణవుని పడకటిం
టనుండిన యొక మెత్తని సెజ్జఁజేర్చి మూర్ఛదేఱునట్లు కాలోచితముల
గు శైత్యోపచారములు గొన్నిఁటి నెరపసాగెను. కొన్ని నిమిషముల
కాబాలిక తెలివిఁదెచ్చుకొని కనుదమ్ములువిచ్చి చూచునప్పటికి రణార్ణ
వుని ముఖచంద్రమండలము కట్టెదుటఁ గానఁబడి యామెనేత్రపద్మముల
ముకుళింపఁజేసెను. అనంతర మిరువురు సేవకుల నావలకుఁ బొమ్మని
యానతిచ్చి రణార్ణవుఁడు నాగవల్లి ప్రక్కఁజేరి తనమూలమునఁ గ్రమ్మఱ

మూర్ఛనొందునేమోయని భయమునొందుచు నొకమాఱుమీఁద జేయివైచి, 'బాలా, నీకింత వంతయేల' యని యేమోపలుకయత్నించుచుండ, "అయ్యో! చచ్చితి చచ్చితి" నని బిగ్గరగ నఱచి తన్నీతఁడు తుద ముట్టించునని గడగడ వడఁకి పునర్మూర్ఛావస్థ నొందెను. అంతట నా శూరుఁడు మరల నామెను మూర్ఛదేర్చి యల్లనల్లన నిట్లనియె. ఓ సుందరీ! నాగవల్లీ! నీకు నేను కీడుసేయఁదలఁచి యిటురావింపలేను. నీతోడఁ గొన్ని రహస్యముల ముచ్చటింపఁగోరి చిరకాలమునుండి సమయము నిరీక్షింపుచుండ నేఁటికి శంకరుఁడు నాకు తగునదను గల్పించెను. మక్కువగదుర నిన్ను నేనెట్లు పిలిచినను నావలన నేదియో భయముదలఁచి నీవు రాకుందువని యిట్లు బలిమిచే నినురావించితి. మరల సుఖముగ నిన్ను నీచెలియకడ కనుచుభారము నాయది. వగవక నాపలుకు లాలకించి నన్ను గృతకృత్యుఁ జేయ వేఁడుచున్నవాఁడ. ఇవిచేతులుకావు కాళ్ళుసుమ్మీ" యని హస్తపల్లవములు స్పృశించి దైన్యముతో నుడువుటయు, నాగవల్లి తన కాతనిదెస భయకారణములేదని కన్నులు తెఱచి యాతనిదిక్కు మొగమై యాతని మొర యాలించునట్లు కనంబడియె. అంతట రణార్ణవుండు తన కథనిట్లు చెప్పనారంభించెను.

"పాల సంద్రమునకు లక్ష్మియు, మంచుఁ గొండకు గౌరియుఁ బలెఁ జంద్రపాలునకు మున్ను నోఁచిన నోములపంటయై వొడమి యా నాఁటి రాచపుట్టువులనెల్ల గళవళము పాలుసేయు మీ నెచ్చెలిం గూర్చి యించుక ముచ్చటించెద దయార్ద్రహృదయవై యాలకించి నామాట పలుకుల నాపలుకులుగనె విన్నవింపక నీవే నీదు కులుకుముద్దుమాటలతో నించుక మేళవించి యామెతో మనవి యొనర్చి నాయెడఁ గరుణ గల్గింపవలయు. చక్కఁదనముం బట్టిచూడ మీగుణోత్తమ కీడువచ్చెడు రాచవాఁ డీజగమునఁ గానరాఁడు. ఆకారణమున నెవ్వనిఁ జేకొన్న నొక్కటియేగదా! కావున నన్నుం జేసికొనినను దప్పులేదుసుమా.

నేను మీనడుమనుండఁబట్టి యిట్లు సామాన్యునిగ నన్ను బరిగణింతురు; కాని నావంటి ధైర్యసాహసములు, సోయగమును గల క్షత్రియుఁడు లేఁడని నీవుమాత్ర మెఱుఁగవే! నాచక్కఁదనమును వేఱ వర్ణించుటకంటె పలువురు రాచకన్నియలు నాచెట్టఁబట్టఁ దపసులు ధారవోయుచు నాకీమజ్జోకుగామి నిరాకరింపబడి రనుమాట చెప్పిన నే నెట్టివాఁడనో నీవెఱుఁగఁగలవు. సాహసమును గూర్చి యొక్కముక్క నీచెవిని వేయవలయు. ఈమధ్యకాలమున మాగధ శ్రీకృష్ణులకు జరగిన కయ్యమున నేను గారణాంతరమున నూరివై పొంటరిగఁ జనుచుండ నన్ను జూచి పిఱికియై పోరువిడిచి పరుగెత్తుచున్నాఁడనియు, రణార్ణవుఁడు నేతిబీరకాయవలె లోని సారములేనివాఁడనియుఁ గిట్టని వాండ్రు పరిహసింపఁ దలఁచి నాపై వేసిన చెడువాడుక నీవు నమ్మినఁ జెప్పఁజాలనుగాని యుద్ధము వచ్చినప్పుడు పగవారిఁ బొడుచుటయో, ప్రాణములు విడుచుటయో నాపనిగాని పాఱిపోవుట మాయింటి కుక్కయు నెఱుఁగదు. జయసేనుఁడు తెంపరి కళానందుఁడు పోటుమానిసి యని పక్షపాతమునఁ బాపపు లోకులు కాకులట్లు చెప్పుకొని యఱచుచుందురు. నాకు వారెందును సరిరారు. ఇంతయేల? నేను నీ వెఱుఁగనివాఁడను గాను. మీగుణోత్తమ నాహృదయము దొంగిలించినయది. నాగవల్లీ! నీకడ నేను దాపక నిక్కము వక్కాణించెద. ఈసుందరిపై వలపు నిలుపుట మొదలు నోటికన్నముఁ గంటికిఁ గునుకు మదికి నిండువేడుకయు సున్న. మాసదాశివుని యడుగులాన. చూచిన సౌందర్య తిలకనే. తలఁచిన సౌందర్యతిలకనే. పలవరించిన సౌందర్యతిలకనే. వేయేల? ఆగుణోత్తమ యిల్లాలు కాదేని రణార్ణవుని ప్రాణములు నిర్హేతుకముగఁ దీసిన దోషంబు మీచెలిం జుట్టుకొనును. ఆమెయందు నానిలిపినంత మక్కువ మెవ్వరు నిలుపరు. ఇట్టి నన్ను విడిచి కళానందునిఁ గిలానందుని గేలువట్టుట కులమునకు వన్నియఁదగ్గించుటకాదా! ఈవామెపై కారణముల నరసి యామె

మదికి వచ్చునట్లు, నితరులమీఁద యనురాగము లోఁచ్చుగ నామీఁది ప్రేమ హెచ్చుగఁబలికి మాసమాగమము నీవుఁ గూర్పవలయును" అని పలుక స్వోత్కర్షము, పరనింద ప్రధానములుగఁ జేయఁబడిన యుపన్యాసము నంతయు నాయింతి జాగరూకతతోఁ గొనముట్ట గమనించి చివచివలేచి పానుపుపైఁ గూరుచుండి, తనప్రస్తుతావస్థకును రణార్ణవుని యాదరణకు ననువగునట్లు మృదూక్తుల నిట్లనియె.

"అన్నా! నీమనంబిట్లు మాగుహోత్తమకారణముగ నుత్తలమందుట మున్నెన్నఁడెఱుఁగనైతి. నన్ను బలాత్కారముగ మీయింటికిఁ దీసికొనిరానేల. కాకిచే వర్తమానమంప నేను నీయడుగుదమ్ముల సన్నిధికివచ్చి వ్రాలకుందునే. మానెచ్చెలి గుట్టుమట్టు నీతోడ మనవి యొనర్పవలయునని పెక్కునాళ్ళుగ నామనమునఁ దలంపుగలదు. ప్రథమమూర్ఛనుండి తెలివిగలిగినవెనుక నాతలంపు లెఱుఁగఁజేయుట కవసరము నేఁటికీవిధమున వచ్చెఁగదా" యని సంతసించుచుంటికాని బలిమిని నన్ను రావించితివని వగచుటలేదు. నీమాటలయందలి చమత్కృతియు, నీయర్థగాంభీర్యమును, నీనోటనుండి వినినకొలంది నాకుఁ జెవులవిందగుచున్నది. ఆహాహా! నిజముగా నిట్టి మనోజ్ఞములగు ద్రాక్షపండ్లవంటి తీయనిమాటలు మాచెలి యొకమారు చెవులార వినిన నిన్ను విడువఁగల్గునే. చక్కఁదనమున్నయెడ సాహసౌదార్యము లుండుట యరిది. ఇవి యున్నచోట సిరియు, విద్దియయు నుంట గగనకుసుమము. అన్నియునున్న గుణముకుదిరి నలువురలోఁ మెలఁగి భళీ యనిపించుకొనుట యరిది. అన్నిటందక్కువ లేకయున్న నినుఁబోలు పుణ్యజనవతంసము కొఱకు నోములునోఁచిన మాచెలికి వేయిపుట్టువులకయిన లభించునే. అయినను మాచెలియు లేలినవారియెడ నసూయఁ జూపునదికాదు. మనసున మిము బాణిగ్రహణము నొనర్చుట కిచ్చగించియుఁ బ్రౌఢయగుట నది మానోట వినఁదలంచి యసూయ నప్పుడప్పు డభినయించుచుంట

జూచి వివేకనిధియగు నామెయయ్య చంద్రపాలుఁడు బిడ్డయను మోమోట నొకమూలఁ ద్రోసి యామెంగసరి నీకేలువట్టుమని చెవి నిల్లుగట్టుకొని పోరుచుండును. దాసినగుటచే నాకంత స్వాతంత్ర్యంబులేమి నవసరమగునప్పడెల్ల నూరకుండక నాశక్తివంచన లేకుండ నాయంత నేను గలుగఁ జేసికొనుట యుచితముకాదని మాట సాయము చేయుచుందు. కళానందునకు నేను సాయమెట్టిదియుఁ జేయఁజాలఁజుమీ. నీవింక బెంగగొనక మనోధైర్యముఁ జిక్కఁబట్టి యుండుము. ఆలతకూన నినువిడిచి యన్యుని గైకొనదు."

ఈపలుకులు రణార్ణవుని మోహార్ణవమున ముంచి తాండవనృత్యము చేయించెనని వేరచెప్ప నావశ్యకతలేదు. కాని క్రొత్తగా నంకురించిన యావేశముచే నాతఁడు లేచి నిండువేడుకచే వ్యక్తముకాని మాటలతో నాగవల్లికి మ్రొక్కి, "వహవా! వహవా! నాగవల్లీ నాకు నీవు తల్లివనిననుఁ దప్పలేదు. నీఋణము నెన్నిపుట్టువులెత్తియుఁ దీర్పనాతరమే. మఱవఁ దలంచిన మఱవరానిమేలు నీవునాకొనర్చితివి. ఇంక నెనర్పఁదలఁచుకొంటివి. కళానందునిపై నాయిందువదన కసూయఁ గలిగించుటకు నీవు జతన సేయవలయు. ఆపాపిచెడి బ్రతికినవాఁడు; నే నాగర్భశ్రీమంతుఁడ. వాఁడు మననగరమునకు మహాశత్రుఁడు. వాసుదేవానుచరుఁడు. నేను జరాసంధ పక్షపాతిని. నాకామె నొసంగక కళానందుని వంటి మందున కర్పించుట కాకిముక్కునకు దొండపండుఁ గట్టుటకాదే. ఇది యటుండనిమ్ము నీవు నాపక్షముదానవగుటచే నీకెఱింగించినను దోసములేదు. పుష్పకేతుని కుమారుఁడు వజ్రదంతుఁడు మొదలగు నేస్తకాండ్రి సాయమునఁ గొన్ని దినములలోఁ గళానందుని దుదముట్టించెద. చూడు నాదెబ్బ. అంతియకాదు. అతని మిత్రుఁడగు నుజ్జయినిపతి విక్రమదేవునిపై మగధరాజు దండువెడలి మాళవదేశమునకు నన్ను రాజుగాఁ జేయఁ బ్రయత్నించుచున్నాఁడు. ఈపలుకులు నీహృద

యమున నిలుపవలయుఁగాని యేరితో ననఁగూడదు. నీవీరాత్రి మా యింటనుండి నాయొసంగు నాతిథ్యము నంగీకరింపవలయు" నన నాగవల్లి మొగము వెలవెలఁబోవఁ దనప్రియసఖి తననిమిత్త మెదురుచూచుచుండు ననియుఁ దానరుగక తప్పదనియు నెన్నెన్నో నెపములఁగల్పించి యాతని మనసు గరిగింపఁ బ్రయత్నించియు నట్లుచేయలేక యూరేయి తనకు రణార్ణవునివలన రాఁదలఁచిన మహోపద్రవసముద్రము నీఁదఁ దలఁచి యచ్చటఁ గూరుచుండెను.

ఆఱవ ప్రకరణము.

మగధమహారాజగు జరాసంధుఁడు నివసించు మందిరము దక్క గిరివ్రజపురమున నుండు మందిరముల నన్నిఁటఁ జంద్రపాలుని గృహమునకు సాటివచ్చెడునిల్లు గానఁబడదు. పొడవును నిడివియుఁ గలచుట్టుగోడలును, నాలుగుగోడలనడుమ వసంతుని విడిదియిల్లట్లు రాజిల్లుసుందరోద్యానవనమును, వనమధ్యమునఁ బాలమున్నీటిలోఁ దెలిదీవిచాయఁ బురజనుల కనులకుఁ బెనువిందుసేయు మేడయు మేడపైఁ జిత్రితములై నానావర్ణముల నింపుగొల్పు సాలభంజికలును నిరుపమానమైనసౌందర్యమును గిరివ్రజపురమునకుఁ దెచ్చుచుండెను. .ఆమేడ మూఁడవ యంతస్తుగోడకుం గల గవాక్షములు రాజమార్గంబున కభిముఖములై యుంట గృహలక్ష్మి కన్నులు దెఱచి నగరముం జూచుచున్నదో యని తోఁచు. గృహలక్ష్మి విలాసార్థము తనవల్లిం గప్పికొనిన తెల్లని దువ్వలువ చందమయి వెల్ల కనంబడుచుండు. చంద్రశాల

యనఁబడు మూఁడవ యంతస్తునందు వ్రాయఁబడిన చిత్తరువుల సొగసుఁ జూడ నగరవాసు లనుదినము వచ్చుచుందురు. అచటి యడుగుభాగము స్ఫటిక శిలానిర్మితమయి, గృహలక్ష్మి నుఁజెక్కుటద్దమట్లు వెలయుచుండును. ఆమేడ కలంకారముండెచ్చు చిత్తరువుల కలంకార మొసంగునదియు, గృహలక్ష్మికి నగలువెట్టి వన్నెలు దిద్దునదియు, సౌందర్యతిలకయను నామాంతరముగల గుణోత్తమ యుత్తమోత్తమయై యందు వసియించు. ఏలావణ్యనిధి యుదయమగుట మొదలు తండ్రి యగు చంద్రపాలునకు నింద్రసమానవైభవులగు మహారాజులు చేతులుమోడ్చి చేయుమనవి సనవులు నిరాకరించునంతటి గౌరవము లభియించె. నే బంగరుబొమ్మ లావణ్యము నృపకుమారకుల హృదయసముద్రముఁ గలఁచుఁ గవ్వపుఁ గొండయై మోహంబను నమృతం బుదయమొందు కారణమయ్యె, నే యింతి సన్నిధాన వర్తినులగుట నాగవల్లి మొదలగు దాసీజనంబునకు రాజాంతఃపురముల నింతింత యనరాని మన్నన సంభవించె, నే మంజువాణి వీణవాయించువేళ దాసీజనంబును వేఁడి తెలిసికొని రాచకొడుకులు ప్రచ్ఛన్న వేషులై సుధారసమొలుకుఁ పాటల నాలకించి ధన్యులగుచుండు, రేచక్కని కూఁతుమొగము కనులనిండఁ జూచిన దృష్టిదోషంబు ప్రాపించునను భయమునఁ దలిదండ్రులు, నెచ్చెలులు, చుట్టములు మనసార జూడ వెఱతురా పూవుబోఁడి, యామెలన్నాఁగ, యాకనకాంగి యామేడనునివసించు. నాగవల్లి పూవులదేర సలు వెడలుటమొద లామెనిమిత్తము గుణోత్తమయుఁ బ్రియసఖియగు రాగలతికయు క్షణక్షణ మెదురుచూచుచుండిరి. "రోహణకుఁడు పూవులీయక యింత తడవు మనసఖిని నిలిపెనో, యీయామెయే మార్గవశమున నేరయినఁ గనఁబడిన మాటలాడుచుండెనో, దురాత్ములేరైన 'చెరగొనిరో'" యని రాగలతిక విషాదమొందుచు, గుణోత్తమ తత్తరపాటు నివారించుచుఁ జీఁకటిపడునంతదనుక నెట్టులో ప్రియసఖి వియోగముసయిరించెను.

కాని సూర్యుఁడు పడమట సముద్రమునం గ్రుంకుటయు, వీరి మనోధైర్యములు జంకసాగెను. చంద్రపాలుఁడు కూఁతు మనోవేదనఁ జూచి నాగవల్లిని వీధులంబడి వెదకి తోడ్కొనిరమ్మని మువ్వురు పరిచారకుల ననిచెను. తలవాకిటికి రాగలతిక మాటిమాటికిఁజని సఖివచ్చుచున్నదోయని మార్గమునఁ బోవునంగనలఁ బలుకరించుచు మఱల నాహార్త చెలియకు విన్నవించుచు మనశ్శాంతి నొందక కాలుగాలిన పిల్లివలె నట్టిటు తిరుగఁ దొడఁగెను. హృదయమునకు హృదయమగు ప్రియసఖి యెంతకురామి, గుణోత్తమ రాగలతికతో "ఓసీ! యింకమనము దాని దెస నాసవిడువవచ్చును మనలఁబాసి యది యిన్నినాళ్ళుగ నెన్నఁడైన నింతతడ వొండొక చోటఁ నుండెనే! కటకటా! అది యొక్కర్తులేకున్న నెందఱో లేనట్టు లీమందిరమెంత చిన్నవోయి కాననయ్యెడునో చూడుము. అది యెక్కడఁ జూచిన నక్కడనేయుండి చిలుకలఁ గూయించుచుండు గొదమ కోయిలల బెదరించుచుండు మనల నవ్వించుచుండు నన్నిపనులం జక్కఁబెట్టుచుండు. అది పదుగురుపెట్టుగదమ్మా అయ్యో! దానినింక నెటఁజూతు రాగలతికా! యని వాపోవుచు నుత్ఫుల్లపుండరీకముల చాడ్పుననున్న కన్నుఁగవనుండి నీళ్లు దొరఁగ సెజ్జపై మేనువాల్చెను. రాగలతిక యూరాగము నందుకొని కొంతయాలాపముసేసి తనచేత నైనంత కన్నీరు సఖినిమిత్తము విడిచి కొండొకసేపటికి నెచ్చెలి నూఱడించి కన్నీరు చీరచెఱఁగునఁ దుడిచి మరలఁ దలవాకిట నిలిచె. అంతటఁ గొన్నినిమిషములకు రాగలతికచూచు దిక్కునుండిగాక యొండొకవైపు నుండి గమనవేగము సూచించు చెమ్మటతోడ నొక లేమవచ్చి యామె యెదుట నిలిచెను. రాగలతిక యాపడఁతి నెమ్మొగముఁ గనుంగొని "నాగవల్లీ! నాగవల్లీ" యని యఱచి "ఓసీ, నీవు జీవముతో నున్నావే? నిన్నెన్నఁడో చూచినట్లులున్నదిసుమీ. నీనిమిత్తము మనగుణోత్తమచిత్తము పొందుతత్తరము వర్ణింపఁ దరముకాదు. అయ్యో! నన్ను నీ

వొక్కసారి బిగ్గఁగౌఁగిలించుకొని నామనస్సంతాపము మాన్పవే" యని యాలింగనముచేసికొని, దానిరాక యెఱిఁగి సత్వరమె మేడమీఁదికి రమ్మనిపిలుచు గుణోత్తమను జూడ, సౌధముమీఁదికిఁ దీసికొనిపోయెను. నాగవల్లియు గుణోత్తమఁ గనుంగొని కంటనీరు వెట్టుకొని "అమ్మా మిమ్ము నందఱఁ జూచుభాగ్యము మరల సంభవించునని నేననుకొననైతి. ఈ వేళ నెట్టిదుశ్శకునము నాకయ్యెనో చచ్చి కఱిమ్మఱఁ దల్లికడుపునఁ బుట్టితిఁ జూడీ" యనియుంగలాఁచ్చుచుఁజెప్ప నాయిరువురు దద్వృత్తాంతము నెఱిఁగింపుమని యడుగుటయు నాగవల్లియుఁ దా నిల్లువెడలి రోహణాసుని పూలయంగడి కరుగుట మొదలుగ నిలుసేరువఱకుఁగల కథఁ దనవాక్చమత్కృతితో రసపుష్టిచేసి కవి కావ్యమునకువన్నెవెట్టునట్లు దానికందము దెచ్చి వినువారికి విసువురాకుండఁ జెప్పెను. సౌందర్యతిలకయు రాగలతికయు నావృత్తాంతము విని కరుణాద్భుత రసముల మునిఁగి మనచెలి సాహసమునకు మెచ్చుకొని రణార్ణవుని బారినుండి తప్పించుకొన్నందులకు నదృష్టవంతురాలవని దాని సంభావించిరి. అనంతరము నాగవల్లి చేతులు జోడించి యా జవ్వని యెదుటనిలిచి "నన్ను క్షమియించి మీరు రక్షింపవలసినదని వేఱ చెప్పకొన నక్కఱలేదు. చిన్ననాఁట నీవునాకు మక్కువమీఱఁ జిటికెనవ్రేల నిడిన యుంగరము గుదువఁబెట్టి ముసలివాని యుసురులు గాపాడితిని. అదిగాక రణార్ణవుని బెండ్లియాడునట్లు నిన్నొడంబఱుతునని వాగ్దానము చేసివచ్చితి.

ప్రాణభీతినాడిన కల్లగావున క్షమింపబడదగినది. అమ్మా! ఆ రణార్ణవునికి జడిసియుంటకిన్న వానికడనున్న సార్థకనాముఁడగు సర్వభక్షుఁడను వానికి నా పడిన భయ మింతింత నరానిది. నాయుసురు తఱిలి రణార్ణవుని వంశ మెన్నఁడు నిర్మూలమగునో! ఒక్కగడియ నాపడిన మనఃక్షోభంబె వానికులాంతమునకుంజాలు. వానిసేవకుఁడేమమ్మా! అమవసచీఁకటికన్నఁ గారునలుపువాఁడు. ముందున కెదిగివచ్చిన మిట్టపండ్లు

వాఁడు. మీఁదుమిక్కిలి మతిలేనివాఁడు. కొకబికివేసంబువాఁడు. మిడిగుడ్లవాఁడు. పగలుచూచిన రాతిరి కలలోనికివచ్చు. నీవొక్కసారి వాని మోముగన్న నాలుమాసము లన్నము రోఁతచే ముట్టవు సుమీ! ఇది యతిశయోక్తి కాదు. వానిగుణరూపాదులు వర్ణింప నా నేర్చుపలుకులు చాలకునికి నేనెట్టెటో యిట్లు రవిదీపన్యాయముగ వర్ణించితిని. రణార్ణవుని చర్యల నాలకించియే యుంటివి. కళానందాదులు మూర్ఖులఁట. తానెక్కఁడ నీహృదయేశ్వరుఁడగుటకర్హుఁడఁట. చెప్పనేటికి? వానిచిన్నెలన్నియు విని తీరవలయును. పిదప నన్నీరేయి తనయింట నుండుమని చాల నొక్కిచెప్ప రావణునిలంకనున్న జానకి విధముననే మెట్లమీఁద నిలిచి నట్టులుండి వానిని గడునమ్మించి యాతఁ డారగింప లోనికిం జనునప్పుడు నాకడ కావలియున్న మందుఁడగుసర్వవక్రిని కెద్దియో పనిఁ గల్పించి యావలకుం బనిచి చప్పుడు గాకుండ పెరటితలుపుం దెఱచి యీవలంబడి మెల్ల మెల్ల నిలు సేరుకొంటి. అని తనచరిత్రము ముగింపఁబోయి మరలనెద్దియో స్ఫురణకురా జంకుచు నల్లనల్లన నిట్లనియె—'అమ్మా! ముద్దుటుంగరము కుదువబెట్టుటకన్న, నాడరాని కల్లలాడుటకన్న నెక్కడు నేరంబు నేఁడు సేసితి. కొంత వెఱచియుఁ గొంత మఱచియు నింతదనుకదాఁక జెప్పక యూరకొంటి. రోహణకునొద్దఁ దీసికొని ముసలవాని నిమిత్తము విక్రయించిన పూలచెండులో నొక దివ్యకుసుమంబుగలదనియు నద్దాని ధరియించినవారికి మనోరథసిద్ధి కరతలామలక మగుననియు నీకుదానినిమ్మనియుఁ బలుమాఱు చెప్పి నా కతఁడొసఁగె. ముసలివానిపైఁ బ్రేమంజేసి నీమాటమఱచి యద్దానిని మొగమెఱుఁగనివాని కొకనికి విక్రయించి నీకుఁ గడునపకార మొనర్చితి."

అని నాగవల్లి తన యొనర్చిన తప్పు నొప్పుకొని, పూలమాలికకు వగచుచు నరుణచరణ నల్లవములకడ దిగులు దెలుపు ముఖవైఖరితోఁ గూరుచుండె. అములయప్రియనానుడువులు చెవులఁ జొచ్చుటయు,

నాగలతిక యదరిపడిలేచి, అయ్యో! నాగవల్లీ! యెంతపనిచేసితివే. నీసలి పిన యీయవివేకపుఁబనికతమున, శాశ్వతమైన యపకారము మన కు మనవారికిఁ బ్రాపించెడునని నాకు నడలు వొడముచున్నది. నీకింత యొడలెఱుఁగని శివ మేల యెత్తెనే? తనకుమాలిన ధర్మము మొదలు చెడిన బేరము నెరపువెంగలి నిన్నొకదానినిఁ గాంచితి. ఆపాపపుముసలి దయ్య మెక్కడ దాఁపురమయ్యె? అయ్యయో యెన్నినోములునోచి యు నెన్నిజన్మములనెత్తియు నెందఱి నుపాసించియు దివ్యకుసుమంబు నందుకొన నేరికిం దరమగునే? అట్టిది మన పూర్వసుకృతవిశేషమున స్వయంప్రాప్తముఁగా సిరిరా మోకాలొడ్డినతీరున చేతులార దానిని గంగపాలుచేసినట్లు పోగొట్టితివి. నీవు తలక్రిందుగఁ దపముచేసె యట్టి కుసుమ మొకటి గ్రిమ్మఱ సంగ్రహింపఁ గలవే? నీయదికీయోచన మే లతట్టక పోవలయు? నీకడఁ బైకమున్న దానధర్మముల నిర్వర్తింపఁ దగుఁగాని పరులసొమ్మువిక్రయించి యనదల రక్షించుట యుచితేతర ము. దాసివై యొడలు దాఁచుకొనక పనిచేసి పొట్టపోసికొను నీవంటి దానికిఁ దలకుఁ దగనిబరువులు బూనుకొనుట కేవలము నింద్యముకా దా? యజమానురాలికార్యము చక్కఁజేయుటకు మాఱు చక్కఁబడి నదానిని భంగముచేసిన నీసాహస మెట్టిదియో నే నూహింపఁజాలఁ మనము దాసీజనమనుమాట మఱచి యజమానుల మనుకొంటివో! మనమెంత, మన మనికియెంత, మనయునికియెంత! యింతనుండి జాగ్రత్తగ నడుచుకొనుము. ఇది నీమేలునిమిత్తమే నుడివితిఁగాని నానిమిత్త ముగా దలుగకుమీ, చెలీ, యని నెఱకులు నడలఁజేయు శూలముల వంటి వాగ్జాలములతోఁ దలవాచునట్లు నాగవల్లిని జీవాట్లుపెట్టెను. స్వయంకృతాపరాధమున నోరెత్తఁజాలక సిగ్గునఁ దలయెత్తనోపక నాగ లతికనోటనుండి వెలువడు వాగ్బాణములు బ్రాణములు దీయుచుండ నాగవల్లి తన చెయిదాఁటినపనికిఁ బశ్చాత్తాపమొందుచు మనోగత

దుఃఖమును గన్నీటఁ దెలియఁజేయసాఁగెను. అట్లు పెనుఁగినుక నెఱ్ఱని మొగముగల యారాగలతికను బెదువగపున దీనవదనయైన నాగవల్లిని జెంగలువయు, నల్లగలువయుఁబోలె నలరుఁ దనయొక్కొక కంటఁజూచి గుణోత్తమ యలుకమానుమని రాగలతికకుఁ గనుసన్నయొనర్చి యెట్టిసమయములనైనఁ గలకల వెన్నెలలుగాయు నాగవల్లిమొగము మితిలేని జాలిగొల్పుటచే మనసుకరఁగి యిట్లనియె.

“ఓసీ! రాగలతికా! నాకడ దానికింగల చనువునుబట్టియో, పారమార్థికచింతనో, చేసిన యీనాగవల్లి యవివేకమునకుఁ గసరనేల? ధర్మకార్యము నెఱపువారు తమ్ము దామెఱుఁగక సంచరింతురు. నాగవల్లి జాలిగుండెగలయది గావున దానిమనస్సు వృద్ధసంరక్షణమునందే నిలిచి పూలచెండుపై, నందలి దివ్యకుసుమంబుపై నరుగదయ్యె. మఱియెంత మనీషావంతులకయినను సహజ మట్టిచో బేలయగు మన నాగవల్లికిఁ గల్గుట యేమియక్కజము! మనఃపూర్వకముగాఁ జేయవలయునని చేసినపనికాని నీతప్పు సైరింపఁబడఁదగినయది. ధర్మకార్యార్థము పుణ్యపురుషులు, స్త్రీలు, సర్వమహీరాజ్యమును, దారపుత్రాదులను, బలిసుతాదులను, వేయేల యవసరంబగుడుఁ దమ ప్రాణములఁ గూడ నిశ్చింతతో నర్పించుచుండ, నొకచిన్న దివ్యకుసుమమును, బరోపకారార్థము వినియోగించి తనకును దనయజమానురాలనగు నాకుఁగూడ మంచిపేరు దెచ్చిన దీని నేమనుటకు నాకు నోరు రాకున్నది. దైవికము లొక్కొకయప్పుడు కొండలవంటి విపత్తుల సంఘటించునట్లగపడి తుదకు నెంతయు మేలొడఁగూర్చుచుండు. ఇయ్యదియు దైవికముకాన నేమిమేలుకానున్నదో తెలియఁ జాలము”

ఈమాట లనియెడు తేటనీటిసోనలు వెలువడ నాగవల్లి, మును రాగలతిక పలుకుములుకులఁ జెందిన మనోవైకల్య ముజ్జనసేసి తెలివి నొంది తనకిఁక భయము నొందవలసినకారణము లేదని కినుకఁ జూపిన

సహచారిణికిని, గరుణఁజూపిన యజమానురాలికి నిట్లని విన్నవించె. "నా సలిపినది యవివేకపుఁ బనియని నే నెఱుఁగుదు. యజమానురాలికపకారంబు దీనఁబుట్టుననియు గుదు. నెఱుఁ ఆదిక్కుమాలినవానిపై నాకాపాటుజాలి యుదయింప విహ్వలచిత్తముతో నేనంతపనిచేసిన యనంతరము నాకాదివ్యకుసుమంబుమాట జ్ఞప్తికివచ్చె. నాయవివేకము, నాకలుగఁజేసికొన్న లేనిపోని స్వాతంత్ర్యము, మీఁపెట్టిన చీవాట్లకన్న మిన్నగ నామనసుఁ గాల్చుచున్నయవి. అయినను నాచేతులార నేఁబోఁగొట్టితిఁ గావునఁ దద్విషయమై నాయొనర్చుప్రతి నాలకింపుఁడు. ఆ దివ్యకుసుమంబు మనగిరివ్రజంబున నెట్టియెట్టి సామంతునిచేతఁ జిక్కినఁ జిక్కనిమ్ము. ఎవ్వరియింట నేయంతిపురమున నేమూలమూలనుండిన నుండనిమ్ము. నే నీగడియ మొదలహోరాత్రములు కన్నునిండ నిదురింపక, కడుపునిండ గుడువక, పురినెల్లమూలలు గాలించి వెదకి యాకుసుమము మఱల నీకుసమర్పించుదానను. ఇట్లు నెఱవేర్చనైతినేని నీమొగము మరలఁ జూచుదానంగాను. నాకాఱుమాసము లీయుత్కృష్టకార్యమునకు గడువు దయసేయుము. ఈకాలంబున నాయందు నీనగరమునందు నీవెట్టిచరిత్రములఁ గనివినియెదవో నేనిపుడుచెప్పనోప."

అని రోసమునఁబలుక దసచెలికత్తియలిరుగురు, గనుమూయక యామెవంకఁ జూచుచు నిదియెంతకయిన సాహసురాలేయని తమలోననుకొనిరి. అంతగుణోత్తమ యీపలుకులకు సంతసించి సిద్ధదత్తమైన దివ్యకుసుమంబు తప్పక దొరుకునని యించుక యాసవొడమ నాగవల్లితో సఖి! నాకిప్పుడు మనసార యూపిరిపుచ్చుకొన్నట్లున్నది. నీమనసు చిన్నవోవునేమోయని నేనింతదనుకఁ గొంతగాంభీర్యముం దెచ్చిపెట్టుకొని యిటులుంటిగాని నిజముచెప్పవలసినదేని నాహృదయమెంతయు మఱుగుచుండుట యొప్పుకొనకతప్పదు. ఏమహాత్ముఁడు దయారసైకచిత్తమున దానినొసఁగెనో యెట్టికార్యములు దానిసాయమున

నవలీలసిద్ధింపఁగలవో యయ్యది యుండిన సాటి రాచకూఁతులలో నే నెంతటిధన్యనగుదునోగదా! అట్టివన్నియు నీశ్వరేచ్ఛ భగ్నమొం దినవని నిర్విణ్ణహృదయనై యుండి నీమనసు నొవ్వనాడఁజాలక యూరకుం టి. నీకెంత రోసమును బూనికయుఁ గల్గినవి కావున నేఁగరమదృష్టవంతు రాలనని యెన్నుకొనుచుంటి. నీకాఱునెలల గడువుకాదు. రెండాఱు నెలల గడువైననొసంగుదు. కార్యసాఫల్యముఁ జేయవలయు. ఇది క్ర మ్మఱలభించునేని నీవు నాకుఁగాదుకాని నేను నీకాజన్మాంతము పరి చారికనై యుండెదనని చిఱునగవునగుచుఁ బల్కి మీఁదఁజేయివైచి నిమిరి “యింకనిదురింపఁ బొమ్మా. పాపము నీవీదినమునఁ గడుడస్సి చెన్ను చెదరియుంటివి. రేయి చాలగడచుట నాకునిద్రాభారమున నావులింతలు మెండుగవచ్చుచున్నవి. రాగలతికా నీవుంబన్నుండవే” యని మెల్లమెల్ల మల్లెపూవు సెజ్జపై మేనువాల్చె. రాగలతికయు జరి గినవృత్తాంతమంతయుఁ దలఁచుకొనుచుఁ గొంతసేపు తదేకధ్యానమున నిదురరాక పాన్పుపైఁబొరలుచుఁ దుదకు నిదురించె. నాగవల్లి తనచె య్యురాండ్రిరువురు నిదురించువఱకుఁ దానుఁగూడ మంచముపైఁబ న్నుండి నిద్రనభినయించి వారుగుఱ్ఱుపట్టిన వెంటనే నిద్రచాలించి మం చముమీఁద గూరుచుండి చెక్కిటఁ జెయిచేర్చి తనలో నిట్లని విచా రింపఁజొచ్చె. “ఈదివ్యకుసుమంబు నే మరలసంపాదింపఁజాలనేని కా ర్యభంగంబుజేసిన యపనింద నామీఁద నాచంద్రార్కము నిలుచును. అందెట్టిరహస్యముఁ లున్నయవియో! ఆయంశము లన్యజనము లెఱుఁ గఁదగినవో కావో! అవి యెఱుఁగఁదగనివేని నాకతమున నెంతలాప దలైన వాటిల్లు. సిద్ధుఁడొసఁగినది సాధారణమైనదయి యుండదుకదా? హా! మాలదైవమా! నాకెంతమనఃక్షోభముల దెచ్చిపెట్టితివి? అయి న విచారించినగార్యమేమి? నానెఱజాణతనమిందుఁ బరులకుఁజూపి యీదివ్యకుసుమమును దొంగకు దొంగనై సంగ్రహించెద. ఎవఁడు

దానిని మాచెలినిమిత్త మొసఁగె వాని పేరరసి కనుఁగొని, యెవ్వఁడు పూలచెండులో నిమిడ్చె వానివృత్తాంతముఁ దెలిసి, యెవఁడు నావద్దఁ బువులుగొనియె వానిగుట్టుమట్టు విచారించి యెవనికడ నిప్పడదియుండు వానియిల్లుతివ్వి యందఱిహృదయములఁ జిచ్చువెట్టికాల్చి యీజరాసంధుని రాజధాని నొకకడకుఁదెచ్చి విడుతు. నాయంతమదియో, దానియంతమునేనో కనుఁగొనవలయు. పూలచెండులో దివ్యకుసుమమర్చినవాఁడు రోహణకుఁడగుటచే దీనియర్థమాతనినడుగఁదేటపడును. తరువాత నాతనితో ముచ్చటింపనగు" నని కొండొకసేపు వితర్కించి మనఃక్షోభమును గనబడకుండఁ జేయునంతటివేగముతో వచ్చుచున్న నిద్రికులోనై కనులుమూసికొని పండుకొనియె.

ఏడవ ప్రికరణము.

వెనుకటిప్రికరణమునందు వర్ణింపఁబడిన యంశములు జరిగిన కొన్నినాళ్ళకుఁ దరువాత నొకనాఁడు, సాయంకాలమున, నమూల్యాభరణములు విలువలేని వలువలు మేనఁదాల్చి, శుభలక్షణముల ముద్దులమూటగట్టు పారశీకహయమునెక్కి యొకపురుషుఁడు రాజాంతఃపురమునై పరుగుచుండెను. ఆతనిఁజూచి వీధియరుగులపయిఁ గూరుచుండువారందఱు లేచి జోహారొనర్చి వినయముగదుర సెలవుగైకొనిపోవుచు నాతఁడు దాఁటి చన్నపిదప "రణార్ణవుఁడు కోటకుఁ జనుచున్నవాఁడు. నేఁడెవ్వని యాయువు మూఁడినదో గదా" యని తమలోఁ రహస్యముగఁ జెప్పకొన్నసాగిరి.

ఆబాటనరుగుచు లాయాశ్వకునిఁ గని యొత్తిగిల్లి భయముతో దారియొసంగుచుండ నాతనికెమరైన మంత్రిసామంతాదులగు నుద్యోగులు సామాన్యులట్ల తమతమ యరదములు, గుఱ్ఱములు దూరమున

నిల్పి యాతఁడు చన్నపిదప సాగిపోఁదొడఁగిరి. ఇట్లు కొంతదవ్వేగి రాజాంతఃపుర సమీపమునకుఁ జని క్రొత్తగా నలఁదఁబడిన సుధావిభూతితో, నందము మీఱి యౌన్నత్యమున, ధావళ్యమున, హిమాలయమును మఱపించు తేనిమేడముందటఁ దనగుఱ్ఱము నాపి మెల్లనదిగి, మహారాజదర్శనార్థమరుగ సమయమగునా కాదా యని కావలివాండ్రి విచారింపకయె మేడమీఁదికరుగ మెట్లెక్కఁదొడఁగెను. రాజభటులెక్కడవారక్కడఁ దొలఁగి యూరకుండిరి. ఈపురుషునకు రాజునొద్ద రాజాంతఃపురమునందుఁగల స్వాతంత్ర్యము, చనవు నెల్లవారెఱిఁగినదగుట నెవ్వరు నాతని కెదురాడరు. అట్లు మెలమెల్ల మెట్లులన్నియు నెక్కి యంతస్తువెనుక నంతస్తుదాఁటి కడమేడమీఁద స్ఫటిక శిలావినిర్మితమై తనప్రతిబింబము గనఁజేయు నొకచోట నించుక నిలిచి యరమూయఁబడిన తలుపుసందునుండి లోనికిఁ దొంగిచూచి మహారాజు ప్రధానులలో నొకరితో రహస్యము మాటలాడుట యెఱిఁగి యది యదనుగాదనిశంకింపక తలుపులఁ ద్రోసికొని గుభాలున లోనికిఁజనియె.

చని సవినయసంభ్రమచిత్తంబుతో కరములుమోడ్చి కట్టెదుట, నున్నతపీఠముపై సుఖాసీనుఁడై యున్న జరాసంధుని చరణరాజీవములకు మ్రొక్కి యవి కన్నులనద్దుకొనియెను. పాదములపైనున్న రణార్ణవుని లేవనెత్తి జరాసంధుఁడు దనప్రక్క నొకపీఠముపైఁ గూరుచుండ నియమించి యెద్దియో కార్యవిశేషమున నాతఁడువచ్చుట యెఱిఁగి మంత్రికి సత్వరము సెలవొసంగెను. అనంతరము రణార్ణవునిఁ గుశలమడిగి రాజు పురవార్తల వినఁ గుతూహలము నొందుచున్నట్లు ముఖవైఖరి తెలుపుటయు వారిరువురు నిట్లు ముచ్చటించిరి.

జరా—కుమారా! గిరివ్రజమున జరుగుచిత్రములన్నిటికిఁ జూపునట్టి నిలువుటద్దమువై నీవు నాకడనుండఁబట్టియే యింతనిర్విచారముగా నేనీమహీభారమును వహించుచున్నాఁడను. నగరమునఁ గ్రొ

త్తగఁ గొందఱు వాసుదేవానుచరులు బయలుదేరుచున్నారు. వారి నిర్మూలించుట మనకు మొదటిపనిగదా.

రణా—దేవరవారియనుగ్రహము నాపయిఁ గలుగ నేను స్వామికార్యమున నప్రమత్తుఁడనై యుండి వాసుదేవానుచరులపయిఁ జిచ్చుఱపిడుగులాగునఁబడి, కూకటివేళ్ళతో వారినందమొందించెద.

జరా—ఇప్పుడేవయిన వింతల విన్నవింప వచ్చితివా ? యూరక చూడ నరుదెంచితివా ?

రణా—నిమిత్తములేక యిట్టివేళల రణార్ణవుఁ డెన్నఁడేని మిముదర్శింపవచ్చునే? మునుపటివానికన్న నెక్కుడు చిత్రమైనదియు, ముఖ్యమైనదియు, ముందుగా విచారింపఁ దగినదియు, నగునొక యంశమున్నది. నాకు మూఁడునాళ్ళక్రిందట మొగలిరేకుపై లిఖింపఁబడిన యుత్తరమొకటి చేఁజిక్కినది.

జరా—కుమారా ! ముందుగా లేఖ ననుఁజూడనిమ్ము. నామనసు తత్తరపడుచున్నది.

రణా—అయ్యా, నేనే యీలేఖను జదువువాఁడ తాము వాక్యసందర్భములను, దానియందలి యంశములను జక్కగాఁ బరిశీలింపుడు. చదువుచున్నానిదిగో వినుండి.

“ త్రిలోకసుందరీ ! నాఁడు గోరువంక నిమిత్తము నిన్నుఁగలసికొని నీముఖారవిందము గనుగొనుటమొదలు నాహృదయము నిన్ను విడునదు. నీకును నాపైఁగరుణ యించుక కలదని కర్ణాకర్ణిం బలుమారు వినియున్నందున విదేశమునందుండియు మునుముందు నేను నీకు లేఖ నంప సాహసించితి. మనసమాగమము సర్వవిధముల నసంభావ్యమని తోఁచెడు. ఈకార్యసంఘటనమునకుఁ జుమీ యేనిట్లు వెడలి నామిత్రుఁడును, నీకు సర్వదా మేలుగోరువాఁడు నగు నొకపుణ్యపురుషుని సందర్శింపవచ్చితి ”

జరా—ఇది కేవలము కాముకవ్యాపారముగ నున్నది. ఇందు
ద్దేశింపఁబడిన యంగన యొకని యిల్లాలో, కన్యయో తెలియరాదు.

రణా—దేవా! ముచ్చటయంతయు ముందున్నది. ఉత్తరము
నందలి మిగిలినభాగముకూడఁ దమరు చిత్తగింపవలయు.

"భర్తా, మరణమునొందు నుపాయము నన్వేషించుటలో నీ
దాసుఁడు మెలఁకువగ వర్తించుచున్నాఁడు. మనరాజ్యలక్ష్మికి వైధవ్య
మును, మనకు గళ్యాణమును నేకముహూర్తమునందె యయ్యెడునని
నాకుఁబోడకట్టుచున్నది. ఊరక బేలవై చింతింపవలదుసుమీ?" అని
యుత్తరమందున్నది.

జాబులోనున్న కొదువ మాటల వినునప్పటికన్న నీకడపటి వా
క్యములు వినినప్పుడు జరాసంధుని ముఖము జేవురించి యెల్లప్పుడు
చూచు రణార్ణవునికే మది నతిభీతిగొలుపఁ జొచ్చెను.

వజ్రపంజరముచాడ్పున నతిదృఢమై యాయుధదుర్భేద్యమగు
తన నెమ్మేను బిట్టులుకఁ గంపింపఁ బటపట పండ్లుగీటుచు "రే. రే.
దురాత్ములారా రాజద్రోహులగు మీకులకాంతలు, వైధవ్యము వ
హింపకమున్న, మీరందఱు యమగృహమునకు నతిథులుగఁ జనకము
న్న సర్వధారుణీ చక్రమునగలఁ రాజచక్ర మట్టుడికిన ట్టుడుకకమున్న
రాచపురు గనుపేరుగూడ నశియింపకమున్న మగధరాజ్యలక్ష్మికి వైధ
వ్యము ప్రాపించునే! రణార్ణవా యీకేతకీ దళ మేదురాత్ముని యింట
నెవనిచేత నెన్నఁడు నీకులభించెనో ముందుగా ఋజుఁగఁజేయుము. ఈ
నాయులుకచే రాజద్రోహులు మనగిరివ్రజమున నింక నుండరుసుమీ"
యని తనమందిరములు, మేడలు, ప్రతినాదముసేయు గంభీరస్వరముతో
నాతఁడు పలికెను. రాజునకుఁ గోపాగ్ని జ్వాలలుగా మండుచున్నతఱి
నందు సమయోచితముగ సమిధలు తగిలించుట రణార్ణవునకు వెన్నతోఁ
బెట్టిన విద్యయగుట నదను దాఁటనీయక, నిజానిజములు నిదానమునఁ

బరిశీలింపక పాపపుణ్యములకు వెఱవక, తన మందబుద్ధికిఁ దోఁచిన తెఱ గున నిట్లని యాతఁడు విన్నవించె. " మహారాజా! ఈలేఖ వ్రాసినవాఁ డెవ్వఁడో నిర్ణయించుటకుఁ నాకుఁ బ్రస్తుతము తగిన యాధారములు గానరాకున్న వయినను నామెఱింగిన యంతవట్టు తమకుగల యనురాఁగ ము, నాచేఁ జెప్పింపకపోదు.

మూఁడునాళ్ళక్రిందట నుషఃకాలమున తమకత్యంత ప్రేమాస్ప దుఁడగు విజయసేనుని యింటికి జయసేనుని సందర్శించునిమిత్తము మెల్లమెల్లనరుగునప్పటికి నాకంటికి జయసేనుఁ డగపడఁడయ్యెఁగాని యొ క పీఠముమీఁద నీమొగలిరేకు చిత్రితము లైన వర్ణములతోఁడఁ గానవ య్యె. అట్టివి కంటికిఁ గానవగుటయు నాచేఁజిక్కుటయు నొక్కమారె యగునని తమతో వేరుగ నేను విన్నవింపనక్కఱలేదు. " రాజకార్య మున దొంగతనమొనర్చినను దాన దోషము వాటిల్లదను దృఢవిశ్వాస ముతో దీనిని సంగ్రహించి యేలినవారి కర్పించుటకు నామనసు మన సులోలేదు. ఈయుత్తరము మనపురమున నివిచహిత యగునొకకన్యఁ గూర్చి యొక తేజోలావణ్యరాశియైన రాచపట్టిచే వ్రాయబడినదనియు నాతఁడు ప్రస్తుతము దేశాంతరమున నున్నవాఁడనియుఁ దన హృదయ పీఠమునఁ బాదుకొనియున్న యాయింతి కీజాబిమ్మని జయసేనుని బంపి యుండవచ్చుననియు నాకుఁ దోఁచెడు. మీఁద దేవర చిత్తము.

అనవుఁడు మగధేశ్వరుఁ డాశ్చర్యము నాగ్రహము నేకకాలమునఁ దన్నుబురిగొన నాకు బాల్యస్నేహితుఁ డగు విజయసేనుని నందనుఁడు జయసేనుఁడుగూఁడఁ గుట్రలోనివాఁడని యనుటకు నాకు నోరాడకున్నది హా! జయసేనా, మగధరాజ్యలక్ష్మికి పైదోడ వైయుండి వాసుదేవ బ లరామప్రముఖుల సంగరమున నిర్జింతువని యెంచితిఁగాని యిట్లు నిర్హే తుకముగ సంబంధములేని కుట్రలంజొరఁబడి నాకోపాగ్నికి మిడుత వై కాలమరణము నొందుదువని తలంప నైతి. అల్పాయుష్మంతుఁడయ

వగునిన్ను దలపనాకుఁ గోపాగ్నిలో జాలివొడముచున్నది. విజయసే నునకుఁ బుత్రశోకమహాదుఃఖమును శాశ్వత మగునపనిందఁదెచ్చు శ త్రుండవెకాని పుత్రుఁడవుకావుసుమీ !" అనిపల్కి యాక్షణము జయ సేన విజయసేనుల నిరువుర వెంటఁబెట్టుకొనిరమ్మని యిరువురు సేవకుల నంపఁదలఁచి మఱల నట్టిపని కావస్యకత లేదని, మరునాఁడుదయముఁ బ్రధానవర్గముతోఁ దగుయోచనముసల్పి, విచారింపవచ్చునని గుణార్ణవు నితోఁ గొంతసేపు ముచ్చటించి వానినింటికంపెను.

ఎ ని మి ద వ ప్ర క ర ణ ము.

నాఁడు కేతకీదళమట్టు లదృశ్యమగుటయు జయసేనుఁడు రాజలే ఖమీఁద రాజలేఖకన్నఁ దారామతిమీఁద గట్టియనుమాన మూని లేకు నిమ్మని దాసినిఁ గొంతతడవడిగి భయకంపితయై యామె నిరుత్తరు రాలుగా నామెనువిడిచి కడుదిగులు గొనియుండెను. సాయంకాల మగునప్పటికి జయసేనుని మొగమంతయుఁ దొంటివికాసముజ్జగించి, నిట్టూర్పుల యావిరిచే వన్నెసడలి మలినమైయుంటయుఁ, దండ్రి, యాతని యెడ నెద్దియో భయము కలుగునని వానివిషయమై యత్యంతము జాగ్రత్త వహించి యారాత్రి మేలుకొని తనసంగతి కుమారుఁ డెరుగ కుండ నప్రమత్తుఁడై మెలఁగెను.

అప్పుడు రమారమి రెండుయామముల రాత్రియై యుండనోపు. అత్తరి మనసునందలి కలఁతయచు మున్నీరు పెల్లుబ్బి పొరలు కతమున రిప్పున జయసేనుఁడు లేచి యేరినింబిలువక తలుపులందెఱచి యుత్తరీ యముఁగూడ గదిలోన వదలి ఢిలువిడిచి యొంటరిగఁ జనుచుండెను. అనిమిషమున నతని మొలలో నాతఁడు సర్వకాలసర్వావస్థల ధరియిం చు కత్తియుఁ దండ్రి కొన్నినాళ్లక్రిందట ముద్దుగా వ్రేలనిడిన పచ్చల

యుంగరము దక్క నితరవస్తువు లెవ్వియు లేవు. విజయసేనుఁడు కుమారునిచేష్టలఁ గనిపెట్టియుండియుఁ జెవులకించుక వినఁబడి వినఁబడకయున్న తలుపుచప్పు డన్యముగా భావించి, బద్ధకముచేఁ గదలఁజాలకయించుక సందేహించి మరల నదియేమో చూడవలయునని లేచి కొడుకు నిజస్థానమునం దగపడకుని కొంతయుఁ దొట్రుపాటునం దలవాకిటికిం జని చూచునప్పటికి వడివడి జయసేనుఁ డెందులకో యరుగుచుండెను. సేవకులను దనసహాయార్థము రమ్మనిపిలువ వ్యవధిలేమి విజయసేనుఁడు దానొంటరిగ నలక్షితుఁడై కొడుకువెంటఁ జనుచు నాతనిగమ్యస్థానము నెఱుఁగఁదలఁచెను. నిష్కాముఁడై యందఱవిడిచి చను శుకయోగి వెంటనంటి తిరుగు బాదరాయణువితమున జయసేను వెంట విజయసేనుఁ డనుగ నరుగఁ గొంతొకసేపటికి నెట్టయెదుట వికసించిన కల్వలుగల్గి, ముకుళించిన తెలిదమ్ములుగల్గి, యలసి సొలసి వచ్చు బాటసారులందేర్చు తేటనీరుగల్గి నలుగట్లబారుతీర్చిన జోదుల పగిదినున్న చెట్లుగల్గి వారిరువురకు మనోవ్యధల మఱపించు నొకసరస్సు గాననయ్యెను. గవ్యూతి దూరమున నది పొడగట్టుటయు, శీతలజలకణములతో వియ్యమొంది పుష్పాదులతో నసఁగి పెనఁగి, దక్షిణ దిశనుండి వెడలెడు మలయమారుతము దండ్రిగొడుకుల నానందవార్ధి నోలలాడించెను. ఆనందముఁ బయికిఁదోఁచనీయక జయసేనుఁడు మూఁగచాడ్పున నోరెత్తక ముందు సాగిపోవుచు నాకొలఁకునఁ జొరఁబడి మీఁగాళ్ళు, చీలమండలు, పిక్కలు, మోకాళ్ళు క్రమమునఁ దడియునట్లు లంతకంతకు లోఁతుగఁ జనుచుండెను.

ఆజలాశయమునఁ జొచ్చి బలవంతముగ ముద్దులపట్టి యాత్మహత్య గావించుకొనునో యనుభయమును, భయముతోఁ దొట్రుపాటునుఁ దన్నుబఱికొలుప, విజయసేనుఁడు పట్టరాని కడుపుదీఁపిచేఁ గనుఁగొలకుల వెచ్చనినీరు గాఱఁ గొలఁకులోనున్న కొడుకు నుద్దేశించి

"వత్స! నఖలు సాహసమ్ నఖలు సాహసమ్. అహమస్మి అహమస్మి" యని గీర్వాణభాష యతని కభిమానభాష యగుట నందు మందలించెను. ఆమాటలు విని యదరిపడి జయసేనుఁడు వెనుకకుఁజూచి తన వైపు వచ్చుచున్న యాపురుషునిఁ బొడగని తెరచినకన్ను మూయక వానివైపొక్కరీతిగఁ జూడనారంభించెను. అంతలో విజయసేనుఁడు పరుగెత్తుకొనివచ్చి కుమారుని చేయిపట్టుకొని "వత్సా! ఇదియేమి సాహసము. నీ కేతకీదళవృత్తాంతమంతయు రాజలేఖ నాకు విన్నవించినది. తారామతియు దాసియు నిందు నిర్దోషులు. ఆత్మహాని యొనర్చుకొంట పౌరుషమే? నినునమ్ముకొని దినములకై యెదురు చూచుచున్న నన్ను దుఃఖజలధినిముంచి యీజలముల నీవు పడఁదలఁచితే? రా నాయనా" యని తటాకమునుండి బైటికిఁ దీసికొనివచ్చి యనేక ప్రశ్నములాతని నడిగెను. కాని యందొక్కదానికేనియు నాతఁడు ప్రత్యుత్తరమొసంగక బొమ్మవలె కనులప్పగించి చూచుచుండెను. కూరుచుండు మన్నప్పుడు కూరుచుండుటయు, నిలువుమన్నపుడు నిలుచుటయు, సాగినడువుమన్నప్పుడు నడుచుటయు మొదలగు చర్యలేకాని వానికి నోటిమాటలు లేవయ్యె. ఈవైపరీత్యముఁజూచి కుమారునకు మనోవైకల్యము కతమున మతిచెడినదని తండ్రి నిశ్చయించి తగిన చికిత్సఁజేయింపఁ దలఁచి యంతవఱకు నిది రహస్యముగ నుంపఁదగునని ప్రియపుత్రుని నొకచాటు గదిలోనుంచి తలుపుమూసి తద్ద్వారమునఁ దానుఁ గావలియుండి యేరిని లోపలికిఁ జననీయకుండెను.

అట్లు రణార్ణవుఁడు జరాసంధునకు మొగలియాకు జాబునొసంగి చెవులలోఁ గొండెమును విషముబోసి యారాత్రి యరిగినపిదప రాజుమరునాఁడు వఱువాత లేచి యంతిపురమునడాగినఁ యుదయభాస్కర బింబమోయనునట్లు లారుణ్యమునఁ బెరయు ముఖవైఖరితో నొకచోటఁ గూరుచుండి జయసేనవిజయసేనులఁ దోడుకొని రమ్మని యిరువురు యమ

దూతలవంటి కింకరులనంపెను. అప్పటికి జయసేనునకుఁ జిత్తచాంచల్య
ముదయించి మూఁడుదినములయ్యె. స్వామియానతినేగాని, పిలువనంపిన
కారణములం దెలుపక రమ్మని త్వరపెట్టుచు నిరువురు సేవకులువచ్చి ని
లుచునప్పటికి విజయసేనునకు నేమికతనముననో గుండెలు చెదరిపోయినవి.
సేవకులు పెట్టుతొందరఁ జూడ నీతనికనుమానము నెమ్మనమున నెంత
యుంబొడమి కళవళ మొందఁజేయ నాతఁ డిట్లని తనలో వితర్కింపసాగెను.
'అక్కటా! ఈవిధముగానున్న కుమారుని మహారాజుసన్నిధి కెట్లుతీసికొ
నిపోవువాఁడను. ఈసేవకుల వైఖరిఁజూడ నెవ్వరో మామీఁద ఱేనితో
గొండెములు చెప్పి యలుక వొడమించినట్లు కానఁబడుచున్నది. అయి
నను విజయసేనునకు నాపత్తులలో ధైర్యము మిక్కుటమని జనులు చె
ప్పుకొనువాక్యము నేఁడు నిజముగావింపయత్నింతు. నాతనయుఁడు వా
సుదేవుని పాదరాజీవములు మొదటినుండియు నమ్మినవాడుకదా" యని
కొడుకుం బిలుచుకొనిపోక తానెక్కడ యరదమెక్కక సేవకులతోఁ గా
లినడకఁ గోటకుఁ బయనమై యరిగెను. సేవకులు మెల్లమెల్లన వానిం
దోడుకొని రాజునెదుటికిం గొంపోయి విడిచిరి. విజయసేనుఁడును దాను
బలుమాఱు చనిన యాయంతిపురమునకుఁ దొంటివలె సాహసముతోఁ
జనక వెనుకకు లాగుచున్న యంతరాత్మతోఁ దనముందటఁ గడాని గ
ద్దెమీఁద భుజపాళికారద్వయము నడుము మగధ రాజ్యలక్ష్మియను శు
ద్ధాంత కన్యక చిందులుద్రొక్క ననువగు వజ్రపీఠమువంటి విశాలవక్ష
స్థలముతోడను, మొగమను నచ్చపుటద్దమునుండి వెలికిఁ బ్రతిబింబించు
కోపాగ్ని జ్వాలాకాంతియో యను సందియమొదవించు ముఖవైఖరితో
డను, రాక్షస క్రౌర్యమును క్షాత్రధర్మమును జంటగా మూర్తిఁగైకొ
నెనో యనిపించు తేజముతోడను గూర్చుచున్న ఱేనిఁగాంచి యెదుట నిల్చి
జోహారొనర్చెను. రాజసభలో విజయసేనునకు మున్నెంతయు గౌరవం
బుండెను. నాఁడు జరాసంధుఁడు విజయసేనునిపైఁ బొడమిన కినుక చే

నాతనికిఁ గూరుచుండఁ బీఠమొసఁగక మునుపటియట్లు చిఱునగవు మొగమున నంకురింపఁ బలుకరింపక, తొంటిచవవాతని కొసంగక రూక్షవీక్షణములతో నాతని కిట్లనియె. “ విజయసేనా! వాసుదేవ పక్షపాతియైన నీకుఁగూర్మి కొడుకెక్కడ.”

విజ—దేవా క్షమియింపుము. నాకుమారుఁడు గృహమునఁ గలంత కతమునఁ జిత్తచాంచల్యము నొందియున్నవాఁడు. అందుచే రాలేదు.

జరా—మగధరాజ్యలక్ష్మికి వైధవ్యము సంఘటించుటలో నీకుమారుఁడు కడునప్రమత్తుఁడై యున్నాఁడుగదా. అతని కీచిత్తచాంచల్యమేల?

విజ—రాజభక్తికి నిధి యగు మాకుటుంబముపై మహారాజుగారి కట్టియనుమాన ముదయించుట మాదురదృష్టఫలము.

జరా—రాజభక్తికిఁ గాదు. ఇప్పుడు రాజద్రోహమునకు నిధి. భక్తిమాట యటుండనిమ్ము. ఇప్పుడు ముఖ్యముగా నీకుమారుని నిమిత్తము మేము వార్త నంపితిమి. అతఁడు చిత్తచాంచల్య మొందినను సరియె, ఏమయినను సరియె, వచ్చితీరవలయుఁ జచ్చితీరవలయు—ఓరీ! నలువురు సేవకులు విజయసేనుని యింటికిఁజని జయసేను నొకబండిపైఁ గూర్చుండఁబెట్టి సత్వర మిటకుఁ దోడుకొనిరండు.

అని భటుల నంపుచుండ విజయసేనుఁడు చూచుచు నూరకుండి రాజుమాట యర్థముగాక చింతిల్లుచుఁ గుమారునిదెస నాసవిడిచెను. అట్లుకొన్ని నిముసములు జరాసంధ విజయసేను లొండొరులతోఁ బలుకక మనోగత కోపదుఃఖములకు లోనై యుండునప్పటికి వాకిట నెద్దియో యరదము నిల్చినచప్పుడు వినఁబడి విజయసేనునకుఁ దనకుమారుని దురవస్థ సమీపించెనునని విధి చాటుచున్న చప్పుడువలెఁ దోఁచె. అంతఁ గొన్ని నిముసములకు జగము నెఱుఁగక యున్నవాని, వివర్ణవదనుఁడగువాని జయసేనుని సేవకులిరుగురు తోడుకొనివచ్చి రాజుముం

దర నిలువఁబెట్టిరి. మహారాజునొద్ద గౌరవము భయము భక్తియు ననె వునట్టి విజయసేనకుమారుఁడు నేఁడు రా జఁదున్నట్టు దలంపనివాఁడు వోలె, నిశ్శంకముగా ముఖమెత్తి చూచుచు బెదరిన యాలబోతువిత మున ఱెప్పవేయక యామాగధుని జూడసాగెను. మగధరాజాతనిము ఖమై ఖరీ నవలోకించి విస్మితుఁడై యించుక చూచి "శరీరమున నెట్లు న్నది? అలాగున నున్నావేమి" యని యడిగెను. జయసేనుఁడు యథా ప్రకారముగఁ దన్ను గానియట్టు లూరకుండెను. అంతట శాంతినొందక జరాసంధుఁడు మొగలిరేకు జాబునుఁగూర్చియు, మగధరాజ్యవ్యవహార ములఁ గూర్చియు, ననేకప్రశ్నలడిగి నిరుత్తరుఁడగు జయసేనునిపై నెం తయు నలుకఁబూని నిందించి యొక్కొకమా అతని విలక్షణపుఁ జూపు లకు నగుచుఁ దుదకు విసిగి యిట్లనియె. "ఓయీ! విజయసేనుఁడా! మ గధరాజ్యమున కపాయము సూచించు మాటలుగల యొకమొగలియా కుజాబు నీకొఁడుకునొద్ద మాసేవకులలో నొకనికి లభించినది. నీతనయుఁ డిదివఱకే వాసుదేవానుచరుఁడన్నమాట జగత్ప్రసిద్ధముగదా! అందుచే నాపైఁబన్నబడిన దుస్తంత్రంబులలో నీపట్టిచేరి పనిచేయుననుమాట వి శ్వాసార్హము. ఇప్పుడీజయసేనుని యందారోపింపఁబడిన చిత్తచాంచ ల్యము, కుమారుని ప్రాణరక్షణార్థము నీవు బోధించిన మంత్రమో స్వయముగా నాతఁడే యభ్యసించిన విద్దియయో మాకుఁ దెలియకున్నది. అంతవఱకు నీతనయుని శత్రురాజమండలముతోఁ గారాగృహ బద్ధుఁ గావించెద. నీవునీగృహమున కరుగవచ్చు. ఓరీ యెవఁడురా యక్కడ! ఈజయసేనుని చెఱసాలనుంపుఁడీ" యని యానతిచ్చి పీఠము మీఁదనుండి లేచెను. విజయసేనుఁడు గొడ్డలిదెబ్బల నేలరాలు వృక్షమువలె మూర్ఛ ల్లెను. జయసేనుఁడు తొంటియట్లు కంటఁజూపెకాని నోటిమాటలేక ర మ్మని సేవకులు చెఱసాలకుఁబిలువ గంగిగోవువలె వారివెంటఁజనియెను.

తొమ్మిదవ ప్రకరణము.

నాగవల్లి యారేయికలంత నిద్దురనొంది కోడికూఁత వినఁబడునప్పుడు మేలుగాంచి తానొనర్చిన దుస్తరప్రతిజ్ఞలను దలఁచుకొని యట్టికార్యము తాను సాధింపనలవియగునాయని తన యశక్తతకును జేయవలసిన కర్జమునందలి కష్టమునకును వగచుచుఁ బ్రభాతమయిన వెనుకఁ జిత్తము కార్యాయత్తము గావించి దేహము గృహకృత్యములకు నప్పగించెను. అట్లు తనకార్యసాధనతకు నుపాయముపయి నుపాయము వెదకి వానియందు దనకు వాటిలు నపాయములను దూరదృష్టిగలిగి యెఱుఁగుచు నాలుగుదినములు రాగలతికతోడను, గుణోత్తమతోడను బుచ్చి యైదవనాఁడు నిశి భోజనానంతరము నెచ్చెలులకిరువురకు నిట్లనియె. "పూలచెంబుమాట రోహిణకునడిగితిని. అతనిం గాలుకసుపులు బట్టుకొని నే నెంతయుల బతిమాలి యీరహస్య మన్యులకు నెఱుఁగఁజేయనని యెన్నోబాసలు చేసి యడుగఁగా నాతఁడు మిగుల కష్టముమీఁద నాతో నిట్లనిచెప్పె:—

"ఓనాగవల్లీ! దీనివృత్తాంతము కడురమణీయము. నీకుఁ జెండు నేనొసఁగిననాఁటికిఁ బూర్వదినమునఁ గడసంజయగుతటి బేరగాండ్రితోఁ బూలవిక్రయించుసందడిలో నేనుండ నాచెవులకు "నారాయణ నారాయణ" యనుశబ్దము వినవచ్చెను. వెంటనే బేరగాండ్రి నించుక తొలంగుడని చూచునప్పటి కొక్కసన్యాసి నాదృష్టిపథమున నిలిచెను. కోరికలనెల్ల జయించిన పరివ్రాజకులు, గాముకజనోపభోగ్యము లగునెత్తావి పువ్వులు గొనవత్తురా యని నేను సందేహమొంది లేచి వందనమొనర్చి స్వామీ యిందు వేంచేయుఁడని పూలబుట్ట నిడుకొను ముక్కాలిపీట నాయనకొసంగి కార్యమున్నఁగాని మహాత్ములు నన్నుభోలు నల్పుల ననుగ్రహింపరారని నిశ్చయించి బేరగాండ్రనందఱి వడి

వడినంపి యాస్వామి యనుగ్రహమునకు నెదురుచూచుచుఁ గట్టెదుట నిల్చితిని. ఆకారముదాల్చిన వినయముచాట్పున నిలువఁబడియున్న నన్నుఁ గూర్చుండుమని యానతిచ్చి యాయతి "నీవా రోహణకుఁ డ" వని యడిగెను. దేవరవారు సెలవిచ్చినట్టే యీ తమసేవకుఁడే రోహణకుఁడు స్వామీ యని నేనంటిని. అనంతరము మహాత్ముఁడతఁ డు నన్ను నఖశిఖపర్యంత మొకమాఱు చూచి యంగడిమీఁద నెవ్వరు లేరుగదాయని యడిగి "రోహణకా! నీతోఁ బరమరహస్య మొండు దెలుపవచ్చితి. నాయుపదేశింపఁబోవునదియు, నీవొనర్పవలసినదియు నగుకార్యము దైవహితము. దీనిందప్పక నెరవేర్తుననియుఁ గుట్టుదాఁ పగలననియుఁ బ్రమాణమొనర్తువేని నావచ్చుపని నీకెఱింగించెద" అనవుడు బ్రహ్మతేజముట్టిపడ నెదుటివారి వాగ్బంధనముసేయు నాత ని మొగముసొరు నాడెందమునఁ గ్రొత్తబత్తిఁ గల్గించుటచేఁ దప్పక యట్లు సలుపువాఁడనని యతీశ్వరుని పాదములఁ గొట్టి బాసచేసి సిద్ధ ముగనుంటి. అంతటనాతఁడు కమండలములో రెండువేళ్ళఁ జొనిపి యొక తెల్లనిమొగలిరేకు నీవలకులాగి తన కాషాయవస్త్రములతోఁ దాని తడియాఱదుడిచి నాతో "రోహణకా! కలదుగదా యీనగర మున సౌందర్యతిలకాభిధానయగు గుహోత్తమ. ఈయుత్తర మాపుత్త డిబొమ్మ కట్టులేనియు నందఁజేయవలయు మన ప్రసంగ మన్యులచెవు లఁ బడఁగూడనట్లు మొగలిరేకు నెవరికంటఁ బడఁగూడదుసుమీ" య ని యది నాచేతికిచ్చి "ఇక్కడ నేఁ దడయరాదు. గౌరీమఠమునందలి సన్యాసులు నానిమిత్త మెదురుచూచుచుందురు. ఈ యమరహిత కార్యము నిర్వర్తించు భాగ్య మిందఱు వర్తకులలో నీకొక్కని కబ్బి నది. జాగ్రత్త" యని చప్పున నంగడిమీఁదనుండి లేచి నాలుగడుగు లు సాగనంపఁబోయిన నన్ను రావలదని నిల్పితిరస్కరిణీవిద్యచే నదృ శ్యుఁడయినమాదిరి నెటకో చనియె. అగ్నిహోత్రుని యర్చిస్సువంటిఖ

ముఖవర్చస్సుఁగల్గి నిలువెల్లఁ బూయఁబడిన బూదియకాని వేఱొక యైశ్వర్యమునెఱుఁగక, కాషాయవస్త్రముల రక్తిమగాక యొండొకరాగ మెఱుఁగక, వేల్పుటేరుడించి 'వేఁడికన్నుడాఁచి, మేనితెల్పు, మెడనల్పు గుట్టుపఱిచి, పులితోలు ముమ్మొనవాలు నింటమఱచి, లేఁతనెలను లే డిపిల్లనువిడిచి, నిండు మగవేషముఁతో నేలగుమ్మలు శంకరుఁడేమో యని నాకాతనియందు భయముభక్తియుఁ గుదిరినందున నాతఁడానతి చ్చినభాతి మరునిచేతి చికిలిబాకుఁబోలు నారేకు చెంతనుండమర్చి నీకి చ్చితిని. “నాగవల్లీ! ఈవృత్తాంతము పరమగోప్యముసుమీ. నీవు నోరుజాఱి నెచ్చటనైన దీని నూఁదితివేని నిర్హేతుకముగ నేను యతి శాపహతుఁడనగుదుసుమీ! నన్ను మిగుల జాగ్రత్తతో వర్తింపఁజే యవలెనని యాతఁడది యమరకార్యమనియెనేకాని యది నిక్కమరసి చూడఁ గాముకవ్యాపారము. ఆరేకుపై నక్షరములు లిఖియింపఁబడినవి. నేను జదువను వ్రాయను నేరని వర్తకుండనగుట నేమివ్రాయబడెనో యెఱుఁగనైతి. మీగుణోత్తమ యాలేఖ “జదువుకొనియెనా” యని రో హిణకుఁడు దళముచరిత్రము పూసగ్రుచ్చినట్లు నాకరమరలేక తెలుపుట యు, నేనును, గొంతగాంభీర్యమువహించి రేకుపోయినదని వానిచెవులవే యక కేవల మబద్ధమాడక పాముచావకుండఁ గఱ్ఱవిఱుఁగకుండఁ బ్రత్యు త్తరము చెప్పివచ్చితిని.

నాగవల్లిచేసిన యుపన్యాసము గుణోత్తమను దత్తఱమొందఁ జేసి రాగలతికను విషాదమున ముంచెను. అందు గుణోత్తమ “హాచె లులారా! మనమనుకొన్నదానికన్న మిన్నయగునంశములు నేఁడు నాచేత వినఁబడినవి. ఈయుత్తరము దేశాంతరమునందుఁ బ్రస్తుతము కొన్ని కారణములవల్ల వసించుచున్న మనమిత్రుఁడు వ్రాసియుండు. అది యీజరాసంధ పక్షపాతు లగుచెనంటులచేతఁ జిక్కనేని చంద్రపా లుఁడు కూఁతు • కతమునను, మనమిత్రులు మనకతనను నెంతయు దుఃఖ

పడుదురుగదా? హా! యెంతకష్టము. అది కరిమ్మఁటి నా కెట్లుల భించు, నేమి యుపాయము?"

అనవుడు రాగలతిక మాఱి యావలకుఁ ద్రిప్పి కోపమున "మాతాత నాకగపడుటయు, నాగవల్లికేరు మరలఁ దెమ్ముటయు నొక్కనాఁడె. నీకన్నీరు దుడుచుటకు నాగవల్లి యల్లిన యల్లిబిల్లికల్లలకు నీవూరక యువ్విళ్ళూరెదవు. గుణోత్తమా! నిన్నుబోలు బేల నాకేలోకంబునఁ గానఁబడదు. ఏవానిచేత నిది చిక్కియుండు నాతఁ డందుండు పలుకుల కర్థముగాక చింపినను జింపు. అది లోహదారు నిర్మితముకాదు. కావునఁ జిఱిఁగి యీపాటికి నామావశిష్టమైనను గానొప్పు. నాగవల్లి తన్నుఁ గనుంగొనుదాక రేకు కనిపెట్టుకొనియుండునా!" యని నిష్ఠురోక్తులు, నిరుత్సాహజనకముగఁ బలుకఁ జొచ్చెను. అంతట నాగవల్లి మెల్లమెల్ల రాగలతిక కుత్తరముఁ జెప్పనట్లు! గుణోత్తమ చిత్తవైకల్యము దీర్చునట్లుకూడ నుండవలయునని, యిట్లనియె "అమ్మా! నాకల్లలు పొల్లుపలుకులు, చిన్నతనమునుండియుఁ జెవులు తడకలుకట్టునట్టు విని విసివియున్నారు. ఇంకఁ గొన్నినాళ్ళుకూడ నాలకించినఁ దొంటికన్న నెక్కుడుకీడు మీకురాదు. పుట్టినవెనుక యజమానురాలియెడల నాయొనర్చిన నేరమిది యొక్కటియేయని నాయభిప్రాయము. దీనికి నేనొక్క యుపాయముఁ బన్నితి. గిరివ్రజపురమునకుఁ గ్రొత్తగా జ్ఞాననిధి యనుపేరుగల యొకపరివ్రాజిక వచ్చి యెచ్చటనో విడిసి యున్నదఁట. ఆమె భూతభవిష్యద్వర్తమానవేదిని యనియు నడిగిన సందేహము లున్నవున్నట్టు తూచాతప్పకుండఁ జెప్పుననియు వాడుకకలదు. ఆమె నిండుజవ్వనమున నున్న యంగనయగుట దుశ్శీలురగు పురుషుల కంటఁ బడనొల్లకయో యింక నెందుననో తెరమఱుఁగున నుండియె ప్రత్యుత్తరము లొసఁగునుగాని స్త్రీలకయినఁ గానఁబడదఁట. జగదీశ్వరియగు భవాని ప్రసాదమున నాపరివ్రాజిక యిట్టిమహిమలకుఁ బుట్టినిల్ల

య్యెనని చెప్పెదరు. నేను రెండు మూఁడు మాసములలో నామె దర్శనముచేసి నాసందియమడిగి తెలిసికొని నీమనోరథమును నెరవేర్తును. ”

ఎట్లయినఁ గార్యముసాధించుటయె పూనికగా నేర్పఱచుకొన్న చెలికత్తెను బుల్లవిఱుపు మాటలాడి యుల్లము రాయిచేయుటకన్న నామె పూనికకుఁ దోడుపడి యుత్సాహముఁ గొల్పినఁ గార్యము శీఘ్రసాధ్యమగునని నిశ్చయించి కార్యవాదమునందె బుద్ధినిల్పి, గుణోత్తమ, యాపల్కులకు సంతసించి యటుసేయ ననుజ్ఞ నొసఁగెను. అనంతరము కొన్నిదినములకు, నొక్కనాఁడుదయమున గుణోత్తమ విరిసెజ్జనుండి లేచి యప్పాన్పుపైఁ గూరుచుండి యప్పుడప్పుడే నిద్రమేల్కను బద్ధకముచే, నావులింతలు మెండుగ వచ్చుచుండఁ గన్నులఁ దుడుచుకొనుచు, వీడివ్రేలాడు కచభారము జారుముడివైచి, నిద్రాసమయమున నలఁగునని యొకచోనిడిన చంద్రహారము మరలఁ గంఠమున నుంచుకొని “నాగవల్లీ! అద్దమొకసారితేవే, అని కేకవేసెను. పిలువఁబడిన నాగవల్లి రెండుమూఁడు పిలుపులకైనఁ బ్రత్యుత్తర మొసంగుటయు, వచ్చుటయు జరగదయ్యె. ఈలోపల రాగలతిక చేతనున్న పనిమాని యామెకద్దము దెచ్చియిచ్చి “యీదినమునఁ దెల్లవారుటాదిగ నాగవల్లి నాకగపడలేదు. నేనామెను గూర్చి మనజంబుకుని తఱచి యడుగ నాతఁడేదో విపరీతమైనకథ చెప్పుచున్నాఁడు. అది నానోటనుండి వినుటకన్న జంబుకుని ముఖమునవినుట నీకత్యానందము గల్గించునుగాన నాతనిఁబిలిచెద ” నని యట్లుచేసెను. జంబుకుఁడు చంద్రపాలుని తండ్రియగు శశిపాదుని కాలమునుండియు నింటనుండుటచే నాతఁడు చేయునది సేవకవృత్తియైనను గౌరవాస్పదముగనుండెను. అతనినొకచోటఁ గ్రిందఁ గూరుచుండుమని నియోగించి గుణోత్తమ నాగవల్లి పోయిన తెరువునుగూర్చి కొన్ని ప్రశ్నములడుగ నాతఁడిట్లనియె. అమ్మా! తెల్లవారుజామున నాగవల్లి నేనిక మంచముమీఁదనుండి లేవకమున్నె నాకడకువచ్చి నన్ను “జ-

బుకా! నాయొనర్చిన తెలివిమాలిన తనమును బట్టి రాగలతిక నన్ను గరము నిందించుచున్నది. దివ్యకుసుమంబు గనుఁగొనఁగలనని వట్టిబీరములు పల్కితిఁగాని యదికనుఁగొనుట నాతరముకాదు. అందుచే రాగలతిక పోరుపడలేకయు, గుణోత్తమ మొగముఁ జూడలేకయు, నేనీయూరువిడిచి, యొకపల్లియకుఁజని యందు వసియింతు. నాతెక్కలు చల్లగనున్న నాపట్టెడన్నము (దెచ్చుకొని నే బ్రతుకఁజాలనే? నేనిలు. దాఁటుదాఁక నీరహస్యమేరికిం జెప్పక తెల్లవారినవెనుకఁ జెప్పుము దయయుంచవలయుఁజుమీ" యనియెటకో చనియె. ఇంతకుమించ నేనేదియు నెఱుఁగనని జంబుకుఁడూరకుండెను. పరులవశ మగు కేతకీదళము మరల నాగవల్లి తెచ్చునని గంపెడాసతోనున్న గుణోత్తమ యామునలివాని మాటలకు నిశ్చేష్టయయ్యె. రాగలతిక తనమాటయే వయినున్నదికదాయని పరిహాస మొనర్ప నారంభించెను.

పదియవ ప్రకరణము.

అవనీతలమున వెలసిన వైకుంఠమని భక్తవరులును, దమకోడిమున్నీటనందనందనునిచే నిర్మింపఁబడిన దాఁగుడుచోటని వైరులును దేని నభినందించి నిందించి హృదయ సంతుష్టియొనర్చుకొనుచుండి రట్టిద్వారకానగరము ద్వాపరయుగమున రాచవారు కట్టిన పోలిలులలో విభవమ్మున మొట్టమొదటిదియుఁ గాలమునఁ గడపటిదియు నై తనరెను. ఉపేంద్రునకు రాజధానియగుటనో, దాసజనుల మనోరథ ఫలముల నవలీలనొసఁగు వాసుదేవ పారిజాతమందుం డుటనో విలాససంపద సిది దానికి దీటుకొనుటనో, సత్యభామ నిమిత్తము మున్నువేల్పారేని నందన వనమునుండి యచ్యుతుండు తెచ్చి పెరటిచెట్టుగా నాటిన నిజమయిన పారిజాతవృక్ష మందుండుటనో యకూరిరప్రముఖులందఱు నాద్వారకను రెండవ

యమరావతి యని పిలుచుచుందురు. పొగడ్తకుఁ గాక నిజముగ సిరికి నెలవని ఘంటాపథముగఁ జాటఁదగిన యాద్వారకాపురమున కొక రాచబిడ్డ సంజతఱి వచ్చుచుఁ దోడనున్న సేవకునితో దినమెల్ల శ్రమపడి పయనముఁజేసిన జాడ మొగముమీఁది చెమ్మట తెలుపఁ గొంత దవ్వు నడచినడచి పురమువెలి యొక చెట్టుక్రింద నాయాస మపనయింపఁ దలఁచి యించుక విడిసి, తనకన్న మున్న దుస్సహమార్గఖేదమున నేలఁ జతికిలఁ బడియున్న శ్రావణునిఁ జూచి యిట్లనియె. శ్రావణా! ఎన్నఁ డిల్లు విడిచి యెఱుఁగని నీవు నానిమిత్త మింతింతయనరాని బాధల నొందుచున్నావుగదా ? పాపము పలుమాఱు నావెంట రావలదని నేనెంత నొక్కి చెప్పినను వినక నాపైఁగల ప్రేమపెంపున వెంటవచ్చి యనుభవించుచున్న సుఖ మిదియే కదా! ఐనను కైవల్యామృత చంద్రమండల మగు భూలోక వైకుంఠ మల్లదె కనుదోయి కఱవుదీఱఁ గనఁబడుచున్నది. కన్నులారఁజూడ, మనయిరువుర యాయాస మొక్కమాఱు పటాపంచలయి నశింపఁగలదు" అనిన శ్రావణుండును యజమానునికిం దనపై నుదయించు నపార కృపకు సంతసించి వినయము గదుర నిట్లని ప్రత్యుత్తర మొసఁగెను.

దేవా ! సేవనమే జీవనముగాఁ గల నేను మీయొద్దనో మఱి యింక నెకరియొద్దనో దేహాయాసము మనోవ్యథయు నొందుచునేయుందును. నాకయి మీరు వగవఁబనిలేదు. ఆగర్భశ్రీమంతులరగు దేవరవారు మీకొఱకే విచారింపనోపు. చెట్టునుండి కోయఁబడిన పూవు చందమున నింటనుండి వెడలినవెనుక మీరు దినకరకరస్పర్శమువలనఁ జెన్ను చెదరి పట్టరాని నెంజిలి నాకుఁ గల్గించుచున్నారు. అని తన నిమిత్తము పొక్కు సేవకుని సమయోచిత శాంతవచనముల నూఱడించి తనవలె నతి దూరప్రయాణమున డస్సి జేవుఱించిన నెమ్మొగంపుఁ గాంతులచేఁ గకుబంతరాళముల శోణము గావించుచుఁ బడమటి కొండపై నెక్కి

యున్న సూర్యునిఁగని కనుదమ్ములు విందగు నాతని బింబమునకు జోహారొనర్చి భగవానుఁడా! లోకబాంధవా! జగత్త్రయనేతవు. సకలచరాచర సంతానము పెరుగుటకు ముఖ్యాధారమవగు నిన్ను నేఁ గొనియాడఁ జాలుదునే! ధరణీనాటకరంగస్థలమునందు, పగలను తెల్లతెరయు రేయి యను నల్లతెరయు దింపి జంతుసంతానమును జాగ్రత్స్వప్నావస్థల నందించి యాడించుసూత్రధారుఁడవు. ఆహాహా! నీ యారుణ్యమునకు శంకగని లలాటనయనాగ్ని తేజము సిందూరద్రివారణ్యము లోనగు నవియే నీచోపమలగుచుండ లోకమున నితరవస్తువు లెవ్వి దానికి సవతువచ్చును. వేయినోళ్ళ పాఁపతేఁడు, వేయికనులవేల్పుతేఁడును వేవెలుఁగులు గల నీ దేహకాంతిఁ బొగడ నేరరన నావంటి యల్పజ్ఞుఁడు రెండుకన్నులఁ గని నుతిసేయ సాహసించుట నాపయి నాకుఁ గల యభిమానముసుమీ యని నుతించి కొన్నియడుగుల దవ్వున నిగనిగల్రిక్కనల్లని తేటనీటిజిగి నాకసమును విడంబించుచుఁ దెలిదమ్ముల వెలుఁగున నక్షత్రభ్రమఁ జేయుచు నింపుఁ బెంపారు నొక కొలను గని కాలుసేతులందుఁ గడిగి సాయంతన కృత్యములు దీర్చి దోసెఁడు నీరు ద్రావి తానును సేవకుఁడును నగరమును బ్రవేశించిరి. పురబహిర్ద్వారమున నడుగు పెట్టినది మొదలు పట్టణపు టనుగుభాగమునఁ గనవచ్చు రామణీయకమును మేడల మిద్దెల సొరుగు మనసార నీక్షింపఁదలఁచియు నొక్కొక మేడఠీవిఁ గనుంగొనునప్పటికే తద్దయుఁ దడవగుచుంట నెన్నిదినములు దినములన నేల యెన్నిసంవత్సరము లిచటనుండి యీ యందముఁ గనఁగొన్నఁ దృప్తి యుండదనుచు శ్రావణుఁడుఁ దాను నొండొరులతోఁ జెప్పుకొనుచు వాడలంబడి నడువసాగిరి. అంతలో భాస్కరుండు పడమటికొండమీఁదనుండి గుభాలున నపరవార్నిధిలోని కుఱికిన చందమున నంతర్ధానము నొందెను. రౌద్రరసము నభినయించు పాత్రమై కొంతసేపు గగనరంగమున విహరించి యాకథవినుపించు ననంతరము శాంతరస మభి

నయింప వేసము మార్చుకొని క్రమ్మఱవచ్చినయాటకాని విధమున నుద
యరాగము వీడిన చంద్రమామ జనులకు దృష్టిగోచరుండయ్యెను. అయ్య
ది వసంతసమయమగుట నా సాయంకాలమున నచటి యువతీజనములు
మేనులనిండఁ బూలదండలు రతనంపుఁ దొడవులు ముత్తియఁపు స
రులు పెట్టుకొని వాడలందిరుగుచు మేడల విహరించుచుఁ జలనము
దాల్చు కొమ్మలచాయ నలరుచు నీరాజనందనుని కమితానంద
ముఁ గొల్పసాగిరి. నాఁటిరేయిఁ గాయు పండువెన్నెలతోడ యదు
కుమారకుల ముఖచంద్రమండలముల వెల్లు వియ్యమందుచు నాపాం
థు నాశ్చర్యసముద్రమును మేరమీఱఁజేసెను. ఇట్లు కతిపయదూర
ము నడచి తన మనంబునఁ బెల్లుబ్బిన మోదముచేత మైమఱచి
కొంతవడికిఁ దెలివొంది తనవచ్చినపని జ్ఞప్తికిరా మాధవాంతఃపురమున
కుఁ బోవసమకట్టి "వేయికన్నుల దొరమొదలగు జేజేలును బడిగాపులు
పడియున్న దర్శనము సేనురని దక్కటక్కటా! ఊరుపేరులేనినా కా
నందనందనపాదారవిందదర్శనంబు లభించుటెట్లు? పుణ్యవశమునలభి
యించు నను ము పాండునందనసంరక్షణమును సుయోధనాది దుష్ట
శిక్షణమును జేయ ననేకరాజకార్యములఁ జక్కపఱుపఁ గంకణముఁ
గట్టుకొనిన యామహామహుఁడు నాయొనర్పు మనవి సనవుల సాకల్య
ముగ నాలకించుటెట్లు. ఒకవేళ నాలకించుననుము. ఆపుండరీకలోచను
నాకు సముకూర్ప నీపుండరీకలోచనుం డంతశ్రద్ధవహించి యట్టి మహ
త్కార్యమునకుఁ గడఁగునే. అయినను నాకార్యము లోకసామాన్యమై
నదికాదు. నామెఱఁగింపఁబోవు నంశమునుగూర్చి భగవంతుఁడగు దేవ
కీతనయుండు పెద్దకాలమునుండి యోచించుచున్నవాఁడని మధురాపుర
మున వినుచున్నాఁడను. అని యాయాదవరత్నము దర్శించు నభిలాష
తోఁ దన్మందిర ద్వారమునకుఁ జని శ్రావణుని గొండొకచోట నిలిపి
ద్వారపాలకులంగని మాగధుండొకఁడు వచ్చి తనుతోఁ గొన్ని యంశ

ముల ముచ్చటింపఁ దలఁచుచున్నాఁడని భగవంతునితో మనవి యొనర్పు మని యావేత్రహస్తునితో నుడువుటయు వాఁడును గ్రొత్తమొగమును జక్కఁగాఁ బరీక్షించి వాసుదేవ భూవరులు తమచుట్టములు కొందఱి తోఁ గొన్ని రాజకార్యముల ముచ్చటలాడుచున్నారు. నిన్నిప్పుడు లో నికిఁ జననీయరాదని వాక్రుచ్చుచు నించుక మనోరథ భంగముఁ గలుగఁ జేసెను. అంతట నాతఁడు సేయునది యేమని యోచించుచుండ నంత లో నొక సేవకుఁడు పరుగు పరుగున వగర్చుచు వచ్చి స్వామివారు నిన్ను రమ్మని యానతిచ్చినారు రా రమ్మని పిలిచెను. ఆనాఁటి రేయి యా పండువెన్నెలలోఁ జేమ్మట లార్చెడు మలయంపుఁ బిల్లగాడుపులు చెల్లాచెదరుగఁ బరుగులెత్తు నాసమయమున యదుకులచంద్రుఁడు చందమామరాలమేడమీఁదఁ గడపటియంతస్తుపైఁ గూర్చుండి స త్యభామయు, మిత్రవిందయుఁ గరారవిందములఁ జామరములఁ బూని మంజుకంకణక్వణము లెసఁగ వీవఁ బాండవమధ్యముం డగుపార్థునితోఁ గొంత మంతనముండి చిఱునగ వంకురింప సత్రాజిత్కుమారిం బలుక రింపుచు మిత్రవింద వదనారవిందమున నెలకొన్న మందహాసముఁగని యుప్పొంగుచు నర్జునుని మాటల కెడనెడ నుత్తరములం జెప్పుచు రుక్మి ణీదేవి చుట్టియిచ్చు తమలపాకుల చుట్టల నందుకొని నమలుచుఁ బార ములేని వినోదసముద్రమునఁ దేలుచుండెను. చిత్తపారవశ్యముఁ గలిగిం చు నావినోదరత్నాకరమునఁ దేలుచుండియు మాగధుఁడు వచ్చెనను మాట యెవ్వరో నివేదింప సత్వర మాతనిఁ దోడ్కొనిరమ్మని ముదల యొసంగి సత్యారుక్మిణీ మిత్రవిందల మొగములవంకఁ జూడ నా తలో దరులు తమతమ పనులఁ జాలించి యంతిపురమునకుం జనిరి. అంత నామాగధుఁడు దౌవారికునిచే మాధవుని సమ్ముఖమునకుఁ దోడ్కొని పోఁబడి రాతిమెట్టు లెక్కియెక్కి బహుద్వారములు గడచికడచి యం తస్తుల దాఁటిదాఁటి తనరూపు ప్రతిబింబించుచున్న పటికంపు గోడల

సొరున కచ్చెరువందుచు మెల్లమెల్ల నడుగులిడుచు వాసుదేవుఁడు పార్థవ సహితముగనున్న నెలవునకువచ్చి యాయదుకులజలధికౌస్తుభమగు కౌస్తుభలాంఛనుని కట్టెదుట నిల్చి కనికరము నలుగెలంకుల వెదఁజిమ్ము విశాల పుండరీకలోచనములును లోచనాంతరముల నంటు శ్రీకారములఁబోలు వీనులును వీనులమీఁదినుండి నునుజెక్కుటద్దములఁ జిందులాడుచుఁ బ్రతిబింబించు మణికుండలద్వయధావళ్యమును నింద్రనీలముల కమ్మలయొప్పును హత్తినమీసంపు నిగనిగయు తొలుకారు మబ్బుతీరున వెలయు కోమలశ్యామలశరీరమును బాలకడలికూఁతురు సుఖోపవిష్టయగు నింద్రనీలంపుబీఠమనఁదగు విశాలవక్షమును గనుగొని తనయంత నుదయించి హృదయపేటిక నాఁగని బయటఁబడు మహాభక్తి నెడలెఱుఁగక వ్యాసశుకప్రముఖమహాయోగివాగమృతధారాశిలోచ్చయుఁడు, ప్రహ్లాదనారదాంరీషాదిభక్తజనహృదయనివాసపీఠుఁడును, జరాసంధశిశుపాలాదివైరివర్గప్రళయాంతకుఁడు నగు యాదవపారిజాత మితఁడొకదా యని యొకమాఱు కనుదమ్ములు విచ్చి కఱవుదీఱ నవలోకించి, తనివిపోమి మఱలఁజూచి కేలుమొగిచి తనకుఁ దోచినలాగున నభినందింపయత్నించి యప్రయత్నముగ నీక్రిందిపలుకుల నుచ్చరించెను.

పదునొకండవ ప్రకరణము.

"శ్లో॥ దామోదరాయ దళితాఖిలదానవాయ
ధారాధరోపమతనుద్యుతిశోభితాయ
దాసావనోత్సవనిరంతరలీనచిత్త
పంకేరుహాయ మహితాయ నమోనమస్తే॥

శ్లో॥ యదుకులాంబుధిపూర్ణసుధాకరం
భువనమోహనవిగ్రహధారిణం

సృజనధారణమారణకారణం
మనసినందకిశోర ముపాస్మహే."

అని వందించి "కాళీయాహిపడగలను రంగస్థలమునఁ జిందులుద్రొక్కి, మున్ను బలిచక్రవర్తి మాణిక్యఖచితకిరీటముపైఁ గొంతసేపు విడిసి, జగత్పావనహేతువగు నాకాశగంగకుఁ బుట్టినిల్లయిన నీచరణద్వంద్వమున కిదె ప్రణామిల్లెద" నని యంగంబులెనిమిదియు నేలఁ దాఁక నమస్కరించి నిలిచెను. అట్లు పరమభాగవతుని లీలఁ దనయెట్టయెదుటఁ జేతులుమోడ్చి నిలిచిన రాచకొమరునకును గన్నులఁ విచ్చిచూచి, పుండరీకాక్షుండు విస్మయమును, నెనరును, వెలికిఁ దోఁపనీయక తనమొగ మాతనివైపు ద్రిప్పి యాతఁడేదో మహత్కార్యముపై వచ్చియుండఁబోలునని నిశ్చయించి యొక యుచితాసనమునఁ గూర్చుండ నియమించి యిట్లనియె.

"చిలుకవారువము నిప్పుడే దిగి, చెఱుకువిల్లును బూవుటమ్ములు నెచ్చటనో మఱచివచ్చిన మన్మథునిలాగుననున్న నీ వెవ్వరివాఁడవో యెఱుఁగునంత దాఁక నామనము తత్తరమొందుచున్నది. రాచవాఁడవే యగుదువేని నీవంటివాని పుట్టుకచే రాచకులము నిక్కముగఁ గృతార్థత నందెనని నే నమ్ముచున్నాను. సత్వరమ నీచరిత్రమును, నాతోడ నీకుం గల కర్జము నెఱిఁగించి యీ మన పరిచయము నిక్కపునెయ్యమగునట్లు హృదయము మఱుఁగుపఱుపక బలికి నాయింట నతిథివి గావలయు" నని సన్మానపురస్సరముగఁ బ్రత్యుత్తర మొసఁగుటయు ధైర్యముఁ దెచ్చుకొని తన వృత్తాంతమిట్లు వినుపింపఁ దొడఁగెను.

"మధుసూదనా! నావసించు నూరుపేరు చెప్పినంతనే నన్ను శత్రుపక్షమునఁ జేరినవానినిగా నెంచకుందువనుదృఢవిశ్వాసముతో నేను మగధరాజ్యములోనివాఁడననియు, గిరివ్రజపురనివాసుఁడననియు, జరాసంధమహారాజు పాలనకు లోఁబడినవాఁడననియుఁ జెప్ప సాహసించు

చున్నాను. నందనందనా! నీకుఁ బగతుఁడగు నాజరాసంధుని యేలుబడియుంటచే నన్ను నీవెఱుఁగవు కాని నేను నిరంతరమును నీ చరణారవిందములను నమ్ముకొనిన భక్తగణములోనివాఁడను. అది యిఁకమీఁద నే నెఱిఁగింపఁబోవు నాచరితమునుబట్టి నీ వెఱుఁగఁగలవు. నేనన్యుఁడనుగాను. దేవా! నీ జన్మకారణమున భువనపావనతఁగాంచి యేకులంబు మించు నాచందమామకొలమె నాకును జన్మకారణము. నన్ను గళానందుఁడని జనులు పిలుతురు. మాతండ్రి విక్రమవర్మ జరాసంధునిమహాసేన కధిపతియై చాలకాలము రాజభక్తి నిండార నాతనిఁ గొల్చి, మీకును మగధరాజునకును గొన్ని సంవత్సరములక్రిందట జరిగిన మహాయుద్ధమున నాదురదృష్టవశముననో, తన యదృష్టవశముననో, నీచేత సంహరింపఁబడియెను. అతఁ డదృష్టశాలియే కాకున్న దుర్లభమైన నీచేతిమరణ మెట్లువానికి సిద్ధించును? తండ్రి బ్రతికియున్నకాలమున నాకుఁ జెల్లిన గారామును, నాకునడచిన ముద్దుముచ్చటలును, నన్ను నేఁబొగడుకొనుట కాదుగాని మాధవా! మీప్రద్యుమ్ననకైన జరగియుండవని నానమ్మకము. అశ్వారోహణము, గజారోహణము విలువిద్దె, యస్త్రశస్త్రసంధానమోక్షణంబులు, చతుర్వేదములు, నాఱుశాస్త్రములు, కావ్యనాటకాలంకారములు, నాకునిరాఘాటముగఁ బదునెన్మిదియేండ్లప్రాయములోపుననే నేరిపి యేవిద్యయందును నాకు సమానుఁ డుండకుండఁ జేయవలయునని మాయయ్య యెంతయుఁ బాటుపడియె. మందభాగ్యుఁడనగు నాకు నాతండ్రి యెట్లుదక్కును! అట్లు నాతండ్రి నన్నువిడిచి పరలోకమునకుఁ జనుటయు, నాతల్లియు, నేనును నిరాధారగతిఁ గాలముఁ బుచ్చుచుండ నింతలో నీనడుమ మీతో జరగిన కయ్యము సంప్రాప్తమయ్యెను.

నాకు విల్లువంచుటలోఁ గత్తిఁద్రిప్పుటలోఁ గల నేర్పునుబట్టి నేను పిల్లెక్కవెట్టి పోరున నిల్తునేని, మహాత్మా నీవును నీయన్నయగు

బలభద్రుఁడును నిలువఁజాలరని మారాజునకును బ్రజలకును గట్టి నమ్మకము గలదు. ఇది స్వోత్కర్షమని నాపై నలుగవలదు. ఇది యన్యుల యభిప్రాయముగాన నేనుడువవలసివచ్చె. అందుచేత మాతండ్రి తీరిన కొన్నినాళ్లకు జరాసంధుఁడు మాయింటికివచ్చి నన్ను గౌఁగిలించి పితృవియోగదుఃఖము గొంత తనశాంతవచనముల నుపశమింపఁజేసి నాకన్నఁ బెద్దలు, ధనుర్విద్యం గృతచిరపరిచయులు, పెక్కండ్రుండిన, వారి నిరాకరించి సైన్యాధిపత్యమునకు నన్నభిషేకింప సమకట్టెను. ఐనను నాకది యిష్టము కాకయుండుటచేఁ గొన్నినాళ్ళు కడచిన వెనుక నట్లభిషేకము గావింపవచ్చునని దినములు జరపుచు వచ్చితిని. ఇంత మహాపదవి యింత చిన్నతనమున నాకువచ్చి స్వయముగాఁ బైఁబడుచుండ నిరాకరింపవలసినంత యవసరమేమని మీరడిగిన నడుగవచ్చును. దాని కుత్తరముఁ జెప్ప సిద్ధముగా నున్నాఁడను. మాయయ్య జీవించియుండఁగ నించుకించుకయు నాతఁడు గతించిన వెనుక నెంతయు నెక్కుడుగను నాకు మాయేలికపై యాతని దుర్గుణములఁబట్టి యసూయ యెంతవారించిన నిలువక పొడమి తుద కుద్యోగము మానిపించునంతటి యౌద్ధత్యంబు వహించి, మాతండ్రియుండఁగా నాతనికి జంకి కొంత నాయభిప్రాయమును దాఁచితినిగాని, తదనంతరమున నాయిచ్చవచ్చినట్లు వర్తింప స్వాతంత్ర్యము లభింపఁజేయుటంజేసి నేనే కొలువితోఁ దలఁ గోకికొంటిని. ఆకడపటి కయ్యమున సైన్యాధిపత్యమున కంగీకరింపకున్నను మీపైఁ గత్తికట్టి తక్కన జోదులతోఁ గలసి పోరుమని నన్ను బలవంతపెట్టి జరాసంధుఁడు స్వయముగా బతిమాలెను. కఠినమైన నామనస్సు విఱిగినందున నేనీయకొననైతిని. నాఁటనుండియును నాయేలిక నన్ను మ్రింగివేయవలయునని యున్నాఁడు. ఇది నాచరిత్రమునఁ బూర్వభాగము."

ఈకథ లిట్లు కళానందుఁడు వాగమృతధారలు గురియ నుపన్యసించుచుండ శ్రీకృష్ణుఁడు వాని మొగమువంక ఱెప్పవాల్పక చూచుచుఁ

బొల్లయిన(బోకుండ నాలకించుచుండ నర్జునుండును బాహుబలమున, విలువిద్దియ నీతఁడు తనకుఁ దుల్యుఁడగుటకు సందియము లేదని యను కొని తనకార్యమున కాతఁడు తోడుపడుటయే సంభవించునేని యది నెఱవేఱుట సిద్ధమని నిశ్చయించెను. అనంతర మారాజ కుమారత్రయ మిట్లు ముచ్చటింపఁజొచ్చిరి.

కృష్ణుఁడు—కళానందా! నీచరిత్రమునఁ బూర్వభాగము కడు విన సొంపయి యున్నది. నీయుత్తరభాగమునుగూడ వినుపింపవే.

అర్జునుఁడు—ఇపుడు వచ్చినపనికూడ నందుఁ దేటపడునని తోఁచెడును.

కళా—అయ్యా! ఇంకఁ జెప్పఁబోవు పలుకుల స్వప్రయోజన మును బరోపకారచింతయుం గూడఁ గలసియున్నవి. అందు నాలాభ మెటులున్న లోకోపకారార్థము తమరు నాయడిగిన సాయమైనఁ జేయుదురని మీయిరువుర వేఁడుకొనుచున్నాను.

కృష్ణ—ఆ రెండునుగూడ నిర్విఘ్నముగఁ గొనసాగు. నీవు మాచెవులఁబోయు వాగమృతమే యింతవఱకు యోచించుచున్న కా ర్యమునకు జీవమును గల్గించుఁగాక యని దీవించుచున్నాను.

కళా—చిన్నతనమున విద్దెకఱచునాఁడు మొదలు నాడెందము మగధరాజు సలుపు చెడుగుల నేవగించుచున్నది. ఇప్పుడది వేయిమ డుంగు లెక్కుడగుటకుఁ గారణము కల్గినది. చంద్రపాలుఁడను క్షత్రియ కులభూషణుండు గిరివ్రజపురమునఁ గలఁడు. తనుజూచినవారి హృద యములనెల్ల నాకర్షింపుచు మోహనయంత్రమువలె నలరు సౌందర్యతిలక యను కూఁతు రాధన్యునకుఁ గలదు. ఆచంద్రముఖిని గనులార శుక యోగియే నొకమాఱుచూచిన నియమభంగము నిశ్చయమగ నెందు నని యీనాఁటివారంచఱు వేయినోళ్ళఁ బొగడుచుండ నావంటి ప్రాకృ తుఁ డా యలరుఁబోడిసి వలచుట యొకవింతకాదు. ఒకనాఁ డాజవ్వని

గీమున జెందు గొజవంక యొకటి దాసి చేసిన పొరపాటు కతము న గూటినుండి యెగిరి మామేడమీఁద వ్రాలి నామె చెలియగు నాగవల్లివచ్చి దానింబట్టి యిమ్మని నన్ను వేఁడుటయు నేర్పున నేను దానింబట్టి స్వయముగ నామెనాఁగకడకుం గొంపోయితిని. సౌందర్యతిలకయు, పెంపుడుపిట్టపయిఁగల కనికరము పెంపున యౌవనవతులను గప్పు సిగ్గు ద్రోచి పైచి నాహృదయమును లాగుకొన్నట్లు గొజవంకను నాచేతనుండి లాగుకొని యనంతర మెంతయు సిగ్గువడి తన సాహసమునకు నొచ్చుకొనెను. నాఁడు మాయిరువురకుఁ బ్రథమదర్శనము. ఆమె నాఁటనుండి నాయందు వలపు నిలిపినట్లు నాగవల్లి ముఖమునవిని యెంతయు విరాళిఁ జెందుచుంటిని.

ఆ యిందువదన నను వలచెననుమాట వినక మున్ను రణార్ణవుండనువాఁడు జరాసంధుని యుంపుడుకత్తెకొడుకు, దానిపయి నెయ్యంబునిలిపి, కొన్నినాళ్ళ కామెచిత్తంబు నాపయి హత్తెనని విని, తండ్రిపయిఁ బడి బలిమిచేఁ దనకా ముద్దుగుమ్మ నిప్పింపుమని వేఁడుకొనుటయు నా నేలఱేఁడు నాపయిం గోపముసఁజేసి యాలేమతండ్రియగుచంద్రపాలునిఁ బిలువనంపి రణార్ణవున కాజవ్వని నిమ్మని యడుగ, నతఁడు పెండ్లితఱి సంప్రాప్తించునపుడు చూడవచ్చునని విభునకు బదులుచెప్పి పుత్రికా వివాహార్థమై దురంతచింతం గూరియున్నవాఁడు. నిండు జవ్వనంబు పెంపున యువతీజనంబు లొండొరులపయిఁ దెరిపరాని వలపు నిలుపునెడ వారి కలయికలకు నాటంకములు పొదలుడు వారిహృదయము లెట్లు నిర్విణ్ణతఁ జెందునో, యెంతటియాపద వారికి వాటిల్లునో రుక్మిణీకళ్యాణకాలమునకు మున్ను నీ వనుభవించితివి. కాన నే వేఱుగఁ జెప్ప నక్కఱలేదు. ఈ కార్యమున నీభర్తనకు నీవు తోడుపడవలయును. దీనిఁ బట్టి యాత్మలాభపరాయణుండయిన యిందువచ్చితినని నన్ను దలంపకుము. నేను బ్రత్యేక మీకార్యార్థినయి

రాలేదు. నేనొకవేళ నబద్ధమాడినను సకలలోకాంతర్యామి వగు నీవెఱుఁగకపోవుగదా.

కృష్ణ—నే నొనర్పవలసిన లోకోపకారముఁగూడ వాక్రుచ్చి నీ సందేశము ముగింపుము.

కళా—నేను రాజద్రోహినని నాయందు మీరు దోష మారోపించిన నారోపింతురుగాక. నావిషయమయి మీర లింక నేమను కొన్న ననుకొందురుగాక. మాయేలిక యగు జరాసంధుని చెడుగుల విన్నవించు తలంపున ధరణీభారంబు మాన్ప నవతరించిన మిమ్ముఁగలదర్శింప వచ్చితిని. ఆదోసకారి కతమున రాజమండలము పాఱయుపాటు చూడఁజాలక నాకుఁ గల భూతదయ రాజభక్తిని డెందమునుండి పాఱఁద్రోలి నన్నిందుఁ దెచ్చినది. మిడుతలదండుఁబోలు సేనతోఁ బలుదేశములపయి దాడివిడిసి పురముల నాక్రమించి జయించి పుష్పశరసుకుమారు లగు రాచకొమరులం దెచ్చి చెఱసాలను బంధించి యనుదినమును భైరవపూజఁజేసి తన్నివేదనకు సీరాజులలో నొకరినో యిరువురనో బలియిచ్చుచుండును. ఇంద్రసమానపదవిఁబాసి యంతదైన్యము నొందు మూర్ధాభిషిక్తులఁ జూడఁజాలకయుఁ దండ్రులకుఁ బాసిన బిడ్డల గోల వినఁజాలకయు, మగలకుఁ బాసిన పతివ్రతల యార్తనాదముల నాలకింపఁజాలకయుఁ గన్నులు కాయలుగాచి చెవులు చీములు కట్టుచున్నవి.

“ఈవల సాక్షాన్నారాయణ స్వరూపుండవగు నీవు వేంచేసి యుండ, నావల నీకు మేనమఱందియై, మగంటిమి నీనాఁటి రాచకొలమునకుఁ దలపూవగు నీయర్జునుఁడుండ, భీష్మద్రోణాదిమహాయోధులుండ మీకన్నులయెదుట నొక దురాత్ముం డింత ఘాత లోకమునకుఁ జేయుచు బ్రదికియుండునా? ఇట్లుదాసీనులై మీరెల్లరు వాని కట్లుసేయ సెలవిచ్చుట మీకప్రతిష్ఠయేగాని యశస్సంపాదకముకాదు. మాధవా!

నీభక్తజనపాల బిరుద మెందరిగినది? కవ్వడీ నీరాచపాడియేది? నంద
నందనా! నీవు మనసారఁ దలఁచుకొన్న నీచక్రధార కాజరాసంధుని
యుసుఱు లెంతపాటివి? ఈవఱకు నీవు కడతేర్చిన రక్కసుల మూఁక
కన్న నీతఁ డెక్కువవాఁడా? ఈతని జంపుటయే చంపుట. వేయేల?
జగత్కంటకుండగు నీ మనుజాధమునిఁ బిల్కుమార్చి రాజచక్రమున
కభయ మొసంగవేని, యీరాజభార్యల యుసుఱు తగలకపోదు. దేవా!
భూతదయపెంపున నిట్లనరానిమాట లంటిని. క్షమింపవలయు" నని
యాకళానందుఁడు ముగించుటయు, వాసుదేవుఁడు వానితోఁ దా నాకా
ర్యము దలపెట్టుటకుఁ గాలము సమీపించుచున్నది. భయపడవలదని
పార్థుని మొగమువంకఁ జూచి "మన మనుకొను పని కిది శుభసూచక
ముగా నున్నదిసుమా" యని చిఱునగవునగి యప్పటికిం బ్రొద్దాయెనని
కళానందునితోఁ గూడ విందారగింప లోని కరిగెను.

పండ్రెండవ ప్రకరణము.

ఆరేయి బంధుమిత్రులతో నందకుమారుఁడు విందుల నారగిం
చి, పండువెన్నెలలోఁ బూలసెజ్జవేయించి యద్దానిపైఁ గళానందునిఁ
బండుకొన నియమించి, పార్థునకుఁదగు పాన్పు నమర్పం బనిచి యంతి
పురమునకుంజని తాను యథేచ్ఛముగఁ బవ్వళించెను. కళానందుఁ డామృ
దుశయ్యపై మేను వాల్చుటయుఁ దనమనసు హరియించిన పూవుఁబో
డి జ్ఞప్తికివచ్చి, కంటికిఁ గొంతతడవు కూర్కు లేకుండఁ జేసినను నడుమన
డుము వీచు చందనాచలపుఁగమ్మతెమ్మెరలు మనస్తాపమును హరింపఁ
జేసి యించుక నిద్రాసౌఖ్యమును గలుగఁజేసెను. గోవిందుఁ డందఱి
కన్న ముందుగఁ బ్రాతఃకాల మంగళతూర్యారావముల మేలుకని, మే
లుకాంచియు నిద్దుర బద్ధకమున లేవలేక కనులు మూసికొని యున్న పా

ర్థుని లేపి యాతని వెంటఁ బెట్టుకొని తన యుద్యానవనమునకుం జని ప్రభాతవాయువులు గమ్మపుష్పాళ్ళ మీఁదఁ జల్ల నొకమాధవీలతా గృహమునఁ గూరుచుండి, పార్థునితో నిట్లనియె. "అర్జునా! నీవు వచ్చినకార్య మెఱుంగఁ జేయవైతివి. చుట్టఱికము పెంపున మముం గనంగోరి వచ్చితివో, రాజకార్యముమీఁద నాయాలోచనముఁ గైకొన నేగుదెంచితివో విస్పష్టముగ నెఱుఁగఁజెప్పుము. దురాత్ముఁడగు దుర్యోధనహతకుఁడు మరల నెగ్గేదయిన మీకుఁ దలపెట్టలేదుగదా!' అనవుడు "మధుసూదనా! దుర్యోధన హతకుఁడు లక్కయింట మమ్ముంచి దానికిం జిచ్చుముట్టించుట మొదలు, మాయభ్యుదయముం జూచియో, తన నింద్యచరిత్రముం దలఁచియో, కడుసిగ్గుపడి సగము చచ్చియున్నట్లు గాన వచ్చుచున్నాఁడు. అతనిదెస మాకు రవంతయు భయకారణము లేదు. తక్కిన రాజచక్రమునకుఁ గృష్ణుఁడు పాండవపక్షపాతియను వాడుకయే పిఱికి మందుగదా? సకలహృదయవర్తియగు నీవు నావచ్చిన పని యెఱుఁగవే? నిన్నఁ గళానందుండు జరాసంధ నిర్మూలమును గూర్చి యుపన్యసింపుచుండ "మన మనుకొను పనికిది శుభసూచకముగా నున్నదిసుమా" యని నీ వనలేదా? అదియు నీవ యెఱుంగుదువు. నానోటినుండియే వినవలతువేని నే నిప్పుడు మనవి యొనర్చెద నాలకింపు" మని పాండవమధ్యముండు సవినయముగఁ బలుకుటయు, నందనందనుండు మందహాసంబు ముఖారవిందమునకు వన్నెయిడ "బావా! నేను గార్యమెఱిఁగి యటులనలేదు. ఈవఱ కనేకపర్యాయములు నీవును నేనును గలిసికొనినపుడు జరాసంధ సంహారమునుగూర్చి ముచ్చటించుచుంటిమి కనుక నట్లంటిని. ధర్మనందనుం డేమి సెప్పుమని నాకడను నిన్నుఁబుత్తెంచె. అతని యాన నామౌళిధరియించి నిర్వర్తింతు నుడువు మన యాదవునకుఁ బాండవుఁ డిట్లనియె. "అచ్యుతా! దయామయుఁడగు మయుఁడు మాకొసంగిన యపూర్వ సభామంటపము

న నానా మహారాజకిరీటసుమశిరాజములు చరణరాజీవములకు నీరాజన మిచుచుండఁ గార్యపరతంత్రులగు మంత్రులుఁ జుట్టములు, నెయ్యురుఁ బరిచారకులు సైనికులు మొదలగువారు తన్నుఁగొలువ నిరుకేలఁకుల గదాగాండీవములు కేలమెఱయ, మాభీమసేనుఁడును నేనును నిలువ గద్దెకు ముందునిలిచి వందనములుసేయు రాచవారల పేరులు దనకు నకుల సహదేవులు విన్నవింప, మాయన్న యుధిష్ఠిరుఁ డొకనాఁడు, నిజముగా నఖండల విభవముతోఁ గొలువుఁ దీర్చియుండ నారదుఁడు మహతియను వీణ మెల్లమెల్ల మీటి, దాని మృదునాదముతోఁ దన కంఠస్వరము మేళవించి, నీలీలలంగొన్నిటిఁ బాడుచు నాసభామధ్యము నకుఁ గన్నులు మిఱుమిట్లుగొలుపునట్లు వచ్చి నిల్చెను. స్ఫటికమునుబో లు దేహకాంతితో సభకుఁ గ్రొమ్మెఱుగులువెట్టుచు నామునిచంద్రుఁ డట్లు నిలువ యుధిష్ఠిరుండు మొదలు ప్రతిహారివఱకు, రచ్చనున్నవా రెల్లరును మోడ్పుఁగేలున నిల్చి మెదలకయుండిరి. అనంతరమున గద్దియడిగ్గి మా యన్న జడదారికిఁ బాదాభివందన మొనర్చి, యర్ఘ్యపాద్యములఁ బూజిం చి, యుచితాసనమునం గూరుచుండఁజేయఁ బ్రసన్నుండై రాజనీతి యొక్కింత మాకుపదేశించి, యామునివల్లభుండు మాసభను నలుదెసలఁ గనుఁగొని, వర్ణించి యేలికవైపు మొగమై యీరీతిం బల్కెను. "యుధిష్ఠిరా! అఖిలధర్మములలోఁ దలిదండ్రులసేవ యుత్తమమని ధర్మ పక్షులు పలుకుదురు. అదియు సర్వోత్కృష్టముగుటఁ గాదె? ఏల సమస్త ప్రపంచసౌఖ్యమును విడిచి మున్ను రాఘవుఁడు, తండ్రిపంపున నన్న వస్త్రములకు దూరుఁడై కాండవుల నంతవంతనొందుట! సర్వలోకసం దర్శన కుతూహలినగు నేనినడుమ నొకనాఁ డింద్రలోకమునుండి మరలు చు మార్గవశమున యమలోకముం గనుగొనఁబోయితిని. రాజా! ఈచెంత వార్తఁ మీరెఱుఁ దెలుపకుండమన్న వలనుపడదు. తనకంటె నల్పైశ్వర్య వంతులు నల్పబలాఢ్యులునగు మహీపాలు రింద్రమందిరమున నపుయ

సౌఖ్య మనుభవింపుచుండఁ, బాపము, మాతండ్రి పాండురాజు దీనావసనుం డై, చూచువారలకు గుండెలు నీరగునట్లు జాలిఁగొలుపుచు, నాయమ లోకమున నొకమూల దిక్కులేనివానివలెఁ గూరుచుండెను. భూలోక మునను౦డు కాలమున మీయప్పకును నాకును బరిచయముఁ గొంతకలి గెను. కావున యమలోకమంతయును జూచినపిదప, నేను, పాండువిభుని సమీపించితిని. ననుజూచినతోడనే పంచప్రాణములు లేచివచ్చినట్లు కమభక్తి నన్ను సమీపించి, “ మునీంద్రా! చూచినారుగదా నాదుర వస్థ. ఈపాట్లనుమ నింక నేనెంతకాలముందును? మీరు శ్రమయ ని యోచింపక నానిమిత్తమొకసారి మర్త్యలోకమునకుఁజని, నాకుమారు లగు యుధిష్ఠిరాదులకు, నాదురవస్థఁ దెలిపి, వారిచే నెట్లయిన, రాజసూ యముఁ జేయింపవలయు. ఆమహాధ్వరము నిరంతరాయముగ ముగియు నేని, నే నీయలోకమునం బురందరతుల్యుఁడనై మహాసుఖముల నను భవింపుచుందును. మాయుధిష్ఠిరుఁడు లోకము బిక్షలవంటివాఁడు కాఁడు, మాభీమార్జును లతిసాహసులు, కుబ్జులగు నకుల సహదేవులు గడుయో గ్యులు, మావాసుదేవునకు నేనన్నఁ బ్రాణముగదా! ఇఁక రాజసూ యము నెఱవేఱకుండుటెట్లని యముఁడు వినకుండ నాచెవిలో మెల్లమెల్ల నఁ బలికెను. అజాతశత్రూ! యెంతభోగమనుభవించిన నేమి? ఎంత పరితాపవంతుఁడయిన నేమి? ఎంతంతవారలుకుమారులున్న నేమి? ఎవ న్నికైనఁ గర్మమనుభవింపక తీరదుగదా యని యప్పుడు నామనస్సునకుం దోఁచినది. మీరు, కీర్తికిని, దేశాక్రమణమునకును గాదుకాని పితృసం రక్షణార్థము రాజసూయము జేయవలయు” నని చెప్పెను. వాసుదే వా! ఈపలుకులు నారదుని నోటినుండి వెలువడుటయు నన్నగారు, గద్దియ మీఁదనే, కొయ్యయైపోయిరి. భీమసేనుఁడు చేతినుండి గద తనం తనె జార నొకపీఠముపైఁ జతికిలబడియెను. నేను యుధిష్ఠిరుని పాదపద్మ ముల సన్నిధి నుస్సురనుచుఁ గూరుచుంటిని. తక్కినవారందఱును నివ్వె

రపడి చూడసాగిరి. సర్వమహీధురంధరులగు మావంటి కొడుకులేవురుండి దిక్కుమాలిన వానిచందమున మాయయ్య యమలోకమునసుండి వన టం జెందునే, తనకొడుకు లప్రయోజకులని పాపము మాయప్ప యెంత మఱుఁగుచున్నవాఁడోగదా! దుర్యోధనునకుఁబోలె, మాకుఁ గూడఁ దండ్రి జీవించుటయు, నాతని గన్నుల నద్దుకొని పూలఁ బూజిం చి సుఖించుటయుఁ బ్రాప్తములేదు సరేకదా, పరలోకముననైన జనకు నకు సద్గతిగల్గు కర్మములు సేయనైన మేము నోఁచుకొనమైతిమే” యని యంగలార్చుచుఁ గన్నీరుపెట్టుకొని దీనాననుండైయున్న పార్థుని వైఖరియు, బేలతనమును, బితృభక్తియుఁ గని నగి, మాధవుఁడు, తన మేనమఱందిమీఁదఁ జేయివైచి నిమిరి “పార్థా! ఈవిషయమున కంత కనుపుపగిలి వాపోయెదవేల? రాజసూయము సేయుటమాట యాలో చింతము. రాజసూయముఁ జేయుట చులకనఁగాదు. అభిమానధనులగు సూర్యచంద్రవంశపు రాజులు తమకుఁదారై మనకు వశులుకారు. జగ త్కంటకుఁడగు జరాసంధ గంధసింధురుఁడు మనశత్రువులకు మొనగాఁ డై యున్నవాఁడు. అతఁడు జీవించియున్నయెడల యాగము జరుగుట సు న్న, మఱియు శిశుపాల సాళ్వప్రముఖులు మహాబలశాలులు, జరాసం ధపక్షీకి శిశుపాలవాయువు తోడగునేని యార్ప మనతరముగాదు. శకయవన పుళింద తురుష్క బర్బర పారసీకాదులు మ్లేచ్ఛనాయకులు న్నవారు. ఇందఱితోఁ గత్తికట్టి పోరి గెల్చికద యజనము ముగించుట. ఐనను మనవారందఱకుఁ బెద్దయుఁ బూజనీయుఁడునగు యుధిష్ఠిరుఁడిం దుల కియ్యకొనిమెనో యెఱింగించి నీయభిప్రాయమును గూడఁ దెలి యపఱుపుము. అనవుఁడు ఫల్గునుం డన్నగారి మత మెఱింగినవాఁడై మాధవుని జూచి యిట్లనియె. “బావా! మాయన్నగారి సంగతి నెఱుఁగనివానివలెఁ గ్రొత్తగా నడిగెదవేమి? వాసుదేవుని యభిప్రా యమే నాయభిప్రాయమని భారమంతయు నీపై మోపినాఁడు. కరుణా

మృతము వెదఁజల్ల నీచల్లని క్రేఁగంటిచూపులును, నావింటితూపులు నక్షయములై యుండెనేని యిట్టిరాజసూయములు వేయియైనను నవలీలగ నిర్వర్తింపఁబడు. తృణీకృతకృశానుండగు మాభీమసేనుని ప్రతాపాగ్నిలోఁ బడి యీసాళ్వాది శలభములు మ్రిగ్గవే? నీవు తలఁపు మాత్రము నిలిపిన రాజసూయము నిర్విఘ్నముగ నగుఁగాన మాకు ననుజ్ఞ నీయవలయు" నని చేతులు జోడించి ప్రార్థింప నాతనిమనవి నాలకించి మాధవుండు తలయూఁచి "సరే యుధిష్ఠిరుఁడు మనమున నుత్తలపాటు నొందుచుండును, నీవిఁక నింద్రప్రస్థపురమున కరుగుము. రాజసూయము నెఱవేఱు నుపాయము వెదకి కొన్నినాళ్ళలోన నీకు వర్తమానమంపెద. కళానందుఁడు మనపని కుపయోగించుఁగాత" యని హెచ్చరించి, యుత్సాహంబుఁ గల్పించి, యాపూఁట పార్థుని సబహుమానంబుగ సాదరంబుగ ధర్మనందనుని కడకుఁ బుత్తెంచెను. కళానందుఁడు పార్థుని యొద్ద సెలవుఁ గైకొని కృష్ణునియింటఁ గొన్నిదినములుండి ద్వారకానగరమునందలి విచిత్రములను, వాసుదేవుని లీలలను, గోపకులబలగము గావించు వినోదములును, గన్నులారఁగనుగొనుచు, హృదయేశ్వరి నిమిత్త మెడనెడ విచారించుచుఁ బొద్దులు పుచ్చుచుండెను.

పదుమూఁడవ ప్రకరణము.

చ. అరమరలేకనే మొగలి♦యాకుపయి న్లిఖియించియంపు ను
త్తరము లతాంగి కందినదో ♦ దానిహరించిరో త్రోవ దుర్జనుల్
సరసిజనేత్రి యెంతటి వి♦షాదము నొందెనో నానిమిత్త మె
క్కరణిఁ బుచ్చుచున్నదొకో ♦ కాలము దుష్టుల మధ్యనుండుటన్.

కూఁతును రణార్ణవున కిమ్మని యా జరాసంధుఁడు బాధించుటఁజేసి, ముదుకఁడగు చంద్రపాలుఁడు రాజున కెదురాడనోపక మెత్తవడి యియ్య

కొనెనో, నాహృదయేశ్వరియె నాపై నిరాశఁజెంది, రణార్ణవునో, మరి యొకనినో చేట్టఁబట్ట సమ్మతించినదో, దైవమా! ఏమికానున్నదో తెలియదు. తీయవిల్తుఁడు బాణములఁ దీయుచున్నవాఁడు. హా! హృదయేశ్వరీ! పౌరుషవంతమగు రాచకొలమునఁ బుట్టిననీవు తుచ్ఛభోగముల కాశవడి, మున్ను నామీఁద నిలిపిన చిత్తమును మరలనింకొకని పై నిలుపవను ధైర్యమున నోడలఁ బాణములతో నుండఁగాని, మఱి యొకలాగునఁ దోఁచునెడ, నేనీపాటికే మాయయ్యకడ నుందునుజుమీ! కళానందునిఁ దక్క నితర రాజనందనుని కేలు బట్టనని మున్ను చెలులతో నీవుచేసిన ప్రతిన నాగవల్లినాకు వీనులవిందుగా విన్నవించి ననాఁటి యానందము మరల నెన్నఁడును గలుగదయ్యె.

తే. గీ. పంజరమునుండి విడివడి ♦ పరుగులెత్తు
చిన్నిగోరువంకఁ బట్టి నీ♦చేతికిచ్చు
వేళ నామీఁదఁ బఱపిన ♦ వాలుఁజూపు
లించువిలుకాని తూపులై ♦ ధృతినిఁ దూల్చె.

అని పెక్కు విధముల మదనవికారమునొంది కళానందుఁ డొక నాఁటిరేయి విలపించుచు, నించుకయు నిద్దురలేక మఱునాఁడు కెంపుఁ బాఱిన కనుదమ్ములతో మాధవుని మొదుటఁ గూరుచుండ నీతని యవస్థ నాతఁడు గ్రహించి కార్యము సత్వరముగ ముగింపకున్న నిర్హేతుకముగ నీరాచపట్టి కృశించిపోవునని మనమునం దలఁచి యాతనితో నిట్లని ముచ్చటించె.

కృష్ణ—కళానందా! నీయిచ్ఛాప్రకారముగ జరాసంధునిఁ బరిమార్చునుపాయ మరిసెదఁగాని మాకుఁజేయు సహాయమేమో చెప్పుము. ఇందు నీలాభముఁగూడఁ గొంతయున్నది గదా?

కళా—దేవా! సర్వశక్తుఁడవగు నీకు నేను సహాయమేమి చేయఁగలను? అయినను మీరెద్దిసేయుమనియెద రద్దియు కావింప నుద్యుక్తుఁడనై యున్నాను.

కృష్ణ—నీవిది నీమనసులోనుంచి ప్రయత్నము సేయవలయును. దగ్గఱగా రమ్ము నీకీరహస్యము నెఱిఁగించెదను.

అని చెవిలో నెద్దియో యొకరహస్యము నూఁది యథాస్థానమునఁ గ్రమ్మఱఁ గూరుచుండ నియమించి యిట్లనియె.

కృష్ణ—నీవును మీశ్రావణులును గలసి నాసందేశముం గైకొని యింద్రప్రస్థమునన్న యుధిష్ఠిరునకు నొసఁగవలయును. ధర్మజుఁడు రాజసూయముఁ దలపెట్టినపుడె జరాసంధుని మరణముఁ దలపెట్టితి. కావున నీవింద్రప్రస్థపురమునకుఁజని కుంతీనందనునితోఁ బార్థుఁడు తెలిపిన యంశముల విని దాని పూర్వోత్తర సందర్భములఁ జక్కఁగ విచారించి రాజసూయము సేయింపఁ గృతనిశ్చయుఁడనైతిననుము. దానినారంభించుటకు మున్నె వసుంధర జరాసంధశూన్యము గావలయుననుము. ఆపనిఁ దీర్పఁగలమేటిమగఁడు మన భీమసేనుఁడొక్కరుఁడ యనుము. ఈనడుమ గిరివ్రజముఁ బ్రవేశించుటకు జరాసంధు నాయువుపట్టెఱుఁగుటకు నెన్నియుం బన్నుగడల నేను బన్నుచుందుననుము. ఇది శిశుపాల దుర్యోధన ప్రముఖులకుఁ దెలియునేని కడుమోసము వాటిల్లుననుము. నాచెప్పినట్లు మెలఁగుదురేని రాజసూయము నెక్కు డ్రేల్మిడిఁ జేయించి యుధిష్ఠిరుని భూలోకదేవేంద్రునిగా నొనర్చుభారము నాయదియనుము. మఱియు నేనక్కడకుఁ గతిపయదివసములలో వత్తుఁగాన నీవాదె పాండవుల కతిథివై యుండుము. అదియును గాక శిశుపాల దుర్యోధన జరాసంధుల వేగులవాండ్రు వేషములువేసికొని దేశములు సంచరించుచు మీవంటి బాటసారులకు నమ్మకముఁ బుట్టఁబల్కి గుట్టుమట్టెఱింగి హానిసేయుచుందురుగానఁ గడునప్రమత్తుండవై మెలఁగవలయును. ఈయాలోచన

లు పరమగోప్యంబులనుమాట నీవ యెఱుంగుదువుగదా” యని సందేశము హితోపదేశముతోఁగూడ జెప్పి మఱునాఁడు వానిం బంపఁదలఁచుచుండ నంతలో సాత్యకి యరుగుదెంచి యన్నకుం బ్రణమిల్లి నిలిచె. వాసుదేవుఁ డాతనినెమ్మొగమ్ముఁజూచి “ తమ్ముఁడా తోట్రుపాటున వచ్చితివేమి? ఎప్పట్టుననైన వింతలు పుట్టెనే” యని పలుకరించెను. సాత్యకియు నలుగడలు బరికించి పరులేరును లేరని తెలిసికొని “ అన్నయ్య! మనవేగువాండ్రలోఁ గడుఁజుఱుకుఁగలవాఁడగు సారంగుడిడె వచ్చియున్నవాఁడు. జరాసంధుఁడదె ద్వారకపై దండువిడియఁదలఁచి యీమహాయాత్రకుఁ బెక్కు సైనికులఁ, బసులఁ, బసులకు మేతల, గుఱ్ఱములఁ, దగినకౌతులఁ బోగుసేయుచున్నాఁడఁట. ఇంతకన్న వింతలేవియుండు” నని విన్నవించె. ఆమాటలు విని దేవకీతనయుఁడు సారంగుని బిల్చి కొన్ని ప్రశ్నముల నడిగి వానిమూలమున వాఁడు విన్న మాటలోని నిజమెంతవఱకున్నదో యరసి సాత్యకితో “ తమ్ముఁడా! మాగధుఁడు మనపై కింతలో రాఁజాలఁడు. హంసడిచికుల నిరువురఁ దెగటార్చి ఱెక్కలులేని పక్షివిధమునఁ జేసితిమి. సన్నాహమొనర్చి మనపై వచ్చునప్పటి కాఱునెలలకన్న నెక్కుడుకాలము పట్టునని తోఁచెడును. నేనొనర్పఁదలఁచుకార్య మీలోపున జరగవలయు. అయినను మనము జాగరూకులమై మెలఁగుట కర్తవ్యము. కళానందా! నీవు రేపు రేపకడ బయలుదేఱి కార్యనిర్వాహ మొనర్పుము. మగధరాజునకు శిశుపాలాదు లెవ్వరయిన సాయముసేయ నుద్యమించుచున్నారేమో యరసి నాకు వర్తమానమంపుమని మాపార్థునితోఁ జెప్పుము. అట్టులైరెసనున్న మున్నవారి పీచమడఁచి వెనుక మాగధుని నుక్కడంచెద. అని మఱియుఁ గొన్ని రాజనీతులు వానికుపదేశించి మఱునాఁడాతనిం బొమ్మని సెలవొసఁగె. ఉదయమునఁ గళానందుఁడు లేచి పయనమయి వాసుదేవుని చరణారవిందములకుఁ బ్రణమిల్లి తన సౌకుమార్యము,

దేహకాంతియుఁ బౌరులు చూచి యచ్చెరువడ నా శ్రావణునితోఁ గూడ నాతఁడు పోవుచుండెను.

ఈయిరువురు నిట్లు బయలుదేఱి మార్గమున ననేక పుణ్యనదులఁ గాంచి యందుఁ గ్రుంకులిడి, బహు దివ్యక్షేత్రములమెట్టి, యున్నత పర్వత శిఖరముల నెన్నియేని నెక్కి, పలుదేశముల గ్రామములఁ బట్టణముల వీక్షించి, వారివారి భాషావైచిత్ర్యములకు, నాచారభేదములకు రూపభేదములకు నెంతయు వినోదము నొందుచు మానవస్వభావము నేర్చుకొనుటకుఁ బ్రపంచజ్ఞాన మువార్జించుటకు దేశాటన మెంతయు మూలంబని తెలిసికొని, యాయాచోటులం గల వింతలను శ్రావణునకుం దెలియఁ జెప్పుచు సంజవడినచోట విడిదిగాఁ జేయుచుఁ గడు నుల్లాసముగా నడచుచుండిరి. ఇట్లు పొద్దులుజరుగుచుండ నొక్కనాఁడు కళానందుఁడు శ్రావణునితోఁ గూడ నెద్దియో ముచ్చటింపుచు, మాటల సందడి దారితప్పి, కొంతదవ్వుచని యొక కుగ్రామముఁ జేరి యందు విడియందలఁప నది మాదిగపల్లియయని యందలి నివాసులు తెల్పిరి. వేదాధ్యయనముఁ జేసిన కర్మిష్ఠుఁడగు నుత్తమ ద్విజునకుఁ జండాలవాటియందు నోటికన్నము నీరు నెట్లుపోవునని పసులఁగోసి యెండవేసిన తోళ్ళకంపున ముక్కు మూసికొని యందు నిలువలేక యక్కడకు దగ్గఱి గ్రామ మెద్దియని యొక మాదిగవానినడిగి మూఁడుక్రోసులదూరమున నున్న వేఱొక యూరికింబోయి వంటఁజేసికొన నిశ్చయించి సాగిపోవుచుండెను. ఆనాఁటి మట్టమధ్యాహ్నము చండభానుఁడు తన సహస్రకిరణములతో వసుమతీమండల మంతయుం గాల్పఁజొచ్చెను. గాడ్పులు నిప్పులం జెరుగుచు, మొగమెత్తినడుచుటకు వీలులేకుండఁజేయ జంతుసంతానములు హాహాకారములం జెలంగి మహాతాపోపహతములై పానీయములకు నలుదెసలఁ బరువులెత్త నారంభించెను. కారుచిచ్చు వృక్షములరాపిడివలన జనించి రాజుల కలహములవలెనే బహువంశంబుల

దహియింపుచుండ విస్ఫులింగములు చెదరి యెంతయు దూరమునంబడి యచటి పల్లెలంగూడఁ బరశురామప్రీతి సేయఁదొడఁగె. దూరమున రవులుచున్న కాఱడవుల పొగయెగసి బ్రహ్మాండమంతయుఁ గప్పి కాలపురుషుఁడేయు నల్లని తెరచాడ్పున నొప్పియుండె. ధూమమునంజేసి కన్నులఁగానక కొన్నియు, నాసెగఁదాఁకి కమలి కొన్నియును, ప్రాణసంరక్షణార్థమై పరచుచు నిప్పునంబడి కొన్నియు బహుమృగములు మ్రగ్గెను. నాల్కలిగిరి పిడుచకట్టుకొనిపోవుచుండుట దాహబాధకోర్వక మృగములు చూపుమేరదవ్వున జలాశయములట్లుగాన్పింప నత్యాశ నందునీరుద్రావఁగోర సమీపించునప్పటికది మృగతృష్ణయగుడు నిర్విణ్ణములగు మనస్సులతో నవిదప్పిపోడమి యంగలార్చుచుఁ గడుశ్రమనొందఁజొచ్చెను. క్షుత్పిపాసాదు లఖిలజంతువులకును సమానములుగద ! మాదిగవాఁడు చెప్పిన గ్రామమెంతనడచినను సమీపింపకునికియు మట్టమధ్యాహ్నమాఁకలితోడయి మేరమీఱిన వేదనను గలుగఁజేయుటయు శ్రావణునితోఁ బలుకనైనఁజాలకఁ గళానందుఁడుగూడ జంతు ధర్మమగు క్షుత్పిపాసాబాధకు లోనై యడుగుదీసి యడుగు నిడలేక నెట్టులో యోపిక పట్టి కొన్నియడుగులు నడచి తుదకు నరములబలిమి సడలుటయు వచ్చియు రానిమాటలతో "శ్రావణా! యుదకముదక" మని యొక చెట్టుక్రింద మూర్ఛిల్లెను. తలవంచికొని వెనుక నడచివచ్చు శ్రావణుఁడా పతనధ్వని నాలకించి యజమానునివైపు కన్నెత్తిచూచి పరుగుపరుగున నటుపోయి "యయ్యో! యయ్యో" యని కుయ్యిడసాగెను. కళానందుఁడు మాటలాడ నోరురాక తనకు దాహము నిమిత్తము నీరుదెమ్మని సన్నఁజేసెను. అసన్న నెఱిఁగి శ్రావణుఁడు చల్లనియుదక మెందు లభియించునని నలుగెలంకులఁ బరికించి, కన్నీరు పెట్టుకొని హా! దైవమా! గంపెడు బలగముఁ గలవాఁడయ్యు, సకల సంపదలఁ గొఱంత లేనివాఁడయ్యు, దిక్కుమాలినవానితీరున నీభూలోక మన్మథుండు పట్టె

డన్నము గ్రుక్కెఁడు నీరును లేక మృతినొందును గాఁబోలు నని వగచి, తన కన్నీటి ధారలంబోలె నేలనంటు నూడలుఁగల పెనుమఱ్ఱిచెట్టు నొక్కదానినెక్కి పాఱఁజూచునప్పటికి నరక్రోసుమేర నొక సరోవరము గాన్పించెను.

కాంచి యచ్చోటికి సత్వరము యరుగఁదలఁచి మంగలములోని పేలగిఁజలవడువున జంతువులను వేచుచున్న యాపట్టపగటి యెండలోఁ దలయుఁ జరణములు మాఁడుచున్న సరకుఁగొనక నడుచుచుఁ ద్రోవలోఁ దమవలె పిపాసార్థ మొక పాత్రములో నీరుదీసికొనుపోవు బాటసారుల నిరువురు పురుషులఁ గని యించుక జలమిమ్మని వేఁడెను ; కాని వారు వానిమాటలను లెక్కసేయక యఱిగిరి. శ్రావణుండు వారి కఠినత కచ్చెరువడి యతిత్వరితముగ సరోవరమునుజేరి, యచ్చటి శీతల జాలార్ద్రమగు మలయానిలునకుఁ బారవశ్యము నొంది, కడుపు పట్టినంతనీరు ద్రావి మఱ్ఱియాకుల దొప్పలుకుట్టి యందుఁ గళానందుని నిమిత్తము కొంత జలమును బోసి క్రమ్మఱ బయలుదేఱెను. అంత శ్రమజెంది స్వామి ప్రాణరక్షణార్థము నీరు దెచ్చి యాచెట్టుక్రిందికివచ్చి చూచునప్పటికి నాస్థలమునఁ గళానందుఁ డుండఁడయ్యెను. కాని వెఱపుగొలుపు క్రొన్నెత్తుటఁ దడసినకత్తియుఁ, గళానందుని యుత్తరీయము మాత్రము గానవయ్యెను.

పదునాలుగవ ప్రకరణము.

నెత్తుటఁ జొత్తిల్లిన యుత్తరీయము, గత్తియుఁ గంటఁబడినతోడనే, ప్రాఁతపగచేతనో, ధనము మ్రుచ్చిలనెత్తిన యాసచేతనో యెవ్వరో నరహంతకులు తనయజమానునిఁ దెగటార్చి రని శ్రావణుండు తలఁచి గుండెపైఁ జేతితో మోదుకొని, హా! కళానందా! నీ పాదసేవకు

నొంటరిగ నట్టడవిం దిగవిడిచి పరలోకమునకుం జనం గడంగినాండవే. వివాహమునకు విఘ్నములు వాటిల్లినవని వాని నివారింపఁ దలఁచి ద్వా రకకు వచ్చి యిట్లగుదువని యెన్నఁ డనుకొననయితిని. నూరేండ్లు నిండి కాటికి కాలుచాపుకొని నీరాక ప్రతిక్షణము నిరీక్షించు మీయ మ్మతో నేనేమని విన్నవింపుదు? అయ్యో! నీమీఁదనె పంచప్రాణములు నిల్పికొనియున్న యాముసలి యవ్వ యీమాట విని గుండెపగిలి చావదే. ఆమెమాట యటుండనిమ్ము రూపున రతియు, విద్యను భా రతియునై, యౌవనమున జనించు మోహసముద్రముఁ గళానందుండ ను తెప్పసాయమున నీదఁ దలఁచిన సౌందర్యతిలకమాటయేమి? నీ యకాలమరణమున మగధరాజ్యమున నెన్నియేని వింతలు వొడమక పోవు. చిదిమినఁ బాలుగాఱు నీసోయగంపుమే నెంతలో నేలపాలయ్యె! హా! భూలోకమన్మథా! బ్రదికియున్న నాలుగుదినములు నెంతలెంత లద్భుతకార్యములు సేసితివి! శ్రీకృష్ణునంతవాని నిరువదియొక్కసా రులు పోరిలో గెల్చిన మేటిమగఁడగు జరాసంధు నంతటివానిఁ జీరికిఁ గొనక ప్రతికక్షిఁబూనఁగల సాహసికుఁ డింక ద్వాపరమున జన్మింపఁడు. అయ్యో! నిన్నుఁగ్రుమ్మిన కఱకువాలుతో నాఘాతకుఁడు నన్నేల క్రు మ్మఁడయ్యె. ఇట్టి ఘోరవార్తను నీచుట్టముల కెఱిఁగించు వ్రాఁత నా మొగమున వ్రాసియుండ నాకేల మరణము సంభవించును. నీతోడఁ బయనముఁ జేసినన్నినాళ్ళు నీమాటల నేర్పువలన నీ దయారసమువల్ల నాకు మార్గాయాసమైనఁ గానఁబడదయ్యె. పెద్దకాలపువాఁడనగు నాను ముప్పు నీవ గడపుదువని యాసఁజేసి కొలిచి కారడవులలో నీము ప్పు నేనే గడపితినిగాని నాకు నీవు కావైతివి. ఎందఱిని పడుచువారి ని దిగమ్రింగకుండ నీశ్రాణముఁడు మేను దొఱఁగునా. నాతండ్రి ప్ర పంచమునకు నిష్ప్రయోజనుఁడైన నావంటివాఁ డుండి సర్వవిధములను గనకవృక్షమువగు నీవు కడతేఱుట నాపాపముగాదా! నిన్నెత్తుకొని

మోచినకాయలు నాబుజమున మాయనైనలేదు. నాకన్నులముందఱ నీకొకగడియలో రూపుమాసె. ఏమి సేయుదు నయ్యో యని తన దైన్యముంగూర్చి పెక్కువిధములఁ బొక్కుచు వేఁడి కన్నీళ్ళు ముడుతలు వడిన ముసలిచెక్కులమీఁదనుండి జాఱి నేలరాల నేడువసాగెను. అట్లు కొండొకతడవు వాపోయి యాపూఁట కూడు దొరకకునికి నాయాసము తన్నలమినం జేవయఱి యొక చెట్టునకుఁ జేరఁబడి యుస్సురుస్సురనుచుఁ గొంతసేపు వగర్చి కన్నులుమూసి పరవశుఁడై యుండెను.

ఇంతలో నాతనికిఁ గునుకుపట్టి యించుక నిదురించుచుండ భానుఁడు గ్రుంకి యపరజలధిఁ బడి జగముం జీఁకటుల ముంచెను పట్టపగటనే సూర్యరశ్మి కానరాని యాకారడవిలోఁ బ్రొద్దు గ్రుంకిన వెనుక నెట్లు లుండునదియును వర్ణింప నెవ్వరితరము. ప్రొద్దుగ్రుంకు నప్పటికి శ్రావణుఁడు కునుకుఁ జెందినందున భయంకరమగు చీఁకటినుం డితొలఁగి యెటకేనియుఁ బాఱఁడయ్యె. చీఁకటిపడిన వెనుక మేలుకాంచి చూచునప్పటికిఁ గళానందుని నిమిత్తము పడుచున్న నెవ్వగయంతయు నడంగి యపూర్వమగు భీతివొడమి యొడలు వడఁకఁజేసెను. ఎంత వడఁకిన నెంత భీతిలినం దన్ను దానె యాశ్వాసించుకొనవలయును గాని యాయరణ్యమునఁ దనకు శరణ్యులగువారు లేనందున నెట్టకేలకు మనము నిబ్బరము చేసికొని యెదుట నేదియున్నదియో వెనుక నేది యున్నదియో యెఱుఁగ లేశమైన నవకాశము నొసంగకఁ దన్ను జుట్టుముట్టిన గాఢాంధకారముచేత మది నేవెరపుఁ దోఁచకునికి మెల్లన నాతఁడు జేరఁబడిన చెట్టునకు వీఁపు నానుకొనెను. తోడనే యాతని కర్మవశమునఁ జిటుక్కన నేదియో విషజంతువు కుట్టెను. నిప్పువెట్టి కాల్చినయటుల నెమ్మేను బగ్గున మండుటయు నావృద్ధఘటము తాళఁ జాలక యబ్బా యని కుట్టినచోటనఁ జేయివైచి రాచికొనుచు నది నొప్పిఁగుట్టినందున మిక్కిలి బాధపడుచుండెను. ఆయవస్థలో నాదీనుని

మనోవ్యాకులత యెట్టులుండెనో వ్రాయుటకన్న నూహించుట సుకర
ము. తాను సర్వదష్టుఁడ నైతినని యొకమారు భయపడుచు మం దైన
వేయువారు లేమికి వగచుచు, నెట్టులయిన నాకట్టడి మేనువాసి పరలో
కముననున్న తనయజమానునిఁ గలయుట సంభవించునని సంతసించుచు
నేదియుఁ జేయఁజాలక తన పల్కు లరణ్య రోదనముగా విచారపడఁ
జొచ్చెను.

ఇట్లు రెండుగడియలు మేరకుమీఱిన బాధ పడుచుఁ జీఁకటిసము
ద్రిములో మునిఁగియున్న యామిదుసలికిఁ బాపాత్మున కీశ్వర సందర్శ
నము లభియించినట్లు రవంత వెలుఁగు కానఁబడియెను. మొట్టమొద
ట శ్రీవణుఁడు దానిఁ గనుగొని యది తన మనస్సునఁ జెందు భ్రాం
తియో, లేక యరణ్యముననుండు వింత పురువులమేనికాంతియో య
దియును గాదేని కొండలలో విద్యుల్లతలుండునని పెద్దలు చెప్పుదురు
గాన వాని వెలుఁగో యని శంకించి క్రమముగ సూర్యకిరణములవలె
దాని కాంతులు వృక్షములు సందునుండి తన ఛాయ కరుదెంచి వచ్చు
టయుఁ జూచి నిజముగా వెలుతురై యుండనోపునని యూహించె.
అది సమీపించినకొలఁది శ్రీవణునకు నించుకధైర్య ముదయించుటకు
మాఱు, యక్ష కిన్నర గంధర్వ పిశాచ రాక్షసుల మూఁకలు కాఱడవు
లఁ గాఱుఁజీఁకటులఁ గ్రిమ్మరుట విందుము. ఈవచ్చువాఁ డందెవ్వఁ
డేని యైయుండి నాబడలినమేను దనకు సంజకబళముగా వినియోగిం
పఁబోవునని శంకింపుచుండ నంతలో నలుఁగఁగొట్టిన కొఱవిపాలకట్టఁ
గాగడాగా వెలిఁగించుకొని దీపపుఁ గ్రీనీడతో వియ్యమొంది యచ్చటి
కాఱుఁజీకటికి వన్నెలు నవరింపఁగలయంత నలుపు దేఱి మేనిచాయతో
బలముగల పొడవువాఁ డొకఁడు శ్రీవణుని కట్టెదుట నిలిచెను. ఆతని
కన్నుగొలుకు లెఱుపుమీఱి చింతనిప్పులచొప్పునఁ జూచువారి గుండెల
కు భయోత్పాతముఁ గలిగింపఁజొచ్చెను. ఎడమచేతఁ బాలకట్టయు

గుడిభుజముపై గండ్రగొడ్డలియు నప్పుడప్పుడే పట్టివధించి జఠరా
గ్ని కింధనముగాఁ జేసికొన్న కారెనుపోతు క్రొన్నెత్తుటఁ దడిసిన కఱకు
మీసములను జూచి యాతఁడు రాక్షసుఁడని యెఱిఁగి శ్రావణుఁడు, త
న యంత్యకాలము వచ్చినదని జంకుచు ఖేదపడుచుండెను. అంతట
నారేద్రిమ్మరీఁడు ముసలివాని యవస్థఁజూచి రాక్షసజాతికి విరుద్ధమగు
జాలి తన్ను బొడువ వానిఁ గడతేర్పక "ఓరీ ఏమిరా నోటనుండి చొం
గలుగ్రక్కుచు నటు బాధపడియెదవు. నీకేమిరోగమురా?" యని
యడిగెను. ప్రత్యుత్తర మొసఁగుట కిష్టములేకున్నను, బదులు చెప్పకు
న్నను నాతఁడు తన్నొకచఱపుఁ జఱచి చంపఁగలఁడని శ్రావణుఁడు
మెల్లమెల్లగ "నన్నిచట నెద్దియో కుట్టినది. చెట్టునకుఁ జేరగిలఁబడిన
పుడు నావీఁపు బగ్గున మండినది. నాయనా" యని పలికెను. ఈపలు
కులు విని వెంటనే వాఁడందు నిలువక వడివడిఁ గొన్ని యడుగులదూ
ర మరిగి యందు నిటునటుఁ నెమకి యెద్దియో గ్రహించి క్రమ్మఱవచ్చి
ముసలివానిఁ బలుకరింపకుండనె రెండుచెక్కలుబట్టి వానిని లేవనెత్తి
యక్కటా! యిదియేమి దైవమా యని యాతఁడు మొఱవెట్టుచున్నను
సరకుఁగొనక గొన్ని యాకులు నలిపి యాపస రాతనివీఁపున గట్టిగా
రాచెను. ఆమోటురక్కసుఁడు చేసిన మోటు వైద్యముతో ముసలి
వాని వీఁపుమంట రెండుగడియలలో నుపశమించుటయు నాతఁడు సేదఁ
దేఱి సంతసించి వానితో నిట్లనియె.

శ్రావ—అయ్యా నన్ను రక్షింపవచ్చిన దైవమువలెఁ దోఁచు
నీవెవ్వఁడవు. పాము పూలదండయైనట్లు నీవు నాకు మొదట భయము
గొల్పి రక్షకుఁడవైతివి.

రెండవవాఁడు—ఓరీ! వినలేదా జ్వాలాజిహ్వుఁడను రాక్షసరా
జుపేరు? నేనామహాత్ముని సేవకుఁడను. నాపేరు కపాలమాలి. ఈయ
రణ్యము మాప్రభువుగారికి జరాసంధుఁడు శిశుపాలుఁడు బట్టముగట్టి

ఱొసఁగినారు. నేను రాక్షసదండనాథుఁడను. పాండవపక్షులను వాసు
దేవానుచరులను బట్టి శిక్షింపుమని మారాజు నాకానతిచ్చె. నీవు వాని
లో నొక్కండవైతివేని యిదిగో నానోటఁబడుము.

అని తన వెడఁదనోరుఁ దెఱచి మేకువంటి పండ్లను జిహ్వ పలక
ఱాయిఁబోలు తన నాలుకను జూపి శ్రావణు నడలఁబెట్టెను. శ్రావణుఁ
డామాటలు విని ద్వారకనుండి వచ్చుట వానికిఁ దెల్పినఁ దన్నతఁడు
నంజుకొనునని తనరాక మాటుఁజేసి చెప్పఁదలఁచుచుండ నింతలో నా
పాలసుఁడిండి “ యోరి నీవెవ్వఁడవో చెప్పవేమిరా ! యని బిగ్గరగా
నఱచెను.” అంతట శ్రావణుఁడు మెల్లమెల్లన నిట్లు విన్నవించుకొనియె
ను. “కపాలమాలీ నీకు నేను బరమాప్తుఁడను సుమా! ఏపురము నీ
నెచ్చెలియగు జరాసంధునకు గాఁపుర మాపురమే మాకుఁ గాఁపురము.
నే నుజ్జయినీపురమునకుఁ బోయి యచ్చటనున్న మాచుట్టములను జూచి
మరల నింటికిఁ బోవుచు దారితప్పి యిటువచ్చితిని. నాకు దారిఁజూపి
కాపాడఁగల భారము నీయదియసుమీ” యని నోటికి వచ్చినన్ని య
బద్ధములు సెప్పి రాక్షసునకు నమ్మకముఁ గల్గించెను. అంతట దై
త్యుఁడు తలయూఁచి “ సరే యెట్లయిన నీవుమాత్రము మాప్రభువగు
జ్వాలాజిహ్వుని దర్శనముఁ జేసి యాతనియొద్ద సెలవుఁ గైకొనిపోవ
లయు రమ్మ” ని ఱెక్కలు పట్టుకొని యాతని లాగఁదొడఁగెను. ఈ
నడుమఁ గాగడాగా నుపయోగించు పాలకట్ట క్షయమైపోవుట నాతఁడు
చంకనున్న రెండవకట్ట నంటించుచు గాలికెదురుగాఁ దిరిగి నోటితో
నుప్పని యూఁదుచుండ నాసందెఱిఁగి యజమానుని కత్తియు మున్ను
గృష్ణుఁ డాతని కిచ్చిన లేఖయు నేలఁబడియున్నందున వానిని సంగ్ర
హించి యుత్తరముదాఁచి వాలుఁ గేలఁబూని శ్రావణుఁడు రక్కసునివెం
టఁ బయలుదేఱెను.

పదునైదవ ప్రకరణము.

అట్లు కపాలమాలి తన యేలికయగు జ్వాలాజిహ్వునియొద్దకు వృద్ధుఁడగు శ్రీపణుని వెంటఁబెట్టుకొని యరుగుచుండ, బహువిధములగు పులుగుల మెలుఁగులు, ఘాతుకజంతుసంతతుల యఱపులు, నందు ముఖ్యముగా బెబ్బులుల గాండ్రుగాండ్రు మను కేకలు, దాఁచుపాముల బుసలు శ్రీపణుని కమిత భయము నాపాదించెను. ఎంతయు దిగులున నరచేతఁ బ్రాణంబుల నిడికొని యేగుచున్న వాని దుర్దశఁ గైకొన్నమూర్తియో యన్నట్లు వారి కట్టెదుట వఱువాత మొదలు నాహరింప నెట్టిజంతువు లభియింపమింజేసి పేరాఁకలిచే నకనకంబడుచుండి మనుష్యదర్శనంబగుడు సంతసంబునఁ జివాలున లేచివచ్చు నొక వ్యాఘ్రము వారి కంటఁబడియె. వెంటనే శ్రీపణునకు నోడలు కంపమెత్తినందున "సయ్యో యేమిసేయుదు నేమిసేయుదు" నని కపాలమాలిని బిగ్గఁ గౌఁగిలించుకొనియెను. ముందు శ్రీపణుఁడును, వెనుకఁ గపాలమాలియును వచ్చుటంజేసి యాశార్దూలము మందభాగ్యుఁడగు నాసేవకుఁ దుదముట్టింప మీఁదికి వచ్చుచుండ దాని నెదుర్కొని కయ్యము సేయుటకుఁ గపాలమాలి సంరంభించుచుండెను. కాని మొఱకువాఁడగు ముదుసలి వానిని వీడఁడయ్యె. రక్కసుండును బెబ్బులికన్న భయంకరాకారముఁదాల్చి తన్నుఁ గౌఁగిలించి విడువకున్న యాయనను జేతులతో నెత్తి వెనుకప్రక్కకు విసరివైచి యప్పటి కొక్క యడుగు దూరములోనికి వచ్చిన క్రోలుపులిపైఁ గవిసెను. అదియును హుమ్మని యొక్కసారి రక్కసుమీఁదఁ బడుటయు నాబండ తనబాహుబలమున దుండగఁపుఁ బులిని నేలం గూలఁద్రొబ్బి తన రెండుచేతుల దానితోఁకఁ బట్టుకొని ముమ్మాఱు భీమసేనుఁడు గదాదండమును ద్రిప్పు చందమున బిఱబిఱఁద్రిప్పి యొకపాషాణముపై వైచికొట్టె. కొట్టుటయుఁ

దలవ్రియ్యలై నెత్తురుఁ గ్రక్కుచు నది యొక్కయఱపఱచి మృతి నొందెను.

శౌర్యమునందేకాక బాహుబలమునఁగూడ బెబ్బులినిమించినట్టి రక్కసునిపరిజ్ఞకు నరుఁడు తాత్కాలికానందము నందియు వానిచేతి నుండి తాను మృత్యుదేవత బారిఁ బడకుండ మరలఁ దనవారి నెన్నఁడేని చూడఁగల్గుదునా యని వగచుచుండ నాఁడుండఁగుఁ డరుదెంచి తలపై నొక్కదెబ్బవైచి "యోరీ, పిరికిగొడ్డా! ఈదినము నీవు చచ్చుటయే గాక మీఁదుమిక్కిలి ననుగూడఁ జంపుకొందువుసుమీ. అపాయము వచ్చి నప్పుడు నాకుఁ దోడగుటకు మారు ననుబట్టి విడువవైతివేమిరా! నీనిమిత్తము నేనీవాహనము దెప్పించితి నెక్కుదువు ర" మ్మని బలిమిచేఁ జేయిఁబట్టుకొని యాసేవకుఁ డావ్యాఘ్రకళేబరము మీఁదఁ గూర్చుండఁబెట్టి "శ్రావణమహారాజుగారూ! మహారణ్య రాజ్యమునకుఁ బట్టముఁ గట్టుకొనుఁడీ" యని పరిహసింపఁజొచ్చెను. ముసలివాఁడును బుద్ధిలేని యాపాడు రక్కసునిచేతఁ దా నింక నెన్ని యిడుమలఁ గుడువ వలసియున్నదో గదా యనియు, యెట్టివాఁడైననేమి? ప్రాణదానముఁ జేసిన పుణ్యజనుఁడనియు నెంచి యప్పాడు నయ్యమునకు ముచ్చటతీఱునంతదనుక వాని చెప్పినచొప్పున పులిపీనుఁగుపై నాసీనుఁడైయుండ, వాఁడును దనచేతి పాలకట్ట కొలవితో ముమ్మారు వానిమొగముకడఁ ద్రిప్పి "మహారాజుగారికి కారతియిచ్చినాను లెండీ" యని ఱెక్కగూడ నూడివచ్చినట్లు లాగెను. "ఎట్లయిన నాతనివెంట నరుగక తప్పదుగదా" యని శ్రావణుఁడులేచి మెల్లమెల్లన నడుగులిడుచు నిస్సత్తువచే నడువ లేక త్రోవలో నిలుచుచుఁ బోవుచుండ కేదిరిమ్మరి రెండుమూఁడు సాకులు వానినిమిత్తము దానుగూడ మెల్లఁగ నడచుచు నతని కిట్లని యెను. "ముసలివయ్యామా? నీవు నడపీనుఁగు చావునున్నావు. ఇప్పుడు చాల ప్రొద్దాయెను. మాస్వామినాయొనర్చిన యాలస్యమునకు

నాపైఁ గినుకఁబూను. నీ వడుగిడఁజాలకున్నావు. నిన్నువిడిచి నేఁ జనరాదు. కావున నీవు నాభుజముపై నెక్కుము. నిన్ను ముహూర్త మలోన మాయింటియొద్ద దింపివైచెద" నని తన మాట లింక ముగి యకమున్నె వాని నువ్వెత్తుగఁ బట్టి యెత్తి భుజముపై నిడుకొని నడువ సాగెను. ఇప్పుడల్లు చిత్తమెఱుఁగకుండఁ దాఁ వీవిన వానిమూఁపునఁ గూరుచున్నందుకు శాస్త్రిపిణుదకు మనశ్శాంత యొకింతయుఁ గానరాక "యిఁక నీ చంచలచిత్తుఁ డెందుఁ దన్నకస్మికముగఁ బారవేయునో" యని భయమందుచు, వాని కంఠమునకుఁ జేతులు పెనివేసి కనులు మూసి, భగవంతునిపై భారమువేసియుండెను. అట్లు కతిపయదూర మరుగునప్పటికి వాఁడొక్క మిట్టు నేలనెక్కి నడచుచుండె. మీఁదఁగూరుచున్న శాస్త్రిపిణుదకుఁ గన్నులముందట, పెనుమంటల నెగసెడు నాలుగునెగళ్ళును, వానిచుట్టును గూరుచున్న కాలకింకరులఁబోలు పదుగురి భీకరాకారములును, జెవ్రులు వ్రక్కలు సేయు వారలయార్పులును గనఁబడి వినఁబడి కూరుచున్న ముసలివానిని భుజముమీఁదనే పరవశుని గావించెను. ఆ పారవశ్యతనుండి, వాఁడు మేల్కనునప్పటికిఁ గపాలమాలి యాప్రదేశమునకు వానిఁ దోడ్కొనివచ్చి, యొకచోట మూటదింపినచందమున వానిని గుభాలున నేలఁ బారవైచెను. ముసలివాని కెముకలన్నియుఁ జూర్ణమగునట్లు దెబ్బలు తగిలెను. కాని విధిలేక తక్షణము నిలువఁబడెను. నిలువఁబడి చూచునప్పటికి నక్కడనున్న మూఁకలలో "మానిసి మానిసి" యని యొకకోలాహలము బయలువెడలెను. అంతలో నచ్చటనున్న స్త్రీపురుషులందఱును వచ్చి వానిచుట్టును మూఁగి, కపాలమాలి ననేక ప్రశ్నపూర్వకముగ వానియిక్కడెద్దియనియు నామ మెద్దియనియు నరయఁజొచ్చిరి. కొందఱికి పాఁవైచిన యెమ్ములు, నెండవైచిన జంతువుల చర్మములు, గుళ్ళిన మాంసపుముద్దలు, నేలఁ బ్రవహించి యెండి యట్టకట్టిన నెత్తురులు

ముక్కు బద్దలగునట్లు దుర్వాసనఁ గల్గించి శ్రావణుఁడు నిలుచుటకు వీలులేనట్లుచేసెను. దానికిఁ దోడై తన్ను జుట్టుకొన్న రక్కసి మూఁకలదేహములనుండి వెడలు గబ్బు వశీకరంపుఁ దరముగానంతమై యదియె నరలోకమై యుండవచ్చునను సందియమును శ్రావణునకుఁ గలుగఁ జేసెను. క్రిక్కిరిసిన రక్కసుల నొక్కప్రక్కకొత్తిగించి కపాలమాలి, శ్రావణుఁ దన యేలికకుఁజూపు తలంపున వానిని వెంటఁబెట్టుకొని, వేఱొకచోట నేలపై నెత్తుగాఁగట్టిన యొక మంచెపైఁ గూరుచుండి, సేవకుఁడు నెగడిలోఁబేల్చియిచ్చు నేదుఁబంది నంజుడుఁ గడుఁదమకముతో మెసవుచు నెడనెడ హరిణశాబకముల మాంసముఁ జవిచూచుచుఁ బులివలె నందఱకు భయంకరుండై మంటలవెలుఁగున సంపూర్ణముగఁ గనఁబడు చిన్నకొండవంటి మహాకాయము సేవకులకు భీతిఁగొల్ప నానందపారవశ్యముచేత నడుమనడుమ గుండియలు పగుల నఱచుచున్న జ్వాలాజిహ్వునిఁ గని జోహారొనర్చి, యొకమూల నొదిగి నిలిచెను.

తనువున నుసుఱులెగిరిపోయెనో నిల్చెనో యను సందియము గలిగించునట్లు శ్రావణుఁడు వడఁకుచు వానివెనుకఁ దన యొడలి క్రీనీడయె రాక్షసేశ్వరునకుఁ గనఁబడునట్లు నిలిచెను. మూఁడేనుబందులు నాలులేడిపిల్లలు గొన్నిపక్షుల నాహరించి యొకరీతిగా క్షుదానలముఁ జల్లార్చుకొని యెదుటనున్నవా రదరిపడునట్లు దేన్చి కనులువిచ్చి తల యెత్తి యెదుటనున్న కపాలమాలింగాంచి “ యోరీ ? నీవింత యాలస్యముగ వచ్చుటకుఁ గారణమేమి ? నీవెనుక నక్కపోతులాగు నక్కి గుక్కుమిక్కుమనకుండ సగము చచ్చినవాఁ డెవఁడురా ” యని మెల్లగాఁ బలికెను. కపాలమాలియుఁ జేతులుజోడించి “ యీపాపాత్ముఁడు మనుష్యుఁడు, మాగఱ వశమ్మైన వీఁడొక చెట్టుక్రింద నీకాఱడవులలోఁబడి యెటు నరుగఁజాలక నటునిటుఁబడుచుండ నీతనిం గలసికొని మాగధుండనియు, జరాసంధుండు మన కాప్తుఁడు, కావున వీఁడును మన కాప్తుఁ

డని యెంచితిని. మీఁదఁ దమచిత్తము దేవా" యని విన్నవించెను. అనవుడు నాదనుజనాయకుఁడు నగి "యీతఁడు మనుజుఁడా? ఓరీ యిటురారా" యని పలికెను. తోడనే నలువురు రక్కసి జెట్టులరుగుదెంచి, భయమున వడఁకుచున్న శ్రీవణునిచెక్కలం బట్టుకొని ఱేని ముందఱఁ బెట్టిరి. రేఁడు విస్మరితుఁడు వానిం గనుంగొని 'యీముసలి దయ్య మిట్లున్న వాఁడేమిరా?' యని వాని కాలుకీలుపట్టినొక్కి 'వీఁడు స్పృశించినమాత్రమునఁ జచ్చునట్లు తోఁచెడును. ఓరీ నీకాఁపురము మగధరాజ్యమేనా? అని యడుగ వాఁడును సభయముగఁ జిత్తము నేను మాగధుఁడనే' యని ప్రత్యుత్తరమిచ్చెను. అంతట రక్కసులసామి యొక చిన్న రక్కసుఁబిలిచి "మన యిందుమతి యీతని నెఱుఁగునేమో యడుగుద మామెనిటు కొనిరమ్ము" అని మొదల నొసఁగ నానేవకుఁడు లోనికరిగి యొకముహూర్తమున నాయిందుమతిని వెంటఁబెట్టుకొని వచ్చెను. ఇందుమతి యనిన పేరు వినఁబడినతోడనే యది రాక్షసాంగనయై యుండనోపుననియుఁ దనమీఁద లేనినేరము లెవ్వి సెప్పునోయనియు శ్రీవణుఁడు జంకఁదొడఁగెను. కాని యామె వచ్చినప్పటి కాతఁడనుకొన్న దన్యథాయయ్యెను. ఆవచ్చిన యిందుమతి వికృతవేషిణియగు నొకరక్కసి కన్నియగాక దివ్యసుందర విగ్రహయగు నొక మానవకన్యయైయుండెను. మణిభూషణములు జీనాంబరములు లేకయున్న ననాగరికులనడుమ కాలముఁ బుచ్చుచున్నయామె మేననలంకరించిన ముదుగుచీరయు వేసలిని ముడువఁబడిన యడవిపూవులును, బదునెనిమిదియేండ్ల నిండుజవ్వనముచేఁ బరిపూర్ణదశఁ బ్రాపించిన యందమునకు వన్నెయిడుచుండెను. కొరడవులఁ జిరకాలము సహవాసముఁజేసి గజరాజునొద్దనుండి నేర్చికొనిన గమనవైఖరినాఁడు ప్రదర్శింపఁజేయుచున్నదో యనునటుల మందగజగమనంబుతో ముద్దులు మూటగట్టుచు సింగారముట్టిపడు వదనచంద్రబింబముతోఁ జేరలం గొలువఁ

జాలిన కనుదామర తేకులతో విచారమును సూచించు వైఖరితో సార్థకనామధేయమగు నిందుమతి వచ్చి నెగళుల వెల్గునఁ దన యంగసౌష్ఠవముఁ గని ముక్కిడి రక్కసిబాలకులలోపల మదనతాపమొందవచ్చి జ్వాలాజిహ్వుని కట్టెదుట నిలిచెను. రాక్షసుఁ డాపెనుజూచి "బిడ్డా యీ మనుజునిది గిరివ్రజపురమఁట, నీవెఱుఁగుదువే" యన నాపె శ్రావణుని ముఖాంబుజమును దప్పక ఱెప్పవేయక చూచి "నేనెఱుఁగ" నని పలికెను. "ఔను నీవేమి యెఱుఁగుదువు వప్పటికి నాతేండ్లదానివేగదా" యని రక్కసితేఁ డుత్తరముసెప్పి యామెను లోనికరుగ నానతిచ్చెను. ఇందుమతియు నెద్దియో యించుక యోచించుచు రెండుమూఁడుసారులు శ్రావణుని నెమ్మొగముఁగాంచి మెల్లమెల్లగ లోనికరిగెను. అనంతరము రాక్షసేశ్వరునకు నిద్రవచ్చుటచే నాతఁ డుండఱకును సెలవొసంగి యామంచెపైఁ గొండవలెఁ బండుకొనెను. కపాలమాలియు శ్రావణునకుఁ బట్టెడన్నముఁ బెట్టించి, యాతని నొకచోటఁ బండుకొన నియమించి, తానును దక్కిన రక్కసులును గడుపుపట్టినంత యిప్పకల్లుఁద్రావి దూరముగ నరిగి యఱచుచు నేల దొర్లుచు బహువినోదములం దేలుచుండిరి. శ్రావణుఁడు పంచాగ్నిమధ్యమున నున్నటులున్న తనయవస్థ దలఁచి యించుక వగచి యిట్లని తనలోఁ దాను వితర్కించుకొనఁజొచ్చెను. అహాహా! తుమ్మచెట్లనడుమఁ గమ్మసంపెంగమొక్క మొలచుట విచిత్రముగనున్నది. ఈలావణ్యపయోనిధియగు నిందుమతి యీరాక్షసుని పుత్త్రికయైయుండునా? ఇది యసంభవము. ఈమె తప్పకమనుష్యాంగన. కారణాంతరమున నిందుండఁబోలు. నే నిందున్నదినములలో నెట్లయిన నీమెస్థితి నరసి యీమె కేదయిన నుపకారమొనర్చి చెఱబాపయత్నింతు" నని కొనుచుఁ గన్నులుమూసి నిద్రించెను.

పదునాఱవ ప్రకరణము.

మఱునాఁడు శ్రీవణుఁడు రక్కసులకన్న మున్న మేలుకాంచి యెట్లయిన నిందుమతి చరిత్ర మరయుతలంపున నామె పండుకొన్న చోటి కరిగి చేరువై చియున్న తలుపుఁ దెఱచెను. ముప్వురు రాక్షస స్త్రీల నడుమ నిద్రించుచున్న యా యిందుమతిని గనుంగొని యాతఁడు మేలుకొలుపుటకు సంశయించి యెద్దియుఁ దోఁచక నిలిచి యుండ నంత నొక్క రాకాసి యొత్తిగిలినందున నాతఁ డశలి వారద్రు తన్నుఁ గనుఁగొనిరేనిఁ దుత్తునియలు గావించి నంజుకొనఁ గలరని గుఱుక్కున వెనుకకు మరలి తనతావునకుఁ జేరెను. రక్కసు లందఱు మెల్లమెల్లఁ బ్రొద్దెక్కి లేచినవెనుక జ్వాలాజిహ్వుఁడు జాముప్రొద్దెక్కి నప్పటికి మేలుకాంచి సేవకులు పరిచర్యలు సేయఁ గాల్యములఁ దీర్చి యంతక మున్నె యాయత్తముసేయఁబడిన కొన్ని మేకముల నంజుళ్ళు మెక్కి రక్కసులతో ముచ్చటలాడుచుండెను. తక్కిన ముక్కిడి రక్కసులెల్లఁ దమతమ పనులం దగిలిరి. శ్రీవణునకు వారిచర్య లెంతయేవఁ గల్గించు చున్న నెంత త్వరితముగ నందుండి యతఁడు దాఁటఁదలంచిన నించుక యు వీలు గలుగదయ్యె. అది యటులనుండఁ దనప్రాణముఁ గోలుపో యినైన నిందుమతిని గాపాడవలయునని యాతఁడు కృతనిశ్చయుఁ డయి యుండెను. కాని నోరెత్తి యామెను బలుకరించుట కైన నవ కాశ మతనికిఁ జిక్కకుండుటచేఁ దన మనంబున "దైవమా! మేలిమి బంగారుబొమ్మబోలు నీమెను రాక్షసుల కప్పగించి నేనెట్టు నా యసు వుల రక్షించుకొందును? నేను సకల సుఖదుఃఖముల ననుభవించిన వృద్ధుఁడను. నేనెట్లయిన భయములేదు. ఇందుమతినిమాత్రము చెఱ నుండి విడిపించి తీఱవలయు" నని నిశ్చయించుకొని సమయమున కెదురు చూచుచుండెను.

ఇట్లు పదునాఱు దినములు సనిమెను. అంత నొక్కనాఁడు రక్కసి మూఁకలన్నియు మహాసంరంభముతోఁ బరవశమ్మలై తిరుగు చుండెను. "అంతటి మహాసంతోషమునకుఁ గారణమేది" యని తన మిత్రుఁడగు కపాలమాలి నడుగ నాతఁడిట్లనియె. "ఈదినమున మా రాక్షసకులచక్రవర్తి యగుహిరణ్యాక్షుఁడు భూమి నంతయుఁ జాపగఁ జుట్టినదినము. అందుచేత మాకందఱకుఁ బండువ. నీవు నీ వేడుక ననుభవింతువుసుమీ" యన శాలివణుని మొగ మెందుచేతనో సంతసమున వికసించెను. అంతటఁ గొంతసేపటికిఁ గొందఱు రాక్షసులు వేడుక లకోలఁది నిప్పకల్లు ధాటికల్లు నీతకల్లుఁ దెచ్చి వరుసగ దింపిరి. వేఱొక కొందఱు బహుమృగజాలములఁ జంపి గుట్టలుగా వేసిరి. అంతయు నాయత్తమయిన వెనుక నొక ముసలిరక్కసి వచ్చి యందఱఁ గూర్చుండఁబనిచి గంభీరస్వరముతో నిట్టనియె. "ఓ రక్కసులారా! యీదినము సుదినము. మనకులమునఁ బెద్దయు, మనకుఁ బూజనీయుఁడును, భగవత్స్వరూపుఁడునైన హిరణ్యాక్షులవారు భూమిని జాపగాఁ జుట్టినదినము. ఆపాపపువిష్ణువు వారిఁ గడతేర్చెనుగాని లేకున్న నో మన యధికారమే యధికముగా నుండి యుండును. దినములు బాగుండక పాపాత్ములైన దేవతాధములు గెల్చుటయు మన మోడుట యు సంభవించినది. ఆమహాత్ము పేరు చెప్పకొని యీసురను మీరు దప్పిదీఱఁ గ్రోలి నంజుళ్ళు మెక్కి మెక్కి సుఖించి కులగురువును గౌరవింపుఁడు" అని ముసలి రక్కసి ముదల యొసఁగుటయుఁ దక్కినవాండ్రందఱుఁ గడవల యొద్దఁజేరి తమపని నారంభించిరి. ముంతలతో ముంచి త్రావువారును గడవలనెత్తి కల్లంతయు నొక్కమాటె వంచుకొనువారును, జెటిమొకచేతఁ జెటిమొకబావనెత్తి యవలీలఁ గ్రోలువారును నై యా సురద్వేషులు శ్రావణున కద్భుతముఁ గొల్పిరి. త్రావుటకు విసుగుఁదోఁచిన మాంసమును దినుటయు, పలల భోజనమునకు విసుగుదోఁ

చినఁ గలు ద్రావుటయు నను రెండుపనులయందుఁ దగిలి వారు వర్తిం పఁదొడఁగిరి. ఒకఁడు సురఁ గ్రోలి విడిచిన కడవఁ గిరీటముగ ధరించి వికవిక నవ్వెను. ఒకఁడు, దానినెగరవైచి తన వీఁపొగ్గి వేయు వ్రయ్యలుగ గుభాలున వీఁపుపైఁబడ నానందమొందు. ఒకఁడు చెట్టెక్కి యొడలెఱుఁగక యొక కొమ్మపైఁ గూరుచుండి నేలఁబడు. ఒకఁడు మృగచర్మములఁ గప్పుకొని కిచకిచలాడును. వేఱొకఁడు మేనుమఱచి దొర్లును. ఇట్లు దనుజులు స్త్రీ పురుషులు శిశువులుగూడ మద్యమాంసలోలురై మహా కోలాహలము సేయుచుండ సాయంకాలమయ్యె. ఈయెడలెఱుఁగని యావేశమునఁ దన్ను దనుజులెక్కడ బలిమొనర్తురో యను సాధ్వసమున శ్రావణుఁడు తరులచాటున నక్కి కానఁబడకుండ జాగ్రత్తపడియెను. ఇందుమతియు వీరి విలక్షణములు కనుఁగొని తన నిరంతర దుఃఖ మించుక మఱచి మందహాసము సేయుచుండెను. అంతటఁ గొంత తడవున కంధకార మెల్లదెసలఁ గ్రమ్మె. అందఱును మద్యపాన విహ్వలురగుట నాఁడా యడవి నెగళ్ళు వేయువారు లేరైరి. స్త్రీపురుషులు దానవులెల్ల మత్తున నొడళ్ళెఱుంగక వజ్రాయుధముచే నఱకఁబడిన కొండతెక్కల చాడ్పున నేలఁబడియుండిరి. అంతట శ్రావణుఁడు తన డాఁగినచోటునుండి యిందుమతియున్న తావునకు మెల్ల మెల్ల నరుగఁదలఁచి ముందుగాఁ జచ్చినట్లు పడియున్న సోఁకుమూఁకలనెల్లఁ బరీక్షించి వారిదెస భయములేదని యా కన్నియయున్న గదియొద్దకరిగి నిలిచెను. ఆగదిలో నామెయు నొకచిన్న నెగడివేసికొని యెద్దియో తలపోయుచుఁ జెక్కిటఁ జేయిఁజేర్చి మంచముపైఁ గూరుచుండెను. శ్రావణుఁడు తలుపుఁ దెఱచి లోనికిఁ దొంగిచూచుటయు నామె లేచి “శ్రావణుఁడా రావచ్చును; ఆపాడుదయ్యము లేవియు లేవులే” యని ముద్దు ముద్దుగాఁ బలికెను. శ్రావణుఁడును ధైర్యముతో లోనికరిగి యొక వ్యాఘ్రచర్మముమీఁద నాసీనుఁడై యారాక్షసోత్సవమును

గూర్చి తనకుఁ గలిగిన యబ్బురమంతయు నామెకుఁ జెప్పి ప్రసంగవశమున నిట్లనియె.

"బిడ్డా! నిను గన్నదిమొదలు కన్నవానివిధమున నాహృదయము మితిమీఱి మఱుఁగుచున్నది. నీ చక్కఁదనము, నీజవ్వనముఁ గాఱడవులపాలు కావలసినపాప మెట్లు సంభవించె? నీ వెవ్వతెవో, నీ తలిదండ్రు లెందున్నవారలో, నీ యునికిపట్టెయ్యదియో, యిందుంటయే నీ కిష్టమో నా కెఱుంగఁజేయవలయు. ఈ పదాఱు దినముల నుండియు నే నెన్నిమాఱులు నీతో ముచ్చటింపఁదలఁచిన నదను సంభవింపదయ్యె. నీగుట్టు దాఁపక నా కెఱిఁగింతువేని నా యోపిన సాయము నీ కొనర్చి నా జన్మము గృతార్థత నొందించుకొందును. బిడ్డా! నన్నన్యునిగాఁ దలంపకుమీ" యని హెచ్చరించుటయు నించుక యూరకుండి యాబాల కన్నుదమ్ములనుండి నీరు దెచ్చుకొని వెక్కి వెక్కి యేడువసాగెను. శాస్త్రివర్యుఁడును డగ్గఱి కన్నీరు దుడిచి భయములేదని చెప్పి మఱలమఱల వృత్తాంత మెఱుంగఁజేయుమన నామె యూఱడిల్లి యిట్లని వివరింపఁ దొడఁగెను. "అయ్యా నీవు నాయం దతినిర్హేతుకకృపఁ గల్గి యడుగుచుండునపుడు నీతో మర్మము విడిచి చెప్పకతప్పదు. కాఁబట్టి నాచరిత్రమును నుడువుచున్నాను వినుము. మాకాఁపురము జరాసంధపరిపాలిత మగు మగధరాజ్యములోని పాటలీపురము; నాతండ్రి వసుమిత్రుఁ డనుక్షత్రియుఁడు. రాజునొద్ద నుద్యోగము లెవ్వియుఁ జేయక మాతండ్రి పితార్జిత మగుభూమి కొంత యుండుటచే దానిపై వచ్చు సొమ్ముఁ దెచ్చుకొని గౌరవముగాఁ గాలక్షేపము సేయుచుండెడువాఁడు. చిన్నతనమందు మాయయ్య క్షాత్రమున కనుకూలము లగు సాముఁవిలువిద్దెల నేరువక విరాగు లగుసన్యాసుల వెంటనంటి తిరిగి, దేశాంతరముల సంచరించి, కాశి మొదలగు సకలదివ్యక్షేత్రములు సేవించి నలువదియేండ్ల వయసు వచ్చునప్పటికి, మరల నిలుసేరెను. సంసారముపై విరక్తితోనున్న యా

తని మాచుట్టము లందఱును బలవంతముఁ జేసి యతఁడు వలదువలదను చుండ వివాహముఁ జేసికొనున ట్లొడంబఱిచిరఁట. గుణములపేటికయు, లావణ్యసీమయు, నగు మాతల్లి నతఁడు వివాహమాడి యామెయందు సంతానముఁ గనక చిరకాలము వగచుచుండెను. మాయమ్మయుఁ బెక్కండ్రు మునులను సేవించి యెన్నియో నోములు నోఁచి పెండ్లియైన యిరువదియేండ్లకు నన్నుఁ గనియెను. కటకటా! అవ్వల నేమి చెప్పుదు? ముద్దుముచ్చట లొకకొన్నియైనఁ దీఱకమున్న సంతానము గనిన వెనుక పట్టుమని పదినాళ్ళు సుఖింపకమున్న, ననుగన్న యేడవనాఁడ మాయమ్మ పరలోకమునకుఁ జనియెను. అదిమొదలు మాయప్ప మాయమ్మపోయిన వెలితి నాకుఁ బొటిలకుండఁ బెంచుచుండ మాకు దైవవశమున దరిద్రస్థితివాటిల్లెను. కూటికిఁ బేదమైనను గులమునఁ గడు ఘనుఁడగుటచేత మాయయ్య యొరులయాచించియు, నుద్యోగములఁ జేసియుఁ బొట్టపోసికొనుట కిచ్చలేక భూముల నమ్మి కాలముఁ గడపుచుండ మా మేనమామ గిరివ్రజపురనివాసి (ప్రాయశః నీవెఱిఁగియే యుందువు) కీర్తివర్మ మమ్మిరువురఁ దోడ్కొనిపోయి తనయింట నుంచుకొనియె. ఆబీదతనమునందే యాద్రవ్యహీనతచేఁ గాసిఁ జెందుచునే, లేక లేక కలిగితి ననియుఁ దల్లిలేని పిల్లననియు నన్ను మాయయ్య చేసిన గారాబ మెంతయో వాకొనలేను. గిరివ్రజమున నున్నకాలమున నాచక్కఁదనముం బట్టియు నాసుగుణసంపదం బట్టియుఁ బౌరులలో ననేకులు నందు ముఖ్యముగాఁ బుష్పకేతుఁడు మొదలగు మంత్రులు, విజయసేనాదు లగు దండనాథులుఁ ద్రిలోకమల్లుఁడు లోనగు రాజబంధువులుఁ దమతమకొడుకులకు నన్నిమ్మని పలుమాఱు మాతండ్రినడుగుచురా నతఁడు మాత్రము తొందరయేమని కడపుచువచ్చెను. ఇట్లుండ నే నాలుగువత్సరముల వయసుఁ గలదాననై యుండ మామేనమామ కుమారున కుజ్జయినిలోఁ బరిణయమహోత్సవము తటస్థమయ్యెను. మా

మేనమామ రమ్మని మాయయ్య నెంతబలవంతముఁ జేసిన నతఁడు బయలుదేఱక నన్నుమాత్రము పెండ్లివారితో నంపెను. మేనమామ కొడుకులు కూఁతులు నాయీడుజోడువారు నుండుటచే నా పయనము నాకపరిమితానందముఁ గలుగఁ జేసెను. మే మందఱమును వడివడి నడచుచు నరదములపై నెక్కి వనాంతముల విడియుచు సరోవరముల జలక్రీడలు సేయుచు గడువినోదముగాఁ బయనము సేయుచు దిన మొక్క నిముసము లాగునఁ బుచ్చుచుంటిమి. ఇట్లుండ నొక్కనాఁటిరాత్రి మహారణ్యమధ్యమునఁ బయనము సేయుచుండ గాలియు వానయుఁ బ్రచండగతిని మమ్ము వేధింపఁజొచ్చెను. గుభల్లుభల్లు మని మహావృక్షములు మహావాయువుచే నేలఁబడుచుండుట సేవకు లిరువురు చెట్లక్రిందఁబడిచచ్చిరి. అందఱమును వానకుఁదడిసి గజగజ వడఁకుచుంటిమి. మనుష్యులుకూడ కొట్టుకొని పోవునంతటి ఝంఝూమారుతము వీచెను. అంతలో నాటవికులగు దొంగలు వచ్చి మాపయిఁ బడిరి. అపుడు స్త్రీజనముఁ బిల్లలు సల్పిన యాక్రిందనధ్వనియు "దోఁచుకొనుండు దోఁచుకొనుం" డని చోరులు వేయు కేకలును బ్రహ్మాండకర్పరమును భేదించి యుండునని నే నెంచితిని. చోరులతోఁ గొంతతడవు పోరాడి మామేనమామ హతుఁడయ్యెను. భయంకరాకారుఁ డగునొక కిరాతుఁడు నను బండిలోనుండి లాఁగి తన మూఁపురముపై నెక్కించుకొని పోవఁజూచుచుండ నసహాయనై కెవ్వున నఱచి మూర్ఛనడితి. అనంతరము మాఁగంపెడు బలగముమాటయేమైనదో యిప్పటికిని నేనెఱుఁగను. మఱునాఁడు నేనీరాక్షసులమధ్యనుండుటఁ దక్క నెట్లిందువచ్చితినో నీకుఁ జెప్పఁజాలను. నన్నా చోరుఁ డెత్తుకొని చనుచుండ జ్వాలాజిహ్వుఁడు మార్గమున వాని కెదురై వానిం దెగటార్చి నన్నిందుఁ దెచ్చెనని కొన్నినాళ్ళకు రాక్షసాంగన యొకర్తు నాతోఁ జాటుగఁ జెప్పినది. నాఁటఁగోలె జ్వాలాజిహ్వుఁడు నాకడ రాక్షసకృత్యముల నెవ్వియుఁ జేయక గడుగోముగఁ గోరినదెల్ల నిచ్చి

పెంచుచున్నాఁడు. ఈరక్కసులనడుమ నీపడియెట్లు నే నెంతజాగరూకతతో మెలంగితినో శ్రీమన్నారాయణుఁ డెఱుంగును. ఇంతటి గారాబము నాకీదానవులు సేయుచున్నను నాకీయునికికన్న మరణమే మేలని తోఁచెడును. ఈజ్వాలాజిహ్వునకు శిశుపాల జరాసంధు లాప్తమిత్రులు. ఒకతూరి చేదిరాజు మృగయాక్రీడ కిందువచ్చి నన్ను గాంచి తనకుఁ బెండ్లిసేయుమని రాక్షసు నడుగ నాతఁడు వల్లెయనియె. నాకు శిశుపాలుఁడు భర్తయగునేని నాచేతి వజ్రపుటుంగరము నాకు సుఖమీయఁజాలును. ఈచెఱనుండి తప్పింప నీ వేదయున నాకు సాయమొనర్తువేని నిన్ను వేయిజన్మాంతరములుదాఁక మఱవను. నీకెంతయుఁ బున్నె ముండుజుమీ” యని తన దీనచరిత్రమును విన్నవింప శ్రావణుఁడు విని యక్కజమొంది ‘నీకు నేను సహాయ మొనర్తును; ఇపుడు రక్కసు లొడలెఱుఁగక పడియున్నారు. ఇదె తగునదను. నీవు సిద్ధమైయుండుము. ఈరాత్రి పోవుద” మని పలుక నామెయు వల్లెయని తత్ప్రయత్నముఁ జేయ సాగెను.

శ్రావణుఁ డీనడుమఁ దనవిడిసిన చోటికింబోయి, మున్ను గళానందుఁ డొసఁగిన యుత్తరమును బదిలపఱచి యాతనికత్తిఁ దన ప్రాణసంరక్షణార్థము కేల గ్రహించి, తన గుడ్డలమూట భుజముపై నిడుకొని రక్కసిమూఁకలలో నేరికైన మెలఁకువ వచ్చెనదో యని యొకసారి చూడవచ్చెను. ఒక్కొకరక్కసియొద్దకుఁ బోయి యొక్కొక నిముసముండి నిదానించి చూచి గాఢనిద్రాసక్తుఁడై యున్నాఁడని నమ్మకముఁ దోఁచిన పిదప నొండొకనియొద్దకుఁ జనుచుఁ గొంతకాలముఁ బుచ్చెను. అంతలో దానవుఁ డొకఁడు మేలుకాంచి తల విరియఁబోసికొని యా పెను చీఁకటి నఱచుచుండ నాతఁడు కార్యవిఘ్నంబుఁ జేయనోపునకాయని వగచి వృద్ధుఁ డుపాయము వెదకి యొకముంతెడు కల్లుదెచ్చి యాతనిచేతి కందిచ్చె. ఎవ్వరిచ్చిరో యారయకయే యాదైత్యుఁడు సుర గుటగుట

గ్రోలి నాలుగు నిముసములలోఁ గ్రిమ్మఱమత్తుచే నేలకొఱగెను. ఒఱగుటయు శ్రావణుఁ డమితానందమునొంది యిందుమతియున్న నెలవున కరుగుదెంచి, " యమ్మా నీవు సిద్ధముగ నుంటివా ?" యని పలుకరించెను. "ఎన్నఁడీ యగ్నిహోత్రమధ్యమునుండిదాఁటుట యని నేనున్నదానను, సిద్ధముగనుండక నాకేమి యాలస్యమున్న" దని యబ్బాల తనకు రాక్షసుఁ డొసఁగిన సకలాభరణంబుల నటవదలి కట్టుబట్టతో నీవలకుఁ జనుదెంచెను. వృద్ధుఁ డాయరణ్యముననున్న కాలమునఁ బట్టపగట నటనుండి దాఁటిపోవుటకు ననువగు మార్గములఁ గనుపెట్టుచు వచ్చుటచేత నాదినమున నాయాసములేకయే యొకదారిత్రొక్కి యిందుమతిని వెంటఁబెట్టుకొని నడువసాగెను. కొంతద వ్వంధకారమున నడచి రాక్షస సామీప్యమును బాయుటతోడన తనచేతనున్న పాలకఱ్ఱ కాగడా వెలిఁగించి శ్రావణుండు బాలికకుఁ జీఁకటివలన వెఱపు జనింపకుండఁజేయుచు నెడనెడ మార్గమధ్యంబున నడ్డముగనుండు ములుగంపలఁ దొలఁగించుచు బెబ్బులియెలుంగుల కాలతాంగి యులుకకుండ మీఁదఁ జెయివైచి తట్టుచుఁ గడు జాగరూకతతోఁ గొనిపోవుచుండెను. క్రూరరాక్షస మధ్యమున వసించుటకన్న నెట్టి యాపదపాలైనను సరియేయని కాఁబోలు నాబాల, తన్ను వెంటఁబెట్టుకొనిపోవు నాతఁడు విదేశీయుఁడని శంకింపక వృద్ధుఁడని వెఱవక తన యసహాయత్వమునకుఁ గుందక యెట్లయిన నావలఁబడినఁ జాలునని పోవుచుండెను. అంతటిసుకుమారి యంతటి చక్కఁదనఁపుటిక్క తనవెంట నొంటరిగఁ దన్నునమ్మి యాచీఁకటినరుదెంచుటఁ జూచి శ్రావణుఁడు తనలో "అయ్యో నేఁజూడఁ గడు పెద్దవాఁడను. రాక్షసులు మాజాడ యెఱిఁగి తఱిమివచ్చి పట్టుకొన్న నేను వారి నెదిర్చి యీయిందువదనను రక్షింపఁ జాలను. అసాధ్యమగు కార్యమునకుఁ దలపెట్టితి. వారిబారినుండి బయటఁబడిన యీమెను నాయొద్దనుండి యేకఱకుటెఱుక యైనఁ దీసి

కొనిపోవఁడుగదా. నాకతమున నీమె కెట్టియాపదలు మూఁడనున్నవో. ఏమయిన నాప్రాణములు కంఠమున నుండ నీమె కాపదరానీయను. పరోపకార వ్యాపారమునఁ బ్రాణముపోయినను మంచిదే” అని చింతించుచు నామెకు నెడనెడఁ జిత్రములగు కథలుసెప్పి మనోవ్యథఁ దొలఁగించుచుఁ బయనము సేయుచుండెను.

పదునేడవ ప్రకరణము.

శ్రీకృష్ణునకు మేనత్తకొడుకు, బద్ధవైరుఁడునై యజాతశత్రుఁడగు యుధిష్ఠిరునకుఁ బిన్నతల్లిపట్టియై చేదిరాజ్యమున కభిషిక్తుఁడై పారాశర్యుఁడు మొదలగు జడదారులచే రాక్షసాంశసంభూతుఁడని యెన్నఁబడుచు శిశుపాలుఁడు చేదిపురమున నత్యంతవిభూతితోఁ బ్రజాపాలనముఁ జేయుచుండెను. దనుజుని యంశమునఁ బుట్టుటచే శిశుపాలునకుఁ గోపాలునిపైఁ బాలపాపఁడగుట మొదలు ననిష్టముండుట యొకవింతకాదు. కాని యా చిఱుతయలుక రవులుటకు భేదకారణము దైవవశమున సంభవించెను. త్రిలోకలావణ్యరాశియైన రుక్మిణిని, రుక్మి తన కీయ సమకట్ట వావివరుసలయినఁ దలపోయక యిరుగురకుఁ గల చుట్టఱికమైనఁ బాటింపక యాదేవిని వాసుదేవుఁ డపహరించి రాక్షసవివాహ మొనర్చుకొన్న నాఁటఁగోలె చేదినాథునకు యాదవునిపై యలుక మున్మడియై నానాఁటికిఁ బెరుఁగుటయే కాని తఱుఁగదయ్యెను. నందనందనునకు జరాసంధునకు జరుగు పోరాటములలోఁ జేదిరాజు మగధరాజుపక్షమై యాతనికి బాసటవచ్చి వాసుదేవునిపైఁ గత్తిఁగట్టి జయాపజయంబులవలనఁ గలుగు సుఖదుఃఖములఁ దానుగూడ మాగధునితోఁ బాటనుభవింపఁ జొచ్చెను. వెనుకటి దటుండ మనకథజరిగెడుకాలమందు నందనందన జరాసంధులకు మహాయుద్ధమగునని శిశుపాలుఁడె

తేఁగి యాజరాసంధునకుఁ దోడుపడ నిశ్చయించి యాతనికిఁ దన మనోనిశ్చయవార్త నంపి ద్వారకానగరమునుండి వచ్చు బాటసారులఁ బట్టి పరీక్షించి చెఱనిడుచుఁ గృష్ణున కేరాజుతోడను వేగునడువనీకుండఁ జేయవలయునని నిశ్చయించెను. సింగంబునకుఁ బులియుఁ జిచ్చునకు గాలియు సాయమై వచ్చునట్లు మగధరాజునకుఁ జేదిరాజు తోడుపడుటచే బలరామకృష్ణులు దక్క తక్కిన యాదవులు జయమునందు సందియమునొందుదు సాధ్యమగు నంత త్వరితముగ జరాసంధ శిశుపాలుర కంతము నాపాదింపఁ దలపెట్టిరి.

ఒక్కనాఁడుదయమునఁ జైద్యుఁడు వ్యవహారవేదులగు కొండఱు మంత్రులు తన్ను గొలువ విహారార్థము తన యంతిపురము నంటియున్న యొక పూవుఁదోఁటకేగుదెంచి బండిగురివెందతీవ లల్లిబిల్లిగ నల్లుకొని చల్లఁదనము వెదజల్లు నొకమంటపము క్రింద స్ఫటికపు శిలలతో నిర్మింపఁబడిన యొకవేదికపైఁ గూరుచుండి నానావిధ కుసుమ సౌరభములఁ గ్రోలి యాపుష్పాదుల నొడలంటఁ బూసికొని మెల్ల మెల్ల మద్యపాన మొనర్చి మేనగందమలందుకొని చను కాముకుని వడువునఁ దమపైఁ బ్రసరించు మందమారుతమువలన జనించు నానందపారవశ్యమున నించుక కనుదామరల మోడ్చి బహు దేశములనుండి తెప్పించి నాటించిన పూలతీవల సౌరభంబుల గుణవిశేషణంబులఁ జేతులు జోడించి నిలుచు మంత్రులకుఁ దెలుపుచు జరాసంధకృష్ణుల ప్రసంగము నడుమరాఁ దద్దండయాత్రం గూర్చి కొంత ముచ్చటింపసాగెను.

అట్లు వినోదించుచున్న సమయంబున శిరమునఁ బెంజడలు వ్రేలాడ మొగమున భస్మోర్ధ్వపుండ్రంబు మెఱయఁ బాదుకలఁ దొడఁగి నల్లసిమేని చాయగల యొక రాయబారివచ్చి వారి కట్టెదుర నిల్చెను. వెంటనే శిశుపాలుఁడు లేచి చేతులుమోడ్చి నమస్కరించి " దేవా దేవర యెవ్వరో యెందుండి రాకయో యెఱుఁగఁజేయ దాసుఁడు వేఁడుచు

న్నాఁడు. ఆనతీయవలయు" నని నాతఁడు పక్కున నగి "వీరినందఱి నావల కనుపు మనంతరమున నాయుదంతమంతయు నెఱిఁగించెద" ననిన మంత్రులు తేని యిచ్చనెఱిఁగి తమకుఁ దాము యచ్చోటువాసి యరిగిరి. అనంతరమున నాజడదారి తేనిపాదములకు మ్రొక్కి "దేవా నన్ను మఱచితిరే, మందప్రజ్ఞుఁడను నాకు మీరంజలిఁజేయ న్యాయమే" యని పలికెను. రాజును వెనుకటి వృత్తాంతమును జ్ఞప్తికిఁ దెచ్చుకొని "యోరా నీవఁటరా. అహాహా నీవు నన్నే యింతభ్రమపెట్టితివి. ప్రపంచమునందలి ప్రకృతి జనుల కన్నుల నెట్లు దుమ్ముకొట్టెదవో వేఱుగఁ జెప్పనేల? నీవంటి జగద్వంచకుండుండ నాకు లోపమెద్ది వాటి లనేర్చ? నీవేమి క్రొత్తవింతల మూటఁ గట్టుకొని వచ్చితివో సత్వర మెఱుఁగఁజేయు" మని యుత్తరమిచ్చి పాదములపైఁ నున్నవాని నెత్తి నిలువఁబెట్టెను. ఆజడదారియుఁ గరములుమోడ్చి "యేలినవారికి నా యొనర్చిన పని మాటలతో విన్నవించుటకన్నఁ బ్రత్యక్షనిదర్శనముఁ జూపుట నుచితము. "ఓరీకుఱ్ఱలారా! అందఱు నిటురండురా" యని తన శిష్యుల నుద్దేశించి పలుకుటయు నంతదనుక నెందేని చాటునఁ బొంచియున్న యిరువురు సేవకు లొకదివ్యసుందర విగ్రహుఁ డగు మను చు వానితోఁగూడఁ బ్రవేశించి వల్లభునకు జోహారొనర్చిరి. శిశుపాలుఁ డును వారి నిరువుర నొకసారి కనువిచ్చిచూచి వెంటనే తనచూపు మారని తూపుచాడ్పునున్న యాలేబ్రాయఁపు మానిసిపైఁ బఱపి యెంతచూ చినఁ దనివోని యాతని మేని సౌరున కచ్చెరువడుచుఁ గొండొకసేపటికి జడదారి కిట్లనియె. "మందప్రజ్ఞ! వీని నెందుండి తెచ్చితి వితనిఁబట్టితే ర నీమన సెట్లొప్పినది? వీనివృత్తాంతమించుక నాకుఁ దెలపవలయు" నన జడదారి నగుచు "స్వామీ మేము భవదాజ్ఞచే సకలారణ్యములు సంచరింపుచుండ నొకచెట్టుక్రింద నీ భూలోకమన్మథుండు పడఁగొట్టి మూర్ఛవడియుండి మాకంటఁబడియె. అతని కించుకసేరుఁ దాగ్రవనిచ్చి

యొడలు తిన్నఁగ నెఱుఁగకయున్న యొకబండిపై వీనినెక్కించుకొని మేము దేవరవారి యొద్దకుఁ గొని తెచ్చుచుండ నంతలో నాతనికిఁ దెలివివచ్చుటయుఁ మీరెవ్వరని మమ్మడిగి పరుషముగ మాపై నలిగి తనయిచ్చవచ్చిన తెఱఁగునఁ బోవఁ దలంప నిరాయుధుఁ డగుట నీతనిఁ బట్టుకొని పాఱనీక యిటులఁ దెచ్చితిమి. ఎన్నివిధముల నాతనిచరిత్ర మడిగినను మిన్నకుండెనే కాని యుత్తరమీయఁడయ్యె. మీఁద దేవర చిత్తము" అని యూరకుండెను. శిశుపాలుఁడును దచ్చరిత్రము నాకర్ణించి యాతనినుద్దేశించి కొన్ని ప్రశ్నముల నడుగ వారిరువురు నిటు మాటలాడిరి.

శిశు—అయ్యా! చక్కనివాండ్రలో మిగుల చక్కనివాఁడవగు నీవెందుండి వచ్చుచు మాసేవకులచేతఁ జిక్కితివో యెఱుఁగఁజేయవలయును. కులగోత్రములు జన్మప్రదేశము నెఱుఁగఁజేయకున్న మేము నిన్నెచ్చటికిని బోనిచ్చువారముగాము. కావున నిజమును వాక్రుచ్చుము.

పురు—అయ్యా! నేను గిరివ్రజవాసుఁడను.

శిశు—ప్రియమిత్రుఁ డగుజరాసంధుని పాలనమున నుంటచే మాకాప్తుఁడవేమో యని తోఁచెడును. కాని నీవెందుండివచ్చెదవు?

పురు—ద్వారకానగరమునుండి యొకచోటికిఁ బోవుచు దైవవశమున మీభటులకుఁ జిక్కితిని.

శిశు—వాసుదేవహతకుని ప్రోలినుండి వచ్చుటచే శత్రుఁడవో యని తోఁచుచున్నది. అయినను నీకొదువ చరిత్రమునుగూడఁ జెప్పుము.

పురు—రాజా నేనేమిపనిమీఁద నెందుకరుగుచున్నవాఁడనో యది గోప్యమగుట మీకుఁ జెప్పనొల్లను. నాపేరు కళానందుఁడందురు. ఉత్తమక్షత్రియుఁడను.

శిశు—అవురా! నీవు కులమునఁజూడ సాటిరాచబిడ్డవు; ఆకారమునఁజూడ ద్వాపరయుగమునఁ బుట్టిన మదనుఁడవు. జరాసంధునిపాలన

మున నుండుటచే మాకు నన్ని విధములఁ బోరానిచుట్టమవు. కానిదురాత్ముఁడైన శ్రీకృష్ణునియొద్దనుండి యేగుచున్నట్లు నుడువుచున్నావుగాన మాకు విడువరాని పగతుండవేమోయని లోఁచెదను. అట్లని విడువరాదు. ఇట్లని విడువకుండ రాదు. సోయగముఁగన్న హృదయము గరఁగుచున్నది. పూర్వోత్తరములనారసిన జంకుజనించుచున్నది. కావున నీ నిజచరిత్రము తెలియునంతకు విడిచియు విడువనట్లొకవిధమున నిన్ను జెఱలోనుంచువాఁడను. నిన్ను నిజవృత్తాంతమెఱుఁగఁజేయుమని యెంత నొక్కి యడిగిన నెఱిఁగింపవైతివి. కావున నందలి లోపంబు నాయందుఁ గానరాదు. మందప్రజ్ఞుఁడా! నీవును నీయనుచరులును జని వీనిఁ గారాగృహమున నుంపుఁడు. తక్కిన నీచులవిధమునఁగాక వీనిని సగౌరవముగఁ నాదరింపవలయునని చెప్పుము.

అని శిశుపాలుఁ డనుమానముగఁ గళానందుని బందెలోనుంప నానతిచ్చి మందిరంబునకుం జనియె.

పదునెనిమిదవ ప్రకరణము.

ప్రశాంతము లగు జడదారులయాశ్రమములు నిరంతరము నానందనిలయములయి యుండునుగదా. జ్వాలాజిహ్వుని యరణ్యమునకుఁ గొన్ని యామడల దూరమున నానందాశ్రమ మనుపేర నొక ఋషివాటిక తనరుచుండు. అందు సాటిలేని తపము పెంపున బ్రహ్మర్షులనెల్లఁ గేలిసేయఁజాలినవాఁడు కరభుఁ డనుతపసిరాయఁడొకరుఁడు వసియించుచుండు. పాలువిడువని పసితనమునాఁడె నారాయణనామస్మరణము జనకునివలన నాతఁడు నేర్చి యైదేఁడుల ప్రాయము వచ్చుతోడనె ప్రాఁజదువుల మొదలుపెట్టి మునికులమెల్ల నచ్చెరువడునట్లు పండ్రెండువత్సరముల యీడు రాకమున్న నాలుగువేదములు భువనైకప్రజ్ఞాధురంధరుఁడై యవ్వల

వేదాంతశాస్త్రము నభ్యసించి యసమానుఁడై యాత్మతత్వంబును బ్రకృతి తత్వంబు నెఱిఁగి చిత్తము పరమపురుషాయత్తమొనర్చియుండఁ దల్లి దండ్రులు జ్ఞానమార్గమున యోగబలంబునంజేసి మేనువాసిరి. నాఁటఁగోలె దారాస్వీకారము మనోవికార కారణ మనియు సంతానప్రాప్తి పున్నామనరకమునుండి తొలఁగించునదియైనను బహునరకంబు లనుభవింపఁ జేయుననియుఁ బరమేశ్వరుని సాక్షాత్కరింపఁ జేసికొనుటకన్న పురుషార్థము వేఱొండు లేదనియుఁ దెలిసికొని యామరణమును బ్రహ్మచర్యము నెరపనిశ్చయించి తమకుఁదారు వలచివచ్చు ఋషికన్యకల ననేకుల నిరాకరించి, ఋష్యశృంగుఁడయిన నెట్టకేలకు మదినిబ్బరము విడనాడి మగువ కేలుబట్టెఁగాని యీతఁడుమాత్రము మనోవికారమొందఁడని యానాటిమును లంద ఱనుచుండ నింద్రియ నిరోధముఁ గావించెను. కోపమువచ్చుటయు శాపమిచ్చుటయు ననునవి తచ్ఛిష్యులే కాలమునఁగాని యెఱుఁగరని లోకు లెన్నుచుండ గురుఁడగు నతనియందట్టివి లేవని యుగ్గడింపనేల? వేయేల? ఆతఁడు వ్రతభంగముగాని విశ్వామిత్రుఁడు; నీచమగు రాజాశ్రయమున బ్రదుకని వశిష్ఠుఁడు; కలహప్రియుఁడుగాని నారదుఁడు. పూవిల్తుని పదును చిగురాకుబాకు లెవ్వనిమీఁద పనిచేయ వన్నఁ గరభునిఁ జేర్కొనవలయును; శుకయోగికి ద్వాపరమున నెవ్వఁడు దీటువచ్చునన్నఁ గరభునిఁ జేర్కొనవలయును; పిపీలికాదిబ్రహ్మపర్యంతమును సమానదయాళుఁ డెవ్వఁడన్నఁ గరభునిఁ జేర్కొనవలయును. అతని బ్రహ్మతేజము గనుంగొనియు నతనిమహిమలువినియు వేటతమకముఁగల రాచవారు రక్కసులు వానియాశ్రమముపొంత కరుగవెఱతురు.

ఈకరభమునికి మనకథ జరిగిన కాలమునాఁటికి వయసు మరలి వృద్ధుఁడగుట లౌకికవ్యాపారములఁ బొత్తుగవదలి పారలౌకికనియముల యందు డెందంబునిల్పి యాశ్రమము వెడలి యెటకుం బోవక యుండెను.

ఈతనియాశ్రమమున కొకనాఁడు వేవెలుఁగు వేయి వెలుఁగుల తోడ బ్రహ్మాండకటాహము నంతయుఁ గాల్చుచున్న సమయమున ము సలివాఁడొకఁడు జవ్వనినోర్తు వెంటఁబెట్టుకొని కరముడస్సి "పుడిసెడునీరు ను, బట్టెడన్నము దొరకకపోవునే" యని యెంతయు దూరమునుండివచ్చె ను. వచ్చి వారిరువురు మునీంద్రునికృపారసములీల నెంతయుఁ జల్లఁదన మును వెదజల్లు నీడలుగలచెట్లను గని తమపుణ్యము పండినవశువుననే య చటఁబరిపక్వములై చెట్లవ్రేలాడు పండ్లగెలలఁ గనుంగొని "రండు ద యసేయుఁ" డని తమకు స్వాగతముఁ బలుకు శుకబ్రహ్మచారులఁగని చి వురుగుత్తులమెక్కి కొవ్విన భాగ్యవంతులచందమున నెరులలక్ష్యములేక ప్రేలు పికదంపతులఁగని సత్పురుషులకుజంతు పాపములతీరునఁ దమ్ముఁ గాంచి వెనుకవెనుకకుంబోవు ఘాతుకమృగములఁ జూచి పరస్పరవిరోధ ములవిడిచి యందు విహరించు జంతుసంతానములఁ జూచి యాసయు, ధై ర్యము నక్కజము సంతసము నొక్కసారి తమ్మలమ, వటువులుసేయు సా మగానంబు వీనులవిందు సేయఁ, గట్టెదురఁగనఁబడు పర్ణశాలయొద్ద కరు గుచుండిరి. అల్లంతదవ్వుల వీరలం గనుఁగొని మునిశిష్యులుకొందఱు ప రుగుపరుగునవచ్చి బహువిధోపచారముల నెరపిరి. ఒకఁడు రెండుదర్భా సనములుపఱచి యందువారినిఁ గూర్చుండఁబనిచె. ఇరుగురు రెండు విం జామరలఁగైకొని వారికిఁజెమటలార్చిరి. ఒక్కఁడు తటాకమునకరిగి చల్ల నినీరుదెచ్చి వారికిఁ ద్రావనిచ్చె. ఇఁకనొకఁడు చెట్లంబండిన తీయనిపండు లందెచ్చి వారికి సమర్పింప వానినారగించి సేదదేఱి శ్రీవణుఁడును మన యిందుమతియు "అమ్మా యింకబ్రదికితిమి సాహసించినందులకు, దు రాత్ములకంటఁబడకుండఁ జేరవలసినచోటఁ జేరితిమి. దైవమే యింకతో డగుఁగాక" యని తమ్ముఁ దామూఱడించుకొనిరి. అనంతరము చపలత్వ మున వడుగులడుగు ప్రశ్నములకు నుత్తరములిచ్చి శ్రీవణుఁడు తనవృ త్తాంతమునంతయుఁ జెప్పక యిందుమతిచరిత్రము నువారలకుఁ దెలిపెను.

సాయంకాలమునందు తనతపోనియమముఁచాలించి పర్ణశాలవిడిచి రెండవబ్రహ్మఁబోలు కరభమహాముని బైటికివచ్చి నిరుపమానశైత్యముతోడ మాంద్యముతోడ సౌరభముతోడ వీచు మలయమారుతమును గ్రోలవచ్చి యొకచోట వ్యాఘ్రచర్మము వేయఁబడియుండ నందుఁగూరుచుండ నరుగుచుండెను. తెల్లనిజడలు నంతకన్నఁదెల్లనిగడ్డము నరసిన కనుబొమలమీఁది వెండ్రుకలు కరభమహామునివయస్సు చెప్పక చెప్పుచున్నవి. మాంసహీనములై ముడతలువడి వ్రేలాడు చర్మముతోఁ జేత దండముఁబట్టి పాదుకలుదొడిగి కాషాయాంబరములఁగట్టి యెంత మూర్ఖునయిన మ్రొక్కమనసు గలవానిగాఁ జేయున ట్లుట్టిపడుచున్న యా తనిబ్రహ్మతేజమున కచ్చెరువడి మెడనున్న యొంటిజన్నిదఁపుఁబోఁగు బ్రహ్మచర్యముం దెలుపుచుండ నామహామునిదార్ఢ్యమునకు మిగుల నాశ్చర్యపడుచు శ్రావణుఁడు నిందుమతియు నమస్కరించిరి. మూర్తీఁగైకొన్నముసలితనమో యన్నట్టులున్న యాముని మూర్తిఁగైకొన్న జవ్వనమువలె నున్న యామెనుగని "దీర్ఘసుమంగలీభవ" యని దీవించి "యాప్సితార్థసిద్ధిర"స్తని శ్రావణుని దీవించి "మీచరిత్రములువిన మాకుఁ జెప్పుటకు మీకిచ్చయేని వినఁగోరెద" నని పలికెను. ఇందుమతి తనకత మునిపతికి విన్నవింపుమని సన్నచేయ శ్రావణుఁడాతనితోఁ బూసగ్రుచ్చినట్లంతయు నెఱుఁగఁజెప్పెను. కరభుండు కథనాలకించి యాయబలపై జాలి వొడముటయుఁ గరుణారసము చిప్పిలుపలుకుల నిట్లనియె. బిడ్డా! నీయిచ్చవచ్చినన్ని దినములు నాయాశ్రమముననుండుము. నీకేభయంబును వాటిలకుండఁగాఁ జేసెదను. నీవు మీగిరివ్రజపురమునకుం బోవలయునేని మాశిష్యులఁదోడిచ్చి యనిపెదను. ఇది నీపుట్టినయిల్లుగా మెలఁగుమని యానతిచ్చి హస్తమలంకరించుచుండిన రుద్రాక్షమాలికనుద్రిప్పుచు వ్యాఘ్రచర్మముమీఁదఁ గూరుచుండి ధ్యానముజేసికొనఁదొడఁగెను. శ్రావణుఁడది మొదలుకొని యిందుమతివిషయమై వగవఁబనిలేదనియుఁ బెద్ద

కాలఁపువాఁడగు తానెట్టియిన బాధలేదనియుఁ దనయొద్దనున్న కళానం
దుని కత్తియును నందనందనుఁడిచ్చినజాబు నామెకిచ్చి దాఁచుమనిచెప్పి
యా యాశ్రమప్రాంతముల సంచరింపుచు మునికుమారులవలన వన
మునందలి చిత్రములనరయుచు నెంతయువేడుకతోడ శ్రావణుఁడు ప్రొ
ద్దులుపుచ్చుచుండెను. ఆఁడువాండ్రులేని యాయాశ్రమమున నిందుమ
తి మతిచెడినట్లుండి కొన్నినాళ్ళపిదప వటువులు తోఁబుట్టువులుగవర్తింప
స్వాధ్యాయముఁజెప్పు శుకపికశారికాది శకుంతసందోహముతోఁ గాలము
గడపుచు మునికన్యవలె నుండెను.

ఇట్లు మద్యపానమత్తులైన రక్కసులందఱు నొడళ్ళెఱుఁగక యారే
యిపొరలిపొరలి మఱునాఁడు పగలు నట్లువర్తించి సంజకత్రె కించుకమత్తు
విడిచి లేవనేరక పీనుంగులచాడ్పునఁ జెట్లను మేనులుచేర్చి కూరుచుండ
నింతలో రాకాసియొకర్తువచ్చి "యిందుమతిలే దిందుమతిలే" దని యఱచె
ను. వెంటనే మఱియొకర్తుకవచ్చి "శ్రావణుఁడులే"డని యఱచెను. ర
క్కసులందఱును బడలినమేనులతోడ నిటునటుఁబరుగులెత్తి కలవరపాటు
నొందసాగిరి. అంతట జ్వాలాజిహ్వుఁ డావార్తవిని యదరిపడి "హా యి
న్నినాళ్ళుపెంచి తుదకాబాలను గోలుపోయితిని. ఆమెనుబెంచి శిశుపా
లునకుఁ బెండ్లిచేసి నాకు నతనికిఁగలనెయ్యమును బెద్దజేసికొనఁదలంచితి
ని. దానికట్టిదుర్బుద్ధి యావృద్ధహతకుఁడు కఱపి వెడలఁదీసియుండును. మీ
రందఱును సకలారణ్యములు నెమకి వారినిగన్గొని బాలికనేమనక యిరు
గురుఁదోడితెండ" ని యానతిచ్చెను. మఱునాఁడు వారినందఱ నానాది
క్కులకంపెను. ఆపొలసుఁదిండ్లు వెదకనియడవులు చూడనిగుహలు నె
క్కనికొండలుఁ బరీక్షింపనిపల్లెలు నాచుట్టుప్రక్కలనెందునులేవు. అం
దుండదనియో కరభుని మహిమను వెఱచియో వారాతనియాశ్రమము
నుజేరరైరి. ఇట్లు వెదకివెదకి వారిఁగానక విసిగి రక్కసులూరకుండిరి.

అంతఁ గొన్నినాళ్ళకు దైవయోగమున నొక్కనాఁడు శ్రావణుఁడు కరఘశ్రమప్రాంతములఁ గ్రుమ్మరుచు నొంటరిగ నాశ్రమమునకు మఱల నరుగుచుండ నెవ్వఁడో వెనుకనేవచ్చి హా! వృద్ధహతకా! యెందుఁబోయెదవురా యని వెన్నుపై నొక్కచఱపు చఱచెను. శ్రావణుఁడు వెంటనే యబ్బా యని నెత్తురులుగ్రక్కి నేలఁగూలఁబడెను. అతని మూఁపుపై నెక్కించుకొని యారాక్షసుఁడు జ్వాలాజిహ్వుని సమ్ముఖమునకరిగి యప్పటికి మూర్ఛనుండి తెలివినొందిన శ్రావణుని వానియెదుట నిలిపెను. జ్వాలాజిహ్వుఁడును "నిందుమతి నెందుంచితి" వని పలుమాఱులు వానిని నయమున భయమున నెన్నివిధముల నడిగెను గాని యాతఁ డించుకయేనియుం జెప్పక మొద్దువలె నిలిచెను. రాక్షసరాజు బిట్టలుక నొంది వీనింజంపి తినుఁడని తన సేవకుల కాతని నొప్పగించెను. శ్రావణుఁడును తనజన్మము పరోపకారమున సార్థకతం జెందెనని సంతసించి, యిందుమతి నిరపాయమగు నెలవున నుంటకు మది ముదమంది యేవిచారము లేక మనమున వాసుదేవపాదరాజీవములను నిలిపి యింటియొద్దనున్న దారపుత్రాదులనుగూర్చి యించుక వగచి వగచినను గార్యము లేదని యెఱింగి, గిరివ్రజమునుండి వేరొకపనిమీఁద వెడలి రాక్షసులచే మరణమొందవలసినట్లు నియమించినవిధి చెయిదముల కచ్చెరువడుచు మరణమునకు సిద్ధమైయుండెను. అంతట రాక్షసులు వచ్చి వానింబట్టి కత్తి చేఁగోసి క్రొన్నెత్తురుఁద్రావి మాంసమంతగా లేని వాని వృద్ధకళేబరము సంతతమకముతోఁ గాక కసిదీరున ట్లొకవిధముగ భక్షించిరి.

పందొమ్మిదవ ప్రకరణము.

ఇందుమతీపాణిగ్రహణము సేయ శిశుపాలుఁడు చాలకాలము నుండి తీవ్రమగు నుత్కంఠతో నెద్దియుందోఁచక వలనుపడినంత శీఘ్రముగ నది చేకుఱఁజేయుమని జ్వాలాజిహ్వుని వేఁడుకొనుచు వచ్చెను. అనంతర మీచిత్రకథ జరిగినదనివిని చేదిరాజు చేతఁజిక్కినపండు బారనైచుకొన్నవాని తెఱంగున నెంతయు వందురుచుండెను.

అట శ్రీవణుఁ డానందాశ్రమమున కెప్పటియట్లు రాకునికి సంజ తఱిమొదల లిందుమతి యెంతయుఁ గలవరపడి మునికుమారకులఁజీఱి వృద్ధునినిమిత్తము వెదకుమని వేఁడుకొనుటయు వారు నలుదెసలకుం బోయి తామెఱిఁగినచోటునెమకి యాతనిని గానక యొక్కరొక్కరుగ నానందాశ్రమమునఁజేరి యిందుమతికావార్తను దెలియఁజేసిరి. వటువులలో నొక్కఁడు మాత్రము మఱికొంతసేపు రోసి వచ్చి బడలికను విసుగు దోఁచు నెమ్మొగముతో నుస్సురనుచుఁ దనతోడివారు నిందుమతియును వినునట్లిట్లనియెను. “అమ్మా మున్నా శ్రీవణుఁడు గ్రిమ్మరు నెలవులెల్ల వెదకి యెందునుం గాననైతిని. ఎవ్వఁడో యొకరక్కసుఁడు వృద్ధునొకని తనయఱకటం బెట్టుకొని పరువెత్తుచుండఁ దాను గాంచితినని యొకయెఱుకు నాకుం జెప్పెను. ఇఁక శ్రీవణుఁడు మనకు దక్కుటకిది. అతఁడు పాలసుఁదిండ్లచేఁ దీఱినాఁడని నానమ్మకము” అని పలుక నిందుమతి మూర్ఛిల్లి వటువులు పలుకుల, శైత్యోపచారముల నించుక సేదదేఱి “హా మాలదైవమా! చుట్టముల, నెచ్చెలులఁ, గన్నవారి నెడబాపుటచాలక యించుకసాయము సేయువచ్చిన యానిఱుపేద ముసలివానినిగూడ మ్రింగించితివే! పాడుమానిసి నగు నాకెవ్వరుపకార మొనర్చిన వారికిఁ గీడుమూడకున్నె? నానిమిత్త మాతఁ డేలచావవలయును. ఆదేవుఁడు నన్ను గొనిపోరాదా” యని విలపింపఁ దొడఁగెను.

కరభమహాముని తపోనియమమును జాలించి సమాధినుండి లేచి యామె రవస్థఁ దెలిసికొని తత్త్వోపదేశమున నామెవగపును గొంతతగ్గించెను. అట్లామె మనమున శాంతివడయునిమిత్తము వగచుచు నానందాశ్రమమున వసించుచుండ నొక్కనాఁ డనేకులు ఋషులు ఋషికుమారులు నచ్చో టికరుదెంచి కరభునిచేఁ బూజితులై యొకదినమందుండి మఱునాఁడు రాత్రి యిట్లనిరి. "కరభమునీంద్రా! జాబాలి యిచ్చటి కనతిదూర మున నొక యాశ్రమముఁ గల్పించుకొనియుంట మీ రెఱుంగుదురుగద! అతఁడిప్పు డొక్కజన్నమును మున్నెవరును జేయనిదానిని జేయఁదల పెట్టినాఁడు. వేదవేదాంగవిదులగు తామచ్చోటికి విజయముచేసి మునుల సదస్సునలంకరించి జన్నము సఫలముఁ గావించి తన్ను ధన్యుఁజేతురని జాబాలి మిమ్ము వేఁడుకొమ్మని మమ్ముఁబంచె. తాము శిష్యసమేతముగ నెల్లి పయనమైరావలయును" అని కరభుఁడు ముదిమిచే నాశ్రమము వాసి యొండొక్కచోటికి నరుగ ననువుగాని సమయమయినను దన యందలి గౌరవమున జాబాలియంతటి జడదారి యన్నివిధములఁ బ్రా ర్థింప నరుగకుంట యనుచితమని పోవనిశ్చయించి యిందుమతికి సాయ ముగఁ గొందఱు శిష్యులనునిచి కడుభద్రమని చెప్పి నాలుగుదినములలో వత్తునని యిందుమతి నొడంబఱచి చనియెను.

ఆమహాత్ముఁ డరిగిన రెండవనాఁడు సాయంకాల మానందాశ్ర మ సమీపమునందు మహాకోలాహల మొకటి విననయ్యెను. పఱచెడు పులులు, పఱువంజాలక నేలఁగూలు నెలుఁగులు, పాఱునెడఁ దమకొమ్ము లు గుల్మములకుం దగులుకొని ప్రాణభీతి నఱచు లేళ్ళు, హతములగుచు జాలివొడమున ట్లాక్రందించు నితరమృగములును నాశ్రమవాసులకుఁ గాననయ్యెను. అదియేమని మునికుమారులు బోయలనడుగ క్షత్రియ కులభూషణుండగు నొకనృపుని వేఁటయని చెప్పిరి. అంతఁ గొంతతడవునకు రాజసేవకులందఱు నాశ్రమమునఁ బ్రవేశింపఁదొడఁగిరి. మృగయా

వినోదమున నరుదెంచి భూపాలుఁడు కరభాశ్రమమున విడియుటయు మునివలన నాతిథ్యమునుబడయుటయుఁ బ్రియకముగఁ గలదగాన వచ్చిన పరిజనమును మంత్రులను సేనాధిపులను వటువులు గౌరవించి వారికి బసలొసంగిరి. అనంతర మామహారాజు మందగమనముతో నరుదెంచు మదపుటేనుఁగునెక్కి యాశ్రమముఁజొచ్చి యొకచో దిగి ముని వటువులుపఱచిన వ్యాఘ్రచర్మముపైఁ బరివారముఁగొలువఁ గూరుచుండి మునుల పల్లెల వైచిత్ర్యములను జూడఁగోరి యించుకసేపిటునటు విలాసార్థము తిరుగఁజొచ్చెను. అట్లు తిరుగుచుండ నాతనికి చిలుకపిల్లలకుఁ బండ్లు దినిపించుచు వానికి మాటలు నేర్పుచున్న యొకజవ్వని త్రిలోకరాజ్యలక్ష్మియట్లు కనంబడి నేత్రములకు విందునొనర్చెను. ఆచిన్నారి కన్నులఁ బడ నామె యెవ్వతెయని అతఁడు వటువుల నడుగ వారామె కతనంతయు నెఱుఁగమనియు జ్వాలాజిహ్వుని యాశ్రమమునుండి యొకవృద్ధుఁడు దెచ్చెననియు నామెపే రిందుమతి యనియుఁ జెప్పిరి. ఆపలుకులు చెవులఁజొరఁబడి నంతనె నృపుని నెమ్మొగము వికసించె. పట్టరాని యానందము హృదయము నాక్రమించె. వెంటనే పరిజనమును బొమ్మని సెలవొసంగి తానద్దేవి సన్నిధికరిగి మాటలాడ నిశ్చయించి, ముని లేని సమయమని శంకింపక తనసాహసమునఁగలుగు నష్టమునరయక యామె వంకఁ జనియెను. చని యామెవెనుకప్రక్కను నిలిచి చిలుకపలుకులకు రసపుష్టిసేయు నామెపలుకుల నాలకించి పూర్ణచంద్రమండలమట్లు ధాళధళ్యముఁజూపు మొగము తనకు వెనుకనున్నకతనఁ గానఁబడకున్నను దానికాంతి కచ్చెరువడి మెడమీఁద ముద్దయైన చీకఁటిచాయనున్న ధమ్మిల్లమును జూచి, యంగసౌష్ఠవమును గాంచి యామహీవల్లభుఁడు పువ్విలుతునఱ్ఱాకల కాఁగలేక కట్టెదుటనిలిచెను. నిలుచుటయు నామెలనాఁగ భయసంభ్రమములతో నడుగులు తడఁబడఁ బ్రక్కనున్న పర్ణశాలలోనికిఁ జని తలుపుచాటుచేసికొనెను. రాజునకప్పుడు తానున్న దా

శ్రీమమనియుఁ బుణ్యదాయకమగుచోట నట్టి కాముకవ్యాపారముఁ దలఁపనైనఁ దగదనియుఁ దెలియక కామగ్రహపీడచేఁ బరవశుఁడై యామెతో లోనికిఁజని యిట్లనియె. బాలా! దైవము మనఘటనమునం దనుకూలభావము వహించినాఁడనుటకుఁ దప్పిపోయిన నిన్ను మరల సమకూర్చుటయే నిదర్శనము. రాక్షసరక్షణమును బాసి యరిగిననాఁడె నీయెడ నాస విడుచుకొన్నవాఁడను. అట్టియెడ నిన్ను నాకొనఁగూర్చుట పరమోపకారముగాదే. ఇంతదనుక నిన్నుగూర్చి వినివిని యూటలూరితిఁగాని యెన్నఁడు నింతకనులపండువుగఁ గాంచనైతిని. ఎన్నిదినములు నీనిమిత్తము కామాయత్తుఁడనై వేఁడినిట్టూర్పులు విడిచితిని! ఎన్నివసంత రాత్రులు కూర్కు లేక నీధ్యానము సేయుచు జాగరముగావించితిని. ఎందఱు జోతిశ్శాస్త్రవిదుల నాకునునీకును సమాగమము కాఁగలదోయని యడిగితిని. అంతయు నేటికి సఫలమయ్యెను. ఏరాజు నీపైఁగల మోహసముద్రమునఁ బడి యాసయను నుడుపముచే నిన్నినాళ్ళు మేన నుసుఱులు నిల్పెనో, యేరాజు జ్వాలాజిహ్వుని యొద్దనుండి తనకు నిన్నొసంగునట్లు వాగ్దానమును గ్రహించెనో యేరాజు నీదాసుఁడై రాజ్యలక్ష్మిని నీకర్పింపఁదలఁచియున్నవాఁడో యాశిశుపాలుఁడనుజుమీ నేను. పుట్టుకచే రాచకన్నెయై కారణాంతరమునఁ దాపసకన్యకయైన శకుంతలను దుష్యంతుఁడు వోలె నిన్ను నేఁ గేలువట్టుట ధర్మేతరముగాదు. నాఁడు కణ్వుఁడింటలేఁడు, నేఁడు కరభుఁడింటలేఁడు. ఇది సర్వవిధముల శోభాకరము. నాతోడఁ జేదిపురమునకు రా రమ్మని సరసోక్తులచేఁ దనయటమటం దెలుపుటయు నాపడంతుక సిగ్గునఁ గొంతదడ వెద్దియుఁ బలుకనేరక మందమందమృదూక్తుల నిట్లనియె. రాజేంద్రా! నామనమున నిక్కముదాఁపక తెలిపెదను. నీపై ననురాగ మించుకంతయును నాకులేదు, నీవురాజువు, ధర్మాధర్మములన్నియు నెఱింగియు మునినిలయమున నున్న నన్నిట్లాడుట యుచితేతరము. పాడిదొఱఁగి వర్తించినవాఁడు భూలోకదేవేంద్రుఁడైనను

నీచుఁడుగా నెన్నఁబడునుగదా. అన రోసమును నీసును డెందముల్ల
సందడింప శిశుపాలుఁడు స్త్రీలోలుండై "అన్నన్నా నీజవ్వనము కాఱు
డవుల పాలుగావలసినదే! చెట్టునంబుట్టి యెవ్వరికిని ననుభవయోగ్యము
గాక తనంతనపడి యడవినిరాలి నశించుపండువోలె నీసోయగము నీతో
నశించునదియే! నీనారచీరలకు మాచీనిచీనాంబరములు తగవో! నీద
ర్భశయ్యలకు మాహంసతూలికాతల్పములు దీటుఁరావో! నీయాకలముల
కు మాకలమాన్నములు బిండివంటలు సరిగావో! యేల నీకింత మోటు
తనము. ఎంతచేలవో. నీమేలు నీవెఱుంగవు. సౌందర్యమునందలి ప్రాశ
స్త్యము నెన్నఁడెఱుఁగని యీకటికి జడదారి వేదాధ్యయన మొనర్చ
పశుప్రాయుఁడగు నొక మోటబ్రహ్మచారికిచ్చి నిను బెండ్లిసేయుదు. అపు
డు నీవెంతయేని వగతువు కాఁబట్టి నావెంట రా రమ్ము" అనిన నామె
యలుకచే మొగముజేవురింప, దురాత్మా! నాశాంతము నీకు మఱింత
పొగరుఁ బుఱికొల్పెడినో! ఛీ నాయెదుట నిలువకుము. అని యింకనేద్ది
యో యనుచుండ రా జారాజబింబాస్యహస్తముం బట్టుకొనియెను. ఇం
దుమతియుఁ గరభమునీందాశ్రి! యని యఱచి గుభాలున మూర్ఛిల్లెను.
రాజించుకయు జంకక యదియ యదనని యిరుగురు సేవకులంబిలిచి
పసిండిచిఱుగంటలు మెఱయు జయధ్వజముగలఁ తనయరడము నాయ
త్తముచేసి యందానెలంతుక నునుపుమని వారికానతిచ్చెను. మునికుమా
రు లాయిందుమతి యాక్రందనధ్వనివిని పరుగుపరుగునవచ్చి రాజునకెదు
రాడ వెఱచియుఁ బరమవైదికులు ఛాందసులునగుట సమయోచితముగఁ
బల్కనేరక రాజును గొంతతడవు వేఁడి బ్రతిమాలి యతఁడియ్యకొనమి
ని నోరు నెత్తి మోఁదుకొని జన్నిదములఁ ద్రెంచుకొని యంగలార్పసాగి
రి. ఆయరదమునఁ దాను గూరుచుండి శిశుపాలుఁడు స్కంధావార మెల్ల
బయలుదేఱవలయునని యానతిచ్చి తేరు సాగఁదోలుకొనిపోయెను. సే
నలన్నియు నారాత్రియె యానందాశ్రమముఁ బాసి యరిగెను.

అంతట నాలుగవనాఁటి సాయంకాలమునకు జాబాలికృతమగు జన్నమునుండి కరభుఁడు వచ్చునప్పటికి, గురువు తన్నేమనునో యనుభయమున నొకఁడు దేశాంతరము బాఱిపోయెను. రెండవవాఁడు ప్రాణము లఱచేత నిడుకొని కరభునిఁ గాంచినతోడనే బారుమని యేడ్చి యచ్చట జరగిన వృత్తాంత మంతయు సవిస్తరముగ నివేదించెను. మునిపుంగవుఁడు శిష్యుల బేలతనమునకు వగచి రాజు మోటుఁదనమున కలిగి బాలిక యబలభావమున కించుక దుఃఖించి తనలో నిట్లని వితర్కించె. కటకటా ప్రశాంతములుఁ బవిత్రములు నగు తాపసాశ్రమములె యబలలగుస్త్రీలకు క్షేమమునొసఁగకున్న నిఁక నరక్షితలకు సేమమెందుండును. రాజధర్మముం దలపెట్టునపుడు మునులు వారింప సమర్థులు. హా నాశరణముజొచ్చి నాపాలఁబడిన బాలను రక్షింపనేరని నాజన్మమేల? ఇది కలిద్వాపరసంధి యగుట రాగల కలిపురుషుని ఛాయం బర్వుటచే న్యాయపరిపాలకులగు రాజులకుఁగూడ దుర్బుద్ధులు పుట్టుచున్నయవి. ఇపుడు నే నలిగితినా చేదిపురము భస్మ మగునట్లు శిశుపాలుఁడు నిర్మూల మగునట్లు జగతిని రాచపురుగు లేకుండునట్లు శపియింప నోపుదును. అయినను దపోవ్యయము సేయనేల? అదిగాక శిశుపాలుడు వాసుదేవునిచేత నిహతుఁడగునట్లు ము న్నశరీరవాణి పలికె. అచిరకాలమున నదియుం జేకూఱు. “హా! శిశుపాల! నీయాయువు క్షయమగుటచేతనే మునులకుఁగూడ నెగ్గులు దలపెట్టుచున్నావుసుమీ” అని యొక శిష్యునిఁ బిలిచి వత్సా! నీవు చేదిపురికిం బోయి శిశుపాలుం గాంచి నాపలుకులుగా నిటు చెప్పుము. “రాజా నీసాహసము నీకు మేలు నాపాదింపదు. ఇందుమతిని నీవు బలిమిచే నింటికిఁ గొనిపోవుట మృత్యుదేవతను నీగృహమునకుఁ బిలుచుటజుమీ. ఆమె నను నమ్మి మాయాశ్రమముఁ జేరినది. శ్రియఃకాముఁడవేని నలిపిన దుష్కృతమునకుఁ బశ్చాత్తప్తుఁడ వైతివేని కొంతకాలము బ్రదుకఁదలఁచితివేని నా

సమ్మతియు నామెసమ్మతియును లేక నీవాబాలఁ బెండ్లియాడఁ దలపెట్టకుము. మునులతోడి పగలు త్రాఁచులతోడి సరసములు సుమీ! కరభునిమాట లక్ష్యముగాఁ దలఁపకుము." అని మఱునాఁ డుదయమున నావటుగుంబుత్తెంచి ప్రత్యుత్తరమున కెదురుచూచుచుండెను.

ఇరువదియవ ప్రకరణము.

అట గిరివ్రజమున నాగవల్లి యిల్లువెడలి యేరికింగనరాక యెందేనిఁ జనుటయు సిద్ధవత్తమఁగుదివ్యకుసుమంబు జాడ లెన్నినాళ్ళకుఁ దెలియకుండుటయు జరాసంధుఁడు దన్ను రణార్ణవున కిమ్మని జనకుని బలుమాఱు పీడించుటయుఁ దలంచి యాగుణోత్తమ యహోరాత్రములు హారము నిద్రయు నుజ్జగించి చిక్కి శల్యమై చూచువారు తనకార్శ్యమునకు భయ మొందునట్లుండెను. రాగలతిక యెన్నివిధముల నూరార్చిన నామె యించుకయు ధైర్య మూనదయ్యె. గుణోత్తమ కళానందునిపై వలపు నిలిపిన దని చెలులవలన విని చంద్రపాలుఁడు కళానందునినిమిత్త మరయుచు రాజువలనఁ దనకుఁ గీడు మూఁడునని యాతఁడు దేశాంతరముల కేగినకత నాలకించి రాడనియుఁ గూతురుఁ దక్కదనియు నిశ్చయించి భారము దైవముపై మోపి దినములు గడపుచుండెను.

ఒక్కనాఁడురాత్రి యింట నందఱు గాఢముగ నిద్రించుచుండ సౌందర్యతిలక నిద్దురలోనుండి యులికిపడి లేచి "యక్కటా! రాగలతికా! ఏమి సేయుదునే? ఇంకను మేలుకొనవైతివే" యని యెలుఁగెత్తి పిలిచి వెక్కి వెక్కి యేడువ నారంభించెను. రాగలతికయు నదరిపడిలేచి రోదనమునకుఁ గారణము తెలియమి వీఁపుపైఁ జేయివైచి చఱచి భయపడవలదని సందిటఁ జేర్చి యనేకభంగుల దుఃఖకారణముం దెలుపుమని వేఁడుకొనియెను. ఆశాంతవచనములఁ గొంత యూఱడిల్లి యబా

లిక మెల్లమెల్ల నిట్లనియె. ‘ఓసీ! రాగలతికా! యేమని చెప్పుదును. నేఁడు పాడుకలఁ గంటిని. హృదయేశ్వరుఁడు కళానందుఁడు భువనమనోహర మగు తన తొంటియాకృతిఁ గోలుపోయి కడుమాసిన ప్రాఁతచీరలు గట్టి నా యెదుట నిల్చి యుచితాసనమునఁ గూరుచుండుమని నే నెంత వేఁడుకొనిన నామనవి నిరాకరించి దూరమునందుండి నన్నుద్దేశించి యిట్లనియె. ‘ఓసౌందర్యతిలకా! నీవు నాహృదయేశ్వరివి కావు. నీకు నాకు ఋణముదీరినది. నేను పరరాజులచేతఁ జిక్కినాఁడను. ఎల్లియొ నేఁడో వారు నన్ను యమపురమున కతిథిగా నంపఁ జూచుచున్నారు. కడసారి నిన్నుఁ జూడఁగోరి యిటువచ్చితిని. నాపేరు మఱవకుము’ అని చెప్పి వడివడి నడచి మరల వెనుకకువచ్చి నాపై నీకుఁ గల యభిమానము పుత్త్రహీన యగుముదుసలితల్లిపై నిల్ప యామెం గనిపెట్టుచుండు మని నాప్రార్థన యనుచుఁ జెచ్చెర నచ్చోటువాసెను. అయ్యో! నన్ను బిగ్గఁగౌఁగిలించు కొనవే? పిడుగులఁబోలు నానుడువు లిప్పటికిని నాచెవిం బడుచున్నట్లె యున్నవి. ఆభయంకరాకార మిప్పుడు నాకన్నులఁ గట్టినట్టెయున్నది. ఓసీ! నామాట నమ్మవుగాని మునుపటి కళానందుఁడే గాఁడే? ఆమధ్యమలోకమన్మథుని కంతమాయరూప మెట్లువచ్చినదే! హా! నాపుణ్య మెంతలో మఱియొకలాగైనదే. వెండియు నంగలార్చుటయు రాగలతిక కన్నీరు తన కొంగునఁదుడిచి వీడినకొప్పు సవరించి కట్టి బాలా నీవొకబేలవు కల నిజమగునా? స్వప్నవృత్తాంతము లొకప్పుడు మున్ను మనమెన్నఁడు గని విని యెఱుంగనివిగా నుండును. ఒకప్పుడు పూర్వదృష్టములుగ నుండును. ఎట్లయిన నవి నిజము లని వగచుట యెండమావులలో నీట నెట్లుతానమాడుదు నని వగచుటగాదె! యన నాగుణోత్తమ యిట్లనియె. ఓసీ! కలలు సాధారణముగ నబద్ధము లని నే నెఱుంగుదును. కాని యిం దేదియో నిక్కమున్నదని నాకు భయము కలుగుచున్నది. కొన్ని పాడుకలలు వచ్చినట్లెవచ్చి యున్నంతపనిఁ జేసితీ

రును. ఇఁక నా కానారాయణుఁడేదిక్కు. నాకాయదు టింకను బోలే దు. నేను నిదురించువఱకు నాపైఁ జేయివైచికొని యుండుమని యా మె యించుక కన్నుమూసి తిరుగ భయంపడిలేచి మరలం బండుకొని మెట్టకేలకు నిద్రించెను. రాగలతికయు నామెకుఁ గురుకుపట్టిన వెనుక మేనువాల్చెను.

మఱునాఁడు రేయిఁగలతనిద్దురచేతఁ గల్గిన బడలికచే సౌందర్య తిలక మేలుగాంచునప్పటి కించుక పొద్దుపోయె. ఆమె లేచి నిలువు టద్దములోఁ దన నెమ్మోముఁ జూచుకొని రేణి సవరించుకొనుచుండ రాగలతిక పరుగుపరుగువచ్చి "అమ్మా! ధారుణీదేవిగారు మిమ్ముఁ జూడఁగోరుచున్నారు. అప్పగారితోఁగూడ నామె యిల్లె వచ్చుచున్న ది." అని పలికెను. గుణోత్తమ తిరిగి చూచునప్పటికిఁ దండ్రియు ధారుణిని వెంటఁబెట్టుకొని మెల్లగ మేడమెట్లెక్కుచుండెను. వాగు నె మ్మదిగ లోని కరుగుదెంచుటయు, సౌందర్యతిలక యెదురుగాఁ జని యాదేవి పాదారవిందములకు వందనమొనర్చెను. ఆమెయు గద్గదకంఠ మై యనురూపరమణునిఁ జేపట్టుమని దీవించె. అనంతరము రాగలతి క వేసిన పీఠములపైఁ జంద్రపాలుఁడును ధారుణియుఁ గూరుచుండిరి. తరువాత వారిట్లు మాటలాడిరి.

ధారు—బిడ్డా! సౌందర్యతిలకా! నిన్ను నేను జూచి చాలదిన ము లగుచునది. ఈనడుమ నెన్నఁడు నాకన్నులు నిన్నుఁ గాంచి యానం దించుటకు సమయ మబ్బదయ్యె. ఎల్లప్పుడును నిన్ను జూచుకొను భా గ్య మింక నబ్బలేదు.

చంద్ర—అమ్మా మీారు వచ్చినపని యేమి? ఆయుష్మంతుఁ డగు మనకళానందుని జాడ యేమయినఁ దెలిసినదా?

ధారు—నాయనా? అంతటిభాగ్య మీమందభాగ్యురాలి కెట్లు కలుగును. మీకేమయినఁ దెలియవచ్చినదా యని యడుగుటకే యిటవచ్చితి. తెలిసెనేని నాకించుక మెఱుఁగం జెప్పుము తండ్రీ?

చంద్రి—అమ్మా నీకుమారునిసంగతి నేనుగూడ మెఱుఁగను.

ధారు—హాకుమార! ఎన్నఁడిల్లువిడచిమెఱుంగవు. ఎండ కన్నెఱుఁగని సుకుమారుఁడవు. ఆఁకలి దప్పికల కెట్టు లోర్చుచుంటివో? వేళకుఁ బట్టెఁడోగిరము నించుక ద్రావ నీరు నిచ్చి నిన్నాదరించువారెవ్వరు? ఏయడవులలో నేచెట్టుపుట్టలక్రిందఁ బడి మూర్ఛిల్లితివో! ఏదయ్యాపు నీకుఁ గీడుసలుపునోకదా! ఎన్నఁడుఁ జఱునవ్వేతోఁచు నీమొగ మింకఁ గాంచు పున్నె మీఘటమునకుఁ గల్గునే. ఏదుఃఖ మెఱుఁగకపోయిన మీ యయ్యయె పుణ్యాత్ముఁడు.

చంద్రి—అమ్మ, అట్లు వాపోవకుము. అతఁడు కుశలియై రాఁగలఁడు. అయినం బోవునపు డెందుకొఱకుఁ బయనమై యతఁడు సనియెనో నాకెఱింగింపుము. అక్కడకు సేవకుని బంపి వెదకించెదను.

ధారు—అయ్యా! ఈదేశయాత్రకుమున్న గొన్నిదినములు మావత్స పరాయత్తచిత్తుఁడుతో నే నన్నమాటలు వినిపించుకొనక తా నన్నమాటఁ గ్రమ్మరననుచు నొకవిధముగా నుండెను. దానింబట్టి యది నవయౌవనారంభ మగుటచే నెవ్వతియో మోహాఁపు విత్తనముల హృదయక్షేత్రమునఁ జల్లినదని యెంచుకొని యడుగుట యుచితము కాదని యూరకయుంటిని. అంతఁ గొన్నిదినములు గడవ నొక్కనాఁడు మాయయ్యనిదురించుటయు నేను మేల్కనియుండుటయు సంభవించినది. అప్పుడు మావత్స నిద్దురలో "సౌందర్యతిలకా గొఱవంక యిదిగో" యని పలుకరించెను. అదియాధారముగ నాతనిచిత్త మీముద్దుగుమ్మయందుఁ దగిలె నని సంతసించుచు ధన్యురాల ననుకొని నీతోడ వియ్యమొందుకాల మెన్నఁడువచ్చుననియు, నుభయకుల పవిత్రతయు రూపున గొన

మున ననమానయు నగు నీమె నాకుఁ గోడలయి యిలుమెట్టు టెప్పడని యుఁ జిలుకయుఁ గొఱవంకయు లాఁగునఁ గొడుకుం గోడలును ముద్దు ముచ్చటలతోఁ గాఁపురముసేయఁ గన్నులారఁ జూచుకొని వారిలుదిద్ది నాకుపచారముఁ జేయ సుఖించుకాల మెన్నఁడుగల్గునని యు నెమరుచూ చుచుండ నంతలో నొకవైపరీత్యము సంభవించెను.

చంద్ర—అంతట వచ్చిన వైపరీత్యమేమి?

ధారు—అయ్యో! యంతలో సౌందర్యతిలకను జరాసంధుఁడు రణార్ణవున కిప్పింపఁదలఁచినాఁడని యొకవార్త నగరిలోఁ బొక్కెను. అదివిని మావాఁడు నిర్విణ్ణహృదయుఁడయి దానికిఁ బ్రతిక్రియసేయఁ గాఁబోలు, నుజ్జయినికింబోయివత్తు నమ్మా! యొకనెలకువత్తునని నన్నొ డఁబఱచి చని యిప్పటి కాఱునెలలయ్యె. ఏపాపపు గడియలో నిల్లు వెడలెనోకాని మరల నిలుసేరలేదు. నాకుఁ గాలము సమీపించినది. ఆయొక్కకుమారుని చేతిమీఁదుగాఁ గడతేరు యోగము నాకులేదు. అయ్యో! మీరెన్నఁడైన వానివార్త విన్న నాకు సత్వరముగ నెఱిఁగిం తురుగాక.

చంద్ర—అమ్మ! అందులకు సందియమేమి? అతనిరాక నాకుఁ గూడ నపేక్షణీయమేకద! కళానందుఁడు చంద్రపాలున కన్యుఁడు గాఁడు.

ధారు—ఆ వాత్సల్యము వానిపై నుంచుము. వాఁడు తండ్రి లేని పిల్లవాఁడు. ఇఁక నే నింటి కరిగెద. నాకు సెలవిమ్మా.

అని లేచుటయు సౌందర్యతిలక యామెకు వెండియు నమస్క రించి యాశీర్వచనములఁబడసి యామెను వీడ్కొనియెను. చంద్రపాలుఁ డాపెను సాగనంపి యామెకుం దనకుఁ జరిగిన సంభాషణముంగూర్చి తనలోఁ దాను వితర్కించుకొనుచుండెను. అవ్వల గుణోత్తమ రాగలతి కతం జూచి యోసీ! పాపము! ఆకథవిన మనకే యింతజాలిగనున్నది.

తల్లిప్రాణమెట్లున్నదోగదా! అహాహా! నెచ్చెలీ! నానిమిత్త మాసుకుమారుఁ డెంత కష్టము నొందుచున్నాఁడే! ఈమహాదేవికిం గోడలనై యాతని చెట్టఁబట్టునట్టి యదృష్టము నావంటిదానికిఁ గల్గుటరిది. కోటి నోములు నోఁచి యెక్కుడుఫలములు గోరఁ దగునా? యని వేఁడి కన్నీరు దొరఁగ వగవసాగెను. అనంతరము రాగలతిక సమయోచితములగువచనరచనల నూరార్చి భోజనమునకుఁ దోడ్కొనిపోయెను.

ఇరువదియొకటవ ప్రకరణము.

రణార్ణవుఁడు మొగలియానుజాబుఁ దనకుఁ జూపిన నాఁటఁగోలె జరాసంధుఁ డాగ్రంథకర్తపై రెఱుఁగఁగోరి యెన్నియేనిజతనములు సేయఁదొడఁగెను. మొట్టమొదట ననుమానము జయసేనుఁ డాకుట్రలోనివాఁడని యాతనినెమ్మది నుదయించెను గాని యారాకొమరుని మతిభ్రమణము నొందుట విన్నపిదప మగధరాజు నిరపరాధినిఁ జెరసాలనుంచితిఁ గాఁబోలు దైవమా యని యపుడపుడు చింతిలుచుండెడివాఁడు. అదియునుంగాక జయసేనుని యిల్లాలు భర్తదురవస్థకు బెంగఁగొని ప్రాణావశిష్టయై యున్నదని సేవకులవలన విని యాపరమపతివ్రత నంతమనఃక్షోభంబు పాలుచేసినందు కాయుసుఱు తనకుం దనవారికిఁ గలుగకున్నే యని యొకప్పుడు వగచుచుండును. ఇది యిటుండ రణార్ణవునకు సౌందర్యతిలకనిప్పించి పెండ్లిసేయింపఁ దలంచుటచే నది యెట్లునెఱవేఱునని రాజు నిరంతరము నుపాయము నన్వేషింపుచుఁ జంద్రపాలుని మనసు నొవ్వకుండ రణార్ణవునికోర్కె భంగముకాకుండ మెలఁకువతో వర్తింపవలయునని నిశ్చయించెను. కాని సౌందర్యతిలక చిత్తము కళానందాయత్తమైనట్లు కర్ణాకర్ణి నాలకించి యాకన్నియ నన్యుని కిప్పించుటచే నాతని మనసు చివుకుమనునని కొంత తలఁచుచుండెను. ఈతలఁపులన్నియు

ముప్పిరిగొని నెమ్మనము నుమ్మలికమ్మున ముంప నొక్కనాఁడు మగధరాజు తామరాకులోని నీరు చందమున డెందము కుదురుపాటెఱుఁగక సంచలింపఁ దనయంతిపురమునఁ గూరుచుండి మగధరాజ్యలక్ష్మి భావిదశం గూర్చి యోచింపుచుండ సర్వస్వతంత్రుఁడగుటచే రణార్ణవుఁడు తలుపులం దెఱచి లోనఁ బ్రవేశించి తేనియెదుటఁ జేదోయిమోడ్చి నిలువంబడియెను. జరాసంధుఁ డెప్పటివాత్సల్యముతో వానిఁగనుఁగొని “కుమారా యిటురమ్ము కేతకీదళమున లిఖించిన మహాపాతకుని జాడయేమైన దొరకినదా” యని పలుకరించెను. రణార్ణవుఁడును వానిప్రక్కనున్న యొకపీఠముపైఁగూరుచుండి దేవా యెన్నిభంగుల నాతపమంతయు ధారవోసి నేఁ గనుంగొనుచున్నను నాకావంతయు జాడ కానఁబడదయ్యె. ఐనను నేఁడు దాని కొక్క నిరపాయమైన యుపాయము నూహించినాఁడ. వినుండు. ఈగిరివ్రజపురమునఁ గొన్నిదినములనుండి యొకవింత జరుగుచున్నది. పార్వతీదేవి యవతారమని పౌరులచేత మితిమీఱినట్లు కొనియాడఁబడుచున్న యొకయోగిని మనపురముఁ జొచ్చినది. అదిమొదలు మన నగర మట్టుడికిన ట్లుడుకుచున్నది. ఎట్టిప్రశ్నలు నెవ్వరడిగిన వారికెల్లఁదగినయుత్తరముల నొసఁగునఁట. ఒక్కప్రశ్నమునకేని తప్పఁ జెప్పియెఱుఁగదఁట. గిరివ్రజపురవాసిఁగాక మగధదేశమున వసించువా రనేకులు కడుమార్గాయాసమున కోర్చి వచ్చి తమమనోరథముల నామె నడిగి సంతుష్టహృదయులై చనుచుందురు. రాత్రులయందెకాని పగటివేళ నామె యేప్రశ్నమునకుత్తరము నొసంగదు. రేలయిన నేరికంటఁ బడక యొకగదిలోఁ దలుపు మూసికొనియుండి యావలనుండి యడుగువారికుత్తరము లొసంగునఁట. అది యేమిమహిమమో నేనెఱుఁగను గాని యామె గుమ్మముముం దిసుక వేసిన రాలకుండునట్లు జనులు గుంపులు గూడి యుందురు. ఇమ్మొగలిరేకు నామెకుం జూపి దీనికర్త యెవ్వఁడని యడిగిచూచెద. దాన నంతయుం దేలునని రణార్ణవుఁడు పలుకుటయు

రాజు చిఱునగవు నగి నీయిచ్చవచ్చిన తెఱంగునఁ బ్రవర్తింపుము. ఎట్లులైన దానిఁ గనుకొనుటయె మాకావశ్యకము. అందు సఫలీకృత మనోరథుఁడ వయ్యెదవేని నీకోరినమేలు నీకొనర్చెద” నని వాగ్దానముఁ జేసెను. నిరాశయను గ్రీష్మమున నెండిన రణార్ణవుని హృదయలతిక యావాక్యామృత వర్షమున వెండియుఁ జివురెత్తి నాతఁ డత్యానందము తో నిట్లనియె. తండ్రీ నాకు నీవొనర్పఁ దగినదియు నేను నీవలన నపేక్షింపఁ దగినదియు నగు మేలు సౌందర్యతిలక కేలువట్టించుట గాక వేఱొకటిలేదు. అక్కన్య కళానందుని పాలగునని తోఁచెను. చంద్రపాలుఁ బిలువనంపి నీతోనెట్లయిన వియ్యమందున ట్లొడంబఱుపుము. ఈకార్యమున నాకాశాభంగము వాటిల్లెనేని నీపాదారవిందములపైఁ బడి ప్రాణములు విడుచువాఁడను. ఇంక వేఱుగతిలేదు. కావున నీవు యావచ్ఛక్తిని వినియోగించి నామనోరథసిద్ధిఁ జేయవలయు. ఇంక నేనరిగి నాప్రయత్నమున నుండువాఁడ” నని మృదులఁగొని యాతఁ డరుగుటయు జరాసంధుఁడు రెండు నిముసములు వాని పోయినవలను జూచి తన నెమ్మనమున నిట్లు వితర్కింపఁ జొచ్చెను. “పసితనమునుండియు వీనిం బెంచినకతమున నీతనిముద్దు లన్నియుఁ జెల్లింపకతీరదు. ఈతనినిమిత్తము చంద్రపాలునితో మొగముఁ జెఱుకొని ముచ్చటింపవలయును. అతని కూఁతురుసౌందర్యతిలక కళానందుని వలచినదనుట ప్రసిద్ధము. ఆమె రణార్ణవునిమెచ్చదు. చంద్రపాలుఁ డాయలదుబోఁడిని రణార్ణవునకు మనఃపూర్వకముగ నొసంగఁడు. తలపెట్టుక వెనుక బలిమినైనఁ గపటోపాయముననైన నామించుఁబోఁడిని హరించి పెండ్లిసేయక నేనుమానను. సాపరాధియో నిరపరాధియో యెఱుఁగక జయసేనునిఁ జెరసాలనుంచినందులకు విజయసేనునికుటుంబమును, సంపూర్ణముగ నెండ్రోరుల డెండములు నాటుకొనినమోహాలతఁ ద్రెంపి సిద్ధమైనపెండ్లి విఘ్నము గావించినందునఁ గళానందుని కుటుంబమును, గతిసోత్తులచే

నొప్పించి తనకూఁతు నపహరించిరణార్ణవునికి వివాహముఁ జేయుటకుఁ జంద్రపాలుని కుటుంబమును, నాకుఁ బగతుర కొలములోఁ జేరుట నిశ్చయము. మఱియు వారింబట్టి వారిచుట్టములు బక్కములు నెయ్యురాఫ్తులు బరిచయులును మాపైఁ గత్తికట్టుట తప్పనిపని. రాజధానిలో స్వసైన్యకలహము గలుగుటకవకాశమొసంగుట పగతురకుఁ దనలోతుఁ దెలియఁజేయుట యని రాజనీతివిశారదులు వాక్రుచ్చుట యెఱిఁగియు విధివశమునవో పుత్రవాత్సల్యమునవో యిందుఁబ్రవేశించితిని. కాని నందనందనున కీగుట్టు తెలియకుండ జాగ్రత్తపెట్టవలయును. జరాసంధుఁడు రాజసామాన్యముశలెనె యింత లాతులకు జంకునే యని మీసముపైఁ జేయివైచి తలయూఁచి లేచి యిట్టటుఁ జూచి సేవకు నొక్కనింబిలిచి చంద్రపాలుందోడుకొని రమ్మని యానతిచ్చె. రాజు మనస్సుకన్న నెక్కుడు వేగముగఁ జంద్రపాలుని గృహమున కాసేవకుఁడు పఱచి తనస్వామి యానతిం దెలుపుటయు నతఁడు మనమున నొక్కించుక శంకించి కొండొకసేపటికి ధైర్యముఁ దెచ్చుకొని దైవికములు మనమునందు హానికరముగాఁ దోఁచి పిదప కుశలపరిణామము లగునని నిశ్చయించి యాసేవకునితో బయలుదేఱినచ్చెను. నిష్కళంకమగు వంశముఁబట్టియు సుప్రసిద్ధమగు సచ్చరితఁబట్టియుఁ జంద్రపాలుఁడు రాజుచే నెల్లపుడు గౌరవింపఁబడుచుండెను వాఁడు. కావునఁ దనకు మున్ను నడచినమర్యాద నడచునోలేదో యని యాతఁడు భయపడెను. కాని మగధరాజాతనిం దొంటికన్న మిన్నగ గారవించి కూరుచుండఁబెట్టి యథోచితములగు కుశలప్రశ్నములఁ జేసి మగధరాజ్యవిషయము నెంతయుముచ్చటించి ప్రసంగవశమున నిట్లనియె. నెచ్చెలీ! చిన్ననాఁటఁగోలె నీవు రాజ్యతంత్రములయందు సైదోడులాగునఁ దోడుపడుచుండ నీతోడఁగల నెయ్యమునకుం దనివోకచుట్టఱికము సేయవలయు నని కోరుచున్నాఁడ. కలదుగదా భువనైక

సుందరి యగుసౌందర్యతిలక నీకూఁతురు. ఆముద్దుగుమ్మసోయగము బుద్ధినేర్పు వినుటచే నాకుఁ గోడలుగ నబ్బాలిక నొనర్చుకొనుట కెంతయు నభిలాష వొడమెను. ఆయింతిచిత్తము కళానందునిపైఁ దవులుకొనిన దని వినినాఁడ. చక్కఁదనమున, బాహుబలమున నాతని కీడువచ్చువాని వేఁబోకనిఁ గానవా! తనగరువంపుఁజేష్టలచే రెండుమూఁడుసారులు నాకలుక వొడమించుట నీవెఱుఁగుదువు. వీనికుఁ గడుంగూర్చువాఁడు సర్వవిధములఁ బూజనీయుఁడు నాకాత్మజుఁడు నగు రణార్ణవుఁడు నీ కల్లుఁడు గానోపు. వారిదాంపత్య మనుకూలమై సెలంగు. నీతోడి వియ్యము నాకుం బరమానందము. మిత్రమా! నావచనంబు లన్యంబులుగాఁ దలంపక నీ కూఁతును రణార్ణవున కొసంగుము." అని నొక్కిచెప్పుటయుఁ జంద్రపాలుఁడు భయమును మోమోటయును దన్ను మారువలుకనీకుంటచేఁ గార్యనిశ్చయము సేయనోపక నాలుగుదినములలో మీకుత్తరముఁ జెప్పెద. నాకుఁ బ్రిస్తుతము సెల వొసంగుఁ డని బ్రతిమాలి యాతని యనుజ్ఞవడసి యంతిపురిఁబాసి బయలుదేఱి యిలు సేరెను.

ఇరువదిరెండవ ప్రకరణము.

అట్లు రణార్ణవుఁడు మాగధునియొద్ద సెలవుఁగైకొని మున్ను జయసేనుని యింటనుండి తాను సంగ్రహించుకొనివచ్చిన మొగలియాకు జాబుఁ జేకొని గిరివ్రజపౌరులచే నత్యంతమును గొనియాడఁబడుచుఁ ద్రికాలవేదియని పేరుఁగన్న యోగిని యున్నమఠమునకుం జనియెను. చనునప్పటికి సాయంకాలమగుటయు యోగిని మఠముముందు జనులు వేనవేలు గుంపులుగూడి చొచ్చుట కెడమునొసంగమి రణార్ణవుఁ డది యసమయమనియు నట్టిరాజకార్యములు రహస్యముగఁ బ్రివర్తిలుట యుచి

తమనియుఁ దనమనమునఁ దలపోసి వెనుకకు మఱలిపోయెను. యోగినియు నిజతపోమహిమచేఁ దన్నుఁ బ్రశ్నములడుగవచ్చిన వారికందఱికి నుచితములగు నుత్తరముల నొసంగి సంతృప్తమనస్కులఁజేసి యంపి మరల స్నానమాడి భవానీచరణరాజీవములఁ గుంకుమతోఁ బూజ సేయుచుండెను. అప్పటికి రెండుజాములరాత్రి యగుటచే రాజవీధులు నిర్మానుష్యములయ్యెను. చండశాసనుండగు జరాసంధునియాన యెవ్వారు దాఁటఁగలరు? మూర్తులు గైకొన్నదో యన్నట్లు రాజభటులును వేగులవాండ్రును నగరమంతయుఁ దిరుగుచు నారాత్రి జరగుసంగతులను స్వామికి నివేదింపఁ జూచుచుండిరి. అంతలో రణార్ణవుఁడు జరాసంధుఁడు దనకు గారాముపెంపున నొసంగిన మణిభూషణములన్నింటిందాల్చి విలువయెన్నరాని వలువలుగట్టి కుడిచేతఁబదునుబాకు నెడమచేత మొగలితేకుంబూని తెల్లనిగుఱ్ఱముపై నెక్కి యోగినీమఠమున కరుగుచుండెను. రాజభటులచే నివారింపఁబడక వేగులవాండ్రచేఁ బరీక్షింపఁబడక మఠమున కతఁడరుగునప్పటికి యోగినియొద్దనుండు పరిచారిక యరుగుపై నిలువంబడి యాపురుషుని జూచి వినయముతో నొకపీఠమువైచి వానిపై గరసి యోగినితో మనవి యొనర్ప లోనికిఁజనియెను. పరిచారికతో నామెయించుక ముచ్చటించి మరలనామె నీవల కంప నదివచ్చి "దేవా! మీరువచ్చినపనియేమో యడుగు" మని యోగిని నా కానతిచ్చినది. చాల ప్రొద్దాయె సత్వరమె సెల వొసంగుడు రేని మా దేవి నిద్రింపంజనియెడు" నన రణార్ణవుఁడిట్టులనియె. మగధమహారాజు జరాసంధుఁ డీమెయొద్దకు నన్నతిరహస్యమగురాజకార్యముమీఁద నంప నేనిందువచ్చితిని. మీదేవి నాతోడఁ బ్రత్యక్షముగసంభాషింప ననువగునేని యటుసేయుట యుత్తమోత్తమము. అని యింకనేదియో యనఁబోవుచుండఁ బరిచారిక వానిమాట కడ్డమువచ్చి "చాలుచాలు; ఆదేవి కొమ్మలుదిరిగిన వారితోడనే మాటాడదు. రాగాదుల జయించిన మునీంద్రులకైన వసుంధరయంతయుఁ బాలించు

చక్రవర్తులకైన దర్శనంబొసఁగదు. నీబోఁటిసామాన్యునకా" యని మందలించెను. చోటుగానిచోటఁ గానిపట్టుఁబట్టుట కార్యభంగమునకు హేతువని జంకి యెప్పటివలె నీముఖముననే యుత్తరపత్యుత్తరముల జరగనిమ్మని యాతఁడు తనపని నిట్లని విన్నవించుకొనెను.

"మగధరాజున కపాయముఁ జేయఁదలఁచి కొందఱు కుటిలాత్ములు దుస్తంత్రములు పన్నుచున్నారు. వారికుట్రలపెట్టెయుంబోలె మాకు వారిజాబొకటి లభించినది. కాని యెవ్వరాలేఖను లిఖియించియుందురో యెఱుఁగఁజాలకున్నారము. ఈయదియే యామొగలియాకుజాబు. దీని నామూలాగ్రముగ మీరు చిత్తగించి వ్రాసినదురాత్ముని పేరు మాకుం దెల్పి మగధరాజ్యమును మహారాజును రక్షింపవలయును. అని పరిచారికచే నామొగలియాకును లోని కంపెను. యోగిని దీపమును బాగుచేసి దానియెదుట నాజాబుం జదువుకొని యందలి ప్రత్యక్షరమునకును మితిమీఱిన యానందమునొందుచుఁ జదువుటముగియఁగనె మరల రెండుమూఁడుసారులు చదివి కొండొకవడికిట్లని మెల్లమెల్ల లోననుండి ప్రత్యుత్తరమిచ్చెను. "ఈజాబున కింత కలవరమొందవలసినపనియేమి? మీకుం గిట్టనివాఁడు, విదేశమున నున్నవాఁడు యువతీమోహమునఁ దవుల్కొన్నవాఁడు దీనిని వ్రాసియుండవోపునని విస్పష్టముగాఁ దెలియుచుండ మీరింతమూర్ఖులై యోజింపనేరకుంట నాకక్కజముఁగనున్నది. అయినను మీయూహ నిజమగునో కల్లయగునో యనుసందియము మీకున్నదిగావున మూఁడునాళ్ళలో వానిపేరును వానియున్న తావును మీకెఱిఁగించెదను. ఒకవేళ వీని నెఱుఁగ నాకు సాధ్యముకాదేని నాకుఁగల యద్భుతదివ్యశక్తిచేఁ గైలాసమున కరిగి శాంకరీముఖమున నదియెఱిఁగివచ్చి మీకుఁ దెలిపెద. జరాసంధుఁడు భైరవపూజాధురంధరుఁడగుటచే మహాకాళికిని మహేశ్వరునకును వానియందుఁ బుత్రప్రేమ. నేను గైలాసమునకరిగినపుడెల్ల భవాని యీతనిమాటయె చెప్పుచుం

డును. భవానింబట్టి నాకును మగధరాజ్యమన్న నింతింతయనరానిపక్ష ము. అయినను మాకిందొక్క సంశయమున్నది. జరాసంధుని రహస్యముల నీ వెఱుఁగఁదగిన చుట్టమవో, టక్కరితనమున నాతనిరహస్యముల నెఱిఁగ నీవఁకఁ బెట్టుకొనివచ్చినపగతుఁడవో నాకు నిజముదెలియకున్నది. కావున నీకారహస్యములఁ దెలుపవచ్చునని నా మనంబునకు దృఢవిశ్వాసముగలుగునట్లు జరాసంధుని వ్రేలియుంగరము నానవాలుగఁ దెమ్ము. ఆవల నంతయు శుభమగును.

ఆపలుకులు చెవినిబడ రణార్ణవుఁ డామెమహిమ కచ్చెరువడి యీవలనుండియె నందన మాచరించి యెట్టులైన నాయుంగరమును మ ఱునాఁడుదయమునఁ దెచ్చి యిచ్చుటకొప్పుకొని సంతుష్టహృదయుఁడై యింటికిఁజనియెను. అనంతర మాయోగిని యాలేఖను మరలమరలఁ జదివి తలయూఁచి ""హాదురాత్మా! నేఁటికిఁ జిక్కితివిరా! పాపాత్ముఁ డెన్నఁటికైనఁ జిక్కకపోవఁడు గదా! యని దానిం బువ్వులసెజ్జలో నుంచి పరిచారికయుఁ దానును నాఁటిసంగతులు ముచ్చటించుకొనుచు నిద్రించిరి.

పొద్దుపోయి నిద్రించుటచేఁ జాలినంత నిద్దురయుండమి రణార్ణ వుఁడు కన్నులు నులిమికొనుచు బద్ధకముచే నొడలు విఱుచుకొనుచు నావులించుచు లేచి చీఁకటి వీడకమున్న రాజగృహమున కరిగెను. రణా ర్ణవుని సందేశ మేగతిఫలించినదో యెఱుఁగఁగోరి పెందలకడ మేలుకాం చి జరాసంధుఁడు వీనికొఱకెదురుచూచుచుండ నింతలో రణార్ణవుఁడువ చ్చి నమస్కరించి యెదుటనిల్చె. జరాసంధుఁడు యథోచితముగ వాని నాదరించి యోగినీవృత్తాంతమంతయు వినఁగోర నాతఁడు పూసగుచ్చి నట్లు జరగినకథయెల్ల తూచాతప్పకుండ విన్నవించి యామెమహిమలు వేయినోళ్ళఁబొగడి యుమామహేశ్వరులకు మగధరాజ్యముపైఁగల య భిమానమును వక్కాణించి తమకార్యము నిరభ్యంతరముగ నెఱవేఱునని

ధైర్యముతో నుండెను. జరాసంధుఁ డాసంభాషణమంతయు నాలకించి యించుకసేపు వానితోఁ బలుకక యోజించి యెట్టకేలకు "కుమారా మనకుఁ గిట్టనివాఁడు దేశాంతరమున నున్నవాఁడు. యువతీమోహమునం జిక్కినవాఁడు, నెవ్వఁడైై యుండవచ్చును? ఈయర్థము మనకుం దోఁచకున్నది. కళానందుఁ డూర నున్నాఁడా? ఈనడుమ జాడలేఁదేమి యని యడిగెను. రణార్ణవుఁడును వెంటనే "కొంతకాలమునుండి యూరలేఁడుసుండీ" యని యుత్తరము సెప్పి తనలో నిట్లని వితర్కింపసాగెను. "కళానందునిపై రాజునకే యనుమానముతగిలినది. సౌందర్యతిలక కాకళానందహతకుఁడు మనోహరుఁడగుటచే నెట్టులైన నాతనిఁ గడతేర్చిన పక్షమున నాయిందువదన డెందము నాపై నిలుపును. కొందఱు మంత్రికుమారులు నేనునుం గలసి యాదురాత్ముని నిదివఱకే రహస్యముగఁ దుదముట్టింపఁ గుట్రలు పన్నినారముగాని యాతఁడపు డూరలేమి నది సాగదయ్యె. ఈలేఖ నీతఁడే వ్రాసియుండును. వ్రాయకున్న నేమి? రాజునకాతనిమీఁద నలుకవొడమించితిని. వాఁడు మరల నగరముఁ బ్రవేశించినతోడనే వధియింపఁబడును. కాని ఱేనితోఁ గాలానుగుణముగ ముచ్చటించి మనోభీష్టముం దీర్చికొందును. ఏయుపాయముచేతనైన శత్రునాశన ముచితముగదా!" అని యెద్దియో మాటలాడఁబోవునప్పటికి రాజంతలో రణార్ణవా! పలుక వేమియని హెచ్చరించెను. అది సందుగా రణార్ణవుఁడు తన క్రోధమహానలముచేఁ గళానందవంశోద్యానమును మసిఁజేయనిశ్చయించి యిట్టులనియె. "దేవా! ఈసరికిఁ గొన్ని మాసములనుండి కళానందుఁ డూరలేఁడు. ఆతనిజాడ లెవ్వరు నెఱుఁగరు. ఇది యాతనిపనియై యుండునని యోగినీవచనముంబట్టి తోఁచుచున్నది. ఎట్టులైన నాతనిఁబట్టి తెప్పించినఁగాని మనకుసేమముండదు. ఇదె నామనవి" యనుటయు మగధరా జామాటలువిని యెద్దియో స్ఫురణకు వచ్చినవాఁడువోలె హా! తెలిసినది! ఆపాపాత్ముఁడు

వాసుదేవునితోఁ గుట్రలుపన్నుట కరిగియుండు రానిమ్ము. హా దురాత్మ! కళానంద! వాసుదేవబలరామసమేతముగ నిన్ను భూతబలి యిచ్చెదనుగాక! కుమారా! అయినను మనతలఁపు నిక్కువమో కల్లయో మూఁడునాళ్ళలో యోగిని మనకు విన్నవింపకపోదు. ఒకవేళ నతఁ డాలేఖను వ్రాసియుండకపోయినను మనము నమ్మఁదగినవాఁడు గాఁడు. కావున వాఁడు పురము విడిచియుంట శ్రేయస్కరము కాదు. సత్వరము పట్టి తెప్పించుట యెల్లవిధముల నుత్తమము. కటకటా! మగధరాజ్యలక్ష్మికిం జేటు మూడియుండవోపు. హా! హంసడిచికులార! దురాత్ముఁడగు వాసుదేవుని కౌటిల్యమున మీరు రొండొరులగతిఁ దెలియకుండ నిధనముఁబొంది నన్నేకాకినిఁ జేసితిరికదా! ఇట్టి సమయంబున రెండుఱెక్కలులాగున మీరలుండిన నేనాయాదవులకు జంకువాఁడనే? ఇప్పటికైన నాకేమిభయము. అయ్యో! ఆలస్యమేల! పుష్పకేతునియొద్దకుంబోయి మన వేగులవాండ్రకు మాఱువేసములు వేసి ద్వారకకంపి యచట వాసుదేవునియాలోచనలును గళానందుని జాడలును దెలిసికొనిరమ్మని పనుపుము. అదియునుగాక సేనాధిపతులతో నిట్లని నావచనములుగఁ దెలియఁజేయుము. వాసుదేవుఁడు తనవేగులవాండ్రనుగూడ బహువేషములతో మనపోలికంపును. వారిం గనుగొనుటలో మెలఁకువ యెంతయుఁ జూపవలయును. బిచ్చగాండ్రని జాలినొందక మునులని బెదరక స్త్రీలని గౌరవింపక రోగులని సందియమొందక మన పురమునఁ గ్రొత్తమొగము కనఁబడఁగనె మాయెదుటికిఁ దోడ్కొనిరండు. అటు చేయనివారు ప్రాణమునకుం బాసినవారని యెఱుఁగవలయునని చెప్పి యోగినికిమ్మని యామెకోరినప్రకారము తనవ్రేలియుంగరము దీసి రణార్ణవునకిచ్చి యనుప నతఁడేగి యోగిని కాయంగుళీయకము నర్పించెను.

ఇరువదిమూఁడవ ప్రకరణము.

కూఁతును రణార్ణవునకిమ్మని తనయేలిక మోఁమోటవిడిచి తన్నడుగుటచేఁ జంద్రపాలుఁడు మిగులఁ జింతాక్రాంతుఁడై యామాట యేటికిం దెలుపక దీనాననుఁడై “రాజుతో నేమని మనవి యొనర్చువాఁడ దైవమా! గడువు సమీపించుచున్నది. రణార్ణవుని పేరు మాగుణోత్తమ యేవగించు. ఈదుహితావివాహముకతమున నాకు మరణము సంభవించునని తోఁచెడును. అయినం గాదలంచినది కాకపోదు. మా యమ్మాయితో నొక్కసారి యీనాదురవస్థ జెప్పి యామె కిష్టమగునేని రణార్ణవుని కేలువట్టుమని ప్రార్థించెద. ఇష్టములేకున్న నాకులాంతమైనను సరియ కాని బిడ్డసుఖమున కడ్డువెట్ట” నని కొండొకసేపు తలపోసి కూఁతునొద్దకుం బోవసమకట్టి రెండడుగులు నడచి “సీ! నాజన్మమేల? ఎంతకఠినహృదయుఁడనోకద, కళానందునియందు డెందము వత్సకు నాటియున్నదని యెఱిఁగియు సర్వవిధముల నయోగ్యుఁ డగు పురుషాధముని వరియింపు మని యడుగ నాకు నోరెట్లులాడు? మున్ను గళానందుని వేనోళ్ళఁబొగడి నేఁ డేమొగము బెట్టుకొని రణార్ణవుని విషయమై ప్రసంగింతు. అక్కటా! బిడ్డయొద్దకుం బోవమానుదునా? కాదు కాదు, పోయిచెప్పెదను. అని నిశ్చయించి మెలమెల్లన మేడమెట్లెక్కుచుండెను.

కడచిన రెండుదినములనుండియుఁ దండ్రిమొగము దైన్యమును సూచించుటచే సౌందర్యతిలకయు నది తనవిషయమైన విచారముగ నుండనోపునని నిశ్చయించి తనమూలమున జననీజనకులకుఁ గలిగెడు మనోవ్యాధికిఁ బొక్కుచు నందులకుఁ బ్రతిక్రియ నరయుచు నెంతయు వ్యాకులము దానుగూడఁ బొందసాగెను. నాఁటియుదయమున రాగలతికయు సౌందర్యతిలకయు మేడపై నొకచోటఁ గూరుచుండి కర్తవ్యము

నాలోచించుకొనుచుండఁగా నింతలో సోపానములమీఁద నడుగులచప్పు డు వినంబడియెను. వచ్చువార లెవ్వరో చూతమని రాగలతిక యించుక తొంగిచూచునప్పటికి మెట్లుదాటి చంద్రపాలుఁడు కొంతదూరము వచ్చెను. తోడనే యువపుగును లేచి నమస్కారముఁజేసి దీవనలఁబడసి నిలువఁబడియుండ నాతఁడు తానొకపీఠముపైఁ గూరుచుండి బిడ్డలారా! కూరుచుండుడీ యని యానతిచ్చి చేయిపట్టుకొని కూఁతు నొక పీఠముపై సమీపమునఁగూరుచుండఁ బెట్టెను. సౌందర్యతిలక సిగ్గుపఁ దలవంచి పెడమొగమై యుండెను. రాగలతికయుఁ గొంతతడ వూరకుండి చనువు పెంపున నిట్లనియె. రెండుదినములనుండి మీరు తొంటియట్టులుంట లేదు! మీస్థితిఁజూచి మాచెలియుఁ దదనుగుణముగనున్నది, మీమనోవేదన బిడ్డలకెఱుఁగఁజేయఁ దగినదైన మేము వినఁగోరుచున్నారము. అనవుడుఁ జంద్రపాలుఁడు చిఱునగవుఁ దెచ్చుకొని యమ్మా! నేనుండ నాయలమట తీరునదికాదు. మీ రడిగిరికావున నామనోవేదనము నంతయుం జెప్పెద నాలకింపుఁడు. మగధరాజ్యమునవసించుట పాములపుట్టలోఁ గాఁపురము సేయుట. మొన్న జరాసంధుఁడు నన్ను బిలువనంపి బిడ్డను రణాంతపునకుఁ బెండ్లిసేయింపుమని నాతోడ నొక్కి చెప్పెను. ఇంతకన్న నాకు దుఃఖకారణమేది? అతని కీయవలసిన యుత్తర మీవఱకే యొసఁగుదునుగాని వత్సతో ముచ్చటించి యవ్వలఁ గార్యనిశ్చయముఁ జేయఁదలంచితిని. అమ్మా! నీమతమెఱిఁగింపుము. రాజుమతమునకు వ్యతిరిక్తముగ నరిగినంతనె నాకుఁగల్గు పాట్లు నీవెఱుఁగుదువు. కళానందుని విడిచిన నీవేమగుదువో నేనెఱుంగుదును. కావున నీవన్నియు నరసి నీయభిప్రాయము నాకెఱిఁగింపుము. కూఁతురైనను గొడుకైనను నాకు నీవకాన ప్రాణాంతమయినను సరియ. కులాంతమైనను సరియ. నేను నీమనోభీష్టము నెఱవేర్పఁ దలఁచియున్న వాఁడ. నాయెదుట జంకక మోమోటఁవిడిచి హృదయమున నున్నదున్న

ట్లు పలుకుము. నాకు నీకన్నఁ గూర్చు పదార్థ మన్య మొక్కటి లేదుగదా! యని తనయుమ్మలికమును వచ్చినపనియు వెల్లడించిన భయసంభ్రమము లంజేసి సౌందర్యతిలక మేను చెమ్మటవరదలతో నిండసాగెను. రాగలతిక చంద్రపాలునిమాట లన్నిటినిఁ జక్కఁగఁ బూర్వోత్తర సందర్భములతో నాలకించినదగుటఁ దన చెలి భయభ్రాంతయైన కతనఁ దండ్రికిఁ దగినయుత్తర మీయఁజాలదని తానె యాతని కభిముఖయై యిట్లనియె. "అప్పా! మీరువచ్చునప్పటికి నేనును మాచెలియు నీయంశమును గూర్చియే ముచ్చటించుకొనుచుంటిమి. ఆమెమాన సంతయు నాకెఱుఁగఁ జెప్పుటచే నాబాలికయభిప్రాయము మీకు విన్నవింపఁగలను. ఇవి నాపలుకులుగ గ్రహింపక వత్సపలుకులుగ గ్రహింపఁ బ్రార్థించెదను. కళానందునివిడిచి రణార్ణవుని జేపట్టుట, యింద్రనీలముఁ బాఱవైచి మసిబొగ్గుఁ గైకొనుట. కళానందునిపై ననురాగలత నాటికొని వేళ్ళుపాఱి చాలకాలమైనది కావున దానిఁ ద్రెంపుటకు మరల నాప్రేమము రణార్ణవునిపై నిడుటకు వేయేండ్లు తలక్రిందుగాఁ దపముఁ జేసినను నాతరముగాదు. ఉత్తమకులజుఁడు మధ్యములోక మన్మథుఁడు నగు కళానందునిఁ దలఁచి నీచకులజుఁడుఁ గురూపియు నగు రణార్ణవునిఁ దలఁపనైనరాదు. డెందమాతనివైపు కలలోనైన ముచ్చటకైన నొకమాఱు కూడ నరుగదు. గాఢానురాగసక్తములగు కాముకజన హృదయములు రాజాజ్ఞలకు లోఁబడి చెప్పినట్లు వినునవి కావని జరాసంధునితో నామాటలుగా విన్నవింపుము. వివాహములు దేహసంబంధములు కావు. హృదయసంబంధములు. కళానందునకు డెందమింతకుమున్న యర్పింపఁబడుటచే నేనాతనికిల్లాలను. ఆడెంద మన్యులకొసంగుట పతివ్రతలక్షణముగాదు. తండ్రీ! ఈకతమున నీకుఁగూడ నాదురాత్మునివలన నపాయమువాటిల్లునుగాన, మనసుగలియనివరుని కేలు పట్టుటకన్నఁ గన్యత్వమునఁ గాలముబుచ్చుదాన నని మావత్సవివాహమునే యుజ్జగించి

బ్రహ్మచర్యవ్రతమాచరణము నిర్వర్తింపఁ దలఁచెనని రాజుతో మనవి యొనర్పుమని గొంకులేక యుపన్యసించుటయు రాగలతిక మొగముఁజూచి చంద్రపాలుఁడు మిగుల నక్కజమునొంది బిడ్డపైఁగను జాలివడి యమ్మాటకు సంతసించి కూఁతునుద్దేశించి యెట్టకేల కిట్టులనియె. అమ్మా! నాప్రతినవినుము. పదునెనిమిదేండ్లు నిన్ను గారాబమునఁ బెంచి తుదకు రాజున కలుకవోడమునను భయముచే నేను బ్రదికియుండి నాకన్నులయెదుట నీచేత బ్రహ్మచర్యవ్రతముఁ జేయించుచుఁ జూచి యూరకుండుటకు నాహృదయమొప్పునే? రాజునకుఁ బగతుఁడనైన నాదునుగాక. ఏమివాటిలిన వాటిలుగాక! నేను నీయిచ్చవచ్చిన తెఱంగున వివాహమునెఱపెదను. బిడ్డా నాదెస భయపడకుము. నీకుఁ గానియెడ నాతనువు కాల్పనేయని యూఱడించి యచ్చోటువాసి క్రిందికిం జనియెను.

తండ్రియరిగినవెనుక సౌందర్యతిలక తనమొగమెత్తి రాగలతిక యిచ్చినయుత్తరముచేఁ దనకత్యానందముంగల్పించిన నామెను గౌఁగిలించుకొని యోసీ! నాహృదయ మున్నదున్నయట్లు, నామనసువచ్చునట్లు, మాయయ్యమనసు నీరగునట్లు, నాగౌరవమునకుఁ దగున ట్లుత్తరముఁ జెప్పితివే! నీప్రజ్ఞ నేమనికొనియాడుదు! మనమెంత దృఢనిశ్చయులమైనను నేమి లావణ్యారాశిజాడ తెలియదుకదా! ఓసీ! అన్నట్టు, నాకు జ్ఞాపకము వచ్చినది. ఈనగరికివచ్చిన యోగిని యడిగినప్రశ్నములనన్నిఁటినిఁ జక్కఁగాఁ జెప్పెనఁట. కళానందుని యున్నతావుఁగూర్చియు నాకాతనిపొందు లభించుటం గూర్చియు నామెనడిగివత్తువా? దానంజేసి హృదయము కొంత యూరటఁజెందునేమో! అనిపలికెను. ఆ మాటకేదియో మాఱువలుకఁదలంచి చెలకత్తె యుద్యమించుచుండ నింతలోఁ దలవాకిటనుండి రాగలతికా రాగలతికా యని పిలుపు వినంబడెను. రాగలతిక మేడదిగివచ్చి గుమ్మముదగ్గఱనొక ముసలిదానిం

జూచి నీవెవ్వ రేమికతమున వచ్చితివని యడిగెను. ఆమెయు నాయూరుపేరు నీకేల? నీతోడ వియ్యమందఁదలఁచినపుడు చెప్పెదనుగాని ముందిది యాలకింపుము. నాఁడొకసన్యాసి సౌందర్యతిలక కెట్టులైన నందఁజేయుమని పూలవర్తకునిచేతి కిచ్చిన దివ్యకుసుమం బిదిగో. యోగిని మీకందఁజేయుమని పన్నంపినది. ఇంకనన్ను నీప్రశ్నలతో బాధింపకుము. నేనరిగెదను. అని యొక గుడ్డమూటనిచ్చి రాగలతిక యేదో యనుగఁదలఁచి యెన్ని పిలిచినం బలుకక వడివడి నడచిపోయెను. ఆయద్భుతప్రసంగముచే రాగలతిక మ్రాన్పడి కొంతసేపు వెఱ్ఱిచూపుఁ జూచి తుదకు మేడమీఁదికిం జని యావృత్తాంతము దనచెలికిం దెలుప నామెయు నమ్మలేకనమ్మి రాగలతిక చేతినుండి మూటలాగికొని పట్టరాని సంభ్రమముతో దానిని విప్పి యంగలత గడగడవడఁకఁ జెమ్మటలుఁగుఱియ నలిగియున్న మొగలియాకు టుత్తరమును దనలోఁదాను చదువుకొనసాగెను. రాగలతికయు నింతకన్న నెక్కుడగు నాత్రముతో దానిం జూడఁగోరెను. కాని చెలి యేమనునో యని సందియమొంది యూరకుండెను. గుణోత్తమ తత్తరమున నుత్తరమెల్లఁ జదువుకొని కనుదమ్ములనుండి యానందబాష్పములు ముత్యాలచేరులట్లు చెక్కుటద్దములనుండి దిగజాఱ "రాగలతికా! ధన్యురాలను. ధన్యురాలను. నన్నుఁబట్టుకొనవే! అయ్యో! రావే యనిపిలిచి యదిరాకమున్న సెజ్జపై వ్రాలి "హా! ఇది యామహాపురుషుని యొద్దనుండియే వచ్చినది. ఇది మనమనుకొనినటుల సిద్ధకుసుమముకాదు. మొగలియాకు. ఇదిగో చూడుమని రాగలతికపైఁ బాఱవైచెను. రాగలతిక దానిజదువుకొనుచుండ గుణోత్తమ నడుమ దానింబిలిచి యోసీ! ఆయక్షరములపొంకమేమే! ఆసందర్భశుద్ధియేమె? వచనరచనఁ జూడుము! హా! ప్రాణేశ్వరా! ఈ మందభాగ్యురాలికతమున నిలువిడిచి దేశాంతరములపాలై పోతివిగదా! యనుచు నిట్టూర్పు నిగుడ్పసాగెను. రాగలతికయు మొగము మందహా

V.R. NARLA MEMORIAL LIBRARY
V.R.NARLA D.P.R.I. Acc. No.

సచంద్రికలచే వికసింప “చెలీ! నీవుకావుగాని మేము ధన్యులమైతిమి. పాపము! సంతసించుటకు నాగవల్లి పేదయ్యె. పాపమిది దొరకదనువిచా శచే నది యెందేనియరిగినది. ప్రాణసఖి! దీనింబట్టి కళానందుఁడు సుఖియై యున్నవాఁడని తోఁచెడును. నీవింక వగఁగూలవలసినపనిలేదు సుమీ! అని హెచ్చరించి యాలేఖఁ గ్రమ్మఱ నామెకిచ్చెను. కమ్మ మరలఁగైకొని యింకొకసారి చదివిచూచి రాగలతిక తన చేష్టలఁజూచి నవ్వుచున్నను సరకుఁగొనక మొగలియాకును ముద్దుబెట్టుకొని కన్నులవద్దుకొని చేతులుమోడ్చి మ్రొక్కి చెలింగనుంగొని యిట్లనియె. ప్రియసఖి! ఇందలి సువర్ణములు సువర్ణములు కుప్పవోసినట్లున్నవి చూచితే! ఈలేఖ పలువుర చేతులం దిరిగివచ్చుటచేఁ గమలినదయ్యుఁ జలితమబ్బులచాటుననుండు లేఁతచందురులాగున శోభ లీనుచున్నది సుమీ! అంతదూరమున నున్నను హృదయము నామీఁదనే నిలిపియున్న యా రాజకుమారున కేమి ప్రత్యుపకారముఁ గావింపనోపుదునే! ఈలేఖలో వాసుదేవునిమాటఁ దలపెట్టుటచే నీతఁడు ద్వారకానగరమం దున్నవాఁడని తోఁచెడును. అతనిం దోడితెచ్చుట కేరి నయిన నంపుమని మా యప్పతోఁ జెప్పవే; అని కేతకీదళము నుద్దేశించి “మోదళమా! ఎన్నినాళ్ళు నీనిమిత్తము నిద్రాహారములు లేక పలవరించితిని! ఎన్నిప్రయత్నములు చేయించితిని! నీ వచేతనపదార్థమవయ్యు నెంతకాలము నాకగపడకుండఁ దడవుచేసి నన్నలమటనొందించితివే! ఎంతజాగొనర్చినఁ బ్రాణేశ్వరుని కుశలవార్తఁ దెలిపితివి. కావున నీవు వందనీయురాలవే యగుదువు. ఇదె నాయంజలిం గైకొనుము. ఆసుకుమారుని హస్తపద్మమునందుండుటకు నీవెంతపున్నెముఁ జేసితివోకదా! యని పరిపరివిధములఁ గాముకజనసామాన్య మగు చిత్రసంభాషణము సలుపుచుండెను. ఇంతలో భోజనమునకు రమ్మని పరిచారిక లరుదెంచుటయుఁ దత్ప్రసంగముమాని యాలేఖను భద్రముగా దాఁచు

మగ్గ రాగలతికకు నొక్కిచెప్పి యిచ్చి లోనికి వికసించిన ముఖారవిందముతో చులుకనైన హృదయముతో, నానందము దెలుపు చూపులతోఁ, గొంతకాలమునుండి యెన్నఁడులేని యొయ్యారముతోఁ బానసంబున కరుగుచుండ సేవకులెల్ల నామె కొంటివగపు విడుచుటకు నెద్దియేని కారణముండవలయునని యూహించిరి. భోజనముసేయుచు యోగిని తనకుఁ జేసిన మహోపకారమును దనపై నామెకుఁ గలనిర్హేతుకజాయమానకృపయుం దలంచి మనమున నామె కనేకవందనములఁ జేయసాగెను. భోజనానంతరమున రాగలతికయొద్దకువచ్చి మఱునాఁడుదయమున యోగినికిఁ దనవందనము సమర్పింపుమని యానతిచ్చి యాదినమున వీణాగానముతోడను జిత్తరువు వ్రాయుటతోడను నాట్యముతోడను గడువిలాసముగాఁ బుచ్చెను.

మఱునాఁ డుదయమున రాగలతిక యోగినిం దర్శించుటకుఁ బోవ సమకట్టి తలవాకిటకి వచ్చునప్పటికిఁ బురజనులుకొందఱు బాటంబోవుచు. యోగిని నిన్నటిరేయి శ్రీపార్వతీదేవి నారాధింపఁ గైలాసమున కరిగినదఁట ; ఆహాహా ! ఆమె మహిమను నెన్న నెవ్వరితరమగు " నని తమలోఁ జెప్పుకొనుచుండవిని చెలి కావార్తఁ దెలిపి పయనము మానుకొనెను. రణార్ణవుఁడుఁగూడ నావృత్తాంతమునువిని తనతో నామె మున్ను వాకుచ్చినట్లు చేసియుండునని యోగినిరాక నిరీక్షించుచు దినములు గడపసాగెను.

మొదటిభాగము సమాప్తము.

సౌందర్యతిలక.

ద్వితీయభాగము.

మొదటి ప్రకరణము.

పాండవులపాలికిఁ దనసందేశముఁ గైకొని చనిన కళానందుఁ డెన్నినాళ్ళకును ద్వారకానగరమునకు మరలిరామి వాసుదేవుఁడు తద్దయుఁ జింతించి యాతని నమ్మకమును గూర్చి యించుక సంశయమంది మరల నతఁడట్టివాఁడుగాఁడని నిశ్చయించి యుధిష్ఠిరుఁడు వానినంపక జాగొనరించెనో మార్గమధ్యమున నాతఁడు దైవవశమున శిశుపాలాదులగు జరాసంధ పక్షపాతులచేతం జిక్కెనో యని తనవేగులవాండ్రి నలుగెలంకులకంపి యరయుచుండెను. ఎంతయారసిన నాతనిజాడ రవంతయేనిఁ జిక్కకునికి విసిగి విసిగి యసురాంతకుఁ డొక్కనాఁడు తనకనుకూలవర్తనుఁడగు నక్రూరునిఁ జేరఁబిల్చి కూరుచుండ నియమించి యిట్లనియె. "అక్రూరా! ఎఱుఁగుదువుగదా నాఁడిక్కడకు వచ్చిన కళానందుని! కార్యాంతరముమీఁద నాతనిఁ బాండునందనులపాలి కనిపినాఁడను. ఎన్నినాళ్ళకు నారాజకుమారుఁడు రాఁడయ్యె, నీవొక్కసారి యింద్రప్రస్థమునకుంజని జాగునకుఁ గారణము దెలిసికొని పాకముదప్పినఁ గార్యముసెడునని యుధిష్ఠిరునితోఁ దృఢముగాఁబలికి కళానందుని వెంటఁబెట్టుకొనిరమ్ము. జరాసంధసంహారముగాక రాజసూయము నెరవేఱుట యసాధ్యమని యారాజుతోఁ నాపలుకులుగా విన్నవించి కార్యసాధనము గావించుకొని సత్వరము రావలయుఁజుమీ. అప్పుడు

నక్రూరుఁడు నల్లెయని యెద్దియో పలుకఁజూచునప్పటికిఁ బ్రతీహారివచ్చి జోహారొనర్చి దేవా! నలుగురు శిష్యులతో నెన్నఁడును మనము కనివినియెఱుఁగని యొకముదుసలి జడదారి కరభుండనువాఁడు దేవరతోఁ గొన్నియంశములు ముచ్చటింపఁ గోరుచున్నాఁడు. ముదలయయ్యేనేని తోడుకొనివత్తునని మనవిసలుపుటయు నందనందనుఁడు త్వరితముగ వారిందోడితెమ్మని యానతిచ్చి యుచితాసనములు వేయఁబనిచి మునిరాక కెదురుచూచుచు నిలువంబడియెను. మూర్తిఁ గైకొన్న నాలుగు వేదములవడువునఁ గంఠములెత్తి స్వస్తిపనసలు చదువుచు నలువురు శిష్యులు వెంటరా వేదపురుషునట్లు కరభుఁడు బహుద్వారములుదాఁటి మాధవుకడ కరుదెంచుచుండ నల్లంతదూరమునఁ గాంచి యాదవుఁడు మానిబ్రహ్మతేజమునకును శాంతమునకు నచ్చెరువడి భక్తి యినుమడింపఁ గేలుమొగిచి యెదురువచ్చి చరణారవిందముల కెఱఁగి పీఠమునఁ గూర్చుండఁబెట్టి యర్ఘ్యపాద్యములసమర్పించి సుఖోపవిష్టుండైన యాతనితో నిట్లనియె. దేవా! మీరుద్వారకానగరమును మాగృహమును బావనము సేయఁదలఁచి యరుదెంచిన మహేశ్వరులనితోఁచుచున్నది. సాటిలేని మహిమగలవారనియుఁ గోపమెఱుఁగని సుశీలురనియు బాల్యమునుండి వీనులవిందుగా విందుఁగాని కన్నాఱఁగన్న భాగ్యములేదు. నేఁటికిఁగదా మాకన్నులకఱవు దీఱినది. ఇప్పుడుగదా మానోఁచిననోములు పండినవి, మాచేత నేకార్యము చేయించి తక్కిన రాజలోకములో నన్నెక్కువగా గౌరవింపఁదలఁచివచ్చిరో యాపని యానతిచ్చినన్ను ధన్యునిఁ జేయవేడెద.

అనవుడు కరభుండు వాసుదేవుని నెమ్మొగముఁజూచి మెల్లమెల్ల నిట్లనియె. దేవా! జగమునఁ గల వంగసములలోనెల్ల రాచకొలము పాపభూయిష్ఠమైనది. ప్రజాపరిపాలన మొనర్తుమను వంకబెట్టుకొని పడతులఁ జెఱఁబట్టుటయు జనులం బీడించుటయు మునుల ధిక్కరించుటయుఁ

గాని వేఱొకటికానరాదు. క్షత్రియాన్వయములపై నాకింతకినుక వొడము టకుఁగల కారణమేమనినఁ జెప్పెద నాలకింపుము. జ్వాలాజిహ్వుఁడను మ్రుక్కడిరక్కసునిచేతఁ జిక్కి స్రుక్కుచు నిందుమతియను నొకరాచ పట్టి యదృష్టవశమున నందుండి తప్పించుకొనివచ్చి నాయాశ్రమముం బ్రవేశించి నాశరణముఁజేరి సుఖంబుననుండె. అంతఁ గొన్నినాళ్ళకు వేఁట తమకంబున శిశుపాలుఁడు మదీయాశ్రమము నేనింటలేనితఱిఁ బ్రవేశించి యిచ్చవచ్చినట్లు పరివారసమేతుఁడై మెలఁగి కట్టడితనమున నెట్టకేలకు నిందుమతిం బట్టి బలిమిచేఁ దనపురంబునకుం గొనిపోయెను. కటకటా! తనకభయప్రదానముగ నుందునని నానెలవుచేరిన యాయిందుమతిని నేను సంరక్షింపలేనయితిని. ఆయింతి యెంతపొగులుచున్నదో! నారాయణా! నాటఁగోలె నామెనిమిత్తము నాచిత్తమొందు నుత్తలపాటు చెప్పతరముకాదు. నాకలుక సంపూర్ణముగఁ బొడమిన బ్రహ్మాండములను గడగడవడంకఁజేసి శిశుపాలుని నిర్మూలింపలేనె! ఆదురాత్ముని సాహసముఁ జిత్తగింపుము. నాయాశ్రమమున నున్నదనియైన నాపఁడతిని విడువక యెత్తుకొనిపోయెను. తెలియనివానిపై నలుకఁజూపరాదని నేను ధర్మమార్గోచితముగ నాతనికి నాశిష్యులవలన సందేశమంపి కన్యను నాయొద్దకుఁ బుత్తెంచుమని వేఁడుకొంటిని. దానికి బ్రత్యుత్తరముగ నాపాపాత్ముఁడంపిన సందేశమునాలకింపుము. "యువయువతీజనముల పరస్పరానురాగములును, జిగురుబోండ్ల వాలుచూపులవాడిమియు, మోడుచెట్లవలె నామరణబ్రహ్మచారులగు నిరాబారు లెల్లెఱుఁగుదురు. మీకుఁదెలియని యంశములతో సంబంధము గలుగఁజేసికొని యున్నగౌరవ మేల చెడఁగొట్టుకొందురు? అదియటుండ నాపడఁతుక యవివాహితకావున నొకరిసొత్తుకాదు. దీని నపహరించిన దోషంబులేదు. ప్రజల యర్థము ప్రాణము, శరీము సర్వమును రాజుదేయని ధర్మశాస్త్ర ముద్ఘోషించుచున్నది. ఈముదిత నాదేశమున నుండుటచే నాయిచ్చవచ్చినట్లు చేయు

ట ధర్మేతరముకాదు. పరిపక్వమైన ఫలంబు చెట్టుపైనఁగానఁబడిన రాచిలుక దానిపైనుఱికి పంటనొక్కి రసమాని యనుభవింపక విడుచునే! కన్యాత్వము బాయనిదియగుబాల కనఁబడుట రాజట్లుచేసిన నేమి యనుచితము! ఈధర్మములు మీకుఁదెలియవుగాన కొన్నినాళ్ళు శుశ్రూషఁజేసి నేర్చికొనుండు" అని. మాధవా! సందేశమిది." అని కోపావేశమున నించుక యూరకుండెను.

వాసుదేవుఁడును జరగినచిత్రకథకును శిశుపాలుని సాహసమునకు నచ్చెరువడి యదియు నించుకమంచిదేయని మనమునహర్షించి చైద్యునకంత్యకాల మాసన్నమగుట నిశ్చయించెను. ఇంతలో సంధ్యాకాలము సమీపించుటఁజేసి మౌనియు శిష్యులును నారాయణుఁడును నియమితార్ఘ్యప్రదానము నొసఁగఁజనిరి. అనుష్ఠానములు ముగిసిన వెనుక యతి నతిప్రీతిమై లోనికింగొంపోయి వాసుదేవుఁడు కందమూలములు ఫలములు నావుపాలుఁ బిండివంటలతో విందారగింపఁజేసి సంతుష్టహృదయునింజేసి కృతార్థుఁడనై తినని పలుమ అుగ్గడించెను. తరువాత వెనుకటికథాసందర్భమందుకొనుటకు మౌని యత్నించుచుండ నింతలోఁ బ్రతీహారియరుదెంచి చేతులుజోడించి, దేవా! దివ్యపురుషుని యటుల నున్నాఁడు. ఊరుపేరుజెప్పమన్నఁ జెప్పఁడఁట. ఒకనిమేషమయిన జాగుసేయక మీతో మాటలాడవలయునఁట. సెలవేమి యని యెదుటనిలువంబడియెను. అంతటిత్వరితమున వచ్చినవాఁడు రాజకార్యముమీఁదఁ గాని రాడని లోనికి వేగముగరమ్మని యానతిచ్చెను. ప్రతీహారియు నావలకుఁజని యాపురుషుని మాధవునిపాలికంపెను. మునియును, శిష్యులు ముకుందుఁడును దివ్యసుందరవిగ్రహమువాని, నతిచాకచక్యముగలవాని మీసకట్టుబొత్తుగా రానివాని నిరువదియేండ్ల వయసుఁగలవాని నారాచకొడుకుంగాంచి యీతఁ డెందుండివచ్చెనో యని చింతించుచుండిరి. అతఁడు సమీపించుటయు వాసుదేవుఁడు చేసన్నచే

నొకపీఠమునఁ గూరుచుండుమని చెప్పెను. ఆవచ్చినపురుషుఁడు వాసుదే
వుని సన్నిధింగని యాతనికింజోహారొనర్చి యెదుటనిలచి యిట్లనియెను.
నాకుఁగల కార్యపువేగిరము నన్ను గూరుచుండనీయదు. నందనందనా
నీమాటకడ్డుపలికితివని కోపింపక యొక్కసారి యొకగదిలోనికి వచ్చితివేని
నాకులగోత్రములు నాపేరు నాయున్న యునికియు నావచ్చినపని నీకువి
న్నవించెదను. అనవుడు నందకుమారుఁడు మునిపురందరు ననుజ్ఞవడసి
యాపురుషుని లోనికిఁదీసికొనిపోయి రెండుగడియలసేపు ముచ్చటించిరి.
వారిసంభాషణ మెట్టిదో యెవ్వరు నెఱింగినవారులేరు. మునికిఁగాని శి
ష్యులకుఁగాని వచ్చినపురుషుని పేరైనఁ దెలియరాకుండ పురుషోత్తముఁ
డాతనితో వలయునంశములన్నియుఁ బ్రశంసించి యెట్టకేలకు వానితో
గదినుండి బైటకువచ్చి వాని నాముని సన్నిధానమునఁ గొండొక సేపుం
డుమని కూరుచుండఁబెట్టి యేకారణముననో ముని యచ్చటికి వచ్చిన
పని యంతయు నాతనికిం దెలియఁజేసెను. తనపని కొరిత్తవానికి నంద
నందనుండు తెలియఁబలుకుటచే నాతఁడెవ్వఁడో యెఱుఁగఁగోరి కరభుం
డు శాంతవచనములతో నిట్లనియెను. మాధవా! ఈపురుషుండెవ్వఁడు?
ఈతఁడు మనకార్యమునకుఁ దోడగునే? అనిన వాసుదేవుఁడు పురుషుని
వంకజూచెను. చూచుటయు నాపురుషుండు చిరునగవు మొగమున నం
కురింప మునీంద్రా! నేను గిరివ్రజపురమునుండి వచ్చితి. నాపేరు జా
తవేదుఁడు. నేనొకరికి మిత్రుఁడగా నొకరికి శత్రుఁడనుగాను. మీసం
కల్పము జనార్దనుఁడు నాకెఱుఁగఁజేసినాడు. నాయొనర్పఁగలసాయము
న్న నేనొనర్చెద. కాని నాకొక్కమాటఁ దెలుపవలయు. నాపోవుకార్య
మున నాకు జయముసిద్ధించునట్లు మీరాశీర్వచనమొసఁగించితిమనుటయే
నని పలికెను. కరభుఁడు వానిమాటలకలరి "యీప్సితార్థసిద్ధిరస్తు" ని దీ
వించి యటనుండి పోవనుకట్టి వాసుదేవునితో నిట్లనియె. "నేనింక నా
య్యాశ్రమముంగూర్చిపోవలయును. నీవు నిష్పక్షపాతమతివి చుట్టముక

డనేరమున్న నూరకుండవు. సామోపాయయుక్తినో దండోపాయశక్తినో మాయచేతనో శిశుపాలుని శిక్షించి యిందుమతిని నాకర్పింపవలయును. అనంతరము నీయిచ్చవచ్చిన వానికా మచ్చెకంటినిచ్చి పెండ్లిసేయుము. సంసారసంబంధములు త్రెంపుకొన్నమాకును దైవవశమున ననురాగగుణములు సంభవించినవి. చేదినగరవృత్తాంతములు నీవేమయిన నెఱుఁగఁగోరితివేని యిదె నాశిష్యుఁడు చారాయణుఁ డక్కడనుండి వచ్చినవాఁడు. వానినడుగవచ్చునని పలుకుటయు వాసుదేవుఁడు చారాయణుంజూచి యిప్పుడు శిశుపాలుండెందులకైనఁ బయనమైయున్నవాఁడా? ఆతనినగరమున నూతనపురుషుఁడెవ్వఁడైన బంధీకృతుఁడై యున్నవాఁడా? ఇప్పటికిందుమతి నింకను బెండ్లిచేసికొనలేదుగదా! యని యడిగెను. ఆచారాయణుఁడును నారాయణునువంక వడంకుచుఁ జూచి "దేవా నేను చేదిపురినుండి బయలుదేఱునప్పటికి శిశుపాలుఁడు మగధరాజసందర్శనార్థమై యరుగఁదలఁచి పయనమునకు జతనము సేయించుచున్నాఁడు. ఇఁక నాలుగైదుదినములలోఁ బోవచ్చును. మఱియుఁ గ్రొత్తపురుషుఁడొక్కఁడు వానిపేరెవ్వరో నేనెఱుఁగనుగాని యతిసుందరుఁడు మార్గవశమున నొంటరిగఁబడియుండఁ జారులచేఁబట్టువడి చెఱలోనున్నవాఁడు. ఏకారణముచేతనో యింతవఱకు నిందుమతిని రాజు పాణిగ్రహణము చేసికొనలేదు. నేనింతకన్న నేమియు నెఱుఁగనుజూఁడీ" యని విన్నవించెను.

అనంతరము కరభముని తన్నడిగినమాటలకుఁ దానొనర్పవలసిన సాయమునకుఁ దగునట్లు గోవిందుఁడు వానికి వీనులవిందుగా నిట్లనియె. మునివర్యా! శిశుపాలుండు జన్మప్రభృతిఁ గడుదుర్వర్తనుండై యున్నవాఁడు. కాలాగ్ని తుల్యుఁడగుజరాసంధున కీతఁడు దండనాథుఁడై యాతని యండనుండి నన్నుసరకుగొనక నాతోడిచుట్టఱికము మానుకొని యున్నవాఁడు. ఆదురాత్ములిరువురు జగత్కంటకులై యున్నవారు. అందు శిశుపాలుని ముందుగా శిక్షింపవలనుపడదు. జరాసంధుని గడతేర్చిన

యనంతరమునఁ గోటలూడినపామును మోదినట్లు చులుకనగా శిశుపాలు నేలపాలుజేతు. వాఁడు నాచేతఁగాని చావడని మున్ను వాఁడుపుట్టినయప్పు డశరీరవాణి పలికినది. నాబుద్ధిబలమునకుఁ బాండవేయుల బాహుబలము నకు మీయాశీర్వచన బలంబుతోడుపడునేని యాజగత్కంటకుల పీడ తొలంగి యనతికాలమున వసుమతిసుఖింపఁగలదు. తమరాశ్రమమునకుఁ బోవఁ ద్వరపడుచున్నారు. కావున నేను తమసెలవునకాటంకము చెప్పవాఁడనుగాను. అన్నిటికన్న మున్న మీయిందుమతి మీయాశ్రమమున కనతికాలమున వచ్చును. దీనికి సందియములేదు. మీరలింక నరుగవచ్చును. అని దండప్రణామముచేసి దీవెనలువడసి పయనమైన మునిని గొంతదవ్వు సాగనంపి మరలవచ్చి జాతవేదునితోఁ గొన్నిరహస్యములను ముచ్చటింపఁదొడఁగెను.

జాతవేదుఁడును శ్రీకృష్ణుఁడును గొండొకసేపు మాగధుని చర్యఁ జెప్పుకొని సంతసించి శిశుపాలుని జరాసంధునితోఁ గలియకుండఁ జేయవలయునని తలపోసి యుపాయము వెదకుచుండిరి. అంతలో వాసుదేవుని మనమున కేదియో తోఁచుటంజేసి యాతఁడు జాతవేదుని చెవిలో నొక రహస్య మువదేశించి తనవేగులవాఁడయిన కుశీలవుని వానికి సాయముగ నుండుమని చెప్పి ప్రొద్దగుటచే నిద్రింప నరుగఁదలఁచుచుండ నంతలోఁ బ్రతీహారి మరల కైవారముసలిపి “దేవా! పాండవులపాలినుండి సూతకుమారుఁడు ప్రాతిగామి వచ్చి దేవరచరణారవిందముల సందర్శింప నున్నాఁ”డని విన్నవించె. వాసుదేవుఁ డామాటలువిని చిరునగవునగి “యేమి! యీదినమున రాజకార్యము లనేకములు వితర్కింపవలసివచ్చె. ఇది కడుసుదినముగద!” యని వాని సత్వరము రానిమ్మని ప్రతీహారి కానతిచ్చె. అంతటఁగొన్నినిమిషములలో సూతులకుచితమగు వేషముతోఁ దన పొడుగువిగ్రహమునీడయే దనరాకఁ దెలియఁజేయ బ్రాతిగామి మందిరముఁజొచ్చి దేవకీతనయుని చరణసరసీరుహములకుం బ్రణమిల్లి చే

తులు మొగిడ్చి నిలిచెను. చిరునగవుతో నాతని దీవించి వాసుదేవుఁడు పాండవుల యందఱికుశలము వేఱువేఱుగ నడిగి యాతనిఁ గూరుచుండఁ బనిచి సందేశమెఱింగింపుమన వాఁడిట్లని విన్నవింపఁదొడఁగెను "స్వామీ! నాఁడర్జునుఁడు దేవరసాన్నిధ్యమునుండి యింద్రప్రస్థమున కరుదెంచి తమరు పంపుదుమని సెలవిచ్చిన వర్తమానమున కెదురుచూచుచుండెను. ఏనాఁటికిని మీయొద్దనుండి యేమాటయుం దెలియకునికి యుధిష్ఠిరార్జునులు మనమున నెంతయుఁ జింతిలుచున్నవారు. నారాయణా! యర్జునునకును నీకును మేనులు రెండుగాని యాత్మయొక్కటి యగుటచే నీయొద్దనుండి రాఁదగిన వర్తమానము రానందుల కాతఁడొందుపరితాప మింతయని చెప్పరాదు. రాజసూయమహాధ్వరముం గూర్చి యుధిష్ఠిరుఁడు మీనిశ్చితాభిప్రాయ మెఱింగి రమ్మని నన్నుం బుత్తెంచె" అనవుడు యాదవకుంజరుఁడు ముక్కునవ్రేలు పెట్టుకొని యక్కజపడి "కళానందుఁ డక్కడికిఁ జేరనేలేదా! హా! యేమివిధికృతము! అట్లయినఁ జారాయణుఁడు చేదిపురమునఁ జూచినవాఁ డాతండై యుండునా?" యని వగచి ప్రాతిగామిఁ గనుంగొని యధ్వరముం గూర్చియుఁ దక్కిన రాజకార్యములఁ గూర్చియు నేనే కొన్నినాళ్ళలో వచ్చి ముచ్చటింతునని యుధిష్ఠిరార్జునులతో నుడువవలయు. నీవుదయమున నింద్రప్రస్థపురమునకు మరల నరుగవచ్చునని సెలవిచ్చి జాతవేదునకుఁ గొన్ని సంగతు లుపదేశించి యారాత్రి యిరువురును నిద్రించిరి. మఱునాఁడు జాతవేదుఁడు లేచి తనదారినిఁ బయనమై యెందులకో యరిగెను.

రెండవప్రకరణము.

కరభాశ్రమమునుండి యిందుమతి శిశుపాలునివలన బలిమిచేనిజపురమునకుం గొనిపోవంబడినది మొదలు బెగఁగొని యాయంగన యున్మాదినియుంబోలె వ్యవహరింపఁ జొచ్చెను. నాలుగైదుదినము లాగతి మతిచెడియుండి యనంతర మలవాటుపడి తనపై నాపడఁతి వలపు తప్పక నిలుపునను నమ్మకముతోఁ జేదినాథుఁడు దానియాక్రందనధ్వనులను రోదనమును సరకుఁ గొనఁడయ్యెను. కాని యెన్నినాళ్ళకు నాయింతి యొక్కమచ్చుననే చచ్చినదియుంబోలె నెవరుపలుకరించినం బలుకక, యేమియిచ్చిన మెచ్చక విరియఁబోసికొనిన కచభారముతోఁ, డస్సినమేనితోఁ శిశుపాలుని కులనిర్మూలముఁ గావించు మహారాకసియో యన భయంకరాకారయైయుండె. పురజనులందఱుఁ జేదిరాజు వంశమునకుఁ గీడుమూడుకాలము సమీపించుటచేతనే శిశుపాలున కట్టివిపరీతబుద్ధులుత్పన్నములైనవని చెప్పుకొని భయపడసాగిరి. పౌరులమాటలొకలెక్కలోనికింగొనక తనకు హితము నాలోచించిచెప్పు నాప్తమంత్రుల యుపదేశము చెవినిడక శిశుపాలుఁ డాయిందుమతిపై డెందమునిలిపి యామెకిష్టమున్నను లేకున్నను నెట్టులయినఁ బెండ్లియాడ నిశ్చయించుకొని తనభోగకామినులఁ గొందఱి నామెకడ నియోగించి తనపై ననురాగ ముదయించునట్లు చేయుమనెను. తనశక్తికొలందిని వారును మాటిమాటికి నిందుమతికి ధైర్యముదెలిపి శిశుపాలు గుణములు స్తవముజేయుచుఁ బ్రయత్నము సేయఁదొడఁగిరి.

కళానందుఁడు చేదినగరమున శిశుపాలునిచేత నొకవిధముగాఁ జెఱనుంచఁబడియుఁ దనమాటల చమత్కృతిచేతను, బాండిత్యప్రకర్షచేతను రాజుమనమున కానందము గలిగించుచు, బాధింపఁబడిన వానియట్లుకాక స్వేచ్ఛగా నున్నవానిచందమున మెలఁగుచుఁ దనకులగోత్రములు

నామధేయముమాత్రిము జెప్పక యెప్పటికప్పు డెద్దియో వంకజెప్పుచు సౌందర్యతిలకపై హృదయమునునిలిపి వాసుదేవ పాదరాజీవములపై మనస్సునుంచి యాతనికృపచే నీవిచారసముద్రము దాఁటవచ్చునను నాసతో మేనునిలిపి కాలము బుచ్చుచుండెను. కళానందుని చక్కఁదనమునకును, తెలివికిని, శిల్పములయందుఁగల విజ్ఞానమునకును శిశుపాలుండు మెచ్చి యచ్చెఱువడి యతనిం దనదేశమున నుంచుకొని యెద్దియో యున్నత మగునుద్యోగము నొసఁగవలయునని పలుమాఱు తలఁచుచుండెను. ఇందుమతిని మహారాజు చేదిపురమునకుఁ దోడుకొని వచ్చుటయు, నామె నిరంతరసంతాపమున గ్రుక్కుటయు, నామె నసున యింప భోగకామినుల దాసీజనుల నాతఁడు నియోగించుటయుఁ, గరభ శిష్యుఁడగు చారాయణుఁడు సందేశముఁ దెచ్చుటయు, మునివాక్యముల రాజు నిరాకరించుటయు విని కళానందుఁడు దిక్కులేని యానెలంతుకపూర్వవృత్తాంత మెఱుంగఁగోరి సమయమున కెదురుచూచుచుండెను. అట్లుండ నొకనాఁడు శిశుపాలుండు వేఁటతమకమున నెందేనియరుగుటయుఁ గళానందుఁ డిందుమతీసమీపమున నెల్లప్పుడుండు నొక్కదాసిం బిలిచి చమత్కారవచనముల దాని నవ్వించి దానిచిత్తవృత్తి మెఱిఁగి మెల్లఁగువతో బుజ్జగించి తనమాట లెవ్వరితోఁ జెప్పకుండునట్లు దానిచే నొట్టుబెట్టుంచుకొని యిట్లనియెను. "ఓసీ! ఇందుమతి జన్మాదికవృత్తాంత మడిగి తెలిసి నాకెఱిఁగింపవలయును. నాకీపనిఁ జేసితివేని నీఋణముఁ దీర్చుకొందును. ఇక్కడివారందఱిలో నీవు గడుయోగ్యురాలవుగఁ గనఁబడుచున్నావు. ఎవ్వరులేనిసమయమున నామెనడిగి యట్టిసమయమున నే నాకుఁ దెలుపఁడగుఁజుమీ!" యని పలికెను. అదియు నాపలుకుల కలరి యిట్లనియె. దేవా! యీమాత్రిపుఁబని నేనొనర్పలేనే, యింతియుగా దీయిందుమతిచెఱ విడిపించు ప్రియత్నమేదైన మీరొనరింతురేని నాచేతనైన సాయమును నేను జరపుదును. ఇది మాయంతిపురి

వచ్చిననాఁటఁగోలె నామనస్సు విచారాగ్నిచే సంతప్త మగుచున్నది. నా కీశిశుపాలుని కొలువుననుండ నిచ్ఛలేదు. నిరంతరము మద్యపానాసక్తుఁడై సుందరియగు పరాంగన తన కంటఁబడువేగమే దానిం దనకుఁ గూర్పుమని మమ్ము శ్రమపెట్టుచుండును. వీనిపెట్టు నిక్కట్టులు పడఁజాలక యేదేశాంతరమైనఁ బోవఁజూచుచున్నాను. తమ రీచెఱనుండి విముక్తులగుతోడనే నన్ను మీయొద్దనుంచుకొనవలయునని వేఁడుకొనుచున్నాను. అదిగో నావల నెవ్వరో వచ్చుచున్నారు. మీ చెప్పినపనియం దప్రమత్తచిత్తముతో వర్తిల్లెద." అని సాగిపోయెను. తాను శత్రుమండల మధ్యమునసుండుటచేఁ దనహృదయ మొకింత వెలికిఁబొక్కినఁ దనకుం దానురక్షింపఁదలఁచినవారికిం గూడ చేటువాటిల్లునని మెలఁకువతో వర్తింపఁ బ్రయత్నించి కళానందుఁడు కృషిచేయసాగెను. తరువాత మూఁడునాళ్ళుగడచుటయు నానాఁటిసాయంకాలమున దాసి మెల్లమెల్లనవచ్చి కనుచీఁకటి నొకమల్లెపందిరియొద్ద నెద్దియో చింతించుచుఁ గూరుచున్న కళానందునిఁగాంచి చెవిలో నిట్లనియె. "అయ్యా! యీదినమున నంతఃపురకాంతలు మద్యపానముజేసి విలాసముతో నాట్యమాడుదురు. నాకాయుత్సవమున కరుగనిచ్ఛలేదు. నీవు రెండుజాముల రాత్రి యగునప్పటి కిందుమతియున్న గదిలోనికివత్తువేని యామెచారిత్రము నీవువినునట్లు పలికించెద. నీగుణములు నీచక్కఁదనము నీకామెపైఁ గలిగిన నిర్హేతుకకృపయు నేనామెకు విన్నవింప నెంతయునామె సంతసించి నిన్నుజూడఁగోరెను. వత్తువే" యనవుడు నాతఁడు వల్లెయని చెప్పినకాలమునకు సిద్ధముగనుండెను. దాసివచ్చి యాసమయమున కాతని నాగదిలోనికిఁ దీసికొనిపోయి యామెయెదుట నొకపీఠముపైఁ గూరుచుండఁ బెట్టెను. వెంటనే యిందుమతి సిగ్గునలేచి తలుపుచాటునకుం జని మున్ను తన్నలమియున్న నెవ్వగయంతయు నెందో యరుగ దాసింబిలిచి యేమియో గుసగుసలాడెను. కళానందుఁడు దాసికిం గనుసన్న యొఁస

గుటయు నది యిందుమతికి సంజ్ఞ చేయ నామె తనచారిత్రమునంతయు మున్ను శ్రావణునకుఁ జెప్పినచందమున విన్నవించి శ్రావణుఁడు దన్ను రాక్షసమధ్యమునుండి బ్రదికించి తననిమిత్తము మేనుదొఱఁగెనని చెప్పెను. తోడనే కళానందుఁడు వేఁడికన్నీరు కొలకులవెడలి చెక్కులదిగజాఱ "హా! శ్రావణా! కడతేఱితే యని మూర్ఛిల్లెను. ఇందుమతియు దాసియు నిదియేమని యక్కజపడి శైత్యోపచారముల నాతనికిం దెలివిఁ గలుగఁ జేసిరి. "హా శ్రావణా! సేవకుఁడవను పేరేకాని తండ్రిలాగున నను బెంచితివి. పెద్దకాలములో సుఖముగా నింటఁ గాలము బుచ్చవలసిన నిన్ను నిర్దయాత్ముఁడనై కాఱడవులనడుమను మహాశైలములమీఁదను ద్రిప్పి నీకు మరణము గలిగించితిని. హా కళానందుఁడా! మోహసముద్రమునఁ దగిలి నమ్మినసేవకుని ప్రాణములు పుచ్చుకొంటివే! అయ్యో! శ్రావణా! మరణసమయమున నేమనుకొంటివో! ఎంతనీప్రాణము నొచ్చెనో! కఠినాత్ముఁడైన కళానందుఁడు నను విడిచినాఁడని తలంచితలంచి పొక్కితివి కాఁబోలును. నామీఁదఁ బ్రేమచేత నను వెంబడించితివి. మార్గమున నొక్కనాఁడైన విడకుండఁ గాపాడిన నిన్నెట్లు మఱతునని వాపోవఁజొచ్చెను. విలాపముంబట్టి శ్రావణుఁడు కళానందుని సేవకుఁడని యిందుమతియు దాసియు నెఱింగి వాని నూరార్చిరి. తనకథయంతయు ముగిసిన వెనుక నిందుమతి కంట నీరు బెట్టుకొనుచు రాజనందనునితో నిట్లనియె. "రాజకుమారా! మాతృగర్భమునుండి ధాత్రిపైఁబడిన దాదిగా నింతింతయనరాని యాపదలపాలైతిని. పుణ్యశీలుఁడగు శ్రావణుఁడు రాక్షసుల బారినుండి రక్షించినాఁడని సంతసించుచు నేనుండ నింతలో నంతకన్న నెక్కుడుచేటు నాకు సంప్రాప్తమైనది. ఏనాఁటికిని నాదుఃఖముల కంతములేదు. పాపపుదైవము నాకాయువుపోసి చిరకాలజీవినిగా జేసెను. నాకంత్యకాలము రారాదా! అయ్యో! నాయందుదయయుంచి నాదురవస్థ మాన్పుట కెద్దియేని సాయము జేయ

వేఁడెదనని రోదనముజేయసాగెను. కళానందుఁడు దీనసంరక్షణమునం
దాసక్తిగలవాఁడగుట నామె కభయహస్తమిచ్చి గిరివ్రిజవాసిని గావున
నభిమానము హెచ్చి యెట్టులైన నామెకు సాయమొనర్ప నిశ్చయించు
కొని యాఁగదివిడిచి తనతావున కరిగి నిద్రించెను. ఇందుమతియు ధై
ర్యముఁదెచ్చుకొని దాసిమాటయుఁ దనమాటయు నొక్కటిగ నడవంద
లంచి యారాత్రినిద్రించెను. ఇట్టు లొకకొన్నినాళ్లుచనెను. మఱునాఁ
డు శిశుపాలుఁడు వేఁటనుండి వచ్చెను.

అట్లుండఁ గొండొకనాఁడు గిరివ్రిజమునుండి జరాసంధుని వేగుల
వాండ్రలో నొకఁడగు తురంగకుఁడు తనస్వామియానతి నెద్దియో పనిగలి
గి బహుదేశములు సంచరింపుచుఁ జేదినగరమును బ్రవేశించి మహారాజు
శిశుపాలునిదర్శనముజేసి యతని యిచ్చవొప్పునఁ గొన్నినాళ్లందుండి
యొక్కనాఁడు కళానందుని చూచి యక్కజమొంది "హృదయమా!
ఇంక కుదురుపడుము. స్వామి మనోరథమును నాపుణ్యమును బండినవి"
యని తనలో సంతసించి జాగుసేయరాదని ఱేనియొద్దకుం జనియె. చని
యాతని నొక్కచాటుచోటునకుంబిలిచి చెవిలో రహస్యముగ "మహా
ప్రభూ! యీకళానందుఁడు పరమదుర్మార్గుఁడు. మగధరాజ్యలక్ష్మి కపా
యము నాపాదింపఁ బ్రయత్నించి దేశమునుండి పాఱివచ్చినాఁడు. జరా
సంధుఁ డీతనిఁబట్టి తెచ్చినవారికిఁ బారితోషికము నిత్తునని వేగులవాండ్ర
నెల్ల నానాదేశములకుం బంపియున్నాఁడు. వీనిని స్వేచ్ఛగా విడుతువేని
మనలను భంగపఱచి పాఱిపోవును. చిక్కకచిక్కక చేఁజిక్కిన యిక్కప
టిని విడచిన మనపై జరాసంధునకుఁ దీఱనియలుక వొడమును. కావున
విచ్చుకత్తులుగలభటులఁ జుట్టునిల్పి వీనిని కారాగృహమున బంధింపవల
యును. ఈతఁడు దొరకినాఁడనువార్త మగధరాజునకుఁ దక్షణము నేన
ఱిగి విన్నవించి బహుమానముల నందుకొందును. నాకు సెలవొసంగుఁ"
డని కొండెములు చెప్పి ధనముదొరకుననియు రాజునకు దయగలుగునని

యు మహాసంతోషమున మగధకుం జనియెను. శిశుపాలుఁ డాపల్కులువిని కళానందునిపైఁ గలయభిమానమెల్ల నశింప నతికఠినముగఁ గారాగృహమున నుంచి రేయింబవళ్ళు వానిపై నొక్కకన్నుఁ బరపి జాగరూకతతో వర్తింపఁ జొచ్చెను.

మూఁడవ ప్రకరణము.

వాసుదేవుని వలనఁ దనకుసాయమంపఁబడిన కుశీలవుఁడును వేగులవాఁడును దనవెంటరా జాతవేదుఁడు కొన్ని దినములు పయనమొనర్చి యెట్టకేలకుఁ జేదినగరమును బ్రాపించెను. ప్రయాణముచేసినన్నినాళ్ళు గుశీలవుఁడు కడుమాటనేర్పుతో రుక్మిణిసాధుభావమును సత్యభామ ప్రౌఢతనమును లక్షణ శృంగారలక్షణములును మిత్రవింద యందమును వారిసవతులకయ్యములను, వాసుదేవుని తగవులుదీర్చునేర్పరితనమును మొదలగు ద్వారకానగరవిశేషములు చెప్పి జాతవేదునకు మార్గాయాసము నివారణచేయుచుండెను. చేదిపురమునుబ్రవేశించుటకుము న్నారుబైట జాతవేదుఁడు మార్గమధ్యమునఁ దాల్చుకొనినప్రాఁతవలువలు విడచి మంచిదువ్వలువలు దొడిగికొని చూపరు తనవేసమునుజూచి భళీ యనునట్లొప్పి కుశీలవుంజూచి యిట్లనియెను. ,, ఓయీ! నేను నీకొక్కపరమరహస్యము నెఱిఁగించెద నాలకింపుము. నీకాఁపురము ద్వారకాపురమని యెవ్వరికిని దెలియనీయకుము. శిశుపాలుఁడుఁ దన్నగరవాసులు నిన్నడుగుదురేని గిరివ్రజమునుండి వచ్చువాఁడనని నీవు వాక్రువ్వవలయును. నేనెడనెడఁ బ్రయోగించు టక్కరితనములకెల్ల నీవు తలయూఁచి యూరకుండవలయునే కాని యిదియేమని నన్నడుగరాదు. సరిగదా నానుడివిన తెఱఁగున నీవువర్తింతువేని జరగెడు చిత్రములను జూడు మనుటయుఁ గుశీలవుడు పక్కననవ్వి ,, దేవా! యెంతమాట! కార్యసాధకనిమిత్త

ము మీరుచేయు నింద్రజాలములకు నేను భంగము వాటిలఁజేయుదునే? నేనుమాత్రము వేగులవాఁడనుగానా? తాతకు దగ్గులు నేర్పవలెనే” యని యతనితోఁబయలుదేఱి చేదిపురముం బ్రవేశించెను. నగరమునం దలి గుట్టుమట్టంతయుఁ దెలియకమున్న రాజమందిరముఁజొచ్చుట య పాయకరమని చింతించి యొకపేదబాపనముసలిదానియింట బసయుండి జాతవేదుఁడు మెల్లమెల్ల నాయమ్మకుఁ గొంతవిత్త మొసఁగి కోటలోఁజ రగు వృత్తాంతములఁదెలిసికొనియెను. జాతవేదుఁ డావృద్ధయువతిని బ లుమారు గళానందుఁడను రాచకొడుకు కారాగృహవాసియై యున్న వాఁడాయని యడుగుచురా నామె యెఱుఁగననిచెప్పి యనంతరము గ్రా మమునఁ గనుంగొని కళానందుఁ డాతనిపేరగునో కాదో, కాని యొక ది వ్యమంగళవిగ్రహముఁగల సుందరపురుషుఁడు బంధీకృతుఁడై యున్నవాఁ డని తెలియఁజెప్పెను. ఆపలుకు లాలకించి యాపురుషుండు తప్పక కళా నందుండ కాదలంచి యాతండు తలపంకించి యానాఁటిరేయి శిశుపాలు ని యంతిపురమునకరిగి ద్వారపాలకు నొక్కనింజేరి జరాసంధమహారాజు నొద్దనుండి సందేశముగైకొని యొక మిత్రుఁడు వచ్చినాఁడని శిశుపాలు నకు వర్తమానమంపెను. శిశుపాలుఁడు తత్సమయమున నొకపూలసె జ్జపై మేనుజేర్చి యిందుమతిపై డెందముగూర్చి మరునికాఁకలపాలై బేలయై యంగలార్చుచు రెండుమూఁడుసారులు సేవకుఁడు క్రొత్తవారి రాక విన్నవించినఁ జెవినిడక యెట్టకేలకు వానిమాటవిని చివాలునఁ బాన్పునుండిలేచి “యెవరురా వచ్చినవారు? లోనికిందోడుకొనిరమ్ము పో” మ్మని యానతిచ్చి తానొకపీఠముపైఁ గూరుచుండెను. ప్రతీహారియు ననంతరమున నామనుజద్వయంబును రాజసమ్ముఖమ్మునకుం దోడుకొని వచ్చి తానవలకుంబోవుటయు వారి వారి నర్హాసనములపైఁ గూరుచుండఁ బనిచి మీవృత్తాంతమంతయు నాకుఁదెలియఁబఱుపవలయునని యడిగెను. మార్గాయాసముచేఁ జెన్ను చెదరినవాఁడువోలె జాతవేదుఁ డుస్సురస్సుర

నుచు నాలుగునిమిషము లలసటనభినయించి ఫేనికిట్లులనియెను. మహా
రాజా! మున్నెన్నఁ జేదివారి దర్శనము నొనర్చినవాఁడను గాకున్నను
మీకాప్తుఁడగు మగధేశ్వరుని పాదములు గని పెట్టుకొనియున్న వాఁడన
గుట నేనించుక చనవుఁగైకొని మాటలాడి జరాసంధుని సందేశమెఱిం
గించెద. సావధానులై యాలకింపవలయు ననఁ జేదిరాజు బద్ధకమునెల్ల
దూరమునకుఁ బాఱఁద్రోలి, యిందుమతిపైనున్న మతిని జేఁబిలచి శై
ర్యమును జిక్కబట్టి సావధానుఁడై యుండె.

అంతట జాతవేదుఁడు "దేవా! కొన్ని కారణములనుబట్టి మగ
ధమహీపాలకుఁడు ప్రస్తుతము వాసుదేవునిపై దండువిడియఁడు! మీరు
గిరివ్రజపురమునకు దయచేయఁదలఁపోయుచున్నవారని యెట్లో మగధేశ్వ
రుఁడాకర్ణించి మిమ్మాప్రాంతములకింతలో రావలదని నొక్కి చెప్పుమని
యెను. మీరిచ్చటనేయుండి వాసుదేవుని వ్యూహములు కుట్రలు వేగు
లనంపి యరసి తన కెప్పటి కప్పుడు వర్తమాన మంపవలయునని మఱి
మఱి నాచెవి నిల్లుకట్టుకొని పోరినాఁడు. ఇట్టిసమయమున మీరిల్లువిడిచి
వత్తురేని మాగధునికి మనపైఁ గమునలుక వొడమగలదు. అదియునుగా
క మగధరాజ్యమున కెంతయు ద్రోహముగావింపఁ దలంచుచున్న కళా
నందుఁడను పరమపాతకుఁడొక్కఁడు మీచేతఁ జిక్కినట్లు తెలిసి మనమ
హారాజుపొందెడు నానంద మింతింతయని నేను వర్ణింపఁజాలను. అదురా
త్ముని సత్వరమ తన తావునకుం దోడుకొనిరమ్మని నన్నుబుత్తెంచె. ఆయు
ధపాణులైన కొందఱు రక్షకభటులనిచ్చి యామనుష్యాధముని మనస్వా
మికడ కంపకున్న మనకు మాటదక్కదు. కావున తద్విషయప్రయత్న
ము నొనర్పవలయుఁజుమీ" యని యుపన్యసించుటయు జాతవేదుని నె
మ్మొగమువంక గొన్నినిముసములు తెప్పవాల్పక చూచి రాజిట్లనియెను.
నేను గిరివ్రజమునకురాఁదలంచుటయుఁ గళానందుఁడు నాచేతఁజిక్కుట
యు నిక్కువము. అందు మొదటికార్యము నేను మానఁగలవాఁడ. కాని

నినునమ్మి కళానందుని విడిచిపుచ్చుటకు నాకు మనసు తాళకున్నయది. నీవెవ్వరివాఁడవో సమగ్రముగ నేనెఱుఁగకమున్న జరాసంధుని యానతి చొప్పున వర్తింపనొప్పదుగదా! అన జాతవేదుఁడు మందహాసముతో మోముదమ్మివికసింప రాజేంద్రా! అగువారెవ్వరో కానివారెవ్వరో తెలియనైతివి; జరాసంధునకు నాయందుఁగల దృఢవిశ్వాస మింక నేరియందును లేదు. నీకింతయనుమానము దోఁచినపక్షమున నాకు జరాసంధ మహీవల్లభుం డిట్టియవసరముల నుపయుక్తంబగునంచు నొసఁగిన జాళువా పసిడియుంగరమిదిగో. ఈయానవాలైనఁ గాంచిన మీకుఁ దగునంతనమ్మకము నాయందుఁ బొడమకపోదు." అని యుత్తరీయపుకొంగునఁ గట్టిన యంగుళీయకము విప్పి యప్పుడమిఱేనిచేతం బెట్టెను.

రాజాయుంగరమెంతో గారవమునఁ జేకొని మగధరాజు ముద్రయందున్నదో లేదోయని దీపికఁ దేరఁబనిచి పరీక్షించి తనలో "నిది నిజముగా మనమహారాజు పంపిన సందేశమే కానియెడల నీయుంగర మెట్లితనికివచ్చు? ఈతనివాక్యములు విశ్వాసార్హములు. నేనీతనిచెప్పినచొప్పున వర్తింపఁదగు" నని యాయుంగరముం దనయొద్దనుంచుకొని "యోయీ! నీమాటలు మాకు విశ్వాసనీయముగ నిప్పుడు తోఁచెడిని. మగధరాజ్యమునకుం బోవసమకట్టి యున్నారముగాని యిఁక మానుకొందుము. కళానందుఁ డింతటి కుత్సితుండని యెన్నఁడెఱుఁగక వానికెంతయుఁ జనవొసంగి మన్ననఁ గావించినాఁడ. ఐనను వానినింక జరాసంధునియొద్ద కనిపివైతును. నీవిఁక నేమైన నాతో ముచ్చటింపవలసినయంశములున్నవే?" యని యాశిశుపాలుఁడు పలుకుటయు జాతవేదుఁడు మోదముతో నిట్టులనియెను. మహాత్మా! మీరిందుమతియను మదవతిపైఁ జిత్తము హత్తంబుజేసినారనియుఁ దద్విషయమై యెంతయుఁ బరితాపమొందుచున్నవారనియు నాయింతి యెంతయు గయ్యాళితనమున మీప్రార్థనల కీయకొనలేదనియుఁ గూడ నేను వినియుంటిని. ఆకార్యము

నందు వలయుపనినొనర్చి యామెలనాఁగపొత్తు మీకొనర్పఁగలనను ధై ర్యము నాకుఁగలదు. క్రమక్రమముగా నున్నకొలఁదినిగాని నాసంగతి మీరలెఱుఁగఁజాలరు. అని మఱియు నెద్దియో యనఁబోవుచుండ శిశు పాలుఁడు మహానందముతోఁ దుల్లిపడి లేచి శరీరము పరవశముగా మి త్రుఁడా! నీపేరెవ్వరో యెఱుఁగనుగాని నీమాటలువినినంతనె నాకుఁ బంచప్రాణములు లేచివచ్చినవి. ఎత్తెఱఁగునఁ గార్యము సమాయత్త ముజేసి నాచిత్తమునఁగల యుత్తలపాటు హరియించెదవో చెప్పఁగదే యని మీఁదఁజేయివైచి తట్టుచు నడిగెను. జాతవేదుఁడును జిఱునగవు తో దేవా! నీవంటిపుణ్యజనునకు మేలుసేయుట మాజన్మము పవిత్ర ము జేసికొనుట. ఇక్కడికి మూఁడుక్రోసులు దూరమున మాయేలుబడి కి లోనైన గ్రామము మహిళావతి యనునది కలదు. అందు మాచె ల్లెలున్నది. ఆమె పేరు హేమావతి. నాపేరు మీరడిగినారు ముం దుగాఁ జెప్పమఱచితిని, నను జాతవేదుఁ డందురు. చిన్ననాఁటనుండియు మాహేమావతి వచోచమత్కృతికిని, శత్రువులనైనఁ దనమాటలపొం దికచే వశముజేసికొను నేర్పునకును గడు పేరుమోసినది. దానిం దోడు కొనివచ్చి యీయిందుమతితో నొక్కమాఱు మాటలాడించితి మేని యీయామె దానికివచ్చి మీయిచ్చవచ్చిన తెఱఁగున మసల నంగీకరించు. నాకనుజ్ఞ నొసంగుదురేని నేను సత్వరము రేపు రేపకడ దానింబంపెద. దానిమగఁడును నాకు మఱిదియు నగు మావిశారదుఁ డొకవేళ నన్ను బంధుభావముచే నచ్చట నిలిపినను నిలుపుంగాక. ఒకపల్లకిలో మా హేమావతిం గూరుచుండఁబెట్టి కుశీలవుని సాయమిచ్చి యిచ్చోటునక నిపెద. ఇందుమతిని దానిస్వాధీనముఁ జేయుఁడు. అంతయుఁ జక్కఁబ డఁగలదు. నాకనుజ్ఞ దయచేయుదురేని యిప్పుడు మహిళావతికిం బోవువాఁడ నని ప్రేమ యుట్టిపడునట్లు పలికెను. అమృతవర్షము గు రిసినట్లు తద్వాక్యములు చెవులంబడుటయు శిశుపాలుఁడు తననోఁచి

నోములపంట మూర్తీభవించినదని వానిం గొనియాడి జాతవేదా! నేను నీవాఁడ. నాప్రాణములు నీయవి. నీమేలుమఱువఁజాల, నను రక్షింపవలయును. సత్వరము రావలయుజుమీ యని కౌఁగిలించుకొని వాని నంపి నిద్రింప నరిగెను. జాతవేదుఁడుఁ గుశీలవసమేతుండై యంతఃపురము బాసి యెందేని చనియె. ఆరాత్రి యంతయుఁ జేదినాథుఁడు హేమావతి వచ్చినట్లు తన సెజ్జ మీఁది కిందుమతిం జేర్చినట్లు కలలు పెక్కులుగాంచుచు మెలఁకువవచ్చినపుడెల్ల నిందుమతి యేదని పొరపాటుచే వెదకికొని యంతలో నది స్వప్నమని సిగ్గుపడి నిరాశచే నిట్టూర్పు నిగుడ్చి మఱల నిద్రించుచుండెను.

నాలుగవ ప్రకరణము.

“కలుగునే నాకు మహానందదాయకమగు నిందుమతి బిగియారు కౌఁగిలింత! దొరకునే యెన్నఁడైన మృదుహంసతూలికాశయ్యా నా మెనమ్మేనితో నామేనువాఁకఁ బవళించి సౌఖ్యవారాశి నోలలాడుట! లభియించునే ననుబోఁటి యదృష్టహీనునకు మధ్యమలోక రంభ యగు నాయిందువదనను బట్టపురాణిగా నొనర్చి రాజచక్రమున నెక్కుడుగా రవముగాంచుట! అట్టిసుఖము నాకేలకలుగును.” అని వగచుచు శిశుపాలుఁడు మహిళావతీపురమునుండి యాహేమావతి వచ్చుచున్నదేమో కనుఁగొని రమ్మని సేవకుల నంపి వేకువనె మేలుకాంచి చలచిత్తుఁడై యుండెను. ఆతఁ డెంతచింతాక్రాంతుఁ డయ్యెనో జాతవేదునిచెల్లెలిరాక యాతనికంతదూరమయ్యెను. ఉదయమగుటతోడనే చైద్యుఁడు మహాగ్రహావేశముతో జాతవేదుఁడు మోసగాఁడనియు మాటలయదనమేకాని చేఁతలు ఘాతలని వాని నిందించుచుఁ బ్రభాకరుని యెండతైక్ష్ణ్యము హెచ్చుకొలఁదిని తనతాపాగ్నియుఁ గోపాగ్నియుఁ బ్రజ్వరిల నొడలు

తెలియక పిచ్చివాఁడువోలె భయంకరాకారుఁడై యుండెను. రెండుగడి
యల ప్రొద్దువేళ నెట్టెటో యాతఁ డాకమా ఉద్యానవనమునకుంబో
యి చంద్రికాంతవేదికపైఁ బూలసెజ్జ మేనుజేర్చి యుస్సురుస్సురనుచు
నిందుమతీవిరహాగ్నిం బొరలుచుండ నంత నతిత్వరితముగఁ గుశీలవుఁ డ
రుదెంచి జోహారొనర్చి “పరాకు మహారాజా! పరాకు, హేమావతి
యింక నొకగడియలో దేవరమందిరమునకువచ్చును. ఆమెభర్త జాత
వేదుని రానీయక నిలిపినాఁడు. కావునఁ దన్ను క్షమియింపుమని జాతవే
దుఁడు మఱి మఱి యేలినవారిం బ్రార్థించితినని మనవిజేయుమనియె”
నని విన్నవించెను. వెంటనే ముక్కుచు మూల్గుచు లేవ సత్తువలేక
యుండు నారాజు చప్పున పానుపునుండిలేచి చకచకనడచి మందిరము
చేరియుండునప్పటికి చండభానుండు చేదిరాజు శాసనముననే తైక్ష్ణ్య
ముడిందియెల్లరకు దర్శనీయుఁడై యపరవారినిధిం జొచ్చె. శిశుపాలుని
మనసునం గ్రమ్ముకొన్న కామాంధకారముభాతి నలుదెసలం గాఱుచీఁ
కటులు గ్రమ్మియుండెను. అంత నోంకార నాదములతో బోయలచే
మోయంబడు పల్లకి యొక్కటి కోటగుమ్మముకడఁ గానఁబడుటయు
శిశుపాలుఁడు మేడదిగి వచ్చి యాపల్లకిని మెల్ల మెల్ల నిందుమతియున్న
గదికిందీసికొనిపొమ్మని యానతిచ్చి కుశీలవునిం జేరంబిలిచి నేనాహేమా
వతి నొక్కమాఱు చూడవచ్చునే యని యడిగెను. కుశీలవుండు న
వ్వుచు “దేవా! యీమె పరపురుషులకెన్నఁడును గానంబడదు. పర
మసాధ్వి మహారాజులు సోదరసమానులగుటచే మీకంటఁబడుటకు మీ
ప్రశ్నములకు జాబొసంగుటకు నీయకొనియె. అదియైన నొక్కమాఱేకాని
దినదినమును మీవంటివారికగుపడుటకు సిగ్గుపడును. కావలసిన నిప్పు
డే యొక్కసారి మీరు ముచ్చటింపవచ్చును.” అని యుత్తరమిచ్చెను.
హేమావతి పల్లకిడిగ్గి యిందుమతియొద్దనున్న దాసియొక్కర్తు తనకాగది
లోనికిం దారిజూప నందుఁ బ్రవేశించి యొకపీఠముపైనఁ గూరుచుండె

ను. అతిథియైవచ్చిన యాసుందరాంగిని గడుమన్నన సేయుమని రాజా నతిచ్చుటచే దాసియు దానితో నిందుమతియు నామెను గారవించిరే కాని యామె యెవ్వరో యేలవచ్చినదో వారెఱుఁగరు. హేమావతి కూరుచున్న కొన్నినిమిషములకుఁ గుశీలవుఁ డరుదెంచి " యమ్మా మహారాజుగారు తమసందర్శనముఁ జేయఁగోరుచున్నవారు. వారుమీకు సోదరప్రాయులగుటచేఁ దమరు సంశయింపఁ బనిలేదుసుఁడీ" యని పలికెను. హేమావతి సిగ్గునఁ దలవంచుకొని యూరకుండుటచేఁ గుశీలవుం డది యంగీకారసూచకమే యని నిశ్చయించి మహారాజును దోడు కొనివచ్చెను.

మహీకాంతునిఁగాంచి కాంతలెల్ల దిగ్గునలేచి నిలిచిరి. కుశీలవుఁడు రాజున కొకపీఠమువైవ నాతం డందుఁ గూరుచుండెను. అంతఁ గొంతసేపు వారెవ్వరు నోరెత్తక నిశ్శబ్దముగ నిలిచియుండ, రాజు హేమావతింజూచి యిట్లులనియె. అమ్మా! నీవు పుట్టినింటికి వచ్చినట్లు భావింపవలయునుగాని యన్యథా యెంచవలదు. జాతవేదుఁడు నేనును నీకు సోదరులమే. నీయిచ్చవచ్చినన్ని దినంబులు నీయిచ్చవచ్చినట్టు లిచ్చట నుండి యనంతరము నీగృహమున కరుగవచ్చు. మీయన్నగారు నీతో నంతయు నామూలాగ్రముగఁ జెప్పియుండవచ్చునని నేఁదలంచెదను." అనవుడు హేమావతి సిగ్గునఁ గొంచెమునే పూరకుండి మొగమింకొకవైపునకుఁ ద్రిప్పి రాజునుద్దేశించి యిట్లనియెను. దేవా! మాయన్నగారు నన్ను బలవంతమున నిటకనిపె. సోదరునిమాటఁ ద్రోసివేయఁజాలకయు సోదరతుల్యులగు రాజుగారిమాట యుపేక్షణీయముగాదనియును నాప్రాణేశ్వరునట్లో యొడంబఱిచి యిటవచ్చితిని. పుట్టి బుద్ధియెఱిఁగిన తరువాతఁ బరపురుషులతో నేను సంభాషించి యెఱుఁగను సరియేకదా వారి మొగములు పొరపాటుననైనఁ జూచియుండలేదు. అందుచే నాకిపుడుద క్క యేలినవారు మరలదర్శనమీయవలదని నేను మనవి చేసికొందును.

అంతియుకాదు. నాగదిలోనికి నేనుండునంతకాలము నన్యపురుషులు స్త్రీలు రా వలనుపడదు. ఇందునకు మీరంగీకరించి యందఱకుఁ గరిగనమైన యుత్తరవొసంగుడు లేని యిందుండుదానఁ గాని-చో నని యింక నేమేమో చెప్పఁబోవుచుండఁగా శిశుపాలుఁడు మాట కడ్డమువచ్చి “నీయిచ్చవచ్చినట్టులుండుము. స్త్రీలయిన నీవు వసియించు నాగారముదరికి రాకుండఁజేసెద. శిశుపాలుఁడు చండశాసనుండనుట నీవెఱుంగవే! ఇఁక నే భోజనమునకరిగెద. ఈదాసి నీవడిగినపదార్థమునెల్ల నీకిచ్చు. ఇదికాక మీకుశీలవుఁడు మీకున్నవాఁడుగదా! యని చెప్పి లోనికింజనియెను. శిశుపాలుఁడున్నంతసేపు నిందుమతి గుండెలు దడదడఁగొట్టుకొనసాగెను. ఆతఁడు గదివిడచిచనినపిదపఁ గుదుటఁబడుటయు నామె యీక్రొత్తజవ్వని యేలవచ్చెనని తలపోఁతలకుంజొచ్చెను. దాసి యంతట బంగరు పళ్లెరములతో నారగింపఁ బంచభక్ష్యపరమాన్నములు దెచ్చి నివేదింప నిందుమతి యేదోదైన్యముతో నారగించెను. హేమావతి చింతయేమియు లేక భుజించెను.

భోజనానంతరమునఁ గొంతవఱకు, శిశుపాలునిచర్యలు, లోకవ్యవహారములు మొదలగునవి చెప్పుకొని కాలముంబుచ్చిరి. మాటలసందడిలో నొకమా ఱిందుమతి హేమావతింజూచి “యమ్మా! మీరెవ్వరో యేల యిచ్చటకరుదెంచిరో నాకెఱిఁగింపఁగలరా”యనెను. అనవుడు నామే ముహూర్తమాత్రముసేపు యోజించి యెట్టకేల కీచందమునఁబలుకఁదొడఁగెను. అమ్మా! నాజన్మవృత్తాంతమంతయు నీకేల? నాపేరు హేమావతి. జాతవేదుఁడను నాయన్నగారు జరాసంధుని యొద్దనుండి శిశుపాలుని యొద్దకువచ్చినాఁడు. కళానందుఁడు మగధరాజ్యమునకు ద్రోహముఁ జేయఁదలఁచుచు దైవవశమునఁనిటఁజిక్కె. ఈతనిని మగధరాజునొద్దకుం దోడుకొని మాయన్న యరుగు నన నిందుమతి మొగము వెలవెలఁబాఱ శరీరము గాలితాఁకునంగదలు తీవచాడ్పున వడఁకఁ గన్నుల నీరు

గ్రమ్మ నోటమాట లేక యుండెను. హేమావతియు దాసియు నామెను బట్టి యూరార్చిరి. ఆదుఃఖకారణ మెద్దియని హేమావతి పలుమాఱు నొక్కి యడుగ గద్గదకంఠయై యిందుమతి యిట్లనియె. హా! దైవమా! ఏనాఁటికానాఁడె నాకోర్కులు భగ్నముజేసి నన్నడఁచివేయుచుంటివి! నన్ను జెఱనుండి విముక్తురాలను జేయుదునన్నందులకుఁ గాఁబోలు కళానందునకుఁ గూడ నిందు మహాపద మూఁడఁదలఁచియున్నది! ఈమంద భాగ్యురాలిని రక్షింపఁదలఁపకున్న నాకళానందుఁడైన బ్రదుకుఁగదా! కటకటా! జరాసంధునిచేతఁ గళానందుఁడు చిక్కుట పులినోట మేకపిల్లవడుటఁగాదె! ఇంక నాతనికి బ్రదుకెక్కడిది! అమ్మా! నీసోదరుఁడెంత ఘాత యొనర్చునమ్మా! అయ్యయో! ఇదెరాజకార్యముకదా! ఆయన లోపమేమున్నది. హా! కళానందా! నన్నీపరమదుర్మార్గుల మధ్యమునఁ బాఱవైచి నీవరిగెదవే! అయ్యో! అమ్మకడుపునఁ బుట్టినదిమొదలు పట్టుమని యొక్కనాఁడైన హాయిగా నిదురింపనైతి. దినదినగండము వేయియేండ్లాయు వన్నట్లు మొండినై జీవించుచున్నాను. హేమావతి తల్లీ! నాకేమయిన గతిచెప్పుమమ్మా!" యని యామె పాదములపైఁబడి వెక్కి వెక్కి యేడువనారంభించెను. హేమావతియు నామెనూఱడించి ధైర్యముఁజెప్పి దాసినావలకుంజనుమని "యిందుమతీ! నిన్ను దనకుఁగూర్చుమని శిశుపాలుఁడు ననురావించినాఁడు. నీకొక్కయాలోచనము నెఱింగించెదవినుము" అని యెద్దియో యొకజామునేపామె కుపదేశించెను. అతిశ్రద్ధతో నాయుపన్యాసమంతయు నాలకించి యిందుమతి యూరటపుమాటలు తన కమితధైర్యముఁబుట్టింపఁ "హేమావతీ! నీవు నాతల్లివి. మాయమ్మ ఋణనుజచ్చి నీరూపమున నవతరించెనని తోఁచెను." అని దాసింబిలిచి "యోసీ! మహారాజుగారి కుత్తరము వ్రాయవలయు నొకకలమును దీసికొనిర"మ్మని చెప్పెను. అదివఱకు శిశుపాలునిపేరువిన్న నేవగించుకొను నిందుమతి యూతనికుత్తరము వ్రా

యఁదలఁచుట యెంతయేని యాశ్చర్యముగా నెంచుకొని కలముదెచ్చి యిచ్చెను. ఇందుమతి యొకజాబువ్రాసి దివ్వెవెలుఁగున హేమావతికిం జూపి యామెయు నది చక్కఁగా నున్నదనిన వెనుక మడఁచి యొకచో దాఁచి యెంతయుసంతసించెను. హేమావతియుఁ గొంతసేపటికి గుఱ్ఱుపట్టి నిద్రించెను. దాసిమాత్రము కలవరపడి యీమాయకు నచ్చెరువడి నిద్రపట్టక ప్రక్కమీఁదఁ బొరల నారంభించెను.

ఐదవప్రకరణము.

"హృదయేశ్వరా! తమరసికతయు నాయందలి గాఢానురాగమును దెలియఁజాలక యింతకాలము బేలనై మీప్రార్థనలకుఁ బెడచెవియొగ్గితి. చేదిపురమునకువచ్చిన నాఁటఁగోలె దేవరవారి గుణములు చెవులారవినుటఁబట్టియుఁ, దమచర్యలు కన్నులారఁ గాంచుటంబట్టియు, మీపై నాచిత్తము హత్తియుండి యెద్దియుందోఁచకున్నది. చూడఁ జూడ నీవ పుణ్యజనాగ్రగణ్యుఁడవనియు, నీవ యోగ్యుఁడవనియు, నీవ రసికుఁడవనియు నామదికి దృఢముగా నచ్చినయది. మీకు శాశ్వతసౌఖ్యము గలుగఁజేయఁ మనమున సంకల్పించియున్నదాన. మీకేలువట్టుటకన్న నాకు నెక్కుడు భాగ్యమున్నదే. ఐన మాచుట్టపక్కములనందఱం బిలువనంపి వారువచ్చినవెనుక వివాహము జరగించుకొనుఁడని వేఁడుకొనుచున్నాను. నాకింక నిముస మొక్కమహాయుగముగఁ దోఁచుచున్నది. తాళఁజాల. కావునఁ దత్క్షణము నాకీచెఱనుండి విముక్తి గలుగఁజేయఁ గోరుచున్నదాన. శిశుపాలమహారాజు నాధనము. ఇందుమతి శిశుపాలునిధనము. ఇంతకాలము నాయొనర్చిన యవివేకవర్తనమును మన్నింపవలయు" నని యున్న యొకజాబుఁ జదువుకొనుచు శిశుపాలుం డుదయమునఁ దన యంతిపురమున నొకచోఁ గూరుచుండెను.

ఆకమ్మఁ దెచ్చి యిచ్చినదాసి తోడనే యక్కడనుండి తన నెలవునకుఁ బో యె. మహారాజు జాబు మొదటనుండి తుదవఱకు నత్యంతానందము తోఁ జదువుకొని యామాటల తియ్యఁదనముచే నాజాబు విడువఁజాలక పదిసారులు చదివి యందలి ప్రత్యక్షరసౌష్టవమునకును, బ్రతిపదమార్ద వమునకును దనలోఁ దాన మఱియుచు నానందపారావారమున నోలలా డఁదొడఁగెను. ఇఁక జాబు కన్నులనద్దుకొని హాయిహాయియని యొక్క మాఱును, హృదయమా! నీవింకశాంతినొందుమని యొక్కమాఱును కామదేవా! నీవు నాపై విక్రమించి యధికారము చేయు కాలము గడ చినదిసుమీ యని యొక్కమాఱును, హా! యిందుమతీ! నామనసు ప ట్టఁజాలక నన్నింతకాలము చిక్కులపాలు చేసితివికదా. నిజము నిలుక డమీఁదఁ దెలియకపోదుసుమీ యని యొక్కమాఱును, కరభమహాము ని నాపైఁ గినుకవొడమిన నేమి, వ్రతము సెడిన ఫలముదక్కినట్లు నాహృ దయేశ్వరి, యిందుమతి, నాపాలఁబడినదని యొక్కమాఱును దలపో యుచు క్షణక్షణము చిత్తభ్రమకులోనై అబ్బా! చుట్టములు వచ్చు దాఁక నన్నాగుమన్నది. ఈవిరహము సైఁప శిశుపాలుని వశమా? యి ప్పుడే యేలపోయి యామెలనాఁగ బిగియారు కౌఁగిలిఁ జేరరాదు! కా దుకాదు, కాముకులు వేగిరమునఁ బ్రణయిజనమునకు నలుకవొడమిం చినచోఁ గార్యము చెడునని పరిపరివిధములఁ జింతించుచుండెను. ఇట్లిం దుమతియందుఁ దగిలిన డెందముతో నాతఁడు భోజనంబు మఱచి ప్రొ ద్దగుదాఁక మహాశనమునకుం జనకునికి సేవకులువచ్చి మధ్యాహ్నమైన దని విన్నవించి యొట్టెటో లోనికిం దీసికొనిపోయి యారగింపఁ జేసిరి.

భోజనానంతరమునందు మహారాజు కొంతశాంతమునొంది తన ట్టి మహోపకారముఁ గావించిన హేమావతిం జూడఁదలఁచుకొనుచుండ నింతలో దాసిడాసి " దేవా! హేమావతి యింటికింజనుటకు సెలవు వేఁడుచున్నయది. అత్తవారింటఁ గాఁపురము సేయుచున్నదగుట సిటఁ

దడవుచేసిన నెగ్గగుననిమనవి చేయుచున్నది. దేవరవారిసెల వెప్పుడైన నప్పుడ శ్రీమ్మఅవత్తునని చెప్పుచున్నది. ఆనెలఁతను నిలుపుట మనకు ను శ్రేయముకా” దని విన్నవింప నించుకయోజించి యది యట్టిదికాఁ దలఁచి ప్రయాణమునకు సమ్మతించి పల్లకిబోయల నాయత్తముచేయుదు మని సేవకులకానతిచ్చెను. దాసియు హేమావతితో రాజుగారియుత్త రువుఁజెప్పి పయనమై యుండుమనియె. అంతలోఁ బల్లకి బోయలు మో సికొనివచ్చి యాగదిముందరదించిరి. కతిపయదినముల మైత్రియైనను హేమావతికిం దనకు మనసుకలియుటచే నిందుమతి యామె నెడఁబాయఁ జాలక బెంగగొని కంటఁదడిబెట్టుకొనుచు నిలిచెను. హేమావతి పల్లకి లోఁ గూరుచుండఁ జనుచు నిందుమతిని బుజ్జగించి తనచెప్పిన దారిద్రొ క్కిన సకలసౌఖ్యములు సేకుఱునని నొక్కిచెప్పెను. అంతలో మహా రాజచ్చోటికరుదెంచి హేమావతి నుద్దేశించి “ అమ్మా! నీవు నానిమి త్తము పడిన శ్రమకు నీకునేను బ్రత్యుపకార మెట్లుసేయుదు. అయిన నామనంబు సంతసించునట్లు నీ వీపసదనముల గ్రహింపవలయు” నని కొన్నినగలు, సన్ననివలువలు కుశీలవుని చేతికిచ్చి యామె కిమ్మనెను. హేమావతి యాభూషణంబులందుకొని పల్లకిలోఁ గూరుచుండ రాజు కుశీలవుని జూచి “ నీవీమెతో నరిగి యీమె నింటికడ నప్పగించి జాతవే దుని జూడ కునికి నాకెద్దియుం దోఁచుటలేదనియు సత్వరము ర”మ్మని యుంజెప్పి వానినంపెను. బోయలు పల్లకి మోసికొనిపోవుచు క్షణకాల మున నచ్చటివారి దృష్టపథమునుండి దాఁటిచనిరి. ఆమె చనిన కొంత సేపుదనుక నిందుమతి వగచి దాసితో హేమావతి కలిసికట్టుతనమును, వచోచమత్కృతియుఁ గార్యసాధకతయందలి నేర్పరితనమును వెయినోళ్ళఁ బొగడుచు నామె సహవాసము లేనందులకుఁ గుందసాగెను. శిశుపాలుని మతి యిందుమతీవివాహమునందు లీనమైయుండె లోకవ్యవహారము మ ఱచి జాతవేదునికై నిరీక్షించుచున్నది.

తన పన్నినపన్నుగడ కొంతవఱకు సాగినందులకు ముదమందుచు జాతవేదుఁడు కుశీలవునితోఁ గూడ మఱునాఁడు సంజవేళఁ జేదినగరమునకుఁ జని మహారాజును సందర్శించెను. జాతవేదుని దర్శనము మహారాజునకుఁ గుతూహల జనకముగ నుండుటచే నాతనిఁ గాంచుటయు దిగ్గున లేచి "మిత్రరత్నమా! యరుదెంచితే. ఈ రెండుదినములు దుర్దినములట్లు నాకుఁదోఁచినవి. మిత్రదర్శనము లేకున్న మాముఖాంభోజములు వికాసముదప్పియుండుట యొక్కయచ్చెరువే. రమ్మిటఁగూర్చుండు" మని పీఠముంజూపెను. జాతవేదుఁడు నందుఁ గూరుచుండి మెల్లమెల్ల రాజుతో "దేవా! మాచెల్లెలు తమయానతి చొప్పున వర్తించినదికదా" యని యడిగెను. ఆపలుకులకుఱేఁడు చిఱునగవునగి "సరిసరి వర్తించినదికదా యని మెల్లఁగ నడుగుచున్నావా? మీచెలియలినేర్పరితనమును దానివాగ్రచనయు నెట్టివియో నే నెఱుఁగను గాని నాపేరువినినప్పుడు గజగజ వడఁకునట్టి యిందుమతి నాపై వలపు నిలిపి నాకుత్తరము వ్రాసినది. ఆహా! ఏమి హేమావతి! నీసోదరియైన యామె నేర్పరితనమునఁ గొదువగ నుండ నేర్చునే? ఆమె మాటలకే కాక రూపమునకుఁగూడ నచ్చుముగ నిన్నుఁబోలి నీకుఁ జెలియ లనఁదగియున్నది. ఇందుమతి వివాహ మగుదాఁక నాడగ్గఱ నుండవలయు జుమీ నెచ్చెలీ!" యని శ్లాఘించి వేఁడుకొనెను. ఆమాటలలోఁ గడపటిది తన కిష్టముగాకున్నను రాజునకలుకవొడము ననుసందియముతో వల్లెయని మాటలచే నాసంగతి మఱపించి జాతవేదుఁ డిట్లనియె. "దేవా! నేనువచ్చినకార్యము దేవరవారు మఱచినారు. గిరివ్రజమునకు మీరింతలో రానక్కఱ లేదనియుఁ గళానందుని నాతోడ నంపుమనియు మగధరాజు మీకు సందేశ మంపినందున నే నిందులకు వచ్చితిని. నాయిచ్చవచ్చినట్లు నే నిందుఁ దడవుమసలినఁ జండశాసనుఁ డగు మగధనాయకుఁడు మనయిరుగురపై నలుగు. అతని కలుకవొడమించుట గాఱువిచ్చున నుఱు

కుట. మీకు సందియము నాయెడఁ దోఁచనేరాదు. తోఁచిన నీయుంగరముంగనుంగొని నాసందేశము మాగధునిదిగా నిశ్చయింపఁజనుఁగదా ! కళానందుని గిరివ్రజమున విడిచిపుచ్చి యిందుమతి చుట్టములఁ బక్కముల నెచ్చెలులఁ దోడఁదీసికొని యొకమాసమునకు నేనిట కరుదెంచి యిందుమతీవివాహము కనులారఁ గాంచి యానందింతు. కావున నాకు శెపు మొదల దయసేయవలయు. రాజునానతి నతిక్రమించి వర్తింపనెఱిచి యిట్లు దేవరవారి కెదురాడవలసినందుల కెంతయు సిగ్గుపడుచున్నవాఁడ నన్ను క్షమియించి సెలవొసంగుఁడు.” అని జాతవేదుఁడు వేఁడుకొనుటయు శిశుపాలుఁడాలోకించుక యోజించి తాను బలిమిచే జాతవేదునినాపుట మగధేశ్వరున కకారణము యలుక పుట్టించుట యగుననియు నాతఁడు నిశ్చయముగ మగధరాజుచే నంపఁబడిన యాప్తుఁడనియు నమ్మి యాతనితో నిట్లనియె “ మిత్రుఁడా ! నిన్ను జరాసంధుఁడే నాయొద్దకుఁబుత్తెంచెననుమాట నిశ్చయము. కళానందుని సత్వరము గిరివ్రజమునకనుపకున్న నా మహారాజు మనలపై నలుగుట సత్యమేకాని నినుజూచినది మొదలు నినువిడువ మనసురాకున్నది. అఘటన ఘటనాసమర్థుఁడ వగు నీవపరపరమేష్ఠివని తోఁచుచున్నది. ఇందుమతి బంధుగులనెల్ల వెంటఁబెట్టుకొని వత్తునని నీవు నామీఁద నొట్టుబెట్టుకొందువేని నినుబంపెద. అన జాతవేదుఁడు నగి “ దేవా! ఎంతమాట ! మీతో వాగ్దానముఁ జేసి మరల రాకుండుటకు నామనసు నిలుచునే! మీతోడు. నేను తప్పక వచ్చువాఁడ” నని యొట్టుబెట్టుకొనెను. తరువాత శిశుపాలుఁడు వారిపయనము మఱునాఁ డుదయముననే యని నిశ్చయించి భోజనమున కుంజని జాతవేదునితోఁ గూడ సంతోషములో విందారగించెను. భోజనానంతరమున నాతఁడు కళానందుని బిలువనంపి యాతనితో నిట్లనియె.

“ ఓయీ ! కళానందా సాటిరాచవాఁడవనియుఁ గళావిదుఁడవనియు నిన్నెంతయు గౌరవించితిని. నాకుఁ బ్రత్యక్షమున నపకారముసేయకున్న

మాకుం బూజనీయుఁడగుజరాసంధుని కెగ్గు దలపెట్టిన కారణమున నీవు మాకుఁ బగతుఁడవు మగధరాజ్యమునకు వినాశముఁదలపెట్టుట స్వవినాశముగోరి తెచ్చుకొనుట. గిరివ్రజమునఁబుట్టి పెరిగి యామహీపాలునిచే ననేకములగు నుపకారములఁ బడసి తుదకాతనికి హానిచేయ యత్నించుట నీకుఁ దగినదికాని మఱియొకనికిందగదు. అయినం దీతు వాకసము నిలుపఁ గాలు పైకిఁ జాపినట్లు నీవంటి యప్రయోజకుఁడు మగధరాజ్యమున కేమికీడు గావింపఁ గలఁడు? నీచక్కఁదనము నీపడుచుపాయము నీవిద్యావైభవముఁ జూడ నేమనుటకు నేమిసేయుటకు నాకు మనసురాదు. నీవు నాతావుననుండ జరాసంధుఁడెఱిఁగి నిన్నుందోడితెమ్మని యీ జాతవేదునంపె. వీనితో నీకు తేపుదయముననే పయనము. నీయాయుష్కాలము ముగియుటచేతనే నీకింతచెడుబుద్ధి పుట్టినది." అని శిశుపాలుఁడు మందలించుటయుఁ గళానందుఁడు తద్వచనశ్రవణమున మొగము రక్తవిహీనమై చిన్నబోవఁ దనయంత్యకాలము సమీపించినదని నిశ్చయించుకొని సౌందర్యతిలక తనపైనిలిపిన యనురాగము తుదకీ చందమునఁ బరిణమించినదనియుఁ దనముసలితల్లి యీమాటవినినపక్షమునఁ దక్షణము గుండియలుపగిలి చచ్చుననియు వగచి దైవికమునకుఁ బ్రతిక్రియ మనుష్యయత్నమున లేదనియెఱిఁగి శిశుపాలుని మాటలకుఁ బ్రత్యుత్తరముసెప్పక నిలిచియుండెను. అనంతర మిరుగురుసేవకులఁ బిలిచి రాజు కళానందుని యథాస్థానమునకుం గొంపొవుఁడని యానతిచ్చెను.

అతఁ డవ్వలకరిగినవెనుకఁ జేదిరాజు జాతవేదుని నెమ్మొగముఁ గనుంగొని యిట్లనియె. “మిత్రుఁడా! నామనసు సహజకఠినమైనదయ్యు నీతని యవస్థకు మిగులం జాలినొందుచున్నది. ఈతనిఁగాంచిననాఁటఁగోలె వీనియందు నాకతిస్నేహమైనది. ఇందులకుఁ గారణమరయఁజాల చక్కఁదనమునకా భూలోకజయంతుఁడు, చదువులకా పుంభావసరస్వతి, చేసినదా రాజద్రోహము; అట్లని హానిసేయ మనసురాదు; ఇట్లని

యూరకుండరాదు. వీనినెట్లయిన రక్షించి నాకడ నిలుపవలయునని కోరుచున్నాఁడ దీనికి నీవేమందువు? అనవుడు వెడనవ్వు మొగమున వెలయ జాతవేదుఁడు రాజుతో “ మహారాజ! రాజద్రోహము సకలపాతకములలో నెక్కుడు. అనృతము మొదలగు పాతకముల నొనరించిన మనుజుఁడు తానె చెడు. కాని రాజద్రోహము సేయువాఁడు దేశమునకంతకును హానిదెచ్చును. మీరు వీనివిషయమై పాపముదలఁపరాదు. ఈకళానందుఁడు శిక్షార్హుఁడు. ఈతఁడు చక్కఁదనమున మదనునట్టులొప్పియుండి కార్యముల నతిద్రోహబుద్ధి పూనియున్నవాఁడు. కాఁబట్టి యీతని దక్షణము జరాసంధునొద్ద కనుపుట యుక్తకరము. ఇదిగాక యిందొకరహస్యమున్నది. ఇందుమతి యీతనిసోయగ మొక్కమాఱు పొరపాటునఁగాంచిన నీయందు హత్తినడెంద మాతనిపై నిలుపుట నిశ్చయము. మీ కెఱుఁగనిదేమున్నది. ఆఁడువాండ్ర చిత్తములు చంచలములగుట జగత్ప్రసిద్ధముకదా. ఆమె హృదయమటుతిరిగెనా యిటుతిప్పుట కేరితరమును గాదుసుమీ!” యని యాతనికి నమ్మకము దోఁచునట్లు పలికెను. పూర్వోదాహృతములగు కారణములలోఁ గడపటిది శిశుపాలుని మనసునకు గాటముగ నాటుటఁజేసి మఱునాఁడుదయమునఁ గళానందుని ప్రయాణము నిశ్చయించి జాతవేదుఁడొక్కఁడు వానింగొనిపోవ నోపండని రత్నఖేటుఁడను నొక్క దండనాథుని మఱినలుగురు వీరభటుల సాయమిచ్చి తేపకడ జనుమని యానతిచ్చెను.

కళానందుని పయనమునుగూర్చి యాయిందుమతి దాసివలన విని మునుపటియట్టు లంతగాఁ బైకివాపోవదయ్యె. హేమాంవతి వచ్చిన దాది యిందుమతియవస్థలో నెంతయు మార్పుగలుగుటకు దాసి యక్కజమంది కారణము నిజస్థితియు నెఱుంగక కలవరపడసాగెను. కళానందుఁడు మృత్యుముఖమున కరుగుచున్నాఁ డని మున్ను దుఃఖించినదయ్యు నేఁడూరకుండెనే కాని యేకారణము చేతనో రాత్రి యామెకంటికి నిదు

రరాక మనఃక్షోభ మొందసాగెను. మఱునాఁ డుదయమున జాతివేదుఁడు పెందలకడలేచి రత్నఖేట ప్రముఖులఁ బిలిచి కళానందుని వెంటఁబెట్టుకొని శిశుపాలునియొద్ద సెలవుదీసికొని బయలుదేఱెను.

ఆఱవ ప్రకరణము.

“ అట్లాయోగిని ముద్దుటుంగరమును గైకొని కైలాసంబున కరిగివత్తునని చెప్పి చాలకాలమైనది. లోకమాతయగు గిరికన్య మావిషయమై యేమనినదో యెఱుఁగనైతి. నిశ్చయముగ నామె యోగినియో మమువంచింపఁదలఁచి యొరులచేనంపఁబడిన రాక్షసాంగనయో నాకుఁ దెలియకున్నది. మామహారాజు పెక్కుచిక్కులలోఁ దగుల్కొని యున్నవాఁడు. మున్నాప్తులైన రాకొమరులనేకులు నేఁడు కారణాంతరమునఁ బగఱయై కత్తిగట్టనుంకించుచున్నవారు. నాకతమునఁ జంద్రపాలుఁడుకూడ మహారాజునకు శత్రుపక్షములోనివాఁడగును గాఁబోలు. నాసాహసహృదయము సౌందర్యతిలకపై నేలహత్తుకొనవలయు. చంద్రపాలుఁ డాపూవుఁబోఁడిని నాకొసఁగునే? అంతటిభాగ్యమానాకు? ఈదినమునఁ జంద్రపాలుఁడు తనయభిప్రాయమును జరాసంధునకు విన్నవించునఁట నేనిప్పు డక్కడకరిగెదఁగాక. అని తనలోఁదాను శంకించుకొనుచు రణార్ణవుఁడు గృహమువెడలి రాజమందిరమున కరిగెను. ఇంతలో మహారాజునొద్దకు జంద్రపాలుఁడు రాఁదలఁచుకొని సింగమువసియించు గుహాకుం జనుమేఁకపోతువలె బెదరసాగెను. తనకూఁతురను రణార్ణవున కిచ్చుట వలనుపడదని క్రూరకర్మనిరతుఁడగు మహారాజుతో నెట్లువిన్నవింతునని చంద్రపాలుఁడును, తనకతమునఁ దండ్రికింతవందురుట చేకురెనని గుణోత్తమయు నాదినమున, రాజు వృద్ధుఁడగు చంద్రపాలునిపై నలిగి యేమిచేయునో యని యందఱును డెందములఁ

రాయివడినట్లు చింతాకాంతులైరి. చంద్రిపాలుఁడాదినమున ను దయముననే మేలుకాంచి యిలువేల్పులకు మ్రొక్కి యప్పుడప్పుడే యు దయశైలము నలంకరించిన భగవంతుండగు ప్రిభాకరునకు నంజలి యొనర్చి యొక్క యరదముపై నెక్కి రాజగృహమునకరిగెను. జరాసం ధునొద్దకరుగుచున్న జనకునిగాంచి కూఁతురు కంటనీరుదెచ్చుకొని రాగ లతికతో " నోసీ! మాయయ్య మరల నాకన్నులకుఁ గానఁబడునే. అకటా! నానిమిత్తమున మాయప్పకిపు డెట్టికీడుమూఁడనున్నదో" యని యంగలార్చుచుండ రాగలతికయుఁ దనకుఁగల భయమునదియే యగుట నించుక శంకించి తానువగచిన గుణోత్తమబొత్తుగ నాఁగజాలద ని ధైర్యముచెప్పి దుఃఖోపశమనముఁగావించెను. బాలికయు నాపూఁట చలిది యారగింపక తండ్రి వచ్చినవెనుక నాతనితోఁగూడ భుజింతునని యూరకుండెను.

అటఁ జంద్రిపాలుఁడరుగకమున్న రణార్ణవుఁడు పరుగుపరుగున నప్పుడప్పుడేలేచి కాల్యకృత్యములు దీర్చుకొని కూరుచుండిన నృపాలు నిపాలికేఁజని వందనములు గావించి వినయమెసఁగ నొకచోఁ గూరు చుండెను.

అత్తఱి మహారాజుమొగము విచారసూచకమై యత్యంతమనః క్షోభమును దెలుపుచుండెను. కొండొకతడవొండొరులతోఁ బలుకక వారూరకయుండ నెట్టకేలకు జరాసంధుఁడిట్లనియె. ఉంగరముం గేతకీ దళమునుంగూడఁ గైకొని యోగిని యెంతకాలమయ్యె నిచ్చటనుండిచని? ఇంక నామెవచ్చునను నమ్మకము నీకుఁగలదే? అనవుడు రణార్ణవుండు భయమున వెలవెలఁబోవు మొగముతో నిట్లనియె. " దేవా! ఆమె కైలాసమునకుఁబోయి శార్వాణితోఁ బ్రసంగించి తప్పకవచ్చునను నమ్మ కముకలదు. వేగరపడినం గార్యము చెడునుగదా!" అని మఱియు నేమో యనఁబోవునప్పటికిఁ బ్రతీహారి కట్టెదుట నిలిచి " దేవా! చంద్రపాలుఁడు

వచ్చి దేవరదర్శనముం గోరుచున్నవాఁడు. ముదలయయ్యెనేని తోడుకొనివచ్చెద" నని విన్నపముగావింప వానిం దోడుకొనిరమ్మని యానతిచ్చి రాజు రణార్ణవునితో "వత్సా! ఈదినముననే చంద్రపాలుఁడు తన కూఁతును నీకొసంగునదియు లేనిదియుఁ దెలియఁజెప్పవచ్చు. నీవిచ్చటనుండరాదు. ఆప్రక్క గదిలోనికిం జను" మని యనిపెను. ఇంతలోఁ జంద్రపాలుఁడును మెల్లమెల్ల సౌధాంతరముం జొచ్చి ఱేనిసన్నిధికిం జని యభివందనమాచరించి యాతని యెట్టయెదుట నొకయుచితాసనమునఁ గూరుచుండెను. మగధదేశవ్యవహారము లొకకొన్ని యాతనితో ముచ్చటించి భూమిపాలుఁడు చంద్రపాలునితో నిట్లనియె. "ఆయుష్మంతియైన సౌందర్యతిలక వివాహమునుమాట యేమిచేసితివి. మా రణార్ణవునకిచ్చి నాతోడ వియ్యమొంది నాముద్దుచెల్లించి రాజబంధువుఁడవై గౌరవమొందుదువుగాక యని నాతలంపు నీయభిప్రాయము నేమియుందాఁపక నాకడ వెల్లడిచేయునది." యని యానతిచ్చుటయుఁ జంద్రపాలుఁడు తనయవస్థ మిగుల నపాయకరమైనదని యెఱిఁగియుఁ గుమారిక యభిమతముం దెలుపనిర్ణయించి ఱేని కభిముఖుఁడై చేతులు జోడించి యిట్లని విన్నవించె. "రాజేంద్రా! రాజులకు న్యాయపరిపాలనము నిసర్గమగుట నాకు న్యాయమె జరగునను ధైర్యము కలదు. మీరడిగిన యర్థమున నాపను మనోవ్యాకుల మిట్టిదనియు నింతయనియుఁ జెప్పఁజాల. వెనకకువచ్చిన నూయియు ముందుకువచ్చిన గోయియుగా నున్నది. నాయాపద నార్చువారుఁ దీర్చువారు మీరుదక్క యన్యులులేరు. నన్నుగూర్చి మీరు జాలివడుదురను దృఢవిశ్వాసముతో మనసులో నున్నదంతయు వెడలఁగ్రక్కనిటవచ్చితి. నాకుమారిక వివాహము చేయువాఁడను నేనుగాని వివాహమాడునది నాకూఁతురేకదా. ఆమెకు రణార్ణవుని పేరువిన్న నెంతయు భయము నేవయుం గలవు. దానిచిత్తము కళానందునిపై హత్తియున్నది. లేకలేక కలిగిన యాకూరిమిబిడ్డను దానికిష్టములేనివానికిం గట్టిపెట్టి

గొంతుకోయఁజాల. దేవరవారెట్లు తలఁచినసరే. ఎట్లునన్ను శిక్షించినను సరే. నేను నాకన్నకూఁతు చిత్తమునకు వ్యతిరేకముగఁ జేయఁజాల. అది యసౌఖ్యమునొందుచుండఁ జూడ నాతరమగునె. ఇదియ నాయభిప్రాయము. మీఁద దేవరచిత్తము.” అని నిలువంబడియుండెను. అతనిమాటలు జరాసంధున కెంత యప్రియములుగనుండెనో యిందువ్రాయ నాశక్యముకాదు. చంద్రపాలు సంభాషణ ముగియునప్పటికి మగధరాజునకు వానిపైఁగల యనురాగము ముగిసెను. చంద్రపాలునిపలుకులు వినివిని రాజు తలయూఁచి యూఁచి తనయెదుట నంతకుమున్నితఁడెన్నఁడు నెదురాడ నోడువాఁడు నేఁ డంతధైర్యసాహసములతోఁ బలుకఁ గలిగినందుల కచ్చెరువందుచుఁ దుదకిట్లనియె.

“చంద్రపాలా! మగధరాజుతోఁ బ్రతిపక్షముబూనఁదలఁచిన నిన్ను జూడ మిగుల జాలిపడుచున్నవాఁడ. ఏమేమి! నీకూఁతు మనసున కెదురుచేయఁ జాలవా? ఏమైన సరేకాని నీబిడ్డను కళానందున కిచ్చెదవే? అహాహా ద్వాపరహరిశ్చంద్రుఁడవు! అయిన నీపంతమెట్టిదియో కనుఁగొనువాఁడ. ఓరోరి పాపాత్మ! ఇంతకాలము కళానందు నెందోదాఁచి యాతనిచే రాజద్రోహములఁ జేయించుచు, నట్లుచేసినందులకుఁ బారితోషికముగా సాలంకృత కన్యాదానము చేయఁదలఁచితివిగా చూతము నీకూఁతు రణార్ణవునకెట్లు పెండ్లిచేయవో. ఇదే నాప్రతిజ్ఞ విను. నాకంఠమునఁ బ్రాణముండ హరిహరబ్రహ్మాదులువచ్చిన ముజ్జగములుతలక్రిందైన సౌందర్యతిలక కళానందుని బెండ్లియాడదు. రణార్ణవుని కేలువట్టుట నిక్కువము. అదియటుండ రాజద్రోహము సేయఁదలఁచిన మహాపాతకునితోఁ జుట్టరికము గలుపఁదలపోయుచున్నవాఁడవు. కావున నీపై మగధరాజునకుఁ గల నమ్మకము చెడినది నీవాతనితోడి బాంధవ్యము మానుకొనునంతకుఁ గారాగృహంబున నుండుము. బాల్యస్నేహితుఁడవనియు వృద్ధుఁడవనియు నేనూరకుంటిని కాని వేఱొకఁడైన నింతకు నుసురులు

దీయకుందునే. ఛీ! యింక నాయెదుట నిలువఁదగవు. ఓరీ భటులార! ఈపరమపాతకుని జెఱసాలలోనికిం దీసికొనిపొండు. అని తన పీఠమునుండి లేచి యాగ్రహావేశమున జేవురించిన నెమ్మొగముతోడ శుద్ధాంత సైరంధ్రికలు దన్ను జూచినంతన వెఱవుగొని పరుగ[illegible]హాఱ నంతిపురమున కతికోపమునఁజనియెను. జరాసంధుని నోటనుండి కారాగృహావాసమునకుఁ దన్నుగొనిపోవుమని యానతి వెడలుటతోడనె చంద్రపాలుఁడు నిశ్చేష్టుండై తనయవస్థందలంచియుఁ దనకింతఘాతచేసినరాజు తనకూఁతు నేమిసేయునోయని యామెయవస్థందలంచియు నొకమారు వగచి సేవకులతో నాతఁడు చెఱసాలకుంజనియెను. ఈమాటలింటికడఁ దెలిసినపుడు గుణోత్తమ మూర్ఛిల్లెను, రాగలతిక నిశ్చేష్టయయ్యెను. ఇంట నందఱు మహాదుఃఖసముద్రమున మునిఁగియుండిరి.

ఏడవ ప్రకరణము.

కళానందుని వెంటఁబెట్టుకొని పదిలముగా రత్నఖేటుఁడు వానివెనుకను జాతవేదుఁడు ముందు నడచుచు నిరుగెలకుల నాయుధపాణులైన జోదుల నిలిపి వారు పయనమొనర్చుచుండిరి. గాఢసంతాపమున బయలువెడలు వెచ్చని నిట్టూర్పులచే సుందరవదనారవిందము కలుషమైయుండ నడువనోపికలేక కళానందుఁ డెట్టెటో సాగివచ్చుచు సూర్యోదయములఁ దనపై మాగధున కత్యాగ్రహోదయ మగుననియుఁ దదస్తమయములఁ దనకస్తమయము సమీపించుచున్నదనియుఁ దలఁచుచు నది తదనకెంత వేగమువచ్చిన నంత సంతసముగ నుండుననియు వారలతోఁ జెప్పుచుఁ బయనమగుచుండెను. కళానందుని విషయమున రత్నఖేటాదు లోకవిధముగఁ గరుణార్ద్రచిత్తులై యుండిరికాని జాతవేదుఁడుమాత్ర మేకారణముననో కటుకఠినముగ వర్తింపఁదొడఁగె. దారి

నుండి యెక్కడుగైనఁ గదలఁగనీక, యిటునటుఁ జూడనీక, యొంటరిగ నెందుఁ జననీక, యితరులతో మాటలాడనీయక యా రాచకొమరుని జాతవేదుఁడు పెక్కువిధముల వెతలఁ బెట్టుచు హరిశ్చంద్ర నక్షత్రకుల న్యాయము జ్ఞప్తికిఁ దెచ్చెను. జాతవేదుఁడు "రాజద్రోహికిఁ గూడ నంతచనవు నొసఁగుచున్నవా" రని రత్నఖేటప్రముఖుల నిందింప నారంభించెను. రత్నఖేటుఁడును, జాతవేదుఁడున్నంతవఱకు రాచకొమరుఁడు తప్పించుకొని పాఱిపోవఁజాలఁడనియుఁ దానెంతయు జాగ్రత్తగా నున్నను భయము లేదనియు రేలఁ హాయిగ నిదురింపసాగెను. జాతవేదుఁడు దనశరీరముం గప్పు నిలువుటంగియు శిరోవేష్టనము నెన్నఁడు భోజనసమయమున నైన విడువకుండుటయు మాసినమడుగుల విడుచు నెడఁ గడురహస్యముగ నెందేనిజని క్రొత్తవలువలు దొడుగుటయుఁ గులమును గోత్రమును నెన్నిసారు లడిగినం దెలుపకుండుటయుఁ గాంచి రత్నఖేటుఁ డీతఁడెవ్వఁడై యుండునాయని నిరంతరము యోచించుచు విశ్వాసకట్టు లేశమును రామి పేడివాని యొక మెట్లు జరాసంధుఁడు జూడనోపెనని సందియ మొందుచు నంతయుఁ గతిపయ దినములలో వినవచ్చునని మనశ్శాంతి కలిగి యూరకుండెను.

ఇట్లు కొన్నిదినములు చేదపురమునుండి పయనము చేసి యొకనాఁడు సంధ్యాకాలమునకు నొకయరణ్యము సేరి దాపున నూరుపల్లెలు గానఁబడమి దారి తప్పితిమో యని వారలందఱు నిముసము యోజించి మఱి కొంత దవ్వరిగి చూతమని యింకను నడచి నడచి పసుల యడుగుల జాడలు మనుజుల యలుకుడు, కోడికూఁత యెందును లేకునికి తుదకది మహారణ్యముగా నిశ్చయించి యందే యా రాత్రి నిద్రింపఁ దలఁచి యొక్కచోట నేలపై నుత్తరీయములం బఱచిరి. నడుమఁ గళానందుని బండుకొనఁ జేసి నాలుగుప్రక్కల నలువురు సేవకులఁ బండుకొనఁజేసి, రెండుజాములు రత్నఖేటుఁడును రెండుజాములు జాతవేదుఁడును రక్షకుఁడుగా నుండ నిర్ణయించుకొనిరి. జాతవేదుని నిదురింపమని రత్నఖేటుఁడు మొదటి రెండుజాములుదా

నుగాఁపుండితనవంతుదీసుటయువానిలేపితానునిదురబోయెను. నిద్దురబద్ధక
ముచేఁ గన్నులు నులిమికొనుచు జాతవేదుఁడు వాలుగేలఁ బూని నాలుగు
గడియలిటునటుదిరుగునప్పటికిబద్ధకమెల్లఁబోయెను. పిమ్మటనాతఁడు కళా
నందునిదురవస్థయుఁ జంద్రపాలనందన యాసయుఁ దలఁచి దైవవైపరీత్య
మునకచ్చెరువుపడుచుండ నేదియోధ్వని వానిచెవులకువినఁబడినట్లయ్యెను.
వినినతోడన నాతఁడు కళానందునిమీఁదఁ జేయివైచి లేపి మరల నా
ధ్వని యగుడు నతనిని వినుమని వానికివినిపించి యిరువురును బెబ్బులిధ్వని
యని నిశ్చయించిరి. అంతట జాతవేదుఁడు కంఠమెత్తి “అయ్యో వ్యా
ఘ్రము ! వ్యాఘ్రము !! లెండు లెం”డని యఱచెను. ఆమహానాద
ము నిదురించుచున్న యాయేవుర నొకమాఱు మేలుకొలిపె. అపుడు
వారందఱును లేచి భయార్తులై కళానందుఁడు జాతవేదుఁడు నున్నవైపు
న కరుగక, దారి తెలియక, యొకరిమాట యొకరువినక యాక్రందనధ్వను
లతోఁ జెల్లాచెదరైనలుదెసలకుం బరువెత్తిరి. జాతవేదుఁడు భయకంపి
తుఁడై గడగడ వడఁకుచుఁ గళానందునిచేయి గట్టిగఁబట్టుకొని “భయ
ము లేదు నిలు నిలు” మని యాతఁ డెంతధైర్యముఁ జెప్పుచున్న నదిచెవిఁ
బెట్టక రాజకుమారు నీడ్చుకొని పాఱిపోవసాగెను. జాతవేద కళానందు
లొకవైపునకుం దక్కినవారందఱింకొకవైపునకుం జనిరి. కొంతదూర
ము పరువెత్తి రత్నఖేటుని సేవకుల నెలుఁగెత్తి పిలిచి పిలిచి వారు మా
రుపలుకకుని కెంతయు విసిగి కళానందునితోఁగూడ నడువసాగెను. అట్లు
నడువ నడువఁ గొంతదవ్వరుగునప్పటికి బల్లున తెల్లవారెను. అప్పుడు
మహోన్నతములగు వృక్షముల చాటునుండి యుదయ మొందుచున్న
యంశుమంతుని బింబ మించుకించుక వారికిఁ గానఁబడఁజొచ్చెను. కొన్నిని
మిషములలో నా తెరవరు లిరువురును నాగహనముదాఁటి బయలు సేరిరి.
అంతట భానుమంతుని యరుణకిరణ సహస్రములె కాక వారికనుదమ్ము
లకు నమితానందజనకముగ ననేకగోపురములు బహువిజయపతాకము

లు బెక్కుమేడలుఁ గానవచ్చెను. అంతకంతకు సమీపమునకుఁజనుచు సిరులకుఁ గాఁపురమగు నాపుర మెయ్యదియై యుండునని కళానందుఁడు యోజించుచుండ నింతలో నంతరిక్షమును దాఁకునట్లు గరుడధ్వజము గానఁబడెను. దానింజూసి యయ్యది ద్వారకానగరముగ భావించి కళానందుఁడు మహానందభరితుఁడై నెమ్మనమున “ఆహాహా! దైవమునాయందుమిగులఁ గరుణకలవాఁడు జాతవేదుఁడు నన్ను గిరివ్రజమునకుం గొంపోఁదలఁచియుండ భగవంతుఁడు ద్వారకకుం దెచ్చె. మూఁడునాళ్ళక్రిందటవీరు దారితప్పిరి. దైవసాహాయమున్నచో నిఁక నెవరెట్లుకావించిన భయము లేదుగదా! యని సంతసింపుచుండెను. జాతవేదుఁడును దానది ద్వారక యని తెలిసికొని చింతాక్రాంతుఁడు గాక సంతసించినవాఁడుపోలె కానఁబడెను. ఇద్దఱును నగరముం బ్రవేశించి యాపూఁట మాధవు నంతిపురమునకుం జనక యొక శూద్రగృహమునందు బసచేసియుండిరి.

భోజనాంతరమునందు రాత్రి వీరలిద్దఱును వాసుదేవుని మందిరమునకుంజని తమరాక యతనికిం దెలియఁజేసిరి. యదుపుంగవుఁడు ప్రతీహారి నంపి వారిందోడ్కొని రమ్మన నాతఁడట్లుచేయుటయు వారు నందకుమారు మ్రోలనిలిచి సాష్టాంగదండప్రణామంబుం జేసిరి. వారలదీవించి కృష్ణుఁ డుచితపీఠముల నాసీనులుగాఁజేసి కళానందుని రాకకు సంతసించి “కళానందా! ఎంతకాలమయ్యె నిన్నుంగనుంగొని! నీవింద్రప్రస్థపురమునకుం జనలేదా? నాసందేశము ధర్మనందనున కెఱింగించితివను కొంటిని. పాపము నీకు నాగంతుకముగఁ బెద్దయిడుమలు రానోపు” నని పలుకరించెను. వాసుదేవుని చల్లని కీగంటిచూపులును, జెవులపండువుసేయు పలుకులును గళానందుని నెమ్మనమున నాటిన యుమ్మలికముఁ గొంతశాంతింపఁజేయ నాతఁడిట్లనియె. “నారాయణా! నీకడ సెలవుగైకొన్న దాదిగ నాపడినయిడుమల నేమని చెప్పఁగొందు. మార్గమధ్యమున విధివశమునఁ జేదిరాజు భటులచేఁ జిక్కి యక్కడ నిన్నాళ్ళుఁ

జెరలోనుంటి. అంతకన్న నిప్పుడు నెక్కుడుకీడు మూడనున్నది. కీడననే ల? మరణమె నాదుఃఖములనంత మొందింపనున్నది. ఈజాతవేదుఁడు నన్ను జరాసంధునియొద్దకుం గొనిపోవనున్నాఁడు. కతిపయదివసములలోఁ బరలోకమునకుం జననున్న నాకు నీచరణారవిందములసందర్శనమయ్యె నింక ముక్తిలభియించు" నని బిట్టువగవుచే నంతకన్న మాటలాడఁజాలక దీనాననుఁడై యున్న యారాచపట్టిదెస జూచి నందకుమారుఁడు జాలి నొంది మీఁదఁ జేయివైచి తట్టి వత్సా! వెఱవకు. వాసుదేవుఁడు నిన్నూరక జరాసంధుని చేతులఁబెట్టునే! నీకు సకలకళ్యాణములు సేకూఱు" నని ధైర్యముం జెప్పి వానివంత కొంతబాపెను. అనంతరము వాసుదేవుఁడు జాతవేదుని మొగమువంకజూచి కొన్నిరహస్యములు ముచ్చటింపఁదలఁపుఁగలుగుట వాని ముఖవైఖరింబట్టి తెలిసికొని లోనికి రమ్మని వానింబిలిచి యొకచోఁగూరుచుండి వానితో ననేక విషయములు ప్రశంసించెను. శ్రీకృష్ణుని పేరువిన్న మండిపడునట్టి శిశుపాలున కాప్తుఁడై వాసుదేవునకు బద్ధశతృవఁగు జరాసంధున కంతకన్నఁ గూరిమిచుట్టమైన యీజాతవేదుఁడు కృష్ణునికిఁగూడ నాప్తుఁడై రహస్యములు మాటలాడు చుండుటఁ జూచి కళానందుఁడత్యాశ్చర్యము నొంది ,,యీతఁ డెవ్వఁడో యేరికిం దెలియదు. వీనిచరిత్రము విచిత్రము. వీనినెచ్చెలులెవ్వరో పగతురెవ్వరోకూడఁ దెలియదు. వీఁడు నాకుపకారము సేయునో యపకారము సేయునో క్రియనుబట్టి చెప్పవలయును గాని వీనిమన మిట్టిది యని నిర్ణయింప నెవ్వరితరముగాదు. అయినను వాసుదేవునికడ నున్న వాఁడను గదా యనుకొనుచుండెను. ఇంతలోఁ దమ విస్రంభ సంభాషణముఁ ముగియుటయు జాతవేదుని వెంటఁబెట్టుకొని వాసుదేవుఁ డీవలకువచ్చి కూరుచుండెను.

కళానందుఁ డంతట వాసుదేవునితో ,, దేవా! నామనవి యొక్కటియున్నయది శిశుపాలుని మందిరమున నిందుమతి యను నొక సుంద

రియున్నది. ఆరాజవదన నారాజు బలిమిచేఁ గేలువట్టఁదలఁచుచున్నాఁడు. నేఁ జేదిపురమునుండ నాయిందుమతి తనకించుక సాయముజేయు మని వేఁడుకొనుటచే నేనటులఁ జేయుదునని వాగ్దానముచేసితిని. నాయవస్థ యిట్టులుండ నేనామెకుఁ గావించు సాయ మేమున్నది? మాధవా! నేనింక పరలోకప్రయాణోన్ముఖుండ నగుటచే నొకమనవి యొనర్చుకొనియెద. ఆయిందుమతి నెట్లయిన వాని బారినుండి రక్షింపవలయు" నని వేఁడికోలు సలుపుటయు యాదవుఁడు చిఱునగవు నగి "యామెకు నీకుఁగూడ భయములేదు. ఇందుమతినిగూర్చి జాతవేదుఁడు తగుయత్నములఁ జేసి యున్నవాఁడని జాతవేదుని నావలకుఁ జను" మని కనుసన్న జేసి కళానందునితో నిట్టులనియె. "రాజకుమారా! నీకుఁ మహోపకారముజేయఁదలఁచితిని. జాతవేదున కిష్టములేకున్నను నిన్ను నే విడిచిపుచ్చెద. నీవు గిరివ్రజపురమునకరిగి నీహృదయేశ్వరియగు సౌందర్యతిలకయొద్దనుండి రహస్యముగ నాచెప్పినచొప్పున వర్తింపుచుండుము. ధర్మనందనుఁడు నన్ను రమ్మని పలుమాఱు వేఁడుచున్నాఁడు నేనింద్రప్రస్థపురమునకుం బోయి యుధిష్ఠిరునకు రాజసూయయాగము సేయుమని నొక్కిచెప్పి యల్పకాలమున జరాసంధసంహారము గావించెద. ఏద్వారమున గిరివ్రజపురముఁ బ్రవేశింపఁదగు, నెట్టికాలమున వానింజంపనగు నేవిధమున మందిరము బ్రవేశింప నుచితమగు నవియెల్ల నరసి పూలవర్తకుల పేరులు గొందఱు సేవకుల పేరులు మాకుఁ దెలియఁజేయుము మాకుఁదోఁచనియంశములావశ్యకము లగునని నీకుఁ దోఁచినవియెల్లఁ గాలానుసారముగ నెఱిఁగింపుచుండుము. నీవుమాకు వ్రాయునుత్తరములలో నీపేరువ్రాయక "దేవభూతి" యని వ్రాలుచేయుము. నేను నీకు వ్రాయవలసినంత యావశ్యకత యుండదుగాని యున్నపక్షమున గుణభూతి యనివ్రాయుచుండు. అది నాపేరుగా నీవుగ్రహింపు. నాయొద్దనున్న వేగులవాండ్రలో మిగుల నేర్పరులున్నవారు. మూఁగవానివేషమువేసికొని యద్భుతములు సేయఁగల

వాఁడు కోరకుఁడు; గుడ్డివానివేషము వేసికొని యెంతెంతో పనులు చేయువాఁడు కాణభూతి. టక్కరితనముల మాయల వీరల జయించినవా రెవ్వరును లేరు కావున వీరలఁదోడుకొని నీవు గిరివ్రజమున కేగుము. నేను ఱేపింద్రప్రస్థమున కరిగెద." అని తనహృదయస్థిత మగు రహస్యముల నెల్ల వాసుదేవుఁడు కళానందునితోఁ జెప్ప నాతఁడు తన బంధవిముక్తికి, జరాసంధుని మరణము సమీపించినందులకు నత్యానంతము నొంది యాయుపకారము జేసినందులకు వాసుదేవునకుఁ బునఃపునః ప్రణామంబు జేసి మఱునాఁడు పయనమని నిశ్చయించుకొని పండుకొనియెను. పిదప జాతవేదునితోఁ గొంతదనుక ముచ్చటించి వాసుదేవుఁడు నిదురించెను. కళానందుఁడు పండుకొని నిదురరామి చిరకాలముక్రిందటఁ గనులపండువుగఁ గాంచిన సౌందర్యతిలక ముఖచంద్రమండలము మరలఁ గాంచు భాగ్యము కలిగినదిగదా యని యొడలెఱుఁగనియానందమున నోలలాడుచుఁ బ్రియురాలి ముఖాంభోజము దలఁచుకొని భావిసౌఖ్యమునుగూర్చి యువ్విళ్ళూరుచుండెను. జాతవేదుఁడు కొంతసేపు మేలుకొని నిదురించెను.

మఱునాఁడు కోరకకాణభూతులతోఁ గళానందుఁడు ద్వారకానగరము విడిచి చుట్టములం బక్కములఁ జూచువేడుకఁ బయనముచేసెను. వాసుదేవుఁడు తనయుద్యమ మెవ్వరికిం దెలుపక కార్యాంతరమున నింద్రప్రస్థమునకుం బోవుదునని బలరామప్రముఖులగు యదువీరులతో విన్నవించి రుక్మిణీసత్యభామాదు లగు నష్టమహిషీమండలమువొద్ద సెలవుగైకొని సాత్యకిని దన వెంటఁ గొంపోవనిశ్చయించి ప్రయాణోచిత మగు వేషముందాల్చి సిద్ధముగనుండెను. అంతలో సారథి గరుడధ్వజలాంఛితమై నానావిధరత్నశోభితమై విజయప్రదమై యలకు నరదమునకు గోవిందుని కీర్తిమూర్తులుగైకొనినవోయనినట్లు క్రాలు ధవళతురంగములను బూన్చి యాయత్తముసేయఁ బురుషోత్తముఁ డందు సాత్యకిసమేతుఁడై ప్రవేశిం

చెను. ఆజానేయతురంగములు నందనందనుఁ డధిష్ఠించిన తోడనే యరదములాగి చంగుచంగునఁ బరుగెత్తుచుఁ బయనము సేయుచుండెను.

ఎనిమిదవ ప్రకరణము.

పార్థుఁడు మున్ను దనయెడఁ గృపాంతరంగిత మనస్కుఁడై యొనర్చిన మహోపకారమునకుఁ బ్రత్యుపకారము సేయుతలంపున దానవవిశ్వకర్మ యగు మయుఁడు పాండవేయులకు ముజ్జగముల దానికీడులేని సభామండపము నొక్కదాని నిర్మించి యొసంగె. అందుఁ జెక్కఁబడినరతనములఁ గాంచిన వారలందఱు నిఁక రత్నాకరములయందుఁగాని భూగర్భమునఁగాని రత్నములుండు నేయని శంకింపఁజొచ్చిరి. మహేంద్రునికొలువుకూటము దీనికి నన్నివిధములఁ దీసిపోవునని నారదాదిమునులు నిష్పక్షపాతబుద్ధితో ననుచుండ మహీమండలమునఁగల రాచవారి కొలువుకూటములు దీనితోఁ బోల్చుట దాని నగౌరవించుటయని తోఁచెడును. పాండవకౌరవమహావైరమున కంకురమై పాండునందనఖ్యాతికి మూలకారణమై, యానాఁటిమేటి రాకొమరులకు భయోత్పాదకమై, సొగసులదీవియై, వింతలతావునై, ముద్దులమూటయై, రతనాలపేటియై, చూపఱకుఁగన్నులపండువై రాజిలు నమ్మహాసభ పాండునందనుల యదృష్టవశమున వారికి లభియించెఁగాని యన్యుల కెట్లది లభియించు. నిర్మలసరోవరములట్లు కన్నులకు భ్రమగలిగించు నింద్రనీలచూర్ణికస్థగిత ప్రదేశములును మనుజుఁడొకఁడు నడుచునపుడిరుగురు నడుచుచున్నట్లు తోఁపఁజేసి నడుచువారికి నడలుగలిగించు పెనుటద్దంపు పలకలును నెట్టి చిన్నగొంతుతోఁ బలికినఁ దద్దయుం బెద్దగాఁ బ్రతిధ్వనియొసఁగు మేడలును గూరుచున్న జనమునకు నుష్ణతాపములేకుండ మందమారుతము లోనికరుదెంచుటకనువగు ననేకవాతాయనములును సభామంటపమున కపూర్వాలంకారము నుదెచ్చుటచే నది ద్వాపరయుగ చిత్రములలో నొకటియని యెంచఁబడియె.

ఈవిధమున సొగసులకుప్పయైన యొప్పు నమ్మహాసభామంటపమునం దొక్కనాఁడు భరతకులప్రదీపకుఁడు గుంతీగర్భశుక్తిముక్తాఫలమును ధర్మావతారుఁడును నగు యుధిష్ఠిరుఁడు తమ్ములు నలువురు పార్శ్వముల, రాజమండలముచుట్టును గూరుచుండి కొలువ మంత్రులు సామంతులు దండనాయకులు వీరభటులు రాయబారులుఁ జుట్టములు నెచ్చెలులుఁ బురోహితులుఁ దమతమ యుచితప్రదేశముల నాసీనులై యుండఁ గొలువుదీఱియుండెను. అత్తఱి ధౌమ్యుఁడు మున్ను రాజసూయాశ్వమేధములుగావించి యశముఁగన్న రాజన్యులచరిత్రములను విన్నవించుచు సందర్భవశమున నిట్లనియె. “యశోదాకిశోరమనియు దేవకీతనూజుఁడనియు నందనందనుఁడనియు వాసుదేవుఁడనియుఁ బేరులుగాంచి మనుజలోకముఁ బావనముగావించుచున్న యీమాధవుఁడే మున్ను త్రేతాయుగమున దశరథరాజనందనుఁడై శ్రీరామాఖ్య నవతారము దాల్చి యశ్వమేధ మొనరించి జగద్విఖ్యాతుఁడయ్యె. అట్టిమహారాజులింక ననేకులున్నవారు” అని మఱియు నెద్దియో యనఁబోవుచుండ నింతలోఁ బ్రతీహారివచ్చి “దేవా సాత్యకీసమేతుఁడై వాసుదేవుఁడు వచ్చియున్నవాఁ”డని విన్నవించెను. విన్నవించుటయు సభయెల్ల విస్మయానందభరితమయ్యెను. అర్ఘ్యపాద్యములఁ దెమ్మని సేవకులకానతిచ్చి యుధిష్ఠిరుఁడులేచె. ఆతనితో నలువురుతమ్ములును లేచిరి. తమ్ములతో రాజమండలమెల్ల లేచె. రాజమండలముతోఁ బరివారమెల్ల లేచె. అందఱితో ధర్మరాజు సభాద్వారమునకుం జని యప్పుడే యరదము డిగిన యాయదుకుంజరద్వయమును విలోకించి పులకితశరీరుఁడై వికసితముఖారవిందుఁడై యనుగమ్యమానసోదరుఁడై యెదురేగెను. వాసుదేవుఁడు జనసమేతుఁడై యుధిష్ఠిరుఁమ్రొక్క నతఁడు తనపాదములపై నున్నవారిని లేవనెత్తి దీవించెను. పిమ్మట యాదవసింహము తనకుఁ బాదాభివందన మొనర్చిన భీమార్జునమాద్రేయుల దీవించి వారిసేమ మడిగి బంధుసామంత పరివా

రము సేయు జోహారు లందుకొని యందఱితో సభామంటపమున కూర్చొనియె. తనగద్దియకు దాపున నవరత్నఖచిత మగుపీఠ మొండు వేయఁబనిచి యందతని నాసీనుఁ జేసి యనంతరము దానును దక్కుఁగల పరివారమును గూరుచుండిరి. యదువృద్ధులసేమము భరతవీరులును గురువృద్ధులసేమము యదువీరులును కనుఁగొనిరి. మాధవుఁడు సభనున్న వారినందఱను బేరులెత్తి వేఱువేఱఁ బలుకరించి సేమమరసి యుల్లాసము దలంపుచేసెను. సాత్యకియు భీమార్జునులకు నడుమఁగూరుచుండి బావమఱఁదుల కుచితము లగు సరససల్లాపముల మునిఁగి తేలుచుండెను. అంతట యుధిష్ఠిరుఁడు భక్తివినయములు గదుర దేవకీనందనుని మోమువంకఁ జూచి యిట్లులనియె. "దేవా! పిపీలికాది బ్రహ్మపర్యంతమును భూతకోటియందు సమదృష్టినిలుపు నీకు మాయందింత యాదరము గౌరవము ప్రేమయు జనియించుట మాభాగ్యముగాని వేఱుకాదు. ద్వాపరంబున దేవకీవసుదేవుల కుద్భవించి దుష్టదానవమానవకోటులఁ బరిమార్చి వసుమతీభారము నడఁపవచ్చితి వని తెలిసినవారలందఱు నందురుగాని నాకు మేనమఱఁదివై కొంగుబంగారమవై నాయశము మహీమండలము నందు వెలయింప మాయేవురను గాపాడవచ్చితివని నేనూహించెద. గాంధారేయులు విషభోజనంబిడినను లక్కయింట మమ్మునిచి చిచ్చువెట్టినను మాకపాయము వాటిలకుంట నీకటాక్షమునఁగాదే? మాధవా! నారాయణా! జనార్దనా! నిన్నుఁగొనియాడ నాకుఁ దరమే?" అని విన్నవింప గోపకుమారుఁడు మందహాసముతో నిందుకుల శేఖరుం గనుంగొని "మహారాజా! సజ్జనులకు దుర్మార్గులు కీడుసేయఁగడఁగుదురేని భగవంతుఁడు వారలకుం దోడుపడి మూడఁదలంచిన కీడుఁ దొలఁగింపఁడే! సత్పథసంచారివైన నిన్నుఁబోలు రాజెందుఁగలఁడు? చల్లని నీపరిపాలనమునందుండి యాదవులగు మేమందఱము నేబాధయు నెఱుఁగక హాయిగా సుఖించుచున్నారము. భీమపార్థమాద్రేయులచేత సురక్షితమగు నీరాజ్య

లక్ష్మి నీకీర్తికాంతతోడం గలిసి యనేక నూతనదేశముల విహరింపనున్న
ది. అన్నట్లడుగ మఱచినాను. కళానందుఁడు మీకడకు రానేలేదా? “య
ని ప్రశ్నజేసెను. అంతట యుధిష్ఠిరుఁడు “కళానందుఁడను పేరు వి
నుటయేకాని వానింజూచి యెఱుంగను. అతనిచే నీవు నాకనిపిన సం
దేశార్థము లెవ్వియో వినవలతు” ననుటయు జనార్దనుం డిట్టులనియె.”
రాజా! ఎఱుంగనివానివోలె నీవిట్లనియెదవేమి? అర్జునా! అదియెట్టిది
యో నీవు మీయన్నకు విన్నవింపవైతివా? మీయన్నదమ్ముల గడుసుఁద
నము లిట్టివియేకదా! ఎఱిఁగియున్న యంశముల నెఱుఁగనట్టులభినయించి
యెదుటివానినోటఁ బలికింతురు. కడుపులోనున్న వెల్లఁ బలుకుటకు మీ
తమ్ముఁడు వెఱ్ఱివాసుదేవుఁడుగాఁడుగదా!” అని పరిహాసోక్తులం బలికి
వెండియు నిట్లనియె. రాజా! నీయనుజులకందఱకు నందుముఖ్యముగాఁ
గిరీటికి నీచేత రాజసూయమహాధ్వరము చేయింపవలయునని మనమున
గట్టిసంకల్పమున్నయది. అది నాతోడ నాలోచించుటకు నీతఁడానడుమ
ద్వారక కరుదెంచె. అప్పుడే జరాసంధునకు జంకి నాశరణము వేఁడివ
చ్చిన కళానందుఁ డందుండినవాఁడు. అపుడు రాజసూయముఁగూర్చి
నాయభిప్రాయముం దెలుపుమని పార్థుఁడు నన్ను నొక్కి యడిగెను. కా
ని నేను గొన్నినాళ్లు చనినవెనుక నామతమును దెలుపుదునని వాక్రు
చ్చి మీతమ్ముననిపితి. నాఁటఁగోలె నేఁటివఱకు నీయంశమునందుఁ
బూర్వోత్తర సందర్భములఁ జక్కగాఁ బరిశీలించి లాభనష్టములు విత
ర్కించి స్వపక్షపరపక్షంబుల బలాబలంబులఁ బూర్వపక్షసిద్ధాంతముగఁ
దరచి మంచిచెడ్డలనరసి తుదకు నయ్యధ్వరము నీవొనర్చుటయె కర్తవ్య
మని నిశ్చయించి నామతము నితరులనోటనుండి నీకుఁ దెలుపుటకన్న
నాముఖముననె తెలుపుట యుచితమని యెఱిఁగింపవచ్చితి” అనునప్పటికి.
సభాసదులందఱుఁ బల్లవితముఖులైరి. “వహవా! బావా! సూత్రము
నిలిపితివి సుమీ” యని భీమసేనుఁడనియె. భగవంతునిచే భరతకులమ

నుగ్రహింపఁబడినదని యర్జునుఁడును "వాసుదేవుఁ డన్యథాసేయఁడని నేనెఱుంగుదు" నని నకులుఁడును, "పాండురాజునకుఁ గొఱంతదీఱెన" దని సహదేవుఁడు ననిరి. సభనున్న తక్కుఁగల జనము యథోచితముగ నామాటలను మెచ్చుకొనిరి. శ్రీకృష్ణుఁడు తన వాగమృతధారావర్షముచేత యుధిష్ఠిరు మనము మెత్తవడఁజేయవలయునని తలఁచి మరలఁ దనయుపన్యాసమందుకొని యిట్లనియెను. "రాజా! యీయాగమువలన నిహాముంబరముఁగూడ నున్నది. ఇహమున రాజరాజవై భూమండలాఖండలుండవై నేలయంతయు నేలుట. పరమున యమలోకమున వసియించి ఖేదపడుచున్న మీయయ్య యింద్రలోక వాసియగుట. అవియటుండ మనకుఁ బెద్దకాలమునుండి పగతురై జగత్కంటకులైన క్షత్రియాధముల నిధనమొందుట. ఇది రాజనీతికనుకూలమగు యోచన. ఇన్నివిధముల నుపయుక్తమగు నీకార్యమును నీవుదక్క నితరులు నిర్వహింపనోపరు. కాఱుచిచ్చులతెఱఁగునఁ దేజోరాసులగు భీమార్జునులు గదాగాండీవశోభితపాణులై కవలు కృపాణాలంకృతులై దిగ్విజయార్థము దిగంతములవఱకు నరుగునపుడు వారినెదిరింపఁ జాలి కట్టెదుట నిలుచువాఁడెవఁడు. మొనలుదీర్చి నీయనుజన్ము లాలమున నిలువ విక్రమించి యున్నతఱి వారిఁగన్నెత్తి చూడఁగలాఁడును విల్లెత్తి వారి నేయఁగలాఁడును ధ్వజమెత్తి వారిపై నడువఁగలవాఁడును రాజకోటింగలఁడె? అన్నియునెఱిఁగి యిట్లనెదరేల. మీభీమసేనుఁడు కుపితుఁడగునేని ప్రళయకాలరుద్రుఁడు. ధనుఃపాణులలో నగ్రగణ్యులు శంకరరఘురామ భృగురాములు, వారింబోల్కిన వెనుక నీయనుజు శ్వేతవాహనుం బేరు కొనవలయునుగాని వ్రేలుమడచి యింకొకనిఁ జెప్పఁదగదుగదా! కత్తిపట్టిన నకులసహదేవుల కీడెవ్వరుందురు? నివురుగప్పిన నిప్పులచొప్పున నీయెదుర వినయనయభయములతో సంచరించు నీతమ్ముల బాహువిక్రమములు నీవెఱుంగవుగాని లోకులనుకొనుమాటలు వింటివేని యీరా

జసూయమునకు నీకు సందియమొదవదు. అంతటిసై దోషుల మగఁటిమి యేమి? యింతటి బంధుగులబలఁగమేమి? ఈవలఁ దోషునీడలాగు నీకనువర్తనుండనగు నేనేమి? సామాన్యరాజలోకంబు చాడ్పున రాజసూయమునొనర్ప నీవు బెదరుటేమి? చతుస్సముద్రముద్రిత మహీమండలంబునంగల నృపనందనులందఱు నీసేనలదాడికోడి కప్పములు కానుకలు నీకర్పించి చేతులుజోడించి నీయెదుటనిలువ వారిపైఁ జల్లనికటాక్షనిరీక్షణములఁ బ్రసరింపఁజేసి కన్నుసన్నలవారి నాసనములంగూర్చుండ నానతిచ్చుచు బ్రాహ్మణాశీర్వచనఘోషము రత్నాకరధ్వానముమీఱ ద్రుపదరాజనందనతో రాజసూయమహాధ్వర మొనర్చి పేరోలగమున సకలభూనాయకపరివృతుఁడవై యుండ నినుజూచి కన్నులకఱవుదీర నానందింపవలయునని నీతమ్ములు నేను నువ్విళులూరుచున్నారము. నీవీ యాగమునారంభింపవేని రాజకులమునకెల్ల నగౌరవమువాటిల్లు. మాకెల్లఁ దలవంపులగును. నీకీర్తి యాచంద్రతారార్కము వెలయఁజేయుటకు భరతకులమునకు వన్నెఁదెచ్చుటకు లోకముద్ధరించుటకు నిదే సమయము. పితృవాక్యపరిపాలకుఁడవేని, భరతకులాభివృద్ధినిఁ గోరెదవేని, రాచపాడి తప్పనివాఁడవేని పౌరుషంబుగలదేని, యభిమానధనుఁడవేని నీయనుజుల దోర్దర్పమెఱుఁగుదేని నామాటయందు రవంతగౌరవము నమ్మకమును నిలుపుదేని యధోగతిపాలైన తండ్రి నుద్ధరింపఁ దలఁపు గలదేని రాజసూయముఁ దప్పక నీవు చేయసమకట్టవలయును. నీవనుమతింతువేని తక్కినయది నేనును భీమార్జునులును జక్కఁజేసెదము. అని యుగ్గడించి యుక్కెక్కించి పలుకుటయు యుధిష్ఠిరుఁడు మహాయశస్సంపాదమునకుఁ గారణమైన యీజన్నము నొనర్చుట యుచితమని యెఱిఁగియు రాజచక్రమున కనిష్టముగ నుండునని సందియమొంది వారినడఁపఁదగిన లాఁవు తనతమ్ములయొద్దనుంట తెలియక వాసుదేవుని మాటలకెదురాడనోపక యుయ్యెలలూగు మనముతో నందకుమారునకట్లనియె ''జనా

ర్దనా! నీచెప్పినట్లు రాజసూయయాగమ్ము భరతవంశమునకుఁ గౌరవన్ని యఁదెచ్చుననుట నిశ్చయము. యుధిష్ఠిరుఁడు సార్వభౌముఁడై మూర్ధాభిషిక్తుల నరిగాపులఁజేయుననుట నిస్సంశయము. కాని కురుదేశమునకుఁ జుట్టుచున్న కడిఁదిమగలగు పగతురఁదలంప నాగుండియ జల్లుమనుచున్నది. అవల చండశాసనుఁడగు జరాసంధుఁడుండ నీవల మనకు బద్ధశత్రులగు శిశుపాలదంతవక్త్రులుండ నింకఁ బోతరించి కన్నుగానని పౌండ్రకవాసుదేవ ప్రముఖులును బుళిందబర్బరయవనవల్లభు లుండ నేనా రాజసూయము దలపెట్టినెరవేర్చుట! కుఱ్ఱలగు నాతమ్ము లెంత బలవంతులైన వారిమీఁది కనుపఁజాల. ఒకవేళ నేనది సేయసమకట్టినను నిన్నుఁజూచుకొని నేనట్లు చేయవలయునుగాని సహోదరులంగాంచికాదు. నాదొరతనముంబట్టికాదు. ఈకార్యమెత్తఁగునైన దీర్చ పితౄణముం దీర్పఁదలఁచుచుంటి" అనవుడు చిఱునగవు నగుచు వాసుదేవుండిట్లనియె "రాజా! పగతురబలిమినిదలంచి వగవఁబనిలేదు. నీయనుజుల విపులదోర్బలమునకు నాబుద్ధిబలము తోడుపడునేని యీయధ్వరము నిర్విఘ్నముగ నెఱవేఱును. శిశుపాలపౌండ్రికవాసుదేవాదు లోక లెక్కలోనివారుకారు. శత్రుపక్షమునకెల్ల శిరోభూషణమై జరాసంధుఁడున్నవాఁడు. భీమార్జునులను నాకుఁ దోడుపంపెదవేని జరాసంధుని నిముసమున యమలోకమునకనిపెదను. వాఁడు పిల్కుమాలినఁ దక్కినవారుక్కుదక్కి కోఱలుపీఁకిన పాములచందమునఁ గూలఁబడును. జరాసంధుఁడైన నిపుడు హంసడిచికులు లేమి ఱెక్కలు తెగిన పక్షివలెఁ బడియున్నాఁడు. ఈవిషయమున సందియమొందక మాకనుజ్ఞ యిమ్ము. ఆమగధేశ్వరుని గుట్టుమట్టు నాయెఱింగినంతవట్టు నీకుఁ దెలిపెదనువిము," మని యాతని జన్మవృత్తాంతము గిరివ్రజపురముఁ జొచ్చునుపాయముఁ గళానందుఁడొనర్చు సాయమును జెప్పె. ధర్మరాజు నవియెల్ల విని యెట్టులో యజనమునకు సమ్మతించెను. సుముహూర్తము నిశ్చ

యించి భీమార్జునసమేతుఁడై శ్రీకృష్ణుఁడు గిరివ్రజపురమునకు జరాసంధసంహారముకొఱకుఁ బోవ నిశ్చయించెను. అంతట సాయంకాలమగుటయు కొలువు చాలించి యుధిష్ఠిరుఁడు మందిరముం జేరెను.

తొమ్మిదవప్రకరణము.

“ నెచ్చెలీ! అనుదినమును రేయును బవలు ననుభేదము లేక యిట్లునీవు కన్నీరువిడుచుచు వాపోయెదవేని యీదుఃఖవృక్షము పూచు పూవులవలెనె కంటఁ బువ్వులువొడమి దృష్టికి భంగము కలిగించును. మహారాజు మీతండ్రిని జెఱఁబెట్టినాఁ డన్నంతమాత్రమున నీవు నిరాశనొందవలసినపని లేదు. భక్తవత్సలుఁడగు పరమేశ్వరుఁడు తన్ను బెద్దయు నమ్ముకొనిన మనకు నించుకయుపకార మొనర్చుంగాని యుపేక్షింపఁడు. నీవన్నపానీయములను నిదురను రోసి కడుఁదూలి చెన్నుచెదరి చిక్కి సగమైతివి. నిన్నుంగని మీయమ్మ యొడల నూపిరిలేకయున్నది. నీకుఁ దండ్రిపైఁగల కూరిమి యలోకసామాన్యమని నేనెఱుంగుదును. అయినను నీవిట్లు దుఃఖించిన మాత్రమున జరాసంధుఁ డాయనను విడుచునా! కావున భగవంతునిపై భారమువైచి యుందము. నా మాటవిని శాంతింపవమ్మా!” అని రాగలతిక యెంతయు వదరుచున్న సౌందర్యతిలక నూఱడించి కన్నీరుదుడిచి, యామె యన్నమక్కఱ లేదని యనుచున్నను బతిమాలి యెట్టెటో భోజనమునకుం గొంపోయెను. ఆగుణోత్తమయు రెండుమెతుకులు కతికి తన కాదినమునఁ బట్టరాని బిట్టలమట కలుగుటచే దాని నాఁపఁజాలక రాగలతికను సంతోషపెట్టుటకై భోజన మయినదనిపించి మగుడ మేడమీఁదకిం జని సెజ్జపైఁ గూరుచుండి పెద్దపెట్టున నేడ్చి రాగలతికం గౌఁగిలించుకొని “ యోసీ! ఇంక నా బొందిని బ్రాణములుండఁజాలవు. మాయయ్య మొగముఁ జూపుము.

ఇంచుకయే
హా! తండ్రీ!! నేను నిన్నువిడిచి యెట్లుజీవింపఁగలుగుదును?
ని యలమట నేనొందఁ జూడఁజాలవు, నేఁడింత పెనువగ పాలుసేయుట
ధర్మమే? హా దురాత్మా! జరాసంధుఁడా! ఎందఱికై నను మరణము సం
ప్రాప్తమైనదిగాని సకలరాజకులమునకు, మహీమండలమునకు నెగ్గుసే
యుచున్న నీకుమాత్రము చావురాకున్నది. తండ్రీ! నిన్ను నాకూ్రరుఁ
డు భైరవదేవునకు బలిగా నొసంగక విడిచిపుచ్చునే? మరల మాయప్ప
మెప్పటియట్ల నాకంటఁబడునే? ఇంతటి మందభాగ్యురాలికా యంతటి
యదృష్టము? మగధరాజుచేతఁ జిక్కినచుట్టములు దక్కుట యెంతటి
యదృష్టవంతులకు? ఛీ! నాపాడుపెండ్లి మాయప్పమృతికిఁ గాఁబోలు
సంభవించినది.” అని నానావిధముల విలవింపఁజొచ్చెను. ఆబాలిక
యూననముఁగాంచి రాగలతిక యడలి యాత్మగతమున “దైవమా!
దీనికిని నాకును ఋణముదీఱినట్లున్నది. ఇంతదుఃఖముతో నీపె జీవించు
నను నమ్మకము నాకులేదు. ఈయతివమనసుఁ దండ్రిమీఁదనుండి త
ప్పించుట కుపాయమొండు తోఁచిన బాగుండును. అప్పుడుకాని యీ
మె మాకు దక్కదుగదా!” యని వితర్కించుచుండెను. ఇట్లుకొన్ని
దినములు గతించె. కాలముగతించుకొలఁది నెవ్వరికైన దుఃఖము వె
నుకపట్టునుగాని యాబాలికకె దుఃఖము చెట్టువలె వేళ్లుపాఱి నాటు
కొనియెను.

ఎడతెగని పితృవియోగముచేత నాయిందువదన యిట్లు లగ్గలమ
గు నుమ్మలికమునొందుచు నానాఁటికి నెక్కుడుకార్శ్యతనొంది తల్లికి, నె
చ్చెలులకుఁ, జుట్టములకు నత్యంతభయావహమగు నవస్థనుండ నొక్క
నాఁ డుదయమున వారందఱుఁ గూడుకొని యామె ననునయించుచుండి
రి. అపుడు నడివయస్సుననున్న యొకమనుష్యుఁడు వీధివెంబడిఁబోవుచు
నాలుగైదు గుమ్మములెక్కి యియ్యది చంద్రపాలుని యిల్లగునే యని
యడుగఁజొచ్చెను. మేడమీఁదనుండి రాగలతిక యప్పురుషుని గనుం

గొని క్రిందికి దిగివచ్చి తమయిల్లుగానక యిట్టట్టుదిరుగుచున్న యా పురుషుంజేరి "యిదియే చంద్రపాలుని గృహ" మనిచెప్పి లోనికి ర మ్మని పిలిచి మేడమీఁదికిం గొనిపోయెను. అతనిం గాంచి యచ్చటి వారెల్లఁ గూరుచుండుమని యాసీనుంజేసి వానివృత్తాంత మడిగిరి. అనుగుటయు నాతఁ డిట్లనియె. "నావృత్తాంతమున కేమికాని మీకొ క్క మేలువార్త నెఱిఁగింపవచ్చితిని, చంద్రపాలుఁడుగా రెందున్నవా రో నాకుఁ జూపవలయు" నన వారందఱుఁ గన్నుల నీరొలుక నూర కుండిరి. ఈమనుష్యుఁ డాయాలాపములఁబట్టి "పూజ్యుఁడయిన చం ద్రపాలుఁడు మఱియొకలాగయ్యెనా! పాపము వాని గాదిలిపుత్త్రియై న సౌందర్యతిలక యేది" యని యడిగెను. రాగలతిక వానికుత్తరము గా నిట్లనియె. అయ్యో! ఆయన మఱియొకలాగు గాలేదు. జరాసం ధమహారాజు వారిం గారణాంతరమునఁ జెఱనుంచె. ఈమెయె యాత ని ముద్దుకూఁతురగు సౌందర్యతిలక" యను పలుకుల కాతఁడించుకచిం తించి "యిక్కడనున్న వారందఱు మనకాప్తులేకదా! పరులెవ్వరును లేరుగదా! "యని యడిగి యందఱు మనకాప్తులేయని రాగలతిక ప్ర త్యుత్తర మొసంగినయనంతర మిట్లనియె. "ఈసౌందర్యతిలక ప్రాణము లకుఁ బ్రాణమయిన కళానందుఁడు నారాయణుని కృపవలన నెట్టెటో చేదిరాజు చెఱనుండి దాఁటి బైటఁబడి యిచ్చటికి వచ్చియున్నవాఁ డు. మీకు సమ్మతియయ్యెనేని నాతని నిందుఁ దోడ్కొనివచ్చెదను. అతని రాకయు నునికియు మీరు గడురహస్యముగా నుంచవలయును." అని యూరకుండెను. ఆపలుకులువిని రాగలతిక "యమ్మయ్య యిఁక బ్రదికినాముగదా" యని కేకవైచెను. అచ్చటివారెల్లరును సంతసించి రి. శ్రవణానందముగావించిన యావచనామృతధారలకు సౌందర్యతిల క యుబ్బి యంతదనుక పానుపుపై మేనుజేర్చి పలుకఁజాలకుండియు న పుడు చివాలునలేచి "యేమి! హృదయేశ్వరుఁడు నిశ్చయముగ నీ

గ్రామమునం దున్నవాఁడా? రాగలతికా! యీతని కేదయినఁ బారి తోషికముగా నీయవే" యని కన్నులనుండి యానందబాష్పములు రాలఁ బరవశయై యుండెను.

చిరకాలమునుండి ప్రియవియోగముచేతను బితృవియోగము చేతను వివర్ణమై దైన్యతం దెలుపు నామెముఖారవిందము కళానందుని రాకచే విచ్చి తెలివొంది యొక వికాసమొందెను. తల్లియు నింటఁ గలకొందఱు పెద్దలు నాతనిం దోడుకొనివచ్చిన జరాసంధునివలన నెద్దియేని కీడుమూడునోయని యెంచి తలఁకియు నాతనిరాకచే బాలికయైనం బ్రిదుకఁగాంచునని యాతనిం దీసికొనిరమ్మనిరి. రాగలతికయు నదియుక్తమని శ్లాఘించెను. ఆమహాశూరశిఖామణి మానాయనగారిని గారాగృహమునుండి విముక్తుని జేయఁగల బిరుదుమగఁడు గదా!" యని యబ్బాలిక పలికెను. వచ్చిన యాక్రొత్తవాఁడు వారితో "పగటివేళ నాతఁడువచ్చినఁ గడుఁజేటువాటిల్లు. ఈరేయి రెండుజాములగునప్పటికి మేము వచ్చువారము. మీరు జాగరూకతతో మేలుకొని యుండవలయును." అని యిచ్చవచ్చిన తెఱఁగునఁ బోయెను. బాలికయు రాగలతికయు మాత్రము సౌధముమీఁద నుండిరి. తక్కినవారు క్రిందికి దిగి యథోచితకృత్యముల నిర్వర్తించుచుండిరి. ఆయెలనాఁగ రాగలతిక మోమువంక చూపునిలిపి రాగభరితమైన తనయంతఃకరణమును జెలిమికత్తెకు నెఱుఁగింపఁదలఁచి యిట్లనియె. "ఓసీ! నిశ్చయముగ నామానవలోకమన్మథుఁ డీదినమున నిచ్చటికి వచ్చెనేని నాయుమ్మలికయుఁ దీఱినదని యనవచ్చును. అతని వదనసుధాకరమండలమును దర్శించుభాగ్య మబ్బెనేని యాతని వచనామృతధారావర్షమునం దడియుసంతతటి పున్నెముఁ జేసికొంటిమేని కొలఁదంతలెల్ల నడఁగంట భూలోకస్వర్గమనుభవింపనా! ఆయనపేరు వినినంతనే మంత్రాక్షరములచేతన శించునట్లునాయలమటయంతయు నెందోయడఁగినది, ఆమోముసందము,

నామేనిసొబగు, నావాలుచూపులు, నాయెలనవ్వు, నానడలహొయలు, నామాటలతీయఁదనము నొక్కసారి మనకుఁదేటపడ నామహాత్ముఁడు వచ్చి మనమధ్యమున నిలిచినపక్షమున నింద్రజాలుని చేతికీలుబొమ్మవలె నేను విశ్వమునంతయు మఱచి యానందవార్ధి నోలలాడనే? అబ్బా భగవంతుఁడగు సూర్యుఁ డెంతకుం గ్రుంకఁడేమి? అయ్యో చెలీ ! యీదినమున సూర్యుండస్తమించుట యుండునే?" అని కాముకజనముల కుచితమగు నాలాపములఁ జేయుచుండ రాగలతిక నవ్వుచు నెచ్చెలీ! నిజముగ నాతనిరాకచే నీవట్టులుండి మమ్మందఱ మఱతువు. ప్రొద్దెప్పటియట్ల తిరుగుచున్నది. నీవేగిరపాటున నీవిట్లు పరితపించెదవుసుమీ!" యని యుత్తరమిచ్చెను. ఎట్టెటో యాదినముముగియఁ గళానందుఁడిట్లె యీరేయి చంద్రపాలునిసౌధంబుఁ బ్రవేశించునని యెఱింగించుటకోయనఁ బ్రభాకరుఁ డపరవారినిధియందుఁ గ్రుంకెను. కళానంద సౌందర్యతిలకల హృదయములఁ గ్రిందుకొనియున్న మోహాంధకారము తెఱఁగున మహాంధకారము దిక్కులఁ గ్రమ్ముకొనియె. ప్రియులనిమిత్తము తలుపుచాటుననుండి మొగములించుక యగపడఁ దొంగితొంగిచూచు నంగనామణుల చాడ్పున నక్షత్రములు మినుకుమినుకుమని కానఁబడఁ జొచ్చెను. క్రమక్రమమున నగరముననున్న జనులు వ్యాపారములుమాని నిదురింపనేగిరి.

ఆకాలమున జరాసంధ శ్రీకృష్ణులకు మిక్కుటమగు పగయుండుటచే ద్వారకానగరమునుండి వేగులవాండ్రు రేలు మారువేసములతో వచ్చి గిరివ్రజమునఁగల్లు గుట్టు నెఱిఁగి పోదురను ననుమానముతో మగధరాజు బాటసారులఁ జక్కగఁ బరీక్షింపవలయుననియు వారిచర్యలు మాటలు ననుమానాస్పదములుగ నుండునేని వారింబోనీయక యారాత్రి నిలుపవలయు ననియు నారక్షకభటులకుఁ గఠినమైన యుత్తరువుల నిచ్చియుండె. అందుచే ముఖ్యముగా రాత్రులందుఁ బయనముసేయు

బాటసారులను రాజభటులుపట్టి బాధింపక విడుచుటలేదు. టక్కరితనములయందు మహానముద్రులగు కోరక కాణభూతు లనునిరువుర వెంటఁబెట్టుకొని కళానందుఁడు ద్వారకానగరమును బాసి నిరంతరప్రయాణముల గిరివ్రజమునుజేరి యేరికిం గానఁబడుట కిష్టములేక యూరనందఱుఁ దన్నెఱిఁగినవారగుట రాత్రి పురముఁ బ్రవేశించి క్రొత్తగా నక్కడకు వచ్చియుండి తన్నెఱుఁగని యొక బ్రాహ్మణుని యింట దిగి మరునాఁడు పగలు కోరకునిచే సౌందర్యతిలకకు తన రాకఁ జెప్పఁబుత్తెంచెను. ఆసందేశము నిదివఱకు మీరలు వినియున్నారు. నాఁటిరాత్రి కళానందుఁడు తత్సేవకద్వయముతోడఁ జంద్రపాలుని గృహముజేరఁ బయనమై యొక్కయెద్దుబండినెక్కి రాజభటులచేతఁ బరీక్షింపఁబడకుండ పోవలయునని యోజించుచు నందుఁ బండుకొనియెను. బండివెనుక కోరక కాణభూతులు వచ్చుచుండిరి. బండివానికి గమ్యస్థానముఁ దెలియఁజెప్పకయే వారు శకటముం దోలించుకొని పోవసాగిరి. అట్లరుగుచుండఁ గొండొకయెడ రాజభటు లాబండిని దూరమునఁ గాంచి తమవైపు వచ్చుచుండటఁ జూచి కాణభూతి కళానందునితో “నయ్యా! మీరు మాటలాడవలదు. రాజభటు లిటవచ్చుచున్నారు. దీని కుపాయము నేనును గోరకుఁడును బన్నువార” మని మెల్లగా ననులోపల రాజభటులు సత్వరమున వచ్చిరి. అంతకుమున్న కాణభూతి “హాతండ్రీ! మాగతి యేమిచెప్పితి” వని కన్నీరు దుడిచికొనుచు నేడ్వసాగెను. కోరకుఁడు హా దైవమా! యెంతపనిచేసితి”వని ఱొమ్ముమోఁదుకొనసాగెను. రాజభటులువచ్చి పొదివి బండినిలిపి “యెవ్వరు మీ రెందేగుచున్నా” రని యడుగ బండివాఁడు నివ్వెరపడి చూచుచుండెను. సేవకులిరువురు పెద్దపెట్టున నేడువఁజొచ్చిరి. భటు లత్యాశ్చర్యముతో దానికిఁగారణము నడుగ వెక్కి వెక్కి యేడ్చుచుఁ గాణభూతి యిట్లనియె. “అయ్యా! యీతఁడు మాతండ్రి, కడువృద్ధుఁడు. వీరి నొకగడియ క్రిందటఁ బుడుగు

ముట్టుకొన్నది. నోటమాటలేదు. చికిత్సనిమిత్తము విషవైద్యుని యిం
టికిం గొనిపోయెదము." అని నేలంబడి యిరుగురును దొర్లి రోదనము
చేసిరి. రాజభటు లది నిశ్చయముగా నగచి పొమ్మని సెలవిచ్చిరి.

పదియవ ప్రకరణము.

ప్రొద్దుగ్రుంకినది మొదలు రాగలతిక తనచెలి వసియించు
మందిరము నెంతయు నలంకరింపందలంచి పెక్కుదీపములు వెట్టించి పట
ములు బొమ్మలు మొదలగువానినుంచి యింక ననేకములగు చిత్రము
లం దేరంబంచి తనచెలి హృదయమునుండి నెవ్వగను బాపినచందమున
మందిరమునుండి మాలిన్యముందుడిచి పాఱవైచి యామె మొగము
చందమున మందిరముగూడం గనువిలాసవంతముగ నగపడం జేసెను.
అంతతో నిలువక సౌందర్యతిలకకుం గమ్మసంపంగినూనెతోం దలదువ్వి
జాళువాపసిడినగలు విలువకెక్కు రతనాల సొమ్ములు వెట్టి క్రైసేసి
యెంతటి నియమముం గైకొన్న విరాగిమనసునైనం గలంపం జాలి కాముని
చేతి బాకుచాయనున్న తనచెలిసోయగముం జూచి తానెయక్కజమం
ది దృష్టిదోషము దగులునను భయమునం బలుమాఱు లాచాయం
జూడమానెను. భోజనానంతరమునం గొంతసేపు కూరుచుండి తల్లియు
నితరబంధువులును మేలుకొనం జాలక లోనికరిగి నిదురించిరి. సౌంద
ర్యతిలకయు రాగలతికయు నిదుర యనుదాని నెఱుంగక చెప్పవాల్ప
కయుండిరి. చీమచిటుక్కుమన్నం బ్రియుండరుదెంచినాండుగదాయని కల
వరమొందుచు నట్టిధ్వనికిం గారణమరసి రమ్మని రాగలతిక నంపుచు,
నిముస మొకసంవత్సరముగం గడపుచుం దీవ్రమైన యుత్కంఠతో నా
యిందుముఖి యెద్దియుందోంపక కాముకజనమున కనుభవైక వేద్యమ
యిన మనశ్చాంచల్యమునకు లోనై యుండెను. జాము రాత్రిమైనది

మొదలుగ రాగలతిక చంద్రశాలనుండిదిగి కవాటముకొద్దఁ గూరుచుండి, మార్గమున నెవ్వరుపోవుచున్నఁ దలుపుఁదెఱచి కనుంగొనుచు నెంతయేని మెలఁకువతోఁ గావలియుండెను. ఇంతలో నొకశకటము దడదడఁబరుగెత్తుకొనివచ్చి తమయింటి ముందర నిలుచుటయు, నందుండి యొకపురుషరత్నము వెడలి వచ్చుటయు, వానివెంట నిరువురుసేవకు లుండుటయు, వారు బండివానికిఁ గొంతసొమ్మిచ్చి వానిననిపి, పిమ్మటలోనికి రాఁబోవుటయుం గాంచి రాగలతిక తలుపుఁదెఱచెను. వారుమువ్వురును మాటలాడకయే లోనంజొచ్చిరి. ఆరాగలతికయుఁ బలుకకుండ కవాటము బంధించెను.

రాగలతిక కళానందుని గుర్తుపట్టి "అయ్యా! జ్ఞాపకమున్నదా!" యని యడిగిన నాతఁడు లేనగవు మొగమునఁ దోఁప "నాకేల జ్ఞాపకముండకపోవు" నని యుత్తరమిచ్చెను. పిమ్మట కోరకకాణభూతుల కిరువురకుఁ బండుకొను నిమిత్తము చెఱియొక పక్కచూపించి యందు విశ్రమింపుఁడని వారితోఁ జెప్పి కళానందునిజూచి "దేవరవారు మేడమీఁదికి వేంచేయవలయునని చిఱునగవుతో మెల్లన ననియెను. తాను ముందునడువ నారంభింపఁ గళానందుఁడు వెంటఁ బోవుచుండ శకటము తమ వాకిట నిలుచుటయు లోనగుసందడి యెఱింగి సౌందర్యతిలక యెన్నఁడరముగాని యానందముతో మేడమీఁదనుండి యామహాత్ముఁ డెపుడుతనకనులకఁ అవు దీర్చునని యువ్విళు లూరుచుండె. రాజనందనుఁడు సోపానములు మెల్లమెల్లగ నెక్కి మీఁదికి వచ్చుచున్న ధ్వని నాలకించుటతోడనే తీవ్రమైన యుత్కంఠచే నీసుందరాంగికి గుండియలు కొట్టుకొనసాగెను. అంత నారాజకుమారుఁడు మహానంద భరితహృదయుఁడై తానంతదనుక నెక్కటొక్కటిగ దాఁటివచ్చిన పెక్కుచిక్కుల చాఁపున మెట్లదాఁటి వచ్చి కట్టెదుటఁ దనపై జరానంధున కసూయవొడముటకుఁ గారణంబై చిరకాలమునుండి హృదయస్థితమై

నేఁడు తనమనోరథము ఫలించిన చాడ్పునఁ బ్రత్యక్షమై దీపికా మధ్య
మున నిరుపమానదీధితుల వెడలఁజిమ్ముచు జగన్మోహనావతారమో
యని భ్రమఁ గలుగఁజేయు నామందయానం గనుంగొనియె. కనుఁగొ
ని లావణ్యామృతము స్రవించు వదనసుధాకరమండలమును, సిగ్గునృత్య
ముచేయుచున్న విశాలపుండరీకలోచనములును, విరహవ్యథాగ్నిజ్వా
లచేఁ గృశించి వన్నియదేరిన నెమ్మేనిబంగారుచాయయు, నిచ్చవచ్చిన
తెఱఁగున ననుభవింపుమని రెండుకన్నుల నొప్పించి తాను నివ్వెరపడి
నిలువఁబడియె. అబ్బాలికయు రాకొమరుఁడు లోనికి వచ్చుచుండ మొ
గమునందము కొంతసేపు సోగకన్నులమురిపెముఁ గొంతసేపు వెడఁదఱొ
మ్ముపేర్మిఁ గొంతసేపు దీర్ఘబాహువులపొలుపుఁ గొంతసేపు తనివితీరియుఁ
దీరనట్లు గనుంగొని యాతండు డగ్గఱినతోడనె సిగ్గుపెంపునఁ దలవాంచి
మేలుతూపులఁ బోలు వాలుచూపుల కందినంతవఱకు నానృపకుమారు
ని లావణ్య మనుభవించుచుండెను. రాజకుమారుఁడు నివ్వెరపాటు
తన్ను విడిచిపోవుటయు రాగలతికతో నెద్దియో మాటలాడ నుంకించు
చుండ నింతలో యొకపీఠమువైచి నామె వానినం దాసీనుంగమ్మని ప్రా
ర్థించెను. ఆవేఁడికోలు నంగీకరించి కళానందుఁడు పీఠముపైఁ గూర్చుండి
యేరితో నపు డేమనుటకుఁ దోఁపకునికి నూరకుండెను. పరస్పరా లోకన
ముల నేఁతయుఁ దనివిదీర్చుకొనుచున్న యాపడుచువాండ్ర నిరువురను
జూచి యామెకన్న నాతఁడె చక్కనివాఁడో వానికన్న నాయమ చక్కని
దియో నిశ్చయింపఁజాలక యట్టియసమానరూపసమేతములగు వారిశరీర
ములు పార్వతీపరమేశ్వరులలాగున నెన్నండేని దాంపత్యవిధిచేఁ గలసికొను
భాగ్యమబ్బునే యనుకొనుచు నింతటి చక్కఁదనము విధాతసంఘటింపం
జాలెనో యని యక్కజ మొందుచుండెను. అంతఁ గొంతసే పందఱు
నూరకున్నఁ గళానందుఁడు రాగలతిక నుద్దేశించి “ మీచెలి సుఖము
గానున్నదా? పాపము పూజ్యులైన చంద్రపాలునకు నేననుకొనినట్లె

కష్టము సంభవించినది. అయినను మీరు వగవఁబనిలేదు. స్వల్పకాలమున మీయప్ప మఱల మీకగపడఁగలఁడు" అని పల్కెను. ప్రియుఁ డూరడించుచుండ నామెలనాఁగకుఁ దండ్రివృత్తాంతము జ్ఞప్తికివచ్చెను. కనుగొలఁకులనుండి వెచ్చనిబాష్పము లురల నామించుఁబోఁడి యించుక దుఃఖింప నప్పటికి హృదయముకరఁగి కళానందుఁడు నిజపీఠమునుండి లేచి యాచివురుఁబోఁడి దగ్గఱకుఁజని కన్నీ రుత్తరీయాంచలమునం దుడిచి వగవవలదని బుజ్జగించి చల్లఁదనమునకు ఠావగు నామె పాణిపద్మముం గేలఁ బట్టి తన సమీపమునం దొకపీఠముపైఁ గూరుచుండఁ బెట్టుకొనియెను. ఆకరస్పర్శసుఖముచేత వారిరువురును హాయిహాయి యని యానందమనువెల్లువను మునింగిరి. అంతకు మున్నెవ్వ రెట్టిభంగుల నూఱడించినను బితృవియోగ దుఃఖమునుండి తేరని యాయబల దాహిమపండులఁబోలు ప్రియవచోరచనలచే నాశ్వాసింపఁబడి నెవ్వగమాని తత్కరస్పర్శనమున నలమట యెటకేనియుంబోవ సంతోషాయత్తచిత్తమున నుండెను. రాజనందనుఁడు సలిపిన యాయాదరణముచేఁ గొంచొకపరిచయము జనవు గాంచి యాకలికిమిన్న మును దన్నలమినసిగ్గు పెంపునువిడిచి తలయెత్తి యాతఁ డడిగినమాటల కొకవిధముగా నుత్తర మొసఁగుచు మరల నొక్కయెడ లజ్జించుచు ననేకావస్థలకు లోనై యుండి నడుమ నొకసారి యిట్లనియె. "రాగలతికా! ఈమహాత్ముఁడు మనపురము బాసినది మొదలు నింతదనుక నెందెందువసియించె నేమేమి యొనర్చె నదియెల్ల నీవు వినుట కుత్సహింతువని తలంచెద." అనవుడు రాగలతిక తచ్చరిత్రము నెఱుఁగఁజెప్పుమని వేఁడుకొనియెను.

ప్రియురాలి నోటనుండి యంతమాత్రపుమాట వెలువడునా యని కనిపెట్టుకొనియున్న ప్రియుఁ డామెయాసతి శిరసావహించి యిట్లనియెను. "కరుణాద్భుతరసముఁ గనికిపట్టగు నాచరిత్రము నంతయు మీకుఁదెలిపెదఁగాని ముదుసలియైనను నామీఁదనే తన యాసలెల్లనిలిపి

నాకయి కంటికి నేలకు నేకధారగా నేడ్చు మాయమ్మ జీవముతో నున్నదా! పుత్రశోకపీడితయై మందభాగ్యురాలగు నామె నిరాశచే బెంగపెట్టుకొని మాతండ్రింగలసికొన్నదా! ఆవార్త ముందుగా నెఱింగించి నాసందియము వాఁపవలయును." అని దీనాననుండై యడుగుటయు రాగలతికాగుణోత్తమ లైకకంఠ్యముగ ధారుణీదేవిగారు కుశలముగానున్నారు. రేపటియుదయమున మీకామెదర్శనము రహస్యముగ నగునట్లుచేసెద" మని యుత్తరమిచ్చిరి. ఆపలుకులువిని సంతోషితాంతరంగుఁడై యాకుమారపుంగవుఁడు తనయుదంత మెఱింగింపఁదలఁచి యిట్లనియె.

"కళ్యాణీ! నాపాలి పెన్నిధియు నానోఁచిన నోములపంటయు నాయదృష్టదేవతయు నగు నిన్ను జరాసంధుఁడు రణార్ణవున కీప్సింపఁదలఁచినవార్త నాచెవింబడియె. అయ్యదివిని నేను శ్రీకృష్ణసహాయమున నామనోరథసిద్ధి నొందఁగలనని ద్వారకానగరమునకుఁ బోవసమకట్టి యాదవపయనము మాయమ్మవినిన నప్పుడ మృతినొందునని పాటలీపురమునకుం బోయి వచ్చువాఁడనని" యామె సెలవుగైకొని ద్వారక కరిగి నందనందన చరణారవిందముల సందర్శించితిని. అతఁడు నాకభయహస్తమొసంగెను. అందుచేతనే కాదె యచ్చటనుండి నీకు మొగలియాకుటుత్తరము వ్రాసి యొకసన్యాసి కిచ్చి పూలవర్తకున కిమ్మని" యనిపితిని. అది మీకందెనేమో నేనెఱుఁగ. నాఁడు గోరువంకను నేను దెచ్చి నీకిచ్చినపుడ నాచిత్తము నీయందుఁ దవుల్కొని యెంతమరల్చిన మరలదయ్యె. ఆప్రథమదర్శనము కాని రెండవమాఱు మనముకలసి ముచ్చటింప నవకాశమొదవదయ్యె. కాని నాగవల్లి రెండుమూఁడు సారులు నాకడకరుదెంచి నీడెందము కళానందునిపై హత్తియున్నదని శ్రవణానందముగఁ జెప్పి నన్ను గృతకృత్యుని జేసినది. అట్లు నాగవల్లిముఖమున నీమనసు జాడకట్టియే కాదే నేనుత్తరమువ్రాయ సాహసించితి'

అని నుడివి యనంతరము తాను ద్వారకనుండి బయలువెడలుటయుఁ గృష్ణసందేశము నింద్రప్రస్థపురమునఁ బాండవాగ్రజునకు విన్నవించుటకుఁ దానరుగుచుండ మార్గమధ్యమున శ్రావణుఁడు మృతినొందుటయుఁ దన్ను జేదిరాజు సేవకులు చెఱబట్టుటయుఁ దానక్కడఁ బెక్కుసిలుగులఁ బడుటయుఁ గొన్నినాళ్ళకు జరాసంధునిపాలనుండి జాతవేదుఁడువచ్చి తన్ను వెంటఁబెట్టుకొని వచ్చుటయు మార్గమధ్యమునఁ దాము దారితప్పి ద్వారకకుఁ బోవుటయు నచ్చట నందకుమారుఁడు దన్ను విడిచిపుచ్చుటయుఁ దాను గోరక కాణభూతులతో వచ్చుటయు లోనగు చరిత్రమెల్ల యిందుమతీచరిత్రాద్యుపాఖ్యానములతో రసపుష్టిచేసి చెప్పి గుణోత్తమకు రాగలతికకు నాశ్చర్యము శోకమును గలిగించి కట్టకడపట నంతకుమున్న మాయాసముద్రులగు కోరక కాణభూతులు తన్ను బండిలోఁ బరుండఁబెట్టి రాజభటులకుఁ దెలియకుండఁజేయ వారు పన్నినయుక్తి నుగ్గడించి కడుపులు పగులునట్లు వారిని నవ్వించెను. ఆ నవ్వులయినవెనుక మరలఁ గళానందుఁడు సౌందర్యతిలక మొగమువంకఁ దన నెమ్మొగముఁ ద్రిప్పి యిట్లనియె. "ఓమంజువాణీ మండువేసవియం దాముఱేనుఁగు చల్లనినీరుఁదెచ్చి జఠరమునందు నిలువయుంచుకొని తాప మెక్కుడయినతఱి నానీరు నాసానాళములను బీల్చి పయినఁ జల్లుకొని సుఖించునట్లు మన తొలికలయిక నాఁడు నీవు నాపైఁ బ్రసరింపఁజేసిన వాలుఁజూపులు, లేతనగవులు, సిగ్గుపెంపులు, గారాబుమక్కువలను జ్ఞప్తికిఁ దెచ్చుకొనియేసుమీ సంతాపము నొందునపుడెల్ల నేనూఱటనొంది యిన్నినాళ్ళు ప్రాణములు మేనిలోనుంచుట. శిశుపాలునివీట నాపడినయలమటయు మార్గమధ్యమున నన్నలయించిన మనఃక్షోభము, జరాసంధుని కతనంగల్గిన యలజడియు నేఁడుగదా నీముఖారవింద సందర్శనమునను నయనారవిందకటాక్షవీక్షణమునను గరారవిందసంస్పర్శనమునను దీఱె తాపత్రయశూన్యుఁడగు ముక్తునిచందమున

హాయిగా నున్నవాఁడను.” అనిచెప్పి యూరకున్న కళానందునితో మెల్లమెల్ల రాగలతిక తానంపిన మొగలియాకుజాబు సన్యాసి పూలవర్తకున కొసఁగుటయు నాతఁడు నాగవల్లి కిచ్చుటయు నది పేవమునలి వాని నిమిత్త మొరులకు దానినెఱుఁగక విక్రయించుటయు దానికై తాను నెవ్వగఁబొందుటయు నాగవల్లి యిల్లువిడిచి భయంబున నెందేని జనుటయు నెట్టకేలకు యోగిని దానిం దమకుఁ బంపుటయు నాదిగాఁగల వృత్తాంతముంజెప్పి యిట్లనియె. “నేఁడు మాచెలి మిమ్ముఁ గాంచినకతన బ్రదికినది. ఇది మీయది. మీనిమిత్తముకాదె యట్టితండ్రి చెఱలోనుండుటకయిన నంగీకరించినది. ఇంక మీరెందు నరుగవలదు. పూజ్యులయిన చంద్రపాలుఁడు క్రమ్మఱవచ్చి మీవివాహము సేయునంతవఱక రహస్యముగ మీరిందుండవచ్చు. మిమ్మువిడిచి మాచెలి క్షణమేనియు మేన నుసుఱులు నిలుపనోఁపదు” అని చెప్పిన సౌందర్యతిలక తలవంచి నాచెలి నాహృదయమునం దున్నదానికన్న వ్యతిరేకమేమియుం జెప్పలేదు. చెఱనుండి మాతండ్రిని మనోవ్యథనుండి నన్నును విముక్తులను జేయుటయె యార్యపుత్త్రుని పనులని నాకుందోఁచుచున్నది” అనిపలికెను.

ప్రాణేశ్వరిహృదయము తనకుఁ దెల్లమైనందులకు మహానందభరితుఁడై కళానందుఁడును, ప్రాణనాయకుమనము తెలిసినదను సంతసముచేతఁ గుతూహలాయత్త చిత్తయై సౌందర్యతిలకయు సంతృప్తమనస్కులై చాలప్రొద్దామెనని యారాత్రి నిదురింపఁదలఁచిరి. అంతట హంసతూలికాతల్పముమీఁదఁ గళానందుఁడు పవ్వళించి గుండియపైఁ జేయి వేసికొని నిద్రించెను. సౌందర్యతిలకయు రాగలతికయు వేఱొకపాన్పుపై నిద్రపోయిరి. మఱునాఁడు తేపకడ రాగలతిక పడకవిడిచి ధారుణీదేవియొద్దకుఁ బోయి కడురహస్యముగఁ గొడుకురాకఁ జెప్పి యామెందోడుకొనివచ్చి చిరకాలవియోగవ్యథచేఁ బీడితులగు తల్లిని గొడుకును గలపెను.

వారొండొరులఁగాఁగిలించుకొని కన్నీరువెట్టుకొని యింకను దుఃఖించి కొం తవడి కూరడిల్లి యొండొరుల కష్టసుఖములను జెప్పుకొనుచుఁ గూరుచుం డిరి. చంద్రపాలుని భార్యలోనగువారు కళానందునిగాంచి సంతసించి వానితల్లినిగూడ నందె యుండుమని ప్రార్థించిరి. ధారుణీదేవియు నందుల కియ్యకొనియె.

ఇట్లు చాలాకాలమునకైన వారికలయిక సార్థమగునట్లు పలుపిండి వంటలుగల విందులచేతను, వాసనాపానములచేతను, లీలోద్యానవిహార ములచేతను, శ్రావ్యవీణాగానముచేతను, వివిధ కథాప్రసంగములచేత ను, చమత్కార వచోరచనలచేతను, పరస్పరవిలోకన కుతూహలము చేతను సొగటాలుమొదలగు నాటలచేతను, జిత్తరువులుమొదలగు వి న్నాణములచేతను దినమొక్కనిముసముగఁ బ్రొద్దులుపుచ్చుచు సకలమ నోవ్యథలు మఱచి తమ్ముఁదామె మఱచి ప్రపంచమేమఱచి యాజవరా లును రాకొమరుఁడును వేడుకల వెల్లిని మునిఁగి తేలుచుండిరి.

పదునొకొండవ ప్రకరణము.

గిరివ్రజనగరమున జనులందఱు నొకనాఁడు మిగుల నద్భుతరస మున మునిఁగియుండిరి. ఇది కరమాశ్చర్యమనువారు నిట్టు లెన్నఁడేము గముఁనఁ గనివినమనువారు, నిది మాయయనువారును, మాయయైన నిన్ని నాళ్లు డాగునేయనువారు, నీసారితో నిజమంతయుఁ దెలియుననువారుఁ దేలుట కేమున్న దిట్టివానియందుఁ దమకు విశ్వాసము లేదనువారునై ప్రజలు గుంపులుగుంపులుగాఁ గూడి ముచ్చటలాడఁజొచ్చిరి. శర్వాణీ ప్రసాదమున నాగతానాగతములనెల్ల నెఱిఁగి తన్నడుగవచ్చిన జనులకుఁ దెల్పి దివ్యమైన తనప్రజ్ఞ లోకమునఁజాటి కొండొకకాలముక్రిందట

నంతర్ధానమునొందినయోగిని క్రిమ్మరఁ దత్పురమునఁ బ్రవేశించుటయే యీకలవరమునకుఁ గారణమని చదువరులూహింపవలయును. చాలకాలముక్రిందటఁ దనయొద్దనుండి మహారాజుగారి ముద్దుటుంగరమును, దనకఁ బ్రయత్నముగ లభించిన మొగలియాకుజాబును గైకొని కైలాసమునకుఁ బోయివచ్చెదనని చెప్పి యరిగినయోగిని వెండియుఁ దమనిమిత్తము వచ్చినదని విని రణార్ణవుఁడు తనవిశ్వాసము ముమ్మడిగా నాశుభవర్తమానమునుజరాసంధునకు విన్నవించి యాతేని యనుమతిఁబొంది మఱునాఁటి రాత్రి తద్దర్శనార్థమేగెను. యోగినియు మున్ను దాను వసియించినచోటనె బసచేసియుండి తనశుశ్రూషనిమిత్తము వెనుకఁ దన్ను సేవించిన దాసిన రావించి తన్ను ప్రశ్నములడుగు వారలకుఁ గానఁబడకుండ నెప్పటియట్ల యవనికచాటున నుండియె యుత్తరములు చెప్పుచుండెను. ఆమహానుభావురాలు తన్నగరమునకు వేంచేసిన నాఁటిరాత్రియుఁ మరునాటిరాత్రియుఁ దమభావిశుభాశుభములఁ దెలియఁగోరి బహుజనులువచ్చి యామెనడిగి తృప్తినొందిన యంతరంగములతో నరిగిరి. అందఱు జనినవెనుక రణార్ణవుఁడు కడుసొగసు మిగులు వేషముతో నరుదెంచి పరిచారికచేత సన్మానింపఁబడి యొకపీఠముపైఁ గూరుచుండి యొకగడియసేపూరకుండి యనంతరము వినయనయభయచేతస్కుండై చేతులు జోడించి యిట్టులనియెను, "ఓమహాదేవి! నీవు సాక్షాత్పార్వతీమహాదేవివి. నీచరణారవిందములను గన్నులపండువుగఁ గనుఁగొన్నవారికి మరల జన్మదుఃఖములుండవు. కొందఱు మొఱకులగు జనులు నీవు రాక్షసాంగనవనియు మమ్మువంచించిపోతివనియును వచింపరానిదుష్ప్రలాపము లాడి దోసము మూటగట్టుకొనిరి. ఇంతటి ప్రజ్ఞానిధి మహిమాఢ్యవైన నిన్నట్టు లనుటకు వారినోరెట్టులాడెనో తెలియదు. నీవు కైలాసముననుండగా నచ్చట నేమిజరగినదో మావిషయమై యేమివచ్చినదో తెల్లముగ నెఱిఁగింపవలయునని దీనముగఁ బ్రార్థించెను.

భయమును భక్తియు విశ్వాసమునుగల యాప్రార్థన చెవిఁబడు టయు యోగిని తెరచాటుననుండి రణార్ణవున కగపడకయే కెవ్వుననఱచి పండ్లు పటపటఁగొఱికి మహోగ్రహోద్వృత్తచిత్తయై యిట్లులనియె. “ హో దురాత్ములారా! పౌరజనపదహతకులారా! మందభాగ్యులరగు మీ రందఱు నామహోగ్రహముఁ జేసి హతాసులై తిరిరా! ఏమేమి! మేము వంచనార్థమై వేంచేసితిమనియు రాక్షసాంశమున జనియించితిమనియుఁ గొందఱు దురాత్ములు కాఱులఱచిరా! ఆపాపాత్ములెవ్వరో యెఱిఁగింపుము. ఆదుష్టకష్టజనంబుల నీక్షణమే మదీయదారుణ శాపోపహతులఁ జేసెద. చెప్పవేని నిదె చూడు పురాంతక మురాంతక బలాంతకు లడ్డవచ్చిననుసరే యీమగధరాజ్యమును మహారణ్యము గావించెదను. ఈగిరివ్రజపురము భస్మీభూతము గావించెదను. ఈజనమెల్ల మహానరకకూపములఁ బడునట్లు మదీయయోగసంపాదితమగు మహామహిమావిశేషమున శపియించెద. అట్లాప్రజలు ప్రేలుచుండ నీవు నీరాజు నేమైరిరా? మీ రాజు పశువా? నీవుపశువువా! వారినిహరించి శిక్షాభాజనులను జేయలేదా! ఇదె చూడు సకలజననిర్మూలనమునకై సంకల్పించెదను. “ అని మహానాదముగల యొకగంట గణగణవాయించి “ ఓం భైరవాయనమః, చండీశ్వరాయనమః, రుద్రాయనమః, మహాకాళేశ్వరాయనమః, త్రిపురాంతకాయనమః ” యను రుద్రనామస్మరణ జేయునప్పటికి రణార్ణవుఁడు మహాభయావేశమునఁ బెదవులెండిపోయి మాటరాక యుండ మేనెల్లఁ జెమ్మటఁగ్రమ్మ గడగడవడఁకుచుఁ జేష్టలుదక్కి యుండెను. పరిచారిక యింత లో లోనికరిగి “ అమ్మా! పాపమీతఁడు మీకుఁ గడుభక్తుఁడు. వీసినె ట్లయిన సైరింపవలయును. కనుదీనుఁడై చేష్టలు దక్కియున్నవాఁడు సుఁడీ! ” యని మనవిచేసి యీవలకువచ్చి రణార్ణవునితో “ నోయీ యామెపాదములపైఁ బడి శాపోపహతులరు గాకుండ నిన్నును నీరాజును రక్షించుకొను ” మనియెను. అతఁడును లేచి యుత్తరీయము మెడకుఁ

జుట్టుకొని యామెయడుగులు తెర కీవలనుంపుమని ప్రార్థించి యామె య టుసేయ నాచరణంబులంబట్టుకొని భయమున వడఁకి యేడ్చి క్షమించితినని యోగిని యనునంతకును విడువకుండెను. యోగినియు వానిని క్షమించి ప్రసన్నయై యనంతరము వానితో నిట్లనియె. "ఓయీ! నాకలుకవోడ మించినవా రిక్కడకు రారు. నాదయకుఁ బాత్రులగువారు మహదైశ్వర్య ముల ననుభవింతురు. నేను మీరాజ్యమున కత్యంతహితము నాపాదిం పఁ దలఁచుచుంటిని. నేను కైలాసమునకుఁ బోయినపు డచ్చట జరగినచి త్రములు వినుము. భక్తవత్సలుఁడగు శంకరుఁడు భవానీసమేతుఁడై యొక నాఁడు కైలాసముమీఁదఁ బ్రమథగణములు, వేలుపులు నింద్రాదిదిక్పాల కులు నారద వశిష్ఠ జామదగ్ని మార్కండేయప్రముఖులగు జడదారులు ప రివేష్టింపఁ గొలువుదీర్చియుండె. అప్పుడు వినయనయభయసంభ్రమముల తో నేను నాసభామధ్యమునకుఁ జని ముందు నుమామహేశ్వరులకు నవలఁ దక్కినవారలకు జోహారొనర్చి నిలిచియుండ శంకరుఁడు నన్ను గూరుచుం డుమనియె. పార్వతియు నామహిమ మెఱుఁగుటచేతఁగాఁబోలు నన్ను బ్ర త్యేకముగాఁ దనయొద్దకు నమ్మని యొక పీఠమువేయించి కూరుచుండఁజేసి నన్ను వేయివిధముల నుగ్గడించె. ఆపలుకులువిని దిక్పాలురు దమ కెన్నఁ డును జరగనిగౌరవము లభియించుటఁజేసి యందఱు నక్కజమునొందిరి. ఆగోడవలేటికి మనవిషయమై చెప్పెద నాలకింపుము. మేమందఱ మచ్చ టనుండ భవాని మహేశ్వరు నుద్దేశించి దేవా! కృష్ణజరాసంధుల బల తారతమ్యముల నీవలఱుఁ గొంత సెలవిచ్చితిరి. వారిలో గెలుపోటము లె ట్లున్నేకుఱునో యానతీయరే యని యడుగఁ గరుణాంతరంగిత హృదయుఁ డై దేవదేవుఁడు పెదవివిఱిచి యిట్లులనియె. దేవీ! జరాసంధుఁడు మహా బలసంపన్నుఁడు, కృష్ణునకు బాహుబల మంతగాలేదు. కాని బుద్ధిబలమె క్కుడు. అందుచేత నిదివఱకు మగధరాజుచే నిరువదియొక్కసారు లోడె ను. ఈపర్యాయము మాగధవాసుదేవులకు ఘోరయుద్ధము వాటిల్లు.

పాప మందుఁ గృష్ణుఁడోను. యాదవకులము నాశనమొందును. ఇది భూలోకమునందుఁ డెలియరాదు. మునులారా! మీరెవ్వ రెందు నిది నోఱుజాఱి యనవలదుసుఁడీ!" అనిపలికెను. అందఱు నాశ్చర్యరసమగ్నులైరి. కొందఱు దుఃఖితాత్ములైరి. తరువాతఁ గొన్నిప్రసంగములు నెఱపి మహేశ్వరుఁడు నాఁటికిఁ గొలువుచాలించెను. నేనక్కడనేయుండి మగధరాజు నన్నుపినాఁడని యుంగర మానవాలుచూపి యామొగలియాకుటుత్తరమువ్రాసినవానిపే రడిగి యింకను గొన్నిరహస్యములనడిగి తెలిసి వచ్చితి. అవియెల్ల వెంటనేచెప్పరాదు. ఇక్కడనయుండి కొన్నిదినములు జరగుటయు నంతయు మీరాజుతోడనే స్వయముగఁ జెప్పెదను. ఇంక మగధేశ్వరుఁడు హాయిగానుండవచ్చును. తనయల్లుఁడైన కంసుని సంహరించిన మహాపాతకుని వధించి యత్యంతానందము నొందఁగలఁడు. కృష్ణుఁ డింక హతాసుఁడైనవాఁడని నమ్ముము.

అని కర్ణరంజనముగ నామెపలుక రణార్ణవుఁ డుబ్బి తెలివొందిన మొగముతో "నమ్మా! కళానందుఁ డెన్నిదినములలోఁ బట్టువడును? సౌందర్యతిలకపొందు నాకు లభింపఁగలదా? ఆమె యింటికి హాటము నఁబోయి యాబాలికను బలిమిమై రాజాంతఃపురమునకుఁ దెప్పించుకొనవలయునని మహారాజు యత్నించుచున్నవాఁడు. అది నిర్విఘ్నముగ నెఱవేఱునా? శ్రీకృష్ణుని వేగులవాండ్రలో గుడ్డివానివేసము వేసికొని జగమును వంచించువాఁడొకఁ డున్నాఁడఁట. వాఁడు మననగరమునకే వచ్చియున్నవాఁడేమో సెలవీయవలయును. ఉంగరమును మొగలియాకుజాబును నాకు మరల నిచ్చుటకిష్టమున్న ననుగ్రహింపవలయునని వేఁడుచున్నాఁడను" అని మనవి యొనర్చుకొని యామె యలిగి యేమిచేయునో యని వడఁకుచుండెను. ఆనుమువు లాలించి యించుక చింతించి యోగిని యిట్లనియె. కళానందుఁడు బహుశః మీకుఁ జిక్కఁడు. నీకొకన్నియ తప్పక భార్యయగును. మీరామెను బట్టుకొ

ని రాజాంతఃపురమునకు నిర్విఘ్నముగఁ గొనిపోవఁగలరు. కృష్ణుని చారులలో గుప్తవేసము వేసికొనినవాఁడు ముసలివానివలెఁ గానఁబడు చు నీపురవీథుల బిచ్చమెత్తుకొనుచు మిము వంచించుచున్నవాఁడు. వానిని సత్వరము బంధింపుఁడు. ఉంగరమును మొసలియాకును నీకుఁగొన్ని నాళ్ళలో నిచ్చెదను. నీవింక పొమ్ము." అని యోగిని ముదలయిచ్చుటయు రణార్ణవుఁడు మహానందముతో నారేయి దనకుఁ జందిరపాలనందన చేకూఱినట్లు మురియుచుఁ బరవశుఁడై యిల్లుచేరెను. ఆరాత్రి నిదురించి మఱునాఁడు మహారాజును దర్శించి యోగినికడ నడచిన సకల ప్రసంగముఁ బూసగ్రుచ్చినట్లు చెప్పి యామెమహత్త్వ ము గ్గడించి కృష్ణుని పరాజయము నిక్కువమని చెప్పెను. మహారాజాప లుకులకెంతయు సంతసిల్లి యోగిని భవానీదేవి యంశమునఁ బుట్టినదని నిశ్చయించి కృష్ణుని వేగులవానిం బట్టింపఁదలఁచి యోగినీదర్శనము దానుం జేయందలఁచి కృష్ణసంహారము దాను సేయఁగలుగుట కనేక విధములఁ బరమేశ్వరుఁ బ్రశంసించి యాదినము మొదలు భైరవపూజఁ దొలుతటికన్న నెక్కుడుగఁ జేయఁదలఁచెను.

ఇది కడచిన రెండుదినములకుఁ గళానందుఁడు రాగలతికయు సౌందర్యతిలకయును మేడమీఁదఁ గూరుచుండి సరససల్లాపవినోదములఁ దేలుచుండ నాబాలిక చెలితోడ" యోగిని మరల నిక్కడకు వచ్చిన దఁట. ఈమె కరుణచేతనే కాదె యీమహాత్ముఁడు వ్రాసినలేఖ మన కందినది. ఈమె సర్వవేదియగుట నీమెను రెండు ప్రశ్నము లడుగవల యును. మాయప్ప చెఱనుండి యెప్పుడు విముక్తుఁడగుననియును" నని రెండవది చెప్పక సిగ్గునఁదలవంచి యూరకుండెను. కళానందుఁ డాభావ ము నెఱిఁగి చిఱునగవు నగియె. రాగలతికయు నెలనవ్వుతో "చెలీ రెండవప్రశ్నము నాకుఁ దెలిసినదిలే. నీవివాహమెప్పుడగునని వేగిరపడు చున్నదానవు. ఆమాట కనుంగొనుమనికదా! అట్లె యీరాత్రి నే

నందుఁబోయి నీమనోరథమును నెఱవేర్చెదను.” అని ప్రియసఖికి సంతోషముగాఁ బలికెను.

ఆరాత్రి రాగలతిక జామయినవెనుక మెల్లమెల్ల యోగినీదర్శనమునకుఁ బోయి యామె స్త్రీలకుఁగూడ దర్శనమీయక తెరచాటుననుండ నీవలఁగూరుచుండి యోగినికిఁ దనరాకఁ జెప్పిపుచ్చెను. పరివ్రాజికతోఁ బరిచారిక రాగలతికరాకఁ జెప్పుటయు నామె మాటలాడక ప్రశ్నములు పరిచారికాముఖముననే విని దానితోడనే యుత్తరములు చెప్ప నిశ్చయించెను. రాగలతిక తనప్రశ్నములు రెండును బరిచారికకుఁ జెప్పె. ఆమె యోగినికి విన్నవించి యుత్తరముఁ దెచ్చి యిట్లుచెప్పె. సౌందర్యతిలక కళానందునిఁ బెండ్లియాడుటనుగూర్చి నేఁజెప్పను. తండ్రి చెఱనుండి స్వల్పకాలమున విముక్తుఁడగు. కాని కళానందునకు గొప్పయాపద రానున్నది. అతఁడు మీయింట నున్నటుల నాదివ్యదృష్టివలన నేనెఱిఁగితి. ఈరాత్రి యాతనిని మీయింటనుండి యెందేనిఁ జనుమని యాతనితోఁ జెప్పవలయు. కాకున్న హానివాటిల్లు. తుదకంతయు శుభముగాఁ బరిణమించును. ఈపలుకు లాచెలికిఁ దెలియనీయవలదు. నీవింక జాగుసేయక పొమ్ము” అను నీమాటలు విని రాగలతిక విషణ్ణహృదయయై విచారముతో నొక్కయడుగైన నడువఁజాలక యేదియుందోఁపక యోగిని తమకు హితమునాచరించుననియు నామె పలుకులంబట్టి నడచుట కర్తవ్యమనియు నిశ్చయించి యింటికి వచ్చిచెలి యప్పటికి నిదురపోవుటచే నామెతో మాటలాడక కళానందునిబిలిచి, యావృత్తాంత మంతయు విన్నవించి తక్షణమె వెడలుమని కన్నీరువెట్టుకొనుచుఁ జెప్పెను. కళానందుఁడు పిడుగడిచినట్టులు నిశ్చేష్టుఁడై కొంతసేపటికిఁ దెలివితెచ్చుకొని కోరకకాణభూతులనులేపి వారికాసంగతి యెఱుఁగఁజెప్పి బయలుదేఱుమని నిద్రించుచున్న ప్రియురాలిచేయి త

నగుండియపై నొకమాఱు చేర్చుకొని చెప్పఁజాలక యిల్లువెడలి సేవకులతోఁ బోవఁదలఁచి పయనమయ్యెను.

పండ్రెండవ ప్రకరణము.

పూర్వమొకనాఁడు గిరివ్రజపురమునందు బిచ్చమెత్తుకొనుచుఁ గనులు గావక చెవులు వినరాక యాఁకలికి నకనకంబడుచు మంత్రికుమారుని బండిక్రిందఁబడి కాలు విఱుగుటచేఁ గడుబాధపడుచుండ నాగవల్లి కనికరముపెంపునఁ దనచేతి పూలదండను, జెంబు నమ్మి వానికి సాయముఁజేసి పుండుమాన్పుటకు మంగలియింట విడుచుట మీరెల్లఁ జదివియేయున్నారు. ఆమెచేత సంరక్షితుఁడయిన యానిరుపేదముదుకఁడు సుఖముగా నుండెను. కాని వానిరక్షించిన యాసాధుశీల, పూలచెండు విక్రయించినకతమునఁ దనచెలికి నింటికిఁ గడుదూరమై యే దేశాంతరములకోచని మరలఁ గనఁబడదయ్యె. ఆదీనుఁడు మంగలివానిసాయమునఁ గాలిమీఁదిపుండు మాన్పుకొని యెప్పటియట్ల కఱ్ఱయు మూఁకుడును జేతఁబట్టుకొని వాడలంబడి యన్నమడుగుకొని తినుచుఁ దనకే భారమైన యాజీవితము నెట్లో గడుపుచుండెను. అట్లుండి యొకనాఁడు వాఁడుదయమున రాజవీధిలో నొక యింటిముందఱ నిలుచుండి వార్ధకముచేవంగిన తననడుము నిలుపఁ దనకఱ్ఱ యూఁతగొని యింటివారు లేదుపొమ్మనినను వినరామినో దైన్యము పెంపుననో యచ్చోటువాసి పోవక యింటివారిచేఁ దిట్లుదినుచు "నయ్యో నిలువఁజాల. కాళ్ళులాగుచున్నవి. ఇంచుక వార్చి నాకిచ్చి ప్రాణమునిలుపుఁడి" యని వేఁడుకొనసాగెను. వారెన్నిసారులు లేదనినను వాఁడు తొలఁగకునికి నాగ్రహాయజమానుఁ డొకపెద్దకఱ్ఱదీసికొనివచ్చి "యోరిముండకొడుకా! నీనిమిత్తమై తెల్లవారకముందే యెవరువార్చి సిద్ధముచేసినారురా !!" యని దా

నితో వానిని మోఁదెను. తోడనె వాఁడు హా చచ్చితి! చచ్చితి!! నని నేలఁబడి యేడ్వసాగెను. చుట్టుప్రక్కలనున్న వారందఱును జేరి యా దురాత్ముని నిందింపుచు నీదీనుని లేవనెత్తుచుండ నింతలో రాజభటులు పలువురు వడివడి నడిచివచ్చి "తొలఁగుఁడు. దారియొసఁగుఁడు." అని త్వరలో నాజనమధ్యమునఁ బ్రవేశించిరి. ఆనిఱుపేదవానిని రక్షించి వానిం గొట్టినందుల కాగృహయజమానుని శిక్షించుటకు రాజభటులు వచ్చియుందురని తలఁచుచుండ వారిలో నొకభటుఁడు ముందఱకువచ్చి యిట్లనియెను. "అయ్యా! ఈముసలివాఁడు మీరంద ఱనుకొనునట్లు ముదుకఁడుగాఁడు. వీఁడు శ్రీకృష్ణుని వేగులవాండ్రలో నొకఁడు. గిరివ్రజమునందలి రహస్యములు ద్వారకకుఁ గొనిపోవఁ దాను పడుచువాఁడయ్యును గృష్ణమహిమచే వృద్ధునిలాగునఁ గానఁబడి యందఱకును జాలిగలుగునటులఁ బ్రవర్తించి లోకమును వంచించుచున్నాఁడు. వీనివంటి పాపాత్ముఁడు లేఁడు వీనిం బట్టి చెఱలో నుంపుఁడని మహారాజుగారు మాకానతి యిచ్చినారు. తొలఁగి యావలకుఁజనుఁడు" అని కఠినస్వరముతోఁ బలుకు రాజభటుని జూచి పౌరులు వెఱచి యొక్కరొక్కరుగఁ దొలఁగిరి. రాజసేవకులు వెంటనే యాముసలివానిం బట్టుకొని రారమ్మని లాగిన వాఁడు వారెవ్వరో కనుఁగొనఁజాలక యెక్కడి కెక్కడికని యడిగెను. ఆమాటకుఁ బ్రత్యుత్తరమీయకయె వానిని గెంటుకొని పోవుచునుండ వాఁడు రోదనముఁ జేయుచు "నయ్యో, యయ్యో! యెవ్వరో నన్నెత్తుకొని పోవుచున్నారు. రక్షింపుఁడు. రక్షింపుఁడు దైవమా! వీండ్రెవ్వరో రెక్కలు నొప్పియెత్తునట్లు నిర్దయాత్ములై నను గెంటి లాగుచున్నారు. తండ్రులారా!" యని యార్చుచున్న రాజునానతికి వెఱచి నోరెత్తఁజాలక యెవ్వరును దొంగిచూడక పోయిరి. ఆ దీనునట్లుచేయుటకుఁ గారణమేమని యెవ్వరేని యడిగిన మున్ను చెప్పిన యుత్తరమె చెప్పుచు వారు వానిం దోడుకొని కారాగృహమునకుం

బోయి చంటిపిల్లవానిచందమున నొక్కపెట్టున నేడ్చువానిని జెయిలోఁ బెట్టిరి. పౌరులందఱు గుంపులుగూడి "కటకటా! వీఁడు కృష్ణుని వేగులవాఁడు కాఁడు. మొదటనుండియు నీపురమునందుండి తిరిపమెత్తుకొని బ్రదుకుచున్నవాఁడు. ఇంతకన్న నన్యాయమేమున్నది. ఛీ ఛీ! జరాసంధమహారాజ పరిపాలన కరము ఘోరముగనున్నది. ఆముదుకనిజూడఁ గడుపు చెఱువగుచున్నదే! ఈదిక్కుమాలినవానివలన రాజ్యమునకు హాని కలుగునా" యని పలువిధముల వగచువారలైరి కాని రాజభటులకును రాజునకును దమయెఱింగినదంతయు విన్నవించు సాహసికులు లేరైరి.

అట్లు కళానందుఁడు రాత్రి కోరకకాణభూతులతో నిలువెడలి పోవుటయు మఱునాఁడు సౌందర్యతిలక తేపకడ మేలుకాంచి మనోనాయకునందుఁ గానక రాగలతికను లేపి యాతనివార్త లడుగ నదియు నించుక సంశయించి "అమ్మా! రాజకార్యములఁ గొన్నిఁటిని నీసేమమునిమిత్తము ముచ్చటింపఁదలంచి ప్రియస్నేహితునియింటికిఁ బోయి యున్నవాఁడు. ఈదినమునఁ దప్పకవచ్చునులే" యని యుత్తరమిచ్చెను. ఆపలుకులు వినిన గుండె జల్లుమనుటయు నామెలనాఁగ "యది యెద్దియో మిషయనియు నిజముగ రాజకార్యమున్నయెడలఁ దనకుఁ జెప్పక హాటమున నింటినుండి రాత్రి లేచిపోవుట సంభవింపదనియు నెద్దియో యాతనికిం దనకుఁ గీడు రానున్నదని విచారించి యా కారణ మెఱిఁగింపు" మని రాగలతికను బహువిధముల వేఁడుకొనియెను. ఎంతబ్రతిమాలినను రాగలతిక తనకుఁ దెలియదనియు నాతఁడు క్రిమ్మఱ వచ్చుననియు నాశ్వాసించుటయే కాని యోగినీవచనములఁ జెప్పదయ్యె. యోగిని యేమన్నదని యామె నొక్కి యడుగ శ్రీఘ్రకాలమున మీయిరువురకు వివాహమగునని యామె యానతిచ్చెనని పలికెను. ఈపలుకులెల్ల సౌందర్యతిలక చిత్తమున కాశ్చర్యము గొలుపఁజొచ్చెను. ఉత్సాహమంతయుఁ గళానందునితోడనె పోయెనో యనునట్లు బాలిక యెప్పటి

యట్లు దీనాననయై మునుపటికన్న నెక్కుడగు బెంగగొని యాపూఁట సరి గ నన్నముదినక జాలిగొలుపుచూపులతో రాగలతికహృదయమున కత్యంతదుఃఖమును గలిగింపఁజొచ్చెను. ఆనాఁడు బాలిక తలదువ్వించుకొనక పువుదోఁటయందుఁ దిరుగక వీణవాయింపక చిలుకలకుఁ బండ్లుపెట్టక సన్యసించిన శృంగారదేవతవలెనుండి సాయంకాలమునఁ బ్రియుఁడరుదెంచు నను నూహతో నెప్పుడు పొద్దుక్రుంకునోయని కనిపెట్టుకొని యుండెను. అట్లుండ నాలుగుగడియల పొద్దువేళఁ బుష్పకేతుఁడనుమంత్రి పదుగురు రాజభటులతోడను నలుగురు దాసీజనులతోడను జంద్రపాలుని గృహమునకువచ్చి నిలిచెను. రాగలతిక క్రిందనే యుండుటచే నాతని నుచితాసనము వేసి కూరుచుండవేఁడుకొని చంద్రపాలునిభార్య కతనిరాక యెఱింగించెను. ఆమెయుఁ దనభర్తకుఁ బ్రాణమిత్రుఁడైన యాతనిని సందర్శించి గుడ్లనీరుగుక్కుకొనఁజొచ్చెను. పుష్పకేతుఁడామెనుజూచి కంటనీరుపెట్టుకొని యమ్మాయి యెక్కడనున్నదని యడిగెను. అప్పుడందఱును మేడమీఁదికిఁజనిరి. వృద్ధుఁడైనపుష్పకేతుని గని లేచి సౌందర్యతిలక యొకచోనిలువఁ బుష్పకేతుఁడు బిడ్డా! కూరుచుండుమని యామె నొకపీఠముపై నాసీనురాలినిగాఁజేసి కన్నీరుతో నిట్లనియె. "అమ్మా మీతండ్రిగారి దురవస్థకు మీరెట్లువగచుచున్నారో నేనునట్లె వగచుచుండెదను గాని దురాత్ముఁడనైన నేను మీకంతకన్న నెక్కుడుకీడుసేయ నిందువచ్చితిని. రణార్ణవునకు సౌందర్యతిలకనిచ్చి పెండ్లిచేయుటకు నిశ్చయించి రాజుగారు నిన్నంతిపురమునకుఁ దోడుకొనిరమ్మని నన్ను—" అని చెప్పవాక్యము ముగియకమున్నె సౌందర్యతిలక కన్నీరు కాల్వలైపాఱ హాతండ్రీ యని నేలఁబడిమూర్ఛిల్లెను. బిడ్డయవస్థనుజూచి తల్లియు మూర్ఛిల్లెను. రాగలతిక నేలఁజదికిలంబడి వెక్కివెక్కి యేడువసాగెను. పుష్పకేతుఁడును దానంతటి ఘోరకృత్యమును జేయవలసివచ్చినందులకుఁ జింతాక్రాంతమనస్కుఁడై వారియవస్థలఁజూచి మొగమున నుత్తరీయము వైచికొని

యేడ్చెను. ఇంతలో నొకమాఱు సౌందర్యతిలక తెప్పిఱిలి 'హాతండ్రి! హా తల్లీ! నాగతి యిటుచేసితిరా' యని యేడ్చి మరల మూర్ఛిల్లెను. పుష్పకే తుఁడు సేవకులంబిలిచి పల్లకిఁదెమ్మని యానతిచ్చిన వారు నదివఱకే తెచ్చి దూరమునందుంచివచ్చిన యాపల్యంకికను గొనితెచ్చి వాకిట నునిచిరి. కూడవచ్చిన యాఁడువాండ్రు నలుగురు మేడమీఁదికిరాఁగా నాదాసీజన ముతోఁ బుష్పకేతుఁడు మెల్లగా "నీబాలికను బురుషులంటరాదు. మీ రెత్తుకొని యాపల్లకీలో మేను నొవ్వకుండఁ బెట్టుఁడీ" యని గద్గదస్వర ముతో నానతిచ్చెను. అప్పుడే రెండవమూర్ఛనుండి తెలివియించుక గాంచినయాబాలిక యాపలుకులువిని పునర్మూర్ఛావస్థనొంది నిశ్చేష్టయై యుండె. నలుగురుదాసీజను లామెయొద్దకుంజని నిలుచునపుడు తల్లి చూచి నోరునెత్తి మోఁదుకొని గుండెలబాఁదుకొని పుత్రికయొద్దకుఁబో యి యామెపైఁబడి "హాకుమారీ! నాతల్లీ!! యిన్నిదినములుపెంచి ని న్ను మృత్యుదేవతకప్పగించినాను. అయ్యో! నీవులేని యాయింటి లో నేనెట్లుండఁగలనే? అమ్మా మీతండ్రిగా రట్లయినను నిన్నుజూచు కొని కాలము గడపుచున్నదాన. నాకెవ్వరుదిక్కు తల్లీ! మాభాగ్యరా శీ! మాయింటిమహాలక్ష్మి! రణార్ణవుని పెండ్లిమాట విన్నతక్షణమే నీ ప్రాణముపోవును. ఇట్టిబంగారుబొమ్మ నాకెట్లుదక్కునే? నీసౌకుమా ర్యము, నీ యందము, నేలపాలుగావలసినయోగ్యత యున్నది కాఁబో లును. హా జరాసంధమహారాజా! నీపాపమునకు మేరలేకయున్నదిగ దా! హా పాడుదైవమా! నాకెంతహాని గలిగించితివి" అని యందఱి హృదయములు కరఁగునట్లు కరుణరసము పొంగివచ్చినట్లు పెక్కువిధము ల విలపించెను. ఆమెను వారించి దాసీజనము బాలికను స్పృశించి పుష్పకేతునితో "నయ్యా! ఈమె నిశ్చేష్టయైనది. ఎత్తి పల్యంకికలోనుం పవచ్చునా?" యని యడిగి యాతఁడు ప్రత్యుత్తరమీయఁజాలక తల యూఁప నది సన్నగా వారును బాష్పాకులలోచనలై యామెనెత్తిరి. తల్లి

యుఘోరకృత్యముజూచి మూర్ఛిల్లెను. రాగలతికయుఁ గొయ్యబారిపో యెను. తల్లికిఁ దెలివిరాకుండఁ దీసికొనిపోయిన బాగుండునని మెల్లమెల్ల గా సర్వచేష్టలుండక్కియున్న దానిం గొనిపోయి పాలకియందుంచి పుష్ప కేతునితోఁగూడ రాజమందిరమునకుం జనిరి. తల్లియు రాగలతికయు స్పృహగలిగినవెనుక నొండొరులఁ గౌఁగిలించుకొని పెద్దపెట్టున రోదన ముచేసి బాలికవాయించువీణ, చదువు పుస్తకములు, నాడుకొను బొ మ్మలుఁ బవ్వళించుపాన్పుఁ బెంచుచిలుక మొదలగువానిం జూచిచూచి తలఁచి తలఁచి చుట్టుపక్కలవా రెందఱువచ్చియూరడించినను నూరడక వాపోవఁజొచ్చిరి.

పదుమూఁడవ ప్రకరణము.

కళానందుఁడు నాఁటిరేయి రాగలతిక పలుకులువిని చంద్రపా లుని గృహము వెడలి కోరకకాణభూతులు తన్ను వెంబడింపఁ దన్నొరు లుకాంచి గుర్తింపకుండ, మొగమునిండ ముసుఁగువైచుకొని తనస్వగృ హమునకుఁ బోయెను. తనతల్లి చంద్రపాలునియింటనే యుండుటయు నింటఁ జన్ననాఁటనుండియుఁ దన్నుఁబెంచిన ముదుసలిదాసి యొర్తుదక్క నన్యులు లేమిని మెల్లన దానిఁబిలిచి తనరాక చాటుగనుంచుమని వే మరు నొక్కిచెప్పి లోపలఁబ్రవేశించి కొండొకవడి ప్రియావియోగవ్యథ చేఁ గుంది యొకగదిలో నిదురవోయెను. ధారుణీదేవియు సౌందర్యతిలక రాజగృహమునకుఁ గొంపోవఁబడుటయుఁ దనకుమారుఁ డెందేని మరల నేగుటయుఁ దలఁచి శోకించి చంద్రపాలునియింటియొద్ద సెలవుఁగైకొని స్వగృహముం బ్రాపించి యందుదాగియున్న నిజకుమారునిగాంచి సం తసించి గుట్టు పరులకుఁ దెలియకుండఁ గాపాడ నిశ్చయించుకొనెను. తన ప్రాణినాయిక చంద్రపాలనందన బలిమిచే రణార్ణవునకుఁ బెండ్లిచే

యేఁబడునని వగచి యాతఁ డాకార్యము జరగకమున్న జనార్దనునియొద్ద
కుఁ గోరకునంపఁదలఁచి యతఁ డానతిచ్చినట్లు పూలవర్తకులు కొంద
ఱితోఁ బరిచయముచేసికొన నిశ్చయించి వారిలోఁ బాపభీతిగలవాఁడు
ను దైవభక్తియుతుఁడు నగు రోహణకుని మంచివానిగానెంచి వానితో
నెయ్యముచేయుఁడని కోరకకాణభూతులనంపెను. కోరకుఁ డంధునియ
ట్లు నటించుచుఁ దన్నూఁతకోలతోఁ దీసికొనిపోవుటకుఁ గాణభూతిని
నియోగింప వాఁడును మూఁగవాఁడయి యెవ్వరు పిలిచిన వినఁబడని
వానియట్లు పలుకక, యెవ్వరుమాటలాడవచ్చిన నవ్యక్తములగు ధ్వను
లెకాని మాటలాడక సంజ్ఞలచేఁ దనభావముఁ దెలియఁజేయుచుఁ
గోరకుని వీథులవెంబడిం ద్రిప్పసాగెను. అట్లు వారిరువురు బిచ్చగాం
డ్రై యింటనింటఁదిరుగుచు రోహణకుని యిల్లు సేరునపుడెల్ల నెంత
యుఁ దడ వందు నిలుచుచుండురు. కోరకుఁడు తన నేర్చినపాటలచే రో
హణకుని మెప్పించుచు నాతనిచే సంతృప్తుఁడగుచుఁ గాణభూతిసమేత
ముగ నగరమునఁగల వార్తలన్నియు గ్రహించుచు రాత్రియో పవ
లో వచ్చి వానినెల్లఁ గళానందునకు విన్నవించుచుండెను. ఇట్లుండఁ గొం
డొకనాఁడు రోహణకుఁడు కోరకుని పాటలకుమెచ్చి వానిపయిం గనికర
ముప్పతిల్ల "నోయీ! నీకన్నులెందుచేఁ బోయిన"వని యడిగెను. కో
రకుఁ డాపలుకుల నాలకించి యిట్లనియెను. "అయ్యా! నాచరిత్రమించుక
చెప్పెద వినుండు. పూర్వము నాకు స్వప్నములయందు నమ్మకములేదు.
అట్టులుండ నొకనాఁడు నాకలలో నొకయోగివచ్చి "యెల్లి మాధవుఁడు
బ్రాహ్మణవేషమున నీయింటికివచ్చు, వాని నఖిలసత్కారములఁ దన్
పవలె"నని వాక్రుచ్చి యంతర్ధానమాయెను. నాకును మెలఁకువ వచ్చి
నది. కలయని నాకు విశ్వాసములేదుగావున నిర్విచారముగనుంటిని.
మఱునాఁడు మధ్యాహ్నమున నొక ముసలిబ్రాహ్మణుఁ డరుగుదెంచి
తనకు భోజనము నిమిత్తము నేయి యిమ్మని నన్నెంతయుఁ బీడిం

చెను. ధనలోభముచే నేనాబ్రాహ్మణుని కోరికదీర్పకపోవుటయేగాక వాని నొకకఱ్ఱతో మొత్తి వానికి బుద్ధిచెప్పితి. విప్రుఁడు చిన్నమొగముతో వచ్చినత్రోవనె పోయి మరలఁ గానఁబడఁడయ్యె. ఆసాయంకాలము మొదలు నాకన్నులుగానఁబడవు. ఆమహాదోషముగొట్టి నాకింతగతి పట్టినది. అంతకుమున్ను నేనుఁ గొంతపాటి భాగ్యవంతుఁడను, పిల్లలుగలవాఁడను. నాఁడుమొదలు నాసంసారము చితికిపోవ నాకులేమివచ్చె. బిడ్డలు చచ్చిరి. ఆలు పరలోకమునకుం జనియె. తుదకు బిచ్చగాఁడనై మీవంటివారిని బీడింపనుంటి"నని చెప్ప నాచరిత్రము విని రోహణకుఁడు జాలినొందెను. అనంతరము కొరకుఁ డిట్టులనియెను. నాఁడుమొదలు నాకు వచ్చిన కలలెల్ల నిక్కములయ్యె. ఇపు డొకచిత్రము నీకుఁ దెలుపవచ్చితి. నిన్నటిరాత్రి నాకొకస్వప్నము, మాధవుం డిందులకు వచ్చినట్లు మీయింట బసచేసినట్లు, వచ్చినది. నాయ ట్లుపచారలోపము సేయకుమా నాతండ్రీ!" యనిన రోహణకుఁ డక్కజమొంది యయ్యో దేవదేవున కపచారమొనర్తునా! అతఁడు వచ్చుభాగ్యము నాకుఁ గలుగవలయు"నని వారినని పెను. వారును బోయి రాత్రి కళానందునితో రోహణకుని దమవానిగాఁ జేసికొన్నవార్త నెఱిఁగించిరి. ఇట్లు కృష్ణచాపలగు కొరక కాణభూతులు శత్రుపురమున నిరాఘాటమగు విహారము మాయవేషము వేసికొని చేయుచుండిరి. రణార్ణవుని ప్రాణమిత్రుఁడు తారకుండను వాఁడు శూద్రుఁడు గలఁడు. వాఁడు త్రాగుబోతు, జూదరియునగుట, వానియన్నదమ్ములు వాని నిల్లువెడలనడిపిరి. నాఁటఁగోలె రణార్ణవు నాశ్రయించియుండ రాజుతోఁ జెప్పి యొకయుద్యోగము జెప్పించి జీవనంబున కాధారముఁగల్పించె. పగతురవేగులవాం డ్రెవ్వరైన వచ్చి గిరివ్రజమునఁ జరించుచుండిరోయని యరసి కనుంగొని యట్టివాఁబట్టి బంధింపుమని జరాసంధుఁ డాతని నియోగించె. అదిపనిగా వాఁడు రేలనక పవలనక యెండయనక వానయనక నగరమంతయుఁ

గ్రుమ్మరుచుండు. ఒకనాఁడు తారకుఁడు నిజసేవకసమేతుఁడై వీథులం గ్రుమ్మరువాఁడు తనముందటఁ దిరిపమెత్తుకొనుచున్న కోరకకాణభూతులంగాంచి సేవకులతో నిట్లనియె. "వీండ్రు దొంగలవలెఁ గానఁబడుచున్నారు వీరి తెఱఁగరసి బంధింపఁదగదే" యనిన నామాటలు నిరంతరము జాగరూకుఁడగు కోరకుని చెవులంబడియెను. పటుటయు వాఁ డవివిననివాఁడువోలె తారకుఁడున్న యెడకుం జనుదెంచి చేతులు తడవుకొనుచు నొకమూల నిలుచుండి "యయ్యా! తారకులెందున్నవారో నాకగపడరు. వారితో నేనొకరహస్యము ముచ్చటింపవలయు ననియె. అనుటయు నాతఁడు దిగ్గునలేచి కోరకుని వైపునకువచ్చి నాతో నేమిరహస్యమున్నయదిరా" యని యడిగెను. కోరకుఁ "డిందెవ్వరు నన్యులు లేరుగదా" యని యిట్లనియెను. ఈనగరమునకుఁ గళానందుఁడు వచ్చియున్నవాఁడు. వాఁడున్నచోటు మీకు నేనెఱిఁగించెద. ఈరాత్రి మీరొంటరిగ నూరువెలుపల నుత్తరదిక్కుననున్న పెనుమఱ్ఱిచెట్టుకడకు రావలయును." అనినఁ దారకుఁడు తారాపథము నంటునట్లు మహానందభరితుఁడై యీకార్యముచేత జరాసంధునిదయకుఁ బాత్రుఁడనగువాఁడనగుదుననియుఁ గోరక కాణభూతులు నిజముగ గ్రుడ్డియు మూఁగయు ననియు వారు మోసగాండ్రు గారనియు నిశ్చయించి సాయంకాల మెప్పుడగునని వేగిరపడుచుండెను. కోరకకాణభూతులు బిచ్చమెత్తుకొని సంజతఱి నాపెనుమఱ్ఱికడకుం బోయిరి.

మాగధుల యజ్ఞానతిరముఁబోలె గాఢాంధకారము నగరమంతయుం గ్రమ్మెను. తారకుఁడు గళానందుని బట్టఁదలంచి యుత్తరపుదిశనున్న మఱ్ఱియొద్దకుఁ బోవుచుండెను. అతఁ డాప్రదేశముఁ జేయనప్పటికి జాముురాత్రికన్న నెక్కుడగుటఁ గోరక కాణభూతులు ప్రొయిమంటఁ బెట్టి యన్నము వండుకొనుచుండిరి. తారకుఁడు వారిం బ్రాంపించి గ్రుడ్డివానిం బలుకరించెను. వాఁడును వినయవిధేయుఁడై తారకునితో "స్వామీ!

ఆవల పదియడుగులదూరమునఁ దమనిమిత్తమొకచాఁపవేయించితి నందు దేవర విశ్రమించునప్పటికి మావంటకము ముగియును." అని చాఁపఁజూపుమని మూఁగవానికి సన్నజేయ నాతఁడును దారకునిస మీపించి కేకలువేయుచు రమ్మని చేసన్నయొనరించి వెంటఁబెట్టుకొని పోయి యాచాఁపఁజూపి తానీవలనిలచెను. ఆచిమ్మచీఁకటిలోఁ దారకుఁ డాచాఁప యెందున్నదో తెలియఁజాలక కాలితోఁదడవి కనుంగొని దానిమీఁదికి నడచి రెండడుగు లిడునప్పటికిఁ బాపఁ మాతఁడును జాఁపయు గుభాలున నొకపాడునూతంబడియె. దుర్వాయువులతో నిండి పలుదుర్గంధములు గలిగి కండచీమలపుట్టలు, తేళ్ళగుట్టలు బుసకొట్టు త్రాఁచు పాములును గలిగి భయంకరమైన యాలోతనూతిలోఁబడి యాపాటు చేతను దలపగిలి నెత్తురు లురుల భీతిచేత శరీరము పరవశమునొంది గఱచెడు పాములుఁ గుట్టెడు తేళ్ళుఁ బీఁకెడుచీమలుఁ బ్రాఁకెడుపురుగులు ను గంపమొందింప వాఁడు బ్రహ్మాండముపగుల నార్చుచు రక్షింపరే యని యేడువఁజొచ్చెను. చుట్టుపక్కల గుడిసెలలోఁ గాఁపురముండు వారందఱును నీమహార్తనాదమేమని పరువులెత్తుచు వచ్చుచుంటఁజూచి కార్యముతప్పినదని కోరక కాణభూతులు పెద్దపెట్టిన రోదనముఁజేయుచు నఱచుచు గుండెలుమోఁదుకొనుచు వచ్చువారి కెదురుగఁబరుగెత్తిరి. వారందఱు కోరకునిజూచి "యేమిది? మీరిట్లు పరువులెత్తి యఱవనేల? ఆమహార్తనాదమెవ్వరిది?" యని యడుగ వగర్చుకొనుచు నోటమాట రాక తుదకు కోరకుఁడిట్లనియె. "అయ్యో! ఈపాడునూత నొకమహారాక్షసి ప్రవేశించినది. అది మనుష్యమాంసమును మెక్కవలయునను కోరికతో బావిబ్రవేశించి తానొకమనుష్యుఁడ ననియుఁ దన్నందెవ్వరో పడద్రోసిరనియు బైటకుందీయవలయుననియు వేఁడుకొనుచుండును. అజ్ఞానులెవరైన నూతకోలకొనఁగియో త్రాఁడువేసియో తన్ను వెలువరింపఁ జూతురేని వారిని గ్రిందికి దిగలాగి భక్షించుచుండును. మాబి

చ్చగాండ్రి ముప్పురనీవఱకు దిగలాగి విఱిచికొని తినియె. కన్నులులేమి నేనుబ్రిదికిపోతిని. అయ్యలారా? మీరైన నీరాకసిచేతఁ బడి చావక బ్రిదికిపొండు. దీని మీరందఱు మీఁద ఱాళ్ళువైచి చంపుదురేని సత్వ ఱమె మీకు క్షేమముగలదు. లేకున్న మిమ్ముల మీబిడ్డపాపలఁ గడతేర్చి మెక్కఁజాలును” అనవుడు వారందఱు నదినిజమనియు నాపని తెస్సయనియు నూతియొద్దకుఁజని యందున్న వానిని నిందించి మీఁద ఱాళ్ళు ఱువ్వ నారంభించిరి. వాఁడు నేను తారకుండను రాజసేవకుఁడ నని యెంతయఱచిన నీజనుల కోలాహలము నడుమ నది యేరికిని విన్పబడదయ్యె. పెద్దశిలలు దొర్లించి యానూతన వారు వేయ నదివఱకే తలపగిలియున్న యానిర్భాగ్యుఁ డేశిలాపాతముచేతనో యేఘణివిషముచేతనో లోకాంతరమునకు విజయముచేసెను.

వేగులవాండ్రి పాలిటికి యముఁడగు తారకుని మడియించి కోరక కాణభూతులు సంతోషహృదయులై యాజనులందఱు తమతమ యిండ్లకుఁ బోయిన వెనుక మెల్లమెల్లగఁ గళానందుని గృహమునకుఁబోయి యాతనికావార్త నెఱిఁగించిరి. కళానందుఁ డత్యాశ్చర్యముతో వారి మాయలు మెచ్చుకొని కోరకునుద్దేశించి “ యోయీ నీవింక మాధవునిపాలికిఁ బొమ్ము వానికి నేనొకకమ్మ వ్రాసియిచ్చెద. ఇప్పటికి మనకీనగరమునందుఁ దెలియఁదగు నంశములు తెలిసినవి. జనార్దనుఁ డేయదియరయుండని మీకును నాకు నాదేశించెనో యదియెల్ల నెఱిపితిమిగదా?” యని యొకకమ్మవ్రాసి యందు జనార్దనున కావశ్యకములగు నంశములనువ్రాసి యాతఁ డెట్లువ్రాలుచేయుమని మున్నుసెప్పె నట్లు చేవ్రాలు చేసి వానికిచ్చి పొమ్మని యానతిచ్చెను. కోరకుఁ డాజాబునుగ్రహించి మాధవుఁడకు దెంచువఱకు మిక్కిలి జాగరూకతతో నుండుమని కాణభూతితోఁ బలుమాఱు నొక్కిచెప్పి యానాఁడు తెల్లవారుజామున బయలుదేఱి ద్వారకానగరమునకుఁ బోయెను. కాణభూతియు వానిని సాగనంపి

తానెప్పటియట్ల మూఁగవానివేసము వేసికొని నగరమంతయుఁ దిరుగుచు బిచ్చమెత్తుకొనుచుండెను. ఆరాత్రి తారకుఁడు బలవన్మరణము నొందుట వానిమిత్రులెవ్వరు నెఱుఁగక మఱునాఁడు వాఁడు కానఁబడమి నగరమంతయు వెదకిరిగాని వానిజాడ యొకింతయుఁ గానరాదయ్యె. అట్లాకస్మికముగఁ దనప్రియమిత్రుఁడు మాయమగుటకు వగచుచు రణార్ణవుఁడు వాని తెఱఁగు నెఱుఁగ సకలప్రయత్నములను జేసియు నేమియుం గార్యము లేమి విచారమనస్కుఁడై యూరకుండెను.

అంతఁ గతిపయదినములు గతియింపఁ గళానందుఁ డొక్కనాఁడు, ప్రియురాలికిఁ దనకుఁ గల్గిన వియోగముఁ దలఁచితలఁచి మాధవుని యాలస్యమునకు వగచివగచి చాలఁప్రొద్దయిన వెనుక నిద్రించెను. ఆయూరఁ దారకునియనుచరులలో నొకఁడగు మండూకుండు జీవింపనెద్దియు వృత్తిగానక దొంగతనము జేయమొదలుపెట్టి యాపనులయం దాఱితేఱి యించుక ధనమార్జించి జీవనము చేయుచుండెను. ఆనాఁటిరేయి కళానందుని యింటికిఁ గన్నము త్రవ్వి లోనున్న విత్త మపహరింప వలయునని నిశ్చయించెను. కళానందుఁడు నగరమున లేఁడుగదా యనియు నాఁడుదియు వృద్ధయు నగు ధారుణీదేవికి మెలఁకువరాదనియు వచ్చెనేని నోరునొక్కి యున్నంతయర్థము గ్రహింపఁగలుగుదుమనియు నాసచేసి వాఁడానాఁటియర్ధరాత్రమునఁ గళానందుఁడు పవ్వళించిన గదికిఁ గన్నము వేసెను. కన్నములోనుండి లోనికిఁ దలపెట్టి యందఱు నిద్రించుచున్నవారో లేదో యని చూచి ప్రవేశించి గంటపలెనున్న దీపము నార్పఁబోయి దానియెదుట దివ్యప్రభాభాసితుఁడై నిద్రించు కళానందుని గాంచి" యహహా! యీతఁడు రహస్యముగ నిండేయున్నవాఁడు గాఁబోలు! ఏమి! ఈతని లావణ్యము! ఇందుచేతనే చంద్రపాలనందన వీనిని వరియింపఁగోరె. ఈతనికి మెలఁకువవచ్చిన నాకొక చిల్లపెంకయిన దొరకదు. కావున సత్వరమ యిటనుండి పాఱిపోవలయునని దీపిక నార్పివైచి యాప్రమిదలోనున్న యాము

దము తనబోడితలకు శరీరమునకుఁ బులిమికొని పట్టుకొన యత్నించువారిచేయి జాఱునట్లుండి కళానందుని మెడలోనున్న ముత్యాలహారము నూడఁదీసికొన నిశ్చయించి పరుగెత్తుటకు ముందు తలుపు లన్నియుఁ దెఱచి నిర్భయుఁడై కళానందుని మెడలోఁ జేయి వెట్టి హారముపట్టియెత్తి యది తలఁదూఱిరామిఁ బుటుకునఁ దెంపి జలజలరాలిన ముత్తియముల నేఱుచుండ నింతలోఁ గళానందునకు మెలఁకువవచ్చెను. వచ్చుటయు నాతఁడు కన్నులు దెఱచి యెవఁడురా యని వానిచేయి గట్టిగాఁబట్టుకొని వాఁ డెంత పెనఁగులాడినను విడువఁడయ్యె. మండూకుఁడు పట్టువిడిపించుకొనుటకుఁ గళానందుని గఱచె. కళానందుఁడు వానినోటిపట్టు వదిలించుకొనుటకుఁ జెళ్ళున వానిచెంప పగులఁగొట్టెను. నోటిపట్టు వదిలి మండూకుఁ డేయుపాయమును దోఁపమి నెడమచేతిలోనున్న కన్నపుఁగత్తితోఁ గళానందుని చేయి నఱికెను. ఆయేటుతోన రాచకొమరుఁడు కడునొచ్చి యెడమచేతితో సిగ నొడిచిపట్టుకొందమని యీచేయివిడిచి యాచేయి చాపునంతలో దొంగ పలాయితుఁ డయ్యెను. తనరహస్యవర్తన మొరులకుఁ దెలియునని వానివెన్నంటి పఱవఁడయ్యె. తరువాత, తల్లిని దాసిని లేపి కళానందుఁడు గాయమునకుఁ గట్టుగట్టుకొని, వగచు తల్లి నూరార్చి శేషించినరాత్రి నిదురింపఁడయ్యె. మండూకుఁడు తనకు రెండుమూఁడు ముత్తియములుదక్క తక్కినవి చిక్కకునికికి వగచి మృత్యుముఖమునుండి బైటఁ బడితినని సంతసించి కళానందుఁ డింటనున్న వార్త రణార్ణవున కెఱిఁగించెను. అతఁడును వానికిఁ బారితోషికమిచ్చి మహాసంతోషముతో జేనీకడకుఁ బోయి యావార్త నెఱుఁగఁజెప్పి సైనికులను సేనానాయకులను గొందఱిని దోడుచేసికొని జాముప్రొద్దెక్కినప్పటికిఁ గళానందుని గృహమువద్ద నిలిచి తలుపు దీయుమని కేకలువైచె. ఎఱుఁగక వృద్ధయగు దాసి వెంటనే తలుపుఁ దీయుటయు బిలబిలలాడుచు నందఱు లోనఁ బ్రవేశించిరి. కళానందుఁ డప్పుడే స్నానముచేసి భోజనమునకు సిద్ధముగనుండ

వీ రెల్లరు వానికెట్టెదుట నిలిచిరి. విస్మితుఁడై యారాజకుమారుఁడు చూచుచుండఁ గొందఱు సేవకులు హస్తములు పట్టుకొనిరి. ఒకఁడు చేతులకు సంకెలలు వేసెను. ఒకఁడు పదపద మని త్వరపెట్టెను. రణార్ణవుఁడు పకపకనవ్వి "యోరోరీ! నీవాసుదేవుఁ డద్దురాఁడేమి" యని యడిగెను. ధారుణీదేవి యాదురవస్థజూచి కడుదుఃఖించి యన్నము దినినవెనుకనైనఁ దీసికొనిపొమ్మని వేఁడికొనె. ఆముదుసలిమాటలు వినువారెవ్వరు నందు లేరైరి. నడువుమని వారు త్వరపెట్టుచుండఁ గళానందుఁ డదియె తన కంత్యకాలమని నిశ్చయించి తల్లితో నేమనుటకు నోరాడక యిలు వెడలి రణార్ణవునివెంటఁ బోయెను. తల్లి మూర్ఛిల్లె. కళానందుని దుస్థితికిఁ బౌరు లందఱు గడుజాలి నొందిరి. అట్లు చిరకాలమునుండి రణార్ణవ జరాసంధులకు హృదయకంటకుఁడగు కళానందుఁడు చిక్కుటయు వారు వానిని రాజునొద్దకుం గొనిపోయి యెదుట నిలిపిరి. ఆమహారాజును బండ్లుగీటుచు వానిదర్శనమునఁ గోపాగ్ని ప్రజ్వరిల్ల నోడ లెఱుఁగక ఖడ్గము నెత్తి యేయఁబోవుచుండ రణార్ణవుఁ డడ్డమువాచ్చి "దేవా! భైరవదేవున కర్పింపక యిటుసేయుదురే" యనియె. ఆమాటలు విని జరాసంధుఁడు వెనుకకుఁ దగ్గి "హాదురాత్మా! మగధరాజ్యలక్ష్మికి వైధవ్యము నాపాదించెదవుగా! నీకుఁ గళ్యాణము జరగునా? నీ వింకను జేదిరాజుకడ నుంటివని చారులవలన నేను విని సంతసించితి. అతని భంగపెట్టి యిటులఁజేసి మాయలఁ బన్నఁదలఁచితే? శత్రుపక్షములోవారెల్లఁ జిక్కిరి. ఇఁక నిర్భయులమయి యుండవచ్చును. వీని నిఁక గారాగృహమున నుంపుఁడీ" యని వారినంపి రణార్ణవునకు వివాహము సేయ యత్నముల జరప నిశ్చయించెను. కాణభూతి యదివిని వగవఁ దొడఁగెను.

పదునాలుగవ ప్రకరణము.

సహదేవుఁడు జరాసంధక్ష్మావల్లభునకు ముద్దులకుమారుఁడై గిరివ్రజనివాసులకుఁ గనులచందమామయై సకలవిద్యావిశారదుఁడై బంధులోకసంరక్షకుఁడై పరాక్రమనిధియై శాంతస్వభావుఁడై యలరుచుండు. గుణములలోఁ దండ్రికిఁ గొడుకునకును గల వ్యత్యాసమును గనుంగొని బుధజనములు కొడుకు దేవతాంశసంభూతుఁడై మహాపురుషుఁడై యుద్భవించెనని భావించుచుందురు. రాజలోకమును దండ్రి బంధించి భైరవపూజకు దిన మొక్కరుని వధియించుటఁ గాంచి కుమారుఁడు మిక్కిలి యక్కటికమునం బడి చేయునది యేమియును లేక తన కట్టిపని కిట్టదనియు నట్టియొప్పనిపని ప్రకృతిజనుల కసూయ గావించుననియుఁ గ్రూరకర్మనిరతుఁడగు రాజునైశ్వర్యము చిరకాలము నిలువదనియు మంత్రిలచేఁ బలుమాఱు చెప్పియంపె. తండ్రి యమ్మాటలు సరకుఁగొనక తేజోవిహీనులైన కొందఱు పౌరులమాటలు విని కొడుకట్లు పలుకఁ జొచ్చెనని నవ్వుకొనుచు యూరకొనుచు వచ్చె. జయసేనుని జెఱఁబెట్టిన నాఁటఁగోలె నీసహదేవుఁడు నెమ్మనమునకుఁ దీఱని యుమ్మలికము బైలుపొడమ నెచ్చెలు లెందఱు నివారింప నెంతయత్నము చేసినను వారింపఁబడఁడయ్యె. సహదేవుఁడు యువరాజయ్యు రాజఠీవికి లాఘవమగు ననియెన్నక యపుడపుడు ప్రకృతిజనుల యభిప్రాయము లెఱుఁగుటకు వారితోఁ గలసిమెలసి వర్తించుచుండును. కావున వారతనితండ్రిక్రౌర్యము మొదలగు గుణములు చెప్పుకొని భయమునొంది కొందఱన్యరాష్ట్రములకుఁ బాఱి యందుల నివసింపఁగలఁచుట విని తన యుమ్మలిక మినుమడియై నెయ్యురతోనైన మాటలాడక నిరంతర విచారాధీనమానసుఁడై యుండఁజొచ్చెను. పువుదోఁటలలో విహరించుటమాని, యువరాజొనర్పవలసిన రాజ్యతంత్రములజోలికిఁ జనక ప్రియమిత్రులతో సల్లా

పములు సలుపక విదూషకాదుల హాస్యములకు మందహాసమైనఁ జేయక, గజాశ్వరథముల నధిరోహింపక యంతిపురమునకుఁ బోయి ప్రియురాలితో ముచ్చటింపక దీనాననుండై యున్న కుమారుని వైఖరినంతయు సేవకులవలన విని జరాసంధుఁడు తత్కారణముల నరయువలయునని యాతఁ డున్నతావునకుం బోయె. మహారాజుగారి రాక విని యువరాజు దిగ్గున లేచి పాదాభివందన మాచరించి వినయమును సూచించు నెమ్మొగముతోఁ బ్రక్కను నిలిచెనేకాని యామొగమునఁ దండ్రికి నేత్రానందకరమైన తొల్లిటి వికాసము గానంబడదయ్యె. జరాసంధుఁడు ప్రియపుత్రుని బిగియాఱఁ గవుంగిలించుకొని శిరము మూర్కొని తానొక యాసనముపైఁ గూర్చుండి చెంత నొక్కపీఠముపైఁ గుమారుఁ గూరుచుండఁ బనిచి మీఁదఁ జేయివైచి తట్టి యిట్లనియెను." వత్సా! నీకింతనెవ్వగకుఁ గారణంబేమి? భారతవర్షమునంగల రాజుల నందఱ నిర్జించి వారిని బాదాక్రాంతులుగఁ జేసి తదీయైశ్వర్యము లపహరించి యగారముల నింపితి. అమాత్యసుహృత్కోశాదిసప్తాంగపరిరక్షిత మయిన రాజ్యలక్ష్మి సేమమున నున్నయది. ఎంతలెంతలు శత్రువులు నారాజ్యలక్ష్మిని నన్నును దేఱిచూడఁ జాలరు. నీవ నాప్రాణము, నామనోరథము, నాజీవము, సేవకులు నీపనుపు చేయరా! మంత్రులు దండనాయకులు నీనియోగము నడుపరా; పరరాజులు నీకు వశవర్తులుగారో, యంతిపురింగల యేసుందరిగాని నీమనోరథము ననుసరించి మెలఁగదో, యెవ్వ రెట్టియవినయమును నీదెసఁజూపిరో యెఱింగింపుము. భయంకరశాసనుఁ డగు నీతండ్రి వారిని గఠినశిక్షకుఁ బాలుచేసి నీయలుక వోవనడచు. కుమారా! నీమహామందిరములు, నీకొలువుకూటములు, నీపూవుతోఁటలు, నీయపారధనసంచయంబు నీయనర్ఘమణిపుంజము, నీయాజానేయపారసీకతురంగములు నీభద్రజాతిగజములు, నీమహాయుధములు, నీసేనలు, నీలేబ్రాయఁపుసుందరులు నీ కింపు బెంపఁజాలకున్న నాకివి

యన్నియు నేలని? నీవు వగచుచుండ నాకీరాజ్యలక్ష్మి సుఖముఁగొల్పునే? ఈధనము నాకానందమును గల్గించునే? ఇవి యన్నియు నీనిమిత్తముగాక నాకొఱకా? నిన్ను యౌవరాజ్యమున కభిషిక్తుంజేసితి. కొలఁది కాలమున నీకీరాజ్య మశేషము నభిషేకించి యేను దపోవనమున కరుగఁ జూచుచున్నాఁడ. ఇంత మహదైశ్వర్యమధ్యమున నుండ నీకింత వగపునకుఁ గారణ మేమి? నారదాదిమునులు ముల్లోకములఁ గ్రుమ్మరి వచ్చి నా యైశ్వర్యముం గాంచి దీనికిఁ దులయగునది యేయుగమున నేజగమున లేదని నుతియించుచుందురు, నాతండ్రి! నీమనోగత మగువ్యథ యేదియో తెలిపి నన్నుం గృతార్థుంజేయవే యని గడ్డము పట్టుకొనియెను. ఈవేఁడికోలును విని సహదేవుఁడు తండ్రికిఁ దనపైఁ గల కూరిమికిఁ దగిన తెఱఁగున దానును మృదుమధుర వచనముల నిట్లనియె ‘‘తండ్రీ! అకుంఠిత మైన దేవరపరాక్రమ మెఱుఁగుదు. దిక్పాలకుల సంపదలను మించిన యీమహదైశ్వర్యము ననుభవించుచున్నవాఁడ. చండశాసనుఁడవగు నీయాన నతిక్రమింప నెవరితరము? నాపనుపు లందఱుఁ గడువినయ భయములు గదుర సేయుచుందురు. నాకెందునను లోపములేదు. కాని యీభోగములవలన జనించు సౌఖ్యములనెల్లఁ గప్పిపుచ్చు నొక మహాసంతాపము నాహృదయముఁ గాల్చుచున్నది. నాపై నలుగకుండ నదియెల్ల వినుము. నీయొనర్చు క్రూరకర్మములంబట్టి ప్రకృతిజనులకు మనపై నసూయ వొడముచున్నది. నిరపరాధుఁడైన జయసేనుని గారాగృహమునఁ బెట్టించితివి. వృద్ధుఁడును బౌరులకు హితుఁడు నగు నాతని తండ్రి విజయసేనుఁడు పుత్రవియోగముచేఁ గృశించి మరణావశిష్టుఁడై యున్నవాఁడని వినుచుంటి. విజయసేనుని యిల్లాలు మహాపతివ్రత, తారావతి చిక్కి శల్యమైనదఁట. ఒకమనుజుఁ డసురుపఁడెనేని, యొక్క పతివ్రత క్షోభపడిన రాజ్యము నాశనము నొందుట యేటివింత! ఆలుబిడ్డలను మగని నెడఁబాయఁజేయుట దోసము గాదే! నే

రములున్న శిక్షించుట రాజధర్మము. లేకున్న విడుచుట యుచితము. ఎంతకాలము విచారణలేక యాతఁడు చెఱలోనుండుట? అపనింద తన మీఁద వేసినకతమున నాతనిమతి చెడియె. ఈపాపములు మనలఁగొట్టుట యటుండనిమ్ము. చంద్రిపాలుఁడు రాజభక్తికిఁ బెట్టినది పేరు. అతఁడు మనకుఁ జేసిన యపరాధ మేనెఱఁగినంతవఱకు నెన్నఁడును లేదు. నీకతఁడు బాల్యస్నేహితుఁడు. అతనికిఁ బుత్రసంతానములేదు. లేకలేకకలిగిన యీసౌందర్యతిలకను దన కిచ్చవచ్చినవానికిఁ దనకూఁతురు వలచినవానికి నిచ్చి పెండ్లిసేయఁదలంచుట వాని తప్పగునే? జనులు చేసికొను సంబంధబాంధవ్యములలో రాజులు జోక్యముఁ గలుగఁజేసికొందురేని యది యనర్థము గలిగింపక మానదు. రణార్ణవుని గుణములు సౌందర్యతిలక మెచ్చదు. అబలయనక సుకుమారియనక నాపుఁబోఁడినిగూడ బంధించితివి. ఇందులకు జనులు నిన్నెట్లు నిందించుచుండిరో నీవెఱుంగవు, నీకు జడిసి నీయనుచరులు నీముందట నీసలుపు పనులు నుతియించి యావల నిన్ను బ్రివ్వఁదిట్టుచుందురు. ఇంక దల్లిదండ్రులకుఁ గూఁతుల వివాహముల విషయమై స్వాతంత్ర్యము నశించినదని జనులు చెప్పుకొనుట విని నాకుఁ గడుకష్టముగనున్నది. ఆసౌందర్యతిలక యన్నము ముట్టుటలేదు. నీరుత్రాగుటలేదు నీవు రణార్ణవున కీబాలిక నీయనిశ్చయించితివేని వజ్రపుంబొడి మ్రింగి మృతినొంద నామె నిశ్చయించుచున్నయది. పురజనుల కాబాలికపైఁ బ్రేమమెండు. అది గాక కళానందుని బట్టి తెప్పించి చెఱఁ బెట్టించితివి. అతఁడు సౌందర్యతిలకపైఁ బ్రాణము నిలిపియున్నవాఁడు. ఆమెను రణార్ణవునకీయ నీవు యత్నించుటమొదలు రాజద్రోహమునకు యత్నము సలిపెనేగాని యంతకు మున్ను మనతోఁగలసి వాసుదేవునిపైఁ గత్తిగట్టఁడే? అతఁడు బలవంతుఁడు. మతిమంతుఁడు. గుణవంతుఁడు. వానిని మనమెట్లో స్వజనములోఁ గలపికొనుట రాజ్యలక్ష్మికి శ్రేయము. కళానందునకు సౌంద

ర్యతిలకనిచ్చి పెండ్లిసేయుటయుఁ, జంద్రపాలుని విడిచిపుచ్చుటయు, జయసేనుని విముక్తుఁ జేయుటయు నవశ్యకృత్యములు. వెండియు నిరపరాధు లగురాజులఁ బెక్కండ్రబంధించి దినమొక్కని మహాభైరవున కర్పించుట యతిక్రూరముగాదే? తోడిమానవుల నందును మహారాజులఁ బసులుమేఁకలట్లు తెగనఱికి యీశ్వరతృప్తి సేయుట హేయభాజనము. సమస్తజనములకు నీయం దసూయకలుగుట కిదే కారణము. ఆ రాజులను విడుచుట యుచితము. మఱియు వాసుదేవుఁడు విష్ణ్వంశమున దుష్టులశిక్షింప యదుకులమునఁ బుట్టెనని మును లనుచుందురు. స్వజనమునకు మనపై నిపుడు పెద్దయసూయ గలిగి యున్నది. ఇది యదనుగ వాసుదేవుఁడు మనల నెద్దియేని జేయునని భయమగుచున్నది. నాకును మాయంబకును మాచెలియండ్రగు కంసభార్యలకును దుస్వప్నములు దుర్నిమిత్తములు పెక్కులు గలుగుచున్నవి. అమ్మయుఁ దోఁబుట్టువులును గంటికి నేలకు నేకధారగ నేడ్చుచున్నవారు. మగవాఁడనగుట నేనించుక ధైర్యము చిక్కఁబట్టియుంటిని నాయుమ్మలికమునకు నామనోవేదనకు నిదియే కారణము. మొగలియాకులోని మాటలు “మగధరాజ్యలక్ష్మికి వైధవ్య” మనునది హృదయశల్యములవలె నన్నుఁ బీడించుచున్న యవి. తండ్రీ! నాచెప్పినచొప్పున వర్తించి నీకపాయము వాటిలకుండఁ జేసికొని వంశము రక్షింపవే” యని పాదములపైఁబడి కన్నీరొలుక దుఃఖించి యచటనుండి లేవఁడయ్యెను.

అడుగులపైఁబడియున్న కొడుకును లేవనెత్తి మగధరాజొకచోట వానిని గూర్చుండఁబెట్టి యాతనికిఁ దనపైఁగల నింతప్రేమకు మెచ్చి యాతని బేలతనమునకు జాలినొంది యాడినపలుకులకుఁ గినిసి యిట్లులనియె. “కుమారా! ఆఁడువారగుట మీయమ్మయుఁ దోఁబుట్టువులును వగచిన వగతురుగాక! మగవాఁడవై యున్నియుఁ గన్నులఁ జూచుచున్న నీవిట్లు కుందఁ జెప్పెడిదేమి? జయసేనునియందు దోషము

గలదని నేననలేదు. అనుమానముచే నాతని బంధించితి. మతిచెడిన నాతనికర్మము నేనేమి సేయుదును? తండ్రి బెంగఁగొనినాఁడనియు నిల్లాలు వగచుచున్నదనియు నపరాధుల విడిచితిమేని యిఁక రాజ్యతంత్రము జరగుటెట్లు? అట్లుసురు తగులుటకు జంకితిమేని ధరాపరిపాలనము మాని యడవుల మునివృత్తి నుంటమేలు. జయసేనుని గొలఁది దినములలో విడిచిపుచ్చెద. కళానందుఁడు పాపాత్ముఁడు. వాఁడు చేసిన చేతఁ లెఱిఁగియు వ్రాసినవ్రాఁతలు చూచియు వానిని విడిచిపుచ్చుమని పలుకుటకు నీకు నోరెట్లువచ్చె. రాజద్రోహి యదృష్టవశమునఁ జేఁజిక్క వానిని విడుపుమను నుడువులు కొడుకవగు నీనోటినుండి వచ్చెనుగాని వేఱొకఁ డుచ్చరించిన నీనఱ కాతనిని యమలోకమునకుఁ బంపియుందును. సింహపరాక్రమునుగల నాకడుపున మేఁకపిల్లచాడ్పునఁ దేజోవిహీనుఁడవైననీ వుదయించితివని తద్దయుఁ గుందుచున్నవాఁడ. ఆదురాత్ముని రక్తధారలు గురియకున్న నాకోపాగ్ని చల్లారుటయెట్లు? చంద్రపాలుఁడు నాపలుకులు నిరాకరించి నందుల కట్లుబంధించితిని. హానిపాగరట్లు చేసినది. కళానందునకుఁగాని కూఁతునీయఁడఁట. చంద్రపాలుఁడు సౌందర్యతిలకయుఁ జూచుచుండఁ గళానందుని శిరము నఱికి భైరవదేవునకు రక్తాభిషేకము గావించి యర్చించి యాదినముననే యాబాలికను రణార్ణవునకిచ్చి పెండ్లి చేసెదను. ఈ రెండింటికి ముహూర్త మొక్కనాఁడ యేర్పఱుపవలయును. అవియన్నియు నటుండనిమ్ము. ఆవాసుదేవుని కింత యడలెదవేమి? వాఁడు కులహీనుఁడు, మానహీనుఁడు, జారుఁడు, చోరుఁడు, నీచుఁడు, బసులఁగాచికొని జీవించువాఁడు. వాఁడా నన్ను నిర్జించుటలు. ఈవఱకు నాచే వాఁ డొకటి రెండుసారులు కాదుగదా యిరువదియొక్కసారి పరాజితుఁడై నాధాటి కాఁగఁజాలక పితృపితామహుల నాఁటఁగోలె నివాసమైన మధురాపురమును విడిచి సముద్రమధ్యమున ద్వారకానగరము గట్టుకొనియెను. ఆదొంగ, యాపాపి, యాయధముఁడు

శ్రీమన్నారాయణుని యవతారమని యడవులఁ జరియించు మృగప్రాయులగు మునులు, నీచులగు పాండవులు వానికాళ్ళు పట్టుకొందురు. కాని నేనాపలుకులు విశ్వసింపను. ఈయభాగ్యుఁడేమి! విష్ణునవతారమేమి! నాకొడుకువై నీవెట్లునమ్మితివి! రాజులందెచ్చి నేను భగవంతుఁడైన భైరవదేవుని మెప్పించుచుంటి నది క్రూరకర్మమైనను సరే మఱియేమైనను సరియే యెవ్వరుచెప్పినను మానువాఁడనుగాను. స్వప్నశకునములు కాకతాళీయముగ నగుచుండును. వానిని విశ్వసించి వగచినం గాదు. నాకేమియు భయములేదు. మీరు వగవకుండు డంతియచాలు. నీవింక లోనికిఁబొమ్ము. ‘‘అనిపలికి తాను గొలువుకూటమునకుం జని కళానందుని బట్టించిన మండూకునకు బహుమానము లిచ్చి సౌందర్యతిలకారణార్ణవుల వివాహమునకును గళానందుని మరణమునకును నొక్క ముహూర్తము నిశ్చయింపుఁడని సిద్ధాంతుల రావించి నియోగించి కొలువుచాలించెను.

పదునేనవ ప్రకరణము.

అట శిశుపాలుఁడు తనమనోనాయిక యగు నిందుమతి బందు
ఁడువత్తునో, యెన్నఁడు మనోవ్యథయశేషము హరియింపఁబడ
ము చేయఁగల్గునో యని గిరివ్రజమునుండి యె
వేదుని వృత్తాంత మేదియేని తెలి
మహాయుగముగాఁ గడపఁ
గానాఁట నతిద్వ

క రాజాంతఃపురమున వసియింపఁదలఁచి కాలమున కెదురుచూచుచుండెను. కృష్ణునిచారుఁడు కుశీలవుఁడు తనజాణతనమునఁ జేదినగరమున నిలిచి శిశుపాలుని మనసు మెప్పించి యాతనికిఁ దనయందు విశ్వాసముఁ గలిగించుచు జాతవేదుఁడు త న్నిందుమతిసేమమునిమిత్త మచ్చటవిడుచుటచే నామెకేయపాయము రాకుండ మెలఁకువతో వర్తింపసాగెను. శిశుపాలుఁ డప్పుడపు డిందుమతియుండు మందిరమునకువచ్చి యామెతో సరససల్లాపములకుంజొచ్చి కడుఁబ్రీతుఁడై యుండు. ఇట్టు లొండొరువు లనువుమెఱసియుండ నొక్కనాఁ డిందుమతి మహారాజునుద్దేశించి వినయము గదుర మొగమునఁ జిఱునగవు వెన్నెలలుగాయ నిట్లనియె. "దేవా! నాకొక్కకోరికయున్నది. హేమావతిని గాంచి చాలదినములయ్యె. దాని నింకొకమాఱు చూచి కొన్నిపొద్దులచ్చటఁ బుచ్చవలయునని మనమున నభిలాషము వొడముచున్నది. నాయీమనోరథము సఫలముఁజేయ దేవరవారి చరణారవిందముల వేఁడుకొనుచున్నదాన. మరల నతిశీఘ్రమున మీకడ నుండుదాన" నని యమృతరస మొలుకునట్లు పలుకుచుండు ప్రియురాలి వచనము విని తన్నతిధన్యునిగా భావించి చేదిరాజు మెల్లమెల్ల నాపల్లవపాణితో నిట్లనియె. "హృదయేశ్వరీ! నీమనోరథముఁ దీర్చుట నామనోరథముఁ దీర్చుకొంటగాదె! నీకుంగల యీకోరికఁ దీర్పనేని నేనేల? నారాజ్యమేల? ఎల్లి నీ

దనపురమునకుంజని నీకును నాకును సంగమకారణ

మావతిం జూచి మూఁడుదినములలో

ల. నీమందిరము చంద్రి

న్నెడఁబాసి యీ

యెక్కి రేపటియుదయమునఁ బైనమైపొమ్ము. హేమావతిని నేను చాలనడిగితిననియుఁ దనమేలు మఱవఁజాలననియు నాకృతజ్ఞతను దెలుపుము. వివాహమునకుఁ దప్పక రావలయుననుము. నైళమ రాకపోయెదవుసుమీ. నను జంపుకొన్నట్లె" యని యొట్టువెట్టుకొని తద్వియోగమును భరింపనోపక పెక్కువిధముల నంగలార్చి మఱునాఁడు చందనపురమునకుఁబోవ నిందుమతి కొక్కపల్లకియు దాసి కొక్కబండియు సిద్ధముచేయించి వెంటఁ గుశీలవుని బొమ్మని యానతిచ్చి రాజు నిజాంతఃపురమున కరిగె.

తనసంకల్పము సిద్ధించినదని యిందుమతి యత్యానందభరితయై మఱునాఁడుదయమునఁ బల్లకియెక్కి కుశీలవుఁడు పాదచారియై వెంటరా శకటారోహణమొనర్చి దాసి వెంబడింప బయలుదేఱి చందనపురమునకుం బోయెను. ఆమె చనినచోటున నెంతకు నెడఁబాయరాని నెచ్చెలు లుండుటంజేసి కాఁబోలు నాయిందువదన రాజుతో వాగ్దానముచేసినట్లు మూఁడుదినములనాటికి రాఁజాలదయ్యె. ఆయెలనాఁగ యన్ననాఁటికి రాకునికి శిశుపాలుఁడు వర్ణింపనలవికాని యలమట నొందఁజొచ్చెను. ఆమూఁడుదినములు ప్రాణములు బిగబట్టియుండి దినత్రయమగుటయు నెంతయుఁ గలవరమొందసాగె. అదియటులుండ నాలుగవనాఁటి …ందుమతీవియోగవ్యథచేఁ బాన్పుపైఁ బొర్లుచు నుమ్మలికము …ను గళానందుని వెంటనంపఁబడిన సేవకులలో …రాక మహీవల్లభునకు విన్నవించెను. …రిఁజూచి సందియమొంది …గా లేదా యని

మై తలయొకదారిగఁ బరువెత్తితిమి. మరల నేఁటికి నెండోరువులఁ గాం
చఁజాలమైతిమి. స్వామిభక్తిచేత నేనాఁటనైనఁ గళానందాదులు దృష్టి
గోచరులగుదురేమోయని కడుఁ బ్రియాసపడి పలుదేశములు చరియించి
తిని. ఎందును జాడయేని గానక విసిగి దేవరపాదములసన్నిధిఁ జేరు
కొంటిని." అన శిశుపాలుఁ డదరిపడి దిగ్గున లేచి కోపారుణితలోచనుం
డై "హా దురాత్ములారా! ఎంతపనిఁ జేసితిరిరా! ఇఁక మగధరాజు
మొగము నెట్లుచూతును? అతని రాజ్యలక్ష్మి కపాయముఁ జేయఁ జూచి
న దురాత్ముఁడు చేతఁ జిక్కియు నిట్లు పలాయితుఁడయ్యెనే! జరాసంధు
నకు దండనాథుఁడనై యుండి యింతపాటిమేలామహాత్మునకుఁ జేయఁ
జాలనైతి. నాపాల సేవజేయుచున్న మీరందఱు నాకింత ద్రోహముఁ
జేసి తలవంపులు దెత్తురే! ఓరీ! సేవకులారా! ఈయధమజాతి మను
ష్యుని వధియింపుఁడు. స్వామి భక్తిలేక రాజద్రోహిని విడిచిన పాత
కుని మొగముఁ జూడరాదు. వీని నతిత్వరితముగ మ్రిందఁ జేయుఁడీ" యని
యానతిచ్చినఁ గింకరులు వానిం గొనిపోయి వధించిరి. ఉరిసిన పుండు
మీఁద నుప్పువెట్టినట్లు ప్రియురాలి వియోగముచేతనే వనటఁ బొందు
చున్న యాకుమారుఁడు కళానందుని పలాయనమువిని గట్టుమీఱిన కో
పప్రవాహమున నా నిరపరాధుని జంపించి రాత్రియంతయు నీరెండు
కారణములచేతఁ గంటికిఁ గూర్కు రాక బిట్టలమటనొందుచుఁ జెదు…
భూలోకముననె నరకబాధ ననుభవించుచుండెను. ప్రి…
చ్చును మాపువచ్చునని యాఱుదినములు …
బాధ గలుగుటచే రాఁజాలదయె…
మెవార్త నేలవిన్నవిం…

తెండనియె. ప్రభువునానతి శిరసావహించి యిరువురు సేవకులును జని యాగ్రామమం దంతట హేమావతియింటి నరసి యెవ్వరు నిది యది యని తెలుపమి మరలవచ్చి యావార్త స్వామికి నివేదించిరి. ఆపలుకులు విని చేదినాథుఁడు మహాకోపమున మండిపడి యాగులోనికరిగి యందుఁ గాఁపురమున్న జనులబస తెలిసికొనఁజాలని మందప్రజ్ఞులు నాకడ నున్నవారుగదా! ఈహీనుల నుద్యోగములనుండి తొలఁగింప రాదేయని వారినట్లుచేసి తానే స్వయముగఁ జందనపురికిం బోయి ప్రియురాలిని వెంటఁబెట్టుకొని రాఁదలఁచెను. మఱునాఁడు సూర్యోదయమునకు మున్న మేల్కాంచి యనుష్ఠానములఁ దీర్చుకొని సకలభూషణభూషితుండయి పవనజవముగల పారసీకహయములఁబన్నిన యరదము నెక్కి పదుగురాశ్వికులు నూర్వురు పదాతులు దన్ను బలిసి కొలువ వైభవముతో నాతఁడు చందనపురమునకుఁ జనియెను. ఇతనిరాకవిని పౌరులందఱు నతిభక్తియుక్తులై యూరుబైటవచ్చి నిలిచి రాజుంగాంచి సత్కారములందనిపి తగుమందిరమున విడియించిరి. భోజనానంతరమున శిశుపాలుఁడు గ్రామమునందలి పెద్దలఁగొందఱఁ గాంచి హేమావతి యిల్లెక్కడనని యడిగెను. వార లొండొరుల మొగంబులు చూచుకొనుచు వెలవెలఁబాఱుచు నామె యిల్లెఱుఁగమనిరి. అట్టి భువనైకసుందరి సు...ప్రసిద్ధురాలుగదా యామెయి ల్లెఱుఁగనివార లుందురే! ఇది చిత్రము

... యని యూరిలోని జనులందఱిఁ బిలిచి యడుగ వారును న

...చేసిరి. రా జాశ్చర్యమహాగ్రహములు త

...వారున్న వచ్చి చూపుఁడని చా

...న్న నెక్కడేమియుఁ

...ము హేమా

నోరీ జాతవేదుని హేమావతిని మొన్న నిందుమతిని మీ రేగృహమున దీసపిరో చూపుఁడని వారిని వెంటనిడుకొని పరిజనముతోఁ బోవ వా రూరికట్టకడకుంజని యట పాడుపడి నిర్జనమయిన యొక పాతయిల్లు జూపి వారందఱు నిందువిడిసి మమ్మొంబొమ్మని యానతిచ్చుచు వచ్చిరి. అంతకన్నఁ దా రెద్దియు నెఱుఁగమని యూరకుండిరి. ఆపలుకులు విని రాజు విస్మితుఁడై యిదియంతయు మాయగాఁ దనమదిఁ దలఁపక హేమావతిని దనప్రియురాలిని మొఱకులెవ్వరయినఁ దమయింట దాఁచి యుందురని గ్రామమునఁ బ్రవేశించి యందున్న యంగనల నందఱఁ జూచి శోధించి యందు హేమావతియు నిందుమతియు లేకపోవుట యెఱింగి దుఃఖింపసాగెను. పురజనులు రాజునెదుటకు వచ్చుటకు సిగ్గుపడి కడుమనోవ్యథ నొందిరి. పురమెల్ల చంద్రోదయఘూర్ణమానసాగరముచందమున నుండె. ఆబాలగోపాలము నిట్టిరాజునకు మరణమెన్నఁడు సంభవించును దైవమా యని బ్రువ్వదిట్టిరి. అనంతర మామహారాజు మహాదుఃఖము నాగ్రహము మల్లడిగొని యొడలెఱుంగక స్యందనారూఢుఁడై నిజపురమునకుంజని తల్పమునఁ బవ్వళించి రాజ్యవ్యాపారము విడిచి మిత్రులతో మాటలాడక పట్టపుదేవి రా మొగమేనియుం గనుంగొనక యనుజ్ఞుల మాటల కుత్తరములీయక యాహారనిద్రలుమాని దుఃఖార్ణవమగ్నుఁడై యుండి యాత్మగతమున " హా యిందుమతీ ప్రాణేశ్వరీ! భువనైకసుందరీ! యెందుఁబోయితే. న న్నెడఁ ... కు నీమన సెట్లొప్పె? నేను నీదాసుఁడ నీ ... దీనుని భంగపెట్టి దూరదేశమున ... రభ మహాముని శాపముల ... తనమునకో ...

నింతకాలము నాకడనమ్మించినట్లు నిలిపి తుద కిట్లువంచింపునని యింత మతి కుపదేశింపనోపు. ఆమెపన్నుగడ నిర్వహించుటకుఁ గుశీలవుఁడింత చేసె. హా! జాతవేదా! ఎంతఁగను సుదనముఁగాఁ బ్రవర్తించితివిరా! జరాసంధుని వేలియుంగరమెట్లో కపటమున నపహరించి నాకుఁజూపి కళానందుని నాచెఱనుండి ముక్తునిఁ జేసిన పాతకుఁ డాజాతవేదుఁడే యై యుండనోపునని నాకుఁ దోఁచుచున్నది. ఆజాతవేదుని మొగమును హేమావతి మొగమును నచ్చుగుద్దినట్లు పోలియుండు. వాఁడే హేమావతి వేసమువేసి నను భంగపెట్టలేదుగదా! అదియే నిజమని తోఁచెను. ఇందుమతికిఁ జుట్టములు గిరివ్రజమున నుండరు. అదియునువాని మాయయే అయ్యో! ఆలతకూన నాకెట్లుచేకూఱును. నేనింకజీవింపను. అయిన ను దానింగూరిచి యరసి కనుఁగొందము. ప్రయత్నలోపమేటికిఁ జేయవలయు" నని విచారించి నలువురు సేవకులం బిలిచి మీరలు గిరివ్రజమున కరిగి కళానందుఁ డందు రాజుచేతఁ జిక్కెనో లేదో యిందుమతి చుట్టము లందున్న వారా లేరా కనుఁగొనిరండని పంచెను. మరియు గూఢసంచారులఁగు చారులంబంచి చేదివిషయమునకుఁ జుట్టుపక్కలనున్న సకలదేశముల కంపి యిందుమతి జాడల నరయవలయునని యానతిచ్చి తద్విరహతాపమునఁ దాను గృశించి కను వందుచుండె.

పదునాఱవ ప్రకరణము.

...మ్ముగ మగధరాజుచేఁ బట్టువడియెనని
... లేమి నింతపుట్టెనని చేయు
...రుగుచుండెను. యో

డి చనవచ్చునని నిరంతరసంతాపహృదయుఁడై యుండె. రణార్ణవుఁడును ద
నకోర్కె లన్నియుఁ దలఁచినవి తలఁచినట్లు కొనసాగెనని యమితానం
దభరితుఁడై చెలిమికాండ్రం గూడి మనసుదీఱ భక్ష్యములమెక్కి మ
ద్యపానములఁ జొక్కి వెలయాండ్రయాటపాటలం దనిసి భూలోకపు
ణ్య సౌఖ్య మనుభవించుచుండెను. జయసేనుఁడు కారాగృహనివాస
మున కలవడి చెడినతనమతి క్రమక్రమముగఁ దనయంతఁదాన చక్కఁ
బడి యథాస్థితికి రా నించుకప్రాపంచికజ్ఞానము మరలఁదెచ్చికొని తన
నిరపరాధతకును జరాసంధుని యరయమికిని వగచి తారావతియు, రా
జసేనుఁడు విజయసేనుఁడు సురక్షితులై యున్నవారే యని కోటలోప
లి సేవకుల నరసి తెలిసికొనుచు నొకవిధముగఁ గాలము కడపుచుండె
ను. తనకుమారున కెన్నటికిఁ జెరనుండి విముక్తి కలుగదయ్యెనని యా
ఱనిదుఃఖముపాలై విజయసేనుఁడు చిక్కి మంచమెక్కె తనకన్న దురటి
ల్లు తారావతి యేమగునోయని బెంగగొని పండువలెనుండునట్టి సంసా
ర మింతవఱకుఁ దెచ్చితె దైవమా యని మనస్థిమితము గానకుండెను.
పురమున వాడలంబడి బిచ్చమెత్తుకొను గ్రుడ్డిముసలివానిని గృష్ణునిచా
రునిగావగచి కారాగృహమున రాజు బంధింపఁ జేసిననాఁటఁగోలె వాఁ
డు రుగ్ణతకు లోనై తగుచికిత్సలేమిఁ దుదకు దారుణసన్నిపాతజ్వర
పీడితుఁడై మున్నె చెడినమతి మఱింత చెడ మరణావస్థుఁడై తన
రము పురజనుల భారమున నడగునట్లు పరలోక ప్రయాణము
ముగ నుండెను. పురజనులు వానిచేత విని
విని యెఱుంగమనిరి. చంద్రపా
గూఁతురు మగధరాజు

పుడు శోకించి యావార్త తనచెవిని బడకమున్నె తానె ముందుగా మరణమొందుట లెస్సగా నుండుననియు నదియెట్లు చేకుఱుననియు యోజింపఁ దొడఁగెను. సౌందర్యతిలక కొన్నినాళ్ళు ప్రియజనకుని దుర్గతిఁదలఁచి చింతించి యనంతరము తనకుఁ బాటిలిన తలఁపరాని కష్టమునుగూర్చి కొండొకవగచి నేఁడు హృదయేశ్వరుఁడగు కళానందుని వంతు వచ్చినందుల కెంతయుఁ బొగలఁజొచ్చెను. జరాసంధుని కూఁతురు నంతఃపురాంగనలు దాసీజనములు నెంతధైర్యము సెప్పిన రణార్ణవుని ప్రజ్ఞాదికము నెంతపొగడిన నాయింతి పెడచెవులం బెట్టి యాహారింపక నిదురింపక నిరంతరబాష్పపూరితలోచనయై తలవిరియఁబోసికొని జరాసంధనిర్మూలనముఁ జేయఁ దలఁచి కోటలోఁ బ్రవేశించిన రాక్షసియట్లు చూపఱకు వెఱ పుదయింపఁ జేయఁజొచ్చెను.

కళానందుఁడు భైరవదేవుని కర్పింపను దన్ను రణార్ణవునకిచ్చి పెండ్లిసేయను ముహూర్తము నిశ్చయింపఁబడెనని విని యాసుందరి మూర్ఛిల్లి దాసీజనములుసల్పు శైత్యోపచారములఁ దెలివొంది వేఁడినిట్టూర్పులు విడిచి వారియెదుట జరాసంధునిం దూఱి తనచేతివజ్రపుటుంగ్రముం బెఱికి యావజ్రము నూరుకొని త్రావి మనోవ్యథ కంతముఁగలుగఁజేసికొనయత్నించె. అదియెఱింగి పరిచారికలు బాలిక కరముఁ బట్టుకొని యాయంగుళీయకము నూడలాగుకొనిరి. రోసము దుఃఖము దన్ను మైమఱచునట్లుచేయ యావిరిబోఁడి కొండొకవగచి దాసీజనముండిట్టి సేయునదిలేమి సెజ్జపైఁ బవ్వళించి రోదనముచేసి కొంతసేపటికి నిదురించెను. అపుడందఱు దలుపులుమూసి యావలకుంజనిరి. అంతలో నామెయు మెలఁకువగాంచి యామందిరమ్మున నెవరును లేమికి సంతసించి సెజ్జవిడిచి లేచి గది నలుదెసలం బరికించి చూచె. అట్లు వెదకవెదక నొకగూటిలో చిన్నమొలకత్తియొండామెకనులంబడి పెనుపండువుసేసె. అయ్యది మహానందమున గ్రహించి దానిమొన వాఁడిగలిగియుండుట

మరియు సంతసించి యప్పుడే తనప్రాణములు దానిచే నంతమొందింప వలయునని యాకత్తిఁ గుత్తుకపైఁ బెట్టుకొని యంతలోఁ గళానందునిమాట జ్ఞప్తికిరా నాత్మగతమున "నయ్యో! ఆమహాత్ముఁ డింక జీవములతో నుండ నాకీసాహసమేల? ఏవేల్పుకృపచేనైన నెద్దియేని మేలు మాకిరువురకుఁ గలుగఁ గూడదే! ఆహా! శరీర మున్నంతవఱకును నీయాశాపిశాచము ననుంబట్టి విడువకున్నయది. అయిన నీయాయుధ మావశ్యకమగునప్పటికి దాఁచుదానని తగుచాటుచోటు గనఁబడమి బాన్పుజేరి యాదూదిలో నాయాయుధమును గప్పి పుచ్చి యెప్పటియట్లు పాన్పుపైఁ బవ్వళించె. కళానందుఁడు తాను బట్టువడకమున్న తనప్రియురాలెన్నటికైన విముక్తయగుననియుఁ దా నారసికురాలి పొం దనుభవించు సమయము సమకూడుఁగాక యనియు నుప్విళ్లు లూరుచుండెను. తనకు బంధము సంభవించిన గడియ మొదలు తనమరణము నిశ్చయించి తనకేను దనబహిఃప్రాణమైన సౌందర్యతిలకకు నింక శాశ్వతమైనయెడబాటు సంభవించెనని వగచినఁ గార్యములేదని రాఁబోవు నిజఘోరమరణము జ్ఞప్తికి వచ్చినపుడెల్ల మేనువడఁక నులికిపడుచు నరక్షకులకు రక్షకుఁడు రాజీవాక్షుఁడ యని నిరంతర నారాయణస్మరణము చేయఁదొడఁగెను. రేలఁ గనులమూఁతయే పడుటలేదు. ఒకవేళఁబడిన నొకమాఱు తన్ను భైరవదేవునకర్పింపఁగొంపోయినట్లు మెడమీఁదఁ గత్తినిలిపి నఱుకవచ్చినట్లు నొకమాఱు హృదయేశ్వరి తన్నుఁ గవుఁగిలించుకొని "ప్రాణనాయకా నన్ను విడిచిపోయెదే?" యని వాపోయినట్లును వేఱొకసారి తల్లి తనదురవస్థఁగాంచి మృతినొందినట్లు పాడుకలలుఁ గనుచు నతిభారమైన యాజీవనముకన్న మరణమే యుక్తమని దానికెదురుచూచుచుండెను.

ఇట్లు దురంతరచింతాక్రాంతుఁడయిన యారాజకొమారునెద్ద కొకభటుఁడువచ్చి దీనవదనుఁడై యిట్లనియె. "అయ్యా! ఈజరగుచున్న మహాసంభ్రమముంబట్టి సౌందర్యతిలకకు రణార్ణవునకు వివాహమగునని

నీవే యెఱుఁగుదువు. రేపురాత్రి యావివాహము జాముప్రొద్దుపోయిన వెనుక నగు. కళ్యాణానంతరమున మగధరాజు నిన్ను శ్రీభైరవదేవున కర్పించు. ఈవార్త నీకెఱుఁగఁజెప్పుమని రాజు నన్ను నియోగింప నే వచ్చితిని. దుర్వార్తఁ జెప్పితినని నాపై నలుగకుమయ్యా" యని నిలిచియుండె. తా నటుజరగునని యెఱిఁగియున్నను దుర్వార్త యెన్నఁడోవచ్చునని తన్నిమిత్త మెదురుచూచుచున్నను సేవకుని దారుణవచనములు శ్రవణగోచరములగుటయుఁ గళానందుని మనస్సున నాకసముపై మెఱుపుపాఱినచందమున కొక్కమాఱు వికార ముప్పతిల్లి శరీరము గడగడ వడఁకఁజేసి నోటమాట రానీయదయ్యె. ఎట్టకేలకు ధైర్యముఁదెచ్చుకొని సేవకునితో నిట్లనియె. "నీవు చేయునదేమి? స్వామిమానతి నెఱవేర్చుకున్న నాయవస్థ నీకును సంఘటిల్లు. చచ్చెడువానికి జగము తృణప్రాయముగదా! మీరాజు నన్నింతకన్న నెక్కుడుశిక్షపాలు సేయఁజాలునే? కావున నావచనములుగ నిట్లు జరాసంధునితో వచియింపుము. ఓరీ జరాసంధహతకా! నీవు సలిపిన మహాపాతకములలో నిదియొక్కటి. నీయదృష్టము పెంపునను నాకొదవిన భాగ్యలోపమునను నేను నీచేతఁ జిక్కవలసివచ్చెఁ గావున నీవు న న్నంతమొందింపగలవు కాని కొలఁది దినములలో వాసుదేవుఁడు నీప్రాణములను హరింపకపోఁడు. నేఁడా రేపా యను విషయమొక్కటియేగాని నీకును గాలమాసన్నమైనది. బంధింపఁబడిన యారాజుల భాగ్యపుఁబంట పండినది. నీవును నేనును బరలోకమున నతిశీఘ్రకాలములోనే కలియఁగలమును మీ మగధరాజ్యలక్ష్మికి వైధవ్యము గలుగుఁ నవసర మిదియే. నిరపరాధులు నబలలు ననదలు ననేకులు క్షోభపడినఁగాని నీపాపము పండదు. ఇపు డంతయు సమాప్తమైనది. ఓయీ సేవకా! జంకక గొంకక యీ వచనములు నే ననిన పగినట్లు తెలియఁజెప్పుము పొమ్ము". అన వాఁడును వల్లెయని యచ్చోటు వాసిపోయె. ఆదినముననె సౌందర్యతిలకను

పెండ్లికూఁతును జేయుమని రణార్ణవుని పెండ్లికొమరునిఁ గావింపుమనియు జరాసంధుఁ డానతిచ్చె. నాఁ డంతఃపురాంగనలు సంపంగినూనెఁ దెచ్చి యాబాలికకుఁ దలయంటవచ్చినపు డాపడంతుక యన్నెలఁతుకలఁ జెంతరానీయక మహాగ్రహముతోఁ గొంతతడవు వారలందూఱి వారందఱును వచ్చి తన్నులమి బలిమిం బట్టుకొని తలయంటఁజూచినపుడు చేయునది లేక మనసున నెద్దియో నిశ్చయించుకొని కొయ్యబొమ్మ వడువున నుండె. అంగన లిచ్చవచ్చినట్లు తలయంటి నలుఁగిడి పన్నీటఁ జలకమాడించి కురులార్చి విలువలేని చీనిచీనాంబరములఁ గట్టించి జిలుగుపైఠాణంపు రవికఁదొడిగించి మగధరాజు నంతిపురమున నున్న యింతుల యాభరణము లన్నియుఁ బెట్టి తెలిసోగకనులఁ గాటుక దిద్ది యధరమునకు లాక్షయెత్తి పచ్చికస్తూరితో వదన చంద్రమండలమునకుఁ గలంకపు శీవిం దెచ్చునట్లు తిలకము దిద్ది సాంకవము గండసీమ నలఁది యగరు పన్నీరు మెదిపిన మంచిగంధము మేనబూసి మల్లెపూదండలు మెడనున్న రత్నహారములతో వియ్యమొందఁజేసి సర్వవిధముల రతీదేవిని మించునట్లుచేసి యామె సోయగమునకు వారె యచ్చెరువందిరి. జరాసంధుని యంగనలు దాని సౌరుంగనుంగొని యాఁడువారికే మనసు కరఁగుచున్నదనిరి. మగధరాజు దూరముననుండి యామెలనాఁగం జూచి "యిది త్రైలోక్యరాజ్యలక్ష్మి. ఇదియెందున్న నది సకల సంపదలతోఁ దులఁదూఁగదే? ఇంతటి యపూర్వలావణ్యమును బ్రహ్మ యెట్లుసృజింపఁ గల్గె? " నని యచ్చెరువొందుచుండ ముదుసల పేరటాండ్రుం బురోహితులు సౌందర్యతిలకం జంద్రపాలునకు మ్రొక్కింపుమనిరి. సుందరాంగులాయంగనను మెల్లనఁదోడ్కొని చంద్రపాలుఁడున్న నెలవునకుఁ బోయిరి. వచ్చుచున్న బిడ్డంజూచి తండ్రి సంతోషబాష్పములకు మాఱు దుఃఖబాష్పములు విడిచె. కూఁతు కన్నీరుతోవచ్చి తండ్రిం గౌఁగిలించుకొనెను. కుమారికయుఁ దండ్రియు నొండొరుల నాలింగనముఁ జేసి

కొని పెద్దపెట్టున నేడ్చిరి. కొంతవగచి చంద్రపాలుఁడు బిడ్డంజూచి "నీకావివాహము కాకపోవుంగాక! కళానందుఁడె నిన్ను వరియించుంగాక!" యనిదీవించెను. మగువ లాపల్కులు విని యెట్టటో చిఱునగవుఁ దోఁప బలిమిచే జనకుని మ్రోలినుండి యీవలకుం దెచ్చిరి. అనంతర కుంతిని జరాసంధునకు మ్రొక్కింప వలసినదని బ్రాహ్మణులు సెలవొసంగ నంగన లామెను మహారాజు మందిరమునకుం గొంపోయి కనకపీఠముపైఁ గూర్చున్న వానికిఁ బాదాభివందన మొనర్పుమనిరి. తనప్రియజనకునిఁ గారాగృహమున నునిచినవానిఁ దన మనోహరుఁ గళానందుఁ గడతేర్పసిద్ధముగా నున్నవానిఁ దనమనోరథము భగ్నముచేయఁదలఁచినవాని నారాజుం గాంచునప్పటికి బాలికకు వశముగాని యాగ్రహము వొడమె. అంతట నయ్యబల కనుగొలఁకులు ముడివడి నేత్రంబులు కెంపుమీఱ మొగ మలుఁ జేజేవురింప నిలువెల్లఁ బొడసూపిన పులకాంకురములు కోపానలధూమశిఖలు ధగధగ మెఱయు రతనాలదీధితులుఁ గోపాగ్ని ప్రజ్వరిలఁ వెడలుమంటలుగాఁగ గంధసింధురముపైఁ గవియు నాఁడుసింగముబోలె మహిషాసురునిపై నుంకించు శర్వాణియుఁబోలె నరకుని నఱుక నరుగు సత్యభామయుంబోలె పండ్లు గీటుచు జరాసంధునంతటివానికే భయజనకమైతోఁపఁ గెలఁకులనున్న చేడియలకు వెఱపుదోఁచెనన నేల? అటునిల్చి పెంగలుకచే మృదూక్తులు తడబడ నిట్లనియె. "క్రూరచిత్తా జరాసంధహంతకా! నేను నీకుఁ బాదాభివందనమాచరింపను. పవిత్రమైన నామేను బహుళపాపభూయిష్ఠమైన నీమేను సోఁకనిచ్చుదాననే? నన్ను నీవు నీయుంపుడుకత్తె కొడుకునకుఁ గులగోత్రములు లేనివానికి నీవంటి నీచున కిచ్చి పెండ్లి చేసెదవే గాని నామనసు వానిమనసుతో నామేను వానిమేనుతోఁ గలుప నీతరముగాదు. నేను రాచదానను. నాపలుకులు వినుము. ఇటు సూర్యుఁడటుపొడిచినను నీమనోరథము సిద్ధింపదు. వివాహము ముగిసిన మఱు

నాఁడు సకలామృతములు నీకన్నులతో నీవుచూచెదవు. ఈపాపఫల మ చిరకాలమున ననుభవింతువుగాక! నే నుత్తమయగు నిల్లాలిబిడ్డనై నినేని బార్వతీచరణములు నమ్మితినేని నాశాపము నీకుం దగులకపోదు." అని మొగముఁద్రిప్పి యచ్చటనుండి మరలి నడువ నంగనలు భయమున వడఁకుచుఁగదలఁజాలరైరి. రాజు దానిపలుకులువిని మీసముపైఁ జేయివైచి తలయూఁచి యిపుడు దీని నేమనుటకును సమయముకాదు. వివాహమైన వెనుక దీని పొగరడఁగును. మీరును వెంటఁబొండు. రేపు కళ్యాణము జరుగునని యానతియిచ్చి వారలనంపి పందిళ్లు వేయించి తోరణములు గట్టించి కలయంపులు చల్లించి బంధుమిత్రుల రావించి సిద్ధమై యుండెను.

పదునేడవ ప్రకరణము.

అంతట లోకబాంధవుఁడగు పద్మబాంధవుఁ డస్తమించి జరాసంధు నంతిపురమున నున్న సేవకులు లోనగు పెండ్లివారికి మహానందమును గళానందుఁడు లోనగువారికి విచారమును గలుగఁజేసెను. రణార్ణవుఁడు విరహతాపమునఁజేసి తెల్లవాఱునెపుడు వివాహమగు నెప్పుడని పొగలుచుఁ దామరతూఁడులపాన్పుపైఁ బవ్వళించి చందన మొడలు నిండ నలంది సుందరాంగులు తాళవృంతముల విసర నిట్టూర్పులు విడుచుచు విశ్రాంతిలేక యుండెను. కళానందుఁడు చీకఁటిపడుట మొదలు తనకష్టమింక నొక్కనాఁటితోఁ గడచిపోవునని నిశ్చయించుకొని ధైర్యమొక్కటియే తనకుసాయముగ నుండదగినదని దానిని విడువఁడయ్యె. ఆరేయి యెంతయైనను గళానందునకు నిద్రరాదయ్యెను. రెండు జాములరాత్రియగుడు నొక్కమాఱు వానికిఁ దనముదుసలి తల్లియు సౌందర్యతిలకయుఁ దనదురవస్థయు జ్ఞప్తిరా నతివిషణ్ణహృదయుఁడై ధై

ర్యము విడచి యిట్లు విచారింపఁజొచ్చెను. " హా సుందరీ ! నాకతమునగ ద నీవింతకష్టములుపడుట ! ఎంతకాలమునుండి వర్ధిలిన యనురాగలత యెంతలో నెట్టులయ్యె ? నీనిమిత్తమకాదె యిలువెడలి ద్వారకానగరము జేరి నందనందనపాదరాజీవముల నాశ్రయించి యిటఁరాఁబురికొల్పితి. చేదిరాజు సేవకులచేఁ బట్టువడి యెన్నెన్నో సిలుగులఁబడి యెట్టకేలకు జాతవేదుని కృపచే మరల ద్వారకఁజేరితిని. ద్వారకనుండి కొండంతయాసతో బయలుదేఱి నినుగాంచి మునుపడిన చిక్కులన్నియు మఱచితి. పట్టుమని యొక నెలయైనను మనసుదీఱ నిన్గలిసియుండలేదు. ఇంతలోనె పాపపుదైవమునకు మనమైత్రి కన్నులకుట్టె. హా ! నావంటి మందభాగ్యునకు నీవంటి మహారసికురాలిపొందు లభించునే ? ఈదురాత్ముఁడగు జరాసంధునకు నేఁగావించిన యెగ్గేమియులేదు. అయ్యో ! సుందరీ ! అనుక్షణము నీకుదాసుఁడనై యుండి నీకనుగొలకులసన్న మెలఁగు నన్నువిడిచి నీవెట్లు ప్రాణములునిలిపితివో ! దైవమా ! ఎంతలో నంతఃకోర్కులు భగ్నముజేసి నాయవస్థ నింతవఱకుఁ దెచ్చితి ! భువనైక సుందరియగు నామందయానను గూడి భూలోకస్వర్గము ననుభవింతు ననుకొంటిఁగాని యింత చిన్నతనమందె దారుణముగ భైరవదేవునకు జరాసంధునిచేత నర్పింపఁబడి యకాలమరణ మొందుదునని యెన్నఁడు ననుకొనలేదు. వాసుదేవా ! నీచరణారవిందముల నమ్ముకొనియుంటి. నాఁడె వత్తునని రావైతివి. నన్నీపాపి తుదముట్టించినవెనుక నీవువచ్చిన నేమి రాకున్ననేమి మిత్రులెవ్వరైన నాకు సాయముజేతురేమోయని వెదకిచూచిన నట్టివాఁడొకఁడును గానఁబడఁడు. నాకాప్తుఁడగు నుజ్జయినీరాజుగూడ జరాసంధునిచేఁ జిక్కి నాయవస్థనె యనుభవించుచున్నాఁడు. హాతల్లీ ! వీరమాతవని నిన్ను జనులు సన్నుతిజేసినప్పుడెల్ల నీగరువంపుఁ గొడుకుఁ దలఁచి యెంతయు సంతసించెడుదానవు. ఇంక నేమగుదువు? అయ్యో ! కొడుకును జగన్మోహనయగు కోడలు గాఁపురముచేయఁ

జాలయానందింపవలయు నని గంపెడుకోరికతో నున్నదానవు. కడకు నీముప్పైన నాచేతఁ గడవదయ్యె.” అనివగచి యంతలో మరల ధైర్యముఁ దెచ్చుకొని ఛీ! నాకేటికీవగపు చాలుఁజాలు నని సర్వప్రపంచవ్యవహారసన్యాసముఁ జేసి యిహపరసాధనమని నారాయణనామ స్మరణముఁ జేయుచుఁ దెల్లవారుటకు నిరీక్షించుచుండెను.

సౌందర్యతిలకయు దాను వివాహోచితమైన మంగళాలంకారములఁ దాల్చియు నానందవార్ధి మునుఁగుటకుమాఱు దుఃఖవారినిధి మునిఁగి నాలుగుజాములు తెప్పవాల్పక రాఁదలఁచిన యాదారుణయవస్థ నెట్లుతప్పించుకొన నగునని యోజింపఁ దొడఁగెను. అందఱును గుఱ్ఱుపట్టి నిద్దురబోయి దేహములు మఱచియుండ నీబాలిక పాన్పుపై లేచి కూరుచుండి యీసును రోషము, వగపు, గోపము నొక్కసారి పొడివి తన్ననేక భంగుల నాడింపఁ బ్రియునిఁ దనయవస్థను దలఁచి యిట్లని విచారింపఁదొడఁగెను.” హా హృదయేశ్వరా! అయ్యయో! హృదయేశ్వరుఁడు గానివాని నేనట్లు పిలుచుకొంట వ్యర్థముగాదే నిన్నుగాంచిన గడియమొదలు భర్తగాఁ బడయుతలంపున నెందఱ దేవతలఁ బూజించితి, నెన్ని నోములు పరమభక్తితో నోఁచితిని. ఎందఱ బ్రాహ్మణులకు దానము లొనర్చితి. నానోఁచిన నోము లిట్లుపండె. ఆవిప్రుల దీవనలిట్లు ఫలించె. నాబ్రదు కింతయాఱడిహోవునని యెన్నఁడు నను కొననైతి. హా కళానందా! నీవు నాకు తప్పక దక్కుదువని జరాసంధునంతవానితోఁ బగసాధించితి. తండ్రి చెఱలోనున్నను రాజున కలుకవొడమినను నిన్నునమ్ముకొనికాదె మనోధైర్యములం జిక్కఁబట్టియుంటి. నీమనస్సు మెప్పింపవలయునని కాదె. యెన్నెన్నో దేశములలోనుండి వినుసుచీరలు దెప్పించుకొంటిని. నీమనస్సు హాయియని యానందించుటకేగదా వీణపై నపురూపరాగముల నలవరించుట. అట్టి నీవు నాకు దూరమైపోవ నింక జగమేల? నేనేల? కళానందునకర్పించిన యీమేను

రణార్ణవుని ప్రక్కఁదార్తునే? వివాహము ముగిసినవెనుక వధూవరుల నేకాంతగృహమున కంపుటయు నీయాయుధముతో నాదురాత్ముని యుసురుఁగొని నన్ను నేఁబొడిచికొని శయనాగారము రక్తాలంకృతమై పీనుఁగులపెంటయై యుండఁజేసి జరాసంధాదివీరు లచ్చెరువడి నా సాహసము మెచ్చ, నగర మట్టుడికునట్లుడుక చంద్రపాలుఁడు బళి యని వినుతించియేడ్వ నత్యుత్సాహముతోఁ బ్రవర్తించెద. రాచపుట్టువునకుఁ జావన్న భయమగునా? ప్రాణసంరక్షణముకన్న మానసంరక్షణ మెక్కుడుగదా! ఈహేయజీవనముకన్న మరణము శ్లాఘనీయము. అయ్యో! అంతదారుణమేల నేఁ జేయవలయు? ఈసమయమున నందకుమారుఁడు రారాదే. వచ్చి దీనికి విఘ్నముఁ జేసి నాదుమనోరథసిద్ధి చేయరాదే. అట్లుమాత్రి మదృష్టవంతులయినవారు లేరే? రుక్మిణికి మున్ను గట్టగడగదా మనోరథము నెఱవేఱెనది. అంతటిభాగ్య మింతటి యదృష్టహీనులకా? హా పార్వతీ! హా మాధవా! హా మిమ్ము నిశ్చయముగ నమ్మియుంటి. పాలముంచిన నీళ్ళముంచిన మీరకారే మీకుగాకున్న నీశరీరము విడిచిపోవుట నిశ్చయము. లోకములో నా పాటు లెంతబీదకన్నియకును గలుగవు. మీకు జాలి యింకనైనఁ గలుగదే? అని పరిపరివిధములఁ బలవించుచునుండ నంతలోఁ దెల్లవాఱెను.

ఆదినమందే వివాహమహోత్సవ మగుటఁ బెండ్లికుమారు మహావైభవముతో నూరేగింపు మనియు, రాజద్రోహముసల్పి వధార్హుఁడైన కళానందుని హీనదశ దెలియునట్లు రణార్ణవు నూరేగింపుచో వెనుకఁ దోడుకొని పోవలయుననియు మహారా జానతిచ్చె. కావున ప్రభాకరుఁ డుదయమొందిన పిదప మంత్రులు సామంతులు దండనాయకులు పరిచారకులు మొనసి యామహోత్సవము వెంటరా సిద్ధముగ నుండిరి. మునుముందు పురజనులును బురజనులవెనుక నేనూఱశ్వికులును నాశ్వికులపిఱుందన నూఱు భద్రగజములపై నధిరోహించిన

మహావీరశతమును, దద్గజబృందమధ్యమున సకలకాంచన రత్నభూష ణములతో గన్నులు మిఱుమిట్లుకొలుపు నొకమహాదంతావళముపై నెక్కి రణార్ణవుఁడును వెడలిరి. ఆగజావళివెనుక నొకముసలియేనుఁగుపై నలంకారశూన్యుఁడై దీనాననుఁడై విచారవినమ్రవదనుఁడై కళానం దుఁడు బలిమిచేఁ గూరుచుండఁ జేయఁబడెను. ఆయేనిక కనులుఁగానక యిట్టటు మార్గమునకుఁదొలఁగుచు నెన్నఁడు దానినెవ్వరు నిరుపయోగ మగుట స్నానముఁజేయింపమి సహింపరాని దుర్గంధభూయిష్ఠమై వార్ధ కమున నడుగులు తడబడ మెల్లగ నడచుచుండె. తనశత్రువైన రణా ర్ణవునికి జరగు మహోత్సవమునందె తననిట్లు చేయుట కేవలము జరా సంధుఁడు తన్నవమానము నొందఁజేయవలయుననియె యని కళానం దుఁడెఱింగి పరమనీచున కట్టిమహాగౌరవము నెఱయుచుండఁ దనకంతదా రుణపరాభవము సేకుఱినందులకు బిట్టువగచి తన్ను మున్నెఱింగిన మిత్ర బాంధవుల మొగము లావేసముతోఁ జూడనోపక వంచినతల యెత్తఁడ య్యె. యోగిని యీమహోత్సవముఁ జూడ నోపక బహుదీనవదనయై కన్నుల నశ్రుజలములు గాఱ వదలఁజాలక నొకచోఁ జతికిలఁబడి ప్ర శ్నములడుగవచ్చినవారి నూరక యంపసాగెను. ఫాగుణిదేవి కుమారు నిదుస్థితియు నిశ్చయమయిన దుర్మరణమును విని కంఠమున నొకత్రా టితో నురిబెట్టుకొనియె. అంతలో నది దాసిగాంచి యురిదీసివేసి మర ణమును దప్పించెనుగాని యామెదుసలి మతిచెడి యసంబంధప్రలాప ము లాడఁజొచ్చెను. చంద్రపాలునిభార్య నాఁటిదినమున వీధిమొగ ముఁ జూడక లోనఁ బండుకొని నిరాహారయై మొగమువాయ బిట్టేడువ సాగెను. కాణభూతియు నానుహోత్సవ మధ్యమునందుండి మూఁగ కేకలు వేయుచు నింతయు భంగముసేయుట కుపాయము గానఁబడదయ్యె నీశ్వరా యని విలపించుచుండె. రణార్ణవుఁడు మహానందవికసితముఖుఁ డై యామదగజేంద్రముపై నమర్పఁబడిన హౌదాలోఁ బచ్చపట్టుపరు

పుపయిం గూరుచుండి తెల్లపట్టు మెత్తలకత్తమిల్లి, మస్తమందు రతనాల కుళ్ళాయి వివిధదీధితులుచిమ్మ మేని విలువలేని తొడవుల మేలిరవలు చూచినవాండ్రి కత్యద్భుతమునొందింప విరహతాపము నభినయించుచు సాయంకాల మగుటకు సుముహూర్తసమయమునకు నెదురుచూచు చుండెను. తన వివాహమునకు మదిఁ బొంగుటకన్నఁ గళానందుని ప రాభవమున కెక్కుడు మురియుచుండెను.

సర్వవసుప్రఁడు తనయజమానుని విషయమునకు సంతోషించి యానినముఁ జిరకాలమునుండి తనమేను నాశ్రయించియున్న మురికి యొకకొంత పోవునట్లు తానమాడి యజమానుఁడు విడిచిన వలువలు కొన్నికట్టుకొని కారుమేనికిఁ జందనము మెత్తి తాంబూలమునమలుచు వారకామినుల యాటపాటలకు మిట్టపండ్లు తెఱచి నగుచు నానంద మతిశయించునపుడు కేకలువేసి పరువులెత్తుచుఁ గిష్కింధాపురవాసుల గు రామసైనికుల జ్ఞప్తికిఁ దెచ్చుచుండి యందఱ నవ్వించుచుండెను. నిరుపమానవైభవముతో మధ్యాహ్న మూరేగింపు మహోత్సవము జరగుటయు నందఱును రాజనగరునఁజొచ్చి మాధ్యాహ్నికములందీర్చి జరాసంధసమేతులై పంచభక్ష్యపరమాన్నముల నారగించిరి. భోజ నానంతరమున సంగీతగోష్ఠి కొంతతడవు నిర్వర్తించిరి. రణార్ణవుఁడు జాముప్రొద్దువేళ నశ్వారూఢుఁడై యోగిని బసకుంబోయి తెరచాటున నుండి తనపరిణయమున కామెను రమ్మని ప్రార్థించెను. అతని వేఁడి కోలునకు సమ్మతించి దీపములు పెట్టినవెనుక వత్తునని యుఁ దనకొక ర హస్యమగుగది సిద్ధము చేయుమనియు నానతిచ్చి వానినంపె. అప్పుడ ప్పుడు యోగినికడకు కాణభూతివచ్చి యాలోచించు వాడుకయున్నందు న నానాఁడు వాఁడు లోనికింబోయి యోగినితోఁ గొంతసేపుప్రసంగిం చి యవ్వోటువాసి యెందేనిఁజని సాయంకాల మగునప్పటికి వివాహ మును జూడ నగరునకుఁ బోయె. యోగినియు నొకపల్లకిలోఁ గూరు

చుండి మహారాజాంతఃపురమున కేగి యొకగదిలో విడిసె. అంతటి మహాత్మురాలు కోటకుఁ జనుదెంచినపుడు నగరునఁగలవారందఱు మహావినయసంభ్రమచిత్తులై యామె పనుపు సేయుచుండిరి. జరాసంధుఁ డామెదర్శనము మఱునాఁ డుదయమునఁ జేసి కృతార్థత నొందఁదలఁచెను. అంతట నంశుమంతుఁ డస్తగిరిఁ గ్రుంకఁ గళానంద సౌందర్యతిలకలముఖాంభోజములు వికాసహీనములయ్యె. తక్కిన పెండ్లివారి మొగములు వికసించె. కోటలో మహాకోలాహలము జరగుచుండెను. అపుడు సంజచీఁకటి బయలువెడలిన సేవకులు దీపములు వెలిఁగించుచుండిరి. జరాసంధుఁ డాకళ్యాణమునిమిత్తము కడువిశాలమయిన యొక పెద్దపందిరి నిర్మింపఁజేసి యందు విచిత్రములగు చిత్తరువులు వ్రాయించి యలంకరింపఁజేసి శృంగారలక్ష్మి తాండవమాడునట్లు చూపరులాశ్చర్యమొందునట్లు సిద్ధము చేయించె. ఆసందెచీఁకటివేళ నామహాకళ్యాణ మంటపమునం దొకమూలఁ జిచ్చంటుకొనియె. అది ముందెవ్వరుఁ గన్గొనమి నంతకంతకుఁ బెరిగి పెనుమంటలు బ్రహ్మాండము ముట్టి పొగలు ద్వారములఁ గ్రమ్మి జనులరానీయకుండుట నందఱుఁ జూచి పరుగులెత్తిరి. జరాసంధుఁడు మేడపై నిల్చి మహాకంఠధ్వనితోఁ బౌరుల సేవకులఁ బిలిచి నీరువోసి యార్పుమనుచుండె. అందఱును బావులు చెఱువులు నిర్జలమగునట్లు కడవలతో నీరుఁదెచ్చి చిచ్చార్పుచుండిరి. ఎంద ఱెన్నికడవలనీరుఁ దిమ్మరించిన నాయగ్ని చల్లాఱక పచ్చనిపందిళ్ళనెల్ల భస్మీభూతములు సేయఁదొడఁగె. మేడలు మిద్దెలు నంతఃపురములు నంటుకొను ననుభయమున శుద్ధాంతకాంతాజను లాక్రందన ధ్వనిసేయ నింగి ప్రతిధ్వనిమొసంగె. లక్షలకొలఁదిజనులు గుంపులు గూడి బ్రహ్మాండకర్పరము పగుల నార్చుచుండిరి. ఆసమయమున నయ్యో సౌందర్యతిలక యీనిప్పునం బడియె నని మహాశబ్ద మొందు పుట్టెను. ఆపలుకులు విని రణాంగణపుఁడు చిచ్చులోనుఱికి నలుదెసల

నామెయున్నచో టరయుచుండ నెట్టిగఁ గాలిన దూల మొక్కటి యూ
తనిభుజముపై విఱిగిపడినది. అందఱును రణార్ణవుఁడు చచ్చెచచ్చెనని
యఱచిరి. సేవకులు కొందఱుటికి వానినీవలకీడ్చి తెచ్చిచూడ వా
నివీఁపును మూఁపును గాలె. ఆగాయము లంతయపాయకరములుగావని
యందఱనిరి. సౌందర్యతిలక యింటనే యున్నదని పరిచారకులువచ్చి
చెప్పి యదియెవ్వరో గొంటితనమున కనిరని నిశ్చయించిరి. కళ్యాణ
మంటపమును భస్మీభూతముఁజేసి మంటలు చల్లాఱె. జరాసంధుఁడు వి
వాహము మఱునాఁడు జరగునని యెల్లవారికిం జెప్పిపుచ్చె. ఇంత య
మంగళముతో నారంభమైన యీవివాహ మెట్లు జరగునో చూడఁ బౌ
రులు ముచ్చటపడుచుండిరి.

పదునెనిమిదవ ప్రకరణము.

జగన్నాటకమునందు నాకాశ మనురంగస్థలమునఁ బగలనునొ
కయంకము రాత్రి యనునొకయంకమును బ్రదర్శింపఁబడుచుండుతఱిఁ
బ్రథమాంకమున రౌద్రరసమభినయించి, పద్మినీరాజు బ్రవేశించి తన
కథ నెంతయుఁ జక్కగా వినిపించి నిష్క్రమించె. అంతట సంధ్య యను
శుద్ధవిష్కంభమునందు జీఁకటి యనురాక్షసి ప్రవేశించి యతిభయంక
వృత్తిఁ దనవ్యాప్తిఁజూపి సకలజంతువులకు భీతిగొలిపిఁ గొంతతడవున
కు నిష్క్రమింప ద్వితీయాంకమునందు శృంగారరస మభినయింపఁదలఁచి
నరాజు ప్రవేశించె. ఆరాజు బహుకళావంతుఁడై చూపఱ కానంద
ముఁగలిగించి తన కరాదివిన్యాసముల నేర్పుచే నెల్లవారలమెప్పు వడ
యఁజొచ్చెను. ఆసమయంబున గిరివ్రజపురమునందు బహుకోలాహ
లము జరగుచుండెను. వివాహమునకు సమస్తప్రయత్నములును సిద్ధ
మయ్యె. క్రిందటిదినమునఁ దగులఁబడినపందిళ్లు మరలవేయించి మహా

రాజు సకల బాంధవులఁ బిలువనంపి మహాభైరవపూజకుఁ దానును సిద్ధముగనుండెను. సౌందర్యతిలకయుఁ గాదలఁచిన యావివాహమును గూర్చి భగవంతునిపై భారముంచి శరీరమాత్రము జరాసంధుని పనికత్తెలకొప్పగించి యూరకుండె. కళానందుఁడు గుండె రాయిచేసికొని తనదారుణమరణమునకుఁ బ్రియురాలి వివాహమునకు నీశ్వరఘటన మిట్లుండఁబోలునని వాసుదేవుని పాదరాజీవములపైఁ జిత్తముహత్తజేసి వర్ణింపరాని మనోవేదనపాలై యుండె. జరాసంధుని సేవకులు వానికాదినమునఁ దలయంటి, రక్తాంబరము గట్టించి కంఠమున బహుమాల్యములవైచి భైరవదేవుని కర్పింపఁ దగినస్థితిలో నునిచిరి. రణార్ణవుఁడును బెండ్లికుమారుఁడై యానందమున మిన్నంటి తన పూర్వశత్రువైన కళానందుని జూడవచ్చి దురవస్థకు సంతసించి వానింబరిహసింపఁ దలఁచి "యోహో! పెండ్లికుమారుఁడు కాఁబోలును. సౌందర్యతిలకపాం దొక్కజాములోఁ గలుగఁగలదు. వాసుదేవుని నమ్మితివిగా! అతఁడు నిన్ను రక్షించునులే" యని యుల్లసమాడి మరలిపోయెను.

మహీమండలమంతయు నంధకారము గప్పినతోడనే గిరివ్రజమున కభిముఖులై మువ్వురు బ్రాహ్మణోత్తములు వచ్చుచుండిరి. సంధ్యాసమయమున వారు తమకాలకృత్యముల నొకసరోవరమునందు దీర్చి పయనముసాగించి గిరివ్రజపురము చుట్టునున్న కొండలలో నొకదానికడకు వచ్చి నిల్చిరి. అందొకఁడు, కార్మొగులఁబోలు నల్లని మేనిచాయయుఁ బుండరీకములవంటి యాకర్ణాంతవిశాలనేత్రములును, లక్ష్మీనివాసయోగ్యమగు వక్షమును నాజానుబాహువులును జగన్మోహనవిగ్రహుఁడై చూచువారలకుఁ బురుషోత్తముఁ డితఁడని తోఁచునట్లుండె. రెండవవాఁడు, మహాకాయుఁడు, మహాభుజాదండమండితుఁడు వీరరసప్రధానుఁడు, చూడ మహాబలావతారమనుటకుం దగి

నవాఁడు. ఆతని యాకృతియు బొమముడియు నున్నతనిటలము గను నవైఖరిం గన్నవారి కాతని బలదర్పములంగూర్చి యక్కజము పొడమకపోదు. మూఁడవవాఁడు లలితసుకుమారశరీరుఁడు, నెగుభుజంబుల వాఁడు, శాంతరసమును సౌజన్యము నుట్టిపడునట్టి మోమువాఁడు. నిరంతరధనుర్వ్యాపారమువలనఁ గాయలుగాసిన వానిభుజములం గనుఁగొనువారి కీతఁడు శౌర్యరాశియనియు మహారణముల లబ్ధవిజయుఁడనియు స్ఫురింపకపోదు. మూఁడు కాలములలీల, మూఁడు విచ్చులయచ్చున, మూఁడు మూర్తులభాతిని నాబ్రాహ్మణత్రయము నిశాప్రవేశమునఁ బొలిమెరఁ బ్రవేశించి యామహాగిరులయున్నతి కచ్చెరువందుచుండ నం దానీలవర్ణుఁడై నజన్నిగట్టు తక్కిన యిరుగురను మెల్లమెల్ల నొక్కకొండ నెక్కించెను. అందఱు నాశైలమెక్కి నిక్కిచూచునప్పటికి నపుడపుడే చీఁకటులువిరిసి చందమామ యించుకించుకతోఁచి కానఁబడుచుండుటచే, మహాసౌధగోపురాది సమేతమై పురముదారి దృష్టిగోచరమయ్యె. ద్వారకకన్న నెక్కుడు ద్వారములు హస్తిపురముకన్న నెక్కుడు గోపురములు నింద్రప్రస్థముకన్న నెక్కుడుమేడలు గల యాపురము సిరికిఁగాఁపురమని తలఁచి కొన్నినిముసములు దానివైశాల్యము జూచిచూచి జనసంకులమునఁ బొడమురొద నాలకించి యక్కజపడ నానీలవర్ణబ్రాహ్మణుఁ డిట్లనియె. "మీరీనగరమెన్నఁడును గాంచియెఱుంగరు. ఈనగరమునకు నైదుకొండలు పెట్టనిప్రాకారమై కాచుచుండును. మనుష్యమాత్రున కీపురముఁ జొరశక్యముగాదు. చొచ్చెనేని చచ్చెనని నమ్ముఁడు. మనమెక్కిన యీకొండ గోరథమనంబరఁగు. చైత్రకాద్రియను నింక నొక్కశైలము గలదు. అక్కడినుండి యీప్రోలికి రెండవ ద్వారము కలదు. అందు మూఁడుదివ్యభేరు లున్నవి. జరాసంధశత్రులు నగరము బ్రవేశింతురేని యవి తమంత మ్రోగు. మనము రాజద్వారమునఁ బోవలదు నావెంటరండు. ఇంక నాలస్యమొనర్పనేల? క

ళానందుని సౌందర్యతిలకను రక్షించి యాదురాత్ముని శాసించి భూభారము నడంపవల్లయు" నని వారిఁదోడుకొని చైత్రికాద్రికరిగె. ఇంతలో దూరమునుండి వారి సేవకుఁడొక్కఁడు మేను ముచ్చెమటలు గ్రమ్మఁ బరుగుపరుగునవచ్చి "అయ్యలారా! ఆలస్యము సేయవలదు. ఆకోలాహలము పెండ్లియేసుఁడీ! కళానందుఁడు భైరవున కర్పింపఁ బడునఁట. త్వరపడుఁడీ!" యని వగర్చుచు వారితోఁ జెప్పెను. నల్లనిబ్రాహ్మణుఁడామాటలువిని భయము లేదని చైత్రికపర్వతమెక్కి యచ్చటనున్న భేరులం బగులఁగొట్టుదమని తనసంగడికాండ్రకుం జెప్ప వారు సమ్మతించిరి. అంతట నామువ్వురు నామూఁడుభేరులను ముక్కముక్కలుగ ఛేదించి యందు గాఁపుండి యెదిరింపవచ్చిన సేవకుల నిరుగుర నడఁచి పురముంబ్రవేశించిరి. అంత సేవకుఁడు ముందఱకు వచ్చి వారికి మార్గప్రదర్శకుఁడై యెటకుఁ బోవుదుమని యడుగ వారు మాలకరుల గృహములకుం గొనిపోవుమనిరి. అతఁడును వారిమువ్వుర రోహాణకుని యింటికిం దోడుకొనిపోయి రణార్ణవునకుఁ గల్యాణసమయమున మెడలో వేయుటకొక సంపఁగిపూలదండయు భైరవదేవునకుఁ బూజాసమయమున సమర్పించుటకు నొక జాజిపూలదండయు నాతఁడప్పుడే సిద్ధముచేసి, భోజనమునకుఁ బోవసమకట్టుచుండ నీవిప్రత్రయము తద్గృహముఁ బ్రవేశించె. సేవకుఁడు రోహాణకుని చెవిలో నెద్దియో గుసగుసలాడెను. రోహాణకుఁడాతనిపలుకుల నాలకించి భయము భక్తియుఁ దన్నుఁ బురికొల్ప వారలకు నమస్కరించి "అయ్యా! నాయర్థము నాశరీరము నాప్రాణములు మీయవియ. మిమ్ముఁ దనియఁజేయుట ముల్లోకములఁ దనియఁజేయుటకద! ఈకుసుమమాలికలు ధరియించి నాయింట విందారగించి నన్ను గృతకృత్యుం జేయవేఁడెద. ఇంక నాజన్మము సఫలమగు కాలము వచ్చె" నని కేలుదోయి ముకుళించి ప్రార్థించె. వేఁడికోలు నంగీకరించి రాజునానతిచే నిర్మింపఁబడిన యారెండుదండలు మఱికొన్ని మాలికలు

ధరియించి యాత్రిమూర్తులు వానియింట విందారగించిరి. నీలవర్ణుఁడు కొండొకతడవు రోహిణకునితోఁ జాలునమాటలాడి తనసంగడీఁడులతో వానియిల్లు వెడలి రాజమార్గముం బ్రవేశించె. ఆసుముహూర్తసమయమునకు నెదురుచూచుచు పురజనము మహానందకల్లోలినియం దోలలాడుచుండి వర్ణింపరానిదశలో నుండిరి. వీధి కిరుగెలఁకుల నున్న మేడలన్నియు బహుదీపకళికలతో విరాజిల్లి పట్టపగలను సందేహమును గలిగింపఁజొచ్చె. యువయువతీ జనములు మద్యపానమును జేయువారు, జేసి ప్రియజనముపై సోలువారు, సోలినవారింబిగ్గఁ గౌఁగిలించువారును; నవ్యక్తాలాపములం దేలువారు, మృదంగధ్వానములఁ జేయువారు, దదనుగుణముగ ధింధిమితకయని తాళమువేయువారు, దాళపులయతప్పకుండ నాట్యముసేయువారు, విన్నాణమేర్పడ వీణలవాయించువారు, దన్నాదములతో సవతువచ్చునట్లు కోకిలకంఠమెత్తి పాడువారు, బహువిధపుష్పమాల్యములు వింతతొడవులు విలువమసువులు దాల్చువారు నయి నగరమునకు మహాశోభఘటించిరి.

గిరివ్రజమునందలి నాఁటివైభవముఁగాంచి నాగరికులయ్యు వారుమువ్వురు నత్యాశ్చర్యమునొంది యింద్రవైభవము జరాసంధుని వైభవముకన్న మిన్నయనుటకుఁ దగుకారణములు లేవనుకొనిరి. అట్లు జనసంకులము లగుబహువీధులు దాఁటిదాఁటి కొండొకయెడకుంజని యచ్చట గందముఁ బూలదండలు విక్రయించు బాలికలఁగాంచి తమకు వానినొసఁగుమని వారడుగ వారలు మహారాజు నంతిపురమునకుం గొనిపోవుచుంటిమి. ఈదినమున నగరునఁ గళ్యాణముగూడ జరగును. ఇవి యన్యులకొసఁగరానివి. అని ప్రత్యుత్తరమిచ్చి చనుచుండ మువ్వురు వారలచేతులలోనున్న గంధమాల్యంబులు బలత్కారముగ లాగికొని గందము తమమేనుల కలందుకొని పూలదండలు కంఠముల ధరియించిరి. పుష్పలావికలు వారిమోటుతనమునకు సాహసమునకుఁ గోపించి

వీరరసముఁగన్న కొడుకులట్లు భయంకరాకారులగు వారి నేమియు ననఁ జాలక తెలతెలఁబోవు మొగములతో వచ్చియురాని కోపపుమాటలతో సాగియుసాగని నడకలతోఁ దొలంగిచనిరి. అంతలో సేవకులరుదెంచి జరాసంధునితో గడగడవడఁకుచు నిట్లనిరి. దేవా ముగ్గురుబ్రాహ్మణులు మనభేరులు వ్రియ్యలుచేసినారు. పుష్పలావికలయొద్దనుండి బలాత్కారముగ గంధమాల్యముల గ్రహించిరి. వారు సామాన్యబ్రాహ్మణులట్లు గాన్పింప రని విన్నవించిరి. జరాసంధుఁ డత్యాశ్చర్యమునొంది చతురంగబలసమంచితు లగుమూర్ధాభిషిక్తులకయిన నాపురముజొర నశక్యము. బీదపాఱులకింత సాహసముండునే? వారిం దోడుకొనిరండని యానతిచ్చెను.

పందొమ్మిదవ ప్రకరణము.

అప్పటికి రాత్రి జామయ్యెను. వివాహమునకు సర్వమును సిద్ధమైనందున సుముహూర్తము సమీపించుచున్నదని వధూవరులకు మంగళస్నానములు చేయింపనగునని పురోహితులు మహారాజునకు వర్తమానము లంపఁదొడఁగిరి. పెండ్లికొడుకు వాని చుట్టములు నెచ్చెలులు, మగధరాజుమంత్రులు మొదలగు నియోగివర్గము గళ్యాణమంటపమున నధివసించి జరాసంధునిమిత్త మెదురుచూచుచుండిరి. ఆత్మజ నరకుఁడగునందనందనుఁ డింకనురాఁడయ్యె. ఈవివాహము జరగుటకు విధినియోగము కలదుకాఁబోలు. అని సౌందర్యతిలక తనకర్మమును దూరుచు వివాహానంతరమున నాత్మనాశనమునఁ గృతనిశ్చయయయ్యె. కళానందుఁడును దనమరణకాలము సమీపించినదని యాసలన్నియు స్మరణముసేయుచుండె. కృష్ణుఁడువచ్చి వారలయార్తి దీర్చునని యనుకొన్న యోగినియుఁ గాణభూతియు వాసుదేవునిరాక గగనకుసు

మమని నిశ్చయించి దీపములు పెట్టినది మొదలు గ్రుడ్లనీరుఁ గ్రుక్కుకొనుచు నేడువసాగిరి.

మహారాజు తమ్ముఁ దోడితెమ్మని యంపిన సేవకులు తమకడకు రాకమున్న బ్రాహ్మణులుముగ్గురు జరాసంధునగరుసొచ్చి తమరాక దౌవారికిం దెలియఁబంపిరి. మహారాజు నర్ఘ్యపాద్యములఁగూడ దేరఁబనిచి విప్రులకెదురువచ్చి వారికి వినయవినమితదేహుఁడయి విధ్యుక్తముగ నమస్కరించి యున్నతపీఠముల నాసీనులఁజేసి వారలకిట్లనియె. “వేదత్రయముఁబోలు మిమ్ముఁజూడ నాజన్మ పావనంబయ్యె. నాయొనర్చు సపర్యల నంగీకరించి యీమధుపర్కముల గ్రహింపఁ బ్రార్థించుచున్నవాఁడ” నన వారుమువ్వురు మధుపర్కాదిసపర్యలు గైకొనమని నిరాకరించిరి. అందులకు రాజు ఖిన్నుఁడై తనమనమున నేదియో యనుమానము గాలముగఁ దవుల్కొన వారలకిట్లనియె. మీరలు సద్బ్రాహ్మణులరేని నే జరపిన మధుపర్కాదిసత్కారము నేలఁ గైకొనరైరి! బలిమిని జందనమాల్యములగ్రహించుట పాడియే? సింహద్వారమునఁ బురము సొరక మ్రుచ్చుల యచ్చున వెనుకటి దారిని రానగునే? మీరు బ్రాహ్మణోత్తములో వేషధారులో యని నాకు సందియ మగుచున్నది” యని వారిమొగములు జూచుచున్న మాగధునికి నీలవర్ణుఁ డిట్లనియె. “రాజా మేముత్తమజాతి ద్విజులము. గంధమాల్యములయందు లక్ష్మి వసించుటంజేసి బలాత్కారముగా లక్ష్మిం గైకొంటిమి. శత్రుగృహము, సింహద్వారమునఁ జొరరాదు. కావున నితరద్వారమునఁ జొచ్చితిమి. మేము, ధనయాచకులముగాము గాన నీమధుపర్కము గ్రహింపమైతిమి. మన మొండొరుల కెన్నఁ డెగ్గుఁగొనర్చుకొన లేదెట్లుశత్రులమైతి మందువో యదివినుము:—నీవును నేను జిరకాలశత్రువులము. “ఆత్మవత్సర్వభూతాని” యనుమాటం బట్టి లోకముల, కెగ్గు జరపువాఁడు మాకెగ్గు జరపువాఁడు. లోకములకు మేలుకావించువాఁడు మాకు

మేలు కావించువాఁడు. నీవు పాపకర్ముఁడవు. నిర్దయాత్ముఁడవు. క్రూరస్వాంతుఁడవు. పరమపుణ్యచరిత్రులగు మూర్ధాభిషిక్తుల, నిష్కారణముగ బంధించి పశుపతికి బలిపెట్టుచుందువు. భక్తవత్సలుండును, బరమపురుషుండు నగు శంకరుఁడు నిరపరాధులగు రాజన్యుల వధవలనం గాని, ప్రీతుఁడుగాఁడే. మేము జగదుపకారార్థము సకలరాజమోక్షణమును, దుష్టరాజశిక్షణముఁ గావింప నిందువచ్చితిమి. ఇప్పటికేనియు వివేకముం దెచ్చుకొని తోటినరపాలురనందఱ విడిచి పుచ్చుము. అట్లు విడువనొల్లవేని నీయసువు లపహరించి రాజుల విడిపింపక మరలువారము కాము. మేము నీవలన యుద్ధము యాచింపవచ్చిన ద్విజులము. లోకోపకారార్థము సమకట్టిన మాకు సర్వదేవతలు తోడుపడుదురు. ఇంక దాఁపనేల? మారహస్యముఁ జెప్పెద నాలకింపుము. నేను నీప్రాణపగతుఁడనగు కృష్ణుఁడ. ఈతఁడు మహాబలనందనుఁడును, కౌరవవంశసింహమునగు భీమసేనుఁడు. ఈతఁడు ఖాండవదాహమును గావించిన మహాధన్వి యర్జునుఁడు. రాజలోకమును విడిచి పుచ్చవేని బాణములనైన విడిచెదవు గాక యని కఠినముగఁ బల్కి భీమార్జునుల మొగములఁ జూచుచుండె. ఆపలుకులకు జరాసంధుఁడు కినిసి భయంకరాకారుఁడయి వాసుదేవుని మొగముపైఁ జూడ్కి నిల్పి యిట్లనియె. „ ఓయీ! వాసుదేవా! నీవిభీషికలకుఁ బెదరి నిన్ను వేఁడుకొంటకు బుద్ధిలేని భీష్ముఁడను గాను. నిన్నె దేవుఁడని నమ్ముటకు మతిమాలిన నారదుఁడనుగాను. పరాక్రమములేని యుధిష్ఠిరుఁడనుగాను. ఎఱుక లేనివారి మ్రోల నీవు డంబములు కొట్టినఁదగును గాని నాచేతి చుఱుకు చక్కగారుచిమెఱఁగిన నీవు నాయెదుట నింత సాహసముతోఁ బలికిన నేను వెఱతునే? ఒక్కసారిగాదు రెండుసారులుగా దిరువదియొక్కసారి నాతోఁ గయ్యమొనర్చి పరాజయమొంది సిగ్గువిడిచి బ్రతుకుట యేచాలు. వీఁడుమిక్కిలి మరల నామొగ మెట్లు చూడవచ్చితివి. నీకు మానా

భిమానములు శూన్యము. నీతిలేనివాఁడవు. జారుఁడవు. చోరుఁడవు. నీకకాదు నీజాతికిఁగూడ సిగ్గుబిడియములు లేవు. అంతంతపరాభవములు నాటినమీఁదట నీవు శరీరముతోఁ జావక నిలిచియుంటివి. కాని మానుషవంతుఁ డింతకాలము జీవింపఁడు. నీవు తేజోహీనుఁడవు. కష్టజనునికన్నఁ గష్టజనుఁడవు. భగవంతుని యవతార మని పేరుబెట్టుకొని సకలపాపములఁ జేయుచుందువు. నీవు సలుపని పాతక మేదైనఁ గలదే? గోపుంజంపితివి. ఆఁడుదాని మ్రిందించితివి. మేనమామఁ బొలియించితివి. మేనత్తం బట్టితివి. ఇవియు నీశ్వర లక్షణములే? నేనీమొగముఁ జూడరాదు. ద్వారకానగరమున గోపికాలోలుఁడవై మద్యపానముఁజేసి భోగములం దేలుటకు నీయంతవాఁడు లేఁడు. రాచవారిలో నొండొరులకుఁ బగ లుదయింపఁజేయు మన్న నీబుద్ధికుశలత యసమానముగాఁ బాదరసమట్లు పాఱును. మాయోపాయమున బల్లిదులగు పగరఁ దెగటార్చుటకుఁ బెట్టినది పేరు. ఎంతతరిచి చూచిన నవలక్షణములె కాని శుభలక్షణ మొక్కటి యేని నీయందు నాకుఁ బొడకట్టదు. నీవు నాయందలి పగచే నన్ను దెగటార్పవచ్చితివి. కాని రాజలోకముపైఁ గల కృపచేఁగాదు. భూతదయ నీయందు గోసినను లేదు. రాజలోకమును బశుపతి కర్పింపకుండ నుద్ధరింప వచ్చితివా? మీముప్పురను భైరవదేవున కర్పించెదను జూఁడు. ఈశ్వరారాధనము నిమిత్తము పట్టి తెచ్చిన రాజచక్రమును నీమాటలకు జంకి విడుతునే? ముజ్జగములెత్తివచ్చిన నాకంఠమునఁ బ్రాణములుండ రాజుల విడిచిపుచ్చ. మీరు పోరితమునకుఁ గృతనిశ్చయు లైతిరేని నేనును సిద్ధముగానె యున్నాఁడను గాని నీకు సిగ్గులేకున్న నాకైన నించుక లజ్జకలదు. నాచేఁ బలుమాఱులు పరాజితుఁడవై యాఁడుదానికన్న నధముఁడవై పలాయనము నొందిన నీతోఁ గయ్యమొనర్పఁజాల. ఈయర్జునుండు కొండికవాఁడు. వీనితో రణమొనర్చుటకు సాంగ్రామికశాస్త్రధర్మము లొ

ప్పవు. కావున నేయుద్ధమయిన మహాసత్వుఁడును, భువనవినుతపరాక్ర ముఁడు మల్లయుద్ధవిశారదుఁడు నాకునచ్చిన మగఁటిమి కలవాఁడు నా చేతి పోటున కాఁగఁ గలాఁడు నగు వృకోదరునితోడన యొనర్చెదను. నీ! నీబ్రతుకుఁగాల్పనే? భీమార్జునులచేత నన్నుజంపింపఁ దలఁచితివి కాని నన్ను జెనక నీకు బలములేదుకదా! కపటోపాయమున నాసంగ డీఁడుల హంసడిచికులఁ జంపుటయనుకొంటివో. కాని భీమసేనా! యుద్ధ మున కాయితము కమ్ము." అని సేవకుం జూచి "ఓరీ! మాకుమా రుని సహదేవుని దోడితెమ్ము. రణాంగణపుని వివాహ మీయుద్ధము ముగియువఱకు నిలుపుసేయుమని మంత్రులతో నావచనములుగఁ బ లుకు" మని పంచి తాను మల్లయుద్ధమునకు సన్నద్ధుఁడాయెను.

ఇంతలో సేవకులవలన సందేశ మెఱిఁగి, తండ్రికడకు, సహదే వుఁడు దీర్ఘవిచారము సూచించు మొగముతో వచ్చి విప్రవేషులైన భీమార్జునవాసుదేవులను, వారికట్టెదుట నున్న జరాసంధుని గాంచి తండ్రికిమ్రొక్కి నిలిచెను. అంత, మాగధుఁడు కొడుకును జేరఁజీరి శి రముపైఁ జేయివైచి వత్సా! కౌరవునితో మల్లయుద్ధమును గావించె దను. నిన్ను మగధరాజ్యమున కభిషిక్తుం జేసెదను. నాయవస్థకు వగవ క వంశక్రమాగత మైన యీరాజభాగమును వహించి ప్రకృతిజనరంజక ముగ నేల యేలుము. మల్లయుద్ధమునఁ గెలుతునేని తపోవనమున క రుగువాఁడ. భీమసేనునిచేత వాసుదేవునియోగమున మడియుట కల్గె నేని వీరస్వర్గముఁజూఱఁగొందును. అనాథలు నీతోడంబుట్టువులు నగు కంసభార్యల నెంతయుఁ గారవమున నాదరింపుము. ముదుసలియగు నీతల్లిమాట కెదురాడకుము. ఈవాసుదేవుఁడు కపటోపాయకుశలుఁడు. నాకుఁ గల యంతమగఁటిమి సాహసము నీకడ లేవు గావున నీవు వా సుదేవునితో బద్ధసఖ్యుఁడవై యుంట లగ్గు. వాని వైరము నీబోఁటుల కుఁ దగదు. అని సమీపమున నున్న వారలచే నించుక పుణ్యజలముఁ

దెప్పించి కుమారునకు మగధ రాజ్యాభిషేకము గావించె. సహదేవుఁడు గనుదమ్ములనుండి వేఁడినీ రొలుక నభిషేకమున కియ్యకొనియె. బ్రాహ్మణు లాశీర్వచనము లొనర్చిరి. మఱునాఁటి యుదయమున మల్లయుద్ధము నిర్ణయింపఁబడియె. యాదవ పాండవుల రాకయు వారి సంకల్పమును గళ్యాణ మండపమునఁ దెలియుటతోడనె యచ్చటి వారందఱు విషాదసంచలితమనస్కులైరి. పౌరు లనేకవిధములఁ దమలోఁ దాము ముచ్చటించుకొనుచు, నిజగృహములం గూర్చి పోయిరి. మంత్రులు వాసుదేవుని రాజనీతి తంత్రమునందలి మర్మములు దెలియుటకు యోచనములు సేయుచు రాజ సమ్ముఖమునకుం బోయిరి. దండనాథులు సేనలఁ గూర్పనావశ్యకము లేని మల్లయుద్ధమేల నిర్ణయింపఁ బడియె. ఇది యుపద్రవ హేతువే యని వగవఁ జొచ్చిరి. సహదేవుఁడు వాసుదేవునితో సంధి యొనర్పుమనియు రాజుల బంధముక్తులఁ జేయుమనియు జనకుని వేఁడికొని సఫల మనోరథుఁడు కాఁడయ్యెను. అంతఃపురాంగనలు రాజునకు వినాశకాలము ప్రాప్తించెనని యుల్లములు తల్లడిల్ల నేడువసాగిరి. హంసడిచికులు లేనిలోపమునఁ దనబీరము మొక్కవోవునని జరాసంధుఁడు జయమునందు నిశ్చయములేక తల్లడిల్లుచు శేషించిన రాత్రి నిదురపోఁడయ్యె. బంధింపఁబడిన రాజుల కందఱకు, ముఖ్యముగాఁ గళానంద చంద్రపాలజయసేనాదులకు హృదయములు చల్లనయ్యె. ముఖారవిందములు వికసించె. సౌందర్యతిలక తనభాగ్యము పండెనని పాండవుని జయమును యాదవుని మనోరథ సిద్ధియు నగునట్లు తన యిలువేలుపుల వేఁడుకొనఁ జొచ్చె. కోరకుఁడు కాణభూతిం గలసికొని మద్యపాన మొనర్చి గంతులు వేయసాగెను. యోగినియుఁ దనపన్నుగడ కడముట్ట నెఱవేఱు నవసరము వచ్చెనని సంతసించి యెప్పటియట్లు జరాసంధ పక్షము మాటలాడుచు నంతిపురమున నున్న స్త్రీలకు జరాసంధ విభుఁడె విజయమొందు నని ధైర్యముం జెప్పుచుండెను.

రణార్ణవుఁడు గుండెలు పగిలి కటకటా! పీటలమీఁది పెండ్లి చెడిపోయె. ఇంక వాసుదేవుఁ డాకన్నెను నాకుఁ దక్కనిచ్చునే? నాపాపము పండినది. హా నాతండ్రి! జరాసంధ యని పెద్దపెట్టున నేడువఁ దొడఁగెను. నగరమంతయు ఘూర్ణమానమహాసముద్రము భంగి మహాక్షోభము నొందె. అంతటఁ బ్రభాతం బగుటయుఁ గాల్యకృత్యములు నిర్వర్తించి భీమసేన జరాసంధులు మల్లయుద్ధమునకు సిద్ధపడి సభారంగమున కెదురుగనున్న చదునగు తలమునకు వచ్చిరి. మాగధుని మంత్రులు సామంతులు దండనాయకులు నాప్తులు నుచితాసనములఁ గూరుచుండి కృష్ణార్జునులకుం దగుపీఠములు వేయించిరి. అపుడపుడే ప్రభాకరుఁ డీమల్లయుద్ధము మొదటినుండియుఁ జూడఁ దలంచువాఁడుంబోలె మెల్లమెల్ల నుదయగిరిశృంగ మెక్కి తొంగిచూడ నారంభించె. భీమజరాసంధులు రంగస్థలమున నొండొరుల కభిముఖులై నిలిచిరి. ఇరుగురును గట్టిన పుట్టములు విఱిచికట్టిరి. ఇరుగురును కేశపాశములఁ గట్టిరి. ఇరువురును భ్రుకుటిస్ఫురణంబున దుర్నిరీక్షకులైరి. ఇరుగురు భుజాస్ఫాలనంబున బ్రహ్మాండము ప్రతినాదము సేయఁ జేసిరి. ఇరువురు సింహనాదమున సభ్యులఁ గంపింపఁజేసిరి. అప్పుడు మహావీరులగు మాగధపాండవులు పరస్పర జయాభిలాషులై యొకరినొక రొడిసిపట్టి పంకించి యట్టహాసము గావించి యాఁకుకఱచి తొడచరచి చేతులకొనలు కలపికొని వలయాకారములుగ భ్రమించి యొండొరులు చిక్కకునికి వీలరయుచు నెట్టకేలకు శార్దూలద్వయంబు చందంబున గజేంద్రయుగళము భాతి మృగేంద్రద్వితయమట్లు ప్రళయసమయఘూర్ణమాన సాగరయుగళము నోజ రెండు కొండల వడువునఁ దాఁకి భీకరమల్లయుద్ధము నెఱపిరి. అట్లు కార్తికశుద్ధమునఁ బాడ్యమినాఁడు కయ్యమారంభమై పదునాలుగు దినములు ప్రవర్తిల్లె. జరాసంధుఁడు నానాఁటికిఁ బరిభ్రాంతుఁడయ్యె. ఒకనాఁ డెమ్ములు చూర్ణమయ్యె. మఱునాఁడు

కాయమునఁ గాయములు తోఁచె. మూఁడవనాఁడు నెత్తురు తొరఁగె. ఇట్లు జరాసంధుఁడు క్రమక్రమముగ క్షీణబలుఁ డగుటయు భీమసేనుఁడు చెక్కుచెదరక నిలుచుటయుఁ జూచి సహదేవుఁడుఁ దద్బంధువులును దుఃఖించిరి. కృష్ణార్జునులు వికసితముఖులై భీమసేనున కుత్సాహము గలిగించుచుండిరి. చతుర్దశినాఁటిరాత్రి మహాశ్రాంతుఁ డయిన జరాసంధుని భీమసేనుఁడు వాసుదేవునియోగమునఁ బట్టి వెన్నెముక పెటుక్కున విఱిచి నోట ముక్కున రక్తము కాలువలుగట్ట జగద్భయంకరముగ వధియించె.

ఇరువదియవ ప్రకరణము.

అత్తెఱంగున భువన ప్రథితప్రతిపక్షగజేంద్ర సింహస్వప్నాయమానుఁడు సకలక్షత్త్రియ ప్రచయతేజోరాశి, వాసుదేవునకుఁ బెద్దకాలపుఁ బగతుఁడును నగు జరాసంధుని భీమసేనుఁ డవలీల మ్రందించి నిజవిజయంబుఁ బౌరులకుఁ బ్రకటించు తలఁపునఁ గాఁబోలు వానిమహాకళేబరము నెత్తుకొనివచ్చి పురద్వారమునఁ బాఱవైచి సింహనాదముచేసి విజయశంఖంబు పూరించి తన్ను బహూకరించు కృష్ణార్జునులం గౌఁగిలించుకొని మహాసంరంభమున మేను మఱచి మృగేంద్రు చందమున రాణించి నిలచె. అంతఃపురకాంతాధ్వానములుఁ జుట్టముల హాహాకారములును సేవకుల యాక్రందనరావములును బౌరుల దీర్ఘనిశ్వాసనినాదంబులును బందెల నున్న రాజుల యానందసూచక జయజయ ధ్వనులును మేదురములై యొకరిపలుకు లొకరికి వినరానియట్లు చేసె. పౌరులాబాలగోపాలము నచ్చటికి వచ్చి పడియున్నరాజుం గాంచి యేడ్చువారుఁ, బ్రక్క నిలిచిన భీమసేను మగఁటిమి మెచ్చువారు, హా! యెంతవాని కెంత కలిగె ననువారు, గద్గదకంఠులై నిట్టూర్పు విడుచు

వారు, గన్నీరు చేలాంచలములఁ దుడిచికొనువారు, రాజుగుణములఁ దలఁచువారు, వానికూ్రరత వానింగొట్టిన దనువారుఁ గృష్ణుఁ డన్యాయము చేసె ననువారు, వాసుదేవుఁడు జగద్రక్షణార్థమై న్యాయమే చేసె ననువారు, రాజుల బంధించిన నీతని కేమి యనువారు నై పలువితములఁ బ్రసంగించుచుఁ, బోవువారలకుఁ దొలఁగుచు, వచ్చువారికి దారి యిచ్చుచు నిసుముచల్లినరాలనట్లు గుంపులు కూడిరి.

అంతట సహదేవుఁడు బాష్పాకులితలోచనుఁడై, వజ్రరాతుఁడు రత్నఖేటుఁడు ననుమంత్రులు తన్నుఁబట్టి నడపింప దుఃఖవశమున నడుగు కదలుపం జాలక యెట్టకే లచ్చోటికి వచ్చి చిరకాలరాజ్యభారము వాయుట కోయన నేలఁబడి పెద్దనిద్దురపోవుచున్న తండ్రికళేబరముం గని దుఃఖము బట్టఁజాలక యాపీనుంగుపైఁబడి కన్నీటిసోనలచే నాతని రక్తసిక్తమగుమేను దడుపుచు నిట్లనివిలపించె “హాతండ్రీ! మహారాజాధిరాజ! త్రిలోకైకభయంకర! ఎంతలేసి మూర్ధాభిషిక్తులును నీయాన దాఁట వెఱతురుకదా! సకలప్రపంచంబు నీపేరు విన్న గడగడ వడఁకు చుండు. అంతటిదుర్నిరీక్ష ప్రభావంతుఁడ వగు నీవు నేఁ డతిదీనముగ ధూళిధూసరమైనకటికినేలఁ బవ్వళించితివి. అయ్యో! నావంటి యదృష్టహీనునకు నిన్నుబోలు బంగారుకొండవంటి తండ్రి దక్కునె! తండ్రీ! రాజ్యాంగసంరక్షణ జూడ వేమి! వీఁడె వజ్రరాతుఁడను మంత్రి వచ్చియున్నాఁడు. కనువిచ్చి చూడవేమి? మాచెలియండ్రి కేమి దిక్కు చెప్పితివి? అనాథమైన రాజ్యలక్ష్మి నాకేల? నీవులేమి జగమంతయు లేనియట్లు తోఁచుచున్నది. కటకటా! నేనింక శత్రుఁడనైతినే! ఆతేజము నామహాసత్వము నారాజనీతి యెందుఁ బోయె? కృష్ణు ననేకప న్యాయములు పరాజయము నొందించిన యీదక్షిణహస్త మిటు ధూళిం బడనిచ్చుట న్యాయమే? హా! కేతకీదళమా? మగధరాజ్యలక్ష్మికి వైధవ్యము కలుగునని నీవుతెచ్చినవార్త నిక్కువమయ్యె హా! యెం

V.R.NARLA MEMORIAL LIBRARY
V.R.NARLA
D.P.R.I.
Acc. No.

ఇరువదియవ ప్రకరణము.

పాతకపువేళ నాలేఖవచ్చెనో? తండ్రి నీయసమానము ... కాల
ము కన్నులఁ గప్పినది. నేను నీతోఁటివైభవమును నేఁటి దురవస్థయు
జూచి భరియింపఁ జాల" నని బిట్టునవగచి నేలమూర్ఛిల్లె. వానియాలా
పములు విని వజ్రిరాతాదులు దుఃఖించిరి. కృష్ణార్జును లిరువుర నేత్ర
ములనుండి బాష్పబిందువులు గిరగిర దిరుగఁ దొడఁగె. ఇంతలో సేవకు
లరుదెంచి మూర్ఛిల్లిన సహదేవునకు శైత్యోపచారములు నడిపి వానిం
దేర్చిరి. కరుణాసముద్రుఁడైన వాసుదేవుఁడు కనికరమునఁ జేసి తన మన
సు కరఁగి నీరై పోవ వడివడి సహదేవుని కడకుఁ బోయి వానిఁ దనవిశాల
బాహువుల నెత్తి కవుంగిలించుకొని సమాశ్వాస వచనములతో నిట్లని
యె. కుమారా! నాకతమున నీవు తండ్రిలేని బిడ్డవయితివి. అతనిం
గూర్చి నీవంటి ప్రాజ్ఞుఁడు వగవం బనిలేదు. నీ తండ్రి మహావిభవము
నఁ జిరకాలము మహీతలమును బాలించి యకుంఠిత విక్రమమున
ధాత్రీశ్వరుల గెల్చి జయలక్ష్మిం జేపట్టి యనేకాధ్వరములు సేసి వేలు
పులం దనిపి మగఁటిమిఁజూపి తుదకు వీరపురుషోచితమైన పదవి నొం
దినాఁడు. దుష్ప్రవర్తనమును గ్రూరతయు నుండుటం బట్టి నేనాతని శా
సింపవలసె. నామేనమామను నేను జంపుకొనలేదె? నీ జనకుని నిధన
మొందించితి నని నన్ను నీశత్రునిగా భావింపకుము. కంసుఁజంపి యు
గ్రసేనుం జేపట్టితి. నీవు సన్మార్గుఁడ వగుటచే నాకాప్తుండవు తనజన
కుం జంపె నను క్రోధంబుం బోఁద్రోసి తొల్లి యంగదుఁడు రాముని
చెలిమి జేసినట్లు నీవును నాసఖ్యమును నెఱపుము. నీకు భయము లే
దు. నేను నీవాఁడను. నీతండ్రికి నగ్నిసంస్కారము చేసి పారలౌకికక్రియ
లు నిర్వర్తించి పుత్రశబ్దము సార్థకము జేయుము. అని యాదరింప స
హదేవుఁడు శాంతించి తండ్రికి నగ్ని సంస్కారము గావించె. శవము
తోఁ గృష్ణభీమార్జునులు, బౌరులును మంత్రులును జని జరాసంధుని
గథావశేషుని గావించి వచ్చిరి. ఉత్తరక్రియలు నెఱపి శుచియై పితృ

ఋణముఁ దీర్చిన పిదప వాసుదేవుఁడు సహదేవునితోఁ దండ్రిచే బంధితులైన రాజుల విడుపుమని యానతిచ్చె. ఇచ్చిన, నాతఁడు తత్క్షణము కళానంద చంద్రపాల జయసేన ప్రముఖులను నుజ్జయినీశ్వర ప్రముఖులగు నన్యరాజన్యులను బంధమోక్షితులను జేసి జగదానందము జేసి వాసుదేవుని దయకుఁ బాత్రుఁడయ్యెను.

పాములవాండ్రి పెట్టెలలోఁబడిన మహాసర్పములట్లు కత్తెరబోనులం బడిన బెబ్బులులయట్లు, బంజరములఁ జిక్కిన పక్షులట్ల నింతకాలము చెఱలో నుండి, కృశించి, వివర్ణవదనులై, యసహాయులై, పససడలి తేజమెడలి కన్నులలోఁ బ్రాణములు నిల్పుకొనియున్న రాజకుమారులు బంధనముల నుండి మోక్షితులై వచ్చి యొక్కరొక్కరుగ వాసుదేవుని చరణారవిందములకు వినయ మెసంగ నమస్కరించి భక్తిమనముల సందడింపఁ జేతులు జోడించి జయజయధ్వానములు సెలఁగ నార్చుచు దమప్రాణప్రదాత యగు నాపురుషోత్తము నిట్లని నుతించిరి. " నారాయణా! అచ్యుతా! ముకుందా! మహీభారము డీలుపడఁ జేయు తలఁపున యాదవాన్వయపయోధిచంద్రుఁడవై యుదయించిన వైకుంఠనాయకుఁడవు. సనకస నందన సనత్కుమారాది నిత్యముక్తులకు నెన్నఁ దరముకాని నీమహిమము మేము కొనియాడనేర్తుమె? కరుణారసము వెల్లిగొలుపు కేరిగంటిచూపులు, చల్లదన ముట్టిపడు నీవదనచంద్రమండలము మా తాపత్రయములఁ బాపె. బంధమోక్షణము భవబంధమోక్షణము నీక్షణమ మాకయ్యె. తపములు దానములు యజనములు పుణ్యకర్మములు గావించియు వేయుజన్మముల కయిన నెవ్వని నెంతధన్యులు గాంచఁజాల రట్టిభగవంతుఁడు నారాయణుఁడు మా కయాచితముగ దర్శనంబిచ్చె. తల్లులకై మఱుఁగుబిడ్డలు, బిడ్డలకై వగచుతల్లులు, సతులకై కందుపతులు, పతులకై స్రుక్కుసతులు, నేఁడుగదా కలసికొనసుఖంపుభాగ్యము నీకటాక్షమున నబ్బె. హిరణ్యాక్ష హి

రణ్యకశిపు రావణకుంభకర్ణప్రముఖులఁ దెగటార్చిన నీకోపవహ్ని జరాసంధమహారణ్యమును భీమోపదేశమునం జేసి కాల్చె. మాకు జరాసంధునిచేత ఘోరమరణము దప్పించి ప్రాణము లొసఁగిన దేవా! నమస్కార" మని నుతియించి నిల్చిరి. నుతించిన రాజులందఱం గనుంగొని కృష్ణుఁడు వారివారిపేరు లరసి దేశములనెఱిఁగి తెలిసికొని యాదరించి కూరుచుండఁ బనిచి గౌరవించి కళానందుఁ జేరబిల్చి దగ్గఱఁ గూరుచుండఁ బెట్టుకొని నెమ్మేను నిమిరి "వత్సా! మగధరాజ్యలక్ష్మికి వైధవ్యము, నీకుఁ గళ్యాణము నేకకాలమునఁ గదా జరుగ వలయును. అందొక్కటి తీఱె రెండవది చేయించి యిటనుండి యరిగెద" నని చంద్రపాలుం జూచి, పూజ్యుఁడవయిన నీవు నీకూఁతురు పెండ్లి యిచ్చవచ్చినట్లు చేసికొనవచ్చుఁగదా! యని జయసేనుఁ గుశల మడిగి మోక్షితులగు రాజులఁ గళానందుని వివాహ మగువఱకచ్చట నుండఁ బనిచె. చంద్రపాలుఁడు తనకూఁతుఁ జూడఁబోయి కౌఁగిలించుకొని యించుకసేపు వగచి యామెం దోడుకొని యింటికరిగెను. కళానందుఁడు తల్లికడకుఁ బోయె. జయసేనుఁ డింటికిఁ జని మంచము పట్టిన తండ్రికి జీవితాశ గల్గించె. తారావతి యానందమేమని వర్ణింతును. అనంతరము వాసుదేవుఁడు కళానందుని వివాహ మాపందిళ్ళలోన జరపవలయునని సహదేవునితోఁ జెప్ప నతఁడు వల్లెయని ప్రయత్నములు చేయింపఁదొడఁగెను.

ఇరువదియొకటవ ప్రకరణము.

వాసుదేవుఁడు గిరివ్రజపురము బ్రవేశించినగడియ మొదలు రణార్ణవునకు శరీరమునం దొకవిధం బైనకంప ముదయించె. అందుచేత కృష్ణుఁడు తన్నుఁ జూచినమాత్రమునఁ దనప్రాణములఁ బుచ్చుకొనునని భయంపడి యాతని కంటఁబడక యొదిగియొదిగి తిరుగుచు నాతఁడు దూ

రమున నగపడినతోడనే బ్రాహ్మణుని గన్నఛండాలునిభంగి నెంతయు దవ్వరుగుచుఁ దనతండ్రి మరణమునకు, నంతకన్నఁ దనవివాహవిఘ్నమునకుఁ జాటుచాటునఁ గుళ్ళి యేడ్చుచుండెను. జరాసంధున కగ్ని సంస్కారములు జరగునాఁడు వెంటఁ జన్నవారందఱు కూర్చుండినచోటఁ గూరుచుండక వాసుదేవుని వలని భయమునఁ దనమిత్రబృందముతో వెలివానివలె దూరమున నొకచెట్టునీడం గూర్చుండి కాలగతి యంత యద్భుతముగ మాఱినందులకు నెంతయుఁ బొక్కఁ జొచ్చెను. సౌందర్యతిలకపేరు తలఁపునఁ బొడమినపుడు మహామోహమును, జరాసంధునినామము మదికిఁ దవిలిన తఱి మహాదుఃఖమును, యాదవుని దలఁపున నిలిపినయెడ మహాభయమును బొడమి మూఁడును మూఁడుదయ్యములై వానిని బీడింపఁజొచ్చెను. కృష్ణుని వలని భయముమాట యటుండ వానికిం గ్రొత్త యాపద యింకొక్కటి సంభవించె. మున్ను జరాసంధుఁడు జీవించియున్నవాఁడు, తనమాటయే శాసనముగఁ జెల్లినదినములలో నిరపరాధులపై నేరములు కొండెములు చెప్పి పెక్కుకొంపలుదీసి యనేకుల ప్రాణములు తీయించినవాఁడగుట నట్టివాండ్రందఱు మున్ను రాజునకోడి నోరెత్తలేక నేఁడు తమప్రాతపగలు రవులఁ జేసి, కసి దీర్చుకొనఁ దలఁచి రణార్ణవుఁ డొంటరిగఁ జిక్కనేని తుదముట్టింతమని ప్రతినలు గైకొనిరి. ఆశపథములు విని రణార్ణవుఁడు భయమ్ముమ్మళుంగులుగాఁగ నిలు వెడలక, లోననెవ్వరైన బలాత్కారమునఁ బ్రవేశించి చంపుదురో యని రాత్రులు నిదురింపక యన్నము హితవుగఁ దినక వెనుక నొనర్చిన పాపముల ఫలముగ మనసు చింత యను నిప్పులు బొర్లుచుండ నొకవిధమైన భూలోకనరక మనుభవించు చుండెను. మునుపటిరాజు జీవించియున్నపుడు వానికి జడిసి రణార్ణవునికి సర్వసమానములు నెఱపి గారవించిన మంత్రిసామంత దండనాయకాదులు, పౌరులు నేఁడు వాఁడు వచ్చి యెంత సేపు వేచియున్న దర్శనం

బీయక, యిచ్చిరేని మాటలాడక, యాడిరేని తత్క్షణమ వాని నవలకంపి తమకు గలతిరస్కారభావముం బ్రకటింప సాగిరి.

తండ్రి కుత్తరక్రియలు దీర్చి సహదేవుఁడు శుచియైన వెనుక రణార్ణవుఁ డాతనిజూడఁ బోయి, రాజుమృతికి వగచి ప్రసంగవశమున వానితో నిట్లనియె. “ అయ్యా! మనమిరుగురము నన్నదమ్ములము. నీ తండ్రిగారు నాకర్ధరాజ్య మొసఁగుదుమని వాక్రుచ్చినారు. నాసాయము నీకుండుట నీరాజ్యమునకు శ్రేయస్కరము. నాకు మంత్రిపదము దయచేయుము. అది యటుండఁ దండ్రి తలపెట్టినపని కొడుకు నిర్వర్తించుట పితృభక్తికలవానికి ధర్మముగదా! నావివాహము మీయప్ప తలపెట్టి యదిముగియకమున్న నాభాగ్యలోపమున వాసుదేవుని మాయఁ బడిపోయె. కావున నీవు సౌందర్యతిలకను నాకిప్పించి పెండ్లి సేయింప వలయునని ప్రార్థించెద” నని యింక నేమోమో చెప్పఁబోవుచుండ నాపలుకు సహింపక సహదేవుఁడు కోపోద్దీపితవదనుఁడై “ యోరిమూర్ఖుఁడా కులహీనుఁడవు నీవు నాతమ్ముఁడవా నీకర్ధరాజ్యము మాతండ్రి యిచ్చునుగా! నీకోరిక లింతదూర మున్నవని యెన్నఁడెఱుఁగ. నీకు మంత్రిపదము కావలయునా! నిన్ను మంత్రిం జేసికొనుట మాగొంతుఁ గోసికొనుట. నీసాయ మపేక్షించుట కొరవితోఁ దలఁగోకుకొనుట. నరములేని నీనాలుక కతమునఁ గాదె సత్పురుషులు బందెలఁ బడిరి. నీకతమునఁగాదె మాకు మావారికిఁ బలుసిలుగులు సంభవించె. నిన్ను దేశమునుండి వెడల నడువక నిలుపుటయే మహోపకారము. నీప్రాణము తీయకుండుటయే నీకుఁ గళ్యాణము. ఊరక ప్రేలక పొమ్ము చాలుచాలు. ” అనవుడు రణార్ణవుఁడు భయంపడి చిన్నవోయిన మొగముతోఁ గనుదోయినుండి బాష్పములు రాల నేడ్చుచు మాఱుమాటాడక యింటికిం జనియె. కళానందుఁడు తల్లిఁ గలసికొని, సౌందర్యతిలక తల్లిదండ్రులం గలసికొని తమవివాహముహూర్త మెప్పుడెప్పు

డని తమముచ్చటలు మనసులోఁ దలఁచుకొనుచు నువ్విళులూరుచు గడి
య యేఁడుగా దినము యుగముగాఁ గడపుచుండిరి.

జరాసంధుఁడు మృతినొందిన నాఁటిరాత్రి యా యోగిని యంతిపు
ముఁ బాసి యదృశ్యమయ్యె. కొరకరాణభూతులు తమతమ గుడ్డియు
మూగయుఁ దమ్మువిడిచిపోవ యథేచ్ఛముగా నగర మంతయుఁ దిరుగ సా
గిరి. పౌరులు కొందఱు వారిం బిలిచి మీ యంగవైకల్య మెట్లుపోయె
నని యడుగ వారు భగవంతుఁ డగువాసుదేవుఁడు మా దైన్యముఁ జూ
చి మా వైకల్యము దొలఁగునట్లు వరమిచ్చెనని యుత్తరము చెప్పిరి.
జయసేనుఁడు బంధనిర్ముక్తుఁడై మనోవైకల్యముక్తుఁడై యింటికరిగెనే
కాని తారావతింగూర్చిన యనుమానము వాని మనసునుండి పాయద
య్యె. జయసేనుఁడు కళానందుఁడు మిత్రులగుటంజేసి బంధముక్తు లై
నమఱునాఁడు కలసికొని తమతమ కష్టసుఖములకుఁ గారణములు చెప్పి
కొనుచుండఁ బ్రసంగవశమున జయసేనుఁ డిట్లనియె. ‟మిత్రుఁడా!
ఏవిధముననో నే నెఱుఁగను గాని మా యింటికి మొగలియాకుజా బొకటి
రాజలేఖ తెచ్చె. దానిని నాకడ నుండి దొంగిలించి యెవ్వరో రాజున
కిచ్చిరి. నే నాకుట్రలో నున్నవాఁడ నని రాజు నన్ను బంధించె. అం
దు జరాసంధమరణము సూచింపఁబడుటచే నాతని కలుకవోడమి య
ట్లుచేసె.” అన నవ్వుచుఁ గళానందుఁ డిట్లనియె. ‟మిత్రమా! ఆజా
బు సౌందర్యతిలక నిమిత్తము నేనె వ్రాసితిని. పూలవర్తకుఁ డై నరో
హణకున కిమ్మని యొకసన్యాసి కిచ్చితిని. అతఁడు రోహణకున కిచ్చె.
వాఁడు దానిని బూలచెండులోనిమిడ్చి సౌందర్యతిలకదాసి యగునాగవ
ల్లి కిచ్చె. అది దాని నెవ్వనికో విక్రయించినదఁట. కొనినవాఁడు దాని
ని మీదాసి కీయఁబోలు. అది రణార్ణవుఁడు మీ యింటనుండి దొంగి
లించుకొనిపోయి రాజున కీయనోపు. ఇదియెల్ల నిక్కమని నాకుఁ దోఁచె
డు” నని చెప్ప జయసేనుఁడు సంతసించి తెలివొందిన మొగముతో మిత్రుని

వీడ్కొని గృహమునకుఁ జని తారావతిం బిలిచి "సుందరీ చిరకాలమునుండి నామనసునం బీడించుచున్న యనుమానము తీఱె. అకలంక చరిత్రవైన నిన్ననినమాటలకు నన్ను సైరింపుము. మొగలియాకు చరిత్ర మంతయుఁ దెలిసినది సుమీ" యని కుమారు రాజసేను నెత్తి ముద్దాడి రాజలేఖ నూరార్చి కడుసుఖముగ నుండెను. కృష్ణుఁడు సహదేవుఁడుఁ గూరుచుండి యానాఁడు రాత్రి మాటలాడుచుండగ నెవ్వఁడో యొక సేవకుఁడు కడువేగమున వచ్చి వారియెదుటనిల్చె. దీపముల వెలుఁగున వాసుదేవుఁ డాతని నానవాలుపట్టి "యోరీ! కుశీలవా! యెప్పుడు వచ్చితివి? పాప మాయిందుమతి వార్త యేమి? దురాత్ముఁడైన శిశుపాలుఁ డామెను బలాత్కారమునఁ బెండ్లియాడెనా?" అని యడిగె. అడుగుటయు వాఁడు వినయమునఁ జేతులు జోడించి యిట్లనియె. "దేవా! దేవరవారి వేగులవాఁడు కుశీలవుఁడు బ్రదికియుండ నంతి మాట పుట్టునే? హేమావతిం జూడవలయు నని వంకబెట్టి చందనపురమున కామెయు నేనును బోతిమి. అది నిజముకా వగచి శిశుపాలుఁడు మమ్మనిపె. మేము చందనపురమునకుఁ బోక ద్వారకానగరమున కరిగితిమి. అట దేవర వారు లేరని యింద్రప్రస్థమున కరుగ నచ్చటను మీరు లేకునికి నేనిందు వచ్చితిని. ఇందుమతిని యుధిష్ఠిర మహారాజుగారు సగౌరవముగ నందు నిలిపి కడు జాగరూకతతోఁ జూడవలయు నని ద్రౌపదీదేవిగారి కప్పగించిరి. ఆమె యటఁ గుశలిగా యున్నది." అని విన్నవించుకొన్న కుశీలవునిం జూచి నందకుమారుఁడు చిఱునగవు వొలయ "నవురా! నీవెంతకయినం దగుదువురా! మంచిపని చేసితివి. నీవీశుభవర్తమానము శరభమహామునీంద్రునకుఁ దదాశ్రమమునకుం బోయి విన్నవించి యటనుండి యింద్రప్రస్థపురమునకుఁ బొమ్ము." అని యానతిచ్చెను. కుశీలవుఁడు రెండడుగులు సాగిపోయి మరల వచ్చి "దేవా! చెప్ప మఱచితిని. ఆయిందుమతి ద్వారకలో నున్నప్పు

డు మీకు దగ్గఱచుట్టముఁ బ్రద్యుమ్నునకుం బాల్య స్నేహితుఁడు నగు మన యశోధరునిపైఁ జిత్తము నిల్పినది. అతఁడు నీమెంజూచిన దాదిగ మదనబాణపీడితుఁడై యున్నవాఁడు. మీఁద దేవరచిత్త” మని మనవి యొనర్చుకొని తనదారింబోయెను. అంతలోఁ గారాగృహాధికారివచ్చి సహదేవున కంజలియొనర్చి నిల్చి యిట్లనియె. “మహారాజా! తండ్రిగారు కొన్నినాళ్ళకింద నిర్హేతుకముగ బిచ్చమెత్తుకొను ముసలివాని నొక్కని వాసుదేవు చారులలో నొక్కఁడని తలంచి బాధించిరి. చెఱసాలలోనికి వచ్చినదాదిగ వాఁడు రోగపీడితుఁడై యొక్కముహూర్తము క్రిందట మరణము నొందినాఁడు. సెలవయ్యేనేని యగ్నిసంస్కారముఁ గావించెద” మని చెప్ప సహదేవుఁడించుకవిచారించి దిక్కుమాలినవానిఁ గూడ మా తండ్రి బంధించి చంపెఁగా! వాఁడు మతిలేనివాఁడు. నిరపరాధుఁడు. పాపమని జాలినొంది వానిదహనమునకు సెలవిచ్చె. పౌరు లామరణవార్త విని యాంబాలగోపాలము వగచిరి.

ఆమఱునాఁడు చంద్రపాలుఁడు మౌహూర్తికులఁ బిలిపించి కుమార్తె వివాహముహూర్తము పెట్టించి ప్రయత్నము సేయందొడఁగె. రణార్ణవునకు సౌందర్యతిలకకు మున్ను జరాసంధుఁ డెచ్చటఁ బెండ్లి సేయ నిశ్చయించె నాచోటనె కళానందుని వివాహముగూడ నెఱపుమని వాసుదేవుఁడు చంద్రపాలున కానతిచ్చె. అతఁ డందుకు సమ్మతించె. సౌందర్యతిలక సర్వవిధముల సంతోషితస్వాంతయై యుండి తన చెలిమికత్తె యగు నాగవల్లి తలఁపునకు వచ్చుటంజేసి రాగలతికతో నాలతకూనయిట్లనియె. ఓసీ! ఈసమయమున నాగవల్లి యున్న నెంతబాగుండునె! మొదటినుండియు మాయిరువుర సమీపము నదియెంత మనసుపడి కోరెనో యంతద వ్వయిపోయె మొగలియాకు దొరకెంగాని దానికై పోయిన నాగవల్లి రాదయ్యె” నని యించుక గంటదడిపెట్టె తమ చెలిమి కారణము నాగవల్లి మాటలసొంపు దానిచమత్కృతిఁ దలఁచి వగవ సా

గెను. ఆమెంజూచి రాగలతికయు వగచి యూరకుండుమని యూరార్చి కన్నీరు కొంగునఁ దుడిచె.

ముహూర్తము సమీపించుచుండఁ గళానందుఁ డానందసాగరమునం దేలె. రణార్ణవుఁడు దుఃఖార్ణవమున మునింగె. పౌరు లందఱు మహానందభరితు లైరి. వివాహమునకుఁ బూర్వమునఁ జంద్రపాలుఁడు కూఁతుఁ బెండ్లికూఁతుంజేసి చుట్టముల నెచ్చెలుల నాప్తులఁ బిలిచి విందొనర్చె. నాఁటిరాత్రి సౌందర్యతిలకయు రాగలతికయు మేడపైఁ గూర్చుండి పెండ్లిముచ్చట లాడుకొనుచుండ వడివడి మేడమెట్టులెక్కివచ్చి యొకపడఁతుక వారి కట్టెదుట నిల్చె. ఆనెలంత లాపడఁతుకంజూచి నాగవల్లి నాగవల్లి యనిపిలిచి యిరువురును లేచి యొకమాటె దానిం గౌఁగిలించుకొనిరి. అద్భుతానంద రసములవలన నుదయించిన పారవశ్యత యొకయింత తమ్ము విడిచినపిదప శరీరములు తెలియుటయు బ్రదికి ప్రాణములతో వచ్చితివే యని రాగలతికయు, నింతకాల మెందుంటి వేఘుపాట్లు పడితివి. నాకతమున నీకెన్నిచిక్కులు సంభవించెనోకదా యని సౌందర్యతిలకయుఁ బలుకరించిరి. నాగవల్లి వారినిద్దఱఁ గూర్చుండఁ బనిచి నేను సుఖముగ నున్నదాన, కష్టము లంతగాఁ బడలేదు. పడినవన్నియు సార్థకములయ్యె. ఇంతకును మొగలియాకు దొరకెనో లేదో యని యడిగెను. ఆమాటకు రాగలతిక యిట్లనియె. "పాప మాయోగిని కటాక్షమున మొగలియాకు లభించె. ఎవ్వఁడో జాతవేదుఁ డనునాతని సహాయమున మన కళానందుఁడు బ్రదికెనఁట! వారలిద్దఱు బెండ్లికివచ్చిన సంతోషముగ నుందును" అనుటయు నాగవల్లి యిట్లనియె. "ఆయోగిని మీకుఁ బరమోపకార మొనర్చె. జరాసంధునియొద్దనుండి మాయోపాయమున మొగలియాకును ముద్దుటుంగరముఁ దెప్పించి రణార్ణవుని భంగపుచ్చి యాకు మీకుఁ బంపి యుంగరము జాతవేదున కిచ్చి పంపె. వాఁ డదికైకొని శిశుపాలునికింజూపి జరాసంధుఁడు కళానందుం

దోఁడితెమ్మనె నని బొంకి యీయంగుళీయక మానవాలుచెప్పి నీ ప్రాణ వల్లభు నీవలకుం దెచ్చి కూడ శిశుపాలుఁడుపంపిన సేవకులనందఱ నర్ధరాత్రమునఁ బులిపులియని భయపెట్టి పల్లాయితులంజేసి కళానందుని ద్వారకకుం గొనిపోయి మఱల నిటకుం బంపె. అచ్చట నిందుమతి యను కన్యకకుఁగూడ హానిలేకుండ జాతవేదుఁడు హేమావతీ వ్యాజమున శిశుపాలునికంట దుమ్ముగొట్టె. ఆయిందుమతి యిప్పు డింద్రప్రస్థమున నున్నదఁట. అని యామెచరిత్రముకూడ వారలకుం జెప్పెను. ఆచరిత్రములకు వా రాశ్చర్యమొందుచుండ నాగవల్లి మరల నిట్లనియె. ఈ విషయమున యోగినికి జాతవేదునకు నందనందనుఁడు సాయమై వేగులవాండ్రగు కోరకకాణభూతులను యోగినికిని, గుశీలవుని జాతవేదునకు సహాయముగా నంపె. యోగిని నీకుఁ గేతకీదళమిచ్చుటయేకాక మఱియొక మహోపకారము గావించె. మొదటి దినమున నిన్ను రణార్ణవునకిచ్చి పెండ్లిసేయ సర్వప్రయత్నములు జరిగెఁగదా! ఆనాఁడు కళ్యాణమంటపముఁ దగులఁబెట్టించి వివాహ మాపినది యోగినిగాక యెవ్వ రనుకొంటివి? అదియొక టననేల? ఇంక వేయుపనులు నామె చేసెను. ఇవియెల్ల నింతకుమున్న కళానందున కెఱిఁగించి యాతని నానంద సముద్రమునఁ దేలించితిని. జాతవేదుని దలంచి యాతఁడు నమస్కరించి తన ప్రాణమయిన నాతని కీయసిద్ధముగ నున్నవాఁడు సుఁడీ" యని చెప్ప సౌందర్యతిలక యద్భుతమునొంది మనసున భక్తియు విశ్వాసమును బెల్లుబ్బ పైకిరాఁ జేతులు జోడించి యిట్లనియె. "అమ్మా! భగవతీ! యోగినీ! నీవు మాతల్లివి. నీఋణము నాశరీరము కోసియొసఁగినఁ దీఱునే? ఎంతలెంతకష్టములు నానిమిత్తమై పడితివి. అహహా! జాతవేదా! నాకు నిజముగ సోదరుఁడవు నీవె. నీవను తెప్పమూలమునగదా ప్రాణేశ్వరుఁడు శిశుపాలుఁ డనుసముద్రమును దాఁటుట. నాపాలిదైవములు గదా వారిరువురు! నాగవల్లి! ఇంతకాలము నీవెందుంటివే" యని

పలికి యూరకుండె. రాగలతికయు నదియేమిచెప్పునో యని చెవియొగ్గి శ్రద్ధతో వినుచుండ నాగవల్లి యిట్లనియె. "ఇంక నిజము దాఁపనేటికి? మీకుఁ దెలియజేయకుండమన్న సంతోషము పొంగి తనంత హృదయము పట్టక వెలికివచ్చుచున్నది. అంతంత యద్భుతములుజేసిన యోగినిని నేనె. కళానందుని విడిపించిన జాతవేదుఁడను నేనె. ఇందుమతిని గట్టెక్కించిన హేమావతిని నేనే. ఇపుడు మరలవచ్చిన నాగవల్లిని నేనె. నేను నేనే" యనిచెప్పి తలవంచుకొని కూర్చుండెను. రాగలతికయు సౌందర్యతిలకయు నామె పలుకులు నమ్మవలయునో లేదో యెఱుఁగక నిశ్చేష్టులయి యుండిరి. నాగవల్లి వారి వైఖరింజూచి "అమ్మా! నాఁడు నేను నీ యెదుటఁ బ్రతినచేయలేదా? ప్రతినలో నున్నదానికన్న నెక్కుడు కార్యములు నిర్వర్తించి కృష్ణునితో నాలోచనము సల్పి, శిశుపాలుని భంగపెట్టి, రణార్ణవుని మోసపుచ్చి, నీప్రాణములు దక్కించి నీహృదయేశ్వరు నసువులు రక్షించి, కేతకీదళము నీకిచ్చి కృతార్థురాలనైతి. ఇదిగో జరాసంధుని ముద్దుటుంగరము చూడుఁడీ" యని మీఁదనైన వారదియెత్తిచూచి కథయంతయు నిజమని నమ్మిరి. సౌందర్యతిలక తన నెచ్చెలిపై యింతింత యనరాని మక్కువయు విశ్వాసమును జూప దానిం బిగ్గఁ గౌఁగిలించుకొని "చెలీ నానిమిత్తము నీకెన్ని కష్టములు గలిగినవి. నిజముగ నీకు వేయుసంవత్సరములుదనుక దాసినయ్యుఁ దీర్పఁజాల. మగవారలయిన నిర్వహింపరాని దుర్ఘటకార్యముల నవలీల నిర్వహించితివి. నాప్రాణము నీయది. యర్థము నీయది నీవనా దైవము" వని నుతించి యాదరించె. అనంతర మందఱు బహుసల్లాపములు జరిపి నిద్రించిరి.

ఇరువది రెండవ ప్రకరణము.

అంతట సకలజనానందకరముగఁ బ్రభాతమయ్యె. సహదేవ మ
హారాజు తానొకపట్టపుటేనికకు సకలాలంకారములు చేయించి బంగరు
టంబారి వేయించి యందు పట్టుపరుపులు పఱపించి కళానందునం దె
క్కుమనియె. మున్ను దుర్గంధ భూయిష్టమయిన ముసలియేనికపై నె
క్కి దీనాననుఁడయి తిరిగినవీథులలోనె విలాసవంతుఁడయి సుందరాన
నుఁడయి పెండ్లికొడుకయి ఠీవితోఁ బౌరులు వెంటరా నూరేగి కల్యాణ
మంటపమునకు వచ్చె. అందు సహదేవమహారాజును, యాదవ పాండ
వ సింహులును సకలమంత్రులు, సామంతులు దండనాయకులు, పరి
చారకులు, దాసదాసీజనములు, బ్రాహ్మణ క్షత్రియ వైశ్య శూద్రా
దిపౌరులు, విద్వాంసులు, వైణికులు, గాయకులు నటులు, చుట్టములు,
నెచ్చెలులు, నాప్తులు నందఱుఁ దత్తదుచితాసనములఁ గూరుచుండి వివా
హమహోత్సవము జూచుచుండిరి. రాగలతిక నాగవల్లి మొదలగు చె
లిమికత్తెలు, పేరటాండ్రు, ముత్తయిదువులు, వెంటరా సౌందర్యతిలక
సిగ్గునఁ దలవంచుకొని సకలభూషణశోభితుఁడై సాక్షాన్మన్మథుని వడువు
న భాసిల్లు మగనిసోయగము క్రీగంటిచూపులఁజూచి తనియుచు వివా
హమంటపముం బ్రవేశించెను. కళానందుని చూడ్కులు, మనసు, ప్రి
యురాలివశముగా మేను మన్మథవశముగా హస్తములు పురోహితుని
చేతికిచ్చి కీలుబొమ్మలాగున నాతఁడు చేయించు దైవారాధనలు చేసె.
అందఱియెదుటఁ జంద్రపాలుఁడు పసిడి పళ్లెరమందుఁ గళానందుని పాదార
విందములుంచి తనభార్య కనకకలశముతో నిర్మలోదకము వోయఁ గడి
గి సాలంకృతకన్యాదానముజేసి ధన్యుఁడయ్యెను. కళానందుఁడు సౌంద
ర్య తిలక పాణిగ్రహణముచేసి యన్యోన్యకరస్పర్శనము వలన నానంద
పారవశ్యము నొందిరి. అనంతరము ధారుణీదేవియుఁ జంద్రపాలుఁడు నా

నంద బాష్పములు విడువ వారిరువురు ముత్యాలతలబ్రాలొండొరుల మీఁద నొకరిని మించి యొకరు వోసికొని రూపలావణ్యముల, వయోవిభవముల, విద్యాగుణములఁ, బరస్పరానురాగముల నొకరికొకరు తగియున్నకతనఁ గొమరుం గోడలిం జూచి ధారిణీదేవియుఁ గూఁతునల్లునిజూచి చంద్రపాలుఁడు నట్టివియ్యములం జూచి సకలపౌరజనములు, వారిం జూచి కృష్ణభీమార్జునులును నందఱుం జూచి సహదేవమహారాజును సంతసించిరి. ఆయైదుదినములు, వచ్చినవారెల్లరు నాటలు, పాటలు, నృత్యములు, వాద్యములు చూచి విని సంతసించి విందు లారగించి వధూవరుల దీవించిరి. అనంతర మాదంపతులకు సంధానమహోత్సవము జరగె. మదనారాతికైనఁ గోరిక లుదయింపఁజేయునట్లు సింగారించినయంతిపురముమేడపైగదిఁగోనం బ్రవేశించి యాదంపతులు పూవుసెజ్జల మేనులుచేర్చి చిరమన్మథాగ్ని చల్లబడునట్లు పన్నీరు మంచిగంధము మేనులం జల్లి పూసికొని మనసువచ్చినట్లు కన్నులకఱవుదీఱ నొండొరులరూపములం జూచుకొని చిరకాలవియోగజనితకంపమువోవ బిగియాఱకౌఁగిళ్ల ననఁగిపెనఁగి యెడలేనిముద్దులం దనిసితనిసి మహాభోగసౌఖ్యములం దేలి మదనసామ్రాజ్య మనుభవింపఁ దొడంగిరి. ఆగాటంపు మక్కువలాతనివోనికోర్కు లాకారణములేనియలుక లానిలుకడలేనిపట్టుదల లాసింగారపుంబండెము లాచిత్రప్రసంగము లాహాయలులు వర్ణింపనసమకట్టుటకన్న ననుభవింపుఁడని వారి నొంటరిగ విడిచి యూహించుకొమ్మని చదువరుల విడిచి యనంతరకథాకథనమునకుఁ బోవు టుచితము.

మఱునాఁడు వాసుదేవుఁడు భీమార్జునులతోఁ గూడఁ బయనమై తన్ననుప వచ్చిన సర్వజనమును వీడ్కొని కళానందునిచేయి సహదేవుని చేతికిచ్చి యప్పగించి చంద్రపాలుని సన్మానించి సహదేవుం గవుంగిలించుకొని వానికి రాజనీతి నేర్పి పురజనుల కభయమిచ్చి రాజభక్తి బోధించి భీమార్జునసహదేవులకు సఖ్య ముండునట్లు నొక్కిచెప్పి జరా

సంధు రత్నకాంచనమయమైన తేరుపై నెక్కి వెడలె. బంధ మోక్షితులైన రాజులు వానివెంటఁజనిరి. అట్లు బయలుదేఱి గోపాలుఁడు భూపాలకపరివారముతో నింద్రప్రస్థము జేరి తమరాక మున్నె యుధిష్ఠిరునకుఁ దెలుపుమని కోరికకొందఱిభూతుల నంపె. యుధిష్ఠిరుఁడును మహానందమున మఱఁదినిదమ్ములని నెదుర్కొని వారల దీవించి కౌఁగిలించుకొని జరాసంధసింధురముం దెగటార్చిన యాదవసింహుబుద్ధిబలమును బాండవసింహుబాహుబలమును, సగ్గించి గిరివ్రజపుర విశేషములం జెప్పకొనుచు నాదినముం గడపిరి. మఱునాఁడు యదుకుంజరము కురుకుంజరముంజూచి యిట్లనియె. ''రాజేంద్రా! చేయదగినపనిఁ జేసితిని. ఈజగత్కంటకుఁడు తీఱుటచే నిఁక శిశుపాలాది శత్రువులు నాచేతిలోనివారు. నీవింక రాజసూయము నారంభింపుము. నీనలువురుతమ్ముల నలుదిక్కులకు దిగ్విజయార్థ మంపుము. జరాసంధబంధితులైన రాజులు మానవలన ముక్తులైరి. వీరల వీరిదేశముల కనిపి రాజసూయమునకు రమ్మని యానతిమ్ము. యజనమునకుం దగుచోటు లరసి శాలలు నిర్మించి సంబారముల సమకూర్చి బ్రాహ్మణులను జుట్టములఁ బిలువనంపి సిద్ధముగ నుండుము. ఇందుమతిని నాతోడం దీసికొని పోయెదను. మేమందఱము మరల నచిరకాలమున వచ్చెదము. మాకు సెలవొసంగుమని వీడుకొని ద్వారకానగరమునకుం జని పురజనులెదుర్కొని గౌరవింప నగరుజొచ్చి రుక్మిణిం బిలిచి యిందుమతింజూపి '' దేవీ! ఈబాలిక కొన్నినాళ్ల క్రిందట నిటకువచ్చియున్నపు డామెచరిత్రము నీవు వినియె యుందువు. ఈమెకాఁపురము గిరివ్రజము. కాని యిచ్చట నేనరసినంతవఱకు నీమెచుట్టములేలేరు. కావున నీమెను మనబలగములోఁ గలిపికొనవలయును. మనయశోధరుచిత్తము దీనియందు హత్తినదఁట. వీరలకు వివాహమిచ్చుటఁ జేయవలయు." అని యిందుమతిం జూచి '' బిడ్డా! నీవు వగవకుము. నాచుట్టమ వైతివి. నీకు రుక్మిణితల్లి, నేను

జనకుఁడను." అని యాదర మొలుకుపలుకుల నామె కభయ మొసఁగి మఱునాఁడు కార్తాంతికులరావించి సుముహూర్తము నిర్ణయించె. అనంతర మొక్క పుణ్యదినమున సింధుమతీయశోధరుల వివాహము మహావైభవముతో వాసుదేవుని నగరుననే జరిగెను. యదుభోజ వంశజులు రాజబంధుసమేతులై మహాసంతోషముతో నాదినములు గడపిరి. కరిభమహామునియుఁ దద్వివాహమునకువచ్చి యిందుమతికిఁ గలిగినకష్టములకు వగచి యామె నాలింగనముజేసికొని దీవించి యా పెండ్లిదినము లందుండి మరలి నాశ్రమమునకుంజనియె.

అటుల యుధిష్ఠిరుఁడు బంధమోక్షితులైనరాజులం దఱ నతమ దేశముల కనిపి భీమార్జుననకులసహదేవుల దిగ్విజయమునుచేసి రాజుల గెల్చి ధనరాసులం దెమ్మని పంచె. ఆవీరచతుష్టయము చతుస్సాగరము లనడుమనున్న సకలదేశములకు సేనాసమేతులై యరిగి మూర్ధాభిషిక్తు లనోడించి కప్పములంగ్రహించి ధనసంచయమును గూర్చుకొని వచ్చి ధర్మజుపాదారవిందముల కర్పించి కృతకృత్యులైరి. అనంతరముఁ యాగ మునిమిత్తమువచ్చు సకలసామంతమహీపాలురకు నివాసయోగ్యములగు ననేకగృహములును, బసులకు గుఱ్ఱములకు నరదములకుఁ దగు పంది ళ్ళును, సేవకులకు దాసదాసీజనముల కనుకూలములగు నిలయములును, జుట్టములకు నెచ్చెలులకు సౌఖ్యదాయకములైన మందిరములును, నాట పాటలకు వేడుకలకుఁ దగుతావులును, బ్రాహ్మణోత్తముల స్నానపానజ పహోమాదుల కనుకూలములగు పవిత్రప్రదేశములును, యాగము నిర్వర్తింపఁబడుటకు శాస్త్రోక్తప్రకారము బహువిధాగారములును, సై న్యములు వసియించుటకు విశాలపటకుటీరములును, బ్రాహ్మణభోజన ములకు వంటలకు విరివియైన పర్ణశాలలును నిర్మింపఁబనిచి యుధిష్ఠిరుఁడు, చుట్టముల, స్నేహితుల, బ్రాహ్మణులఁ, దక్కిన రాజలోకంబులఁ బిలువ నంపె. వేదములవతరించినట్లు, షడంగములు మూర్తులు గైకొన్న

ట్లు, శాస్త్రము లాకారములు దాల్చినట్లు, వసుమతీచక్రమునఁ గల బ్రాహ్మణులు యాగము నిర్వర్తించుటకు ఋత్విజులు సభ్యులు నుద్గాతలు నుపద్రష్టలు హోతలు మొదలగువారు నరుదెంచి రాజుచే సన్మానింపఁ బడిరి. శిఖండిదృష్టద్యుమ్న ప్రముఖ కుమారులతో ద్రుపదుఁడురాఁ బాంచాలదేశమువారెల్లరు తరలివచ్చిరి. ఉగ్రసేన వసుదేవ బలదేవ సాత్యకి సంకర్షణాక్రూర ప్రముఖులగు వృద్ధులును సాంబప్రద్యుమ్నాది కుమారులను యశోధరాది బంధువులును, రుక్మిణి, సత్యభామ, జాంబవతి, మిత్రవింద యన్నగువారును వారితో నిందుమతియు వెంటరా వాసుదేవుఁడు బయలుదేఱిన, వానితో, ద్వారకానగరమంతయు వచ్చె. భీష్మబాహ్లిక సోమదత్త భూరిశ్రవసాదులగు కురువృద్ధజనులతోడను, కృపద్రోణాశ్వత్థామలతోడను, దుర్యోధన దుశ్శాసనాదికుమారసంతతితోడను, కర్ణాదియాప్తవర్గముతోడను సింధుగాంధారరాజప్రముఖులగు చుట్టములతోడను ధృతరాష్ట్రుఁడు వెడల హస్తిపురమంతయు వెడలివచ్చె. కళానందాదులతో సహదేవ మహారాజును, జరాసంధమరణమునకు నిందుమతీవివాహమునకుఁ జింతించుచు శిశుపాలుఁడును సకలమహీమండలమును వచ్చి యింద్రప్రస్థపురముఁ జేరి యుధిష్ఠిరునిచే సన్మానము నొందిరి.

వచ్చినచుట్టములను స్నేహితులను నాయాకార్యములందు నియోగించి ధర్మరాజు రాజసూయము జేయుటకు ద్రుపదరాజకన్యతో దీక్షవహించె. బహువిధాజ్యహోమముల వేల్పులం దనియించి, షడ్రసోపేతాన్నముల భూసురులం దృప్తినొందించి, సన్మానముల రాజుల సమ్మదితాంతరంగులం గావించి, దానముల నేలవేల్పులదరిద్రదశలఁ బాపి బహుమానముల మిత్త్రులఁ జుట్టముల సంతోషింపఁజేసి; యామహారాజు జన్నము సేయుచుండె. పవిత్రమంత్రవాదములు, బ్రాహ్మణాశీర్వాద నినాదములు, బహుజనుల మాటలరొదలు, వందిమాగధవైతాళి

కుల యభివాదములు బ్రహ్మాండములునిండె. ఆసమయమున, లోఁబడిన సామంతులు, నటకు రానిరాజులు, నరివెట్టని ధారుణీశ్వరులు, మ్రొక్కని భూపాలురుఁ, దనియనిబీదలు, దానములొందని భూసురులు, సంతసింపని వారుఁ గానరారైరి. ఆయాజాతశత్రుఁడాసమయమున దీపకళికలంబోలె ధగధగ వెలయు బహురత్నయుక్తాలంకారకిరీటము మస్తకమునలంకరింప హారకేయూరాది భూషితుఁడయి నిజకీర్తియుంబోలె భాసిల్లు దువ్వలువలెఁదాల్చి యిరుగడల భీమార్జునులు ధవళచామరములిడ నకులసహదేవులు ఛత్రములనిడ సాత్యకిధృష్టద్యుమ్నులు సమస్తమూర్ధాభిషిక్తుల నామధేయకీర్తనములతో మ్రొక్కింప వారికిరీటమాణిక్యకాంతులు తనయడుగుఁగెందామరలయరుణకాంతులనినుమడించి నీరాజనమొసంగ వివిధదేశాగతులు వినయసంభరితులై యర్పించుకానుకలు, కట్నములు, రతనములు, ధనసంచయము శిరఃకంపములఁ గ్రేగంటిచూపుల మన్నించుచు సర్వబంధుజనము మహాసంతోషమొంద స్నేహితు లుప్పొంగఁ బాంచాలుఁడు కూఁతునల్లుంజూచి సంతసింపఁ గొడుకులయాధిపత్యమునకుఁ గుంతి యానందబాష్పములు విడువఁ గురుకులము మహోన్నతదశంబ్రాపించెనని భీష్మబాహ్లికులు ముదితులుగా, శిష్యులపరితాపములకుఁ గృపద్రోణులహృదయములు జల్లఁబడ నిర్విశేషిత శత్రుమండలుఁడై నిరుపమానప్రతాపుఁడై వ్యాస నారద పరాశర మార్కండేయ ప్రముఖులగు మునిగణము, కౌరవులు యాదవులు పాంచాలురు మాగధులు చైద్యులు తక్కినరాజులు గొలువ, పెక్కుగట్టులనడుమఁ బొల్చు మేరువట్లు తారకామధ్యమున వెలయు చంద్రునివలెఁ బ్రమథగణసమేతుఁడయిన శంకరు చందమున దిక్పాలకులనడుమఁబొల్చు మహేంద్రునట్లు భూలోకదేవేంద్రుఁడై వీరనారాయణుఁడై నలహరిశ్చంద్రుల మఱపించుచు రాజతేజము బ్రహ్మతేజము గుమికూడినట్లు మహావిభవమునఁ గొలువుదీర్చి యుండె. యజ్ఞాంతమున సభ్య మెవ్వరికీయఁద

గునని యుధిష్ఠిరుఁడు భీష్మునడుగ నాతఁడు వాసుదేవుఁడర్ఘ్యమందుకొన నర్హుఁడని పలికె. అపుడు సకలరాజలోకమువీక్షింప సహదేవుఁడు కృష్ణున కర్ఘ్యమొసఁగె. సహజవైరమున శిశుపాలుఁ డదియోర్వక మహాకోపమున యుధిష్ఠిరు నాక్షేపించి గంగానందను నిందించి గోపాలదేవుండిట్టి యుద్ధసన్నద్ధుఁడయ్యె. చక్రధరుఁడు మహాక్రోధమున రాజచక్రము చూచుచుండ శిశుపాలశిరచ్ఛేదము చేసె. రాజులు గడగడవడఁకి జయజయధ్వనుల నందఱుమాఱుం బొగడిరి. రాజసూయము, ప్రశాంతవిఘ్నమై, కురుకులక్షేమకరమై, సర్వజనానందకరమై, భూతప్రీతిదాయకమై, పరివర్తిల్ల యుధిష్ఠిరుఁడు ద్రౌపదీమహాదేవియు నవభృతస్నాన మాచరించి వచ్చినచుట్టముల రాజుల వారివారిదేశముల కనిపిరి. మాగధసహదేవులు కళానందునితో గిరివ్రజమునకుఁబోయి సుఖముగనుండిరి. యశోధరునితో వాసుదేవుఁడు ద్వారకానగరముంజేరె. కళానందుని రాజభక్తికి విద్యావైభవమునకు బాహుబలమునకు మెచ్చి సహదేవుఁడు వానిం దనమంత్రిగాఁజేసికొనియె. కళానందసౌందర్యతిలక లత్యంతసౌఖ్యమున నొండొరులపైఁ గూర్మిలు నానాఁటికి హెచ్చి హాయిగనుండిరి. వాసుదేవునియనుగ్రహమువలన నిందుమతియు యశోధరుఁడును నేకొంతయు లేకుండ సుఖించిరి. రణార్ణవుఁడొక నాఁడొంటరిగ నెందో పోవుచుండ వానిప్రాతపగతుఁ డెవ్వఁడో వానింజంపగదీర్చుకొనియె. యుధిష్ఠిరమహారాజు వాసుదేవుని బుద్ధిబలము తనకు మంత్రియైయుండ నలువురితమ్ముల బాహువిక్రమములు దనకుఁ బెట్టని నాలుగుకోటలుగాఁగఁ బ్రకృతిజనానురంజనముగఁ గురువృద్ధజన సమ్మతముగఁ గువలయానందకరముగఁ బ్రజాపాలనముసేయుచు సుఖముగనుండెను.

సమాప్తము.

మనసు ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక

పుస్తకం సంఖ్య	AOUA104B108
పుస్తకం పేరు	చిలకమర్తి లక్ష్మీనరసింహకృత గ్రంథములు01
తారీఖు	31 December 2025
ముందు అట్ట	no
వెనుక అట్ట	
మొత్తం పేజీలు	709
పెద్ద సైజు పేజీలు	nil
ఖాళీ పేజీలు	ii, iv, vi, viii, 136
లేని పేజీలు	17TO152
తయారు చేసినది	Jayalakshmi
పేజీలు విడదీసినది	Jayalakshmi
స్కాన్ చేసినది	Hemant
పరీక్ష చేసినది	BUJJI
పేజీలు సరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
పరిస్థితి	good.

ఖాళీ పేజీలు

138, 422, 420(6), BCP